ఆదిపర్వ కథాసారం

(రెండవభాగం)

ధృతరాష్ట్రునికి పెళ్లియీడు వచ్చింది. గాంధారదేశాన్ని పరిపాలించే సుబలుడనే రాజుకు గాంధారి అనే కూతురు ఉన్నదనీ, ఆమె రూపలావణ్యశీలాలలో ఉత్తమురాలనీ, నూరుగురు బిడ్డలకుతల్లి కాగలదనీ జ్యోతిష్కుల వలన విని భీష్ముడు స్వయంగా ఆ సంబంధాన్ని కుదిర్చాడు. అంతేకాదు, గాంధారికి పదిమంది తోబుట్టువు లున్నారు. వారందరినీ ధృతరాష్ట్రుని కిచ్చి పెళ్ళిచేయించాడు. అంతేకాక, కులశీలవతులైన నూరుగురు కన్యల నిచ్చి ఆపై వివాహాలు జరిపించాడు. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడయినా అతనికి ఎటువంటి లోపం రాకుండా చూచాడు. అతనికి పట్టాభిషేకం చేశాడు.

పాండురాజు అఖిలాస్త్రశస్త్రవిద్యలను గడించి విస్తృతదేశదండయాత్రలు చేసి, అపారధనరాసులు తెచ్చి ధృతరాష్ట్రుని వశం చేసేవాడు. బంధువులకు పంచేవాడు. అతడు స్వయంవరంలో పొందిన కన్య కుంతి; భీష్మానుమతితో పెండ్లాడిన కన్య మాద్రి. పాండురాజు కుంతీమాద్రులను అమితానురాగంతో చూచుకుంటూ ఉండేవాడు.

కర్ణుని జన్మరహస్యం

ఇక్కడ కుంతి జీవితంలో జరిగిన ఒక రహస్యవృత్తాంతం చెప్పాలి. కుంతిభోజునియింట కుంతి కన్యగా పెరుగుతున్నప్పుడు అతిథులకు సత్కారాలను స్వయంగా నిర్వహిస్తూ వారి ఆశీస్సులను, ప్రశంసలను పొందుతూ ఉండేది. ఒకసారి దుర్వాసుడు వారింటికి అతిథిగా వచ్చాడు. అతనికి ఇష్టమైన పదార్థాలను వండి వడ్డించి భక్తితో సేవించింది - కుంతి. ఆ ముని సంతసించి ఒక దివ్యమంత్రాన్ని ప్రసాదించా డామెకు. ఆ మంత్రంతో ఏ వేల్పునైనా ఆరాధిస్తే అతడు కోరినపుత్రుడిని ఇచ్చి సంతోషపెడతాడు. అది ఆపద్ధర్మంగా వాడుకోతగినది మాత్రమే.

ఆ ముని వెళ్లిపోగానే ఆ మంత్రశక్తిని పరీక్షించాలని ఆసక్తి కలిగి గంగదరి కేగి కుంతి సూర్యుడిని స్మరించి, అతనివంటికొడుకును కోరి మంత్రాన్ని జపించింది. సూర్యుడు తరుణద్యుతితో ఆ తరుణి దగ్గరకు వచ్చాడు. సహజకవచకుండల శోభితుడైన బిడ్డ నిచ్చాడు. అతడే కర్ణుడు. అయితే కుంతి కోరికపై ఆమె కన్యాత్వం యథాతథంగా ఉండేటట్లు వరమిచ్చాడు. కుంతి సూర్యప్రేరితమై వచ్చిన ఒకమందసంలో కర్ణుడిని ఉంచి నదిలో వదలింది. సూతు డొకడు ఆ పెట్టెను పట్టి కర్ణుని తన పట్టిగా పెంచుకొన్నాడు.

కుంతి కర్ణుని జన్మరహస్యాన్ని బైటపెట్టలేదు. అది దేవరహస్యంగానే ఉండిపోయింది.

పాండవ, కౌరవజననం

ఒకసారి పాండురాజు వేటకు వెళ్లాడు. ఆ రోజు వనంలో ఎక్కడా వేటకు మృగాలు దొరకలేదు. విసిగి వేసారి పోయాడు. చివరకు ఒకచోట, రెండుమృగాలు క్రీడిస్తుంటే చూచి వాటిని బాణాలతో కొట్టి చంపాడు. కిందము డనే

ముని తనభార్యతో కలిసి మృగరూపంలో క్రీడిస్తున్నాడు. అతడు పాండురాజు బాణాలకు చనిపోతూ శాపం పెట్టాడు. 'నేను నా భార్యతో కూడియున్నప్పుడు ఎలా చనిపోతున్నానో అలాగే నీవూ నీ భార్యతో కూడినప్పుడు చనిపోతావు. నీ భార్యకూడా చనిపోతుంది' - అని శపించి ఋషి దంపతులు కన్ను మూశారు. పాండురాజు విషణ్ణుడయ్యాడు; విరక్తుడుకూడా అయ్యాడు. భార్యాసమేతుడై శతశృంగపర్వతం చేరి ఘోర తపస్సు చేయ నారంభించాడు. అది బ్రహ్మలోకానికి వెళ్లేదారి. కొందరు మునులు బ్రహ్మలోకానికి పోతూ ఉంటే పాండురాజు వారితో తానూ వస్తా నన్నాడు. కాని, వారు 'అపుత్రస్య గతిర్నాస్తి - అని వినలేదా! నీకు సంతానం లేదు కాబట్టి మోక్షానికి అర్హతలే'దని చెప్పారు. వారిమాటలు పాండురాజును మరీ క్రుంగదీశాయి.

సంతానాన్ని గురించి కుంతీమాద్రులతో కలిసి ఆలోచించాడు. దుర్వాసమహర్షి తన కిచ్చిన మహామంత్ర మొకటున్నదని ఆపద్ధర్మంగా దానిని పుత్రలబ్ధికి వాడుకోవచ్చునని కుంతి చెప్పింది. పాండురాజు అంగీకరించాడు. కుంతిని పుత్రసంతానంకొరకు మంత్రమహిమ నాశ్రయించుమని నియోగించాడు. ఆమె భర్తకు ప్రదక్షిణం చేసి సమాహితచిత్తంతో మంత్రాన్ని జపించింది. మొదటగా సర్వలోకాలకు ఆశ్రయమైన ధర్మానికి మూలమైనవాడు ధర్ముడు; అతనిని స్మరించి ఉత్తమధర్మవర్తనుడైన పుత్రుడిని కోరుకొన్నది. దిక్కులు కాంతులతో పిక్కటిల్లేటట్లు వెలుగొందే బాలుడు ధర్ముని అంశాన జన్మించాడు. అతడు పుట్టినప్పుడు సర్వభూతములు సంతోషించాయి. ఆకాశవాణి ఇట్లా పలికింది; "ఇతడు కురుకులదీపకుడౌతాడు; ధర్మస్థిరమతి కావటంచేత యుధిష్ఠిరుడు అని పిలువబడతాడు".

యుధిష్ఠిరుడు పుట్టినసంగతి హస్తినాపురానికి వార్త అందింది. అందరూ సంతోషించారు. కాని, గాంధారి అప్పటికే గర్భవతి. సంవత్సరం నిండుతున్నా ముందుగా సంతానాన్ని కనలేకపోయింది. ఆ అసూయతో కడుపుపై బాదుకొన్నది. గర్భపాతమైపోయింది. వేదవ్యాసుడు వచ్చి ఆ పిండఖండాలను నూటొక్కటిని లెక్కించి వేరువేరు తైలభాండాలలో భద్రపరిచాడు. నూర్వురు కొడుకులు, ఒక్క కూతురు పుడతా రని చెప్పి వెళ్లాడు.

అక్కడ - శతశృంగపర్వతంమీద పాండురాజు మరొక పుత్రుని పొందాలనే కోరికతో కుంతిని - వాయుదేవుని నారాధించి ఉత్తమజవసత్త్వుడైన కుమారుడిని పొందుమని అడిగాడు. ఆమె అలాగే చేసింది. వజ్రదేహుడైన విక్రమోన్నతుడైన బాలుడు పుట్టాడు. దివ్యవాణి అతనికి "భీమసేనుడు" అని పేరు పెట్టింది.

అదేరోజు హస్తినాపురంలో దుర్యోధనుడు పుట్టాడు. కులాన్నీ, లోకాన్నీ నాశనం చేయగల దుశ్శకునాలు ఎన్నో పొడసూపాయి. అందరూ భయవిహ్వలులైనారు. అట్లాగే క్రమంగా దుశ్శాసనుడు మొదలైన తొంభైతొమ్మిది మంది తమ్ములు, దుశ్శల అనే చెల్లెలు పుట్టారు. కులనాశకుడైన దుర్యోధనుడిని ఒక్కడిని దూషించటం మంచి దని పెద్దలు ధృతరాష్ట్రునికి సూచించారు. అతడు పుత్రవ్యామోహంతో దాన్ని అంగీకరించలేదు.

ఈ సంగతి విని - పాండురాజు త్రిలోకవిజయుడైన పుత్రునికొరకు ఏకపాదంమీద నిలువబడి ఒక సంవత్సరకాలం ఇంద్రుడిని గురించి తపస్సు చేశాడు. దేవేంద్రుడు ప్రసన్నుడై శత్రుక్షయాన్ని చేయగల మహావీరుడు నీకు కొడుకుగా పుడతాడని వరమిచ్చాడు. కృతార్థుడైన పాండురాజు, కుంతీదేవిని ఉపాసించుమని కోరాడు. ఆమె అట్లాగే ఆరాధించింది. స్థిరపౌరుషుడు, లోకోత్తరుడు, వంశకరుడు అయిన పుత్రుడు ఇంద్రాంశతో పుట్టాడు. ఆ సమయంలో దేవతలు ఆ బాలుని భావిబలవీర్యాలను కీర్తిస్తూ పూలవానలు కురిపించారు. ఉత్తరఫల్గుణీనక్షత్రంలో పుట్టాడు కాబట్టి ఆ బాలుడిని ఫల్గుణుడని పిలిచారు.

ముగ్గురు కొడుకులను చూచి పాండురాజు మూడులోకాలు జయించినట్లు పొంగిపోతుండేవాడు. కాని మాద్రి తనయందు పుత్రసంతానం పొందే ఉపాయం లేకపోవటంవలన విచారిస్తూ ఉండేది. దీన్ని గమనించి కుంతితో ఒప్పించి, దుర్వాసుని మంత్రప్రభావంతో మాద్రిచేత అశ్వినీదేవతలను ఆరాధింపజేసి కవలపిల్లలను పొందగలిగాడు. వారే నకుల సహదేవులు. సౌందర్యపరాక్రమాలలో సాటిలేనివారు. ఇట్లా పంచపాండవులు పుట్టి శుక్లపక్షచంద్రబింబాలవలె పెంపొందుతూ ఉన్నారు.

అంతలో ఒక విపత్తు. వసంతఋతువు వచ్చింది. ప్రకృతిశోభ మానవుల హృదయాల నుప్పొంగ జేస్తున్నది. కుంతి అన్నదానవ్రతంలో నిమగ్నురాలై ఉన్నది. మాద్రి ఒక్కతే పాండురాజు ప్రక్కన ఉన్నది. ఆమె మనోహరరూపం వసంతప్రభావంతో అతని మనస్సు నాకర్షించింది. పాండురాజు మాద్రిని సమీపించాడు. మునిశాపంచేత మరణించాడు. శతశృంగీయులందరూ గుమిగూడారు. హృదయవిదారకంగా విచారించారు. మాద్రి తాను పాండురాజుతో సహగమనం చేసింది. కుమారులరక్షణకు కుంతి దృఢచిత్తంతో జీవించ సంకల్పించింది. మాద్రీపాండురాజుల అంత్యక్రియల తర్వాత వారి అవశేషాలతో అందరూ హస్తినాపురం చేరారు.

రగిలిన పగలు

హస్తినాపురరాజమందిరంలో అటు కౌరవులు, ఇటు పాండవులు అందరూ కలిసి బాలక్రీడలాడుతుండే వారు. అందరిలో బలాఢ్యుడు భీమసేనుడు. జలక్రీడ లాడేటప్పుడు భీముడు కౌరవులను భుజాలపై కెక్కించుకొని నీటిలో ముంచి తేల్చి ఉక్కిరిబిక్కిరి చేసేవాడు. పండ్లకోసం కౌరవులు చెట్లెక్కితే భీముడు చెట్లమొదళ్ళు పట్టి ఊపి పండ్లతోబాటు వారిని కూడా క్రింద పడేసేవాడు. ఇట్లా భీముని చేతిలో బాధలు పడలేక దుర్యోధనుడు శకునిదుశ్శాసనులతో మంతనాలు సలిపి, భీముడిని ఒంటరిగా ఉన్నప్పుడు చంపటానికి పన్నాగాలు పన్నాడు.

ఒకనాడు భీముడు జలక్రీడలలో వేయిమంది వీరకుమారులతో పోటీపడి గెలిచి, బాగా అలసిపోయి, చల్లగాలి వీస్తుంటే నీటి ఒడ్డునే పడుకొని గాఢనిద్రపోయాడు. దాన్ని గమనించిన దుర్యోధనుడు భీముడిని లతాపాశాలతో గట్టిగా కట్టించి నీటిలో త్రోయించాడు. కాని భీముడు ఒళ్ళు విరుచుకునేసరికి ఆ లతలన్నీ పెటపెటా తెగిపోయాయి. భవబంధవిముక్తునివలె నీటినుండి బయటికి వచ్చాడు.

ఒకనాడు బాగా శ్రమించి భీముడు నిద్రిస్తున్నాడు. ఆ అదను కనిపెట్టి దుర్యోధనుడు ఒక సారథిచేత పాములను తెప్పించి అతడిని కరిపించాడు. భీమునిశరీరం వజ్రతుల్యం కావటంచేత పాముల కోరలు అతని చర్మంలో దిగబడలేదు. కాని, నిద్ర మెలకువ వచ్చింది. అతడు సారథి నొక్క చరుపుతో చంపివేశాడు. పాములను కాళ్ళతో నలిపేశాడు. ఒకసారి అన్నంలో విషం కలిపి పెట్టించాడు. యుయుత్సుడు వద్దంటున్నా ఆకలిగొన్న భీముడు ఆ విషాన్నం తిన్నాడు. విషంకూడా ఆకలివలన అతనికి అమృతంగా మారింది. ఇట్లా ఎన్నో ఉపాయాలతో భీముడిని వధించి ధర్మరాజును ఒంటరివాడిని చేసి చంపాలని దుర్యోధనుడు ప్రయత్నించి విఫలుడయ్యాడు. చివరకు పాండవుల కందరికీ అపాయం కలిగించే ఉపాయమే ఉపాదేయమనుకొన్నాడు.

ఆదిపర్వ కథాసారం - 4

భీష్ముడు బాలురకందరికీ మొదట కృపాచార్యునిచేత విలువిద్య నేర్పించాడు. ఆపై ద్రోణుడినికూడా నియోగించాడు. ద్రోణుడిని ద్రుపదుడు అవమానించాడు. అందువలన అతనిపై ప్రతీకారం తీర్చుకోవాలని అతడు లోలోన మండిపడిపోతున్నాడు. శిష్యు లందరిని తనకోర్కె తీర్చగలరా అని అడిగాడు. అర్జునుడు ఒక్కడే మాట ఇచ్చాడు. అందువలన అతడిని జగదేకవీరునిగా తీర్చిదిద్దుతానని ద్రోణుడు వరమిచ్చాడు. ఏకలవ్యుని వంటివారిఅడ్డును ఉపాయంతో తొలగించాడు. రాత్రియుద్ధం, శబ్దభేది, అస్త్రశస్త్రాలు, విలువిద్యా రహస్యాలు ఎన్నెన్నో అర్జునుడికి బోధించాడు. విలువిద్యలో పార్థుడే ప్రథమగణ్యుడు.

రాజకుమారుల అస్త్రశస్త్రపాండిత్యాన్ని పెద్దలముందు ప్రదర్శింప చేయటానికి ద్రోణుడు ఒక విశాల సమతల ప్రదేశంలో రంగం ఏర్పాటు చేయించాడు. తెల్లనివస్త్రాలను ధరించిన ద్రోణుడు అశ్వత్థామ వెంటరాగా క్రీడారంగం మధ్యకు వచ్చి నిలబడ్డాడు. కురుకుమారులందరూ జ్యేష్ఠానుపూర్వంగా మహాధనువులతో తనుత్రాణాలతో గురువుగారివెనుక వరుసగా నిలిచారు. చూడముచ్చటగా నున్నది దృశ్యం.

మొట్టమొదట భీమదుర్యోధనుల గదాద్వంద్వయుద్ధం ప్రవర్తిల్లింది. భూమి దద్దరిల్లేటట్లు పాదఘట్టనం చేస్తూ మదపుటేనుగులవలె భయంకరంగా పోరాడసాగారు భీమదుర్యోధనులు. ప్రజలలో వారివురిపట్ల అభిమానం గలవారు పెద్దఅరుపులతో పాటు పరస్పరవివాదాలుగూడా చేయటం మొదలుపెట్టారు. దానితో వారిద్దరి పోరును ద్రోణుడు అశ్వత్థామను పంపి ఆపివేయించాడు.

ఆ తరువాత హేమకవచావృతుడు, ఉన్నతచాపధరుడు, అసితోత్పలవర్ణుడు, బద్ధతూణీరుడు అయిన అర్జునుడు రంగమధ్యంలో నిలిచి జనహృదయాలను ఆకట్టుకొన్నాడు. ప్రజలు చేసే ప్రస్తుతి మిన్నంటింది. అర్జునుడు ఆచార్యునిఅనుమతితో ఆగ్నేయ, వారుణాదిమహాస్త్రాలను ప్రయోగించి, పరుగెత్తుతున్న మృగాలపై బాణాలు నాటేపలునేర్పులను ప్రదర్శించి విలువిద్యలో మేటివీరుడని జయజయధ్వానాలు పొందాడు.

అంతలో సహజకవచకుండలధారియైన కర్ణుడు రంగద్వారం వద్ద నిలిచి భుజాస్ఫాలనం చేసి అర్జునుడిని ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించాడు. ద్రోణుని అనుమతితో ముందుగా అర్జునుడు ప్రదర్శించిన విద్యలన్నీ ప్రదర్శించి చూపించాడు. అతని పరాక్రమాన్ని చూచి దుర్యోధను డతనిని కౌగలించుకొని "నాతో స్నేహం చేసి నాకూ నా బంధువులకూ హితం చేసి నన్ను కురురాజ్యం ఏలించి, నా ఐశ్వర్యం ఉపయోగించుకో" అని కోరాడు. కర్ణుడు దానికి అంగీకరించాడు.

ఆ తరువాత కర్ణార్జునుల ద్వంద్వయుద్ధం మొదలైనది. కర్ణుడు పర్జన్యాస్త్రం వేశాడు. అర్జునునిపై మేఘాలు దట్టంగా క్రమ్మాయి. కుంతి భయపడింది. అంతలో అర్జునుడు వాయుబాణం వేసి మేఘాలను చిమ్మివేశాడు. కుంతి శాంతపడింది. వారిద్దరి నడుమ పంతాలు పెరుగుతున్నందువలన కృపాచార్యు డడ్డంవచ్చి, అర్జునుని తల్లిదండ్రుల పేర్లు కులం అందరికీ తెలుసు. అట్లాగే నీ వివరాలు తెలియజెప్పుమని కర్ణుడిని అడిగాడు. కర్ణుడు చెప్పడానికి సిగ్గుపడి తలవంచుకొన్నాడు.

దుర్యోధనుడు రంగప్రవేశం చేసి, రాజైతేతప్ప పార్థునితో యుద్ధం చేయడానికి వీల్లేదంటే ఇదుగో అంగరాజ్యా న్నిస్తున్నానని, రంగమధ్యంలో సింహాసనం వేసి అంగరాజ్య పట్టాభిషేకం చేసి కర్ణుడిని అంగరాజుగా పిలిచాడు. సూతుడు, కొడుకుని చూచి ఉప్పొంగిపోయి కౌగలించుకొన్నాడు. కర్ణుడు అతనికి అభివాదనం చేశాడు. దానితో

అతడు సూతపుత్రుడని అందరికీ తెలిసిపోయింది. సూతపుత్రుడు క్షత్రియునితో యుద్ధం చేయటం తగదన్నాడు భీముడు. దుర్యోధనుడు అతని మాటలకు అడ్డువచ్చాడు. 'లేడి కడుపున పులి పుడుతుందా? ఇంతటి దివ్యతేజస్సు కలవాడు సామాన్యుడై ఉంటాడా? సూరుల జన్మస్థానం సురల జన్మం, ఏరుల జన్మం ఎవరు చెప్పగలరు? సహజకవచకుండలధారియైన ఇతడు అంగరాజ్యానికే కాదు, అఖిల మహీ మండలానికే అధిపతి కాగలిగినవాడు' అని ప్రశంసిస్తూ ఉండగా ప్రొద్దు క్రుంకింది. అందరూ వారివారి మందిరాలకు వెళ్ళారు.

గురుదక్షిణ

మరునాడు ద్రోణాచార్యులు శిష్యులందరినీ పిలిచి 'గురుదక్షిణ నివ్వండి!' అన్నాడు. అందరూ గురువు గారిని ఆదేశించుమన్నారు. 'ఐశ్వర్యమదగర్వితుడైన ద్రుపదుడిని ఓడించి పట్టి నాముందు పెట్టండి. అదే నేను కోరే గురుదక్షిణ' అని ప్రకటించాడు-ద్రోణాచార్యుడు.

ఆమాట వినగానే కౌరవులందరూ సైన్యాలను వెంటబెట్టుకొని రథాలెక్కి పాంచాలపురం వైపు పయనం సాగించారు. పాండవులు గురువుకు ప్రదక్షిణం చేసి ఆయనను వెంట తీసికొని ఆ తరువాత బయలుదేరారు. కౌరవుల సేనను ద్రుపదుడు చతురంగసేనతో ఎదుర్కొనాడు. పోరు ఘోరంగా సాగింది. ద్రుపదుని పరాక్రమానికి కౌరవులు నిలువలేకపోయారు. వెనుదిరిగి పోసాగారు. పాండవు లెదురుపడ్డారు. వారి అండన నిలిచారు. అర్జునుడు భీమునిసాయంతో ముందుకు నడిచాడు. ద్రోణుడినీ, ధర్మజుడినీ ఒకచోట నిలిపారు. సైన్యంతో భీముడు ద్రుపదుని గజబలాన్ని మట్టుపెట్టాడు. అర్జునుడు అశ్వబలాన్ని మట్టుబెట్టి ద్రుపదునిపై బాణాలు గుప్పించాడు. అంతలో ద్రుపదుడు అర్జునుని విల్లును విరుగకొట్టాడు. అర్జునుడు సింహంవలె లంఘించి కత్తితో ద్రుపదుని రథంపైకి దూకాడు. మెరుపుదాడి చేసి అతడిని రథాక్షంతో కట్టి ద్రోణుని యెదుటకు తెచ్చి ఉంచాడు. అప్పుడు అవహేళనగా నవ్వుతూ ద్రోణుడు ద్రుపదునితో ఈవిధంగా అన్నాడు.

క. "వీ రెవ్వరయ్య ద్రుపదమ
హారాజులె యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె యహహ! మ
హా రాజ్యమదాంధకార మది వాసెనొకో!"

ఇప్పటికైనా నేను జ్ఞాపకానికి వచ్చానా? అని అధిక్షేపించి ద్రుపదుడిని వదలివేశాడు. ఇట్లా గురుదక్షిణ పాండవులే ఇవ్వగలిగారు.

లాక్షాగృహ దహనం

రాజ్యభారాన్ని వహించగలవాడినిగా భావించి భీష్మ విదురాదులతో విచారించి ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు యువరాజుగా పట్టంగట్టాడు. ధర్మజుడు నలుగురుతమ్ములసాయంతో నాలుగుదిక్కులా విజయయాత్రలు సాగించి అపారధనరాసులను తెచ్చి హస్తినాపుర వైభవాన్ని పెంచాడు. ధర్మరాజు పేరుకు యువరాజుగాని, తీరుకు సార్వభౌముడు.

పాండవులమీద పెరుగుతున్న ప్రజానురాగం దుర్యోధనునిగుండెల్లో అసూయాగ్నిని రగిల్చింది. అతడు

ధృతరాష్ట్రుని దగ్గరకు వెళ్లి తన దుఃఖాన్ని వెళ్లగక్కాడు. 'పైతృకమైన ఈ రాజ్యలక్ష్మిని పూర్వం పాండురాజు భరించాడు. కాబట్టి ఇప్పుడు ధర్మరాజును యువరాజును చేశారు. ఆ తరువాత ఆతనికొడుకులు, మనుమలే రాజ్యాధిపతులౌతారు. మేము వారిని సేవించి బ్రతికేదుర్గతి ఏర్పడుతుంది. రాజ్యం మీ ఆధీనంలో ఉన్నది కాబట్టి మీరే మాకు, రాజ్యానికి మార్గం వేసి చూపించాలి. పాండవులకీర్తి ప్రజలలో పెరిగిపోతున్నది. ముందు వారిని దూరం చేయండి. వారణావతానికి పంపండి. ఆరునెలలలో నేనూ హస్తినాపురి ప్రజలలో నా మీద అభిమానం కలిగేటట్లు చూచుకొంటాను' - అని వాదించి తండ్రిని ఒప్పించాడు.

ధృతరాష్ట్రుడు నయంతో ప్రేమతో పాండవులను కుంతితోసహా వారణావతానికి పంపాడు. అక్కడ దుర్యోధనుడు పురోచనునితో లక్కయింటిని కట్టించి సమయం కనిపెట్టి అందులో పాండవులు తగులపడేటట్లు చూడాలని పన్నాగం పన్నాడు. విదురు డీరహస్యాన్ని గోప్యంగా ధర్మరాజుకు సూచించాడు. ధర్మజుడు గ్రహించి, భీమునితో చెప్పి, లాక్షాగృహంలో నిపుణంగా జాగరూకతతో ఉంటుంటారు. విదురుడు ఒక గూఢచారిని పాండవుల చెంతకు పంపించి లక్కయింటినుండి వారు తప్పించుకొని పోవటానికి బిలమార్గాన్ని ఏర్పరచి, కృష్ణ చతుర్దశినాటిరాత్రి లాక్షాగృహదహనమవుతుందని సూచించాడు. భీముడు ఈ రహస్యాన్ని గమనించి, పురోచనుని, ఒక దాసిని, దాని అయిదుగురు కొడుకులను ఆ లక్కయింటిలో ఉంచి, అన్నదమ్ములను తల్లిని బిలంద్వారా పంపించి, నియమించిన ముహూర్తంకంటె ముందే లక్కయిల్లు మొత్తం దహనమయ్యేటట్లు చూచి తాను బిలంద్వారా వెడలిపోయాడు. ఒక్క విదురుడు తప్ప అందరూ పాండవులు లక్కయింటిలో పడి కాలిపోయారని దుఃఖించారు. ధృతరాష్ట్రదుర్యోధనుల పాపసంకల్పాలను ప్రజలు గర్హించారు.

బిలద్వారంగుండా పాండవులు బయటపడి పాదచారులై నడిచి ఒక వనం చేరారు. భీముడు నీరు తెచ్చేలోపలే ఒక చెట్టుకింద ధర్మజాదులూ, కుంతీ గాఢనిద్రలో మునిగిపోయారు. వారి దీనావస్థకు విచారపడుతూ ఆ రాత్రి భీముడు వారికి కాపలా కాస్తూ ఉన్నాడు.

అది హిడింబాసురుడు నివసించే వనం. నరవాసన కొట్టింది అతనికి. పాండవులను చంపి వండి వడ్డించు మని చెల్లెలైన హిడింబను ఆజ్ఞాపించాడు. ఆమె ఆ చెట్టు దగ్గరకు వచ్చింది. భీముని సుందరవీరాకారం చూచింది. మనసారా ప్రేమించింది. అతనితోడిదే తనజీవిత మని మొదటిచూపులోనే నిర్ణయించుకొన్నది. అన్నను పోగొట్టుకొన్నా భీముడిని మాత్రం పొందాలనుకొన్నది. అన్నివిషయాలు భీముడికి చెప్పింది. ఆలస్యమైనదని హిడింబుడు లేచి వచ్చాడు. భీము డాతనితో యుద్ధానికి తలపడ్డాడు. రాక్షసుని అరుపులకు కుంతి నిద్ర లేచింది; ధర్మజాదులు లేచారు. హిడింబ మానవాకారంలో ఎదుట పడింది. కుంతి ఆమెను గురించి అడిగింది. హిడింబ ఏ సంగతీ దాచుకోకుండా మనసు విప్పి కుంతితో చెప్పుకొన్నది. ఆమెకు ఎన్నో మహిమలున్నాయి. వాటిని ప్రదర్శించి చూపింది. భీముడు హిడింబాసురుడుని చంపాడు. పాండవులను హిడింబ అనుసరించింది. భీముడు వారించాడు. ధర్మజుడు, కుంతి భీముడికి నచ్చజెప్పారు. శాలిహోత్రుని ఆశ్రమంగురించి హిడింబ చెప్పినమాటలు నిజమని తెలిశాయి. భీమునితో హిడింబకు వివాహమయింది. పగలల్లా ఆ దంపతులు అడవులలో విహరించేవారు. రాత్రిళ్ళు ధర్మరాజాదుల వద్ద ఉండేవారు. కొన్నాళ్ళకు ఘటోత్కచు డనేపుత్రుడు పుట్టాడు-హిడింబకు. భయంకరాకారుడు, సద్యోయౌవనుడు, అస్త్రశస్త్రకుశలుడు, రాక్షస పిశాచబలపరివృతుడు అయిన ఘటోత్కచుడు పాండవులను కొంతకాలం సేవించి రాక్షస రాజ్యానికి వెళ్ళిపోయాడు - తల్లిని తీసికొని. తనను స్మరిస్తేచాలు ప్రత్యక్షమౌతానని తండ్రితో చెప్పాడు.

శాలిహోత్రుని ఆశ్రమంలో వ్యాసుడు పాండవులకు దర్శనమిచ్చాడు. జరిగిన దానికి విచారించవ ద్దని ధైర్యం చెప్పి, భావికార్యక్రమాన్ని సూచించి వెళ్లాడు. పాండవులు బ్రాహ్మణవేషాలతో ఏకచక్రపురం చేరారు. అక్కడ భిక్షాటనం చేసికొంటూ బ్రతుకు సాగించారు. అయినా, అక్కడ ప్రజలను పట్టి పీడించే బకాసురుడిని భీముడు వధించి వారికి శాంతిసౌఖ్యాలను అందించాడు.

పాండవవివాహం

ఆనాడు అర్జునుడి చేతిలో ఓడిన ద్రుపదుడు ద్రోణుడిని చంపే ఒకకొడుకును, అర్జునుని వివాహమాడే ఒకకూతురును పొందాలని అనేకఘోరవ్రతాలు చేశాడు. చివరకు ఒక క్రతువు నిర్వహించాడు. యజ్ఞాగ్నిలో నుండి ఉజ్జ్వల కరవాలంతో రథారూఢుడైన ధృష్టద్యుమ్నుడు పుట్టాడు. దివ్యతేజస్విని ద్రౌపది పుట్టింది. ఆ ద్రౌపదిని అర్జునునకివ్వాలని లోన సంకల్పం. పైకి చలత్ మత్స్యయంత్రభేదనాన్ని వరపరీక్షగా పెట్టాడు-ద్రుపదమహారాజు. ఈ సంగతి పాండవులు ఏకచక్రపురంలో విన్నారు. పాంచాలపురికి హుటాహుటిన బయలుదేరారు.

ద్రుపదనగరం స్వయంవరోత్సవంతో కోలాహలంగా ఉన్నది. ఎత్తుగా కట్టబడిన మత్స్యయంత్రాన్ని అయిదుబాణాలతో ఎవడు కొట్టగలడో, ఆ విలుకాడే ద్రౌపదికి భర్త కాగలడని పాంచాలపతి ప్రకటించాడు. రాజులు నగరం చుట్టూ డేరాలు తీర్చి స్వయంవరానికి దిగి ఉన్నారు. పాండవు లాపురిలో బ్రాహ్మణ వేషాలతో ప్రవేశించి ఒక కుంభాకారుని యింట్లో వసించి మత్స్యయంత్రసభకు వెళ్లారు.

ధృష్టద్యుమ్నుడు స్వయంవరనియమాన్ని ప్రకటించాడు. స్వయంవరసభలో విచ్చేసియున్న రాజులనందరినీ ద్రౌపదికి చూపించాడు. అందులో నూరుగురు కౌరవులున్నారు. కర్ణాశ్వత్థామాదులుకూడా ఉన్నారు. వారిలో ఎవరు లక్ష్యాన్ని భేదిస్తే అతడు కల్యాణమాలకు అర్హుడని సూచించాడు. ఆ సభలోని అతిథులలో వాసుదేవు డున్నాడు. అతడు బ్రాహ్మణవర్గంలో పంచాగ్నులవలె వెలుగొందుతున్న పాండవులను గ్రహించి, పార్థుడు పాంచాలిని గ్రహిస్తాడని సంతోషించాడు.

కొందరు రాజులు విల్లు ఎక్కుపెట్టలేక వెనుతిరిగిపోయారు; కొందరు ప్రయత్నమే చేయలేకపోయారు; కొందరు చేసి విఫలురయ్యారు. బ్రాహ్మణులలో నుండి అర్జునుడు లేచి యంత్రాన్ని సమీపించి, గురువులకు నమస్కరించి, ధనువునకు ప్రదక్షిణం చేసి మ్రొక్కి, దానిని అవలీలగా ఎక్కుపెట్టి, అలవోకగా మత్స్యయంత్రాన్ని భేదించాడు. సభికు లందరూ ఆశ్చర్యపోయారు. బ్రాహ్మణు లుప్పొంగిపోయారు. ధృష్టద్యుమ్నుడు సైన్యంతో అర్జునుని వెంట నిలువ బడ్డాడు. ధర్మజుడు నకుల సహదేవులతో కలిసి వసతిగృహానికి వెళ్లాడు. ద్రౌపది కల్యాణమాలను అర్జునుని మెడలో ఉంచటానికి బయలుదేరింది. దుర్యోధనాదు లది సహించలేకపోయారు. రాచకన్నెను విప్రుడి కివ్వటం అవమానమని ఆగ్రహించారు. విప్రాకారంలో నున్న అర్జునుడిని అపహసించారు. ద్రుపదుడు భయపడి బ్రాహ్మణుల వెనకాల నిలువబడ్డాడు. వారందరికి అభయమిచ్చి అర్జునుడు భీమ సహాయంతో తిరుగబడ్డాడు.

అర్జునుడికి ఎదురుగా కర్ణుడు నిలిచి బాణయుద్ధం చేశాడు. తన ఎదుట నిలువగలిగిన ఆత డెవడా? అని కర్ణు డాశ్చర్యపోయాడు. ఎవడో విప్రశ్రేష్ఠునివలె నున్నాడని రణరంగం నుండి తొలగిపోయాడు. భీముడు శల్యుడిని

నేలపై పడేసి కొట్టాడు. అతడు లేచి దుమ్ము దులుపుకొని వెళ్లిపోయాడు. ఆ బ్రాహ్మణులెవరో తేల్చుకోవాలని పట్టుబట్టిన దుర్యోధనాదులకు మొగం వాచేటట్లు సమాధానం చెప్పి వాసుదేవుడు పంపివేశాడు. రాజులందరూ మరలిపోయారు. భీమార్జునులు ద్రౌపదిని తీసికొని యింటికి వచ్చారు. ధర్మజాదులతో కలిసి "తల్లితో అమ్మా! మే మొకభిక్ష తెచ్చాం" అని అన్నారు. కుంతి అసలు విషయాన్ని గ్రహింపక "మీ రయిదుగురూ ఉపయోగించుకొనండి" అని కొడుకులను నియోగించింది. ఆ తరువాత ద్రౌపదిని చూచి ప్రబోధించానని చిన్నబోయింది. ఆమె అన్నమాట అయితీరుతుంది. పాండవులు అమ్మమాట జవదాటరు. కుంతి కలత చెందింది. ధర్మజుడు తల్లినోదార్చి ద్రౌపదిని అర్జునుడినే వివాహమాడుమన్నాడు. అర్జునుడు పెద్దవాడైన ధర్మరాజును పెండ్లాడుమన్నాడు. వీరిద్దరూ ఇట్లా అంటూనే ఉన్నారు. పాండవులైదుగురూ పాంచాలిని చూచి మన్మథభావాన్ని ఒకేసారి పొందారు. పాంచాలి కూడా వారి అయిదుగురియందు బద్ధానురాగయై నిలిచింది. ధర్మజుడు వేదవ్యాసుని మాటలు స్మరించి ద్రౌపదిని పాండవులైదుగురు పాణిగ్రహణం చేయటమే ఉత్తమ మని నిర్ణయించాడు.

మత్స్యయంత్రం భేదించింది అర్జునుడనీ, ద్రౌపదిని వివాహమాడేది పాండవు లనీ తెలిసికొని ద్రుపదుడు సంతోషించాడు. ద్రౌపదికి భర్తృపంచకం ఏర్పడటానికి గల పూర్వజన్మవృత్తాంతాన్ని వ్యాసుడు వినిపించాడు. ఆమె అయిదుగురు భర్తలకు భార్య అయినా ఎవరిదగ్గర కన్యాత్వం సతీత్వం వారివద్ద మొక్కవోకుండా ఉండే వరం ఉండటంవలన వివాహంలోకూడా వరుసగా ధర్మజాదులు తాళిగట్టేటప్పు డామె కన్యాత్వం చెక్కు చెదరకుండా నిలిచింది. ఆ మహిమను చూచి అగ్నిజాతయైన ద్రౌపదియొక్కవిశిష్టలక్షణంగా అందరూ భావించారు. వాసుదేవుడు సంతోషించాడు. పాండవులవివాహం వైభవంగా జరిగింది. వారు పాంచాలనగరంలో ఒకయేడాదిపాటు ఉన్నారు.

ఇంద్రప్రస్థపురం

ధృతరాష్ట్రుడు భీష్మాదుల నీతివచనాలు విని విదురుని పంపి పాండవులను హస్తినాపురానికి పిలిపించాడు. లాక్షాగృహదహనం నుండి పాండవులు బైటపడ్డందుకు దుర్యోధనుడు లోలోన మండిపోతుండేవాడు. పాండవులు ఎక్కువకాలం హస్తినాపురంలో ఉండకుండా చూడుమని తండ్రిని బలవంతపెట్టేవాడు. కొడుకుపోరు పడలేక ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యమిచ్చి ఇంద్రప్రస్థపురం రాజధానిగా ఏలుకోండని పంపాడు. ధర్మరాజును పట్టాభిషిక్తుడిని చేశాడు. శ్రీకృష్ణాదులు వెంటరాగా పాండవులు ఇంద్రప్రస్థపురాన్ని చేరుకొన్నారు.

శ్రీకృష్ణుడు ఇంద్రుడిని, ఇంద్రుడు విశ్వకర్మను స్మరించగా విశ్వకర్మసాయంతో ఇంద్రప్రస్థపురం దిక్పాలకుల పురాలతో దీటైనదిగా రూపొందింది. వాసుదేవుని అనుమతితో ఆశీస్సులతో ధర్మజు డానగరంలో ప్రవేశించి అపరదేవేంద్రునివలె వెలుగొందుతూ ఉన్నాడు.

ఒకనాడు నారదుడు వచ్చి పాండవులలో ఒక్కొక్కరు ద్రౌపదిని ఒక్కొక్క యేడు తన భవనంలో ఉంచుకోవా లనీ, ఆ కట్టడిని తెలిసిగాని, తెలియకగాని ఎవరైనా మీరితే ఒకయేడాది పాటు అతడు తీర్థయాత్రలు చేసిరావా లనీ నియమం చేశాడు. పాండవులు దానికి కట్టుబడి ఉన్నారు.

అలా ఒకయేడు ధర్మరాజు అంతఃపురంలో ద్రౌపది ఉంటున్నది. అర్జునుడు బ్రాహ్మణ ధేనువును రక్షించటానికై ఆయుధాలు తెచ్చికొందామని ధర్మజుని భవనానికి వెళ్ళాడు. దొంగలను చంపి ధేనువును బ్రాహ్మణున కిచ్చి ఆయుధాలు ఉన్నచోట పెట్టాడు. కాని ఆ సమయంలో అర్జునాదులు ధర్మజునింటికి పోగూడదు. నియమం

తప్పినట్లైనది. ధర్మజుడు వలదన్నా అర్జునుడు తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఆ యాత్ర అతనికి పుణ్యం పురుషార్థం కలిసి వచ్చేటట్లు చేసింది. ఉలూచి, చిత్రాంగద, సుభద్రలు అర్జునుని వివాహమాడారు. సుభద్ర బలరామ శ్రీకృష్ణుల ముద్దుల చెల్లెలు. అర్జునుడు యతివేషంలో సుభద్రకు సన్నిహితుడు కావటానికి, ఆమెను వివాహమాడి ఇంద్రప్రస్థపురానికి చేరటానికీ శ్రీకృష్ణుడు సూత్రధారుడుగా నిలిచాడు. సుభద్రార్జునుల వివాహం ఇంద్రోపేంద్రులే స్వయంగా చేయించారు. ఆమీద బలరాముడంగీకరించాడు. సుభద్రను ద్రౌపది దీవించింది. పాండవవంశాన్ని నిలిపే కౌరవవధువుగా సుభద్ర మహాభారతంలో చిరస్మరణీయురాలిగా నిలిచింది.

ఇది ఆదిపర్వకథాసారంలో రెండవభాగం.

జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రధానసంపాదకుడు

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటం -2

ఆదిపర్వము

రెండవ భాగము (5, 6, 7, 8 ఆశ్వాసములు)

విషయసూచిక

పంచమాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
ధృతరాష్ట్ర పాండుకుమారులు పెరుఁగుట	1-102-1	467
ధృతరాష్ట్రుఁడు గాంధారిని వివాహంబు సేసికొనుట	1-103-10	473
కుంతి చరిత్రము	1-104-1	475
కర్ణుఁడు జనియించి సూతగృహంబు సేరుట	1-104-10	479
పాండురాజు వివాహమై దిగ్విజయము సేయుట	1-105-1	483
పాండురాజు సత్కృత్యములు	1-106-1	486
వేటకుఁ బోయిన పాండురాజునకు శాపంబు గలుగుట	1-109-5	488
పాండురాజు శతశృంగంబునఁ దపోవృత్తి నుండుట	1-111-1	497
వ్యుషితాశ్వుం డను రాజువృత్తాంతము	1-112-7	504
శ్వేతకేతుఁడు స్త్రీ పురుషుల విషయంబునఁ గావించిన కట్టడి	1-113-1	507
కుంతీదేవియందు ధర్మరాజుజననము	1-114-3	511
గాంధారి యుదరతాడనంబు గావించుకొనుట	1-107-8	514
దుర్యోధనాదుల జననము	1-107-24	517
భీముని శరీరదార్ఢ్యము	1-114-11	520
ఇంద్రప్రసాదంబునఁ గుంతి కర్జునుఁ డుదయించుట	1-114-15	521
మాద్రికి నకులసహదేవులు పుట్టుట	1-115-1	527
వసంత వర్ణనము	1-116-1	530
పాండురాజు మరణము	1-116-4	532
మాద్రి సహగమనము సేయుట	1-116-25	534
మునులు పాండవులను హస్తినాపురంబునకుం గొనివచ్చి		

విషయము	సంస్కృతమూలము	పుట
ధృతరాష్ట్రున కొప్పగించుట	1-117-6	536
కురుపాండుకుమారుల బాలక్రీడలు	1-119-13	543
దుర్యోధనుఁడు భీమునిఁ జంపింపఁ దివురుట	1-119-28	546
కృపాచార్యుల జన్మవృత్తాంతము	1-120-2	551
ద్రోణాచార్యుల జన్మవృత్తాంతము	1-121-3	554
ద్రోణుఁడు ద్రుపదునిచే నవమానితుఁ డగుట	1-122-2	559
ద్రోణుఁడు హస్తినాపురంబునకు వచ్చుట	1-122-14	561
భీష్ముఁడు కురుపాండుకుమారులకు ద్రోణుని గురువుగా నియమించుట	1-122-2	566
ఏకలవ్యుం డనువాఁడు ద్రోణు నారాధించి విలువిద్య గఱచుట	1-123-10	570
ద్రోణుఁ డస్త్రవిద్యం దనశిష్యులఁ బరీక్షించుట	1-123-15	576
అర్జునుఁడు ద్రోణుని మొసలినుండి విడిపించుట	1-123-68	579

షష్ఠాశ్వాసము

విషయము	సంస్కృతమూలము	పుట
కుమారాస్త్ర విద్యాసందర్శనము	1-123-68	584
భీమదుర్యోధనులు దమ గదాకౌశలంబు సూపుట	1-124-30	589
అర్జునుండు తన యస్త్రవిద్యాకౌశలంబు సూపుట	1-125-18	595
కర్ణుఁడు ప్రవేశించి యర్జును నధిక్షేపించుట	1-126-2	597
కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము	1-126-23	601
దుర్యోధనుఁడు కర్ణుని నంగరాజ్యమున కభిషిక్తుం జేయుట	1-126-36	605
కౌరవపాండవులు గురుదక్షిణార్థంబు ద్రుపదుం బట్టఁ జనుట	1-127-1	612
భీమార్జునులు ద్రుపదుని సేనను దునుమాడుట అను	1-78-40 పంక్తి	617
అర్జునుఁడు ద్రుపదుం బట్టి కట్టి తెచ్చుట	1-128-3	620
ధృతరాష్ట్రుఁడు యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషిక్తునిం జేయుట	1-179-191	623
భారద్వాజుం డర్జునునకు బ్రహ్మశిరోనామక దివ్యబాణం బొసఁగుట అను	1-80-20 పంక్తి	625
కణికనీతి	1-81-10	627
దుర్యోధనుఁడు తండ్రితోఁ దన మనోదుఃఖంబుఁ దెలుపుట	1-129-10	635
దుర్యోధనుఁడు పాండవులను వారణావతంబునకుఁ బంపుమని తండ్రితోఁ జెప్పుట	1-30-8	639
ధృతరాష్ట్రుండు పాండవులను వారణావత నగరంబునకుఁ బోవఁ బనుచుట	1-131-2	642
దుర్యోధనుఁడు లాక్షాగృహనిర్మాణమునకై పురోచనుని వారణావతంబునకుఁ బంపుట	1-132-2	644
వారణావతప్రస్థానము - విదురోపదేశము	1-133-4	646

విషయము	సంస్కృతమూలము	పుట
పాండవులు జననీసహితంబుగా వారణావతంబుఁ జేరుట	1-134-1	650
లాక్షాగృహదహనము	1-135-1	654
పాండవులు లక్కయింటఁ జచ్చిరని ధృతరాష్ట్రుండు దుఃఖించుట	1-137-10	660
పాండవులు వారణావతమునుండి దక్షిణదిశగా నడచుట	1-137-17	662
భీముఁడు నిద్రితులైన జననీసోదరులను జూచి చింతిల్లుట	1-138-14	664
హిడింబ భీమసేనునిం జూచి మోహించుట	1-139-1	668
భీమసేనహిడింబాసురుల యుద్ధము	1-141-15	674
భీముఁడు తల్లియనుమతంబున హిడింబను బరిగ్రహించుట	1-143-1	683
పాండవులకు వ్యాసుఁడు హితోపదేశము సేయుట	1-144-7	685
హిడింబయందు ఘటోత్కచుండు పుట్టుట	1-145-27	688
పాండవు లేకచక్రపురంబున విప్రగృహంబున నుండుట	1-145-1	690
బకున కాహారముగాఁ బోవుటనుగూర్చి బ్రాహ్మణకుటుంబము విచారించుట	1-145-20	693
కుంతీదేవికి బ్రాహ్మణుండు తన దుఃఖకారణంబును దెలుపుట	1-148-1	700
బకునిఁ జంప భీమునిఁ బంపుటకుఁ గుంతి నిశ్చయించుట	1-149-13	704
కుంతి ధర్మజునకుఁ బరదుఃఖనివారణము పరమపుణ్యంబని తెలుపుట	1-150-20	708
భీముఁడు బకాసురునిఁ జంపఁ బోవుట	1-151-1	711
భీమసేనుఁడు బకాసురుం జంపట	1-151-15	713

సప్తమాశ్వాసము

ధృష్టద్యుమ్న ద్రౌపదులయుత్పత్తివృత్తాంతము	1-153-1	721
ద్రౌపదీవివాహప్రయ్నతము (అమూలకము)		730
పాండవులు పాంచాలపురంబునకు బయలుదేరుట	1-156-2	733
పాండవులు ద్రుపదుపురంబున కరుగుచు వ్యాసమహర్షిం గనుట	1-157-1	734
అర్జునుఁ డంగారపర్ణుని జయించుట	1-158-9	737
అంగారపర్ణుం డర్జునునితో సఖ్యము సేయుట	1-158-35	742
అంగారపర్ణుఁడు పాండవులకుఁ బురోహితునిఁ బురస్కరింపుఁ డని చెప్పుట	1-159-17	746
తపతీసంవరణోపాఖ్యానము	1-160-3	749
సంవరణుండు తపతిం జూచి మోహించుట	1-160-25	751

విషయము	సంస్కృతమూలము	పుట
వసిష్ఠుఁడు తపతినిఁ గొనితెచ్చి సంవరణునకు వివాహంబు సేయించుట	1-162-12	756
అంగారపర్ణుడు అర్జునునకు వసిష్ఠుమహిమ చెప్పుట	1-165-2	761
శక్తిమహాముని కల్మాషపాదుని శపియించుట	1-166-7	768
పుత్రశోకంబున వసిష్ఠుఁడు ఆత్మహత్యకుఁ బ్రయత్నించుట	1-166-40	771
వసిష్ఠువలనఁ గల్మాషపాదుండు శాపవిముక్తిఁ జెందుట	1-168-5	775
వసిష్ఠ ప్రసాదంబునఁ గల్మాషపాదుండు పుత్రవంతుఁడగుట	1-168-11	777
భార్గవుండయిన ఔర్వుని జననము	1-169-20	780
పితృదేవతలు ఔర్వుని శాంతచిత్తునిఁ జేయుట	1-170-14	782
పరాశరుఁడు రాక్షసవినాశార్థంబు సత్త్రయాగంబు సేయుట	1-172-2	786
పాండవులు ధౌమ్యునిఁ బురోహితుఁగా వరియించుట	1-174-6	789
ద్రౌపదీస్వయంవరము	1-179-11	793
రాజపుత్త్రులు మత్స్యయంత్రమును భేదింపఁబోయి భంగపడుట	1-177-22	797
అర్జునుఁడు మత్స్యయంత్రంబుఁ దెగనేయుట	1-179-4	801
ద్రౌపది యర్జునుని వరించుట	1-179-22	806
అర్జునుండు కర్ణునితో యుద్ధంబు సేసి జయించుట	1-181-3	809
అర్జునుండు ద్రౌపదిం దెచ్చి తల్లికి నివేదించుట	1-182-1	815
శ్రీకృష్ణబలరాములు ధర్మరాజాదులఁ జూడవచ్చుట	1-183-2	818
పాండవుల వంశాదికము నెఱింగి రమ్మని ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం బనుచుట	1-184-3	821
పాండవులు ద్రుపదమహారాజగృహంబునకుఁ బోవుట	1-185-25	827
వ్యాసమహాముని ద్రుపదునియొద్దకు వచ్చుట	1-186-38	833
ద్రుపదునకు వ్యాసుండు ఇంద్రసేన యను పతివ్రతకథ సెప్పుట	1-100-60	838
ద్రుపదునకు వ్యాసుండు పంచేంద్రోపాఖ్యానంబు సెప్పుట	1-189-1	842
ద్రౌపదీవివాహమహోత్సవము	1-90-5	849

అష్టమాశ్వాసము

పాండవులు ద్రుపదరాజుపురంబున నిష్టోపభోగంబు లనుభవించుచు సుఖంబుండుట	1-190-25	855

విషయము	సంస్కృతమూలము	పుట
చారులవలన పాండవుల యభ్యుదయమును విని దుర్యోధనుఁడు నిర్వేదించుట	1-191-1	859
దుర్యోధనుఁడు తండ్రితోఁ బాండవపాంచాల విభేదనోపాయంబు నాలోచించుట	1-192-25	863
భీష్మద్రోణులు దుర్యోధనునకు బుద్ధి సెప్పుట	1-195-1	869
పాండవులను దోడ్తేర ధృతరాష్ట్రుండు విదురునిఁ బంచుట	1-193-3	879
పాండవులు హస్తిపురంబునకు వచ్చుట	1-199-10	883
విశ్వకర్మ యింద్రప్రస్థపట్టణమును నిర్మించుట	1-199-28	886
నారదుఁడు పాండవులపాలికి వచ్చుట	1-200-8	896
సుందోపసుందోపాఖ్యానము	1-201-1	898
సుందోపసుందు లొండొరులతోఁ బోరి చచ్చుట	--	905
నారదప్రేరితులయి పాండవులు సమయము సేయుట	1-204-27	906
సమయభంగకారణమున నర్జునుండు తీర్థయాత్రకుం జనుట	1-206-12	911
ఉలూచి యర్జునునిఁ గామించుట	1-206-12	913
అర్జునుండు చిత్రాంగదను వివాహంబగుట	1-207-14	918
అర్జునుఁడు పంచతీర్థంబులం దప్సరసలను శాపవిముక్తుల నొనరించుట	1-208-1	921
అర్జునుండు ద్వారకానగరంబునకుఁ జనుట	1-210-4	930
అర్జునుండు యతిరూపంబున కన్యాపురంబున నుండుట	(సం-అను.1-114-64 పంక్తి)	937
అర్జునుండు సుభద్రను వివాహంబగుట	(సం-అను.1-114-270 పంక్తి)	943
అర్జునుండు సుభద్రాసహితుండై యింద్రప్రస్థపురంబునకుఁ జనుట	1-213-13	950
శ్రీకృష్ణబలదేవాదులు పాండవులకుఁ గానుకలు తెచ్చి యిచ్చుట	1-213-33	952
అభిమన్యుప్రభృతుల జననము	1-213-58	956
అగ్నిదేవుఁడు ఖాండవసమీపమున విహరించుచున్న కృష్ణార్జునులకడకు వచ్చుట	1-214-29	960
శ్వేతకి యను రాజర్షివృత్తాంతము	1-215-11 (అను.1-8)	963
అగ్నిదేవుండు కృష్ణార్జునులకుఁ జక్రకార్ముకాదు లొసంగుట	1-215-12	967
కృష్ణార్జును లగ్నిహోత్రునిచే ఖాండవంబు దహింపఁజేయుట	1-216-28	970
ఇంద్రుండు కృష్ణార్జునులతోఁ బోరుట	1-218-13	977
మందపాలోపాఖ్యానము	1-220-1	983
ఇంద్రుం డర్జునునకు నాగ్నేయ వారుణ వాయవ్యాది దివ్యబాణంబు లిచ్చుట	1-225-7	992

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము

రెండవ భాగము

(5,6,7,8 ఆశ్వాసాలు)

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - పంచమాశ్వాసము

శ్రీనాథమూర్తి! విబుధని । ధాన! మహాదాన తర్పితద్విజవర! వేం
గీనాథ! పార్థనిభ! యభిమానమహార్ణవ! మహేంద్రమహిమాతిశయా! 1

ప్రతిపదార్థం: శ్రీనాథమూర్తి=లక్ష్మిదేవికి భర్త అయిన విష్ణువువంటి ఆకారం కలవాడా!; విబుధ, నిధాన= పండితులకు నిధివంటివాడా!; మహా, దాన తర్పిత, ద్విజ వర= గొప్పదానాలచేత తృప్తిని పొందింపబడిన బ్రాహ్మణశ్రేష్ఠులు కలవాడా!; వేంగీ నాథా= వేంగీదేశానికి ప్రభువు అయినవాడా!; పార్థ, నిభ= అర్జునితో సమానం అయినవాడా!; అభిమాన మహా+అర్ణవ= ప్రేమయందు సముద్రంవంటివాడా లేదా ఆత్మగౌరవంలో సముద్రంవంటివాడా!; మహా+ఇంద్ర, మహిమ+అతిశయా= దేవేంద్రుని గొప్పతనంవంటి ఆధిక్యము కలవాడా!

తాత్పర్యం: విష్ణుమూర్తివంటి ఆకారంకలవాడా! పండితులకు నిధివంటివాడా! మహాదానాలచేత బ్రాహ్మణ శ్రేష్ఠులను తృప్తి పొందించినవాడా! వేంగీదేశానికి రాజైనవాడా! అర్జునునితో సమానమైనవాడా! సముద్రమంత ప్రేమ కలవాడా లేదా సముద్రమంత ఆత్మాభిమానం కలవాడా! దేవేంద్రునంతటి గొప్పతనం కలవాడా!

విశేషం: ఇది రాజరాజనరేంద్రుని మనోహరమైన ఆకారాన్ని, మహాదానగుణాన్ని, పరాక్రమ విశేషాన్ని, ప్రేమాతిశయాన్ని, వైభవాన్ని తెలియచేసే ఆశ్వాసారంభ సంబోధనపద్యం.

ధృతరాష్ట్రపాండుకుమారులు పెరుఁగుట (సం.1-102-1)

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె: నట్లు ధృతరాష్ట్రపాండువిదురులు భీష్మాభిరక్షితులై పెరుఁగుచు, నుపనయనానంతరంబున నధ్యయనం బొనరించి రాజవిద్యలయందు జితశ్రము లై యున్నంత. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= కథను చెప్పే ఆ ఉగ్రశ్రవసమహర్షి; శౌనక+ఆది, మహా, మునులకున్= శౌనకుడు మొదలైన మహర్షులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; ధృతరాష్ట్ర, పాండు విదురులు; భీష్మ+అభిరక్షితులు+ఐ= భీష్మునిచేత పోషింపబడిన వాళ్ళయి; పెరుగుచు= వృద్ధిచెందుతూ; ఉపనయన+అనంతరంబునన్= ఉపనయనం జరిగినతరువాత; అధ్యయనంబు= విద్యాభ్యాసం; ఒనరించి= చేసి; రాజ, విద్యల+అందు= క్షత్రియులకు తగిన విద్యలలో; జిత, శ్రములు+ఐ= జయింపబడిన శ్రమ కలవాళ్ళయి - అనగా సమర్థులై; ఉన్నంత= ఉండినప్పుడు.

తాత్పర్యం: మహాభారతకథను చెప్పే ఆ ఉగ్రశ్రవసుడు, శౌనకాదిమహామునులకు ఇట్లా చెప్పాడు; ఆ విధంగా ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు భీష్ముని పోషణలో పెరుగుతూ ఉపనయనమైన తరువాత విద్యాభ్యాసం చేసి, రాజవిద్యలలో ఆరితేరి ఉండగా.

సీ. అమరాపగాసుతు ననుశాసనంబునఁ। గౌరవ రాజ్యంబు గడు వెలింగెఁ,
గురుభూము లుత్తరకురువులకంటెను । నధికలక్ష్మీయుక్తి నతిశయిల్లె,
ధర్మాభిసంరక్షితం బైన భూప్రజ । కెంతయు నభివృద్ధి యెసఁగుచుండె,
వలసినయప్పుడు వానలు గురియుట । సస్యసమృద్ధి ప్రశస్త మయ్యెఁ,

ఆ. బాలు సేఁపెఁ బుష్పఫలభరితంబు లై । తరువనంబు లొప్పె, ధర్మకర్మ
నిరతిఁ జేసి కరము నెమ్మితో నన్యోన్య । హితముఁ జేయుచుండి రెల్ల జనులు 3

ప్రతిపదార్థం: అమర+ఆపగా, సుతు, అనుశాసనంబునన్= దేవనది అయిన గంగయొక్క పుత్రుడు భీష్ముని ఏలుబడిచేత; కౌరవ, రాజ్యంబు; కడు=మిక్కిలి; వెలింగెన్=ప్రకాశించింది; కురు, భూములు=కురుదేశంలోని భూభాగాలు; ఉత్తర, కురువుల కంటెను=ఉత్తరకురుదేశంలోని ప్రదేశాలకంటె; అధిక, లక్ష్మీ, యుక్తిన్= అధికమైన సంపదచేత; అతిశయిల్లెన్= హెచ్చెను; ధర్మ+ అభిరక్షితంబు+ఐన= ధర్మంచేత చక్కగా రక్షింపబడిన; భూ, ప్రజకు= దేశప్రజలకు; ఎంతయున్= మిక్కిలి; అభివృద్ధి; ఎసఁగుచుండెన్= కలుగుతూ ఉండెను; వలసిన, అప్పుడు= అవసరమైనప్పుడు; వానలు, కురియుట= వానలు కురవటంచేత; సస్య, సమృద్ధి= పంటల అతిశయం; ప్రశస్తము+అయ్యెన్= గొప్పగా ఉండెను; పాలు, చేఁపెన్= పాలు పోసుకొన్నవి; (పంటగింజలు పాలుపోసుకోవడం అంటే పంటలు సారవంతంగా పండట మని భావం లేదా పాడి ఎక్కువయింది అని భావం); తరు, వనంబులు= చెట్ల సమూహాలు; పుష్ప, ఫల, భరితంబులు+ఐ= పూలతో, పళ్ళతో నిండిన వై; ఒప్పెన్= శోభిల్లినాయి; ఎల్ల జనులు= ప్రజలంతా; ధర్మ, కర్మ, నిరతిన్+చేసి= ధర్మకార్యాలమీద ఆసక్తిచేత; కరము, నెమ్మితోన్= మిక్కిలి ప్రేమతో; అన్యోన్య హితమున్= ఒకరికి ఒకరు మేలును; చేయుచుండిరి = చేస్తూ ఉన్నారు.

తాత్పర్యం: భీష్మునిపాలనలో కౌరవరాజ్యం గొప్పగా వెలిగింది. కురుదేశం ఉత్తరకురుదేశాలకంటె అధికసంపదతో విలసిల్లింది. ధర్మంచేత చక్కగా రక్షింపబడిన దేశప్రజలకు అభివృద్ధి కలుగుతూ ఉన్నది. అవసరమైనప్పుడు వానలు కురవటంచేత పంటలు సమృద్ధిగా పండాయి. పాడి ఎక్కువ అయింది. వృక్షాలు పూలతో, పళ్ళతో నిండాయి. ప్రజలంతా ధర్మకార్యాలమీద ఆసక్తి కలవా ళ్ళయి మిక్కిలి ప్రేమతో ఒకరి కొకరు మేలు చేస్తూ ఉన్నారు.

విశేషం: సమర్థుడు, ధర్మ బద్ధుడు అయిన భీష్ముని పాలనలో దేశంలో శాంతిసౌభాగ్యాలు ఎట్లా ఉన్నాయో ఈ పద్యం తెలుపుతున్నది. (వ్రాతప్రతులలో మొదటిపాదము చివర "వెలుంగె" అని ఉన్నది.)

మ. అమలాచారపవిత్రభూసురవరేణ్యాగార పుణ్యప్రదే
శములం దధ్యయనారవంబు విధివత్స్వాహాస్వధాస్వస్తిశ
బ్దములున్ మంగళతూర్యఘోషములు నుద్యత్కౌతుకాశీర్నినా
దములున్ రమ్యతరంబు లయ్యె ధరణిం దద్రాజ్యసంవృద్ధితోన్. 4

ప్రతిపదార్థం: ధరణిన్=భూమిమీద; తద్+రాజ్య, సంవృద్ధితోన్= ఆ భీష్మునిపరిపాలనయొక్క పెంపుతో; అమల+ఆచార, పవిత్ర, భూసుర, వరేణ్య+అగార, పుణ్య ప్రదేశముల, అందు= నిర్మలమైన ఆచారంచేత, పరిశుద్ధాలు అయిన బ్రాహ్మణ శ్రేష్ఠుల ఇళ్ళలోని ఆ పుణ్యస్థలాలలో; అధ్యయన+ఆరవంబు= వేదపఠనధ్వని; విధివత్+స్వాహా, స్వధా, స్వస్తి శబ్దములున్= వేదశాస్త్రకర్మలతో కూడుకొన్న స్వాహా, స్వధా, స్వస్తి శబ్దాలూ; మంగళతూర్య, ఘోషములున్= మంగళవాద్యాల ధ్వనులూ;

ఉద్యత్+కౌతుక+ఆశీస్+నినాదములున్= వృద్ధిపొందే సంతోషంతో కూడిన ఆశీర్వచనశబ్దాలూ; రమ్యతరంబులు= మిక్కిలి మనోహరాలు; అయ్యెన్= అయినవి.

తాత్పర్యం: పెంపు వహించిన భీష్మునిపరిపాలనలో - సదాచారంచేత పవిత్రాలైన బ్రాహ్మణశ్రేష్ఠులఇళ్ళలో, పుణ్యస్థలాలలో- వేదనాదాలు, శ్రౌత స్మార్త కర్మసంబంధాలైన స్వాహా, స్వధా, స్వస్తిశబ్దాలు, మంగళవాద్య ధ్వనులు, మహానందంతో కూడిన ఆశీర్వచనాలు మిక్కిలి మనోహరాలై వినిపిస్తున్నాయి.

విశేషం: బ్రాహ్మణుల ఇళ్ళలో వేదకర్మలు, లౌకిక కర్మలు నిర్విఘ్నంగా సాగుతున్నా యని వస్తుధ్వని. అధ్యయన అధ్యాపనాలు, నిత్యనైమిత్తిక యజ్ఞకర్మలు, శుభకార్యాలు, ఆశీర్వచనాలు అనే నాల్గు క్రియలు వాటికి మూలమైన బ్రాహ్మణ సదాచార సంపత్తిని ధ్వనింపచేస్తున్నాయి. వర్ణాశ్రమ ధర్మ రక్షణపరుడైన భీష్ముని ప్రవృత్తి వస్తుధ్వని. ప్రసాదగుణమిశ్రితమైన ఓజస్సును ఉదాత్తవస్తువర్ణనంతో నిబంధించటం నన్నయరచనలో తరచుగా కనపడే శైలీశిల్పం. (సంపా.)

వ. ఇట్లు బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజాభివృద్ధియు సస్యసమృద్ధియు నగుచుండ, నాంబికేయు ధృతరాష్ట్రు రాజ్యాభిషిక్తుం జేసి, భీష్ముండు దనకు విల్లును విదురుబుద్ధియును సహాయంబులుగా రాజ్యంబు రక్షించుచున్నంత. 5

ప్రతిపదార్థం: ఇట్లు; బ్రహ్మ+ఉత్తరంబు, కాన్= బ్రాహ్మణులు అధికులు కాగా; ప్రజా, వృద్ధియు= ప్రజలయొక్క అభివృద్ధి; సస్య, సమృద్ధియున్= పంటలు దండిగా పండటం; అగుచుండన్; భీష్ముండు; ఆంబికేయు= అంబికకొడుకు అయినవాడిని; ధృతరాష్ట్రున్; రాజ్య+అభిషిక్తున్= రాజ్యానికి అభిషేకింపబడినవాడిని - అంటే రాజును; చేసి; తనకున్; విల్లును; విదురు, బుద్ధియును; సహాయంబులుగాన్= తోడు కలవిగా; రాజ్యంబున్; రక్షించుచున్+ఉన్నంత= కాపాడుతూ ఉన్నప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా బ్రాహ్మణులు అధికులు అవుతుండగా, ప్రజలు అభివృద్ధి చెందుతుండగా, పంటలు సమృద్ధిగా పండుతుండగా భీష్ముడు అంబికకొడుకు అయిన ధృతరాష్ట్రుడిని పట్టాభిషిక్తుడిని చేసి, తనకు ధనుస్సు, విదురుడిబుద్ధిబలం సహాయకాలుగా కౌరవరాజ్యాన్ని రక్షిస్తూ ఉండగా.

విశేషం: ధృతరాష్ట్రుని పట్టాభిషిక్తత వివాదగ్రస్తం. ఔత్తరాహభారతప్రతులలో అంధత్వంచేత ధృతరాష్ట్రుడు, పారసవత్వంచేత అనగా (పరుని కులము), పరస్త్రీయందు పుట్టినవాడు అగుటచేత విదురుడు రాజ్యాన్ని పొందలేక పోయినట్లూ, పాండురాజు రాజు అయినట్లూ చెప్పబడింది.

ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వా ద్రాజ్యం న ప్రత్యపద్యత

పారసవత్వా ద్విదురో రాజా పాండు ర్బభూవహ. (సం.భా.అధ్యా.109 శ్లో.25)

దాక్షిణాత్యప్రతిలోమాత్రం ధృతరాష్ట్రుడు పట్టాభిషిక్తు డైనట్లు ఉన్నది.

భీష్మేణ రాజా కౌరవ్యో ధృతరాష్ట్రోఽభిషేచితః (సం.భా. దాక్షిణాత్యప్రతి. అధ్యా 18. శ్లో.21)

కాని అదే ప్రతిలో అదే అధ్యాయంలో ధృతరాష్ట్రుడు అంధుడు అవటంచేత రాజ్యాన్ని పొందలేకపోయినట్లు, పారసవత్వం చేత విదురుడు రాజు కానట్లు, పాండురాజే రా జైనట్లు చెప్పబడి ఉండటం గమనించతగింది.

ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వా ద్రాజ్యం న ప్రత్యపద్యత

పారసవత్వా ద్విదురో రాజా పాండు ర్బభూవ హ. (సం.భా. దక్షిణాత్యప్రతి అధ్యా.18 శ్లో.30)

తెలుగుభారతంలో కూడా అనేక సందర్భాలలో ధృతరాష్ట్రుడి పట్టాభిషిక్తతకు ప్రతిబంధకా లైన వాక్యా లున్నాయి. (ఆది. షష్ఠా.ప.123 వ.124; ప 128, వ, 129, ప. 143)

ధృతరాష్ట్రుని పట్టాభిషిక్తత విషయంలో నన్నయ దాక్షిణాత్యప్రతిని అనుసరించినట్లు ఉన్నది.

మ. ఆయము గర్వమున్ విడిచి యన్యపతుల్ పనిసేయ నిట్లు గాం
గేయభుజాబలంబున నికృత్తవిరోధిసమాజుఁ డై కుమా
రాయితశక్తిశాలి ధృతరాష్ట్రుఁడు రాజ్యము సేయుచుండె న
త్యాయతకీర్తితోఁ దనకు హస్తిపురం బది రాజధానిగన్. 6

ప్రతిపదార్థం: ఆయము= ఆదాయం; గర్వమున్ విడిచి; అన్య, పతులు= తక్కిన రాజులు; పనిచేయన్= సేవ చేయగా; ఇట్లు= ఈ విధంగా; గాంగేయ; భుజా, బలంబునన్= భీష్మునిభుజబలంచేత; నికృత్త, విరోధి, సమాజుఁడు+ఐ= నరకబడిన శత్రువులసమూహం కలవాడై; కుమార+ఆయిత, శక్తిశాలి= కుమారస్వామి అంతటి పరాక్రమం కలవాడైన; ధృతరాష్ట్రుఁడు; అతి+ఆయత; కీర్తితోన్= మిక్కిలి పొడవైన కీర్తితో - అనగా అత్యధికమైన కీర్తితో; తనకున్; హస్తిపురంబు; అది; రాజధానిగన్= రాజు నివసించు ప్రధాన నగరముగా అనగా పరిపాలనకేంద్రముగా; రాజ్యమున్ = రాజ్యమును; చేయుచున్+ఉండెన్= పాలిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: ఇతరదేశాలరాజులు తమ ఆదాయాన్ని, గర్వాన్ని విడిచి తనను కొలుస్తూ ఉండగా, భీష్ముని భుజబలంచేత శత్రురాజులను సంహరించి, కుమారస్వామి అంతటి శక్తిశాలి అయిన ధృతరాష్ట్రుడు హస్తినాపురాన్ని తనకు రాజధానిగా చేసికొని, అత్యధికకీర్తితో రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉన్నాడు.

విశేషం: 'ఆయము గర్వమున్' అనేదానికి 'ఆయుతగర్వమున్' అనే పాఠాంతరం ఉన్నది. అప్పుడు అధికమయిన గర్వమును విడిచి ఇతరరాజులు అందరూ ధృతరాష్ట్రుడిని కొలిచారు అని అనవలసివస్తుంది. పద్యంలోని ప్రసాదగుణం పరిపాలనలోని ప్రశాంతతను ధ్వనింపచేస్తున్నది.

వ. ఇట్లు రాజ్యంబు సేయుచు నారూఢ యౌవనుం డైన యా ధృతరాష్ట్రునకు వివాహంబు సేయ సమకట్టి, భీష్ముండు గాంధారపతి యయిన సుబలుకూఁతు గాంధారి యనుదాని, నతిశయ రూపలావణ్య శీలాభిజాత్య సమన్వితఁ గా బ్రాహ్మణులవలన విని విదురున కి ట్లనియె. 7

ప్రతిపదార్థం: ఇట్లు; రాజ్యంబు; చేయుచు; ఆరూఢ, యౌవనుండు+ఐన= యౌవనవంతుడు కాగా; ఆ, ధృతరాష్ట్రునకున్= ఆ ధృతరాష్ట్ర మహారాజునకు; వివాహంబు; చేయన్ సమకట్టి= పూనుకొని; భీష్మండు= భీష్ముడు; గాంధారపతి, అయిన= గాంధారదేశానికి రాజైన; సుబలు, కూఁతున్= సుబలుని పుత్రికను; గాంధారి, అను, దానిన్= గాంధారి అను పేరుగల కన్యను; అతిశయ, రూప, లావణ్య, శీల+ఆభిజాత్య; సమన్వితగా= మిక్కిలి, అందమైన రూపంతో; కాంతితో, మంచినడవడితో, ఉన్నతమైన వంశంతో కూడిన దానినిగా; బ్రాహ్మణులవలనన్= విప్రుల మూలమున; విని= విని; విదురనకున్= విదురునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా రాజ్యం చేస్తూ యౌవనవంతు డైన ఆ ధృతరాష్ట్రునికి వివాహం చేయటానికి పూనుకొని భీష్ముడు, గాంధారరాజైన సుబలునికూతురు గాంధారి - అందమైన రూపం కల దని, కాంతి కల దని, మంచి నడవడితో, ఉన్నత మైన వంశంతో కూడుకొన్న దని, బ్రాహ్మణులవలన విని విదురునితో ఇట్లా అన్నాడు.

క. ఈ వంశము విచ్ఛేదము । గావచ్చినఁ గులము నిలుపఁగా సత్యవతీ
దేవి వచనమున సంతతి । గావించెను వ్యాసుఁ డను జగత్కర్త దయన్. **8**

ప్రతిపదార్థం: ఈ వంశము; విచ్ఛేదము= నాశం; కావచ్చినన్= కానుండగా; కులము నిలుపఁగాన్= కురువంశమును నిలుపుటకై; సత్యవతీదేవి, వచనమునన్= సత్యవతీదేవి యొక్క మాటవలన; వ్యాసుఁడు; అను; జగత్+కర్త= వ్యాసుడు అను పేరుగల బ్రహ్మ; దయన్= కృపతో; సంతతిన్ కావించెను= సంతానము కలిగించాడు.

తాత్పర్యం: ఈ కురువంశం నశిస్తూ ఉండగా, సత్యవతీదేవిమాటప్రకారం వ్యాసుడు అనే బ్రహ్మ, కులాన్ని నిలపటానికి దయతో సంతానాన్ని కలిగించాడు.

విశేషం: అలం: రూపకం.

క. ఈ కులము వివర్ధింపఁగ । నా కభిమత; మేను వింటి నలినేక్షణ దా
నేకశత సుతులఁ బడయఁగ । నా కన్యక వరము వడసె నటె హరుచేతన్. **9**

ప్రతిపదార్థం: ఈ, కులము= ఈ వంశాన్ని; వివర్ధింపఁగన్= వృద్ధిపొందించటానికి; నాకున్; అభిమతము= ఇష్టం; ఏను=నేను; వింటిన్= విన్నాను; నలిన+ఈక్షణ= తామరలవంటి కళ్ళు కలది; తాన్=తాను; ఆ, కన్యక= ఆ గాంధారి; ఏక, శత, సుతులన్= ఒక కూతురును ఎక్కువగాగల వందమందికొడుకులను; పడయఁగన్= పొందటానికి; హరుచేతన్= శివునివలన; వరము; పడసెన్, అటె= పొందెనట కదా.

తాత్పర్యం: ఈ వంశాన్ని వృద్ధిపొందింప చేయడం నాకు ఇష్టం. తామరలవంటి అందమైన కళ్ళు కల ఆ గాంధారి వందమంది కొడుకులు, ఒక కూతురు- మొత్తం నూటొక్కరు తనకు కలిగేటట్లు శివుడివలన వరం పొందిందట కదా.

విశేషం: తనతరంలోనే సంతతిలేని కారణంగా రాజవంశంలో వారసుడులేని దీనస్థితి ఏర్పడటం భీష్ముడు గ్రహించాడు. దేవర న్యాయంతో ధృతరాష్ట్రపాండురాజులు పుట్టారు. వారితరంలో మళ్ళీ వారసులు లేనిదుస్థితి రాకూడ దని భావించాడు. నూరుగురు కొడుకులను, ఒక కూతురుని కనగలిగిన వధువును అన్వేషించాడు. పైకి చూస్తే అది ఒక అత్యాశగా ఉండవచ్చు. కాని, కులవిస్తారం కావా లంటే విస్తృతసంతానం గల కులసతి కావాలి. వంశాభివృద్ధినిగూర్చిన భీష్ముని ఆసక్తి ఈ మాటలలో ధ్వనిస్తూ ఉన్నది. ఏకశతసుతులన్ - ఇందులో సుతశబ్దం ఏకశేషసమాసంలో ఉన్నది కాబట్టి కొడుకు లనీ, కూతు రనీ అర్థం ఇస్తుంది. సుతులును=సుతయు, సుతుడును; ఏకశేషసమాసంలో పుంలింగమే శేషిస్తుంది. ఏకశతమంటే నూటొక్కరని అర్థం. గాంధారి నూర్గురుకొడుకులను, ఒక కూతురిని కంటుం దని శివునివరం.

వ. 'కావున ధృతరాష్ట్రునకు గాంధారిని వివాహంబు సేయుదము; గాంధారపతి మనతోడి సంబంధమునకుం దగు' నని నిశ్చయించి సుబలు పాలికిఁ దగుముదుసళ్ళం బంచిన, సుబలుండును సుముఖుం డై

'కురుకులవిస్తారకుం డయిన ధృతరాష్ట్రుండ యిక్కన్యకకు నర్హుండు గావున నా రాజునకు గాంధారి నిచ్చితి'
ననిన, వాని బంధుజనంబు లెల్లఁ దమలో ని ట్లనిరి. 10

ప్రతిపదార్థం: కావునన్; ధృతరాష్ట్రునకున్; గాంధారిని; వివాహంబున్, చేయుదము= పెండ్లిగావింతము; గాంధారపతి= గాంధారరాజు సుబలుడు; మనతోడి= మనతో; సంబంధమునకున్= వియ్యమునకు, తగున్; అని= ఆ విధముగా; నిశ్చయించి= నిర్ణయించుకొని; సుబలు, పాలికి= సుబలునిదగ్గరకు; తగు, ముదుసళ్ళన్= తగినపెద్దలను; పంచినన్= పంపగా; సుబలుండును; సుముఖుండు+ఐ= అనుకూలు డై; కురు, కుల విస్తారకుండు+అయిన= కురువంశాన్ని పెంచేవాడైన; ధృతరాష్ట్రుండు+అ= ధృతరాష్ట్రుడే; ఈ+కన్యకకున్; అర్హుండు= తగినవాడు; కావునన్; ఆ రాజునకున్= ధృతరాష్ట్రునకు; గాంధారిన్; ఇచ్చితిన్; అనిన; వాని= ఆ సుబలునియొక్క; బంధు, జనంబులు+ఎల్లన్= బంధుగణమంతా; తమలోన్; ఇట్లు+అనిరి= ఈ విధంగా అనుకొన్నారు.

తాత్పర్యం: 'కాబట్టి ధృతరాష్ట్రునితో గాంధారిని వివాహం చేద్దాము. గాంధారదేశప్రభువు సంబంధం యోగ్యమైనది' అని తీర్మానించి; సుబలునిదగ్గరికి యోగ్యులైన పెద్దలను పంపగా, సుబలుడుకూడా అనుకూలుడై 'వంశాన్ని విస్తరించేవా డైన ధృతరాష్ట్రుడే ఆ కన్యకు తగినవాడు. కాబట్టి, ధృతరాష్ట్రునికి గాంధారి నిస్తా'నని వాగ్దానంచేయగా గాంధారరాజబంధువు లందరూ తమలో తాము ఇట్లా అనుకొన్నారు.

విశేషం: తమతో సంబంధానికి తగినవాడు గాంధారరాజు అని భావించాడు- భీష్ముడు. దానికి కారణ మేమిటో చెప్పడు నన్నయ. సారమతులు లోనారసి తెలిసికొనదగిన అంశ మని వ్యంగ్యంచేశాడు. వంశవిస్తారాన్ని కోరేవారే గాంధారిని వివాహమాడటం సహజం. నూటఒక్క బిడ్డల తల్లి కాగల వరం పొందిన గాంధారికి వంశ విస్తృతికొరకు వివాహం చేసికొనే ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడైనా అనువైన, యోగ్యుడైన వరుడు అని వ్యంగ్యార్థం. గాంధారరాజు తన కూతురికి తగిన భర్త లభించా డని భావించాడు. తనభారం తీరిం దని తలంచాడు. ఎవ్వరికీ చెప్పకుండానే అంగీకరించాడు. ఇదంతా ఊహిస్తే కథ ప్రసన్నమౌతుంది. ఇది నన్నయ కథాకథనశిల్పం. (సంపా.)

తే. అంగములలోన మే లుత్తమాంగ, మందు । నుత్తమంబులు గన్నుల యుర్విజనుల,
కట్టి కన్నులు లే వను నదియకాక । యుత్తముఁడు గాఁడె సద్గుణయుక్తి నతఁడు. 11

ప్రతిపదార్థం: ఉర్వి, జనులకు= భూమిమీదప్రజలకు; అంగములలోన= అవయవాలలో; ఉత్తమ+అంగము= తల; మేలు= శ్రేష్ఠము; అందున్= ఆ తలలో; కన్నులు+అ= కన్నులే; ఉత్తమంబులు= శ్రేష్ఠాలు; అట్టి, కన్నులు= అటువంటి కన్నులే అతనికి లేవు; అనున్= అని లోకము అనును; అదియు+అ, కాక= అంతమాత్రమేకాని; అతఁడు= ఆ ధృతరాష్ట్రుడు; సత్+గుణ, యుక్తిన్=మంచిగుణాల కూడికతో; ఉత్తముఁడు; కాఁడే= అగునుకదా.

తాత్పర్యం: లోకంలో మానవులకు అవయవా లన్నింటిలో శిరస్సు ప్రధానం. ఆ శిరస్సులో కన్నులే ప్రధాన మైనవి. అటువంటి కన్నులే ధృతరాష్ట్రునికి లేవు. కాని అతడు మంచిగుణాలచేత ఉత్తముడే కదా!

విశేషం: 'కన్యా వరయతే రూపమ్' అనీ 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్' అనీ అభియుక్తోక్తి. గాంధారి పద్మాలవంటి అందమైన కళ్ళుకలది. ఆమెకు పుట్టుగ్రుడ్డితో పెండ్లి. ఆమెకు తగినవాడు ధృతరాష్ట్రుడే అని గాంధారపతి నిర్ణయించి, వివాహం నిశ్చయించాడు. అతడు చండశాసనుడు. అతని మాటను ఎవరూ కా దనలేరు. చివరకు గాంధారికూడా! ఆమెకు కూడ వివాహం కావా లంటే ధృతరాష్ట్రునివంటి వంశవిస్తారకుడే ముందుకు రావా లని తెలుసు. బంధువులుమాత్రం చూచి గ్రుడ్డివానికి పిల్ల నివ్వటం ఇష్టంలేక అధిక్షేపాత్మకంగా, వ్యంగ్యంగా గుసగుసలాడుకొన్నారు.

ధృతరాష్ట్రుడు గాంధారిని వివాహంబు సేసికొనుట (సం.1-103-10)

వ. అనిన వారిపలుకులు విని గాంధారి ధృతరాష్ట్రునకుఁ బితృవచనదత్తఁగాఁ దన్ను నిశ్చయించి, 'నాకుఁ బతి యిమ్మహీపతియ కాని యొరుల నొల్ల' నని యప్పరమపతివ్రత పరపురుషదర్శనంబు పరిహరించి, పతి కనుగుణంబుగా నేత్రపట్టంబునఁ దన నేత్రంబులు గట్టికొని యుండె; నంత నక్కన్యం దోడ్కొని దాని సహోదరుం డయిన శకుని మహావిభూతితో హస్తిపురంబునకు వచ్చిన' ధృతరాష్ట్రుండును బరమోత్సవంబున గాంధారిని వివాహంబై దానితోఁ బుట్టిన కన్యకల సత్యవ్రతయు సత్యసేనయు సుదేష్ణయు సంహితయుఁ దేజశ్శ్రవయు సుశ్రవయు నికృతియు శుభయు శంభువయు దశార్ణయు నను పందుండ్ర నొక్కలగ్నంబున వివాహం బయి మఱియును. 12

ప్రతిపదార్థం: అనినన్+ అని అనగా; వారిపలుకులు విని; గాంధారి; ధృతరాష్ట్రునకున్= యువరాజైన ధృతరాష్ట్రునకు; తన్నున్= తనను; పితృ వచన, దత్తన్; కాన్= తండ్రిమాటతో ఇవ్వబడిన దానినిగా; నిశ్చయించి= నిర్ణయించి; నాకున్; పతి=భర్త; ఈ+మహీపతియు+అ, కాని= ఈ ధృతరాష్ట్రమహారాజేకాని; ఒరులన్= ఇతరులను; ఒల్లను= ఇష్టపడను; అని= ఆ ప్రకారంగా తెలిసి; ఆ+పరమ, పతివ్రత; పర, పురుష, దర్శనంబు= ఇతరపురుషులను చూడటం; పరిహరించి= వదలి; పతికిన్= భర్తకు; అనుగుణంబుగా= తగినట్లు; నేత్ర, పట్టంబునన్= కంటివస్త్రంతో; తన, నేత్రంబులు= తనకళ్ళు; కట్టికొనిఉండెన్= కనబడకుండా కట్టుకొని ఉండినది; అంతన్= తరువాత; ఆ+కన్యన్= ఆ గాంధారిని; తోడ్కొని= వెంటపెట్టుకొని; దాని= ఆ గాంధారియొక్క; సహోదరుఁడు+అయిన= తోడబుట్టినవాడైన; శకుని; మహా, విభూతితో= గొప్పసంపదతో; హస్తి, పురంబునకున్= హస్తినా పురమునకు; వచ్చినన్= రాగా; ధృతరాష్ట్రుండును; పరమ+ఉత్సవంబునన్= మహావైభవంగా; గాంధారిని; వివాహంబు+ఐ= పెళ్ళి చేసికొని; దానితోన్= ఆమెతో కూడ; పుట్టిన= జన్మించిన అనగా గాంధారీదేవి తోబుట్టువు లైన; కన్యకలన్, సత్యవ్రతయు; సత్యసేనయు; సుదేష్ణయు, సంహితయు, తేజశ్శ్రవయు; సుశ్రవయు; నికృతియు, శుభయు, శంభువయు, దశార్ణయున్, అను; పదుండ్రను= పదిమందిని; ఒక్క; లగ్నంబునన్= ఒకే ముహూర్తమునందు; వివాహంబు+అయి= పెండ్లాడి; మఱియును= ఇంకను.

తాత్పర్యం: సుబలుని బంధువులమాటలు విన్న గాంధారి, తండ్రి తనను ధృతరాష్ట్రుని కిచ్చినట్లు నిశ్చయించుకొన్నది. 'నాకు భర్త ధృతరాష్ట్రమహారాజే, అన్యులను వివాహమాడ అంగీకరించ' నని ఆ మహాపతివ్రత పరపురుషులను తాను చూడటానికి ఇష్టపడక, భర్తకు కళ్ళు లేవు కనుక తానుకూడా కళ్ళకు అడ్డంగా గుడ్డ కట్టుకొన్నది. తరువాత ఆమె సోదరుడు శకుని అధికసంపదతో ఆమెను వెంటబెట్టుకొని హస్తినాపురానికి వచ్చాడు. ధృతరాష్ట్రుడు మహావైభవంగా గాంధారినే కాక ఆమె చెల్లెళ్ళు పదిమందినికూడా ఒకే ముహూర్తంలో వివాహమాడాడు.

విశేషం: తండ్రి తీసికొనిన నిర్ణయాన్ని గురించి బంధువులు మాట్లాడుకొనే మాటలు గాంధారి విన్నది. తండ్రిమాటను గౌరవించి తాను ధృతరాష్ట్రుడిని పతిగా భావించుకొని, అతనికి అనురూపంగా కళ్ళకు గంతలు కట్టుకొన్నది. ఆమెచర్యవలన అటు పితృభక్తి, ఇటు పతిభక్తి వ్యక్తమయ్యాయి. బంధువులనోళ్ళు మూతపడ్డాయి. గాంధారి తనతో పాటు పదిమంది తోబుట్టువులతో సహా ధృతరాష్ట్రుని అంతఃపురంలో ప్రవేశించింది. వారినికూడా ధృతరాష్ట్రుడు వివాహమాడాడు.

క. కులమును రూపము శీలముఁ । గల కన్యలఁ దెచ్చి తెచ్చి గాంగేయుం డీ
నలఘుఁడు ధృతరాష్ట్రుఁడు కుల । తిలకుండు పరిగ్రహించె దేవీశతమున్. 13

ప్రతిపదార్థం: కులమును= వంశమును; రూపము= ఆకారము; శీలమున్= మంచి నడతయును; కల= ఉన్న; కన్యలన్; తెచ్చితెచ్చి= ఎక్కువగా తీసికొనివచ్చి; గాంగేయుండు= భీష్ముడు; ఈన్= ఇవ్వగా; అలఘుఁడు= గొప్పవాడు; కుల, తిలకుండు= వంశానికి అలంకారమైనవాడు; ధృతరాష్ట్రుఁడు; దేవీ, శతమున్= భార్యలు వందమందిని; పరిగ్రహించెన్= పెళ్ళిచేసికొన్నాడు.

తాత్పర్యం: కులం, రూపం, శీలం ఉన్న కన్యలను భీష్ముడు పలువురిని తెచ్చి ఇవ్వగా ధృతరాష్ట్రుడు వందమందిని పెళ్ళిచేసికొన్నాడు.

విశేషం: కన్యలను తెచ్చి తెచ్చి అని రెండుమార్లు చెప్పటంలో భీష్ముడు వంశవిస్తృతిమీద ఎంత అధికమైన ఆసక్తిని ప్రదర్శించాడో స్పష్టమౌతుంది. వందమంది కొడుకులను కనే గాంధారితో పాటు నూటపదిమంది రాణులను ధృతరాష్ట్రుని కిచ్చి పెళ్ళి చేయించాడు భీష్ముడు. వారందరివలన కలిగే సంతానంతో మరెప్పటికీ కురువంశంలో వారసులు లేరనే ప్రశ్న పుట్టదని అనుకొన్నాడు ఆ కురుపితామహుడు. అనావృష్టిని చూచిన గంగాసుతుడు అతివృష్టిని అభిలషించాడు. చివరకు ధృతరాష్ట్రసంతతి అంతా గంగపాలు కావటం విధివిలాసం.

వ. అంత.

తాత్పర్యం: ఆ తరువాత.

సీ. వేదంబులందుఁ బ్రవీణుఁడై మఱి సర్వ । శాస్త్రంబులందుఁ గౌశలము మెఱసి
యసికుంత కార్ముకాద్యాయుధ విద్యల । యందు జితశ్రముఁ డై తురంగ
సింధురారోహణశిక్షల దక్షుఁడై । నీతిప్రయోగముల్ నెఱయ నేర్చి
యతిమనోహర నవయౌవనారూఢుఁడై । కఱలేని హిమరశ్మికాంతి దాల్చి

ఆ. పెరుఁగుచున్న కొడుకుఁ బృథువక్షు నాయత । బాహు దీర్ఘదేహుఁ బాండుఁ జూచి
వీనివలనఁ గులము వెలుఁగు నంచును నెడ । జాహ్నవీసుతుండు సంతసిల్లి. 15

ప్రతిపదార్థం: వేదములందున్= నాలుగు వేదాలలో; ప్రవీణుఁడు+ఐ= నేర్పరి అయి; మరి+ అంతేకాక; సర్వశాస్త్రంబులందున్= అన్ని శాస్త్రములలోకూడా; కౌశలము= సామర్థ్యం; మెఱసి= ప్రకాశింపచేసి; అసి, కుంత, కార్ముక+ఆది+ఆయుధ, విద్యల, అందున్= కత్తి, ఈటె, విల్లు మొదలైన ఆయుధాలకు సంబంధించిన విద్యలందు; జితశ్రముఁడు+ఐ= జయింపబడిన శ్రమకలవాడై-అనగా సమర్థుడై; తురంగ, సింధుర+ఆరోహణ; శిక్షలన్= గుఱ్ఱాలను, ఏనుగులను ఎక్కి స్వారిచేసేటటువంటి అభ్యాసాలలో; దక్షుఁడు+ఐ= నేర్పరి అయి; నీతి, ప్రయోగముల్= అనేకనీతులను ప్రయోగించేమాటలు; నెఱయన్= బాగా; నేర్చి; అతి, మనోహర, నవ, యౌవన+ఆరూఢుఁడు+ఐ= మిక్కిలి మనోహరం అయిన క్రొత్తయౌవనం పొందినవాడై; కఱలేని= మచ్చ లేని; హిమరశ్మి, కాంతిన్= చల్లనికిరణాలు కల చంద్రునికాంతిని; తాల్చి= ధరించి; పెరుఁగుచు+ఉన్న, కొడుకున్= వృద్ధి చెందుచున్న కుమారుని; పృథు, వక్షున్= విశాలమైన వక్షఃస్థలం కలవాడిని; ఆయత, బాహున్= పొడవైన చేతులు కలవాడిని; దీర్ఘ, దేహున్= పొడవైన శరీరం కలవాడిని; పాండున్= పాండురాజును; చూచి; వీనివలనన్; కులము= వంశం; వెలుఁగున్; అంచును= అనుచు (అంటూ); ఎడన్= హృదయంలో, జాహ్నవీ, సుతుండు= గంగాపుత్రుడైన భీష్ముడు; సంతసిల్లి= సంతోషించి.

తాత్పర్యం: వేదాలను, సర్వశాస్త్రాలను బాగా నేర్చి, కత్తి, ఈటె, ధనుస్సు మొదలైన ఆయుధవిద్యలలో ఆరితేరి, గుర్రాలను, ఏనుగులను ఎక్కి స్వారి చేయటంలో బాగా నేర్పరి అయి, మనోహరమైన నవయౌవనం కలవాడై,

మచ్చలేని చంద్రుడివలె ప్రకాశిస్తూ, విశాలమైన వక్షం, పొడవైన చేతులు, నిడుపైన శరీరం కల పాండురాజును చూచి ఇతనివలన వంశం వన్నెకు ఎక్కుతుం దని భీష్ముడు సంతోషించి.

విశేషం: వేదాలు నాలుగు - ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. శాస్త్రాలు ఆరు - తర్కం, వ్యాకరణం, ధర్మం, మీమాంస, వైద్యం, జ్యోతిషం. యౌవనారూఢులైన ధృతరాష్ట్రుడిని, పాండురాజును వర్ణించే తీరులో నన్నయ ఒక భేదాన్ని పాటించి కథాకథనశిల్పాన్ని ప్రదర్శించాడు. పాండురాజుకు గల వేదశాస్త్రపాండిత్యంగాని, యుద్ధోచిత పరిశ్రమగాని ధృతరాష్ట్రునికి లేవు. పాండురాజుయొక్క యౌవనం అతిమనోహరంగా ఉన్నదట. ధృతరాష్ట్రునివలన కులం విస్తరిల్లుతుం దనీ, పాండురాజువలన కులగౌరవం పెరుగుం దనీ భీష్ముని ఆశయం. ధార్తరాష్ట్రులు సంఖ్యలో అధికమైనా, పాండవులు యశస్సులో అధికు లౌతా రనీ పాండురాజువల్లనే కులం కీర్తి కెక్కుతుం దనీ వస్తుధ్వని.

వ. ఇ క్కుమారున కెందు వివాహంబు సేయుద మని విదురుతో విచారించుచుండె; నంతఁ దొల్లి. 16

ప్రతిపదార్థం: ఈ+కుమారునకున్= యువకుడైన ఈ పాండురాజుకు; ఎందున్=ఎక్కడ; వివాహంబు, చేయుదము= పెండ్లిచేద్దాము; అని; విదురుతోన్; విచారించుచున్, ఉండెన్= ఆలోచిస్తూ ఉన్నాడు; అంతన్= తరువాత; తొల్లి= పూర్వం.

తాత్పర్యం: ఈ యువకుడైన పాండురాజుకు వివాహం చేయా లని విదురునితో కలిసి ఆలోచిస్తూ ఉన్నాడు. తరువాత - పూర్వం.

కుంతిచరిత్రము (సం.1-104-1)

సీ. యాదవకులవిభుఁ డగు శూరుఁ డను నాతఁ। డాత్మతనూజలయందుఁ బెద్ద
దాని నంబుజముఖి ధవళాక్షి వసుదేవు। చెలియలిఁ బృథ యను చెలువఁ బ్రీతిఁ
దనమేనయత్తనందనుఁ డపుత్త్రకుఁ డైన। యా కుంతిభోజున కర్థితోడఁ
గూఁతుఁగా నిచ్చినఁ గోమలి యాతని। యింటఁ దా నుండి యనేక విప్ర

తే. వరుల కతిథిజనులకు నవారితముగఁ। దండ్రి పనుపున నిష్టాన్నదాన మొనరఁ
జేయుచున్న దుర్వాసుఁ డన్ సిద్ధమౌని। వచ్చె నతిథి యై భోజనవాంఛఁ జేసి. 17

ప్రతిపదార్థం: యాదవ, కుల, విభుఁడు+అగు= యాదవవంశరాజు అయిన; శూరుఁడు, అనునాతఁడు= శూరుడు అను పేరుగలవాడు; ఆత్మ, తనూజల, అందున్= తనకూతుళ్ళలో; పెద్దదానిన్= పెద్దకుమార్తెను; అంబుజముఖిన్= పద్మంవంటి ముఖం కలదానిని; ధవళ+అక్షిన్= తెల్లనికళ్ళు కలదానిని; వసుదేవు, చెలియలిన్= వసుదేవుని చెల్లెలిని; పృథ, అను= పృథ అను పేరుగల; చెలువన్= అందమైన పిల్లను; ప్రీతిన్= ప్రియమార; తన, మేనయత్త, నందనుఁడు= తన మేనత్తకుమారుడు; అపుత్రకుఁడు+ఐన= సంతానం లేనివాడైన; ఆ, కుంతిభోజునకున్= ప్రసిద్ధుడైన కుంతిభోజునికి; అర్థితోడన్= ప్రీతితో; కూతున్, కాన్ ఇచ్చినన్= కూతు రగునట్లుగా ఈయగా; కోమలి= ఆ సుకుమారి - పృథ; ఆతని, ఇంటన్= కుంతిభోజుని ఇంటిలో; తాన్= తాను; ఉండి= వసించి; అనేక, విప్ర, వరులకున్= పెక్కుమంది బ్రాహ్మణశ్రేష్ఠులకు; అతిథి, జనులకున్= ఆగంతకులైన ప్రజలకు; అవారితముగన్= అడ్డులేకుండా; తండ్రి, పనుపునన్= తండ్రిఆజ్ఞతో; ఇష్ట+అన్న, దానమున్= ఇష్టమైన భోజనం పెట్టటాన్ని; ఒనరన్= తగువిధంగా; చేయుచు+ఉన్నన్= చేస్తూఉండగా; దుర్వాసుఁడు+అన్; సిద్ధ, మౌని= సిద్ధికలముని; భోజన, వాంఛన్, చేసి= భోజనంమీద కోరికతో; అతిథి+ఐ వచ్చెన్= అతిథిగా విచ్చేసినాడు.

తాత్పర్యం: యాదవవంశరాజు అయిన శూరుడు తన పెద్దకుమార్తె పృథను, పిల్లలు లేని తనమేనత్తకొడు కైన కుంతిభోజుడికి ఎంతో ప్రీతితో పుత్రికగా ఇచ్చాడు. ఆ సుకుమారి కుంతిభోజుడిఇంట్లో తా నుండి, తండ్రి ఆజ్ఞతో పెక్కుమంది బ్రాహ్మణశ్రేష్ఠులకు, అతిథిజనులకు యథేచ్ఛగా అన్నదానం చేస్తూ ఉండగా దుర్వాసు డనే సిద్ధమౌని 'భోజనం పెట్టు' మని అతిథిగా వచ్చాడు.

విశేషం: అతిథి - తిథీ,వారం మున్నగు కాలనియమాలు లేకుండా, ఇంటికి భోజనానికి వచ్చినవాడు.

వ. కుంతియు న మ్మునివరు కోరిన యాహారంబు వెట్టిన సంతుష్టుం డై యమ్మునివరుం డి ట్లనియె; 'నీమంత్రంబున నీ వే వేల్పుల నారాధించి తవ్వేల్పులు నీకోరినయట్టి పుత్త్రకుల నిత్తు' రని యాపద్ధర్మంబుగా నొక్కదివ్యమంత్రంబుఁ బ్రసాదించి చనిన, నమ్మంత్రశక్తి యెఱుంగ వేఁడి కుంతి యొక్కనాఁ డేకాంతంబ గంగకుం జని యవగాహనంబు సేసి. 18

ప్రతిపదార్థం: కుంతియున్= కుంతీదేవియు; ఆ+ముని, వరు, కోరిన= ఆ మునిశ్రేష్ఠుడు కోరిన; ఆహారంబు, పెట్టినన్= విందుభోజనము పెట్టగా; సంతుష్టుండు+ఐ= పూర్తిగా తృప్తిచెందినవాడై; ఆ+ముని, వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు - దుర్వాసుడు; ఇట్లు+అనియెన్; ఈ మంత్రంబునన్= ఈ మంత్రముచేత; నీవు; ఏ వేల్పులన్= ఏ దేవతలను; ఆరాధించితివి= పూజించావో; ఆ+వేల్పులు= ఆ దేవతలు; నీ, కోరిన, అట్టి= నీవు కోరినటువంటి; పుత్త్రకులన్= కుమారులను; ఇత్తురు+అని= ప్రసాదింతురు అని తెలిపి; ఆపద్+ధర్మంబుగాన్= ఆపత్కాలంలోని ధర్మంగా; ఒక్క; దివ్య, మంత్రంబున్; ప్రసాదించి= ఇచ్చి; చనినన్= వెళ్ళగా; ఆ+మంత్ర, శక్తిన్= ఆ మంత్రము యొక్క ప్రభావాన్ని; ఎఱుంగన్ వేఁడి= తెలియకోరి; కుంతి= కుంతీదేవి; ఒక్కనాఁడు= ఒక్కదినం; ఏకాంతంబు+అ= ఒంటరిగా; గంగకున్+చని= గంగకు వెళ్ళి; అవగాహనంబు చేసి= స్నానం చేసి.

తాత్పర్యం: కుంతి ఆ మునిశ్రేష్ఠుడు కోరిన ఆహారం పెట్టగా దుర్వాసుడు చాలా తృప్తి పొంది 'ఈ మంత్రం చేత నీవు ఏ దేవతలను ఆరాధిస్తావో ఆ దేవతలు నీవు కోరిన కొడుకులను ఇస్తారు' అని ఆపద్ధర్మంగా ఒక దివ్యమంత్రాన్ని ఉపదేశించి వెళ్ళాడు. తరువాత ఆమె ఆ మంత్రశక్తిని తెలిసికొనాలని ఒకరోజు ఒంటరిగా గంగకు వెళ్ళి స్నానం చేసి.

విశేషం: ఆపద్ధర్మం అంటే గత్యంతరం లేకపోయినప్పుడు పాటించదగిన న్యాయం అని భావం. త్రికాలజ్ఞుడైన దుర్వాసుడు పాండవోత్పత్తికి ఆ మంత్రం ఆపద్ధర్మంగా వినియోగింపబడా లని భవిష్యద్దర్శనంతో వరంగా ప్రసాదించాడు. అట్లా పుట్టినవాళ్ళే కౌంతేయు లయ్యారు (ధర్మరాజాదులు). ఆపద్ధర్మంగా కాక మంత్రశక్తి పరీక్షార్థం వినియోగించినప్పుడు పుట్టిన కర్ణుడు కౌంతేయుడుగా కాక రాధేయుడుగా ప్రసిద్ధికావటం జరిగింది.

క. అ మ్మంత్రముఁ దనదగు హృద । యమ్మున నక్కన్య నిలిపి యాదిత్యున క
ర్ఘ్య మ్మెత్తి ' నాకు నిమ్ము ప్రి । యమ్మున నీ యట్టి పుత్త్రు నంబుజమిత్త్రా ! ' 19

ప్రతిపదార్థం: ఆ+మంత్రమున్= ప్రసిద్ధిగల ఆ మంత్రాన్ని; తనది, అగు= తనదైన; హృదయమ్మునన్= హృదయంలో; ఆ+కన్య= ఆ కుంతి; నిలిపి= ఉంచుకొని అనగా జపించి; ఆదిత్యునకున్= సూర్యుడికి; అర్ఘ్యమ్ము= పూజకోసం దోసిట్లోకి తీసికొనే నీటిని; ఎత్తి= పైకెత్తి; అంబుజ మిత్త్రా= నీటిలోంచి పుట్టిన పద్మానికి మిత్రుడవు అయినవాడా- ఓ సూర్యుడా! నాకున్; ప్రియమ్మునన్= ప్రీతితో; నీ, అట్టి= నీవంటి; పుత్త్రున్= కుమారుని; ఇమ్ము= ప్రసాదించు.

తాత్పర్యం: కుంతి ఆ మంత్రాన్ని తనమనస్సులో జపించి సూర్యునికి అర్ఘ్యం ఇచ్చి 'ఆదిత్యా! నాకు నీవంటి కొడుకును ప్రేమతో ఇమ్ము.'

క. అని కేలు మొగిచి నిలిచిన । వనజాయతనేత్ర కడకు వచ్చెను గగనం
బున నుండి కమలమిత్త్రుఁడు । తన తీవ్రకరత్వ ముడిగి తరుణద్యుతితోన్. 20

ప్రతిపదార్థం: అని= ఆప్రకారంగా; కేలు= చేతులు; మొగిచి= మోడ్చి; నిలిచినన్= నిలువగా, కమల, మిత్త్రుఁడు= పద్మాలకు మిత్రుడు అయిన సూర్యుడు; తన; తీవ్ర, కరత్వము= వేడికిరణాలు కలిగి ఉండటాన్ని; ఉడిగి= విడిచి; తరుణ, ద్యుతితోన్= లేతకాంతితో అనగా యువకుడి అందంతో; వనజ+ఆయత, నేత్ర, కడకు= నీటినుండి పుట్టిన పద్మాలవలె విశాలమైన కన్నులు కల కుంతి దగ్గరకు; గగనంబుననుండి= ఆకాశంనుండి; వచ్చెను.

తాత్పర్యం: అని కుంతి చేతులు మోడ్చి నిలబడగా, సూర్యుడు తన వేడికిరణాలను విడిచి, కోమలకాంతితో (యువకుడి అందంతో) ఆకాశంనుండి ఆమెదగ్గరకు దిగివచ్చాడు.

వ. అ క్కన్యకయు నట్టి తేజోరూపంబు సూచి విస్మయంబునను భయంబునను గడు సంభ్రమించి నడునడ నడుంగుచున్నదాని 'నోడకుండు' మని సూర్యుండు ప్రసన్నుండై 'నీకోరినవరం బీ వచ్చితి' ననిన గొంతియు లజ్జావనతవదనయై' యొక్కబ్రహ్మవిదుండు నాకుం గరుణించి యిమ్మంత్రం బుపదేశించిన దానిశక్తి నెఱుంగ వేఁడి యజ్ఞానంబున నిన్నుం ద్రిలోకైకదీపకుం ద్రిపురుషమూర్తిఁ ద్రివేదమయు రావించిన యీయపరాధంబు నాకు సహింపవలయు.' 21

ప్రతిపదార్థం: ఆ+కన్యకయున్= ఆ కుంతీదేవి; అట్టి; తేజస్+రూపంబు= కాంతిమంతమైన ఆకారం; చూచి= విస్మయంబునను=ఆశ్చర్యంతో; భయంబునను= భీతితో; కడు=మిక్కిలి; సంభ్రమించి= తొట్రుపడి; నడునడ= నడకమధ్యలో; నడుంగుచు+ఉన్న, దానిన్= వణుకుతున్నదానిని; ఓడక+ఉండుము= భయపడకుము; అని= ఆ విధంగా తెలిపి; సూర్యుండు = సూర్యభగవానుడు; ప్రసన్నుండు+ఐ= దయకలవాడై; నీ కోరిన, వరంబు= నీవు కోరిన ప్రసిద్ధమైనవరాన్ని; ఈన్= ఇవ్వటానికి; వచ్చితిన్ అనిన; గొంతియు= కుంతీదేవికూడ; లజ్జా+అవనత, వదన+ఐ= సిగ్గుతో వంచుకొన్న ముఖం కలదై; ఒక్క, బ్రహ్మ విదుండు= ఒక ప్రసిద్ధుడైన బ్రహ్మమును తెలిసినవాడు; నాకున్; కరుణించి= దయతలచి; ఈ+మంత్రంబున్; ఉపదేశించినన్= ఉపదేశింపగా; దాని శక్తిన్= దాని బలాన్ని; ఎఱుంగ, వేఁడి= తెలిసికొనా లని; అజ్ఞానంబునన్= తెలివి తక్కువతనంతో; త్రిలోక+ఏక, దీపకున్= మూడులోకాలను ముఖ్యంగా వెలిగించేవాడిని; త్రి, పురుష, మూర్తిన్= బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనే ముగ్గురు ఆకారం అయినవాడిని; త్రివేదమయున్= మూడు వేదాలరూపం అయినవాడిని; నిన్నున్; రావించిన= రప్పించిన; ఈ+అపరాధంబు= ఈ తప్పు; నాకున్= నాయందు; సహింపవలయున్= ఓర్చుకోవాలి.

తాత్పర్యం: ఆ కుంతీదేవికూడా అటువంటి కాంతిమంతమైన సూర్యునిరూపాన్ని చూచి ఆశ్చర్యంతో, భయంతో మిక్కిలి తొట్రుపడి వణకుతూ ఉండగా, సూర్యుడు, భయపడకు మని ప్రసన్నుడై 'నీవు కోరిన వరం ఇవ్వటానికి వచ్చాను' అన్నాడు. కుంతి సిగ్గుతో ముఖం వంచుకొని 'ఒక బ్రహ్మజ్ఞాని దయతో నాకు ఈ మంత్రాన్ని ఉపదేశించగా దానిశక్తి తెలిసికొనాలనే కోరికతో - మూడులోకాలను ముఖ్యంగా వెలిగించేవాడవు, త్రిమూర్తుల స్వరూపుడవు, మూడువేదాల ఆకారం తాల్చినవాడవు అయిన నిన్ను అజ్ఞానంచేత రప్పించిన నా తప్పును క్షమించుము.'

విశేషం: సూర్యుడు ఉదయం బ్రహ్మస్వరూపు డని, మధ్యాహ్నం శివస్వరూపు డని, సాయంకాలం విష్ణుస్వరూపు డని ప్రసిద్ధి. అందువలన సూర్యుడు త్రిపురుషమూర్తి. "బ్రహ్మస్వరూప ముదయే - మధ్యాహ్నే తు మహేశ్వరమ్ । సాయం ధ్యాయే త్సదా విష్ణుం- । త్రిమూర్తించ దివాకరమ్"॥ అట్లాగే సూర్యుడు ఉదయం ఋగ్వేదస్వరూపుడు, మధ్యాహ్నం యజుర్వేదస్వరూపుడు' సాయంకాలం సామవేదస్వరూపుడు. అందువల్లనే త్రివేదమయుడు. సూర్యుడు-(వ్యు) ప్రాణులను వారివారి వృత్తులందు ప్రేరేపించేవాడు.

ఆ. 'ఎఱుకలేమిఁ జేసి యింతు లెప్పుడు నప । రాధయుతలు సాపరాధ లయిన
వారిఁ గరుణ నెల్లవారును రక్షింతు' । రనుచు సూర్యునకు లతాంగి మ్రొక్కె. 22

ప్రతిపదార్థం: ఎఱుక= జ్ఞానం; లేమిని, చేసి= లేకపోవటంచేత; ఇంతులు= స్త్రీలు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; అపరాధయుతలు=తప్పిదాలతో కూడినవారు; స+అపరాధలు= తప్పులతో కూడినవారు; అయినన్= అగుటచేత; వారిన్= ఆ స్త్రీలను; కరుణన్= దయతో; ఎల్లవారును= అందరూ; రక్షింతురు; అనుచున్= అని తెల్పుతూ; లతా+అంగి= లతవంటి (సుకుమారమయిన) దేహంకలది - కుంతి; సూర్యునకున్= సూర్యభగవానునికి; మ్రొక్కెన్= నమస్కరించింది.

తాత్పర్యం: 'తెలివి లేక స్త్రీలు ఎప్పుడూ తప్పులు చేస్తారు. తప్పులు చేసిన స్త్రీలను దయతో అందరూ మన్నిస్తారు' అని అంటూకుంతి సూర్యునికి నమస్కరించింది.

వ. సూర్యుండును 'నీకు దుర్వాసుం డిచ్చిన వరంబును మంత్రంబుశక్తియు నెఱుంగుదు; మదీయదర్శనంబు వృథగాదు; నీ యభిమతంబు సేయుదు' ననిన గొంతి యి ట్లనియె. 23

ప్రతిపదార్థం: సూర్యుండును; నీకున్; దుర్వాసుఁడు+ఇచ్చిన= దుర్వాసుడు ప్రసాదించిన; వరంబును; మంత్రంబు, శక్తియున్= మంత్రంయొక్కబలాన్ని; ఎఱుంగుదున్= తెలియుదును; మదీయ, దర్శనంబు= నాదర్శనం- నీవు నన్ను చూడటం; వృథకాదు= వ్యర్థం కాదు; నీ అభిమతంబు= నీ యిష్టప్రకారం; చేయుదును; అనినన్; కాంత= కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు దుర్వాసుడు ప్రసాదించిన వరంగురించి, మంత్రశక్తినిగురించి నాకు తెలుసు. నా దర్శనం వృథా కాదు. నీ కోర్కె నెరవేరుస్తాను' అని సూర్యుడు పలుకగా, కుంతి ఈ విధంగా అన్నది.

ఆ. ఏను మంత్రశక్తి యెఱుఁగక కోరితిఁ । గన్య కిదియు కోరఁగాదు నాక;
నాకు గర్భమయిన నాతలిదండ్రులుఁ । జుట్టములును నన్నుఁ జూచి నగరె? 24

ప్రతిపదార్థం: ఏను= నేను; మంత్ర, శక్తి= మంత్రంయొక్క శక్తిని; ఎఱుఁగక= తెలియక; కన్యకున్= పెళ్ళికానిస్త్రీకి; ఇదియున్= ఇది; కోరన్+కాదు= కోరకూడదు; నాకు+అ= అని అనక; కోరితిన్; నాకు; గర్భము+అయినన్= గర్భము కలిగినచో; నా, తలిదండ్రులున్; చుట్టములును= బంధువులును; నన్నున్ చూచి = నన్ను కనుగొని; నగరె= నవ్వరా?

తాత్పర్యం: నేను మంత్రశక్తి తెలియక, ఇది పెళ్ళికానిస్త్రీ కోరకూడ దని తెలియక కోరాను. నాకు గర్భం వస్తే నన్ను చూచి నా తల్లిదండ్రులు, బంధువులు నవ్వరా?

వ. అనిన విని సూర్యుండు దానికిఁ గరుణించి 'నీకు సద్యోగర్భంబునఁ బుత్త్రుఁ డుద్భవిల్లు; నీకన్యాత్వంబును దూషితంబుగా' దని వరం బిచ్చినఁ, దత్క్షణంబ యక్కన్యకకు నంశుమంతునంశంబునఁ గానీనుం డై. 25

ప్రతిపదార్థం: అనినన్; విని; సూర్యుండు; దానికిన్= ఆ కుంతీదేవిని; కరుణించి= దయతలచి; నీకున్; సద్యస్+గర్భంబునన్= ఇప్పటికిప్పుడు కలిగే గర్భంవలన; పుత్త్రుఁడు; ఉద్భవిల్లున్= పుడతాడు; నీ, కన్యాత్వంబును= నీ కన్నెతనంకూడ; దూషితంబుకాదు= దోషం కలదికాదు; అని= ఆ ప్రకారంగా; వరంబు+ఇచ్చినన్= వరాన్ని ఇయ్యగా; తద్+క్షణంబు+అ= ఆ క్షణంలోనే; ఆ+కన్యకకున్; అంశుమంతు; అంశంబునన్= సూర్యుని అంశంచేత; కానీనుండు+ఐ= కన్యకు పుట్టినవా డై. (కానీన: కన్యకాజాతః - అని అమరకోశం).

తాత్పర్యం: అని కుంతి అనగా విని సూర్యుడు ఆమెమీద దయతలచి 'నీకు సద్యోగర్భంవలన పుత్త్రుడు పుట్టుతాడు. నీ కన్నెతనంకూడా చెడదు' అని వరం ఇవ్వగా, అప్పటికప్పుడే ఆ కన్యకు సూర్యునిఅంశాన కన్యాపుత్త్రుడై.

కర్ణుఁడు జనియించి సూతగృహంబు సేరుట (సం.1-104-10)

చ. సలలిత మైన పుట్టుఁగవచంబు నిసర్గజ మైన కుండలం
బుల యుగళంబు నొప్పఁగ సుపుత్త్రుఁడు కర్ణుఁడు పుట్టె సూర్యమం
డలమొకొ భూతలంబున బెడంగయి దీప్తిసహస్రకంబుతో
వెలుఁగెడు నా నిజద్యుతి సవిస్తరలీల వెలుంగుచుండఁగన్. 26

ప్రతిపదార్థం: సలలితము+ఐన= అందమైన; పుట్టు, కవచంబు= పుట్టుకతోనే ఏర్పడ్డకవచం; నిసర్గజము+ఐన= సహజమైన; కుండలంబుల, యుగళంబున్= చెవిపోగుల జంటయు; ఒప్పఁగన్= ప్రకాశించగా; సు+పుత్త్ర+డు= చక్కనికుమారుడు; కర్ణుఁడు; సూర్య, మండలము+ఒకొ= సూర్యమండలమే యేమో; భూతలంబునన్= భూమిమీద; బెడంగు+అయి= అందమై; దీప్తి, సహస్రకంబుతో= వేయికిరణాలతో; వెలుఁగెడు, నా= ప్రకాశిస్తున్నదా అన్నట్లు; నిజ, ద్యుతి= తనకాంతి; సవిస్తర లీలన్= విరివి అయిన విలాసంతో; వెలుంగుచు+ఉండఁగన్; పుట్టెన్= పుట్టాడు.

తాత్పర్యం: అందమైన సహజకవచకుండలాలతో ప్రకాశిస్తూ, సూర్యమండలమే భూమిమీద వేయికిరణాలతో ప్రకాశిస్తున్నదా అన్నట్లు అధికమైన కాంతితో కర్ణుడు పుట్టాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'నిజద్యుతిసవిస్తరలీల వెలుంగుచుండఁగన్' అనే విశేషణం సార్థకం. మహాభారతపాత్రలలో స్వీయ వ్యక్తిత్వంతో ఒంటరిపోరుతో దిగంతయశస్సు గడించిన వీరుడు కర్ణుడు. కర్ణుడు లేకపోతే భారతం లేదన్న లోకోక్తి ఈ పాత్రకున్న ప్రత్యేకతను తెలుపుతున్నది. పుట్టుకవచంతో, కుండలాలతో పుట్టిన దివ్యరూపసంకలవాడైనా, కర్ణుడు నిజజీవితంలో విషాదాంతనాయకుడు.

వ. అంత నాదిత్యుం డాకాశంబున కరిగినఁ, గొడుకుం జూచి కుంతి దద్దయు విస్మయం బంది యెద్దియుం జేయునది నేరక. 27

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; ఆదిత్యుండు= సూర్యుడు; ఆకాశంబునకు; అరిగినన్= వెళ్ళగా; కుంతి; కొడుకున్; చూచి; తద్దయున్= మిక్కిలి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; చేయునది, నేరక= ఏమి చేయాలో తెలియక.

తాత్పర్యం: తరువాత సూర్యుడు ఆకాశానికి వెళ్ళిపోగా, కుంతి కొడుకును చూచి మిక్కిలి ఆశ్చర్యపడి ఏమి చేయాలో తెలియక.

తరువోజ

ఏల యమ్మౌని నాకు నిచ్చె నిమ్మంత్ర? మిమ్మంత్రశక్తి యే నెఱుఁగంగ వేఁడి
యేల పుత్త్రకుఁ గోరి యెంతయు భక్తి నినుఁ దలంచితిఁ బ్రీతి? నినుఁడును నాకు
నేల సద్యోగర్భమిచ్చెఁ? గుమారుఁ డేల యప్పడ యుదయించె? నిం కెట్టు
లీ లోకపరివాద మే నుడిగింతు? నింతకు నింతయు నెఱుఁగరె జనులు! 28

ప్రతిపదార్థం: ఏల= ఎందుకు; ఆ+ముని= ఆ దుర్వాసుడు; నాకున్; ఈ+మంత్రము, ఇచ్చెన్= ఈ మంత్రాన్ని ప్రసాదించినాడు; ఈ+మంత్ర, శక్తి= ఈ మంత్రము యొక్క బలాన్ని; ఏన్=నేను; ఎఱుఁగంగ, వేఁడి= తెలిసి కొనా లని కోరి; ఏల= ఎందుకు; పుత్త్రకున్= కొడుకును; కోరి= ఇష్టపడి; ఎంతయున్= మిక్కిలి; భక్తిన్= భక్తితో; ఇనున్= సూర్యుడిని; తలంచితిన్= తలచుకొన్నాను; ప్రీతిన్= ప్రేమతో; ఇనుఁడును= సూర్యుడుకూడ; ఏల= ఏమిటికి; నాకున్=నాకు; సద్యఃగర్భము= అప్పటికప్పుడే కలిగే గర్భాన్ని; ఇచ్చెన్; ఏల= ఎందుకు; కుమారుఁడు; అప్పుడు+అ= అప్పుడే, ఉదయించెన్= పుట్టాడు; ఇంకన్=ఇటుపై; ఎట్టులు= ఏవిధంగా; ఈ లోక, పరివాదమున్= ఈలోకాపవాదాన్ని; ఏను= నేను; ఉడిగింతున్= లేకుండా చేస్తాను; ఇంతకున్= ఇప్పటికే; జనులు; ఇంతయున్= జరిగినది అంతా; ఎఱుఁగరె= తెలిసికోరా?

తాత్పర్యం: దుర్వాసుడు నా కెందుకు ఈ మంత్రాన్ని ఉపదేశించాడు? ఆ మంత్రప్రభావాన్ని తెలిసికొనా లని నేను ఎందుకు భక్తితో సూర్యుడిని స్మరించాను? ఆ సూర్యుడుకూడ నాకు ఎందుకు సద్యోగర్భాన్ని ఇచ్చాడు? అప్పుడే ఈ పుత్త్రుడు ఎందుకు నాకు పుట్టాడు? ఇంక ఏ విధంగా ఈ లోకాపవాదాన్ని తప్పించుకొంటాను? ఇప్పటికే జరిగిన దంతా ప్రజలు తెలిసికొనిఉండరా?

విశేషం: తరువోజలోని ప్రతిపాదంలోనూ రెండు ద్విపదపాదా లుంటాయి. ద్విపదలో ప్రతిపాదంలోనూ మూడు ఇంద్రగణాల మీద ఒక సూర్యగణం ఉంటుంది. అంటే తరువోజలో ఒక్కొక్క చరణంలో 3 ఇంద్రగణాలు+ ఒక సూర్యగణం+ 3 ఇంద్రగణాలు+ 1 సూర్యగణం ఉంటాయన్నమాట. ప్రతి రెండేసి గణాలమీద మూడు యతులు ఉంటాయి. ప్రాసనియతికూడా ఉన్నది. మొదటి పాదం గురువుతోకాని, లఘువుతోకాని, ప్రారంభమైతే మిగిలిన పాదాలన్నీ అట్లాగే సాగాలి. "తరువోజ యలసము, సుకుమారమైన ఛంద మని కవిత్రయము వారభిప్రాయపడినట్లు వారి ప్రయోగమునుబట్టి యూహింపఁదగియున్నది. చింత, శంక, దైన్యము, గ్లాని, శోకము మున్నగు నలసచిత్తవృత్తులందే తరువోజలు తఱచుగాఁ బ్రయోగింపబడి యున్నవి. విశేషించి భారతమందలి పందొమ్మిది తరువోజలలో నేడు తరువోజలు స్త్రీవాక్యములై యుండుటచే విన్నకోట పెద్దన యన్నట్లు స్త్రైణమైన మృదువృత్తముగా, కవిత్రయము భావించి రని కూడ తలంపవచ్చును... ఈ తరువోజయందు మత్తకోకిలా సంక్రమణ కల్పితమైన గమకచమత్కారము గుర్తింపదగియున్నది... తరువోజ మత్తకోకిలా భ్రాంతిని మాటిమాటికి గలిగించు చున్నది. విరుద్ధావిరుద్ధ నానాభావసాంకర్య చిత్రితమైన కుంతీదేవి తత్కాలచిత్తవృత్తి రమ్యముగ ధ్వనితమగుచున్నది." (డాక్టర్ పాటిబండ మాధవశర్మ - ఆంధ్రమహాభారతము. ఛందశ్శిల్పము). వితర్కరూపకమైన వాక్యవిన్యాసం పద్యమంతా ఒకే పద్ధతిలో కూర్చబడి ఉండటంచేత సమత (మార్గాభేదం) అనే శబ్దగుణం సార్థకంగా సమకూరింది. (సంపా.)

వసంతతిలకము

'ఈ బాలు నెత్తుకొని యింటికిఁ జన్న, నన్నున్
నా బంధు లందఱు మనంబున నేమనా? రె
ట్లీ బాలసూర్యనిభు నిట్టుల డించి పోవం
గా బుద్ధిపుట్టు?' నని కన్య మనంబులోనన్. **29**

ప్రతిపదార్థం: ఈ, బాలున్= ఈ శిశువును; ఎత్తుకొని= తీసుకొని; ఇంటికిన్= అంతఃపురానికి; చన్న= వెళ్ళిన; నన్నున్; నా బంధులు+అందఱున్= నా చుట్టా లందరు; మనంబునన్= మనస్సులో; ఏమి+అనారు= ఏమి అనరు? - అనగా ఏమైనా అంటారు; ఎట్లు; ఈ, బాల, సూర్య, నిభున్= ఈ బాలసూర్యుడితో సమానమైనవాడిని; ఇట్టులన్= ఈ రీతిగా; డించి= దించి, వదలిపెట్టి; పోవన్కాన్= పోవగా; బుద్ధిపుట్టున్= ఆలోచన కలుగుతుంది.; అని= ఆ ప్రకారంగా; కన్య= పెళ్ళికానికుంతి; మనంబులోనన్= మనస్సులో.

తాత్పర్యం: ఈ బాలుడిని ఎత్తుకొని ఇంటికి వెళ్ళితే నన్ను నా బంధువు లందరూ దూషిస్తారు. అట్లని, బాలసూర్యుడివంటి ఈ బాలుడిని వదలి వెళ్ళటానికి బుద్ధి ఎట్లా పుడుతుంది? అని కన్యగా ఉన్న కుంతి మనస్సులో.

విశేషం: వసంతతిలకవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా - త-భ-జ-జ-గగ- అనే గణా లుంటాయి. ఎనిమిదవ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది. దీనికి సింహోన్నత, సింహోద్ధత, ఉద్ధర్షిణి, మధుమాధవి, శోభాతతి, కర్ణోత్పల మొదలైన పే ర్లున్నాయి. నన్నయ ఈ వృత్తంలో మూడుపద్యాలు వ్రాశాడు. వాటిలో రెండు ఆశ్వాసాంత్యపద్యాలుగానూ, ఒకటి (అంటే ఈపద్యం) కథాసందర్భంలోనూ ఉపయోగించాడు. కుంతీదేవియొక్క అనిశ్చితమైన చిత్తవృత్తిని ఈ వృత్తం ధ్వనింపచేస్తున్నది. పుత్రుడిమీది మమకారం, బంధువులవలన కలిగే అపవాదం అనే రెండుభావావస్థలనడుమ అల్లల్లాడుతున్న ఆ మాతృమూర్తి వత్సల, భయభావాలను మాధుర్య మనే గుణంతో పోషించటం నన్నయరచనాశిల్పం, పృథక్పదత్వంతోపాటు ఉక్తివైచిత్ర్యంకూడా ఇందులో ఉన్నది. కుంతి మాతృమూర్తిగా వేదనపడుతున్నది. కాని, కన్య మనంబులో ఈ మాట లనుకొన్నట్లు నన్నయ చెప్పాడు. అది పొసగదు కదా! అనిపించవచ్చును. ఆమెకు సద్యోగర్భంలో కర్ణుడు పుట్టగానే సూర్యవరంవలన ఆమె కన్యాత్వం దూషితం కాకుండా యథాస్థితిగా ఉన్న దని వస్తుధ్వని, ఈ కన్యాత్వస్థితి వచ్చినందువలననే పసివాడైన కర్ణుడిని మందసంలో ఉంచి వెంటనే రాగలిగిం దని భావించాలి. నన్నయ 'కన్య' అనే మాటతో పాత్రయొక్క తత్కాలస్థితిగతులను ధ్వనింపచేయటం ఉక్తి చమత్కారం. (సంపా.)

వ. వందురి వగచుచున్న దాని పుణ్యంబున నాదిత్యప్రేరితం బయి యనర్ఘరత్నవసుభరితంబయిన యొక్కమంజస నదీప్రవాహవేగంబునం దనయొద్దకు వచ్చిన, దానిలోఁ జెచ్చెరఁ దనకొడుకుం బెట్టి, కుంతి నిజగృహంబునకు వచ్చె; నంత. **30**

ప్రతిపదార్థం: వందురి= దుఃఖించి; వగచుచు+ఉన్న= ఆలోచిస్తున్న; దాని, పుణ్యంబునన్= ఆమె పుణ్యంవలన; ఆదిత్య, ప్రేరితంబు+అయి= సూర్యుడిచేత పంపబడినదై; అనర్ఘ, రత్న, వసు, భరితంబు+అయిన= అమూల్యమైన రత్నాలచేత, బంగారంచేత నిండినట్టిది అయిన; ఒక్క, మంజస= ఒకపెట్టె; నదీ, ప్రవాహ, వేగంబునన్= నదీప్రవాహవేగంచేత; తన,ఒద్దకు=

తన సమీపమునకు; వచ్చినన్= రాగా; దానిలోన్= ఆ పెట్టెలో; చెరన్+చెరన్= వెంటనే; తన, కొడుకున్= అప్పటికప్పుడే పుట్టిన తన కుమారుని; పెట్టి= ఉంచి; కుంతి= కుంతీకుమారి; నిజ, గృహంబునకున్= తన ఇంటికి; వచ్చెన్; అంత= ఆ తరువాత.

తాత్పర్యం: దుఃఖిస్తూ, ఆలోచిస్తున్న కుంతీదేవిపుణ్యంవలన సూర్యుడు పంపిన ఒకపెట్టె అమూల్యమైన రత్నాలతో, బంగారంతో నిండి నదీప్రవాహవేగంవలన ఆమెదగ్గరకు వచ్చింది. ఆ విధంగా తన దగ్గరకు వచ్చిన పెట్టెలో వెంటనే తనకొడుకును పెట్టి, కుంతి తనఇంటికి వచ్చింది. ఆ తరువాత.

ఆ. ఘనభుజుండు రాధ యను దానిపతి యొక్క। సూతుఁ డరుగుదెంచి చూచి రత్న
పుంజభరిత మయిన మంజసలో నున్న। కొడుకు దానితోన కొనుచు వచ్చి. 31

ప్రతిపదార్థం: ఘన, భుజుండు= గొప్పభుజాలు కలవాడు; రాధ, అను, దాని= రాధ అనుపేరుగల ఆమె; పతి= భర్త; ఒక్క, సూతుఁడు= సూతవంశంలో పుట్టినవాడు ఒకడు; అరుగుదెంచి= వచ్చి; చూచి= కనుగొని; రత్న, పుంజ, భరితము= రత్నాల సమూహంతో నిండినది; అయిన; మంజసలోన్= పెట్టెలో; ఉన్న= ఉండినట్టి; కొడుకున్; దాని, తోనన్= ఆ పెట్టెతోనే; కొనుచు= తీసికొంటూ; వచ్చి= ఇంటికివచ్చి.

తాత్పర్యం: రాధ అనే స్త్రీకి భర్త అయిన ఒక సూతుడు, గొప్పభుజాలు కలవాడు వచ్చి చూచి, రత్నాలపెట్టెలో ఉన్న బిడ్డను ఆ పెట్టెతోకూడ తీసికొని వెళ్ళి.

క. తన భార్యకు రాధకు ని। చ్చిన నదియును గరము సంతసిల్లి కుమారుం
గని చన్నులు సేఁపి ముదం। బునఁ బెనిచెను సుహృదు లెట్టిపుణ్యమొ యనఁగన్. 32

ప్రతిపదార్థం: తన భార్యకు, రాధకున్= తన ఇల్లాలు రాధకు; ఇచ్చినన్= ఈయగా; అదియును= ఆమెకూడా; కరము= మిక్కిలి; సంతసిల్లి; కుమారున్; కని=చూచి; చన్నులు= పాలిండ్లు, చేఁపి= పాలుకారునట్లు చేసి; సుహృదులు= చెలులు; ఎట్టి, పుణ్యమొ= ఎటువంటి పుణ్యమో; అనఁగన్= అని పలుకగా; ముదంబునన్= సంతోషముతో; పెనిచెను=పెంచింది.

తాత్పర్యం: తన భార్య అయిన రాధకు ఇవ్వగా, ఆమె చాలా సంతోషించి, ఆ కుమారుడిని చూచి చన్నులు చేపగా అతనికి పాలిచ్చి, చెలు లందరూ, 'ఇదంతా నీ పుణ్యం' అని పొగడగా, ఆ బాలుడిని పెంచింది.

వ. ఇట్లు వసునివహంబుతో వచ్చుటంజేసి వసుషేణుం డను నామంబునం బరగి కర్ణుండు రాధేయుం డై సూతగృహంబునం బెరుఁగుచుండె; నంత నిట. 33

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; వసు, నివహంబుతో= రత్నాల, బంగారుసమూహంతో; వచ్చుటన్+ చేసి= రావటంవలన; వసుషేణుండు; అను; నామంబునన్= పేరుతో; పరగి= ఒప్పి; కర్ణుండు; రాధేయుండు+ఐ= రాధకొడుకై; సూత, గృహంబునన్= సూతుని ఇంట్లో; పెరుఁగుచు+ఉండెన్= పెరుగుతూ ఉండినాడు; అంతన్, ఇట= అటుమీద - ఇక్కడ.

తాత్పర్యం: ఈ విధంగా బంగారంతో, రత్నాలతో రావటంచేత వసుషేణుడు అనే పేరుతో కర్ణుడు రాధకొడుకుగా సూతుడి ఇంట్లో పెరుగుతున్నాడు. ఆపైన ఇక్కడ.

విశేషం: వసుశబ్దానికి బంగారు, రత్నాలు అనే రెండుఅర్థాలూ ఉన్నాయి.

పాండురాజు వివాహ మై దిగ్విజయము సేయుట (సం. 1-105-1)

సీ. యదుకులవిమలపయఃపయోనిధిసుధా । కరరేఖఁ, గమనీయకాంతినిలయ,
ననవరతాన్నదానాభితర్పితముని । విప్రజనాశీఃపవిత్రమూర్తి,
వినయాభిమానవివేకసౌజన్యాది । సదమలగుణరత్నజన్మభూమిఁ,
బరమపతివ్రతాభరణాభిశోభితఁ । దామరసేక్షణఁ, దాల్మియందుఁ

ఆ. బృథివిఁ బోనిదానిఁ బృథయను కన్యక । నధికవీరుఁ డై స్వయంవరమునఁ
బడసి పరనరేంద్రపరిభావి పాండు భూ । వరుఁడు పేర్మితో వివాహ మయ్యె. 34

ప్రతిపదార్థం: యదుకుల, విమల పయస్+పయస్+నిధి, సుధాకర, రేఖన్= యదువంశం అనే నిర్మలమైన పాలసముద్రానికి చంద్రరేఖ అయిన దానిని; కమనీయ, కాంతి, నిలయన్= మనోహరమైన కాంతికి స్థానం అయినదానిని; అనవరత+అన్నదాన+అభితర్పిత, ముని, విప్రజన+ఆశీస్, పవిత్రమూర్తిన్= ఎడతెగని అన్నదానంచేత తృప్తి పొందింపబడిన మునుల, బ్రాహ్మణుల ఆశీర్వచనంచేత పవిత్రమైన ఆకారం కలదానిని; వినయ+అభిమాన, వివేక, సౌజన్య+ఆది, సద్+అమల, గుణ, రత్న, జన్మభూమిన్= అడకువ, గౌరవం, వివేకం, మంచితనం మొదలైన ఉత్తమాలు అయిన నిర్మలగుణాలు అనే రత్నాలకు పుట్టుచోటు అయిన దానిని; పరమ, పతివ్రతా+ఆభరణ+అభిశోభితన్= ఉత్తమమైన పాతివ్రత్యం కల స్త్రీలకు నగవలె ఎక్కువగా ప్రకాశింపజేయబడుతున్నదానిని; తామరస+ఈక్షణన్= కమలాలవంటి కన్నులు కలదానిని; తాల్మి, అందున్= ఓర్పులో; పృథివిన్= భూమిని; పోనిదానినన్= పోలినట్టిదానిని; పృథ, అను, కన్యకన్= పృథ అనే పేరుగల కన్నెను అనగా కుంతిని; పర, నర+ఇంద్ర, పరిభావి= శత్రురాజులను అవమానించువాడు; పాండు, భూవరుఁడు= పాండురాజు; అధిక, వీరుఁడు+ఐ= మిక్కిలి పరాక్రమశాలి అయి; స్వయంవరమునన్= స్వయంవరమునందు; పడసి= పొంది; పేర్మితో= గొప్పగా ప్రీతిగా; వివాహము+అయ్యెన్= పెళ్ళి చేసుకొన్నాడు.

తాత్పర్యం: యదువంశ మనే నిర్మలసముద్రానికి చంద్రరేఖవంటిది, మనోహరమైన తేజస్సుకు స్థానమైనది, ఎడతెగని అన్నదానంచేత మునులను బ్రాహ్మణులను తృప్తిపొందించి వాళ్ళ ఆశీర్వచనంచేత పవిత్రమైన ఆకారం కలది, వినయం, గౌరవం, వివేకం, మంచితనం మొదలైన ఉత్తమగుణా లనే రత్నాలకు జన్మభూమి అయినది, పరమ పతివ్రతలకు అలంకారంవలె ప్రకాశించేది, కమలాలవంటి కన్నులు కలది, ఓర్పులో భూమితో పోల్చదగింది అయిన పృథను, శత్రురాజులను జయించిన పాండురాజు మహాపరాక్రమశాలి అయి, స్వయంవరంలో పొంది, ప్రీతితో పెళ్ళి చేసికొన్నాడు.

విశేషం: అలం: రూపకం, ఉపమ. ఈ పద్యంలో నన్నయ కుంతిని ఒక శృంగారనాయికగా కాక పుణ్యవతిగా, పవిత్రమూర్తిగా వర్ణించాడు. 'గణనీయకాంతినిలయ' అన్న విశేషణంద్వారా ఈ పద్యరచనలో కాంతి అనే శబ్దగుణం గణనీయంగా పోషింపబడిం దని సూచించాడు. వాడిన దీర్ఘసమాసాలు ఔజ్జ్వల్యం అనే స్వభావాన్ని ప్రదర్శించటంచేత కుంతిలోని కాంతిశీలం ధ్వనిమయం అవుతున్నది. అక్షరరమ్యత కాంతిగుణశోభకు వ్యంజకం కావటం ఈ రచనలోని విశేషం. భారతకథలోని మాతృమూర్తిగా అత్యంత కీలకమైన పాత్రను నిర్వహించే పృథను (కుంతిని) సీసపద్యంలో గుణసుందరంగా, ఉదాత్తంగా పరిచయం చేయటం రుచిరార్థ సూక్తినిధి ప్రదర్శించినశిల్పం.

వ. మఱియు భీష్మానుమతంబున మద్రరాజతనయ మాద్రి యనుదాని మహోత్సవంబున వివాహంబై పాండురాజు భరతకులరత్నాలంకారుం డై పరాక్రమంబున నెవ్వరిని మెచ్చక యపారచతురంగబలసమన్వితుం డై. 35

ప్రతిపదార్థం: మఱియు; భీష్మ+అనుమతంబున= భీష్ముడి అనుమతితో; మద్ర, రాజ, తనయ= మద్రదేశానికి సంబంధించిన రాజు కూతురు; మాద్రి అను దానిన్= మాద్రి అను పేరుగల ఆమెను; మహా+ఉత్సవంబునన్= గొప్ప పండుగతో (ఊరేగింపుతో); వివాహంబై= పెండ్లాడి; పాండురాజు= పాండురాజు; భరత, కుల, రత్న+ అలంకారుండు+ఐ= భరతవంశానికి రత్నాభరణం వంటివాడై; పరాక్రమంబునన్= వీర్యము లేదా శౌర్యమునందు; ఎవ్వరిని, మెచ్చక= ఎంతటివారినైనా, లెక్కచేయక; అపార, చతురంగ, బల, సమన్వితుండు+ఐ= అంతులేని నాలుగు అంగములు (రథ, గజ, తురగ, పదాతులు) కలసేనతో కూడుకొన్నవాడై.

తాత్పర్యం: పాండురాజు భీష్మునిఅనుమతితో మద్రరాజుకూతురైన మాద్రినికూడా వైభవంగా వివాహంచేసికొని, భరతవంశానికి రత్నాభరణంవంటివాడై, పరాక్రమంలో ఎవరినీ లెక్కచేయక చతురంగబలాలతో కూడుకొన్నవాడై.

మ. ధ్వజినీ పాత భరంబునం దలరఁగా, ధాత్రీధరాహీంద్ర మూ
ర్ధజరత్నప్రకరంబు లున్నతగజేంద్రస్యందనప్రోల్లస
ద్ధ్వజ వాతాహతిఁ దూలఁగా జలదబృందం బీక్రియన్ సర్వది
గ్విజయార్థం బరిగెం గురుప్రభుఁడు దోర్వీర్యప్రకాశార్థి యై. 36

ప్రతిపదార్థం: ధ్వజినీ, పాత, భరంబునన్= సైన్యంనడకభారంచేత; ధాత్రీ, ధర+అహి+ఇంద్ర, మూర్ధజ, రత్న, ప్రకరంబులు= భూమిని మోస్తున్న నాగరాజైన ఆదిశేషుని శిరస్సునందు పుట్టిన రత్నాలసమూహాలు; తలరఁగా= చలింపగా; ఉన్నత, గజ+ఇంద్ర, స్యందన, ప్ర+ఉల్లసత్+ధ్వజ, వాత+ఆ, హతిన్= ఎత్తైన మేలిమి ఏనుగులయొక్క, రథాలయొక్క బాగా ప్రకాశించే టెక్కెముల గాలిదెబ్బచేత; జలద, బృందంబు= మేఘాలసమూహం; తూలఁగాన్= చలింపగా; ఈ, క్రియన్= ఈ విధంగా; కురు, ప్రభుఁడు= కురురా జైన పాండురాజు; దోః+వీర్య, ప్రకాశ+అర్థి+ఐ= బాహుబలాన్ని ప్రకటించాలన్న కోరిక కలవాడై; సర్వ, దిక్+విజయ+అర్థంబు= అన్నిదిక్కులను జయించటంకొరకు; అరిగెన్+ వెళ్ళాడు.

తాత్పర్యం: సైన్యంయొక్క పాదఘట్టనలభారంవల్ల భూమిని మోస్తున్న ఆదిశేషునిశిరోమణులు చలించేటట్లు, ఎత్తైన మేలిమిఏనుగులమీద, రథాలమీద కల జెండాల గాలిదెబ్బకు మేఘాల సమూహం చెదిరేటట్లు పాండురాజు తన బాహుబలాన్ని ప్రకటించా లన్నకోరికతో దిగ్విజయంకోసం వెళ్ళాడు.

విశేషం: అలం: అతిశయోక్తి. మత్తేభవృత్తం సమాసఘటితమై సంధిబంధురమై, ఉదాత్తగంభీరంగా ప్రసాదమిశ్రిత ఓజోగుణంతో సాగింది. ఈ పద్యశైలి వీరరసోచితం; అక్షరరమ్యం.

క. అతులప్రతాపలీలా । యుతుఁ డై ప్రాగ్దక్షిణాపరోత్తర దిగ్భూ
పతుల నిజశాసన వశీ । కృతులం గావించెఁ దనదుకీర్తి వెలుంగన్. 37

ప్రతిపదార్థం: అతుల, ప్రతాప, లీలా, యుతుఁడు+ఐ= సాటిలేని పరాక్రమవిలాసంతో కూడినవాడై; ప్రాక్+దక్షిణ+అపర+ ఉత్తర, దిక్+భూపతుల= తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరదిక్కులరాజులను; తనదు కీర్తి; వెలుంగన్; నిజ, శాసన, వశీకృతులన్= తన ఆజ్ఞకు లొంగేటట్లు చేయబడినవారినిగా - అనగా తనకు లొంగినవారినిగా; కావించెన్= చేశాడు.

తాత్పర్యం: సాటిలేని పరాక్రమవిలాసంతో పాండురాజు నాలుగుదిక్కులరాజులను తన ఆజ్ఞకు లొంగేటట్లు చేశాడు.

మహాస్రగ్ధర

అతిరౌద్రాకారకీలాయతదవదహనోగ్రాగ్ర సేనానిపీడా
హతు లై నానావిధోపాయనములు గొని సౌహార్దవాంఛన్ జయశ్రీ
శ్రితబాహుం గానఁగా వచ్చిరి సకలజగత్సేవ్యమానున్ మహేంద్ర
ప్రతిముం గౌరవ్యవంశప్రభు నఖిలమహీపాలు రాంబాలికేయున్. 38

ప్రతిపదార్థం: అఖిల, మహీ, పాలురు= భూమిమీది రాజులంతా; అతి, రౌద్ర+ఆకార, కీలా+ఆయత, దవదహన+ఉగ్ర+ అగ్ర, సేనా, నిపీడా, హతులు+ఐ= మిక్కిలితీక్ష్ణ మైన ఆకారం కల మంటలచేత గొప్పదైన కార్చిచ్చువలె భయంకరమైన ముందు ఉన్న సైన్యంతాకిడిచేత కొట్టబడినవారై; నానావిధ+ ఉపాయనములు= పలురకాలకానుకలు; కొని= తీసికొని; సౌహార్ద, వాంఛన్= స్నేహంమీదికోరికతో; జయ శ్రీ, శ్రిత, బాహున్= జయలక్ష్మిచేత ఆశ్రయించబడిన చేతులు కలవాడిని; సకల, జగత్+సేవ్యమానున్= అన్నిలోకాలచేత సేవింపదగినవాడిని; మహా+ఇంద్ర, ప్రతిమున్ = దేవేంద్రుడితో సమానమైనవాడిని; కౌరవ్య, వంశ, ప్రభున్= కురువంశరాజును; ఆంబాలికేయున్= అంబాలికకొడుకైన పాండురాజును; కానఁగాన్= చూడటానికి; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: భూమిమీద రాజులంతా మహాతీవ్రజ్వాలలతో మండుతున్న కార్చిచ్చువలె భయంకరమయిన ముందున్న సైన్యం తాకిడిచేత కొట్టబడినవాళ్ళయి అనేకరకాల కానుకలు తీసుకొని, మిత్రత్వాన్ని కోరి జయలక్ష్మిని ఆశ్రయించిన చేతులుకలవాడు, అన్నిలోకాలచేత సేవించబడేవాడు, దేవేంద్రునితో సమానుడయినవాడు, కురువంశప్రభువు అయిన - పాండురాజును చూడటానికి వచ్చారు.

విశేషం: అలం: ఉపమ. మహాస్రగ్ధర పాదానికి 22 అక్షరా లుంటాయి. స, త, త, న, స ర, ర, గ అనే గణాలు వరుసగా ఉంటాయి. 9, 16 అక్షరాలకు యతి చెల్లుతుంది. నన్నయ వ్రాసినవి మొత్తం రెండు మహాస్రగ్ధరలు, మొదటిది (ఆది 2.22) దేవదానవయుద్ధంలో నరనారాయణులు ప్రదర్శించిన ప్రతాపాన్ని వర్ణించేది. రెండవది ఇది. దిగ్విజయయాత్రలో పాండురాజు ప్రదర్శించిన పరాక్రమాన్ని వర్ణించేది. "వీరస్య భుజదండానాం వర్ణనే స్రగ్ధరా భవేత్" అని క్షేమేంద్రుని మతం. స్రగ్ధరలోని మొదటి గురువును రెండు లఘువులు చేస్తే మహాస్రగ్ధర ఔతుంది. కాబట్టి స్రగ్ధరవలె మహాస్రగ్ధరనుకూడా మహావీరుల పరాక్రమ ప్రదర్శనకు వినియోగించి, నన్నయ వృత్తౌచిత్యాన్ని పాలించాడు. (సంపా.) పరాక్రమంవల్ల గాంభీర్యాన్ని, విజయలక్ష్మి వల్ల సౌందర్యాన్ని ఒక గొప్ప దండవలె ధరించినా డని-వృత్తము పేరుకు తగిన సన్నివేశకల్పన నన్నయఛందశ్శిల్పమర్మజ్ఞతకు నిదర్శనం.

చ. లలిత హయ ద్విపంబుల విలాసినులన్ మణిరౌప్య కాంచనా
వలుల నజావిగోమహిష వర్గములన్ బహుభూషణంబులన్
బలువిడిఁ గప్పముల్ ధరణిపాలురచేఁ గొని నూఱువేల్గజం
బులఁ బెటికించి తెచ్చెఁ గురుముఖ్యుఁ డకుప్యధనమ్ము లిమ్ముగన్. 39

ప్రతిపదార్థం: కురు, ముఖ్యుఁడు= కురువంశంలో ముఖ్యుడైనవాడు - పాండురాజు; లలిత, హయ, ద్విపంబులన్= మనోహరాలైన గుఱ్ఱాలను, ఏనుగులను; విలాసినులన్= అందమైన స్త్రీలను; మణి, రౌప్య, కాంచన+ఆవలులన్= మణుల వెండిబంగారాల సమూహాలను; అజ+అవి, గో, మహిష, వర్గములన్= మేకల, గొర్రెల, గోవుల, దున్నల సమూహాలను; బహు,

భూషణంబులన్= అనేక ఆభరణాలను; బలువిడిన్= మిక్కుటంగా; కప్పములో= పన్నులు; ధరణిపాలురచేన్= రాజులనుండి; కొని= గ్రహించి; అకుప్య, ధనమ్ములు= వెండి బంగారు రూపం అయిన సంపదలను; ఇమ్ముగన్= సులువుగ; నూఱు, వేల్, గజంబులన్= నూరువేల ఏనుగులతో; పెఱికించి= మోయించి; తెచ్చెన్.

తాత్పర్యం: పాండురాజు మనోహరాలైన గుర్రాలను, ఏనుగులను, అందమైన స్త్రీలను, మణులను, వెండిని, బంగారాన్ని, మేకలను, గొర్రెలను, ఆవులను, దున్నలను, చాలాధనాన్ని రాజులనుండి కప్పాలుగా గ్రహించాడు. వెండి, బంగారు రూపమైన ధనాన్ని నూరువేలఏనుగులతో మోయించి తెచ్చాడు.

క. శరనిధిపరివృత విశ్వం । భరఁ గల భూపతులు పాండుపతికృతమునఁ గిం
కరు లై ప్రతిసమకల్పిత । కరు లై రది మొదలుగాఁగఁ గౌరవ్యులకున్. 40

ప్రతిపదార్థం: శర, నిధి, పరివృత, విశ్వంభరన్= సముద్రంచేత చుట్టబడిన భూమిమీద; కల= ఉన్న; భూపతులు= రాజులు; పాండుపతి, కృతమునన్= పాండురాజు చేసిన పనివలన; కింకరులు+ఐ= సేవకులై; అది, మొదలు, కాఁగన్= అప్పటినుండి; కౌరవ్యులకున్= కురువంశరాజులకు; ప్రతి, సమ, కల్పిత, కరులు+ఐ= ప్రతిసంవత్సరం ఏర్పాటు చేయబడిన కప్పం కలవారు అయ్యారు - అనగా ప్రతిసంవత్సరం కప్పం చెల్లిస్తున్నారు.

తాత్పర్యం: భూమిమీది రాజులంతా పాండురాజు చేసిన పనివల్ల సేవకులై, అప్పటినుండి కురువంశ రాజులకు ప్రతి సంవత్సరం కప్పం చెల్లిస్తున్నారు.

పాండురాజు సత్కృత్యములు (సం. 1-106-1)

వ. ఇట్లు పాండురాజు దిగ్విజయంబు సేసి తదుపార్జితంబు లైన యపరిమితధనంబులఁ దెచ్చి ధృతరాష్ట్రుననుమతంబున భీష్మునకు సత్యవతికిం దమతల్లు లైన కౌసల్యలకు విదురునకు సుహృజ్జనులకు బ్రాహ్మణులకు నిచ్చి, వారివలన ననేకాశీఃప్రశంసలు వడసి సుఖం బున్నంత. 41

ప్రతిపదార్థం: ఇట్లు; పాండురాజు; దిక్+విజయంబు, చేసి= దిక్కులను జయించి; తద్+ఉపార్జితంబులు+ఐన= ఆ దిగ్విజయంవలన సంపాదించబడిన; అపరిమిత, ధనంబులన్= అంతులేని సంపదలను; తెచ్చి; ధృతరాష్ట్రు, అనుమతంబున= ధృతరాష్ట్రుని అంగీకారంతో; భీష్మునకున్; సత్యవతికిన్; తమ, తల్లులు+ఐన; కౌసల్యలకు= కోసలరాజు కూతుళ్ళకు; విదురునకున్; సుహృద్+జనులకున్= స్నేహితులకు; బ్రాహ్మణులకున్; ఇచ్చి; వారివలనన్; అనేక+ఆశీస్+ప్రశంసలు= పెక్కు ఆశీస్సులు, పొగడ్తలు; పడసి= పొంది; సుఖంబు+ఉన్నంత= సుఖంగా ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా పాండురాజు దిగ్విజయం చేసి, అంతులేని సంపద తెచ్చి, ధృతరాష్ట్రుని అనుమతితో భీష్మునికి, సత్యవతికి, తమతల్లులకు, విదురునకు, మిత్రులకు, బ్రాహ్మణులకు ఇచ్చి, వారివలన అనేక ఆశీర్వచనాలను, ప్రశంసలను పొంది, సుఖంగా ఉండగా.

చ. వినుతయశుండు పాండునృపవీరుఁడు దిగ్విజయంబు సేసి పెం
పునఁ గొనివచ్చి యిచ్చిన యపూర్వ మహా ధనరాశి పేర్మి వా

రని విభవంబుతోడ ధృతరాష్ట్రుఁడు సేసె శతాశ్వమేధముల్
దనిసన భూసురేశులకు దక్షిణ లిచ్చి యథోచితంబుగన్. **42**

ప్రతిపదార్థం: వినుత, యశుండు= పొగడబడిన కీర్తికలవాడు; పాండునృప, వీరుఁడు= వీరుడైన, పాండురాజు; దిక్+ విజయంబు, చేసి= దిక్కులను జయించి; పెంపునన్= గొప్పతనంచేత; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చిన= ఇచ్చినటువంటి; అపూర్వ, మహా, ధన, రాశి, పేర్మిన్= అంతకుముందు లేని గొప్ప ధనసమూహం యొక్క అతిశయంతో; వారని, విభవంబుతోడ= ఎడతెగని వైభవంతో; ధృతరాష్ట్రుఁడు; తనిసనన్= తృప్తిదీర; భూసుర+ఈశులకు= బ్రాహ్మణశ్రేష్ఠులకు; యథా+ఉచితంబుగన్= ఎవరికి తగినట్లు వారికి; దక్షిణలు= పెద్దవారికి గౌరవంగా ఇచ్చు ధనము; ఇచ్చి= ఒసగి; శత+అశ్వమేధముల్= వంద అశ్వమేధయాగాలు; చేసెన్.

తాత్పర్యం: కీర్తిమంతు డైన పాండురాజు దిక్కులను జయించి గొప్పగా తెచ్చి ఇచ్చిన ధనసమూహంతో ధృతరాష్ట్రుడు, మహావైభవంగా తృప్తిదీర బ్రాహ్మణోత్తములకు ఎవరికి తగినట్లు వారికి దక్షిణలు ఇచ్చి, వంద అశ్వమేధయాగాలు చేశాడు.

వ. మఱియు నప్పాండురాజు వినయవిధేయత్వంబున ధృతరాష్ట్రునకు, నభిమతకార్యకరణంబున బాంధవులకు, ననుకూలత్వంబున సుహృజ్జనులకుఁ, బరిశ్రమజ్ఞానంబున విద్వాంసులకుఁ, గారుణ్యదానంబున ననాథులకు, నభయంకరత్వంబున మహీప్రజలకు సంతోషంబు సేయుచు. **43**

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఆ+పాండురాజు; వినయ, విధేయత్వంబునన్= అణకువతో లొంగిఉండటంచేత; ధృతరాష్ట్రునకున్; అభిమతకార్య, కరణంబునన్= ఇష్టమైన పనులు చేయటంచేత; బాంధవులకున్= చుట్టాలకు; అనుకూలత్వం బునన్= అనుకూలంగా ఉండటంచేత; సుహృత్+జనులకున్= మిత్రులకు; పరిశ్రమ, జ్ఞానంబునన్= కృషిని గుర్తించటంచేత; విద్వాంసులకున్= పండితులకు; కారుణ్య, దానంబునన్= దయను దానంచేయటంచేత - అనగా కరుణ చూపటంచేత; అనాథులకున్= దిక్కులేనివాళ్ళకు; అభయంకరత్వంబునన్= భయంలేకుండా చేయడంచేత; మహీ, ప్రజలకున్= భూమిమీద ప్రజలకు; సంతోషంబు, చేయుచున్= సంతసం కలిగిస్తూ.

తాత్పర్యం: అంతేకాక ఆ పాండురాజు వినయవిధేయతలతో ధృతరాష్ట్రునికి, ఇష్టమైన పనులు చేయటంతో బంధువులకు, అనుకూలంగా ఉండటంతో మిత్రులకు, చేసిన కృషిని గుర్తించడంతో పండితులకు, దయ చూపటంతో దిక్కులేనివాళ్ళకు, భయంలేకుండా చేయటంతో ప్రజలకు సంతోషాన్ని కలిగిస్తూ.

విశేషం: ఇవి ఉత్తమరాజుకు ఉండే లక్షణాలు. ఉత్తమరాజు లక్షణాలే కాదు ఉత్తమవ్యక్తు లందరిలో ఉండే ఉన్నతమైన గుణాలు. వ్యక్తులంతా అలవరచుకోవలసిన ఉత్తమగుణాలు. పాండురాజు వంశకర్త. భావిచక్రవర్తుల వర్తనవిధిని ఆదర్శవంతంగా ఆచరించి చూపించాడు. పాండురాజు తన వంశాన్నీ, కుటుంబాన్నీ సమైక్యంగా, సంపన్నంగా, సంతోషంగా, ఆదర్శవంతంగా ఉంచటానికి తన శక్తియుక్తు లన్నీ ధారపోసి వంశకర్త అయినాడు. పాండురాజు తెచ్చియిచ్చిన ధనంతో వంద అశ్వమేధాలు చేసిన ధృతరాష్ట్రుడు వంశవిచ్ఛిత్తికి దోహదంచేశాడు. పాండురాజు ప్రవర్తిల్లచేసిన ఉదార చరిత్రాన్ని పాండవులు కొనసాగించారు. అందువలననే ధార్తారాష్ట్రులు నశించారు. పాండవులు వంశోద్ధారకులైనారు. పాండురాజు ప్రవర్తనలో ధ్వనిస్తున్న భావికథార్థాలను సారమతితో భావించాలి.

క. 'మండిత గుణ సంపద నధి। కుం డగుచున్ బూరు భరత కురు పతులకుఁ దు
ల్యుం డయి వంశకరుం డగుఁ। బాండుమహీశుఁ' డని బుధసభలు దనుఁ బొగడన్. 44

ప్రతిపదార్థం: మండితగుణసంపదన్= అలంకరింపబడిన సుగుణాల అతిశయంలో; అధికుండు= గొప్పవాడు; అగుచున్= అవుతూ; పాండు, మహీ+ఈశుఁడు= పాండురాజు; పూరు, భరత, కురుపతులకున్= రాజులైన పూరు, భరత, కురురాజులకు; తుల్యుండు+అయి= సమానుడైనవాడై; వంశ, కరుండు= వంశాన్ని నిలిపేవాడు, అగున్= కాగలడు; అని= ఆ ప్రకారంగా; బుధ, సభలు= పండితసమూహాలు; తనున్= తన్ను; పొగడన్= ప్రశంసింపగా.

తాత్పర్యం: 'అనేకసుగుణాలతో గొప్పవాడై పాండురాజు పూరు భరత కురు చక్రవర్తులతో సమానుడై, వంశాన్ని నిలిపేవాడు ఔతా' డని పండితులు తనను పొగడుతూ ఉండగా.

క. నానాద్రవ్య నిరంతర। దానముల ననూనయజ్ఞదక్షిణలను ధా
త్రీనాథుఁడు బ్రాహ్మణులను। శ్రీనిలయులఁ జేయుచుండె శిష్టప్రియుఁ డై. 45

ప్రతిపదార్థం: ధాత్రీ; నాథుఁడు= భూపతి - పాండురాజు; నానా, ద్రవ్య, నిరంతర, దానములన్= అనేక విధాలైన సంపదలను నిరంతరం దానంచేస్తూ ఉండటంవలన; అనూన, యజ్ఞ, దక్షిణలను= తక్కువకాని యజ్ఞాలలో దక్షిణలచేత - అనగా యజ్ఞాలలో గొప్పగా ఇచ్చే దక్షిణలచేత; శిష్ట, ప్రియుఁడు+ఐ= సదాచారసంపన్నులకు ప్రియమైనవాడై; బ్రాహ్మణులను; శ్రీనిలయులన్= సంపదకు ఉనికిపట్టు లయిన వారినిగా; చేయుచున్+ఉండెన్.

తాత్పర్యం: పాండురాజు అనేకవిధాలైన సంపదలను నిరంతరం దానం చేయటంచేత, యజ్ఞాలలో గొప్పగా దక్షిణలు ఇవ్వటంచేత, సదాచారసంపన్నులకు ప్రియమైనవాడై, బ్రాహ్మణులను ధనవంతులనుగా చేస్తూ ఉన్నాడు.

వేటకుఁ బోయిన పాండురాజునకు శాపంబు గలుగుట (సం. 1-109-5)

వ. మఱియు ననేకవినోదంబులను ననవరతకామానురూపవిషయసుఖానుభవంబులనుం బ్రొద్దు పుచ్చుచు నాతండు మృగయావ్యసనంబునం దగిలి. 46

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనేక, వినోదంబులను= పెక్కు వినోదాలతో; అనవరత, కామ+అనురూప, విషయ, సుఖ+అనుభవంబులన్= ఎడతెగని కామానికి తగిన విషయ సుఖాలను అనుభవించటంచేత; ప్రొద్దు, పుచ్చుచున్= కాలం గడుపుతూ; ఆతండు= పాండురాజు; మృగయావ్యసనంబునన్= వేటమీది మితిమీరిన ఆసక్తితో; తగిలి= తగులుకొని.

తాత్పర్యం: అంతేకాక, వివిధ సుఖవిలాసాలతో, ఎడతెరిపి లేకుండా కోరుకొన్న భోగాలు అనుభవించటంతో కాలంపుచ్చుతూ, పాండురాజు వేటమీద మితిమీరిన ఆసక్తితో తగులుకొని.

ఉ. వాసవసన్నిభుండు హిమవన్నగదక్షిణపార్శ్వభూములన్
శ్రీసతిఁ బోని కుంతియును జెల్వగు మాద్రియుఁ దోడ రాఁగ బా
ణాసన బాణ భాసిత మహాభుజుఁడై విహరించుచుండె ని
చ్ఛాసదృశంబుగా గజవశాద్వయమధ్య గజేంద్ర లీలతోన్. 47

ప్రతిపదార్థం: వాసవ, సన్నిభుండు= దేవేంద్రునితో సమానుడు అయిన పాండురాజు; హిమవత్+నగ, దక్షిణ, పార్శ్వ, భూములన్= హిమాలయపర్వతంయొక్క దక్షిణంవైపు ఉన్న భూములలో; శ్రీసతిన్+పోని= లక్ష్మీదేవిని పోలినట్టి; కుంతియును= కుంతియు; చెలువు+అగు= అందమైనది అయిన; మాద్రియున్; తోడ, రాఁగన్= వెంట రాగా; బాణ+ఆసన, బాణ, భాసిత, మహా, భుజుఁడు+ఐ= ధనుస్సుచేత, బాణాలచేత ప్రకాశింపచేయబడిన గొప్పభుజాలు కలవాడై; ఇచ్ఛా, సదృశంబుగాన్= కోరికకు తగినట్లు; గజావశా, ద్వయ, మధ్య, గజ+ఇంద్ర, లీలతోన్= ఆడేనుగులు రెండింటి మధ్య ఉండే మదపుటేనుగువంటి విలాసంతో; విహరించుచున్+ఉండెన్= విహరిస్తూ ఉండినాడు.

తాత్పర్యం: దేవేంద్రునితో సమాను డైన పాండురాజు, హిమాలయపర్వతానికి దక్షిణవైపున ఉండే భూములలో లక్ష్మీదేవివంటి కుంతి, అందమైన మాద్రి తనవెంట రాగా; ధనుస్సును, బాణాలను చేపట్టి ఇష్టంవచ్చినట్లుగా, రెండు ఆడుఏనుగుల మధ్య ఉండే మగమదపుటేనుగువంటి విలాసంతో విహరిస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱియుఁ దనకు ధృతరాష్ట్రుం డిష్టాన్నపాన మాల్యానులేపన భూషణాదులు నిత్యంబునుం బుత్తెంచుచుండ నిట్లు వనవాసవ్యాసంగంబున నుండి, యొక్కనాఁడు పెక్కుమృగంబుల నెగిచి యొక్కటి నేనియు నేయంగానక కినిసి యొక్కయెడ. 48

ప్రతిపదార్థం: మఱియున్; తనకున్; ధృతరాష్ట్రుండు; ఇష్ట+అన్న, పాన, మాల్య+అనులేపన, భూషణ+ఆదులు= ఇష్టమైన అన్నపానాలు, పూదండలు, మైపూతలు, ఆభరణాలు మొదలైనవాటిని; నిత్యంబునున్= ప్రతిరోజు; పుత్తెంచుచు+ఉండన్= పంపుతూ ఉండగా; ఇట్లు; వన, వాస, వ్యాసంగంబునన్= అడవిలో ఉండటంమీది ఆసక్తితో; ఉండి= వసించి; ఒక్కనాఁడు; పెక్కు, మగ్రుంబులన్= అనేకమృగాలను; ఎగిచి= తరిమి; ఒక్కటిన్, ఏనియున్= ఒక్కదానినికూడా; ఏయన్+కానక= కొట్టడానికి సాధ్యపడక; కినిసి= కోపించి; ఒక్క+ఎడన్= ఒకచోట.

తాత్పర్యం: అంతేకాక తనకు ఇష్టమైన అన్నపానాలు, పూదండలు, మైపూతలు, ఆభరణాలు మొదలైనవి ప్రతిరోజు ధృతరాష్ట్రుడు పంపుతూ ఉండగా, అడవిలో ఉండా లనే ఆసక్తి ఉండి, ఒకరోజు అనేకమృగాలను తరిమి, ఒక్కదాన్ని కూడా కొట్టడం సాధ్యంకాక కోపించి, ఒకచోట.

క. మనసిజరాగంబునఁ బెనఁ । గిన యిఱ్ఱిని లేడిఁ జూచి కృతహస్తుఁడు పె
ల్చన యే నమ్ముల నారెం । టిని ద్రెళ్ళఁగ నేసెఁ గడుఁ గఠినహృదయుం డై. 49

ప్రతిపదార్థం: మనసిజ, రాగంబునన్= మన్మథరాగంతో; పెనఁగిన= కలిసిన; ఇఱ్ఱిని= మగజింకను; లేడిన్= ఆడుజింకను; చూచి= కనుగొని; కృత, హస్తుఁడు= బాణాలను ప్రయోగించటంలో అలవాటుపడిన చేయి కలవాడు; కడున్= మిక్కిలి; కఠిన, హృదయుండు+ఐ= కఠినమైన మనస్సు కలవాడై; పెల్చన= గట్టిగా; ఏను+అమ్ములన్= ఐదుబాణాలతో; ఆ, రెంటిని= ఆ రెండుమృగాలను; త్రెళ్ళఁగన్= చనిపోయేటట్లు; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: మన్మథరాగంతో కలిసి ఉన్న మగ ఆడుజింకలను చూచి, బాణప్రయోగంలో నేర్పుకలవాడైన పాండురాజు కఠినహృదయుడై అయిదుబాణాలతో అవి చనిపోయేట్లు గట్టిగా కొట్టాడు.

వ. ఇ ట్లేసి యబ్బాణంబులు పుచ్చికొనియున్న యప్పాండురాజుం జూచి యమ్మృగమిథునంబునం దల్పావశిష్టజీవం బై పడియున్న మృగంబు మనుష్యవచనంబుల ని ట్లనియె. 50

విశేషం: ఇట్లు+ఏసి= ఈ విధంగా కొట్టి; ఆ+బాణంబులు; పుచ్చికొని= తీసికొని; ఉన్న, ఆ+పాండురాజున్; చూచి; ఆ, మృగ, మిథునంబునందు= ఆ మృగాలజంటలో; అల్ప+అవశిష్ట, జీవంబు+ఐ= కొంచెం మిగిలిన ప్రాణం కలదై; ఉన్న= ఉండిన; మృగంబు= మగజింక; మనుష్య, వచనంబులన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా కొట్టి ఆ బాణాలు తీసికొన్న ఆ పాండురాజును చూచి, ఆ మృగాలజంటలో కొన ఊపిరితో ఉన్న మగజింక మానవవాక్కులతో ఈవిధంగా అన్నది.

తరలము.

హరిపరాక్రమ! యేను గిందముఁ డన్మునిన్, మృగముల్ నిరం
తరము నిట్లు రమింపఁగాఁ గని తద్రతం బెడఁ గోరి సుం
దర మృగాకృతి నేను భార్యయు దారుణాటవిఁ గామ భో
గరతి నుండితి మిష్టచారిమృగవ్రజంబుల పొత్తునన్. 51

ప్రతిపదార్థం: హరి, పరాక్రమ= దేవేంద్రునిపరాక్రమంవంటి పరాక్రమం కలవాడా!; ఏను= నేను; కిందముఁడు, అను, మునిన్= కిందముడు అను పేరుగల మునిని; మృగముల్= జింకలు; నిరంతరమున్= ఎల్లప్పుడు; ఇట్లు; రమింపన్+కాన్= సంభోగించటాన్ని; కని=చూచి; తద్+రతంబు= వానియొక్కక్రీడను; ఎడన్=మనస్సులో; కోరి= ఇష్టపడి; సుందర, మృగ+ఆకృతిన్= అందమైన జింకలరూపంతో; ఏను= నేను; భార్యయు= నా ఇల్లాలు; దారుణ+అటవిన్= భయంకరమైన అడవిలో; కామ, భోగ, రతిన్= మన్మథసుఖంమీది ఆసక్తితో; ఇష్ట, చారి, మృగ, వ్రజంబుల, పొత్తునన్= ఇష్టంగా తిరుగుతున్న జింకలసమూహాల సహవాసంతో; ఉండితిమి.

తాత్పర్యం: దేవేంద్రునివంటి పరాక్రమం కలవాడా! నేను కిందముడు అనే మునిని. ఎల్లప్పుడూ ఈ విధంగా మృగాలు సంభోగించటాన్ని చూచి అట్లా సంభోగించా లని భావించి, నేనూ, నా భార్యా అందమైన మృగరూపాలు ధరించి, భయంకరమైన ఈ అడవిలో స్వేచ్ఛగా తిరిగే తోటిజింకల సమూహంతో కలసి, మన్మథసుఖాలు అనుభవిస్తున్నాం.

విశేషం: తరల వృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, ర, స, జ, జ, గ - గణాలు ఉంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది. తరలం తన పేరుకు తగినట్లుగా చంచలం, తరంగితం, కంపితం అయిన చిత్తవృత్తిని ధ్వనింపచేస్తుంది. కిందముని చంచలత్వాన్ని కంపితకంఠంతో (కొనఊపిరితో) చెప్పే సందర్భంలో వాడి నన్నయ ఛందశ్శిల్పాన్ని ప్రదర్శించాడు.

వ. మృగముల మై యున్న మమ్ము వధియించిన దీన నీకు పాతకంబు లేదు; వేటలాడుటయు, మృగంబులఁ జంపుటయు రాజులకు ధర్మంబ; యయినను. 52

ప్రతిపదార్థం: మృగములము+ఐ, ఉన్న= జింకలమై ఉండు; మమ్మున్= మమ్మల్ని; వధియించిన= చంపిన; దీనన్= దీనివలన; నీకున్; పాతకంబు= పాపం; లేదు= ఉండదు; వేటలు, ఆడుటయు= వేటాడుటలు; మృగంబులన్= జింకలను; చంపుటయున్= వధించుట; రాజులకున్= క్షత్రియులకు; ధర్మంబు+అ= న్యాయమే; అయినను.

తాత్పర్యం: జింకల మై ఉన్న మమ్మల్ని చంపటంవలన నీకు పాపం రాదు. వేటాడటం, మృగాలను చంపటం క్షత్రియులకు ధర్మమే, అయినా.

తే. **పఱవనోపక యున్న మైమఱచి పెంటిఁ । బెనఁగియున్నను, బ్రసవింప మొనసియున్నఁ,**
దెవులు గొనియున్న మృగములఁ దివిరి యేయ । రెఱచి యాహారముగ మను నెఱుకు లయిన. 53

ప్రతిపదార్థం: పఱవన్= పరుగెత్తటానికి; ఓపక= శక్తి లేక; ఉన్నన్= ఉండినను; మైమఱచి= శరీరము మరచి; పెంటిన్= ఆడుదానితో; పెనఁగి= కూడి; ఉన్నను= ఉండినప్పుడును; ప్రసవింపన్= ఈనటానికి; మొనసి= పూని; ఉన్నన్= ఉన్న సమయంలోను; తెవులు, కొని= వ్యాధిని పొంది; ఉన్నన్= ఉండినప్పుడున్నూ; మృగములన్= జింకలను; ఎఱచి= మాంసం; ఆహారముగ; మను= జీవించే; ఎఱుకులు= బోయవారు; అయినన్= అయినా; తివిరి= ప్రయత్నించి; ఏయరు= కొట్టరు.

తాత్పర్యం: పరుగెత్తలేనివి, ఆడుదానితో కూడుకొన్నవి, ఈనుతున్నవి, వ్యాధితో బాధపడుతున్నవి అయిన మృగాలను మాంసం ఆహారంగా జీవించే కిరాతులుకూడా కొట్టరు.

చ. **ఇనసమతేజు లై ధరణి నెన్నడు ధర్మపథంబు దప్పఁ ద్రొ**
క్కని భరతాదిరాజుల జగన్నుతవంశమునందుఁ బుట్టి నీ
కనఘచరిత్ర । యిట్లు దగునయ్య యధర్మువు సేయ? నీ యెఱుం
గని నృపధర్మువుల్ గలవె? కౌరవపుంగవ! గౌరవస్థితిన్. 54

ప్రతిపదార్థం: ఇన, సమ, తేజులు+ఐ= సూర్యుడితో సమానమైన తేజస్సు కలవారై; ధరణిన్= భూమిమీద; ఎన్నడున్= ఎప్పుడునూ; ధర్మ, పథంబు= ధర్మమార్గాన్ని; తప్పన్, త్రొక్కన్= తప్పుగా త్రొక్కని; భరత+ఆది, రాజుల, జగత్+నుత, వంశము+అందున్= భరతుడు మొదలైన రాజులు గల్గి; లోకంచేత పొగడబడినవంశంలో; పుట్టి; అనఘ, చరిత్ర= పాపం లేని నడవడి కలవాడా!; నీకున్, ఇట్లు; అధర్మువు= అన్యాయం; చేయన్= చేయటానికి; తగును+అయ్య= తగునా అయ్యా; కౌరవ, పుంగవ= కురువంశంలో శ్రేష్ఠుడా!; గౌరవ, స్థితిన్= ఉన్నతస్థితిలో ఉండటంచేత; నీ, ఎఱుంగని= నీకు తెలియని; నృప, ధర్మువుల్= రాజధర్మాలు; కలవె= కలవా?

తాత్పర్యం: సూర్యునితో సమానమైన తేజస్సు కలవారై, భూమిమీద ఎప్పుడూ ధర్మమార్గాన్ని తప్పని భరతుడు మొదలైన రాజుల ప్రసిద్ధవంశంలో పుట్టి, పుణ్యాత్ముడవైన నీకు అధర్మం చేయటం తగునా? కౌరవశ్రేష్ఠా! ఉన్నత స్థితిలో ఉన్న నీకు తెలియనిరాజధర్మాలు ఉన్నాయా?

విశేషం: భరతుడు మొదలైన వంశకర్తలు ధర్మమూర్తులు. వారివంశంలో పుట్టిన పాండురాజుకూడా ఆదర్శమూర్తిగా ఉండక, అధర్మంగా రతివివశులైన మృగాలను చంపటం గర్హించదగిన దని మునివచనం. "యద్య దాచరతి శ్రేష్ఠః తత్తదే వేతరో జనః। స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే" భ.గీ.3.21 అని గీతావాక్యం. పెద్దవారి ఆచరణలనే ఇతరజనులు

అనుసరిస్తారు. పెద్దలు చూపిన ప్రమాణాలకు లోకం కట్టుబడిఉంటుంది అన్న ధర్మాన్ని ఆధారంగా చేసుకొని కిందముడు పలికాడు. 'తగునయ్య' అను ప్రయోగము ఎంతో ఔచిత్యవంతము. తండ్రివై కాపాడవలసిన నీవు, రతిక్రీడలో ఉన్న మమ్మల్ని చంపటం న్యాయమా? అని మెత్తని మందలింపు.

వ. అని తన్ను నిందించి పలికిన నామృగంబు పలుకుల కలిగి పాండురా జి ట్లనియె. 55

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; తన్ను= తనను; నిందించి; పలికినన్= మాటాడగా; ఆ, మృగంబు= ఆ జింకయొక్క; పలుకులకున్= మాటలకు; అలిగి= కోపించి; పాండురాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని తనను నిందించి పలుకగా ఆ జింకమాటలు విని కోపించి, పాండురాజు ఈ విధంగా పలికాడు.

తే. పగఱఁ గని సైఁతురేనియు మృగకులంబు । గని సహింపరు రాజులు; మొనసి వాని
గ్రచ్చఱఁగఁ జంపుదురు; నమ్మి కిచ్చి చంపఁ । జనదు; మాయాబలంబునఁ జనదు చంప. 56

ప్రతిపదార్థం: రాజులు, పగఱన్= శత్రువులను; కని= చూచి; సైఁతురు+ఏనియున్= సహించినప్పటికిని; మృగ, కులంబు= మృగాలసమూహాన్ని; కని= చూచి; సహింపరు= ఓర్చుకొనరు; మొనసి= పూని, వానిన్= ఆ మృగాలను; క్రచ్చఱగన్= వేగంగా; చంపుదురు; నమ్మిక +ఇచ్చి= నమ్మించి; చంపన్= చంపగా; చనదు= కూడదు; మాయా, బలంబునన్= మోసంయొక్క బలంచేత - అనగా మోసగించి; చంపన్= వధింపగా; చనదు= కూడదు.

తాత్పర్యం: రాజులు శత్రువులను చూచి సహిస్తారేమో కాని మృగాలను చూచి సహించరు. వెంటనే వాటిని చంపుతారు. అయినా నమ్మించి కాని, మోసంచేసి కాని చంపకూడదు.

వ. 'తొల్లి యగస్త్య మహామునీంద్రుండు మృగ మాంసంబున నిత్యశ్రాద్ధంబు సేయుచుండి రాజులకు మృగవధ దోషంబు లేకుండ నిర్మించె; దీని నీకు నిందింపఁదగునే?' యనుచున్న నమ్మృగంబులు బాణఘాతక్షతవేదన సహింపనోపక 'సర్వప్రాణులకు సాధారణం బయి యిష్టం బగు సుఖావసరంబున నున్న మమ్ము ననపరాధుల వధించితి గావున నీవునుం బ్రియాసంగమం బయిన యప్పుడ పంచత్వం బొందెదు' మని, 'నీ ప్రియయు నిన్ను ననుగమించు' నని పాండురాజునకు శాపం బిచ్చి, గతప్రాణము లై పడియున్న మృగంబులం జూచి శోకించి పాండురాజు పరమ నిర్వేదనపరుం డయి. 57

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; అగస్త్య, మహా, ముని+ఇంద్రుండు= అగస్త్యమహర్షి; మృగ, మాంసంబునన్= జింకమాంసముతో; నిత్య, శ్రాద్ధంబు= ప్రతిదినశ్రాద్ధం; చేయుచున్+ఉండి= చేస్తూ ఉండి; రాజులకున్= క్షత్రియులకు; మృగ, వధ, దోషంబు= మృగాలను చంపటంవలని పాపం; లేకుండన్; నిర్మించెన్= చేశాడు; దీనిన్= ఈ పనిని, నీకున్= నీకు; నిందింపన్= దూషింపగా; తగునే= యోగ్యము అగునా? అనుచున్నన్= అంటూండగానే; ఆ+మృగంబులు= ఆ రెండు జింకలు; బాణ, ఘాత, క్షత, వేదనన్= బాణందెబ్బలవలన ఏర్పడిన గాయాలబాధను; సహింపఁగన్, ఓపక= ఓర్చుకోలేక; సర్వ, ప్రాణులకు; సాధారణంబు+అయి; ఇష్టంబు+అగు; సుఖ+అవసరంబునన్= సుఖసమయంలో; ఉన్న= ఉండిన; మమ్మున్= మమ్మల్ని; అనపరాధులన్= తప్పుచేయనివారిని; వధించితివి= వధించావు; కావున; నీవున్= నీవుకూడా; ప్రియా, సంగమంబు= ప్రియురాలితో కలయిక; అయిన= కలిగినవేళ; అప్పుడు+అ; పంచత్వంబు= మరణం; ఒందెదుము= పొందుతావు గాత; అని= ఆ

ప్రకారంగా; నీ, ప్రియయున్= నీ ప్రియురాలు కూడ; నిన్నున్, అనుగమించున్= వెంబడిస్తుంది; అని; పాండురాజునకు; శాపంబు+ఇచ్చి; గత, ప్రాణములు+ఐ= పోయిన ప్రాణాలు కల వై; పడియున్న= నేలపై పడిఉన్న; మృగంబులన్= జింకలను; చూచి; దుఃఖించి= శోకించి; పాండురాజు; పరమ, నిర్వేదన, పరుండు+అయి= మిక్కిలి నిరాశ చెందినవా డై.

తాత్పర్యం: 'పూర్వం అగస్త్యమహర్షి మృగమాంసంతో ప్రతిరోజూ శ్రాద్ధం చేస్తూ, రాజులకు మృగవధవలన పాపం లేకుండా చేశాడు. అందువలన నీవు నన్ను నిందించటం తగునా?' - అని అంటూ ఉండగా, ఆ మృగాలు బాణం దెబ్బలవలన కలిగినబాధ ఓర్చుకోలేక, ప్రాణు లన్నిటికి సాధారణ మై, ఇష్టమైన సంభోగ సుఖాన్ని అనుభవిస్తున్న సమయంలో ఏ తప్పు చేయని మమ్మల్ని చంపావు. కాబట్టి నీవుకూడా నీ ప్రియురాలితో కలిసినప్పుడు మరణాన్ని పొందుతావు; నీ భార్యకూడా నీతో మరణించుగాక' అని పాండురాజుకు శాపమిచ్చి, ప్రాణాలు విడిచి పడి ఉన్న ఆ మృగాలను చూచి, పాండురాజు మిక్కిలి దుఃఖించి నిరాశ చెందినవాడై.

విశేషం: శ్రాద్ధము - శ్రద్ధతో కూడినది - కాల, పాత్ర నియమాలతో చేసే పితృక్రియ.

క. ఎట్టి విశిష్టకులంబునఁ । బుట్టియు, సదసద్వివేకములు గల్గియు, మున్
గట్టిన కర్మఫలంబులు । నెట్టన భోగింపకుండ నేర్తురె మనుజుల్? 58

ప్రతిపదార్థం: మనుజుల్= మానవులు; ఎట్టి విశిష్ట, కులంబునన్= ఎంతటి ఉత్తమవంశంలో; పుట్టియున్; సత్+అసత్+ వివేకములు= మంచి చెడ్డలను గురించిన పరిజ్ఞానాలు; కల్గియున్= కలిగియుండియు; మున్= పూర్వజన్మలో; కట్టిన= కూడబెట్టుకొన్న; కర్మ, ఫలంబులు= కర్మఫలాలు; నెట్టన= తప్పక; భోగింపక= అనుభవింపక; ఉండ, నేర్తురె = ఉండగలరా?

తాత్పర్యం: మానవులు ఎంతటి ఉత్తమవంశంలో పుట్టినా, మంచిచెడ్డలనుగురించిన పరిజ్ఞానాలు కలిగిఉన్నా, పూర్వ జన్మకర్మఫలాన్ని అనుభవించక తప్పదు.

విశేషం: విధికంటె కర్మ బలీయ మని సుభాషితం. "ఫలం కర్మాయత్తం కి మమరగణైః కించ విధినా । నమ స్తత్కర్మేభ్యో విధిరపి న యేభ్యః ప్రభవతి" అని భర్తృహరిసుభాషితం (కర్మపద్ధతి-91 శ్లో) - ఫలం కర్మాధీనం కాబట్టి దేవతలతోనూ, దైవంతోనూ మా కేమిపని? దేవతలకుకూడా దాట శక్యంగాని కర్మకే నమస్కారం అని భర్తృహరికవితోక్తి. (సంపా.)

వ. కామవ్యామోహితుం డయి కొండుకనాఁడు మదీయజనకుండు పరలోకగతుం డైనఁ దత్క్షేత్రంబున ధర్మమయుం డయిన కృష్ణద్వైపాయనమునివలన నుద్భవిల్లి, ధర్మప్రవృత్తుండ నై యున్న నా కిట్టి దుర్వ్యసనంబు కర్మవశంబున సంభవించె; నింక మునివృత్తియ యుచితంబు గావున సర్వసంగంబులు విడిచి, సర్వభూతంబులయందు సమచిత్తుండనై, హింస దలంపక నిత్యంబు నొక్కొక్కవనస్పతియందు నొక్కొక్కవన్య ఫలంబు భిక్ష గొని, యసంభవం బయిననాఁ డుపవాసంబు సేసి, వృక్షమూలంబున నుండి పాంసుపరిచ్ఛన్నదేహుండ నయి. 59

ప్రతిపదార్థం: మదీయ, జనకుండు= నాతండ్రి; కామ, వ్యామోహితుండు+అయి= మన్మథునిచేత మిక్కిలి మోహింప చేయబడినవాడై; కొండుకనాఁడు= చిన్నతనంలో; పర, లోక, గతుండు+ఐనన్= స్వర్గలోకానికి వెళ్ళినవాడు కాగా; తద్+క్షేత్రంబునన్= అతని భార్యకు; ధర్మమయుండు+అయిన= ధర్మస్వరూపుడు అయిన; కృష్ణద్వైపాయన, మునివలనన్= వ్యాసమునివల్ల; ఉద్భవిల్లి= పుట్టి; ధర్మ, ప్రవృత్తుండను+ఐ= ధర్మమార్గంలో నడుస్తున్నవాడ నై; ఉన్న నాకున్= జీవించునాకు; ఇట్టి;

దుర్+వ్యసనంబు= ఇటువంటి చెడ్డఅవస్థ; కర్మ, వశంబున్= పూర్వజన్మంలో చేసిన పనులను అనుసరించి; సంభవించెన్= కలిగెను; ఇంకన్= ఇటుపై; ముని, వృత్తి, అ= మునిజీవనమే; ఉచితంబు= తగినది; కావునన్= కాబట్టి; సర్వ, సంగములు= అన్నిబంధాలు; విడిచి; సర్వ, భూతంబుల, అందున్= అన్ని ప్రాణులలో; సమ, చిత్తుండను+ఐ= సమానమైన మనస్సు కలవాడనై; హింస= హింసనుగూర్చి; తలంపక= ఆలోచింపక; నిత్యంబున్= ప్రతిరోజు; ఒక్కొక్క, వనస్పతి, అందున్= ఒక్కొక్క చెట్టునందు; ఒక్కొక్క, వన్య, ఫలంబు= ఒక్కొక్క, అడవిసంబంధ మైన పండును; భిక్ష, కొని= బిచ్చముగా గ్రహించి; అసంభవంబు+అయిననాఁడు= దొరకని రోజు; ఉపవాసంబు, చేసి= తిండిలేక ఉపవాసం గావించి; వృక్ష మూలంబునన్, ఉండి= చెట్టుమొదటఉండి; పాంసు పరిచ్ఛన్న దేహుండను+అయి= దుమ్ముతో కప్పబడిన దేహం కలవాడనై.

తాత్పర్యం: నా తండ్రి కామపరవశుడై చిన్ననాడు చనిపోగా, ఆయన భార్యకు ధర్మస్వరూపుడైన కృష్ణద్వైపాయనుని వలన పుట్టి, ధర్మమార్గంలో నడుస్తున్న నాకు ఈ దురవస్థ పూర్వజన్మకర్మను అనుసరించి కలిగింది. ఇక నాకు తగింది ముని వృత్తే. అందువలన బంధాల నన్నింటిని విడిచిపెట్టి, అన్నిప్రాణులందు సమబుద్ధి కలిగి, హింసమాని, ప్రతిరోజూ ఒక్కొక్కచెట్టునుండి ఒక్కోపండు భిక్షగా తీసికొని, అదీ దొరకనిరోజు ఉపవాసం ఉంటూ, చెట్టుమొదట్లో నివసిస్తూ, దుమ్ముతో నిండిన శరీరాన్ని కలవాడ నై.

విశేషం: పాండురాజు మునివృత్తిని స్వీకరించా లని సంకల్పించాడు. మునినిగురించి భగవద్గీతలో ఇట్లా చెప్పబడింది. "దుఃఖే ష్వనుద్విగ్నమనాః, సుఖేషు విగతస్పృహః । వీతరాగభయక్రోధః, స్థితధీ ర్మని రుచ్యతే॥" (భ.గీ.2.56) దుఃఖాలు కలిగినప్పుడు కలతచెందని మనస్సు కలవాడు, సుఖాలపై కోరికలేనివాడు, అనురాగభయక్రోధాలను వదలినవాడు అయిన స్థితప్రజ్ఞుడు ముని. అట్టి మునిచిత్తవృత్తినీ, జీవనవిధానాన్నీ స్వీకరించా లని బ్రతుకుమీది నిరాశతో పాండురాజు సంకల్పించాడు.

సీ. **ఇంద్రియార్థంబులం దింద్రియవ్యాపార । ముడిగించి; క్రియ లెల్ల విడిచి, పుణ్య**
పాపబంధంబుల నోపి బంధింపంగఁ । బడక మనోవృత్తి నొడిచి, నాకు
నిది ప్రియం బప్రియం బిది నింద యిది మహా । స్తుతి యిది యనక, సంతత నితాంత
సంతోషయుతుఁడనై వంతయు భయమును । శీతాతపంబులు వాతగతియు

ఆ. **నెఱుఁగ కివ్విధమున మఱచి, శరీరంబు । మరణజీవితముల కురువిషాద**
తోషవృత్తు లుడిగి, భీషణాటవి నుండి । చేసెదను దపంబు భాసురముగ. **60**

ప్రతిపదార్థం: ఇంద్రియ+అర్థంబుల, అందున్= ఇంద్రియవిషయా లైన శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలలో; ఇంద్రియ, వ్యాపారము= ఇంద్రియాలు పనిచేయటాన్ని; ఉడిగించి= మాన్పించి; క్రియలు+ఎల్లన్= పనులు అన్నీ; విడిచి= వదలిపెట్టి; పుణ్య, పాప, బంధంబులన్= పాపపుణ్యాలబంధాలను; ఓపి= సహించి; బంధింపఁగన్, పడక= కట్టుపడకుండా; మనో, వృత్తిన్= మనోవ్యాపారాన్ని; ఒడిచి= జయించి అనగా ఓడించి; నాకున్; ఇది, ప్రియంబు= ఇది ఇష్టం; ఇది, అప్రియంబు= ఇది ఇష్టం కాదు; ఇది, నింద= ఇది దూషణ; ఇది మహా, స్తుతి= ఇది గొప్పపొగడ్త; అనక= అని తలపక; సంతత, నితాంత, సంతోష, యుతుఁడను+ఐ= ఎడతెగని అధికమైన సంతోషంతో కూడుకొన్నవాడ నై; వంతయున్= దుఃఖాన్ని; భయమును= భయాన్ని; శీత+ఆతపంబులు= చలిని ఎండను; వాత, గతియున్= గాలికదలికను; ఎఱుఁగక= తెలియక; ఈ+విధమునన్= ఇట్లు; శరీరంబున్; మఱచి; మరణ జీవితములకు= చావు బ్రతుకులకు; ఉరు, విషాద, తోష, వృత్తులు= గొప్ప దుఃఖం, సంతోషం అనే మనోవృత్తులను; ఉడిగి= విడిచి; భీషణ+అటవిన్= భయంకరమైన అడవిలో; ఉండి; తపంబున్= తపస్సును; భాసురముగన్= ప్రకాశించేటట్లు; చేసెదను.

తాత్పర్యం: నేను ఇంద్రియాలను బంధించి; అన్నికర్మలను వదలి, పాపపుణ్యాలను విడిచి, మనస్సును ఓడించి, ఇది ఇష్టం, ఇది అనిష్టం, ఇది నింద, ఇది స్తుతి అనే భావం లేకుండా, ఎడతెగని మహానందంతో - దుఃఖం, భయం, చలి, ఎండ, గాలి అంటే ఏమిటో తెలియక, శరీరాన్ని మరచిపోయి, చావుకు దుఃఖాన్నీ, బ్రతుకునకు సంతోషాన్నీ లేనివాడ నై, భయంకర మైన అరణ్యంలో పెద్దతపస్సు చేస్తాను.

విశేషం: మునివృత్తికి ఫలం స్థితప్రజ్ఞత్వం. భగవద్గీతలో చెప్పబడిన స్థితప్రజ్ఞ లక్షణాలు పాండురాజు సంకల్పంలో ప్రతిఫలిస్తున్నాయి. "యదా సంహరతే చాయం, కూర్మోంఽ౽గానీవ సర్వశః । ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥ య స్సర్వత్రా నభిస్నేహః, తత్తత్ప్రాప్యశుభాశుభం । నాభినందతి న ద్వేష్టి, తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా॥" మొదలైన శ్లోకాల తాత్పర్యం (భ.గీ. అధ్యా.2. శ్లో.58-57) స్మరింపతగినది. తపింపచేయుటం తపస్సు. తపస్వి క్రమంగా ఇంద్రియాలను, క్రియలను, మనస్సును, రాగద్వేషాలను, ద్వంద్వాలను, సుఖదుఃఖాలను తపింపచేసి బ్రహ్మానందసిద్ధిని పొంది, ఆపై బ్రహ్మపదవిని పొందుతాడు. పాండురాజు ఆ మార్గాన్ని ఆశ్రయించా లని సంకల్పించాడు.

వ. అని నిశ్చయించి, గొంతిని మాద్రినిం జూచి; 'మీర లిందుండి నవయక హస్తిపురంబునకుం జని నాతపోవృత్తి నునికి రాజునకు సత్యవతీదేవికి భీష్మునకు విదురనకుం గౌసల్యలకు వృద్ధపురోహిత బ్రాహ్మణులకుం జెప్పి యం దుండుం' డనిన, వారలు బాష్పపూరితనయన లయి 'యిట్టి యుగ్రతపంబు విడిచి, మమ్ము విడువనియట్టి యాశ్రమంబున నుండి తపంబు సేయు నది; యేము నిన్ను విడిచి పోవనోపము; మమ్ము విడిచితేని యిప్పడ ప్రాణంబులు విడుతు' మనిన వారల నిశ్చయం బెఱింగి 'యట్లేని నాయొద్దన యుండుం; డేను వానప్రస్థాశ్రమంబున వల్కలంబులు గట్టి, రేపును మాపును మధ్యాహ్నంబునప్పడును స్నానంబు సేసి వేల్చుచుం గందమూలఫలాశనుండనై, పితృదేవతల వాక్సలిలవన్యఫలంబులం దనుపుచుఁ, గ్రమంబున దేహమోక్షణంబు సేయుదు' నని యప్పడు. 61

విశేషం: అని= ఆ ప్రకారంగా; నిశ్చయించి; గొంతిని= కుంతిని; మాద్రినిన్= మాద్రిని; చూచి; మీరలు; ఇందున్+ఉండి= ఇచ్చట వసించి; నవయక= కృశించిపోక; హస్తి, పురంబునకున్= హస్తినాపురికి; చని= వెళ్ళి; నా, తపస్+వృత్తి, ఉనికి= నేను తపోవృత్తిస్వీకరించే విషయాన్ని; రాజునకున్= ధృతరాష్ట్రునకు; సత్యవతీదేవికి= సత్యవతీదేవికి; భీష్మనకున్= భీష్మునికి; విదురునకున్; కౌసల్యలకు= అంబిక, అంబాలికలకు; వృద్ధ= వృద్ధులకు; పురోహిత= పురోహితులకు; బ్రాహ్మణులకున్= విప్రులకు; చెప్పి= తెలిపి; అందు+ ఉండుండు= అక్కడనే ఉండండి; అనినన్= అని చెప్పగా; వారలు= వారు (కుంతి, మాద్రి); బాష్ప, పూరిత, నయనలు+అయి= కన్నీటితో నిండిన కళ్ళు కలవారై; ఇట్టి, ఉగ్ర, తపంబు= ఇటువంటి భయంకరమైన తపస్సు; విడిచి= వీడి; మమ్మున్, విడువని, అట్టి, ఆశ్రమంబునన్+ఉండి= మమ్మల్ని విడిచిపెట్టనటువంటి ఆశ్రమంలో ఉండి; తపంబు, చేయునది= తపస్సు చేయండి; ఏము= మేము; నిన్నున్; విడిచి; పోవన్, ఓపము= పోలేము; మమ్ముః; విడిచితి+ఏని= వదలివేసితివా; ఇప్పుడు+అ= ఈ క్షణమే; ప్రాణంబులన్, విడుతుము; అనినన్= అనగా; వారల= వారి యొక్క; నిశ్చయంబు= నిర్ణయము; ఎఱింగి= తెలిసికొని; అట్లు+ఏని= అట్లా అయితే; నా. ఒద్దన= నాదగ్గరే; ఉండుండు= ఉండండి; ఏను= నేను; వానప్రస్థ+ఆశ్రమంబునన్= వనములో వసించు ఆశ్రమధర్మముచేత; వల్కలంబులు= నారచీరలు; కట్టి; రేపును= ఉదయం; మాపును= సాయంకాలం; మధ్య+అహ్నంబు, అప్పుడును= మధ్యాహ్న సమయమునకూడ; స్నానంబు, చేసి= స్నానముగావించి; వేల్చుచున్= హోమం చేస్తూ; కంద, మూల; ఫల+అశనుండను+ఐ= గడ్డలు, వేళ్ళు, పళ్ళు ఆహారంగా కలవాడనై; పితృదేవతలన్= పితృదేవతలను; వాక్, సలిల, వన్య, ఫలంబులన్= మాటలతో, నీళ్ళతో, అడవిలో ఉండే పళ్ళతో; తనుపుచున్= తృప్తిపెట్టుతూ; క్రమంబున; దేహ, మోక్షణంబు= శరీరాన్ని విడువటం; చేయుదును= చేస్తాను; అని= అని చెప్పి; అప్పుడు.

తాత్పర్యం: అని నిశ్చయించి పాండురాజు కుంతిని, మాద్రిని చూచి 'మీరు ఇక్కడే ఉండి కృశించి పోక హస్తినాపురం వెళ్ళి, నేను తపోవృత్తిలో ఉండటాన్ని ధృతరాష్ట్రునికి, సత్యవతికి, భీష్మునికి, విదురునికి, తల్లులకు, వృద్ధులకు, పురోహితులకు, బ్రాహ్మణులకు చెప్పి అక్కడ ఉండండి' అని చెప్పగా వారు కంటతడిపెట్టి - 'ఈ విధమైన భయంకరతపస్సు మాని మాతోకూడ ఆశ్రమంలో ఉండి తపస్సు చేయండి. మేము మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళలేం. మీరు మమ్మల్ని వదలితే ఇప్పుడే ప్రాణాలు విడుస్తాం' అనగా, వారినిర్ణయం తెలిసికొని, 'అట్లా అయితే మీరు నా దగ్గరే ఉండండి. నేను వానప్రస్థాశ్రమంలో నారచీరలు కట్టి ఉదయం, సాయంకాలం, మధ్యాహ్నం స్నానం చేసి హోమం చేస్తూ కందమూలాలు, ఫలాలు ఆహారంగా తీసికొని, పితృదేవతలను మాటలతో, నీళ్ళతో, ఫలాలతో తృప్తిపరుస్తూ క్రమంగా శరీరాన్ని విడుస్తాను' అని అప్పుడు.

విశేషం: ఆశ్రమాలు నాలుగు. అవి - బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం. గృహస్థాశ్రమాన్ని వదలి వనంలోనే నివసిస్తూ తపస్వియై నియమజీవితాన్ని సాగించే ఆశ్రమం (జీవనవిధానం) వానప్రస్థం. వానప్రస్థంలో భార్యలతో కలిసి జీవించవచ్చును. సన్న్యాసంలో ఆ అవకాశం లేదు. అందువలననే చాలామంది రాజులు వానప్రస్థాశ్రమంలోనే తనువులు చాలిస్తారు.

పృథ్వి.

> **అమూల్య మణి భూషణంబులు గజాశ్వ బృందంబులున్**
> **సమృద్ధ ధన ధాన్యరాసులుఁ బ్రశస్తగోవర్గముం**
> **గ్రమంబునను భూసురేశుల కగణ్యపుణ్యార్థి యై**
> **యమర్త్యనిభుఁ డిచ్చెఁ బాండువిభుఁ డత్యుదారస్థితిన్.** 62

ప్రతిపదార్థం: అమూల్య, మణి, భూషణంబులు= వెలలేని (అనగా ఎంతో విలువైన) రత్నాల సొమ్ములు; గజ+అశ్వ, బృందంబులున్= ఏనుగుల, గుర్రాల, సమూహాలు; సమృద్ధ, ధన, ధాన్య, రాసులున్= అధికమైన ధనరాసులు, ధాన్యరాసులు; ప్రశస్త, గోవర్గమున్= శ్రేష్ఠమైన ఆవులసమూహాన్ని; అమర్త్య, నిభుఁడు= దేవతలతో సమానుడైనవాడు; పాండు, విభుఁడు= పాండురాజు; అగణ్య, పుణ్య+అర్థి+ఐ= లెక్కకు మించిన పుణ్యాన్ని కోరినవాడై; అతి+ఉదార, స్థితిన్= మిక్కిలి ఎక్కువగా ఉదారమైన స్థితిచే; భూసుర+ఈశులకు= బ్రాహ్మణశ్రేష్ఠులకు; ఇచ్చెన్= ఇచ్చాడు.

తాత్పర్యం: దేవతలతో సమానుడైన పాండురాజు, అపరిమిత మైన పుణ్యాన్ని కోరి, మిక్కిలి ఉదారంగా బ్రాహ్మణ శ్రేష్ఠులకు ఎంతో విలువైన రత్నాల సొమ్ములను, ఏనుగులను, గుఱ్ఱాలను, ధనరాసులను, ధాన్యరాసులను, శ్రేష్ఠమైన ఆవులను ఇచ్చాడు.

విశేషం: పృథ్వీ వృత్తపాదంలో 17 అక్షరా లుంటాయి. జ, స, జ, స య, లగ - అనే గణాలు వరుసగా ప్రతిపాదంలోనూ క్రమంగా వస్తాయి. 12వ అక్షరం యతిస్థానం. ప్రాస నియతి ఉన్నది. ఆంధ్రభారతంలో ఈ వృత్తాన్ని నన్నయమాత్రమే 5 సార్లు ప్రయోగించాడు. "సాక్షేప క్రోధ ధిక్కారే పరం పృథ్వీ భరక్షమా" అనే క్షేమేంద్రుని మతానికి చెందినవాడు నన్నయ. సంపదలపై తీవ్రమైన వ్యతిరేకభావంతో విరివిగా విప్రులకు దానం చేయటం ఈ వృత్తంలో వర్ణితం. (సంపా.)

వ. మఱియుం గల వస్తువు లెల్లను ధృతరాష్ట్రున కిచ్చి పుచ్చి, మమత్వాహంకారవిముక్తుండై, ధర్మపత్ను లయ్యిరువురుఁ దనయట్ల తపస్వినులై తోడరా నుత్తరాభిముఖుండై యరిగి, నాగశైలంబును జైత్రరథంబును బారిషేణంబును హిమవంతంబునుం గడచి, సురసిద్ధసేవితం బయిన గంధమాదనంబునం గొండొక కాలం బుండి, యింద్రద్యుమ్నం బను కొలనును హంసకూటంబును నతిక్రమించి. 63

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; కల, వస్తువులు+ఎల్లను= ఉన్నవస్తువులన్నీ; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రునికి; ఇచ్చి, పుచ్చి= ఇచ్చి పంపి; మమత్వ+అహంకార, విముక్తుండు+ఐ= మమకారంచేత, అహంకారంచేత విడువబడినవాడై; ధర్మ పత్నులు= ధర్మనిర్వహణకోసం అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకొన్న భార్యలు; ఆ+ఇరువురున్= ఆ ఇద్దరు; తన, అట్లు+అ= తనవలె; తపస్వినులు+ఐ= తపస్సు చేసేవారై; తోడరాన్= వెంటరాగా; ఉత్తర+అభిముఖుండు+ఐ= ఉత్తరదిశవైపు ముఖం కలవాడై; అరిగి= వెళ్ళి; నాగశైలంబును; చైత్రరథంబును; పారిషేణంబును; హిమవంతంబునున్- ఆయా పేర్లుగల ప్రదేశాలను; కడచి= దాటి; సుర, సిద్ధ, సేవితంబు+అయిన= దేవతలచేత, సిద్ధులచేత సేవింపబడినదైన; గంధమాదనంబునన్= గంధమాదన పర్వతంమీద; కొండు+ఒక, కాలంబు= కొంతకాలం; ఉండి= వసించి; ఇంద్రద్యుమ్నంబు+అను= ఇంద్రద్యుమ్నము అను పేరుగల; కొలనును= సరస్సును; హంసకూటంబును= హంసకూటము అనుదానిని, అతిక్రమించి= దాటి.

తాత్పర్యం: ఇంకా ఉన్నవస్తువు లన్నీ ధృతరాష్ట్రునికి ఇచ్చి పంపి, మమకారాన్ని, అహంకారాన్ని విడిచి, తన ధర్మపత్నులు కుంతీమాద్రులు తనవలె తాపసవృత్తిని స్వీకరించి వెంటరాగా, ఉత్తరదిశవైపు పయనించి, నాగశైలాన్ని, చైత్రరథాన్ని, పారిషేణాన్ని, హిమవంతాన్ని దాటి, దేవతలు, సిద్ధులు సేవించే గంధమాదనంమీద కొంతకాలం ఉండి, ఇంద్రద్యుమ్నం అనే కొలనును, హంసకూటాన్ని దాటి వెళ్లి.

పాండురాజు శతశృంగంబునఁ దపోవృత్తి నుండుట (సం. 1-111-1)

మ. యతిసంఘంబుల సంగతిన్ దురితకర్మాపేతుఁడై యేఁగి సం
తతసిద్ధామరయక్ష సేవితసముద్యచ్ఛృంగ మై యున్న యా
శతశృంగం బను పర్వతంబున శుభాచారుండు నిత్యవ్రతో
ద్యతుఁ డై ఘోరతపంబు సేసె మునిబృందం బద్భుతం బందఁగన్. 64

ప్రతిపదార్థం: యతి, సంఘంబుల, సంగతిన్= మునుల సమూహాల సహవాసంతో; దురిత, కర్మ+అపేతుఁడు+ఐ= పాపకర్మలనుండి తొలగినవాడై; ఏఁగి= వెళ్ళి; సంతత, సిద్ధ+అమర, యక్ష, సేవిత, సముద్యత్+శృంగము+ఐ= ఎల్లప్పుడు సిద్ధులచేత, దేవతలచేత, యక్షులచేత సేవించబడిన మిక్కిలి ఎత్తైన శిఖరాలు కలదై; ఉన్న; ఆ శత, శృంగంబు= ప్రసిద్ధమైన శతశృంగము; అను, పర్వతంబున= అను పేరుగల కొండయందు; శుభ+ఆచారుండు= శుభమైన నడవడి కలవాడు; నిత్య, వ్రత+ఉద్యతుఁడు+ఐ= ఎడతెగని వ్రతాలమీద పూనిక కలవాడై; ముని, బృందంబు= మునులసమూహం; అద్భుతంబు+ అందఁగన్= ఆశ్చర్యపడేటట్లు; ఘోర, తపంబు; = భయంకరమైన తపస్సు; చేసెన్.

తాత్పర్యం: పాండురాజు మునులతో కలిసి పాపకర్మలకు దూరమై, ఎప్పుడూ సిద్ధులు, దేవతలు, యక్షులు సేవించే ఎత్తైన శిఖరాలు కల శతశృంగ మనే పర్వతంమీద (శుభమైన) మంగళకరమైన నడవడితో, ఎడతెగని వ్రతాలతో, మునులంతా ఆశ్చర్యపడేటట్లు ఘోరమైనతపస్సు చేస్తూ ఉన్నాడు.

వ. ఇట్లు శతశృంగంబున నుత్తరభాగంబునందుఁ దపంబు సేయుచు బ్రహ్మఋషి సమానుండై, దివ్యవిమానంబు లెక్కివచ్చుచుం బోవుచున్న దేవగణంబులచేత సంకీర్ణం బైన స్వర్గమార్గంబున నుత్తరాభిముఖు లై యూర్ధ్వలోకంబున కనాయాసంబున నరిగెడు మునిసహస్రంబుం జూచి, 'మీర లెందులకుఁ బోయెద'రని యడిగిన నప్పాండురాజునకు వార లి ట్లనిరి. 65

ప్రతిపదార్థం: ఇట్లు; శతశృంగంబునన్= శతశృంగపర్వతమున; ఉత్తరభాగంబునందున్= ఉత్తరంవైపు; తపంబు; చేయుచున్; బ్రహ్మ, ఋషి, సమానుండు+ఐ= బ్రహ్మర్షులతో సమానమైనవాడై; దివ్య, విమానంబులు= దేవతలు ఎక్కి తిరుగు రథములు; ఎక్కి= ఎక్కి; వచ్చుచున్, పోవుచు+ఉన్న= వస్తూపోతూ ఉన్నట్టి; దేవ, గణంబులచేత= దేవతలసమూహంతో; సంకీర్ణంబు+ఐన= నిండిన; స్వర్గ, మార్గంబునన్= దివి యొక్కదారిలో; ఉత్తర+అభిముఖులు+ఐ= ఉత్తరదిశవైపు ముఖాలు కలవారు అయి; ఊర్ధ్వ, లోకంబునకున్= స్వర్గానికి; అనాయాసంబునన్= శ్రమలేకుండ; అరిగెడు= వెళుతున్న; ముని సహస్రంబున్= వెయ్యిమంది మునులను; చూచి; మీరలు; ఎందులకున్; పోయెదరు; అని అడిగినన్= అని అడుగగా; ఆ+పాండురాజునకున్= ఆ పాండురాజుతో; వారలు= వారు; ఇట్లు, అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా శతశృంగపర్వతానికి ఉత్తరభాగంలో తపస్సు చేస్తూ బ్రహ్మర్షులతో సమానమైనవాడై, దివ్య విమానా లెక్కి వస్తూ పోతూ ఉండే దేవతాసమూహాలతో నిండిన స్వర్గమార్గంలో, ఉత్తరదిక్కుగా స్వర్గలోకానికి శ్రమ లేకుండా వెళ్ళుతున్న వెయ్యిమందిమునులను చూచి, 'మీరు ఎక్కడికి పోతున్నా'? రని అడుగగా, ఆ పాండురాజుతో వారు ఇట్లా అన్నారు.

క. అమవస గావున నేఁ డ క్కమలజుఁ గొలువఁగ మహర్షిగణములు పితృసం
ఘములును బోదురు బ్రహ్మం । డమునం గలవార లం దొడంగూడంగన్. 66

విశేషం: నేఁడు= ఈ రోజు; అమవస= అమావాస్య; కావున= కాబట్టి; ఆ+కమలజున్= పద్మంనుండి పుట్టిన ఆ బ్రహ్మదేవుడిని; కొలువఁగన్= సేవించటానికి; మహర్షి, గణములు= మహర్షుల సమూహాలు; పితృ, సంఘములును= పితృదేవతల సమూహాలు; బ్రహ్మండమునన్= విశ్వంలో; కల, వారలు= ఉండేవారు; అందు=ఆ బ్రహ్మలోకంలో; ఒడన్+కూడంగన్= చేరటానికి; పోదురు= పోతూఉన్నారు.

తాత్పర్యం: ఈ రోజు అమావాస్య. అందువలన బ్రహ్మదేవుడిని సేవించడానికి మహర్షులసమూహాలు, పితృదేవతల సమూహాలు, బ్రహ్మండంలో ఉన్నవాళ్ళంతా ఆ బ్రహ్మలోకం చేరటానికి పోతారు.

విశేషం: అమావాస్య పితృదినంగా ప్రసిద్ధం.

వ. 'అది కారణంబుగా నేమును బ్రహ్మలోకంబునకుం బోయెద' మనిన నమ్మునుల పిఱుంద భార్యాద్వయసహితుండై సమవిషమప్రదేశంబులం జనుచున్న య ప్పాండురాజుం జూచి ఋషు లి ట్లనిరి. 67

విశేషం: అది, కారణంబుగాన్= ఆ కారణంగా; ఏమును= మేముకూడా; బ్రహ్మ, లోకంబునకున్; పోయెదము; అనన్=అనగా; ఆ+మునుల; పిఱుంద= వెనుక; భార్యా, ద్వయ, సహితుండు+ఐ= భార్యల జంటతో కూడినవాడు అయి; సమ, విషమ, ప్రదేశములన్= సమంగా, మిట్టపల్లాలుగా ఉన్న భూములలో; చనుచు+ఉన్న= వెళ్ళుతున్న; ఆ+పాండురాజున్; చూచి; ఋషులు; ఇట్లు+అనిరి= ఈ విధంగా అన్నారు.

తాత్పర్యం: 'ఆ కారణంగా మేము బ్రహ్మలోకానికి పోతున్నాం' అని అనగా, ఆ మునుల వెనుక భార్య లిద్దరితో సమంగానూ, మిట్టపల్లాలుగానూ ఉన్న భూమిమీద పోతున్న ఆ పాండురాజును చూచి ఋషులు ఇట్లా అన్నారు.

క. వీర లతిలలిత మృదులా । కారలు, గిరివిషమగహనగహ్వరముల రా
నేరరు గావున నిట చను । దేరక మీ రుండుఁ డివియు దేవపథంబుల్. 68

ప్రతిపదార్థం: వీరలు= ఈ కుంతీమాద్రులు; అతి, లలిత, మృదుల+ఆకారలు= మిక్కిలి మనోహరం, సుకుమారం అయిన ఆకారాలు కలవారు; గిరి, విషమ, గహన, గహ్వరములన్= కొండలలో మిట్టపల్లాలై చొరశక్యం కాని గుహలలో; రానేరరు= రాలేరు; కావునన్; ఇట= ఇచ్చటనుండి; చనుదేరక= రాకుండ; మీరు; ఉండుఁడు; ఇవియు= విశేషించి ఇవి; దేవ, పథంబుల్= దేవలోకానికి వెళ్ళే దారులు.

తాత్పర్యం: నీ భార్యలు మిక్కిలి సుకుమారమైన శరీరాలు కలవాళ్ళు. వీళ్ళు కొండలలో మిట్టపల్లాలై చొర శక్యం కాని గుహలలో రాలేరు. మీరు ఆగండి. విశేషించి ఇవి దేవమార్గాలు.

విశేషం: నీ భార్యలు సుకుమారశరీరాలు కలవారు; మిట్టపల్లాలతో చొరశక్యంకాని ఈ కొండగుహలలో రాలేరు- అనటం సమంజసమే. కాని, తాము వెళ్తూ మీరు ఆగండి; ఇవి దేవమార్గాలు అనడంలో - ఈ మార్గంలో వచ్చే యోగ్యత మీకు లేదనే అంశాన్ని సూక్ష్మాతిసూక్ష్మంగా పాండురాజుమనస్సు నొవ్వకుండా మునులు ధ్వనింపచేశారు. పాండురాజుకు తప స్సున్నది. సంతానం లేదు. సంతానహీనులకు దేవమార్గంలో ప్రవేశించడానికి అర్హత లేదు. ఈ విషయాన్ని పాండురాజు గ్రహించాడు.

క. అనిన విని నరుల కక్కడఁ జనఁబోలమి యెఱిఁగి పాండుజనపాలకుఁ డి
ట్లనియెను 'స్వర్గద్వారం । బనపత్యులు గాన నోపరటె మును లయ్యున్.' 69

ప్రతిపదార్థం: అనిన, విని= అని మునులు చెప్పగా విని; నరులకు; అక్కడన్; చనన్+పోలమి= వెళ్ళటం సాధ్యం కాకుండటాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; పాండు, జనపాలకుఁడు= పాండురాజు; ఇట్లు+అనియెను; అనపత్యులు= సంతానం లేనివారు; మునుల్+అయ్యున్= ఋషులైనప్పటికి; స్వర్గ, ద్వారంబు= స్వర్గముయొక్క వాకిలి; కానన్= చూచుటకు; ఓపరు+అటె= చూడలేరట కదా.

తాత్పర్యం: ఋషు లన్న మాటలు విని, మానవు లక్కడికి పోలే రని తెలిసికొని పాండురాజు - 'సంతానం లేనివాళ్ళు మును లైనప్పటికీ స్వర్గద్వారాన్ని చూడలేరటకదా' అన్నాడు.

విశేషం: 68వ పద్యంలో వ్యంగ్యంగా చెప్పబడిన అంశం ఈ పద్యంలో వాచ్యం కావటంచేత అత్యంతతిరస్కృతవాచ్యధ్వని ఇక్కడ గుణీభూత మయింది. (సంపా.)

వ. 'అపుత్త్రస్య గతి ర్నాస్తి' యను వేదవచనంబుం గలదు గావున నే నపుత్త్రకుండ నేమి సేయుదు? ననిన మునులును గరుణించి యోగదృష్టి ననాగతం బెఱింగి. 'నీ వపుత్త్రకుండవు గావు; దైవాధిష్ఠితం బైన సంతానంబు నీకు ధర్మానిలశక్రాశ్వినులవరంబున నగు; నక్షయలోకంబులుం బడయుదువు గావున సంతానార్థంబు యత్నంబుఁ సేయు' మనిన విని పాండురా జాత్మగతంబునఁ 'బురుషుండు పుట్టుచుండి దేవఋషి పితృమనుష్యులఋణంబులు నాలుగింటితోడం బుట్టి యథాకాలవిధుల వానివలన విముక్తుండు గావలయు; నట్లుగాని వానికిఁ బుణ్యలోకంబులు

లేవు; యజ్ఞంబులంజేసి దేవతలఋణంబును, దపస్స్వాధ్యాయ బ్రహ్మచర్యవ్రతంబులంజేసి ఋషుల ఋణంబును, శ్రాద్ధపుత్త్రలాభంబులం జేసి పితరుల ఋణంబును, నానృశంస్యంబునం జేసి మనుష్యుల ఋణంబునుం బాపవలయు; నందుఁ బితరుల ఋణంబు దక్కఁ దక్కిన మూఁడుఋణంబులవలన విముక్తుండ నయితి. 70

విశేషం: అపుత్రస్య= బిడ్డలులేనివానికి; గతిః= పుణ్యలోకం; నాస్తి= లేదు; అను; వేద, వచనంబున్= వేదవాక్యంకూడ; కలదు, కావున; నేనున్= నేను; అపుత్రకుండను= సంతానంలేనివాడిని; ఏమి చేయుదును; అనిన= అనగా; మునులును; కరుణించి= దయదలచి; యోగ, దృష్టిన్; అనాగతంబు= రాబోవుదానిని; ఎఱింగి= గ్రహించి; నీవు; అపుత్రకుండవు= పుత్రులు లేనివాడివి; కావు; దైవ+అధిష్ఠితంబు+ఐన= దేవతలచేత ప్రభావితం చేయబడిన; సంతానంబు; నీకున్; ధర్మ+అనిల, శక్ర+అశ్వినుల, వరంబునన్= యమునియొక్క, వాయువుయొక్క, ఇంద్రునియొక్క, అశ్వినీదేవతలయొక్క వరంచేత; అగున్= కలుగుతుంది; అక్షయ, లోకంబులున్= నాశం లేనిలోకాలు - అనగా పుణ్యలోకాలు; పడయుదువు= పొందుతావు; కావునన్, సంతాన+అర్థంబు= సంతానంకొరకు; యత్నంబు; చేయుము; అనినన్= అనగా; విని; పాండురాజు; ఆత్మగతంబునన్= మనస్సులో; పురుషుండు; పుట్టుచుండి; దేవ, ఋషి, పితృ, మనుష్యుల, ఋణంబులు; నాలుగింటితోడన్; పుట్టి; యథాకాల, విధులున్= ఆ యా కాలాల్లో చేసే కార్యాలచేత; వానివలన= ఈ ఋణాలవలన; విముక్తుండు= విడువబడినవాడు; కావలయున్= అగును; అట్లు, కానివానికిన్= ఆ విధంగా కాని అతనికి; పుణ్యలోకంబులు; లేవు= ఉండవు; యజ్ఞంబులన్, చేసి, దేవతల, ఋణంబును; తపస్+స్వాధ్యాయ, బ్రహ్మచర్య, వ్రతంబులన్, చేసి= తపస్సుచేత, వేదాధ్యయనంచేత, బ్రహ్మచర్యవ్రతంచేత; ఋషుల, ఋణంబును; శ్రాద్ధ, పుత్రలాభంబులన్, చేసి= శ్రాద్ధాలచేత, కొడుకులను పొందటంచేత; పితరుల ఋణంబునున్; ఆనృశంస్యంబు+చేసి= అక్రూరమైన భావంచేత - అనగా దయకలిగి ఉండటంచేత; మనుష్యుల ఋణంబునున్; పాపవలయున్= పోగొట్టవలెను; అందున్= అందులో; పితరుల, ఋణంబు; తక్కన్= తప్ప; తక్కిన, మూడు, ఋణంబులవలనన్; విముక్తుండను+అయితిన్= విడువబడినవాడను అయ్యాను.

తాత్పర్యం: 'పుత్రులు లేనివారికి పుణ్యలోకం లేదు' అనే వేదవచనంకూడా ఉన్నది. నేను పుత్రులు లేనివాడిని. ఏమి చేసేది?' - అని పాండురాజు అనగా, మునులు, దయతలచి, యోగదృష్టితో ముందు జరిగేదాన్ని తెలిసికొని 'నీవు పుత్రులు లేనివాడివి కావు. యమధర్మరాజు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతల వరంతో నీకు సంతానం కలుగుతుంది. నీవు పుణ్యలోకాలు పొందుతావు. కాబట్టి సంతానంకొరకు ప్రయత్నించుము' అని చెప్పారు. అది విని పాండురాజు మనస్సులో ఇట్లా తలచాడు. 'పురుషుడు దేవ, ఋషి, పితృ, మనుష్య ఋణాలు నాలుగింటితో పుట్టి, ఆయాకాలాలలో చేయవలసిన కార్యాలచేత ఈ ఋణవిముక్తుడు కావాలి. అట్లా ఋణవిముక్తుడు కానివాడికి పుణ్యలోకాలు లేవు. యజ్ఞాలు చేసి దేవతల ఋణాన్నీ, తపస్సు, వేదాధ్యయనం, బ్రహ్మచర్యవ్రతంచేత ఋషుల ఋణాన్నీ, శ్రాద్ధాలు పెట్టి, కొడుకుల్ని కని పితృదేవతల ఋణాన్నీ, దయార్ద్రహృదయు డై మానవఋణాన్ని తీర్చుకోవాలి. నేను ఒక్క పితరులఋణం తప్ప-మిగతా మూడూ తీర్చుకొన్నాను.

విశేషం: పంచమవేదమైన మహాభారత ఆంధ్రీకరణంలో నన్నయ సందర్భోచితంగా వేదధర్మాలను వివరించడమే కాక వేదవాక్యాలను కూడా చెప్పాడు. 'అపుత్రస్య గతి ర్నాస్తి' అనే వాక్యం అటువంటిదే. 'ఋణం' శబ్దంలో ఋ వర్ణానికి బదులు రు, రి వర్ణాలు - ఋషి - రుషి - రిషి, ఋణము - రుణము - అని తాళపత్రప్రతులలో ఉండటం గమనించదగింది.

తే. దేహనాశంబుతోడన తీఱు నెల్ల। ఋణములును మఱి పితరులఋణము దేహ
నాశ మయినను దీఱదు నాకు నదియ। తక్కియున్నది యే నెట్లు దానిఁ బాతు. 71

ప్రతిపదార్థం: దేహ, నాశనంబుతోడన= శరీరం నశించిన వెంటనే; ఎల్ల, ఋణములను= అప్పులన్నీ, తీఱున్= తీరిపోతాయి; మఱి= ఇక; పితరుల, ఋణము= పితృ ఋణం; దేహ, నాశము+అయినను, తీరదు= శరీరము నాశనం అయినప్పటికి తీరిపోదు; నాకున్; అదియ; ఆ పితరుల ఋణమే; తక్కి, ఉన్నది= మిగిలి ఉన్నది; ఏను= నేను; దానిన్= దానిని; ఎట్లు, పాతున్= ఏవిధంగా తొలగించుకుంటాను.

తాత్పర్యం: శరీరం నశించిన వెంటనే అన్నిఋణాలు తీరిపోతాయి. పితరుల ఋణముమాత్రం శరీరం నశించినా తీరదు. నాకు అది ఒక్కటే మిగిలిఉన్నది. నేను దానిని ఎట్లా తీర్చుకొనగలను?

వ. అని దుఃఖించి మృగశాపంబు దలంచి, తనవలన సంతానం బయ్యెడి విధంబు లేమి యెఱింగి యొక్కనాఁ
డేకాంతంబ గొంతి కి ట్లనియె. 72

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; దుఃఖించి; మృగ, శాపంబు; తలంచి; తనవలన= తనమూలకంగా; సంతానంబు;అయ్యెడి= కానున్న; విధంబు= తీరు; లేమి= లేకపోవటాన్ని; ఎఱింగి= తెలిసి; ఒక్కనాఁడు; ఏకాంతంబు+అ= ఒంటరిగా; గొంతికి= కుంతీదేవికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని విచారించి మృగశాపాన్ని తలచికొని, తనవలన సంతానం కలిగేమార్గం లేకపోవటాన్ని తెలిసికొని, ఒకరోజు ఒంటరిగా ఉన్న కుంతితో ఈ విధంగా అన్నాడు.

ఉ. దానములం దపంబుల సదక్షిణ యజ్ఞములన్ విహీన సం
తానుల కూర్ధ్వలోక సుపథంబు లవశ్యము గావు; లబ్ధ సం
తానుల యెందుఁ బుణ్యు; లిది తథ్యము గావున నొండు దక్కి సం
తానము నాకు నయ్యెడువిధం బొనరింపుము ధర్మసంస్థితిన్. 73

ప్రతిపదార్థం: దానములన్; తపంబులన్; స, దక్షిణ, యజ్ఞములన్= దక్షిణలతో కూడిన యజ్ఞాలచేత; విహీన, సంతానులకు= సంతానం లేనివాళ్ళకి, ఊర్ధ్వ, లోక సుపథంబులు= పై లోకాలకు మంచిమార్గాలు; అవశ్యము= తప్పక; కావు= లభించవు; లబ్ధ, సంతానులు+అ= పొందబడిన సంతానం కలవాళ్ళే, ఎందున్= ఎచ్చటైనా; పుణ్యులు= పుణ్యాంకలవాళ్ళు; ఇది; తథ్యం= నిజం; కావునన్; ఒండు= ఇతరకార్యాలు; తక్కి= మాని; నాకున్; సంతానము; ధర్మ, సంస్థితిన్= ధర్మమార్గంలో; అయ్యెడు, విధంబు= కాగల తీరు; ఒనరింపుము= చేయుము.

తాత్పర్యం: దానాలు చేసినా, దక్షిణలతో యజ్ఞాలు చేసినా, సంతానం లేనివాళ్ళకు పుణ్యలోకాలు లభించవు. సంతానం కలవాళ్ళే పుణ్యవంతులు. అందువలన నీవు ఇతరకార్యా లన్నీ మాని, ధర్మమార్గంలో నాకు సంతానం కలిగేటట్లు చేయుము.

క. అనపత్యుఁడ నై జీవిం । చిన, మృతిఁ బొందినను నిర్విశేషంబ; యిహం
బును బరమును నఫలమ; గా । వున సంతతి వడయు ధర్మువున ధర్మసతీ! 74

ప్రతిపదార్థం: అనపత్యుఁడను+ఐ= బిడ్డలు లేనివాడనై; జీవించినన్= బ్రతికినను; మృతిన్+పొందినను= మరణం పొందినా; నిర్+విశేషంబు+అ= విశేషం లేదు - అనగా ఒక్కటే; ఇహంబును= ఈ లోకం; పరమును= పరలోకం; అఫలము+అ= ఫలం లేనిదే; కావున; ధర్మ, సతీ= ధర్మపత్నీ - కుంతీ! ధర్మువునన్= ధర్మంచే; సంతతి= సంతానాన్ని; పడయు= పొందుము.

తాత్పర్యం: బిడ్డలు లేనివాడినై జీవించినా, మరణించినా ఒకటే; ఇహపరలోకాలు రెండూ ఫలరహితాలే. అందుచేత నీవు ధర్మపద్ధతిలో సంతానం పొందుము.

వ. 'ఔరస క్షేత్రజ దత్తక కృత్రిమ గూఢోత్ప న్నాపవిద్ధు లను నార్వురుపుత్త్రులు బంధువులు దాయాదులు నగుదురు, కానీన సహోఢక్రీత పౌనర్భవ స్వయందత్త జ్ఞాతు లను నార్వురుపుత్త్రులు బంధువు లగుదురు గాని దాయాదులు గా; రట్టి పుత్త్రులలో నౌరసున కించుకయు తక్కువగాని తక్కటి పుత్త్రులకంటె క్షేత్రజుం డుత్కృష్టుం; డందును దేవరన్యాయ జాతుం డుత్తముం డండ్రు గావున నస్మన్నియోగంబునంజేసి ధర్మమార్గంబున క్షేత్రజులం బడసిన నేనును బుత్త్రవంతుల పుణ్యలోకంబులు వడయనేర్తు; నె ట్లనినఁ; దొల్లి గేకయరా జైన శారదండాయని పుత్త్రోత్పాదనంబునం దశక్తుం డయి తనధర్మపత్ని నీచెలియలి శ్రుతసేనం బుత్త్రార్థంబు నియోగించిన నది బ్రాహ్మణవచనంబునం బుణ్యస్నాతయై పుంసవనహోమంబు సేయించి ఋత్విజులవలన దుర్జయాదు లయిన కొడుకుల మువ్వురం బడసెఁ; బుత్త్రలాభంబున ననంతపుణ్యఫలం బగుట నది ధర్మ్యం బయిన యాచారం' బనిన విని కుంతి యి ట్లనియె. 75

ప్రతిపదార్థం: ఔరస, క్షేత్రజ, దత్తక, కృత్రిమ, గూఢ+ఉత్పన్న+అపవిద్ధులు+అను= వివాహం చేసికొన్న భార్యయందు తనకు పుట్టినవాడు, నియోగంచేత తన భార్యయందు ఇతరులవలన పుట్టినవాడు, తనకు కుమారుడుగా ఇవ్వబడిన ఇతరుల కుమారుడు, అభిమానంతో కుమారుడుగా పెంచుకొనబడినవాడు, తనభార్యయందు తనకు తెలియకుండా ఇతరులవలన జన్మించినవాడు, తల్లిదండ్రులచేత విడిచిపెట్టబడి తనదగ్గర చేరినవాడు; అను; ఆర్వురు= ఆరుగురు; పుత్త్రులు; బంధువులు; దాయాదులున్= తన సంపదలో భాగం పొందేవాళ్ళు; అగుదురు; కానీన, సహోఢ, క్రీత, పౌనర్భవ, స్వయందత్త, జ్ఞాతులు= పెళ్ళికిముందు తన భార్య కన్యగా ఉన్నప్పుడు పుట్టినవాడు, వివాహసమయానికే గర్భిణిగా ఉన్న తన భార్యకు వివాహానంతరం పుట్టినవాడు, తల్లిదండ్రులకు ధన మిచ్చి కొనబడినవాడు, భర్తచే విడువబడిన స్త్రీకి లేదా విధవకు తనచేత పుట్టింపబడినవాడు, నీకు పుత్రుడను అవుతా నని తనంతగా తాను వచ్చినవాడు, తనగోత్రంవాడు; అను; ఆర్వురు= ఆరుగురు; పుత్త్రులు; బంధువులు; అగుదురు= ఔతారు; కాని, దాయాదులు= ఆస్తిలో భాగం పంచుకొనేవారు; కారు; అట్టి, పుత్త్రులలో, క్షేత్రజుండు= నియోగంచేత తన భార్యకు ఇతరులచేత పుట్టిన కుమారుడు; ఔరసునకు= వివాహమాడిన తన భార్యయందు తనకు పుట్టినవాడికంటె; ఇంచుకయు= కొంచెం; తక్కువగాని= అల్పుడు కాని; తక్కటి= మిగిలిన; పుత్రులకంటె; ఉత్కృష్టుండు= శ్రేష్ఠుడు; అందును= అందులోనూ; దేవర, న్యాయ, జాతుండు= దేవరన్యాయంవలన పుట్టినవాడు; ఉత్తముండు; అండ్రు= అంటారు; కావునన్; అస్మత్, నియోగంబునన్, చేసి= నా ఆజ్ఞతో చేసి; ధర్మ, మార్గంబునన్= ధర్మమార్గముచేత; క్షేత్రజులన్= క్షేత్రజులను; పడసినన్= పొందినచో; నేనును= నేనుకూడా; పుత్త్రువంతుల, పుణ్యలోకంబులు= పుత్రులున్నవాళ్ళు పొందే పుణ్యలోకాలు; పడయ, నేర్తున్(నేర్చుదున్)= పొందగల్గుతాను; ఎట్లు+అనిన్= ఏ విధంగా అంటే; తొల్లి= పూర్వం; కేకయ, రాజు+ఐన; శారదండాయని; పుత్ర+ఉత్పాదనంబు; అందున్= కొడుకులను పుట్టించటంలో; అశక్తుండు+అయి= శక్తిలేనివాడై; తన, ధర్మ, పత్ని= తాను అగ్నిసాక్షిగా వివాహం చేసికొన్న భార్యను; నీ చెలియలిన్= నీ (కుంతియొక్క) చెల్లెలిని; శ్రుతసేనన్; పుత్త్ర+అర్థంబు= పుత్రుల కొరకు; నియోగించినన్= ఆజ్ఞాపించగా; అది= ఆమె; బ్రాహ్మణ= బ్రాహ్మణుల; వచనంబునన్= మాటనుబట్టి; పుణ్య, స్నాత +ఐ= పవిత్రమైన స్నానం చేసిందై; పుంసవన, హోమంబు= కొడుకు పుట్టడానికి చేసే వైదికశుభకర్మకు

సంబంధించినహోమం; చేయించి; ఋత్విజులవలనన్= యజ్ఞం చేయించే బ్రాహ్మణులవలన; దుర్జయ+ఆదులు+అయిన= దుర్జయుడు మొదలగు వారైన; కొడుకులన్; ముప్పురన్= ముగ్గురిని; పడసెన్= పొందెను; పుత్త్ర, లాభంబునన్= కొడుకులు పుట్టడంవలన; అనంత; పుణ్య, ఫలంబు+అగుటన్= అంతులేని పుణ్యం కలగటంచేత; అది= దేవరన్యాయంతో పుత్త్రులను పొందటం; ధర్మ్యంబు+ అయిన, ఆచారంబు= ధర్మంతో కూడిన ఆచారము; అనినన్= అనగా; విని; కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఔరసుడు, క్షేత్రజుడు, దత్తకుడు, కృత్రిముడు, గూఢోత్పన్నుడు, అపవిద్ధుడు అనే ఆరుగురు పుత్రులు బంధువులుమాత్రమే కాదు, ఆస్తిలో భాగస్వాములుకూడా. కానీనుడు, సహోఢుడు, క్రీతుడు, పౌనర్భవుడు, స్వయందత్తుడు; జ్ఞాతుడు అనే ఆరుగురుపుత్రులు బంధువులే, కాని, ఆస్తిలో భాగస్వాములు కారు. ఈ పుత్రు లందరిలో క్షేత్రజుడు ఔరసుడికన్నా కొంచెం తక్కువ; తక్కినవారికన్నా మిన్న. అందునా దేవరన్యాయంచేత పుట్టిన క్షేత్రజుడు ఉత్తముడు. అందువలన నీవు నా ఆజ్ఞచేత ధర్మమార్గంలో క్షేత్రజులను పొందితే పుత్రు లున్నవాళ్ళు పొందే పుణ్యలోకాలు నేను పొందుతాను. ఎట్లా అంటే - పూర్వం కేకయరాజు శారదండాయని తాను పుత్రులను పొందలేక తనధర్మపత్ని, అంటే నీచెల్లెలు శ్రుతసేనను పుత్రులకొరకు నియోగించగా, ఆమె బ్రాహ్మణులు చెప్పినట్లు పుణ్యస్నానం చేసి, పుత్రులు పుట్టటంకోసం చేసేపుంసవన హోమం చేయించి, ఋత్విజులవలన దుర్జయుడు మొదలైన ముగ్గురుకొడుకులను పొందింది. పుత్రులు పుట్టటంచేత అంతులేని పుణ్యం కలుగుతుంది. కాబట్టి దేవరన్యాయంచేత పుత్రులను పొందటం ధర్మంతో కూడిన ఆచారం' అని పాండురాజు చెప్పగా కుంతి ఇట్లా అన్నది.

విశేషం: ఆంధ్రమహాభారతంలో సంశోధితప్రతిలో ఈ క్రింది విశేషా లున్నాయి. "సంస్కృతమూలము-సంతానమును బంధుదాయాదులు, అబంధుదాయాదులు- అని రెండుగా విభజించినది. అందు బంధుదాయాదులు; (1) స్వయంజాతుఁడు (2) ప్రణీతుఁడు (3) పరిక్రీతుఁడు (4) పౌనర్భవుఁడు (5) కానీనుఁడు (6) స్వైరిణీసుతుఁడు. అబంధుదాయాదులు- (1) దత్తుఁడు (2) క్రీతుఁడు - కృత్రిముఁడు (3) స్వయందత్తుడు (4) సహోఢుఁడు (5) జ్ఞాతరేతుఁడు (6) హీనయోనిధృతుఁడు. క్షేత్రజుఁడు -అనుటకు బదులు పి.పి.ఎస్ ప్రతిలో 'క్షైత్రిక' పదము కలదు. మూలమునందు 'క్షేత్రజుఁడు' అను పేరు లేదు. ప్రణీతుఁ డనియే కలదు. "ఊఢాయామేవ ఉత్తమానుగ్రహా జ్ఞాతః ప్రణీతః" అని నీలకంఠీయవ్యాఖ్య. బంధు దాయాద, అబంధుదాయాద విభాగమునందు నన్నయ మార్పులు చేసెను. దత్తక, కృత్రిమాపవిద్ధులు - అనువారిని నన్నయ బంధుదాయాదులలో చేర్చెను. బంధుదాయాదులనుండి పరిక్రీతుఁడు, పౌనర్భవుఁడు, కానీనుఁడు - అను వీరిని తొలగించెను. హీనయోనిధృతుఁడు మూలములో అన్ని ప్రతులయందును పేర్కొనఁబడెను. ఆంధ్రమునం దీతఁడు విడువఁబడెను. షట్సంతానమును పూర్తి చేయుటకై క్రీతుఁడు, కృత్రిముఁడు వేర్వేరుగా పరిగణింపఁబడిరి. (ప్రథమసంపుటం పు.273)"

మరొక విశేషం: నన్నయ ఆపస్తంబసూత్రుడు కాబట్టి ఆపస్తంబధర్మసూత్రాలను అనుసరించి సంతానవిషయాన్ని సమీక్షించి ఉండవచ్చును. మనువు, బోధాయనుడు, గౌతముడు ద్వాదశవిధపుత్రులను పేర్కొన్నారు. వారు ఔరస, క్షేత్రజ, దత్తక,కృత్రిమ, గూఢోత్పన్న, అపవిద్ధ, కానీన, సహోఢ, క్రీత, పౌనర్భవ, స్వయందత్త, జ్ఞాతులు. ఆపస్తంబుడు ఆరుగురిని మాత్రమే వారసులుగా, దాయాదులుగా పేర్కొన్నాడు. వారిలోకూడ క్రీతుడినీ, దత్తుడినీ తిరస్కరించాడు. నన్నయ మనువు పేర్కొన్నద్వాదశ పుత్రులను పేర్కొన్నప్పటికీ ఆరుగురినే వారసులుగా నిర్ధారించాడు. ఔరసుని తరువాత క్షేత్రజుడిని నిలిపాడు. (సంపా.)

క. భరతకులశ్రేష్ఠుఁడ వయి । పరఁగిన నీ కేము ధర్మపత్నుల మయి యిం
కొరుల మనుష్యుల నంతః । కరణంబులఁ దలఁపఁ బొందఁగా నోపుదుమే? 76

ప్రతిపదార్థం: భరత, కుల, శ్రేష్ఠుఁడవు+అయి= భరతవంశంలో ఉత్తముడవు అయి; పరఁగిన= ఒప్పిన; నీకున్= నీకు; ఏము= మేము; ధర్మపత్నులము+అయి= అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యలమై; ఇంకన్= మరి; ఒరుల, మనుష్యులన్= ఇతర పురుషులను; అంతఃకరణంబులన్= మనస్సులలో; తలఁపన్= తలంచుటకు; పొందగా= కలవడానికి; ఓపుదుమె= ఒప్పుకొందుమా? (ఒప్పుకొన మని భావం.)

తాత్పర్యం: భరతవంశంలో శ్రేష్ఠుడ వైన నీకు ధర్మపత్నుల మై, పరపురుషులను మనస్సులలో తలవటానికి, కలవటానికి ఒప్పుకోగలమా?

వ. 'భవత్ప్రసాదంబున మాయందుఁ బుత్త్రోత్పత్తి యగు నె ట్లనిన; దీని కనుగుణం బయినది యొక్క పుణ్యకథఁ దొల్లి పౌరాణికులవలన నా వినిన దానిం జెప్పెదఁ జిత్తగించి విను' మని పాండురాజునకుఁ గుంతి యి ట్లనియె. 77

ప్రతిపదార్థం: భవత్+ప్రసాదంబునన్= నీ అనుగ్రహంతో; మాయందున్; పుత్త్ర+ఉత్పత్తి, అగున్= కొడుకులు పుట్టటం జరుగుతుంది.; ఎట్లు+అనిన= ఏ విధంగా అంటే; దీనికిన్; అనుగుణంబు+అయినది= తగినది; ఒక్క, పుణ్య, కథ= ఒక పుణ్యకథ; తొల్లి= పూర్వం, పౌరాణికులవలన= పురాణాలు చెప్పేవారివలన; నా, వినిన, దానిన్= నేను విన్న దానిని; చెప్పెదన్= తెలుపుతాను; చిత్తగించి= మనస్సు ఉంచి; వినుము; అని; పాండురాజునకున్; కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీదయవలన మాకు కొడుకులు కల్గుతారు. ఎట్లా అంటే దీనికి తగ్గ ఒకపుణ్యకథ పూర్వం పౌరాణికులు చెప్పగా విన్నాను. మనస్సు నిలిపి వినండి' అని పాండురాజుతో కుంతి ఇట్లా అన్నది.

వ్యుషితాశ్వుండను రాజు వృత్తాంతము (సం. 1-112-7)

చ. అతుల బల ప్రతాప మహిమాధికుఁ డై వ్యుషితాశ్వుఁ డన్మహీ
పతి నయధర్మతత్పరుఁడు పౌరవవంశజుఁ డశ్వమేధముల్
శత మొనరించుచుండి భుజశక్తి జయించె మహీశులం బ్రవ
ర్ధితయశుఁ డై ప్రతీచ్యుల నుదీచ్యులఁ బ్రాచ్యుల దాక్షిణాత్యులన్. 78

ప్రతిపదార్థం: అతుల, బల, ప్రతాప, మహిమ+అధికుఁడు+ఐ= సాటిలేని బలపరాక్రమాల ప్రభావంచేత గొప్పవాడై; నయ, ధర్మ, తత్పరుఁడు= నీతి, ధర్మాలమీద ఆసక్తికలవాడు; పౌరవ, వంశజుఁడు= పూరువువంశంలో పుట్టినవాడు; వ్యుషిత+ అశ్వుఁడు= వ్యుషితాశ్వుడు; అన్+మహీ, పతి= అనే రాజు; అశ్వమేధముల్= అశ్వమేధయాగములు; శతము= వంద, ఒనరించు+ఉండి= చేస్తూ ఉండి, భుజ, శక్తిన్= భుజబలంతో; ప్రవర్ధిత, యశుఁడు+ఐ= పెంపొందింపబడిన కీర్తి కలవాడై; ప్రతీచ్యులన్= పడమటి దిక్కులో ఉన్నవాళ్ళను; ఉదీచ్యులన్= ఉత్తరాన ఉన్నవాళ్ళను; ప్రాచ్యులన్= తూర్పున ఉన్నవాళ్ళను; దాక్షిణాత్యులన్= దక్షిణాన ఉన్నవాళ్ళను; మహి+ఈశులన్= రాజులను; జయించెన్.

తాత్పర్యం: సాటిలేని బలపరాక్రమాలతో అందరిని మించినవాడై, నీతిలో, ధర్మంలో ఆసక్తి కలిగి, పూరువంశంలో జన్మించిన వ్యుషితాశ్వు డనే మహారాజు అశ్వమేధయాగాలు వంద చేసి, భుజబలంతో పెంపొందిన కీర్తి కలవాడై నాలుగుదిక్కులలో ఉన్న రాజులను జయించాడు.

విశేషం: వ్యుషితాశ్వుడు బలపరాక్రమాలలో, దిగ్విజయాలలో పాండురాజును పోలి ఉండటంచేత కుంతికి అతని వృత్తాంతం జ్ఞాపకం వచ్చినట్లు ధ్వని. పాండురాజుయొక్క దిగ్విజయప్రశంసలోను, వ్యుషితాశ్వునిప్రశంసలోను నన్నయ చంపకమాలను వినియోగించటం విశేషం. వృత్తరచనాశిల్పం. చూడు. 39, 42 (సంపా.)

క. ఆతని యజ్ఞంబునఁ బురు । హూత పురస్సర మరుద్గణోత్తము లధిక
ప్రీతిఁ జనుదెంచి హవ్యము । లాతత హస్తములఁ గొందు రగ్నిముఖమునన్. 79

ప్రతిపదార్థం: అతని= ఆ రాజుయొక్క; యజ్ఞంబునన్; పురుహూత, పురఃసర, మరుత్+గణ+ఉత్తములు= దేవేంద్రుడు మొదలైన దేవతా శ్రేష్ఠులు; అధిక, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; చనుదెంచి= వచ్చి; అగ్ని, ముఖమునన్= అగ్నిదేవునిమూలాన; హవ్యములు= హోమంలో వేసిన ఆహుతులు; ఆతత, హస్తములన్= చాపబడిన చేతులతో; కొందురు= తీసికొంటారు.

తాత్పర్యం: ఆ వ్యుషితాశ్వునియజ్ఞంలో దేవేంద్రుడు మొదలైన దేవతాశ్రేష్ఠులు మిక్కిలిప్రీతితో వచ్చి, చేతులు చాచి అగ్నిదేవునిముఖంగా ఆహుతులు గైకొంటారు.

వ. అట్టి వ్యుషితాశ్వుండు కాక్షీవతి యైన భద్ర తన భార్యయందు ననవరత కామాసక్తిం జేసి యక్ష్మ రుజాక్రాంతుం డయి యస్తమించిన నది పుత్త్రాలాభదుఃఖిత యయి పతివియోగంబు సహింప నోపక. 80

విశేషం: అట్టి, వ్యుషిత+అశ్వుండు= వ్యుషితాశ్వుడు అను రాజు; కాక్షీవతి+ఐన; భద్ర; అను; తన భార్యయందున్= తన పత్నిపై; అనవరత, కామ+ఆసక్తిన్+చేసి= ఎడతెగని కామంమీద ఆసక్తితో; యక్ష్మ; రుజా+ఆక్రాంతుండు+అయి= క్షయరోగంచే ఆక్రమింపబడిన వాడై; అస్తమించినన్= మరణించగా; అది= అతని భార్య అయిన భద్ర; పుత్త్ర+అలాభ, దుఃఖిత+అయి కొడుకులను పొందలేక పోవటంతో దుఃఖించినదై; పతి, వియోగంబును= భర్తను కోల్పోవటాన్ని; సహింపన్+ఓపక= ఓర్చుకోలేక.

తాత్పర్యం: అటువంటి వ్యుషితాశ్వుడు తనభార్యమీద మితిమీరినకామంతో ఆసక్తుడై వ్యవహరించి క్షయ రోగగ్రస్తుడై మరణించగా, అతనిభార్య భద్ర కొడుకులు లేకపోవటంతో దుఃఖించి, భర్తను కోల్పోవటాన్ని సహించలేక.

తే. పతియులేక జీవించు నయ్యతివ కయిన । జీవనముకంటె దానికిఁ జావ లగ్గు
కాన నీతోన చనుదెంతుఁ గాని నిన్నుఁ । బాసి యిం దుండఁగా నోప వాసవాభ ! 81

విశేషం: పతియు= భర్త; లేక; జీవించు= జీవించే; ఆ+అతివకు= ఆ స్త్రీకి; అయిన= ఏర్పడిన; జీవనముకంటె= బతకటంకన్నా; దానికిన్= ఆ స్త్రీకి; చావు+అ, లగ్గు= చావే మేలు; కాన; నీతోన; చనుదెంతున్= వస్తాను; కాని; వాసవ+ఆభ= దేవేంద్రుని వంటి తేజస్సుకలవాడా!; నిన్నున్; పాసి= విడిచి; ఇందున్= ఈ లోకంలో; ఉండన్+కాన్= ఉండటానికి; ఓపన్= ఇష్టపడను.

తాత్పర్యం: భర్తలేకుండా జీవించటంకన్నా స్త్రీ చావటమే మేలు. అందువలన నేను నీతో వస్తాను కాని, ఇక్కడ ఉండలేను.

వ. 'కాదేని నాకు నీ పుణ్యమూర్తిప్రతిమూర్తులైన పుత్త్రులం బ్రసాదింపు' మని దర్భాస్తరణశాయిని యై యాశవంబుఁ గౌఁగిలించుకొని విలాపించుచున్న దానికి వాని శరీరమුననుండి యొక్క దివ్యవాణి యి ట్లనియె. 82

ప్రతిపదార్థం: కాదు+ఏని= అట్లా కాకపోతే; నాకున్; నీ, పుణ్య, మూర్తి, ప్రతిమూర్తులు+ఐన= నీ పవిత్రమైన రూపం కలవారైన; పుత్రులన్= కుమారులను; ప్రసాదింపుము= దయతో ఇమ్ము; అని= ఆ విధంగా తెలిపి; దర్భ+ఆస్తరణ, శాయిని+ఐ= దర్భలపరుపుమీద పడుకొన్నది అయి; ఆ, శవంబున్= ఆ భర్తశవాన్ని; కౌగలించుకొని; విలపించుచు+ఉన్న= ఏడుస్తున్న; దానికి= ఆ భద్రకు; వాని, శరీరముననుండి= ఆ వ్యుషితాశ్వునిశరీరంనుండి; ఒక, దివ్య, వాణి= ఒక దేవతాసంబంధ మైన వాక్కు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అట్లా కాకపోతే నాకు నీపవిత్రరూపంవంటి రూపం కల కొడుకులను ప్రసాదించు' అని దర్భల పరుపుమీద పడుకొని భర్తశవాన్ని కౌగలించుకొని ఏడుస్తూ ఉండగా, ఆమెతో అతని శరీరంనుండి ఒక దివ్యవాణి ఇట్లా అన్నది.

క. విదితముగ నీకు వర మి । చ్చెద నోడకు లెమ్ము; గుణవశీకృతభువనుల్
సదమలచరిత్రు లాత్మజు । లుదయింతురు వగవకుండు ముదితేందుముఖీ! 83

ప్రతిపదార్థం: విదితముగ= ప్రసిద్ధంగా; నీకు; వరము; ఇచ్చెదన్; ఓడకు= భయపడకుము, లెమ్ము; ఉదిత+ఇందు, ముఖీ= ఉదయించిన చంద్రునివంటి ముఖంకలదానా; గుణ, వశీ, కృత, భువనుల్= గుణాలచేత వశం చేసుకోబడిన లోకాలు కలవాళ్ళు; సత్+అమల, చరిత్రులు= ఉత్తమమైన నిర్మలమైన నడవడి కలవాళ్ళు; ఆత్మజులు= కుమారులు; ఉదయింతురు= పుట్టుతారు; వగవక= చింతించక; ఉండుము.

తాత్పర్యం: నీకు వర మిస్తాను. భయపడవద్దు. లెమ్ము. ఉదయించినచంద్రునివంటిముఖంకలదానా! సుగుణాలచేత లోకాలను వశంచేసుకొనేవాళ్ళు, ఉత్తమమైన నడవడి కలవాళ్ళు అయినకొడుకులు నీకు పుడతారు. బాధపడకుము.

వ. 'ఋతుమతి వయిన యష్టమ దివసంబుననేనిం జతుర్దశ దివసంబుననేని శుచి వై శయనంబున నుండి నన్నుం దలంపు' మనిన నదియుం దద్వచనానురూపంబు సేసి ముగ్వురు సాల్వులును, నల్వురు మద్రులునుంగా నేడ్వురు కొడుకులం బడసె; నది గావున 'నీవు మాయందు దైవానుగ్రహంబున నపత్యంబు వడయు' మనినం గుంతిం జూచి పాండురాజు ధర్మ్యం బయిన యొక్క పురాణ కథఁ జెప్పెదఁ 'దొల్లి స్త్రీలు పురుషులచేత ననావృత లయి స్వతంత్రవృత్తి నఖిలప్రాణిసాధారణం బైన ధర్మంబునం దమతమవర్ణంబులయందు ఋతుకాలంబు దప్పక నియతానియతపురుషు లయి ప్రవర్తిల్లుచున్న, నుద్దాలకుం డను నొక్కమహామునిభార్య నతిసాధ్వి నధికతపోనిధి యైన శ్వేతకేతుతల్లి ఋతుమతి యైన దాని నొక్క వృద్ధవిప్రుం డతిథి యై వచ్చి పుత్రార్థంబు గామించిన శ్వేతకేతుం డలిగి యిది ధర్మవిరుద్ధం బని యాక్రోశించి దాని సహింపనోపక. 84

విశేషం: ఋతుమతివి= ముట్టుఅయినదానివి; అయిన; అష్టమ, దివసంబునన్=ఏనిన్= ఎనిమిదోరోజున కాని; చతుర్దశ, దివసంబునన్+ఏని= పద్నాలుగో రోజున కాని; శుచివి+ఐ= పరిశుద్ధమైన దానివై; శయనంబునన్+ఉండి= పడకమీద ఉండి; నన్నున్; తలంపుము; అనినన్; అదియున్= ఆమె కూడా; తత్+వచన+అనురూపంబునన్+చేసి= అతనియొక్క మాటకు తగినట్లుగా ఆచరించి; ముగ్వురు, సాల్వులును; నల్వురు, మద్రలునున్; కాన్= అగునట్లు; ఏడ్వురు= ఏడుమంది; కొడుకులన్; పడసెన్= పొందెను; అది= ఆమె; కావున= కాబట్టి; నీవున్=నీవును; మాయందున్= మాయెడ; దైవ+అనుగ్రహంబునన్;

అపత్యంబు= సంతానాన్ని; పడయుము= పొందుము; అనినన్= అనగా; కుంతిన్; చూచి; పాండురాజు; ధర్మ్యంబు+అయిన= ధర్మసంబంధమైన; ఒక్క= ఒక; పురాణ= ప్రాచీనమైన; కథన్= కథను; చెప్పెదన్= చెపుతాను; తొల్లి= పూర్వం; స్త్రీలు; పురుషులచేత= భర్తలచేత; అనావృతులు+అయి= చుట్టుకొనబడనివా రై - అనగా కట్టడిలేనివారై; స్వతంత్ర, వృత్తిన్= స్వతంత్ర మైన ప్రవర్తనతో; అఖిల, ప్రాణి, సాధారణంబు+ఐన= అన్నిప్రాణులకు సామన్యమైన; ధర్మంబునన్; తమ, తమ వర్ణంబులఅందున్= తమతమ జాతులలో; ఋతుకాలంబు= ముట్టయిన తరువాత పదహారురోజులు; తప్పక= దాటకుండ; నియత+అనియత, పురుషులు+అయి= నియమింపబడిన, నియమింపబడని పురుషులు కలవారై; ప్రవర్తిల్లుచున్+ఉన్నన్= వర్తిస్తూ ఉండగా; ఉద్దాలకుండు; అను; ఒక్క, మహా, ముని, భార్యన్= ఒక గొప్ప తపస్వి యొక్క ఇల్లాలిని; అతి, సాధ్విన్= మిక్కిలిపతివ్రత అయిన దానిని; అధిక, తపస్+నిధి+ఐన= అధికమైన తపస్సునకు స్థానమైనవాడు అయిన; శ్వేతకేతు, తల్లి= శ్వేతకేతునియొక్క తల్లిని; ఋతుమతి+ఐన= ముట్టు అయినది కాగా; దానిన్= ఆమెను; ఒక్క; వృద్ధ, విప్రుండు= ముసలి బ్రాహ్మణుడు; అతిథి+ఐ; వచ్చి; పుత్త్ర+అర్థంబు= కొడుకును పొందటంకొఱకు; కామించిన= రమింపగా; శ్వేతకేతుండు; అలిగి= కోపించి; ఇది; ధర్మ, విరుద్ధంబు= ధర్మానికి వ్యతిరేకం; అని; ఆక్రోశించి= తిట్టి; దాని; సహింపక= ఓర్వక.

తాత్పర్యం: 'నీవు ముట్టయిన ఎనిమిదో రోజు కాని, పద్నాలుగో రోజు కానీ పరిశుద్ధురాల వై పడకమీద ఉండి నన్ను స్మరింపుము' అని అనగా ఆమెకూడా ఆ మాటప్రకారం చేసి ముగ్గురు సాల్వులను, నలుగురు మద్రలను మొత్తం ఏడుగురు కొడుకులను కన్నది. కాబట్టి మాయందు నీవుకూడ దైవానుగ్రహంతో సంతానాన్ని పొందు' మని కుంతి చెప్పగా, పాండురాజు ఆమెను చూచి 'నీకు ధర్మసంబంధమైన ఒక పురాణకథ చెబుతాను. 'పూర్వం స్త్రీలు భర్తవలన కట్టడి లేని వాళ్ళయి, స్వతంత్రమైన ప్రవర్తన కలిగి, సర్వప్రాణిసాధారణమైన ధర్మంతో, తమ తమ జాతులలో ముట్టయిన తరువాత గర్భధారణకు యోగ్యమైన పదహారురోజులకాలం దాటకుండా, నియమింపబడిన లేదా నియమింపబడని పురుషులతో రమిస్తూ ఉండగా; మహాతపస్వి అయిన శ్వేతకేతుని తల్లి, మహాముని అయిన ఉద్దాలకుని భార్య, మహాపతివ్రత - ముట్టయి ఉన్నసమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి తనకు పుత్త్రుడు కావా లని ఆమెను కామింపగా, శ్వేతకేతుడు కోపించి, ఇది ధర్మవిరుద్ధం అని తిట్టి, దాన్ని సహించక.

శ్వేతకేతుఁడు స్త్రీపురుషుల విషయంబునఁ గావించిన కట్టడి (సం. 1-113-1)

సీ. **'ఇది యాదిగా సతు లెన్నండుఁ బరపురుషార్థినుల్ గాఁ జన; దన్యపురుష**
సంగమంబునఁ జేసి సకలపాతకములు నగుఁ ; బరిగ్రహభూత లయిన సతుల
కిట్టిద మర్యాద యి మ్మనుష్యుల కెల్లఁ జేసితి లోక ప్రసిద్ధి గాఁగ '
నని ధర్మ్యమైన మర్యాద మానవులకుఁ దద్దయు హితముగా ధర్మమూర్తి

ఆ. **యబ్జభవసమానుఁ డగు శ్వేతకేతుండు । నిలిపె; నదియు ధారుణీ జనంబు**
నందు లోకపూజ్యమై ప్రవర్తిల్లుచు । నుండె శిష్ట సంప్రయుక్తిఁ జేసి. **85**

ప్రతిపదార్థం: ఇది, ఆదిగాన్= ఇది మొదలుగా; సతులు= స్త్రీలు; ఎన్నండున్= ఎప్పుడూకూడ; పర, పురుష+అర్థినుల్= పరపురుషులను కోరేవారుగా; కాన్, చనదు= కాకూడదు; పరిగ్రహభూతలు+అయిన, సతులకు= చేపట్టబడిన స్త్రీలకు- అనగా పెళ్లి అయిన స్త్రీలకు; అన్య పురుష, సంగమంబునన్+చేసి= పరపురుషసంబంధంవలన; సకల, పాతకములున్= అన్ని

పాపాలు; అగున్= కలుగును; ఇట్టిది+అ= ఇదే; మర్యాద= కట్టుబాటు; ఈ+మనుష్యులకు+ఎల్లన్= ఈ మానవు లందరికి; లోక, ప్రసిద్ధి, కాఁగన్= ప్రపంచంలో ప్రసిద్ధిచెందేటట్లు; చేసితి; అని= ఆ ప్రకారముగా; ధర్మ్యము+ఐన= ధర్మంతో కూడిన దైన; మర్యాద= హద్దు; అబ్జ, భవ, సమానుఁడు+అగు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునితో సమానమైనవాడైన; శ్వేతకేతుండు; నిలిపెన్= ఉంచెను; అదియు= ఆ నియమం; శిష్ట, సంప్రయుక్తిన్+చేసి= పెద్దల ఆచారంచేత; లోక, పూజ్యము+ఐ= లోకంచేత పూజింప తగినదై; ప్రవర్తిల్లుచున్+ఉండెన్= నడుస్తూ ఉన్నది.

తాత్పర్యం: 'ఇది మొదలు స్త్రీలు ఎప్పుడూ పరపురుషులను కోరకూడదు. వివాహితస్త్రీలకు పురుషసంగమం వలన సర్వపాపాలు కలుగుతాయి. ఈ కట్టుబాటు లోకప్రసిద్ధంగా మానవు లందరికీ చేశాను' - అని ధర్మంతో కూడిన ఈ కట్టడిని మానవులకు మేలు కలిగేటట్లు ధర్మమూర్తి, బ్రహ్మతో సమానుడు అయిన శ్వేతకేతుడు ఏర్పాటు చేశాడు. ఆ మర్యాదనే శిష్టులంతా అనుసరించటంతో అది లోకానికి పూజింపతగిందై నడుస్తున్నది.

వ. మఱియుఁ దిర్యగ్యోనులయందును నుత్తరకురుదేశంబులయందును మొదలింటి ధర్మంబ యిప్పడుం బ్రవర్తిల్లుచుండునట్లు మనుష్యులయందు శ్వేతకేతుండు సేసిన ధర్మస్థితికారణంబున నాఁటంగోలె. 86

ప్రతిపదార్థం: మఱియున్; తిర్యక్+యోనుల, అందున్= పశుపక్ష్యాదులలోకూడ; ఉత్తర, కురు, దేశంబుల+అందును; మొదలింటి, ధర్మంబు+అ= మొదటి పద్ధతే - అనగా ఆడుప్రాణి ఋతుకాలంలో ఇష్టం వచ్చిన మగప్రాణితో రమించే పద్ధతి; ఇప్పుడున్; ప్రవర్తిల్లుచు+ఉండున్= జరుగుతూ ఉన్నది; అట్లు= ఆ విధంగా; శ్వేతకేతుఁడు; మనుష్యుల= మానవులలో; చేసిన= ఏర్పాటు గావించిన; ధర్మ, స్థితి= ధర్మం యొక్క ఉనికి; కారణంబునన్= కారణముచేత; నాఁటన్+కోలె= ఆ నాటి నుండి.

తాత్పర్యం: పశుపక్ష్యాదులతో కూడ, ఉత్తరకురుభూములలో ఇప్పటికీ ఆడుప్రాణి ఋతుకాలంలో ఏ నియమం లేకుండా ఇష్టం వచ్చినట్లు మగప్రాణితో రమించే మొదటి పద్ధతే ఉన్నది. శ్వేతకేతుడు ఆ విధంగా మానవులలో ఏర్పాటు చేసిన ధర్మంవలన ఆ రోజునుండీ.

క. పురుషులచే ధర్మస్థితిఁ । బరిగ్రహింపంగఁ బడిన భార్యలకు నిరం
తరము నిజపురుషభక్తియుఁ బరపురుషవివర్జనంబుఁ బరిచిత మయ్యెన్. 87

ప్రతిపదార్థం: పురుషులచే= మగవారిచే; ధర్మ, స్థితిన్= ధర్మమార్గంతో; పరిగ్రహింపంగన్+పడిన= వివాహం చేసుకొనబడిన; భార్యలకు; నిరంతరము= ఎల్లప్పుడు; నిజ, పురుష భక్తియున్= తమ భర్తలమీద భక్తీ; పర, పురుష వివర్జనంబున్= పర పురుషులను విడవటం; పరిచితము+అయ్యెన్= అలవడినదిగా అయింది.

తాత్పర్యం: పురుషులు ధర్మమార్గంలో వివాహం చేసుకొన్న భార్యలకు, ఎల్లప్పుడూ తమ భర్తలమీద భక్తి కలిగి ఉండటం, పరపురుషులను విడవటం అలవడింది.

తే. భర్తచేత నియోగింపఁ బడక సతికి । నెద్దియును జేయఁగాఁ దగ; దెద్ది యైన
భర్తచేత నియోగింపఁ బడిన దానిఁ । జేయకునికి దోషం బని చెప్పె మనువు. 88

ప్రతిపదార్థం: భర్తచేతన్= మగనిచేత; నియోగింపన్, పడక= ఆజ్ఞాపింపబడక; సతికిన్= భార్యకు; ఎద్దియును= ఏదీ; చేయఁగాన్, తగదు= చేయకూడదు; ఎద్ది+ఐనన్= ఏదైననూ; భర్తచేత= మగనిచేత; నియోగింపన్, పడిన, దానిన్= ఆజ్ఞాపింప బడినదానిని; చేయక+ఉనికి= చేయకుండటం; దోషంబు; అని, మనువు, చెప్పెన్= అని మనువు అన్నాడు.

తాత్పర్యం: భర్త ఆజ్ఞాపించనిదే భార్య ఏదీ చేయకూడదు. భర్త దేనిని ఆజ్ఞాపించినా అది చేయక పోవటం దోషం' అని మనువు చెప్పాడు.

వ. పతి నియోగించిన దానిం జేయని నాఁడు భార్యకుం బాతకం బని యెఱింగి కాదె తొల్లి సౌదాసుం డైన కల్మాషపాదుం డను రాజర్షిచేత నియుక్తయై వానిభార్య మదయంతి యనునది వసిష్ఠువలన నశ్మకుం డను పుత్త్రుం బడసె; నస్మజ్జన్మంబు నిట్టిద; మహాముని యయిన కృష్ణద్వైపాయనువలనఁ గురుకులవృద్ధిపొంటె నే ముద్భవిల్లితిమి; కావున నీ విన్నికారణంబులు విచారించి నా నియోగంబు సేయుము. 89

ప్రతిపదార్థం: పతి= భర్త; నియోగించిన, దానిన్= ఆజ్ఞాపించినదాన్ని; చేయని, నాఁడు= చేయని రోజు; భార్యకున్; పాతకంబు+అని= పాప మని; ఎఱింగి= తెలిసి; కాదె= కదా; తొల్లి= పూర్వం; సౌదాసుండు+ఐన= సుదాసుడి కుమారు డైన; కల్మాషపాదుండు; అను= అనుపేరుగల; రాజ+ఋషిచేతన్= రాజర్షివలన; నియుక్త+ఐ= ఆజ్ఞాపించబడినది అయి; వాని, భార్య= అతని పత్ని; మదయంతి; అనునది= అనుపేరు కలది; వసిష్ఠువలనన్= వసిష్ఠునివలన; అశ్మకుండు+అను; పుత్త్రున్; పడసెన్= పొందింది; అస్మత్+జన్మంబున్= మా పుట్టుకకూడా; ఇట్టిది+అ= ఇటువంటిదే; మహాముని; అయిన; కృష్ణద్వైపాయను వలనన్; కురు, కుల, వృద్ధిపొంటెన్= కురువంశవృద్ధి కొరకు; ఏము= మేము; ఉద్భవిల్లితిమి= జన్మించాము; కావునన్= కాబట్టి; నీవు= నీవు, ఇన్ని; కారణంబులు; విచారించి; నా, నియోగంబు= నా ఆజ్ఞ; చేయుము= పాటించుము.

తాత్పర్యం: భర్త ఆజ్ఞాపించిన దానిని చేయని రోజు భార్యకు పాపం వస్తుం దని తెలిసే కదా, పూర్వం సుదాసుడి కుమారుడైన కల్మాషపాదుడి ఆజ్ఞతో అతనిభార్య మదయంతి వసిష్ఠునివలన అశ్మకు డనే పుత్రుడిని పొందింది. మా పుట్టుకకూడా ఇటువంటిదే. మహాముని కృష్ణద్వైపాయనునివలన కురువంశం వృద్ధిపొందటానికి మేము జన్మించాము. కాబట్టి నీవు ఈ కారణా లన్నీ విచారించి నేను చెప్పినట్లు చేయుము.

చ. అలయక ధర్మశాస్త్రములయందుఁ బురాణములందుఁ జెప్ప ను
త్పలదళనేత్ర! విందుమ యపత్యము మే లని; కావునన్ యశో
నిలయులఁ బుత్త్రులం బడయు నీ కొనరించెద సంగతాంగుళీ
దళవిలసన్మదీయకరతామరసద్వయయోజితాంజలిన్. 90

ప్రతిపదార్థం: ఉత్పల, దళ, నేత్ర= కలువ రేకులవంటి కన్నులు కలదానా!; అలయక= విసుగు లేకుండ; ధర్మశాస్త్రముల, అందున్= ధర్మశాస్త్రాలలో; పురాణముల, అందున్= పురాణాలలో; చెప్పన్= చెప్పగా; అపత్యము= సంతానం; మేలు; అని; విందుము+అ= వింటున్నాం కదా; కావునన్; యశః+నిలయులన్= కీర్తికి స్థానమైనవారిని; పుత్త్రులన్; పడయు= పొందుము; సంగత+అంగుళీ, దళ, విలసత్+మదీయ, కర, తామరస, ద్వయ, యోజిత, అంజలిన్= కూడినవ్రేళ్ళు అనే రేకులతో ప్రకాశిస్తున్న నా కరకమలాల జంటచేత కూర్చబడిన నమస్కారాన్ని; నీకున్; ఒనరించెదన్= చేస్తాను.

తాత్పర్యం: కలువ రేకులవంటి కన్నుల కల ఓ కుంతీ! విసుగు లేకుండా ధర్మశాస్త్రాలలోను, పురాణాలలోను సంతానం మే లని చెప్పగా వింటున్నాంకదా! అందువల్ల కీర్తిమంతు లైన పుత్రులను పొందుము. కమలాల జంటవంటి నా చేతు లెత్తి నీకు నమస్కారం చేస్తాను.

విశేషం: అలం: రూపకం. పాండురాజు కరకమలాలను జోడించి భార్యను ప్రార్థించటంలో ఒక వైశిష్ట్యాన్ని ప్రదర్శించాడు. పాండురాజు చెప్పిన కథనాన్నిబట్టి సమాజవ్యవస్థలో పూర్వం మాతృస్వామ్యవ్యవస్థమాత్రమే ఉండేది. ఆ తరువాత శ్వేతకేతువు మొదలైనవాళ్ళు వివాహిత అన్యపురుషసంయోగం పొందటం పాప మనే కట్టుబాటు ఏర్పరచి, పితృస్వామ్యవ్యవస్థకు ప్రాతిపదికలు వేశారు. మధ్యేమార్గంగా దేవరన్యాయం ప్రవర్తిల్లింది. దానితో మిశ్రస్వామ్యవ్యవస్థ తలయెత్తింది. భర్త బ్రతికి ఉండగా అన్యపురుష స్మరణం, గ్రహణం సముచితం కా దని కుంతి చెప్పింది. కాని, పాండురాజు, పతి అనుమతితో దేవరన్యాయంతో కలిగే సంతానం - క్షేత్రజులను- పొందు మని మాతృస్వామ్యప్రవృత్తిని ప్రార్థిస్తున్నాడు. దేవాంశసంభూతులు దేవరన్యాయజులకంటె ఉత్తము లని కుంతి అభిప్రాయం. నమస్కరించే పాండురాజులో పుత్రులకొరకైన దైన్యం, మాతృవ్యవస్థమీది గౌరవం ధ్వనిస్తున్నాయి. (సంపా.)

వ. అని పుత్రముఖావలోకనలోలత్వంబున దీనవదనుం డై దేవిం బ్రార్థించినఁ గుంతియుం బుత్రోత్పాదనోన్ముఖి యై కుంతిభోజునింటఁ దనకొండుకనాఁడు దుర్వాసునిచేతం బడసిన మంత్రంబుతెఱంగు పతి కెఱింగించి 'యమ్మంత్రంబున కిది యవసరం బయ్యెఁ; నేవేల్పు నారాధింతు? నాన తి' మ్మనిన సంతసిల్లి కుంతీదేవికిం బాండురా జి ట్లనియె. 91

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పుత్ర, ముఖ+అవలోకన, లోలత్వంబునన్= కొడుకుల ముఖాన్ని చూడాలనే ఆసక్తితో- అనగా కొడుకులు కావా లనే కోరికతో; దీన, వదనుండు+ఐ= దీనమైన ముఖం కలవా డై; దేవిన్= భార్యను - కుంతిని; ప్రార్థించినన్= అర్థింపగా; కుంతియున్; పుత్ర+ఉత్పాదన+ఉన్ముఖి+ఐ= కొడుకులను పుట్టించటంలో అనుకూలమైనది అయి; కుంతిభోజు, ఇంటన్; తన కొండుక, నాఁడు= తన చిన్నతనంలో; దుర్వాసుని చేతన్; పడసిన= పొందిన; మంత్రంబు, తెఱంగు= మంత్రంయొక్క విధం; పతికి= భర్తకు; ఎఱింగించి= తెలిపి; ఆ+మంత్రంబునకు= ఆ మంత్రానికి; ఇది; అవసరంబు= సమయం; అయ్యెన్= అయింది; ఏ, వేల్పున్= ఏ దేవుడిని; ఆరాధింతున్= సేవింతును; ఆనతి, ఇమ్ము, అనినన్= ఆజ్ఞాపించు మనగా; సంతసిల్లి= సంతోషించి; కుంతీదేవికిన్; పాండురాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని కొడుకులముఖాన్ని చూడా లనే కుతూహలంతో దీనవదను డై పాండురాజు కుంతిని ప్రార్థించగా ఆమెకూడా కొడుకులను కనా లనే కోరికకు అనుకూలమైనదై, తనచిన్నతనంలో కుంతిభోజుని ఇంట్లో దుర్వాసునిచేత తాను పొందిన మంత్రవిషయాన్ని భర్తకు చెప్పింది. ' ఆ మంత్రానికి ఇది సమయ మనీ, ఏ దేవుడిని సేవించాలో ఆజ్ఞాపించు' మని భర్తను అడిగింది, పాండురాజు సంతోషించి, కుంతీదేవితో ~~ఈ~~విధంగా అన్నాడు.

క. లలితాంగి! యెల్లలోకం । బులు ధర్మువునంద నిలుచుఁ ; బొలుపుగ ధర్మున్
దలఁపుమ; యాతఁడ మఱి వే । ల్పులలోపలఁ బెద్ద ధర్మమున సత్యమునన్. 92

విశేషం: లలిత+అంగి= అందమైన శరీరం కలదానా! ఓ కుంతీ!; ఎల్ల, లోకంబులు; ధర్మువు, అందు+అ=ధర్మం మీదే; పొలుపుగన్= స్థిరంగా; నిలుచున్= నిలుస్తాయి; ధర్మున్= ధర్మదేవతను; తలఁపుము+అ= స్మరించుము; మఱి= ఇక; వేల్పుల లోపలన్= దేవతలలో; ధర్మమునన్= ధర్మమునందు; సత్యమునన్= సత్యమునందును; ఆతఁడు+అ= అతడే; పెద్ద= గొప్పవాడు.

తాత్పర్యం: అందమైన శరీరం కల ఓ కుంతీ! అన్నిలోకాలు ధర్మంమీదే స్థిరంగా నిలుస్తాయి. ధర్మదేవతను స్మరించుము. దేవతలలో ధర్మంలోనూ, సత్యంలోనూ అతడే పెద్దవాడు.

విశేషం: "విశ్వం ధరతీతి ధర్మః" లోకాన్ని ధరించేది ధర్మం. ఆ ధర్మానికి అధిదేవత ధర్ముడు; అతడిని స్మరించి సంతానాన్ని పొందటంలో పాండురాజుయొక్క విశ్వశ్రేయోదృష్టి వ్యక్తమౌతున్నది. ధర్మాన్ని రక్షించే సంతానాన్ని కోరటం ఉత్తమగృహస్థుయొక్క ధర్మం. పుట్టబోయే కొడుకు మూర్తికట్టిన ధర్మం కావా లని పాండురాజు సంకల్పం.

వ. అని నియోగించినఁ, గుంతియుం బతికిఁ బ్రదక్షిణంబుఁ జేసి సమాహితచిత్త యై మహాముని యిచ్చిన మంత్రంబు విధివంతంబుఁ జేసి ధర్ముని నారాధించిన, నా ధర్ముండును యోగమూర్తి ధరుం డై వచ్చి, వరం బిచ్చినం, గుంతియుఁ దత్ప్రసాదంబున గర్భంబు దాల్చి, సంవత్సరంబు పరిపూర్ణం బైన. 93

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; నియోగించినన్= ఆజ్ఞాపించగా; కుంతియున్; పతికిన్= భర్తకు; ప్రదక్షిణంబున్; చేసి; సమాహిత, చిత్త+ఐ= నిలువబడిన మనస్సు కల దై; మహాముని; ఇచ్చిన; మంత్రంబున్; విధి, వంతంబున్= విధితో కూడిన దానినిగా; చేసి; ధర్ముని= ధర్మదేవతను; ఆరాధించినన్= ప్రార్థించగా; ఆ ధర్మండును; యోగ, మూర్తి, ధరుండు+ఐ= యోగబలంచేత ఆకారాన్ని ధరించినవాడై; వచ్చి; వరంబు, ఇచ్చినన్= వరము ఈయగా; కుంతియున్; తద్+ప్రసాదంబునన్= అతని దయచేత; గర్భంబున్; తాల్చి= ధరించి; సంవత్సరంబు= ఒక సంవత్సరం; పరిపూర్ణంబు+ఐనన్= పూర్తికాగా.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా, కుంతీదేవి భర్తకు ప్రదక్షిణం చేసి, మనస్సు నిలిపి మహాముని ఇచ్చిన మంత్రాన్ని యథావిధిగా జపించి, ధర్మదేవతను ప్రార్థించింది. ధర్ముడు యోగంచేత రూపాన్ని ధరించి వచ్చి వరమిచ్చాడు. కుంతీదేవి అతనిదయవలన గర్భం ధరించి సంవత్సరకాలం పూర్తి కాగానే.

విశేషం: కుంతి గర్భం ధరించి, సంవత్సరకాలం పూర్తిఅయిన తరువాత - కుమారుడిని కన్నట్లు ఈ కథనంలో ఉన్నది. సంవత్సరకాలం గడిచినట్లు మూలంలో లేదు. కుంతీదేవి ధర్ముడిని ఆహ్వానించేనాటికి గాంధారి ఒక సంవత్సరం గర్భవతి అయిఉన్నది. 'సంవత్సరధృతే గర్భే గాంధార్యా జనమేజయ!' అని మూలం. (భం.ఆది.పు.505)

కుంతీదేవియందు ధర్మరాజుజననము (సం.1-114-3)

ఉ. శాత్త్రవజైత్రతేజమున సర్వదిశల్ వెలుఁగంగ నైంద్ర న
క్షత్త్రయుతుండుగా శశి ప్రకాశజయోన్నత మైన యష్టమిన్
మిత్త్రముఖగ్రహప్రతతి మేలుగ నాభిజితోదయంబునం
బుత్త్రుఁడు ధర్మునంశమునఁ బుట్టె నతిస్థిరధర్మమూర్తి యై. 94

ప్రతిపదార్థం: శాత్రవ, జైత్ర, తేజమునన్= శత్రువులను జయించే పరాక్రమంతో; సర్వ, దిశల్= అన్ని దిక్కులు; వెలుఁగంగన్; శశి= చంద్రుడు; ఐంద్ర, నక్షత్ర, యుతుండుగా= జ్యేష్ఠా నక్షత్రంతో కూడినవాడుగా; ప్రకాశ, జయ+ఉన్నతము+ఐన= కాంతితో, జయంతో ఉచ్చస్థితిలో ఉండగా; అష్టమిన్= అష్టమినాడు; మిత్ర, ముఖ, గ్రహ, ప్రతతి= సూర్యుడు మొదలైన గ్రహాల సమూహం; మేలుగన్= బాగుండగా; ఆభిజిత+ఉదయంబునన్= అభిజిన్ముహూర్తం ప్రారంభంలో; ధర్మ+అంశమునన్= ధర్మునియొక్క అంశం చేత; పుత్త్రుఁడు; అతి, స్థిర, ధర్మ, మూర్తి+ఐ= మిక్కిలి స్థిరమైన ధర్మం ఆకారంగా కలవా డై; పుట్టెన్.

తాత్పర్యం: దిక్కు లన్నీ వెలుగగా, చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రంతోకూడి ఉచ్చస్థితిలో ఉండగా, సూర్యాదిగ్రహాలు శుభస్థానాలలో ఉండగా, అష్టమినాడు అభిజిన్ముహూర్తప్రారంభంలో ధర్మదేవతఅంశచేత శత్రువులను జయించగల పరాక్రమంతో ధర్మరాజు జన్మించాడు.

విశేషం: ఆంధ్రమహాభారత సంశోధితముద్రణప్రతిలో ఈక్రింది వివరణం అధస్సూచికలో ఇవ్వబడింది; "యుధిష్ఠిరుఁడు వికృతి సంవత్సర ఫాల్గుణ బహుళ అష్టమియందు జన్మించినట్లు భారతకూలంకష వ్యాఖ్యాకారుఁడు వివరించెను. కలియుగాది ప్రమాది సంవత్సరము చైత్రశుద్ధపాడ్యమిగనుక, ఆ పయిని నూటయెనిమిదియేళ్ళ యెనిమిది దినముల క్రిందట యుధిష్ఠిర జననము. ఆ తిథికి - అనగా ఫాల్గుణబహుళఅష్టమికి - జ్యేష్ఠానక్షత్రము వచ్చును. జయతిథిన్నీ అవును. ధర్మరాజు తరువాత సంవత్సరమునకు భీమునిపుట్టుక - ఖరసంవత్సరఫాల్గుణశుక్లత్రయోదశి మాఘనక్షత్రము. దుర్యోధనుఁడు భీమునికన్న మూఁడుయామములు 'చిన్న'' చిన్న. అర్జునుఁడు నందనసంవత్సర ఫాల్గుణశుక్ల పౌర్ణమాసి'' (పుట.279). సంశోధితముద్రణప్రతిలో 'శాత్రవ', 'మిత్ర' శబ్దప్రయోగం ఉన్నది. వావిళ్ళప్రతిలో 'మిత్త్ర' శబ్దం ఉంది. 'క్షత్త్ర శబ్దం క్షత్ర'గా వాడబడింది. ఈ రెండింటిని గమనించి ప్రాసపామ్యం పరిష్కరించటమైనది.

నన్నయ ధర్మజుని పుట్టుకను ఉత్పలమాలలో వర్ణించాడు. మహావీరుల పుట్టుకలను, వారికి సంబంధించిన అంశాలను వర్ణించినప్పుడు కొన్నిటికి ఉదాత్త గంభీరమైన ఉత్పల చంపకమాలా వృత్తాలను ఎన్నుకొని, నన్నయ సజాతీయఛందస్సంవాద శిల్పాన్ని వెలార్చి పద్యవిద్యను ప్రదర్శించాడు. ఉదాహరణకు; కర్ణుని పుట్టుక (5.26) పాండురాజు తనకు సంతానాన్ని సమకూర్చు మని కుంతిని కోరటం(5.90), వ్యుషితాశ్వునిపరాక్రమం (5.78), మరొక పుత్రునికొరకు వాయుదేవుడిని ఉపాసించు మని పాండురాజు కుంతిని కోరటం (5.102), భీముని పుట్టుక (5.104), ఇంద్రుని అంశతో కుమారుడిని కను మని పాండురాజు కుంతిని కోరటం (5.120) ధర్మజాదుల నందరిని పాండురాజుపుత్రులుగా గుర్తించి, హస్తినాపురిప్రజలు మొదటిసారిగా వారిని చూచినతీరు (5.150) మొదలైన చోట్ల చంపకమాలలు గమనించతగినవి. ధర్మరాజుజననం (5-94), ధృతరాష్ట్ర రాజ్యపాలనం (5.6), పాండురాజువిలాసం (5.47), సంతానంకొరకు ప్రార్థన (5.73), మాద్రి సంతానం కొరకు పరితపించటం (5.129), హస్తినాపుర ప్రజలు పాండవులను అసాధారణవ్యక్తు లని కీర్తించటం (5.151), (5.153), ఏకలవ్యునివర్ణనం (5.235) ఉత్పలమాలలో ఉన్నాయి. ఈ పద్యా లన్నింటిలోకంటె ధర్మజునిపుట్టుక వర్ణించే ఉత్పలమాల వృత్తంలో సంయుక్తాక్షరంతో దుష్కరప్రాస వాడి మిగిలినవారికంటె ధర్మజుని సంశ్లిష్టమైన ఉదాత్తవ్యక్తిత్వాన్ని ధ్వనింపచేయుటం విశేషం. పద్యరచనలో కాంతి అనే శబ్దగుణాన్ని ఉజ్జ్వలంగా పోషించి నన్నయ గుణవద్రచనాశిల్పాన్ని వెలార్చాడు. 'శాత్రవ జైత్ర తేజమున సర్వదిశల్ వెలుగంగ' అనే విశేషణంలోనే కాంతిగుణం సూచించబడింది. ఉజ్జ్వలమైన తారాచంద్ర గ్రహ దైవబలాల వర్ణనతో అది ప్రకాశించింది. జ్యేష్ఠానక్షత్రం (పెద్దవాడుగా సూచించే నక్షత్రం)లో తారాబలం, చంద్రుడి శుభస్థితిలో చంద్రబలం, మిత్త్రగ్రహస్థితిలో గ్రహబలం, 'అతిస్థిరధర్మమూర్తి' అనిచెప్పి లోకాన్ని ధరించే ధర్మమే మూర్తికట్టినవా డని చెప్పటంతో దైవబలం-సూచించటంవలన ఒక పరిపూర్ణపురుషుడి ఉజ్జ్వలవ్యక్తిత్వాన్ని నన్నయ ధ్వనింపచేశాడు. జననకాలశుభగ్రహలక్షణాదులవివరంతో ఇతిహాసనాయకుడైన ధర్మజుడి జన్మఘట్టాన్ని వర్ణించి (ఇతరులకు ఈ వివరాలు ఇవ్వలేదు) అతడు భావికాలంలో చరిత్రపై వేయబోయే ప్రభావాన్ని ధ్వనిమయంగా నన్నయ సూచించాడు. (సంపా.)

క. ధరణీసురు లాదిగ ను । ర్వరలోఁ గల సర్వభూత వర్గం బెల్లం
బరమోత్సవ మొందెను గుణ । శరణ్యుఁ డగు ధర్మజన్ము జన్మదినమునన్. 95

ప్రతిపదార్థం: ధరణీ, సురులు+ఆదిగన్= బ్రాహ్మణులు మొదలుగా; ఉర్వరలోన్= భూమిమీద; కల= ఉన్న; సర్వ, భూత, వర్గంబు= అన్ని ప్రాణుల సమూహం; ఎల్లన్= అంతయు; గుణ, శరణ్యుడు= మంచిగుణాలకు స్థానమైనవాడు; అగు; ధర్మ,

జన్మ, జన్మ, దినమునన్= ధర్ముడినుండి పుట్టిన వానియొక్క జన్మదినాన - అనగా ధర్మరాజు పుట్టినరోజున; పరమ+ఉత్సవము= మిక్కిలి ఆనందం; ఒందెను= పొందాయి.

తాత్పర్యం: గుణవంతు డైన ధర్మరాజు పుట్టినరోజు బ్రాహ్మణులు మొదలుకొని భూమిమీద ఉన్న అన్ని ప్రాణులు ఎంతో ఆనందాన్ని పొందాయి.

విశేషం: ఇది శుభకరమైన మహాశకునం. సర్వభూతహితుడు, ధర్మరక్షకుడు, ప్రజారంజకుడైన సమ్రాట్టు కానున్నా డన్న భావిసూచన ఇందులో ధ్వని.

క. **శతశృంగ నిలయు లగు సం । శితవ్రతులు విప్రవరులు సేసిరి ధర్మ**
స్థితి జాతకర్మ మత్యు । న్నతిఁ బాండుప్రథమపుత్త్రునకు హర్షముతోన్. **96**

ప్రతిపదార్థం: పాండు, ప్రథమ, పుత్త్రునకున్= పాండురాజుయొక్క మొదటికుమారునికి; శత, శృంగ, నిలయులు+అగు= శతశృంగ పర్వతాన్ని ఉనికిపట్టుగా కలవాళ్ళయిన; సంశ్రిత, వ్రతులు= ఆశ్రయింపబడిన వ్రతం కలవాళ్ళు; విప్ర, వరులు= బ్రాహ్మణ శ్రేష్ఠులు; ధర్మ, స్థితి= ధర్మమార్గంలో; అతి+ఉన్నతిన్= మిక్కిలి గొప్పగా; జాతకర్మము= పుట్టినప్పుడు శిశువుకు చేసే సంస్కారం; హర్షముతోన్= సంతోషంతో; చేసిరి.

తాత్పర్యం: పాండురాజుయొక్క మొదటి కుమారునికి శతశృంగపర్వతంమీద వ్రతదీక్ష పూని ఉన్న బ్రాహ్మణ శ్రేష్ఠులంతా ధర్మమార్గంలో సంతోషంతో చాలాగొప్పగా జాతకర్మ చేశారు.

క. **కురుకుల విభుఁ డగు ధర్మ । స్థిరమతి యగు నీతఁ డనుచు ధృతిఁ జేసి యుధి**
ష్ఠిరుఁ డను నామముఁ దా ను । చ్చరించె నాకాశవాణి జనవినుతముగన్. **97**

ప్రతిపదార్థం: ఈతఁడు= ఈ ధర్మనందనుడు; కురు, కుల, విభుఁడు= కురువంశానికి రాజు; అగున్; ధర్మ, స్థిర, మతి= ధర్మంలో స్థిరమైన బుద్ధికలవాడు; అగున్= కాగలడు; అనుచున్; ఆకాశవాణి; ధృతిన్+చేసి= ధైర్యంవలన; యుధిష్ఠిరుఁడు= యుద్ధంలో నిలుకడ కలవాడు; అను; నామమున్= పేరును; తాను= ఆ ఆకాశవాణి; జన, వినుతముగన్= జనులచేత కొనియాడబడేది ఔనట్లుగా; ఉచ్చరించెన్= పలికింది.

తాత్పర్యం: ఈతడు కురువంశానికి రా జవుతాడు. ధర్మంలో స్థిరమైన బుద్ధి కలవాడు అవుతాడు. ధైర్యంవలన యుధిష్ఠిరు డవుతాడు' అని ఆకాశవాణి లోకం కొనియాడేటట్లుగా అతనికి యుధిష్ఠిరు డనే పేరు పెట్టింది.

విశేషం: ఆకాశవాణి పేరుపెట్టటంచేత యుధిష్ఠిరుడు దేవహితు డని సూచన. పాండుధృతరాష్ట్రుల తరువాత వంశకర్తల గౌరవం నిలిపే చక్రవర్తి అత డౌతా డనీ, ధర్మాచరణంలో వీరుడూ, ధీరుడూ, స్థిరుడూ అయి ధర్మవీరరసప్రధానకథానాయకుడు కాగల డనీ ధ్వని. మహాభారతేతిహాసంలో మొదటినుండి చివరిదాకా ధృతితో నిలిచే ధర్మమూర్తి యుధిష్ఠిరుడు. (సంపా.)

గాంధారి యుదరతాడనంబు గావించుకొనుట (సం. 1-107-8)

వ. **ఇట్లు పుత్త్రోదయంబునఁ బరమహర్ష సంపూర్ణ హృదయుం డై పాండురాజు కుంతీ మాద్రీ సహితుండై శతశృంగంబున నుండునంత, నట ముందఱ ధృతరాష్ట్రువలనన్ గాంధారి కృష్ణద్వైపాయనువరంబున గర్భంబు దాల్చి, యొక్క**

సంవత్సరంబు నిండినఁ బ్రసూతి కాకున్నం బదరుచుఁ బుత్త్రలాభలాలస యయి యున్న యది యప్పు డయ్యుధిష్ఠిరు జన్మంబు విని మనస్తాపంబున నుదరతాడనంబుఁ జేసికొనిన, గర్భపాతం బగుడును. 98

ప్రతిపదార్థం: ఇట్లు; పుత్త్ర+ఉదయంబునన్= కొడుకు పుట్టుకచేత; పరమ, హర్ష, సంపూర్ణ, హృదయుండు+ఐ= ఎక్కువ సంతోషంచేత నిండిన మనస్సు కలవాడై; పాండురాజు; కుంతీ, మాద్రీ, సహితుండు+ఐ= కుంతీదేవితో, మాద్రితో కూడినవాడై; శతశృంగంబునన్+ ఉండునంతన్= శతశృంగపర్వతమున, ఉండగా; అట= అక్కడ - హస్తినాపురంలో; ముందఱ= ముందుగా; ధృతరాష్ట్రువలనన్= ధృతరాష్ట్రునివల్ల; గాంధారి= గాంధారి; కృష్ణద్వైపాయను, వరంబునన్= కృష్ణద్వైపాయనుని వరంచేత; గర్భంబున్, తాల్చి= గర్భము ధరించి; ఒక్క, సంవత్సరంబు నిండినన్= ఒక సంవత్సరము పూర్తికాగా; ప్రసూతి=కాన్పు; కాకున్నన్= కాకపోగా; పదరుచు= త్వరపడుచు; పుత్త్ర, లాభ, లాలస+అయి= కొడుకును పొందా లనే మితిమీరిన ఆసక్తి కలది అయి; ఉన్న; అది= అయినది; అప్పుడు; ఆ+యుధిష్ఠిరు, జన్మంబున్= ఆ యుధిష్ఠిరుని పుట్టుకను; విని; మనస్+ తాపంబునన్= మనస్సులోని దుఃఖంచేత; ఉదర, తాడనంబున్= కడుపును బాదుకోవటం; చేసికొనిన= చేసుకో; గర్భ, పాతంబు= గర్భం క్రిందపడటం; అగుడును= కాగా.

తాత్పర్యం: ఇట్లా కొడుకు పుట్టటంవలన ఎంతో ఆనందించి పాండురాజు కుంతీమాద్రులతో శతశృంగాన ఉండగా, హస్తినాపురంలో కృష్ణద్వైపాయనునివరంచేత, ధృతరాష్ట్రునివలన, కుంతికన్నా ముందే గర్భవతి అయిన గాంధారి, ఒక సంవత్సర మైనా తనకు కాన్పు కాకపోవడంతో త్వరపడుతూ కొడుకును పొందా లని తహతహలాడుతూ ఉండగా, యుధిష్ఠిరుడు కుంతికి పుట్టాడని విని, కడుపును బాదుకోగా గర్భపాత మయింది.

విశేషం: తల్లుల మనఃప్రవృత్తులకు పిల్లలు ప్రతిబింబా లౌతారు. విశ్వశ్రేయస్సును కోరి, ధర్మమూర్తిని కోరి, కన్నది- కుంతీదేవి. కుంతీదేవికంటె ముందుగా గర్భవతి అయినా, తొలికాన్పు కుంతీదేవికే దక్కిం దని అసూయతో తనగర్భాన్ని తానే విచ్ఛిన్నం చేసుకొన్నది-గాంధారి. ధర్మరాజు వంశాన్నీ, ధర్మాన్నీ నిలిపేవా డౌతాడు; దుర్యోధనాదులు వంశాన్ని విచ్ఛిన్నం చేసేవా రౌతారు. ఇది వస్తుధ్వని. గాంధారిగర్భవిచ్ఛిత్తియే వంశవిచ్ఛిత్తికి సూచన. ఆమె అసూయామాత్సర్యాదిగుణాలే సంతానానికి వర్తించాయి. (సంపా.)

క. దాని నెఱింగి పరాశర। సూనుఁడు చనుదెంచి సుబలసుతఁ జూచి 'మనో
హీన వయి గర్భపాతము। గా నిట్టులు సేయు టిదియుఁ గర్తవ్యం బే.' 99

ప్రతిపదార్థం: దానిన్= ఆ గర్భపాతవృత్తాంతాన్ని; ఎఱింగి= తెలిసికొని; పరాశర, సూనుఁడు= పరాశరుని కుమారుడు - కృష్ణద్వైపాయనుడు; చనుదెంచి= వచ్చి; సుబల, సుతన్= సుబలునియొక్క కూతురిని - గాంధారిని; చూచి; మనోహీనవు+అయి= మనస్సులేని దాన వై; గర్భ, పాతము= గర్భం క్రిందపడుట; కాన్= అగునట్లుగా; ఇట్టులు= ఈ విధంగా; చేయుట; ఇదియున్= ఇట్టి హీనకార్యం; కర్తవ్యంబు+ఏ= చేయతగిందా?

తాత్పర్యం: అది తెలిసి కృష్ణద్వైపాయనుడు వచ్చాడు. గాంధారిని చూచి 'నీవు బుద్ధి లేకుండా ఈ విధంగా గర్భపాతం చేసికొనటం తగునా?' అన్నాడు.

విశేషం: ఈ పద్యంలో సముచ్చయంతోకూడిన 'ఇది' శబ్దంలో ఎంతో అర్థం ఇమిడిఉంది. అంతటి హీనమైన కార్యానికి అది సున్నితమైన మందలింపు. మందమతివై ఇంతటి తెగువకు పూనుకోవడం తగునా అని హెచ్చరిక.

క. ఇమ్మాంసపేశి నేకశ । త మ్ముదయింతురు సుతులు ముదమ్మున; నిది త
థ్య; మ్మింక నైన నతియ । త్నమ్మున రక్షింపు దీని నా వచనమునన్. 100

ప్రతిపదార్థం: ఈ+మాంస, పేశిన్= ఈ మాంసపు ముద్దనుండి; ఏక శతమ్ము= నూటొక్కమంది; సుతులు= కుమారులు, కూతుళ్ళు; ముదమ్మునన్= సంతోషంతో; ఉదయింతురు= పుడతారు; ఇది+తథ్యమ్ము= ఇది నిజం; ఇంకన్+ ఐనన్= ఇకనైనా; నా వచనమునన్= నా, మాటచేత; దీనిన్= ఈ మాంసపుముద్దను; అతి, యత్నమ్మునన్= మిక్కిలి ప్రయత్నంతో; రక్షింపు= కాపాడుము.

తాత్పర్యం: ఈ మాంసపుముద్దనుండి నూటొక్కమంది కొడుకులు కూతుళ్ళు (నూరుగురు కొడుకులు, ఒక కూతురు) పుడతారు. ఇది నిజం. నా మాట నమ్మి దీనిని చాలాజాగ్రత్తగా కాపాడుకొమ్ము.

విశేషం: ఏకశతము - (చూడు. 9వ పద్యవిశేషం.)

వ. అని గాంధారిం బదరి తొల్లివేదంబులు విభాగించిన మహానుభావుం డమ్మాంసపేశి నేకోత్తరశతఖండంబులుగా విభాగించి, 'వీని వేఱు వేఱ ఘృత కుండలంబులం బెట్టి, శీతలజలంబులం దడుపుచు నుండునది; యిందు నూర్వురు గొడుకులు నొక్క కూతురుం బుట్టుదు'రని చెప్పి చనినఁ, దద్వచనప్రకారంబు చేయించి, గాంధారీ ధృతరాష్ట్రులు సంతసిల్లియున్న; నిట శతశృంగంబున. 101

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; గాంధారిన్; పదరి= నిందించి; తొల్లి= పూర్వం; వేదంబులు; విభాగించిన; మహానుభావుండు; ఆ+మాంస, పేశిన్= ఆ మాంసపు ముద్దను; ఏక+ఉత్తర, శత, ఖండంబులుగా= నూటొక్క ముక్కలుగా; విభాగించి; వీనిన్= ఈ ముక్కలను; వేఱు, వేఱు+అ= వేర్వేరుగా; ఘృత, కుండలంబులన్= నేతికుండలలో; పెట్టి; శీతల జలంబులన్= చల్లని నీటితో; తడుపుచున్, ఉండునది= తడుపుతూ ఉండవలసింది; ఇందున్= ఈ కుండలలో; నూర్వురు, కొడుకులున్= నూరుమంది కుమారులూ; ఒక్క కూతురున్= ఒక కుమార్తె; పుట్టుదురు= జన్మిస్తారు; అని; చెప్పి; చనినన్= వెళ్ళగా; తద్+వచన ప్రకారంబు= ఆయనమాట ప్రకారం; చేయించి; గాంధారీ, ధృతరాష్ట్రులు; సంతసిల్లి, ఉన్నన్= సంతోషించి ఉండగా; ఇటన్, శతశృంగంబునన్= ఇక్కడ, శతశృంగపర్వతం దగ్గర.

తాత్పర్యం: అని గాంధారిని ఆక్షేపించి; పూర్వం వేదాలను విభజించిన మహానుభావుడు వ్యాసుడు, ఆ మాంసపు ముద్దను నూటొక్క ముక్కలుగా చేసి, 'వేర్వేరుగా వీటిని నేతి కుండలలో పెట్టి, చన్నీళ్ళతో తడుపుతూ ఉండండి, వీటినుండి నూరుమంది కొడుకులు, ఒక్క కూతురు పుడతారు' అని చెప్పి వెళ్ళగా, గాంధారీ ధృతరాష్ట్రులు ఆయన చెప్పినప్రకారం చేయించి, సంతోషంతో ఉండగా - ఇక్కడ శతశృంగపర్వతం దగ్గర.

చ. నిరుపమకీర్తి పాండుధరణీపతి వెండియుఁ గుంతిఁ జూచి 'యం
బురుహదళాక్షి ! యింక నొకపుత్త్రు నుదారచరిత్రు నుత్తమ
స్థిరజవసత్త్వు నయ్యనిలదేవుదయం జనియింపు పెంపుతోఁ ;
గురుకులరక్షకుం డతఁ డగున్ బలవద్భుజవిక్రమోన్నతిన్. 102

ప్రతిపదార్థం: నిరుపమ, కీర్తి= సాటిలేని కీర్తి కలవాడు; పాండుధరణీపతి= పాండురాజు; వెండియున్= మళ్ళీ; కుంతిన్; చూచి; అంబురుహ, దళ+అక్షి= తామరరేకులవంటి కన్నులు కలదానా; ఇంకన్, ఒక పుత్త్రున్= ఇంకా ఒక కుమారుని; ఉదార, చరిత్రున్= గొప్పనడవడి కలవాడిని; ఉత్తమ, స్థిర, జవ, సత్త్వున్= శ్రేష్ఠమైన, స్థిరమైన వేగం, బలం కలవానిని; ఆ+అనిలదేవు, దయన్= ఆ వాయుదేవునిదయచేత; జనియింపు= పుట్టించుము; అతఁడు= ఆ పుత్రుడు; పెంపుతోన్= గొప్పతనంచేత; బలవత్+భుజ, విక్రమ+ ఉన్నతిన్= బలమైన భుజాల పరాక్రమంయొక్క అతిశయంచేత; కురు, కుల రక్షకుండు= కురువంశాన్ని రక్షించేవాడు; అగున్= కాగలడు.

తాత్పర్యం: సాటిలేనికీర్తి కల పాండురాజు కుంతీదేవిని చూచి, 'నీవు గొప్పనడవడి కలవాడూ, శ్రేష్ఠమైన, స్థిరమైన వేగం, బలం కలవాడూ అయిన మరో కొడుకును, వాయుదేవునిదయతో కనుము. అతడు గొప్పగా తన భుజబలపరాక్రమంచేత కురువంశాన్ని రక్షిస్తాడు.'

విశేషం: పాండురాజుపుత్త్రసంకల్పాలు విశిష్టంగా ఉన్నాయి. సత్యాన్నీ, ధర్మాన్నీ సర్వలోకంలో నిలుపగలిగినవాడుగా మొదటి కొడుకును కోరాడు. ధర్ముడిని ఆరాధించి యుధిష్ఠిరుడిని పొందాడు. ఇప్పుడు మహాబలశాలి అయిన కొడుకును వంశరక్షణం కొరకు కోరుకొంటున్నాడు. ముందు ధర్మరక్షణం, (లోకరక్షణం) ఆ తరువాత వంశరక్షణం. ఆ క్రమంలో పాండురాజుయొక్క ధార్మికచింతన వెల్లడిఅవుతున్నది. పాండురాజు చంద్రవంశకర్తలలో ఒకడుకదా! (సంపా.)

వ. అని పనిచిన నెప్పటియట్ల కుంతీదేవి వాయుదేవు నారాధించి తత్ప్రసాదంబున గర్భంబు దాల్చి, సంవత్సరంబు సంపూర్ణం బగుడును. 103.

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; పనిచినన్= ఆజ్ఞాపించగా; ఎప్పటి అట్లు+అ= ఎప్పటివలెనే; కుంతీదేవి; వాయుదేవున్; ఆరాధించి; తద్+ప్రసాదంబునన్= ఆయన అనుగ్రహంచేత; గర్భంబున్; తాల్చి= ధరించి; సంవత్సరంబు= ఒక్క సంవత్సరం; సంపూర్ణంబు= పూర్తి; అగుడును= కాగా.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా ఎప్పటివలెనే కుంతీదేవి వాయుదేవుడిని పూజించింది. అతనిదయవలన గర్భం తాల్చింది. ఒకఏడాది పూర్తి కాగానే -

చ. సుతుఁడు నభస్వదంశమున సుస్థిరుఁ డై యుదయించినన్ మహా
యతికృత జాతకర్ముఁ డగు నాతని కాతతవీర్యవిక్రమో
న్నతునకు భీమసేనుఁ డను నామముఁ దా నొనరించె దివ్యవా
క్సతి శతశృంగశైల నివసన్మునిసంఘము సంతసిల్లఁగన్. 104

ప్రతిపదార్థం: సుతుఁడు= కుమారుడు; నభస్వత్+అంశమునన్= వాయుదేవునియొక్క అంశంచేత; సుస్థిరుఁడు+ఐ= మిక్కిలి నిలుకడ కలవాడై; ఉదయించినన్= పుట్టగా; మహా, యతి, కృత, జాతకర్ముఁడు= గొప్ప ఋషులచే చేయబడిన జాతకర్మం కలవాడు; అగు, ఆతనికిన్= ఆ వాయుపుత్రునికి; ఆతత, వీర్య, విక్రమ+ఉన్నతునకు= అధికబలపరాక్రమాలచేత గొప్పవాడైన వానికి; దివ్య, వాక్+సతి= ఆకాశవాణి; తాన్= తను; శతశృంగ, శైల, నివసత్+ముని, సంఘము= శతశృంగ పర్వతం మీద నివసించే మునుల సమూహం; సంతసిల్లగన్= సంతోషింపగా; భీమసేనుఁడు; అను; నామమున్= పేరును; ఒనరించెన్= చేసింది.

తాత్పర్యం: వాయుదేవునిఅంశతో మహాబలవంతు డైనకొడుకు పుట్టగా, మహర్షులు అతనికి జాతకర్మ చేశారు. అధికబలపరాక్రమాలచేత ఉన్నతు డైన ఆ బాలునికి శతశృంగపర్వతంమీద నివసించే మహర్షు లందరూ సంతోషించేటట్లుగా ఆకాశవాణి భీమసేను డని నామకరణం చేసింది.

విశేషం: ఈ పద్యరచనలో ప్రసాదగుణం పోషింపబడింది. మునిసంఘం పొందిన సంతోషానికి కారకుడైన భీమునిపుట్టుకను ఆ గుణంలో వర్ణించటం ఔచిత్యం. ధర్మజుని పుట్టుకను వర్ణించిన పద్యంలో (5-94) సంయుక్తాక్షరమైన తవర్ణాన్ని ప్రాసగా నిలపటంవలన ధర్మజుడు నాయకుడు కాగా, ఈ వృత్తంలో అసంయుక్త మైన తకారం ప్రాసగా నిలపటంవలన భీమసేనుడు అనునాయకుడుగా ఎల్లప్పుడు అన్నను అనుసరించి ఉంటా డని ఛందశ్శిల్పంతో నన్నయ సాధించినవస్తుధ్వని. (సంపా.)

దుర్యోధనాదుల జననము (సం.1-107-24)

క. అనిలజు పుట్టిన దివసము - నన యట దుర్యోధనుండు నరనుత ! ధృతరా
ష్ట్రునకున్ గాంధారికి న । గ్ర నందనుఁడు ఘనుఁడు పుట్టెఁ గలియంశమునన్. 105

ప్రతిపదార్థం: నరనుత= జనులచేత పొగడబడేవాడా! ఓ జనమేజయ మహారాజా!; అనిలజు, పుట్టిన, దివసముననన= వాయుదేవుని కుమారు డైన భీమసేనుడు పుట్టినరోజే; అట= హస్తినాపురంలో; కలి, అంశమునన్ = కలియొక్క అంశంలో; గాంధారికిన్; ధృతరాష్ట్రునకున్; అగ్ర, నందనుఁడు= పెద్దకొడుకు; ఘనుఁడు= గొప్పవాడు; దుర్యోధనుండు; పుట్టెన్.

తాత్పర్యం: ఓ జనమేజయమహారాజా! వాయుపుత్రుడు భీముడు పుట్టినరోజే, హస్తినాపురంలో గాంధారీ ధృతరాష్ట్రులకు కలిఅంశతో పెద్దకొడుకుగా గొప్పవాడైన దుర్యోధనుడు పుట్టాడు. (అని వైశంపాయనమహర్షి చెప్పటం ప్రారంభించాడు.)

శా. ఆదుర్యోధనుఁ డుద్భవిల్లుడును గ్రవ్యాదారవంబుల్ శివా
నాదంబుల్ మదఘూకఘూంకృతులు నానారాసభధ్వానముల్
భూదిక్కంపముగాఁ జెలంగె విగతాంభోభృన్నభోవీథియం
దాదిత్యద్యుతి మాయఁగాఁ గురిసె నుగ్రాసృఙ్మహావర్షముల్. 106

ప్రతిపదార్థం: ఆ, దుర్యోధనుఁడు; ఉద్భవిల్లుడును= పుట్టగా; క్రవ్యాద+ఆరవంబుల్= క్రూరమృగాల అరుపులు; శివా, నాదంబుల్= ఆడునక్కలయొక్క కూతలు; మద, ఘూక, ఘూంకృతులు= మదించిన గుడ్లగూబల ఘూంకారాలు; నానా, రాసభ, ధ్వానముల్= అనేకవిధా లైన గాడిదల ఓండ్ర శబ్దాలు; భూ, దిక్+కంపము, కాన్= భూమికి, దిక్కులకు చలనం కలిగేటట్లు; చెలంగెన్= మ్రోగాయి; విగత+అంభస్+భృత్+నభస్+వీథి, అందున్= పోయిన మేఘాలు కల ఆకాశమార్గంలో; ఆదిత్య, ద్యుతి= సూర్యునియొక్క కాంతి; మాయఁగాన్= నశించేటట్లుగా; ఉగ్ర+అసృక్+మహా, వర్షముల్= భయంకర మైన నెత్తుటి పెనువానలు; కురిసెన్= కురిశాయి.

తాత్పర్యం: దుర్యోధనుడు పుట్టగానే క్రూరమృగాల అరుపులు, నక్కలకూతలు, మదించినగుడ్లగూబల ఘూంకారాలు, నానావిధా లైన గాడిదల ఓండ్రలు, భూమి, దిక్కులు కంపించే విధంగా చెలరేగాయి. ఆకాశంలో నీటిని ధరించిన మేఘాలు తొలగి, సూర్యకాంతి మాసేటట్లుగా భయంకర మైన పెద్దనెత్తుటివానలు కురిశాయి.

విశేషం: ఇవి అన్నీ లోకోపద్రవాన్ని సూచించే అపశకునాలు. పాండురాజుపెద్దకొడుకు పుట్టినప్పుడు సర్వలోకానందకరాలైన శుభశకునాలు కలిగాయి. ధృతరాష్ట్రునిపెద్దకొడుకు పుట్టినప్పుడు సర్వలోకారిష్టదాయకాలైన అపశకునాలు కలిగాయి. ఇవి

భావికథలో కురువంశంలో వా ళ్ళిద్దరూ వరుసగా నిర్వహించే నిర్మాణాత్మక, విధ్వంసకాత్మకపాత్రల ప్రవృత్తులను ధ్వనింప చేస్తున్నాయి.

వ. మఱియు దుర్యోధనజన్మానంతరంబున ధృతరాష్ట్రునకు వైశ్యాపుత్త్రుం డయిన యుయుత్సుండు పుట్టె; నంత గాంధారికి నొక్కొక్కదివసంబున నొక్కొక్కరుండుగాఁ గ్రమంబున దుశ్శాసన దుస్సహ దుశ్శల జలసంధ సమ సహ విందానువింద దుర్ధర్ష సుబాహు దుష్ప్రధర్షణ దుర్మర్షణ దుర్ముఖ దుష్కర్ణ కర్ణ వివింశతి వికర్ణ శల సత్త్వ సులోచన చిత్రోపచిత్ర చిత్రాక్ష చారుచిత్ర శరాసన దుర్మద దుర్విగాహ వివిత్సు వికటాన నోర్ణనాభ సునాభ నందోపనందక చిత్రబాణ చిత్రవర్మ సువర్మ దుర్విమోచనాయోబాహు మహాబాహు చిత్రాంగ చిత్రకుండల భీమవేగ భీమబల బలాకి బలవర్ధ నోగ్రాయుధ సుషేణ కుండధార మహోదర చిత్రాయుధ నిషంగి పాశి బృందారక దృఢవర్మ దృఢక్షత్ర సోమకీ ర్త్యనూదర దృఢసంధ జరాసంధ సద సువా గుగ్రశ్రవ ఉగ్రసేన సేనానీ దుష్పరాజ యాపరాజిత కుండశాయి విశాలాక్ష దురాధర దుర్జయ దృఢహస్త సుహస్త వాతవేగ సువర్చ ఆదిత్యకేతు బహ్వాశి నాగదత్తాగ్రయాయి కవచి క్రథన కుండి ధనుర్ధ రోగ్ర భీమరథ వీరబాహ్వ లోలు పాభయ రౌద్రకర్మ దృఢరథాశ్ర యానాధృష్య కుండభేది విరావి ప్రమథ ప్రమాథి దీర్ఘరోమ దీర్ఘబాహు వ్యూఢోరు కనకధ్వజ కుండాశి విరజసు లనంగా నూర్వురు గొడుకులు పుట్టిన. 107

ప్రతిపదార్థం: మఱియు; దుర్యోధన, జన్మ+అనంతరంబున= దుర్యోధనునిపుట్టుక తర్వాత; వైశ్యా, పుత్త్రుండు+అయిన= కోమటి స్త్రీ కొడుకైన; యుయుత్సుండు; పుట్టెన్; గాంధారికిన్; ఒక్కొక్క, దివసంబునన్= ఒక్కొక్క రోజు; ఒక్కొక్కరుండుగాన్= ఒక్కొక్కడుగా; క్రమంబునన్= వరుసగా; దుశ్శాసనుడు, దుస్సహుడు మొదలైనవారు; అనంగాన్; నూర్వురు= వందమంది; కొడుకులు= కుమారులు; పుట్టినన్= పుట్టగా.

తాత్పర్యం: అంతేకాక, దుర్యోధనుడు పుట్టినతరువాత ధృతరాష్ట్రునికి వైశ్యకులపత్నివలన యుయుత్సు డనే కొడుకు పుట్టాడు. ఆ తరువాత గాంధారికి రోజు కొక్కడుగా దుశ్శాసనాదులు వరుసగా పుట్టారు. (వారిపే ర్లన్నీ పై వచనంలో వరుసగా ఉన్నాయి). ఈ విధంగా మొత్తం నూరుగురుకొడుకులు పుట్టారు.

తే. ఆ తనూజుల కందఱ కనుజ యై ల। తాంగి దుశ్శల యను కూఁతు రమరఁ బుట్టె;
నందు దౌహిత్రవంతుల దైన్య పుణ్య। గతియుఁ గాంతు నే నని పొంగెఁ గౌరవుండు. 108

ప్రతిపదార్థం: ఆ, తనూజులకు+అందఱకున్= ఆ కుమారులందరికి; అనుజ+ఐ= అనుసరించి పుట్టిన దై - అనగా చెల్లె లై; లతా+అంగి= తీగవంటి దేహం కలది; దుశ్శల; అను; కూఁతురు; అమరన్= ఒప్పుగా; పుట్టెన్; అందున్= ఆమెయందు; దౌహిత్రవంతులది+ఐన= కూతురియొక్క కొడుకులు కలవారిది అయిన; పుణ్య, గతియున్= పుణ్యలోకంకూడ; నేమన్; కాంతున్= పొందుతాను; అని= ఆ విధంగా; కౌరవుండు= ధృతరాష్ట్రుడు; పొంగెన్= సంతోషించాడు.

తాత్పర్యం: ఆ కొడుకు లందరికి చెల్లెలుగా సుకుమారి అయి దుశ్శల అనే కూతురు పుట్టింది. ఆమెవలన దౌహిత్రులు కలవాళ్ళు పొందేపుణ్యలోకాన్నికూడా పొందుతా నని ధృతరాష్ట్రుడు సంతోషించాడు.

విశేషం: దుహిత అంటే కూతురు అని అర్థం. ఆమెకొడుకు దౌహిత్రుడు.

వ. ఇట్లేకోత్తరశతపు త్త్రులం బడసి కృతార్థుండై యున్న ధృతరాష్ట్రుకడకు భీష్మవిదురాది బంధుజనంబులుఁ బురోహితప్రముఖ బ్రాహ్మణవరులును వచ్చి యొక్కనాఁ డేకాంతంబున ని ట్లనిరి. 109

ప్రతిపదార్థం: ఇట్లు; ఏకోత్తర, శత, పుత్త్రులన్= నూటొక్కమంది కొడుకులను కూతుండ్రను (100మందికొడుకులు, ఒకకూతురు); పడసి= పొంది; కృత+అర్థుండు+ఐ= తీరిన కోరిక కలవాడై; ఉన్న; ధృతరాష్ట్రు, కడకు= ధృతరాష్ట్రునిదగ్గరకు; భీష్మ, విదుర+ఆది, బంధు, జనంబులున్= భీష్ముడు, విదురుడు మొదలైన బంధువులు; పురోహిత, ప్రముఖ, బ్రాహ్మణ, వరులును= పురోహితులు మొద లైన బ్రాహ్మణ శ్రేష్ఠులు; వచ్చి; ఒక్కనాఁడు; ఏకాంతంబునన్= ఒంటరిగ; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా నూటొక్కమంది పిల్లల్ని పొంది కోరిక తీరిన ధృతరాష్ట్రుని దగ్గరకు భీష్ముడు, విదురుడు మొదలైన బంధువులు, పురోహితులు మొదలైన బ్రాహ్మణ శ్రేష్ఠులు వచ్చి ఒంటరిగా అతనితో ఇట్లా అన్నారు.

క. మన దుర్యోధను జన్మం । బునఁ బెక్కులు దుర్నిమిత్తములు పుట్టె: జగ
జ్జనసంక్షయజననుం డగు । నని పలికెద రెఱుక గల మహాత్ములు వానిన్. 110

ప్రతిపదార్థం: మన, దుర్యోధను, జన్మంబునన్= మనదుర్యోధనుడు పుట్టినప్పుడు; దుర్+నిమిత్తములు= చెడ్డశకునాలు; పెక్కులు= చాల; పుట్టెన్; ఎఱుక= జ్ఞానం; కల= ఉన్న; మహాత్ములు; వానిన్= ఆ దుర్యోధనుడిని; జగత్+జన+సంక్షయ, జననుండు= లోకంలోని ప్రజలకు నాశనం కలిగించేవాడు; అగున్, అని= అవుతాడు అని; పలికెదరు= చెప్పుతారు.(చెప్పారు).

తాత్పర్యం: మన దుర్యోధనుడు పుట్టినప్పుడు అనేకదుశ్శకునాలు పుట్టాయి. జ్ఞానులైన మహాత్ములు వాడు లోక జననాశకు డని అంటారు.(అన్నారు).

క. కులమునకు నఖిలలోకం । బులకు నపాయంబు సేయు పురుషాధము ని
మ్ముల దూషించి జగంబును । గులమును రక్షించు టుఱదె కువలయనాథా! 111

ప్రతిపదార్థం: కువలయనాథా= భూమికి ప్రభువు అయినవాడా!; కులమునకున్= వంశానికి; లోకంబులకున్= అన్ని లోకాలకు; అపాయంబు= కీడు; చేయు; పురుష+అధమున్= పురుషులలో నీచుడిని; ఇమ్ముల= సంతోషంతో; దూషించి= విడిచివేసి; జగంబును= లోకాన్ని; కులమును= వంశాన్ని; రక్షించుట; ఉఱదు+ఎ= తగదా?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్ర మహారాజా! కులానికీ, లోకాలకూ కీడు కల్గించే నీచుడైన ఈ దుర్యోధనుడిని వదలివేసి, లోకాన్నీ, కులాన్నీ రక్షించటం తగదా? (తగునని భావం.)

వ. 'కావున నిప్పుడ దుర్యోధను దూషింతము; నీకు వెండియుఁ బుత్త్రశతంబు సంపూర్ణంబయి పెరుఁగుచున్నయది' యనిన ధృతరాష్ట్రుండు పుత్త్రమోహంబున నప్పలుకులు విన నొల్లకుండె; నంత నట శతశృంగంబునఁ గుంతీదేవి భీమసేను సుపుత్త్రుం బడసి, దశమదివసంబున వేల్పులకు మ్రొక్క గొడుకు నెత్తుకొని దేవగృహంబునకుఁ బోవునెడ నతివిషమగహనగిరిగహ్వరంబుననుండి యొక్కపులి వెలువడి యామిషార్థి యయి పయికి లంఘించిన. 112

ప్రతిపదార్థం: కావునన్; ఇప్పుడు+అ= ఇప్పుడే; దుర్యోధను; దూషింతము= వదలి వేద్దాం; నీకున్; వెండియున్= మరియు; పుత్త్రశతంబు= వందమందికొడుకులు; సంపూర్ణంబు+అయి= నిండుగా; పెరుగుచు+ఉన్న అది = పెరుగుతూ ఉన్నారు; అనినన్= అనగా; ధృతరాష్ట్రుండు; పుత్త్ర మోహంబునన్= కొడుకుమీది మమకారంతో; ఆ+పలుకులు= పెద్దలు చెప్పిన ఆ మాటలు; వినన్= వినటానికి; ఒల్లక+ఉండెన్= ఇష్టపడలేదు; అంతన్= అప్పుడు; అట= అచ్చట; శతశృంగంబునన్= శతశృంగ పర్వతందగ్గర; కుంతీదేవి; భీమసేనున్= భీమసేనుడు అను; సుపుత్త్రున్= చక్కనికుమారుని; పడసి= పొంది; దశమ,

దివసంబునన్= పదోరోజు; వేల్పులకున్= దేవతలకు; మ్రొక్కన్= మ్రొక్కుటకై; కొడుకున్; ఎత్తుకొని; దేవ, గృహంబునకున్= దేవాలయానికి; పోవు, ఎడన్= పోవుచోట; అతి, విషమ, గహన, గిరి, గహ్వరంబునన్, ఉండి= మిక్కిలి మిట్టపల్లాలై ప్రవేశించడానికి సాధ్యం కాని కొండగుహనుండి; ఒక్క; పులి; వెలువడి= బయటకు వచ్చి; ఆమిష+అర్థి, అయి= మాంసంకోరిన దై; పయికిన్= మీదికి; లంఘించినన్= దూకగా.

తాత్పర్యం: 'అందువలన ఇప్పుడే దుర్యోధనుడిని విడిచిపెట్టుము, నీకు ఇంకా వందమందిపిల్లలు నిండుగా పెరుగుతున్నారు' అని అనగా, ధృతరాష్ట్రుడు పుత్రమమకారంతో ఆ పలుకులు వినటానికి ఇష్టపడలేదు. అక్కడ శతశృంగపర్వతంమీద కుంతి భీమసేనుడిని కని, పదోరోజున దేవతలకు మ్రొక్కటానికి ఆ బాలుడిని ఎత్తుకొని దేవాలయానికి పోయేచోట - మిక్కిలి మిట్టపల్లాలై ప్రవేశించ సాధ్యం కాని కొండగుహనుండి ఒకపులి బయటకు వచ్చి, మాంసాన్ని కోరి మీదికి దూకగా.

భీమునిశరీరదార్ఢ్యము (సం.1-114-11)

క. వీరుఁడు పాండుమహీపతి । దారుణ బాణ త్రయమునఁ దద్వ్యాఘ్రంబున్
ధారుణిఁ ద్రెళ్ళఁగ నడుమన । భూరిభుజుం డేసి కాచెఁ బుత్త్రుం దేవిన్. 113

ప్రతిపదార్థం: వీరుఁడు; భూరి, భుజుండు= గొప్పభుజాలు కలవాడు; పాండు, మహీపతి= పాండురాజు; దారుణ, బాణ, త్రయమునన్= భయంకరమైన మూడుబాణాలతో; తద్+వ్యాఘ్రంబున్= ఆ పులిని; నడుమన్+అ= మధ్యలోనే; ధారుణిన్= భూమిమీద; త్రెళ్ళఁగన్= (చచ్చి) పడేటట్లు; ఏసి= కొట్టి; పుత్త్రున్= కొడుకును; దేవిన్=భార్యఐన కుంతీదేవిని; కాచెన్= రక్షించాడు.

తాత్పర్యం: వీరుడు, బలమైన భుజాలు కలవాడు అయిన పాండురాజు భయంకరాలైన మూడుబాణాలతో మధ్యలోనే ఆ పులిని భూమిమీద చచ్చిపడేటట్లు కొట్టి కొడుకు భీముడిని, భార్య కుంతీదేవిని కాపాడాడు.

క. ఉరు శార్దూల భయంబునఁ । బరవశ యయి కుంతి యున్న బాలకుఁడు శిలో
త్కరముపయిఁ బడియెఁ దన ని । ష్ఠురతనుహతిఁ జేసి రాలు చూర్ణంబులుగన్. 114

ప్రతిపదార్థం: ఉరు, శార్దూల, భయంబునన్= పెద్దపులివలన కలిగినభయంతో; కుంతి; పరవశ+అయి= ఒడలు తెలియని దై; ఉన్నన్= ఉండగా; బాలకుఁడు; తన, నిష్ఠుర, తను హతిన్= తన కఠినమైన శరీరంయొక్క దెబ్బచేత; రాలు, చూర్ణంబులుగన్= రాళ్ళు పొడి అయ్యేటట్లు; చేసి; శిలా+ఉత్కరము, పయిన్= రాళ్ళ సమూహంమీద - కొండమీద; పడియెన్= పడినాడు.

తాత్పర్యం: పెద్దపులివలన కలిగినభయంతో కుంతీదేవి శరీరం స్వాధీనం తప్పగా, బాలుడు భీముడు క్రిందపడ్డాడు. కఠినమైన అతనిశరీరం తాకిడికి ఆ కొండమీది రాళ్ళు పొడి అయ్యాయి.

వ. దానిం జూచి పాండురాజు సంభ్రమంబునఁ బఱతెంచి విస్మితుం డై కొడుకు నెత్తికొని కుంతీదేవిం దోడ్కొని వేల్పులకు మ్రొక్కించి మగుడి నిజాశ్రమంబునకు వచ్చి సుఖం బుండి, గాంధారీధృతరాష్ట్రులకుఁ బుత్త్రశతంబు పుట్టుట విని, ఋషులవలన దివ్యమంత్రోపదేశంబుఁ గొని. 115

ప్రతిపదార్థం: దానిన్+చూచి; పాండురాజు; సంభ్రమంబునన్= వేగిరపాటుతో; పఱతెంచి= వచ్చి; విస్మితుండు+ఐ= ఆశ్చర్య పడినవాడై; కొడుకున్; ఎత్తుకొని; కుంతీదేవిన్; తోడ్కొని= తనతో తీసికొని; వేల్పులకున్= దేవతలకు; మ్రొక్కించి; మగుడి= మరలి; నిజ+ఆశ్రమంబునకున్= తనయొక్క ఆశ్రమానికి; వచ్చి; సుఖంబు, ఉండి= సుఖంగా ఉండి; గాంధారీ, ధృతరాష్ట్రులకున్; పుత్త్ర శతంబు= వందమందికొడుకులు; పుట్టుట విని; ఋషులవలనన్; దివ్య, మంత్ర+ఉపదేశంబున్; కొని= గ్రహించి.

తాత్పర్యం: దానిని చూచి పాండురాజు వేగిరపాటుతో వచ్చాడు. ఆశ్చర్యపడి ఆ కొడుకును ఎత్తికొన్నాడు. కుంతీదేవిని తోడ్కొని దేవతలకు మ్రొక్కించి, తిరిగి తనఆశ్రమానికి వచ్చి సుఖంగా ఉండగా, గాంధారీ ధృతరాష్ట్రులకు వందమందికొడుకులు పుట్టా రని విని, ఋషులవలన దివ్యమంత్రోపదేశాన్ని పొంది.

ఇంద్రప్రసాదంబునఁ గుంతి కర్జునుఁ డుదయించుట (సం.1-114-15)

క. **కొడుకుం ద్రిలోక విజయుం । బడయుదు నని ఘోర మగు తపం బొనరింపం**
దొడఁగె సురరాజు నెడలో । నిడికొని యేకాగ్రబుద్ధి నేకాంతమునన్. **116**

ప్రతిపదార్థం: త్రిలోక, విజయున్= మూడులోకాలను జయించేవాడిని; కొడుకున్; పడయుదును= పొందుతాను; అని= అని తలచి; ఘోరము+అగు= భయంకర మైనట్టి; తపంబు; సురరాజన్= దేవతలరా జైన దేవేంద్రుడిని; ఎడలోన్= మనస్సులో; ఇడికొని= ఉంచుకొని; ఏక+అగ్ర, బుద్ధిన్= ఒకదానిమీదే లగ్నమైన మనస్సుతో; ఏకాంతమునన్= ఒంటరిగా; ఒనరింపన్= చేయడానికి; తొడఁగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ముల్లోకాలను జయించగల కొడుకును పొందా లని దేవేంద్రుడిని ధ్యానిస్తూ, ఏకాగ్రబుద్ధితో, ఏకాంతంగా గొప్పతపస్సు చేయడానికి పూనుకొన్నాడు.

విశేషం: కథలో కారణం చెప్పకుండా కార్యాలు జరుగుతున్నట్లు చెప్పటం ప్రసన్నకథాకవితలో ఒకశిల్పం. వందమంది కొడుకులు ధృతరాష్ట్రునికి పుట్టా రని వినగానే పాండురాజు దివ్యమంత్రాల ఉపదేశం పొందాడు; ఒంటి కాలిమీద గొప్పతపస్సు చేశాడు. త్రిలోకవిజయుడైన కొడుకును కోరుకొన్నాడు. ఈచర్యకు కారణం కథలో స్పష్టంగా లేదు. కాని లో నారసి చూస్తే కారణం స్పష్టమౌతుంది. ధార్తరాష్ట్రులు నూరుగురు ఏకమైతే మూడులోకాలనే జయించగలరేమో, ధర్మరక్ష కులరక్షకులైన ధర్మజ భీము లిద్దరూ ధార్తరాష్ట్రుల ధాటికి నిలువలేకపోవచ్చును. త్రిలోకవిజయుడైన పుత్త్రుడుమాత్రమే ధార్తరాష్ట్రులకు దీటుగా నిలిచి, పాండవ ప్రాభవాన్ని, లోకాధిపత్యాన్ని నిలుపగల డనే భావం పాండురాజులో కలిగినట్లు స్పష్టమౌతూఉంది. అందుకే త్రిలోకవిజయుడైన పుత్రునికొరకు త్రిలోకాధిపతిని ఆరాధించటం. (సంపా.)

వ. **ఇట్లతి నిష్ఠ నేకపాద స్థితుం డయి తపంబు సేయుచుఁ గుంతి నొక్కసంవత్సరంబు వ్రతంబు సేయం బంచియున్న నప్పాండురాజున కింద్రుండు ప్రత్యక్షం బై.** **117**

ప్రతిపదార్థం: ఇట్లు; అతి, నిష్ఠన్= మిక్కిలి నియమంతో; ఏక, పాద, స్థితుండు+అయి= ఒకపాదంమీదనే నిలిచి ఉన్నవాడై - అనగా ఒంటి కాలిమీద నిలబడి; తపంబు, చేయుచున్= తపస్సు గావిస్తూ; కుంతిన్; ఒక్క, సంవత్సరంబు; వ్రతంబు చేయన్= వ్రతం చేయటానికై; పంచి= ఆజ్ఞాపించి; ఉన్నన్= ఉండగా; ఆ+పాండురాజునకున్= ఆ పాండురాజునకు; ఇంద్రుండు= మహేంద్రుడు; ప్రత్యక్షంబు+ఐ= ఎదుట కన్పించినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా మిక్కిలినిష్ఠతో ఒంటికాలిమీద నిలబడి తాను తపస్సు చూస్తూ, కుంతీదేవిని ఒక సంవత్సరం వ్రతం చేయవలసిందిగా ఆజ్ఞాపించి ఉండగా, ఆ పాండురాజుకు దేవేంద్రుడు ప్రత్యక్షమై.

క. 'పుత్త్రుఁడు నీ కుదయించు న। మిత్త్రక్షయకరుఁడు బంధుమిత్త్రాంబుజ స
న్మిత్త్రుం' డని వర మిచ్చిన। ధాత్రీపతి పొంగి పృథకుఁ దా ని ట్లనియెన్. 118

ప్రతిపదార్థం: నీకున్; అమిత్ర, క్షయ, కరుఁడు= మిత్రులు కాని వాళ్ళను నాశం చేసేవాడు - అంటే శత్రువులను నాశనం చేసేవాడు; బంధు, మిత్ర+అంబుజ, సత్+మిత్త్రుండు= చుట్టాలు, స్నేహితులు అనే పద్మాలకు చక్కని సూర్యునివంటివాడు; పుత్త్రుఁడు; ఉదయించును= పుట్టుతాడు; అని= ఆ విధంగా; వరము+ఇచ్చినన్= వరం ఇయ్యగా; ధాత్రీ, పతి= పాండురాజు; పొంగి= మిక్కిలి సంతోషించి; తాన్= తాను; పృథకున్= కుంతీదేవికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు శత్రువులను నాశనం చేసేవాడు, బంధువులు, స్నేహితులు అనే పద్మాలకు సూర్యుని వంటివాడు అయినకొడుకు పుడతాడు' అని వరం ఇవ్వగా పాండురాజు ఎంతో సంతోషించి కుంతీదేవితో ఇట్లా అన్నాడు.

విశేషం: పాండురాజు వరం కోరినట్లు చెప్పకుండా, ఇంద్రుడే తనంతట తాను వర మిచ్చినట్లు చెప్పటం ఇక్కడ విశేషం. శత్రువులను సంహరించేవాడు, బంధువులను సంతోషపెట్టేవాడు అయిన కొడుకు పుట్టుతా డని ఇంద్రునివరం. నిజానికి అటువంటి కొడుకు కావా లన్నది పాండురాజు మనసులోనికోరిక. ఆ శత్రువు లెవరు? ఆ బంధువు లెవరు? - అనే ప్రశ్నలకు సమాధానం కాలం చెప్పవలసిందే. సారమతులు లో నారసి భావించతగిందే.

క. ధనమున విద్యను సంతతిఁ దనిసిన వా రెందుఁ గలరె? ధవళేక్షణ ! కా
వున నా కింకను బలువురఁ। దనయులఁ బడయంగ వలయు ధర్మువు పేర్మిన్. 119

ప్రతిపదార్థం: ధవళ+ఈక్షణ= తెల్లని కన్నులు కలదానా!; ధనమునన్= ధనంచేత; విద్యను= విద్యచేత; సంతతిన్= సంతానంచేత; తనిసినవారు= తృప్తిపొందినవారు; ఎందున్= ఎక్కడైనా; కలరె= ఉన్నారా?; కావునన్= కాబట్టి; నాకున్= నాకు; ఇంకను= ఇంకా; పలువురన్= పెక్కుమందిని; తనయులను= పుత్రులను; ధర్మువు, పేర్మిన్= ధర్మంయొక్క అతిశయంచేత; పడయంగవలయున్= పొందాలి.

తాత్పర్యం: ఓ కుంతీ! లోకంలో ధనం, విద్య, సంతానం విషయాలలో తృప్తి పొందినవాళ్ళు ఎవరైనా ఉన్నారా? అందువలన నా కింకా ఎందరో కొడుకులను ధర్మమార్గంలో పొందా లని ఉన్నది.

చ. అమరగణంబులోనఁ బరమార్థమ యింద్రుఁడు పెద్ద, సర్వలో
కములకు వల్లభుం డతఁడ కావున నయ్యమరాధిపప్రసా
దమున సుతున్ సురేంద్రసము ధర్మసమన్వితు నస్మదీయవం
శము వెలుఁగింపఁగాఁ బడయు సర్వజగత్పరిరక్షణక్షమున్. 120

ప్రతిపదార్థం: అమర, గణంబులోనన్= దేవతలసమూహంలో; పరమ+అర్థము+అ= సత్యంగానే; ఇంద్రుఁడు; పెద్ద= పెద్దవాడు, గొప్పవాడు; అతడు+అ= అతడే; సర్వ, లోకములకున్= అన్ని లోకాలకు; వల్లభుండు= రాజు; కావునన్= అందుచేత; ఆ+అమర+అధిప, ప్రసాదమునన్= ఆ దేవతలరాజుయొక్క దయతో; సుర+ఇంద్ర,సమున్= దేవేంద్రునితో సమాను డైనవాడిని;

ధర్మ సమన్వితున్= ధర్మంతో కూడినవాడిని; సర్వ, జగత్+రక్షణ, క్షమున్= లోకా లన్నింటిని కాపాడటంలో సమర్థుడు అయినటువంటివాడిని; అస్మదీయ, వంశము = నా వంశం; వెలుఁగింపఁగాన్= ప్రకాశింప చేయటానికి; సుతున్= కుమారుని; పడయు= పొందుము.

తాత్పర్యం: దేవతలలో నిజంగా దేవేంద్రుడు పెద్ద. అతడే లోకాల కన్నింటికి రాజు. అందువలన ఆ దేవేంద్రుని దయతో అతనితో సమాన మైనవాడు, ధర్మాత్ము డైనవాడు, అన్నిలోకాలను రక్షించటంలో సమర్థు డైనవాడు, నా వంశాన్ని వెలిగించేవాడు అయినకొడుకును పొందుము.

వ. అని నియోగించినఁ గుంతియుఁ దొల్లిటి యట్ల దుర్వాసుం డిచ్చిన మంత్రంబున నింద్రు నారాధించినఁ,
దత్ప్రసాదంబునఁ గుంతికి. 121

ప్రతిపదార్థం: అని; నియోగించినన్= ఆజ్ఞాపించగా; కుంతియున్; తొల్లిటి, అట్లు+అ= ఇదివరకటివలెనే; దుర్వాసుండు; ఇచ్చిన= ప్రసాదించిన; మంత్రంబునన్= మంత్రంచేత; ఇంద్రున్= ఇంద్రుని; ఆరాధించినన్= పూజించగా; తద్+ప్రసాదంబునన్= అతని దయతో; కుంతికిన్.

తాత్పర్యం: అని పాండురాజు ఆజ్ఞాపించగా; కుంతికూడ ఇదివరకటివలెనే దుర్వాసు డిచ్చినమంత్రంతో ఇంద్రుడిని ప్రార్థించగా అతనిదయతో కుంతికి.

క. స్థిరపౌరుషుండు లోకో । త్తరుఁ డుత్తరఫల్గునీప్రథమపాదమునన్
సురరాజునంశమున భా । సురతేజుఁడు వంశకరుఁడు సుతుఁ డుదయించెన్. 122

ప్రతిపదార్థం: స్థిర, పౌరుషుండు= నిలకడైన పౌరుషం కలవాడు; లోక+ఉత్తరుఁడు= లోకంలో శ్రేష్ఠుడు; భాసుర, తేజుఁడు= ప్రకాశిస్తున్న తేజస్సు కలవాడు; వంశ, కరుఁడు= వంశాన్ని నిలిపేవాడు; సుతుఁడు= కుమారుడు; సుర, రాజు, అంశమునన్= దేవేంద్రుని అంశంతో; ఉత్తర ఫల్గునీ, ప్రథమ, పాదమునన్= ఉత్తరఫల్గునీనక్షత్రం మొదటిపాదంలో; ఉదయించెన్= పుట్టాడు.

తాత్పర్యం: స్థిరమైనపౌరుషం కలవాడు, లోకంలో కెల్ల శ్రేష్ఠుడు, ప్రకాశించే తేజస్సు కలవాడు, వంశాన్ని నిలిపేవాడు అయినకుమారుడు, దేవేంద్రునిఅంశతో ఉత్తరఫల్గునీనక్షత్రప్రథమపాదంలో జన్మించాడు.

విశేషం: పాద మనగా నాల్గోవంతు.

వ. అయ్యవసరంబున.

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సందర్భంలో 123

తాత్పర్యం: ఆ సమయంలో.

సీ. 'విను కార్తవీర్యుకంటెను వీరుఁ డగుట నర్జుననామ మీతండ యొనరఁ దాల్చు;
నీతండ యనిఁ బురుహూతాదిసురుల నోడించి ఖాండవము దహించు బలిమి;

నీతండ నిఖిలావనీతలేశుల నోర్చి రాజసూయము ధర్మరాజు నునుచు;

నీతండ వేల్పులచేత దివ్యాస్త్రముల్ వడసి విరోధుల నొడుచుఁ గడిమి'

ఆ. అనుచు నవపయోదనినదగంభీర మై। నెగసె దివ్యవాణి గగనవీథిఁ,

గురిసెఁ బుష్పవృష్టి, సురదుందుభిధ్వనుల్। సెలఁగె సకలభువనవలయ మద్రువ. 124

ప్రతిపదార్థం: విను; కార్త్యవీర్యుకంటెన్; వీరుఁడు; అగుటన్= అవటంచేత; అర్జున, నామము= అర్జును డనే పేరు; ఒనరన్= ఒప్పేటట్లు; తాల్చున్= ధరిస్తాడు; ఈతండు+అ= ఇతడే; అనిన్= యుద్ధంలో; పురుహూత+ఆది, సురులన్= ఇంద్రుడు మొదలైన దేవతలను; ఓడించి; బలమిన్= పరాక్రమంతో; ఖాండవము= ఖాండవవనాన్ని; దహించున్= కాల్చును; ఈతండు+అ= ఇతడే; నిఖిల+అవనీతల+ఈశులన్= మొత్తం భూమిమీది రాజులను; ఓర్చి= జయించి; రాజసూయము= రాజసూయయాగంలో; ధర్మరాజున్= ధర్మరాజును; ఉనుచున్= ఉంచుతాడు; ఈతండు+అ= ఇతడే; వేల్పులచేత= దేవతలచేత; దివ్య+అస్త్రముల్= దేవతా సంబంధమైన బాణాలు; పడసి= పొంది; కడిమిన్= పరాక్రమంతో; విరోధులన్= శత్రువులను; ఒడుచున్= ఓడిస్తాడు; అనుచున్= అంటూ; నవ, పయోద, నినద, గంభీరము+ఐ= క్రొత్త మేఘంయొక్క ఉరుమువలె గంభీరమై; దివ్య, వాణి= దేవతా సంబంధ మైన పలుకు; గగన, వీథిన్= ఆకాశవీథిలో; నెగసెన్= వ్యాపించింది; పుష్ప, వృష్టి= పూలవాన; కురిసెన్; సుర, దుందుభి, ధ్వనుల్= దేవతలయొక్క నగారాల మ్రోతలు; సకల, భువన, వలయము= మొత్తం భూమండలం; అద్రువన్= అదిరేటట్లు; చెలఁగెన్= మ్రోగాయి.

తాత్పర్యం: 'ఇతడు కార్త్యవీర్యునికన్నా వీరుడు కావటంచేత అర్జునుడు అనేపేరు వహిస్తాడు. యుద్ధంలో ఇంద్రాది దేవతలను ఓడించి, పరాక్రమంతో ఖాండవాన్ని దహిస్తాడు. భూమిమీద రాజు లందరినీ జయించి, ధర్మరాజుచేత రాజసూయయాగాన్ని చేయిస్తాడు. దేవతలవలన దివ్యాస్త్రాలు పొంది శత్రువులను జయిస్తాడు' అని ఆకాశవాణి క్రొత్త మేఘం మ్రోసిన ఉరుమువలె గంభీరంగా పలికింది. పూలవాన కురిసింది. భూమండలం దద్దరిల్లేటట్లు దేవ దుందుభులు మ్రోగాయి.

విశేషం: పుట్టుకను కందపద్యంలో వర్ణించి; మహిమను సీసపద్యంలో వివరించటం నన్నయ ప్రదర్శించిన పద్యవిద్యాప్రౌఢి. ధర్మజభీములు స్థిరపాత్రలుగాను, అర్జునునిపాత్ర వికాసదశలను పొందేదిగాను చిత్రించటం భారతకథలో కనపడుతుంది. ధర్మజు డనే ధర్మశక్తికి భీముడు భౌతికబలాన్ని కూర్చేవాడు; అర్జునుడు దైవబలాన్ని అనుసంధించేవాడు. ఆ భేదం చెప్పటం నన్నయ వస్తుశిల్పం. 'ఈతండ' ఏవార్థకమైన తదర్థకసర్వనామాలను మూడుచరణాలలో మొదట వాడి, అర్జునుని పరిణామ స్థితులను నన్నయ కథలో చక్కగ సూచించాడు. ఏవార్థకం అర్జునుని అనన్యపరాక్రమాన్ని ధ్వనింప చేస్తుంది. ఖాండవదహన ఘట్టంనుండి అర్జునునికి శ్రీకృష్ణసహాయం, దేవతలవలని దివ్యాస్త్రలాభం కలగటం ప్రారంభ మౌతుంది. ఇవి భావికథాబీజాలుగా ప్రస్తావించి వాటి వివరాలను తెలిసికొనటానికి పఠితలహృదయాలలో ఉత్కంఠను రేకెత్తించటం ప్రసన్నకథాకవి(లి) తార్థయోజనం. (సంపా.)

వ. మఱియు మరీచ్యాది ప్రజాపతులును, ధాత్రాది ద్వాదశాదిత్యులును, మృగవ్యాధాది రుద్రులును, ధరాది వసువులును, భరద్వాజాది మహర్షులును, భీమసేనాది గంధర్వులును, శేషాది మహానాగముఖ్యులును, వైనతేయాది ఖచరులును, మేనకాద్యప్సరసలును, నాశ్వినులును, విశ్వేదేవతలును, మఱియు స్వర్గంబున నున్నరాజులుం జను దెంచిన. 125

ప్రతిపదార్థం: మఱియున్; మరీచి+ఆది, ప్రజాపతులును= మరీచి మొద లైనబ్రహ్మలు, ధాతృ+ఆది, ద్వాదశ+ ఆదిత్యులును= ధాత మొదలైన పన్నెండుమందిసూర్యులు; మృగవ్యాధ+ఆది, రుద్రులు= మృగవ్యాధుడు మొదలైన రుద్రులు; ధర+ఆది, వసువులును= ధరుడు మొదలైనవసువులు; భరద్వాజ+ఆది, మహర్షులును= భరద్వాజుడు మొదలైన మహామునులు; భీమసేన+ఆది, గంధర్వులును= భీమసేనుడు మొదలైన గంధర్వులు; శేష+ఆది, మహా, నాగ, ముఖ్యులును= శేషుడు మొదలైన సర్పశ్రేష్ఠులు; వైనతేయ+ఆది, ఖచరులును= వైనతేయుడు మొదలైన ఆకాశసంచారులు; మేనకా+ఆది. అప్సరసలును= మేనక మొదలైన అప్సరసలు; అశ్వినులు= అశ్వినీదేవతలు; విశ్వేదేవతలును; మఱియున్= ఇంకనూ; స్వర్గంబునన్+ఉన్న; రాజులున్; చనుదెంచినన్= రాగా.

తాత్పర్యం: అంతేకాక, మరీచి మొదలైన నవబ్రహ్మలు, ధాత మొదలైన ద్వాదశాదిత్యులు, మృగవ్యాధుడు మొదలైన ఏకాదశరుద్రులు, ధరుడు మొదలైన అష్టవసువులు, భరద్వాజుడు మొదలైన మహర్షులు, భీమసేనుడు మొదలైన గంధర్వులు, శేషుడు మొదలైన సర్పశ్రేష్ఠులు, గరుత్మంతుడు మొదలైన ఆకాశగమనం కలిగినవాళ్ళు, మేనక మొదలైనఅప్సరసలు, అశ్వినీదేవతలు, విశ్వేదేవతలు, ఇంకా స్వర్గంలో ఉన్నరాజులంతా రాగా.

విశేషం: ప్రజాపతులు తొమ్మిదిమంది. వారిని నవబ్రహ్మ లంటారు. వారు-భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగిరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు, మరీచి. ద్వాదశాదిత్యులు - ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు. ఏకాదశరుద్రులు - అజుడు, ఏకపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్వష్ట, రుద్రుడు, హరుడు, శంభుడు, త్ర్యంబకుడు, అపరాజితుడు, ఈశానుడు, త్రిభువనుడు. (మృగవ్యాధు డనగా రుద్రుడు);

క. శతశృంగనగేంద్రము శత । ధృతి సర్గదినంబపోలెఁ ద్రిభువనభూత
ప్రతతిఁ బరిపూర్ణశోభా । ధృతి నింద్రతనూజుజన్మదినమున నొప్పెన్. 126

ప్రతిపదార్థం: ఇంద్ర, తనూజు, జన్మదినమునన్= ఇంద్రునికొడు కైన అర్జునుని పుట్టినరోజు; శతశృంగ, నగ+ఇంద్రము= శతశృంగం అనేపేరు కల పర్వతశ్రేష్ఠం; త్రి, భువన, భూత, ప్రతతిన్= మూడులోకాలలోని భూతాలసమూహంతో; పరిపూర్ణ, శోభా, ధృతిన్= నిండుశోభను ధరించటంచేత; శతధృతి, సర్గ, దినంబు+అ పోలెన్= బ్రహ్మయొక్క సృష్టిరోజువలె; ఒప్పెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: అర్జునుడు పుట్టినరోజు శతశృంగపర్వతం మూడులోకాలలోని భూతాలు అక్కడికి రాగా పరిపూర్ణ శోభతో బ్రహ్మదేవుడు సృష్టిచేసేరోజువలె ప్రకాశించింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. ఇందులో అలంకారకృత వస్తుధ్వని ఉన్నది. త్రిభువనాలనుండి పెద్దలు రావటంచేత రెండు విశేషార్థాలు స్ఫురిస్తున్నాయి. పాండవులలో మూడులోకాలను దర్శించిన తన విజయగీతాలను పాడించుకొన్నవాడు అర్జును డొక్కడే. ఈ భావి కథార్థధ్వని ఒకటి. బ్రహ్మదేవుడు సృష్టిచేసేరోజేమో అన్న ఉత్ప్రేక్షవలన అర్జును డొక్కడే పాండవులలో వంశకారకు డౌతా డని లో నారసినవారిభావనకు అందే మరొక భావికథార్థవస్తుధ్వని. (సంపా.)

మాలిని :

సరససురవధూలాస్యంబులున్ సిద్ధవిద్యా
ధరపటుపటహాతోద్యంబులుం గిన్నరీ కిం

పురుష లలితగీతంబుల్ మహారమ్య మయ్యెన్
వరముని దివిజాశీర్వాదనాదంబుతోడన్. 127

ప్రతిపదార్థం: సరస, సుర, వధూ లాస్యంబులున్= మనోహరా లైన అప్సరసలయొక్క నృత్యాలు; సిద్ధ, విద్యాధర, పటు, పటహ+ఆతోద్యంబుల్= సిద్ధుల, విద్యాధరులయొక్క గట్టి తప్పెటల, వీణ, వేణువు, మృదంగం, కాంస్యం (కంచువాద్యం) అనే నాలుగు విధాలైన వాద్యాలయొక్క శబ్దాలు; కిన్నరీ, కింపురుష, లలిత, గీతంబుల్= కిన్నర స్త్రీల, కింపురుషులయొక్క మనోహరాలైన గానాలు; వర, ముని, దివిజ+ఆశీర్వాద, నాదంబుతోడన్= ఉత్తము లైన ఋషులయొక్క, దేవతలయొక్క ఆశీర్వచనశబ్దంతో; మహా, రమ్యము= మిక్కిలి మనోహరం; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: మనోహరా లైన అప్సరసల నృత్యాలు, సిద్ధవిద్యాధరుల వీణా వేణు మృదంగాదివాద్యాల ధ్వనులు, కిన్నర కింపురుషుల లలితగానాలు, మహర్షులు, దేవతలు చేసే ఆశీర్వచనాలశబ్దంతో మిక్కిలి మనోహరంగా ఉన్నది.

విశేషం: మాలినిపాదంలో వరుసగా న, న, మ, య, య అనే గణా లుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాసనియతి ఉన్నది.. వరమునిదివిజాశీర్వాదాలతో సహా దేవతల లలితగీతాలు మహారమ్య మయ్యె నని సహోక్తిరమ్యంగా నన్నయ వర్ణించాడు. వర్ణ్యవస్తువుకు తగిన అక్షరరమ్యత రచనాసౌందర్యాంశం. శ్లేష, సమతగుణాల నిర్వహణం దానికి పోషణం, కాగా మునుల ఆశీస్సులు - తపస్సుచేసి ఇంద్ర పరమేశ్వరాదులను మెప్పించగలిగే అర్జునుని తపోవీరాన్ని, లలితగీతాదులు - ధీరలలితుడుగా ప్రదర్శించే అతడి సరసశృంగారవిలాసయశోవీరాన్ని భావింప చేసేవిగా ఉన్నాయి. (సంపా.)

వ. పాండురాజును బరమోత్సవంబునం గుంతివలనఁ బురుషత్రయసమానం బయిన పుత్త్రత్రయంబు వడసి భువనత్రయరాజ్యంబు వడసినంతియ సంతసిల్లి, కుమారులతోడి వినోదంబులం దగిలి యున్నంత; మాద్రి దనయందుఁ బుత్త్రజన్మంబు వడయు నుపాయంబు లేమికి దుఃఖించి యాత్మగతంబున. 128

ప్రతిపదార్థం: పాండురాజును= పాండురాజుకూడ; పరమ+ఉత్సవంబునన్= మిక్కిలి వేడుకగా; కుంతివలనన్; పురుష, త్రయ, సమానంబు+అయిన= పురుషులు ముగ్గురితో (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో) సమానమైన; పుత్త్ర, త్రయంబు= కొడుకులు ముగ్గురిని; పడసి= పొంది; భువన, త్రయ, రాజ్యంబు= మూడు లోకాలయొక్క పాలనాధికారం; పడసినంతియు+అ= పొందినంతగా; సంతసిల్లి= సంతోషించి; కుమారులతోడి; వినోదంబులన్= విలాసంగా ఆటలలో; తగిలి= తగుల్కొని - అనగా ప్రొద్దు పుచ్చుతూ; ఉన్నంతన్= ఉండగా; మాద్రి; తనయందున్= తనకు; పుత్త్ర, జన్మంబు= కొడుకులు పుట్టటం; పడయు= పొందే; ఉపాయంబు; లేమికి= లేకున్నందుకు; దుఃఖించి; ఆత్మగతంబునన్= మనస్సులో.

తాత్పర్యం: పాండురాజు మిక్కిలివేడుకగా కుంతీదేవివలన త్రిమూర్తులతో సమానమైన ముగ్గురు కొడుకులను పొంది, త్రిలోకాధిపత్యం పొందినంతగా సంతోషించి, కుమారులతో విలాసంగా ఆటలతో ప్రొద్దు పుచ్చుతూ ఉండగా - మాద్రి తనకు కొడుకులు పుట్టేమార్గం లేనందుకు దుఃఖించి, మనస్సులో.

ఉ. కోరిన కోర్కికిం దగఁగఁ గుంతి సుతత్రయంబుఁ గాంచె; గాం
ధారియు నక్కడన్ సుతశతంబు ముదం బొనరంగఁ గాంచె; నేఁ
బోరచి యాఁడుఁబుట్టువునఁ బుట్టి నిరర్థకజీవ నైతి సం
సారసుఖావహం బయిన సత్సుతజన్మముఁ గానఁ బోలమిన్. 129

ప్రతిపదార్థం: కుంతి; కోరిన, కోర్కికిన్; తగన్+కన్= తగినట్లుగ; సుత, త్రితయంబున్= కొడుకులు ముగ్గురిని; కాంచెన్= కన్నది; గాంధారియున్= గాంధారికూడా; అక్కడన్= హస్తినాపురంలో; సుత, శతంబు= కొడుకులు వందమందిని; ముదంబు= సంతోషం; ఒనరంగన్= ఒప్పేటట్లు; కాంచెన్= కన్నది; ఏన్= నేను; పోరచి, ఆడు, పుట్టువునన్= నిస్సార మైన స్త్రీజన్మతో; పుట్టి; సంసార సుఖ+ఆవహంబు+అయిన= సంసారంలో సుఖాన్ని కలిగించేది ఐన; సత్+సుత, జన్మమున్= మంచికొడుకుల పుట్టుకను; కానన్‌పోలమిన్= కనలేకపోవటంచేత; నిరర్థక, జీవన్= వ్యర్థ మైన బ్రతుకు కలదాన్ని; ఐతిన్= అయినాను.

తాత్పర్యం: కుంతి తాను కోరినకోర్కెకు తగినట్లు ముగ్గురు కొడుకులను కన్నది. అక్కడ హస్తినాపురంలో గాంధారి సంతోషంగా వందమందికొడుకులను కన్నది. నేను నిస్సార మైన ఆడజన్మ నెత్తి సంసారంలో సుఖాన్ని కలిగించే కొడుకులను కనలేకపోవటంచేత వ్యర్థ మైనబ్రతుకు కలదాన్ని అయ్యాను.

విశేషం: మాద్రిమాటలలో తోడికోడళ్ళవలె తానుకూడా సంతానవతి కాలేకపోయినందుకు పడే వేదనతోపాటు, స్త్రీకి జీవితంలో సంతానకాంక్ష ఎంత ప్రబలమో వ్యక్త మవుతున్నది. 'పోరచియాఁడుఁబుట్టువునఁ బుట్టి నిరర్థకజీవ నైతి' - అనే వాక్యం సంతానం లేని జీవితం ఎంతో నిరర్థక మని ఆమె ఎంతగా భావిస్తున్నదో ధ్వనింపచేస్తున్నది. వాక్యం అలక్ష్యక్రమవ్యంగ్యానికి వ్యంజన మయ్యే రచన కిది చక్కని ఉదాహరణం. ఓజఃప్రసాదగుణమిశ్రరూపమైన పద్యరచన మాద్రిమనోవేదనను ప్రసన్నం చేస్తున్నది. (సంపా.)

మాద్రికి నకులసహదేవులు పుట్టుట (సం. 1-115-1)

వ. అని వగచుచు నొక్కనాఁ డేకాంతంబునం బతియొద్ద గద్గద వచన యై తన మనోవాంఛితంబుఁ జెప్పి 'కుంతీదేవి యనుగ్రహంబుం బడయ నగునేని కొడుకులం బడయుదు; నట్లయిన నాకును నీకును లోకంబులకును హితం బగుఁ గావున నాకుఁ బుత్త్రోత్పాదనంబు దయసేయం గుంతీదేవికి నానతి యి' మ్మనిన మాద్రికిఁ బాండురా జి ట్లనియె. 130

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; వగచుచున్= చింతిస్తూ; ఒక్కనాఁడు; ఏకాంతంబునన్= ఒంటరి పాటున; పతి, ఒద్ద= భర్త దగ్గర; గద్గద, వచన+ఐ= తడబడుతున్న మాటలు కలదై; తన మనో, వాంఛితంబున్= తన మనస్సులోని కోరికను; చెప్పి; కుంతీదేవి, అనుగ్రహంబున్ = కుంతీదేవియొక్క దయను; పడయన్+అగున్+ఏని; పొందకల్గినట్లైతే; కొడుకులన్; పడయుదును= పొందుతాను; అట్లు+అయినన్= ఆ విధంగా అయితే; నాకును; నీకును; లోకంబులకును; హితంబు+అగున్= మేలు కల్గుతుంది. కావున; నాకున్; పుత్త్ర+ఉత్పాదనంబు= కొడుకులు పుట్టేటట్లు; దయ, చేయన్= కరుణచూపేటట్లు; కుంతీదేవికిన్; ఆనతి; ఇమ్ము= ఆజ్ఞ ఇమ్ము; అనినన్= అనగా; మాద్రికిన్; పాండురాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చింతిస్తూ ఒకరోజు ఒంటరిగా భర్తదగ్గర తడబడేమాటలతో తనమనస్సులోని కోరికను తెలిపి 'కుంతీదేవి దయతలిస్తే నేను కొడుకులను పొందుతాను; అట్లా అయితే నాకు, నీకు, లోకాలకు మే లవుతుంది. అందువలన నాకు కొడుకులు పుట్టేటట్లు చేయవలసిందిగా కుంతీదేవికి ఆజ్ఞ ఇవ్వండి' అని మాద్రి అనగా పాండురాజు ఇట్లా అన్నాడు.

క. నా వచనమున నపత్యముఁ। గావించును గుంతి నీకుఁ గడు నెయ్యముతో;
నీ వగచిన యీ యర్థము। చూవె। మనంబునఁ దలంచుచుండుదు నేనున్. 131

ప్రతిపదార్థం: నా వచనమునన్= నామాటచేత; కుంతి; నీకున్; కడు, నెయ్యముతో= మిక్కిలి ప్రేమతో; అపత్యమున్= సంతానాన్ని; కావించును; నీ, వగచిన= నీవు ఆలోచించిన; ఈ, అర్థము+అ= ఈ విషయాన్నే; ఏనున్, మనంబునన్, తలంచుచుందున్; చూవె= నేను కూడా మనస్సులో అనుకుంటూ ఉంటాను సుమా.

తాత్పర్యం: నా మాటప్రకారం కుంతి మిక్కిలి ప్రేమతో నీకు సంతానాన్ని కలుగజేస్తుంది. నీవు తలచిన ఈ విషయాన్నే నేనూ నా మనస్సులో కోరుకొంటూ ఉండేవాడినిసుమా.

వ. అని పలికి యప్పుడ కుంతీదేవిం బిలిచి మద్రరాజపుత్త్రి దయిన మనోవాంఛితంబుఁ జెప్పి 'సకలలోక కల్యాణ కారులాశ్వినులు గావున వారి నారాధించి యపత్యంబు వడయు' మనిన గొంతియుం బతివచనానురూపంబు సేసిన మాద్రికి. 132

ప్రతిపదార్థం: అని; పలికి; అప్పుడు+అ= ఆ క్షణమే; కుంతీదేవిన్+పిలిచి; మద్ర, రాజ, పుత్త్రిది+అయిన= మద్రరాజ కూతురైన మాద్రియొక్క; మనస్+వాంఛితంబున్= మనస్సులోని కోరికను; చెప్పి= తెలిపి; సకల, లోక, కల్యాణ, కారులు= అన్ని లోకాలకు శుభాన్ని కూర్చేవారు; ఆశ్వినులు= అశ్వినీదేవతలు; కావునన్; వారిన్; ఆరాధించి= పూజించి; అపత్యంబు= సంతానం; పడయుము= పొందుము; అనిన; గొంతియున్= కుంతీదేవియు; పతి, వచన+అనురూపంబు= మగనిమాటకు తగినట్లుగా; చేసినన్= చేయగా; మాద్రికిన్.

తాత్పర్యం: అని పలికి అప్పుడే కుంతీదేవిని పిలిచి, మాద్రి కోరికను తెలియచెప్పి; 'లోకానికంతా మేలుచేసేవాళ్ళు అశ్వినీదేవతలు కాబట్టి వాళ్ళను ఆరాధించి సంతానాన్ని పొందుము' అని చెప్పాడు. కుంతికూడా మగనిమాటకు తగినట్లు చేయగా మాద్రికి.

తే. కవలవారు సూర్యేందుప్రకాశతేజు లా। శ్వినులయంశములఁ బుట్టి రమరగుణులు
వారలకుఁ బ్రీతి నాకాశవాణి సేసె। నకుల సహదేవు లనియెడు నామయుగము. 133

ప్రతిపదార్థం: కవలవారు= కవల పిల్లలు; సూర్య+ఇందు, ప్రకాశ, తేజులు= సూర్యచంద్రులవలె ప్రకాశించే కాంతి కలవాళ్ళు; అమర, గుణులు = దేవతలయొక్క గుణాలవంటి గుణాలు కలవాళ్ళు; ఆశ్వినుల, అంశములన్= అశ్వినీదేవతల అంశలలో; పుట్టిరి= జన్మించారు; వారలకున్= వాళ్లకు; ప్రీతిన్= సంతోషంతో; ఆకాశవాణి; నకుల, సహదేవులు; అనియెడు; నామ, యుగము = పేర్లజంటను; చేసెన్.

తాత్పర్యం: సూర్యచంద్రులవలె ప్రకాశించే తేజస్సు కలవాళ్ళు, దేవతల గుణాలవంటి గుణాలు కలవాళ్ళు అశ్వినీదేవతల అంశలలో కవలలు పుట్టారు. వారికి ఆకాశవాణి సంతోషంతో నకుల సహదేవు లనేపేర్లు పెట్టింది.

క. ఊర్జితులు యుధిష్ఠిర భీ। మార్జున నకుల సహదేవు లన నిట్లు వివే
కార్జితయశు లుదయించిరి। నిర్జరుల వరప్రసాదనిర్మితశక్తిన్. 134

ప్రతిపదార్థం: ఊర్జితులు= గట్టిబలం కలవాళ్ళు; భీమ+అర్జున, నకుల, సహదేవులు; అనన్= అనగా; వివేక+ఆర్జిత, యశులు= వివేకంచేత సంపాదించబడిన కీర్తి కలవాళ్ళు; నిర్జరుల, వర, ప్రసాద నిర్మిత, శక్తిన్= దేవతలయొక్క వరప్రసాదంచేత కల్పించబడిన శక్తిచేత; ఇట్లు; ఉదయించిరి= పుట్టారు.

తాత్పర్యం: బలవంతు లైన యుధిష్ఠిరభీమార్జుననకులసహదేవు లనేవాళ్ళు - వివేకంచేత సంపాదించిన కీర్తి కలవాళ్ళు, దేవతల వరప్రసాదంచేత ఈ విధంగా పుట్టారు.

విశేషం: 'పాండవులు పుట్టిన శుభవేళలలో ఆకాశవాణి పలికింది: వాళ్ళకు పేర్లనుకూడా తానే పెట్టింది. అర్జునుని జన్మదినం త్రిలోకవైభవంగా జరిగింది. దైవాంశసంభూతులేకాక, దైవబలసమన్వితులు, దైవాశీర్వాదయుతులు పాండవులు. ఊర్జితులు అంటే పురుషకారాన్ని సాధింపగలిగిన బలం కలవా ళ్ళని విశేషార్థం. వివేక+ఆర్జితయశులు అనే విశేషణం కూడా పాండవులకు సార్థకమే. సదసద్వివేకం ధర్మవీరుల లక్షణం. పాండవుల సద్వృత్తం, ధార్తరాష్ట్రుల దుర్వృత్తమే భావిభారతకథ. ఇది వస్తుధ్వని. (సంపా.)

వ. అంత నట. **135**

టీ. అంతన్= తరువాత; అటన్= అక్కడ.

సీ. మృగ శాప భయమున జగతీశుఁ డప్పాండు । పతి శతశృంగపర్వతమునందుఁ
బత్నీసమేతుఁడై యత్నంబుతో ఘోర । తప మొనరించుచు విపులశక్తి
నమరవరప్రసాదమున ధర్మస్థితిఁ । గొడుకుల నేవురఁ బడసె ననియు
విని వసుదేవుండు మనమున హర్షించి । యనుజను మఱఁదిని ఘనుఁడు చూడఁ

తే. దనపురోహితుఁ గశ్యపుం డను మహాత్ముఁ । జీరి పుత్తెంచె నవ్విప్రుచేత భాగి
నేయు లగు కుమారులకు నమేయరత్న । భూషణావళు లిచ్చి విశేషలీల. **136**

ప్రతిపదార్థం: జగతి+ఈశుఁడు= లోకానికంతటికి ప్రభువు; ఆ+పాండు, పతి= ఆ పాండురాజు; మృగ, శాప, భయంబునన్= మృగశాపంవలన కల్గిన భయంతో - అనగా మృగరూపం పొందిన కిందము డనే ఋషివలన కల్గిన శాపభయంతో; శతశృంగ, పర్వతమునందున్; పత్నీ, సమేతుఁడు+ఐ= భార్యలతో కూడినవాడై; యత్నంబుతోన్; ఘోర, తపమున్= తీవ్రతపస్సును; ఒనరించుచు= చేస్తూ; విపుల, శక్తిన్= గొప్ప శక్తిచేత; అమర, వర, ప్రసాదమునన్= దేవతలయొక్క వరప్రసాదంచేత; ధర్మ, స్థితిన్= ధర్మమార్గంలో; కొడుకులన్; ఏవురన్= ఐదుగురిని; పడసెన్= పొందెను; అనియున్= అని కూడా; విని= ఆలకించి; ఘనుఁడు; వసుదేవుండు; మనమునన్= మనస్సులో; హర్షించి= సంతోషించి; అనుజను= తోడబుట్టిన దానిని - చెల్లెలిని (కుంతిని); మఱఁదిని (అనగా పాండురాజును); చూడన్= చూడగా; పురోహితున్= పురోహితుణ్ణి; కశ్యపుఁడు అను మహాత్మున్ = కశ్యపుడు అనే పేరుగల మహనీయుణ్ణి; చీరి= పిలిచి, ఆహ్వానించి; ఆ+విప్రుచేతన్= ఆ బ్రాహ్మణునితో; భాగినేయులు= తోబుట్టువుయొక్క కొడుకులు; అగు+కుమారులకున్= అయిన పుత్రులకు; అమేయ, రత్న, భూషణ+ఆవళులు= అపరిమిత మైన రత్నాభరణాల సమూహాలను; విశేష, లీలన్= అధిక మైన విలాసంతో; ఇచ్చి+పుత్తెంచెన్ = ఇచ్చి పంపాడు.

తాత్పర్యం: పాండురాజు మృగశాపభయంవలన భార్యలతో కలిసి శతశృంగపర్వతంమీద ఘోరతపస్సు చేస్తూ, దేవతలవరప్రసాదంవలన ధర్మమార్గంలో అయిదుగురుకొడుకులను పొందా డని విని, కుంతిఅన్న వసుదేవుడు, తన చెల్లెలిని, మరదిని చూచి రావడానికి తన పురోహితు డైన కశ్యపుడిని పిలిచి, అతనిచేత తన చెల్లెలిపిల్లలకు అపరిమిత మైన రత్నాభరణాలను విశేషవైభవంతో ఇచ్చి పంపాడు.

విశేషం: పాండవులకు యాదవులతో ఏర్పడబోయే గాఢమైన అనుబంధానికి ఇది ప్రస్తావనవంటిది. పాండురాజుతో బంధుత్వం కలుపుకొన్న వసుదేవుని తరువాత వాసుదేవుడుకూడా పాండవులతో బంధుత్వాన్ని కలుపుకుంటాడు (సుభద్రను అర్జునుడి కిచ్చి); అంతేకాదు వారియోగక్షేమాలను చూచే రక్షకుడుగా నిలుస్తాడు.

వ. అ క్కశ్యపుండును జనుదెంచి పృథామాద్రీ సహితుం డయి యున్న యప్పాండురాజుం గని వసుదేవు సందేశంబుఁ జెప్పి యక్కుమారులకు రత్నభూషణాంబరంబు లిచ్చి, క్రమంబునఁ జౌలోపనయనంబు లొనరించి, వేదాధ్యయనంబు సేయించుచున్నంత వసంతసమయం బఖిలజీవలోకానందజననం బై యేర్పడం జనుదెంచిన. 137

ప్రతిపదార్థం: ఆ+కశ్యపుండును; చనుదెంచి= వచ్చి; పృథా, మాద్రీ, సహితుండు+అయి= కుంతీమాద్రులతో కూడినవాడై; ఉన్న= కలిసిఉండే; ఆ+పాండురాజును; కని= చూచి; వసుదేవు, సందేశంబు= వసుదేవుడు చెప్పి పంపిన సమాచారాన్ని; చెప్పి; ఆ+కుమారులకున్= ఆ పాండవులకు; రత్న, భూషణ+అంబరంబులు= రత్నాల ఆభరణాలు, వస్త్రాలు; ఇచ్చి; క్రమంబునన్= వరుసగా; చౌల+ఉపనయనంబులు= చౌలకర్మ, ఉపనయనకర్మ; ఒనరించి= చేసి; వేద+అధ్యయనంబున్= గురుముఖమున వేదాన్ని చదివించటం; చేయించుచు+ఉన్నంత= చేయిస్తూ ఉండే సమయంలోనే; వసంత, సమయంబు= వసంతకాలం; అఖిల, జీవ, లోక+ఆనంద, జననంబు+ఐ= అన్ని ప్రాణిసమూహాలకు ఆనందాన్ని కలిగించే దై; ఏర్పడన్+చనుదెంచినన్= తేటపడునట్లు, రాగా.

తాత్పర్యం: ఆ కశ్యపుడు వచ్చి కుంతీమాద్రులతో కలిసి ఉన్న పాండురాజును చూచి, వసుదేవుడు చెప్పి పంపిన సందేశాన్ని వినిపించి, క్రమంగా వాళ్ళకు చౌలోపనయనకర్మలు చేసి వేదాధ్యయనం చేయిస్తూ ఉండగా అన్ని ప్రాణులకు ఆనందాన్ని కలిగిస్తూ వసంతకాలం వచ్చింది.

వసంతవర్ణనము (సం. 1-116-1)

లయగ్రాహి.

కమ్మని లతాంతములకు మ్మొనసి వచ్చు మధుపమ్ముల సుగీత నినదమ్ము లెసఁగెం; జూ
తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి ముకుళమ్ములను నానుచు ముద మ్మొనర వాచా
లమ్ము లగు కోకిల కులమ్ముల రవమ్ము మధుర మ్మగుచు విన్చె; ననిశమ్ము సుమనోభా
రమ్ముల నశోకనికరమ్ములును జంపకచయమ్ములును గింశుకవనమ్ములును నొప్పెన్. 138

ప్రతిపదార్థం: కమ్మని, లతా+అంతములకున్= మంచివాసన కల పూలకు; మొనసి= పూని; వచ్చు= చెంతకు విచ్చేయు; మధుపమ్ముల, సుగీత, నినదమ్ములు= తుమ్మెదలయొక్క చక్కని గానాల ధ్వనులు; ఎసఁగెన్= అతిశయించినాయి; చూతమ్ముల, లసత్+కిసలయమ్ముల, సుగంధి, ముకుళమ్ములన్= మామిడిచెట్లయొక్క ప్రకాశిస్తున్న చివుళ్ళను, మంచివాసన కల మొగ్గలను; ఆనుచున్= తింటూ; ముదమ్ము= సంతోషం, ఒనరన్= ఒప్పగా; వాచాలమ్ములు= కూయునటువంటివి; అగు= అయిన; కోకిల, కులమ్ముల, రవమ్ము= కోయిల గుంపులయొక్క ధ్వని; మధురమ్ము+అగుచు; వినిచెన్= వినిపించింది; అనిశమ్ము= ఎల్లప్పుడూ; సుమనస్+భారమ్ములన్= పూలబరువుచేత; అశోక, నికరమ్ములును= అశోకవృక్షాల సమూహాలు; చంపక, చయమ్ములును= సంపెంగల సమూహాలు; కింశుక, వనమ్ములును= మోదుగులసమూహాలు, ఒప్పెన్= అందగించాయి.

తాత్పర్యం: సువాసన కల పూలకు మూగినతుమ్మెదలఝుంకారం అతిశయించింది. మామిడిచివుళ్ళను, మొగ్గలను తింటూ సంతోషంతో కూసే కోయిలగుంపులకూతలు మనోహరంగా వినిపించాయి. అశోకాలు, సంపెగలు, మోదుగులు బాగా పూచాయి.

విశేషం: లయగ్రాహి పాదానికి 30 అక్షరా లుంటాయి. భ, జ, స, న, భ, జ, స, న, భ, య అనే గణాలు వరుసగా ఉంటాయి. 9, 17, 25 అక్షరాలు ప్రాసయతిస్థానాలు. ప్రాసనియమం ఉన్నది. నన్నయ రచించినమూడులయగ్రాహులలో రెండింటిని (క్రింది పద్యంకూడా) వెంటవెంటనే వసంతర్తువర్ణనలో వినియోగించటం విశేషం. (తరువాతి పద్యంకూడా లయగ్రాహియే). ఈ పద్యంలో వసంత ఋతువులో వనాలలో విరబూసి కనువిందుచేసే పూలచెట్ల అందాన్ని, వీనుల విందుచేసే తుమ్మెదల ఝంకార నాదాన్ని, కోయిలల సుస్వరమాధుర్యాన్ని నన్నయ వర్ణించాడు. మకారం నాదాక్షరం, సప్తస్వరాలలో ఒకటి. అటువంటి మకారాన్ని ద్విరుక్తంగా, నియతసుందరంగా, మళ్ళీమళ్ళీ ప్రయోగించి, ఆ తుమ్మెదల ఝంకారనాదాన్ని, ఆ కోయిలల సుస్వర మాధుర్యాన్ని పాఠకుల చెవి సోకేటట్లు చేశాడు. శృంగారభావోద్దీపకంగా ఏర్పడిన వాతావరణాన్ని అక్షరరమ్యంగా ధ్వనింపచేశాడు. వసంతం లోకంలో అందరికీ అందంగా, ఆనందంగా, ప్రాణప్రదంగా ఉండటం సహజం. కానీ ఇక్కడ పాండురాజుకు మాద్రికి ప్రాణహారిగా పరిణమించింది. అంటే లయగ్రాహి ప్రాణగ్రాహి అయింది. ఒకరికి ఇరువురి ప్రాణాలు అంతమయ్యాయి. అందుకే రెండు లయగ్రాహివృత్తాలు. లయించటం అంటే నశించటం. ఈ సందర్భంలో ఒకే పర్యాయం భార్యాభర్తల ప్రాణాలు లయమయ్యాయి. (వృత్తాలు) లయాత్మకపద్యంలో పేరుకు తగిన ఔచిత్యాన్ని, అందులో అంతర్గతంగా ఉన్న పరమసత్యాన్ని నన్నయ ప్రసన్న గంభీరంగా ప్రతిపాదించాడు.

లయగ్రాహి

> **చందన తమాలతరులందు నగరుద్రుమములందుఁ గదళీవనములందు లవలీ మా**
> **కంద తరుషండములయందు ననిమీలదరవిందసరసీవనములందు వనరాజీ**
> **కందళిత పుష్పమకరందరసముం దగులుచుం దనుపు సౌరభము నొంది జనచిత్తా**
> **నందముగఁ బ్రోషితులడెందము లలందురఁగ మందమలయానిల మమందగతి వీచెన్.** **139**

ప్రతిపదార్థం: చందన, తమాల, తరుల+అందున్= మంచి గంధపు చెట్లయందు, చీకటి చెట్లయందు; అగరు, ద్రుమముల+ అందున్= అగరు చెట్లతోటలందు, కదళీ, వనముల+అందు= అరటితోటలందు; లవలీ, మాకంద, తరు, షండముల+అందున్= లవలీతీగలు, తియ్యామామిడి చెట్లయొక్క సమూహాలయందు; అనిమీలత్+అరవింద, సరసీ, వనముల+ వికసించిన తామరలు కల కొలకుల సమూహాలందు; వనరాజీ, కందళిత, పుష్ప, మకరంద, రసమున్= వనసమూహంలో వికసించిన పూలమీది తేనెను; తగులుచున్= తాకుతూ; తనుపు= చల్లదనం; సౌరభమున్= సువాసనను; ఒంది= పొంది; జన, చిత్త+ఆనందముగన్= ప్రజలమనస్సుకు సంతోషం కలిగేట్లు; ప్రోషితుల, డెందములు= దేశాంతరంలో ఉన్న వారి మనస్సులు; అలందురఁగన్= దుః ఖించేట్లు; మంద, మలయ+అనిలము= మెల్లనిచల్లగాలి; అమంద, గతిన్= అధిక మైన వ్యాప్తితో; వీచెన్= వీచింది.

తాత్పర్యం: మంచిగంధపుచెట్ల, చీకటిచెట్ల, అగరుచెట్ల, అరటితోటల, లవలీతీగల, తియ్యామామిడి చెట్ల సమూహాలలో, పూచిన తామరకొలనులలో, వికసించినపూలలోని తేనెమీద పాకుతూ చల్లదనాన్ని, సువాసనను పొంది ప్రజల మనస్సుకు ఆనందం కలిగించేటట్లు, దేశాంతరంలో ఉన్నవాళ్ళ మనస్సులు దుఃఖించేటట్లు మందమారుతం అధికంగా వీచింది. (తమాల= చీకటి చెట్లు- నల్లని ఆకులు గల చెట్లు. లవలీ= ఒకతీగ, ఒక ఫలవృక్షము)

విశేషం: ముందు పద్యంలో రూపనాదాత్మక వనసౌందర్యాన్ని రమణీయంగా వర్ణించిన నన్నయ - ఈ పద్యంలో కనువిందుచేసే వనసౌందర్యంతో పాటు స్పర్శాత్మకమందమలయానిలాన్ని మనోహరంగా వర్ణించాడు. ఆ పద్యంలో తుమ్మెదల ఝుంకారనాదాన్ని, కోయిలల స్వరమాధుర్యాన్ని ధ్వనింపచెయ్యటానికి ద్విరుక్తమకారాన్ని వాడుకుంటే - ఈ పద్యంలో మందమలయానిలాన్ని అందచేయటానికి బిందుపూర్వక దకారాన్ని వాడుకొన్నాడు. అక్షరశిల్పి నన్నయ. అక్షరరమ్యం, రుచిరార్థమనోజ్ఞం ఆయన కవిత.

పాండురాజుమరణము (సం. 1-116-4)

వ. ఇట్లు సర్వభూతసమ్మోహనంబయిన వసంతసమయంబునం బాండురాజు మదనసమ్మోహనమార్గణబందీకృత మానసుం డై మద్రరాజపుత్త్రి దైన మనోహరాకృతియందు మనంబు నిలిపి యున్నంత; నొక్కనాఁడు కుంతీదేవి బ్రాహ్మణభోజనంబు సేయించుచుండి మాద్రీరక్షణంబునం దేమఱియున్న యవసరంబున. 140

ప్రతిపదార్థం: ఇట్లు; సర్వ, భూత, సమ్మోహనంబు+అయిన= అన్ని ప్రాణులను మోహింపచేసేది అయిన; వసంత, సమయంబునన్= వసంతకాలంలో; పాండురాజు; మదన, సమ్మోహన, మార్గణ, బందీకృత, మానసుండు+ఐ= మన్మథుడి యొక్క సమ్మోహన బాణంచేత కట్టివేయబడిన మనస్సు కలవా డై; మద్రరాజ, పుత్త్రికది+ఐన= మాద్రికి సంబంధించిందైన; మనోహర+ఆకృతియందున్= అందమైన రూపంమీద; మనంబు= మనస్సు; నిలిపి; ఉన్నంతన్= ఉండగా; ఒక్కనాఁడు; కుంతీదేవి= కుంతి; బ్రాహ్మణ, భోజనంబు, చేయించుచున్= బ్రాహ్మణులకు భోజనం చేయిస్తూ; ఉండి= ఉన్నదై; మాద్రీ, రక్షణంబునందున్= మాద్రియొక్క రక్షణలో; ఏమఱి= మరచి; ఉన్న అవసరంబునన్= ఉండిన సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా అన్నిప్రాణులను మోహింపచేసే వసంతకాలంలో పాండురాజు మన్మథునియొక్క సమ్మోహన బాణానికి లొంగిన మనస్సు కలవాడై, మాద్రియొక్క మనోహరరూపం మీద మనస్సు నిలిపి, ఒక రోజు కుంతీదేవి బ్రాహ్మణభోజనం చేయిస్తూ మాద్రిని కనిపెట్టటం మరచి ఉన్నసమయంలో.

విశేషం: మానవమనస్తత్త్వంపై ప్రకృతిప్రభావం ప్రబలం. విశేషించి వసంతప్రభావం విపరీతం. మాద్రి వయస్సులో చిన్నది. మహా సౌందర్యవతి. ఆమె పాండురాజువశం కాకుండా, వా ళ్ళిద్దరికీ ఏకాంతం ఏర్పడకుండా కుంతి కనిపెడుతూనే ఉన్నది. కానీ ఆ రోజు బ్రాహ్మణభోజనంలో నిమగ్నురా లై ఆమె మాద్రివిషయం మరచింది.

ఉ. చారుసువర్ణహాసినవచంపకభూషయు సిందువారము
క్తా రమణీయయున్ వకుళదామవతంసయు నై యపూర్వ శృం
గారవిలాసలీల యెసఁగం దనముందట నున్న మాద్రి నం
భోరుహనేత్రఁ జూచి కురుపుంగవుఁ డంగజరాగమత్తుఁ డై. 141

ప్రతిపదార్థం: చారు, సువర్ణ, హాసి, నవ, చంపక, భూషయున్= అంద మైన బంగారాన్నే గేలిచేసే క్రొత్తసంపెంగపువ్వులే ఆభరణంగా కలది; సిందువార, ముక్తారమణీయయున్= వావిలిపూ లనే ముత్యాలచే మనోహరమైనదియున్నూ; వకుళ, దామ, వతంసయున్,ఐ= పొగడదండలు చెవి ఆభరణాలుగా కలదై; అపూర్వ, శృంగార, విలాస, లీల= అంతకుముందు లేని అలంకార విలాసం యొక్క అతిశయం; ఎసఁగన్= ఒప్పగా; తన, ముందటన్, ఉన్న= తన ముందున్న; అంభోరుహ, నేత్రన్= కమలాలవంటి కన్నులు కలదానిని; మాద్రిన్= మాద్రిని; చూచి= కనుగొని, కురు పుంగవుఁడు= కురుశ్రేష్ఠు డైన పాండురాజు; అంగజ, రాగ, మత్తుఁడు+ఐ= మన్మథరాగంచేత మదించినవాడై,

తాత్పర్యం: అందంలో బంగారాన్ని మించిన క్రొత్తసంపెంగపువ్వులే ఆభరణాలుగా కలదై, వావిలిపూ లనే ముత్యాలచేత మనోహర మైనదై, పొగదండలు చెవి ఆభరణాలుగా కలదై అంతకుముం దెన్నడూ లేని శృంగారవిలాసంతో తన ముందున్న - కమలాలవంటి అందమైన కన్నులు కల మాద్రిని చూచి, కురుశ్రేష్ఠుడైన పాండురాజు మన్మథరాగవశుడై.

విశేషం: సహజంగానే సౌందర్యవతి అయిన మాద్రికి వసంత పుష్పాలంకారాలు అమితమైన శోభను కల్గించాయి. ఆమె రూపం ఆనాడు పాండురాజుకు మత్తెక్కించింది. (వతంస-అవతంసయొక్కరూపాంతరం)

క. కిందముశాపము డెందము । నం దలఁపక శాపభయమునన్ మాద్రి గడున్
వందురి వారింపఁగ బలి । మిం దత్సంభోగసుఖసమీహితుఁ డయ్యెన్. 142

ప్రతిపదార్థం: కిందము, శాపమున్= కిందమునియొక్క శాపాన్ని; డెందమునన్= మనస్సులో; తలఁపక= ఆలోచింపక; మాద్రి; శాప, భయమునన్= శాపంవలని భయంచేత; కడున్= మిక్కిలి; వందురి= దుఃఖించి; వారింపఁగన్= అడ్డుకోగా; బలిమిన్= బలాత్కారంచే; తత్+సంభోగ, సుఖ సమీహితుఁడు= దానితో సంభోగసుఖంమీద కోరిక కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: పాండురాజు కిందమునిశాపాన్ని మరచాడు. ఆ శాపం గుర్తున్నమాద్రి ఎంతో భయంతో, దుఃఖంతో తనను వారిస్తున్నా, బలాత్కారంగా ఆమెతో సంభోగసుఖాన్ని పొందకోరాడు.

విశేషం: ప్రకృతిప్రభావం, మాద్రి సౌందర్యం, మానవసహజమైన కామతృష్ణ. విశేషించి ఆ కామతృష్ణ తీర్చుకోవటానికి అనుకూలించిన ఆ సమయం పాండురాజుప్రాణాలు తీశాయి. విధి బలీయం.

వ. దానం జేసి విగతజీవుం డైన యప్పాండురాజుం గౌఁగిలించుకొని మాద్రి యఱచుచున్న, దాని యాక్రందన ధ్వని విని వెఱచి కుంతీదేవి గొడుకులుం దానునుం బఱతెంచి పతియడుగులపయిం బడి యేడ్చుచున్న నెఱింగి, శతశృంగ నివాసులగు మునులెల్లం దెరలివచ్చి చూచి శోకవిస్మయాకులితచిత్తు లయి; రంతఁ గుంతీదేవి మాద్రి కి ట్లనియె. 143

ప్రతిపదార్థం: దానన్+చేసి= దానివలన; విగత, జీవుండు+ఐన= కోల్పోయిన ప్రాణాలు కల వాడైన; ఆ+పాండురాజున్; కౌఁగిలించుకొని; మాద్రి; అఱచుచున్నన్= రోదిస్తుండగా; దాని+ఆక్రందన, ధ్వని= ఆమె ఏడుపు శబ్దం; విని; వెఱచి= భయపడి; కుంతీదేవి; కొడుకులున్; తానునున్; పఱతెంచి= వచ్చి; పతి, అడుగుల, పయిన్= భర్త పాదాల మీద; పడి; ఏడ్చుచు+ఉన్నన్= దూషించుచుండగా; ఎఱింగి= తెలిసికొని; శతశృంగ, నివాసులు+అగు మునులు+ఎల్లన్= శతశృంగ పర్వతమున నివసించు ముని లందరూ; తెరలి= కలతచెంది; వచ్చి; చూచి;శోక, విస్మయ+ఆకులిత, చిత్తులు+అయిరి= దుఃఖంచేత, ఆశ్చర్యంచేత కలత చెందిన మనస్సు కలవాళ్ళు అయ్యారు; అంతన్= అప్పుడు, కుంతీదేవి; మాద్రికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దానివలన ప్రాణాలు కోల్పోయిన ఆ పాండురాజును కౌగలించుకొని మాద్రి అరుస్తూ ఉన్నది. దాని యేడుపు సవ్వడి విని భయపడి కొడుకులతోసహా కుంతీదేవి వచ్చి, భర్తపాదాలమీద పడి ఏడ్వసాగింది. ఆ సంగతి తెలిసికొని శతశృంగంలో నివసిస్తున్న మునులంతా గుమికూడి వచ్చి చూచి దుఃఖంతో, ఆశ్చర్యంతో కలతచెందిన మనస్సు కలవా రయ్యారు. అప్పుడు కుంతి మాద్రితో ఈ విధంగా అనింది.

ఉ. 'నా కెడ యిమ్ము, లెమ్ము, కురునాథుమనఃప్రియధర్మపత్ని నే
నేకత మెట్టు లుండుదు? మహీపతితోడన పోదుఁ; బుత్త్రులం
జేకొని పెన్పు; నా పసుపుఁ జేయుము' నావుడు మాద్రి దద్దయున్
శోకపరీతచిత్త యగుచుం బృథ కి ట్లనియెం బ్రియంబునన్. 144

ప్రతిపదార్థం: నాకు; ఎడ= చోటు; ఇమ్ము; లెమ్ములే; కురునాథు, మనస్+ప్రియ, ధర్మపత్నిన్= కురురా జైన పాండురాజుయొక్క మనస్సుకు ప్రియ మైన భార్యను; ఏన్= నేను; ఏకతము+అ= ఒంటరిగా; ఎట్టుల; ఉండుదున్; మహీపతితోడన= రాజుతోనే; పోదున్= పోతాను - అనగా ప్రాణాలు విడుస్తాను; పుత్త్రులన్; చేకొని= తీసికొని; పెన్పు= పెంచుము; నా, పసుపున్= నా యొక్క ఆజ్ఞను; చేయుము; నావుడు= అనగా; మాద్రి; తద్దయున్= మిక్కిలి; శోక, పరీత, చిత్త, అగుచున్= దుఃఖంచే చుట్టబడిన మనస్సు కలదై; ప్రియంబునన్= అనువుగా; పృథకున్= కుంతికి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: 'నీవు లేచి నాకు చో టిమ్ము. నేను పాండురాజుమనస్సుకు ప్రియ మైన ధర్మపత్నిని. ఆయనను విడిచి ఉండలేను. ఆయనతో వెళ్ళిపోతాను. నీవు కొడుకులను పెంచుము' అని కుంతి అనగా మాద్రి ఎంతో దుఃఖంతో ఆమెమనస్సుకు ప్రియంగా ఇట్లా పలికింది.

విశేషం: కురునాథుమనఃప్రియధర్మపత్ని - అని మాద్రిని సంబోధించి - నేను, ఏకతమ ఎలా ఉండగలను అని కుంతి అన్నట్లు కూడా గ్రహింపవచ్చు. ఆ సంబోధనలో కుంతి మాద్రిని ఎత్తిపొడవడం ధ్వనిస్తుంది. - పాండురాజు మనస్సుకు ప్రియమైన నీ ధర్మపత్నీత్వం ఇదేనా? భర్త ప్రాణం పోవడానికి కారణభూతురాలవు అయ్యావు - అనేనింద అందులో స్ఫురించక మానదు, అట్లా కాక కుంతి తనే కురునాథుమనఃప్రియధర్మపత్నిన్ అని చెప్పుకొని, ఏన్= నేను, ఏకతమ= ఒంటరిగా, ఎట్లా ఉండగలను అన్నట్లు భావించినా అందులోనూ కొంత ఎత్తిపొడుపు లేకపోలేదు. పాండురాజుకు నేను నీ కన్నా తక్కువ ప్రియమైన భార్యను కాను; అయినా మైమరచి నీవలె ఆయనకు ప్రాణాపాయం కలిగింపని ధర్మపత్నిని సుమా! ఆయన ధర్మపత్నిని అయిన నేను ఆయన లేకుండా ఎట్లా జీవించగలను అనే పదునైనభావం పరోక్షంగా మాద్రికి ఎత్తుపొడుపే. అప్పటి పరిస్థితుల్లో కుంతి ఎంత సానుభూతితో మాద్రిని చూచినా, ఆమెమీద కుంతికి ఒకింత కోపం, సపత్నీభావం లోలోపల కలగటం సహజమే. తదనుగుణంగా ఆమె మాటలలో కొంత ఎత్తిపొడుపు చోటుచేసికొనడంకూడా సహజమే. అలతి అలతి మాటలతో కూడినవాక్యాలు శోకతీవ్రతను వ్యక్తంచేస్తున్న ట్లున్నాయి. మాధుర్యగుణం ఈ పద్యంలో నాటకీయంగా పోషింపబడింది.

మాద్రి సహగమనము సేయుట (సం. 1-116-25)

తరువోజ.

కురువంశ నిస్తారకుల ధర్మయుక్తిఁ గొడుకులఁ బడసి యి క్కురుకుంజరునకుఁ
గరము మనఃప్రీతి గావించి పుణ్యగతికిఁ గారణమవై కమలాక్షి! నీవు
దిరముగా నిష్టంబు దీర్చి; తే నిందు ధృతిఁ బతియిష్టంబు దీర్పన; కాన
యరిగెదఁ బతితోడ నన్యలోకంబునం దైనఁ బ్రీతిసేయఁగఁ గాంతు ననియు. 145

ప్రతిపదార్థం: కమలాక్షి= తామరలవంటి కన్నులు కలదానా! ఓ కుంతీ!; నీవు; కురు, వంశ నిస్తారకులన్= కురువంశాన్ని తరింప చేసేవారిని; కొడుకులన్; ధర్మ, యుక్తిన్= ధర్మంతోడి కూడికచేత - అనగా ధర్మమార్గంలో; పడసి= పొంది; ఈ+కురు,

కుంజరునకున్= ఈ కురుశ్రేష్ఠు డైన పాండురాజుకు; కరము= మిక్కిలి; మనఃప్రీతి= మనస్సంతోషాన్ని; కావించి; పుణ్య, గతికిన్= పుణ్యలోకానికి; కారణమవు+ఐ= హేతువై; తిరముగాన్= శాశ్వతంగా; ఇష్టంబున్ తీర్చితి= అభీష్టాన్ని నెరవేర్చావు; ఏన్= నేను; ఇందున్= ఈ లోకంలో; ధృతిన్= సంతోషంతో; పతి, ఇష్టంబున్= భర్తయొక్క కోరికను; తీర్పను+అ= తీర్చనే లేదు; కానన్= అందుచేత; అన్య, లోకంబు, అందు+ఐనన్= పరలోకంలో నైనా; ప్రీతి= ఇష్టం; చేయఁగన్; కాంతున్= చూస్తాను; పతితోడన్= భర్తతోకూడా; అరిగెదన్= వెళ్తాను; అనియు.

తాత్పర్యం: కుంతీ! నీవు కురువంశాన్ని తరింప చేసే కొడుకులను ధర్మమార్గంలో కని, ఈ కురుశ్రేష్ఠు డైన పాండురాజుకు మిక్కిలి సంతోషం కలిగించి, పుణ్యలోకం పొందడానికి కారణ మయ్యావు. శాశ్వతంగా ఆయన కోర్కె తీర్చావు. నేను ఈ లోకంలో భర్తకోర్కె తీర్చనే లేదు. అందువలన పరలోకంలో నైనా తీర్చటానికి ఆయన వెంట వెళ్తాను.

విశేషం: తరువోజ లక్షణానికి ఆది. 5.28 చూడండి. ఎత్తిపొడుపుగా పలికిన కుంతితో గడుసరిగా మాద్రి మాట్లాడింది. కుంతి ఎత్తిపొడుపును తనమాటలలో ఎంత గోప్యంగా మలచిందో, మాద్రికూడా తన గడుసరితనాన్ని అంత నిపుణంగా గోప్యంచేసి సహజసంభాషణవలె పలికింది. ముందటి పద్యంలో 'మనఃప్రియధర్మపత్నిగా భావిస్తే ఆమె పాండురాజు అనుమతితో మంత్రశక్తివలన పుణ్యగతికి కారకు లైన కొడుకులను కని ఆయనకు పుణ్యగతిని, మనఃప్రీతిని కలిగించింది. మాద్రికి మంత్రశక్తి లేదు కాని అందమైన ఆకృతి ఉన్నది. దానిని పాండురాజు కోరాడు. కాని, దానివలన పాండురాజుకు మనఃప్రీతి కలిగించలేక పోయింది. శాపకారణంగా, మనఃప్రీతిని కలిగించటంలో కుంతి కృతార్థురాలైంది. తాను కాలేకపోయింది అని వాచ్యమైన అర్థం. వ్యంగార్థప్రతీతికూడా కలుగుతున్నది. కుంతీ! నీవు పాండురాజు ఇష్టం తీర్చినదానవు. ఆ యిష్టపూర్తివలన ఆ వాచ్యంవెంట ఇహలోకసుఖంకంటె పరలోకసుఖమే కలుగుతుంది. పాండురాజు నన్ను కోరింది ఇహలోక సుఖాన్ని. దాన్ని తీర్చే అవకాశం లేదు-ఈ లోకంలో. అందువలన ఆయనతోపాటు నేనుకూడా సహగమనంచేసి ఆ కోర్కె పరలోకంలోనైనా తీరుస్తాను అన్నది-మాద్రి. 'పతికి మనఃప్రియధర్మపత్ని' అని ఎత్తిపొడుపుగా మాద్రిని సంబోధించిన అర్థాన్ని పురస్కరించుకొని తానే సహగమనయోగ్యత కలిగినదాని ననీ, అదే పాండురాజుకు మనఃప్రియహేతు వనీ చెప్పింది. మాద్రిశోకపరీతచిత్తప్రవృత్తి వ్యంజకంగా కాంతిగుణంతో కూడిన తరువోజ సార్థకం. (సంపా.)

వ. 'మఱియు మృగశాపభయం బెఱింగియు ని ట్లేమఱిన యతిప్రమత్తురాల; నే నిందుండి పుత్త్రుల రక్షింప నేర; నన్ను వారింప వలవదు; కొడుకుల నేమఱక రక్షించునది' యని చెప్పి కుంతీదేవి వీడ్కొని మునిసహస్రంబునకు మ్రొక్కి మద్రరాజపుత్త్రి పతితోడన చితారూఢ యై యగ్నిశిఖల నపగత ప్రాణ యయ్యెఁ; నంత నయ్యిరువుర యంగంబులు సంగ్రహించుకొని మహామునులు కుంతీదేవిం గొడుకుల నూరార్చి. 146

ప్రతిపదార్థం: మఱియు; మృగ, శాప, భయంబు= జింకయొక్క శాపంవలనకలిగే భయం; ఎఱింగియున్= తెలిసికూడ; ఇట్లు; ఏమఱిన= మరచిపోయిన; అతి, ప్రమత్తురాలన్= మిక్కిలి మత్తు గొన్న దానను - అనగా జాగరూకత లేనిదానను; ఏన్=నేను; ఇందు+ఉండి; పుత్రుల; రక్షింపనేరన్= కాపాడలేను; నన్నున్, వారింప, వలవదు= అడ్డగించవద్దు; కొడుకులన్; ఏమఱక= మరువకుండా; రక్షించునది= కాపాడేది; అని, చెప్పి; కుంతీదేవిన్; వీడ్కొని= వీడి; ముని, సహస్రంబునకు= మునులు వేయిమందికి (మునుల సమూహానికి); మ్రొక్కి= నమస్కరించి; మద్రరాజ, పుత్త్రి; పతితోడన= భర్తతో కూడా; చితా+ఆరూఢ+ఐ= చితిపైకి ఎక్కిందై; అగ్ని శిఖలన్= నిప్పుమంటలలో; అపగత, ప్రాణ= పోయిన ప్రాణాలు కలది; అయ్యెన్= అయినది; అంతన్= అటుపై; ఆ+ఇరువుర, అంగంబులు= ఆ ఇద్దరిఅవయవాలు (శవదహనం తరువాతి రోజు ఆయా అవయవాల

ఎముకలు); సంగ్రహించుకొని= సమకూర్చుకొని - అనగా ఒకటిగా చేర్చి తీసికొని; మహామునులు; కుంతీదేవిన్, కొడుకులన్= కుంతిని, ఆమెపుత్రుల్ని; ఊరార్చి= ఓదార్చి.

తాత్పర్యం: 'మృగశాపంవలన కలిగే భయం తెలిసికూడా ఈవిధంగా జాగ్రత్త లేనిదాన్ని అయిన నేను, ఇక్కడ ఉండి కొడుకులను కాపాడ లేను. నన్ను అడ్డుకోవద్దు. జాగ్రత్తతో నీవే కొడుకులను కాపాడుము' అని కుంతీదేవికి చెప్పి; వెయ్యి మంది(అనేకులైన) మహర్షులకు మ్రొక్కి, భర్తశవంతోపాటు తానుకూడా చితి ఎక్కి మంటలలో మాద్రి ప్రాణాలు వదిలింది. తరువాత మహామునులు మాద్రీపాండురాజుల అస్థిసంచయనం చేసి, కుంతీదేవినీ, ఆమె కొడుకులను ఓదార్చి.

విశేషం: కిందము డిచ్చిన శాపంప్రకారం పాండురాజు ఏ సతితో క్రీడింపబోతాడో ఆమెకూడా చనిపోతుంది. అది ఇక్కడ నిజమయింది.

క. ధరణీరాజ్యవిభూతియు । పరిజనులను బాంధవులను బ్రజ విడిచి తప
శ్చరణతపస్వుల తనకున్ । శరణం బని నమ్మి పాండుజనపతి నెమ్మిన్. 147

ప్రతిపదార్థం: పాండు, జనపతి= పాండురాజు; ధరణీ, రాజ్య విభూతియు= భూరాజ్యసంపదను; పరిజనులను= సేవకులను; బాంధవులను= చుట్టాలను; ప్రజ= ప్రజలను; విడిచి; తపస్+చరణ= తపస్సుచేసే; తపస్వులు+అ= ఋషులే; తనకున్; శరణంబు+అని= దిక్కని; నమ్మి; నెమ్మిన్= ప్రీతితో.

తాత్పర్యం: పాండురాజు రాజ్యసంపదను, సేవకులను, చుట్టాలను ప్రజలను వదలి తపస్సుచేసే ఋషులు మాత్రమే తనకు దిక్కని నమ్మి నిశ్చింతగా.

క. కొడుకుల నిందఱ కిల్లడ । యిడి పరలోకమున కరిగె; నెడసేయక యి
ప్పుడ వీరలఁ గురువృద్ధుల । కడకుం గొని పోవ వలయు గజపురమునకున్. 148

ప్రతిపదార్థం: కొడుకులన్; ఇందఱకున్= ఇంతమందికి - (ఇంతమంది మహర్షులకు); ఇల్లడ, ఇడి= ఇల్లడ పెట్టి, అప్పగించి; పరలోకమునకున్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు; ఎడ, చేయక= ఆలస్యం చేయక; ఇప్పుడు+అ; వీరలన్= పాండవులను; గజ, పురమునకున్= హస్తినాపురానికి; కురు, వృద్ధుల కడకున్= కురువంశంలోని పెద్దల దగ్గరకు; కొనిపోవవలయున్= తీసికొనిపోవాలి.

తాత్పర్యం: కొడుకులను మనందరికి అప్పగించి పాండురాజు స్వర్గానికి వెళ్ళాడు. మనం ఆలస్యం చేయకుండా ఇప్పుడే ఈ పాండవులను హస్తినాపురంలో కురువంశంలోని పెద్దలదగ్గరకు తీసికొనిపోవాలి.

విశేషం: ఎవరైనా తీర్థయాత్రాదులకు పోతూ తిరిగివచ్చేంతవరకూ ఒకరివద్ద భద్రంగా ఉంచి, మరల తిరిగి ఇచ్చేటట్లు అర్థాన్ని (డబ్బు, వస్తువులు) ఉంచటం ఇల్లడపెట్టటం అంటారు. ఇక్కడ పాండవులు పాండురాజుకు, అతని వంశానికి సంబంధించిన ధనంవంటివారు. పాండురాజు పరలోకగతుడైనవాడు కాబట్టి అతనివంశానికి వారసులైన పుత్రులను ఆ వంశంలోని పెద్దలకు ఒప్పచెప్పటం న్యాయం. ఋషులు ధర్మబుద్ధితో తమకు ఆ కర్తవ్య మున్న దని భావించటం మానవసంబంధాలలో ఉండదగిన ఒక మహనీయలక్షణంగా కావ్యోపదేశం.

మునులు పాండవులను హస్తినాపురంబునకుం గొనివచ్చి ధృతరాష్ట్రున కొప్పగించుట (సం.1-117-6)

వ. అని తమలో విచారించి, కుంతీదేవిని గుమారులం దోడ్కొని మునులెల్ల హస్తిపురంబునకు వచ్చి రంత.149

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; తమలోన్; విచారించి= ఆలోచించి; కుంతీదేవిని; ఆమె కుమారులన్= ఆమె కుమారుల్ని; తోడ్కొని= తీసికొనివచ్చి; మునులు+ఎల్లన్= మునులందరు; హస్తి, పురంబునకున్= హస్తినాపురానికి; వచ్చిరి; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: అని మునులు తమలో ఆలోచించి కుంతీదేవిని, కుమారులను వెంటపెట్టుకొని హస్తినాపురానికి వచ్చారు. అప్పుడు.

చ. 'సురల వరప్రసాదమునఁ జూవె సుపుత్త్రులఁ బాండురాజు భా
సురముగఁ గాంచెఁ ; దత్సుతులఁ జూతము రం' డని పౌరు లెల్ల నొం
డొరులకుఁ జెప్పచుం దెరలి యొండొరులం గడవంగ వచ్చి చూ
చిరి భుజవిక్రమాధరిత సింహకిశోరులఁ బాండవేయులన్. 150

ప్రతిపదార్థం: పౌరులు+ఎల్లన్= హస్తినాపుర ప్రజలందరును; పాండురాజు; సురల, వరప్రసాదమునన్+చూవె= దేవతలయొక్క వరప్రసాదంచేత సుమా; సు, పుత్త్రులన్= యోగ్యులైన కొడుకులను; భాసురముగన్= ప్రకాశించేటట్లు; కాంచెన్= కన్నాడు; తత్+సుతులన్= ఆయనయొక్క కొడుకులను; చూతము+రండు+అని; ఒండు+ఒరులకున్= ఒకరి కొకరు; చెప్పుచున్= పలకరించుకుంటూ; తెరలి= బయలుదేరి; ఒండు+ఒరులన్= ఒకరు మరొకరిని; కడవంగన్= దాటి; వచ్చి; భుజ, విక్రమ+అధరిత, సింహ, కిశోరులన్= బాహు పరాక్రమంచే తక్కువగా చేయబడిన సింహపుపిల్లలు కలవారిని - అనగా సింహపుపిల్లలను మించిన పరాక్రమవంతులను; పాండవేయులన్= పాండుపుత్త్రులను; చూచిరి.

తాత్పర్యం: 'పాండురాజు దేవతల అనుగ్రహంచేత సుపుత్రులను కన్నాడు. వారిని చూద్దాం రం'డని హస్తినాపుర ప్రజ లందరూ ఒకరితో ఒకరు చెప్పుకొంటూ, ఒకరికంటె ఒకరు ముందుమిగిలి సింహపుపిల్లలకంటె పరాక్రవంతులైన పాండుకుమారులను చూచారు.

విశేషం: హస్తినాపురానికి దూరమై చాలకాలంగా అడవులలో పాండురాజు ఉంటున్నా, ఆ నగరంలో, రాజ్యంలో, ప్రజలలో అతనికి ఉన్నపలుకుబడి, గౌరవం ఈ పద్యంలో వ్యంగ్యం. ఈ పద్యరచనలో సమాధి అనే శబ్దగుణం సార్థకంగా పోషించబడింది. పాండవులను చూడా లన్నఉత్కంఠను క్రమంగా పౌరులు పెంచుకొంటూ వచ్చి, చివరకు పాండవులను చూచినట్లు ఈ పద్యరచన చిన్నచిన్న పదాలతో, సమాసాలతో సాగి పాండవులను, 'భుజవిక్రమాధరితసింహకిశోరులు'గా వర్ణించిన దీర్ఘసమాసంతో ముగియటంతో ఆరోహగతిని సూచిస్తూ, చూపరుల ఆసక్తినీ, అద్భుతాన్నీ ధ్వనింపచేస్తున్నది. 'పాండవేయులన్' అన్న చివరివిశేషణం 'తండ్రికి తగిన తనయులు' అనే భావం ప్రజలకు కలిగిం దని ధ్వనింపజేస్తున్నది.

ఉ. 'వీరలు దైవశక్తిఁ బ్రభవించిన వా రగు టేమి సందియం?
బీరమణీయకాంతి నుపమింపఁగ వేల్పుల కారె? యిట్టి యా
కారవిశేషసంపదఁ బ్రకాశితతేజముపేర్మిఁ జూడ సా
ధారణమర్త్యులే!' యని ముదంబునఁ బౌరులు దమ్ముఁ జూడఁగన్. 151

ప్రతిపదార్థం: వీరలు= వీళ్ళు; దైవ,శక్తిన్= దేవతలప్రభావంచేత; ప్రభవించిన వారు+అగుట= పుట్టినవాళ్ళుకావటంలో; ఏమి, సందియంబు= అనుమానం ఏ మున్నది? ఈ, రమణీయ, కాంతిన్= ఈ మనోహరమైన కాంతిని; ఉపమింపఁగన్= పోల్చి చూడగా; వేల్పులు+అ, కారె= దేవతలే కదా; ఇట్టి, ఆకార, విశేష, సంపదన్= ఈ విధమైన రూపవిశేషంయొక్క అతిశయాన్ని; ప్రకాశిత, తేజము, పేర్మిన్= ప్రకటం చేయబడిన తేజస్సు యొక్క అతిశయాన్ని; చూడన్= చూడగా; సాధారణ, మర్త్యులే= సామాన్య మానవులా; అని= ఆ విధంగా; పౌరులు= పురప్రజలు; ముదంబునన్= సంతోషంతో; తమ్మున్= తమను; చూడఁగన్= కనుగొనగా.

తాత్పర్యం: 'వీళ్ళు దైవశక్తివలన పుట్టిన వా ళ్ళవటంలో సందేహం ఏముది? ఈ మనోహరమైన కాంతిని పోల్చి చూస్తే వీరు దేవతలే. ఈ విధమైన రూపసంపద, తేజస్సు సామాన్యమానవులకు ఉంటాయా?' - అని పౌరులు తమను సంతోషంతో చూడగా.

విశేషం: పాండవులను చూడాలన్న ప్రజలఆసక్తిని ముందుపద్యంలో వర్ణించి, వాళ్ళను చూచిన తరువాత ప్రజలు వాళ్ళనుగూర్చి చేసే ప్రశంసను ఈ పద్యంలో నన్నయ వర్ణించాడు. పై పద్యంలో కర్తృపదస్థానీయులు ప్రజలు, ఈ పద్యంలోని ప్రజలవాక్యాలలో చూడటానికి వచ్చినప్రజలను ఆకట్టుకొని వారిని తమ అభిమానులుగా మార్చుకొంటున్న పాండవుల మహిమ వ్యంగ్యం. పాండురాజు తరువాత పాండవులే హస్తినకు ప్రభువు లన్నది ధ్వని.

వ. ముని సహస్ర పరివృతులయి జననీ సహితంబు పాండురాజ కుమారులు రాజమార్గంబు దఱియవచ్చి రాజమందిర ద్వారాసన్ను లగునంత, మంత్రి పురోహిత బ్రాహ్మణ నివహంబులు దుర్యోధన దుశ్శాసన ప్రముఖ ధార్తరాష్ట్రశతంబును నెదురు వచ్చి పాండవులం దోడ్కొని తెచ్చిన, భీష్మ విదుర ధృతరాష్ట్ర సత్యవత్యం బికాంబాలికలు మొదలుగా నమ్మునులకు నమస్కరించి; రంతం దమకు మ్రొక్కిన కుమారుల నతిస్నేహంబున నెత్తికొని. కుంతిని బ్రియపూర్వకంబున సంభావించి, పాండురాజవియోగదుఃఖితు లయి మహాశోకంబునం దేలుచున్న విదుర ధృతరాష్ట్రుల గాంధారీ సహితం బూరార్చి, యమ్మునులయం దొక్కవృద్ధతపస్వి ముని సహస్రానుమతంబున ని ట్లనియె. 152

ప్రతిపదార్థం: ముని, సహస్ర, పరివృతులు+అయి= మునులు వెయ్యి మందిచే (అనేకులచే) చుట్టబడినవాళ్ళయి; జననీ, సహితంబు= తల్లితోకూడా; పాండురాజ, కుమారులు; రాజమార్గంబు; దఱియ, వచ్చి= చేరవచ్చి; రాజ, మందిర, ద్వార+ఆసన్నులు+అగునంతన్= రాజభవనంయొక్క ద్వారం దగ్గరకు వచ్చినవారు కాగానే; మంత్రి, పురోహిత, బ్రాహ్మణ, నివహంబులు= మంత్రుల, పురోహితుల, బ్రాహ్మణుల యొక్క సమూహాలు; దుర్యోధన, ప్రముఖ, ధార్తరాష్ట్ర, శతంబును= దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన ధృతరాష్ట్రుని కుమారులు వందమంది; ఎదురువచ్చి; పాండవులన్; తోడ్కొని, తెచ్చినన్= తీసికొనిరాగా; భీష్మ, విదుర, ధృతరాష్ట్ర, సత్యవతి+అంబికా+అంబాలికలు= భీష్ముడు, విదురుడు, ధృతరాష్ట్రుడు, సత్యవతి, అంబిక, అంబాలిక; మొదలుగాన్= ముందుగా; ఆ+మునులకు; నమస్కరించిరి; అంతన్= ఆ సమయంలో; మ్రొక్కిన+కుమారులన్= తమకు నమస్కరించిన పుత్రుల్ని; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; ఎత్తికొని= పైకెత్తి; కుంతినిన్, ప్రియ, పూర్వకంబునన్= ప్రీతిగా; సంభావించి= గౌరవించి; పాండురాజ, వియోగ, దుఃఖితులు+అయి= పాండురాజు యొక్క ఎడబాటుచే (మరణంచే) దుఃఖాన్ని పొందినవాళ్ళయి; మహా, శోకంబునన్= పెద్దదుఃఖంలో; తేలుచున్న= తేలిపోతూ ఉండే; విదుర, ధృతరాష్ట్రుల, గాంధారీ, సహితంబున్= విదురునీ, ధృతరాష్ట్రునీ, గాంధారితో కూడా; ఊరార్చి= ఓదార్చి;

ఆ+మునులయందు= ఆ మహర్షులలో; ఒక్క; వృద్ధ, తపస్వి= వృద్ధ ముని;, సహస్ర+అనుమతంబునన్= ఋషులు వెయ్యిమందియొక్క అనుమతితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వెయ్యిమంది మునులు తమను చుట్టి వెంట రాగా, తల్లితోకూడి పాండవులు, రాజమార్గాన్ని చేరటానికి వచ్చి, రాజభవనద్వారాన్ని సమీపించగానే మంత్రులు, పురోహితులు, బ్రాహ్మణులు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన ధృతరాష్ట్రునికొడుకులు వందమంది ఎదురువచ్చి, వారిని తోడ్కొని లోపలికి తీసికొనివచ్చారు. భీష్ముడు, విదురుడు, సత్యవతి, ధృతరాష్ట్రుడు, అంబిక, అంబాలిక ముందుగా ఆ మునులకు నమస్కరించి, తమకు మ్రొక్కిన పాండవులను ప్రేమతో ఎత్తుకొని, కుంతిని ఎంతోప్రీతితో గౌరవించారు. పాండురాజుమరణానికి పెద్దగా దుఃఖిస్తున్న విదురధృతరాష్ట్రులనూ, గాంధారినీకూడా ఓదార్చి, ఆ మునులలో పెద్దవాడైన ఒకమహాముని మిగతా ముని లందరి అనుమతితో ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది - ఒక రాజకుటుంబాన్ని రాజకుటుంబసభ్యులు ఆహ్వానించే తీరును తెలిపే వర్ణన. ప్రజాపరిషత్తులలోనూ, సామూహికంగా రాజును దర్శించే సందర్భాలలోనూ అందరూ మాట్లాడకుండా వారిచేత అనుతింపబడిన ప్రతినిధులే మాట్లాడే సాంఘిక సంప్రదాయం వృద్ధతపస్వి మాట్లాడటంలో కనపడుతున్నది.

ఉ. భానునిభుండు పాండుజనపాలుఁడు ఘోరతపంబు సేసి ధ
ర్మానిలవాసవాశ్వినుల దైనవరంబున శక్తిపేర్మితో
నీ నరనాథనందనుల నేవుర వంశవివృద్ధిపొంటెఁ బం
చాననసత్త్వులం బడసె నాశతశృంగమహానగంబునన్. 153

ప్రతిపదార్థం: భాను, నిభుండు= సూర్యునితో సమానుడు; పాండు, జన, పాలుఁడు= పాండురాజు, ఆ శతశృంగ, మహా నగంబునన్= ఆ శతశృంగ మనే గొప్పపర్వతంమీద; ఘోర, తపంబు= భయంకర మైన తపస్సు; చేసి; ధర్మ+ అనిల, వాసవ+అశ్వినులది+ఐన= యమునియొక్క, వాయుదేవునియొక్క, దేవేంద్రునియొక్క, అశ్వినీదేవతలయొక్క; వరంబున, శక్తి, పేర్మితో= వరప్రభావంయొక్క అతిశయంతో; వంశ; వివృద్ధి, పొంటెన్= వంశంయొక్క గొప్పపెంపుదలకొరకు; ఈ, నరనాథ, నందనులన్= ఈ రాజకుమారులను; పంచానన, సత్త్వులన్= సింహంయొక్క బలంవంటి బలంకలవాళ్ళను; ఏవురన్= ఐదుగురిని; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: సూర్యునితో సమాను డైన పాండురాజు, శతశృంగపర్వతంమీద పెద్దతపస్సు చేసి, యమ, వాయు, దేవేంద్ర, అశ్వినీదేవతలయొక్క వరప్రసాదంతో, వంశాభివృద్ధికొరకు సింహాలవలె బలవంతు లైన అయిదుగురు కొడుకులను కన్నాడు.

విశేషం: ఈ పద్యరచనలో అర్థవ్యక్తి అనే గుణం సార్థకం. వృద్ధతపస్వి మాట్లాడినమాటలలో వంశవృద్ధికొరకు పాండురాజు దేవతలవరాలతో పుత్రులను ఏ విధంగా పొందాడో ప్రతిపదసార్థకంగా వివరించాడు. వస్తుస్వభావాన్ని ఝటితిస్ఫూర్తితో వ్యక్తమయ్యేటట్లు చెప్పటం అర్థవ్యక్తిగుణస్వభావం. పాండురాజు ఘోరతపస్సుచేత సూర్యునివలె ప్రకాశించాడు. దానికి దేవతలు మెచ్చి వరాలుగా తనయుల నిచ్చారు. అరణ్యంలో పెరిగిన పాండవులు సింహసత్త్వులుగా శ్రేష్ఠు లనిపించుకొన్నారు. దీనికి శతశృంగాలతో కూడుకొన్న ఆ పర్వతంమీది వేలాదిమునులు సాక్ష్యం! అని ప్రత్యక్షప్రమాణంగా పాండవులను పరిచయం చేశాడు. (సంపా.)

క. త్రిదశాధినాథసదృశుఁడు । ద్రిదశాలయమునకు మాద్రిదేవియుఁ దానున్
ముదమొనర నరిగె నేఁటికిఁ । బదియేడగునాఁడు దురితబంధచ్యుతుఁ డై. 154

విశేషం: త్రిదశ+అధినాథ, సదృశుఁడు= దేవేంద్రునితో సమాన మైనవాడు - పాండురాజు; మాద్రిదేవియున్+ తానున్= మాద్రి మరియు తానూ; దురిత, బంధ, చ్యుతుఁ డై= పాపబంధాలనుండి విడువబడినవాడై; నేటికిన్; పది+ఏడగు, నాఁడు= పదిహేడో రోజు; త్రిదశ+ఆలయమునకున్= స్వర్గానికి; ముదము= సంతోషం, ఒనరన్= ఒప్పగా; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రునితో సమాను డైన పాండురాజు మాద్రితో పాపబంధాలనుండి విముక్తుడై పదిహేడు రోజులక్రితం స్వర్గానికి వెళ్ళాడు.

విశేషం: మాద్రీపాండురాజులు మరణించారు అని వాచ్యంగా చెప్పకుండా స్వర్గస్థు లైనా రని పౌరుష్యం లేనట్లుగా ముని చెప్పటంలో సౌకుమార్యం అనే శబ్దగుణం పోషింపబడింది. ఉత్తమసంతానంవలన పాండురాజుకు ఉత్తమగతి - అంటే స్వర్గలోక ప్రాప్తి - లభించిం దని వ్యంగ్యం. భూలోకంలో ఇంద్రునివలె బ్రతికిన పాండురాజు స్వర్గానికి వెళ్ళేటప్పుడు-శచీసమేతంగా ఇంద్రుడు వెళ్ళినట్లుగా మాద్రీసహితంగా వెళ్ళా డనీ, సతీసమేతుడై స్వర్గగమనంచేసిన పాండురాజు పాపబంధా లన్నీ తెగిపోవటంవలన శాశ్వతస్వర్గాలోకావాప్తిని పొందా డనీ వస్తుధ్వని. (సంపా.)

క. కమనీయలీల నొక్కట । నమరపురంబునకుఁ జనిన యయ్యిరువుర యం
గము లివి; పితృమేధవిధి । క్రమ మొనరఁగ సంస్కరింపఁ గడఁగుఁడు వీనిన్. 155

ప్రతిపదార్థం: కమనీయ, లీలన్= మనోహర మైన విలాసంతో; ఒక్కటన్= ఒకరితో ఒకరు; అమర, పురంబునకున్= స్వర్గానికి; చనినన్ = వెళ్ళగా; ఆ+ఇరువుర, అంగములు= ఆ ఇద్దరియొక్క అస్థులు; ఇవి; పితృమేధ, విధి, క్రమము= ఉత్తర క్రియలయొక్క విధానం; ఒనరన్= ఒప్పేటట్లు; వీనిన్= ఈ అస్థుల్ని; సంస్కరింపన్= సంస్కరించటానికి; కడఁగుఁడు= ప్రయత్నించండి.

తాత్పర్యం: ఆ విధంగా ఒకటిగా స్వర్గానికి వెళ్ళిన ఆ ఇద్దరి అస్థు లివి. ఉత్తరక్రియలు శాస్త్రోక్తంగా జరిపి, వీటిని సంస్కరించటానికి ప్రయత్నించండి.

వ. ‘ ఈ దేవియును బతితోడన పోవ సమకట్టినం బుత్త్రరక్షణార్థంబు మునిగణ ప్రార్థిత యై యెట్టకేనియు ధృతప్రాణ యయ్యెః నిక్కుమారులు కురుకులవిస్తారకులు, దేవమూర్తులు. యుధిష్ఠిరభీమార్జున నకులసహదేవు లనంగా దేవాధిష్ఠితనామంబులు దాల్చి, బ్రహ్మర్షి ప్రణీతోపనయను లై శ్రుతాధ్యయన సంపన్ను లగుచుఁ బెరుఁగుచున్నవారు వీరలం జేకొని కురువృద్ధులు ధర్మబుద్ధి రక్షించునది’ యని చెప్పి సిద్ధచారణగణంబులతో నమ్మహాముని లంతర్ధానంబు సేసి; రంత వ్యాస భీష్మ ధృతరాష్ట్రుల యనుమతంబున. 156

ప్రతిపదార్థం: ఈ, దేవియును= ఈ కుంతీదేవికూడ; పతితోడన్+అ= భర్తతోనే; పోవన్= వెళ్ళటానికి; సమకట్టినన్= పూనుకోగా; పుత్త్ర, రక్షణ+అర్థంబు= కొడుకులను కాపాడటంకొరకు; ముని, గణ, ప్రార్థిత+ఐ= ఋషులసమూహంచేత ప్రార్థింపబడిందై; ఎట్టకు+ఏనియు= చిట్టచివరకు; ధృత, ప్రాణ= ధరింపబడిన ప్రాణాలు కలది; అయ్యెన్= అయింది; ఈ+కుమారులు= ఈ పాండవులు; కురు, కుల, విస్తారకులు= కురువంశాన్ని వృద్ధిచేసేవారు; దేవమూర్తులు= దేవతాస్వరూపులు;

యుధిష్ఠిర, భీమ+అర్జున, నకుల, సహదేవులు; అనంగాన్; దేవ+అధిష్ఠిత= దేవతలచేత ప్రభావితా లైన; నామంబులు= పేర్లు; తాల్చి= ధరించి; బ్రహ్మ+ఋషి, ప్రణీత+ఉపనయనులు+ఐ= బ్రహ్మర్షులచేత చేయబడిన ఉపనయనం కలవాళ్ళయి; శ్రుత+అధ్యయన, సంపన్నులు= వేదాధ్యయనం అనే సంపద కలవాళ్ళు; అగుచున్; పెరుఁగుచున్నవారు= పెరుగుతూ ఉన్నారు; వీరలన్= వీళ్లను; చేకొని= తీసికొని; కురు, వృద్ధులు= కురువంశంలోని పెద్దలు; ధర్మ, బుద్ధిన్= ధర్మంతో కూడిన బుద్ధితో; రక్షించునది= కాపాడవలసింది; అని= ఆ విధంగా; చెప్పి= వివరించి; సిద్ధ, చారణ, గణంబులతోన్= సిద్ధుల, చారణుల యొక్క సమూహాలతో; ఆ+మహా, మునులు; అంతర్ధానంబు+ చేసిరి= కనపడకుండా పోయారు; అంతన్= తరువాత; వ్యాస, భీష్మ, ధృతరాష్ట్రుల, అనుమతంబునన్= వ్యాస, భీష్మ, ధృతరాష్ట్రులయొక్క అనుమతితో.

తాత్పర్యం: 'ఈ కుంతీదేవికూడా భర్తతో సహగమనం చేయటానికి పూనుకొన్నది. అయితే, ఋషులు ప్రార్థించటం చేత కొడుకులను రక్షించటానికి బ్రతికి ఉన్నది. ఈ కొడుకులు కురువంశాన్ని వృద్ధి చేస్తారు; దేవతాస్వరూపులు; యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవు లని దేవతల ప్రభావం కల పేర్లు ధరించి, బ్రహ్మర్షులు ఉపనయనం చేయగా, చక్కగా వేదాధ్యయనం చేస్తూ పెరుగుతున్నారు. కురువంశంలో పెద్ద లైనమీరు వీళ్ళను చేరదీసి ధర్మబుద్ధితో రక్షించండి' - అని చెప్పి, ఆ మహామునులు సిద్ధచారణులతోసహా అంతర్ధాన మయ్యారు. తరువాత వ్యాస భీష్మ ధృతరాష్ట్రుల అనుమతితో.

విశేషం: శతశృంగపర్వతంలో జరిగిన వృత్తాంతా న్నంతా వృద్ధమునిచేత సంగ్రహంగా చెప్పించి, హస్తినాపుర కథ కొక సంబంధాన్ని పునరుద్ధరించాడు-నన్నయ. భర్తతోపాటు సహగమనం చేస్తా నని మాద్రి చెప్పినమాటలే పూర్వకథలో ఉన్నాయి. ఆ తరువాత కుంతి తానుకూడా సహగమనానికి సిద్ధమైనట్లూ, మాద్రియే కాక, మునిగణాలు ఆమెకు ఎంతోనచ్చజెప్పి పుత్రరక్షణార్థం బ్రతుకు మని బోధించా రనే వివరణం ఇక్కడ చెప్పాడు-నన్నయ. సమయసందర్భా లెరిగి కథార్థాలను ఉత్కంఠావహంగా కూర్చటం ప్రసన్నకథాకలితార్థయుక్తిలక్షణం. (సంపా.)

సీ. వెలయంగఁ బితృమేధవిధి విచక్షణశీల । సద్భూసురోపదేశక్రమమున
నధికవిభూతితో నతిపవిత్రదే । శమున నయ్యంగముల్ సంస్కరించి,
పుణ్యస్వధామృతంబుల నొప్పఁగా । శ్రాద్ధవిధి యొనరించి, సద్విప్రతతికి
నగ్రహారములు దివ్యాంబరాభరణ శ । య్యాసనచ్ఛత్రగవాశ్వకరుల

ఆ. నిచ్చి, సర్వజనుల కెల్లను భోజన । దాన మొనరఁ జేసి, ధర్మవిదుఁడు
విదురుఁ డట్లు పాండువిభునకుఁ జేయించె । నన్యలోకహితంబు లైన విధులు. 157

ప్రతిపదార్థం: ధర్మ, విదుఁడు= ధర్మం తెలిసినవాడు; విదురుఁడు; వెలయంగన్= ఒప్పేటట్లు; పితృమేధ, విధి, విచక్షణ, శీల, సత్+భూసుర+ఉపదేశ, క్రమమునన్= పితృయజ్ఞ విధానంలో పండితస్వభావం కల ఉత్తము లైన బ్రాహ్మణులు చెప్పిన విధంగా; అధిక, విభూతితోన్= మిక్కిలి ఐశ్వర్యంతో; అతి, పవిత్ర, ప్రదేశమునన్= మిక్కిలి పవిత్రమైన స్థలంలో; ఆ+అంగముల్= ఆ అస్థికలు; సంస్కరించి= సంస్కారం జరిపించి; పుణ్య, స్వధా+అమృతంబులన్= పుణ్య మైన హోమాలతో, జలతర్పణాలతో; ఒప్పఁగాన్= తగు విధముగా; శ్రాద్ధ, విధి= శ్రాద్ధకర్మను; ఒనరించి= చేసి; సత్+విప్ర, తతికిన్= ఉత్తమ బ్రాహ్మణుల సమూహానికి; అగ్రహారాలు= కొన్నిగ్రామాలు; దివ్య+అంబర+ఆభరణ, శయ్యా+ఆసన, ఛత్ర, గో+అశ్వ, కరులన్= శ్రేష్ఠమైన వస్త్రాలను, ఆభరణాలను, పడకలను, ఆసనాలను, గొడుగులను, గోవులను, గుర్రాలను, ఏనుగులను; ఇచ్చి; సర్వ,

జనులకు+ఎల్లన్= ప్రజలకు అందరికి; భోజన, దానమున్= అన్నదానాన్ని; ఒనరన్= తగినట్లు; చేసి; పాండువిభునకు= పాండురాజుకు; అన్యలోక, హితములు+ఐన= పరలోకంలో మేలు చేసేవి అయిన; విధులు= కర్మలు; అట్లు; చేయించెన్.

తాత్పర్యం: ధర్మజ్ఞు డైన విదురుడు పితృయజ్ఞవిధానం చక్కగా తెలిసిన బ్రాహ్మణోత్తములు చెప్పినప్రకారం మిక్కిలి వైభవంగా మహాపవిత్రస్థలంలో ఆ అస్థికలకు సంస్కారం జరిపించి, పుణ్యాహోమంతో, జలతర్పణాలతో శ్రాద్ధకర్మ చేయించి, సద్బ్రాహ్మణులకు అగ్రహారాలు, వస్త్రాలు, ఆభరణాలు, పడకలు, ఆసనాలు, గొడుగులు, గోవులు, గుఱ్ఱాలు, ఏనుగులు దానా లిచ్చి, ప్రజ లందరికీ అన్నదానం చేసి, పాండురాజుకు ఉత్తరక్రియలు చేయించారు.

విశేషం: గో+అశ్వ= గవాశ్వ - అయవాయావాదేశసంధి. దేవతలకు 'స్వాహా'శబ్దంతో, పితరులకు 'స్వధా' శబ్దంతో హోమాలు చేయడం శాస్త్రవిధానం.

వ. అంతఁ గృష్ణద్వైపాయనుండు వారి కందఱకు దుఃఖోపశమనంబుసేసి, యొక్కనాఁడు సత్యవతికి నేకాంతంబున ని ట్లనియె. 158

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; కృష్ణద్వైపాయనుండు; వారికి+అందఱకున్= వా ళ్లందరికి; దుఃఖ+ఉపశమనంబు చేసి= దుఃఖం తగ్గేటట్లు ఓదార్చి; ఒక్కనాఁడు; సత్యవతికిన్= తనతల్లి సత్యవతితో; ఏకాంతంబునన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత కృష్ణద్వైపాయనుడు వా ళ్ళందరినీ ఓదార్చి, ఒకనాడు సత్యవతితో రహస్యంగా ఇట్లా అన్నాడు.

క. మతిఁ దలఁపఁగ సంసారం । బతి చంచల మెండమావులట్టుల సంప
త్ప్రతతు లతిక్షణికంబులు; । గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్. 159

ప్రతిపదార్థం: మతిన్= బుద్ధితో; తలఁపఁగన్= ఆలోచించగా; సంసారంబు;అతి, చంచలము= మిక్కిలి చలించునది; ఎండమావులు+అట్టులన్= ఎండమావులవలె; సంపత్+ప్రతతులు= సంపదలయొక్క సమూహాలు; అతి, క్షణికంబులు= మిక్కిలి త్వరగా నశించేవి; గత కాలము= గడచిన కాలం; వచ్చు, కాలముకంటెన్= రాబోయే కాలంకంటె; మేలు= మంచిది, ఉత్తమమైంది.

తాత్పర్యం: ఆలోచించి చూస్తే సంసారం ఎండమావులవలె అతిచంచలం. సంపదలు అశాశ్వతాలు. రాబోయే రోజులకంటె గడచిపోయిన రోజులే మేలు.

విశేషం: అలం: ఉపమ. అతిప్రసిద్ధా లైన నన్నయసూక్తులలో ఇది ఒకటి. ఏ యుగంలో నైనా, ఎవరికైనా ఇది సత్య మనిపిస్తుంది.

క. క్రూరులు విలుప్త ధర్మా । చారులు ధృతరాష్ట్రసుతు లసద్వృత్తులు ని
ష్కారణవైరులు వీరల । కారణమున నెగ్గు పుట్టుఁ గౌరవ్యులకున్. 160

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, సుతులు= ధృతరాష్ట్రుని యొక్క కొడుకులు; క్రూరులు; విలుప్త, ధర్మ+ఆచారులు= నశించిన ధర్మ బద్ధమైన నడవడి కలవారు; అసత్+వృత్తులు= మంచివి కాని పనులు కలవాళ్ళు; నిష్కారణ, వైరులు= కారణం

లేకుండానే శత్రువులయేవాళ్ళు; వీరల, కారణమునన్; కౌరవ్యలకున్= కురువంశంలో పుట్టిన వాళ్ళకు; ఎగ్గు= కీడు; పుట్టున్= కలుగుతుంది.

తాత్పర్యం: ధృతరాష్ట్రునికొడుకులు దుర్మార్గులు. కారణం లేకుండానే వైరం వహించేవారు. వారికారణంగా కౌరవవంశానికి కీడు కలుగుతుంది.

వ. 'దాని ధృతరాష్ట్రుండు తాన యనుభవించుంగాని మీ రీ దారుణంబుఁ జూడక వీరి విడిచి తపోవనంబున కరుగుం' డని చెప్పి చనిన సత్యవతియుఁ బారాశర్యునుపదేశంబు భీష్మవిదురుల కెఱింగించి కోడండ్ర నంబికాంబాలికలం దోడ్కొని వనంబునకుం జని, తానును వారు నతిఘోరతపంబు సేసి కొండొక కాలమునకు శరీరంబులు విడిచి పుణ్యగతికిం బోయి; రిట ధృతరాష్ట్రుండును. 161

ప్రతిపదార్థం: దానిన్= ఆ కీడును; ధృతరాష్ట్రుండు; తాను+అ= తానే; అనుభవించున్= అనుభవిస్తాడు; కాని; మీరు; ఈ, దారుణంబున్= ఈ దారుణాన్ని; చూడక= చూడకుండా; వీరిన్= వీరిని; విడిచి= వదలి; తపోవనంబునకున్= తపస్సు చేయు అడవికి; అరుగుండు= వెళ్ళండి; అని= ఆ విధంగా; చెప్పి= తెలిపి; చనినన్= పోగా; సత్యవతియున్= సత్యవతికూడా; పారాశర్యు, ఉపదేశంబు= పరాశరునికొడుకైన కృష్ణద్వైపాయనుని ఉపదేశాన్ని; భీష్మ, విదురులకున్= భీష్మునికి, విదురునికి; ఎఱింగించి= తెలిపి; కోడండ్రన్= కోడళ్లైన; అంబికా+అంబాలికలన్= అంబికను, అంబాలికను; తోడ్కొని= తీసికొని; వనంబునకున్= అడవికి; చని= వెళ్ళి; తానును= తానూ; వారు= వాళ్ళూ; అతి, ఘోర, తపంబు= మిక్కిలి భయంకర మైన తపస్సు; చేసి; కొండొక, కాలమునకున్= కొంతకాలానికి; శరీరంబులు; విడిచి; పుణ్య, గతికిన్= స్వర్గానికి; పోయిరి; ఇట; ధృతరాష్ట్రుండును-

తాత్పర్యం: 'దానిని ధృతరాష్ట్రుడు తానే అనుభవిస్తాడు. కాబట్టి మీరు ఈ దారుణాన్ని చూడకుండా వీళ్ళను విడిచిపెట్టి తపోవనానికి వెళ్ళండి' అని చెప్పి వెళ్ళగా, సత్యవతికూడ వ్యాసుని ఉపదేశాన్ని భీష్మునికీ, విదురునికీ తెలిపి, కోడళ్ళయిన అంబిక, అంబాలికలను వెంటతీసికొని అడవికి వెళ్ళి, తానూ వాళ్ళూ తీవ్రమైన తపస్సుచేసి, కొంతకాలానికి శరీరాలు విడిచి స్వర్గానికి చేరారు. ఇక ఇక్కడ ధృతరాష్ట్రుడు.

విశేషం: ద్రష్ట అయిన కృష్ణద్వైపాయనుడు కౌరవుల స్వభావాలు, భవిష్యత్పరిణామాలు దర్శించాడు. కౌరవ వంశాభ్యుదయంమీద కొండంత ఆశ పెట్టుకొన్న సత్యవతీదేవిగుండె బ్రద్దలు కాకుండ ముందుగానే దాన్ని తెలిపి, ఆమెను తపోవనానికి పంపాడు.

కురుపాండుకుమారుల బాలక్రీడలు (సం. 1-119-13)

క. తన సుతులు పాండు సుతు లని। మనమున భేదింప కతిసమంజసభావం
బున నొక్క రూపకాఁ జే। కొని యుండెం బాండురాజుకొడుకులఁ బ్రీతిన్. 162

ప్రతిపదార్థం: తన, సుతులు= తన కొడుకులు; పాండు, సుతులు= పాండురాజు, కొడుకులు; అని= ఆ విధంగా; మనమునన్= మనస్సులో; భేదింపక= తేడా చూపక; అతి, సమంజస, భావంబునన్= మిక్కిలి న్యాయబుద్ధితో; ఒక్కరూపు+అ, కాన్= ఒకే విధంగా, ప్రీతిన్= ప్రేమతో; పాండురాజు, కొడుకులన్= పాండవుల్ని; చేకొని+ఉండెన్= చేపట్టి ఉన్నాడు.

తాత్పర్యం: తనకొడుకులు, పాండురాజుకొడుకులు అనే భేదభావం లేక, మిక్కిలిన్యాయబుద్ధితో అందరినీ ఒకే విధంగా చూస్తూ పాండవులను ప్రేమతో పెంచుతూ ఉన్నాడు.

క. ధృతరాష్ట్రునెయ్యమున సం । తతవర్ధితు లగుచుఁ బాండుతనయులు వినయా
న్వితులు కుమారక్రీడా । రతు లయి యొడఁగూడి ధార్తరాష్ట్రులతోడన్. 163

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రు, నెయ్యమునన్= ధృతరాష్ట్రునిప్రేమతో; సంతత, వర్ధితులు+అగుచున్= ఎల్లప్పుడు పెంచబడిన వాళ్ళయి; వినయ+అన్వితులు= వినయంతో కూడినవారు; పాండు, తనయులు= పాండురాజుకొడుకులు; ధార్తరాష్ట్రుల తోడన్= ధృతరాష్ట్రునికొడుకులతో; ఒడన్+కూడి= కలిసి; కుమార, క్రీడా, రతులు+అయి= బాలక్రీడలలో ఆసక్తి కలవాళ్ళయి.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని ప్రేమచేత పెరుగుతూ వినయవంతు లైన పాండవులు కౌరవులతో కలిసి బాలక్రీడల మీద ఆసక్తి కలవాళ్ళయి.

క. గిఱుపునెడ నేయునెడ వడిఁ । బఱచునెడం బెనఁగునెడ నపార బలంబుల్
మెఱయునెడ భీమునకు నం । దొఱుఁ గీడ్పడఁ దొడఁగి రుద్ధతులు రాజసుతుల్. 164

ప్రతిపదార్థం: గిఱుపు, ఎడన్= తిరిగేటప్పుడు; ఏయు, ఎడన్= కొట్టేటప్పుడు; వడిన్= వేగంగా; పఱచు, ఎడన్= పరుగెత్తేటప్పుడు; పెనఁగు, ఎడన్= పెనగులాడేటప్పుడు; అపార, బలంబుల్= అంతులేని బలాలను; మెఱయు, ఎడన్= చూపేటప్పుడు; ఉద్ధతులు= గర్వించినవారు; రాజ, సుతుల్= రాజకుమారులు; అందొఱున్= అందరూ; భీమునకున్; కీడ్పడన్= తక్కువ అవటానికి; తొడఁగిరి= పూనుకొన్నారు.

తాత్పర్యం: గుండ్రంగా తిరిగేటప్పుడు, కొట్టేటప్పుడు, వేగంగా పరుగెత్తేటప్పుడు, పెనగులాడేటప్పుడు, అపార బలాలను ప్రదర్శించేటప్పుడు గర్వంతో ఉన్న రాజకుమారు లంతా భీమునికన్నా తక్కువ అవుతున్నారు.

క. వదలక పెనఁగి పదుండ్రం । బదియేవుర నొక్కపెట్ట పట్టి ధరిత్రి
జెదరఁ బడవైచి పవనజుఁ । డదయుండయి వీఁపు లొలియ నందఱ నీడ్చున్. 165

ప్రతిపదార్థం: వదలక; పెనఁగి= పోరాడి; పదుండ్రన్= పదిమందిని; పదియేవురన్= పదిహేనుమందిని; ఒక్కపెట్టు+అ= ఒక్కసారిగ; పట్టి; ధరిత్రిన్= భూమిమీద; చెదరన్= చెల్లాచెదురుగా; పడవైచి= క్రిందపడవేసి; పవనజుఁడు= వాయుదేవునికి పుట్టినవాడు - భీముడు; అదయుండు+అయి= దయలేనివాడై; వీఁపులు+ఒలియన్= వీపుల చర్మం ఊడిపోయేట్లుగ; అందఱన్, ఈడ్చున్= అందరినీ, ఈడ్చేవాడు.

తాత్పర్యం: వదలక పోరాడి, పది లేదా పదిహేనుమందిని ఒక్కసారిగా పట్టి, నేలమీద చెల్లాచెదురుగా పడవేసి, భీముడు దయలేనివాడై అందరివీపులచర్మాలు లేచిపోయేట్లు ఈడ్చేవాడు.

సీ. కూడి జలక్రీడ లాడుచోఁ గడఁగి యా । ధృతరాష్ట్రతనయుల నతులశక్తి
లెక్కించియుఁ బదుండ్ర నొక్కొక్క భుజమున । నెక్కించుకొని, వారి యుక్కడంగఁ
గ్రంచఱ నీరిలో ముంచుచు నెత్తుచుఁ । గారించి తీరంబు చేరఁ బెట్టుఁ ;
గోరి ఫలార్థు లై వారల యెక్కిన । మ్రాఁకుల మొదళ్ల వీఁకఁ బట్టి

ఆ. వడిఁ గదల్చుఁ బండ్లు దడఁబడువారల । తోన ధరణిమీఁదఁ దొరఁగుచుండ;
నిట్టిపాట గాడ్పుపట్టిచే దుశ్శాస । నాదు లెల్ల బాధితాత్ము లైరి. 166

ప్రతిపదార్థం: కూడి; జలక్రీడలు; ఆడుచోన్; కడఁగి= పూని; ఆ ధృతరాష్ట్ర, తనయులన్= ఆ ధృతరాష్ట్రుని కొడుకులను; అతుల, శక్తిన్= సాటిలేని బలంతో; లెక్కించియున్= లెక్కపెట్టి; పదుండ్రన్= పదిమందిని; ఒక్క+ఒక్క, భుజమునన్= ఒక్కొక్క భుజంమీద; ఎక్కించుకొని; వారి, ఉక్కు= వాళ్ల బలం; అడంగన్= అణగేటట్లుగా; క్రంచఱ= వేగంగా; నీరిలోన్; ముంచుచున్; ఎత్తుచున్; కారించి= బాధించి; తీరంబు= గట్టును; చేరన్= చేరేట్లు; పెట్టున్; కోరి; ఫల+అర్థులు+ఐ= పండ్లు కోరినవాళ్ళయి; వారల, ఎక్కిన మ్రాకులమొదళ్లను= వా రెక్కినట్టి చెట్లమొదళ్ళను; వీఁకన్= బలంతో; పట్టి; తడఁబడు, వారలతోనన్; పండ్లు; ధరణి, మీఁదన్= భూమిమీద; తొరఁగుచుండన్= పడుతుండగా; వడిన్= వేగంగా; కదల్చున్= కదలించేవాడు; ఇట్టిపాట= ఈ విధంగా; గాడ్పు, పట్టిచే= వాయుదేవుని కొడుకైన భీమునిచేత; దుశ్శాశన+ఆదులు+ఎల్లన్= దుశ్శాసనుడు మొదలైనవాళ్లంతా; బాధిత+ఆత్ములు+ఐరి= బాధింపబడిన శరీరాలుకలవాళ్ళు అయ్యారు.

తాత్పర్యం: అంతా చేరి జలక్రీడలు ఆడేటప్పుడు భీముడు సాటిలేని బలంతో పూని ధృతరాష్ట్రునికొడుకులను ఒక్కొక్క భుజంమీద పదిమందిని లెక్కపెట్టి ఎక్కించుకొని, వాళ్ళ బలం అణగేటట్లు వేగంగా నీటిలో ముంచుతూ, పై కెత్తుతూ బాధించి, గట్టుకు చేర్చేవాడు. వాళ్ళు పండ్లు కోయడానికి ఎక్కిన చెట్లమొదళ్ళను బలంగా వేగంగా కదల్చి, వాళ్ళూ, పండ్లూ నేలమీద రాలేటట్లు చేసేవాడు. ఈ విధంగా దుశ్శాసనుడు మొదలైనవాళ్ళంతా భీమునిచేత బాధింపబడుతూ ఉండేవాళ్ళు.

వ. దాని సహింపనోపక యొక్కనాఁడు దుర్యోధనుండు శకుని దుశ్శాసనాదులతో విచారించి యి ట్లనియె.167

ప్రతిపదార్థం: దానిన్= భీమునిచేత కలిగేబాధను; సహింపన్+ఓపక= ఓర్చుకోలేక; ఒక్కనాఁడు; దుర్యోధనుండు; శకుని; దుశ్శాసన+ఆదులతో= శకుని, దుశ్శాసనుడు మొదలైనవాళ్ళతో; విచారించి= ఆలోచించి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: భీమునిచేత కలిగేబాధను ఓర్చుకోలేక, ఒకనాడు దుర్యోధనుడు శకుని, దుశ్శాసనుడు మొదలైన వాళ్ళతో ఆలోచించి ఈ విధంగా అన్నాడు.

పృథ్వి.

ఉపాంశువధఁ జేసి మధ్యము మదోద్ధతుం జంపి ని
స్సపత్నముగ ధర్మనందను నశక్తు బంధించి యే
నపాండవముగా సముద్రవలయాఖిలక్షోణి మ
త్కృపాణపటుశక్తి నత్యధికకీర్తి నై యేలెదన్. 168

ప్రతిపదార్థం: మద+ఉద్ధతున్= గర్వంతో విజృంభించినవాడిని; మధ్యమున్= నడిమివాడిని - అనగా కుంతీదేవికొడుకులలో మధ్యమంవాడైన భీముడిని; ఉపాంశు, వధన్+చేసి= రహస్యంగా హత్యచేసి; చంపి; అశక్తు= శక్తిలేనివా డైన; ధర్మనందనున్; బంధించి; నిస్సపత్నముగన్= శత్రువు లేకుండా; అపాండవముగాన్= పాండవులు లేకుండా; సముద్ర, వలయ+అఖిల, క్షోణిన్= సముద్రంచేత చుట్టబడిన సమస్తభూమండలాన్ని; మత్, కృపాణ, పటు, శక్తిన్= నా కత్తియొక్క గట్టిబలంతో; అతి+అధిక, కీర్తిని+ఐ= మిక్కిలి ఎక్కువ కీర్తిగలవాడనై; ఏలెదన్= పరిపాలిస్తాను.

తాత్పర్యం: గర్వంతో విజృంభిస్తున్న భీముడిని రహస్యంగా చంపి, అశక్తు డైన ధర్మరాజును చెరసాలలో పెట్టి, శత్రువు అనేవాడు లేకుండా, అపాండవంగా సమస్తభూమండలాన్నీ నాకత్తికి ఎదురులేకుండా అఖండకీర్తితో పరిపాలిస్తాను.

విశేషం: పాండవులకు బలం, తనకు ప్రబలశత్రువు భీముడుమాత్రమే అని దుర్యోధనుని భావన. అతడిని ప్రత్యక్షంగా ఎదుర్కొని చంపడం సాధ్యపడదు. అందువలన అతడిని రహస్యంగా చంపి, తనకన్నా పెద్దవాడైన ధర్మరాజును చెరసాలలో పెడితే-ఇక తనను ఎదిరించే శత్రువు లుండ రనీ, మిగతావారిలో తానే పెద్ద కనుక రాజ్యాధికారం తనకే సంక్రమిస్తుం దనీ, సమస్తభూమండలాన్ని తానే పరిపాలించవ చ్చనీ దుర్యోధనుని దురాలోచన. అప్పటి కింకా అర్జున నకుల సహదేవుల శక్తి సామర్థ్యాలు దుర్యోధనుని దృష్టికి వచ్చినట్లు లేదు. పాండవధార్తరాష్ట్రుల విభేదానికి బీజం భీమునిబల మనీ, దుర్యోధనుని దుశ్చింత అనీ వస్తుధ్వని. (సంపా.)

ఛందశ్శిల్పం: పృథ్వీవృత్తంలోని ప్రతిపాదంలోనూ 17 అక్షరా లుంటాయి. జ, స, జ, స, య, లగ - అనే గణాలు వరుసగా అమరి ఉంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ఈ సందర్భంలో నన్నయ పృథ్వీవృత్తం వాడటంలో గల సార్థక్యాన్ని గురించీ, ఈ పద్యరచనలోని అక్షరరమ్యత, వాక్యవృత్తులగురించీ డాక్టర్ పాటిబండమాధవశర్మగా రిట్లా వ్యాఖ్యానించారు. "పృథ్వీరాజ్య హరణోత్సాహమును, తదంగమైన పృథానందనోత్సాహమును పృథ్వీవృత్తమున నిబంధించుట వృత్తనామాశ్రితమైన శిల్పము. పద్య మందలి పూర్వోత్తరార్ధములందు అక్షర, పదరచనా రూపమైన శిల్పమును గుర్తింపవచ్చును. పూర్వార్ధమందలి మహాప్రాణవ్యంజనము, నీచమధ్యస్వరములు, వ్యస్తపదములు దుర్యోధనుఁ డా వాక్యఖండములను రహస్యముగ, అనుదాత్తస్వరమున, సనిశ్వసితముగ, ససంభ్రమముగ నుచ్చరించె నని స్పష్టము చేయుచున్నది. ఉత్తరార్ధమునందలి సమస్తపదములు, నాదాక్షరములు, విశేషించి చతుర్థపాదము నందలి ఉదాత్తస్వరములు దుర్యోధను డావాక్యమును అనర్గలముగ క్రమవర్ధమానస్వరమున ఉచ్చరించె నని స్ఫుటము చేయుచున్నవి. భీమవధ, ధర్మజబంధనములు రహస్యవిషయములు. అపాండవమైన క్షోణీరాజ్యపాలనము ప్రకాశవిషయము, స్వరవ్యంజనవిన్యాస శిల్పము వాక్యార్థవ్యంజకమైన వాచికాభినయనమునకు చక్కగా నుపకరించుచున్నది. 'అసమాసైః పదై ర్భాతి పృథ్వీ పృథ్వీ పృథక్ స్థితైః (సువృత్తతిలకం 2-27). వ్యస్తములైన యసమస్త పదములచే పృథ్వీవృత్తము పృథువుగా భాసించు నని క్షేమేంద్రుఁ డొకరహస్యమును వెల్లడించెను. నన్నయ యారహస్యమునే పైపద్యమందలి పూర్వార్ధమున ప్రదర్శించెను'' (ఆంధ్రమహాభారతము: ఛందశ్శిల్పము - పు.280,281)

దుర్యోధనుఁడు భీముని జంపింపఁ దివురుట (సం. 1-119-28)

వ. అని పాపబుద్ధియందుఁ గృతనిశ్చయుం డై దుర్యోధనుండు భీష్మ విదురు లెఱుంగకుండ భీమున కపాయంబు సేయ సమకట్టి, యంతరం బన్వేషించుచున్నంత నొక్కనాఁడు జలక్రీడావసరంబున. 169

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పాప, బుద్ధియందున్= చెడ్డఆలోచనతో; కృత, నిశ్చయుండు+ఐ= చేయబడిన నిర్ణయం కలవాడై; దుర్యోధనుండు; భీష్మ, విదురులు ఎఱుంగకుండన్= భీష్మునికి విదురునికి తెలియనీయకుండా; భీమునకున్; అపాయంబు, చేయన్= అపాయం కలిగించటానికి; సమకట్టి= పూనుకొని; అంతరంబు= అవకాశాన్ని; అన్వేషించుచున్= వెదకుతూ; ఉన్నంతన్= ఉండగా; ఒక్కనాఁడు; జల, క్రీడా+అవసరంబునన్= జలక్రీడలు ఆడేసమయంలో.

తాత్పర్యం: అని దురాలోచనతో దుర్యోధనుడు భీష్మవిదురులకు తెలియకుండా భీమునికి కీడు చేయా లని అవకాశంకొరకు వెదకుతుండగా ఒకరోజు జలక్రీడలు ఆడేసమయంలో.

ఉ. వేడుక నొక్కరుండు శతవీరకుమారులతోడఁ జల్లుఁ బో
రాడి జయించి యందఱ, ననంతపరిశ్రమపారవశ్యముం
గూడి ప్రమాణకోటి ననఘుండు సమీరణనందనుండు మే
యాడక నిద్రవోయె శిశిరానిలముల్ పయి వీచుచుండఁగన్. 170

ప్రతిపదార్థం: అనఘుండు= పాపంలేనివాడు; సమీరణ, నందనుండు= వాయుదేవునికొడుకైన భీముడు; వేడుకన్= వేడుకతో; ఒక్కరుండు= ఒక్కడు; శత, వీర, కుమారులతోడన్= నూరుమంది వీరులైనకురుకుమారులతో- దుర్యోధనాదులతో; చల్లున్+పోరు+ఆడి= నీళ్ళలో దిగి ఒకరిమీద ఒకరు నీళ్ళు చల్లుకొనే ఆట ఆడి; అందఱన్; జయించి; అనంత, పరిశ్రమ, పారవశ్యమున్= అంతులేని శ్రమవల్ల కల్గిన మైమరపుతో; కూడి= ఉండి; ప్రమాణకోటిన్= ప్రమాణకోటి అనే స్థలంలో; శిశిర+అనిలముల్= చల్లనిగాలులు; పయిన్= మీద; వీచుచుండఁగన్; మెయి= దేహం; ఆడక= కదలక; నిద్ర, పోయెన్.

తాత్పర్యం: పాపరహితుడు, వాయుపుత్రుడు అయిన భీముడు ఒక్కడే వేడుకగా వందమందికౌరవులతో జలక్రీడలాడి అందరినీ జయించి, అంతులేని శ్రమచేత కలిగిన అలసటవలన మైమరచి ప్రమాణకోటి అనే స్థలంలో చల్లగాలులు వీస్తూ ఉండగా మేను కదల్చకుండ గాఢనిద్రలో ఉన్నాడు.

విశేషం: ధార్తరాష్ట్రు లందరినీ మట్టుపెట్టగలదిట్ట భీము డనే అర్థాన్ని వ్యంగ్యంగా, బీజతుల్యంగా ఈ సన్నివేశం వ్యక్తంచేస్తున్నది.

క. ఆ పవనజు నతిఘనలతి । కాపాశావలుల నంటఁ గట్టించి మహా
కోపమున గంగమడువునఁ । ద్రోపించె సుయోధనుండు దురితకరుం డై. 171

ప్రతిపదార్థం: సుయోధనుండు= దుర్యోధనుడు; దురిత, కరుండు+ఐ= పాపం చేసేవాడై; ఆ, పవనజున్= ఆ వాయుపుత్రుడైన భీముడిని; అతి, ఘన, లతికా, పాశ+ఆవలులన్= మిక్కిలి గట్టివైన తీగ లనే తాళ్ళ సమూహంచే; అంటన్+కట్టించి= శరీరానికి అతుక్కొనిపోయే విధంగా కట్టించి; మహాకోపమునన్= మిక్కిలికోపంతో; గంగమడువునన్= గంగమడుగులోకి; త్రోపించెన్= త్రోయించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు దుర్మార్గుడై భీముడిని గట్టి తీగలచే గట్టిగా కట్టించి, మహాకోపంతో గంగమడుగులోకి త్రోయించాడు.

క. అనిలసుతుం డంతన మే । ల్కని నీల్గుడు నతని వజ్రఘనకాయముఁ బొం
దినలతికాపాశము లె । ల్లను ద్రెస్సె మృణాళనాళలతికలపోలెన్. 172

ప్రతిపదార్థం: అనిల, సుతుండు= వాయుదేవునికొడుకు - భీముడు; అంతన= అప్పటికప్పుడే - అంతలోనే; మేల్కని= మేలుకొని; నీల్గుడున్= ఒళ్ళు విరుచుకోగా; అతని, వజ్ర, ఘనకాయమున్= అతనియొక్క వజ్రంవంటి దృఢమైన దేహాన్ని; పొందిన= తగులుకొన్న; లతికా, పాశములు+ఎల్లను= తీగ లనే త్రా ళ్ళన్నీ; మృణాళ, నాళ, లతికల, పోలెన్= లేత తామరతూళ్ళతీగలవలె; త్రెస్సెన్= తెగాయి.

తాత్పర్యం: భీముడు అప్పటి కప్పుడు మేల్కొని ఒళ్ళు విరువగానే, వజ్రంవలె కఠినమైన అతనిశరీరానికి కట్టిన తీగలతా ళ్ళన్నీ లేతతామరతూళ్ళతీగలవలె సులభంగా తెగిపోయాయి.

విశేషం: అలం: ఉపమ.

ఆ. కర్మబంధనములు గ్రక్కునఁ బాయుడుఁ । బుణ్యగతికి నెగయు పురుషు నట్లు
బంధనంబు లెల్లఁ బాయుడు భీముండు । నీరిలోననుండి నెగయుదెంచె. 173

ప్రతిపదార్థం: కర్మ, బంధనములు= కర్మబంధాలు; గ్రక్కునన్= తటాలున; పాయుడున్= తొలగిపోగా; పుణ్యగతికిన్= పుణ్యలోకానికి; ఎగయు, పురుషునట్లు= ఎగిరిపోయే పురుషునివలె; బంధనంబులు+ఎల్లన్= కట్లన్నీ; పాయుడున్= తొలగిపోగా; భీముండు= భీముడు; నీరిలోన, నుండి= నీళ్ళలోనుండి; నెగయుదెంచెన్= పైకి లేచాడు.

తాత్పర్యం: కర్మబంధాలు తొలగిపోగా పురుషుడు(జీవుడు) స్వర్గానికి ఎగిరిపోయినట్లు, కట్లు తెగగానే భీముడు నీటినుండి పైకి లేచి వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱియు నొక్కనాఁడు. 174

తాత్పర్యం: ఇంకా మరొకరోజు.

క. జనపతి పనుపఁగ సారథి । ఘనవిషకృష్ణోరగములఁ గఱపించె శ్రమం
బున నిద్రితుఁ డైన ప్రభం । జనసుతుసర్వాంగమర్మసంధుల నెల్లన్. 175

ప్రతిపదార్థం: జన, పతి= రాజు - దుర్యోధనుడు; పనుపఁగన్= ఆజ్ఞాపించగా; సారథి; శ్రమంబునన్= అలసటచేత; నిద్రితుఁడు+ఐన= నిద్రపోయినవాడైన; ప్రభంజన; సుతు, సర్వ+అంగ, మర్మ, సంధులన్, ఎల్లన్= వాయుపుత్రుని అన్ని అవయవాల కీలకస్థానాల కూడిక లన్నింటను; ఘన, విష, కృష్ణ+ఉరగములన్= గొప్పవిషం కల నల్లత్రాచుపాములచేత; కఱపించెన్= కరిపించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఆజ్ఞాపించగా సారథి, అలసి నిద్రపోయిన భీమసేనుని అన్ని అవయవాల మర్మస్థానాల సంధు లన్నిటా గొప్పవిషంగల నల్లత్రాచుపాములతో కరిపించాడు.

క. అవిరళవిషఫణిదంష్ట్రలు । పవనజువజ్రమయతనువుపయితోలును నో
పవ భేదింపఁగఁ; బాప । వ్యవసాయులచెయ్వు లర్థవంతము లగునే? 176

ప్రతిపదార్థం: అవిరళ, విష, దంష్ట్రలు= దట్టమైన విషం ఉన్న పాములకోరలు; పవనజు, వ్రజమయ, తనువు, పయితోలునున్= వాయుపుత్రుని వజ్రంవంటి (అనగా వజ్రంవలె గట్టిదైన) శరీరంమీది చర్మాన్నికూడ; భేదింపఁగన్= చీల్చటానికి; ఓపవ= సమర్థమైనవి కాలేకపోయాయి; పాప, వ్యవసాయుల, చెయ్వులు= పాపం చేయడంలో నిశ్చితమైనబుద్ధి కలవాళ్ళచేష్టలు; అర్థవంతములు= ఫలాన్ని కూర్చేవి; అగునే= అగునా? - కావు.

తాత్పర్యం: దట్ట మైనవిష మున్న ఆ పాములకోరలు, భీమసేనుని వజ్రంవంటి శరీరం పై తోలునుకూడా చీల్చ లేక పోయాయి. పాపబుద్ధి కలవారిపను లెప్పుడూ ఫలించవు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. అలఘుబలుండు భీముఁడును నంతన మేల్కని యవ్విషోరగం
బులఁ జరణంబులం జమరి, ముక్కన వాతను నెత్తు రొల్కగాఁ
దలరఁగ సారథిం జఱచెఁ దా నపహస్తమునన్, వసుంధరా
తలమునఁ ద్రెళ్ళె సారథియుఁ దత్క్షణమాత్రన ముక్తజీవుఁ డై. 177

ప్రతిపదార్థం: అలఘు, బలుండు= తక్కువ కాని బలం కలవాడు; భీముఁడును; అంతన= అప్పుడే; మేల్కని; ఆ+విష+ ఉరగంబులన్= ఆ విషపుపాములను; చరణంబులన్= కాళ్ళతో; చమరి= రాచి; ముక్కున; నోట; నెత్తురు; ఒల్కగాన్= కారేటట్లు; తలరఁగన్= చలించునట్లుగా; తాన్= తాను - అనగా భీముడు; అపహస్తమునన్= పెడచేత్తో; సారథిన్; చఱచెన్= కొట్టాడు; సారథియున్= సారథికూడా; తత్+క్షణ, మాత్రన= ఆ క్షణంలోనే; ముక్త జీవుఁడు+ఐ= విడువబడిన ప్రాణాలు కలవా డై; వసుంధరాతలమునన్= నేలమీద; త్రెళ్ళెన్= చచ్చిపడ్డాడు.

తాత్పర్యం: మహాబలవంతు డైన భీముడు; అప్పుడే మేల్కొని ఆ పాములను కాళ్ళతో రాచి, చంపి, ముక్కున నోట నెత్తురు కారేటట్లు సారథిని పెడచేత్తో కొట్టాడు. సారథి ఆ క్షణంలోనే చచ్చి నేలమీద పడ్డాడు.

క. మఱియును నొకనాఁ డెవ్వరు । నెఱుఁగక యుండంగఁ గౌరవేంద్రుఁడు ధర్మం
బెఱుఁగక విష మన్నముతో । గుఱుకొని పెట్టించె గాడ్పుకొడుకున కలుకన్. 178

ప్రతిపదార్థం: మఱియునున్= ఇంకనూ; ఒకనాఁడు; ఎవ్వరున్= ఎవరుకూడా; ఎఱుఁగక, ఉండంగన్= తెలియక ఉండేటట్లు; కౌరవ+ఇంద్రుఁడు= కౌరవరాజు - దుర్యోధనుడు; ధర్మంబు= ధర్మాన్ని; ఎఱుఁగక= ఆలోచింపక; గాడ్పు, కొడుకునకున్= వాయుదేవుని కుమారునికి - భీమునికి; అలుకన్= కోపంతో; విషము; అన్నముతో; గుఱుకొని= పూని; పెట్టించెన్.

తాత్పర్యం: ఇంకోరోజు ఎవ్వరికీ తెలియకుండా దుర్యోధనుడు, ధర్మాన్నిగూర్చి ఆలోచింపక, కోపంతో విషాన్ని అన్నంలో కలిపి భీమునికి పెట్టించాడు.

క. సముఁ డై యుయుత్సుఁ డయ్య । న్నము దుష్టం బగుటఁ జెప్పినను గుడిచె విషా
న్నము నాఁకటిపెలుచను; నది । యమృతాన్నం బయ్యె జీర్ణ మై మారుతికిన్. 179

ప్రతిపదార్థం: యుయుత్సుఁడు= ధృతరాష్ట్రునికి వైశ్యవనితయందు పుట్టినవాడు; వయసులో దుర్యోధనుని తరువాతివాడు; సముఁడు+ఐ= సమబుద్ధి కలవాడై; ఆ+అన్నము; దుష్టంబు= చెడ్డది; అగుటన్= కావడం; చెప్పినను= చెప్పినప్పటికి; ఆఁకటి, పెలుచనున్= ఆకలియొక్క అతిశయంతో; విష+అన్నమున్= విషభోజనాన్ని; కుడిచెన్= తిన్నాడు; అది= ఆ విషాన్నం; మారుతికిన్= వాయుపుత్రుడైన భీమునికి; జీర్ణము+ఐ= అరిగినదై; అమృత+అన్నంబు= అమృతభోజనము; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: యుయుత్సుడు సమబుద్ధి కలవాడై ఆ అన్నం చెడ్డ దని చెప్పినా, భీముడు అధిక మైన ఆకలివలన దాన్ని తిన్నాడు. అది అతనికి జీర్ణ మై అమృతంవంటిది అయింది.

వ. ఇట్లు దుర్యోధనుండు భీమునకుఁ దనచేసిన యెగ్గు లెల్లను గృతఘ్నునకుం జేసిన లగ్గులునుంబోలె నిష్ఫలంబు లైన సిగ్గువడి, వెండియుఁ బాండవుల కెల్ల నపాయంబు సేయ నుపాయంబుఁ జింతించుచుండె; నంత భీష్మ నియోగంబున. 180

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దుర్యోధనుండు; భీమునకున్; తన, చేసిన, ఎగ్గులు+ఎల్లను= తాను చేసిన అపకారాలన్నీ; కృతఘ్నునకున్, చేసిన= మేలు మర్చిపోయేవాడికి చేసిన; లగ్గులునున్+పోలె= ఉపకారాలవలె; నిష్ఫలంబులు+ఐన= వ్యర్థం కాగా; సిగ్గు, పడి; వెండియున్= మరల, పాండవులకు+ఎల్లన్= పాండవులందరికి; అపాయంబు= కీడు; చేయన్= చేయుటకై; ఉపాయంబున; చింతించుచు+ఉండెన్= ఆలోచిస్తూ ఉండినాడు; అంతన్= అప్పుడు, భీష్మ, నియోగంబునన్= భీష్ముని ఆజ్ఞతో.

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు భీమునికి చేసిన అపకారా లన్నీ కృతఘ్నునికి చేసిన ఉపకారాలవలె వ్యర్థం కాగా, సిగ్గుపడి, మళ్ళీ పాండవు లందరికి కీడు చేయా లని ఉపాయం ఆలోచిస్తూ ఉన్నాడు. అప్పుడు భీష్ముని ఆజ్ఞవలన.

విశేషం: ఒక్క భీముడిని చంపితే పాండవులు నిర్వీర్యు లౌతా రని దుర్యోధనుడు భావించి విఫలు డైనాడు. తర్వాత పాండవు లందరిని కలిపి ఒక్కసారిగా చంపటానికి ఆలోచించాడు.

క. విలువిద్యఁ గఱచుచుండిరి । బలయుతులు కుమారకులు కృపద్రోణాచా
ర్యులతోడఁ గలసి యొక్కట । నలఘుపరాక్రమసమేతు లధికస్పర్ధన్. 181

ప్రతిపదార్థం: బలయుతులు= బలంతో కూడినవాళ్ళు; అలఘు, పరాక్రమ, సమేతులు= గొప్పపరాక్రమంతో కూడినవాళ్ళు; కుమారకులు= పాండవులు కౌరవులు; ఒక్కటన్= ఒకటిగా; కలసి; కృప, ద్రోణ+ఆచార్యులతోడన్= కృపద్రోణాచార్యులవద్ద; అధిక, స్పర్ధన్= అధికమైనపోటీతో; విలువిద్యన్; కఱచుచున్+ఉండిరి= నేర్చుకొంటూ ఉన్నారు.

తాత్పర్యం: బలవంతులు, పరాక్రమవంతులు అయిన కురుపాండవులు, ఒక్కటిగా కలిసి, కృపద్రోణాచార్యులవద్ద, ఒకరిని మించవలె నని మరొకరు పోటీపడుతూ, విలువిద్య నేర్చుకుంటూ ఉన్నారు.

విశేషం: 'స్పర్ధయా వర్ధతే విద్యా' అని పండితోక్తి. విలువిద్యను కురుకుమారులు ఒకరికంటె మరొకరు మించా లని స్పర్ధతో నేర్చుకుంటున్నా రన్నమాట!

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 182

తాత్పర్యం: అని చెప్పగా విని వైశంపాయనునితో జనమేజయుడు ఈ విధంగా అన్నాడు.

తే. కృపుఁడు ద్రోణుండు నన(గ సత్కీర్తులైన । వారిజన్మప్రకారంబు, వారు వచ్చి
కౌరవులకెల్ల గురు లైన కారణంబు । విప్రముఖ్య! నా కెఱుఁగంగ విస్తరింపు. 183

ప్రతిపదార్థం: కృపుఁడు; ద్రోణుండున్; అనఁగన్= అనగా; సత్+కీర్తులు+ఐన= మంచికీర్తి కలవా ళ్ళయిన; వారి, జన్మ, ప్రకారంబు= వాళ్ళ పుట్టుకయొక్క విధం; వారు, వచ్చి; కౌరవులకు+ఎల్లన్= కురుకుమారు లందరికీ; గురులు+ఐన=

ఆచార్యులైన; కారణంబున్= విధానాన్ని; విప్ర, ముఖ్య= బ్రాహ్మణోత్తమా! వైశంపాయనమహర్షీ!; నాకున్; ఎఱుఁగంగ= తెలిసేటట్లు; విస్తరింపు= వివరంగా చెప్పుము.

తాత్పర్యం: ఓ వైశంపాయనమహర్షీ! కృపుడు, ద్రోణుడు పుట్టినవిధాన్నీ, వాళ్ళు వచ్చి కురుకుమారు లందరికీ గురువు లైనవిధాన్నీ నాకు తెలిసేటట్లుగా వివరంగా చెప్పుము.

వ. అని యడిగిన వైశంపాయనుం డి ట్లనియె. 184

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు ఇట్లా చెప్పాడు.

కృపాచార్యుల జన్మవృత్తాంతము (సం. 1-120-2)

సీ. విన వయ్య! గౌతముం డనఁ బ్రసిద్ధుం డైన । మునికి శరద్వంతుఁ డను మహాత్ముఁ
డురుతరతేజుఁ డై శరసమూహంబుతో । నుదయించి, వేదముల్ చదువ నొల్ల
కతిఘోరతపమున నుతభూసురోత్తముల్ । వేదముల్ చదువున ట్లాదరమున
సర్వాస్త్రవిదుఁడు ధనుర్వేద మొప్పఁగఁ బడసి, మహానిష్ఠఁ గడఁగి తపము

ఆ. సేయుచున్న దివిజనాయకుఁ డతిభీతి । నెఱిఁగి, వానితపముఁ జెఱుపఁ బనిచె
జలజనయనఁ దరుణి జలపద యనియెడు । దాని; నదియు వచ్చె వానికడకు. 185

ప్రతిపదార్థం: వినవయ్య= అయ్యా! వినుము; గౌతముండు; అనన్; ప్రసిద్ధుండు+ఐన; మునికి; శరద్వంతుడు+అను; మహాత్ముఁడు; ఉరుతర, తేజుఁడు+ఐ= ఎంతో (మిక్కిలి) తేజస్సు కలిగినవాడై; శర, సమూహంబులతోన్= బాణాల సమూహంతో; ఉదయించి= పుట్టి; వేదముల్; చదువన్= పఠించటానికి; ఒల్లక= ఇష్టపడక; అతి, ఘోర, తపమునన్= ఎంతో భయంకర మయిన తపస్సుచేత; నుత, భూసుర+ఉత్తముల్= పొగడబడిన బ్రాహ్మణశ్రేష్ఠులు; వేదముల్; చదువునట్లు; ఆదరమునన్= ప్రీతితో; సర్వ+అస్త్ర, విదుఁడు= అన్ని అస్త్రాలూ తెలిసినవాడు; ధనుర్వేదమున్= ధనుర్వేదాన్ని; ఒప్పఁగన్= తగునట్లు; పడసి= పొంది; మహా, నిష్ఠన్= గొప్ప నియమంతో; కడఁగి= పూని; తపము; చేయుచున్+ఉన్నన్= చేస్తూ ఉండగా; దివిజ, నాయకుఁడు= దేవేంద్రుడు; ఎఱిఁగి= తెలిసికొని; అతిభీతిన్= మిక్కిలి భయంతో; వాని= అతని; తపమున్= తపస్సును; చెఱుపన్= భంగపరచటానికై; జలజనయనన్= కమలాలవంటి కన్నులు కలదానిని; తరుణిన్= యౌవనంలో ఉన్నదానిని; జలపద, అనియెడు దానిన్= జలపద అను పేరుగల దానిని; పనిచెన్= పంపినాడు; అదియున్= ఆ యౌవనవతియు; వాని; కడకున్; వచ్చెన్.

తాత్పర్యం: గౌతము డనే పేరుగల (గౌతము డనే పేరుతో ప్రసిద్ధుడైన) మహామునికి, శరద్వంతు డనే మహాత్ముడు గొప్పతేజస్సుతో, బాణసమూహంతో పుట్టి, వేదాలు చదవటానికి ఇష్టపడక, అతిభయంకర మయిన తపస్సు చేసి, బ్రాహ్మణోత్తములు వేదాలు చదివేవిధంగా తాను ధనుర్వేదాన్ని సాధించి, మహానిష్ఠతో తపస్సు చేస్తుండగా దేవేంద్రుడు అది తెలిసికొని భయపడి, అతనితపస్సును భగ్నం చెయ్యా లని కమలాలవంటి కన్నులు గల 'జలపద' అనే యౌవనవతిని పంపించాడు. ఆమె అతనిదగ్గరికి వచ్చింది.

విశేషం: 'జలపద'కు జానపది, జాలవతి, జలవతి అనే పాఠాంతరా లున్నాయి.

క. అమ్ముదితఁ జూచి కాముశ। రమ్ములచే విద్ధుఁ డై శరద్వంతుఁడు చి
త్త మ్మలర మదనరాగర। సమ్మునఁ ద న్నెఱుఁగకుండెఁ జంచలతనుఁ డై. 186

ప్రతిపదార్థం: ఆ+ముదితన్= ఆ కాంతను; చూచి; శరద్వంతుఁడు; కాము, శరమ్ములచే= మన్మథునియొక్క బాణాలచేత; విద్ధుఁడు+ఐ= కొట్టబడినవాడై; చిత్తమ్ము= మనస్సు; అలరన్= వికసించగా; మదన, రాగ, రసమ్మునన్= మన్మథరాగం అనే ఆనందంలో; చంచల, తనుఁడు+ఐ= చలిస్తున్న శరీరం కలిగినవాడై; తన్నున్+ఎఱుఁగక+ఉండెన్= తనను తాను తెలియక ఉన్నాడు.

తాత్పర్యం: ఆ కాంతను చూచి శరద్వంతుడు మన్మథబాణంచేత పీడింపబడి, మనసు చెదరి మన్మథరాగంలో మైమరచి ఉన్నాడు.

క. ఆ తరుణికటాక్షేక్షణ। పాతము గౌతమున కపుడు పటుబాణధనుః
పాతముతోడన రేతః। పాతము గావించె రాగపరవశుఁ డగుటన్. 187

ప్రతిపదార్థం: ఆ, తరుణి, కటాక్ష+ఈక్షణ, పాతము= ఆ కాంతయొక్క కడగంటిచూపు పడటంతోనే; అపుడు; రాగ, పరవశుఁడు+అగుటన్= మన్మథరాగానికి స్వాధీనం అయినవాడు అవటంచేత; గౌతమునకున్= గౌతముని కుమారుడైన శరద్వంతునికి; పటు, బాణ, ధనుః, పాతముతోడన= గట్టివైన బాణాలు గల ధనుస్సు పడటంతోనే; రేతస్ పాతము= వీర్యం పడటం; కావించెన్= చేసింది.

తాత్పర్యం: ఆ కాంత కడగంటిచూపు శరద్వంతునిమీద పడగానే, అతడు మన్మథరాగపరవశు డై ఉండటం చేత, అతనిచేతిధనుర్బాణాలతోపాటు వీర్యంకూడా జారిపడింది.

విశేషం: అలం: సహోక్తి.

వ. దాని నెఱింగి శరద్వంతుం డయ్యాశ్రమంబు విడిచి చని యొండుచోటం దపంబు సేయుచుండె; నవ్వీర్యం బొక్క శరస్తంబంబున ద్వివిధం బయి పడిన, నందొక కొడుకునుం గూఁతురుం బుట్టి; రంత శంతనుండు మృగయా వినోదార్థం బరిగిన వానిసేనాచరుం డా శరస్తంబంబున నున్న కొడుకుం గూఁతుఁ దత్సమీపంబున నున్న శరచాప కృష్ణాజినంబులుం జూచి, యివి యెయ్యేనియు నొక్కధనుర్వేదవిదుం డయిన బ్రాహ్మణునపత్యం బగు నని శంతనునకుం జూపిన, శంతనుండును వారలఁ జేకొని కృపాయత్తచిత్తుం డయి పెనుచుటం జేసి యయ్యిరువురుఁ గృపుఁడును గృపియు ననం బెరుఁగుచున్నంత. 188

ప్రతిపదార్థం: దానిన్= ఆ సంఘటనను; ఎఱింగి= తెలిసికొని; శరద్వంతుండు; ఆ+ఆశ్రమంబు; విడిచి; చని= వెళ్ళి; ఒండు, చోటన్= మరొకచోట; తపంబు= తపస్సు; చేయుచున్+ఉండెన్= చేస్తూ ఉండినాడు; ఆ+వీర్యంబు= ఆ రేతస్సు; ఒక్క; శర, స్తంబంబునన్= రెల్లుగంటలో; ద్వివిధంబు+అయి= రెండుభాగాలు కలిగినదై; పడినన్= పడగా; అందున్= అందులోనుండి; ఒక్క+కొడుకునున్+కూతురున్ = ఒక్కకుమారుడు, ఒకకుమార్తె; పుట్టిరి= జన్మించారు; అంతన్= తర్వాత; శంతనుండు= శంతనమహారాజు; మృగయా, వినోద+అర్థంబు= వేటకోసం; అరిగినన్= వెళ్ళగా; వాని, సేనా చరుండు= అతనియొక్క సేనలో తిరిగేవాడు; ఆ శర, స్తంబంబునన్= ఆ రెల్లు గంటలో; ఉన్న= ఉండే; కొడుకున్+కూతున్; తద్+సమీపంబునన్, ఉన్న=

దానికి దగ్గరగా ఉన్న; శర, చాప, కృష్ణ+అజినంబులున్= బాణాలు, ధనుస్సు, జింకచర్మం; చూచి; ఇవి= ఈ కనిపించేవి అన్నీ; ఏ+ఏవియున్= ఎవరేని; ఒక్క= ధనుర్వేద, విదుండు+అయిన= ఒక్కవిలువిద్యలో పండితుడైన; బ్రాహ్మణు, అపత్యంబు= బ్రాహ్మణునియొక్క సంతానం; అగును= అయిఉండును; అని= ఆ విధంగా; శంతనునకున్= శంతనుమహారాజుకు; చూపినన్= చూపగా; శంతనుండును= శంతనమహారాజును; వారలన్= ఆ ఇద్దరినీ; చేకొని= తీసికొని; కృపా+ఆయత్త, చిత్తుండు+అయి= దయతో కూడిన మనస్సు కలిగినవాడై; పెనుచుటన్+చేసి= పెంచటంచేత; ఆ+ఇరువురున్; కృపుఁడును; కృపియు; అనన్= అనే పేర్లతో; పెరుగుచున్+ఉన్నంతన్= పెరుగుతూ ఉండగా.

తాత్పర్యం: దానిని తెలిసికొని శరద్వంతుడు ఆ ఆశ్రమాన్ని విడిచివెళ్లి, వేరొకచోట తపస్సు చేసికొంటూ ఉన్నాడు. ఆయనవీర్యం ఒకరెల్లుగంటలో రెండు భాగాలుగా పడింది. దానినుండి ఒకకొడుకు, ఒకకూతురు పుట్టారు. తర్వాత ఒకరోజు శంతనుమహారాజు వేటకు రాగా, అతని సైనికులలో ఒకడు ఆ రెల్లుగంటలో ఉన్నపిల్లలనూ, అక్కడే పడి ఉన్న ధనుర్బాణాలనూ, జింకచర్మాన్నీ చూచి, వీ ళ్లెవరో ఒక ధనుర్వేదపండితు డైన బ్రాహ్మణునిసంతానం అని తలచి, శంతనునికి చూపించగా, ఆయన వాళ్లను తీసికొని కృపతో పెంచటంచేత వా ళ్లిద్దరూ కృపుడు, కృపి అనే పేర్లతో పెరుగుతూ ఉండగా.

క. చనుదెంచి శరద్వంతుం। డనవద్యుఁడు దనయపత్య మని వారిని శం
తనున కెఱిఁగించి కృపు న। త్యనుపము నుపనీతుఁ జేసె నధికప్రీతిన్. 189

ప్రతిపదార్థం: అనవద్యుఁడు= దోషంలేనివాడు; శరద్వంతుండు; చనుదెంచి= వచ్చి; తన, అపత్యము+అని= తనసంతానం అని; వారిని= ఆ ఇద్దరిని; శంతనునకున్; ఎఱిఁగించి= తెలియజేసి; అతి+అనుపమున్= ఏమాత్రం సాటిలేనివాడిని; కృపున్= కృపుని; అధిక, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఉపనీతున్= ఉపనయనసంస్కారం కలవాడినిగా; చేసెన్.

తాత్పర్యం: పవిత్రు డైన శరద్వంతుడు వచ్చి, వాళ్లు తనసంతాన మని శంతనునికి తెలిపి, అద్వితీయు డైన కృపునికి అమిత మైన ప్రేమతో ఉపనయనసంస్కారం చేశాడు.

శా. వేదంబుల్ చదివించె భూసురులతో విఖ్యాతిగా, నాత్మసం
వేదిం జేసెఁ, జతుర్విధం బగు ధనుర్వేదంబు నానాస్త్రవి
ద్యాదాక్షిణ్యముతోడఁ దాన కఱపెం, దద్విత్తముల్ సూచి సం
వాదుల్గాఁ దననందనుం గృపు శరద్వంతుండు దాంతాత్ముఁ డై. 190

ప్రతిపదార్థం: దాంత+ఆత్ముఁడు+ఐ= నిగ్రహించబడిన మనస్సు కలిగినవాడై; శరద్వంతుండు; తన; నందనున్= తన యొక్క కుమారుడిని; కృపున్= కృపుని; విఖ్యాతిగాన్= ప్రసిద్ధిగా; వేదంబుల్; భూసురులతోన్= బ్రాహ్మణులతో; చదివించెన్= చదివింపజేసినాడు; ఆత్మ, సంవేదిన్= ఆత్మ నెరిగినవానిగా; చేసెన్; చతుర్విధంబు+అగు= నాలుగువిధాలు కలిగినదైన; (రథ, గజ, తురగ, పదాతి సంబంధాలు కలిగినది); ధనుర్వేదంబు; నానా+అస్త్ర, విద్యా, దాక్షిణ్యము, తోడన్= అనేకవిధాలైన అస్త్రవిద్యలలోని నేర్పుతో; తద్+విత్తముల్= ఆ ధనుర్వేదాన్ని తెలిసినగొప్పవారు - అంటే ధనుర్వేదపండితులు; చూచి; సంవాదుల్= ఏకీభవించేవారు; కాన్= అయ్యేటట్లు; తాను+అ= తానే; కఱపెన్= నేర్పించాడు.

తాత్పర్యం: శరద్వంతుడు బ్రాహ్మణులవద్ద తనకుమారుడికి వేదాలు చెప్పించి, ఆత్మజ్ఞానం కలవాడినిగా చేశాడు. రథ, గజ, తురగ, పదాతిబలాలతో సంబంధం ఉన్న ధనుర్వేదాన్ని, నానావిధాలైన అస్త్రప్రయోగ నైపుణ్యంతో, ధనుర్వేదపండితులు చూచి మెచ్చుకొనేవిధంగా తానే నేర్పించాడు.

వ. అట్టి కృపాచార్యు రావించి భీష్ముం డతిభక్తిం బూజించి వానితోడఁ దన మనుమల నందఱ విలువిద్య గఱవం బంచిన. 191

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; కృపాచార్యు= కృపాచార్యుని; రావించి=రప్పించి; భీష్ముండు; అతి భక్తిన్= మిక్కిలిభక్తితో; పూజించి; వానితోడన్= అతనితో; తన, మనుమలన్; అందఱన్; విలువిద్య; కఱవన్= నేర్చుకొనటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: అటువంటి కృపాచార్యుడిని రప్పించి భీష్ముడు, మిక్కిలి భక్తితో గౌరవించి, తన మనుమల నందరినీ విలువిద్య నేర్చకొనటానికి ఆజ్ఞాపించగా.

క. సవిశేషముగ ధనుర్వే । దవిశారదు లైరి కడు జితశ్రములై పాం
డవ ధృతరాష్ట్రాత్మజ యా । దవు లాదిగ రాజసుతులు తత్కృపుశిక్షన్. 192

ప్రతిపదార్థం: పాండవ, ధృతరాష్ట్ర+ఆత్మజ, యాదవులు+ఆదిగ= పాండవులు, ధృతరాష్ట్రునికొడుకులు, యాదవులు మొదలైన; రాజ, సుతులు= రాజకుమారులు; తద్+కృపు, శిక్షన్= ఆ కృపుని శిక్షణచేత; సవిశేషముగన్= అతిశయంతో కూడినట్లు; కడున్= మిక్కిలి; జిత, శ్రములు+ఐ= జయించబడిన శ్రమ కలిగినవారై; ధనుర్వేద, విశారదులు+ఐరి= విలువిద్యలో పండితు లయ్యారు.

తాత్పర్యం: పాండవులు, కౌరవులు, యాదవులు మొదలైన రాకుమారులు కృపునిశిక్షణలో శ్రమను జయించి, విలువిద్యలో గొప్పపండితు లయ్యారు.

ద్రోణాచార్యుల జన్మవృత్తాంతము (సం. 1-121-3)

వ. 'మఱియు వారల కాచార్యుం డైన ద్రోణుజన్మంబును వానిచరిత్రంబును జెప్పెద విను' మని జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 193

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; వారలకున్= ఆ కౌరవపాండవులకు; ఆచార్యుండు+ఐన= గురు వైన; ద్రోణు= ద్రోణుని యొక్క; జన్మంబును=పుట్టుకను; వాని, చరిత్రంబును= అతనిచరిత్రను; చెప్పెదన్; వినుము; అని= ఆ ప్రకారంగా; జనమేజయునకున్= జనమేజయమహారాజుకు; వైశంపాయనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక, కురుపాండవులకు ఆచార్యు డైన ద్రోణునిపుట్టుకనూ, చరిత్రనూ తెలుపుతాను' విను మని జనమేజయునితో వైశంపాయనుడు ఈ విధంగా అన్నాడు.

క. సద్వినుతచరిత్రుండు భ । రద్వాజుం డను మునీశ్వరప్రవరుఁడు గం
గాద్వారమునఁ దపంబు జ । గద్వంద్యుఁడు సేయుచుండె గతకల్మషుఁ డై. 194

ప్రతిపదార్థం: సత్+వినుత, చరిత్రుండు= సత్పురుషులచేత పొగడబడిన నడవడి కలవాడు; జగత్+వంద్యుఁడు= లోకాలచేత నమస్కరింపదగినవాడు; భరద్వాజుండు, అను; ముని+ఈశ్వర, ప్రవరుఁడు= ఋషి శ్రేష్ఠులలో ఉత్తముడు; గత, కల్మషుఁడు+ఐ= పోయిన పాపం కలిగినవాడై; గంగా, ద్వారమునన్= గంగానదిద్వారముకడ; తపంబున్= తపస్సును; చేయుచున్ ఉండెన్= చేస్తూ ఉండినాడు.

తాత్పర్యం: సత్పురుషులచేత ప్రశంసించబడిన నడవడి కలిగినవాడు, లోకంచేత నమస్కరింపదగినవాడు, పవిత్రుడు అయిన భరద్వాజమహాముని గంగాద్వారంవద్ద తపస్సు చేస్తూ ఉన్నాడు.

సీ. అమ్ముని యొక్కనాఁ డభిషేచనార్థంబు । గంగకుఁ జని, మున్న కరము లీల
నందు జలక్రీడ లాడుచునున్న య । ప్సరస ఘృతాచి యన్సదమలాంగి
పటుపవనాపేత పరిధాన యైన య । య్యవసరంబునఁ జూచి, యమ్మృగాక్షిఁ
గామించి యున్నఁ, దత్కామరాగంబున । యతిరేకమునఁ జేసి యాక్షణంబ

తే. తనకు శుక్లపాతం బైన, దానిఁ దెచ్చి । ద్రోణమున సంగ్రహించిన, ద్రోణుఁ డనఁగఁ
బుట్టె శుక్రునంశంబునఁ బుణ్యమూర్తి । ధర్మతత్త్వజ్ఞుఁ డగు భరద్వాజమునికి. 195

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆ భరద్వాజుడు; ఒక్కనాఁడు; అభిషేచన+అర్థంబు= స్నానంకొరకు; గంగకున్+చని; మున్న+అ= ముందుగానే; కరము= మిక్కిలి, లీలన్= విలాసంతో; అందున్= ఆ గంగలో; జలక్రీడలు+ఆడుచున్= జలక్రీడలు ఆడుతూ ఉండే; అప్సరసన్; ఘృతాచి, అన్= ఘృతాచి, అనేపేరుకల; సత్+అమల+అంగిన్= మిక్కిలి నిర్మలం అయిన దేహంగలది; పటు, పవన+అపేత, పరిధాన+ఐన= పెద్దగాలిచేత తొలగించబడిన చీర కలది కాగా; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; చూచి; ఆ+మృగ+అక్షిన్= ఆ జింకకన్నులవంటి కన్నులు కల స్త్రీని; కామించి+ఉన్నన్= కామించిఉండగా; తద్+కామ, రాగంబున, అతిరేకమునన్+చేసి= ఆ మన్మథరాగంయొక్క అతిశయంచేత; ఆ, క్షణంబు+అ= ఆ నిమిషంలోనే; తనకున్; శుక్ల, పాతంబు+ఐనన్= వీర్యం జారిపడగా; దానిన్= ఆ వీర్యాన్ని; తెచ్చి; ద్రోణమునన్= కలశంలో; సంగ్రహించినన్= పట్టిపెట్టగా; శుక్ర, అంశంబునన్= శుక్రునియొక్క అంశచేత; పుణ్య, మూర్తి= పుణ్యాత్ముడు; ధర్మ, తత్త్వజ్ఞుఁడు= ధర్మంయొక్క తత్త్వాన్ని తెలిసినవాడు; అగు= అయినట్టి; భరద్వాజ, మునికిన్; ద్రోణుఁడు+అనఁగన్+పుట్టెన్= ద్రోణుడు అనేవాడు పుట్టాడు.

తాత్పర్యం: ఆ భారద్వాజముని ఒకనాడు స్నానానికై గంగానదికి వెళ్ళాడు. ఎదురుగా మహావిలాసంతో జలక్రీడలాడుతూ, పెనుగాలిచేత చీరతొలగి నిర్మల మైనదేహంతో ఉన్న ఘృతాచి అనే అప్సరసను చూచి కామించాడు. ఆ మన్మథరాగాతిశయంచేత ఆ క్షణంలోనే తనకు వీర్యస్ఖలనం కాగా, ఆ వీర్యాన్ని తెచ్చి, కలశంలో పెట్టాడు. దానినుండే శుక్రునిఅంశతో పుణ్యాత్ముడు, ధర్మతత్త్వం తెలిసినవాడు అయిన భరద్వాజమునికి ద్రోణుడు పుట్టాడు.

విశేషం: 'తెచ్చి ద్రోణమున సంగ్రహించిన' అనే దానికి 'చేతిద్రోణమున సంగ్రహించిన' అనే పాఠాంతరం ఉన్నది. ఆ పరిస్థితులలో వీర్యాన్ని తెచ్చి ద్రోణంలో సంగ్రహించా డనటంకంటె, స్నానార్థమై వెళ్ళిన ద్రోణుడు చేతిద్రోణంలో సంగ్రహించా డనటం ఎక్కువ సమంజసం అనిపిస్తుంది. 'శుక్రునంశంబున' అనే దానికి గురునియంశంబున అనే పాఠాంతరంకూడా ఉన్నది.

వ. మఱియు ననంతరంబ భరద్వాజసఖుండైన పృషతుం డను పాంచాలపతి మహాఘోరతపంబు సేయుచు నొక్కనాఁడు దనసమీపంబున వాసంతికాపచయవినోదంబున నున్న యప్సరస మేనక యను దానిం జూచి, మదనరాగంబున రేతస్స్కందం బయిన దానిం దన పాదంబునఁ బ్రచ్ఛాదించిన, నందు ద్రుపదుం డనుకొడుకు మరుదంశంబునఁ బుట్టిన, వాని భరద్వాజాశ్రమంబునఁ బెట్టి చని పృషతుండు పాంచాలదేశంబున రాజ్యంబు సేయుచుండె, ద్రుపదుండును ద్రోణునితోడ నొక్కట వేదాధ్యయనంబు సేసి విలువిద్యయుం గఱచి యా పృషతు పరోక్షంబునం బాంచాలదేశంబున కభిషిక్తుం డయ్యెఁ; ద్రోణుండును నగ్నివేశ్యుం డను మహామునివలన ధనుర్విద్యా పారగుం డై తత్ప్రసాదంబున నాగ్నేయాస్త్రం బాదిగా ననేకదివ్యబాణంబులు వడసి, భరద్వాజు నియోగంబునఁ బుత్రలాభార్థంబు కృపుని చెలియలిఁ గృపి యనుదాని వివాహం బయి, దానియం దశ్వత్థామ యను కొడుకుం బడసి, యొక్కనాఁడు. 196

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; అనంతరంబు+అ= ఆ తరువాత; భరద్వాజ, సఖుండు+ఐన= భరద్వాజునియొక్క స్నేహితు డైన; పృషతుండు+అను; పాంచాల, పతి= పాంచాలదేశపురాజు; మహా, ఘోర, తపంబు= గొప్ప తీవ్రతపస్సు; చేయుచున్= చేస్తూ; ఒక్కనాఁడు; తన, సమీపంబునన్= తనకు దగ్గర; వాసంతికా, కుసుమ+అపచయ, వినోదంబునన్= వసంతోత్సవ పుష్పాలను కోసే వేడుకలో; ఉన్న; అప్సరస, మేనక, అను, దానిన్= అప్సరసయైన మేనక అను పేరుగల దానిని; చూచి; మదన, రాగంబునన్= మన్మథరాగంచేత; రేతస్+స్కందంబు+అయినన్= వీర్యం జారిపడగా; 'రేతస్ఖలనంబు' అని పాఠాంతరం ఉన్నది; దానిన్= ఆ రేతస్సును; తన, పాదంబునన్= తనకాలితో; ప్రచ్ఛాదించినన్= కప్పివేయగా; అందున్, ద్రుపదుండు= అందుండి ద్రుపదుడు; అను, కొడుకు= పేరుగల కుమారుడు; మరుత్+అంశంబునన్= మరుత్తుయొక్క అంశలో; పుట్టినన్= పుట్టగా; వానిన్= అతనిని; భరద్వాజ+ఆశ్రమంబునన్= భరద్వాజుని ఆశ్రమంలో; పెట్టి= ఉంచి; చని= వెళ్ళి, పృషతుండు= పృషతుడు; పాంచాల, దేశంబునన్= పాంచాలదేశంలో; రాజ్యంబు, చేయుచున్= రాజ్యం చేస్తూ; ఉండెన్; ద్రుపదుండును; ద్రోణునితోడన్= ద్రోణునితోటి; ఒక్కట= ఒకటిగా; వేద+అధ్యయనంబు= వేదాధ్యయనం (వేదాలను చదవడం); చేసి; విలువిద్యయున్= విలువిద్యనుకూడా; కఱచి= నేర్చి; ఆ, పృషతు, పరోక్షంబునన్= ఆ పృషతుని తర్వాత; పాంచాల, దేశంబునకున్; అభిషిక్తుండు+అయ్యెన్= అభిషేకింపబడ్డ వా డయినాడు; ద్రోణుండును; అగ్నివేశ్యుండు+అను; మహా, ముని వలనన్; ధనుర్విద్యా, పారగుండు+ఐ= విలువిద్యయొక్క అంతాన్ని (చివరిని) ముట్టినవాడై; తద్+ప్రసాదంబునన్= అతడి (అగ్నివేశ్యుని) యొక్క దయచేత; ఆగ్నేయ+అస్త్రంబు; ఆదిగాన్= మొదలుగా; అనేక, దివ్య, బాణంబులు= అనేకమయిన దేవతాసంబంధాలైన బాణాలు; పడసి= పొంది; భరద్వాజ, నియోగంబునన్= భరద్వాజునియొక్క ఆజ్ఞచేత; పుత్ర, లాభ+అర్థంబు= పుత్రులను పొందటంకొరకు; కృపుని, చెలియలిన్= కృపుని చెల్లెలిని; కృపి, అనుదానిన్= కృపి అను పేరుగల ఆమెను; వివాహంబు+అయి= పెండ్లి అయి; దాని అందున్= ఆమెయందు; అశ్వత్థామ, అను; కొడుకున్; పడసి= పొంది; ఒక్కనాఁడు.

తాత్పర్యం: భరద్వాజునిస్నేహితు డైన పృషతు డనే పాంచాలదేశపు రాజు మహాభయంకర మయిన తపస్సు చేస్తూ, ఒక రోజు తనసమీపంలో వసంతకుసుమాలను కోస్తున్న మేనక అనే అప్సరసను చూచాడు. మన్మథరాగంచేత వీర్యస్ఖలనం కాగా, దానిని తనపాదంతో కప్పివేశాడు. అందులోనుండి ద్రుపదు డనే కొడుకు మరుత్తుని అంశతో జన్మించాడు. ఆ బాలుడిని భరద్వాజాశ్రమంలోనే ఉంచి, పృషతుడు వెళ్ళి పాంచాలరాజ్యం పాలిస్తూ ఉన్నాడు. ద్రుపదుడు ద్రోణునితో కలిసి వేదాలు చదివి, విలువిద్యను నేర్చి, పృషతునితర్వాత పాంచాలదేశానికి రా జయ్యాడు. ద్రోణుడు అగ్నివేశ్యుడనే మహామునివద్ద ధనుర్విద్యాపారంగతుడై, అతనిఅనుగ్రహంచేత ఆగ్నేయాస్త్రం మొదలుగా

అనేకదివ్యాస్త్రాలు పొంది, భరద్వాజుని ఆజ్ఞచేత పుత్రులను పొందటానికి కృపునిచెల్లెలైన కృపిని వివాహమాడాడు. ఆమెవలన అశ్వత్థామ అనే కొడుకును కన్నాడు. ఒకనాడు -

క. అనవరతము బ్రాహ్మణులకుఁ । దనియఁగ ధన మిచ్చు జామదగ్న్యుఁడు రాముం
డను జనవాదపరంపర । విని యరిగెను వానికడకు విత్తాపేక్షన్. 197

ప్రతిపదార్థం: అనవతరము= ఎల్లప్పుడూ; బ్రాహ్మణులకున్; తనియఁగ= తృప్తిపొందే విధంగా, జామదగ్న్యుఁడు=జమదగ్ని కుమారుడు; రాముండు= పరశురాముడు; ధనము=ధనాన్ని; ఇచ్చున్= ఇస్తున్నాడు; అను, జన, వాద, పరంపర= అనే జనుల మాటల వరుసను; విని; వాని కడకున్= అతనిదగ్గరకు; విత్త+అపేక్షన్= ధనంమీదికోరికచేత; అరిగెను=వెళ్ళాడు.

తాత్పర్యం: ఎప్పుడూ బ్రాహ్మణులకు తృప్తి కలిగేవిధంగా జమదగ్నికుమారు డైన పరశురాముడు ధన మిస్తున్నా డని అందరూ అనుకుంటుంటే విని, అతనివద్దకు ధనాపేక్షతో వెళ్ళాడు.

క. అరిగి మహేంద్రాచలమునఁ । బరమతపోవృత్తి నున్న భార్గవు లోకో
త్తరు భూరికర్మనిర్మల । చరితుని ద్రోణుండు గాంచి సద్వినయమునన్. 198

ప్రతిపదార్థం: అరిగి=వెళ్ళి; మహేంద్ర+అచలమునన్= మహేంద్రపర్వతంవద్ద; పరమ, తపస్+వృత్తిన్= గొప్పతపస్సు చేసే పనితో; ఉన్న; భూరి, కర్మ, నిర్మల చరితుని= గొప్పపనులచేత పరిశుద్ధం అయిన నడవడి కలవాడిని; భార్గవు= భృగువంశంవా డైన పరశురాముడిని; ద్రోణుండు= ద్రోణుడు; కాంచి=చూచి; సత్+వినయంబునన్= మంచి వినయంతో.

తాత్పర్యం: వెళ్ళి, మహేంద్రపర్వతంవద్ద ఘోరతపస్సు చేస్తున్నవాడూ, లోకంలో శ్రేష్ఠుడూ, గొప్పపనులు చేయటం చేత పరిశుద్ధమయిన నడవడి గలవాడూ అయిన పరశురాముడిని చూచి మంచివినయంతో.

వ. 'ఏను భారద్వాజుండ, ద్రోణుం డనువాఁడ; నర్థార్థి నై నీకడకు వచ్చితి' ననినఁ బరశురాముం డి ట్లనియె.199

ప్రతిపదార్థం: ఏను= నేను; భరద్వాజుండ= భరద్వాజుని కుమారుడను; ద్రోణుండు; అనువాఁడన్; అర్థ+అర్థిని+ఐ= ధనాన్ని కోరినవాడినై; నీ, కడకున్= నీ దగ్గరికి; వచ్చితిన్; అనినన్; పరశురాముండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేను భరద్వాజునికుమారుడ నైన ద్రోణుడిని. ధనాన్ని ఆశించి నీదగ్గరకు వచ్చాను' అని అనగా పరశురాముడు ఈ విధంగా బదులు పలికాడు.

చ. కలధన మెల్ల ముందఱ జగన్నుత । విప్రుల కిచ్చి, వార్ధిమే
ఖలనిఖిలోర్వి యంతయును గశ్యపుఁ డన్మని కిచ్చితిన్, శరం
బులును శరీరశస్త్రములుఁ బొల్పుగ నున్నవి; వీనిలోన నీ
వలసినవస్తువుల్ గొను ధ్రువంబుగ నిచ్చెద నీకు నావుడున్. 200

విశేషం: జగత్+నుత= లోకంచేత పొగడబడేవాడా!; కల, ధనము+ఎల్లన్= ఉన్న ధనా న్నంతటినీ; ముందఱ= ముందుగానే,; విప్రులకున్= బ్రాహ్మణులకు; ఇచ్చి; వార్ధి, మేఖల, నిఖిల+ఉర్వి, అంతయును= సముద్రం ఒడ్డాణంగా కలిగిన సమస్త

భూమండలాన్నీ; కశ్యపుఁడు= కశ్యపుడు; అన్, మునికిన్, ఇచ్చితి; శరంబులును= బాణాలు; శరీర, శస్త్రముల్= శరీరం, ఆయుధాలు; పొల్పుగన్= ఒప్పుగా; ఉన్నవి; వీనిలోనన్= వీటిలో; నీ, వలసిన, వస్తువుల్= నీవు కోరుకొన్న వస్తువులను; కొను= తీసికొమ్ము; నీకున్= నీకు; ధ్రువంబుగన్= తప్పకుండా; ఇచ్చెదన్; నావుడున్= అని పరశురాముడు అనగా.

తాత్పర్యం: 'లోకంచేత పొగడ్త లందుకొన్న ఓ ద్రోణా! నేను ఉన్నధనం అంతా ముందే బ్రాహ్మణులకు ఇచ్చివేశాను. సముద్రం ఒడ్డాణంగా చుట్టిన భూమి నంతటినీ కశ్యపమహర్షికి ఇచ్చివేశాను. ఇక శస్త్రాస్త్రాలు, శరీరం మిగిలి ఉన్నాయి. వీటిలో నీకు కావలసినవాటిని తీసికొమ్ము తప్పక ఇస్తాను' అని పరశురాముడు అనగా.

క. ధనములలో నత్యుత్తమ । ధనములు శస్త్రాస్త్రములు; ముదంబున వీనిం
గొని కృతకృత్యుఁడ నగుదును । జననుత ! నా కొసఁగు మస్త్రశస్త్రచయంబుల్. 201

ప్రతిపదార్థం: జన, నుత= జనులచేత కొనియాడబడేవాడా! ఓ పరశురామా!; ధనములలోన్; అతి+ఉత్తమ+ధనములు= మిక్కిలి శ్రేష్ఠములైన ధనాలు; శస్త్ర+అస్త్రములు; ముదంబునన్= సంతోషంతో; వీనిన్= వీటిని; కొని=తీసికొని; కృతకృత్యుఁడను= నెరవేరిన పనికలవాడిని; అగుదును= అయ్యెదను; నాకున్; అస్త్ర,శస్త్రచయంబుల్= అస్త్ర శస్త్రాల సమూహాలు; ఒసఁగుము= ఇమ్ము.

తాత్పర్యం: జనులచేత ప్రశంసించబడే ఓ పరశురామా! ధనాలలో మిక్కిలి మేలైనధనాలు శస్త్రాస్త్రాలు. కాబట్టి సంతోషంతో వీటిని తీసికొని కృతార్థుడ నవుతాను. శస్త్రాస్త్రసమూహాన్ని నాకు ఇమ్ము.

వ. అని పరశురాముచేత దివ్యాస్త్రంబులు ప్రయోగరహస్యమంత్రంబులతోడం బడసి, ధనుర్విద్యయు నభ్యసించి, ధనార్థియయి తన బాలసఖుండైన ద్రుపదుపాలికిం జని 'యేను ద్రోణుండ, నీ బాలసఖుండ, సహాధ్యాయుండ న న్నెఱుంగుదే' యని ప్రణయపూర్వకంబుగాఁ బలికిన విని యప్పలుకులు విన సహింపక ద్రుపదుం డలిగి యి ట్లనియె. 202

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పరశురాముచేత; దివ్య+అస్త్రంబులు= దేవతాసంబంధమైన అస్త్రాలు; ప్రయోగ, రహస్య, మంత్రంబులతోడన్= ప్రయోగించటంలోని మర్మాలతో, మంత్రాలతో; పడసి= పొంది; ధనుర్విద్యయున్= విలువిద్యనుకూడా; అభ్యసించి= నేర్చుకొని; ధన+అర్థి+అయి= ధనాన్ని కోరినవాడై; తన, బాల, సఖుండు+ఐన= తనయొక్క చిన్ననాటి స్నేహితుడైన; ద్రుపదు, పాలికిన్= ద్రుపదుని దగ్గరకి; చని= వెళ్లి; ఏను= నేను; ద్రోణుండన్= ద్రోణుడను; నీ, బాల సఖుండన్= నీ చిన్ననాటి మిత్రుణ్ణి; సహ+అధ్యాయుండన్= నీతో కలిసి చదివినవాడిని; నన్నున్= నన్ను; ఎఱుంగుదే= తెలిసి ఉన్నావు కదా, గుర్తుపట్టావుకదా!; అని= ఆ ప్రకారంగా; ప్రణయ, పూర్వకంబుగా= స్నేహభావం ఉట్టిపడగా; పలికినన్= మాట్లాడగా; ఆ+పలుకులు; వినన్ సహింపక= వినటానికి ఇష్టపడక; ద్రుపదుండు; అలిగి= కోపపడి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పరశురామునిచేత దివ్యాస్త్రాలను, వాటిప్రయోగమర్మాలతో, మంత్రాలతోకూడా పొంది, విలువిద్యను అభ్యసించి, ధనాన్ని కోరి తనచిన్ననాటి స్నేహితు డైన ద్రుపదుదగ్గరికి వెళ్లి, ' నేను నీ బాల్యమిత్రుడిని, నీతో కలిసి చదువుకొన్నవాడిని. తెలుసుకదా' అని స్నేహపూర్వకంగా మాట్లాడగా, ద్రుపదు డామాటలను సహించలేక కోపించి ఈ విధంగా అన్నాడు.

ద్రోణుఁడు ద్రుపదునిచే నవమానితుఁ డగుట (సం. 1-122-2)

చ. కొలఁది యెఱుంగ కిట్టి పలుకుల్ పలుకం దగుఁ గాదు నా కనన్
బలుగుఁదనంబునం బలుకఁ బాడియె నీ సఖి నంచుఁ? బేదవి
ప్రులకును ధారుణీశులకుఁ బోలఁగ సఖ్యము సంభవించునే?
పలుకక వేగ పొ; మ్మకట పాఱుఁడు సంగడికాఁడె యెందునన్ ? 203

ప్రతిపదార్థం: కొలఁది= అంతరం; ఎఱుంగక= తెలియక; ఇట్టి పలుకుల్= ఇటువంటి మాటలు; పలుకన్= మాటాడుటకు; తగున్, కాదు= తగినది, కాదు; నాకు+అనన్= నాకు అనగా; పలుగు+తనంబునన్= నిందాపూర్వకంగా; నీ, సఖిన్= నీ స్నేహితుడిని; అంచున్= అంటూ; పలుకన్; పాడియె= న్యాయమా!; పేద, విప్రులకును= బీద బ్రాహ్మణులకు; ధారుణి+ ఈశులకున్= రాజులకు; పోలఁగన్= సమానమైనట్లు; సఖ్యము= స్నేహం; సంభవించునే= కలుగుతుందా?; పలుకక= మాట్లాడ కుండా; వేగన్= త్వరగా; పొమ్ము= వెళ్లు; అకట= అయ్యో!; పాఱుఁడు= బ్రాహ్మణుడు; ఎందునన్= ఎక్కడైనా; సంగడికాఁ డు+ఎ= స్నేహితుడా?

తాత్పర్యం: మన ఇద్దరి అంతరం తెలియకుండా, 'నాకు ఈ విధంగా మాట్లాడ తగునా, కూడదా' అని అనుకోకుండా, నన్ను నీ స్నేహితుడి నని చెప్పడం న్యాయంగా ఉందా? బీదబ్రాహ్మణులకూ మహారాజులకూ స్నేహం ఎట్లా సాధ్యపడుతుంది? మారుమాట్లాడక పొమ్ము. అయ్యో! అసలు బ్రాహ్మణుడు ఎక్కడైనా చెలికా డౌతాడా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

చ. ధనపతితో దరిద్రునకుఁ, దత్త్వవిదుం డగు వానితోడ మూ
ర్ఖునకుఁ, బ్రశాంతుతోడఁ గడుఁ గ్రూరునకున్, రణశూరుతోడ భీ
రునకు, వరూథితోడ నవరూథికి, సజ్జనుతోడఁ గష్టదు
ర్జనునకు నెవ్విధంబునను సఖ్యము దా నొడఁగూడ నేర్చునే? 204

ప్రతిపదార్థం: ధనపతితోన్= ధనానికి ప్రభువైనవానితో - అంటే సంపదకలవానితో; దరిద్రునకున్; తత్త్వ, విదుండు+ అగువానితోడన్= తత్త్వం తెలిసినవానితో; మూర్ఖునకున్; ప్రశాంతుతోడన్= మిక్కిలి శాంతం కలిగినవానితో; కడున్+క్రూరునకున్= మిక్కిలి క్రూరుడైనవానికి; రణ, శూరుతోడన్= యుద్ధంలో పరాక్రమవంతు డైన వానితో; భీరునకున్= పిరికివానికి; వరూథితోడన్= కవచం కలిగినవానితో; అవరూథికిన్= కవచం లేనివానికి; సజ్జనుతోడన్= సన్మార్గునితో; కష్ట, దుర్జనునకున్= పాపి అయిన దుర్మార్గునికి; సఖ్యము= స్నేహం; ఏ+విధంబునను= ఎట్లు; తాన్= తాను; ఒడగూడన్+నేర్చునే= కలుగుతుందా? కలుగ దని భావం.

తాత్పర్యం: ధనవంతునితో దరిద్రునికి, పండితునితో మూర్ఖునికి, ప్రశాంతునితో క్రూరునికి, వీరునితో పిరికివానికి, కవచరక్షణ కలవానితో రక్షాకవచం లేనివానికి, సజ్జనునితో దుర్మార్గునికి స్నేహం ఏ విధంగా కలుగుతుంది?

విశేషం: ఈ పద్యం నన్నయరుచిరార్థసూక్తులలో ఒకటి. ద్రుపదుడు చిన్ననాటి నెచ్చెలిని గుర్తించికూడా, పేదవాడూ, ధనవంతుడూ అనే భేదభావంతో అతనిని తిరస్కరించాడు. అంతటితో ఆగకుండా తన ప్రవర్తనను ధర్మబద్ధమైనదానిగా

సమర్థించుకొన్నాడు. అందుకై ముందు పద్యంలో మహారాజుకూ పేదబాపనికీ ఎక్కడి సంబంధం అని ఎత్తిపొడిచాడు. ధనాపేక్షతో వచ్చిన ద్రోణుని మనసు అతని పేదరికాన్ని ఎత్తిచూపుతున్నందుకు చివుక్కుమనేటట్లు చేశాడు. అంతటితో ఆగక అసలు బ్రాహ్మణుడు స్నేహంచేయ తగినవాడా? అని అధిక్షేపించాడు. ఇది అతని వర్ణాన్నీ, స్వభావాన్నీ నిందించేవాక్యం. అర్థహీనుడైనా ద్రోణుడు అభిమానహీనుడు కాడు. అందువలన ఆవాక్యం అతడిని రెచ్చగొట్టుంది. పైపెచ్చు ఈపద్యంలో ద్రుపదుడు తన ప్రవర్తనకు లోకధర్మాన్ని సూక్తిగా చెప్పి సమర్థించుకొంటున్నాడు. ఇందులో పేర్కొన్న పోలికలవలన ద్రుపదుడు తనను ధనపతిగా, తత్త్వవేత్తగా, ప్రశాంతునిగా, రణశూరునిగా, సురక్షితునిగా, ఉత్తమునిగా చెప్పుకొని ఆత్మప్రశంస చేసికొన్నాడు. ద్రోణుడిని వరుసగా దరిద్రునిగా, మూర్ఖునిగా, క్రూరునిగా, పిరికిపందగా, అరక్షితునిగా, పరమదుర్మార్గునిగా నిందించి, నిష్కారణమైన పరనిందకు పాల్పడ్డాడు. ముందు పద్యంలోని మాటలే ద్రోణునిమనసును పుండుచేసి ఉంటాయి; పైపెచ్చు ఈ మాటలు పుండుమీద కారం చల్లిన ట్లుంటాయి. సూక్తులను కథార్థపోషకాలుగా వాడేనన్నయకథాకథనశిల్ప మిది.

క. సమశీలశ్రుతయుతులకు । సమధనవంతులకు సమసుచారిత్రులకుం
దమలో సఖ్యమును వివా । హము నగుఁ గా; కగునె రెండు నసమానులకున్. 205

ప్రతిపదార్థం: సమ, శీల, శ్రుత, యుతులకున్= సమానమైన స్వభావంతో, విద్యతో కూడిన వాళ్ళకు, సమ, ధనవంతులకున్= సమానంగా ధనవంతు లైనవాళ్ళకు; సమ, సుచారిత్రులకున్= సమాన మైన మంచి నడవడిక కలిగినవాళ్ళకు; తమలోన్; సఖ్యమును= స్నేహం; వివాహము= పెండ్లి; అగున్, కాక= ఏర్పడుతాయికానీ; రెండున్= మైత్రి, - వివాహము, అను రెండును; అసమానులకున్= సమానులు కానివాళ్ళకు; అగునె= ఔతాయా? (కా వని భావం)

తాత్పర్యం: సమానమైన స్వభావం, విద్య కలవాళ్ళకు, సమానమైన సంపద కలవాళ్ళకు, సమానమైన మంచినడవడి కలవాళ్ళకు స్నేహం, వివాహం ఏర్పడుతాయి. కాని సమానులు కానివాళ్ళకు అవి ఏర్పడతాయా? (ఏర్పడ వని భావం)

విశేషం: కయ్యానికీ వియ్యానికీ సామ్యం ఉండా లనే జనసూక్తి కీపద్యం రమణీయపద్యాకృతి.

వ. 'మఱి యట్లుంగాక రాజులకుఁ గార్యవశంబునం జేసి మి త్త్రామిత్త్ర సంబంధములు సంభవించుం గావున మా యట్టి రాజులకు మీయట్టిపేదపాఱువారలతోఁ గార్యకారణం బైన సఖ్యం బెన్నండును గానేర' దని ద్రుపదుం డైశ్వర్యగర్వంబున మెచ్చక పలికిన విని, ద్రోణుం డవమానజనితమన్యుఘూర్ణమానమానసుం డయి యెద్దియుం జేయునది నేరక పుత్త్రకళత్రాగ్నిహోత్రశిష్యగణంబులతో హస్తిపురంబునకు వచ్చె; నంత నప్పురబహిరంగణంబున ధృతరాష్ట్రపాండునందను లందఱుఁ గందుకక్రీడాపరు లయి వేడుకతో నాడుచున్నంత నక్కాంచనకందుకం బొక్కనూతం బడిన. 206

ప్రతిపదార్థం: మఱి= ఇంకా; అట్లున్+కాక= ఆ విధంగా కాకుండా; రాజులకున్; కార్య, వశంబునన్ చేసి= అవసరంచేత; మిత్త్ర+అమిత్త్ర, సంబంధములు= స్నేహ, వైర సంబంధాలు; సంభవించున్= కలుగుతాయి, కావునన్; మీయట్టి, పేద, పాఱు వారలతోన్= మీవంటి బీదబ్రాహ్మణులతో; కార్య, కారణంబు+ఐన= ప్రయోజనకర మైన; సఖ్యంబు= మైత్రి; ఎన్నండును= ఎప్పటికినీ; కానేరదు=కలుగబోదు; అని= ఆ ప్రకారంగా; ద్రుపదుండు; ఐశ్వర్య గర్వంబునన్= సంపదవలన కలిగినపొగరుచేత; మెచ్చక= లక్ష్యపెట్టకుండా (నిర్లక్ష్యంగా); పలికినన్; విని; ద్రోణుండు; అవమాన, జనిత, మన్యు, ఘూర్ణమాన, మానసుండు+అయి= అవమానంవలన పుట్టినకోపంచేత తిరుగుడు పడుతున్న మనసు కలిగినవా డై; ఎద్దియున్, చేయునది, నేరక= ఏమిచేయాలో

తెలియక; పుత్త్ర, కళత్ర+అగ్నిహోత్ర, శిష్య, గణంబులతో= కొడుకుతో, భార్యతో, అగ్నిహోత్రంతో, శిష్యసమూహంతో; హస్తి, పురంబునకున్; వచ్చెన్; అంతన్= అప్పుడు; ఆ+పుర, బహిస్+అంగణంబునన్= ఆ పట్టణం వెలుపల; ధృతరాష్ట్ర, పాండు నందనులు= ధృతరాష్ట్రుని కుమారులు, పాండురాజు కుమారులు (కౌరవ పాండవులు); అందఱున్= అంతా; కందుక, క్రీడాపరులు+అయి= చెండాట ఆడటంలో ఆసక్తి కలిగినవారై; వేడుకతోన్= సంతోషంతో; ఆడుచు+ఉన్నంతన్= ఆడుతూ ఉండగా; ఆ+కాంచన, కందుకంబు= ఆ బంగారు చెండు (బంతి); నూతన్= బావిలో; పడినన్= పడగా.

తాత్పర్యం: 'అంతేకాదు; రాజులకు అవసరాన్నిబట్టి మిత్రత్వశత్రుత్వాలు ఏర్పడుతుంటాయి; అందుచేత మా వంటి రాజులకు, మీవంటి పేదబ్రాహ్మణులతో ప్రయోజనం ఏమీ లేదు కాబట్టి స్నేహం ఎప్పుడూ ఏర్పడదు' అని ద్రుపదరాజు ఐశ్వర్యగర్వంతో తిరస్కరించి మాట్లాడగా ద్రోణుడు అవమానంచేత కలిగిన కోపంవలన కలతచెందిన మనసు కలవాడై, ఏమీచేయటానికీ తోచక, కొడుకుతో, భార్యతో, అగ్నిహోత్రంతో, శిష్యసమూహాలతో హస్తినాపురానికి వచ్చాడు. అప్పుడు ఆ పట్టణంబయట ధృతరాష్ట్రునికుమారులు, పాండురాజుకుమారులు చెండాట ఆడుకొంటూ ఉండగా వా ళ్ళాడుతున్న బంగారుబంతి బావిలో పడింది. అప్పుడు.

ఆ. నీరిలోనఁ దోఁచు తారక ప్రతిబింబ । మొక్కొ యనఁగ వెలుఁగుచున్నదాని
రాచకొడుకులెల్లఁ జూచుచునుండిరి । దానిఁ బుచ్చుకొనువిధంబు లేక. 207

ప్రతిపదార్థం: నీరిలోనన్= నీటిలో; తోఁచు= కనిపిస్తున్న; తారక, ప్రతిబింబము+ఒక్కొ= నక్షత్రంయొక్క ప్రతిబింబమా?; అనఁగన్= అనేటట్లుగా; వెలుఁగుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉన్న; దానిన్= ఆ బంతిని; రాచ, కొడుకులు+ఎల్లన్= రాకుమారులంతా; దానిన్= ఆ బంతిని; పుచ్చుకొను, విధంబు= తీసికొనే మార్గం; లేక= తెలియక; చూచుచున్; ఉండిరి.

తాత్పర్యం: నీటిలో ప్రతిఫలిస్తున్న నక్షత్రమా అన్నట్లుగా వెలుగుతున్న ఆ బంగారుబంతిని తీసికొనేమార్గం లేక రాకుమారులంతా ఊరకే చూస్తున్నారు.

విశేషం: అలం : ఉత్ప్రేక్ష.

వ. అట్టి యవసరంబున. 208

తాత్పర్యం: అటువంటి సమయంలో.

ద్రోణుఁడు హస్తిపురంబునకు వచ్చుట. (సం. 1-122-14)

క. నానావిధశరశరధుల । తో నున్నతచాపధరుఁడు ద్రోణుఁడు వారిం
గానఁ జనుదెంచి యంతయుఁ । దా నప్పు డెఱింగి రాజతనయుల కనియెన్. 209

ప్రతిపదార్థం: నానా, విధ, శర, శరధులతోన్= అనేకవిధా లైన బాణాలతో, అమ్ములపొదులతో; ఉన్నత, చాప, ధరుఁడు= పొడవైన ధనుస్సు ధరించినవాడు; ద్రోణుఁడు; వారిన్= ఆ కౌరవ పాండవుల్ని; కానన్= చూడటానికై; చనుదెంచి= వచ్చి; తాన్= తాను; అప్పుడు; అంతయున్; ఎఱింగి; రాజ, తనయులకున్= రాకుమారులతో; అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: అనేకవిధా లైన బాణాలతో, అమ్ములపొదులతో, ఎత్తైన ధనుస్సును ధరించిన ద్రోణుడు వాళ్ళ దగ్గరికి వెళ్ళి, విషయమంతా తెలిసికొని ఆ రాజకుమారులతో ఇట్లా అన్నాడు.

చ. భరతకులప్రసూతులరు భాసురశస్త్రమహాస్త్ర విద్యలం
గరము ప్రసిద్ధుఁ డై పరఁగు గౌతమశిష్యుల; రిట్టి మీకు దు
ష్కరముగ నూతిలోఁ బడిన కాంచనపిండుఁ గొనంగనేర కొం
డొరుల మొగంబు చూచి నగుచుండఁగఁ జన్నె యుపాయహీనతన్. 210

ప్రతిపదార్థం: భరత, కుల, ప్రసూతులరు= భరతవంశంలో పుట్టినవారు; భాసుర, శస్త్ర, మహా+అస్త్ర, విద్యలన్= ప్రకాశిస్తున్న శస్త్రవిద్యలలో, గొప్ప అస్త్రవిద్యలలో; కరము= మిక్కిలి; ప్రసిద్ధుఁడు+ఐ= పేరు పొందినవాడై; పరఁగు= ఒప్పు; గౌతమ, శిష్యులరు= కృపాచార్యుని శిష్యులు; ఇట్టి; మీకున్; దుష్కరముగన్= కష్టంగా; నూతిలోన్= బావిలో; పడిన, కాంచన, పిండున్= బంగారు బంతిని; కొనంగ, నేరక= పైకితీయకలేక; ఉపాయ హీనతన్= ఉపాయం లేక; ఒండు+ఒరుల, మొగంబు= ఒకరిముఖాన్ని ఒకరు; చూచి; నగుచున్+ఉండఁగన్= నవ్వుతూ (నిస్సహాయంగా)ఉండటం; చన్నె= తగినపనా?

తాత్పర్యం: మీరు భరతవంశంలో పుట్టి; శస్త్రాస్త్రవిద్యలలో మహాప్రసిద్ధు డైన కృపాచార్యునిశిష్యులై, బావిలో పడిన బంతిని తీసికొనటం చేతకాక ఒకరిముఖం ఒకరు చూచుకుంటూ నవ్వుకొనటం మీకు తగినపనా?

విశేషం: బాణవిద్యలో ప్రౌఢుడై ద్రోణుడు - బావిలో పడినబంతిని పైకితీసికొనలేక వెలవెలపోతున్న పాండవులతో, ధార్తరాష్ట్రులతో అవహేళనగా మాట్లాడటం వాళ్ళను అవమానించటం కాదు. ఉత్తమవంశంలో పుట్టి, ఉత్తమగురువుకు శిష్యులై సమయోచితమైన ఉపాయం ఆలోచించకుండ ఉద్విగ్నులు కావటం వీరులకు ఉచితం కా దని హెచ్చరించటానికి. ఆ తరువాత తనవిద్యను, యోగ్యతను ప్రదర్శించాడు. ఈ సన్నివేశం కృపాచార్యునికంటె ద్రోణుడు గొప్పవా డనీ, అతనిశిక్షణ రాజకుమారుల కవసర మనీ భీష్ముడు భావించేటట్లు చేసిం దని వస్తుధ్వని. (సంపా.)

వ. 'దీని బాణపరంపరం జేసి పుచ్చి యిచ్చెదఁ జూడుఁ; డీ విద్య యొరు లెవ్వరు నేర' రని ద్రోణుం డొక్కబాణం బభి మంత్రించి దృష్టి ముష్టి సౌష్ఠవంబు లొప్ప నక్కందుకంబు నాట నేసి దానిపుంఖంబు మఱియొక బాణంబున నేసి తత్పుంఖం బొండొకబాణంబున నేసి వరుసన బాణరజ్జువు గావించి దానిం దిగిచికొని యిచ్చినం జూచి రాజకుమారు లెల్ల విస్మయం బంది ద్రోణుం దోడ్కొని చని భీష్మున కంతయు నెఱింగించిన నాతండును. 211

ప్రతిపదార్థం: దీనిన్= ఈ బంతిని; బాణ, పరంపరన్+చేసి= బాణాల వరుసతో; పుచ్చి= తీసికొని; ఇచ్చెదన్; చూడుఁడు= చూస్తూ ఉండండి; ఈ, విద్య; = ఈ విలువిద్యను; ఒరులు+ఎవ్వరున్= ఇతరు లెవ్వరూ; నేరరు= నేర్వలేదు; అని= ఆ విధంగా; ద్రోణుండు; ఒక్క, బాణంబు= ఒక్క బాణాన్ని; అభిమంత్రించి= మంత్రంతో పిలిచి; దృష్టి, ముష్టి, సౌష్ఠవంబులు= చూపు యొక్క, పిడికిలి యొక్క చక్కదనాలు; ఒప్పన్= ఒప్పునట్లుగా; ఆ+కందుకంబు= ఆ బంతిని; నాటన్+ఏసి= గ్రుచ్చుకునేట్లుగా కొట్టి; దాని= ఆ బాణం యొక్క; పుంఖంబు= క్రింది చివర; మఱియొక, బాణంబునన్= ఇంకొక బాణంతో; ఏసి= కొట్టి; తద్+పుంఖంబు= దానియొక్క చివరిఅంచును; ఒండు+ఒక, బాణంబునన్= మరొక బాణంచేత; ఏసి=కొట్టి; వరుసన; బాణ, రుజ్జువు= బాణాల తాడును; కావించి= అగునట్లు చేసి; దానిన్= ఆ బంతిని; తిగిచికొని= లాగుకుని; ఇచ్చినన్= ఈయగా; చూచి= కనుగొని; రాజకుమారులు+ఎల్లన్= రాజకుమారు లందరు; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; ద్రోణుని= ద్రోణుణ్ణి; తోడ్కొని= తీసికొని; చని= వెళ్ళి; భీష్మునకున్, అంతయున్, ఎఱింగించినన్= భీష్మునికి అంతా తెలుపగా; అతండున్= అతడుకూడా.

తాత్పర్యం: 'ఈ బంతిని బాణపరంపరతో తీసి ఇస్తాను చూడండి. ఈ విద్య ఇతరు లెవ్వరికీ రాదు' అని ద్రోణుడు ఒక బాణాన్ని అభిమంత్రించి, చూపును, పిడికిలిని చక్కగా నిలిపి, ఆ బంతికి నాటుకునే విధంగా ఆ బాణాన్ని కొట్టి, ఆబాణంచివరికి మరో బాణాన్ని, దాని చివరికి ఇంకో బాణాన్నీ కొట్టి, వరుసగా బాణాలతాడు చేసి బంతిని లాగి ఇచ్చాడు. అది చూచి, రాకుమారు లందరూ ఆశ్చర్యపడి, ద్రోణుడిని తీసికొని వెళ్ళి భీష్మునికి జరిగినదంతా చెప్పారు. ఆయనకూడా.

క. ఆసన్నపలితు ననఘు శ । రాసనగురు భూరిసత్త్వు నసితకృశాంగున్
భూసురవరు ద్రోణు గుణో । ద్భాసితు వినినట్లు చూచి పరమప్రీతిన్. 212

ప్రతిపదార్థం: ఆసన్న, పలితున్= సమీపించిన తెలనెరిసినవాడిని; అనఘున్= పాపంలేనివాడిని; శర+ఆసన, గురున్= ధనుర్విద్యకు గురువైనవాడిని; భూరి, సత్త్వున్= గొప్పబలం కలిగినవాడిని; అసిత, కృశ+అంగున్= నల్లని, సన్నబడిన శరీరం కలవాడిని; భూసుర, వరున్= బ్రాహ్మణ శ్రేష్ఠుడిని; గుణ+ఉద్భాసితున్= మంచిగుణాలచేత ప్రకాశిస్తున్నవాడిని; ద్రోణున్= ద్రోణుణ్ణి; వినినట్లు+అ= మునుపు వినినట్లే; చూచి= కనుగొని; పరమ, ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో.

తాత్పర్యం: తల నెరియటం మొదలైనవాడు, పుణ్యాత్ముడు, ధనుర్విద్యాచార్యుడు, మహాబలవంతుడు, నల్లని బక్కచిక్కిన శరీరం కలవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు, మంచిగుణాలచేత ప్రకాశించేవాడు అయిన ద్రోణుడిని తాను ముందే విన్నట్లుగా చూచి భీష్ముడు ఎంతో సంతోషంతో.

క. 'ఎందుండి వచ్చి తిందుల; । కెం దుండఁగ నీకు నిష్ట మెఱిఁగింపుము స
ద్వందిత!' యని యడిగిన సా । నందుఁడు ద్రోణుండు భీష్మునకు ని ట్లనియెన్. 213

ప్రతిపదార్థం: ఎందు+ఉండి= ఎక్కడనుండి; ఇందులకున్= ఇక్కడికి; వచ్చితివి= వచ్చావు? నీకున్; ఎందు+ఉండఁగన్= ఎక్కడ ఉండటానికి; ఇష్టము= అభిలాష; ఎఱిఁగింపుము= తెలియజేయుము; సద్+వందిత= సజ్జనులచేత పొగడబడేవాడా!; అని= ఆ ప్రకారంగా; అడిగినన్= అడుగగా; స+ఆనందుఁడు= ఆనందంతో కూడినవాడైన; ద్రోణుండు; భీష్మునకున్; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: 'సజ్జనులచేత పొగడబడేవాడా! ఓ ద్రోణాచార్యా! నీవు ఎక్కడనుండి ఇక్కడకు వచ్చావు? ఎక్కడ ఉండటం నీ కిష్టం? చెప్పుము' అని అడుగగానే ద్రోణుడు సంతోషించి భీష్మునితో ఈ విధంగా అన్నాడు.

వ. ఏను ద్రోణుం డనువాఁడ; భరద్వాజపుత్త్రుండ నగ్నివేశ్యుండను మహామునివరునొద్ద బ్రహ్మచర్యాశ్రమంబున వేదాధ్యయ నంబు సేసి ధనుర్వేదం బభ్యసించుచున్ననాఁడు, పాంచాలపతి యైన పృషతుపుత్త్రుండు ద్రుపదుం డను వాఁడు నా కిష్టసఖుం డయి యెల్లవిద్యలు గఱచి, 'యేను పాంచాలవిషయంబునకు రా జయిననాఁడు నా యొద్దకు వచ్చునది; నా రాజ్యభోగంబులు నీవు ననుభవింప నర్హుండ' వని నన్నుఁ బ్రార్థించి చని, పృషతుపరోక్షంబునఁ దద్దేశంబునకు రా జయి యున్న, నేను గురునియుక్తుండ నై గౌతమిం బాణిగ్రహణంబు సేసి యిక్కుమారు నశ్వత్థామ నధికతేజస్వి నాత్మజుం బడసి, ధనంబు లేమిం గుటుంబభరణంబునం దసమర్థుండ నయి యుండియు. 214

ప్రతిపదార్థం: ఏను= నేను; ద్రోణుండు+అను వాఁడన్; భరద్వాజ, పుత్త్రుండన్= భరద్వాజమహర్షి కుమారుణ్ణి; అగ్నివేశ్యుండు= అగ్నివేశ్యుడను పేరుగల; మహాముని, వరున్+ఒద్ద= గొప్ప మునిశ్రేష్ఠుని దగ్గర; బ్రహ్మచర్య+ఆశ్రమంబునన్; వేద+ అధ్యయనంబు= వేదాలు చదవటం; చేసి; ధనుర్వేదంబు= విలువిద్యను; అభ్యసించుచున్= నేర్చుకొంటూ; ఉన్న, నాఁడు= ఉన్నప్పుడు; పాంచాల, పతి+ఐన= పాంచాలదేశపురాజైన, పృషతు, పుత్త్రుండు= పృషతు డనేవానికుమారుడు; ద్రుపదుండు+ అనువాడు; నాకు; ఇష్ట, సఖుండు+ఐ= ప్రియమైన స్నేహితుడై; ఎల్ల, విద్యలు; కఱచి= నేర్చుకొని; ఏను= నేను; పాంచాల, విషయంబునకున్= పాంచాలదేశానికి; రాజు+అయిన, నాఁడు= రాజైనప్పుడు; నా, ఒద్దకున్= నా దగ్గరికి; వచ్చునది= రమ్ము; నా, రాజ్య, భోగంబులు; నీవున్= నీవు కూడా; అనుభవింపన్= అనుభవించుటకు; అర్హుండవు= తగినవాడివి; అని; నన్నున్; ప్రార్థించి; చని= వెళ్ళి; పృషతు, పరోక్షంబునన్= పృషతుని తర్వాత, తద్+దేశంబునకున్= ఆ దేశానికి; రాజు+అయి, ఉన్నన్= ప్రభువైఉండగా; నేను= నేను; గురు, నియుక్తుండను+ఐ= తండ్రిచేత ఆజ్ఞాపించబడినవాడినై; గౌతమిన్= కృపిని; పాణిగ్రహణంబు+చేసి= వివాహమాడి; ఈ+కుమారున్; అశ్వత్థామన్; అధిక, తేజస్విన్= మిక్కిలి తేజశ్శాలిని; ఆత్మజున్= కుమారుని; పడసి= పొంది; ధనంబు, లేమిన్= ధనం లేకపోవటంచేత; కుటుంబ, భరణంబు, అందు= సంసారాన్ని భరించటంలో; అసమర్థుండను; అయి; ఉండియున్= శక్తిలేనివాడనై ఉండికూడా.

తాత్పర్యం: నాపేరు ద్రోణుడు. భరద్వాజునికుమారుడిని. అగ్నివేశ్యు డనే గొప్పమునిశ్రేష్ఠునిదగ్గర బ్రహ్మచర్య వ్రతం అవలంబించి వేదాధ్యయనం చేసి, ధనుర్వేదం నేర్చుకొంటున్నకాలంలో, పాంచాలరాజైన పృషతునికుమారుడు ద్రుపదు డనేవాడు నాకు ప్రియమిత్రుడై అన్నివిద్యలూ గురువుదగ్గర నేర్చి, 'నేను పాంచాలదేశానికి రాజైనప్పుడు నీవు నా దగ్గరికి రావాలి సుమా! నా రాజ్యభోగాలు నీవు కూడా అనుభవించటానికి అర్హుడ' వని నన్ను ప్రార్థించి వెళ్ళాడు. పృషతునితర్వాత ద్రుపదుడు ఆ దేశానికి రా జయ్యాడు. నేనుకూడా తండ్రిఆజ్ఞచేత కృపిని వివాహమాడి, గొప్పతేజస్సుకల ఈ బాలుడు అశ్వత్థామను కొడుకుగా పొంది, ధనం లేమిచేత సంసారాన్ని భరించలేనివాడినై ఉండికూడా -

క. పురుషవిశేష వివేకా । పరిచయు లగు ధరణిపతుల పాలికిఁ బోవం
బరులందు దుష్ప్రతిగ్రహ । భర మెదలో రోసి ధర్మపథమున నున్నన్. 215

ప్రతిపదార్థం: పురుష, విశేష, వివేక+అపరిచయులు+అగు= పురుషునియొక్క గొప్పతనాన్ని గురించిన ఆలోచనలందు పరిచయం లేనివాళ్ళయిన; ధరణి, పతుల, పాలికిన్= రాజుల దగ్గరికి; పోవన్= వెళ్ళటం; పరులందు= ఇతరుల దగ్గర; దుష్ప్రతిగ్రహ, భరము= చెడుదానాలను తీసికొనటంయొక్క కష్టాన్ని; ఎదలో= మనసులో; రోసి= అసహ్యించుకొని; ధర్మ, పథమునన్= ధర్మమార్గంలో; ఉన్నన్= ఉండగా.

తాత్పర్యం: వ్యక్తులయోగ్యతను గుర్తించలేని రాజులదగ్గరికి వెళ్లటానికీ, ఇతరులనుండి చెడుదానాలు తీసికొనటానికీ, ఇష్టపడక ధర్మమార్గంలో జీవితం గడపుతుండగా.

క. ధనపతుల బాలురు ముదం । బున నిత్యముఁ బాలు ద్రావఁబోయిన నస్మ
త్తనయుండు వీఁడు బాల్యం । బున నేడ్చెను బాలు నాకుఁ బోయుం డనుచున్. 216

ప్రతిపదార్థం: ధన, పతుల, బాలురు= ధనవంతుల పిల్లలు; ముదంబునన్= సంతోషంతో; నిత్యమున్= ప్రతిదినం; పాలు, త్రావన్ పోయినన్= పాలుత్రాగుచుండగా; అస్మద్+తనయుండు= నా కుమారుడు; వీఁడు= ఈ బాలుడు; బాల్యంబునన్= బాల్యమునందు; నాకున్, పాలు, పోయుండు; అనుచున్; ఏడ్చెన్.

తాత్పర్యం: ధనవంతుల బిడ్డలు ప్రతిదినం సంతోషంతో పాలు త్రాగుతూండగా, నా కుమారుడు వీడు బాల్యంలో 'నాకుకూడా పాలు పోయం'డని ఏడ్చాడు.

వ. దానిం జూచి 'దారిద్ర్యంబునకంటెఁ గష్టం బొం డెద్దియు లేదు; దీని నా బాలసఖుండగు పాంచాలు పాలికిం బోయి పాచికొందు; నాతండు తనదేశంబున కభిషిక్తుండు గాఁ బోవుచుండి నన్ను రాఁ బనిచి పోయె'. 217

ప్రతిపదార్థం: దానిన్+చూచి= ఆ సన్నివేశాన్ని చూచి; దారిద్ర్యంబునకంటెన్= లేమిడి కన్నా; కష్టంబు= కష్టము; ఒండు+ ఎద్దియున్= మరొకటి ఏదీ; లేదు; దీనిన్= ఈ పేదరికాన్ని; నా, బాల, సఖుండు= నా చిన్ననాటి స్నేహితుడు; అగు= అయినట్టి; పాంచాలు, పాలికిన్= పాంచాలదేశపు రాజైన ద్రుపదుని దగ్గరికి; పోయి; పాచికొందున్= పోగొట్టుకొంటాను; అతండు= ఆ ద్రుపదుడు; తన, దేశంబునకున్= తన రాజ్యానికి; అభిషిక్తుండు+కాన్= రాజు కావడానికి; పోవుచుండి= పోతూ ఉండి; నన్నున్= నన్ను; రాన్+పనిచి= రమ్మని చెప్పి; పోయెన్.

తాత్పర్యం: దానిని చూచి దారిద్ర్యంకంటే కష్టం మరొకటి లే దని తలచి 'ఈ దారిద్ర్యాన్ని నా బాల్యమిత్రు డైన పాంచాలరాజు ద్రుపదునిదగ్గరకు పోయి తొలగించుకుంటాను. అతడు తనదేశానికి రాజు కావటానికి వెళ్తూ నన్ను ఆహ్వానించి వెళ్ళాడు'.

మత్తకోకిల

వేఁడు టెంతయుఁ గష్టమైనను వేఱులేని సుహృజ్జనున్
వేఁడికో లుచితంబ కావున వేడ్కతోఁ జని సోమకున్
వేఁడినన్ ధన మొపఁడేనియు వీనిమాత్రకు నాలుగేన్
పాఁడికుఱ్ఱుల నీఁడె వీనికిఁ బాలు ద్రావుచునుండఁగన్. 218

ప్రతిపదార్థం: వేఁడుట= యాచించటం; ఎంతయున్= మిక్కలి; కష్టము+ఐనను= కష్టమైనపని అయినప్పటికీ; వేఱులేని= భేదంలేని; సుహృత్+జనున్= మిత్రుడిని; వేఁడికోలు= వేడుకోవటం; ఉచితంబు+అ= తగినదే; కావునన్; వేడ్క,తోన్= సంతోషంతో; చని= వెళ్ళి; సోమకున్= ద్రుపదుడిని; వేఁడినన్= ప్రార్థింపగా; ధనము+ఒపఁడు+ఏనియున్= ధనం ఇవ్వలేకపోయినప్పటికీ; వీని మాత్రకు= వీడికి (అశ్వత్థామకు) సరిపోయేంతగా; నాలుగు+ఏన్= నాలుగైనా; పాఁడి, కుఱ్ఱులన్= పాడి ఆవులను; వీనికిన్= ఈ అశ్వత్థామకు; పాలు; త్రావుచున్, ఉండఁగన్= పాలుత్రాగటానికి; ఈఁడె= ఇవ్వడా!

తాత్పర్యం: యాచించటం ఎంతో కష్టమైన పని. అయినప్పటికీ భేదం లేని మిత్రుడిని యాచించటం ఉచితమే. అందుచేత సంతోషంగా వెళ్లి ద్రుపదుడిని అడిగినట్లయితే, ధనం ఇవ్వలేకపోయినా, అశ్వత్థామ పాలు త్రాగటానికి సరిపోయేటట్లుగా నాలుగుపాడిఆవులనైనా ఇవ్వడా?

విశేషం: మత్తకోకిలపాదంలో ర, స, జ, జ, భ, ర - అనే గణాలు వరుసగా ఉంటాయి. 11వ అక్షరం యతిస్థానం. ప్రాస నియమం ఉన్నది.

వ. 'అని నిశ్చయించి ద్రుపదునొద్దకుం బోయి న న్నెఱింగించిన, నాతండు దన రాజ్యమదంబున నన్నును దన్నును నెఱుంగక' యేను రాజను నీవు పేదపాఱుండవు; నాకును నీకును నెక్కడి సఖ్యం?' బలి పలికిన వానిచేత నవమానితుండ నయి వచ్చితి' నని ద్రోణుండు దనవృత్తాంతం బంతయుఁ జెప్పిన. 219

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; నిశ్చయించి= నిర్ణయించుకొని; ద్రుపదు+ఒద్దకున్= ద్రుపదుడి దగ్గరికి; పోయి; నన్నున్+ఎఱింగించినన్= నన్ను నేను పరిచయం చేసికొనగా; ఆతండు= ఆ ద్రుపదుడు; తన, రాజ్య మదంబునన్= తన యొక్క రాజ్యంవలన కలిగిన పొగరుచేత; నన్నును= నన్ను; తన్నును= తనను; ఎఱుంగక= తెలియక; ఏను= నేను; రాజను; నీవు; పేద, పాఱుండవు= బీదబ్రాహ్మణుడివి; నాకును; నీకునున్; ఎక్కడి= ఎక్కడ; సఖ్యంబు= స్నేహం; అని, పలికినన్; వానిచేతన్= ఆ ద్రుపదునిచే; అవమానితుండను+అయి= అవమానించబడినవాడి నై; వచ్చితిని; అని; అట్లు; ద్రోణుండు; తన+వృత్తాంతంబు+అంతయున్, చెప్పినన్= తన వృత్తాంతాన్ని అంతా చెప్పగా-

తాత్పర్యం: 'అని నిర్ణయించుకొని ద్రుపదునిదగ్గరికి వెళ్ళి, నన్ను నేను పరిచయం చేసికొనగా, అతడు రాజ్యమదంచేత నన్నూ, తననూ ఎరుగకుండా 'నేను రాజును నీవు బీదబ్రాహ్మణుడివి. నాకూ నీకూ స్నేహం ఎక్కడిది?' అని పలికాడు. ఆ విధంగా అతనిచేత అవమానం పొంది వచ్చా' నని ద్రోణుడు తనవృత్తాంతం అంతా చెప్పగా-

క. విని రోయుతీఁగ గాళ్లం । బెనఁగెం దా ననుచుఁ బొంగి భీష్ముఁడు ద్రోణున్
ఘనభుజు నభీష్టపూజా । ధనదానవిధానముల ముదంబునఁ దనిపెన్. 220

ప్రతిపదార్థం: విని= ఆ ద్రోణవృత్తాంతాన్ని ఆలకించి; భీష్ముఁడు; రోయు, తీఁగ= వెదకుతున్న తీగ; తాన్; కాళ్ళన్; పెనఁగన్= చుట్టుకొన్నది; అనుచున్= అంటూ; పొంగి= సంతోషించి; ఘన, భుజున్= గొప్పభుజాలు కలిగినవాడిని; ద్రోణున్= ద్రోణుణ్ణి; అభీష్ట, పూజా, ధన, దాన, విధానములన్= ఇష్టమైన పూజలు చేయటం, ధనాన్ని దానం ఇవ్వటం అనే పద్ధతులచేత; ముదంబునన్= సంతోషంతో; తనిపెన్= తృప్తిపరచాడు.

తాత్పర్యం: అది విని, భీష్ముడు వెదుకబోయిన తీగ కాళ్లకు చుట్టుకున్నట్లు సంతోషించి, ద్రోణునికి ఇష్టమైన పూజలు చేసి, ధనదానా లిచ్చి తృప్తిపరచాడు.

వ. మఱియును. 221

తాత్పర్యం: అంతటితో ఆగక.

భీష్ముఁడు కురుపాండుకుమారులకు ద్రోణుని గురువుగా నియమించుట (సం. 1-122-40)

చ. మనుమల నెల్లఁ జూపి మతిమంతుఁడు శాంతనవుండు 'వీరిఁ జే
కొని గురువృత్తిమైఁ గఱపు ఘోరశరాసనవిద్యలెల్లఁ ; బెం
పున జమదగ్నిసూనుఁడును బోలఁడు' ని న్నని విందు విల్లునే
ర్పున నయనైపుణంబునను భూరిపరాక్రమగర్వసంపదన్. 222

ప్రతిపదార్థం: మతిమంతుఁడు= గొప్పబుద్ధికలవాడు; శాంతనవుండు= భీష్ముడు; మనుమలన్; ఎల్లన్; చూపి; వీరిన్; చేకొని= గ్రహించి; ఘోర+శర+ఆసన, విద్యలు+ఎల్లన్= భయంకరమైన ధనుర్విద్య లన్నింటినీ; పెంపునన్= అతిశయంగా; గురు, వృత్తిమైన్= గురుత్వంచేత; కఱపు= నేర్పుము; నిన్నున్; విల్లు, నేర్పునన్= విలువిద్యా నైపుణ్యంలో; నయ, నైపుణంబునను= నీతినేర్పులో; భూరి, పరాక్రమ, గర్వ, సంపదన్= గొప్పబలం కలిగిన గర్వమనే కలిమిలో; జమదగ్ని సూనుఁడును= జమదగ్నికుమారు డైన పరశురాముడుకూడా; పోలడు, అని, విందున్= సరిపోలడు అని విన్నాను.

తాత్పర్యం: మతిమంతుడైన భీష్ముడు తనమనుమళ్ళందరిని ద్రోణునికి చూపించి 'వీరికి గురుత్వం వహించి గొప్పగా విలువిద్య లన్నింటినీ నేర్పుము. విలువిద్యలో, నీతిలో, పరాక్రమంలో పరశురాముడుకూడా నిన్ను పోల డని విన్నాను'.

వ. అని కుమారుల నెల్లం జూపి ద్రోణునకు శిష్యులంగా సమర్పించిన, ద్రోణుండును వారలం జేకొని యందఱ కి ట్లనియె. 223

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; కుమారులను+ఎల్లన్= కుమారు లందరినీ; చూపి; ద్రోణునకున్; శిష్యులన్+కాన్= శిష్యు లయ్యేటట్లుగా; సమర్పించినన్= సమర్పింపగా; ద్రోణుండును; వారలన్; చేకొని= (శిష్యులుగా) గ్రహించి; అందఱకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పలికి కుమారు లందరినీ చూపి, వాళ్ళను ద్రోణునికి శిష్యులుగా సమర్పించాడు. ద్రోణుడు వాళ్ళందరినీ దగ్గరికి తీసి ఈ విధంగా అన్నాడు.

తే. 'అస్త్రవిద్యలు గఱచి నా దైన యిష్ట । మొగిన తీర్పంగ నిం దెవ్వఁ డోపు' ననినఁ
బాయ మొగమిడి కౌరవుల్ పలుకకుండి; । 'రేను దీర్చెద' నని పూనె నింద్రసుతుఁడు. 224

ప్రతిపదార్థం: అస్త్ర; విద్యలు= అస్త్రములయొక్క విద్యలు; కఱచి= నేర్చి; నాది+ఐన; ఇష్టము= నాదగు కోర్కె; ఒగిన్+అ= క్రమంగా; తీర్పంగన్= తీర్చగా; ఇందున్= ఇచ్చట; ఎవ్వఁడు= ఎవడు; ఓపున్= సరిపోతాడు; అనినన్= అని అనగా; పాయమొగము= మారుమొగం; ఇడి= పెట్టి; కౌరవుల్= కౌరవులు; పలుకక+ఉండిరి= పలుకకుండా ఊరక ఉండిరి; ఇంద్ర, సుతుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; ఏను= నేను; తీర్చెదను+అని+పూనెన్= తీరుస్తాను అని పూనుకున్నాడు.

తాత్పర్యం: 'నా దగ్గర అస్త్రవిద్యలు నేర్చి నాకోరిక మీలో ఎవ్వడు తీర్చగల' డని అడుగగా కౌరవు లందరూ పెడమొగాలు పెట్టి మౌనం వహించారు. అర్జునుడు 'నేను తీరుస్తా'నని ముందుకు వచ్చాడు.

వ. ఇట్లు దన యిష్టంబు దీర్పం బూనిన యర్జును నాచార్యుం డతిస్నేహంబునఁ గౌఁగిలించుకొని కరంబు సంతసిల్లి కుమారుల కెల్ల విలువిద్యఁ గఱపుచున్న, నానాదేశంబులం గల రాజపుత్త్రులెల్ల వచ్చి వారితోడఁ గలసి కఱచుచుండిరి; మఱియు, సూతపుత్త్రుం డయిన రాధేయుండును ధనుర్విద్యాకౌశలంబున నర్జునునితోడ మచ్చరించుచు దుర్యోధనపక్షపాతి యై యుండె; నంత. 225

ప్రతిపదార్థం: ఇట్లు; తన, ఇష్టంబు= తన కోరికను; తీర్పన్+పూనిన= తీర్చటానికి పూనుకొన్న; అర్జునున్; ఆచార్యుండు; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; కౌఁగిలించుకొని; కరంబు= మిక్కిలి; సంతసిల్లి; కుమారులకు+ఎల్లన్= కురుకుమారు లందరికీ; విలు, విద్యన్= కఱపుచు+ఉన్నన్= నేర్పుతూ ఉండగా; నానా దేశంబులన్, కల= అనేకదేశాలలో ఉండే; రాజపుత్రులు+ఎల్లన్, వచ్చి= రాజకుమారులు అందరూ వచ్చి; వారితోడన్, కలసి= ఆ కురుకుమారులతో కలిసి; కఱచుచు+ఉండిరి= నేర్చుకొంటూ ఉన్నారు; మఱియున్; సూత, పుత్త్రుండు+అయిన= సూతుని కొడుకైన; రాధేయుండును; ధనుర్విద్యా, కౌశలంబునన్= విలువిద్యలోని నేర్పుతో; అర్జునునితోడ; మచ్చరించుచు= ద్వేషం వహిస్తూ; దుర్యోధన, పక్షపాతి+ఐ= దుర్యోధనుని పక్షాన ఉన్నవాడై; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా తనకోరికను తీరుస్తా నని ముందుకు వచ్చినఅర్జునుడిని అపారప్రేమతో కౌగిలించుకొని, ఎంతో సంతోషించి, కురుకుమారు లందరికీ విలువిద్య నేర్పుతుండగా, నానాదేశాలనుండి రాకుమారులు వచ్చి, వారితో కలిసి ఆ విద్య నేర్చుకొంటున్నారు. సూతునికుమారుడైన రాధేయుడు విలువిద్యా నైపుణ్యంలో అర్జునునితో ద్వేషంవహిస్తూ దుర్యోధనునిపక్షంలో చేరి ఉన్నాడు.

క. నరుఁ డస్త్రశస్త్రవిద్యా । పరిణతి నధికుఁ డయి వినయపరుఁ డయి శశ్వ
ద్గురుపూజాయత్నంబునఁ । బరఁగుచు సంప్రీతుఁ జేసె భారద్వాజున్. 226

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; అస్త్ర, శస్త్ర, విద్యా, పరిణతిన్= అస్త్రశస్త్రవిద్యాదులలో పక్వతతో; అధికుఁడు+అయి= గొప్పవాడై; వినయపరుఁడు+అయి=అణకువ ప్రధానంగా కలవాడై; శశ్వత్+గురు, పూజా, యత్నంబునన్= నిరంతరం గురువును పూజించే ప్రయత్నంలో; పరఁగుచున్= ప్రవర్తిస్తూ; భారద్వాజున్= భరద్వాజుని కుమారు డైన ద్రోణుణ్ణి; సంప్రీతున్= సంతోషించిన వాణ్ణిగా; చేసెన్.

తాత్పర్యం: అర్జునుడు శస్త్రాస్త్రవిద్యానైపుణ్యంలో అధికు డై; వినయంతో ఎప్పుడూ గురుపూజ చేస్తూ ద్రోణుణ్ణి సంతోషపరిచాడు.

విశేషం: శిష్యుడు ఉత్తమగురువుకొరకు ఎట్లా అన్వేషిస్తాడో; గురువుకూడా ఉత్తమశిష్యుడికొరకు అట్లా అన్వేషిస్తాడు, సాధిస్తాడు. ఇక్కడ ఉభయత్రా సార్థక్యం ఏర్పడింది.

వ. అ య్యర్జునుతోడి విద్యామత్సరంబునఁ జీఁకటి నాతం డేయ నేరకుండవలయు నని తలంచి యశ్వత్థామ రహస్యంబున నన్నసాధకుం బిలిచి 'యెన్నండును నరునకు నంధకారంబునఁ గుడువం బెట్టకుమీ!' యని పంచిన వాఁడును దద్వచనానురూపంబు సేయుచున్న నొక్కనాఁటి రాత్రియందు. 227

ప్రతిపదార్థం: ఆ+అర్జునుతోడి; విద్యా, మత్సరంబునన్= విద్యలో పోటీచేత; చీఁకటిన్= చీకట్లో; ఆతండు= అర్జునుడు; ఏయ, నేరకుండ వలయును+అని= బాణాలు వేయటం నేర్వకుండా ఉండా లని; తలంచి; అశ్వత్థామ= ద్రోణునికొడుకు; రహస్యంబునన్= రహస్యంగా; అన్నసాధకున్= వంటవాడిని; పిలిచి; ఎన్నండును= ఎప్పుడుగానీ; నరునకున్= అర్జునునికి; అంధకారంబునన్= చీకట్లో; కుడువన్= తినటానికి; పెట్టకుమీ= పెట్టవద్దు సుమా!; అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడును; తద్+వచన+అనురూపంబు= అతని మాటప్రకారం; చేయుచున్+ఉన్నన్; ఒక్కనాఁటి; రాత్రి; అందున్.

తాత్పర్యం: అర్జునునితో ఉన్న విద్యాస్పర్ధతో అశ్వత్థామ-చీకట్లో బాణాలు వేయటం అర్జునుడు నేర్చుకోకుండా ఉండా లని తలచి, వంటవాడిని పిలిచి, 'చీకట్లో అర్జునుడికి అన్నం పెట్టవ' ద్దని ఆజ్ఞాపించగా, అతనిమాట ప్రకారం వంటవాడు అదేవిధంగా చేస్తుండగా, ఒకనాటిరాత్రి.

ఉ. వాసవనందనుండు గుడువం గుడువం బటుమారుతాహతిం
జేసి చలించి దీపశిఖ చెచ్చెరఁ బాయుడు భోజనక్రియా
భ్యాసవశంబునం గుడిచి 'పన్నుగ నిట్టుల విద్య లెల్ల న
భ్యాసవశంబునం బడయ భారము లే దని నిశ్చితాత్ముఁ డై. 228

ప్రతిపదార్థం: వాసవ, నందనుండు= ఇంద్రకుమారుడు - అర్జునుడు; కుడువన్, కుడువన్= తింటూ తింటూ ఉండగా; పటు, మారుత+ఆహతిన్+చేసి= పెద్దగాలితాకిడిచేత; చలించి= కదిలి; దీప, శిఖ= దీపపుమంట; చెరన్+చెరన్= తటాలున; పాయుడున్= తొలగిపోగా(ఆరిపోగా); భోజన, క్రియా+అభ్యాస, వశంబునన్= అన్నం తినటం అనే పని చేయటంలో అలవాటు చొప్పున; కుడిచి= తిని; పన్నుగన్= ఒప్పేటట్లుగా; ఇట్టులన్= ఈ విధంగా; విద్యలు+ఎల్లన్= విద్యలు అన్నీ; అభ్యాస వశంబునన్= సాధన చేయటంచేత; పడయన్= పొందటం; భారము= కష్టం; లేదు; అని= ఆ ప్రకారం; నిశ్చిత+ఆత్ముం డు+ఐ= నిశ్చయం పొందిన మనసు కలవాడై.

తాత్పర్యం: ఇంద్రునికొడుకైన అర్జునుడు అన్నం తింటూండగా పెద్దగాలికి తటాలున దీపం ఆరిపోయింది. అయినా, అలవాటు ప్రకారం ఆ చీకటిలోనే తిని, ఈ విధంగానే విద్య లన్నింటినీ సాధన చేసి నేర్చుకొనవచ్చని నిశ్చయించుకొని.

క. పాయక చీఁకటియందును । నేయంగా నభ్యసించు నిట్టియెడం గౌం
తేయు ధనుర్జ్యా ధ్వని విని । ధీయుక్తుఁడు ద్రోణుఁ డరుగుదెంచి ముదమునన్. 229

ప్రతిపదార్థం: పాయక= విడవకుండా; చీఁకటియందును; ఏయన్, కాన్= బాణాలు వేయటాన్ని; అభ్యసించి= సాధన చేసే; ఇట్టి ఎడన్= ఈ సమయంలో; కౌంతేయు; ధనుః+జ్యా, ధ్వని= అర్జుననివింటియొక్క అల్లెత్రాటిధ్వని; విని; ధీ, యుక్తుఁ డు= బుద్ధితో కూడినవాడు; ద్రోణుఁడు; ముదమునన్= సంతోషంతో; అరుగుదెంచి= వచ్చి.

తాత్పర్యం: పట్టుపట్టి చీకట్లోకూడా ఎప్పుడు విలువిద్యను అభ్యసించసాగాడో అప్పుడు అర్జుననివింటియొక్క అల్లెత్రాటిధ్వని విని, మేధావి అయిన ద్రోణుడు సంతోషంతో అక్కడకు వచ్చి.

సీ. ఆతని యస్త్రవిద్యాభియోగమునకుఁ । బ్రియశిష్యవృత్తికిఁ బెద్ద మెచ్చి
'యన్న! ధనుర్ధరు లన్యులు నీకంటె । నధికులు గాకుండునట్లు గాఁగఁ
గఱపుదు విలువిద్య ఘనముగా' నని పల్కి । ద్వంద్వసంకీర్ణయుద్ధముల తెఱఁగు
రథమహీవాజివారణములపై నుండి । దృఢచిత్రసౌష్ఠవస్థితుల నేయ

తే. బహువిధవ్యూహభేదనోపాయములను । సంప్రయోగరహస్యాతిశయము గాఁగఁ
గఱపె నర్జునుఁ దొంటి భార్గవుఁడు వింట । నిట్టిఁ డే! యని పొగడంగ నెల్ల జనులు. 230

ప్రతిపదార్థం: అతని, అస్త్ర, విద్యా+అభియోగమునకున్= ఆ అర్జునుని అస్త్రవిద్యలందలి పూనికకూ; ప్రియ, శిష్య, వృత్తికిన్= ప్రియమైన శిష్యుడినడవడికీ; పెద్ద మెచ్చి= మిక్కిలి సంతోషించి; అన్న! (ప్రేమపూర్వకసంబోధన); అన్యులు= ఇతరులు; ధనుర్ధరులు= విల్లును చేపట్టినవాళ్ళు; నీ కంటెన్; అధికులు; కాకుండునట్లు; కాఁగన్; ఘనముగాన్= గొప్పగా; విలువిద్య కఱపుదున్= ధనుర్విద్య నేర్పుతాను; అని= ఆ విధంగా; పలికి; ద్వంద్వ, సంకీర్ణ, యుద్ధముల, తెఱఁగు= ద్వంద్వ యుద్ధంయొక్క, సంకుల యుద్ధంయొక్క పద్ధతి; రథ, మహీ, వాజి, వారణములపైన్, ఉండి= రథంమీద, నేలమీద, గుర్రంమీద, ఏనుగుమీద ఉండి; దృఢ, చిత్ర, సౌష్ఠవ, స్థితులన్= గట్టిగా; చిత్రంగా, చక్కగా ఉన్న స్థితులలో; ఏయన్= కొట్టటానికి; బహు, విధ, వ్యూహ, భేదన+ఉపాయములను= అనేకవిధాలైన వ్యూహాలను భేదించే ఉపాయాలను; సంప్రయోగ, రహస్య+అతిశయము, కాఁగన్= ప్రయోగ రహస్యాల అతిశయంతో కూడుకొనేట్లుగా; తొంటి, భార్గవుఁడు= ఒకనాటి పరశురాముడు; వింటన్= విలువిద్యలో; ఇట్టిఁడే= ఇటువంటివాడా!; అని; ఎల్ల, జనులు; పొగడంగన్; అర్జునున్= అర్జునుడికి; కఱపెన్= నేర్పాడు.

తాత్పర్యం: అస్త్రవిద్యలో అర్జునునికి గల పట్టుదలకు, అతని గురుభక్తికి ద్రోణుడు ఎంతో సంతోషించాడు. 'అన్న! నీకంటె వే రెవ్వరూ అధికులు కానట్లుగా విలువిద్య నేర్పిస్తా'నన్నాడు. ద్వంద్వయుద్ధ, సంకులయుద్ధ పద్ధతులను, రథంమీద, నేలమీద, గుర్రాలమీద, ఏనుగులమీద ఉండి దృఢం, చిత్రం, సౌష్ఠవం అయిన స్థితులలో బాణాలు వేయటాన్ని, బహువిధా లైన వ్యూహాలను భేదించే ఉపాయాలను, బాణప్రయోగరహస్యాలను 'ఇదివరకటి ఆ పరశురాముడుకూడా విలువిద్యలో ఇంతటివాడు కా డని' ప్రజలు అర్జునుడిని పొగడేటట్లుగా అతనికి నేర్పాడు.

విశేషం: ఇద్దరువీరులమధ్య యుద్ధం ద్వంద్వయుద్ధం. చాలామందివీరులు కలియబడి చేసేయుద్ధం సంకీర్ణయుద్ధం.

ఏకలవ్యుం డనువాఁడు ద్రోణు నారాధించి విలువిద్య గఱచుట (సం. 1-123-10)

వ. మఱియు గదాకార్ముకప్రాసాసితోమరకుంతశక్త్యాది వివిధాయుధంబులయందును గుమారుల నందఱ జితశ్రములం జేయుచున్న ద్రోణాచార్యుల మహాప్రసిద్ధి విని హిరణ్యధన్వుం డను నెఱుకురాజుకొడు కేకలవ్యుం డనువాఁడు ధనుర్విద్యాగ్రహణార్థి యయి వచ్చినవాని నిషాదపుత్త్రుం డని శిష్యుంగాఁ జేకొన కున్న, వాఁడును ద్రోణుననుజ్ఞ వడసి చని వనంబులోన. 231

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; గదా, కార్ముక, ప్రాస+అసి, తోమర, కుంత, శక్తి+ఆది, వివిధ+ఆయుధంబులయందును= గద, ధనుస్సు, ఈటె, కత్తి, తోమరం, కుంతకం, శక్తి మొదలైన అనేకాలైన ఆయుధాలలో; కుమారులన్, అందఱన్= కురు కుమారుల్ని అందరినీ; జిత, శ్రములన్= జయించిన శ్రమగలవాళ్ళుగా (నేర్పరులుగా); చేయుచున్+ఉన్న= చేస్తూ ఉన్న; ద్రోణాచార్యుల; మహా, ప్రసిద్ధి = గొప్ప పేరు; విని= ఆలకించి; హిరణ్యధన్వుండు; అను; ఎఱుకు, రాజు, కొడుకు; ఏకలవ్యుండు; అనువాఁడు; ధనుర్విద్యా, గ్రహణ+అర్థి+అయి= విలువిద్యను నేర్చుకొనా లన్న కోరిక కలవాడై; వచ్చిన; వానిన్= ఆ ఏకలవ్యుడిని; నిషాద, పుత్త్రుండు+అని= ఎరుకలవాని కొడు కని; శిష్యున్+కాన్; చేకొనక+ఉన్నన్= గ్రహింపకుండగా; వాఁడును= ఆ ఏకలవ్యుడును; ద్రోణున్; అనుజ్ఞ= అనుమతి; పడసి= పొంది; చని= వెళ్లి; వనంబులోన్= అడవిలో.

తాత్పర్యం: అంతేకాకుండా గద, ధనుస్సు, ఈటె,కత్తి, తోమరం, కుంతం, శక్తి మొదలైన అనేకవిధాలైన ఆయుధవిద్యలలో రాకుమారు లందరినీ నేర్పరులను చేస్తున్న ద్రోణాచార్యులకీర్తి విని, హిరణ్యధన్వు డనే ఎరుకరాజుకొడుకు ఏకలవ్యు డనేవాడు విలువిద్యను నేర్చుకోవా లని వచ్చాడు. ఏకలవ్యుడు ఎరుకువాని కుమారు డని ద్రోణుడు శిష్యునిగా అంగీకరింపలేదు. అప్పుడు ఏకలవ్యుడు ద్రోణునిఅనుమతి పొంది వెళ్లి అడవిలో.

తే. వినయమున ద్రోణురూపు మన్నున నమర్చి । దాని కతిభక్తితోడఁ బ్రదక్షిణంబుఁ
జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి । నస్త్రవిద్యారహస్యంబు లర్థిఁ బడసె. 232

ప్రతిపదార్థం: వినయమునన్=అణకువతో; ద్రోణు, రూపు= ద్రోణుని బొమ్మను; మన్ననన్= మట్టితో; అమర్చి= చేసి; దానికిన్= ఆ బొమ్మకు; అతి, భక్తితోన్= మిక్కిలి భక్తితో; ప్రదక్షిణంబున్; చేసి; మ్రొక్కుచు; సంతత+అభ్యాస, శక్తిన్= ఎడతెగని అభ్యాసబలంచేత; అస్త్ర విద్యా, రహస్యంబులు= విలువిద్యలోని మర్మాలు; అర్థిన్= సంతోషంతో; పడసెన్= పొందాడు.

తాత్పర్యం: వినయంతో ఏకలవ్యుడు ద్రోణునిబొమ్మను మట్టితో చేసి నిలిపి, దానికి భక్తితో ప్రదక్షిణ నమస్కారాలు చేస్తూ, ఎడతెగని సాధనబలంచేత తానే విలువిద్యా రహస్యాలన్నీ గ్రహించాడు.

విశేషం: ఇది ఏకలవ్యునిముగ్ధ మైన స్థిరభక్తికి అద్దంపట్టే పద్యం. గురుముఖతః నేర్చుకొన్నవిద్యకంటె గురువుకు దూరంగా ఉన్నా, భక్తితో అధికమైనవిద్యను సాధించవచ్చు ననీ, విద్యాప్రాప్తికి గురుసాన్నిధ్యంకంటె గురుభక్తియే ముఖ్యం అనీ ఈ పద్యం బోధిస్తున్నది. గురుభక్తిని మించిన శక్తి లే దనే ఒక అర్థాంతరన్యాసాలంకారస్ఫూర్తినికూడా కలిగిస్తున్నది. అందువలన ఇందులో స్వతస్సంభవ్యర్థశక్త్యుద్భవాలంకారకృతవస్తుధ్వని ఉన్నది (సంపా.)

క. ఇట పాండవకౌరవు లొ ।క్కొట నందఱు గురుననుజ్ఞఁ గొని మృగయాలం
పటు లై వనమున కరిగిరి । పటుతరజవసారమేయభటనివహముతోన్. 233

ప్రతిపదార్థం: ఇట= హస్తినాపురంలో; పాండవ, కౌరవులు; ఒక్కొటన్= ఒకటిగా; అందఱు; గురు, అనుజ్ఞన్= గురువుయొక్క ఆజ్ఞను; కొని= పొంది; మృగయా, లంపటులు+ఐ= వేట అంటే ఎంతో ఆసక్తి కలిగినవా ళ్ళయి; పటుతర, జవసారమేయ, భట నివహముతోన్= మిక్కిలి ఎక్కువైనవేగం గల కుక్క లున్న భటులసమూహంతో; వనమునకున్= అడవికి; అరిగిరి= వెళ్లారు.

తాత్పర్యం: ఇక్కడ హస్తినాపురంలో పాండవులు, కౌరవులు కలిసి ద్రోణాచార్యుని అనుమతి పొంది, వేటపట్ల ఎంతో ఆసక్తి కలవా ళ్ళయి, మిక్కిలివేగం గల వేటకుక్కలతోకూడిన భటసమూహంతో అడవికి వెళ్ళారు.

వ. ఇ ట్లరిగి వనంబులోఁ గ్రమ్మరుచున్న నం దొక్క భటునికుక్క తోడు దప్పి పఱచి యొక్కెడ నేకతంబ యేయుచున్న నేకలవ్యుసమీపంబున మొఱింగిన, నయ్యెలుంగు విని దానిముఖంబునం దేడుబాణంబు లొక్కటఁ దొడిగి యక్కజంబుగా నతిలాఘవంబున వాఁ డేసిన, నది శరపూరితముఖం బయి కురుకుమారుల యొద్దకుం బాఱిన దానిం జూచి విస్మయం బంది య ట్లేసినవాఁ డెవ్వఁడో యని రోయుచు వచ్చువారు ముందఱ. 234

ప్రతిపదార్థం: ఇట్లు, అరిగి= ఈ విధంగా వెళ్లి, వనంబులోన్= అడవిలో; క్రుమ్మరుచున్+ఉన్నన్= తిరుగుతూఉండగా; అందున్= వానిలో; ఒక్క, భటుని, కుక్క= ఒకానొక భటునియొక్క కుక్క; తోడు; తప్పి; పఱచి= పరిగెత్తి; ఒక్క+ఎడన్= ఒకచోట; ఏకతంబు+అ= ఒంటరిగానే; ఏయుచున్నన్= బాణాలు వేస్తున్న; ఏకలవ్యు, సమీపంబునన్= ఏకలవ్యుని దగ్గర; మొఱింగినన్= మొరవగా; ఆ+ఎలుంగు= ఆ కంఠధ్వని; విని, దాని, ముఖంబున+అందు= దాని నోటిలో; ఏడు, బాణంబులు; ఒక్కటన్= ఒకటిగా; తొడిగి= ధనుస్సులో ఎక్కుపెట్టి; అక్కజంబుగాన్= ఆశ్చర్యకరంగా; అతి లాఘవంబునన్= ఎంతో చాకచక్యంతో; వాఁడు= ఏకలవ్యుడు; ఏసినన్= కొట్టగా; అది= ఆ కుక్క; శర, పూరిత, ముఖంబు+అయి= బాణాలతో నిండిన నోరు కలిగిన దై; కురు కుమారుల, ఒద్దకున్= కౌరవపాండవుల కడకు; పాఱినన్= పరుగెత్తగా; దానిన్= ఆ కుక్కను; చూచి; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; అట్లు= ఆ విధంగా; ఏసినవాఁడు= కొట్టినవాడు; ఎవ్వఁడో= ఎవరో; అని= ఆ విధంగా; రోయుచున్= వెదకుతూ; వచ్చువారు= వస్తున్నవాళ్ళు; ముందఱన్= ఎదురుగా.

తాత్పర్యం: ఈ విధంగా వెళ్లి వెళ్లి, అడవిలో తిరుగుతూ ఉండగా, ఒక భటుడికుక్క తోడు తప్పి పరుగెత్తి ఒకచోట ఒంటరిగా బాణాలు వేస్తున్న ఏకలవ్యుడికి దగ్గరగా వెళ్ళి మొరిగింది. అతడు ఏడుబాణాలను ఒక్కటిగా వింట సంధించి అతిచాకచక్యంగా, ఆశ్చర్యకరంగా ఆ కుక్కనోట కొట్టాడు. అది బాణాలతో నిండిన నోటితో కురుకుమారుల దగ్గరికి పరుగెత్తింది. దానిని చూచివాళ్ళు ఆశ్చర్యపడి ఆ విధంగా కొట్టినవా డెవ్వడా అని వెదకుతూ వస్తుండగా - ఎదురుగా -

ఉ. తేజితబాణహస్తు, దృఢదీర్ఘమలీమసకృష్ణదేహుఁ, గృ
ష్ణాజినవస్త్రు నస్త్రవిషయాస్తవిషాదు నిషాదుఁ జూచి యా
రాజకుమారు లందఱుఁ బరస్పరవక్త్రవిలోకనక్రియా
వ్యాజమునం దదీక్షణనివారితు లై రతిమత్సరంబునన్. 235

ప్రతిపదార్థం: తేజిత, బాణ, హస్తున్= పదును పెట్టబడిన బాణం చేతిలో కలిగినవాడిని; దృఢ దీర్ఘ, మలీమస, కృష్ణ, దేహున్= దిట్టమైనదీ, పొడవైనదీ, మురికి పట్టినదీ, నల్లనిదీ అయిన శరీరం కలవాడిని; కృష్ణ+అజిన, వస్త్రున్= జింకచర్మాన్ని వస్త్రంగా కలిగిన వాణ్ణి; అస్త్ర, విషయ+అస్త, విషాదున్= అస్త్రాల విషయంలో పోయిన దుఃఖం కలవాడిని; నిషాదున్= ఎరుకవాడిని; చూచి; ఆ, రాకుమారులు; అందఱున్; పరస్పర, వక్త్ర, విలోకన, క్రియా, వ్యాజమునన్= ఒకరిముఖాన్ని ఒకరు చూచుకొనటం అనే పని నెపంతో; అతి, మత్సరంబునన్= మిక్కిలి స్పర్ధచేత; తద్+ఈక్షణ, నివారితులు+ఐరి= అతడిని చూడడంనుండి తొలగించబడిన వా ళ్ళయ్యారు.

తాత్పర్యం: పదునుపెట్టినబాణాన్ని చేత పట్టుకొన్నవాడు, దిట్టమైనదీ, పొడవైనదీ, మురికిపట్టినదీ, నల్లనిదీ అయిన దేహాన్ని కలిగినవాడు, జింకచర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, అస్త్రవిద్యలో లోటు లేనివాడు అయిన ఏకలవ్యుడిని చూచి, ఆ రాకుమారులంతా విపరీతమయిన మాత్సర్యంచేత అతడిని చూడలేక ఒకరిముఖం ఒకరు చూచుకొన్నారు.

విశేషం: ఈపద్యశైలి ప్రసాదవిశిష్టమైన ఓజోగుణంతో పాత్రవిశిష్టతను ధ్వనింపచేస్తున్నది. అక్షరరమ్యం, ఉదాత్తమనోహరం అయిన నన్నయశైలికి ఉత్తమ ఉదాహరణాలుగా నిల్చే పద్యాలలో ఇది ఒకటి. స్థిరచిత్రాలను వర్ణించటంలో నన్నయ చూపిన నైపుణ్యానికి ఇదొక నిలువెత్తు సాక్ష్యం. (సంపా.) 'అస్త్ర' విషయాస్త' -కు 'అస్త్ర విషయాప్త' అని పాఠాంతరం ఉన్నది.

వ. అ క్కుమారులు వానిశరలాఘవంబునకు మెచ్చి 'నీ వెవ్వండ వెవ్వరిచేత విలువిద్యఁ గఱచి?' తని యడిగిన వారికి నయ్యెఱు కి ట్లనియె. 236

ప్రతిపదార్థం: ఆ+కుమారులు= ఆ కురు కుమారులు; వాని= ఆ ఏకలవ్యుని; శర, లాఘవంబునకున్= బాణప్రయోగంలో నేర్పునకు; మెచ్చి= పొగడి; నీవు, ఎవ్వండవు= నీవు ఎవడవు; ఎవ్వరిచేతన్= ఎవరిచేత; విలువిద్యన్= ధనుర్విద్యను; కఱచితివి= నేర్చావు? అని= ఆ విధంగా; అడిగినన్= అడుగగా; వారికిన్= ఆ కుమారులకు; ఆ+ఎఱుకు= ఆ ఎరుకవాడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ కుమారులు అతని బాణప్రయోగంలోని నేర్పరితనానికి మెచ్చి, 'నీ వెవ్వడవు? నీవు ఎవ్వరివద్ద విలువిద్య నేర్చుకొన్నావు?' అని అడుగగా వారితో ఆ బోయవాడు ఈ విధంగా అన్నాడు.

క. వినుఁ! డే హిరణ్యధన్వుం । డను వనచరనాథుకొడుక; నాచార్యుఁడు ద్రో
ణునకున్ శిష్యుఁడ; నెందును । ననవద్యుఁడ ; నేకలవ్యుఁ డనువాఁడ మహిన్. 237

ప్రతిపదార్థం: వినుఁడు; ఏన్= నేను; హిరణ్యధన్వుండు+అను= హిరణ్యధన్వుడు అనే పేరుగల; వనచరనాథుకొడుకన్= అడవిలో తిరిగేవాడైన ఎఱుకలరాజు కుమారుడిని; ఆచార్యుఁడు= గురువు; ద్రోణునకున్; శిష్యుఁడన్; ఎందునున్; అనవద్యుఁడన్= దోషంలేనివాడిని; మహిన్= భూమిలో; ఏకలవ్యుఁడు; అనువాఁడన్= అను పేరుగలవాడిని.

తాత్పర్యం: వినండి. నేను హిరణ్యధన్వు డనే కిరాతరాజకుమారుడిని. ద్రోణాచార్యుల శిష్యుడిని. ఏదోషం లేని వాడిని. నాపేరు ఏకలవ్యుడు.

వ. అనిన విని కురుకుమారు లందఱు మగుడి వచ్చి ద్రోణున కంతయుఁ జెప్పి; రంత నర్జునుం డేకాంతంబ యొక్కనాఁ డాచార్యున కి ట్లనియె. 238

విశేషం: అనినన్= అని అనగా; విని; కురుకుమారులు; అందఱు; మగుడి, వచ్చి= తిరిగి వచ్చి; ద్రోణునకున్; అంతయున్; చెప్పిరి; అంతన్= అప్పుడు; అర్జునుండు= అర్జునుడు; ఏకాంతంబు+అ= రహస్యంగా; ఒక్క నాఁడు= ఒకరోజు; ఆచార్యునకున్= ద్రోణునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఏకలవ్యు డనగా విని, కురుమారు లందరూ తిరిగివచ్చి ద్రోణునికి ఆ సంగతినంతా చెప్పారు. ఆ పైన అర్జునుడు ఏకాంతంగా ఒకనాడు ద్రోణునితో ఈ విధంగా అన్నాడు.

క. విలువిద్య నొరులు నీ క । గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు నని మున్
బలికితిరి; నాక కా దీ । త్రిలోకముల కధికుఁ జూచితిమి యొక యెఱుకున్. 239

ప్రతిపదార్థం: విలువిద్యన్= విలువిద్యలో; ఒరులు= ఇతరులు; నీకున్; అగ్గలముగన్= అధికంగా; లేకుండ; నిన్నున్= నీకు; కఱపుదున్= నేర్పుతాను; అని= ఆ విధంగా; మున్= మునుపు లేదా ఇదివరకు; పలికితిరి= చెప్పినారు; నాకు+అ= నా ఒక్కనికే; కాదు; ఈ, త్రిలోకములకున్= ఈ ముల్లోకాలకూ; అధికున్= అధికమైనవానిని; ఒక, ఎఱుకున్= ఒక ఎరుకువాడిని; చూచితిమి.

తాత్పర్యం: విలువిద్యలో నీకంటె అధికులు లేనట్లుగా నేర్పుతా నని ఇదివరకు నాతో చెప్పారు. ఇప్పుడు నాకే కాదు, ఈ ముల్లోకాలకంటె అధికు డైన ఒకఎరుకను చూచాము.

క. నాకంటెను మీకంటెను । లోకములో నధికుఁ డతిబలుండు ధనుర్వి
ద్యాకౌశలమున; నాతఁడు । మీకుం బ్రియశిష్యుఁ డటె యమిథ్యావచనా ! 240

ప్రతిపదార్థం: అమిథ్యా, వచనా= అసత్యంకాని మాట కలవాడా!; ఆతఁడు= ఆ ఎరుకవాడు; ధనుర్విద్యా, కౌశలమునన్= విలువిద్యలోని నేర్పులో; లోకములో; నాకంటెను; మీకంటెను; అధికుఁడు; అతి, బలుండు= ఎంతో బలశాలి; మీకున్, ప్రియ, శిష్యుఁడు= మీకు ఇష్టమైన శిష్యుడు; అటె= ఔనటకదా!

తాత్పర్యం: అసత్యం కానిమాట గల ఆచార్యవర్యా! ఆ ఎరుకులవాడు విలువిద్యా నైపుణ్యంలో నాకంటె, మీకంటె ఈ లోకంలో అధికుడు, మహాబలవంతుడు, అతడు మీకు ప్రియశిష్యు డట కదా!

విశేషం: ఏకలవ్యుని విలువిద్యానైపుణ్యం అర్జునునికి ఆశ్చర్యజనకం, మాత్సర్యహేతువు కాగా, అతడు తాను ద్రోణాచార్య శిష్యుడి నన్న మాట పిడుగు పాటైంది. కాగా, ఆచార్యుడు చెప్పినమాటకు, చేసిన పనికి ఎంత భేదం! అర్జునునిహృదయం తుకతుక లాడిపోయింది, అయినా అర్జునునివంటి సంస్కారసంపన్నుడు అంతటి గురుదేవుడిని ఏ మనగలడు? అట్లా అని ఏమీ అనకుండా ఎట్లా ఉండగలడు? అందుచేతనే 'అమిథ్యావచనా'! - అసత్యం కానిమాట కలవాడా! అని ఒక్కమాట

అన్నాడు. ఆ మాటలోని ఎత్తిపొడుపు ఈటెపోటు వంటిది. కాగా, అలతి, అలతి పదాలతో అతితీవ్రభావాలను ప్రకటించే నన్నయపద్యాలలో ఇది ఒకటి. నన్నయ సందర్భోచితంగా 'అర్థవ్యక్తి' అనే శబ్దగుణాన్ని వాడి, అర్జునుని మనసులోని బాధను, అమర్షను, అసూయను వ్యక్తంచేసే శక్తి కల సర్వనామాలను, అవ్యయాలను, నిపాతాలను నిపుణంగా ప్రయోగించి నాటకీయతను పోషించాడు. 'నాకంటె అధికుడు, మీకంటె అతిబలుడు అనటంలోనూ, 'మీకున్' ప్రియశిష్యుడు 'అటె' అనటంలోనూ గూఢమైన కోపంతోకూడిన అధిక్షేపం ఉన్నది. నిపాతాలనుసైతం కథాధ్వనికి వ్యంజకాలుగా వాడటం ఇక్కడివిశేషం. (సంపా.)

క. అనిన విని ద్రోణుం డదరిపడి 'వానిం జూతము ర'మ్మని యర్జునుం దోడ్కొని, యనవరతశరాసనాభ్యాసనిరతుం డయి యున్న యేకలవ్యుకడ కేఁగిన, నెఱింగి వాఁడు నెదురు పఱతెంచి ద్రోణునకు మ్రొక్కి తన శరీరంబు సర్వస్వంబును నివేదించి, 'యేను మీ శిష్యుండ; మి మ్మారాధించి మీ ప్రసాదంబున నివ్విలువిద్యఁ గఱచితి' నని కరంబులు మొగిచియున్నం జూచి, ద్రోణుం 'డట్లేని మాకు గురుదక్షిణ యి'మ్మనిన సంతసిల్లి వాఁ డిట్లనియె. 241

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని; ద్రోణుండు; అదిరిపడి= ఉలిక్కిపడి; వానిన్= అతనిని; చూతము= చూస్తాము; రమ్ము; అని; అర్జునున్, తోడ్కొని= తీసికొని; అనవరత, శర+ఆసన+అభ్యాస, నిరతుండు+అయి= ఎడతెగని విలువిద్యయొక్క అభ్యాసంలో మిక్కిలి ఆసక్తికలవాడై; ఉన్న; ఏకలవ్యు, కడకున్= ఉండే ఏకలవ్యుని దగ్గరకు; ఏఁగినన్= వెళ్లగా; ఎఱింగి= (వారి రాకను) తెలిసికొని; వాఁడు= ఏకలవ్యుడు; ఎదురు, పఱతెంచి= ఎదురుగా వచ్చి; ద్రోణునకున్; మ్రొక్కి; తన, శరీరంబు= తనయొక్క దేహము; సర్వస్వంబును=మొత్తం సంపదను; నివేదించి= అర్పించి; ఏను, మీ, శిష్యుండన్= నేను మీ శిష్యుణ్ణి; మిమ్ము+ఆరాధించి= మిమ్మల్ని సేవించి; మీ, ప్రసాదంబునన్= మీ అనుగ్రహంచేత; ఈ విలువిద్యన్= ఈ ధనుర్విద్యను; కఱచితిని= నేర్చుకొన్నాను; అని= అంటూ; కరంబులు= చేతులు; మొగిచి= ముడిచి; ఉన్నన్= ఉండగా; చూచి= కనుగొని; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; అట్లు+ఏని= అలా అయినట్లయితే; మాకున్; గురుదక్షిణ+ఇమ్ము= గురుదక్షిణ నిమ్ము; అనినన్= అనగా; సంతసిల్లి=సంతోషించి; వాఁడు= ఆ ఏకలవ్యుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా విని ద్రోణుడు అదిరిపడి అతడిని చూద్దాం ర మ్మని అర్జునుని తీసికొని, నిరంతరం విలువిద్యను సాధనచేయటంలో మునిగి ఉన్న ఏకలవ్యునిదగ్గరకు వెళ్లాడు. వాళ్ళ రాకను ఏకలవ్యుడు తెలిసికొని, ఎదురు వచ్చి ద్రోణునికి నమస్కరించి, తనశరీరాన్నీ, మొత్తం సంపదనూ ఆయనకు సమర్పించి, 'నేను మీ శిష్యుడిని. మిమ్మల్ని సేవించి ఈ విలువిద్య నేర్చుకొన్నాను' అని చేతులు జోడించి నిలిచినాడు. అతడిని చూచి ద్రోణుడు 'అయితే నాకు గురుదక్షిణ ఇ'మ్మన్నాడు. అందుకు సంతోషించి ఏకలవ్యుడు ఇట్లా అన్నాడు.

క. 'ఇది దేహం; బిది యర్థం; । బిది నా పరిజనసమూహ; మిన్నిటిలో నె
య్యది మీ కిష్టము దానిన । ముద మొదవఁగ నిత్తుఁ గొనుఁ డమోఘం' బనినన్. 242

ప్రతిపదార్థం: ఇది, దేహంబు; ఇది; అర్థంబు= ధనం; ఇది; నా, పరిజన, సమూహము= నా సేవకుల సమూహం; ఇన్నిటిలోన్; ఏ+అది; మీకున్; ఇష్టము; దానిన్+అ= దానినే; ముదము= సంతోషం; ఒదవఁగన్= కలిగేట్లుగా; ఇత్తున్; కొనుఁడు= తీసికొనండి; అమోఘంబు= ఇది తప్పనిది - అంటే దీనికి తిరుగులేదు; అనినన్= అని అనగానే.

తాత్పర్యం: 'ఇది నాదేహం, ఇది నాధనం. ఇది నాసేవకసమూహం. వీటిలో మీ కేది ఇష్టమో దానిని తప్పకుండా, సంతోషంగా ఇస్తాను. తీసికొనండి. దీనికి తిరుగులేదు' అని అనగా.

విశేషం: అంతటిగురువు తానై వచ్చి గురుదక్షిణ కోరటమే కొండంత భాగ్యంగా భావించి, ఉన్న దంతా ఆయన ముందుంచిన ఏకలవ్యుని ఉన్నతోన్నతగురుభక్తికి ఈ పద్యం అద్దంవంటిది. అతనిమాటలలో సర్వార్పణభావంతోడి ముగ్ధభక్తి మూర్తికట్టింది.

క. 'నెమ్మిని నీ దక్షిణహ । స్తమ్మున పెనువ్రేలు దునిమి దక్షిణ యి; మ్మి
ష్ట మ్మిది నా 'కనపుడు విన । యమ్మున వాఁ డిచ్చె దాని నాచార్యునకున్. 243

ప్రతిపదార్థం: నెమ్మిని= ప్రీతితో; నీ, దక్షిణ, హస్తమ్మున, పెను, వ్రేలు= నీ కుడిచేతి బొటన వ్రేలిని; తునిమి= కోసి; దక్షిణ= దక్షిణగా; ఇమ్ము; ఇది; నాకున్; ఇష్టమ్ము; అనవుడు= అని అనగా; వాఁడు= ఆ ఏకలవ్యుడు; వినయమ్మునన్= వినయముతో; దానిన్= ఆ బొటనవ్రేలిని; ఆచార్యునకున్= ద్రోణాచార్యులకు; ఇచ్చెన్.

తాత్పర్యం: ' నీ కుడిచేతి బొటనవ్రేలిని కోసి ప్రీతితో నాకు గురుదక్షిణగా ఇమ్ము. అది నా కిష్టం' అని ద్రోణు డనగానే ఏకలవ్యుడు వినయంతో దానిని ఆచార్యునికి ఇచ్చాడు.

తే. దక్షిణాంగుష్ఠ మిచ్చిన దానఁ జేసి । బాణసంధానలాఘవభంగ మయిన
నెఱుకు విలువిద్య కలిమికి హీనుఁ డయ్యెఁ; బార్థునకును మనోరుజ పాసె నంత. 244

ప్రతిపదార్థం: దక్షిణ+అంగుష్ఠము = కుడిచేతి బొటనవ్రేలిని; ఇచ్చిన; దానన్+చేసి = ఇచ్చినందువలన; బాణ, సంధాన, లాఘవ, భంగము= బాణాన్ని కూర్చటంలోని నేర్పుకు లోపం; అయినన్= కాగా; ఎఱుక= ఆ ఏకలవ్యుడు; విలువిద్య, కలిమికి= ధనుర్విద్య అనే సంపదకు; హీనుఁడు= లేనివాడు; అయ్యెన్= అయ్యాడు; పార్థునకును= అర్జునునికిని; మనస్+రుజ= మానసిక దుఃఖం; పాసెన్= తొలగింది; అంతన్= అనంతరం.

తాత్పర్యం: కుడిచేతిబొటనవ్రేలు ఇవ్వటంచేత బాణాన్ని కూర్చటంలో నేర్పు లోపించి ఏకలవ్యుడు విలువిద్యా సంపద కోల్పోయాడు. దానివలన అర్జునునికి దుఃఖం తొలగింది.

క. 'విలువిద్య నొరులు నీ క । గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు' నని మున్
బలరిపుసుతునకుఁ బలికిన । పలు కప్పడు గురుఁడు సేసెఁ బరమార్థముగన్. 245

ప్రతిపదార్థం: విలువిద్యన్= విలువిద్యలో; ఒరులు= ఇతరులు; నీకున్; అగ్గలముగన్= అధికంగా; లేకుండన్= లేకుండునట్లు; నిన్నున్; కఱపుదున్= నేర్పుతాను; అని= ఆ విధంగా; మున్= పూర్వం; బల, రిపు, సుతునకున్= బలు డనే రాక్షసుడికి శత్రువైన ఇంద్రునికుమారునికి - అర్జునునికి; పలికిన, పలుకు= చెప్పిన మాటను; అప్పుడు; గురుఁడు= ద్రోణుడు; పరమార్థముగన్= సత్యంగా; చేసెన్.

తాత్పర్యం: 'విలువిద్యలో ఇతరులు నీకంటె అధికులు కాకుండా నీకు నేర్పుతా' నని, ఇదివరకు ద్రోణుడు అర్జునుని కిచ్చిన మాట అప్పుడు నిజం చేశాడు.

మత్తకోకిల.

భూపనందను లివ్విధంబున భూరిశస్త్రమహాస్త్రవి
ద్యోపదేశపరిగ్రహస్థితి నున్న నందఱయందు వి

ద్యోపదేశము దుల్య మైనను నుత్తమోత్తముఁ డయ్యె వి
ద్యాపరిశ్రమకౌశలంబున దండితారి నరుం డిలన్. 246

ప్రతిపదార్థం: భూప, నందనులు= రాకుమారులు; ఈ+విధంబునన్; భూరి, శస్త్ర, మహా+అస్త్ర, విద్యా+ఉపదేశ, పరిగ్రహ, స్థితిన్= గొప్ప ఆయుధవిద్యయొక్క, గొప్ప అస్త్రవిద్యయొక్క బోధను గ్రహించటం అనే స్థితిలో; ఉన్నన్= ఉండగా; అందఱ, అందున్= అందరిలో; విద్యా+ఉపదేశము= విద్యాబోధన; తుల్యము= సమానం; అయినను= అయినప్పటికి; దండిత+అరి= శిక్షించబడిన శత్రువులు గలవాడు; నరుండు= అర్జునుడు; విద్యా, పరిశ్రమ, కౌశలంబునన్= విద్యయొక్క అభ్యాసపు నేర్పుచేత; ఇలన్= భూమిలో; ఉత్తమ+ఉత్తముఁడు= శ్రేష్ఠులలో శ్రేష్ఠుడు; అయ్యెన్.

తాత్పర్యం: రాజకుమారులు ద్రోణునివలన గొప్పశస్త్రాస్త్రవిద్యాబోధనను పొందటంలో అంతా సమానమే అయినా, అర్జునుడు విశేషంగా సాధన చేసి సర్వశ్రేష్ఠు డయ్యాడు.

విశేషం: మత్తకోకిలపాదంలో ర,స,జ,జ,భ, ర - అనే గణాలు వరుసగా ఉంటాయి. 11వ అక్షరం యతిస్థానం. ప్రాసనియమం ఉన్నది.

క. అనిలాత్మజు బలమును న । ర్జును కార్ముక కౌశలంబు శూరగుణంబుల్
మనమున సహింపనోపక । వనరుచు ధృతరాష్ట్రసుతులు వందిరి తమలోన్. 247

ప్రతిపదార్థం: అనిల+ఆత్మజు, బలమును= వాయుపుత్రుడైన భీముని బలాన్ని; కార్ముక, కౌశలంబు= అర్జునుని విలువిద్యా నైపుణ్యం; శూర, గుణంబుల్= వీరలక్షణాలు; మనసునన్= మనసులో; సహింపన్+ఓపక= ఓర్వలేక; ధృతరాష్ట్ర సుతులు= కౌరవులు; వనరుచున్ = బాధపడుతూ; తమలోన్; వందిరి= దుఃఖించారు.

తాత్పర్యం: భీమునిబలాన్నీ, అర్జునుని విలువిద్యానైపుణ్యాన్నీ, వీరలక్షణాలనూ చూచి, సహించలేక కౌరవులు తమలో తాము ఎంతో దుఃఖాన్ని పొందారు.

ద్రోణుఁ డస్త్రవిద్యం దనశిష్యులఁ బరీక్షించుట (సం.1-123-15)

వ. అ క్కుమారుల ధనుర్విద్యా కౌశలం బెఱుంగ వేఁడి యొక్కనాఁడు ద్రోణుండు కృత్రిమం బయిన భాసం బను పక్షి నొక్క వృక్షశాఖాగ్రంబున లక్ష్యంబుగా రచియించి, దాని నందఱకుఁ జూపి 'మీమీ ధనువుల బాణంబులు సంధించి నా పంచిన యప్పుడ యిప్పక్షి తలఁ దెగ నేయుం; డే నొక ళ్లొకళ్ళన పంచెద' నని ముందఱ ధర్మనందనుం బిలిచి 'యీ వృక్షశాఖాగ్రంబున నున్న పక్షి నిమ్ముగా నీక్షించి మద్వచనానంతరంబున శరమోక్షణంబు సేయు మనిన నతండును వల్లె యని గురువచనంబు సేసి యున్న నయ్యుధిష్ఠిరునకు ద్రోణుం డి ట్లనియె. 248

ప్రతిపదార్థం: ఆ కుమారుల= ఆ కురుకుమారులయొక్క; ధనుర్విద్యా, కౌశలంబు= విలువిద్యలోని నేర్పు; ఎఱుంగన్= తెలుసుకొనాలని; వేఁడి=కోరి; ఒక్కనాఁడు= ఒకరోజు; ద్రోణుండు; కృత్రిమంబు+అయిన= కల్పించబడిన దైన; భాసంబు= గ్రద్ద; అను, పక్షిన్= అనే పక్షిని; ఒక్క; వృక్ష, శాఖా+అగ్రంబున= ఒక చెట్టుకొమ్మచివరిలో; లక్ష్యంబుగాన్= గురిగా; రచియించి= కూర్చి; దానిన్; అందఱకున్= అందరికి; చూపి; మీ, మీ, ధనువులన్= మీమీవిండ్లయందు; బాణంబులు; సంధించి= ఎక్కుపెట్టి; నా, పంచిన, అప్పుడు+అ= నేను ఆజ్ఞాపించిన సమయంలోనే; ఈ, పక్షి, తలన్= ఈ పక్షి యొక్క తలను; తెగన్= తెగేట్లుగా; ఏయుండు= కొట్టండి; ఏన్= నేను; ఒకళ్లు+ఒకళ్ళన= ఒక్కొక్కరినీ; పంచెదన్= ఆజ్ఞాపిస్తాను;

అని= ఆ ప్రకారంగా; ముందఱ; = మొదట; ధర్మనందనున్, పిలిచి = ఆ ధర్మరాజుని పిలిచి; ఈ, వృక్ష, శాఖా+అగ్రంబునన్= ఈ చెట్టుకొమ్మ కొనలో; ఉన్న= ఉండు; పక్షిన్= పక్షిని; ఇమ్ముగాన్= తగిన విధంగా; ఈక్షించి= చూచి; మద్+వచన+ అనంతరంబునన్; నా మాట తర్వాత; శర, మోక్షణంబు= బాణాన్ని వదలటం; చేయుము; అనినన్= అనగా; అతండును = ఆ ధర్మరాజును; వల్లె, అని= సరే, అని; గురు, వచనంబు= గురువుగారి మాటను; చేసి= సిద్ధము గావించి; ఉన్నన్= ఉండగా; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుతో; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కురుకుమారుల విలువిద్యా నైపుణ్యాన్ని తెలిసికొన గోరి ఒకనాడు ద్రోణుడు, భాస మనే పక్షిని రూపొందించి, ఒకచెట్టుకొమ్మచివరన కట్టి, దానిని అందరికీ చూపి, 'నేను చెప్పినప్పుడు మీమీ ధనువులు ఎక్కు పెట్టి, ఆ పక్షితలను తెగగొట్టండి. నేను ఒక్కొక్కరినే ఆజ్ఞాపిస్తాను' అని ముందుగా ధర్మరాజును పిలిచి 'ఈ చెట్టుకొమ్మ కొసన ఉండే పక్షిని చక్కగా చూచి, నేను చెప్పినప్పుడు బాణంతో కొట్టుము', అనగా, అతడు సరే అని గురువుమాట ప్రకారం సిద్ధంగా ఉండగా, ద్రోణుడు ఇట్లా అన్నాడు.

తే. 'వృక్షశాఖాగ్రమున నున్న పక్షిశిరము । దెల్లముగఁ జూచితే మహీవల్లభుండ!'
యనిన నిమ్ముగఁ జూచితి ననిన, వెండి । యును గురుఁడు ధర్మజున కిట్టు లనియెఁ బ్రీతి. 249

ప్రతిపదార్థం: మహీ, వల్లభుండ= ఓ రాజా!; వృక్ష, శాఖా+అగ్రమునన్= చెట్టుకొమ్మచివరన; ఉన్న, పక్షి, శిరము= ఉండే పక్షితల; తెల్లముగన్= స్పష్టంగా; చూచితే= చూచావా?; అనినన్= అనగా; ఇమ్ముగాన్= చక్కగా; చూచితిని; అనినన్= అని చెప్పగా; వెండియును= మఱియును; గురుఁడు= ద్రోణుడు; ప్రీతిన్= ప్రీతితో; ధర్మరాజునకున్; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్.

తాత్పర్యం: 'ఓ ధర్మరాజా! చెట్టుకొమ్మచివర ఉన్న పక్షితలను స్పష్టంగా చూచావా' అని అడుగగా; చక్కగా చూచా నని అతడు చెప్పగా, మరల ద్రోణుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

క. జననుత! యా ద్రుమానిని న । న్నును మఱి నీ భ్రాతృవరులనుం జూచితె నీ?'
వనవుడుఁ జూచితి నన్నిటి । ననఘా! వృక్షమున నున్న యవ్విహగముతోన్. 250

ప్రతిపదార్థం: జన, నుత,= జనులచేత పొగడబడేవాడా! ఓ ధర్మరాజా!; ఆ, ద్రుమానిని= ఆ చెట్టును; నన్నును= నన్ను; మఱి= ఇంకా; నీ, భ్రాతృ, వరులనున్= నీయొక్క ఉత్తములైన తమ్ములను; నీవు; చూచితె= చూశావా; అనవుడు= అని అనగా; అనఘా= పాపంలేనివాడా! ఓ ద్రోణాచార్యా!; వృక్షమునన్, ఉన్న= చెట్టుపై నున్నట్టి; ఆ+విహంగముతోన్= ఆ పక్షితోసహా; అన్నిటిన్; చూచితిన్.

తాత్పర్యం: 'జనులచేత పొగడబడే ఓ ధర్మరాజా! ఆమానును, నన్ను, నీతమ్ముళ్లని చూశావా?' అని ద్రోణుడు అడుగగానే, 'పుణ్యాత్మా! చెట్టుమీద నున్న ఆ పక్షితోపాటు అన్నిటినీ చూచా'నని ధర్మరాజు అన్నాడు.

వ. అనిన విని ద్రోణుండు ధర్మజుం బదరి 'నీ దృష్టి చెదరె; నీవు దీని నేయనోపవు పాయు' మని యివ్విధంబున దుర్యోధనాదు లైన ధార్తరాష్ట్రులను భీమసేన నకుల సహదేవులను నానాదేశాగతు లైన రాజపుత్రులను గ్రమంబున నడిగిన వారలు ధర్మనందను చెప్పినట్ల చెప్పిన, నందఱ నిందించి, పురందరనందనుం బిలిచి వారి నడిగిన యట్ల యడిగిన నాచార్యునకు నర్జునుం డి ట్లనియె. 251

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ద్రోణుండు; ధర్మజున్; పదరి= నిందించి; నీ, దృష్టి= నీ చూపు; చెదరెన్= చెదరింది; నీవు, దీనిన్= నీవు ఈ పక్షిని; ఏయన్+ఓపవు= కొట్టలేవు; పాయుము= తప్పుకో; అని= అంటూ నిర్దేశించి; ఈ+విధంబునన్= ఈ రీతిగా; దుర్యోధన+ఆదులు+ఐన= దుర్యోధనుడు మొదలైనవారైన; ధార్తరాష్ట్రులను; నానా, దేశ+ఆగతులు+అయిన= వివిధదేశాలనుండి వచ్చినవా రైన; రాజ, పుత్త్రులను= రాకుమారుల్ని; క్రమంబునన్= వరుసగా; అడిగినన్= అడుగగా; వారలు= వాళ్లు; ధర్మనందను, చెప్పినట్లు+అ= ధర్మరాజు చెప్పినట్లే; చెప్పినన్= చెప్పగా; అందఱన్= అందరినీ; నిందించి= దూషించి; పురందర, నందనున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడిని; పిలిచి= చెంతకు పిలిచి; వారిన్= వాళ్లను; అడిగిన, అట్లు+అ= అడిగిన విధంగానే; అడిగినన్= అడుగగా; ఆచార్యునకున్= ద్రోణునకు; అర్జునుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని ద్రోణుడు ధర్మరాజును నిందించి 'నీ దృష్టి చెదిరింది. నీవు దీనిని కొట్టలేవు. ప్రక్కకు తప్పుకొమ్మ' అన్నాడు. అదే విధంగా దుర్యోధనుడు మొదలైన కౌరవులను, భీమసేననకులసహదేవులను, వివిధ దేశాలనుండి వచ్చిన రాకుమారులను వరుసగా అడుగగా, వా ళ్ళంతా ధర్మరాజు ఇచ్చిన సమాధానమే ఇచ్చారు. ద్రోణుడు అందరినీ నిందించి, తర్వాత అర్జునుడిని పిలిచి వాళ్ళను అడిగినట్లే అడుగగా అత డిట్లా అన్నాడు.

క. 'పక్షిశిరంబు దిరంబుగ । నీక్షించితి; నొండు గాన నెద్దియు' నని‌నన్
లక్షించి యేయు మని సూ । క్ష్మేక్షణు ద్రోణుండు పనిచె నింద్రతనూజున్. 252

ప్రతిపదార్థం: పక్షి, శిరంబు= పక్షితలను; తిరంబుగన్= చక్కగ; ఈక్షించితిన్= చూచాను; ఒండు= ఇతరం; ఎద్దియున్= ఏదీ కూడా; కానన్= చూడటం లేదు; అనినన్= అని తెల్పగా; లక్షించి= గురిపెట్టి; ఏయుము= కొట్టుము; అని= ఆ ప్రకారం; ద్రోణుండు; సూక్ష్మ+ఈక్షణున్= సునిశిత మైన దృష్టి గల; ఇంద్రతనూజున్= అర్జునుని; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'పక్షితలను చక్కగా చూచాను. ఇం కేదీ నాకు కనిపించటం లేదు' అని అర్జునుడు అనగా, ద్రోణుడు 'గురి చూచి కొట్టుము' అని సూక్ష్మదృష్టి గల అర్జునుని ఆజ్ఞాపించాడు.

క. గురువచనానంతరమున । నరుఁ డప్పుడు శరవిమోక్షణము సేయుఁడుఁ జె
చ్చెరఁ బక్షిశిరము దెగి త । ద్ధరణీరుహశాఖనుండి ధారుణిఁ బడియెన్. 253

ప్రతిపదార్థం: గురు, వచన+అనంతరమునన్= గురువుమాట తర్వాత; నరుఁడు= అర్జునుడు; అప్పుడు; శర, మోక్షణము= బాణాన్ని విడవటం; చేయుఁడున్= చేయగా; చెరన్+చెరన్= తత్క్షణమే; పక్షి, శిరము= పక్షితల; తెగి; తద్+ధరుణీరుహ, శాఖ నుండి= ఆ చెట్టుకొమ్మనుండి; ధారుణిన్= భూమిమీద; పడియెన్= పడింది.

తాత్పర్యం: గురువు చెప్పిన తర్వాత అర్జునుడు బాణాన్ని వదిలాడు. ఆ పక్షితల తత్క్షణమే తెగి చెట్టుకొమ్మ నుండి నేలమీద పడింది.

వ. ఇ ట్లశ్రమంబునఁ గృత్రిమపక్షితలఁ దెగనేసిన యర్జును నచలితదృష్టికి లక్ష్యవేధిత్వంబునకు మెచ్చి ద్రోణుం డాతనికి ధనుర్వేదరహస్యంబు లుపదేశించె; నంత. 254

ప్రతిపదార్థం: ఇట్లు; అశ్రమంబునన్= సులువుగా; కృత్రిమ, పక్షి తలన్= కల్పింపబడిన పక్షియొక్క తలను; తెగన్, ఏసిన= తెగునట్లు కొట్టిన; అర్జును= అర్జునునియొక్క; అచలిత దృష్టికి= చెదిరిపోని దృష్టికి; లక్ష్య, వేధిత్వంబునకున్= గురిని

కొట్టగలిగినందుకు; మెచ్చి= పొగడి; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; అతనికి= అర్జునునికి; ధనుర్వేద, రహస్యంబులు= విలువిద్యలోని రహస్యాలు; ఉపదేశించెన్; అంతన్= తర్వాత.

తాత్పర్యం: ఈ విధంగా సులువుగా ఆ కల్పితపక్షితలను తెగగొట్టిన అర్జునునినిశ్చలదృష్టికీ, గురిని కొట్టే సామర్థ్యానికీ, ద్రోణుడు మెచ్చి, అతనికి విలువిద్యారహస్యాలు ఉపదేశించాడు. తర్వాత.

అర్జునుఁడు ద్రోణుని మొసలినుండి విడిపించుట (సం. 1-123-68)

క. మానుగ రాజకుమారుల । తో నొక్కట నొక్కనాఁడు ద్రోణుఁడు గంగా
స్నానార్థ మరిగి యందు మ । హా నియమస్థుఁ డయి నీళ్ల నాడుచునున్నన్. 255

ప్రతిపదార్థం: మానుగన్= ఒప్పుగ; రాజ, కుమారులతోన్= కురుకుమారులతో; ఒక్కటన్= ఒక్కటిగా; ఒక్కనాఁడు; ద్రోణుఁడు; గంగా, స్నాన+అర్థము= గంగానదిలో స్నానం చేయటంకొరకు; అరిగి= వెళ్లి; అందున్= ఆ నదిలో; మహా, నియమస్థుఁడు+అయి= గొప్పనియమం కలిగినవా డై; నీళ్లన్, ఆడుచున్= స్నానం చేస్తూ; ఉన్నన్= ఉండగా.

తాత్పర్యం: ఒకనాడు రాకుమారు లందరితో కలిసి ద్రోణుడు గంగాస్నానం చేయటానికై వెళ్లి, ఎంతోనిష్ఠతో నీటిలో స్నానం చేస్తుండగా.

క. వెఱచఱవ నీరిలో నొ । క్కెఱగా నొక మొసలి చూడ్కికి నగోచర మై
పఱతెంచి కుంభసంభవు । చిఱుదొడ వడిఁ బట్టికొనియె శిష్యులు బెదరన్. 256

ప్రతిపదార్థం: వెఱచఱవ= భయపడేట్లుగా; నీరిలోన్= నీటిలో; ఒక్కెఱగాన్= భయంకరంగా; ఒక; మొసలి= మొసలి; చూడ్కికిన్= చూడటానికి; అగోచరము+ఐ= కనిపించనిదై; పఱతెంచి= వచ్చి; కుంభసంభవు, చిఱుతొడ= ద్రోణునియొక్క పిక్కను; శిష్యులు, బెదరన్= శిష్యులంతా బెదరునట్లు; వడిన్= వేగంగా; పట్టుకొనియెన్= పట్టుకొన్నది.

తాత్పర్యం: నీళ్ళల్లో భయంకరంగా ఒకమొసలి కంటికి కనపడకుండా వచ్చి, శిష్యులంతా బెదిరేటట్లుగా ద్రోణాచార్యుని పిక్కను వెంటనే పట్టుకొన్నది.

క. దాని విడిపింప ద్రోణుఁడు । దా నపుడు సమర్థుఁ డయ్యుఁ దడయక పనిచెన్
'దీని విడిపింపుఁ' డని నృప । సూనుల శరసజ్యచాపశోభితకరులన్. 257

ప్రతిపదార్థం: దానిన్= ఆ మొసలిని; విడిపింపన్= విడిపించటానికి; ద్రోణుఁడు= ద్రోణాచార్యుడు; తాన్; అపుడు= ఆ సమయంలో; సమర్థుఁడు+అయ్యున్= సామర్థ్యం కలిగినవాడు అయికూడా; తడయక= ఆలస్యం చేయకుండా; దీనిన్= ఈ మొసలిని; విడిపింపుఁడు; అని; శర, సజ్య, చాప, శోభిత, కరులన్= బాణాలచేత, అల్లెత్రాళ్లచేత కూడిన ధనుస్సులతో ప్రకాశిస్తున్న చేతులు కలవారిని; నృప, సూనులన్= రాకుమారులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: ఆ మొసలిని విడిపించటానికి ద్రోణు డపుడు తాను సమర్థు డైకూడా ఆలస్యం లేకుండా దీన్ని విడిపించం డని ధనుర్బాణాలు చేత ధరించిఉన్నరాకుమారులను ఆజ్ఞాపించాడు.

శా. దానిన్ నేరక యందఱున్ వివశు లై తా రున్న నన్నీరిలోఁ
గానం గాని శరీరముం గల మహోగ్ర గ్రాహమున్ గోత్ర భి
త్సూనుం డేనుశరంబులన్ విపులతేజుం డేసి శక్తిన్ మహా
సేనప్రఖ్యుఁడు ద్రోణుజంఘ విడిపించెన్ విక్రమం బొప్పఁగన్. 258

ప్రతిపదార్థం: దానిన్= ఆ మొసలిని విడిపించటం; నేరక= చేతకాక; అందఱున్; వివశులు+ఐ= మైమరచినవాళ్ళయి; తారు= తాము; ఉన్నన్= ఉండగా; ఆ+నీరిలోన్; కానన్+కాని= చూడటానికి సాధ్యపడని; శరీరమున్+కల= దేహంఉండే; మహా+ఉగ్ర, గ్రాహమున్= మిక్కిలి భయంకరం అయిన మొసలిని; విపుల, తేజుండు= ఎంతో పరాక్రమం కలవాడు; శక్తిన్= బలంలో; మహాసేన, ప్రఖ్యుఁడు= కుమారస్వామితో సమానుడు; గోత్ర, భిత్+సూనుండు= కొండలను చీల్చిన దేవేంద్రునియొక్క కుమారుడు; ఏను, శరంబులన్= అయిదు బాణాలతో; ఏసి= కొట్టి; విక్రమంబు= పరాక్రమం; ఒప్పఁగన్= ప్రకాశించేటట్లు; ద్రోణు, జంఘన్= ద్రోణాచార్యునియొక్క పిక్కను; విడిపించెన్.

తాత్పర్యం: ఆ రాకుమారులంతా మొసలిని విడిపించటం చేతకాక దిక్కుతెలియనిస్థితిలో ఉండగా, మహాపరాక్రమశాలి, శక్తిలో కుమారస్వామివంటివాడు, పర్వతాలరెక్కలు నరికిన దేవేంద్రునిపుత్త్రుడు అయిన అర్జునుడు, నీటిలో కనిపించకుండా ఉన్న ఆ భయంకరమైన మొసలిని అయిదుబాణాలతో కొట్టి, ద్రోణాచార్యుని పిక్కను విడిపించాడు.

వ. అ మ్మహోగ్రగ్రాహంబు పార్థబాణపంచకవిభిన్నదేహం బయి పంచత్వంబుఁ బొందినం జూచి, ద్రోణుం డర్జును ధనుః కౌశలంబునకుఁ దనయం దతిస్నేహంబునకు మెచ్చి, వీనిచే ద్రుపదుండు బంధుసహితంబు పరాజితుండగు నని తనమనంబున సంతోషించి, వానికి ననేకదివ్యబాణంబు లిచ్చె నని యర్జునుకొండుకనాఁటి పరాక్రమ గుణసంపదలు వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పె నని. 259

ప్రతిపదార్థం: ఆ+మహా=ఉగ్ర, గ్రాహంబు= ఆ గొప్ప భయంకరమయిన మొసలి; పార్థ, బాణ, పంచక, విభిన్న, దేహంబు+అయి= అర్జునునిబాణాలు అయిదింటిచేత చీల్చబడిన శరీరం కలదై; పంచత్వంబున్= మరణాన్ని; పొందినన్= పొందగా; చూచి= కనుగొని; ద్రోణుండు; అర్జును, ధనుస్+కౌశలంబునకున్= అర్జునుని విలువిద్యానైపుణ్యానికి; తనయందు= తనపై; అతి, స్నేహంబునకున్= మిక్కిలి ప్రీతికి; మెచ్చి= పొగడి; వీనిచే= వీనివల్ల; ద్రుపదుండు; బంధు, సహితంబు= బంధువులతో సహా, పరాజితుండు= ఓడగొట్టబడినవాడు; అగున్= కాగలడు; అని= అని; తన, మనంబునన్; సంతోషించి; వానికిన్= ఆ అర్జుననికి; అనేక, దివ్య, బాణంబులు= అనేకదేవతాసంబంధమైనబాణాలు; ఇచ్చెన్; అని; అర్జును, కొండుకనాఁటి= అర్జునుని యొక్కచిన్ననాటి; పరాక్రమ, గుణ, సంపదలు= పరాక్రమంయొక్క, గుణాలయొక్కగొప్పలు; వైశంపాయనుండు; జనమేజయునకున్; చెప్పెన్; అని.

తాత్పర్యం: 'ఆ అతిభయంకరమయిన మొసలి అర్జునుని అయిదుబాణాలచేత శరీరం చీలి మరణించింది. అది చూచి ద్రోణుడు అర్జునుని విలువిద్యానైపుణ్యానికి, తనపట్ల గల ప్రేమకు మెచ్చి, అతనిచేత ద్రుపదుడు బంధువులతో సహా ఓడిపోగల' డని సంతోషించి అనేకదివ్యబాణాలు అతనికిచ్చాడు' - అని అర్జునునిచిన్ననాటి పరాక్రమ గుణవిశేషాలు వైశంపాయనుడు జనమేజయునికి చెప్పె నని.

విశేషం: ద్రోణుడు ధృతరాష్ట్రపాండురాజకుమారులకు విలువిద్య నేర్పటంలో కొంత స్వార్థం ఉంది. అది ద్రుపదుడిని తన శిష్యులచేత అవమానింప చేయటం, భీష్ముడు తన మనుమ లందరినీ శిష్యులుగా చేసిన మరుక్షణమే గురువుగా తనకోర్కెను

తీర్చేవా ళ్ళెవ రని వాళ్ళని ప్రశ్నించాడు. అర్జును డొక్కడే అనుకూలంగా స్పందించాడు. మొసలిని చంపి ద్రోణుడిని కాపాడటంతో విలువిద్యాభ్యాసం పూర్తి అయినట్లు వస్తుధ్వని. అర్జునుడు ఏకైక వీరుడిగా ప్రకాశించాడు. ద్రోణునికోర్కె తీరింది. ద్రుపదుడిని సపరివారంగా ఓడించ గలిగిన ఒక మహావీరుడిని తయారు చేయగలిగినందుకు ద్రోణుడు సంతోషించాడు. ఇది భావికథకు నాంది. పూర్వాపరసంబంధం కల కథాకథనశిల్పం. (సంపా.)

ఆశ్వాసాంతము

క. వ్యసనవివర్జిత ! మాన । వ్యసగోత్రపవిత్ర! విష్ణువర్ధననృప! స
ప్తసముద్రముద్రితాఖిల । వసుధాజనగీతకీర్తి! వాసవమూర్తీ!. 260

ప్రతిపదార్థం: వ్యసన, వివర్జిత= వ్యసనాలచేత విడువబడినవాడా!; మానవ్య, సగోత్ర, పవిత్ర= మానవ్య, సగోత్రంలో పవిత్ర మైన వాడా!; విష్ణు, వర్ధన, నృప= విష్ణువర్ధన మహారాజా!; సప్తసముద్ర, ముద్రిత+అఖిల, వసుధా, జన, గీత, కీర్తి= ఏడు సముద్రాలచేత గుర్తు వేయబడినటువంటి సమస్త భూప్రజలచేత పొగడబడిన కీర్తి కలవాడా!; వాసవ, మూర్తీ= ఇంద్రునివంటి రూపం కలవాడా!

తాత్పర్యం: ఏ వ్యసనం లేనివాడా! మానవ్య సగోత్రంలో పవిత్రుడ మైనవాడా! విష్ణువర్ధనమహారాజా! సప్త సముద్రాలచేత ముద్రవేయబడిన సమస్తభూమండలప్రజలచేత పొగడబడిన కీర్తి కలవాడా! ఇంద్రునివంటి రూపం కలవాడా!

విశేషం: రాజరాజనరేంద్రుడు మొదట వైయాఘ్రపాదగోత్రుడు. విష్ణువర్ధనుని మానవ్య సగోత్రుడైన హరితపుత్త్రుడు పెంచుకొన్నందు వలన మానవ్య సగోత్రు డైనాడు.

వనమయూరం.

రాజకులశేఖర! పరంతప! వివేక । భ్రాజిత! జగద్వలయభాసురసముద్య
త్తేజ! నిరవద్య! యువతీమదన! వీరో । గ్రాజివిజయా! త్రిభువనాంకుశ! నరేంద్రా. 261

ప్రతిపదార్థం: రాజ, కుల, శేఖర= రాజవంశమందు లేదా చంద్రవంశమందు శ్రేష్ఠుడయిన వాడా!, పరంతప= శత్రువులను నాశనం చేసేవాడా! వివేక, భ్రాజిత= విచక్షణజ్ఞానంచేత ప్రకాశింపచేయబడినవాడా!; జగత్+వలయ, భాసుర, సముద్యత్, తేజ= భూమండలంలో ప్రకాశిస్తూ పెరుగుతున్న కాంతి కలవాడా!; నిరవద్య= దోషం లేనివాడా!; యువతీ, మదన= యౌవనంలో ఉన్నస్త్రీలకు మన్మథుడైనవాడా!; వీర+ఉగ్ర+ఆజి, విజయా= వీరులతోడి భయంకరమయిన యుద్ధంలో గెలుపు కలిగినవాడా!; త్రిభువన+అంకుశ= మూడులోకాలకు అంకుశంవంటివాడా! (ఇది రాజరాజుబిరుదం); నర+ఇంద్రా= మానవులకు ప్రభు వైనవాడా- ఓ రాజరాజనరేంద్రా!

తాత్పర్యం: రాజవంశానికి లేదా చంద్రవంశానికి అలంకార మైనవాడా! శత్రువులను నాశనం చేసేవాడా! వివేకం చేత ప్రకాశించేవాడా! భూమండలంలో ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్న తేజస్సు కలవాడా!, యువతులకు మన్మథునివంటివాడా!, వీరులతో భయంకరయుద్ధంలో విజయం కలవాడా!, త్రిభువనాంకుశ అనే బిరుదం కలవాడా! రాజరాజనరేంద్రా!

విశేషం: ఇవికూడా రాజరాజనరేంద్రునిగుణవిశేషాలు. ఆశ్వాసాంతంలో కృతిపతిసంబోధనలు. వనమయూరపాదానికి భ, జ, స, న, గగ - అనే గణాలు వరుసగా ఉంటాయి. 9వ అక్షరం యతిస్థానం. ప్రాసనియతి ఉన్నది.

గద్యము.

ఇది సకలసుకవిజనవినుతనన్నయభట్టప్రణీతం బైన శ్రీ మహాభారతంబునం దాదిపర్వంబున ధృతరాష్ట్ర పాండురాజుల వివాహంబును, బాండురాజదిగ్విజయంబును, బాండవధార్తరాష్ట్రసంభవంబును, బాండురాజు నిర్యాణంబును, గృపద్రోణజన్మకథనంబును, గుమారాస్త్రవిద్యాగ్రహణంబును నన్నది పంచమాశ్వాసము. 262

తాత్పర్యం: ఇది, సకలసత్కవుల ప్రశంస లందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలో - ఆదిపర్వంలో- ధృతరాష్ట్రపాండురాజులవివాహం, పాండురాజుదిగ్విజయం, పాండవధార్తరాష్ట్రులజననం, పాండురాజు మరణం, కృపాచార్యద్రోణాచార్యులపుట్టుకనుగూర్చి చెప్పటం, కురుకుమారులు అస్త్రవిద్యను అభ్యసించటం - అనే కథార్థాలు కల ఐదవఆశ్వాసం.

ఆదిపర్వంలో పంచమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - షష్ఠాశ్వాసము

శ్రీ జయవిభాసి! వినమ । ద్రాజన్య కిరీటమణి విరాజిత పాదాం
భోజ! భువనైకసుందర । రాజాన్వయతిలక! రాజరాజనరేంద్రా! 1

ప్రతిపదార్థం: రాజరాజనరేంద్రా!; శ్రీ= సంపదచేత; జయ= జయంచేత; విభాసి= ప్రకాశించేవాడా; వినమత్+రాజన్య, కిరీట, మణి, విరాజిత, పాద+అంభోజ= వంగి నమస్కరిస్తున్న రాజులయొక్క కిరీటాలలోని మణులవలన మిక్కిలి ప్రకాశిస్తున్న పద్మాలవంటి పాదాలు గలవాడా!; భువన+ఏక, సుందర= లోకంలో నీకు నీవే సాటి అయిన అందగాడా!; రాజ+అన్వయ, తిలక= చంద్రవంశంలో శ్రేష్ఠుడవైనవాడా!

తాత్పర్యం: సంపదతో, విజయంతో వెలుగొందుతూ, వంగి నమస్కరిస్తున్న రాజుల కిరీటాలలోని మణుల కాంతులవలన ఎంతో ప్రకాశించే పాదపద్మాలు కలిగి, లోకమంతటికీ అందగాడివై, చంద్రవంశశ్రేష్ఠుడవైన ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: ఆశ్వాసారంభపద్యాన్ని శ్రీకారంతో ప్రారంభించి, కృతిపతిగుణవిశేషాలు కొనియాడుతూ అతడిని సంబోధించి, కథ మొదలుపెట్టటం, నన్నయ ఏర్పరచిన సంప్రదాయం. తర్వాతి తెలుగుకవులు చాలామంది దీన్ని పాటించటం జరిగింది.

వ. అ క్కథకుండు శౌనకాది మహామునులకుం జెప్పె: నట్లు కృతాస్త్ర శస్త్రులయిన రాజకుమారుల విద్యాకౌశలంబు వ్యాస గాంగేయ విదుర కృప శల్య శకుని సోమదత్తాదుల సమక్షంబునం జూప సమకట్టి యొక్కనాఁడు ద్రోణుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= కథను చెప్పుతున్న ఆతడు - రౌమహర్షణి; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలయిన గొప్ప ఋషులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; కృత+అస్త్ర, శస్త్రులు+అయిన= చేయబడిన (అంటే నేర్పబడిన) అస్త్రాలు, శస్త్రాలు కలవారైన; రాజకుమారుల; విద్యా, కౌశలంబు= విద్యలోని నేర్పు; వ్యాస, గాంగేయ, విదుర, కృప, శల్య, శకుని, సోమదత్త+ఆదుల= వ్యాసుడు, భీష్ముడు, విదురుడు, కృపుడు, శల్యుడు, శకుని, సోమదత్తుడు మొదలైనవాళ్ళయొక్క; సమక్షంబునన్= ఎదుట; చూపన్= చూపటానికి; సమకట్టి= పూనుకొని; ఒక్కనాఁడు= ఒక రోజు; ద్రోణుండు= ద్రోణాచార్యుడు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రునితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: శౌనకుడు మొదలైన మహామునులకు మహాభారతకథను చెపుతున్న రౌమహర్షణి- 'ఆ విధంగా శస్త్రాస్త్రవిద్యలు నేర్చుకొన్న కురుకుమారుల విద్యానైపుణ్యాన్ని - వ్యాసుడు, భీష్ముడు, విదురుడు, కృపుడు, శల్యుడు,

శకుని, సోమదత్తుడు మొదలైన పెద్దలముందు ప్రదర్శింపచేయాలనుకొన్న ద్రోణాచార్యుడు -ధృతరాష్ట్రునితో ఇట్లా అన్నా' డని మళ్ళీ కథను ప్రారంభించి చెప్పాడు.

విశేషం: రాజకుమారుల-అంటే ఇక్కడ ధృతరాష్ట్ర, పాండురాజకుమారుల-అని గ్రహించాలి.

కుమారాస్త్రవిద్యాసందర్శనము **(సం.1-124-1)**

క. ఘోరాస్త్రశస్త్రవిద్యల । నారూఢత మిగుల నిపుణు లైరి కుమారుల్
మీరలు వీరల విద్యా । పారము సను టెఱుఁగవలయు భవదీయ సభన్. 3

ప్రతిపదార్థం: కుమారుల్ (కౌరవులు, పాండవులు); ఘోర+అస్త్ర, శస్త్ర, విద్యలన్= భయంకరాలైన అస్త్రశస్త్రవిద్యలలో; ఆరూఢతన్= మీదికి ఎదుగుటచేత; మిగులన్= మిక్కిలి; నిపుణులు+ఐరి= నేర్పరులయ్యారు; మీరలు= మీరు; భవదీయ సభన్= మీయొక్కసభలో; వీరల, విద్యా, పారము+చనుట= వీళ్ళయొక్క విద్యయొక్క ఆవలిఒడ్డును చేరటాన్ని - అంటే వీళ్ళు శస్త్రాస్త్రవిద్యనంతటినీ నేర్చుకొని సాధించిన నైపుణ్యాన్ని; ఎఱుఁగవలయున్= తెలిసికొనాలి.

తాత్పర్యం: భయంకరాలైన శస్త్రాస్త్రవిద్యలను సమగ్రంగా అభ్యసించి, కౌరవులు, పాండవులు, ఆ విద్యలలో మిక్కిలి నేర్పరులయ్యారు. మీరు సభలో వాళ్ళనేర్పును తెలిసికొనాలి.

వ. అనిన నట్ల చేయుదు నని ధృతరాష్ట్రుండు 'గుమారుల విద్యాసందర్శనరంగంబు రమ్యంబుగాఁ జేయింపు' మని విదురుం బంచిన, నతండును దాని శాస్త్రవిహిత ప్రమాణోపేత వృత్తాయామంబును, నపాకృత వృక్ష గుల్మ వల్మీకంబును, నంగీకృత పూర్వోత్తరప్లవంబును, సమీకృత నిమ్నోన్నత ప్రదేశంబును, దూరీకృత కంటక పాషాణ శల్య శకలంబును, విరజీకృత రజోధూసర స్థలంబును, విరచిత బహువిధ ప్రేక్షాగారాంచిత మణిమయమంచ ప్రపంచంబును,నానాధ్వజనవపల్లవరంభాస్తంభమాలాలంకృతద్వారతోరణంబును, బ్రతిదిశనిర్వర్తిత శాంతిక బలి విధానంబునుంగాఁ జేయించినం, బంచాంగశుద్ధదినశుభముహూర్తంబున ధృతరాష్ట్రుండు గాంధారీ పురస్కృత దేవీశతపరివృతుం డై, వివిధభూషణ భూషితానేక విలాసినీనివహంబుతోఁ జనుదెంచి, విలంబిత కదంబక స్థూలముక్తాఫలదామ రమణీయం బై, యాబద్ధమరకత వజ్రవైడూర్య పద్మరాగప్రభాప్రకర వ్యతికర విరచితా పూర్వ సురచాపచారుగౌరవం బై, యతిమనోహరం బైన శాతకుంభమయ ప్రేక్షాగారంబున నున్న. 4

విశేషం: అనినన్= ద్రోణాచార్యుడు ఆ విధంగా చెప్పగా; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదున్+అని= చేస్తాను అని; ధృతరాష్ట్రుండు; కుమారుల, విద్యా, సందర్శన, రంగంబు= రాజకుమారుల విద్యలను చూపే ప్రదేశాన్ని; రమ్యంబు, కాన్= అందంగా ఉండేటట్లుగా; చేయింపుము; అని; విదురున్= విదురుణ్ణి; పంచినన్= ఆజ్ఞాపించగా; అతండును; దానిన్= ఆ ప్రదేశాన్ని - ఆ రంగస్థలాన్ని; శాస్త్ర, విహిత, ప్రమాణ+ఉపేత, వృత్త+ఆయామంబునున్= శాస్త్రంలో విధించబడిన కొలతలతో కూడుకొన్న చుట్టుకొలత, పొడవు కలదీ; అపాకృత, వృక్ష, గుల్మ, వల్మీకంబును= తొలగించబడినచెట్లు, పొదలు, పుట్టలు కలదీ; అంగీకృత, పూర్వ+ఉత్తర, ప్లవంబును= అవయవాలుగా చేయబడిన - అంటే అవయవాలవలె అతుక్కొని రంగస్థల భాగాలుగా ఉండేటట్లు చేయబడిన - తూర్పు, ఉత్తర, దిక్కుల్లో వాటమైన పల్లపునేలలు కలదీ; సమీకృత, నిమ్న+ఉన్నత, ప్రదేశంబును= చదరం చేయబడిన పల్లాలూ, మిట్టప్రదేశాలూ కలదీ; దూరీకృత, కంటక, పాషాణ, శల్య, శకలంబును= దూరం చేయబడిన - అంటే తొలగించబడిన ముళ్ళూ, రాళ్ళూ, ఎముకముక్కలూ కలదీ; విరజీకృత, రజస్+ధూసర,

స్థలంబును= దుమ్ముతొలగించి, శుభ్రంచేయబడిన స్థలాలు కలదీ; విరచిత, బహు, విధ, ప్రేక్షా+అగార+అంచిత, మణిమయ, మంచ, ప్రపంచంబును= నిర్మించబడిన, అనేకవిధాలైన, చూడటం కోసమైన ఇండ్లయొక్కయు, అలంకరింపబడిన మణులతో నిండిన మంచలయొక్కయు, సమూహంతో కూడిందీ; నానాధ్వజ, నవ, పల్లవ, రంభా, స్తంభ, మాలా+అలంకృత, ద్వార, తోరణంబును= పలువిధాలైన జెండాలతో, క్రొత్తచివుళ్ళతో, అరటిస్తంభాలతో, పూలమాలలతో అలంకరింపబడిన లోపలివాకిళ్ళూ; వెలుపలివాకిళ్ళూ కలదీ; ప్రతిదిశ, నిర్వర్తిత, శాంతిక, బలి, విధానంబునను, కాన్= ప్రతిదిక్కులలోను నెరవేర్పబడిన శాంతిని కలిగించే బలులతో కూడిన పూజావిధులు కలది అగునట్లుగా; చేయించినన్= చేయించగా; పంచ+అంగ, శుద్ధ, దిన, శుభ, ముహూర్తంబునన్= = పంచాంగాలచేత (తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలచేత) పవిత్రమైన శుభసమయంలో; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; గాంధారీ, పురస్, కృత, దేవీ, శత, పరివృతుండు+ఐ= గాంధారి ముందుండేటట్లుగా చేయబడిన భార్యలు వందమందిచేత చుట్టబడినవాడై; వివిధ, భూషణ, భూషిత+అనేక, విలాసినీ, నివహంబుతోన్= పలువిధాలైన సొమ్ములతో అలంకరింపబడిన పెక్కుమంది స్త్రీల సమూహంతో; చనుదెంచి= వచ్చి; విలంబిత, కదంబ, స్థూల, ముక్తాఫల, దామ, రమణీయంబు+ఐ= వ్రేలాడగట్టిన కడిమి మొగ్గలవలె పెద్దవైన ముత్యాలయొక్క దండలచేత అందమైనదై; ఆబద్ధ, మరకత, వజ్ర, వైడూర్య, పద్మరాగ, ప్రవాళ, ప్రభా, ప్రకర, వ్యతికర, విరచిత+ అపూర్వ, సుర, చాప, గౌరవంబు+ఐ= కట్టబడిన పచ్చలయొక్క, వజ్రాలయొక్క, వైడూర్యాలయొక్క, పద్మరాగాలయొక్క, పగడాలయొక్క, కాంతులసమూహంయొక్క పరస్పరంకూడికచేత నిర్మింపబడిన అరుదైన ఇంద్రధనుస్సు అందంయొక్క గొప్పతనం కలదై; అతిమనోహరంబు+అయిన= మిక్కిలి అందమైనదైన; శాతకుంభమయ, ప్రేక్షా+అగారంబునన్= (ప్రదర్శన) చూడటంకొరకు బంగారుతో నిర్మించిన ఇంటిలో; ఉన్నన్=ఉండగా.

తాత్పర్యం: ఆ విధంగా ద్రోణాచార్యుడు చెప్పగా, అట్లే చేస్తానని ధృతరాష్ట్రుడు 'కురుకుమారుల శస్త్రాస్త్ర విద్యా ప్రదర్శనకు అందమైన రంగస్థలాన్ని సిద్ధంచేయించుమని విదురుడిని ఆజ్ఞాపించాడు. విదురుడు శాస్త్రప్రకారం చుట్టుకొలత, పొడవు ఉండేటట్లు, చెట్లను, పొదలను, పుట్టలను తీసివేయించి, అవయవాలవలె అంటి ఉంటేటట్లు తూర్పుభాగంలో, ఉత్తరభాగంలో వాటమైన పల్లపుప్రదేశాలను ఏర్పాటుచేయించి, మిట్టపల్లాలను చదునుచేయించి, ముళ్ళను, రాళ్ళను, ఎముకముక్కల్ని ఏరివేయించి, దుమ్మును అణగగొట్టించి, ప్రేక్షకులు కూర్చొని చూడడానికి పలువిధాలైన ఇండ్లను, మణులతో అలంకరించిన మంచెలను నిర్మింపజేశాడు. లోపలి వాకిళ్ళను, వెలుపలవాకిళ్ళను జెండాలతో, క్రొత్తచిగుళ్ళతో, అరటిస్తంభాలతో, పూలమాలలతో అలంకరింపజేసి, అన్నిదిక్కులలో శాంతిపూజలు జరిపించాడు. రంగస్థలాన్ని సర్వాంగసుందరంగా సిద్ధంచేయించాడు. పంచాంగం ప్రకారం మంచిరోజున, శుభముహూర్తంలో ధృతరాష్ట్రుడు గాంధారీదేవి ముందు నడుస్తుండగా వందమంది భార్యలతో, పలువిధాలైన సొమ్ములు అలంకరించుకొన్న పెక్కుమంది స్త్రీలతో వచ్చి, వ్రేలాడే కడిమిమొగ్గలవలె పెద్దవైన ముత్యాలతో కూర్చిన దండలతో చూడముచ్చటయిందీ, అమర్చిన మరకత వజ్ర వైడూర్య పద్మరాగ ప్రవాళకాంతుల కలయికతో అపూర్వ మైన ఇంద్రధనుస్సు అందాన్ని మించిందీ, మనోహరమైందీ, బంగారుతో నిర్మించిందీ అయిన ఇంటిలో - (కురుకుమారాస్త్రవిద్యాప్రదర్శనను లోపలకూర్చొని చూడటానికి నిర్మించిన ఇంటిలో) - ఉండగా.

విశేషం: అలం: ఉదాత్తం, ఉపమ, అంత్యానుప్రాసం. ఈ రంగస్థలంయొక్క అధునాతనరూపమే ఇప్పటి 'స్టేడియం'.

తే. అందుఁ గరమొప్పి సుందరీబృంద మఖిల। రత్నరాజితకనకధరాధరేంద్ర
కందరాంతరమున నున్న సుందరామృ। తాశనాంగనాబృందంబు ననుకరించె. 5

ప్రతిపదార్థం: అందున్= ఆ ఇంటిలో (ఆ ప్రేక్షాగారంలో); సుందరీ, బృందము= స్త్రీలయొక్క సమూహం; కరము= మిక్కిలి; ఒప్పి= తగినట్లుండి; అఖిల, రత్న, రాజిత, కనక, ధరాధర+ఇంద్ర, కందర+అంతరమునన్+ఉన్న= అన్నిరత్నాలతో ప్రకాశింపజేయబడిన బంగారుపర్వతశ్రేష్ఠముయొక్క-అంటే మేరుపర్వతంయొక్క-గుహలలోపల ఉన్న; సుందర+అమృత+ ఆశన+అంగనా, బృందంబున్= అందమైన దేవతాస్త్రీలసమూహాన్ని; అనుకరించెన్= పోలింది.

తాత్పర్యం: ఆ ఇంట్లో ఉండే స్త్రీలసమూహం సకలరత్నకాంతులతో ప్రకాశించేమేరుపర్వతగుహలో ఉన్న సుందరదేవతాస్త్రీలసమూహాన్ని పోలి ఉన్నది.

విశేషం: అలంకారం: ఉపమ. అమృతాన్ని ఆహారంగా కలవారు దేవతలు.

తే. సుతులవిద్యాప్రవీణతఁ జూచువేడ్క । నెంతయును సంతసంబునఁ గుంతిదేవి
రాజసన్నిధి గాంధారరాజపుత్రి । కెలన నుండె నున్మీలితనలిననేత్ర. 6

ప్రతిపదార్థం: ఉత్+మిలీత, నలిన, నేత్ర= విప్పారిన తామరలవంటి కన్నులు గలది; సుతుల=కొడుకులయొక్క; విద్యా ప్రవీణతన్= విద్యలోని నేర్పును; చూచు, వేడ్కన్= చూడాలనే కుతూహలంతో; ఎంతయున్= మిక్కిలి; సంతసంబునన్= సంతోషంతో; కుంతీదేవి; రాజ, సన్నిధిన్= రాజుదగ్గర; గాంధార, రాజ, పుత్రి, కెలనన్= గాంధారరాజుకూతురైన గాంధారిప్రక్క; ఉండెన్.

తాత్పర్యం: వికసించిన తామరపూలవంటి కన్నులున్న కుంతీదేవి, తనకుమారుల విద్యానైపుణ్యాన్ని చూడాలన్న కుతూహలంతో, ధృతరాష్ట్రునిదగ్గర-గాంధారిప్రక్కన ఎంతో సంతోషంతో ఉండింది.

విశేషం: కొడుకుల విద్యానైపుణ్యాన్ని కళ్ళార చూడగోరే మాతృమూర్తియొక్కమానసికస్థితికి - 'ఉన్మీలితనలిననేత్ర' అనే విశేషం ఎంతో ఉచితంగా ఉన్నది. కళ్ళకు గంతలు గట్టుకొన్న గాంధారిప్రక్కన విప్పారిన కన్నులు గల కుంతి కూర్చోవటం విశేషం. తులనాత్మకసౌందర్యాన్ని వెలార్చే స్థిరచిత్ర మిది.

వ. మఱియును. 7

తాత్పర్యం: ఇంకా.

సీ. వ్యాసపురస్కృతావనిదేవనివహంబుఁ, గృప శల్య శకుని గాంగేయ విదుర
సోమదత్తాది భాసురగురుబాంధవ । మిత్త్రవర్గంబు, నమేయ మంత్రి
సామంత మండలేశ్వరసమూహంబును, । గాయక వైతాళికప్రవరులుఁ
దమతమ నియమిత స్థానంబులం దోలి । నుండిరి; బోరన నులిసె భేరు;

ఆ. లస్త్రదర్శనాగతాఖిల క్షత్రియ । వైశ్యశూద్రవివిధవర్ణజనుల
కలకలంబు ప్రళయకాలసంక్షోభితాం । భోనిధిస్వనంబుఁ బోలెఁ జెలఁగె. 8

ప్రతిపదార్థం: వ్యాస, పురస్+కృత+అవని, దేవ, నివహంబున్= వ్యాసుడు ముందుగా ఉండే భూసురుల - అంటే బ్రాహ్మణుల సమూహం; కృప, శల్య, శకుని, గాంగేయ, విదుర, సోమదత్త+ఆది, భాసుర, గురు, బాంధవ, మిత్ర, వర్గంబున్= కృపాచార్యుడు,

శల్యుడు, శకుని, భీష్ముడు, విదురుడు, సోమదత్తుడు మొదలైన ప్రకాశించే గురువులయొక్క, బంధువులయొక్క, మిత్రులయొక్క సమూహం; అమేయ, మంత్రి, సామంత, మండల+ఈశ్వర, సమూహంబును= అపరిమితమైన మంత్రులయొక్క, సామంతులయొక్క, మండలాధిపతులయొక్క సమూహం; గాయక, వైతాళిక, ప్రవరులున్= శ్రేష్ఠులైన పాటలు పాడేవారు, వేకువనే రాజును మేలుకొలిపేవారు; తమ, తమ, నియమిత స్థానంబుల+అందున్= తమ తమకు నియమింపబడిన ప్రదేశాలలో; ఒలిన్= వరుసగా; ఉండిరి= కూర్చున్నారు; భేరులు; బోరనన్= బోరుమని; ఉలిసెన్= మ్రోగాయి; అస్త్ర, దర్శన+ఆగత+అఖిల, క్షత్రియ, వైశ్య, శూద్ర, వివిధ, వర్ణ, జనుల కలకలంబు= అస్త్రవిద్యాప్రదర్శనోత్సవాన్ని చూడటానికి వచ్చిన అందరు క్షత్రియులయొక్క, వైశ్యులయొక్క, శూద్రులయొక్క, వివిధజాతుల జనులయొక్క పెద్దశబ్దం; ప్రళయకాల, సంక్షోభిత+అంభోనిధి, స్వనంబున్= ప్రళయకాలంచేత మిక్కిలి కలతపెట్టబడిన సముద్రశబ్దాన్ని; పోలెన్= వలె; చెలఁగెన్= ఒప్పారెను.

తాత్పర్యం: వ్యాసమహర్షిని ముందుగా కల బ్రాహ్మణులసమూహం; కృపాచార్యుడు, శల్యుడు, శకుని, భీష్ముడు, విదురుడు, సోమదత్తుడు మొదలైన గురుబంధుమిత్రులసమూహం, అపరిమితమైన మంత్రిసామంత మండలాధిపతుల సమూహం, గాయకవైతాళికశ్రేష్ఠులు - ఎవరికి నియమించినస్థానాలలో వాళ్ళు వరుసగా కూర్చున్నారు. భేరులు మ్రోగాయి. అస్త్రవిద్యా ప్రదర్శనోత్సవం చూడడానికి వచ్చిన క్షత్రియవైశ్యశూద్రాదివివిధజాతి జనుల కలకలం ప్రళయకాలసముద్రఘోషవలె ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

వ. అట్టియవసరంబున నాచార్యుండు శుక్లాంబరాభరణమాల్యానులేపన యజ్ఞోపవీతపలితకేశశ్మశ్రు శోభిత దేహుండై రంగమధ్యంబున నశ్వత్థామసహితుం డై, విముక్తజలదజాలవియన్మధ్యంబున నంగారకసహితుం డైన యాదిత్యుండునుంబోలె నున్న నగణ్యభూసురవరేణ్యపుణ్యాహవాచనానంతరంబున. 9

ప్రతిపదార్థం: అట్టి అవసరంబునన్= అటువంటి సమయాన; ఆచార్యుండు= ద్రోణాచార్యుడు; శుక్ల+అంబర+ఆభరణ, మాల్య+అనులేపన, యజ్ఞ+ఉపవీత, పలిత, కేశ, శ్మశ్రు, శోభిత, దేహుండు+ఐ= తెల్లనివస్త్రాలతో, సొమ్ములతో, పూలదండలతో, గంధంతో, జందెంతో, నెరసిన వెండ్రుకలతో, గడ్డంతో, మీసంతో, ప్రకాశిస్తున్నదేహం కలవాడై; రంగ, మధ్యంబునన్; అశ్వత్థామ, సహితుండు+ఐ= అశ్వత్థామతో కూడినవాడై; విముక్త, జలద, జాల, వియత్+మధ్యంబునన్= విడువబడిన మేఘాలసమూహం గల ఆకాశంయొక్క మధ్యప్రదేశంలో; అంగారక, సహితుండు+ఐన= అంగారకునితో కూడుకొన్నవా డైన; ఆదిత్యుండునున్, పోలెన్= సూర్యునివలె; ఉన్నన్= ఉండగా; అగణ్య, భూసుర, వరేణ్య, పుణ్యాహవాచన+అనంతరంబునన్= లెక్కకు మిక్కిలి అయిన బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క పుణ్యాహవాచనానికి తర్వాత.

తాత్పర్యం: అటువంటి సమయంలో ద్రోణాచార్యుడు - తెల్లనివస్త్రాలతో, సొమ్ములతో, పూలదండలతో, గంధంతో, జందెంతో, నెరసిన వెండ్రుకలతో, గడ్డంతో, మీసంతో, ప్రకాశిస్తున్న దేహం కలవాడై- రంగమధ్యంలో అశ్వత్థామతో కూడి, మేఘాలు వీడి నిర్మలమైన ఆకాశమధ్యంలో అంగారకగ్రహసహితుడై ప్రకాశించే సూర్యునివలె ఉన్నాడు. పెక్కుమంది బ్రాహ్మణోత్తముల పుణ్యాహవాచనంతర్వాత.

విశేషం: అలం: ఉపమ. అంగారకసహితుండైన యాదిత్యుండునుంబోలె - అనేచోట మూలం ఇట్లా ఉన్నది. 'సాంగారక ఇవాంశుమాన్. సాంగారకః సభౌమః, అంశుమాన్ చంద్రః' అని నీలకంఠీయం - చిత్రశాలాప్రతి పుట 236, చూడు.

మహాభారతసంశోధితప్రతి. పుట.323, ధనుర్విద్యాభాస్కరుడైన ద్రోణాచార్యుని సూర్యునితోను, రాక్షసావేశపరు డైన అశ్వత్థామను అగ్నిగ్రహమైన అంగారకునితోను పోల్చటం ఎంతో ఉచితంగా ఉన్నది. తండ్రికొడుకు లిద్దరు ఆ రెండుగ్రహాలవలె మహాతేజస్వులు.

శా. ద్రోణాచార్యుపిఱుంద నొప్పి దృఢహస్తుల్, బద్ధగోధాంగుళీ
త్రాణుల్, మార్గణపూర్ణతూణులు, మహాధన్వుల్ కుమారుల్ తను
త్రాణోపేతులు రంగమధ్యమున నంతన్ నిల్చి రుద్యద్గుణ
శ్రేణీరమ్యులు ధర్మజప్రముఖు లై జ్యేష్ఠానుపూర్వంబుగన్. 10

ప్రతిపదార్థం: దృఢ, హస్తుల్= బలమైన చేతులు కలవాళ్ళు; బద్ధ, గోధా+అంగుళీ, త్రాణుల్= కట్టబడిన ఉడుముచర్మపు వ్రేళ్ళకవచాలు కలవాళ్ళు; మార్గణ, పూర్ణ, తూణులు= బాణాలతో నిండిన అమ్ములపొదులు కలవాళ్ళు; మహా, ధన్వుల్= గొప్ప ధనుస్సులు కలవాళ్ళు; తను, త్రాణ+ఉపేతుల్= కవచాలతో కూడినవాళ్ళు; ఉద్యత్+గుణ, శ్రేణీ, రమ్యులు= ఉన్నతగుణాల వరుసతో మనోహరమైనవాళ్ళు; రాజకుమారుల్= కురురాజకుమారులు; ద్రోణ+ఆచార్యు, పిఱుందన్, ఒప్పి= ద్రోణాచార్యుని వెనుక అందంగా; ధర్మజ, ప్రముఖులు+ఐ= ధర్మరాజును మొట్టమొదట కలవాళ్ళయి; జ్యేష్ఠ+అనుపూర్వంబుగన్= పెద్దవాళ్ళు ముందు ఉండేటట్లుగా; అంతన్= అప్పుడు; రంగమధ్యంబునన్= రంగంయొక్కమధ్యన; నిల్చిరి= నిలిచారు.

తాత్పర్యం: బలమైనహస్తాలు కలవాళ్ళు, అల్లెత్రాటిదెబ్బ తగులకుండా ఉడుముతోలుతో కుట్టినకవచాలు వ్రేళ్ళకు తొడుక్కొన్నవాళ్ళు, బాణాలు నిండుగా ఉండే అమ్ములపొదులు కలవాళ్ళు, గొప్పధనుస్సులు, కవచాలు ధరించినవాళ్ళు, ఉన్నతగుణాలచేత రాణించేవాళ్ళు అయిన పాండవులు, కౌరవులు, ద్రోణాచార్యుని వెనుక, ధర్మరాజుప్రక్కన వయోధర్మాన్నిబట్టి వరుసగా రంగమధ్యంలో నిలిచారు.

వ. అట్లు నిలిచి, రక్తచందనదిగ్ధాంగులు రక్తమాల్యాంబరాభరణులు రక్తపతాకులు రక్తాంతలోచను లై యాచార్యు ననుమతంబున. 11

ప్రతిపదార్థం: అట్లు= ఆవిధంగా; నిలిచి; రక్త, చందన, దిగ్ధ+అంగులు= ఎర్రగంధంచేత పూయబడిన దేహాలు కలవాళ్ళు; రక్త, మాల్య+అంబర+ఆభరణులు= ఎర్రనిపూలదండలు, వస్త్రాలు, సొమ్ములు కలవాళ్ళు; రక్త, పతాకులు= ఎర్రనిజెండాలు కలవాళ్ళు; రక్త+అంత+లోచనులు+ఐ= ఎర్రని కొలుకులు ఉండే కన్నులు కలవాళ్ళయి; ఆచార్యు+అనుమతంబునన్= ద్రోణాచార్యుని ఆజ్ఞచేత.

తాత్పర్యం: ఆ విధంగా నిలబడి - ఎర్రగంధాన్ని దేహానికి పూసికొని, ఎర్రటి పూలదండలు, వస్త్రాలు, సొమ్ములు ధరించి, ఎర్రజెండాలు చేత పట్టుకొని, ఎర్రబడ్డకనుగొలకులతో ఉన్నవాళ్ళు - ద్రోణాచార్యుని ఆజ్ఞతో.

విశేషం: రక్తవర్ణం వీరరౌద్రరసస్ఫోరకం. రసోచితవిభావవర్ణనం ప్రసన్నకథాకవితలో ఒక శిల్పం.

సీ. అసిచర్మకౌశలం బమరంగఁ జూపెడు । వారును, దృఢసౌష్ఠవంబు లొప్పఁ
దమతమనామాంకితము లైన శరముల । నేర్పడ లక్ష్యంబు లేయువారు,
హయ మదద్విరద రథారూఢ దక్షతఁ । బ్రకటించువారును, బ్రాసశక్తి
కుంత తోమర గదాకుశలత్వ మెఱిఁగించు । వారునుగా నిట్లు వసుధలోని

ఆ. రాజసుతులతోడ రమణఁ బాండవధృత । రాష్ట్రసుతులు వృద్ధరాజులొద్దఁ
దద్దయును ముదమునఁ దమతమవిద్యలు । మెఱసి రెల్లజనులు మెచ్చి పొగడ. 12

ప్రతిపదార్థం: పాండవ, ధృతరాష్ట్ర, సుతులు= పాండవులు, ధృతరాష్ట్రునికుమారులు - కౌరవులు; రమణన్= మనోహరంగా; వసుధలోని= భూమిలోని; రాజసుతులతోడన్= రాకుమారులతో; అసి, చర్మ, కౌశలంబు= కత్తులలోని, డాలులోనినేర్పును; అమరంగన్= ఒప్పిదంగా; చూపెడు వారును= చూపుతున్నవాళ్ళూ; దృఢ, సౌష్ఠవంబులు+ఒప్పన్= బలం నిండుదనం ఒప్పగా; తమ, తమ; నామ+అంకితములు+ఐన= పేర్లతో గుర్తులు వేయబడినవైన; శరములన్= బాణాలతో; ఏర్పడన్= వేరయ్యేటట్లు; లక్ష్యంబులన్= గురిచేసి కొట్టదలచినవాటిని; ఏయువారు= కొట్టేవాళ్ళు; హయ, మద, ద్విరద, రథ+ఆరూఢ, దక్షతన్= గుఱ్ఱాలను, మదపుటేనుగులను, రథాలను ఎక్కటంలోని నేర్పును; ప్రకటించువారును= ప్రదర్శించేవాళ్ళు; ప్రాస, శక్తి, కుంత, తోమర, గదా, కుశలత్వము= ఈటెలలో, శక్తులలో, బల్లేలలో, చిల్లకోలలలో, గదలలో నేర్పును - అంటే వీటిని ప్రయోగించటంలోని నేర్పును; ఎఱిగించువారును= తెలియజేసేవాళ్ళు; కాన్= అగునట్లు; ఇట్లు= ఈ విధంగా, తద్దయును= మిక్కిలి; ముదమునన్= సంతోషంతో; తమ, తమ, విద్యలు= వారివారివిద్యలు; ఎల్ల, జనులు; మెచ్చి; పొగడన్; వృద్ధ, రాజుల+ఒద్ద= పెద్దరాజులదగ్గర; మెఱసిరి= ప్రకాశించారు.

తాత్పర్యం: పాండవులు, కౌరవులు చూడముచ్చటగా లోకంలోని రాకుమారులతో కూడి - కత్తి, డాలు, విన్యాసాలలో తాము గడించిన నేర్పునూ, తమపేర్లు పొదిగిన బాణాలు వేసి లక్ష్యాన్ని ఛేదించటంలో సాధించిన సామర్థ్యాన్నీ, గుఱ్ఱాలను, మదపుటేనుగులను, రథాలను అధిరోహించటంలో ఆర్జించిన నైపుణ్యాన్నీ, ఈటె మొదలైన ఆయుధాలను ప్రయోగించటంలో తాము పొందిన కౌశలాన్నీ ప్రజలందరూ చూచి సంతోషించి కొనియాడేటట్లు పెద్దరాజుల ఎదుట ప్రదర్శించారు.

భీమదుర్యోధనులు తమగదాకౌశలంబు సూపుట (సం. 1-124-30)

వ. అంత ననంతబలపరాక్రము లగు భీమదుర్యోధను లుద్యద్గదాహస్తు లయి మహామత్సరంబుతో నేక శృంగసముత్తుంగశైలద్వయంబు ననుకరించుచు వశానిమిత్తక్రుద్ధగంధసింధురంబులుంబోలె నొండురులం దాఁకి సవ్యాపసవ్యచిత్రమండలమార్గంబుల గదాకౌశలంబు మెఱయునెడ. 13

ప్రతిపదార్థం: అంతన్= ఆ తరువాత; అనంత, బల, పరాక్రములు+అగు= అంతులేని - అంటే అమితమైన బలపరాక్రమాలు కలవాళ్ళయిన; భీమదుర్యోధనులు; ఉద్యత్+గదా, హస్తులు+అయి= ఎత్తబడిన గదలతో కూడిన చేతులు గలవాళ్ళయి; మహా, మత్సరంబుతోన్= మిక్కిలి క్రోధంతో; ఏక, శృంగ, సమ్+ఉత్+తుంగ, శైల, ద్వయంబున్= ఒక్కశిఖరం ఉండే మిక్కిలి ఎత్తైన పర్వతాల జంటను; అనుకరించుచున్= పోలుతూ; వశా, నిమిత్త, క్రుద్ధ, గంధ, సింధురంబులున్+పోలెన్= ఆడ ఏనుగు కారణంగా కోపించిన మదపుటేనుగువలె; ఒండొరులన్= ఒకరినొకరు; తాఁకి= ఎదుర్కొని; సవ్య+అపసవ్య, చిత్ర, మండల, మార్గంబులన్= ఎడమనుంచి కుడికి, కుడినుండి ఎడమవైపునకు, చిత్రమైనవలయాకార (తిరిగే) పద్ధతులలో; గదా, కౌశలంబు= గదలోని నేర్పును - అంటే గదాయుద్ధంలోని నేర్పును; మెఱయు+ఎడన్= ప్రదర్శించేసమయంలో.

తాత్పర్యం: ఆ తర్వాత- అంతులేని బలపరాక్రమాలు గల భీమదుర్యోధనులు, చేత గదలెత్తుకొని, మహాక్రోధంతో ఒకే శిఖరం ఉన్న మిక్కిలిఎత్తైనపర్వతాలజంటవలె, ఆడఏనుగు కారణంగా కోపించిన మదపుటేనుగుల జంటవలె,

ఒకరినొకరు తాకి, ఎడమనుండి కుడికి, కుడినుండి ఎడమకు చిత్రమైన వలయాకారపద్ధతులలో తిరుగుతూ, గదాయుద్ధనైపుణ్యాన్ని ప్రదర్శించారు.

విశేషం: అలం: ఉపమ. చేత గదలు ధరించి, యుద్ధానికి సిద్ధమైన భీమదుర్యోధనులను ఒకే శిఖరం ఉన్న మిక్కిలి ఎత్తైన పర్వతాలజంటతో, ఆడఏనుగు కారణంగా కోపించి కలబడే మదపుటేనుగుల జంటతో పోల్చటంవలన వాళ్ళ ఉన్నతాకారం, బలసమానత, మాత్సర్యతీవ్రత చక్కగా వ్యక్తమౌతున్నాయి.

మ. అవనీచక్రము పాదఘాతహతి నల్లాడంగ నత్యుగ్రభై
రవహుంకార రవంబునన్ వియదగారంబెల్ల భేదిల్లఁ బాం
డవకౌరవ్యగదావిఘట్టన మకాండప్రోత్థమై భావిపాం
డవకౌరవ్యరణాభిసూచన పటిష్ఠం బయ్యె ఘోరాకృతిన్. 14

ప్రతిపదార్థం: అవనీ, చక్రము= భూమండలం; పాద, ఘాత, హతిన్= పాదాలతొక్కిళ్ళదెబ్బలతో; అల్లాడంగన్= కదలగా; అతి+ఉగ్ర, భైరవ, హుంకార, రవంబునన్= మిక్కిలితీవ్రమై భయంకరమైన హుంకారధ్వనిచేత; వియత్+అగారంబు+ఎల్లన్= ఆకాశమనే ఇల్లంతా; భేదిల్లన్= బ్రద్దలుకాగా; పాండవ, కౌరవ్య, గదా, విఘట్టనము= భీమదుర్యోధనుల గదలయొక్క తీవ్రమైన తాకిడి; అకాండ, ప్ర+ఉత్థము+ఐ= అకాలంలో లెస్సగా పుట్టిందై; ఘోర+ఆకృతిన్= భయంకరమైన రూపంతో; భావి, పాండవ, కౌరవ్య, రణ+అభిసూచన, పటిష్ఠంబు+అయ్యెన్= ముందు జరగబోయే పాండవ కౌరవ యుద్ధాన్ని ఇప్పటికిప్పుడే సూచించటంలో సమర్థమైనదయింది.

తాత్పర్యం: కాళ్ళతొక్కుడు దెబ్బలతో భూమండలం చలించగా, మహాభయంకరహుంకారధ్వనితో ఆకాశమనే ఇల్లంతా బ్రద్దలయ్యేటట్లు, భీమదుర్యోధన గదలతాకిడి, అకాలంలో ఏర్పడి, భయంకరరూపంతో మున్ముందు రాబోయే కురుపాండవమహాసంగ్రామాన్ని ఇప్పటికిప్పుడే స్పష్టంగా సూచించేదయింది.

విశేషం: కురుక్షేత్రయుద్ధంలోని చివరిఘట్టం భీమదుర్యోధనుల గదాయుద్ధం. దానికి ఈ గదాయుద్ధ ప్రదర్శనం వ్యంజకంగా ఉన్నది. ఇదొక వస్తుధ్వనిశిల్పవిశేషం. అంతేకాదు, ఓజోగుణం విభావయుద్ధోద్రేకాన్ని ధ్వనింపచేస్తున్నది.

క. ఆ రాజసుతులవిద్యా । పారగపటు చేష్టితములఁ బరువడి నగ్గాం
ధారీధృతరాష్ట్రుల కతి । ధీరుఁడు విదురుండు సెప్పి తెలుపుచునుండెన్. 15

ప్రతిపదార్థం: ఆ, రాజ,సుతుల= ఆ కురుపాండవులైన రాకుమారులయొక్క; విద్యా, పారగ, పటు, చేష్టితములన్= విద్యయొక్క పరిణతిని సాధించటాన్ని తెలిపే సమర్థాలైన చేష్టలను (అంటే విద్యాప్రదర్శనలను); అతి, ధీరుఁడు= గొప్పవిద్వాంసుడైన విదురుడు; పరువడిన్= వరుసగా; ఆ+గాంధారీ, ధృతరాష్ట్రులకున్ చెప్పి, తెలుపుచున్, ఉండెన్= గాంధారికి ధృతరాష్ట్రునికి చెప్పి వివరిస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: ఆ రాకుమారుల విద్యాపారంగత్వాన్ని తెలిపే ఆ విద్యాప్రదర్శనలనుగూర్చి విద్వాంసుడైన విదురుడు వరుసగా ఆ గాంధారీధృతరాష్ట్రులకు తెలియచెప్పుతూ ఉన్నాడు.

వ. అంత భీమదుర్యోధనుల గదా కౌశలంబు సూచుజనులపక్షపాతజనిత పరస్పర క్రోధ వచనంబులు విని ద్రోణుండు రంగభంగభయంబున నశ్వత్థామంబంచి వారి నిద్దఱ వారించి, వారాశియుంబోలె బోరన మ్రోయుచున్న వాదిత్రశబ్దంబు లుడిపి, 'నా ప్రియశిష్యుండయిన యర్జును ధనుర్విద్యాకౌశలంబుఁ జూడుం' డనిన నయ్యాచార్యు వచనానంతరంబున. 16

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; భీమ, దుర్యోధనుల, గదా, కౌశలంబు= భీమదుర్యోధనులయొక్క గదావిద్యలోని నేర్పు; చూచు, జనుల, పక్షపాత, జనిత, పరస్పర, క్రోధ, వచనంబులు= చూస్తున్నట్టి ప్రజలయొక్క పక్షపాతంవలన పుట్టిన ఒండొరులకోపవాక్యాలు; విని; ద్రోణుండు; రంగ, భంగ, భయంబున్= విద్యాప్రదర్శనరంగం చెడిపోతుందనే భయంవలన; అశ్వత్థామన్; పంచి= పంపి; వారిన్; ఇద్దఱన్; ఆ భీమదుర్యోధనులిద్దరిని; వారించి= తొలగించి; వారాశియున్+పోలెన్= సముద్రంవలె; బోరు+అన; మ్రోయుచున్+ఉన్న; వాదిత్ర, శబ్దంబులు= వాద్యాలయొక్క ధ్వనులను; ఉడిపి= మాన్పించి; నా, ప్రియ, శిష్యుండు+అయిన; అర్జును, ధనుస్+విద్యా, కౌశలంబున్= అర్జునునియొక్క ధనుర్విద్యలోని నేర్పును; చూడుండు; అనినన్= అని అనగా; ఆ+ఆచార్యు, వచన+అనంతరంబున= ఆ ద్రోణాచార్యుని మాటలతర్వాత.

తాత్పర్యం: అప్పుడు భీమదుర్యోధనుల గదాకౌశలం చూచే ప్రజలు, పక్షపాతంతో కోపావేశాలు పెంచుకొని, ఒకరి నొకరు అనుకొంటున్నమాటలు విని, అస్త్రవిద్యాప్రదర్శనరంగం భగ్నమవుతుందన్నభయంతో, ద్రోణాచార్యుడు అశ్వత్థామను పంపి, ఆ భీమదుర్యోధనులను తొలగించి, సముద్రఘోషవలె మ్రోగుతున్న వాద్యధ్వని మాన్పించి, 'నా ప్రియశిష్యుడైన అర్జునుని ధనుర్విద్యానైపుణ్యాన్ని చూడం' డని ప్రకటించిన తర్వాత.

విశేషం: ఆటలపోటీలలో పాల్గొనేవాళ్ళసంగతి ఎట్లా ఉన్నా - ఆ పోటీలను చూచేప్రేక్షకులు పక్షాలు వహించటం; అరుపులతో, కేకలతో, మాటలతో పరస్పరం క్రోధావేశాలు రెచ్చగొట్టుకొనటం, ఒక్కొక్కసారి ఆ పోటీలు పెద్ద పోట్లాటలుగా మారటం లోకసహజమే. ప్రస్తుతం భీమదుర్యోధనుల గదాకౌశలప్రదర్శనలో కూడా అలాంటి వాతావరణమే ఏర్పడింది. రంగస్థలం రణభూమిగా మారే ప్రమాదం ఏర్పడింది. అందుచేతనే ఆచార్యుడు ఆ ప్రదర్శనను ఆపివేయించటం జరిగింది. కాగా, మానవహృదయంమీద ధ్వనిప్రభావం మెండు. వివిధవాద్యధ్వనులు వివిధరసోద్దీపకాలు. అందుచేతనే క్రోధావేశప్రేరకాలైన వాద్యధ్వనులను ఆచార్యుడు ఆపివేయించాడు. తతం, ఆనద్ధం, సుషిరం, ఘనం అనే వాద్యచతుష్టయానికి వాదిత్రనామండున్నది.

ఉ. హారివిచిత్రహేమకవచావృతుఁ, డున్నతచాపచారుదీ
ర్ఘోరుభుజుండు, భాస్వదసితోత్పలవర్ణుఁడు, సేంద్రచాపశం
పారుచిమేఘమో యనఁగ బాండవమధ్యముఁ డొప్పి బద్ధతూ
ణీరుఁడు రంగమధ్యమున నిల్చె జనంబులు దన్నుఁ జూడఁగన్. 17

ప్రతిపదార్థం: హారి, విచిత్ర, హేమ, కవచ+ఆవృతుఁడు= మనోహరమై వింతవింత రంగులు గలదైన బంగారు కవచంతో కప్పబడినవాడు; ఉన్నత, చారు, చాప, దీర్ఘ+ఉరు+భుజుండు= అందమైన ధనుస్సుతో పొడవైన, శ్రేష్ఠమైన హస్తం కలవాడు; బద్ధ తూణీరుఁడు= కట్టబడిన అమ్ములపొదులు గలవాడు; భాస్వత్+అసిత+ఉత్పల, వర్ణుఁడు= ప్రకాశిస్తున్న నల్లకలువ వన్నె కలవాడు; పాండవమధ్యముఁడు= పాండవులలో నడిమివాడైన అర్జునుడు; జనంబులు; తన్నున్= తనను; చూడఁగన్= చూస్తుండగా; స+ఇంద్ర+చాప, శంపా, రుచి, మేఘమో, అనఁగన్= ఇంద్రధనుస్సుతో, మెరుపుకాంతితో కూడుకొన్న మేఘమా అనేటట్లు; ఒప్పి= అందంగాఅమరి; రంగ, మధ్యమునన్; నిల్చెన్.

తాత్పర్యం: మినమినలాడే నల్లకలువ వన్నెవాడు, పాండవులలో నడిమివాడు అయిన అర్జునుడు - మనోహరమై, వింతవింత రంగుల బంగారుకవచం తొడుక్కొని, దీర్ఘం, శ్రేష్ఠం అయిన తన హస్తానికి అందమిచ్చిన ఎత్తైన ధనుస్సు ధరించి, అమ్ములపొదులు కట్టుకొని, జనులంతా తనను చూస్తుండగా - ఇంద్రధనుస్సుతో, మెరుపుకాంతితో కూడినమేఘమా అన్నట్లు రంగమధ్యంలో అందంగా నిలిచాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. పద్యంలో ప్రసాదవిశిష్టమైన ఓజోగుణం ధీరోదాత్తుడైన అర్జునుని రూపవర్ణనకు అనుగుణంగా ఉన్నది.

క. నరు నింద్రాత్మజు నింద్రా । వరజసఖున్ వీరుఁ బాండవప్రవరు ధను
ర్ధరుఁ జూచి, చూపఱెల్లం । బరమాద్భుతచిత్తు లగుచుఁ బలికిరి తమలోన్. 18

ప్రతిపదార్థం: నరున్= అర్జునుని; ఇంద్ర+ఆత్మజున్= ఇంద్రునియొక్క కుమారుడైనవానిని; ఇంద్ర+అవరజ, సఖున్= ఇంద్రునితమ్ముడైన ఉపేంద్రునియొక్క - శ్రీకృష్ణునియొక్క స్నేహితుడిని; వీరున్= వీరుడైనవానిని; పాండవ, ప్రవరున్= పాండవులలో శ్రేష్ఠమైనవాడిని; ధనుః+ధరున్= ధనుస్సును ధరించినవాడిని; (అర్జునుడిని) చూచి; చూపఱు+ఎల్లన్= ప్రేక్షకులంతా - చూచేవాళ్ళంతా; పరమ+అద్భుత, చిత్తులు+అగుచున్= మిక్కిలి ఆశ్చర్యంతో కూడిన మనస్సులు కలవాళ్ళయి; తమలోన్= తమలో తాము; పలికిరి= పలికారు, మాట్లాడుకొన్నారు.

తాత్పర్యం: నరుడు ఇంద్రతనయుడు, ఉపేంద్రుడైన శ్రీకృష్ణునిస్నేహితుడు, వీరుడు, పాండవశ్రేష్ఠుడు, ధనుర్ధరుడు అయిన అర్జునుడిని చూచి, అమితాశ్చర్యంతో ప్రేక్షకులు తమలో తాము ఇట్లా అనుకొన్నారు.

విశేషం: ఈ పద్యంలో అర్జునుణ్ణి "ఇంద్రావరజసఖున్" అని చెప్పడం జరిగింది. ఈ 'కుమారాస్త్రప్రదర్శన' సమయం నాటికి కృష్ణుడు - పాండవులతో సమావేశం కాలేదుకదా! అని సంశయం కల్గుతుంది. 'ఉపేంద్రుడైన కృష్ణుని సఖుడు' - అర్జునుడనే మాట కవి చెప్పిందే కానీ, పాత్ర లెవ్వరూ చెప్పింది కాదు. కవికి కథపూర్తిగా తెలుసుగనుక-"కృష్ణసఖుడు" అనడం- భవిష్యత్ సూచకం కూడా కాగలదు. పాత్రనైతే ఆక్షేపించవచ్చు. కవికి కృష్ణార్జునుల జన్మాంతర నారాయణనరఋషిత్వాలు తెలుసు కనుక ఇక్కడ 'సఖ' శబ్దం అనౌచిత్యం కాదు. మూలంలో "ఇంద్రానుజసమః" అని ఉంది. 'సఖ' శబ్దం 'సమాన' మనే అర్థంలో చెప్పడం కద్దు. కనుక కృష్ణసమానుడని కూడ చెప్పుకోవచ్చు.

తే. వీఁడె కృతహస్తుఁ డఖిలాస్త్రవిద్యలందు । వీఁడె యగ్రగణ్యుఁడు ధర్మవిదులలోన,
వీఁడె భరతవంశం బెల్ల వెలుఁగఁ గుంతి । కడుపు చల్లఁగాఁ బుట్టిన ఘనభుజుండు. 19

ప్రతిపదార్థం: వీఁడె= ఇతడే; అఖిల+అస్త్ర, విద్యల+అందు= అన్ని అస్త్రవిద్యలలో; కృత, హస్తుఁడు= నేర్పరి; వీఁడె= ఇతడే; ధర్మ, విదులలోన= ధర్మం తెలిసినవారిలో; అగ్ర, గణ్యుఁడు= మొదట లెక్కించదగినవాడు; వీఁడె= ఇతడే; భరత, వంశంబు+ఎల్లన్= భరతునియొక్క వంశమంతా; వెలుఁగన్= ప్రకాశించగా; కుంతి, కడుపు, చల్లఁగాన్= కుంతీదేవికడుపు చల్లగా; పుట్టిన; ఘన, భుజుండు= గొప్పహస్తాలు గలవాడు.

తాత్పర్యం: ఇతడే (ఈ అర్జునుడే) అస్త్రవిద్యలన్నింటిలో నేర్పరి. ఇతడే ధర్మం తెలిసినవాళ్ళలో మొదట లెక్క పెట్ట తగినవాడు. ఇతడే భరతవంశానికంతటికీ కీర్తి వచ్చేటట్లు కుంతికడుపు చల్లగా పుట్టిన గొప్పభుజాలు కలవాడు.

విశేషం: రంగస్థలంలో ప్రవేశించిన వీరులందరిలో ప్రదర్శనకు పూర్వమే ప్రజల ప్రశంసలందుకొన్న వాడిగా అర్జునుని వర్ణనలో అతని అత్యధికవీరత్వం ధ్వనిస్తూ ఉన్నది.

క. అని పలుకుజనులపలుకులు । విని గొంతి యనంతహర్షవిస్తారితలో
చన యై నందను నృపనం । దనసంఘములోనఁ జూచి తద్దయుఁ బొంగెన్. 20

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పలుకు; జనుల పలుకులు విని; గొంతి= కుంతీదేవి; అనంత, హర్ష, విస్తారిత, లోచన+ఐ= అంతులేని ఆనందంచేత విప్పారిన నేత్రాలు కలదై; నందనున్= కుమారుడిని - అర్జునుడిని; నృప, నందన, సంఘములోనన్= రాజకుమారులయొక్క సమూహంలో; చూచి; తద్దయున్= మిక్కిలి; పొంగెన్= సంతోషించింది.

తాత్పర్యం: ఆ విధంగా పలికే జనులపలుకులు విని, కుంతీదేవి అంతులేనిఆనందంతో విప్పారినకళ్ళతో తన కుమారుడైన అర్జునుడిని రాకుమారులసమూహంలో చూచి ఎంతో సంతోషించింది.

క. చారుమనస్సమ్మదరస । పూరము వెలివేర్చునట్లు పొలఁతికి విగళ
ద్భూరిస్తనజనితపయో । ధారలు నానందబాష్పధారలు నొప్పెన్. 21

ప్రతిపదార్థం: చారు, మనస్+సమ్మద, రస, పూరము= చక్కనిమనస్సులోని సంతోషమనే జలప్రవాహం; వెలివేర్చున్+అట్లు= బయల్పడేట్లు; పొలఁతికిన్= స్త్రీకి - అంటే కుంతీదేవికి; విగళత్+భూరి, స్తన, జనిత, పయస్+ధారలున్= కారుతున్న పెద్ద పాలిండ్లనుండి పుట్టిన పాలధారలును; ఆనంద, బాష్ప, ధారలున్= ఆనందంవల్లవచ్చే కన్నీటిధారలును; ఒప్పెన్= అమరినాయి-తగువిధంగా ఏర్పడినాయి.

తాత్పర్యం: మనస్సులోని సంతోషజలప్రవాహం వెలుపలికి వచ్చినట్లు, కుంతీదేవిపాలిండ్లనుండి పాలధారలు, కన్నులనుండి ఆనందబాష్పధారలు బయటికి వచ్చాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. కొడుకు గొప్పతనాన్ని లోకమంతా మెచ్చుకుంటే ఓ మాతృమూర్తి హృదయం ఎంతగా పులకిస్తుందో ఈ పద్యంలో చూడవచ్చును. లోకులందరి ఆనందం ఒకవైపు, తల్లిపొందే ఆనందం మరొకవైపు వర్ణించి సామ్యపరిశీలనవలన కలిగే రమణీయభావచిత్రాన్ని పఠితకు నన్నయ అందించాడు. కుంతి ఉద్విగ్నప్రవృత్తికలదిగా చిత్రించబడింది. వత్సలభావాన్ని సాత్త్వికభావాలతో వ్యక్తంచేయటం అందుకు సాక్ష్యం. పాలిండ్లనుండి పాలధారలు, కన్నులనుండి కన్నీటిధారలు రావటం వాత్సల్యరసాన్ని వ్యంజింపచేసే మాతృసహజమైన సాత్త్వికభావాభివ్యక్తులు. (సంపా.)

వ. అయ్యర్జునుస్తుతివచనంబు లొక్కట జనసంఘంబువలన నెగసి వియత్తలవిదళనం బయిన నమ్మహాధ్వని విని యదరిపడి ధృతరాష్ట్రుం 'డిది యేమి రభసం?' బని విదురు నడిగిన నాతం డి ట్లనియె. 22

ప్రతిపదార్థం: ఆ+అర్జును, స్తుతివచనంబులు= ఆ అర్జునునిగూర్చిన పొగడ్తలు; ఒక్కట= ఒక్కమారుగ; జన, సంఘంబు వలనన్= జనసమూహంనుండి; ఎగసి= పైకి లేచి; వియత్+తల, విదళనంబు+అయినన్= ఆకాశప్రదేశాన్ని చీల్చేది కాగా; ఆ+మహా, ధ్వని= ఆ పెద్దశబ్దాన్ని; విని; అదరిపడి= భయపడి; ధృతరాష్ట్రుండు; ఇది; ఏమి, రభసంబు= ఇదేమి అలజడి; అని; విదురున్+అడిగినన్= విదురుడిని అడుగగా; ఆతండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ అర్జునుడినిగూర్చినపొగడ్తలు ఒక్కమారుగా జనసమూహంనుండి పైకి లేచి ఆకాశాన్ని బ్రద్దలు చేసేట్లు ఉండగా, ఆ మహాధ్వనిని విని ధృతరాష్ట్రుడు భయపడి 'ఇదేమి అలజడి' అని విదురుడిని అడిగాడు. విదురుడు అతనితో ఇట్లా అన్నాడు.

విశేషం: ధృతరాష్ట్రుడు ఆ మహాధ్వనిని విని, మొదట భయపడ్డాడు. ఇది 'ఫలానా' ధ్వని అని తెలిశాక సంతోషించాడు.

క. **భూరిభుజుం డర్జునుఁ డతి । శూరుఁడు దనయస్త్రవిద్యఁ జూపఁగ రంగ**
త్ప్రారంభుఁ డయిన నతని న । వారితముగఁ బొగడుజనరవం బిది యధిపా! **23**

ప్రతిపదార్థం: అధిపా= ఓ రాజా!; ఇది; భూరి, భుజుండు= పెద్దభుజాలు గలవాడు; అతి, శూరుఁడు= మిక్కిలి పరాక్రమవంతుడు - అయిన; అర్జునుఁడు; తన, అస్త్ర, విద్యన్; చూపఁగన్; రంగత్+ప్రారంభుఁడు+అయినన్= ప్రకాశిస్తున్న ప్రారంభం కలవాడు కాగా; అతనిన్= ఆ అర్జునుని; అవారితముగన్= అడ్డులేకుండగా; పొగడు= కొనియాడు; జన, రవంబు= జనులయొక్కశబ్దం.

తాత్పర్యం: ఓ రాజా! ఇది - గొప్పభుజాలు కలవాడు, మిక్కిలి పరాక్రమవంతుడు అయిన అర్జునుడు - తన అస్త్రవిద్యాప్రదర్శనను, శోభాయమానంగా ప్రారంభించగా, అతడిని ఎడతెరిపిలేకుండా ప్రశంసించే ప్రజల ధ్వని.

క. **అనవుడు ధృతరాష్ట్రుఁడు దన । మనమున సంతోషమంది మానుగ వీనుల్**
గనిన ఫల మిపుడు గంటిన్ । వినఁ గంటినిఁ బాండుసుతుల విద్యాశక్తుల్. **24**

ప్రతిపదార్థం: అనవుడు= అని విదురు డనగా; ధృతరాష్ట్రుఁడు; తన, మనమునన్= తనయొక్క మనస్సులో; సంతోషము+అంది= సంతోషాన్ని పొంది; మానుగన్= ఒప్పుగా; వీనుల్= చెవులు; కనిన= పొందిన; ఫలము; ఇప్పుడు; కంటిన్= పొందాను; పాండు, సుతుల, విద్యా, శక్తుల్= పాండురాజుకొడుకుల విద్యలలోని సామర్థ్యాలను; వినన్+కంటిని= వినగలిగాను.

తాత్పర్యం: అని విదురుడు చెప్పగా ధృతరాష్ట్రుడు, తన మనస్సులో సంతోషించి 'చెవులున్న ఫలాన్నిప్పుడు పొందాను; పాండుకుమారుల విద్యాశక్తులనుగూర్చి ఇప్పుడు వినగలిగాను' అన్నాడు.

క. **భూరినిజద్యుతితోడఁ బృ । థారణిసంభూతపాండవాగ్నిత్రితయం**
బారఁగ నస్మత్కులదురి । తోరుతరారణ్యదాహ మున్నతిఁ జేయున్. **25**

ప్రతిపదార్థం: పృథా+అరణి, సంభూత, పాండవ+అగ్ని, త్రితయంబు= కుంతి అనే అరణిలో పుట్టిన పాండవులనే అగ్నులు మూడు; భూరి, నిజ, ద్యుతి, తోడన్= గొప్పదైన తమకాంతితో; ఆరఁగన్= పూర్తిగా; అస్మత్+కుల, దురిత+ఉరుతర+అరణ్య, దాహము= నా వంశంయొక్క పాపమనే మిక్కిలి పెద్ద అరణ్యాన్ని కాల్చటం; ఉన్నతిన్= గొప్పగా; చేయున్= చేయగలవు.

తాత్పర్యం: కుంతి అనే అరణిలో పుట్టిన మూడుఅగ్నులూ (అంటే ధర్మరాజు, భీముడు, అర్జునుడు) తమ గొప్పకాంతితో నావంశంయొక్క పాపమనే పెద్దఅరణ్యాన్ని పూర్తిగా దహించివేయగలవు.

విశేషం: అలం: రూపకం. కుంతికి పుట్టిన ముగ్గురు కొడుకులు త్రేతాగ్నులనీ, ఆ ముగ్గురూ కురువంశంలో పుట్టిన పాప మనే అరణ్యాన్ని దహించివేస్తారనీ, అప్రయత్నంగా ధృతరాష్ట్రుడే అనటంలో - పాండవుల పరాక్రమంమాత్రమే కాక, వాళ్ళ

వ్యక్తిత్వాల పవిత్రత, అంతేకాక ముమ్ముందు మహాభారతసంగ్రామంలో ఈ ముగ్గురే కౌరవులను హతమారుస్తారన్న భావికథార్థం, 14వ పద్యంలోవలె వాచ్యంగా కాకుండా వ్యంగ్యరమణీయంగా ధ్వనిస్తున్నాయి.

అర్జునుండు తనయస్త్రవిద్యాకౌశలంబు సూపుట (సం.1-125-18)

వ. అని పొగడుచుండ నర్జునుం డాచార్యుననుమతంబున నస్త్రలాఘవవైచిత్ర్య ప్రకాశనపరుం డయి యెల్లవారును జూచుచుండ. 26

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పొగడుచున్+ఉండన్; అర్జునుండు; ఆచార్య+అనుమతంబునన్= ద్రోణాచార్యునియొక్క అనుమతితో; అస్త్ర, లాఘవ, వైచిత్ర్య, ప్రకాశన, పరుండు+అయి= అస్త్రవిద్యానైపుణ్యంలోని విచిత్రాన్ని (అనగా ఆశ్చర్యకరాలైన నానావిధ అస్త్ర విద్యా విన్యాసాలను) ప్రకటించటమే ప్రధానమైనదానినిగా కలవాడై; ఎల్లవారును= అందరును; చూచుచున్+ఉండన్= చూస్తుండగా.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు పొగడుతూ ఉండగా అర్జునుడు ద్రోణాచార్యుని అనుమతితో, మంత్రప్రధానాలైన గొప్పగొప్ప అస్త్రాలను ప్రయోగించే విద్యలోగల అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించటంలో ఆసక్తికలవాడై, అక్కడున్న వాళ్ళందరూ చూస్తూ ఉండగా....

సీ. ఆగ్నేయశరమున నతిభీకరాగ్నియు । వారుణాస్త్రమున దుర్వారజలము
ననిలబాణంబున నధికానిలంబును । మేఘాస్త్రమున మహామేఘచయముఁ
బుట్టించు మఱియును భూమిబాణంబున । భూప్రవిష్టుం డగు, భూరిఘోర
శైలబాణంబున శైలరూపము దాల్చు । వీరుఁ, డదృశ్యాస్త్రవిద్యపేర్మిఁ

తే. దా నదృశ్యదేహుం డగుఁ, దత్క్షణంబ । హ్రస్వుఁ డగు దీర్ఘుఁ డగు సూక్ష్ముఁ డగు రయంబు
తోడ రథమధ్యగతుఁ డగు ధూర్గతుండు । నగు మహీతలగతుఁ డగు నద్భుతముగ. 27

ప్రతిపదార్థం: వీరుఁడు= వీరుడైన అర్జునుడు; అద్భుతముగ= ఆశ్చర్యకరంగా; ఆగ్నేయశరమునన్= అగ్నిసంబంధమైన బాణంచేత; అతి, భీకర+అగ్నియు= మిక్కిలి భయంకరమైన నిప్పును; వరుణ+అస్త్రమునన్= వరుణసంబంధమైన అస్త్రంచేత; దుర్+వార, జలమున్= ఆపటానికి సాధ్యం కాని నీటిని; అనిలబాణంబునన్= వాయుసంబంధమైన బాణంచేత, అంటే వాయవ్యాస్త్రంచేత; అధిక+అనిలంబును= మిక్కిలిగాలిని; మేఘ+అస్త్రమునన్= మేఘసంబంధమైన అస్త్రంచేత; మహా, మేఘ, చయమున్= పెద్దమేఘాల సమూహాన్ని; పుట్టించున్; మఱియును= ఇంకా; భూమి, బాణంబునన్= భూబాణంచేత; భూ, ప్రవిష్టుండు+అగున్= భూమిలో ప్రవేశించినవాడౌతాడు; భూరి, ఘోర, శైల, బాణంబునన్= పెద్దది, భయంకరమైనది అయిన పర్వతబాణంచేత; శైల, రూపము= పర్వతరూపాన్ని; తాల్చున్= ధరిస్తాడు; అదృశ్య+అస్త్ర విద్య, పేర్మిన్= అగుపించకుండ చేసే అస్త్రవిద్యలోని అతిశయంచేత; తాను; అదృశ్య, దేహుండు+అగున్= అగుపించని దేహం కలవాడౌతాడు; తత్+క్షణంబు+అ= ఆ నిమిషాననే; హ్రస్వుఁడు, అగున్= పొట్టివాడవుతాడు; దీర్ఘుఁడు+అగున్= పొడవైనవాడవుతాడు; సూక్ష్ముఁడు+అగున్= సన్నని వాడవుతాడు; రయంబుతోడ= వేగంతో; రథ, మధ్య, గతుఁడు+అగున్= రథంయొక్క మధ్యానికి వెళ్ళినవాడౌతాడు; ధూర్గతుండున్+అగున్ = నొగలనడుమ ఉన్నవాడవుతాడు; మహీతల, గతుఁడు+అగున్= భూమిమీద ఉన్నవాడౌతాడు.

తాత్పర్యం: వీరుడైన అర్జునుడు అందరికీ ఆశ్చర్యం కలిగేటట్లు ఆగ్నేయాస్త్రంతో అతిభయంకరమైన అగ్నిని, వారుణాస్త్రంతో వారింప సాధ్యంగాని నీటిని, వాయువ్యాస్త్రంచేత విపరీతమైన గాలిని, మేఘాస్త్రంచేత మహామేఘ సమూహాన్ని పుట్టించాడు. అంతేకాక భౌమాస్త్రంచేత భూమిలో ప్రవేశించాడు. శైలాస్త్రంచేత పర్వతరూపాన్ని పొందాడు. అదృశ్యాస్త్రంచేత అగుపడకుండా పోయాడు. అప్పటికప్పుడు పొట్టివాడయ్యాడు; పొడుగువాడయ్యాడు; సన్ననివాడయ్యాడు; మహావేగంగా రథమధ్యంలోకి వెళ్ళాడు, వెంటనే నొగలపై కూర్చున్నాడు; నేలమీద నిలిచాడు.

వ. మఱియుం బాఱెడుసింహవ్యాఘ్రవరాహాదిమృగంబుల ముఖంబులం దొక్కొక్కయ మ్మేసినట్ల యేనేసి యమ్ము లతిలాఘవంబున నేసియు, రజ్జుసమాలంబితం బయిన గోశృంగంబునం దేకవింశతిశరంబులు వరుసన నాట నేసియు, ని ట్లస్త్రవిద్యావైచిత్ర్యంబు మెఱసి గదాఖడ్గాదివివిధాయుధదక్షతం జూపి యర్జునుండు జనుల కాశ్చర్యంబు సేయుచున్నంతఁ, గర్ణుండును నిజవిద్యాకౌశలంబు మెఱయ సమకట్టి రంగద్వారంబున నిలిచి భుజాస్ఫాలనంబు సేసిన. 28

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; పాఱెడు, సింహ, వ్యాఘ్ర, వరాహ+ఆది, మృగంబుల, ముఖంబుల+అందు= పరుగెత్తుతున్న సింహం, పెద్దపులి, పంది మొదలయిన జంతువులయొక్క నోళ్ళలో; ఒక్కొక్క; అమ్ము+ఏసినట్లు+అ= బాణాన్ని వేసినవిధంగా; ఏనేసి, అమ్ములు= ఐదేసిబాణాలు; అతిలాఘవంబునన్= మిక్కిలిసులువుగా; ఏసియున్= వేసినతర్వాత; రజ్జు, సమ్+ ఆలంబితంబు+అయిన= త్రాటికి చక్కగా వేలాడగట్టబడిన; గో, శృంగంబు+అందు= ఆవుకొమ్మునందు; ఏకవింశతి, శరంబులు= ఇరవైఒక్కబాణాలు; వరుసన, నాటన్+ఏసియున్= నాటుకొనేటట్లు; వేసి; ఇట్లు+అస్త్ర, విద్యా, వైచిత్ర్యంబు= ఈవిధంగా అస్త్రవిద్యలోని విచిత్రతను - అంటే అస్త్రవిద్యలోని ఆశ్చర్యకరమైన తన నైపుణ్యాన్ని; మెఱసి= ప్రదర్శించి; గదా, ఖడ్గ+ఆది, వివిధ+ఆయుధ, దక్షతన్= గద, కత్తి మొదలయిన పలువిధాల ఆయుధాలలోని నేర్పును; చూపి; అర్జునుండు; జనులకు+ ఆశ్చర్యంబు+ చేయుచున్+ఉన్న+అంతన్= ప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుండగా; కర్ణుండును= కర్ణుడుకూడా; నిజ, విద్యా, కౌశలంబు= తనయొక్క విద్యలోని నేర్పును; మెఱయన్= ప్రదర్శించుటకు; సమకట్టి= పూనుకొని; రంగ, ద్వారంబునన్; నిలిచి; భుజా+ఆస్ఫాలనంబు= భుజం చరచటాన్ని; చేసినన్= చేయగా.

తాత్పర్యం: అంతేకాక పరుగెత్తుతున్న సింహం, పెద్దపులి, పంది మొదలయిన మృగాలనోళ్ళలో ఒక్కొక్క బాణాన్ని వేసినట్లు ఐదేసిబాణాలను అతిసులభంగా వేసి, తర్వాత త్రాటికి వేలాడగట్టబడిన ఆవుకొమ్మున నాటుకొనేటట్లు వరుసగా ఇరవయ్యొక్క బాణాలను వేశాడు. ఈ విధంగా తన అస్త్రవిద్యావిచిత్రాలను ప్రదర్శించి, గద, కత్తి మొదలయిన అనేకవిధాలైన ఆయుధవిద్యల్లో తనకున్న నైపుణ్యాన్ని చూపి జనులను ఆశ్చర్యపరవశులను చేస్తుండగా; కర్ణుడు తన విద్యానైపుణ్యాన్ని ప్రదర్శింప పూనుకొని రంగద్వారంలో నిలిచి భుజం చరచగా.

విశేషం: రంగస్థలంలో పరుగెత్తే సింహాలకు, పెద్దపులులకు ప్రసక్తి ఎట్లని కొంతకు కొంత సందేహం కలగటం సహజం. రంగస్థలం సువిశాలమైన భద్రతకు తగిన ఏర్పాట్లు చేసినప్పుడు ఆయామృగాలను ప్రవేశపెట్టటం అసాధ్యం కాదు. కాని అవి లోహమయాలైన కృత్రిమజంతువులు అనే సూచన కొన్ని సంస్కృత భారత పాఠాలలో ఉన్నట్లు మహాభారత సంశోధితప్రతిలో పేర్కొనటం జరిగింది. "భ్రమతశ్చ వరాహస్య లౌహస్యప్రముఖే సమమ్ పంచబాణానసంసక్తా సమ్ముమో చైకబాణవత్." 'లౌహస్య' అనటానికి 'భ్రమరస్య, కామస్య, సింహస్య' అనే పాఠాలుకూడా ఉన్నాయి''. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.328.

మ. జనులెల్లం గడుసంభ్రమింపఁగ నజస్రంబై భుజాస్ఫాలన
ధ్వని శైలప్రకరంబుపైఁ బడు మహాదంభోళిశబ్దంబొకో
యన వీతెంచినఁ బాండవుల్ సనిరి ద్రోణాచార్యు డాయన్, సుయో
ధను వేష్టించిరి తమ్ము లందఱును దద్ద్వారంబు వీక్షించుచున్. 29

ప్రతిపదార్థం: జనులు+ఎల్లన్= ప్రజలందరు; కడున్= మిక్కిలి; సంభ్రమింపఁగన్= భయపడగా; అజస్రంబు+ఐ= ఎడతెరపిలేనిదై; భుజా+ఆస్ఫాలధ్వని= భుజం చరచటంవలన కలిగినశబ్దం; శైల, ప్రకరంబు, పైన్= కొండల సమూహం మీద; పడు= పడుతూఉన్న; మహా, దంభోళి, శబ్దంబు+ఒకో= గొప్పవజ్రాయుధంయొక్కశబ్దమా; అనన్= అనేటట్లు; వీతెంచినన్= రాగా; పాండవులు; ద్రోణాచార్యు డాయన్= ద్రోణాచార్యుణ్ణి సమీపించటానికి; చనిరి= వెళ్ళారు; తమ్ములు+అందరును= (దుర్యోధనుడి) తమ్ములందరు; తద్+ద్వారంబు= ఆ వాకిలిని - అంటే ఆ శబ్దం వచ్చినవాకిలిని; వీక్షించుచున్= చూస్తూ; సుయోధనున్, వేష్టించిరి= దుర్యోధనుని చుట్టూ చేరారు.

తాత్పర్యం: ప్రజలంతా ఎంతో భయపడి ఎడతెరిపిలేనిదై భుజం చరచటంవలన పుట్టిన ఆ శబ్దం, పర్వత సమూహంపై పడే మహావజ్రాయుధశబ్దమా అనేటట్లు రాగా, పాండవులు ద్రోణాచార్యునిదగ్గరకు చేరారు. దుర్యోధనుని తమ్ముళ్లందరూ శబ్దం వచ్చిన ఆ వాకిలివైపు చూస్తూ దుర్యోధనునిచుట్టూ చేరారు.

విశేషం: ఆ ధ్వనితీవ్రత కర్ణునిహృదయబాధాతీవ్రతను చక్కగా ధ్వనింపచేస్తున్నది.

వ. అంత. 30

తాత్పర్యం: అప్పుడు.

కర్ణుఁడు ప్రవేశించి అర్జును నధిక్షేపించుట (సం. 1-126-2)

శా. సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్వత్కుండలోద్భాసితున్
బాలార్క ప్రతిమున్ శరాసనధరున్ బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణవర్ణు ఘనుఁ గర్ణాఖ్యున్ జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణుఁ జూచి చూపఱు ప్రభూతాశ్చర్యులై రచ్చటన్. 31

ప్రతిపదార్థం: అచ్చటన్= అక్కడ; సాల, ప్రాంశున్= మద్దిచెట్టువలె పొడవైనవాడిని; నిజ+ఉత్+జ్వలత్+కవచున్= సహజమై మిక్కిలి ప్రకాశిస్తున్న కవచం గలవాడిని; శశ్వత్+కుండల+ఉద్భాసితున్= శాశ్వతాలయిన కుండలాలతో గొప్పగా వెలుగుతున్నవాడిని; బాల+అర్క, ప్రతిమున్= బాలసూర్యునిపోలినవాడిని; శర+ఆసన, ధరున్= ధనుస్సును ధరించినవాడిని; బద్ధ+ఉగ్ర, నిస్త్రింశున్= కట్టబడిన భయంకరమైన ఖడ్గం కలవాడిని; శౌర్య+అలంకారున్= శౌర్యమే అలంకారంగా కలవాడిని; సువర్ణ, వర్ణున్= బంగారువన్నెకలవాడిని; ఘనున్= గొప్పవాడిని; జగత్+కర్ణ, పూర్ణ+ఆలోలత్+గుణున్= లోకంయొక్క చెవులలో నిండి, వ్యాపిస్తున్న గుణాలు కలవాడిని; కర్ణ+ఆఖ్యున్= కర్ణుడనేపేరు కలవాడిని; చూచి, చూపఱు= చూచేవారు; ప్రభూత+ఆశ్చర్యులు+ఐరి= మిక్కిలి ఆశ్చర్యం కలవాళ్ళయ్యారు.

తాత్పర్యం: మద్దిచెట్టువలె ఎంతో ఎత్తైనవాడు, సహజకవచకుండలాలతో చాలా ఎక్కువగా ప్రకాశించేవాడు, బాలసూర్యుడిని పోలినవాడు, ధనుస్సును ధరించినవాడు, మొలలో భయంకరమైన కత్తిని కట్టుకొన్నవాడు, శౌర్యమే

అలంకారంగా కలవాడు, బంగారువన్నెవాడు, గొప్పవాడు, లోకం చెవులలో నిండి వ్యాపిస్తున్న మంచిగుణాలు కలవాడు అయిన కర్ణుడిని చూచి ప్రేక్షకులంతా ఎంతో ఆశ్చర్యపడ్డారు.

విశేషం: మహాభారతంలో ఇది ఒక ప్రసిద్ధ పద్యం; నన్నయనాటకీయరచనకు పతాకవంటిపద్యం. హస్తినాపురరంగమధ్యంలో ప్రేక్షకులు చూచిన కర్ణునిమహనీయవ్యక్తిత్వాన్ని, దీప్తిని, విజృంభణాన్ని పాఠకుల కంటికి కట్టినట్లు వ్రాసిన ఛాయాచిత్రంవంటి పద్యం. ఇందులోని ఉదాత్తమనోహరశైలి, శార్దూలవృత్తం కర్ణుని ఔన్నత్యవిజృంభణలకు చక్కని ఉద్దీపకాలు. నన్నయ ప్రసన్నకథాకవితలో స్థిరచిత్రవర్ణనశిల్పానికి ఈ పద్యం ఒక మచ్చుతునక. 17వ పద్యంలోని అర్జునునివర్ణనకు ఇది దీటుగా నిలుస్తుంది. ప్రసాదమిశ్రితమైన ఓజోగుణం ఈ పద్యరచనలోని విభావవిస్ఫోరకంగా రాణిస్తున్నది.

వ. కర్ణుండును జనుల నందఱ నదల్చి చొత్తెంచి, రంగమధ్యంబున నిలిచి, కలయం జూచి, కృపద్రోణాచార్యులకు నమస్కరించి, సజలజలధరధ్వానగంభీరవచనంబుల నర్జును నాక్షేపించి యి ట్లనియె. 32

ప్రతిపదార్థం: కర్ణుండును= కర్ణుడుకూడా; జనులన్+అందరన్= ప్రజలను అందరినీ; అదల్చి= బెదిరి తొలగిపోయేటట్లు చేసి; చొచ్చు+తెంచి= ప్రవేశించి; రంగమధ్యంబునన్= రంగమధ్యంలో; నిలిచి= నిలబడి; కలయన్+చూచి= అంతటా చూచి; కృప, ద్రోణ+ఆచార్యులకున్; నమస్కరించి; సజల, జలధర, ధ్వాన, గంభీర, వచనంబులన్= నీటితో కూడిన మేఘంయొక్క ఉరుములవలె గంభీరాలైన మాటలచేత; అర్జునున్= అర్జునుణ్ణి; ఆక్షేపించి= అడ్డగించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కర్ణుడుకూడా ప్రజలంతా బెదిరి తొలగిపోయేటట్లు చేసి ప్రవేశించి, రంగమధ్యంలో నిలిచి, అంతటా కలయ చూచి కృపద్రోణాచార్యులకు నమస్కరించి, నీటితో కూడిన మేఘం ఉరిమినట్లు గంభీరంగా మాట్లాడుతూ అర్జునుడిని అడ్డగించి ఈ విధంగా అన్నాడు.

విశేషం: ఇది కర్ణునిచలద్రూపవర్ణన; నన్నయనాటకీయరచన, కర్ణుడు జనులందరిని అదల్చి ప్రవేశించటం, రంగమధ్యంలో నిల్చి కలయచూడటం, కృపద్రోణాచార్యులకు నమస్కరించటం, అర్జునునికి అడ్డంగా నిలబడి గంభీరస్వరంతో మాట్లాడటం - భావుకుడైన పాఠకుడు చలనచిత్రంలోవలె ఈ వచనంలో దర్శించవచ్చును.

క. నీవ కడునేర్పుకాఁడవు। గా వలవదు; వీనిఁ గొన్ని గఱచితి మేమున్
నీవిద్యలెల్లఁ జూపుదు। మే వీరుల సూచి మేలుమే లని పొగడన్. 33

ప్రతిపదార్థం: నీవు+అ= నీవే; కడున్= మిక్కిలి; నేర్పుకాఁడవు= నేర్చినవాడివి; కావలవదు= కానక్కరలేదు; ఏమున్= మేము కూడ; వీనిన్= ఈ విద్యలను; కొన్ని= కొన్నింటిని; కఱచితిమి= నేర్చుకొన్నాము; నీ, విద్యలు+ఎల్లన్= నీవు చూపించిన విద్య లన్నింటిని; వీరులు+అ= వీరులైనవారే; చూచి; మేలు; మేలు; అని; పొగడన్= కొనియాడగా; చూపుదుము+ఎ= చూపుతాంకదా!

తాత్పర్యం: నీవే పెద్దనేర్పరి కానక్కరలేదు. మేముగూడా ఈ విద్యలు కొన్ని నేర్చి ఉన్నాం. నీవు చూపిన అన్ని విద్యలు - ఈ సామాన్యజనులు కాదు - వీరులైనవాళ్ళుకూడా చూచి మేలు మే లని పొగడేటట్లు చూపుతాం గదా!

విశేషం: ఇది నన్నయనాటకీయసంభాషణ, కర్ణునిస్వభావానికి అద్దంపట్టే సంభాషణ. స్వాతిశయంవైపు మొగ్గుతున్న అతని ఆత్మవిశ్వాసాన్ని, అర్జునమాత్సర్యంవైపు మొగ్గుతున్న అతనివిద్యాస్పర్ధను ధ్వనింపజేయటం ఇందులో చూడవచ్చు. అధిక్షేపోక్తికి ఇదొక చక్కని ఉదాహరణం.

క. అనిన నినతనయుపలుకులు । జనులకు విస్మయము, సవ్యసాచికిఁ గోపం
బును సిగ్గును, మఱి దుర్యో । ధనునకుఁ బ్రీతియును జేసెఁ దత్క్షణమాత్రన్. 34

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఇన, తనయు, పలుకులు= సూర్యునికుమారుడైన కర్ణునిమాటలు; జనులకు; విస్మయము= ఆశ్చర్యాన్ని; సవ్యసాచికిన్= అర్జునునికి; కోపంబును= కోపాన్ని; సిగ్గును; మఱి= మరియు; దుర్యోధనునకున్; ప్రీతియును= సంతోషాన్నీ; తద్+క్షణ, మాత్రన్= ఆ నిమిషంలోనే; చేసెన్= కలుగజేశాయి.

తాత్పర్యం: కర్ణునిమాటలు ఆ క్షణాన ప్రజలకు ఆశ్చర్యాన్నీ, అర్జునునికి కోపాన్నీ, సిగ్గునూ, దుర్యోధనునికి సంతోషాన్నీ కలిగించాయి.

విశేషం: అలం: ఉల్లేఖం; చూపరులకు కర్ణుని భుజస్ఫాలనం భయాన్నీ, ఆకారం అద్భుతాన్నీ కలిగించాయి. అనుకోని విధంగా అతడు అర్జునుణ్ణి ధిక్కరించి పలికిన మాటలు వివిధవ్యక్తులకు వివిధభావాలు కలిగించాయి. ప్రజలకు అసంభవమైనది సంభవమైనట్లు ఆశ్చర్యం కలిగించాయి. తనకు ఎవ్వరూ సాటిలేరని అనుకొంటున్న అర్జునునికి కోపాన్నీ, సిగ్గునూ కలిగించాయి. పాండవమధ్యమునితో దీటైన వీరుడు తనవైపు లేడని నిరాశతో ఉన్న దుర్యోధనునికి సంతోషాన్ని కలిగించాయి.

వ. అంత ద్రోణుచేత ననుజ్ఞాతుం డయి కర్ణుం డర్జునుచూపిన యస్త్రవిద్యావిశేషంబులెల్ల నశ్రమంబునఁ జూపినఁ జూచి, దుర్యోధనుండు దానుం దమ్ములును గర్ణునిం గౌఁగిలించుకొని 'నాతో బద్ధసఖ్యుండ వయి నాకును బాంధవులకును హితంబు సేసి నారాజ్యభోగంబులను నీవును నుపయోగింపు' మనిన 'నట్ల చేయుదు' నని కర్ణుం డాతనితోడి యిష్టసఖిత్వంబున కొడంబడి, 'యిమ్మూఁగిన రాజలోకంబును నీవును జూడఁ బార్థుతో ద్వంద్వయుద్ధంబు చేయవలయు' ననిన ధార్తరాష్ట్రమధ్యంబున నున్న యక్కర్ణుం జూచి పార్థుం డి ట్లనియె. 35

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ద్రోణునిచేతన్; అనుజ్ఞాతుండు+అయి= అనుమతింపబడినవాడై; కర్ణుండు; అర్జునుడు, చూపిన= అర్జునుడు ప్రదర్శించిన; అస్త్ర, విద్యా, విశేషంబులు+ఎల్లన్= అస్త్రవిద్యలోని ప్రత్యేకతలన్నింటిని; అశ్రమంబునన్= శ్రమలేకుండ - సులభంగా; చూపినన్= చూపగా; చూచి; దుర్యోధనుండు; తానున్= తానునూ; తమ్ములును= తమ్ములున్నూ; కర్ణునిన్; కౌఁగిలించుకొని; నాతో (దుర్యోధనుడితో); బద్ధసఖ్యుండవు+అయి= కట్టబడినస్నేహం కలవాడివై; నాకును; బాంధవులకును= చుట్టాలకూ; హితంబు+చేసి= మేలుచేసి; నా, రాజ్యభోగంబులను; నీవును= నీవు కూడా; ఉపయోగింపుము= వినియోగించుకొమ్ము; అనినన్= అని అనగా; అట్లు+అ= అట్లే; చేయుదును= చేస్తాను; అని= ఆ విధంగా; కర్ణుండు; అతనితోడన్= దుర్యోధనునితో; ఇష్టసఖిత్వంబునకు= ఇష్టమైన స్నేహానికి; ఒడంబడి= ఒప్పుకొని; ఈ+మూగిన, రాజ, లోకంబును= ఈ చేరిన రాజుల సమూహమూ; నీవును= నీవూ; చూడన్= చూస్తుండగా; పార్థుతో= అర్జునునితో; ద్వంద్వ, యుద్ధంబు= జతగా పోరాడేయుద్ధం; చేయవలయున్= చేయాలి; అనినన్= అనగా; ధార్తరాష్ట్ర, మధ్యంబునన్+ఉన్న= ధృతరాష్ట్రునికుమారులైన కౌరవులమధ్యన ఉండే; ఆ+కర్ణున్; చూచి; పార్థుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు ద్రోణుడు అనుమతించగా కర్ణుడు, అర్జునుడు చూపిన అస్త్రవిద్యావిశేషాలన్నీ అతి సులభంగా చూపాడు. అది చూచి దుర్యోధనుడు - తాను, తమ్ములు కర్ణుణ్ణి కౌగలించుకొని, 'నాతో చెలిమి చేసి నాకు, బంధువులకు మేలు కూర్చి, నా రాజ్యభోగాలు నీవుగూడా అనుభవించు' మని అన్నాడు. కర్ణుడు అట్లే అని అతనితో స్నేహంచేయటానికి సమ్మతించి, 'ఇక్కడ చేరిన ఈ రాజసమూహం, నీవూ చూస్తుండగా అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయా' లని అన్నాడు. అప్పుడు కౌరవులమధ్యనున్న ఆ కర్ణుడిని చూచి అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: 'నా రాజ్యభోగంబులను నీవు నుపయోగింపుము' - అనే దానికి 'నన్నుం గురురాజ్యం బేలించి నా యైశ్వర్యంబు...' అనే పాఠాంతరం కొన్నిప్రతులలో ఉన్నది. మూలం: అహం చ కురురాష్ట్రం చ యథేచ్ఛ ముపభుజ్యతామ్ (పి.పి.యస్. ప్రతి, పుట. 850) - శ్రీమదాంధ్రమహాభారతసంశోధిత ప్రతి, పుట. 330.

క. పిలువంగఁబడక సభలకు । బలిమిం జని పలుకు పాపభాగుల లోకం
బులకుఁ జన వేఁడి పలికెదు । పలువ! యెఱుంగవు పరాత్మపరిమాణంబుల్. **36**

ప్రతిపదార్థం: పిలువంగన్+పడక= పిలువబడకుండ - ఆహ్వానం లేకుండా; సభలకున్= సభలకు; బలిమిన్= బలంతో; చని=వెళ్ళి; పలుకు= మాట్లాడే; పాప, భాగుల, లోకంబులకున్= పాపం పొందినవాళ్ళలోకాలకు, చనన్= వెళ్ళటానికి, వేఁడి= కోరి; పలికెదు= మాటాడుతున్నావు; పలువ= దుర్మార్గుడా; పర+ఆత్మ, పరిమాణంబుల్= ఎదుటివాళ్ళయొక్క, నీయొక్క కొలదులు; ఎఱుంగవు= తెలియవు.

తాత్పర్యం: పిలుపు లేకుండానే సభలకు బలగర్వంతో వెళ్ళి, నోటికివచ్చినట్లు మాట్లాడే పాపాత్ములు వెళ్ళే లోకాలకు (నరకాలకు) పోవాలనుకొని మాట్లాడుతున్నావు. దుర్మార్గుడా! నీవు ఎదుటివాళ్ళకొలది, నీ కొలది తెలియనివాడవు.

క. అనిన విని పార్థునకు ని । ట్లనియె నినాత్మజుఁడు 'దుర్బలాశ్వాసక్షే
పనిబంధమ్ములు వలుకక । ఘననిశితాస్త్రములఁ బలుకఁ గడఁగుము నాతోన్'. **37**

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ఇన+ఆత్మజుఁడు= సూర్యునియొక్క కుమారుడైన కర్ణుడు; పార్థునకున్= అర్జునునితో; ఇట్లు+అనియెన్; నాతోన్=నాతో; దుర్+బల+ఆశ్వాస, క్షేప, నిబంధమ్ములు= బలహీనులను ఊరడించటంకోసం కాలంపుచ్చే మాటలు; పలుకక; ఘన, నిశిత+అస్త్రములన్= గొప్ప వాడియైన బాణాలతో; పలుకన్= పలకటానికి; కడఁగుము= ప్రయత్నించుము.

తాత్పర్యం: అర్జునునిమాటలు విని కర్ణుడు - 'బలహీనులను ఊరడించటానికి చెప్పేమాటలు మాని, గొప్ప పదునైనబాణాలతో మాట్లాడుము' అని పలికాడు.

విశేషం: దుర్బలాశ్వాసక్షేపనిబంధమ్ములు - అనే దానికి మూలం: "సంక్షేపైః దుర్బలాశ్వాసైః శరైః కథయ భారత" - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట 330. 'చేతకానివారికి సంతోషం కలిగించే పొల్లుమాటలు కట్టిపెట్టి, వాడిబాణాలతో సమాధానం చెప్పుము' - అని పలికిన కర్ణునివాక్యంలో అత్యంతతిరస్కృతవాచ్యధ్వని ఉన్నది. బాణాలతో పలకటం - అనేది లక్ష్యార్థవిశేషం. 'అర్జునా! నీవలె నేను వాచాశూరుడిని కాదు. కార్యశూరుడిని. మాటలతో కాలం వ్యర్థం చేయక చేతనైతే యుద్ధం చేయుము' అన్నది కర్ణుని అధిక్షేపం.

క. ఈ రంగభూమి యస్త్రవి । శారదు లగువారి కెల్ల సామాన్యముగా
కారయ వీరికిఁ జొర నగు । వీరికిఁ గా దను విచారవిషయము గలదే?. **38**

ప్రతిపదార్థం: ఆరయన్= విచారిస్తే; ఈ, రంగ, భూమి; అస్త్ర, విశారదులు+అగు, వారికి+ఎల్లన్= అస్త్రాలలో నేర్పరులైనవారి కందరికి; సామాన్యము, కాక= సమానం కాకుండా; వీరికిన్= వీళ్ళకు; చొరన్+అగున్= ప్రవేశించవచ్చు; వీరికిన్= వీళ్ళకు; కాదు+అను= ప్రవేశించకూడదనే; విచార, విషయము= ఆలోచించదగిన అంశం; కలదే= ఉన్నదా?

తాత్పర్యం: విచారించి చూస్తే ఈ రంగభూమి అస్త్రవిద్యావేత్తలందరికి సమానం గాకుండా - వీళ్ళకు ప్రవేశం ఉన్నది, వీళ్ళకు ప్రవేశం లేదు అని విచారించవలసింది ఏమైనా ఉన్నదా?

వ. అని గర్వించి దుర్యోధనానుమతంబునఁ బార్థుతో ద్వంద్వయుద్ధంబు సేయంబూని రణసన్నద్ధుం డయి రవితనయుండు రంగమధ్యంబున నున్నంత, నర్జునుండును నాచార్యభ్రాతృచోదితుం డై యుగాంత కాలానలుండునుంబోలెఁ బ్రతిఘటించి నిలిచిన. 39

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; గర్వించి= పొగరుతోకూడి; దుర్యోధన+అనుమతంబునన్= దుర్యోధనునియొక్క అనుమతితో; పార్థుతో= అర్జునునితో; ద్వంద్వయుద్ధంబు= ఇద్దరు ఒకరితో ఒకరు చేసేయుద్ధం; చేయన్= చేయటానికి; పూని= ప్రయత్నించి; రణ, సన్నద్ధుండు+అయి= యుద్ధంకోసం బాగా సిద్ధమైనవాడై; రవి, తనయుండు= సూర్యునియొక్క కుమారుడైన కర్ణుడు; రంగమధ్యంబునన్= రంగమధ్యంలో; ఉన్న+అంతన్= ఉండిన సమయంలో; అర్జునుండును=అర్జునుడు కూడా; ఆచార్య, భ్రాతృ, చోదితుండు+ఐ= గురువులచేత, సోదరులచేత పురికొల్పబడినవాడై; యుగ+అంత; కాల+అనలుండునున్, పోలెన్= ప్రళయకాలంలోని అగ్నివలె; ప్రతిఘటించి=ఎదిరించి; నిలిచినన్= నిలువగా.

తాత్పర్యం: అని కర్ణుడు గర్వపడి దుర్యోధనుని అనుమతితో - అర్జునునితో ద్వంద్వయుద్ధం చేయటానికై సిద్ధమై రంగమధ్యంలో ఉండగా, గురువులచేత, సోదరులచేత ప్రేరేపింపబడినవాడై అర్జునుడు ప్రళయకాలాగ్నివలె ఎదిరించి నిలువగా.

విశేషం: కర్ణుడు రంగప్రవేశం చేయగానే కురుకుమారులు రెండు వర్గాలుగా చీలిపోవటం కళ్ళకు కట్టినట్లు అందరికి అగుపించింది. కర్ణునికి మిత్రుడు, గురువు, దైవం అన్నీ దుర్యోధనుడే. అర్జునునికి గురువులు, సోదరులు మార్గదర్శకులు. పాండవులకు పెద్దలున్నారు. దుర్యోధనుడు తనకు తానే పెద్ద. అర్జునునిది ధర్మనిర్ణయం. కర్ణునిది, దుర్యోధనునిది స్వయంనిర్ణయం. ఇక ముందు కథలో ఈధోరణి ఇంతే! భావికురుకుమారవిభేదక్రమానికి ఇది నాంది.

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము (సం.1-126-23)

మ. జనితామర్షణుఁ డంతఁ బార్థుపయిఁ బర్జన్యాస్త్ర మక్కర్ణుఁ డే
సె; నపారం బయి భూనభోంతరముఁ దజ్జీమూతయూథంబు గ
ప్పినఁ దద్ధ్వాంతతిరోహితాపఘనుఁ డై బీభత్సుఁ డుండెన్; విరో
చనుఁ డాత్మద్యుతి విస్తరించె సుతుపై సంప్రీతచేతస్కుఁ డై. 40

ప్రతిపదార్థం: జనిత+అమర్షణుఁడు= పుట్టబడినకోపం గలవాడు; ఆ+కర్ణుఁడు; అంతన్= అప్పుడు; పార్థు, పయిన్= అర్జునునిమీద; పర్జన్య+అస్త్రము= మేఘాస్త్రాన్ని; ఏసెన్= వేశాడు; తత్+జీమూత, యూథంబు= దానియొక్కమేఘాలసమూహం; అపారంబు+అయి= హద్దు లేనిదై; భూ, నభస్+అంతరమున్= భూమ్యాకాశాల మధ్యప్రదేశాన్ని; కప్పినన్= కప్పివేయగా; బీభత్సుఁడు= అర్జునుడు; తద్+ధ్వాంత, తిరోహిత+అపఘనుఁడు+ఐ= ఆ చీకటిచేత మరుగుపడినదేహం కలవాడై; ఉండెన్; విరోచనుఁడు= సూర్యుడు; సంప్రీత, చేతస్కుఁడు+ఐ= మిక్కిలి ఆనందించిన మనస్సు కలవాడై; ఆత్మ, ద్యుతిన్= తన యొక్కకాంతిని; సుతుపైన్= కుమారుని (కర్ణుడి) మీద; విస్తరించెన్= ప్రసరించాడు.

తాత్పర్యం: కర్ణుడు కోపంతో అర్జునునిమీద మేఘాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతులేని మేఘసమూహం భూమ్యాకాశమధ్యప్రదేశాన్ని కప్పివేయగా అర్జునుడు ఆ చీకటిలో మరుగుపడిపోయాడు. సూర్యుడు సంతోషించి కుమారుడైన కర్ణునిమీద తనకాంతిని ప్రసరించాడు.

విశేషం: 'తద్ధ్వాంత తిరోహితాపఘనుడై బీభత్సు డుండెన్' - అనేదానికి - తద్ధ్వాంతము వాయ వాయుశరముం బీభత్సు డేసెన్ - అనే పాఠాంతరమున్నది. మూలం: మేఘచ్ఛాయోపగూఢస్తు తతోఽదృశ్యత పాండవః । సూర్యాతప పరిష్వక్తః కర్ణోఽపి సమదృశ్యత. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.331.

వ. అయ్యవసరంబున దుర్యోధనుండొట్టి ధృతరాష్ట్రనందను లందఱుఁ గర్ణువలన నుండిరి; భీష్మద్రోణకృప పాండవులు పార్థువలన నుండి రంత. 41

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; దుర్యోధనున్+తొట్టి= దుర్యోధనుడు మొదలుకొని; ధృతరాష్ట్రనందనులు+ అందఱున్= కౌరవులందరూ; కర్ణువలనన్= కర్ణునివైపు; ఉండిరి; భీష్మ, ద్రోణ, కృప, పాండవులు; పార్థువలనన్= అర్జునునివైపు; ఉండిరి; అంతన్= అటుపై.

తాత్పర్యం: ఆ సమయంలో ఒకవైపు దుర్యోధనుడుమొదలు ధృతరాష్ట్రునికొడుకులంతా కర్ణునిపక్షంలో నిలిచారు. మరొకవైపు భీష్ముడు, ద్రోణుడు, పాండవులు అర్జునునిపక్షంలో నిలిచారు. అప్పుడు.

క. రవిసుతపార్థులఘోరా । హవమునకును వెఱచుచున్నయది కుంతి తదు
ద్భవఘనతరశరతిమిరౌ । ఘవృతాంగుఁ దనూజుఁ జూడఁ గానక వంతన్. 42

ప్రతిపదార్థం: రవిసుత, పార్థుల, ఘోర+ఆహవమునకును= కర్ణార్జునులయొక్క భయంకరమైన యుద్ధానికి; వెఱచుచున్+ఉన్న, అది, కుంతి= భయపడుతూన్న కుంతీదేవి; తత్+ఉద్భవ, ఘనతర, శర, తిమిర+ఓఘ, వృత+అంగున్= దానినుండి పుట్టిన చాలాగొప్పదైన బాణంవలన కలిగిన చీకట్ల సమూహంచేత కప్పబడిన దేహం గలవాడిని; తనూజున్= కుమారుడిని, అర్జునుని; చూడన్+కానకన్= చూడలేక; వంతన్= దిగులుతో.

తాత్పర్యం: కర్ణార్జునులద్వంద్వయుద్ధం చూచి భయపడుతూన్న కుంతి, కర్ణునిపర్జన్యాస్త్రం (మేఘాస్త్రం) వలన కలిగినచీకట్లసమూహంచేత కప్పబడి, అర్జునుడు అగుపించకపోగా అప్పుడు.

క. ధృతి దఱిఁగి మోహమూర్ఛా । న్విత యైనను సంభ్రమించి విదురుఁడు ప్రత్యా
గతజీవఁ జేసె నప్పడ । యతిశీతలచందనోదకాసేకమునన్. 43

ప్రతిపదార్థం: ధృతి= ధైర్యం; తఱిఁగి= తగ్గి; మోహ, మూర్ఛా+అన్విత+ఐనను= మోహంవలన, మూర్ఛతో కూడుకొన్నది కాగా; విదురుడు; సంభ్రమించి= త్వరపడి; అప్పుడు+అ= అప్పటికప్పుడే; అతి శీతల, చందన+ఉదక+ఆసేకమునన్= మిక్కిలి చల్లని గంధపునీళ్లను చల్లటంచేత; ప్రతి+ఆగత, జీవన్= మరలివచ్చిన ప్రాణం గలదాన్నిగా; చేసెన్.

తాత్పర్యం: ధైర్యం తగ్గి, మోహంతో కుంతీదేవి మూర్ఛిల్లగా, విదురుడు వెంటనే చల్లనిగంధపునీళ్లను చల్లి ఆమెకు ప్రాణం మళ్ళీ వచ్చేటట్లు చేశాడు.

విశేషం: కుంతీదేవి పుత్రవాత్సల్యాన్ని వ్యక్తంచేయటంలో ప్రదర్శించే ఉద్విగ్నప్రవృత్తిని ఈ సన్నివేశం మరొకసారి ధ్వనింప చేస్తున్నది. మూర్ఛ అన్నది సాత్త్వికభావంవంటిది. వాత్సల్యం హర్షంతో ఉప్పొంగితే పాలధారలు, ఆనందబాష్పాలు (21వపద్యం); భయభావంతో ఉప్పొంగితే మూర్ఛిల్లటం - అనేవి సాత్త్వికచేతనను వ్యక్తంచేస్తున్నాయి. వస్తుధ్వనిని రసధ్వనికి అంగంగా పోషించే కథాకథనశిల్పమిది. (సంపా.)

వ. అంత నర్జునుం డనిలబాణంబున నమ్మేఘపటలంబు పఱవనేసి యాదిత్యసమతేజుం డయి యుండె; నంత విదురదర్శితు లైన యక్కర్ణార్జునులం జూచి కుంతి సంతసిల్లె; నపుడు ధర్మవిదుం డఖిలద్వంద్వయుద్ధసమాచార నిపుణుండు కృపాచార్యుం డయ్యిద్దఱ నడుమ నిలిచి కర్ణున కి ట్లనియె. 44

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; అర్జునుండు; అనిల, బాణంబునన్= వాయవ్యాస్త్రంచేత; ఆ+మేఘ, పటలంబు= ఆ మేఘాల సమూహాన్ని; పఱవన్+ఏసి= పారిపోయేటట్లు కొట్టి; ఆదిత్య, సమ, తేజుండు+అయి= సూర్యునితో సమానమైన కాంతి కలవాడై; ఉండెన్; అంతన్= తర్వాత; విదుర, దర్శితులు+ఐన= విదురునిచేత చూపబడినవారైన; ఆ+కర్ణ+అర్జునులన్; చూచి; కుంతి; సంతసిల్లెన్= సంతోషించింది; అపుడు; ధర్మ, విదుండు= ధర్మం తెలిసినవాడు; అఖిల, ద్వంద్వ, యుద్ధ, సమాచార, నిపుణుండు= అన్ని ద్వంద్వయుద్ధాలను చక్కగా నడపటంలో నేర్పరి అయినవాడు; కృపాచార్యుండు; ఆ+ఇద్దఱ, నడుమన్= ఆ ఇద్దరిమధ్య; నిలిచి; కర్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పు డర్జునుడు వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించి, ఆ మేఘసమూహాన్ని పారద్రోలి, సూర్యునివలె వెలుగుతూ నిలిచాడు. విదురుడు చూపిస్తే ఆ కర్ణార్జునులను కుంతి చూచి సంతోషించింది. ధర్మజ్ఞుడూ, ద్వంద్వయుద్ధాలను చక్కగా నడపటంలో నిపుణుడూ అయిన కృపాచార్యుడు ఆ కర్ణార్జునులనడుమ నిలిచి కర్ణునితో ఇట్లా అన్నాడు.

విశేషం: కర్ణార్జును లిద్దరికీ తల్లి కుంతి. వాళ్ళిద్దరి ద్వంద్వయుద్ధం చూచి జనులంతా పొందే స్పందన ఒక యెత్తు; ఆ తల్లి పొందే స్పందన ఒకయెత్తు అని కథనశిల్పం చెపుతున్నది. కర్ణునిమేఘాస్త్రంవలన అర్జునుడు కప్పివేయబడటం చూచి ఓర్చుకోలేక మూర్ఛితురాలైంది. మబ్బులు వీడినతరువాత అర్జునుడిని చూచి ఆనందించింది. అర్జునుడు లోకానికి తెలిసిన కుంతికొడుకు. కర్ణుడు తెలియనికొడుకు. ఇద్దరినీ చూచి రెండుకన్నులతో సంతోషించటం సార్థకం. ఈ సన్నివేశం భావికథలో పాండవులను కర్ణుడు చంపుతాడేమో అన్న భయంతో ఆమె అతడిని రహస్యంగా వరంకోరే ఘట్టానికి బీజప్రాయంగా భాసిస్తుంది.

చ. కురుకులజుండు పాండునకుఁ గుంతికిఁ బుత్త్రుడు, రాజధర్మబం
ధురచరితుండు; నీ వితనితోడ రణం బొనరించెదేని వి
స్తరముగ నీదువంశమును దల్లిని దండ్రిని జెప్పు; చెప్పినన్
దొరయగుదేని నీ కెదిరి దోర్బలశక్తి నితండు సూపెడిన్. 45

ప్రతిపదార్థం: కురు, కులజుండు= కురువంశంలో పుట్టినవాడు; పాండునకున్= పాండురాజుకు; కుంతికిన్; పుత్త్రుడు; రాజ, ధర్మ, బంధుర, చరితుండు= రాజధర్మంచేత ఒప్పిన నడవడి కలవాడు; నీవు; ఇతనితోడన్= ఈ అర్జునునితో; రణంబు= యుద్ధం; ఒనరించెదు+ఏని= చేసేటట్లయితే; విస్తరముగన్= వివరంగా; నీదు, వంశమును; తల్లిని, తండ్రిని= తల్లిదండ్రుల్ని; చెప్పు= చెప్పుము; చెప్పినన్= అట్లా చెప్పితే; దొర+అగుదువు+ఏని= సమానుడవైతే, క్షత్రియుడవైతే; ఇతండు= ఈ అర్జునుడు; నీకున్+ఎదిరి= నీకు ఎదురు నిలిచి; దోస్+బల, శక్తిన్= భుజబలశక్తిని; చూపెడిన్= చూపగలడు.

తాత్పర్యం: అర్జునుడు కురురాజువంశంలో పుట్టినవాడు. పాండురాజుకు, కుంతీదేవికి పుత్రుడు. రాజధర్మంచేత ప్రకాశించేప్రవర్తన కలవాడు. నీవు ఇతనితో యుద్ధం చేయదలిస్తే నీవంశాన్నీ, తల్లిదండ్రులనూ వివరంగా చెప్పుము. సమానుడవైతే ఇతడు నిన్నెదిరించి భుజశక్తి చూపిస్తాడు.

విశేషం: శబ్దశక్తిమూలధ్వనికి ఈ పద్యం అమూల్యోదాహరణం. 'కృపాచార్యుడు పలికిన వాక్యాలలో 'కుల', 'రాజ', 'దొర' - అనే మూడు శబ్దాలు సాభిప్రాయాలు. కులమంటే వంశమనీ, వర్ణమనీ రెండర్థాలున్నాయి. అర్జునుడు కురువంశానికీ, వాళ్ళకులానికీ (క్షత్రియవర్ణం) చెందినవాడు; రాజశబ్దానికి రాజ్యంచేసేవాడనీ, క్షత్రియుడనీ అర్థాలేర్పడతాయి. వంశాన్ని తల్లిని తండ్రిని పేర్కొని నీవు దొరవు (క్షత్రియుడవు, రాజువు, సమానమైనవాడవు)గా నిరూపించుకొను మని కృపాచార్యుడు కర్ణుడిని అడిగాడు. దొర శబ్దంలోని ప్రభువు అనే అర్థాన్ని గ్రహించి, దుర్యోధనుడు ఆ కర్ణుడిని అంగరాజ్యాధిపతిని చేస్తాడు. పరాక్రమంలో అర్జునునితో కర్ణుడు సమానమని సూచించాడు. తల్లిదండ్రులు, కులం అనే అంశాలను శూరులపట్ల పట్టించుకొనకూడదని వారించాడు. 'అనిలజ' అని భీముడిని ఎత్తిపొడిచాడు. ఈ పద్యంలోని రమణీయమైన వ్యంగ్యార్థమంతా 'దొర' అనే శబ్దప్రయోగంమీద అధారపడి ఉన్నది. ప్రభువనే అర్థం వాచ్యంలో, సమానుడనే అర్థం వ్యంగ్యంలో స్ఫురిస్తుంది. 'వివాహశ్చ వివాదశ్చ సమయోరేవ శోభతే' అనే న్యాయం ధ్వనిస్తుంది. భావికథకు అదే మూలమౌతుంది. కాబట్టి ఇది శబ్దశక్తిమూలధ్వని. చమత్కారమేమంటే పఠితకు కర్ణుడి తల్లిదండ్రులసంగతి తెలుసు.. సన్నివేశంలో ఉన్నవారికి తెలియదు. కర్ణునిస్థితి పఠితలో సానుభూతిని రేకెత్తిస్తుంది. ఇది రసవిషయకమైన రహస్యం. (సంపా.)

వ. అనిన విని కర్ణుండు దనకులంబును దల్లిదండ్రులను జెప్ప సిగ్గుపడి తలవాంచి యున్నం జూచి దుర్యోధనుండు గృపున కి ట్లనియె. 46

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; కర్ణుండు; తన, కులంబును; తల్లి, దండ్రులను; చెప్పన్= చెప్పటానికి; సిగ్గుపడి; తలవాంచి= తలనువంచి; ఉన్నన్= ఉండగా; దుర్యోధనుండు; కృపునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని కర్ణుడు తన కులాన్నిగురించి, తల్లిదండ్రులనుగురించి చెప్పటానికి సిగ్గుపడి, తలవంచుకొని ఉండగా చూచి దుర్యోధనుడు కృపాచార్యునితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: కర్ణుడు తాను సూతనందనుడననీ, రాధేయుండననీ చెప్పటానికి సిగ్గుపడి ఊరుకొనటమే ప్రకరణౌచిత్యం. అత డెవరి కొడుకో పఠితకు తెలుసు. పెంచినతండ్రిని తండ్రిగా చెప్పుకొనటం అవమానంగా భావించాడని తలంచటం ఉచితం కాదు. తనను పెంచిన తల్లిదండ్రులు వంశగౌరవంలో కుంతీపాండురాజులతో సమానులు కారని చెప్పటం కర్ణునికి ఇష్టం లేదు. అందువలన సిగ్గుపడి ఊరుకొన్నాడు.

క. కులముగలవాఁడు, శౌర్యము । గలవాఁడును, నధికసేన గలవాఁడును, భూ
తలమున రా జను నామము । విలసిల్లఁగఁ దాల్చు మూఁడువిధముల పేర్మిన్. 47

ప్రతిపదార్థం: కులము, కలవాఁడు; శౌర్యము, కలవాఁడునున్= పరాక్రమం కలవాడును; అధిక, సేన, కలవాఁడును= ఎక్కువ సేన కలవాడును; భూతలమునన్= భూమిమీద; పేర్మిన్= గొప్పగా; మూడు విధముల; రాజు+అను, నామమున్= రాజు అనే పేరును; విలసిల్లఁగన్= ఒప్పుగా; తాల్చున్= ధరిస్తాడు.

తాత్పర్యం: కులమున్నవాడు, శౌర్యమున్నవాడు, అధికసేనాబలమున్నవాడు, భూమిమీద మూడువిధాల రాజనే పేరు గొప్పగా పెట్టుకొంటున్నాడు.

విశేషం: కృపాచార్యుడు పేర్కొన్న 'దొర' అనే పదానికి రూఢిలో ఉన్న అర్థాలు చెప్పి, కర్ణుని దొరతనాన్ని నిలపటానికి దుర్యోధనుని ప్రయత్నం ఇది.

తే. రాజవరుఁ డైన పార్థుతో రాజు గాని । యీతఁ డని సేయఁగాఁ దగఁడేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ । రాజుఁ జేసెద నే నంగరాజ్య మిచ్చి. 48

ప్రతిపదార్థం: రాజ, వరుఁడు+ఐన, పార్థుతో= రాజులలో శ్రేష్ఠుడైన అర్జునునితో; రాజు, కాని, ఈతఁడు= రాజు కానట్టి ఈ కర్ణుడు; అని= యుద్ధం; చేయఁగాన్= చేయటానికి; తగఁడు+ఏని= తగనివాడైతే; వీనిన్= ఈ కర్ణుడిని; ఎల్ల, వారును= అందరును; చూడంగన్= చూస్తూఉండగా; అంగరాజ్యము+ఇచ్చి; నేను; రాజున్+చేసెదన్= రాజుగా చేస్తాను.

తాత్పర్యం: రాజశ్రేష్ఠుడైన అర్జునునితో - రాజు కానట్టి ఈ కర్ణుడు యుద్ధం చేయటానికి తగనివాడైతే అందరూ చూస్తుండగా ఇతనికి నేను అంగరాజ్యమిచ్చి, రాజుగా చేస్తాను.

దుర్యోధనుఁడు కర్ణుని నంగరాజ్యమున కభిషిక్తుం జేయుట (సం. 1-126-36)

వ. అని యప్పుడ భీష్మధృతరాష్ట్రులకుం జెప్పి వారియనుమతంబున మహామహీసురసహస్రంబునకు గోసహస్రా యుతంబు దానంబు సేసి 'యంగరాజ్యంబునకు వీఁ డర్హుం డయ్యెడు మను బ్రాహ్మణవచనంబు వడసి, కర్ణుం గాంచనపీఠంబున నునిచి యంగరాజ్యమున కభిషిక్తుం జేసినఁ, గర్ణుండును మణిమకుట కేయూర హారాది భూషణ భూషితుం డై సకలరాజచిహ్నంబుల నొప్పి పరమహర్షంబుతోడం గురుపతి కి ట్లనియె. 49

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; అప్పుడు+అ= అప్పటికప్పుడే; భీష్మ, ధృతరాష్ట్రులకున్= భీష్మునికి, ధృతరాష్ట్రునికి; చెప్పి= తెలిపి; వారి, అనుమతంబునన్= వారి అనుమతితో; మహామహీసుర, సహస్రంబునకున్= ఉత్తములయిన బ్రాహ్మణులు వేయిమందికి; గో, సహస్ర+అయుతంబు= కోటిఆవులను [అయుతము= 10వేలు; సహస్ర అయుతము 1000X 10,000= 1,00,00,000(కోటి);] దానంబు; చేసి; అంగ, రాజ్యంబునకున్; వీఁడు= ఈతడు - ఈ కర్ణుడు; అర్హుండు+అయ్యెడము= తగినవాడు అయ్యెడుగాక; అను= అనునట్టి; బ్రాహ్మణ, వచనంబు= బ్రాహ్మణులయొక్క మాట; పడసి= పొంది; కర్ణున్= కర్ణుణ్ణి; కాంచన, పీఠంబునన్= బంగారు సింహాసనంమీద; ఉనిచి= ఉంచి; అంగ,రాజ్యమునకున్; అభిషిక్తున్= అభిషేకించినవానిని; చేసినన్= చేయగా; కర్ణుండును; మణి, మయ, మకుట, కేయూర, హార+ఆది, భూషణ, భూషితుడు+ఐ= మణులతో నిండిన కిరీటం, భుజకీర్తులు, దండలు మొదలయిన సొమ్ములతో అలంకరింపబడినవాడై; సకల, రాజ చిహ్నంబులన్= అన్నివిధాలైన రాజలాంఛనాలతో - అంటే అన్నివిధాలైన రాచరికపు గుర్తులతో; ఒప్పి= ప్రకాశించి; పరమ, హర్షంబుతోడన్= మిక్కిలిసంతోషంతో; కురుపతికిన్= దుర్యోధనునికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు ఈ విధంగా పలికి, అప్పటికప్పుడే భీష్మధృతరాష్ట్రులకు చెప్పి - వాళ్ళ అనుమతితో వేయిమందిబ్రాహ్మణోత్తములకు కోటి గోవులను దానంగా ఇచ్చి, ఆ బ్రాహ్మణులచేత అంగరాజ్యానికి కర్ణుడు అర్హుడయ్యెడు గాక అని ఆశీర్వదింపజేసి, బంగారుసింహాసనంమీద కర్ణుడిని కూర్చుండబెట్టి అంగరాజుగా అతడిని అభిషేకించాడు. కర్ణుడు మణిమయ కిరీటంతో, భుజకీర్తులతో, హారాలతో, అనేకవిధాలైన ఆభరణాలతో, సకలరాజలాంఛనాలతో శోభిల్లి మహానందంతో దుర్యోధనునితో ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడు చేసిన ఈ మహోపకారమే కర్ణునిజీవితాన్నీ, మహాభారతకథనూ మలుపు తిప్పింది. సూతసుతుడిని అంగరాజుగా మార్చింది. జీవితాంతం కృతజ్ఞతాభావబంధంతో కర్ణుడిని కౌరవపక్షానికి కట్టివేసింది. అర్జునునికి సమానుడైన విలుకాడు తనపక్షాన ఉన్నాడన్న ఆత్మవిశ్వాసాన్ని సుయోధనునిలో పెంచింది. గోదాన విషయం మూలంలో లేదు. అక్కడ

"విప్రైశ్చ ప్రదత్వా హ్యమితం వసు" అనే ఉంది. 'వసు' అంటే 'బంగారం, రత్నం, ధనం' అని అర్థాలు. గోదాన వైశిష్ట్యాన్ని గుర్తించిన నన్నయ - వసుదానాన్ని "గోసహస్రాయుతంబు దానంబుసేసి" అని వివరించాడు.

క. బృహదబ్ధిమేఖలాఖిల । మహీతలక్షత్త్రవరసమక్షమున మహా
మహిమాన్వితుఁగా నన్నును । మహీశుఁగాఁ జేసి తతిసమర్థత వెలయన్. 50

ప్రతిపదార్థం: బృహత్= అబ్ధి, మేఖలా+అఖిల, మహీతల, క్షత్త్ర, వర, సమక్షమునన్= మహాసముద్రాన్ని మొలనూలుగా గల సమస్త భూమండలంలోని రాజశ్రేష్ఠులయొక్క ఎదుట; అతి, సమర్థత= మిక్కిలి నేర్పు; వెలయన్= ప్రకాశించగా; నన్నును= నన్ను కూడా; మహా, మహిమ+అన్వితుఁగాన్= మిక్కిలిగొప్పతనంతో కూడుకొన్నవాణ్ణిగా; మహీ+ఈశున్+కాన్= భూపతిని అగునట్లుగా - అంటే రాజగునట్లుగా; చేసితి= చేశావు.

తాత్పర్యం: మహాసముద్రాన్ని మొలనూలుగా (ఒడ్డాణంగా) గల సమస్తభూమండలంలోని రాజశ్రేష్ఠుల సమక్షంలో మిక్కిలినేర్పు మెరయ నన్నెంతో గౌరవించి రాజుగా చేశావు.

క. 'దీనికి సదృశముగా మఱి । యే నేమి యొనర్తు నీకు నిష్టం?' బనినన్
'మానుగ నాతోఁ జెలిమి మ । హీనుతముగఁ జేయు; మిదియ యిష్టము నాకున్.' 51

ప్రతిపదార్థం: దీనికిన్= ఈ గొప్ప ఉపకారానికి; సదృశముగాన్= సమానంగా; మఱి= మరల; ఏను= నేను; ఏమి= ఏది; ఇష్టంబు= ఇష్టమైన దానిని; ఒనర్తున్= చేస్తాను; అనినన్= అని అనగా; మానుగన్= ఒప్పుగా; నాతోన్; చెలిమి= స్నేహం; మహీ, నుతముగన్= లోకం కొనియాడేటట్లుగా; చేయుము; నాకున్; ఇదియ, ఇష్టము = ఇదే ఇష్టం.

తాత్పర్యం: 'నీవు చేసిన ఈ మహోపకారానికి సమానంగా నేను నీ కిష్టమైంది ఏంచేయగలను?' - అని కర్ణు డడుగగా, 'లోకం కొనియాడేటట్లు నాతో స్నేహం చేయుము; ఇదే నా కిష్టం' అని దుర్యోధనుడన్నాడు.

విశేషం: ఏ ముహూర్తంలో 'నాతో చెలిమి మహీనుతముగా' చేయు మని దుర్యోధనుడు కర్ణుడిని కోరాడో - ఏ ముహూర్తంలో కర్ణుడు దుర్యోధనునితో చెయ్యి కలిపాడో - వాళ్ళమైత్రి మహీనుతమే అయింది. మహాభారతంలో అతిప్రధానపాత్ర నిర్వహించింది. కర్ణుని స్వామిభక్తి లోకం కొనియాడదగిందే. కాని అది ఆంజనేయుని స్వామిభక్తివంటిది కాదు. కర్ణుని స్వామిభక్తి కృతజ్ఞతారూపం. ఆంజనేయుని స్వామిభక్తి శ్రీరామసుగుణపరవశతారూపం; స్వార్థరహితం.

వ. అనిన విని దుర్యోధనున కెంతయు సంతోషంబుగాఁ గర్ణుం డతనితోడి యిష్ట సఖిత్వంబున కొడంబడియె, నంతఁ గొడుకు రాజ్యాభిషేకోత్సవంబు సూచి హర్షపరవశుం డయి సూతుండు రథంబు డిగ్గి కర్ణునొద్దకుం బఱతెంచినఁ, గర్ణుండును బితృగౌరవంబున సంభ్రమించి వానికి వినయవినమితోత్త మాంగుండయిన. 52

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; దుర్యోధనునకున్; ఎంతయున్= మిక్కిలి; సంతోషంబుగాన్= సంతోషంగా; కర్ణుండు; అతనితోడి; ఇష్ట, సఖిత్వంబునకున్= అతనితో ఇష్టమైన స్నేహితుడుగా ఉండటానికి; ఒడంబడియెన్=ఒప్పుకొన్నాడు; అంతన్= అప్పుడు; కొడుకు= పెంచిన కుమారునియొక్క; రాజ్య+అభిషేక+ఉత్సవంబున్= రాజ్యానికి అభిషిక్తుడైన పండుగను; చూచి; సూతుండు= రథంనడిపేవాడు- అతిరథుడు- కర్ణునిపెంచినతండ్రి; హర్ష, పరవశుండు+అయి= సంతోషంతో మైమరచినవాడై;

రథంబు, డిగ్గి= రథంనుండి దిగి; కర్ణు+ఒద్దకున్= కర్ణునిదగ్గరకు; పఱతెంచినన్= పరుగెత్తి రాగా; కర్ణుండును; పితృగౌరవంబునన్= తండ్రిమీది భక్తిచేత; సంభ్రమించి= వేగిరపడి; వానికిన్= ఆ సూతునికి; వినయ, వినమిత+ఉత్తమ+ అంగుండు= వినయంచేత (అణకువచేత) వంగినశిరస్సు కలవాడు; అయినన్= కాగా.

తాత్పర్యం: అని దుర్యోధనుడనగా, ఎంతో సంతోషంతో కర్ణుడాతనికి ప్రియమిత్రుడుగా ఉండటానికి అంగీకరించాడు. అప్పుడు కుమారుని అంగరాజ్యాభిషేకోత్సవాన్ని చూచి అతిరథుడు రథం దిగి పరుగుపరుగున కర్ణునిదగ్గరకు రాగా, కర్ణుడుకూడా తండ్రిమీదిగౌరవంతో త్వరత్వరగా లేచి వినయంతో శిరస్సువంచి నమస్కరించాడు.

విశేషం: ఇది తండ్రికొడుకుల జీవితంలో ఒక రసోజ్జ్వలమైనసన్నివేశం.

తే. కడఁగి సూతుండు పుత్త్రకుఁ గౌఁగిలించి । కొని తదీయమూర్ధాఘ్రాణ మొనరఁ జేసి
యంగరాజ్యాభిషేకార్ద్రమైన శిరముఁ । దడిపె వెండియు హర్షాశ్రుతతుల నొప్ప. 53

ప్రతిపదార్థం: సూతుండు= అతిరథుడు; కడఁగి= ప్రయత్నించి; పుత్త్రకున్= ప్రియకుమారుడిని; కౌఁగలించుకొని; తదీయ, మూర్ధ+ఆఘ్రాణము= అతనియొక్క తలను మూర్కొనటాన్ని; ఒనరన్= ఇంపుగా, ప్రియమార; చేసి= గావించి; అంగ+రాజ్య+ అభిషేక+ఆర్ద్రము+ఐన= అంగరాజ్యానికి అభిషేకించటంచేత తడిసిందైన; శిరమున్= తలను; వెండియున్= మళ్ళీ; హర్ష+అశ్రు, తతులన్= ఆనందబాష్పసమూహాలచేత; ఒప్పన్= అందంగా; తడిపెన్= తడిపాడు.

తాత్పర్యం: అతిరథుడు ప్రయత్నించి పుత్రుడిని కౌగలించుకొని ప్రియమార అతనితలను మూర్కొని అంగ రాజ్యాభిషేకంచేత తడిసిన అతనితలను మళ్ళీ తన ఆనందాశ్రువులచేత తడిపాడు.

విశేషం: కర్ణుడు తనకుమారుడే అయినా ఇప్పుడతడు అంగరాజు. ఇప్పుడు అతడిని ఇదివరకటివలె కౌగలించుకొనటం ఎట్లా? పైగా ఎవరేమనుకొంటారో? అందుచేతనే కాబోలు 'కడగి' సూతు డాతనికి కౌగలించుకొన్నాడని చెప్పటం.

వ. దానిం జూచి భీముండు గర్ణుని సూతకులసంభవుంగా నెఱింగి నగుచు ని ట్లనియె. 54

ప్రతిపదార్థం: దానిన్+చూచి= అతిరథుడు కర్ణుడిని కౌగలించుకొనటాన్ని చూచి; భీముండు; కర్ణునిన్; సూత, కుల, సంభవున్, కాన్= సూతకులంలో (రథంనడిపేవారికులంలో) పుట్టినవాడినిగా; ఎఱింగి= తెలిసికొని; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అతిరథుడు కర్ణుడిని కౌగలించుకొనటం గమనించి, అతడు సూతకులంలో పుట్టినవాడని తెలిసికొని భీముడు అవహేళనగా నవ్వుతూ ఈవిధంగా అన్నాడు.

క. నీదు కులమునకుఁ దగఁగఁ బ్ర । తోదము గొని రథము గడపఁ దొరఁగుము నృపధ
ర్మోదయుఁ డగు నర్జునుతోఁ । గా దనక రణంబు సేయఁగా నీ కగునే? 55

ప్రతిపదార్థం: నీదు, కులమునకున్; తగఁగన్= తగినట్లు; ప్రతోదము, కొని= మునికోలను తీసికొని; రథమున్= రథాన్ని; కడపన్= నడపటానికి; తొడుగుము= పూనుకో; నీకున్, నృప, ధర్మ+ఉదయుఁడు+అగు+అర్జుతోన్= రాజధర్మంలో పుట్టినవా డైన అర్జునునితో; కాదు+అనక= కాదనకుండ - తగదు నని; రణంబు, చేయఁగా= యుద్ధంచేయటం; అగునే= తగునా!

తాత్పర్యం: నీ కులానికి తగ్గట్లు మునికోల పుచ్చుకొని నీవు రథం నడప ప్రయత్నించాలి గాని, రాజధర్మంలో జన్మించిన అర్జునునితో కాదనకుండా యుద్ధంచేయటం నీకు తగునా!

వ. మఱి యదియునుం గాక. 56

తాత్పర్యం: ఇంకా, అంతేకాక.

తే. ఉత్తమక్షత్త్రియప్రవరోపయోగ్య । మైన యంగరాజ్యంబు నీ కర్హ మగునె?
మంత్రపూత మై గురుయజమానభక్ష్య । మగుపురోడాశ మది గుక్క కర్హ మగునె! 57

ప్రతిపదార్థం: ఉత్తమ, క్షత్త్రియ, ప్రవర+ఉపయోగ్యము+ఐన= ఉత్తముడైన క్షత్రియశ్రేష్ఠునిచేత అనుభవించదగినదైన; అంగ రాజ్యంబు; నీకున్+అర్హము+అగునె= నీకు తగినటువంటిది అవుతుందా; మంత్ర, పూతము+ఐ= మంత్రంచేత పవిత్రమై; గురు, యజమాన, భక్ష్యము+అగు= గొప్పయజ్ఞకర్త తినదగినదైన; పురోడాశము= యజ్ఞంకొరకు చేసిన పిండివంట; కుక్కకున్; అర్హము= తగింది; అగునె= ఔతుందా? (కాదని భావం)

తాత్పర్యం: ఉత్తమక్షత్రియశ్రేష్ఠునిచేత అనుభవించదగిందైన అంగరాజ్యం నీకు అనుభవించ తగిందవుతుందా? గొప్పయజ్ఞకర్త భుజించదగిన యజ్ఞశేషమైనపిండివంట కుక్క తినటం తగునా!

విశేషం: అలం : దృష్టాంతం.

వ. అనినం గర్ణుండు వెల్లనయి యెద్దియుం జేయునది నేరక దీర్ఘోష్ణనిశ్వాసవ్యాకులిత వదనుం డయి యాకాశంబు వలన నున్న యాదిత్యుం జూచుచు మిన్నకుండె; నంత నంతర్విలులితుం డయిన యక్కర్ణుం జూచి భ్రాతృపద్మవన మధ్యంబుననుండి దుర్యోధనమదాంధగంధసింధురంబు వెలువడి వచ్చి కడు నలిగి భీమున కి ట్లనియె. 58

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; కర్ణుండు; వెల్లనయి= వెలవెలబోయి; ఎద్దియున్, చేయునది= ఏదీ చేయటానికి; నేరక= తెలియక; దీర్ఘ+ఉష్ణ, నిశ్వాస, వ్యాకులిత, వదనుండు+అయి= పొడవై వేడి అయిన నిట్టూర్పుచేత కలత చెందిన ముఖం కలవాడై; ఆకాశంబువలనన్= ఆకాశంవైపు; ఉన్న; ఆదిత్యున్= సూర్యుడిని; చూచుచున్; మిన్నక+ఉండెన్= ఊరకున్నాడు; అంతన్= తర్వాత; అంతః+విలులితుండు+అయిన= లోలోపల (మనస్సులో) కలతచెందుతున్నవాడైన; ఆ+కర్ణున్; చూచి; భ్రాతృ, పద్మ, వన, మధ్యంబుననుండి= తమ్ములు అనే తామరవనం మధ్యనుండి; దుర్యోధన, మద+అంధ, గంధ, సింధురంబు= దుర్యోధనుడనే మదంచేత కన్నులు కానని మదపుటేనుగు; వెలువడి= బయటకు నడచి; వచ్చి; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: భీముడు అట్లా మాట్లాడగానే కర్ణుడు వెలవెలపోయి, ఏమీ చేయటానికి తోచక, పెద్దవేడినిట్టూర్పు విడిచి, కలతచెందినముఖంతో ఆకాశంలో ఉన్న ఆ సూర్యునివైపు చూస్తూ ఊరకున్నాడు. మనసులో మిక్కిలి కలత చెందుతున్న ఆ కర్ణుడిని చూచి, తమ్ములనే తామరవనమధ్యంనుండి దుర్యోధనుడనే మదపుటేనుగు వెలుపలికి వచ్చి ఎంతో కోపంతో భీమునితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. తన కులాన్ని, తండ్రిని, తల్లినిగురించి పదిమంది ఎదుట నిలదీసి అడిగినపుడు బదులు చెప్పలేక ఏమిచేయటానికీ దిక్కుతోచక బాధపడుతూ- అన్నీ తెలిసి, ఏమీ తెలియనట్లు నంగనాచివలె నింగిలో ఉన్న కర్మసాక్షివైపు చూచే కర్ణుని భంగిమలోని నాటకీయత, ఔచిత్యం, విశేషించి భావుకులకు రసానందహేతువులు. అట్లే తమ్ములనే తామరవనమధ్యం బునుండి మదపుటేనుగువలె కన్నుమిన్నుకానక ముందుకు నడచివచ్చే దుర్యోధనుని భంగిమకూడా రూపకోచితం. (సంపా.)

క. అనిలజ! నీ కి ట్లని ప । ల్కను దలఁపను నగునె? లేడి కడుపునఁ బులి పు
ట్టునె? యిట్టి దివ్యతేజం । బున వాఁ డధమాన్వయమునఁ బుట్టునె చెపుమా! 59

ప్రతిపదార్థం: అనిలజ= వాయువువల్ల పుట్టినవాడా!; నీకున్; ఇట్లు+అని= ఈ ప్రకారంగా; పల్కను= మాటాడటానికి; తలఁపనున్= ఆలోచించటానికి; అగునె= తగునా; లేడి, కడుపునన్; పులి; పుట్టునె; ఇట్టి; దివ్య, తేజంబునవాఁడు= శ్రేష్ఠమైన కాంతి కలవాడు; అధమ+అన్వయమునన్= నీచమైన కులంలో; పుట్టునె, చెపుమా!= జన్మించునా! చెప్పు.

తాత్పర్యం: వాయువువల్ల పుట్టిన ఓ భీమా! ఇట్లా మాట్లాడటం, ఆలోచించటం నీకు తగునా? లేడికడుపున పులి పుట్టుతుందా? ఇంత గొప్పకాంతికలవాడు నీచకులంలో పుట్టుతాడా?

విశేషం: భీముడిని 'అనిలజ' అని సంబోధించటంలో నీ పుట్టుక సంగతి ఏమిటనే ఎత్తిపొడుపు ధ్వనిస్తున్నది. అలం: అర్థాంతరన్యాసం.

వ. శూరులజన్మంబు సురలజన్మంబును । నేఱులజన్మంబు నెఱుఁగ నగునె?
మొగిని దధీచియెమ్ముసఁ బుట్టదయ్యెనే । వాసవాయుధ మైన వజ్ర మదియు;
గాంగేయుఁ డన మఱి కార్తికేయుం డన । నాగ్నేయుఁ డన రౌద్రుఁ డనఁగ శరవ
ణోద్భవుం డన గుహుం డుద్భవిల్లఁడె? శర । స్తంబజన్ముఁడు గాఁడె ధర్మవిదుఁడు

తే. గృపుఁడు? ఘటసంభవుఁడు గాఁడె కీర్తిపరుఁడు । వరుఁడు ద్రోణుండు? విప్రులవలనఁ బుట్ట
రైరె సత్‌క్షత్రియుల్ ఘను లవనిఁ గావఁ? గడఁగి మీ జన్మములు నిట్ల కావె వినఁగ. 60

ప్రతిపదార్థం: శూరుల, జన్మంబున్; సురల, జన్మంబునున్= దేవతలయొక్క పుట్టుకను; ఏఱుల, జన్మంబున్= నదుల పుట్టుకను; ఎఱుఁగన్+అగునె= తెలిసికొనటం సాధ్యమా!; మొగిని= క్రమంగా; వాసవ+ఆయుధము+ఐన= దేవేంద్రునియొక్క ఆయుధమైన వజ్రము; అదియున్= అది; దధీచి, ఎమ్ముసన్= దధీచి ఎముకలో; పుట్టదు+అయ్యెనే= పుట్టలేదా?; గాంగే యుఁడు+అనన్= గంగకొడు కనగా; ఆగ్నేయుడు+అనన్= అగ్ని కొడుకనగా; రౌద్రుఁడు+అనంగన్= రుద్రునికొడు కనగా; శరవణ ఉద్భవుండు+అనన్= రెల్లుగడ్డిపొదలో పుట్టినవాడనగా; గుహుండు= కుమారస్వామి; ఉద్భవిల్లఁడె= పుట్టలేదా; ధర్మవిదుఁ డు= ధర్మాన్ని తెలిసినవాడు; కృపుఁడు= కృపాచార్యుడు; శర, స్తంబ, జన్ముఁడు= రెల్లుగంటలో పుట్టుక కలవాడు; కాఁడె; కీర్తిపరుఁడు= కీర్తిగలవాడు; వరుఁడు= శ్రేష్ఠుడు; ద్రోణుండు; ఘట, సంభవుఁడు= కుండలో పుట్టినవాడు; కాఁడె= కాదా!; అవనిన్+ భూమిని; కావన్=కాపాడటానికి; కడఁగి= పూనుకొని; ఘనులు= గొప్పవారు; సత్+క్షత్రియుల్= ఉత్తములైనరాజులు; విప్రులవలనన్= బ్రాహ్మణులవలన; పుట్టరు+ఐరె= పుట్టినవారు కాలేదా; వినఁగన్= వినటాన్ని బట్టి (తెలియగా), మీ జన్మములున్= మీ యొక్క పుట్టుకలుకూడా; ఇట్లు+అ, కావె= ఈ విధమైనవే కదా!

తాత్పర్యం: శూరుల పుట్టుక, దేవతల పుట్టుక, నదుల పుట్టుక తెలిసికొనటం సాధ్యమా? దేవేంద్రుని వజ్రాయుధం దధీచి ఎముకనుండి పుట్టలేదా? గంగకొడుకుగా, కృత్తికలకొడుకుగా, అగ్నికొడుకుగా, రుద్రునికొడుకుగా, రెల్లుపొదలలో జన్మకలవాడుగా కుమారస్వామి పుట్టలేదా? ధర్మమెరిగిన కృపాచార్యుడు రెల్లుగడ్డిగంటలో పుట్టలేదా? కీర్తిమంతుడు, శ్రేష్ఠుడు అయిన ద్రోణుడు కుండలో పుట్టలేదా? భూమిని కాపాడటానికై ఉత్తమ క్షత్రియులు బ్రాహ్మణులవలన పుట్టలేదా? విన్నదానినిబట్టి మీ పుట్టుకలుకూడా ఇట్టివే కదా!

విశేషం: 'శూరులజన్మంబు సురలజన్మంబును నేఱులజన్మంబు నెఱుఁగనగునె' - అనేదానికి మూలం:- "శూరాణాంచ నదీనాంచ దుర్విదాః ప్రభవాః కిల" (చిత్రకళాప్రతి) - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.335. పెద్దలముందు మిత్రుడైన కర్ణుడిని నిందించిన భీముడిని అధిక్షేపిస్తూ దుర్యోధనుడు పెద్దలందరిపుట్టుకతో కలిపి పాండవుల పుట్టుకలను గురించికూడా పేర్కొన్నాడు. మీరందరూ శూరులైతే గూఢజన్ముడైకూడా గొప్పవాడుగా కనపడుతున్న కర్ణుడు శూరుడు కాలేకపోతాడా? అని తార్కికంగా మాట్లాడాడు. తెలియక, అభిమానంతో మాట్లాడుతున్న దుర్యోధనునిమాటలతో నిజం తెలిసిన పఠితల మనస్సులు అభిమానిస్తాయి. కర్ణుడిలోని విషాదాంతనాయకలక్షణాలలో ఇది ఒకటి. అన్ని మంచిగుణాలున్నా ఏదో ఒక అనివార్యమైన లోపంవలన కర్ణుడు విషాదాంతం పొందుతూ పఠితల సానుభూతిని పొందుతాడని వస్తుధ్వని. (సంపా.)

వ. 'వానితోడి దేమి? దివ్యలక్షణలక్షితుండును సహజకవచకుండలమండితుండును గాని ప్రకృతిపురుషుండు గాఁడు; తన బాహుబలంబున నీ యంగరాజ్యంబునక కాదు సకలమహీరాజ్యంబునకు నర్హుం డగు' ననుచున్నయంత నాదిత్యుం డస్తంగతుం డైన, నస్త్రసందర్శనరంగంబు వెలువడి దుర్యోధనుండు గర్ణుం దోడ్కొని కరదీపికా సహస్రంబుతో నిజమందిరంబున కరిగెఁ; బాండవులును భీష్మద్రోణవిదుర కృపాచార్యులతో నిజనివాసంబుల కరిగిరి. 61

ప్రతిపదార్థం: వానితోడిది+ఏమి= వాటితో పనేమి? (అంటే ఆ జన్మలగురించి తర్కించి ఏం ప్రయోజనం); (కర్ణుడు) దివ్య, లక్షణ, లక్షితుండును= శ్రేష్ఠాలైనలక్షణాలచేత గుర్తింపబడేవాడును; సహజ, కవచ, కుండల, మండితుండును, గాని= సహజాలైన కవచకుండలాలచేత అలంకరింపబడినవాడుగాని; ప్రకృతిపురుషుండు, కాఁడు= సామాన్య మానవుడు కాడు; తన బాహుబలంబునన్= తనయొక్క బాహుబలంచేత; ఈ, అంగరాజ్యంబునక, కాదు= ఈ అంగరాజ్యానికి మాత్రమే కాదు; సకల, మహీ, రాజ్యంబునకున్= మొత్తం ప్రపంచంయొక్క దొరతనానికి; అర్హుండు+అగున్= తగినవాడవును; అనుచున్+ఉన్న, అంతన్= అని పలుకుతుండగా; ఆదిత్యుండు= సూర్యుడు; అస్తంగతుండు+ఐనన్= అస్తమించే కొండవైపు వెళ్ళినవాడు కాగా - అంటే అస్తమించగా; దుర్యోధనుండు; అస్త్ర, సందర్శన, రంగంబు= అస్త్రవిద్యను చూపే ప్రదేశంనుండి; వెలువడి= బయటకు వచ్చి; కర్ణున్= కర్ణుడిని; తోడు+కొని= వెంటపెట్టుకొని; కర, దీపికా, సహస్రంబుతో= దివ్విటీలు వెయ్యింటితో; నిజ, మందిరంబును= తనయొక్క ఇంటికి; అరిగెన్= వెళ్ళాడు; పాండవులును; భీష్మ, ద్రోణ, విదుర, కృపాచార్యులతో; నిజ, నివాసంబులకున్= తమయొక్క ఇండ్లకు; అరిగిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'ఆ జన్మలతో ఏం పని? కర్ణుడు దివ్యలక్షణాలు కలవాడు. సహజకవచకుండలాలు కలవాడు. సామాన్యుడు కాదు. తనబాహుబలంచేత ఈ అంగరాజ్యాన్నే కాదు ఈ భూమండలాన్నంతా పరిపాలించగల సమర్థుడు' అని అంటూండగా, సూర్యు డస్తమించాడు. దుర్యోధనుడు అస్త్రవిద్యారంగాన్ని విడిచి కర్ణుని వెంటబెట్టుకొని వెయ్యి దివ్విటీలు వెలుగుతుండగా తన ఇంటికి వెళ్ళాడు. పాండవులుకూడా భీష్మ ద్రోణ విదుర కృపాచార్యులతో కలిసి తమతమ ఇండ్లకు వెళ్ళారు.

విశేషం: దుర్యోధనుని అధిక్షేపాలకు ఏఒక్కరుకూడా ప్రతిసమాధానం ఇచ్చినట్లు చెప్పకుండా ఉండటమే ప్రకరణౌచిత్యం. ప్రతిభావంతుడైన నాటకకర్త ఒకరంగాన్ని అద్భుతంగా నిర్వహించినట్లు ఈ ముగింపు గోచరిస్తుంది. కర్ణునికీర్తి చివరకు జగజ్జేగీయమానంగా ప్రకాశిస్తుంది. కాని, సూర్యుడు అస్తమించటంతో రంగం ముగుస్తుంది. సూర్యసుతుడైన కర్ణుడు జగత్ప్రసిద్ధిని పొందుతాడు కాని విషాదాంతాన్ని చవిచూస్తాడు అని వస్తుధ్వని. వేయిదివిటీలతో వెలుగుతూ నిష్క్రమించిన దుర్యోధనుడు కర్ణుడి స్నేహంవలన భావిచరిత్రలో వేయివిధాల వెలుగబోతున్నాడని వస్తుధ్వని. కాలాన్ని వస్తుధ్వనిగా వాడుకొనే శిల్పం అనల్పం. కాళిదాసాదిమహాకవులనాటకశిల్పమర్మాలను నన్నయ తనరచనలో ప్రవేశపెట్టి కథార్థసంవిధానాన్ని చేశాడు. (సంపా.)

ఆ. కుంతి యంత సహజకుండలకవచాభి । రామuc గర్ణుc జూచి రవి సమానుc
బ్రత్యభిజ్ఞ నెఱిcగి ప్రథమపుత్త్ర స్నేహ । మెఱుకపడక యుండ నింతి యుండె. 62

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు, కుంతి; సహజ, కుండల+అభిరామున్= పుట్టుకతో వచ్చిన కుండలాలతో, కవచంతో మనోహరమైన వాడిని; రవి, సమానున్= సూర్యునితో సమానమైనవాడిని; కర్ణున్, చూచి; ప్రతి+అభిజ్ఞన్= గుర్తుచేత; ఎఱిc గి= తెలుసుకొని; ఇంతి= స్త్రీ - కుంతీదేవి; ప్రథమ, పుత్త్ర, స్నేహము= మొదటి కుమారునిమీది ప్రేమ; ఎఱుక, పడక, ఉండన్= బయటపడకుండేటట్లు; ఉండెన్.

తాత్పర్యం: అప్పుడు కుంతీదేవి సహజకవచకుండలాలచేత మనోహరుడై, సూర్యసమానుడైన కర్ణుడిని చూచి, గుర్తుపట్టినా, ఆ మొదటికొడుకుమీద తనకున్నప్రేమను బయటపడనీకుండా ఉండింది.

విశేషం: కుమారాస్త్రవిద్యాసందర్శనఘట్టంవలన కర్ణుడు హస్తినాపురంలోనే సూతపుత్రుడుగా పెరిగి, దుర్యోధనునికి మిత్రుడై, అంగరాజై ఉన్నాడని కుంతికి తెలిసింది. కాని, ఆమె నిజం బయటపెట్టక దాచి ఉంచింది. ఇది కర్ణునిజీవితం విషాదాంతం కావటానికి ప్రధానమైన శాపం అయింది. (సంపా.)

క. వినుతధనుర్విద్యావిదు । ఘనుc గర్ణు సహాయుc బడసి కౌరవవిభుc డ
ర్జునువలనిభయము సెడి ఱొ । మ్మునc జేయిడి నిద్రవోయె ముదితాత్ముం డై. 63

ప్రతిపదార్థం: వినుత, ధనుః+విద్యా, విదున్= పొగడబడిన విలువిద్యను తెలిసినవాడిని; ఘనున్= గొప్పవాడిని; కర్ణున్= కర్ణుడిని; సహాయున్= స్నేహితుడిని; పడసి= పొంది; కౌరవ, విభుcడు= దుర్యోధనుడు; ముదిత+ఆత్ముండు+ఐ= సంతోషించిన మనస్సు కలవాడై; అర్జునువలని= అర్జునునివలన; భయము, చెడి= భయంపోయి; ఱొమ్మునన్+చేయి+ఇడి= గుండెమీద చేయి వేసికొని; నిద్రపోయెన్.

తాత్పర్యం: పొగడదగిన విలువిద్యానిపుణుడైన కర్ణుడిని మిత్రుడిగా పొంది దుర్యోధనుడు సంతోషించి, అర్జునునివలన భయం లేకుండా గుండెమీద చెయ్యివేసికొని నిద్రపోయాడు.

విశేషం: అర్జునునికి ప్రతివీరుడిగా కర్ణుడిని నిలిపిన దుర్యోధనునినైపుణ్యం ప్రశంసనీయంగా మిగిలింది ఈ రంగంచివర. కురుకుమారులలో భీమదుర్యోధనులపోరు పెద్దలచేత వారింపబడవచ్చునేమో కాని, కర్ణార్జునుల వైరంమాత్రం కాలం తీర్చవలసిందే అనే సూచన కథాంతంలో నన్నయ ధ్వనింపచేశాడు. (సంపా.)

కౌరవపాండవులు గురుదక్షిణార్థంబు ద్రుపదుం బట్టఁ జనుట (సం. 1-127-1)

వ. అంతఁ బ్రభాతం బగుటయు సమయనియమంబులు దీర్చి యాచార్యుండు శిష్యులనెల్ల రావించి 'మీరు నాకు గురుదక్షిణ యిం' డనిన నందఱు మ్రొక్కి యెదుర నిలిచి 'మీ కెద్ది యిష్టంబు సెప్పుం' డనిన విని 'యవివేక కారణ దారుణైశ్వర్యావలిప్తుం డైన ద్రుపదు నోడిచిపట్టి తెం; డిదియ నా కిష్టం బైన గురుదక్షిణ' యని పంచిన. 64

ప్రతిపదార్థం: అంతన్= తర్వాత; ప్రభాతంబు+అగుటయు= తెల్లవారగా; సమయ, నియమంబులు= ఆయా సమయాలలో చేయవలసిన పనులు; తీర్చి= పూర్తిచేసుకొని; ఆచార్యుండు= గురువైన ద్రోణుడు; శిష్యులను+ఎల్లన్= శిష్యులందరినీ; రావించి; మీరలు; నాకున్; గురుదక్షిణ; ఇండు= ఈయవలసింది; అనినన్= అనగా; అందఱు; మ్రొక్కి; ఎదుర,నిలిచి= ఎదుట నిలబడి; మీకున్+ఎద్ది= మీకు ఏది; ఇష్టంబు= ఇష్టమో; చెప్పుండు= చెప్పండి; అనినన్= అనగా; విని; అవివేక, కారణ, దారుణ+ఐశ్వర్య+అవలిప్తుండు+ఐన= అవివేకానికి కారణమైన భయంకరమైన సంపదచేత గర్వించినవాడైన; ద్రుపదున్; ఒడిచి= ఓడించి; పట్టి; తెండు= తీసికొని రండు; ఇదియ; నాకు+ఇష్టంబు+ఐన= నాకు ప్రీతికరమైన; గురుదక్షిణ; అని= ఆవిధంగా; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: తెల్లవారగానే ఆయా సమయాలలో చేయవలసిన పనులు పూర్తిచేసుకొని ద్రోణాచార్యుడు శిష్యులను పిలిచి 'మీరు నాకు గురుదక్షిణ ఇవ్వండి' అన్నాడు. శిష్యులందరు ఆయనకు మ్రొక్కి ఎదుట నిలబడి 'మీ కేది ఇష్టమో సెలవీయం' డని అడిగారు. అందుల కాయన 'అత్యధికసంపదచేత గర్వించి వివేకాన్ని కోల్పోయిన ద్రుపదుడిని ఓడించి పట్టి తీసికొని రండి. ఇదే నా కిష్టమైన గురుదక్షిణ' అని ఆజ్ఞాపించాడు. కాగా.

క. వల్లె యని రాజనందను । లెల్లను సమకట్టి, రథము లెక్కి దిశల్ భే
దిల్లఁగ గర్జిల్లి , నిశా । తోల్లసిత కృపాణ కార్ము కోద్యతకరు లై. 65

ప్రతిపదార్థం: వల్లె, అని= సరే అని, రాజనందనులు+ఎల్లను= రాజకుమారులంతా; సమకట్టి= పూనుకొని; రథములు+ఎక్కి; దిశల్= దిక్కులు; భేదిల్లఁగన్= బ్రద్దలయ్యేట్లు; గర్జిల్లి= సింహనాదం చేసి - పెద్ద యుద్ధధ్వని చేసి; నిశాత+ఉల్లసిత, కృపాణ, కార్ముక+ఉద్యత, కరులు+ఐ= వాడియై ప్రకాశిస్తున్న కత్తులతో, విల్లులతో ఎత్తబడిన చేతులు కలవాళ్ళయి.

తాత్పర్యం: ద్రోణుడు కోరినగురుదక్షిణకు సరే అని రాజకుమారులంతా పూనుకొని రథాలెక్కి దిక్కులు పిక్కటిల్లేట్లుగా సింహనాదాలు చేసి, చేత ఖడ్గాలు, ధనుస్సులు ధరించి.

ఉత్సాహము.

'ఏల దీని నెడయుఁ జేయ? నీ క్షణంబ యేఁగి పాం
చాలుఁ బట్టి తెత్త మధికశౌర్యలీల మెఱయఁగాఁ
బోలు' ననుచుఁ బెరిఁగి రాజపుత్త్రు లెల్ల నరిగి పాం
చాలుపురము ముట్టికొని రసంఖ్య బలసమేతు లై. 66

ప్రతిపదార్థం: రాజ, పుత్త్రులు+ఎల్లన్= రాజకుమారులంతా; దీనిన్= ఈ పనిని అంటే ద్రుపదుడిని ఓడించి పట్టితెచ్చేపనిని; ఎడయున్+చేయ= ఆలస్యంచేయటం; ఏల= ఎందులకు; ఈ క్షణంబు+అ= ఈ నిముషంలోనే, ఏఁగి= వెళ్ళి; పాంచాలున్+పట్టి=

పాంచాలరాజైన ద్రుపదుడిని పట్టుకొని; తెత్తము (తెచ్చుదము)= తీసుకొనివద్దాము; అధిక, శౌర్య, లీల= అధికశూరత్వం యొక్క విలాసం; మెఱయఁగాన్= ప్రదర్శించగా; పోలున్= తగును; అనుచున్= అంటూ; పెరిఁగి= విజృంభించి; అరిగి= వెళ్ళి; అసంఖ్య, బల, సమేతులు+ఐ= లెక్కించ సాధ్యం గాని సైన్యంతో కూడుకొన్నవాళ్ళయి; పాంచాలు, పురమున్= ద్రుపదుని పట్టణాన్ని; ముట్టికొనిరి= ముట్టడించారు.

తాత్పర్యం: రాజకుమారులంతా 'ఈ పనికి ఆలస్యంచేయడమెందుకు?' అని ఈ క్షణమే వెళ్ళి ద్రుపదుడిని పట్టి తెద్దామనీ, ఇది అధికశౌర్యవిలాసాన్ని ప్రదర్శించదగినసమయమనీ, విజృంభించి అసంఖ్యాకసైన్యంతో వెళ్ళి, ద్రుపదుపురాన్ని ముట్టడించారు.

విశేషం: ఉత్సాహం జాతివృత్తం. అందులో ప్రతిచరణంలోనూ ఏడు సూర్యగణాలు, ఒక గురువు ఉంటాయి. అయిదవగణం మొదటి అక్షరం యతి. ఉత్సాహం వీరరసస్థాయిభావం. ఆ పేరుతో వెలసిన వృత్తం ఇక్కడ కురుకుమారులు యుద్ధోత్సాహాన్ని ప్రదర్శించే సందర్భంలో వాడబడింది. 'ఉత్సాహ స్సర్వకృత్యేషు సత్వరా మానసీక్రియా' అన్న భావప్రకాశోక్తికి అనుగుణంగా కురుకుమారుల వేగవంతమైన మానసికప్రక్రియను ఈ వృత్తం ధ్వనింప చేస్తున్నది. కాబట్టి నన్నయ మొదటిసారిగా వాడిన ఉత్సాహవృత్తాన్ని కథార్థయోజనకు అనుగుణంగా నిర్వహించాడు. (సంపా.)

వ. పాండవులును రథంబు లెక్కి ద్రోణుం బరివేష్టించి పిఱుంద నరిగి; రంత నర్జునుం డాచార్యున కి ట్లనియె.67

ప్రతిపదార్థం: పాండవులును; రథంబులు+ఎక్కి; ద్రోణున్= ద్రోణాచార్యుని; పరివేష్టించి= చుట్టువచ్చి; పిఱుందన్= వెనుక; అరిగిరి= వెళ్ళారు; అంతన్= అప్పుడు; అర్జునుండు; ఆచార్యునకున్= ద్రోణాచార్యునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పాండవులుకూడా రథాలెక్కి ద్రోణుణ్ణి మధ్యలో ఉంచి చుట్టూ తాము గుమిగూడి రక్షించుకొంటూ కౌరవులవెనుకనే బయలుదేరి వెళ్ళారు. అప్పుడు అర్జునుడు ద్రోణునితో ఇట్లా అన్నాడు.

క. వడిగొని కౌరవు లొండొరుఁ । గడవఁగ మును చనిరి; వారిగర్వము సూడం
గడిమిని ద్రుపదాధిపుతోఁ । బొడువఁగఁ దమ కలవియగునె భుజవీర్యమునన్. 68

ప్రతిపదార్థం: కౌరవులు; వడిగొని= వేగంగా; ఒండొరున్= ఒకరినొకరు; కడవఁగన్= మీరునట్లుగా; మును, చనిరి= ముందు వెళ్ళారు; వారిగర్వము; చూడన్= చూడగా; భుజ, వీర్యమునన్= భుజశక్తిలోని; కడిమిని= అతిశయంతో; ద్రుపద+అధిపుతోన్= ద్రుపదరాజుతో; పొడువఁగన్= యుద్ధంచేయటానికి; తమకు+అలవి, అగునె= తమకు సాధ్యమవుతుందా?

తాత్పర్యం: కౌరవులు వేగంగా ఒకరినొకరు మీరి ముందుగా వెళ్ళారు గాని - వాళ్ళగర్వం చూస్తే - భుజబలంలో ద్రుపదరాజును మించి యుద్ధంచేయటం వాళ్ళకు సాధ్యమా?

విశేషం: ఇది ద్రుపదునిబలం ఏపాటిదో తెలిసికొనాలని పార్థుడు సాగించినసంభాషణ, ఉత్తమవీరుడు శత్రుబలాన్ని అంచనా వేసుకోకుండా యుద్ధానికి దిగడు. కౌరవులు తామే ద్రుపదుడిని పట్టితెచ్చామన్న కీర్తి రావాలని, ద్రోణునిమెప్పు పొందాలని, అవిచారంగా, ఆవేశంతో ముందుకు దూకారు. అర్జునుడు అట్లా చేస్తాడా? దెబ్బతిని తిరిగి వస్తాడా? పైగా అస్త్రవిద్యాభ్యాసం తరువాత ఇదే తానెదుర్కొనే ప్రథమయుద్ధం. అందులోనూ ద్రుపదునితో. అందుకే ఇంత ఆలోచన. తన గురువును అంతటి అస్త్రవిద్యాచార్యుడిని తిరస్కరించిన ద్రుపదుడు అంత తక్కువవాడుగా ఉంటాడా? కాని ద్రుపదుని బలపరాక్రమాల కొలదిని

గూర్చి గురువుగారిని ప్రత్యక్షంగా అడగటం ఎట్లా? అర్జునుడు జంకుతున్నాడనే భావన ఆయనకు వస్తుందేమో? అంతేకాదు, తన ఆత్మాభిమానం ఏమి కావాలి? అందుకే అర్జునుడు అంతనేర్పుగా ద్రోణునితో సంభాషణ ఆరంభించాడు; కౌరవుల స్వాతిశయాన్ని, తొందరపాటును గూర్చి అనుకొంటున్నట్లు ఆరంభించాడు.

క. అతగులచే ద్రుపదుఁ డనవ । హితుఁ డై పట్టువడ నంతహీనుఁడె? శౌర్యో
న్నతుఁ డధికధనుర్విద్యా । న్వితుఁడు భవత్సఖుఁ డనంగ వినరొకొ వానిన్. 69

ప్రతిపదార్థం: ద్రుపదుఁడు; అనవహితుడు+ఐ= ఎచ్చరిక లేనివాడై; అతగులచే= బలహీనులచే; పట్టు పడన్=చిక్కుటకు; అంత, హీనుఁడె= అంతతక్కువవాడా!; వానిన్= ఆ ద్రుపదుడిని; శౌర్య+ఉన్నతుఁడు= శూరత్వంచేత గొప్పవాడు; అధిక, ధనుః+విద్యా+అన్వితుఁడు= గొప్ప ధనుర్విద్యతో కూడుకొన్నవాడు; భవత్+సఖుఁడు= మీయొక్క స్నేహితుడు; అనంగన్= అని అంటుండగా; వినరు+ఒకొ= వినలేదా ఏమి?

తాత్పర్యం: ఏమరుపాటున బలహీనులచేత పట్టువడటానికి ద్రుపదుడంత తక్కువవాడా? ద్రుపదుడు గొప్ప శౌర్యవంతుడనీ, గొప్ప ధనుర్విద్యాసంపన్నుడనీ, మీ స్నేహితుడనీ వినలేదా ఏమి ?

విశేషం: గురువుగారుమాత్రం తక్కువవారా! శిష్యునిశక్తిసామర్థ్యాలు ఆయనకు తెలియవా. పరీక్షకు ముందే శిష్యునికి సమాధానాలు చెపుతాడా? అందుకే ద్రోణునిమౌనం. ప్రియశిష్యునియుద్ధనైపుణ్యాని కిది ప్రథమపరీక్ష. ఆ శిష్యుడే అన్నీ ఆలోచించుకోవాలి. అంచనా వేసుకోవాలి. యుద్ధం చేయాలి. విజయం సాధించాలి. గురుదక్షిణ ఇవ్వాలి.

వ. అనుచుం బాంచాలుపురం బాసన్నంబు గాఁ జనుదెంచునంతకు ముందఱ చని దుర్యోధన యుయుత్సు దుశ్శాసనవికర్ణజలసంధాదు లైన ధార్తరా ష్ట్రు లనేకనృపకుమారసహితు లై పాంచాలుపురం బవరోధించినఁ బాంచాలపతి యలిగి యపారచతురంగబలసమేతుం డై కౌరవులం దాఁకి. 70

ప్రతిపదార్థం: అనుచున్; పాంచాలు, పురంబు= ద్రుపదునియొక్క నగరం; ఆసన్నంబు, కాన్= దగ్గర అయ్యేటట్లు; చనుదెంచు+అంతకున్= రాగా; చని= ముందుగా వెళ్ళి; దుర్యోధన, యుయుత్సు, దుశ్శాసన, వికర్ణ, జలసంధ+÷ఆదులు+ఐన= దుర్యోధనుడు, యుయుత్సుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, జలసంధుడు మొదలైన; ధార్తరాష్ట్రులు= ధృతరాష్ట్రుని కుమారులు; అనేక, నృప, కుమార, సహితులు+ఐ= పెక్కుమంది రాకుమారులతో కూడినవాళ్ళయి; పాంచాలు, పురంబు; అవరోధించినన్= అడ్డగించగా; పాంచాల, పతి= పాంచాలరాజు - ద్రుపదుడు; అలిగి= కోపించి; అపార, చతురంగ, బల, సమేతుండు+ఐ= అంతులేని రథ గజ తురగ పదాతి సైన్యంతో కూడుకొన్నవాడై; కౌరవులన్; తాఁకి= ఎదుర్కొని.

తాత్పర్యం: ద్రుపదునినగరం దగ్గరపడగా దుర్యోధనుడు, యుయుత్సుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, జలసంధుడు మొదలైన ధృతరాష్ట్రునికుమారులు, పెక్కుమంది రాకుమారులతో కలిసి, ఆ ద్రుపదుని నగరాన్ని ముట్టడించగా, ద్రుపదుడు కోపించి అంతులేని రథగజతురగపదాతిసైన్యంతో కౌరవుల నెదుర్కొని.

క. శరనికరసహస్రంబులఁ । బరువడి నందఱను గప్పెఁ బ్రావృడ్ధారా
ధర మురుధారాజలముల । సరసిజములఁ గప్పనట్లు సంరంభమునన్. 71

ప్రతిపదార్థం: ప్రావృట్+ధారా, ధరము= వర్షాకాల మేఘం; ఉరు, ధారా, జలముల= పెద్ద ధారలైన నీళ్ళతో; సరసిజములన్= పద్మాలను; కప్పునట్లు= క్రమ్మే విధంగా; సంరంభమునన్= త్వరపడి; శర, నికర, సహస్రంబులన్= వేలబాణసమూహాలతో; పరువడిన్= వరుసగా; అందఱను= వారిని అందరినీ; కప్పెన్= కప్పాడు.

తాత్పర్యం: వర్షాకాలమేఘం పెద్ద జలధారలతో పద్మాలను కప్పివేసినట్లు ద్రుపదుడు త్వరపడి బాణ సమూహాలు వేలకువేలు వేసి, వాళ్ళనందరినీ వరుసగా కప్పివేశాడు.

విశేషం: అలం: ఉపమ.

క. కలయ నసిముసల దండం । బులు గొని కాంపిల్యనగరమున జను లెల్లన్
నలి రేఁగి యార్చి కౌరవ । బలసుభటులఁ బొడిచి రాజి బడలు వడంగన్. 72

ప్రతిపదార్థం: కాంపిల్య, నగరమునన్, జనులు+ఎల్లన్= కాంపిల్యనగరంలోని ప్రజలంతా; నలి= మిక్కిలి; రేఁగి= విజృంభించి; ఆర్చి= సింహనాదాలు చేసి; కలయన్= అంతటా; అసి, ముసల, దండంబులు= కత్తులను, రోకళ్ళను, కర్రలను; కొని= చేతపట్టి; ఆజిన్= యుద్ధంలో; కౌరవ, బల, సుభటులన్= కౌరవ సైన్యంలోని మేటి వీరులను; బడలుపడంగన్= శ్రమపడేట్లుగా; పొడిచిరి= యుద్ధంచేశారు.

తాత్పర్యం: కాంపిల్యనగరంలోని ప్రజలంతా విజృంభించి సింహనాదాలు చేసి, కత్తులు, రోకళ్ళు, కర్రలు చేతపట్టి కౌరవసేనలోని మేటివీర లందరు బడలికపొందేటట్లు యుద్ధం చేశారు.

క. ధృతరాష్ట్రకుమారకు లవ । హితు లై పాంచాలుమీఁద నేసిరి సాంద్రా
తతబాణప్రకరతిరో । హిత మై రవికిరణజాల మేర్పడకుండన్. 73

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రకుమారులు= ధృతరాష్ట్రునియొక్క ప్రియపుత్రులు; అవహితులు+ఐ= ఎచ్చరిక గలవాళ్ళయి - సావధానులై; సాంద్ర+ఆతత, బాణ, ప్రకర, తిరోహితము+ఐ= దట్టములై అధికములైన బాణాల సమూహంచేత కప్పబడినదై; రవి, కిరణ, జాలము= సూర్యునియొక్కకిరణాలసమూహం; ఏర్పడక+ఉండన్= బయటపడకుండ ఉండేటట్లుగా; పాంచాలుమీఁదన్= ద్రుపదునిమీద; ఏసిరి= కొట్టారు.

తాత్పర్యం: కౌరవులు సావధానులై సూర్యకిరణాలుకూడా బయల్పడకుండేటట్లు దట్టమై అధికమైన బాణ సమూహాన్ని ద్రుపదునిమీద వేశారు.

క. వారల శరములు నడుమన । వారించుచు నధికలాఘవంబున వారిన్
ఘోరశరవిద్ధమర్ములఁ । గా రణమున సోమకుండు ఘనుఁ డై యేసెన్. 74

ప్రతిపదార్థం: సోమకుండు= ద్రుపదుడు; రణమునన్= యుద్ధంలో; ఘనుఁడు+ఐ= గొప్పవాడై - అధికుడై; వారల, శరములు= వాళ్ళయొక్క - కౌరవులయొక్క బాణాలు; నడుమన= నడుమనే; వారించుచున్= తొలగిస్తూ; అధిక, లాఘవంబునన్= మిక్కిలి సులువుగా; వారిన్= వాళ్ళను; ఘోర, శర, విద్ధ, మర్మలన్+కా= భయంకరాలైన బాణాలచేత బాధింపబడిన ఆయువుపట్లు కలవాళ్ళనుగా; ఏసెన్= కొట్టినాడు.

తాత్పర్యం: యుద్ధంలో ద్రుపదుడు పెచ్చుపెరిగినవాడై కౌరవుల బాణాలను నడుమనే తొలగించి, అతిసులభంగా వారిఆయువుపట్లు అదరేటట్లు భయంకరాలైన బాణాలతో కొట్టాడు.

క. నానావిధ మార్గణముల । నానామార్గముల నేసినం, గురువీరుల్
వానిం జూచి భయంపడి । నానాతనుఁగా మనంబునన్ వగచి రనిన్. 75

ప్రతిపదార్థం: నానావిధ, మార్గణముల= పలురకాలైన బాణాలచేత; నానామార్గములన్= పలువైపులనుండి; ఏసినన్= కొట్టగా; కురు, వీరుల్= కౌరవవీరులు; అనిన్= యుద్ధంలో; వానిన్= ఆ ద్రుపదుడిని; చూచి; భయంపడి; నానాతనున్+కా= అనేకవిధాలైన రూపాలు కలవాడినిగా; మనంబునన్= మనస్సులో; వగచిరి= తలచారు.

తాత్పర్యం: పలువిధాలైన బాణాలచేత పలువైపులనుండి కొట్టగా, కురువీరులు యుద్ధంలో ఆ ద్రుపదుణ్ణి చూచి భయపడి, అతణ్ణి నానారూపాలు కలవాణ్ణిగా మనస్సులో తలచారు.

వ. ఇట్లు పాంచాలుబాణవృష్టికి నిలుపోపక కురుకుమారులు కుమారశరనిహత సురారికుమారులుంబోలె వెఱచఱిచి పాండవులయొద్దకుం బఱతెంచినం జూచి, యర్జునుం డాచార్యధర్మజులకు నమస్కరించి 'మీర లింద యుండుం; డే నీక్షణంబ యప్పాంచాలుం బట్టి తెచ్చెద' నని విజృంభించి, సంరంభంబున భీమసేనుండు దనకు సేనాగ్రచరుండుగా మాద్రేయులు రథచక్రరక్షకులుగా ద్రుపదరాజవాహినీసముద్రంబు దఱియం జొచ్చిన. 76

ప్రతిపదార్థం: ఇట్లు; పాంచాలు, బాణ, వృష్టికిన్= ద్రుపదునియొక్క బాణాల వానకు; నిలుపు+ఓపక= నిలువలేక; కురుకుమారులు; కుమార, శర, నిహత, సుర+అరి, కుమారులున్+పోలెన్= కుమారస్వామియొక్క బాణాలతో కొట్టబడిన రాక్షసకుమారులవలె; వెఱచఱిచి= భయపడి; పాండవుల, ఒద్దకున్= పాండవులదగ్గరకు; పఱతెంచినన్= పరుగెత్తుకొనిరాగా; చూచి, అర్జునుండు; ఆచార్య, ధర్మజులకు= ద్రోణాచార్యునికి, ధర్మరాజుకు; నమస్కరించి; మీరలు; ఇందు+అ= ఇక్కడే; ఉండుండు= ఉండండి; ఏను= నేను; ఈ క్షణంబు+అ= ఈ నిమిషాన్నే; ఆ+పాంచాలున్= ఆ ద్రుపదుడిని; పట్టి; తెచ్చెదను+అని; విజృంభించి; సంరంభంబునన్= వేగిరపాటుతో; భీమసేనుండు; తనకున్; సేనా+అగ్రచరుండు+కా= సేనయొక్క ముందుభాగానికి వెళ్ళేవాడుగా; మాద్రేయులు= మాద్రితనయులైన నకులసహదేవులు; రథ, చక్ర, రక్షకులుగా= రథంయొక్కచక్రాలను రక్షించేవాళ్ళుగా; ద్రుపద, రాజ, వాహినీ, సముద్రంబున్= ద్రుపదరాజుయొక్కసేన అనే సముద్రాన్ని; తఱియన్= సమీపించేటట్లు; చొచ్చినన్= ప్రవేశించగా.

తాత్పర్యం: ద్రుపదునిబాణవర్షానికి నిలువలేక కౌరవులు కుమారస్వామిబాణాలచేత కొట్టబడిన రాక్షసకుమారులవలె భయపడి పాండవులదగ్గరకు పరుగెత్తారు. అది చూచి అర్జునుడు ద్రోణధర్మరాజులకు నమస్కరించి 'మీ రిక్కడే ఉండండి. నేను ఈ క్షణాన్నే ద్రుపదుణ్ణి పట్టి తెస్తా' నని ఆటోపంతో, భీమసేనుడు తనసైన్యానికి ముందు నడువగా, నకులసహదేవులు తనచక్రరక్షకులు కాగా, ద్రుపదుడిసైన్యమనే సముద్రాన్ని సమీపించాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకం. అర్జునుడు గురువైన ద్రోణునికి, పెద్దన్న అయిన ధర్మరాజుకు నమస్కరించటం గురుజనభక్తికి నిదర్శనం. అర్జునుడికి గురు వెంతటి దైవమో, అన్నకూడా అంతటి దైవం.

భీమార్జునులు ద్రుపదునిసేనను దునుమాడుట (సం. అను.1-78-40 పంక్తి)

క. కరిఘటలఁ దాఁకి భీముఁడు । కరటికటీకుంభదంతకరముఖముల జ
ర్జరితములఁ జేసె నిష్ఠుర । తరవజ్రనిపాతపటుగదాఘాతములన్. 77

ప్రతిపదార్థం: కరి, ఘటలన్= ఏనుగుల సమూహాలను; తాఁకి= ఎదుర్కొని; భీముఁడు; నిష్ఠురతర, వజ్ర, నిపాత, పటు, గదా, ఘాతములన్= మిక్కిలి కఠినాలైన వజ్రాయుధంయొక్క దెబ్బలవలె బలమైన గదయొక్క దెబ్బలచేత; కరటి, కటీ, కుంభ, దంత, కర, ముఖములన్= ఏనుగులయొక్క చెక్కిళ్ళను, కుంభస్థలాలను, దంతాలను, తొండాలను, ముఖాలను; జర్జరితములన్+చేసెన్= పగులగొట్టబడినవాటినిగా చేశాడు.

తాత్పర్యం: భీముడు ఏనుగుల సమూహాలను ఎదుర్కొని వజ్రపాతంవంటి గదాఘాతాలచేత వాటిచెక్కిళ్ళను, కుంభస్థలాలను, దంతాలను, తొండాలను, ముఖాలను పగులగొట్టాడు.

ఉ. దారుణమౌ వృకోదరు గదాకులిశాహతి నన్యవాహినీ
వారణసంచయం బభినవక్షతజారుణధార లొప్ప సం
చారితధాతునిర్ఝరవిశాలశిలోచ్చయ సంచయాభమై
వీరరణంబునం బడియె విక్షతహస్తిపవృక్షపంక్తితోన్. 78

ప్రతిపదార్థం: దారుణము+!ఔ= భయంకరమైనట్టి; వృక+ఉదరు, గదా, కులిశ+ఆహతిన్= తోడేలు కడుపువంటి కడుపు కలవాడైన భీమునియొక్క గద అనే వజ్రాయుధంయొక్క దెబ్బచేత, అన్య, వాహినీ, వారణ, సంచయంబు= శత్రుసేనలోని ఏనుగులగుంపు; అభినవ, క్షతజ+అరుణ, ధారలు+ఒప్పన్= కొత్తనెత్తురుయొక్క ఎఱ్ఱనిధారలు ఒప్పగా; సంచారిత, ధాతు, నిర్ఝర, విశాల, శిలా+ఉచ్చయ, సంచయ+ఆభము+ఐ= సంచరింపజేయబడిన గైరికధాతువులతో కూడిన సెలయేళ్ళతో విశాలమైన పర్వత సమూహం యొక్క కాంతి గలదై; విక్షత, హస్తిప, వృక్ష, పంక్తితోన్= కొట్టబడిన మావటీళ్ళనే వృక్షాల సమూహంతో, వీర, రణంబునన్= వీరులయొక్కయుద్ధంలో; పడియెన్= పడింది.

తాత్పర్యం: భయంకరమైన వజ్రాయుధంవంటి భీమునిగదాఘాతంచేత శత్రుసైన్యంలోని ఏనుగులగుంపు - క్రొత్తనెత్తుటిధారలతో - గైరికాదిధాతువులతో కూడిన సెలయేళ్ళతో, విశాలమైన సంచార పర్వత సమూహంవలె, కొట్టబడిన మావటీళ్ళనే వృక్షసమూహంతోకూడి ఆ యుద్ధంలో పడింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'పర్వతసమూహంవలె' అని ఉంటే ఉపమ అవుతుంది. కాని, 'సంచారపర్వతసమూహంవలె' అనే భావన దీన్ని ఉత్ప్రేక్షగా మారుస్తున్నది.

చ. అనిలజుఁ డుగ్రుఁ డై ద్రుపదుహస్తిఘటావళి నశ్వసంహతిన్
ఘనరథకోటి భగ్నములుగా సమరంబునఁ జేసె పేదదు
ర్మనుజులఁ జంప నేల యని మానుగ గోపుఁడు గోగణంబులన్
గొనకొని రొప్పునట్టు లధికుం డెగిచెం బృథుదండహస్తుఁ డై. 79

ప్రతిపదార్థం: అనిలజుఁడు= వాయుదేవునికుమారుడైన భీముడు; ఉగ్రుఁడు+ఐ= భయంకరమైనవాడై; సమరంబునన్= యుద్ధంలో; ద్రుపదు, హస్తి, ఘటా+ఆవలిన్= ద్రుపదునియొక్క ఏనుగు మందలయొక్క సముదాయాన్ని; అశ్వ, సంహతిన్= గుర్రాల సమూహాన్ని; ఘన, రథ, కోటిన్= గొప్ప రథాల సమూహాన్ని; భగ్నములు+కాన్= దెబ్బతిన్నవాటినిగా; చేసి, పేద, దుర్+మనుజులన్= బలహీనులైన దుష్ట మానవులను; చంపన్+ఏల= చంపటం ఎందుకు; అని= అనుకొని; మానుగన్= ఒప్పుగా; అధికుండు= గొప్పవాడు - భీముడు; పృథు, దండ, హస్తుఁడు+ఐ= పెద్దగద చేతిలో గలవాడై; గోపుఁడు= ఆవులకాపరి; గో, గణంబులన్= ఆవుల సమూహాలను; కొనకొని= పూని; రొప్పునట్టుల= అరచి తరిమినట్లుగా; ఎగిచెన్= తరిమాడు.

తాత్పర్యం: భీముడు భయంకరుడై యుద్ధంలో ద్రుపదునిగజాశ్వరథసమూహాలను భగ్నంచేసి, బలహీనులైన దుష్టమానవులను చంపటం ఎందుకులే అని గొల్లవాడు గోవులమందను అరచి తరిమినట్లు తరిమాడు.

విశేషం: అలం: ఉపమ. భీమపరాక్రమాన్ని వర్ణించిన 77, 78, 79 పద్యాలు ఓజోగుణరమణీయాలు.

స్రగ్ధర.

అంతఁ గౌంతేయుఁ డత్యాయతభుజుఁడు నరుం డల్గి పాంచాలు దంతి
ధ్వాంతంబున్ వానివాహోత్తమతుహినతతిం దద్భటోదారతారా
సంతానంబున్ శరాంశూచ్చయవిభవమునన్ శాంతిఁ బొందించి యుద్య
ద్ధ్వాంతారాతిప్రభుం డై తనరుచు వెలిఁగెన్ దద్రణవ్యోమవీథిన్. **80**

ప్రతిపదార్థం: అంతన్= తర్వాత; అతి+ఆయత, భుజుఁడు= మిక్కిలి విశాలాలైన భుజాలు కలవాడు; కౌంతేయుఁడు= కుంతీదేవి కుమారుడు; నరుండు= అర్జునుడు; అల్గి= కోపించి; పాంచాలు, దంతి, ధ్వాంతంబున్= ద్రుపదునియొక్కఏనుగుల సమూహమనే చీకటిని; వాని, వాహ+ఉత్తమ, తుహిన, తతిన్= అతనియొక్క అశ్వశ్రేష్ఠాలనే మంచుసమూహాన్ని; తత్+భట+ఉదార, తారా, సంతానంబున్= అతనియొక్క భటులు అనే గొప్పనక్షత్రాల సమూహాన్ని; శర+అంశు+ఉచ్చయ, విభవమునన్= బాణాలు అనే కిరణాల సమూహంయొక్కసంపదచేత; శాంతిన్+పొందించి= అణగేటట్లు చేసి; తత్+రణ, వ్యోమ, వీథిన్= ఆ యుద్ధమనే ఆకాశమార్గంలో; ఉద్యత్+ధ్వాంత+అరాతి, ప్రభుండు+ఐ= ప్రకాశిస్తున్నసూర్యునికాంతివంటి కాంతి గలవాడై; తనరుచున్= ఒప్పుతూ; వెలిఁగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: తర్వాత విశాలాలైన భుజాలు కలవాడూ, కుంతీకుమారుడూ అయిన అర్జునుడు ఆగ్రహించి, ద్రుపదుని ఏనుగులసమూహమనే చీకటిని, అశ్వసమూహమనే మంచును, సైనికసమూహమనే నక్షత్రసముదాయాన్ని తన బాణాలనే కిరణసంపదచేత అణగేటట్లు చేసి, యుద్ధమనే ఆకాశవీథిలో సూర్యుడివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: రూపకం. స్రగ్ధరావృత్తంలో ప్రతిపాదంలోనూ మ, ర, భ, న, య, య, య అనే గణాలుంటాయి. 8, 15 అక్షరాలతో యతిమైత్రి. నన్నయ వాడిన స్రగ్ధరావృత్త మిదే. “వీరస్య భుజదండానాం వర్ణనే స్రగ్ధరా భవేత్” అని కాత్యాయనుడు చెప్పినట్లు అభినవగుప్తపాదులు పేర్కొన్నారు. అత్యాయుతభుజుడైన అర్జునుని బాణప్రయోగాన్ని సూర్యుని కర (కిరణ) ప్రయోగాలుగా రూపకం చేయటంతో ఛందశ్శిల్పంతోపాటు అలంకారసార్థక్యాన్నికూడా నన్నయ ప్రదర్శించాడు. (సంపా.)

క. ఆతనిఁ జూచి సహింపక । యాతతకార్ముకుఁడు ద్రుపదునను జుఁడు శౌర్యో

పేతుఁడు సత్యజితుం డను । నాతఁడు ధీరుఁ డయి తాఁకె నతిరభసమునన్. 81

ప్రతిపదార్థం: ఆతనిన్= ఆ అర్జునుడిని; చూచి; సహింపలేక= ఓర్వలేక; ఆతత, కార్ముకుఁడు= గొప్పవిల్లు కలవాడు; శౌర్య+ ఉపేతుఁడు= శౌర్యంతో కూడుకొన్నవాడు; ద్రుపదున్+అనుజుఁడు= ద్రుపదుడిని అనుసరించి పుట్టినవాడు - తమ్ముడు; సత్యజితుండు; అను; అతడు; ధీరుఁడు+అయి= ధైర్యంగలవాడై; అతి, రభసమునన్= మిక్కిలి ఆటోపంతో; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: అర్జునునివిజృంభణం చూచి ఓర్వలేక ద్రుపదునితమ్ముడు సత్యజితుడనేవాడు గొప్పవిల్లు చేపట్టి శౌర్యధైర్యాలు గలవాడై అమితమైన ఆటోపంతో ఆతణ్ణి ఎదుర్కొన్నాడు.

క. కడఁగి ద్రుపదానుజుఁడు నె । వ్వడిఁ గవ్వడి నేసె నూఱువాఁడిశరములం

గడు నలిగి వాని నన్నియు । నడుమన తునియంగ నేసె నరుఁ డస్త్రములన్. 82

ప్రతిపదార్థం: ద్రుపద+అనుజుఁడు= ద్రుపదునితమ్ముడు; కడఁగి= పూనుకొని; నెఱ+వడిన్= నిండువేగంతో; నూఱు, వాఁడి, శరములన్= వంద పదునైన బాణాలచేత; కవ్వడిన్= అర్జునుడిని; ఏసెన్= కొట్టాడు; నరుఁడు= అర్జునుడు; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి; వానిన్= ఆ బాణాలను; అన్నియున్= అన్నింటిని; నడుమన్+అ= మధ్యలోనే; తునియంగన్= ముక్కలయ్యేటట్లు; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: ద్రుపదుని తమ్ముడు ఎంతో ప్రయత్నించి, మహావేగంగా వందవాడిబాణాలతో అర్జునుడిని కొట్టాడు. అందుకు అర్జునుడు ఆగ్రహించి, తనబాణాలతో నడుమనే వాటినన్నింటిని ముక్కలు చేశాడు.

క. వివిధాస్త్రకోవిదుఁడు వా । సవి వానిరథంబుఁ బార్ష్ణిసారథుల మహిం

గువలు వడ నేసె నుగ్రా । హవమునకును వాఁడు విముఖుఁడై చెడి పఱవన్. 83

ప్రతిపదార్థం: వివిధ+అస్త్ర, కోవిదుఁడు= అనేకవిధాలైన అస్త్రాలను తెలిసినవాడు; వాసవి= ఇంద్రునికొడుకైన అర్జునుడు; వాని, రథంబున్= అతనియొక్క రథాన్ని; పార్ష్ణి సారథులన్= వెనుక కాపలాకాసేవాళ్ళను, సారథులను; వాఁడు= ఆ ద్రుపదుని తమ్ముడు; ఉగ్ర+ఆహవమునకును= భయంకరమైనయుద్ధానికి; విముఖుఁడు+ఐ= పెడమొగంగలవాడై; చెడి= కనబడకుండ; పఱవన్= పరుగెత్తిపోయేటట్లు; మహిన్= భూమిమీద; కువలుపడన్= కుప్పలుపడేట్లుగా; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: అనేకవిధాలైన అస్త్రాలు తెలిసిన అర్జునుడు - ద్రుపదుడితమ్ముడు గొప్పయుద్ధానికి భయపడి పరుగెత్తిపోయేటట్లు - అతనిరథాన్నీ, సారథులనూ నేలమీద కుప్పలు పడేటట్లు కొట్టాడు.

వ. అంత. 84

తాత్పర్యం: ఆ పైన.

క. శరమోక్షణవేగనిరం । తరమండలితోరుచాపదండుఁ డకాండో

ద్ధురదండధరుఁడపోలెను । హరినందనుఁ దాఁకె ద్రుపదుఁ డత్యుద్ధతుఁ డై. 85

ప్రతిపదార్థం: శర, మోక్షణ, వేగ, నిరంతర, మండలిత+ఉరు, చాప, దండుఁడు= బాణాలను వదలటంలోని వేగంచేత ఎడతెగక వలయాకారంగా చేయబడిన గొప్ప ధనుస్సుయొక్క కర్రగలవాడు; ద్రుపదుఁడు; అతి+ఉద్ధతుఁడు+ఐ= మిక్కిలి గర్వించినవాడై; అకాండ+ఉద్ధుర, దండ, ధరుఁడు+అ, పోలెను= అకాలంలో విజృభించిన యముడో అనేటట్లు; హరి, నందనున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుణ్ణి; తాఁకెన్= ఎదుర్కొన్నాడు.

తాత్పర్యం: వ్యవధి లేకుండ వేగంగా బాణాలు వదలటంవలన వలయాకారం పొందిన ధనుస్సుయొక్క కర్ర కలవాడైన ద్రుపదుడు, మిక్కిలిగర్వంతో అకాలంలో విజృంభించిన యముడో అన్నట్లు అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. 'చాపదండుఁ డకాండోద్ధుర....' అనేదానికి 'చాపదండు నకాండోద్ధుర...' అనే పాఠాంతరమున్నది. అట్లయితే ఆ విశేషం అర్జుననకు అన్వయిస్తుంది.

మ. పరమాస్త్రైకవిశారదుల్ బలయుతుల్ పాంచాలకౌంతేయు లొం
డొరులన్ మార్కొని యేయునప్పుడు తదీయోగ్రాజిరంగంబు దు
స్తర నీరంధ్ర నిశాత సాయక తమస్సంఛన్న మైనం బర
స్పరయుద్ధంబులు దక్కి యోధులు నిశాభ్రాంతాత్ము లై రచ్చటన్. 86

ప్రతిపదార్థం: పరమ+అస్త్ర+ఏక, విశారదుల్= ఉత్తమాలైన అస్త్రాలలో మిక్కిలిపండితులూ; బలయుతుల్= బలంతో కూడుకొన్నవాళ్ళు అయిన; పాంచాల, కౌంతేయులు= పాంచాలరాజైన ద్రుపదుడు, కుంతీ తనయుడైన అర్జునుడు; ఒండు+ఒరులన్= ఒకరినొకరు; మార్కొని= ఎదుర్కొని; ఏయు+అప్పుడు= బాణాలు ప్రయోగించేటప్పుడు; తదీయ+ఉగ్ర+ఆజి, రంగంబు= వాళ్ళయొక్క భయంకరమైన యుద్ధభూమి; దుస్+తర, నీరంధ్ర, నిశాత, సాయక, తమస్+సంఛన్నము+ఐనన్= దాటరానివి, దట్టమైనవి, వాడిఅయినవి అయిన బాణాలవలన కలిగిన చీకటిచేత కప్పబడగా; అచ్చటన్= అక్కడగల; యోధులు= వీరులు; పరస్పర యుద్ధంబు= ఒకరితో నొకరు పోరాడటాలు, తక్కి= మాని; నిశా, భ్రాంత+ఆత్ములు+ఐరి= రాత్రి అయిందనే భ్రాంతిని పొందిన మనస్సులు కలవాళ్ళు అయ్యారు.

తాత్పర్యం: అస్త్రవిద్యలో పండితులు, బలవంతులు అయిన ద్రుపదపార్థులు, ఒకరినొకరు ఎదుర్కొని బాణాలు ప్రయోగించుకొనేటప్పుడు - భయంకరమైన వాళ్ళయుద్ధభూమి, దాటరాని దట్టమైన వాడిబాణాలతో కప్పబడి చీకటిమయం కాగా, అచ్చటివీరులు ఒకరితో ఒకరు పోరాటడం మాని రాత్రి అయిందని భ్రాంతిపడ్డారు.

విశేషం: అలం: భ్రాంతిమంతం.

అర్జునుఁడు ద్రుపదుం బట్టి కట్టి తెచ్చుట (సం.1-128-3)

వ. అట్టి మహాద్వంద్వయుద్ధంబున విజిగీషుం డయి పాంచాలుండు పాండవమధ్యముధనుర్మధ్యంబు భగ్నంబుగా నొక్కబాణంబున నేసి యార్చిన, నలిగి వాసవసుతుం డుద్యతాసిహస్తుం డయి శైలస్థలంబుమీఁదికి లంఘించుకొదమసింగంబునుంబోలె ద్రుపదురథంబుమీఁదికి లంఘించి వానిం బట్టికొనినఁ దత్సైన్యంబు హాహాకారంబు లెసంగ మహార్ణవంబునుంబోలె మ్రోయుచుండె నంత. 87

ప్రతిపదార్థం: అట్టి; మహా, ద్వంద్వ, యుద్ధంబునన్= అటువంటి గొప్ప జంటపోరులో; విజిగీషుండు+అయి= జయించాలన్నకోరిక మిక్కుటంగా కలవాడై; పాంచాలుండు= ద్రుపదుడు; పాండవ, మధ్యము, ధనుః+మధ్యంబు= పాండవులలో

నడిమివాడైన అర్జునుని విల్లుయొక్క నడిమిభాగం; భగ్నంబు, కాన్= విరిగేటట్లుగా; ఒక్క, బాణంబునన్= ఒక్క బాణంతో; ఏసి= కొట్టి; ఆర్చినన్= సింహనాదం చేయగా; వాసవ, సుతుండు= దేవేంద్రునియొక్క కుమారుడైన అర్జునుడు; అలిగి= కోపించి; ఉద్యత+అసి, హస్తుండు+అయి= ఎత్తబడిన కత్తిని చేతిలో కలవాడై; శైల, స్థలంబు, మీఁదికిన్= కొండ ప్రదేశం మీదికి; లంఘించు= ఎగిరిదూకే; కొదమ, సింగంబునున్+పోలెన్= పిల్లసింహంవలె; ద్రుపదు రథంబు, మీఁదికి= ద్రుపదుని తేరుపైకి; లంఘించి= దూకి; వానిన్= ఆ ద్రుపదుడిని; పట్టికొనినన్= పట్టుకోగా; తత్+సైన్యంబు= అతనియొక్క సైన్యం; హాహాకారంబులు= హాహా శబ్దాలు; ఎసంగన్= అతిశయించగా; మహా+అర్ణవంబునున్+పోలెన్= మహాసముద్రంవలె; మ్రోయుచున్+ఉండెన్= ఘోషిస్తూ ఉండింది; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ గొప్పద్వంద్వయుద్ధంలో జయించాలన్నకోరిక మిక్కుటంగా కలవాడై ద్రుపదుడు, అర్జునుని విల్లు నడిమిభాగం విరిగేటట్లు ఒక బాణం వేసి పెద్దగా అరచాడు. అందుకు అర్జునుడు ఆగ్రహించి, చేత కత్తి నెత్తుకొని కొండమీదికి దూకే కొదమసింహంవలె ద్రుపదునిరథంమీదికి ఎగిరి దూకి, అతణ్ణి పట్టుకొన్నాడు. అప్పుడు ద్రుపదునిసైన్యం పెద్దహాహాకారాలతో మహాసముద్రంవలె ఘోషిస్తూ ఉండింది.

విశేషం: అలం: ఉపమ.

క. ప్రక్షీణదర్పు ద్రుపదు ర । థాక్షముతోఁ గట్టి తెచ్చి యర్జునుఁడు క్రియా
దక్షుం డయి గురునకు గురు । దక్షిణగా నిచ్చి చేసెఁ దత్సమ్మదమున్. 88

ప్రతిపదార్థం: అర్జునుఁడు; క్రియా, దక్షుండు+అయి= కార్యంలో సమర్థుడై - అంటే చేయవలసిన పనిని చేయడంలో సమర్థుడై; ప్రక్షీణ, దర్పున్= మిక్కిలి తగ్గిపోయినగర్వం గలవాడిని; ద్రుపదున్= ద్రుపదుడిని, రథ+అక్షముతోన్= తేరి ఇరుసుతో (ఇరుసుకు); కట్టి, తెచ్చి; గురునకున్= గురువైన ద్రోణాచార్యునికి; గురుదక్షిణగాన్; ఇచ్చి; తత్+సమ్మదమున్= అతనికి సంతోషాన్ని; చేసెన్= కలిగించాడు.

తాత్పర్యం: అర్జునుడు కార్యసాధనసమర్థుడై గర్వం కోల్పోయిన ద్రుపదుణ్ణి తేరి ఇరుసుకు కట్టి తెచ్చి , గురుదక్షిణగా ఇచ్చి ద్రోణాచార్యుణ్ణి సంతోషపెట్టాడు.

విశేషం: అక్షరరమ్యతలో అనురణనధ్వనికి ఉపకరణంగా వాడే నన్నయరచనాశిల్పంలో ఒక మెలకువ ఈ పద్యంలో ఉన్నది. పద్యంలో 'క్ష' ప్రాసాక్షరం. చివరి పాదంలోని 'గురుదక్షిణ' అనే పదం. ఈ పద్యంలో ఆయువుపట్టు. గురుదక్షిణకు గౌరవాన్ని కలిగించే క్షకారప్రాస అనురణనసౌందర్యాన్ని కలిగిస్తున్నది. పూర్వార్ధంలోని క్షకారప్రాస ద్రుపదుని దైన్యాన్ని ధ్వనిచూస్తుంటే, ఉత్తరార్ధంలోని క్షకారప్రాస అర్జునుని ప్రతాపాన్ని ధ్వనిస్తున్నది. 'గురుదక్షిణ' అంటే గురువుకొరకైనదక్షిణ అనీ, గొప్పదైన దక్షిణ అనీ అర్థవైచిత్రి ఏర్పడి 'గురువునకు గురుదక్షిణ' తగినవిధంగా - కొండంతదేవుడికి కొండంతపత్రి నిచ్చినట్లు - ఇచ్చాడనే అర్థం అనురణన సామర్థ్యంతో ఏర్పడుతున్నది. అందువలన ఈ పద్యంలో శబ్దశక్తిమూలక అనురణనధ్వని ఉన్నది. (సంపా.)

వ. ద్రోణుండును నర్జునుచేసిన పరాక్రమంబునకుఁ బరమహృష్టహృదయుం డై ద్రుపదుం జూచి నగుచు ని ట్లనియె. 89

ప్రతిపదార్థం: ద్రోణుండును; అర్జును= అర్జునుడు; చేసిన= కావించిన; పరాక్రమంబునకున్; పరమ, హృష్ట, హృదయుండు+ఐ= మిక్కిలి ఆనందించిన హృదయం కలవాడై; ద్రుపదున్+చూచి; నగుచున్= నవ్వుతూ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ద్రోణుడుకూడా అర్జునుని పరాక్రమం చూచి ఆనందించి నవ్వుతూ ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

క. వీ రెవ్వ రయ్య? ద్రుపదమ । హారాజులె! యిట్లు కృపణు లయి పట్టువడన్
వీరికి వలసెనె? యహహా! మ । హారాజ్యమదాంధకార మది వాసెనొకో?. 90

ప్రతిపదార్థం: వీరు+ఎవ్వరు+అయ్య= వీ రెవ్వరండి!; ద్రుపద, మహారాజులె= ద్రుపదమహారాజులుగారేనా!; ఇట్లు= ఈ విధంగా; కృపణులు+అయి= దిక్కులేనివారై; పట్టు+పడన్= పట్టుపడటానికి; వీరికిన్= వీరికి; వలసెన్+ఎ= ఆవశ్యకమయిందా! అహహా= ఔరా!; మహా, రాజ్య, మద+అంధకారము= గొప్పరాజ్యగర్వంచేత కలిగిన గ్రుడ్డితనం; అది= అది; పాసెన్+ఒకో= తొలగిపోయిందా ఏమి?

తాత్పర్యం: వీ రెవ్వ రయ్యా? ద్రుపదమహారాజులే! ఈ విధంగా దిక్కులేక పట్టుపడవలసిన పరిస్థితి ఏర్పడిందే! అహో! మహారాజ్యమదంచేత కలిగిన కన్నుగాననితనం తొలగిపోయిందా?

విశేషం: వ్యంగ్యంగా అధిక్షేపించే వాక్యపద్ధతికి ఈ పద్యం తెలుగులో హృద్యమైన ఉదాహరణగా నిలిచిపోయింది. ద్రోణుని గూఢాభిమానాన్ని ఈ పద్యం వ్యంగ్యసుందరంగా వ్యక్తం చేస్తున్నది. ద్రోణుడు అధిక్షేపంగా పలికేటప్పుడు - అయ్య! మహారాజులె, వీరికి వలసెనె; అదివాసెనొకో! - అనే మాటలనేప్పుడు ఒక వింతవెటకారం ధ్వనిస్తుంది. దానిని కాకువు అంటారు. ఆ కాకువులు పూర్వం ద్రుపదుడు ద్రోణుడిని అవమానించినమాటలవరుసను స్ఫురింపచేస్తూ, వాటికి ప్రతిగా ద్రోణుడు అధిక్షేపిస్తున్నట్లు ధ్వని. మొదట ద్రోణుడు తమ పాతస్నేహాన్ని జ్ఞాపకంచేస్తూ గుర్తించావా? అని ప్రశ్నించినప్పుడు, ద్రుపదుడు తనకు తెలియదన్నాడు. దానికి ఎద్దేవగా 'నీ వెవరయ్యా?' అని వ్యంగ్యంగా ప్రశ్నించటం. మహారాజుతో పేద బాపడికి సంబంధం ఎట్లా కలుగుతుంది? అని ప్రశ్నించిన ద్రుపదుడిని 'ఇప్పుడు నా ఎదుట ఉన్నది ద్రుపదమహారాజులా?' అని వెటకారపుతిరుగుప్రశ్న. 'రాజ్యంపోయిన పేదవాడివి నీవు' అని వ్యంగ్యమైన అధిక్షేపం. 'ఈ విధంగా దిక్కులేకుండా పట్టుపడవలసి వచ్చిందా?' అని పరిహసించినప్పుడు పూర్వం తన దయనీయస్థితిని చూచికూడా జాలిపడక 'మిత్రామిత్రత్వాలు రాజులకు కార్యవశంగా ఏర్పడతాయి' అన్న ద్రుపదునిమాటకు తిరుగుదెబ్బ వినపడుతుంది. ఐశ్వర్యగర్వంచేత ద్రోణుని విలువ తెలిసికొనకుండ మాట్లాడిన గ్రుడ్డితనం ఇప్పుడు తొలగిందా, 'నీ ఐశ్వర్యం, నీ పరాక్రమం, నా శిష్యులఅధీనం, నా దయాభిక్ష' అని తలపింపచేసి, తన ఔన్నత్యాన్నీ, అదృష్టాన్నీ వ్యంగ్యంగా ద్రోణుడు ధ్వనింపచేశాడు. (సంపా.)

ఆ. 'ఇంక నైన మమ్ము నెఱుఁగంగ నగునొక్కొ!' యనుచు నుల్లసంబు లాడి ద్రుపదు
విడిచిపుచ్చె గురుఁడు; విప్రులయలుకయుఁ దృణహుతాశనంబు దీర్ఘ మగునె?. 91

ప్రతిపదార్థం: ఇంకన్+ఐన= ఇక ముందైన; మమ్మున్= మమ్ములను; ఎఱుంగన్+అగున్+ఒక్కొ= గుర్తించుకోతగునుసుమా!; అనుచున్= అంటూ; ఉల్లసంబులు+ఆడి= ఎగతాళి మాటలు మాట్లాడి; గురుఁడు= ద్రోణాచార్యుడు; ద్రుపదున్= ద్రుపదుడిని; విచిచి, పుచ్చెన్= వదిలివేశాడు; విప్రుల+అలుకయున్= బ్రాహ్మణులయొక్కకోపం; తృణ, హుతాశనంబు= గడ్డినిప్పు; దీర్ఘము+అగునె= ఎక్కువకాలం ఉంటుందా!

తాత్పర్యం: 'ఇక ముందైనా మమ్మల్ని గుర్తుంచుకోగలరా?' అని ఎగతాళి చేసి, ద్రోణుడు ద్రుపదుణ్ణి విడిచి పెట్టాడు. బ్రాహ్మణునికోపం, గడ్డినిప్పు ఎక్కువకాలం ఉంటాయా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇప్పటికైనా న న్నెప్పుడూ గుర్తుంచుకుంటావా? - అనే కాకువువలన కలిగే అధిక్షేపార్థం ద్రుపదునికి గుండెలో ములుకువలె కలకాలం గుర్తుంటుంది. చేసిన స్నేహాన్ని మరిచేవారికి తగినవాఙ్మయాస్త్రం ద్రోణుని

అధిక్షేపోక్తి. భీమార్జునులు ద్రుపదునితో యుద్ధం చేసినఘట్టంలో దాదాపు ప్రతిపద్యంలోనూ అలంకారప్రయోగం చేశాడు- నన్నయ. కథార్థాలను ప్రసన్నంచేయటానికి అర్థాలంకారప్రయోగంకూడా అర్థయోజనశిల్పంలో ఒకభాగం. (సంపా.)

ధృతరాష్ట్రుఁడు యుధిష్ఠిరుని యౌవరాజ్యాభిషిక్తునింజేయుట (సం.1-79-191)

వ. ఇట్లు ద్రుపదుండు ద్రోణుచేత విముక్తుం డయ్యుఁ గోపపాశబద్ధుం డయి యప్పరిభవంబునకుం బ్రతీకారంబు సేయ
సమకట్టి బ్రాహ్మణోపాస్తి సేయుచుండె; నంత నిట ధృతరాష్ట్రుండు యుధిష్ఠిరు రాజ్యభారధురంధరుంగా నెఱింగి
భీష్మవిదురులతో విచారించి యౌవరాజ్యాభిషిక్తుం జేసిన. 92

ప్రతిపదార్థం: ఇట్లు; ద్రుపదుండు; ద్రోణుచేతన్; విముక్తుండు+అయ్యున్= విడువబడినవాడైనా; కోప, పాశ, బద్ధుండు+అయి= కోప మనే తాటిచేత కట్టబడినవాడై; ఆ+పరిభవంబునకున్= ఆ అవమానానికి; ప్రతీకారంబు= తిరిగి అపకారం; చేయన్= చేయటానికి; సమకట్టి= పూనుకొని; బ్రాహ్మణ+ఉపాస్తి= బ్రాహ్మణులయొక్క సేవను; చేయుచున్+ఉండెను= చేస్తూఉన్నాడు; అంతన్= తర్వాత; ఇటన్= హస్తినాపురంలో; ధృతరాష్ట్రుండు, యుధిష్ఠిరున్= ధర్మరాజును; రాజ్య, భార, ధురంధరున్+కాన్= రాజ్యంయొక్క భారాన్ని వహించేసమర్థుడిగా; ఎఱింగి= తెలిసికొని; భీష్మ, విదురులతో; విచారించి= ఆలోచించి; యౌవ, రాజ్య+అభిషిక్తున్= యౌవరాజ్యంలో అభిషేకింపబడినవానినిగా; చేసినన్= చేయగా.

తాత్పర్యం: ఈ విధంగా ద్రుపదుడు ద్రోణునిచేత విడిచిపెట్టబడినా - అతడు కోపమనే తాటితో కట్టబడినవాడై, ద్రోణుడు తనకు చేసినఅవమానానికి తిరిగి అపకారం చేయాలని బ్రాహ్మణులసేవ చేస్తున్నాడు. అట హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు యౌవరాజ్యభారం వహించటానికి యుధిష్ఠిరుడు తగినవాడని భీష్మ, విదురులతో విచారించి, అతణ్ణి యౌవరాజ్యాభిషిక్తుణ్ణి చేయగా.

విశేషం: 'బ్రాహ్మణోపాస్తి సేయుచుండె' - అనే దానికి బ్రాహ్మణోపాస్తిచేయుచు పురంబు సొరనొల్లక యుండె' - 'సేయుచుండె ద్రోణుండు రాజకుమారసహితుండై హస్తిపురంబునకు మగుడి వచ్చె నంత' అనే పాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్ర మహాభారతము సంశోధితప్రతి, పుట. 341. ద్రోణుడు తరువాత రాజకుమారసహితుడై హస్తినాపురానికి తిరిగిరావటం విశేషంగాదు. కాని ద్రుపదుడు అవమానాన్ని భరించలేక బ్రాహ్మణోపాస్తి చేస్తూ తనపురం సొర నొల్లకుండటం విశేషం.

చ. నలువురు దమ్ములున్ బలిమి నాలుగుదిక్కులు నోర్చి సర్వభూ
తలమున రాజనందనులదర్ప మడంచుచు భూరివస్తురా
సులు గొనివచ్చి యీఁగొని విశుద్ధయశోనిధి యొప్పె ధర్మజుం
డలఘుఁడు యౌవరాజ్యయుతుఁ డయ్యును బెంపున సార్వభౌముఁ డై. 93

ప్రతిపదార్థం: నలువురు, తమ్ములున్; బలిమిన్= బలంతో; నాలుగు, దిక్కులున్= నాలుగుదిక్కుల్ని; ఓర్చి= ఓడించి; సర్వ, భూతలమునన్= మొత్తంభూమిమీద; రాజ, నందనుల, దర్పము= రాజకుమారులయొక్క గర్వాన్ని; అడంచుచున్= అణచివేస్తూ; భూరి, వస్తు, రాసులు= పెద్దవైన పదార్థరాసులను; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఈన్= ఈయగా; కొని= తీసుకొని; విశుద్ధ, యశస్+నిధి= స్వచ్ఛమైనకీర్తికి స్థానమైనవాడు; అలఘుఁడు= తక్కువవాడుకానివాడు - అంటే గొప్పవాడు; ధర్మజుండు= యౌవ, రాజ్య, యుతుఁడు+అయ్యును =యౌవరాజ్యంతో కూడుకొన్నవాడే అయినప్పటికీ; పెంపునన్= గొప్పతనంచేత; సార్వభౌముఁడు+ఐ= సమస్తభూమిని పరిపాలించే రాజై; ఒప్పెన్= వెలిగాడు.

తాత్పర్యం: నలుగురుతమ్ములు తమబలంతో నాలుగుదిక్కులు జయించి, భూమిమీది రాకుమారు లందరి పొగ రణచి, ఎంతోవిలువైన పదార్థరాసులను తెచ్చి ఇయ్యగా, వాటిని గ్రహించి స్వచ్ఛమైనకీర్తితో గొప్పవాడైన ధర్మరాజు యువరాజే అయినా చక్రవర్తివలె వెలిగాడు.

విశేషం: అలం: కావ్యలింగం. 'సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్'. ధర్మరాజు పదవిలో యువరాజైనా మహిమలో సార్వభౌముడు. తమ్ములు నలుదిక్కుల రాజులను జయించి సంపదలు తెచ్చి అతని అధీనం చేయటంవలన అతడు సార్వభౌముడనే భావం సమర్థనీయమైనది. ఇక్కడ ధర్మరాజుని నాయకత్వంతోపాటు భీమాదుల అనునాయకత్వంకూడ వస్తుధ్వని. భీమాదుల వీరవృత్తాలన్నీ ధర్మజునిధర్మవీరప్రవృత్తికి పోషకాలే. అంగిని పోషించే అంగా (అంగరసా) లే అని తాత్పర్యం. ధర్మజుడివర్ణనం ప్రసాదగుణభూయిష్ఠమై ఉండటం సార్థకం. (సంపా.)

వ. మఱియును. **94**

తాత్పర్యం: ఇంకా.

క. బద్ధపరంపర నొప్పె మ । దోద్ధతగజరథతురంగయుద్ధముల గదా
యుద్ధములఁ జూడ నెందుఁ బ్ర । సిద్ధుఁడు మధ్యముఁడ యను విశిష్టస్తవముల్. **95**

ప్రతిపదార్థం: మద+ఉద్ధత, గజ, రథ, తురంగ, యుద్ధముల= మదంచేత గర్వించిన ఏనుగులబలంతో, రథబలంతో, అశ్వ బలంతో యుద్ధాలు చేయటంలో; చూడన్= చూడగా; ఎందున్= దేనిలోనైనా; మధ్యముఁడు+అ= కుంతీపుత్రులలో నడిమివాడైన భీముడే; ప్రసిద్ధుడు= పేరుకెక్కినవాడు; అను; విశిష్ట, స్తవముల్= గొప్పపొగడ్తలు; బద్ధ, పరంపరన్= కట్టబడ్డవరుసచేత; ఒప్పెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: గజరథాశ్వయుద్ధాలలో, గదాయుద్ధంలో - దేనిలోనైనా కుంతీపుత్రులలో నడిమివాడైన భీముడే పేరు కెక్కినవాడన్న పొగడ్తలు పరంపరగా వ్యాపించాయి.

చ. అనుపమకార్ముకాదివివిధాయుధవిద్యలయందుఁ గోవిదుం
డనఁగ నజయ్యుఁ డై పరఁగు నర్జునుఁ బోలఁగ నన్యు లెందు లే
రను జనఘోష ముచ్చరిత మయ్యె మరుచ్చలితోచ్చవీచి ని
స్వనముఖరాబ్ధివేష్టిత విశాలమహీవలయాంతరంబునన్. **96**

ప్రతిపదార్థం: అనుపమ, కార్ముక+ఆది, వివిధ+ఆయుధ విద్యల+అందు= సాటిలేని ధనుస్సు మొదలుగా నానావిధాలైన ఆయుధ విద్యలలో; కోవిదుండు= పండితుడు; అనఁగన్; అజయ్యుఁడు+ఐ= గెలువసాధ్యంగానివాడై; పరఁగు= ఒప్పునట్టి; అర్జునున్; పోలఁగన్; అన్యులు= ఇతరులు; ఎందున్= ఎచ్చటను; లేరు; అను; జన, ఘోషము= జనులయొక్కధ్వని; మరుత్+ చలిత+ఉచ్చ, వీచి, నిస్వన, ముఖర+అబ్ధి, వేష్టిత, విశాల, మహీ, వలయ+అంతరంబునన్= గాలిచేత ఎగురుతున్న ఎత్తైన అలలయొక్క శబ్దంచేత ధ్వనిస్తున్నసముద్రాలచేత చుట్టబడిన విశాలభూమండలంయొక్క మధ్యప్రదేశంలో; ఉత్+చరితము= మీది కెగసింది; అయ్యెన్.

తాత్పర్యం: ధనుర్విద్య మొదలుగా వివిధాలైన ఆయుధవిద్యలలో పండితుడై, అజేయుడైన అర్జునునితో పోల్చటానికి ఇతరు లెక్కడా లేరనే జనఘోష భూమండలంలో అంతటా మీదికి ఎగసింది.

విశేషం: ప్రసాదగుణ విశిష్టమైన ఓజోగుణం ఈ రచనలో అర్జునుడిఅనంతకీర్తిని ధ్వనింపచేస్తున్నది. ధర్మజుడిని, అర్జునుడిని చంపకమాలలో వర్ణించటం, భీముడిని, కవలను కందపద్యాలలో వర్ణించటం నన్నయ ఛందశ్శిల్పంద్వారా ప్రదర్శిస్తున్న పాత్రల కీర్తుల తారతమ్యానుశీలనం, అక్షరరమ్యాలైన ఛందస్సులనుకూడా వ్యంజకాలుగా నిబంధించే నన్నయరుచిరార్థసూక్తినిధిత్వం పాండవవర్ణనంలో ప్రౌఢంగా ప్రదర్శించబడింది. (సంపా.)

క. యము లమితశౌర్యు లరినృప । యము లమలచరిత్రనిరతు లనఁగా నత్యు
త్తమభక్తి నన్నలకు విన । యము మెఱయుచు నుండి రధికు లై బహుకళలన్. 97

ప్రతిపదార్థం: యములు= కవలలు - నకులసహదేవులు; అమిత, శౌర్యులు= మిక్కిలిపరాక్రమం కలవాళ్ళు; అరి, నృప, యములు= శత్రురాజులకు యమధర్మరాజువంటివాళ్ళు; అమల, చరిత్ర, నిరతులు= నిర్మలమైన నడవడిలో ఆసక్తిగలవాళ్ళు; అనఁగాన్= అని చెప్పబడగా; బహుకళలన్= అనేకవిద్యల్లో; అధికులై= గొప్పవాళ్ళయి; అతి+ఉత్తమ, భక్తిన్= మిక్కిలి శ్రేష్ఠమైన భక్తితో; అన్నలకున్; వినయము; మెఱయుచున్= చూపుతూ; ఉండిరి.

తాత్పర్యం: నకులసహదేవులు - మిక్కిలి పరాక్రమం కలవాళ్ళు. శత్రురాజులకు యమధర్మరాజువంటివాళ్ళు. స్వచ్ఛ మైన నడవడిగలవాళ్ళు - అనే పేరు పొంది అనేకవిద్యలలో ఆరితేరి అత్యుత్తమభక్తితో అన్నలపట్ల వినయం చూపుతూన్నారు.

భారద్వాజుం డర్జునునకు బ్రహ్మశిరోనామకదివ్యబాణం బొసఁగుట (సం.1-80-20)

వ. ఇట్లు పాండుకుమారు లపారగుణంబుల నెల్లవారికి నారాధ్యు లయి పరఁగుచున్న నందు ధనుర్విద్య నర్జును దృఢముష్టిలాఘవలక్ష్యవేధిత్వదూరాపాత జితశ్రమత్వంబులకు నసిగదాశక్తితోమరాదిప్రహరణప్రవీణతకుం బరమహీపాల పరాజయోత్పాదన పరాక్రమంబునకుఁ దనవలని భక్తిస్నేహంబులకు మెచ్చి భారద్వాజుండు వానికి బ్రహ్మశిరం బను దివ్యబాణంబు సప్రయోగనివర్తనంబుగా నిచ్చి యి ట్లనియె. 98

ప్రతిపదార్థం: ఇట్లు; పాండు, కుమారులు= పాండవులు; అపార, గుణంబులన్= అంతులేని (మంచి) గుణాలతో; ఎల్లవారికిన్= అందరికీ; ఆరాధ్యులు+అయి= పూజింపదగినవాళ్ళయి; పరగుచున్+ఉన్నన్= ప్రవర్తిల్లుతుండగా; అందున్= అందులో; ధనుః+విద్యన్= ధనుర్విద్యలో; అర్జును, దృఢ, ముష్టి, లాఘవ, లక్ష్యవేధిత్వ, దూర+ఆపాత, జిత, శ్రమత్వంబులకున్= అర్జునునియొక్క గట్టిపిడికిలికీ, వేగానికీ (నైపుణ్యానికీ), గురిని కొట్టటానికీ, దూరప్రయోగానికీ, జయింపబడిన అలసట కలవా డవటానికీ; అసి, గదా, శక్తి, తోమర+ఆది, ప్రహరణ, ప్రవీణతకున్= కత్తి, గద, బల్లెం, చిల్లకోల మొదలయిన వాటితో కొట్టటంలోని నేర్పుకు; పర, మహీపాల, పరాజయ+ఉత్పాదన, పరాక్రమంబునకున్= శత్రురాజులకు అపజయాన్ని కలిగించేటి పరాక్రమానికీ; తనవలనిభక్తి, స్నేహంబులకున్= తనపట్ల ఉండే భక్తిప్రేమలకు; మెచ్చి; భారద్వాజుండు= ద్రోణుడు; వానికిన్= అర్జునునికి; బ్రహ్మశిరంబు+అను; దివ్య, బాణంబున్= దేవతాసంబంధమైన బాణాన్ని; సప్రయోగ, నివర్తనంబుగాన్= ప్రయోగ, ఉపసంహారాలతో కూడినట్లుగా; ఇచ్చి= ఒసగి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు అంతులేని మంచిగుణాలతో అందరికీ పూజ్యులై ప్రవర్తిల్లుతుండగా- వారిలో అర్జునునియొక్క పిడికిలిబిగువుకు, వేగానికి (నైపుణ్యానికి), గురి కొట్టే నేర్పుకు, దూరాన పడేటట్లు ప్రయోగించే సామర్థ్యానికి, అలసటలేనితనానికీ; కత్తి, గద, బల్లెం, చిల్లకోల మొదలైన ఆయుధవిద్యలలో ఆర్జించుకొన్న ప్రావీణ్యానికీ,

శత్రురాజుల జయింపగల పరాక్రమానికీ, తనపట్ల చూపుతున్న భక్తిప్రేమలకు మెచ్చి, ద్రోణాచార్యుడు 'బ్రహ్మశిర' మనే పేరుగల దివ్యాస్త్రాన్ని ప్రయోగోపసంహారాలతో ఉపదేశించి ఇచ్చి, ఇట్లా అన్నాడు.

ఉ. దీని నగస్త్తి నాఁ బరగు దివ్యమునీంద్రుఁడు దొల్లి ప్రీతితో
భూనుత! యగ్నివేశుఁ డను భూరిమునీంద్రున కిచ్చె; వారలున్
మానుగ నాకు నిచ్చిరి; క్రమంబున నేనును నీకు నిచ్చితిన్;
దీనికి నీవ యర్హుఁడవు తేజమునం గడుఁ బెద్ద గావునన్. 99

ప్రతిపదార్థం: భూనుత!= భూమిపై పొగడబడేవాడా!; దీనిన్= ఈఅస్త్రాన్ని; తొల్లి= పూర్వం; అగస్తినాన్+పరగు= అగస్తి అనే పేరుతో ఒప్పే; దివ్యముని+ఇంద్రుఁడు= గొప్పమునిశ్రేష్ఠుడు; ప్రీతితోన్= ప్రేమతో; అగ్నివేశుఁడు+అను; భూరి; ముని+ఇంద్రునకున్= గొప్ప మునిశ్రేష్ఠునికి; ఇచ్చెన్; వారలున్= వారు; మానుగన్= అయితే; ఒప్పుగ; నాకున్= నాకు; ఇచ్చిరి= ఇచ్చారు; నేనును= నేనుకూడా; క్రమంబునన్= వరుసగా; నీకున్; ఇచ్చితిని; తేజంబునన్= పరాక్రమంలో; కడున్= మిక్కిలి; పెద్ద; కావునన్; దీనికిన్; నీవు+అ= నీవే; అర్హుఁడవు= తగినవాడివి.

తాత్పర్యం: లోకంలో పొగడ్తలందుకొన్న ఓ అర్జునా! అగస్తి మహాముని ఈ అస్త్రాన్ని ప్రేమతో అగ్నివేశునికి ఇచ్చాడు. ఆయన నా కిచ్చాడు. నేను నీ కిచ్చాను. పరాక్రమంలో గొప్పవాడివి కనుక దీనికి నీవే తగినవాడివి.

వ. 'దీని మానవులయందుఁ బ్రయోగింపకుండునది; యల్పతేజులయందుఁ బ్రయుక్తం బయి యిది జగంబులఁ గాల్చు; నిన్ను బాధించు నట్టి మానవులు గలిగిరేని ప్రయోగించునది; వారి నశ్రమంబున సాధించు' నని దాని మహిమ చెప్పి 'నీవు నీ బంధుసమక్షంబున నాకు గురుదక్షిణ యి; మ్మిది యెయ్యది యనిన నాయుద్ధంబుసేయునపుడు నాతో నెన్నడుఁ బ్రతియుద్ధంబు సేయకుండు; మిదియ నాకు గురుదక్షిణ' యనిన నర్జునుండు వల్లె యని యాచార్యునకు నమస్కరించి దాని కొడంబడియె; నంత దుర్యోధనుండు యుధిష్ఠిరుయౌవరాజ్యాభిషేకంబునకు భీమార్జునయముల పరాక్రంబునకు మనంబున సహింపనోపక కర్ణశకునిదుశ్శాసనులతో మంతనం బుండి యి ట్లనియె. 100

ప్రతిపదార్థం: దీనిన్= ఈ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని; మానవుల+అందున్= మానవులపై; ప్రయోగింపక+ఉండునది= ప్రయోగించకుండా ఉండవలసింది; అల్ప, తేజుల+అందు= తక్కువశక్తి కలవారిమీద; ప్రయుక్తంబు+అయి= ప్రయోగింపబడినదై; ఇది= ఈ అస్త్రం; జగంబులన్= లోకాలను; కాల్చున్; నిన్నున్; బాధించు, అట్టి= బాధకలిగించునట్టి; మానవులు; కలిగిరి+ఏని= ఉన్నట్లయితే; ప్రయోగించునది= ప్రయోగించుము; వారిన్; అశ్రమంబునన్= శ్రమలేకుండ - సులభంగా; సాధించున్= లోబరుచుకొంటుంది; అని; దాని, మహిమన్= దాని ప్రభావాన్ని; చెప్పి; నీవు; నీ, బంధు, సమక్షంబునన్= నీయొక్క బంధువుల ఎదుట; నాకున్; గురుదక్షిణ; ఇమ్ము; ఇది= ఈ గురుదక్షిణ; ఏ+అది= ఏది; అనినన్= అనగా; నా, యుద్ధంబు, చేయు, అపుడు= నేను యుద్ధం చేసేప్పుడు; నాతోన్= నాతో; ఎన్నడున్= ఎప్పుడూ; ప్రతి, యుద్ధంబు= ఎదురుయుద్ధం; చేయక+ఉండుము; ఇదియ= ఇదే; నాకున్, గురుదక్షిణ; అనినన్= అనగా; అర్జునుండు; వల్లె= సరే; అని; ఆచార్యునకున్= ద్రోణునికి; నమస్కరించి; దానికిన్; ఒడంబడియెన్= అంగీకరించాడు; అంతన్= తరువాత; దుర్యోధనుండు; యుధిష్ఠిరు= ధర్మరాజుయొక్క;, యౌవరాజ్యాభిషేకంబునకు; భీమ+అర్జున, యముల, పరాక్రమంబునకు= భీయునియొక్క అర్జునునియొక్క,

నకులసహదేవులయొక్క పరాక్రమానికి; మనంబునన్; సహింపన్+ఓపక= ఓర్వలేక; కర్ణ, శకుని, దుశ్శాసనులతో; మంతనంబు+ ఉండి= ఆలోచనచేస్తూ ఉండి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని మానవులమీద ప్రయోగించవద్దు. అల్పశక్తిగల వారిమీద ప్రయోగిస్తే ఇది లోకాలనే మాడ్చివేస్తుంది. నిన్ను బాధించే మానవులుంటే వాళ్ళమీద ప్రయోగించు. అతిసులభంగా ఇది వాళ్ళను పడగొట్టగలుగుతుంది' - అని ఆ అస్త్రమహిమ తెలియజెప్పి - 'నీ బంధువు లందరియెదుట నా కొక గురుదక్షిణ ఇమ్ము. అది ఏమంటే నేను యుద్ధం చేసేప్పుడు నీవు నాతో ఎదురుయుద్ధం చేయకుండటం' అని ద్రోణాచార్యు డనగా విని అందుకు అర్జునుడు అంగీకరించాడు. తర్వాత దుర్యోధనుడు భీమార్జుననకుల సహదేవులపరాక్రమం చూచి ఓర్వలేక, కర్ణశకునిదుశ్శాసనులతో ఆలోచనచేస్తూ ఇట్లా అన్నాడు.

కణికనీతి (సం. 1-81-10)

సీ. 'ఆయుధవిద్యలయందు జితశ్రము । లనియును రణశూరు లనియు సంత
తోత్సాహు లనియు నత్యుద్ధతు లనియును । భయమందుచుండుదుఁ బాండవులకు;
దానిపై నిప్పుడు ధర్మజు యువరాజుఁ । జేసె రా; జే నేమి సేయువాఁడ?
నృపనీతి యెయ్యది? నిరతంబుగా మీర । నా కెఱిఁగింపుఁడు నయముతోడ'

ఆ. ననిన వినియుఁ గణికుఁ డనువాఁడు, సౌబలు । నాప్తమంత్రి, నీతులందుఁ గరము
కుశలుఁ డైనవాఁడు కురుకులవల్లభు । నిష్టమునకుఁ దగఁగ నిట్టు లనియె. 101

ప్రతిపదార్థం: ఆయుధ, విద్యల+అందు; జితశ్రములు+అనియును= అలసట ఎరుగనివారు, పండితులనీ; రణ, శూరులు+ అనియు= యుద్ధంలో శౌర్యంకలవారనీ; సంతత+ఉత్సాహవంతులు+అనియున్= ఎడతెగని ఉత్సాహం కలవారనీ; అతి+ ఉద్ధతులు= మిక్కిలి గర్వించినవాళ్ళు; అనియును= అనికూడా; పాండవులకు= పాండవులను జూచి; భయము+ అందుచు+ ఉండుదున్= భయపడుతుంటాను; దానిపైన్= దానికితోడు; రాజు= ధృతరాష్ట్ర మహారాజు; ధర్మరాజున్= ధర్మరాజును; యువరాజున్+చేసె= యువరాజుగా చేశాడు; ఏమి, చేయు, వాఁడన్; నృపనీతి= రాజనీతి; ఏ+అది=ఏది; మీరు+అ= మీరే; నయముతోడన్= ప్రీతితో; నిరంతరంబుగాన్= నిత్యంగా; నాకున్+ఎఱిఁగింపుఁడు= నాకు తెలియచెప్పండి; అనినన్= అనగా; వినియున్= వినికూడా; నీతుల+అందున్; కరము, కుశలుఁడు+ఐనవాఁడు= నీతులలో మిక్కిలినేర్పరి ఐనవాడు; సౌబలు+ఆప్త, మంత్రి= సుబలునికుమారుడైన శకునియొక్క ప్రియమైనమంత్రి; కణికుఁడు+అనువాఁడు; కురు, కుల, వల్లభు+ఇష్టమునకున్= కురువంశరాజైన దుర్యోధనుని కోరికకు; తగఁగన్= తగినట్లుగా; ఇట్టుల+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఆయుధవిద్యలలో పండితులనీ, రణశూరులనీ, ఎడతెగనిఉత్సాహవంతులనీ, మిక్కిలి గర్వించినవాళ్ళనీ పాండవులకు భయపడుతుంటాను. దానికితోడు ధృతరాష్ట్రమహారాజు, ధర్మరాజును యువరాజుగా చేశాడు. ఏం చేయాలో తోచటంలేదు. ప్రీతితో రాజనీతి నా కుపదేశించండి' - అని దుర్యోధనుడనగా, నీతుల్లో నేర్పరీ, శకునికి ప్రియమంత్రీ అయిన కణికుడు దుర్యోధనునికోరికకు తగినట్లు ఈ విధంగా చెప్పాడు.

విశేషం: కణికుడు - అనే పేరుకు 'కణింకుఁడు' , 'గిణికుఁడు' అనే పాఠాంతరాలున్నాయి. అంతేగాక సంస్కృతభారతం పి.పి.యస్.శాస్త్రిప్రతి, 904 పుటలో "తతః కణింక మానాయ్య ధృతరాష్ట్రోఽబ్రవీ దిదమ్" అని ఉంది. సంస్కృతభారతం

చిత్రశాలాప్రతి, 244 పుటలో "కణికం మంత్రిణాం శ్రేష్ఠం ధృతరాష్ట్రోఽబ్రవీ ద్వచః"అని ఉన్నది. చూడు, - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట 344. కణికుడు - కిణింకుడైనాఁ గిణికుడైనా - అతనిపేరు సంగతి ఎలా ఉన్నా పైన పేర్కొన్న సంస్కృతభారత ప్రతులనుబట్టి కణికుడిని పిలిపించి ఉపదేశం పొందినవాడు ధృతరాష్ట్రుడు. కాని నన్నయ భారతంలో కణికోపదేశాన్ని పొందింది దుర్యోధనుడు. ఇది పెద్దమార్పు. ఇది ఇట్లా ఉండగా భాండార్కరుప్రతిలో నన్నయభారతంలోని కణికనీతిప్రక్షిప్తమనే అభిప్రాయం వ్యక్తంచేయబడినట్లు, తాము చూచిన తాళపత్రప్రతుల్లో, ముద్రితప్రతుల్లో కణికనీతి ఉన్నట్లు శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతిని సిద్ధం చేసినవారు చెప్పున్నారు. "భాండార్కరు ప్రతిలో (అధ్యాయాలు 128, 129) కణికనీతి విడువబడింది. 574 పుటలోని జ్ఞాపిక చూడనవును. నన్నయ (క్రీ.శ.1050) భారతంలో కణికనీతిప్రశంస లే దని భాండార్కరు నుడువుతున్నది. క్షేమేంద్రుని భారతమంజరిలో గూడ ఇది లేదని భాండార్కరు సంస్థవారు వ్రాస్తున్నారు. జావాప్రతి (క్రీ.శ.1000)లో గూడ ఇది లేదని వారే చెప్పున్నారు. మూలభారతంమీద రచింపబడిన వ్యాఖ్యలలో కణికనీతి వ్యాఖ్యానింపబడలేదని భాండార్కరుప్రతి తెలుపుచున్నది. శాంతిపర్వంలో శత్రుంజయునికి భరద్వాజునిచేత ఉపదేశించబడిన రాజనీతిసారాంశమే- కణికనీతి అని వీరిమతం. కాని మేము చూచిన తాళప్రతులలోను, ముద్రితప్రతులలోను కణికనీతి కనబడుచున్నది. నన్నయభారతములో ఇది ప్రక్షిప్తమనుటకు ఆధారమేమో తెలియదు. పర్వానుక్రమణిక, పర్వసంగ్రహములందు మాత్రం కణికనీతి ప్రశంస లేదు". - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుటలు 344, 345.

తరువోజ.

ధరణీశుఁ డుద్యతదండుఁ డై యుచిత । దండవిధానంబుఁ దప్పక ధర్మ
చరితులఁగా మహీజనుల రక్షించి । సద్వృత్తుఁ డగునది; సర్వవర్ణములు
వరుసన తమతమ వర్ణధర్మముల । వర్తిల్లుదురు గడవక దండభీతి
నరిమిత్రవర్జితుఁ డై సమబుద్ధి । యగు మహీవల్లభు ననుశాసనమున. 102

ప్రతిపదార్థం: ధరణి+ఈశుడు= భూపతి, రాజు; ఉద్యత, దండుఁడు+ఐ= పైకెత్తబడిన రాజదండం గలవాడై; ఉచిత, దండ, విధానంబున్= తగిన దండనీతి పద్ధతిని; తప్పక; మహీ, జనులన్= భూమిలోని ప్రజలను; ధర్మ, చరితులన్+కాన్= ధర్మమైన నడవడి కలవాళ్ళనుగా; రక్షించి= సత్+వృత్తుఁడు+అగునది= మంచి నడవడి కలవాఁడు కావాలి; దండనీతిన్= దండ నీతిలో; అరి, మిత్ర, వర్జితుఁడు+ఐ = శత్రువులు, మిత్రులు లేనివాడై; సమ, బుద్ధి+అగున్= సమానమైన బుద్ధి కల వాడవుతాడు; మహీ, వల్లభు+అనుశాసనమునన్= రాజుయొక్క ఆజ్ఞచేత; సర్వ, వర్ణములు= అన్నిజాతులు; వరుసన= క్రమంగా; తమ, తమ వర్ణ ధర్మముల= తమ తమ జాతులయొక్క ధర్మాలను; కడవక= దాటక; వర్తిల్లుదురు= ప్రవర్తిస్తారు.

తాత్పర్యం: ప్రభువు ప్రబలమైన అధికారం గలవాడై, తగిన దండనీతిని అవలంబించి, ప్రజలను ధర్మమార్గాన నడిపించి, మంచి ప్రవర్తన గలవాడుగా ఉండాలి. దండనీతిలో స్వపరభేదభావం లేకుండ సమబుద్ధితో ఉండే రాజుయొక్కఆజ్ఞచేత అన్నిజాతులవాళ్ళూ తమతమజాతిధర్మాలను ఉల్లంఘించక ప్రవర్తిస్తారు.

విశేషం: ఉత్తమపాలనకు అధికారబలం ఒక్కటే ప్రభువుకు చాలదు. నిష్పక్షపాతం, సత్ప్రవర్తనం ప్రభుతకు పెద్దబలాన్ని చేకూర్చే గుణాలు. ఇవికూడా ప్రభువుకు ఉండాలి. తరువోజ లక్షణానికి ఆది. 5,28, 145 పద్యాల విశేషవ్యాఖ్యలు చూడండి.

క. గుఱుకొని కార్యాకార్యము । లెఱుఁగక దుశ్చరితుఁ డై యహితుఁ డగు నేనిన్
మఱవక గురు నైనను జను ।లెఱుఁగఁగ శాసించునది మహీశుఁడు బుద్ధిన్. 103

ప్రతిపదార్థం: గుఱుకొని= ప్రయత్నించి; కార్య+అకార్యములు= చేయదగిన పనులు, చేయకూడని పనులు; ఎఱుఁగక= తెలియక; దుః+చరితుఁడు+ఐ= చెడునడవడి కలవాడై; అహితుఁడు+అగున్+ఏనిన్= మేలుకోరేవాడు కాకుంటే; మహీ +ఈశుఁడు= భూపతి - రాజు; గురున్+ఐనను= గురువునైనా; మఱవక= మరచిపోకుండా; బుద్ధిన్= తెలివితేటలతో - వివేకంతో; జనులు+ఎఱుఁగఁగన్= ప్రజలకందరికీ తెలిసేటట్లు; శాసించునది= శిక్షించవలసింది.

తాత్పర్యం: ఇవి చేయదగిన పనులు, ఇవి చేయగూడని పనులు - అని తెలిసికొనకుండ, చెడు నడవడి గలవాడై, మేలుకోరేవాడు కాకుంటే - తండ్రినైనా (లేదా గురువునైనా) సరే విడిచిపెట్టక, వివేకంతో, ప్రజలందరికీ తెలిసేటట్లు అతడిని ప్రభువు శిక్షించాలి.

విశేషం: గురు శబ్దానికి పాఠాంతరం సుతుశబ్దం ఉంది. మూలంలో దీనికి సరిపడే శ్లోకం కనిపించదు - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పు. 345

క. ధీరమతియుతులతోడ । విచారము సేయునది మును, విచారితపూర్వ
ప్రారబ్ధమైన కార్యము । పారముఁ బొందును విఘాతపదదూరం బై. 104

ప్రతిపదార్థం: మును= ముందుగా; ధీర, మతి, యుతులతోడన్= గొప్ప బుద్ధి గలవాళ్ళతో; విచారము= ఆలోచన; చేయునది= చేసేది; విచారిత, పూర్వ, ప్ర+అరబ్ధము+ఐన, కార్యము= ముందుగా ఆలోచించబడిందై గొప్పగా మొదలుపెట్టబడిన పని; విఘాత, పద, దూరంబు+ఐ= చెడిపోవటం అనే మాటకు దూరమైనదై - అంటే చెడిపోకుండ; పారమున్+పొందును= తుదముట్టును - పూర్తి అవుతుంది.

తాత్పర్యం: ఏ పనినైనా బుద్ధిమంతులతో ముందుగా విచారించి చేయాలి. ముందుగా విచారించి చక్కగా ప్రారంభించిన పని చెడిపోకుండా సఫలమవుతుంది.

క. జనపాలుఁడు మృదుకర్మం । బున నైనను గ్రూరకర్మమున నైనను నే
ర్పున నుద్ధరించునది త - న్ననపాయతఁ బొంది చేయునది ధర్మంబుల్. 105

ప్రతిపదార్థం: జన, పాలుఁడు= ప్రజలను పాలించేవాడు - రాజు; నేర్పునన్= నేర్పుతో; తన్నున్= తనను; మృదు, కర్మంబునన్+ఐనను= మెత్తనిపనిచేతకాని; క్రూర, కర్మమునన్+ఐనను= భయంకరమైనపనిచేతగాని; ఉద్ధరించునది= రక్షించుకోవాలి; అనపాయతన్= ప్రమాదం లేకుండటాన్ని; పొంది= కలిగి; ధర్మంబుల్; చేయునది= చేయాలి.

తాత్పర్యం: రాజు నేర్పుతో మెత్తనిపనిచేతగాని, భయంకరమైనపనిచేతగాని, మొదట తనను తాను రక్షించుకోవాలి. తనకు ప్రమాదం లేకుండ చూచుకొని రాజధర్మాలు నడపాలి.

క. అమలినమతి నాత్మచ్ఛి । ద్రము లన్యు లెఱుఁగకుండఁ దా నన్య చ్ఛి
ద్రము లిమ్ముగ నెఱుఁగుచు దే । శముఁ గాలము నెఱిఁగి మిత్రసంపన్నుం డై. 106

ప్రతిపదార్థం: అమలినమతిన్= స్వచ్ఛమైన బుద్ధితో; ఆత్మ, ఛిద్రములు= తనయొక్క లోపాలు; అన్యులు= ఇతరులు; ఎఱుఁగకుండ = తెలిసికొనకుండా; తాను, అన్య, ఛిద్రములు= ఇతరులయొక్క లోపాలు; ఇమ్ముగన్= అనుకూలంగా; ఎఱుఁగుచున్= తెలిసికొంటూ; దేశమున్= దేశపరిస్థితులను; కాలమున్= కాల పరిస్థితులను; ఎఱిఁగి= తెలిసికొని; మిత్ర, సంపన్నుండు+ఐ= స్నేహితులయొక్క బలంకలవాడై.

తాత్పర్యం: అచ్చపుబుద్ధితో తన లోపాలు ఇతరులు తెలిసికోకుండ ఇతరుల లోపాలను తాను తెలిసికొంటూ, దేశకాలపరిస్థితులను ఎరిగి, మిత్రబలం గలవాడై, రాజు తనరాజధర్మాలను నిర్వర్తించాలి.

క. బలహీను లైనచో శ । త్రులఁ జెఱచుట నీతి, యధిక దోర్వీర్య సుహృ
ద్బలు లైన వారిఁ జెఱుపఁగ । నలవియె యక్లేశ సాధ్యు లగుదురె మీఁదన్. 107

ప్రతిపదార్థం: బల, హీనులు+ఐనచో= బలాన్ని కోల్పోయినవాళ్ళయితే; శత్రువులన్; చెఱచుట= చంపటం; నీతి= రాజనీతి; అధిక, దోః+వీర్య, సుహృత్+బలులు+ఐన, వారిన్= ఎక్కువ బాహుబలం, మిత్రబలం గలవాళ్ళయినవారిని; చెఱపఁగన్= చంపటం; అలవియె= సాధ్యమా; మీఁదన్= తర్వాత; అక్లేశ, సాధ్యులు+అగుదురు+ఎ= (వారు) కష్టం లేకుండా - అంటే సులభంగా జయింపబడినవాళ్ళవుతారా!

తాత్పర్యం: బలహీను లైనపుడే శత్రువులను చంపటం రాజనీతి. వాళ్ళు అధికబాహుబలం, మిత్రబలం కూర్చుకొన్న తర్వాత వాళ్ళని చంపటం సాధ్యమా? జయించటం సులభమా? (కాదు అని భావం)

క. అలయక పరాత్మ కృత్యం । బులఁ బతి యెఱుఁగునది దూతముఖమునఁ, బరభూ
ముల వృత్తాంతము లెఱుఁగఁగఁ । బలుమఱుఁ బుచ్చునది వివిధ పాషండ తతిన్. 108

ప్రతిపదార్థం: పతి= రాజు; అలయక= విసుగుచెందక; దూత, ముఖమునన్= దూతవలన; పర+ఆత్మ, కృత్యంబులన్= తనయొక్క, శత్రువులయొక్క పనులను; ఎఱుంగునది= తెలుసుకోవాలి; పర, భూముల, వృత్తాంతములు= శత్రుదేశాలయొక్క సమాచారాలు; ఎరుఁగఁగన్= తెలిసికొనటానికి; వివిధ, పాషండ, తతిన్= పలువిధాలైన పాషండుల సమూహాన్ని; పలుమఱున్= పెక్కుమారులు; పుచ్చునది= పంపించాలి.

తాత్పర్యం: రాజు విసుగులేకుండా తన పనులనుగురించి, శత్రువుల పనులనుగురించి దూతలవలన తెలిసికొనాలి. శత్రుదేశవిషయాలను తెలిసికొనటానికి పలువిధాలైన పాషండులసమూహాల్ని పంపాలి.

విశేషం: శత్రువుల కృత్యాలనుగూర్చి దూతల వలన తెలిసికొనవలసిన అవసరం రాజులకు ఉన్నది. అంతేకాదు; తమ పనులను గూర్చి ప్రజలేమనుకొంటున్నారో, తమపనులప్రభావం దేశప్రజలమీద, శత్రువులమీద ఏ విధంగా ఉన్నదో మదింపువేసుకొనటం కూడా రాజుకు అవసరమే. పాషండు లంటే వేదబాహ్యులు.

క. నానావిహార శైలో । ద్యాన సభా తీర్థ దేవతాగృహ మృగయా
స్థానముల కరుగునెడ మును । మానుగ శోధింపవలయు మానవపతికిన్. 109

ప్రతిపదార్థం: మానవ, పతికిన్= రాజుకు; నానా, విహార, శైల+ఉద్యాన, సభా, తీర్థ, దేవతా, గృహ, మృగయా, స్థానములకున్+ అరుగు+ఎడన్= పలువిధాలైన క్రీడాపర్వతాలకు, ఉద్యానవనాలకు, సభలకు, పుణ్యతీర్థాలకు, దేవాలయాలకు, వేటాడే ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు; మును= ముందుగా; మానుగన్= తగు విధంగా; శోధింపవలయున్= పరిశుద్ధంచేయాలి - అంటే ప్రభువుకు ప్రమాదం కలిగించే వ్యక్తులు, ఆయుధాలు దాగి ఉండకుండా పరిశీలించి, ఉంటే తొలగించి ఆయా స్థలాలను ప్రమాదరహితంగా శుద్ధంచేయాలి.

తాత్పర్యం: పలువిధాలైన క్రీడాపర్వతాలకు, ఉద్యానవనాలకు, సభలకు, పుణ్యతీర్థాలకు, దేవాలయాలకు, వేటాడే ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు - ప్రభువుకు ప్రమాదాలు కలుగకుండ, ఆయాప్రదేశాలను ముందుగా తగువిధంగా పరిశీలించి, ప్రమాదంకలిగించే వ్యక్తులు, ఆయుధాలు ఉంటే తొలగించి పరిశుద్ధంగా ఉండేటట్లు చేయాలి.

విశేషం: ఈ పద్ధతులు ఈనాడుగూడ ఆచరణలో ఉన్నాయి. ఇవి ప్రభువుకు రక్షణ కల్పించటంలో భాగాలు.

తే. **వీరు నమ్మంగఁ దగుదురు వీరు నమ్మఁ। దగరు నాకు నా వలవదు; తత్త్వబుద్ధి**
నెవ్వరిని విశ్వసింపక యెల్ల ప్రొద్దు। నాత్మరక్షాపరుం డగు నది విభుండు. **110**

ప్రతిపదార్థం: విభుండు= రాజు; నాకున్; వీరు; నమ్మంగన్ తగుదురు= నమ్మదగినవాళ్ళు; వీరు; నమ్మన్, తగరు= నమ్మదగనివాళ్ళు; నా, వలవదు= అని అనవద్దు; తత్త్వ, బుద్ధిన్= నిశ్చయబుద్ధిచేత; ఎవ్వరిని= ఎవరినికూడా; విశ్వసింపక= నమ్మక; ఆత్మ, రక్షా, పరుండు+అగునది= తన్ను తాను రక్షించుకోవటమే ప్రధానంగా కలవాడు కావాలి.

తాత్పర్యం: రాజైనవాడు 'నాకు వీరు నమ్మదగినవారు, వీరు నమ్మగూడనివారు'అని అనగూడదు. నిశ్చయబుద్ధి చేత ఎవ్వరినీ నమ్మకుండా తనరక్షణ తానే ప్రధానంగా చూచుకోవాలి.

ఉ. **ఇమ్ముగ నాత్మరక్ష విధియించువిధంబున మంత్రరక్ష య**
త్నమ్మునఁ జేయఁగావలయుఁ; దత్పరిరక్షణశక్తి నెల్ల కా
ర్యమ్ములు సిద్ధిఁ బొందుఁ బరమార్థము; మంత్రవిభేద మైనఁ గా
ర్యమ్ములు నిర్వహింపఁగ బృహస్పతికైనను నేరఁబోలునే. **111**

ప్రతిపదార్థం: ఇమ్ముగన్= బాగుగా; ఆత్మ, రక్ష= తనను రక్షించుకోవటాన్ని; విధియించు, విధంబున= చేసికొన్నట్లే; మంత్ర, రక్ష= రహస్యంయొక్క కాపాడటాన్ని; యత్నమ్మునన్= ప్రయత్నంతో; చేయగావలయున్= చేసుకోవాలి; తత్+పరిరక్షణ, శక్తిన్= ఆ రహస్యాలోచనాన్ని రక్షించటంయొక్క బలంచేత; ఎల్ల, కార్యమ్ములు= అన్ని పనులు; సిద్ధిన్+పొందున్= సఫలతను పొందుతాయి; పరమ+అర్థము= నిశ్చయం; మంత్ర, విభేదము+ఐనన్= రహస్యంయొక్క వెల్లడిఅయితే; కార్యమ్ములు= పనులు; నిర్వహింపఁగన్= జరపటానికి; బృహస్పతికిన్+ఐనను; నేరన్+పోలునే= సాధ్యమవుతుందా?

తాత్పర్యం: ప్రభువు తనను తాను జాగ్రత్తగా రక్షించుకొన్నట్లే, తన రహస్యాలోచనాన్నిగూడ రక్షించుకోవాలి. రహస్యాలోచన వెల్లడి కాకుండ రక్షించుకొనే బలంచేతనే అన్నిపనులు ఫలవంతాలవుతాయి. రహస్యాలోచన వెల్లడి అయితే పనులను ఫలవంతం కావించటం ఆ బృహస్పతికైనా సాధ్యంకాదు. (బుద్ధిబలంలో బృహస్పతిని మించిన వాళ్ళులేరు కనుక అతనికికూడా సాధ్యం కాదనటం.)

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. **పలుమఱు శపథంబులు నం। జలియును నభివాదనమును సామప్రియభా**
షలు మిథ్యావినయంబులుఁ। గలయవి దుష్టస్వభావకాపురుషులకున్. **112**

ప్రతిపదార్థం: దుష్టస్వభావ, కాపురుషులకున్= చెడుస్వభావం గల నీచ మానవులకు; పలుమఱు= చాలామార్లు; శపథంబులున్= ఒట్టుపెట్టుకోవటాలు; అంజలియును= చేతులు జోడించటాలు; అభివాదనమును= నమస్కారాలు; సామ, ప్రియ, భాషలు= సామోపాయం, (అనుకూల ప్రవర్తన రూపమైన ఉపాయం), ఇంపైన మాటలు; మిథ్యా, వినయంబులు= కపటపు వినయాలు; కల, అవి= ఉన్నాయి.

తాత్పర్యం: చెడు స్వభావం గల నీచులు మాటిమాటికీ ఒట్టుపెట్టుకుంటారు. చేతులు జోడిస్తారు. నమస్కారాలు చేస్తారు. సామోపాయంతో కూడిన ఇంపైన మాటలు మాట్లాడుతారు. కపటపువినయాలు ప్రదర్శిస్తారు.

విశేషం: ఉపాయాలు - సామ, దాన, భేద, దండాలు - అనేవి నాలుగు.

క. తన కిమ్మగు నంతకు దు। ర్జనుఁ డిష్టుఁడపోలె నుండి సర్పముపోలెం
దన కిమ్మగుడును గఱచును। ఘనదారుణకర్మగరళ ఘనదంష్ట్రములన్. 113

ప్రతిపదార్థం: దుర్జనుఁడు= దుర్మార్గుడు; తనకు; ఇమ్ము+అగు+అంతకు= అనుకూలం అయ్యేవరకు; ఇష్టుఁడు+అ, పోలెన్= ఇష్టమైనవాడివలె - మిత్రుడివలె; ఉండి= వర్తించి; తనకున్; ఇమ్ము+అగుడును= అవకాశం లభించినంతనే; సర్పము+పోలెన్= పామువలె; ఘన, దారుణ, కర్మ, గరళ, ఘన దంష్ట్రములన్= మిక్కిలి క్రూరాలయిన పనులు అనే విషంచే పెద్దవైన కోరలచేత; కఱచును= కరుస్తాడు.

తాత్పర్యం: దుర్మార్గుడు తనకు అనుకూల మయ్యేంతవరకు మిత్రుడివలె నటించి, అనుకూలత ఏర్పడిన వెంటనే పామువలె తన క్రూరకృత్యా లనే కోరలతో కరుస్తాడు.

విశేషం: అలం: ఉపమ.

క. కడునలుకయుఁ గూర్మియు నే। ర్పడ నెఱిఁగించునది వాని ఫలకాలమునన్
బిడుగును గాడ్పును జనులకుఁ। బడుటయు వీచుటయు నెఱుకపడియెడుభంగిన్. 114

ప్రతిపదార్థం: కడున్= మిక్కుటమైన; అలుకయున్= కోపమూ; కూర్మియున్= స్నేహమూ; వాని, ఫల, కాలమునన్= వాటియొక్క ఫలంయొక్క సమయాన - అంటే ఆ రెండింటియొక్క అనుభవకాలాన; పిడుగును; గాడ్పును= గాలియును; పడుటయు; వీచుటయున్; జనులకున్; ఎఱుకపడియెడు, భంగిన్= తెలిసేటట్లుగా; ఏర్పడన్= స్పష్టమయ్యేట్లు; ఎఱిఁగించునది= తెలియజేయాలి.

తాత్పర్యం: పిడుగుపడటం, గాలివీచటం - అవి జరిగినపుడే జనులకు తెలిసినట్లు - మిక్కుటమైన కోపంగాని, స్నేహంగాని వాటి అనుభవకాలానికే ఇతరులకు తెలియజేయాలి.

విశేషం: అలం: క్రమం, ఉపమ.

క. తఱియగునంతకు రిపుఁ దన। యఱకటఁ బెట్టికొనియుండునది; దఱియగుడుం
జెఱచునది ఱాతిమీదను। వఱలఁగ మృద్ఘటము నెత్తి వైచిన భంగిన్. 115

ప్రతిపదార్థం: తఱి= సమయం; అగునంతకున్= వచ్చేవరకు; రిపున్= శత్రువును; తన, అఱకటన్= తనయొక్క భుజం మీద; పెట్టుకొని; ఉండునది = ఉండాలి; తఱి, అగుడున్= సమయం వచ్చినపుడు; మృత్+ఘటమున్= మట్టికుండను; వఱలఁగన్= ఒప్పగా - ప్రకాశించేటట్లు; ఱాతిమీదను; ఎత్తివైచిన, భంగిన్= ఎత్తి పడవేసిన విధంగా; చెఱచునది= నాశనమయ్యేటట్లు చేయాలి.

తాత్పర్యం: తగిన సమయం వచ్చేవరకు శత్రువును భుజంమీదికి ఎక్కించుకొని మోస్తూ, తగిన సమయం రాగానే మట్టికుండను రాతిమీద ఎత్తికొట్టినట్లు అతడిని నాశనం చేయాలి.

విశేషం: అలం: ఉపమ. ఈ పద్యం పెక్కు ప్రతుల్లో లేనట్లు శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి పుట,348లో ఉన్నది.

క. తన కపకారము మునుఁ జే। సిన జనుఁ డల్పుఁ డని నమ్మి చేకొని యుండం
జన; దొకయించుక ముల్లయి। నను బాదతలమున నున్న నడవఁగ నగునే. 116

ప్రతిపదార్థం: మును= ముందు - ఇదివరకు; తనకున్; అపకారము= కీడు; చేసిన; జనుఁడు; అల్పుఁడు+అని= తక్కువవాడని; నమ్మి; చేకొని= ఆదరించి; ఉండన్+చనదు= ఉండకూడదు; ఒక, ఇంచుక= ఒకకొద్దిపాటి; ముల్లు+అయినను; పాద, తలమునన్= పాదప్రదేశంలో - అంటే పాదంలో; ఉన్నన్= ఉంటే; నడువఁగన్= నడవటానికి; అగునే= సాధ్యమవుతుందా?

తాత్పర్యం: ఇంతకుముందు తనకు అపకారం చేసిన మానవుడు తక్కువవాడుకదా అని, అతడిని ఆదరించకూడదు. ముల్లు చిన్నదే అయినా అది పాదంలో ఉంటే నడవటానికి సాధ్యమవుతుందా?

విశేషం: అలం: అర్థాంతర్యాసం. ఈ పద్యానికి పాఠాంతరంగా కొన్ని ప్రతుల్లో ఉన్న పద్యం: "తన కపకారము చేసిన, జనుఁ డల్పుం డనుచు నమ్మి జడమతి యై చే, కొనఁ జన దించుక ముల్లయి, నను బద్ధతులందు నున్న నడువఁగ నగునే." - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి పుట,347

క. బాలుఁ డని తలఁచి రిపుతో। నేలిదమునఁ గలిసియునికి యిది కార్యమె? యు
త్కీలానలకణ మించుక। చాలదె కాల్పంగ నుగ్రశైలాటవులన్. 117

ప్రతిపదార్థం: బాలుఁడు+అని; తలఁచి; రిపుతోన్= శత్రువుతో; ఏలిదమునన్= చులకనభావంతో; కలిసి, ఉనికి= కలిసి ఉండటం; ఇది= ఇట్లుండటం; కార్యమె= చేయదగిన పనియా; ఉగ్ర, శైల+అటవులన్= భయంకరాలైన పర్వతాలలోని అడవులను; కాల్పంగన్= కాల్చడానికి; ఉత్, కీలా+అనల, కణము= పెద్దమంటయొక్క నిప్పురవ్వ; ఇంచుక= కొంచెం; చాలదె= సరిపోదా.

తాత్పర్యం: బాలుడు కదా అని చులకన భావం వహించి శత్రువుతో కలిసి ఉండకూడదు. భయంకరాలైన పర్వతారణ్యాలను కాల్చటానికి చిన్న నిప్పురవ్వ చాలదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. మొనసి యపకారిఁ గడ నిడి। కొనియుండెడు కుమతి దీర్ఘకుజశాఖాగ్రం
బున నుండి నిద్రవోయెడు। మనుజునకు సమాన మగుఁ బ్రమత్తత్వమునన్. 118

ప్రతిపదార్థం: మొనసి= పూని; అపకారిన్= కీడుచేసినవాడిని; కడన్+ఇడికొని+ఉండెడు= దగ్గర ఉంచుకొని ఉండే; కుమతి= చెడుబుద్ధికలవాడు - ఇట బుద్ధిలేనివాడని గ్రహింపవచ్చు; ప్రమత్తత్వమునన్= ఏమరినవాడు కావటంలో; దీర్ఘ, కుజ, శాఖా+ అగ్రంబునన్+ఉండి= ఎత్తైనచెట్టు కొమ్మయొక్క చివరలో పరుండి; నిద్ర+పోయెడు; మనుజునకున్ సమానము+అగున్= నిద్రించేవాడితో సమానం అగుచున్నాడు.

తాత్పర్యం: ప్రయత్నించి తన కపకారం చేసినవాడిని దగ్గర ఉంచుకొన్న బుద్ధిహీనుడు ఏమరుపాటుతో ఎత్తైన చెట్టుకొమ్మచివర నిద్రించేవాడితో సమానం.

విశేషం: అలం: ఉపమ.

చ. తడయక సామభేదముల దానములన్ దయతోడ నమ్మఁగా
నొడివియు సత్యమిచ్చియుఁ జనున్ జననాథ! కృతాపకారులం
గడఁగి వధింపఁగాఁ గనుట కావ్యమతం బిది; గాన యెట్టులుం
గడుకొని శత్రులం జెఱుపఁగాంచుట కార్యము రాజనీతిమైన్. 119

ప్రతిపదార్థం: జననాథ= ఓరాజా!; కృత+అపకారులన్= చేయబడిన అపకారాలు కలవాళ్ళను; తడయక= ఆలస్యంచేయక; సామ భేదములన్= సామోపాయంచేత, భేదోపాయంచేత; దానములన్= దానాలచేత; దయతోడ; నమ్మన్+కాన్= నమ్మకం కలిగించేటట్లుగా; నొడివియున్= మాట్లాడి; సత్యము+ఇచ్చియున్= ఒట్టుపెట్టుకొని; కడఁగి= ప్రయత్నించి; వధింపన్+కాన్+కనుట= చంపబడేటట్లు చూడటం - అంటే చంపటం; చనున్= తగును; ఇది= ఈ నీతి; కావ్య, మతంబు= శుక్రాచార్యునియొక్క అభిప్రాయం; కానన్= కనుక; ఎట్టులున్= ఏ విధంగానైనా; కడుకొని= ప్రయత్నించి; రాజనీతిమైన్= రాజనీతిచేత; శత్రువున్= పగవాణ్ణి, చెఱుపన్, కాంచుట= నశించేటట్లు చూడటం; కార్యము= చేయదగిన పని.

తాత్పర్యం: ఓ రాజా! అపకారాలు చేసినవాళ్ళను - సామదానభేదోపాయాలచేత లేదా దయ చూపి నమ్మకం కలిగేట్లుగా మాట్లాడి లేదా ఒట్టుపెట్టుకొని, నమ్మకం కలిగించి ఆలస్యం జరగకుండా చంపాలి. ఇది శుక్రుని అభిప్రాయం. అందుచేత ఏ విధంగా నైనా రాజనీతితో శత్రువులను హతమార్చాలి.

విశేషం: కావ్యమతం బిది - అనే దానికి కావ్యమతం బిది, కార్యమతం బిది, కావ్యమతం బిది అనే పాఠాంతరాలున్నాయి. శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి పుట,348

వ. 'కావున సర్వప్రకారంబుల నపకారకారణు లయిన వారిం బరుల నయిన బాంధవుల నయిన నుపేక్షింపక యాత్మరక్షాపరుండ వయి దూరంబుసేసి దూషించునది' యనినఁ గణికుమతంబు విని దుర్యోధనుండు చింతాపరుం డై యొక్కనాఁడు ధృతరాష్ట్రున కేకాంతంబున ని ట్లనియె. 120

ప్రతిపదార్థం: కావునన్; సర్వ, ప్రకారంబులన్= అన్నివిధాలచేత; అపకార, కారణులు+అయిన, వారిన్= అపకారాలు చేసిన వారిని; పరులన్+అయినన్= శత్రువులనైనా; బాంధవులన్+అయినన్; ఉపేక్షింపక= అశ్రద్ధచేయక; ఆత్మ, రక్షాపరుండవు+అయి= నిన్ను నీవు రక్షించుకొనటంలో మనస్సు కలవాడవై; దూరంబు+చేసి= (వారిని) దూరంగా ఉంచి; దూషించునది= తిట్టాలి (ఇట చంపాలి అనే అర్థం సమంజసం); అనినన్= అని అనగా; కణికు, మతంబు= కణికునియొక్క అభిప్రాయం; విని;

దుర్యోధనుండు; చింతా, పరుండు+ఐ= దుఃఖం నిండిన మనస్సు కలవాడై; ఒక్కనాఁడు; ధృతరాష్ట్రునకున్= ధృతరాష్ట్రునితో; ఏకాంతంబునన్= ఒంటరిగా ఉన్నప్పుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అందుచేత అపకారాలు చేసినవాళ్ళు శత్రువులైనా బంధువులైనా అశ్రద్ధచేయకూడదు. ఆత్మరక్షణకొరకు అన్నివిధాలా వాళ్ళను హతమార్చా' లని కణికుడు చెప్పగా విని, చింతాక్రాంతుడై దుర్యోధనుడు ఒకనాడు ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నప్పుడు అతనితో ఇట్లా అన్నాడు.

దుర్యోధనుఁడు తండ్రితోఁ దన మనోదుఃఖంబుఁ దెలుపుట (సం.1-129-10)

తే. **వీరు లని పాండుసుతులకు వెఱతు నేను; । వెఱచుటకుఁ దోడుగా నిప్డు విభుఁడ వీవు**
పాండవజ్యేష్ఠునకుఁ బ్రీతిఁ బరమయౌవ । రాజ్య మిచ్చితి కురువృద్ధరాజులొద్ద. 121

ప్రతిపదార్థం: నేను; వీరులు+అని; పాండు, సుతులకున్= పాండురాజుయొక్క కుమారులకు - పాండవులకు; వెఱతున్= భయపడతాను; వెఱచుటకున్= భయపడటానికి; తోడు, కాన్= తోడయినట్లు; విభుఁడవు+ఈవు= రాజువైన నీవు; కురు, వృద్ధ, రాజుల+ఒద్ద= కురువంశపు పెద్దలయొక్క, రాజులయొక్క ఎదుట; ప్రీతిన్= ప్రేమతో; పాండవ, జ్యేష్ఠునకున్= పాండవులలో పెద్దవాడైనవానికి, ధర్మరాజుకు; పరమ, యౌవ, రాజ్యము= ప్రధానమైన యౌవరాజ్యాన్ని; ఇచ్చితి= ఇచ్చావు.

తాత్పర్యం: పాండవులు వీరులని నేను భయపడుతున్నాను. నేను భయపడటానికి తగ్గట్లే ప్రభువైన నీవు కురువంశపుపెద్దలయెదుట, రాజులయెదుట పాండవులలో పెద్దవాడైన ధర్మరాజును ప్రేమతో యువరాజును చేశావు.

విశేషం: వ్యక్తిబలాన్ని అంతకంత పెంచేది అధికారం. పాండవులు మొదలే బలవంతులు. అందుకుతోడు యుధిష్ఠిరుడిప్పుడు యువరాజైనాడు. ఆ యౌవరాజ్యాధికారం అతనికి ఎవరో ఇచ్చింది కాదు. రాజైన ధృతరాష్ట్రుడే స్వయంగా ఇచ్చాడు. పైగా చాటుమాటుగా ఏదో మాటవరుస ఇవ్వలేదు. పదిమందిఎదుట శాస్త్రోక్తంగా కట్టబెట్టాడు. దాన్ని కాదనటం ఎట్లా? పాండవులను ఎదిరించటం ఎట్లా? అదే దుర్యోధనునిబాధ, భయం. అతనిమానసికస్థితిని తెలియపరచేదే ఈ తేటగీతి.

వ. **'దాననచేసి పౌర జానపద బ్రాహ్మణ ప్రధానవరులు ధర్మజున కనురక్తు లయి, నిన్నును భీష్ముని నాదరింపక, ప్రజ్ఞాచక్షుండు రాజ్యరక్షణంబు సేయ సమర్థుండు గాఁడు, భీష్ముండు సమర్థుం డయ్యును ముందఱ రాజ్యభార నివర్తనంబునందుఁ గృతప్రతిజ్ఞుం డయ్యెం; గావునఁ బాండవజ్యేష్ఠుం డైన యుధిష్ఠిరునకు రాజ్యాభిషేకంబు సేయుద; మతండు తరుణుం డయ్యును గుణవృద్ధుండు ధర్మశీలుండు పరాక్రమవంతు లైన తమ్ములుగలవాడు రాజ్యప్రతిష్ఠితుం డయ్యెనేని వృద్ధుల నమాత్యుల బంధుమిత్రులను దొల్లింటికంటె మిక్కిలిగాఁ బూజార్హుల నెల్లం బూజించుఁ, బితామహుండైన భీష్ముని సపుత్త్రకుండైన ధృతరాష్ట్రుని నతిభక్తి నభీష్టభోగానుభవపరులంగా సుఖంబున నునుచు, దీనికి విదురుండును నొడంబడు నని యెప్పుడుఁ దమలో విచారింతు రని వింటిఁ; గర్ణశూలాయమానంబు లైన మూర్ఖప్రకృతుల పలుకులు విననోపఁ; బాండవుల నిప్వరంబువలనఁ బాయునట్లుగాఁ జేయవలయు; నేమి సేయుదు?' నని నఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె.** 122

ప్రతిపదార్థం: దాననచేసి= దానివలన - ధర్మరాజుకు యౌవరాజ్యం ఇచ్చినందువలన; పౌర, జానపద, బ్రాహ్మణ, ప్రధానవరులు= పట్టణప్రజలు, పల్లెప్రజలు, బ్రాహ్మణులు, మంత్రిశ్రేష్ఠులు; ధర్మజునకు= ధర్మరాజునకు; అనురక్తులు+అయి= అనురాగం

- ప్రేమ కలవాళ్ళయి; నిన్నును; భీష్మునిన్= భీష్ముని; ఆదరింపక= లెక్కచేయక; ప్రజ్ఞాచక్షుండు= బుద్ధియే కన్నుగా కలవాడు-ధృతరాష్ట్రుడు; రాజ్య, రక్షణంబు, చేయన్= రాజ్యాన్ని రక్షించటానికి; సమర్థుఁడు; కాఁడు; భీష్ముండు; సమర్థుండు+అయ్యును; ముందఱ= మున్ను, రాజ్య, భార, నివర్తనంబు+అందు= రాజ్యభారంనుండి మరలటంలో; కృత ప్రతిజ్ఞుండు= చేయబడినప్రతిజ్ఞ కలవాడు; అయ్యెన్; కావునన్; పాండవ, జ్యేష్ఠుండు+ఐన= పాండవులలో పెద్దవాడైన; యుధిష్ఠిరునకున్= ధర్మరాజునకు; రాజ్య+అభిషేకంబు; చేయుదము; అతండు= ఆ ధర్మరాజు; తరుణుండు+అయ్యును= యువకుడైనా; గుణ, వృద్ధుండు= గుణంచేత పెద్దవాడు; ధర్మశీలుండు= ధర్మాన్నే స్వభావంగా కలవాడు; వృద్ధులన్= పెద్దలను; అమాత్యులన్= మంత్రులను; బంధు, మిత్రులను; తొల్లింటికంటె= మునుపటికంటె; మిక్కిలిగా= ఎక్కువగా; పూజా+అర్హులన్+ఎల్లన్= గౌరవానికి తగినవాళ్ళ నందరినీ; పూజించున్= గౌరవిస్తాడు; పితామహుండు+ఐన= తాతగారైన; భీష్ముని; స, పుత్త్రుకుండు+ఐన= కుమారులు గల వాడైన; ధృతరాష్ట్రునిన్; అతి, భక్తిన్= మిక్కిలిభక్తితో; అభి+ఇష్ట, భోగ+అనుభవ, పరులన్+కాన్= కోరుకొన్న భోగాలను అనుభవించటంలో లగ్నమైన మనస్సులు గలవాళ్ళనుగా; సుఖంబునన్= సుఖంతో; ఉనుచున్= ఉంచుతాడు; దీనికిన్= ఈ విధంగా చేయటానికి; విదురుండునున్= విదురుడుకూడా; ఒడంబడును+అని= ఒప్పుకొంటాడని; ఎల్లప్పుడు; తమలోన్= తమలో తాము; విచారింతురు= ఆలోచిస్తారు; అని= అనికూడా; వింటిన్= విన్నాను; కర్ణ, శూలాయమానంబులు+ఐన= చెవులకు బల్లేలవంటివైన; మూర్ఖ, ప్రకృతుల, పలుకులు= మూర్ఖులైన జనులయొక్క మాటలు; వినన్+ఓపన్= వినలేకున్నాను; పాండవులన్; ఈ+పురంబువలనన్= ఈ నగరంనుండి; పాయు+అట్లు+కాన్= తొలగేటట్లుగా; చేయవలయున్; ఏమి; చేయుదున్; అనినన్; కొడుకునకున్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మరాజుకు యౌవరాజ్యం ఇవ్వటంవలన పట్టణప్రజలు, పల్లెప్రజలు, మంత్రిశ్రేష్ఠులు అతనిపట్ల అనురాగంకలవాళ్ళయి, నిన్నూ; భీష్ముడినీ లెక్కచేయక, ధృతరాష్ట్రుడు రాజ్యాన్ని రక్షించలేడు. భీష్ముడు రాజ్యాన్ని రక్షించగలవాడే అయినా రాజ్యభారం స్వీకరించనని ప్రతిజ్ఞచేసి ఉన్నాడు. అందుచేత ధర్మరాజునే రాజుగా చేద్దామనీ, అతడు యువకుడైనా గుణవంతుడనీ, ధర్మాత్ముడనీ, పరాక్రమవంతులైన తమ్ములు గలవాడనీ, అటువంటివాడిని రాజుగా చేస్తే మంత్రులను, బంధువులను, మిత్రులను, గౌరవించదగినవాళ్ళందరినీ మునుపటికంటె ఎక్కువగా గౌరవిస్తాడనీ, తాతగారైన భీష్ముడిని, పుత్రులున్న ధృతరాష్ట్రుడిని మిక్కిలిభక్తితో పూజిస్తాడనీ, వారి కిష్టమైన భోగాలను అనుభవింపజేసి సుఖంగా ఉంచుతాడనీ, ఇందుకు విదురుడుకూడ అంగీకరిస్తాడనీ ఎప్పుడూ తమలో తాము అనుకొంటున్నారు. చెవులకు బల్లెములవలె తగిలే ఈ మూర్ఖజనుల మాటలను నేను వినలేకున్నాను. పాండవులను ఈ పురం వదలిపోయేటట్లు చేయం' డని దుర్యోధనుడనగా అతనితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

చ. జనపతి యైనవానికిఁ బ్రచండమహాతుములాహవాంతరం
బున మృతిఁబొందియొండె, మఱి పుత్త్రులపైఁ దనరాజ్యభార మె
ల్లను నియమించి యేఁగి గిరులం దప మొప్పఁగఁ జేసి యొండెఁ గా
కనిమిషలోకభోగసుఖ మందఁగఁ బోలునె శాశ్వతంబుగన్. 123

ప్రతిపదార్థం: జనపతి+ఐన, వానికిన్= రాజైనవానికి; ప్రచండ, మహా, తుముల+ఆహవ+అంతరంబునన్= సహింప శక్యంగాని పెద్ద సంకులయుద్ధంయొక్క మధ్యంలో; మృతిన్= మరణాన్ని; పొంది; ఒండెన్= కాని; మఱి= అట్లా కాక; పుత్త్రుల పైన్; తన, రాజ్య, భారము+ఎల్లను= తనయొక్క రాజ్యంయొక్కభారాన్నంతను; నియమించి= ఏర్పాట్లుచేసి; ఏఁగి= వెళ్ళి; గిరులన్= పర్వతాలలో; తపము= తపస్సు; ఓపన్+కన్= తగినట్లుగా; చేసి; ఒండెన్= కాని; కాక= కాకుండా; శాశ్వతంబుగన్= శాశ్వతంగా; అనిమిష, లోక, భోగ, సుఖము= స్వర్గలోకాన్ని అనుభవించటంలోని సుఖాన్ని; అందన్+కన్= పొందటానికి; పోలునె= సాధ్యమగునా?

తాత్పర్యం: రాజైనవాడు మహాయుద్ధంలో మరణించి గాని, రాజ్యభారాన్ని కొడుకులకు అప్పగించి కొండలపై గొప్పతపస్సు చేసి గాని, శాశ్వతమైన స్వర్గసుఖాన్ని పొందగలడేగాని, వేరే విధంగా దాన్ని పొందగలడా!

వ. రా జయ్యెడువాఁడు తన రాజ్యభారంబు దాన చూచి యరయవలయు; నేను షడంగసహితంబుగా వేదాధ్యయనంబు సేసియు నర్థశాస్త్రంబునందుఁ గృతనిశ్చయుండ నయి బలంబు గలిగియు నంగవైకల్యంబునం బరచక్రంబులకుం బ్రతివ్యూహంబు రచియింప నేరమింజేసి రాజ్యంబునకుఁ దగకున్న. 124

ప్రతిపదార్థం: రాజు+అయ్యెడు, వాడు= రాజైనవాడు; తన, రాజ్య, భారంబు= తనరాజ్యభారాన్ని; తానే; చూచి, అరయ, వలయున్= విచారించుకోవాలి; ఏను= నేను; షట్+అంగ, సహితంబుగా= ఆరు అంగాలతో కూడిన; వేద+అధ్యయనంబు= వేదాన్ని చదవటం; చేసియున్=చేసికూడా; అర్థశాస్త్రంబు+అందు= ద్రవ్యనీతిశాస్త్రంలో; కృత, నిశ్చయుండను+అయి= నేర్పబడిన సిద్ధాంతాలు కలవాడినై; బలంబు; కలిగియు; అంగ, వైకల్యంబునన్= అవయవంయొక్క లోపంచేత; పర, చక్రంబులకున్= శత్రువులయొక్క సైన్యాలకు; ప్రతివ్యూహంబులు= ఎదురు పన్నుగడలు; నేరమిన్+చేసి= కూర్చటానికి చేతకాకపోవటంవలన; రాజ్యంబునకున్, తగక+ఉన్నన్= రాజ్యపాలనకు తగనివాడనై ఉండటంచేత.

తాత్పర్యం: రాజైనవాడు తన రాజ్యవిషయాలు తానే విచారించుకొనాలి. నేను ఆరుఅంగాలతో కూడిన వేదాన్ని చదివి అర్థనీతిశాస్త్రాన్ని నేర్చుకొన్నా, బలంకలవాణ్ణి అయినా, అంధుడిని కావటంచేత శత్రు సైన్యాలకు ఎదురు వ్యూహాలు కూర్చలేనివాడినై రాజ్యపాలనకు తగనివాడను కావటంచేత.

విశేషం: షడంగాలు - శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం.

ఉ. లోకనుతుండు పాండుఁ డమలుండు మహాగుణరత్నపూర్ణర
త్నాకరుఁ డత్యుదారమతి నంధుఁడ నైనను నన్ను రాజుఁగాఁ
జేకొని నాకు భక్తిఁ బనిసేయుచు సర్వజగజ్జిగీషుఁ డై
యీకురువంశరాజ్యభర మింతయుఁ దాల్చెఁ బరాక్రమంబునన్. 125

ప్రతిపదార్థం: లోక, నుతుండు= ప్రపంచంచేత కొనియాడబడినవాడు; అమలుండు= దోషంలేనివాడు- పవిత్రుడు; మహా, గుణ, రత్న, పూర్ణ, రత్న+ఆకరుఁడు= గొప్పవైన మంచిగుణాలనే రత్నాలచేత నిండిన సముద్రునివంటివాడు; పాండుఁడు= పాండురాజు; అతి+ఉదారమతిన్= మిక్కిలి గొప్పమనస్సుతో; అంధుఁడను+ఐనను= గ్రుడ్డివాడను అయినప్పటికీ; నన్నున్; రాజున్+కాన్= రాజును కావించి; చేకొని; నాకున్; భక్తిన్= భక్తితో; పనిచేయుచు; సర్వ, జగత్+జిగీషుఁడు+ఐ= మొత్తం ప్రపంచాన్ని జయించ గోరేవాడై; పరాక్రమంబునన్; ఈ, కురు, వంశ, రాజ్య, భరము+ఇంతయున్= ఈ కురువంశ రాజ్యభారాన్నంతటినీ; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: ప్రపంచప్రశంసలందుకొన్నవాడు, పవిత్రుడు, సద్గుణాలనే రత్నాలకు సముద్రునివంటివాడు అయిన పాండురాజు గొప్పమనస్సుతో, గ్రుడ్డివాడినైన నన్ను రాజుగా స్వీకరించి, భక్తితో సేవచేస్తూ, సర్వప్రపంచాన్ని జయింపగోరేవాడై పరాక్రమంతో ఈ కురువంశరాజ్యభారాన్నంతా వహించాడు.

క. పరచక్రపతులచే భీ । కరుఁ డై ధనరాసు లదిమి కప్పము గొని చె
చ్చెరఁ దెచ్చియిచ్చి నన్నును । భరతకులశ్రేష్ఠుఁ డునిచె బహుయజ్ఞములన్. 126

ప్రతిపదార్థం: భరత, కుల, శ్రేష్ఠుండు= భరతవంశంలో పేరు కెక్కినవాడు; భీకరుఁడు+ఐ= భయాన్ని కలిగించేవాడై; అదిమి= అణచి; ధన, రాసులు; పర, చక్ర, పతులచే= శత్రురాజ్యాలయొక్క రాజులచేత; కప్పము; కొని= తీసికొని; చెర+ చెరన్= వెంటనే; తెచ్చి, ఇచ్చి; నన్నును= నన్నుకూడా; బహు, యజ్ఞములన్= అనేకయజ్ఞాలలో; ఉనిచెన్= ఉండేట్లు చేశాడు - అంటే అనేక యజ్ఞాలు నాచేత చేయించాడు.

తాత్పర్యం: భరతవంశశ్రేష్ఠుడైన పాండురాజు శత్రుభయంకరుడై శత్రువులను అణచి, కప్పం గ్రహించి ధనరాసులు వెంటనే తెచ్చి, ఇచ్చి నా చేత అనేకయజ్ఞాలు చేయించాడు.

వ. 'మఱియు వానికంటె గుణంబుల మిక్కిలి యయి జనంబులకు ననురక్తు లై పరగుచున్నపాండురాజు కుమారుల నెవ్విధంబునఁ బాపనేర్తు' నని దుఃఖించిన ధృతరాష్ట్రునకు దుర్యోధనుం డి ట్లనియె. 127

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ, వానికంటెన్= ఆ పాండురాజుకంటె; గుణంబుల= మంచిగుణాలలో; మిక్కిలి, అయి= ఎక్కువై; జనంబులకున్, అనురక్తులు+ఐ= అనురాగం - ప్రేమ - కలవారై; పరగుచున్+ఉన్న= ఒప్పుతున్న; పాండు రాజ, కుమారులన్= పాండవులను; ఏవిధంబునన్= ఏ విధంగా, పాపనేర్తును= తొలగించగలను, అని; దుఃఖించిన= దుః ఖించు; ధృతరాష్ట్రునకు; దుర్యోధనుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఆ పాండురాజుకంటె గుణాలలో అధికు లై ప్రజలప్రేమ గలిగి ప్రకాశిస్తున్న పాండవులను ఏ విధంగా తొలగించగల?' నని ధృతరాష్ట్రుడు దుఃఖించగా, దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

సీ. పైతృకం బగు లక్ష్మి పాండుభూపతి మున్ను । తాల్చుటఁజేసి తత్తనయుఁ డైన
ధర్మజుఁ డిప్పుడు దాల్చిన, నాతని । తనయుండు మఱి దానిఁ దాల్చు, మీఁద
నిప్పాటఁ బాండువంశేశుల వసుమతీ । రాజ్యార్హు లగుదురు; రాజ్యమునకుఁ
బరువడి మే మింతఁ బాసిన మాపుత్ర పౌత్ర వర్గంబునుఁ బాయు; నింక

ఆ. నొరులఁ గొలిచి కుడువనోప మే; మట్లుగా । కుండ మమ్ముఁ జేయనోపుదేని
పాండురాజుతోంటిభక్తియు నప్పాండు । తనయులందు దయయుఁ దలఁపకుండు. 128

ప్రతిపదార్థం: పైతృకంబు+అగు, లక్ష్మి= పితరులనుండి వచ్చిందైన సంపదను; పాండు, భూపతి= పాండురాజు; మున్ను= ముందు; తాల్చుటన్+చేసి= ధరించటంవలన; తత్+తనయుఁడు+ఐన, ధర్మజుడు= అతనియొక్క కుమారుడైన ధర్మరాజు; ఇప్పుడు= ఈ సందర్భంలో; తాల్చినన్= ధరిస్తే; అతని, తనయుండు= అతనియొక్క - ధర్మరాజుయొక్కకుమారుడు; మఱి= మళ్ళీ; దానిన్= ఆ సంపదను; తాల్చున్= ధరిస్తాడు; మీఁదన్= తర్వాత; ఈ+పాటను= ఈవిధంగా; పాండు, వంశ+ ఈశులు+అ= పాండువంశరాజులే; వసుమతీ, రాజ్య+అర్హులు= భూమిదొరతనానికి తగినవారు; అగుదురు; రాజ్యమునకున్= రాజ్యానికి; పరువడి= క్రమంగా; మేము; ఇంతన్= ఈ కొలది; పాసినన్= దూరమైతే; మా, పుత్ర, పౌత్ర, వర్గంబునున్= మాయొక్క కొడుకులయొక్క, మనుమలయొక్క సమూహం; పాయున్= దూరమవుతుంది; ఇంకన్= ఇకముందు; ఏము;

ఒరులన్= ఇతరులను; కొలిచి= సేవించి; కుడువన్+ఓపము= తినటాన్ని, త్రాగటాన్ని చేయలేము - అంటే బ్రతుకు గడపలేము; అట్లు; కాక+ఉండ; మమ్మున్; చేయన్+ఓపుదు+ఏని= నీవు చేయగలిగితే; పాండురాజు, తొంటి, భక్తియున్= పాండురాజుయొక్క మునుపటి భక్తిని; ఆ+పాండు, తనయుల+అందు= ఆ పాండవులపట్ల; దయయున్; తలఁపక+ఉండు= ఆలోచించకుండా ఉండుము.

తాత్పర్యం: వంశపారంపర్యంగా తాత తండ్రులనుండి వచ్చే రాజ్యసంపదను ఇదివరకు పాండురాజు చేపట్టి ఉండటంచే ఇప్పుడు ధర్మరాజు చేపడితే, తరువాత అతనితనయుడు చేపడతాడు. ఈ విధంగా పాండురాజు వంశంవాళ్ళే రాజ్యార్హులౌతారు. మేము రాజ్యాధికారానికి దూరమైతే క్రమంగా మాకొడుకులు, మనుమలు దూరమౌతారు. ఇకముందు ఇతరులకు సేవలుచేసి మేము బ్రదుకలేము. మాకు అటువంటి గతిపట్టకుండా నీవు చేయగలిగితే పాండురాజు నీపట్ల ఇదివరకు చూపిన భక్తిని, పాండవులపట్ల నీ కున్న దయను మనస్సులో నిలుపవద్దు.

దుర్యోధనుఁడు పాండవులను వారణావతంబునకుఁ బంపు మని తండ్రితోఁ జెప్పుట (సం. 1-130-8)

వ. 'ఈరాజ్యంబు మొదలింటంగోలె భవదీయం బయినది; ప్రకృతిజనులు వశ్యులు గాకున్నను గ్రమాగతంబయి మాకు నప్రయత్నలభ్యంబగుఁ దొల్లి పాండురాజు రా జై గుణంబులం బ్రజానురాగంబు వడయుటంజేసి యెల్లవారును ధర్మరాజురాజ్యంబ వలతురు; దాని నెఱింగియ కాదె యేను నిత్యదానసమ్మానంబులం బ్రకృతిజనంబులకు సంతోషంబు సేయుచునుండుదు; నిందుల దుష్టజనులపక్షపాతవచనంబు లుడుగునంతకు నుపాయంబునఁ గొంతినిఁ బాండవులను దదీయభృత్యామాత్యవర్గంబుతో వారణావతంబునకుం బుత్తము; మనకు రాజ్యంబు సుప్రతిష్ఠితం బైన మఱి వార లిందులకు వత్తు' రనిన దుర్యోధనునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 129

ప్రతిపదార్థం: ఈ, రాజ్యంబు; మొదలింటన్+కోలె= మొదటినుండి; భవదీయంబు+అయినది= నీదైనది; ప్రకృతి, జనులు= స్వామి, అమాత్య, సుహృత్కోశాదులకు సంబంధించినప్రజలు; వశ్యులు+కాక+ఉన్నను= లోబడినవారు కాకపోయినా; క్రమ+ఆగతంబు+అయి= వరుసగా వచ్చినదై; మాకున్, అప్రయత్న, లభ్యంబు= శ్రమపడకుండా దొరికింది; అగున్= అవుతుంది; తొల్లి= ఇదివరకు; పాండురాజు; రాజు+ఐ; గుణంబులన్= మంచి గుణాలచేత; ప్రజా+అనురాగంబు= ప్రజల యొక్క ప్రేమ; పడయుటన్+చేసి= పొందటంవలన; ఎల్లవారును= అందరూ; ధర్మరాజు, రాజ్యంబు= ధర్మరాజుయొక్క రాజ్యాన్నే, వలతురు= కోరుకొంటారు, దానిన్=దాన్ని; ఎఱింగియు, కాదె= తెలిసికొనేకదా; ఏను= నేను; నిత్య, దాన, సమ్మానం బులన్= ప్రతిదినం దానాలచేతను, గౌరవాలచేతను; ప్రకృతి, జనంబులకున్= స్వామి, అమాత్య, సుహృత్కోశాదులకు సంబంధించిన ప్రజలకు; సంతోషంబు= సంతోషాన్ని; చేయుచున్+ఉండుదున్= కలిగిస్తూఉన్నాను; ఇందుల= ఇచ్చట; దుష్ట, జనుల, పక్షపాత, వచనంబులు= చెడ్డజనులయొక్క పక్షపాతపు మాటలు; ఉడుగు+అంతకున్= మానునంతవరకు; ఉపాయం బునన్= ఉపాయంతో; గొంతినిఁ= కుంతీదేవిని; పాండవులను; తదీయ, భృత్య+అమాత్య, వర్గంబుతో= వారియొక్క సేవకులయొక్క, మంత్రులయొక్క సమూహంతో; వారణావతంబునకున్= వారణావతానికి; పుత్తము= పంపుదాము; మనకున్; రాజ్యంబు= అధికారం; సుప్రతిష్ఠింబు+ఐనన్= బాగుగా స్థిరపడగానే; మఱి=తర్వాత; వారలు= వాళ్లు; ఇందులకున్= ఇక్కడికి; వచ్చుదురు= వస్తారు; అనినన్= అని అనగా; దుర్యోధనునకు; ధృతరాష్ట్రుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ రాజ్యం మొదటినుండి నీది. నీవు ఒకవేళ స్వామి అమాత్యసుహృత్కోశాదులకు సంబంధించిన వాళ్ళు విధేయులు కాకున్నా, అప్రయత్నంగా రాజ్యం క్రమపద్ధతిలో మా చేతి కందుతుంది. ఇదివరకు పాండురాజు

రాజై తనగుణగణాలచేత ప్రజానురాగం పొందిన కారణంగా అందరూ ధర్మరాజురాజ్యాన్ని కోరుకొంటున్నారు. దాన్ని గ్రహించేకదా నేను ప్రతిదినం దానాలచేత, సమ్మానాలచేత ప్రకృతిజనులను సంతోషపరుస్తున్నాను. ఇచ్చట చెడ్డవాళ్ళ పక్షపాతపుమాటలు ఆగిపోయేంతవరకు కుంతీదేవిని, పాండవులను, వారిసేవకులతో, అమాత్యులతోసహా ఉపాయంతో వారణావతం పంపుదాము. మనకు రాజ్యాధికారం స్థిరపడిన తర్వాత వాళ్ళిక్కడికి వస్తారు' అని దుర్యోధనుడనగా అతనితో ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు.

విశేషం: సప్తప్రకృతులు - స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, బలం.

తరువోజ.

'ఏ నెల్లప్రొద్దు నా యెడ లోనఁ దలఁతు నీయభిప్రాయంబ; యిది దారుణంబు
గాన వాకునకుఁ జుల్కన తేరనోపఁ; గడఁగి పాండవుల నేకత మెట్లు లనుప
గా నగు? మఱి దీని గాంగేయవిదురకలశజాశ్వత్థామ గౌతముల్ బుద్ధి
గా నొడంబడుదురె? కా దయ్య!' యనినఁ గౌరవజ్యేష్ఠుండు ఘనుఁ డిట్టు లనియె. 130

ప్రతిపదార్థం: ఏను= నేను; ఎల్ల, ప్రొద్దు= అన్ని వేళలా; నా, ఎడలోనన్= నాహృదయంలో; ఈఅభిప్రాయంబు+అ; తలఁతున్= ఆలోచిస్తాను; ఇది= ఈ అభిప్రాయం; దారుణంబు= భయంకరమైనది; కానన్= అగుటచేత; చుల్కన= సులువుగా; వాకునకున్= మాటకు; తేరన్+ఓపన్= తీసుకొనిరాలేను; కడఁగి= పూని; పాండవులన్; ఏకతము= ఒంటరిగా; ఎట్టుల= ఏ విధంగా; అనుపగాన్+అగున్= పంపటానికి వీలగును; మఱి= ఇక; దీనిన్= దీన్ని; గాంగేయ, విదుర, కలశజ+అశ్వత్థామ, గౌతముల్= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు; బుద్ధిగాన్= మనస్ఫూర్తిగా; ఒడంబడుదురె= ఒప్పుకొంటారా; కాదు+అయ్య= సాధ్యంకాదయ్యా; అనినన్= అని అనగా; కౌరవ, జ్యేష్ఠుండు= కౌరవులలో పెద్దవాడైన దుర్యోధనుడు; ఘనుఁడు= అసాధ్యుడు; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: 'ఎప్పుడూ నా హృదయంలో ఈ అభిప్రాయమే ఉన్నది. ఇది ఘోరమైనది కనుక సులభంగా పైకి చెప్పలేకున్నాను. ఒంటరిగా పాండవులను పంపటానికి ఏ విధంగా వీలవుతుంది? మరి, దీనికి భీష్మ ద్రోణ విదురాశ్వత్థామకృపులు మనఃపూర్వకంగా అంగీకరిస్తారా? సాధ్యం కాదు' - అని ధృతరాష్ట్రుడనగా తండ్రితో దుర్యోధనుడు ఇట్లా అన్నాడు.

విశేషం: ఇది ధృతరాష్ట్రుని ఆంతర్యాన్ని తెలిపే పద్యం. మొదటిపాదానికి - "ఏను నిక్కార్యంబ(బు) హృదయంబులోన నెప్పుడుఁ జింతింతు నిది దారుణంబు'' అనేపాఠాంతరం ఉంది. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.352. ద్విపదపాదద్వయం తరువోజ ఏకపాదం. లక్షణానికి చూడు - ఆది.2.151.

వ. 'భవదనుజ్ఞాగౌరవంబున గాంగేయాదులు దీనికి నొడంబడుదురు; వారు కౌరవులకెల్ల సము లై యుండియు నావారల; యెట్లనిన; నశ్వత్థామ నా కిష్టుం డగుట నన్నుఁ బాయకుండు; పుత్త్రస్నేహంబున ద్రోణుండును భారద్వాజుని భాగినేయునిం బాయనేరమింజేసి కృపాచార్యుండును నాయొద్దన యుందురు; మఱి భీష్ముండు మధ్యస్థుం డగుటఁ బాండవులం బరిగ్రహింపఁడు; విదురుండు పాండవపక్షపాతి యయ్యును నొక్కరుండు నా కహితంబు

సేయనోపండు; గావున నిక్కార్యంబున దోషంబు లేదు; వినిద్రకరణం బయిన నాహృదయశల్యంబు బాచి న న్నుద్ధరింపు' మని ధృతరాష్ట్రు నెట్టకేలకు నొడంబఱిచి దుర్యోధనుం డప్పుడు. 131

ప్రతిపదార్థం: భవత్+అనుజ్ఞా, గౌరవంబున= నీయొక్క ఆజ్ఞలోని గౌరవంచేత; గాంగేయ+ఆదులు= భీష్ముడు మొదలయిన వాళ్ళు; కౌరవులకు+ఎల్లన్= కురువంశంవాళ్ళందరికీ; సములు+ఐ= సమానమైన భావం కలవాళ్ళయి - అంటే కురువంశం వాళ్ళందరిపట్ల సమభావం కలవాళ్ళయి; ఉండియు; నా, వారలు+అ= నావాళ్ళే; అనినన్; అశ్వత్థామ; నాకు; ఇష్టుండు+అగుటన్= ప్రియమైనవాడు కావటంచేత; నన్నున్; పాయక+ఉండున్= వదలక ఉంటాడు; పుత్త్ర, స్నేహంబునన్= పుత్రునిమీది ప్రేమచేత; ద్రోణుండును; భారద్వాజుని= ద్రోణుని; భాగినేయునిన్= చెల్లెలిభర్తను; పాయ, నేరమిన్+చేసి= వదలలేకుండటంచేత; కృపాచార్యుండును; నా, ఒద్దన= నా దగ్గరే; ఉందురు; మఱి; భీష్ముండు; మధ్యస్థుండు+అగుటన్= నడుమఉండి రెండువైపుల వారికి పక్షపాతంలేక న్యాయం చెప్పేవాడు కావటంచేత; పాండవులన్; పరిగ్రహింపఁడు= ప్రియంతో తీసుకోడు - అంటే పాండవులవైపు వెళ్ళడు; విదురుండు; పాండవ, పక్షపాతి= పాండవులపట్ల పక్షపాతం కలవాడు; అయ్యును; ఒక్కరుండు; నాకు; అహితంబున్+అ= కీడు; చేయన్, ఓపండు= చేయలేడు; కావునన్, ఈ+కార్యంబునన్= ఈ పనిలో - పాండవులను పంపేపనిలో; దోషంబు= లోపం; లేదు; వినిద్రకరణంబు+అయిన= నిద్రలేనట్లు చేసేదైన; నా, హృదయ, శల్యంబున్= నా గుండెలోని ముల్లును; పాచి= తొలగించి; నన్నున్; ఉద్ధరింపుము= పైకి తెమ్ము; అని; ధృతరాష్ట్రున్; ఎట్టకేలకున్= చిట్టచివరికి; ఒడంబఱిచి= ఒప్పించి; దుర్యోధనుండు; అప్పుడు= అంతట.

తాత్పర్యం: 'మీ ఆజ్ఞమీదిగౌరవంచేత భీష్ముడు, ద్రోణుడు మొదలయినవాళ్ళు దీనికి ఒప్పుకొంటారు. వాళ్ళు కురుపాండవులపట్ల సమభావం కలవాళ్ళే అయినా నావాళ్ళే. ఎ ట్లనగా; అశ్వత్థామ నాకు ఇష్టమైనవాడు. అందుచేత నన్ను వదలిపోడు. కొడకుమీదిప్రేమచేత ద్రోణుడు, చెల్లెలి భర్త అయిన ద్రోణుడిని వదలలేక కృపుడు నా వైపే ఉంటారు. భీష్ముడు మధ్యస్థుడు కనుక పాండవులవైపు వెళ్ళడు. విదురుడు పాండవపక్షపాతియే. కాని ఆత డొక్కడు నాకు కీడు చేయలేడు. అందుచేత ఈ కార్యక్రమంలో ఏ లోపం లేదు. నాకు నిద్రలేకుండా చేసే ఈ గుండెలోని ముల్లును తొలగించి, నన్ను జీవితంలో పైకితీసికొని రమ్ము' - అని చిట్టచివరికి ధృతరాష్ట్రుడిని ఒప్పించి దుర్యోధనుడు.

క. వలను గల మంత్రివరులం । బిలిచి పృథానందనులకుఁ బ్రియముగ మీ రి
మ్ముల వారణావతంబును । వెలయఁగఁ బొగడుండు వారు విని తగుల నెడన్. 132

ప్రతిపదార్థం: వలను, కల= నేర్పుగల; మంత్రివరులన్= మంత్రిశ్రేష్ఠులను; పిలిచి, మీరు; పృథా, నందనులకున్= కుంతీదేవి యొక్కకొడుకులకు; ప్రియముగన్= ఇష్టమయ్యేటట్లు; వారు; విని; ఎడన్= మనస్సులో; తగులన్= ఆశపడేటట్లు; ఇమ్ములన్= ఇంపుగా; వారణావతంబును; వెలయఁగన్= ప్రకాశించేటట్లు - అంటే గొప్పగా; పొగడుండు = ప్రశంసించండి.

తాత్పర్యం: నేర్పరులు, మంచివాళ్ళు అయిన మంత్రులను పిలిచి, 'మీరు పాండవులు వినేటట్లు, విని వాళ్ళు ఆశపడేటట్లు, వారణావతాన్ని గొప్పగా పొగడండి'.

వ. అని పంచిన వారును వారణావతంబు ననవరతసురభికుసుమఫలభారనమ్రశాఖావిశాలతరువనరేఖాలంకృతం బనియును, వనజలకేళీకందుకమృగయాదివివిధవిహారహారిప్రదేశాభిశోభితం బనియును, నవసుధా ధౌతసౌధ సుధాకరనికరప్రభాపటలప్రధ్వంసితాసితపక్షదోషం బనియును, నిరస్తదోషానుషంగమంగళ మహారత్న

రాజివిరాజితవిపులవిపణివీథీవిహసితాలకావిలాసం బనియును, మనోరమానేకసుఖానుభోగ భోగిమహాభాగ జనసమృద్ధం బనియును, బుణ్యనదీప్రవాహశోభితం బనియును వర్ణించి యప్పురంబునంద పాండునందనుల జాతకౌతూహలచిత్తులం జేసి యున్నఁ, గొండొకకాలంబునకు ధృతరాష్ట్రుండు దుర్యోధనదుష్టవచనప్రబోధితుం డయి యొక్కనాఁడు. **133**

ప్రతిపదార్థం: అని, పంచిన= ఆజ్ఞాపించగా; వారును; వారణావతంబున్; అనవరత, సురభి, కుసుమ, ఫల, భార, నమ్ర, శాఖా, విశాల, తరు, వనరేఖా+అలంకృతంబు+అనియును= ఎల్లప్పుడు మంచివాసనగల పూలయొక్క, పండ్లయొక్క బరువుచేత వంగిన కొమ్మలచేత విశాలమైన చెట్లు ఉండే తోపులయొక్క వరుసలచేత అలంకరింపబడిందనీ, వన, జల, కేళీ, కందుక, మృగయా+ఆది, వివిధ, విహార, హారి, ప్రదేశ+అభిశోభితంబు+అనియును= ఉద్యానవనం, జలక్రీడ, చెండ్లాట, వేట మొదలయిన అనేకవిధాలైన క్రీడలకు మనోహరాలైన ప్రదేశాలతో ఒప్పిందనీ; నవ, సుధా, ధౌత, సౌధ సుధాకర, నికర, ప్రభాపటల, ప్రధ్వంసిత+అసిత, పక్షదోషంబు+అనియును= క్రొత్తదైన సున్నంచేత తెల్లగా చేయబడిన మేడలు అనే చంద్రుల సమూహంయొక్క కాంతిసమూహంచేత పూర్తిగా నశింపజేయబడిన కృష్ణపక్షంలోని రాత్రులు కలది అనీ; నిరస్త, దోషా+అనుషంగ, మంగళ, మహత్, రత్న, రాజి, విరాజిత, విపుల, విపణి, వీథీ, విహసిత+అలకా, విలాసంబు+అనియును= తీసివేయబడిన దోషసంబంధం గల శుభాన్ని కూర్చే గొప్పరత్నాలయొక్క సమూహంచేత మిక్కిలి ప్రకాశిస్తున్న విశాలమైన అంగడివీథులచేత ఎగతాళి చేయబడిన అలకాపట్టణంయొక్క శోభకలది అనీ; మనోరమా+అనేక, సుఖ+అనుభోగ, భోగి, మహాభాగ, జన, సమృద్ధంబు+అనియును= మనోహరాలైన పెక్కుసుఖాలయొక్క అనుభవాలను అనుభవించేటి పుణ్యావంతులయిన జనులచేత నిండినట్టిదనీ; పుణ్య,నదీ,ప్రవాహ,శోభితంబు+అనియును= పవిత్రాలైన నదులయొక్క ప్రవాహాలతో ప్రకాశించేది అనీ; వర్ణించి; ఆ+పురంబు+అందు+అ= ఆ నగరమందే; పాండునందనుల= పాండవుల, జాత, కౌతూహల, చిత్తులన్+చేసి= పుట్టిన ఆశ కల మనస్సుకలవాళ్ళనుగా చేసి; ఉన్నన్; కొండొక, కాలంబునకు= కొద్దికాలానికి; ధృతరాష్ట్రుండు; దుర్యోధన, దుష్ట, వచన, ప్రబోధితుండు+అయి= దుర్యోధనునియొక్క చెడు మాటలచేత లెస్సగా తెలుపబడినవాడై; ఒక్కనాఁడు= ఒకదినం.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా - ఆ మంత్రులు - వారణావతం ఎల్లప్పుడూ పూలబరువుచేత, పండ్లబరువుచేత వంగిన కొమ్మలుగల పెద్దచెట్లతో - ఉద్యానవనవిహారం, జలక్రీడ, చెండ్లాట, వేట మొదలైన పెక్కుక్రీడలకు తగిన మనోహరప్రదేశాలతో - కృష్ణపక్షరాత్రులను (చీకట్లను) తమ క్రొత్తసున్నపుపూత కాంతులతో పారద్రోలే చంద్రులవంటి పెద్ద మేడలతో - దోషం లేనివి, శుభాన్ని కూర్చేవి, అయిన గొప్ప రత్నాలతో అలకానగర శోభనే అపహాస్యంచేసే పెద్ద అంగడి వీథులతో - అనేకభోగాలను అనుభవించే పుణ్యాత్ములైన ప్రజలతో - పవిత్రనదీ ప్రవాహాలతో ప్రకాశిస్తున్నదనీ, ఆ నగరంమీద పాండవులకు అపరిమితమైన కోరిక కలిగేటట్లు వర్ణించారు. కొద్దికాలం తర్వాత ధృతరాష్ట్రుడు దుర్యోధనుని చెడుమాటలు మనస్సుకు పట్టినవాడై.

విశేషం: అలం: రూపకం, ఉపమ, అంత్యానుప్రాసం, వృత్త్యనుప్రాసం.

ధృతరాష్ట్రుండు పాండవులను వారణావతనగరంబునకుఁ బోవఁ బనుచుట (సం. 1-131-2)

ఉ. పాండుకుమారులం బిలువఁబంచి సుహృన్నివహంబు నొద్ద న
ప్పాండుఁ దలంచి నిర్గళితబాష్పకరాళకపోలయుగ్ముఁ డై
పాండుమహీశుకంటె నతిభక్తుల మి మ్మొకఁ డేను బంచెదం
బాండుయశోఽర్థులార! యిది పథ్యము కాఁగఁ దలంపుఁ డాత్మలోన్. **134**

ప్రతిపదార్థం: పాండు, కుమారులన్; పిలువన్; పంచి= ఆజ్ఞాపించి; సుహృత్+నివహంబు+ఒద్దన్= ఆప్తుల సమూహంయొక్క ఎదుట; ఆ+పాండున్= ఆ పాండురాజును; తలంచి= గుర్తు చేసికొని; నిర్గళిత, బాష్ప, కరాళ, కపోల, యుగ్ముఁడు+ఐ= కారుతున్న కన్నీళ్ళ మిట్టపల్లాలైన చెక్కిళ్ళజంట కలవాడై; పాండు, మహీ+ఈశునికంటెన్= పాండురాజుకంటె; అతి, భక్తులన్= మిక్కిలి భక్తి గల వాళ్ళయిన; మిమ్మున్; ఏను= నేను; ఒకఁడు, పంచెదన్= ఒకటి ఆజ్ఞాపిస్తాను; పాండు, యశః+అర్థులారా!= పాండురాజుయొక్క కీర్తిని కోరేవాళ్ళారా! లేదా తెల్లనికీర్తిని కోరేవాళ్ళారా!; ఆత్మలోన్= మనస్సులో; ఇది= నేను ఆజ్ఞాపించునది; పథ్యము, కాఁగన్= చేయదగింది, అయినట్లుగా; తలంపుఁడు= ఆలోచించండి.

తాత్పర్యం: పాండవులను పిలిపించి, ఆప్తులందరి ఎదుట పాండురాజును స్మరించి కన్నీరు నింపుకొని, పాండు రాజుకంటె ఎక్కువ భక్తిగలవాళ్ళయిన మిమ్మల్ని నేనొకటి ఆజ్ఞాపిస్తాను. పాండురాజుకీర్తిని కోరేవాళ్ళారా! ఇది చేయదగింది అని ఆలోచించండి. (లేదా నిర్మలకీర్తిని కోరే మీరు ఇది చేయదగింది అని ఆలోచించండి.)

విశేషం: 'పాండు' శబ్దంలో శ్లేష ఉన్నది. తండ్రికీర్తిని కోరేవాళ్ళు తండ్రి అడుగుజాడలలో నడుస్తారు. అందుచేత ధృతరాష్ట్రుడు - తండ్రికీర్తిని కోరే ఓ పాండవులారా! మీ తండ్రి నా పట్ల భక్తికలవాడు. మీరు కూడా నా పట్ల అతనికంటె ఎక్కువభక్తి కలవాళ్ళు. మీతండ్రి అడుగుజాడలలో నడిచి నేను చెప్పినట్లు అతనివలె మీరుకూడా చేయండనటం. పాండుయశోఽర్థులారా - అనేదాన్ని తెల్లనికీర్తిని కోరేవాళ్ళారా అని అన్వయిస్తే - పెద్దలమాట వినటం కీర్తికరం. కీర్తిని కోరే ఓ పాండవులారా! ఈ పెదతండ్రి చెప్పినట్లు చేయండి అనటం. కీర్తివర్ణం తెలుపు అని కవిసమయం.

క. విదితంబుగఁ బుణ్యామర । నదీ సమీపమున వారణావత నగరం
బది సర్వసుఖాస్పద మని । వదలక వర్ణింతు రెల్లవారును దానిన్. 135

ప్రతిపదార్థం: విదితంబుగన్= ప్రసిద్ధంగా; పుణ్య+అమర, నదీ, సమీపమునన్= పవిత్రమైన గంగానది దగ్గర; వారణావత, నగరంబు; అది= ఆ నగరం; సర్వ, సుఖ+ఆస్పదము+అని= అన్ని సుఖాలకు చోటు అని; ఎల్లవారును= అందరూ; దానిన్= దాన్ని; వదలక; వర్ణింతురు.

తాత్పర్యం: పవిత్రమైన గంగానదీసమీపంలో ప్రసిద్ధమైన వారణావతనగరం సర్వసుఖాలకు స్థానమని అందరూ ప్రశంసిస్తారు.

క. మీరును గుంతియు సహపరి । వారమహామాత్య భృత్యవర్గులరై నా
నారాజ్యలీలతోఁ జని । సారమతిం జేయుఁ డందు సతతోత్సవముల్. 136

ప్రతిపదార్థం: మీరును; కుంతియున్; సహపరివార, మహా+అమాత్య, భృత్య, వర్గులరు+ఐ= పరివారంతోను, మహా మంత్రులతోను; సేవకులసమూహాలతోను కూడినవాళ్ళయి; నానా, రాజ్య, లీలతోన్= పలువిధాలైన రాజ్యవిలాసంతో; చని= వెళ్ళి; అందున్= ఆ నగరంలో; సారమతిన్= మేలిమిబుద్ధితో; సతత+ఉత్సవముల్= ఎడతెగనిపండుగలను; చేయుఁడు= ఆచరించండి.

తాత్పర్యం: మీరూ, కుంతీదేవితో, పరివారంతో, అమాత్యులతో, సేవకులతో కూడి నానావిధరాజ్యవైభవంతో అక్కడకు వెళ్ళి హాయిగా పండుగలను చేసికొనండి.

వ. 'పశుపతి నివాసం బయిన యప్పుణ్యస్థానంబునం బాండుహితంబుగా నగణ్యగోహిరణ్యాదిమహాదానంబుల బ్రాహ్మణసంతర్పణంబులు సేసి యందుఁ గొండొకకాలం బుండి వచ్చునది' యని పంచిన వల్లె యని పాండవులు గాంధారీధృతరాష్ట్రులకు మ్రొక్కి వీడ్కొని, దుర్యోధనాదుల నందఱం బ్రియపూర్వకంబుగా సంభావించి, భీష్మద్రోణవిదురకృపాదులకు మ్రొక్కి యనేకవృద్ధబ్రాహ్మణులకు నమస్కారంబు సేసి వారలవలన దీర్ఘాయురారోగ్య స్వస్తివచనంబులతోఁ బునర్దర్శనం బయ్యెడ మని దీవనలు సేకొనుచు జననీసహితంబుగా వారణావతంబునకు గమనోన్ముఖు లయినంత. 137

ప్రతిపదార్థం: పశుపతి, నివాసంబు+అయిన= శివునియొక్క ఉనికిపట్టయిన; ఆ+పుణ్య, స్థానంబునన్; పాండు, హితంబుగాన్= పాండురాజుకు ఇష్టమయ్యేటట్లుగా; అగణ్య, గో హిరణ్య+ఆది, మహా, దానంబులన్= లెక్క లేనన్ని గోవులు బంగారం మొదలైన మహాదానాలచేత; బ్రాహ్మణ, సంతర్పణంబులు= బ్రాహ్మణులను బాగుగా తృప్తిపరచటం; చేసి; అందున్= ఆ వారణావత నగరంలో; కొండొక; కాలంబు= కొద్దికాలం; ఉండి; వచ్చునది= రండు; అని, పంచినన్= ఆజ్ఞాపించగా; వల్లె; అని= సరే అని; పాండవులు; గాంధారీ, ధృతరాష్ట్రులకున్= గాంధారీధృతరాష్ట్రులకు, మ్రొక్కి= నమస్కరించి; వీడ్కొని= సెలవుతీసికొని; దుర్యోధన+ఆదులన్= దుర్యోధనుడు మొదలయినవాళ్ళను; అందరన్= అందరిని; ప్రియ పూర్వకంబుగా= సంతోషపూర్వకంగా; సంభావించి= సమ్మానించి; భీష్మ, ద్రోణ, విదుర, కృప+ఆదులకు= భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, కృపుడు మొదలయినవారికి; మ్రొక్కి; అనేక, వృద్ధ, బ్రాహ్మణులకు; నమస్కారంబు, చేసి; వారలవలనన్= వారివల్ల; దీర్ఘ+ఆయుః +ఆరోగ్య, స్వస్తి, వచనంబులతోన్= నిడుపైన-అంటే ఎక్కువైన -ఆయుష్యం, ఆరోగ్యం, శుభం కలుగుతుందనే మాటలతో; పునః+దర్శనంబు= మరలచూడటం; అయ్యెడము+అని= అగునుగాక అని; దీవనలు= ఆశీస్సులు; చేకొనుచున్= తీసికొంటూ; జననీ సహితంబుగా= తల్లితోకూడా; వారణావతంబునకు; గమన+ఉన్ముఖులు+అయినన్= పోవటానికి పూనుకొన్నవాళ్ళు కాగా; అంతన్= తర్వాత.

తాత్పర్యం: 'శివుని నివాసస్థానమైన ఆ పవిత్రస్థలంలో పాండురాజుకు ప్రీతిగా అనేక గోదానాలు; సువర్ణదానాలు మొదలయిన మహాదానాలు చేసి, బ్రాహ్మణులను తృప్తిపరుస్తూ, కొద్దికాలం ఉండి తిరిగిరం' డని ఆజ్ఞాపించగా, పాండవులు అందుకు అంగీకరించి గాంధారీధృతరాష్ట్రులకు మ్రొక్కి, వారిదగ్గర సెలవు తీసికొని దుర్యోధనాదు లందరిని సంతోషపూర్వకంగా సమ్మానించి, పెక్కుమంది వృద్ధబ్రాహ్మణులకు నమస్కారాలుచేసి, వారివలన దీర్ఘఆయురారోగ్యశుభాలు కలిగేట్లు ఆశీర్వచనాలు పొంది, తల్లితోకూడ వారణావతానికి పోవటానికి పూనుకోగా - తరువాత.

విశేషం: భీష్మద్రోణవిదురాదులకు మ్రొక్కి - అనేదానికి "విదుర సోమదత్త బాహ్లిక కురువృద్ధులకున్ ద్రోణకృపాచార్యాది బ్రాహ్మణసమూహంబునకుఁ బ్రియపూర్వకంబుగా మ్రొక్కి" - విదురసోమదత్తబాహ్లికకురువృద్ధులకు ద్రోణకృపాచార్యాశ్వత్థామాది బ్రాహ్మణసమూహంబునకు ప్రియపూర్వకంబుగా నమస్కరించి - అనే పాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట. 354.

దుర్యోధనుఁడు లాక్షాగృహనిర్మాణమునకై పురోచనుని వారణావతంబునకుఁ బంపుట (సం.1-132-2)

క. తనవగచినకార్యము దొర। కొనుటకు ధృతరాష్ట్రపుత్త్రకుఁడు పొంగి పురో
చనుఁ బిలిపించి రహస్యం। బున వానికిఁ గరమునెయ్యమున ని ట్లనియెన్. 138

ప్రతిపదార్థం: ధృతరాష్ట్ర, పుత్త్రకుఁడు= ధృతరాష్ట్రునియొక్క ప్రియపుత్రుడు - దుర్యోధనుడు; తనవగచిన, కార్యము= తనయొక్కతలచినపని; దొరకొనుటకు= ఈడేరటానికి - ఫలించినందుకు; పొంగి= సంతోషించి; పురోచనున్= పురోచనుణ్ణి; పిలిపించి; రహస్యంబునన్= గోప్యంగా; వానికిన్= అతనికి; కరము= మిక్కిలి; నెయ్యమునన్= స్నేహంతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు తాను తలంచినపని ఫలించినందుకు సంతోషించి, పురోచనుడిని పిలిపించి రహస్యంగా అతనితో మిక్కిలిస్నేహంగా ఇట్లా అన్నాడు.

తరలము.

అలఘుతేజుల వారణావత మన్పురంబునఁ బాండవే
యులఁ బ్రియంబున నుండఁబంచె గుణోన్నతుండు కురుప్రభుం;
డలయ కిప్పుడు నీవు మున్ చని యందు వారికి నుండఁగా
నిలయముల్ రచియింపు నీదగునేర్పుఁ జూతము చెచ్చెరన్. 139

ప్రతిపదార్థం: గుణ+ఉన్నతుండు= మంచిగుణాలచేత గొప్పవాడైన; కురు, ప్రభుండు= కురురాజు - ధృతరాష్ట్రుడు; అలఘు, తేజులు= తక్కువకాని కాంతిగలవాళ్ళయిన; పాండవేయులన్= పాండవులను; వారణావతము+అన్+పురంబునన్; ప్రియంబునన్= ప్రేమతో; ఉండన్= ఉండటానికి; పంచెన్= ఆజ్ఞాపించాడు; అలయక= విసుగుకోకుండ; నీవు; మున్= ముందు; చని= వెళ్ళి; అందున్= అక్కడ - అంటే వారణావతంలో; వారికిన్= పాండవులకు; ఉండఁగాన్= ఉండటానికి; నిలయముల్= ఇండ్లు; చెర+చెరన్= వెంటనే; రచియింపు= నిర్మించు; నీది+అగు; నేర్పున్; చూతము= నీ నైపుణ్యాన్ని చూద్దాము.

తాత్పర్యం: గొప్పగుణవంతుడైన ధృతరాష్ట్రమహారాజు తేజోవంతులైన పాండవులను ప్రేమతో వారణావతమనే నగరంలో నివసించటానికి ఆజ్ఞాపించాడు. నీవు విసుగుకోకుండ వెంటనే వాళ్ళకు అక్కడ ఇండ్లు నిర్మించుము. నీ నేర్పు చూద్దాం. తరలము లేక తరళము అనగా చలించునది, ప్రకాశించునది. చంచలమైన ధృతరాష్ట్రుని మనస్సు దుర్యోధనుని దుర్బుద్ధికి లొంగి పాండవులను వారణావతానికి తరలించే తరుణంలో ఈ తరలము ప్రయుక్తం. దివ్యప్రకాశం ఎక్కడ ఉన్నా అది మణియై శోభిస్తుంది. హారంవంటి పాండవుల ఔజ్జ్వల్యం సర్వప్రకాశనిలయం.

విశేషం: తరలంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, ర, స, జ, జ, గ అనే గణాలుంటాయి. 12వ అక్షరం యతి.

వ. **నాకుం బరమవిశ్వాసివి నీ వొక్కరుండవ; యిది యనన్యవిషయం బయిన కార్యంబు; కావున నీవ దీనిం జేయవలయు; వాయుజవంబు లయిన వేసడంబులఁ బూనిన యరదం బెక్కి, నేఁడ చని వారణావతంబున లాక్షాసర్జకరసమిశ్రం బై ఘృతతైలార్ద్రంబయిన మృత్తికాపుంజంబున నొక్క చతుశ్శాల విశాలంబుగా నాయుధశాల సమీపంబున మనోహరంబుగా నవిరళసుధాధవళితంబుగా నిర్మించి యందుఁ బాండవుల నునిచి వార లేమఱి నమ్మి కొండొకకాలం బుండ, ని న్నొరు లెఱుంగకుండ నిమ్మయినయవసరంబునం దద్గృహద్వారంబునందు ఘోరానలంబు దరికొలిపి పగఱ పంచత్వం బెఱింగి రమ్ము.** 140

ప్రతిపదార్థం: నాకున్; పరమవిశ్వాసివి= మిక్కిలి నమ్మదగినవాడివి; నీవు+ఒక్కరుండవు+అ= నీవొక్కడివే; ఇది= ఈపని; అనన్య, విషయంబు+అయిన= ఇతరులకు గోచరం కానిదైన; కార్యంబు= పని; కావునన్; నీవు+అ= నీవే; దీనిన్; చేయవలయు; వాయు, జవంబులు+అయిన= గాలివేగంతో సమానమైన వేగం గలవైన; వేసడంబులన్= కంచరగాడిదలను; పూనిన= తాల్చిన; అరదంబు= రథం; ఎక్కి; నేఁడు+అ= ఈ రోజే; చని= వెళ్ళి; వారణావతంబునన్; లాక్షా, సర్జక, రస, మిశ్రంబు+ఐ= లక్క, మద్దిచెట్టుబంక కలసిందై; ఘృత, తైల+ఆర్ద్రంబు+అయిన= నెయ్యితోను, నూనెతోను తడిసిందైన; మృత్తికా, పుంజంబునన్= మట్టికుప్పచేత; ఒక్క, చతుశ్శాలన్= ఒక నాలుగిండ్ల భవంతిని; విశాలంబుగాన్= విడిదికలదిగా; ఆయుధశాల, సమీపంబునన్= ఆయుధాలుండే మేడకు దగ్గరగా; మనోహరంబుగాన్= మనస్సు ఆకర్షించేటట్లు; అవిరళ, సుధా, ధవళితంబుగాన్= దట్టమైన సున్నంచే తెల్లగా చేయబడిందిగా, నిర్మించి; అందున్; పాండవులన్; ఉనిచి; వారలు; ఏమఱి= (అజాగ్రత్తగా) మరచి; నమ్మి; కొండొక, కాలంబు= కొద్దికాలం; ఉండన్= ఉండగా; ఇమ్ము+అయిన= అనుకూలమయిన; అవసరంబునన్= సమయంలో; తత్+గృహ, ద్వారంబు, అందున్= ఆ యింటియొక్కవాకిట్లో; ఘోర+అనలంబు= భయంకరమైన నిప్పును; దరికొలిపి= మండించి; పగఱ, పంచత్వంబు= శత్రువులయొక్కచావును; ఎఱింగి= తెలిసికొని; రమ్ము.

తాత్పర్యం: నీవు నాకు మిక్కిలి నమ్మదగినవాడివి. ఇది ఇతరులకు సాధ్యం కాని పని. అందుచేత నీవే చేయాలి. వాయువేగంతో సమానమైన వేగం కలిగిన కంచరగాడిదలు పూనినరథం ఎక్కి ఈ రోజే వారణావతం వెళ్ళి అక్కడ లక్క, మద్దిబంక కలిపిన నేతితో, నూనెతో తడిపినమట్టితో ఒక నాలుగిండ్ల భవంతిని ఆయుధశాల దగ్గర మనోహరంగా దట్టమైన సున్నంకొట్టి తెల్లగా నిర్మించి, అందులో పాండవులను ఉంచి, వాళ్ళు ఏమరుపాటున నమ్మి కొంతకాలం ఉన్న తర్వాత, ఆ యింటి వాకిటికి నిప్పుపెట్టి, శత్రువులైన పాండవుల చావును తెలిసికొని రమ్ము.

క. ఈ కార్య సిద్ధి యగుడును। నీ కతమున నఖిల ధారుణీ రాజ్యము నా
కేకాధిష్ఠిత మగు నిది। నీకును నిత్యోపభోగనిలయము కాదే. 141

ప్రతిపదార్థం: ఈకార్యసిద్ధి= ఈ పనియొక్క సఫలత; అగుడును= అయితే, అయినవెంటనే; నీ కతమునన్= నీ కారణాన; అఖిల, ధారుణీ, రాజ్యము= మొత్తం భూమిమీద అధికారం; నాకున్; ఏక+అధిష్ఠితము= ఒకనిచేతనే పొందబడింది; అగున్= అవుతుంది; ఇది= ఈ పని; నీకును= నీకు కూడా, నిత్య+ఉపభోగ, నిలయము+అ= శాశ్వతమైన సుఖాలకు స్థానం; కాదే= కాదా.

తాత్పర్యం: ఈ పని సఫలమైతే నీ కారణంగా సమస్తరాజ్యాధికారం నా చేతికి వస్తుంది. ఈ విధంగా జరిగితే నీవు శాశ్వతసుఖాలను అనుభవించవచ్చునుగదా!

వారణావతప్రస్థానము - విదురోపదేశము (సం. 1-133-4)

వ. అని పంచినం బురోచనుం డతిత్వరితగతి నరిగి దుర్యోధను కఱపిన రూపున వారణావతంబున లాక్షాగృహంబు రచియించుచుండె; నిట యుధిష్ఠిరభీమార్జునయములుం గ్రమంబునం దొల్లి షోడశపంచదశ చతుర్దశత్రయోదశవర్షజాతు లయి శతశృంగంబున నుండి హస్తిపురంబునకు వచ్చి యందుఁ గౌరవులం గలసి యస్త్ర విద్యలం గఱచుచుం బదమూఁడేం డ్లుండి, యపుడు ధృతరాష్ట్రునియోగంబున వారణావతంబునకు జననీ సహితంబుగాఁ బోవ సమకట్టి మహాజవసత్త్వసమేతంబు లయిన హయంబులం బూనిన రథంబు లెక్కి ధనుర్ధరు లయి హస్తిపురంబు వెలువడు నపు డప్పురంబునం గల బ్రాహ్మణక్షత్రియప్రముఖానేక జనంబులు శోక సంతప్తహృదయు లయి. 142

ప్రతిపదార్థం: అని; పంచినన్= ఆజ్ఞాపించగా; పురోచనుండు; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగంతో గూడిన విధంగా; అరిగి= వెళ్ళి; దుర్యోధను, కఱపిన, రూపునన్= దుర్యోధనుడు చెప్పినవిధంగా; వారణావతంబునన్; లాక్షాగృహంబు= లక్క ఇల్లు; రచియించుచున్+ఉండెన్= నిర్మిస్తూ ఉన్నాడు; ఇట; యుధిష్ఠిర, భీమ+అర్జున, యములున్= ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులసహదేవులు; క్రమంబునన్= వరుసగా; తొల్లి= పూర్వం; షోడశ, పంచదశ, చతుర్దశ, త్రయోదశ, వర్ష జాతులు+అయి= పదహారు, పదిహేను, పధ్నాలుగు, పదమూడు సంవత్సరాల పుట్టుక (వయస్సు) కలవాళ్ళయి; శతశృంగం బుననుండి= శతశృంగపర్వతంనుండి; హస్తి, పురంబునకున్= హస్తినాపురానికి; వచ్చి; అందున్= ఆ హస్తినాపురంలో; కౌరవులన్+కలిసి= కౌరవులతో కలిసి; అస్త్రవిద్యలన్; కఱచుచున్= నేర్చుకొంటూ; పదమూడు+ఏండ్లు+ఉండి; అప్పుడు; ధృతరాష్ట్రు, నియోగంబునన్= ధృతరాష్ట్రునియొక్క ఆజ్ఞచేత; వారణావతంబునకున్; జననీసహితంబుగాన్= తల్లితోకూడ; పోవన్= పోవటానికి; సమకట్టి= పూనుకొని; మహా, జవ, సత్త్వ, సమేతంబులు+అయిన= గొప్పవేగంతో, బలంతో కూడుకొనిన వైన; హయంబులన్= గుఱ్ఱాలను; పూనిన= ఏర్పాటుచేసిన; రథంబులు; ఎక్కి; ధనుః+ధరులు+అయి= విండ్లను చేపట్టినవాళ్ళయి; హస్తి, పురంబు= హస్తినాపురం; వెలువడునపుడు= వెలువడే సమయంలో; ఆ+పురంబునన్= ఆ నగరంలో; కల= ఉన్న; బ్రాహ్మణ; క్షత్త్రియ, ప్రముఖ+అనేక, జనంబులు= బ్రాహ్మణులు; క్షత్రియులు; మొదలయిన పెక్కుమంది ప్రజలు; శోకసంతప్తహృదయులు+అయి= దుఃఖంచేత మిక్కిలి కాల్చబడిన మనస్సులు కలవాళ్ళయి.

తాత్పర్యం: అని ఆజ్ఞాపించగా, పురోచనుడు మిక్కిలి వేగంగా వెళ్ళి, దుర్యోధనుడు చెప్పినట్లు వారణావతంలో లక్కఇల్లు నిర్మిస్తూ ఉన్నాడు. ఇక్కడ క్రమంగా పదహారు, పదిహేను, పధ్నాలుగు, పదమూడుసంవత్సరాల వయస్సు కల ధర్మజభీమార్జుననకులసహదేవులు శతశృంగపర్వతంనుండి హస్తినకు వచ్చి, కౌరవులతో కలిసి అస్త్రవిద్యలు నేర్చుకొంటూ పదమూడేండ్లు ఉండి, ధృతరాష్ట్రుని ఆజ్ఞప్రకారం తల్లితోకూడ వారణావతానికి పోవ సమకట్టి, గొప్పవేగం, బలంగల గుర్రాలు పూనినరథాలెక్కి, చేత ధనుస్సులు ధరించి, హస్తిపురం వెలువడేటప్పుడు ఆ పురంలోని బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలయినవాళ్ళంతా మిక్కిలి దుఃఖంతో;

విశేషం: వారణావతానికి వెళ్ళేనాటికి ధర్మరాజు వయస్సు 29 సంవత్సరాలు - భీమునిది 28 సంవత్సరాలు - అర్జుననిది 27 సంవత్సరాలు - నకులసహదేవులది (కవలలు) 26 సంవత్సరాలు.

సీ. 'ఇప్పాండుపుత్త్రుల నేలకో ధృతరాష్ట్రుం । డేకత మనుపంగ నిచ్చగించె;
నిది యధర్మం బని యెఱిఁగి గాంగేయాదు । లేల వారింపరో యెఱుఁగరొక్కొ;
పితృపితామహులచే భృతపూర్వమై క్రమా । గత మైన రాజ్యంబుఁ గరము నెమ్మిఁ
బాండుసుతజ్యేష్ఠు భరతకులశ్రేష్ఠు । ధర్మజుఁ బూన్పక ధర్ము వుడిపి

ఆ. యేల వృద్ధరాజు లెడసేసిరో; పార్థుఁ డరుగు నెడక మనము నరిగి యతని
యున్న చోన ప్రీతి నుండుద; మిం దుండ । నేల?' యనుచుఁ బౌరు లెల్లఁ దెరలి. 143

ప్రతిపదార్థం: పౌరులు+ఎల్లన్= హస్తినాపుర ప్రజలంతా; ఈ+పాండు, పుత్త్రులన్= ఈ పాండురాజు కుమారులను, పాండవులను; ఏల+ఒకో= ఎందుచేతనోగదా!; ధృతరాష్ట్రుఁడు; ఏకతమ= ఒంటరులను చేసి, వేరుచేసి, ప్రత్యేకంగా; అనుపంగన్= పంపటానికి; ఇచ్చగించెన్= ఇష్టపడ్డాడు; ఇది= ఈ పని; అధర్మంబు; అని; ఎఱిఁగి= తెలిసి; గాంగేయ+ఆదులు= భీష్ముడు మొదలయినవాళ్ళు; ఏల= ఎందుచేత; వారింపరో= అడ్డగించరో; ఎఱుఁగరు+ఒక్కొ= వారికి తెలియదేమో! పితృ, పితామహులచే=

తండ్రితాతలచేత; భృత, పూర్వము+ఐ= ముందు భరింపబడినదై; క్రమ+ఆగతము+ఐన= వరుసగా వచ్చేదైన; రాజ్యంబునన్; కరము= మిక్కిలి; నెమ్మిన్= ప్రీతితో; పాండు, సుత, జ్యేష్ఠున్= పాండురాజు కుమారులలో పెద్దవాణ్ణి; భరతకుల, శ్రేష్ఠున్= భరతునియొక్క వంశంలో శ్రేష్ఠుణ్ణి; ధర్మజున్= ధర్మరాజును; పూన్పక= వహించేట్లు చేయక; ధర్మువు+ఉడిపి= ధర్మాన్ని తొలగించి; వృద్ధ, రాజులు; ఏల= ఎందుకు; ఎడ= దూరము; చేసిరో; పార్థుఁడు= పృథ - అంటే కుంతి-కనుక కుంతీతనయు డైన ధర్మరాజు; అరుగు+ఎడకు+అ= వెళ్ళేచోటికే; మనమున్= మనంకూడ; అరిగి=పోయి; అతని, ఉన్న చోన= ఆయన ఉండే చోటనే; ప్రీతిన్, ఉండుదము= ప్రీతితో ఉందాము; ఇందున్= ఈ హస్తినలో; ఉండన్+ఏల= ఉండటమెందుకు; అనుచున్= అంటూ; తెరలి= కదలి.

తాత్పర్యం: 'ఈ పాండవులను ఎందుచేతనో ధృతరాష్ట్రుడు తన ఆలోచనతో హస్తిననుండి ఒంటరులుగా చేసి పంపివేయాలనుకొన్నాడు. ఇది అధర్మమని తెలిసికూడా భీష్ముడూ మొదలయినవాళ్ళు ఎందుచేత అడ్డగించలేదో? తండ్రితాతలనుండి వరుసగా వచ్చిన రాజ్యాన్ని - పాండుపుత్రులలో పెద్దవాడూ, భరతవంశంలో శ్రేష్ఠుడూ అయిన ధర్మరాజు ధరించేటట్లు చేయక, ధర్మం తప్పి ఎందుచేత వృద్ధరాజులు అతణ్ణి దూరం చేశారో? ధర్మరాజు వెళ్ళే చోటికే మనంగూడా వెళ్ళుదాము. అతడున్న చోటనే మనంగూడా ప్రీతితో ఉందాం. ఈ హస్తినలో ఉండట మెందుకు' అని పౌరులందరూ బయలుదేరారు.

వ. తన పిఱుందన వచ్చువారిం బ్రియపూర్వకంబున నూరార్చి 'పితృవచనంబు సేయకునికి ధర్మవిరుద్ధంబు గావున వారణావతంబునకుం బోయి వచ్చెద' మని యందఱం గ్రమ్మఱించి, చనుచున్న ధర్మనందను పిఱుంద నొక్కింతనేల యరిగి, విదురుం డొరులు వినియును నెఱుంగరాని వచనంబుల బహుప్రకారవచనరచనా విశారదుం డైన యుధిష్ఠిరున కెల్ల కార్యంబులు గఱపి, కొడుకులం గౌఁగిలించుకొని, కుంతీదేవికి మ్రొక్కి పాండురాజుం దలంచి బాష్పపూరితనయనుం డై క్రమ్మఱి చనియె; నిట కుంతియు ధర్మరాజు డాయ వచ్చి యి ట్లనియె. 144

ప్రతిపదార్థం: తన, పిఱుందన్= తనవెంట; వచ్చు వారిన్ = వచ్చేవాళ్లను; ప్రియ, పూర్వకంబునన్= స్నేహం మొదలుగా - అంటే స్నేహంతో; ఊరార్చి= ఊరడించి; పితృ, వచనంబు= తండ్రియొక్క మాట; చేయక+ఉనికి= పాటించకుండటం; ధర్మ విరుద్ధంబు= ధర్మానికి వ్యతిరేకం; కావునన్; వారణావతంబునకున్= వారణావతానికి; పోయి= పోయి; వచ్చెదము= వస్తాము; అని; అందరన్= అందరినీ; క్రమ్మరించి= మరలించి; చనుచున్+ఉన్న= వెళ్ళుతున్న; ధర్మనందను, పిఱుందన్= ధర్మరాజుయొక్క వెనుక; ఒక్కింత, నేల, అరిగి= కొద్దిదూరం వెళ్ళి; విదురుండు; ఒరులు= ఇతరులు; వినియును= వినికూడా; ఎఱుంగరాని= తెలిసికొనటానికి సాధ్యంగాని; వచనంబులన్= మాటలతో; బహు, ప్రకార, వచన, రచనా, విశారదుండు+ఐన= పలువిధాలైన మాటలను కూర్చటంలో పండితుడైన; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుకు; ఎల్ల కార్యంబులు= అన్ని చేయదగ్గ పనులను; కఱపి= బోధించి; కొడుకులన్= కుమారుల్ని; కౌఁగిలించుకొని; కుంతీదేవికిన్= కుంతికి; మ్రొక్కి= నమస్కరించి; పాండురాజున్= పాండురాజును; తలంచి= గుర్తుచేసికొని; బాష్ప, పూరిత, నయనుండు+ఐ= కన్నీళ్ళతో నిండిన కన్నులు కలవాడై; క్రమ్మఱి= మరలి; చనియెన్= వెళ్ళాడు; ఇట= ఇచ్చట; కుంతియున్= కుంతీదేవియు; ధర్మరాజున్, డాయ, వచ్చి= ధర్మరాజు సమీపానికి వచ్చి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తన వెంట వచ్చేవాళ్ళను స్నేహపూర్వకంగా ఓదార్చి 'తండ్రిమాట పాటించకపోవటం ధర్మవిరుద్ధమనీ, అందుచేత వారణావతం పోయివస్తా' మనీ చెప్పి వాళ్ళందరినీ వెనుకకు పంపి, వెళ్ళుతున్న ధర్మరాజువెంబడి - విదురుడు కొద్దిదూరం వెళ్ళి, ఇతరులు విన్నా వాళ్ళకు అర్థంగాని మాటలతో మాటనేర్పరి అయిన ధర్మరాజుకు

వారణావతాన చేయదగిన పనులన్నింటినీ బోధించి, పాండవులను కౌగిలించుకొని, కుంతీదేవికి మ్రొక్కి, పాండురాజును స్మరించి కన్నీళ్ళు నించి, వెనుదిరిగి వెళ్ళాడు. తరువాత కుంతీదేవి ధర్మరాజుకు దగ్గరగా వచ్చి ఇలా అన్నది.

తే. విదురుఁ డేతెంచి యొరులకు వినియు నెఱుఁగఁ గానియ ట్లుండఁ బలికి నిన్ గఱపె బుద్ధి;
నట్ల చేయుదు నంటి వీ; వతని మతము । సెప్పనగునేని యెఱుఁగంగఁ జెప్పు మయ్య! 145

ప్రతిపదార్థం: విదురుఁడు; ఏతెంచి= వచ్చి; ఒరులకున్= ఇతరులకు; వినియున్= విని కూడా; ఎఱుఁగన్+కాని= అర్థంకాని; అట్లు+ఉండన్= ఆ విధంగా ఉండేటట్లు; పలికి; బుద్ధిన్= తెలివిని - సలహాను; నిన్+కఱపెన్= నీకు చెప్పాడు; నీవు; అట్లు= ఆ విధంగానే; చేయుదున్= చేస్తాను; అంటి=అన్నావు; అతని, మతము= అతనియొక్క (విదురునియొక్క) అభిప్రాయం; చెప్పన్+అగున్+ఏని= చెప్పదగిందైతే; నీవు; ఎఱుఁగంగన్= తెలిసేటట్లు; చెప్పుము+అయ్య= చెప్పుము నాయనా!

తాత్పర్యం: విదురుడు వచ్చి ఇతరులు విన్నా అర్థంకాని విధంగా నీకు సలహా చెప్పాడు. నీవుకూడా చెప్పినట్లుగానే చేస్తానని అతనితో అన్నావు. చెప్పదగిందైతే అతనిఅభిప్రాయం నాకు తెలియజెప్పుము.

వ. అనిన నగుచు ధర్మతనయుండు విదురువచనంబుల యభిప్రాయంబులు దల్లి కి ట్లని చెప్పె. 146

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; నగుచున్= నవ్వుతూ; ధర్మతనయుండు= ధర్మరాజు; విదురు+వచనంబుల+ అభిప్రాయంబులు= విదురుని మాటలలోని అభిప్రాయాలు; తల్లికిన్= తల్లి కుంతీదేవికి; ఇట్లు+అని+చెప్పెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అనగా ధర్మరాజు నవ్వుతూ విదురునిమాటలలోని తాత్పర్యాన్ని తల్లికి ఈ విధంగా చెప్పాడు.

ఆ. ఎల్లకార్యగతులు నెఱుఁగుదు; రయినను । నెఱుఁగఁ జెప్పవలయు నెఱిఁగినంత;
పనియులేక మిమ్ముఁ బనిచిన కురుపతి । హితుఁడపోలె మీఁద నెగ్గు సేయు. 147

ప్రతిపదార్థం: ఎల్ల, కార్య గతులున్= అన్ని పనుల విధాలు; ఎఱుఁగుదురు= మీకు తెలియును; అయినను= అయినప్పటికి; ఎఱిఁగిన+అంత= తెలిసినంతవరకు; ఎఱుఁగన్+చెప్పవలయున్= తెలియచెప్పాలి; పనియు; లేక= ఏ పనిగూడ లేకుండ; మిమ్మున్; పనిచిన= పంపిన; కురు, పతి= ధృతరాష్ట్రుడు; హితుఁడపోలెన్= మేలు చేసేవానివలె ఉండి; మీఁదన్= తర్వాత; ఎగ్గు= కీడు; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: చేయదగిన పనుల పద్ధతులన్నింటిని మీ రెరుగుదురు. అయినా నాకు తెలిసినంతవరకూ మీకు తెలియచెప్పాలి. ఏ పనీ లేకుండా మిమ్ములను వారణావతం పంపించే ధృతరాష్ట్రుడు మీకు మేలు చేసేవాడివలె ఉండి, తర్వాత కీడు చేస్తాడు.

వ. 'కావున మీర లేమఱక విషాగ్నులవలన నప్రమత్తుల రై యెఱుక గలిగి యుండునది' యని బుద్ధిగఱపి మఱియు' దుర్యోధనుచేసెడు దుష్క్రియ లిమ్ముగా నెఱింగి వానికిం బ్రతీకారంబు సెప్పి పుత్తెంచెద ననియె' నని చెప్పిన విని, విదురుబుద్ధికిఁ దమవలని నెయ్యంబునకు సంతసిల్లుచునిట్లు బాండవులు కతిపయప్రయాణంబుల వారణావతంబున కరుగునంత. 148

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మీరలు= మీరు; ఏమఱక= ఏమరుపాటు లేక; విష+అగ్నులవలనన్= విషంవలనను, అగ్నివలనను; అప్రమత్తులరు+ఐ= ఏమరుపాటు లేనివాళ్ళయి; ఎఱుక= తెలివి; కలిగి ఉండునది= కలిగి ఉండండి అని; బుద్ధి, కఱపి= సలహా చెప్పి; మఱియున్= ఇంకా; దుర్యోధను, చేసెడు, దుష్క్రియలు= దుర్యోధనునియొక్క చేస్తున్న చెడ్డపనులు - అంటే దుర్యోధనునిచెడ్డపనులు; ఎఱింగి= తెలిసికొని; వానికిన్= ఆ చెడ్డ పనులకు; ప్రతీకారంబు= విరుగుడు; చెప్పి; పుత్తెంచెదన్= పంపిస్తాను; అనియెన్= అని; చెప్పినన్= ధర్మరాజు చెప్పగా; విని; విదురు, బుద్ధికిన్= విదురునియొక్క సలహాకు; తమ, వలని= తమవైపు ఉన్న; నెయ్యంబునకున్= స్నేహానికి; సంతసిల్లుచున్= సంతోషిస్తూ; ఇట్లు; పాండవులు; కతిపయ, ప్రయాణంబులన్= కొన్నిరోజులప్రయాణాలతో; వారణావతంబునకున్+అరుగు+అంత= వారణావతానికి వెళ్ళినతర్వాత.

తాత్పర్యం: 'అందుచేత మీరు ఏమరుపాటు లేకుండా విషంవల్ల, అగ్నివల్ల కలిగే ప్రమాదాల విషయంలో జాగరూకులై ఉండుండని సలహా చెప్పి, దుర్యోధనుడు చేసే చెడుపనులు తెలిసికొని, ఆ చెడుపనులకు విరుగుడులుకూడా చెప్పి పంపిస్తానని విదురు డన్నా' డని ధర్మరాజు చెప్పగా - కుంతీదేవి, పాండవులు విదురుడు చెప్పిన సలహాకు, అతనికి తమపట్ల ఉండే స్నేహభావానికి సంతోషిస్తూ కొన్నిరోజులు ప్రయాణంచేసి వారణావతానికి చేరుకొన్న తర్వాత.

పాండవులు జననీసహితంబుగా వారణావతంబుఁ జేరుట (సం. 1-134-1)

సీ. **వారణావతమునవా రెల్లఁ బాండవా। గమనంబు విని సంతసమునఁ బెరిఁగి**
కరమొప్పఁ గరిరథతురగబలాఢ్యు లై। యెదురు వచ్చిరి మహాముదముతోడఁ;
గలయంగ గృహములఁ గలువడములు గడు - విలసిల్లె నంబరతలము గప్పి
మలయజమృగమదావిలసలిలంబుల। నిమ్ముగా నార్ద్రీకృతమ్ము లయిన

తే. **యంగళుల నొప్పెఁ గర్పూరరంగవల్లు। లంగనలు గయిసేసి యుత్తుంగహర్మ్య**
తలము లెక్కిరి తత్పురీవిలసంబుఁ। జూచు పాండుకుమారులఁ జూచువేడ్క. 149

ప్రతిపదార్థం: పాండవ+ఆగమనంబు= పాండవులయొక్క రాక; విని; వారణావతమున, వారు+ఎల్లన్= వారణావతంలోని జనులంతా; సంతసమునన్= సంతోషంతో; పెరిగి= ఉబ్బి; కరము= మిక్కిలి; ఒప్పన్= అందంగా; కరి, రథ, తురగ, బల+ఆఢ్యులు+ఐ= ఏనుగులతో, రథాలతో, గుర్రాలతో; సైన్యంతో కూడినవాళ్ళయి; మహాముదముతోడన్= మహాసంతోషంతో; ఎదురు, వచ్చిరి; కలయంగన్= అంతటా; గృహములన్= ఇండ్లలో; కలువడములు= ధ్వజస్తంభాలకు కట్టే బంగారుకలువపూదండలు; అంబర, తలము= ఆకాశంయొక్క క్రిందిభాగాన్ని; కప్పి; కడున్= మిక్కిలి; విలసిల్లెన్= ప్రకాశించాయి; మలయజ, మృగమద+ఆవిల, సలిలంబులన్= మంచిగంధంతోను, కస్తూరితోను; కలిసిననీటిచేత; ఇమ్ముగాన్= ఇంపుగా; ఆర్ద్రీకృతమ్ములు+అయిన= తడుపబడినవి అయిన; అంగళులన్= రాజవీథులందు; కర్పూరరంగవల్లులు= కర్పూరపుపొడితో వేసిన ముగ్గులు; ఒప్పెన్= ప్రకాశించాయి; అంగనలు= స్త్రీలు; కయిసేసి= అలంకరించి; తత్+పురీ, విలసంబున్= ఆ పట్టణంయొక్క శోభను, చూచు, పాండుకుమారులన్= పాండవులను; చూచు= చూడాలనే; వేడ్కన్= కుతూహలంతో; ఉత్తుంగ= ఎత్తైన; హర్మ్య, తలములు= మేడలమీది సమప్రదేశాలు; ఎక్కిరి.

తాత్పర్యం: పాండవులరాకనుగురించి విని, వారణావతంలోని ప్రజలంతా ఎంతో ఆనందించి, చతురంగ బలాలతో వారికి ఎదురేగారు. ఇండ్ల ధ్వజస్తంభాలకు కట్టిన బంగారుకలువపూదండలు ఆకాశాన్ని కప్పి మిక్కిలి ప్రకాశించాయి.

మంచిగంధం, కస్తూరి కలిపిననీటితో తడిసిన రాజమార్గాలలో కర్పూరపుముగ్గులు కళకళలాడాయి. ఆడవాళ్ళు అలంకరించుకొని ఆ నగరశోభను చూస్తున్నపాండవులను చూడటానికి మేడలెక్కారు.

వ. పాండుకుమారులు ననేకభూసురాశీర్వాదనాదాభినందితు లై ఫాల్గునమాసంబున శుక్లపక్షమున నష్టమియు రోహిణినాడు వారణావతంబు సొచ్చి సర్వాలంకారసుందరం బయిన రాజమందిరంబున నున్న, కొన్ని దినంబులకుం బురోచనుండు దనచేసినచతుశ్శాల సకలజననయనాభిరామం బైన దానిం జూపినం జూచి పాండుసుతులు సంతసిల్లి, పురోచనశిల్పాచార్యులం, బూజించి పుణ్యాహరవపురస్సరంబుగా గృహప్రవేశంబు సేసి; రంతం బరాభిప్రాయమాయోపాయ ప్రయోగవిదుం డైన ధర్మతనయుండు దాని కృత్రిమరమణీయత నుపలక్షించి యల్లన భీమున కి ట్లనియె. 150

ప్రతిపదార్థం: పాండుకుమారులున్= పాండవులు; అనేక, భూసుర+ఆశీర్వాదనాద+అభినందితులు+ఐ= పెక్కుమంది బ్రాహ్మణులయొక్క ఆశీర్వాద ధ్వనులచేత కొనియాడబడినవాళ్ళయి; ఫాల్గున,మాసంబున; శుక్లపక్షంబున; అష్టమియు; రోహిణినాడు; వారణావతంబు; చొచ్చి= ప్రవేశించి; సర్వ+అలంకార, సుందరంబు+అయిన= అన్నిఅలంకారాలచేత అందమైన దైన; రాజ మందిరంబునన్; ఉన్నన్= ఉండగా; కొన్ని, దినంబులకున్; పురోచనుండు; తన, చేసిన= తనయొక్క చేసిన - అంటే తాను నిర్మించిన; చతుశ్శాల= నాలుగిండ్ల భవంతి; సకల, జన, నయన+అభిరామంబు+ఐన= అందరు ప్రజలయొక్క కన్నులకు ఇంపు గొలిపేది అయిన; దానిన్; చూపినన్= చూపగా; చూచి; పాండుసుతులు= పాండురాజుయొక్క కుమారులు; సంతసిల్లి= సంతోషించి; పురోచన; శిల్ప+ఆచార్యులన్= పురోచనుడనే పేరుగల శిల్పాచార్యులను; పూజించి; పుణ్యాహ, రవ, పురస్సరంబుగాన్= పుణ్యాహవచనం మున్నుగా; గృహ, ప్రవేశంబు; చేసిరి; అంతన్= అటుపై; పర+అభిప్రాయ, మాయ+ఉపాయ, ప్రయోగ విదుండు+ఐన= ఇతరుల అభిప్రాయాలను, కపటోపాయ ప్రయోగాలను ఎరిగినవాడైన; ధర్మతనయుండు= ధర్మరాజు; దాని= ఆ చతుశ్శాలయొక్క కృత్రిమ రమణీయతన్= సహజంకాని కేవలం కల్పింపబడినదైన అందాన్ని; ఉపలక్షించి= చూచి; అల్లనన్= మెల్లగా; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పాండవులు పెక్కుమందిబ్రాహ్మణుల ఆశీర్వచనాలు పొంది, ఫాల్గున శుద్ధఅష్టమి రోహిణీ నక్షత్రం రోజున వారణావతంలో ప్రవేశించి; అన్నివిధాల అందమైన రాజమందిరంలో ఉంటూఉండగా, పురోచనుడు తాను నిర్మించిన మహామనోహరమైన చతుశ్శాలను చూపించాడు. పాండవులు సంతోషించి, పురోచనుడిని సమ్మానించి, పుణ్యాహవచనాలతో అందు ప్రవేశించారు. ఇతరుల అభిప్రాయాలను, మాయోపాయప్రయోగాలను ఎరిగిన ధర్మరాజు ఆ చతుశ్శాలకృత్రిమరమణీయతను చూచి మెల్లగా భీమునితో ఇట్లా అన్నాడు.

విశేషం: పుణ్యాహవాచనము - శుభంకలగటానికి పుణ్యాహమనే శబ్దాన్ని మూడుమారులు చెప్పే శుభకర్మం. 'అష్టమియు రోహిణి నాడు' - అనే దానికి 'సిద్ధార్థి సంవత్సర ఫాల్గున శుద్ధ అష్టమి రోహిణియందు', అనే ఒకపాఠాంతరం గూడ ఉన్నది. - శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పుట 358.

క. ఈ గృహ కుడ్యంబులు లా । క్షాగర్భము లాజ్య తైలగంధులు మఱి శ
స్త్రాగారసమీపము మా - యాగృహ మగు నిది యవశ్య మాగ్నేయం బై. 151

ప్రతిపదార్థం: ఈ, గృహ, కుడ్యంబులు= ఈ యింటియొక్క గోడలు; లాక్షా, గర్భములు= లక్కను లోపల కలిగినట్టివి; ఆజ్య, తైల, గంధులు= నేతియొక్కయు, నూనెయొక్కయు వాసన గలవి; మఱి= అంతేగాక; శస్త్ర+అగార, సమీపము= ఆయుధాలుండేచోటికి దగ్గరగా ఉన్నది; అవశ్యము= తప్పక; ఆగ్నేయంబు+ఐ= అగ్నిచే దహింపదగిందై; ఇది; మాయా, గృహము+అగున్= మోసపుటిల్లుగా ఉన్నది.

తాత్పర్యం: ఈ యింటిగోడలలో లక్క ఉన్నది. ఇవి నేతివాసన, నూనెవాసన కలిగి ఉన్నాయి. అంతేగాక ఇది ఆయుధాలుండే చోటికి దగ్గరగా ఉన్నది. తప్పక ఇది నిప్పుచేత తగులబడే మోసపుటిల్లు.

క. దీని తెఱఁ గెఱిఁగినట్ల మ । హానిపుణుఁడు విదురుఁ డురువిషాగ్నులవలనన్
మానుగ నేమఱకుం డని । తాను బ్రబోధించె నేకతమ ననుఁ బ్రీతిన్. 152

ప్రతిపదార్థం: దీని, తెఱఁగు= ఈ యింటియొక్కపద్ధతి; ఎఱిఁగినట్లు+అ= తెలిసినట్లే; మహానిపుణుఁడు= గొప్పనేర్పరి; విదురుఁడు; ఉరు, విష+అగ్నులవలనన్= గొప్ప విషంవలన, అగ్నివలన; ఏమఱకుండు+అని= మైమరచి ఉండవద్దని; మానుగన్= ఒప్పుగా; తాను; ఏకతమ= ఒంటరిగా; ననున్; ప్రీతిన్= ప్రేమతో; ప్రబోధించెన్= ఉపదేశించాడు.

తాత్పర్యం: ఈ యింటి విషయం తనకు తెలిసినట్లే మహామేధావి అయిన విదురుడు విషం, నిప్పు విషయాలలో ఏమరి ఉండవద్దని ఎవ్వరూ లేకుండా చూచి ఒంటరిపాటున నాకు హెచ్చరిక చేశాడు.

వ. 'కావున మన మిందు విశ్వసించియుండవలవ; దవశ్యం బగ్నిభయం బగు' ననిన విని భీముం డి ట్లనియె. 153

ప్రతిపదార్థం: కావున; మనము; ఇందున్= ఈ యింటిలో; విశ్వసించి= నమ్మి; ఉండవలవదు= ఉండకూడదు; అవశ్యంబు= తప్పక; అగ్ని, భయంబు+అగున్= నిప్పువలన భయం కలుగుతుంది; అనిన్; విని; భీముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి, మనం ఈ యింట్లో నమ్మి ఉండకూడదు; తప్పక ఈ యింట అగ్నిభయం కలుగుతుంది అని ధర్మరాజు పలుకగా విని భీముడు ఈ విధంగా అన్నాడు.

ఆ. 'ఇట్టిదేని మనకు నిం దుండఁగా నేల? । యరిగి ముందు నున్నయంద యుండి,
యెఱిఁగి దీనితోన యుప్పరోచనుఁ గాల్చి । పోద' మనిన ధర్మపుత్త్రుఁ డనియె. 154

ప్రతిపదార్థం: ఇట్టిది+ఏని= ఇటువంటిదైతే; మనకున్; ఇందున్= ఈయింటిలో; ఉండఁగాన్+ఏల= ఉండట మెందుకు; అరిగి= వెళ్ళి; ముందు+ఉన్న+అందు+అ= ఇదివరకు ఉన్నచోటనే; ఉండి= వసించి; ఎఱిఁగి= తెలిసి; ఈ+పురోచనున్; దీనితోనన్= ఈ యింటితోకూడ; కాల్చి; పోదము= పోవుదము; అనినన్= అనగా; ధర్మపుత్త్రుడు= ధర్మరాజు; అనియెన్= ఇట్లన్నాడు.

తాత్పర్యం: 'ఇటువంటిదైతే ఈయింట్లో మనం ఉండటమెందుకు? ఇదివరకున్న ఇంట్లోనే ఉందాము. ఈ యింటితో పురోచనుడినిగూడ దహించి పోదాము' అని భీము డనగా అతనితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. ఎఱిఁగితిమి దీని తెఱఁ; గే । మఱి కెఱుఁగనియట్లు గూఢమతి నుందుద మిం
దఱముఁ బురోచనుకృతకము । నెఱి నేర్పడునంతకును వినీతాత్ముల మై. 155

ప్రతిపదార్థం: దీని, తెఱఁగు= ఈ యింటి పద్ధతి; ఎఱిఁగితిమి= తెలిసికొన్నాము; ఏమఱక= పరాకులేకుండ; ఎఱుఁగని+అట్లు= తెలియనట్లు; పురోచను, కృతకము= పురోచనునిచేత చేయబడినది - అంటే పురోచనునిమోసం - నెఱిన్= పూర్తిగా; ఏర్పడు+అంతకును= బయటపడేంతవరకు; వినీత+ఆత్ములము+ఐ= నిగ్రహించిన మనస్సులు కలవారమై; గూఢ మతిన్= రహస్యమైన తలంపుతో; ఇందఱము= ఇంతమందిమి; ఉండుదము= ఉందాము.

తాత్పర్యం: మనం ఈ యింటి సంగతి తెలిసికొన్నాము. పరాకు లేకుండా ఏమీ తెలియనట్లే పురోచనుడిమోసం పూర్తిగా బయటపడేవరకు మనస్సును నిగ్రహించుకొని రహస్యమైన ఆలోచనతో అందరం ఇందే ఉందాము.

వ. ఇప్పాపగృహప్రకారంబు మన మెఱుంగుట పురోచనుం డెఱింగెనేని దుర్యోధనునియోగంబు విఫలం బగు నట్లు గాకుండ శీఘ్రకారుల మై దీని దహించిన నక్కడ భీష్మవిదురులు విని కోపించినం గురుకులసముద్రక్షోభం బగు; మఱి దాహభయంబున మన మొండుగడకుం బోయిన నెఱింగి మనయంతరంబ రోయుచు నద్దురాత్ముండు దుర్యోధనుండు వెండియు మన కపాయంబు సేయు నె ట్లనిన. 156

ప్రతిపదార్థం: ఈ+పాప, గృహ, ప్రకారంబు= ఈ పాపమైన ఇంటి విధం; మనము; ఎఱుంగుట; పురోచనుండు; ఎఱింగెన్+ఏని= తెలిసికొన్నట్లయితే; దుర్యోధను, నియోగంబు= దుర్యోధనునియొక్క ఆజ్ఞ; విఫలంబు+అగున్= వ్యర్థమవుతుంది; అట్లు, కాక+ఉండ= అలా కాకుండా; శీఘ్ర, కారులము+ఐ= త్వరపడి చేసేవాళ్ళమై; దీనిన్= ఈ యింటిని; దహించినన్= కాల్చివేస్తే; అక్కడ= హస్తినలో; భీష్మ, విదురులు= భీష్మ విదురులు; విని; కోపించినన్= కోపపడగా; కురు, కుల, సముద్ర క్షోభంబు+అగున్= కురువంశమనే సముద్రంలో గగ్గోలు కలుగుతుంది; మఱి= అట్లుగాక; దాహ, భయంబునన్= కాల్పువలని భయంచేత; మనము; ఒండు, కడకున్= ఇంకొకచోటికి; పోయినన్= పోయినచో; ఎఱింగి= తెలిసికొని; మన, అంతరంబు+అ= మనయొక్కమఱుగునే - అంటే మనం దాగిఉండే చోటునే; రోయుచున్= వెదుకుతూ; ఆ+దురాత్ముండు= ఆ దుర్మార్గుడు; దుర్యోధనుఁడు; వెండియున్= మరల; మనకున్; అపాయంబు= కీడును; చేయును= చేస్తాడు; ఎట్లు+అనినన్= ఏ విధంగాఅంటే.,

తాత్పర్యం: ఈ పాపపుఇంటిసంగతి మనకు తెలిసినట్లు పురోచనుడికి తెలిస్తే; దుర్యోధనుని ఆజ్ఞ విఫలమవుతుంది. అట్లా కాకుండా మనం తొందరపడి ఈ యింటిని దహించివేస్తే, అక్కడ హస్తినలో భీష్మవిదురులు ఇది విని కోపిస్తే, కురువంశమనే మహాసముద్రంలో సంక్షోభం కలుగుతుంది. అట్లా కాక ఇల్లు కాలుతుందనే భయంచేత వేరొక చోటికి వెళ్తే ఆ దుర్మార్గుడు దుర్యోధనుడు మనం దాగినచోటునే వెదుకుతూ మళ్లీ మనకు కీడు చేస్తాడు. అది ఎట్లాగంటే.

సీ. 'రాజ్యపదస్థుం డరాజ్యపదస్థులఁ। బక్షబలాఢ్యుఁ డపక్షబలుల
విపులార్థవంతుండు విగతార్థసార్థుల । నవసరం బెఱిఁగి వాఁ డశ్రమమున
దూష్యులఁ దుదిదాఁక దూషించు మనల న । న్నిష్ఠురునకు నది నీతిగాదె!
కావున నొరు లెఱుంగకయుండఁ గడు నమ్మి । నట్టుల యుండుద' మని దినంబు

తే. లెల్ల వేఁటలాడుచు రాత్రులెల్ల నుద్య । తాయతాయుధహస్తు లై యనుదినంబు
నప్పురోచను వంచించి యనఘు లుండి । రప్రమాదు లై పాండవు లప్పురమున. 157

ప్రతిపదార్థం: రాజ్యపదస్థుండు= రాజ్యస్థానంలో ఉన్నవాడు - అంటే రాజ్యాధికారంలో ఉన్నవాడు; అరాజ్య, పదస్థులన్= రాజ్యాధికారంలో లేనివాళ్ళను; పక్షబల+ఆఢ్యుఁడు= సహాయబలం కలవాడు; అపక్ష, బలులన్= సహాయబలం లేనివాళ్ళను; విపుల+అర్థవంతుండు= ఎక్కువ డబ్బున్నవాడు; విగత+అర్థసార్థుల= కోల్పోయిన ధనం గలవాళ్ళను; అవసరంబు= సమయం; ఎఱిఁగి= తెలుసుకొని; అశ్రమమునన్= సులువుగా; వాఁడు= ఆ దుర్యోధనుడు; మనలన్= మనల్ని; దూష్యులన్= నిందింపదగినవాళ్ళను; (ఇట చెరుపదగినవాళ్ళనని భావించాలి); తుది, తాఁకన్= చివరివరకు; దూషించున్= నిందిస్తాడు-చెరుస్తాడు; ఆ+నిష్ఠురునకున్= ఆ క్రూరుడికి; అది; నీతి; కాదె= కాదా! కావునన్; ఒరులు= ఇతరులు, ఎఱుంగక+ఉండన్= తెలిసికొనకుండ; నమ్మినట్టులన్= నమ్మినట్లే; ఉండుదము= ఉందాము; అని= ఆ ప్రకారం; దినంబులు+ఎల్లన్= పగటిపూటలం దెల్ల; వేఁటలు+ఆడుచు; రాత్రులు+ఎల్లన్; ఉద్యత+ఆయత+ఆయుధ, హస్తులు+ఐ= ఎత్తబడిన గొప్ప ఆయుధాలు కల చేతులు కలవాళ్ళయి; అప్రమాదులై= ఏమరుపాటు లేనివాళ్ళయి; అనుదినంబు= ప్రతిదినం; ఆ+పురోచనున్; వంచించి= మోసగించి; ఆ+పురమునన్= ఆ వారణావతనగరంలో; అనఘులు= పాపంలేనివాళ్ళు - పుణ్యాత్ములు; పాండవులు; ఉండిరి.

తాత్పర్యం: రాజ్యాధికారంలో ఉన్నవాడు, సహాయబలం కలవాడు, గొప్పసంపద కలవాడు అయిన దుర్యోధనుడు - రాజ్యాధికారం, సహాయబలం లేక సంపద కోల్పోయిన మనలను సమయం చూచి తుదముట్ట చెరచటానికి ప్రయత్నిస్తాడు. ఆ దుర్మార్గుడికి అదియేనీతి. అందుచేత ఇతరులు తెలిసికొనకుండా నమ్మినట్లే ఉందాము- అని పుణ్యాత్ములైన పాండవులు ప్రతిదినం పగలెల్ల వేటాడుతూ, రాత్రులలో ఆయుధాలు చేత ధరించి అప్రమత్తులై ఆ వారణావతంలో ఉన్నారు.

విశేషం: విగతార్థసార్థుల - అనేదానికి 'విగతార్థవంతుల,' 'విగతార్థసాధుల' అనే పాఠాంతరాలున్నాయి. హస్తినాపురం వదలి బయటికి వచ్చిన పాండవులస్థితి, హస్తినాపురంలో రాజైన ధృతరాష్ట్రుని సంతతిస్థితి ధర్మజుని వాక్యాలలో నిరూపితమయ్యాయి. పాండవులకు హస్తినలోని బందుగుల బలం దూరమైనది. రాజ్యాధికారం, బంధువులబలగం, అపారసంపద, దుర్యోధనాదులకు దక్కాయి. పాండవులు ఏకాకులు, నిస్సహాయులు అయ్యారు. ఇక క్రమంగా వాళ్ళకు ద్రుపదునితో బంధుత్వం, కృష్ణునితో చెలిమి ఏర్పడితేకాని కౌరవులకంటె బలంలోనూ, బలగంలోనూ, సంపదలోనూ అధికులు కారు.

లాక్షాగృహదహనము (సం. 1-135-1)

వ. అట హస్తిపురంబున విదురుండు దుర్యోధనుదుర్మంత్రం బంతయు నిమ్ముగా నెఱింగి, కడువిశ్వాసి నొక్క ఖనకు నతి కుశలుం బాండవులపాలికిం బుత్తెంచిన వాఁడును వచ్చి రహస్యంబునం బాండవులం గని తన్ను నమ్మునట్లుగా విదురుసాభిజ్ఞానవచనంబు లెఱింగించి 'యీకృష్ణచతుర్దశినాఁటిరాత్రి పురోచనుండు లక్కయింట దహనంబు దరికొల్పుం గావున నిందుండి మీకు వెలువడిపోవునట్టియుపాయంబు మారాజు నియోగంబునం జేయవచ్చితి' నని చెప్పి, లక్కయిల్లు వెలువడునట్లుగా నొక్కబిలంబు నెవ్వరు నెఱుంగకుండం జేసి, వారల కెఱింగించిన భీముండు దాని నిమ్ముగా శోధించి యెఱింగి యుండు నంత. 158

ప్రతిపదార్థం: అట, హస్తినాపురంబునన్= హస్తినాపురంలో; విదురుండు; దుర్యోధన, దుర్మంత్రంబు+అంతయును= దుర్యోధనుని యొక్క చెడ్డఆలోచన అంతా; ఇమ్ముగాన్= స్పష్టంగా; ఎఱింగి; కడున్= మిక్కిలి; విశ్వాసిన్= నమ్మదగినవాడిని; అతికుశలున్= మిక్కిలి నేర్పుగల వాడిని; పాండవులపాలికిన్= పాండవుల దగ్గరకు; పుచ్చు+తెంచినన్= పంపించగా; వాఁడును; వచ్చి; రహస్యంబునన్= చాటుగా; పాండవులన్; కని= చూచి; తన్ను, నమ్మునట్లుగ; విదురు, స+అభిజ్ఞాన, వచనంబులు=

విదురునియొక్కగుర్తుతో కూడిన మాటలు; ఎఱిఁగించి= తెలిపి; ఈ, కృష్ణ, చతుర్దశినాటి, రాత్రి; పురోచనుండు; లక్కయింట; దహనంబు= నిప్పు; దరికొల్పున్= మండిస్తాడు; కావునన్; ఇందుండి= ఈ యింటినుండి; మీకున్; వెలువడి, పోవునట్టి= బయటపడిపోవునట్టి; ఉపాయంబు; మా, రాజు, నియోగంబునన్= మా దొర అయిన విదురునియొక్క ఆజ్ఞచేత; చేయన్= చేయటానికై; వచ్చితిన్= వచ్చాను; అని; చెప్పి; లక్క, ఇల్లు, వెలువడునట్లుగాన్= లక్కయింటినుండి బయటికిపోయి ఉండేటట్లుగా; ఒక్క= ఒక; బిలంబున్= సొరంగాన్ని; ఎవ్వరున్, ఎఱుంగకుండన్= ఎవ్వరుకూడా తెలుసుకోకుండ; చేసి; వారలకున్= పాండవులకు; ఎఱింగించినన్= తెలియజేయగా; భీముండు; దానిన్= ఆ సొరంగాన్ని; ఇమ్ముగా= పూర్తిగా; శోధించి= పరిశీలించి; ఎఱింగి= తెలిసికొని; ఉండునంతన్= ఉన్నతర్వాత.

తాత్పర్యం: హస్తినాపురంలో విదురుడు దుర్యోధనునిదురాలోచననంతటిని స్పష్టంగా తెలిసికొని, మిక్కిలి విశ్వాసపాత్రుడు, నేర్పరి అయిన ఒక ఖనకుడిని పిలిచి, పాండవుల దగ్గరకు పంపించగా, వాడు పాండవులను రహస్యంగా కలిసి, విదురుడు తనను గుర్తించటానికి చెప్పిన మాటలు చెప్పి, 'రానున్న కృష్ణపక్షచతుర్దశినాటి రాత్రి పురోచను డీ లక్కయింటిని తగులబెడతాడు. అందుచేత ఈ యింటినుండి మీరు బయటపడి వెళ్ళటానికి తగినమార్గం విదురుని ఆజ్ఞమేరకు నేరవేర్చటానికి వచ్చా' నని, లక్కయింటినుండి బయటికి ఒక రహస్యపుసొరంగాన్ని ఎవ్వరికీ తెలియకుండా త్రవ్వి పాండవులకు తెలియజేయగా, దాన్ని భీముడు పూర్తిగా పరిశీలించి తెలిసికొన్నాడు. తర్వాత.

విశేషం: ఈ కృష్ణ చతుర్దశి - ఇది రౌద్రి సంవత్సర భాద్రపద బహుళ చతుర్దశి అని భారతకూలంకషవ్యాఖ్య. శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట 361.

క. ధనదానములను బ్రియభో । జనదానములను విశిష్టసద్ద్విజతతులం
దనుపుచు నుండఁగఁ దత్పుర । మున షణ్మాసమున భరతముఖ్యుల కరిగెన్. 159

ప్రతిపదార్థం: ధన, దానములన్= ధనదానాలచేత; ప్రియ, భోజన, దానములను= ప్రియమైన భోజనదానాలచేతను; విశిష్ట, సత్+ద్విజ, తతులన్= గొప్పవారైన మంచిబ్రాహ్మణులను; తనుపుచున్= తృప్తిపరుస్తూ; ఉండఁగన్= ఉండగా; తత్+పురమునన్= ఆ నగరాన - వారణావతనగరాన; భరత, ముఖ్యులకున్= భరతవంశంలో ముఖ్యులైన పాండవులకు; షట్+మాసములు= ఆరునెలలు; అరిగెన్= గడిచాయి.

తాత్పర్యం: ధనదానాలచేత; ఇష్టమైన భోజనదానాలచేత బ్రాహ్మణసమూహాలను తృప్తిపరుస్తుండగానే వారణావతంలో పాండవులకు ఆరునెలలు గడిచాయి.

వ. ఆ కృష్ణచతుర్దశినాఁడు కుంతీదేవి యప్పురంబునం గల బ్రాహ్మణ పుణ్యాంగనా జనంబుల కెల్ల నిష్టాన్న పానదానంబులం దుష్టి చేసి దేవపూజ గావించి యున్నెడం, బురోచనుపంపిననిషాదవనిత సపుత్త్రయై బహువిధవన్యమూల ఫలంబులు దెచ్చి యిచ్చుచుం గుంతీదేవింబాయక సేవించి పాండవ కృత్యంబులు నిత్యంబును నెఱింగించు చుండెడు నది, నాఁటిరాత్రి యుత్సవంబునం గాలచోదిత యై తానునుం దన యేవురు కొడుకులు నధికమధుపాన మదంబున మెయి యెఱుంగక లక్కయింటి పక్కంబున నిద్రవోయిన, నర్ధరాత్రంబునప్పడు భీముండు మేల్కని పురోచనుకంటె ముందఱఁ దాన యుత్సహించి వానిశయనగృహద్వారంబున ఘోరానలంబు దరికొలిపి,

చెచ్చెరఁ దల్లిని నన్ననుం దమ్ములను బిలంబులోని కనిచి, యాయుధాగారంబుతోడన లాక్షాగారంబు హుతాశనున కశనంబు సేసి, ఖనకునకుం దమకుశలగమనం బెఱింగించి, బిలప్రవిష్టుం డయి కుంతిని ధర్మార్జుననకుల సహదేవులను బిలంబు వెలువరించి తోడ్కొని చనునప్పుడు. **160**

ప్రతిపదార్థం: ఆ, కృష్ణ, చతుర్దశినాఁడు; కుంతీదేవి; ఆ+పురంబునన్+కల= ఆ వారణావతనగరంలో ఉన్న; బ్రాహ్మణ, పుణ్యాంగనా, జనంబులకు+ఎల్లన్= బ్రాహ్మణముత్తైదువుల కందరికి; ఇష్ట+అన్న, పాన, దానంబులన్; తుష్టి+చేసి= తృప్తిపెట్టి; దేవపూజ; కావించి; ఉన్న+ఎడన్= ఉన్నసమయాన; పురోచను, పంపిన, నిషాద, వనిత= పురోచనుడు పంపిన బోయస్త్రీ; సపుత్ర+ఐ= కొడుకులతో కూడిందై; బహు, విధ, వన్య, మూల, ఫలంబులు= అనేకవిధాలైన అడవిలో పుట్టిన వైన వేళ్ళను, పండ్లను; తెచ్చి; ఇచ్చుచున్= ఇస్తూ; కుంతీదేవిన్; పాయక= వదలక; సేవించి; పాండవ, కృత్యంబులు= పాండవులయొక్క పనులు; నిత్యంబును= ప్రతిదినము; ఎఱింగించుచున్= తెలియజేస్తూ; ఉండెడు+అది= ఉన్నట్టిది; నాఁటి, రాత్రి= ఆ కృష్ణచతుర్దశినాటిరాత్రి; ఉత్సవంబునన్= పండుగనందు; కాల, చోదిత+ఐ= మృత్యువుచేత ప్రేరేపింపబడిందై; తానునున్; తన, ఏవురు= తన అయిదుగురు; కొడుకులున్=కుమారులును; అధిక, మధుపాన, మదంబునన్= ఎక్కువ కల్లుయొక్క త్రాగుడుచేత కలిగిన మత్తుచేత; మెయి= దేహం; ఎఱుంగక= తెలియక, లక్కయింటి; పక్కంబునన్= లక్కయింటిప్రక్కన; నిద్రపోయినన్= నిద్రించగా; అర్ధరాత్రంబు+అప్పుడు; భీముండు; మేల్కని; పురోచనుకంటె; ముందఱన్; తాను+అ= తానే, ఉత్సహించి= పూనుకొని; వాని, శయన, గృహ, ద్వారంబునన్= వాడియొక్క పడకటింటివాకిట్లో; ఘోర+అనలంబున్= భయంకరమైనఅగ్నిని; దరికొలిపి= మండించి; చెర+చెరన్= వెనువెంటనే; తల్లినిన్; అన్ననున్; తమ్ములను; బిలంబులోనికి= సొరంగంలోనికి; అనిచి= పంపి; ఆయుధ+ అగారంబుతోడన= ఆయుధాలయొక్కఇంటితోసహా, లాక్షా+అగారంబు= లక్కయిల్లు; హుత+ అశనునకున్= అగ్నిహోత్రునికి; అశనంబు+చేసి= ఆహారంగా చేసి; ఖనకునకున్; తమ, కుశల, గమనంబు= తమయొక్క క్షేమగమనాన్ని; ఎఱిఁగించి= తెలియజేసి; బిల, ప్రవిష్టుండు+అయి= సొరంగంలో ప్రవేశించినవాడై; కుంతిని; ధర్మ+అర్జున; నకుల, సహదేవులను; బిలంబు, వెలువరించి= సొరంగంనుండి బయల్పడేటట్లు చేసి; తోడ్కొని= తీసుకొని; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు.

తాత్పర్యం: ఆ కృష్ణచతుర్దశినాడు కుంతీదేవి వారణావతనగరంలో ఉండే బ్రాహ్మణముత్తైదువుల కందరికి ఇష్టమైన భోజనం తృప్తిగా పెట్టి, దేవపూజ చేసింది. పురోచనుడు పంపిన బోయస్త్రీ కొడుకులు గలది కనుక అడవిలో అనేకవిధాలైన మూలాలు, ఫలాలు తెచ్చి యిస్తూ కుంతీదేవిని వదలక సేవిస్తూ; పాండవులు చేసే పనులన్నింటిని ప్రతిదినం ఆ పురోచనుడికి తెలియజేస్తూ ఉన్నది. చావు మూడిందై ఆ బోయెత తాను, తన కొడుకులు ఆ కృష్ణచతుర్దశి నాటిరాత్రి పండుగనందు పెల్లుగా కల్లు త్రాగి, మత్తెక్కి మైమరచి ఆ లక్కయింటిప్రక్క నిదురించగా, భీముడు పురోచనుడికంటె ముందే తానే పూనుకొని వాడిపడకింటి వాకిటికి పెద్దగా నిప్పు అంటించి, వెంటనే తల్లిని, అన్నను, తమ్ములను ఆ సొరంగంలో పంపి, ఆయుధాలున్న ఆ యింటితోకూడా లక్కయింటిని తగులబెట్టాడు. విదురుడు పంపిన ఖనకుడికి తాము క్షేమంగా వెళ్ళటాన్ని తెలియజేశాడు. సొరంగంలో ప్రవేశించి, కుంతిని, ధర్మార్జుననకులసహదేవులను ఆ సొరంగంనుండి బయల్పడేటట్లు చేసి తోడ్కొని వెళ్ళేటప్పుడు.

విశేషం: ఆ బోయవనితకు కూడా కుంతీదేవివలె ఐదుగురు కొడుకులుండటం విశేషం. వాళ్ళు కుంతిని, ఆమెపుత్రులను గమనిస్తూ నిత్యం రహస్యసమాచారాన్ని అందించటానికి నియుక్తులైన వారన్నమాట.

సీ. కడునిద్రఁ గానక తొడరుచు వడిగొని । నడవంగ నేరక తడయుచున్న
నెఱిఁగి, చెచ్చెరఁ దల్లి నఱకట నిడి, ధర్మ । సుతవిజయులఁ దనవితతబాహు

యమళంబు నెక్కించి, యముల నుత్సంగంబు । లెక్కించుకొని భీముఁ డక్కజముగ

నరిగెడు రయమునఁ దరులు సాల్పడి మ్రొగ్గ । బదఘట్టనంబులఁ జదిసి ఱాలు

ఆ. నుఱుము గాఁగ నిట్లు నెఱయంగ సత్త్వంబు । మెఱసి రాతి రెల్ల నుఱక పవన

తనయుఁ డరిగెఁ బవలు సనినట్లు చీఁకటి । యనక ముండ్లు గండ్లు ననక తెరలి. **161**

ప్రతిపదార్థం: కడు, నిద్రన్= ఎక్కువ నిద్రచేత; కానక= చూడలేక; తొడరుచున్= తొట్రుపడుతూ; వడిగొని= వేగాన్ని పొంది; నడవంగనేరక= నడవలేక; తడయుచు+ఉన్నన్= ఆలస్యంచేస్తున్న; ఎఱిఁగి= తెలిసికొని; భీముఁడు; చెర+చెరన్= వేగమే; తల్లిన్; అఱకటన్= మూపుమీద; ఇడి= ఉంచి; ధర్మసుత, విజయులన్= ధర్మరాజును, అర్జునుణ్ణి; తన, వితత, బాహు, యమళంబున్= తనయొక్క విశాలమైన బాహువుల (భుజాల) యొక్కజంటపై; ఎక్కించి; యములన్; కవలను - నకుల సహదేవులను; ఉత్సంగంబులు= ఒడులు - తొడలపైభాగాలపై; ఎక్కించుకొని; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; అరిగెడు= వెళ్ళునట్టి; రయంబుననన్= వేగంచేత; తరులు= చెట్లు; సాలు+పడి= వరుసగా; మ్రొగ్గన్= పడగా; పద, ఘట్టనంబులన్= పాదాల తొక్కిళ్ళచేత; చదిసి= నలిగి; ఱాలు= రాళ్ళు; నుఱుము= పొడి; కాఁగన్= కాగా; ఇట్లు= ఈ విధంగా; సత్త్వంబు= బలం; నెఱయంగన్= నిండుగ; మెఱసి= చూపి; రాతిరి+ఎల్లన్= రాత్రినికూడ; ఉఱక= లెక్కచేయక; చీఁకటి;అనక= అనకుండా; ముండ్లు, గండ్లున్= ముళ్ళు, పగుళ్ళు; అనక= అని అనకుండ; తెరలి= కదిలి; పవలు= పగటిపూట; చనినట్లు= పోయినట్లు; పవన, తనయుండు= వాయుదేవునియొక్కకుమారుడైన భీముడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మిక్కుటమైన నిద్రతో తొట్రుపడుతూ వడివడిగా నడవలేని తల్లిని మూపుమీద, ధర్మజార్జునులను భుజాలమీద, నకులసహదేవులను ఒడులలో ఎత్తుకొని, భీముడు తన గమనవేగంవలన వృక్షాలు వరుసగా పడేటట్లు; పాదాల త్రొక్కిళ్ళచేత నలిగి రాళ్ళు పొడి అయ్యేటట్లు తన బలం చూపి, రాత్రిని కూడలెక్కచేయకుండా, చీకటని అనుకోకుండా, ముండ్లు, పగుళ్ళు అని కూడచూడకుండా, పగటిపూట నడిచినట్లు నడిచి వెళ్ళాడు.

విశేషం: 'గండ్లు' అనేదానికి 'గుండ్లు' అనే పాఠాంతరం ఉంది. గుండ్లు అంటే రాళ్ళు.

వ. ఇట వారణావతంబున. **162**

తాత్పర్యం: ఇక ఇక్కడ వారణావతనగరంలో.

చ. అనుపమనిత్యసత్యరతు లై వినయాన్వితు లైన పాండునం

దనులకు ధర్మమూర్తులకు ధర్ము వెఱుంగక యిట్టు లెగ్గు సే

సిన ధృతరాష్ట్రజాధము నశేషసుహృత్సుతబంధుదాహసూ

చనమయి లక్కయి ల్లతికృశానుశిఖాహతిఁ గ్రాఁగె గ్రక్కునన్. **163**

ప్రతిపదార్థం: అనుపమ, నిత్య, సత్య, రతులు+ఐ= సాటిలేని నిత్యమైన సత్యంపై ఆసక్తిగలవారై; వినయ+అన్వితులు+ఐన= అణకువతో కూడినవారైన; పాండు, నందనులకు= పాండురాజుయొక్క కుమారులకు - పాండవులకు; ధర్మమూర్తులకు= ధర్మంయొక్క ఆకారమైనవారికి; ధర్మువు+ఎఱుంగక= ధర్మాన్ని తెలియక; ఇట్టులు= ఈ విధంగా; ఎగ్గు= కీడు; చేసిన; ధృతరాష్ట్రజ+అధమున్= ధృతరాష్ట్రునికుమారుడైన నీచుడిని; అశేష; సుహృత్+సుత, బంధు, దాహ, సూచనము+అయి=

మొత్తంమిత్రులయొక్క, కొడుకులయొక్క, బంధువులయొక్క కాలటాన్ని సూచించేటిదై; లక్కఇల్లు; అతి, కృశాను, శిఖాహతిన్= అధికమైన అగ్నిజ్వాలలయొక్క దెబ్బచేత; గ్రక్కునన్= వెంటనే; క్రాఁగెన్= కాలింది.

తాత్పర్యం: సత్యంమీద ఆసక్తి కలవాళ్ళు; వినయవంతులు, ధర్మస్వరూపులు అయిన పాండునందనులకు, ధర్మం తప్పి ఈ విధంగా కీడుచేసిన నీచ దుర్యోధనుని మిత్రులు, పుత్రులు, బంధువులు కాలటాన్ని సూచించేదై - లక్కయిల్లు అధికమైన అగ్నిజ్వాలలచేత కాలిపోయింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. "అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫల మశ్నుతే" అన్నట్లు ధర్మమార్గవర్తనులైన పాండవులను సజీవదహనం చేయాలనేది దుర్యోధనుని దురాలోచన. కాని అతడు ఈ జీవితకాలంలోనే బంధుమిత్ర సంతతితో నశించిపోవటం తథ్యమని లక్కయింటి మంట ధ్వనింపచేసింది.

వ. తదనంతరంబ ప్రభాతసమయం బగుడును. 164

ప్రతిపదార్థం: తత్+అనంతరంబు+అ= ఆ తర్వాత; ప్రభాత, సమయంబు= తెల్లవారటం; అగుడును= కాగా;

తాత్పర్యం: ఆ తరువాత తెల్లవారగా.

చ. అతిదురితక్రియాభిరతుఁడైన పురోచనుతోన భస్మసా
త్కృత మయి చెడ్డ తద్విపులగేహముఁ దత్క్షణదగ్ధ మైనయా
కృతక విభూతి జాతుష నికేతనమున్ మఱి శస్త్ర వేశ్మమున్
ధృతి సెడి చూడఁగా నరుఁగుదెంచి జనుల్ గడు సంభ్రమంబుతోన్. 165

ప్రతిపదార్థం: అతి, దురిత, క్రియా+అభిరతుఁడు+ఐన= మిక్కిలిపాపకార్యంలో ఆసక్తిగలవాడైన; పురోచనుతోనన్= పురోచనునితో సహా; భస్మ, సాత్కృతము+అయి= బూడిదచేయబడినదై; చెడ్డ= చెడినట్టి; తత్+విపుల, గేహమున్= ఆ విశాల మైన ఇంటిని; తత్; క్షణ, దగ్ధము+ఐన= ఆక్షణాననే కాలిపోయిందైన; ఆ కృతక, విభూతి, జాతుష, నికేతనమున్= ఆ యొక్క కృత్రిమ మైన వైభవంగలదైన లక్కయింటిని; మఱి= మరియు; శస్త్ర, వేశ్మమున్= ఆయుధాలయొక్క ఇంటిని, ధృతి+చెడి= సంతోషాన్ని కోల్పోయి; జనుల్= ప్రజలు; చూడఁగాన్= చూడటానికి; అరుగుదెంచి= వచ్చి; కడు, సంభ్రమంబుతోన్= మిక్కిలివేగిరపాటుతో.

తాత్పర్యం: పాపపుపనులు చేయటంలో ఆసక్తి కల ఆ పురోచనునితోసహా బూడిద అయిన ఆ కృత్రిమ శోభగల లక్కయింటినీ, ఆయుధగారాన్నీ సంతోషం కోల్పోయి చూడటానికి జనులు, మిక్కిలి వేగిరపాటుతో వచ్చి.

మధ్యాక్కర.

ప్రో వైన భస్మంబు వాయఁ ద్రోచి య బ్బూదిలో నడఁగి
యేవురు గొడుకులతోడ నం దొక్క యింతి యత్యుగ్ర
పావకదగ్ధ యై యున్నఁ జూచి, యప్పౌరులు దాని
భావించి కుంతియు సుతులు నని శోకపరవశు లగుచు. 166

ప్రతిపదార్థం: ప్రోవు+ఐన= కుప్పగా పడ్డ; భస్మంబు= బూడిదను; పాయన్+త్రోచి= తొలగేటట్లుగా త్రోసి; ఆ+బూదిలోన్= ఆ బూడిదలో; అడఁగి=అణగి; ఏవురు, కొడుకులతోడన్= ఐదుగురు కొడుకులతో కూడ; అందు+÷ఒక్క; ఇంతి= ఆడది; అతి+ఉగ్ర, పావక, దగ్ధ+ఐ= మిక్కిలి భయంకరమైన అగ్నిచేత కాల్చబడిందై; ఉన్నన్= ఉండగా; చూచి, ఆ+పౌరులు; దానిన్= ఆ స్త్రీని; కుంతియున్, సుతులన్+అని= కుంతీదేవియు, కుమారులనియు - అంటే పాండవులని; భావించి= తలంచి; శోక, పరవశులు= దుఃఖంతో మైమరచినవారు - అనగా అమితదుఃఖం పొందినవారు; అగుచున్= అవుతూ.

తాత్పర్యం: కుప్పగా ఉండే బూడిదను తొలగద్రోసి అందులో అయిదుగురు కొడుకులతోసహా కాలిపడి ఉండే స్త్రీని చూచి - వాళ్ళే కుంతీ, పాండవులని భావించి, పౌరులు పెద్దదుఃఖంతో.

విశేషం: మధ్యాక్కరచరణంలో క్రమంగా 2 ఇంద్ర - 1 సూర్య - 2 ఇంద్ర - 1 సూర్యగణాలుంటాయి. నన్నయ అయిదవగణం మొదటి అక్షరంతో యతిమైత్రి చేశాడు. ప్రాస ఉన్నది. కోపం, పశ్చాత్తాపం, దుఃఖం, ప్రబోధం, ప్రార్థనం, అధిక్షేపం, విస్మయం, నింద,స్తుతి, ఉత్సాహం మొదలైన భావాలను వర్ణించేటప్పుడు ఈ వృత్తం సాధారణంగా ప్రయోగింపబడుతుంది. ఇక్కడ దుఃఖభావ వ్యంజకంగా మధ్యాక్కరను నన్నయ రచించాడు. (సంపా.)

మ. 'బలవంతుల్ భరతాన్వయస్థితికరుల్ భాస్వద్భుజావీర్యని
ర్దళితారాతులు భూరి భూభర మహాధౌరేయకుల్ పాండవే
యులు నిష్కారణ మిట్లు వచ్చి ధృతరాష్ట్రోపాయమాయోత్థిత
జ్వలనజ్వాలలఁ గ్రాఁగిరే' యనుచు సంజాతార్తులై రెంతయున్. 167

ప్రతిపదార్థం: బలవంతుల్; భరత+అన్వయ, స్థితి, కరుల్= భరతవంశానికి నిలుకడను కూర్చేవాళ్ళు; భాస్వత్+భుజా, వీర్య, నిర్దళిత+అరాతులు= ప్రకాశిస్తున్న భుజాలయొక్క బలంచేత చీల్చబడిన శత్రువులు కలవాళ్ళు; భూరి, భూ, భర, మహా, ధౌరేయకుల్= గొప్పదైన భూమియొక్క భారాన్ని గొప్పగా మోసేవాళ్ళు; పాండవేయులు= పాండవులు; నిష్కారణము= కారణంలేకుండానే, ఇట్లు; వచ్చి; ధృతరాష్ట్ర+ఉపాయ, మాయ+ఉత్థిత, జ్వలన, జ్వాలలన్= ధృతరాష్ట్రునియొక్క ఉపాయమైన మోసంచేత పైకిలేచిన నిప్పుమంటలలో; క్రాఁగిరే= కాలిపోయారు కదా; అనుచున్; ఎంతయున్= మిక్కిలి; సంజాత+ఆర్తులు+ఐరి= పుట్టిన దుఃఖం కలవాళ్ళయ్యారు.

తాత్పర్యం: 'బలవంతులు, భరతవంశం నిలిపేవాళ్ళు, భుజబలంచేత శత్రువులను సంహరించినవాళ్ళు, భూభారాన్ని వహించగలవాళ్ళు అయిన పాండవులు - ఏ కారణం లేకుండా - ఈ విధంగా ధృతరాష్ట్రుని కపటోపాయంతో పైకెగిసిన నిప్పుమంటల్లో మాడిపోయారు గదా!' అని మిక్కిలి దుఃఖించారు.

వ. అంత విదుర ప్రేషితుం డయిన ఖనకుండు పౌరులం గలసి భస్మంబు వాయఁ ద్రోచువాఁడపోలె నెవ్వరు నెఱుంగకుండఁ దనచేసిన బిలంబుద్వారంబు గప్పి లక్కయింట నొక్కనిషాదవనిత యేవురుగొడుకులతో దగ్ధ యగుట యెఱింగి గజపురంబునకుం జని తద్వృత్తాంతంబును బాండవుల కుశలగమనంబును విదురునకుం జెప్పె; నిట వారణావతమ్మునవా రెల్ల నిట్టిదారుణంబు దుర్యోధనకారితంబకా నెఱింగి శోకించి, కుంతీ పాండవులపంచత్వంబు ధృతరాష్ట్రునకుం జెప్పి పుచ్చిన. 168

ప్రతిపదార్థం: అంతన్= అనంతరం; విదుర, ప్రేషితుండు+అయిన= విదురునిచేత పంపబడినవాడైన; ఖనకుండు= త్రవ్వేవాడు; పౌరులన్= ఆ నగరప్రజలను; కలసి; భస్మంబు= బూడిదను; పాయన్+త్రోచు, వాడ, పోలెన్= తొలగత్రోసేవానివలె; తన, చేసిన, బిలంబు, ద్వారంబు= తాను చేసిన సొరంగంయొక్క వాకిలిని; కప్పి= మూసివేసి; లక్క, ఇంటన్= లక్క యింటిలో; ఒక్క; నిషాద, వనిత= బోయకాంత; ఏవురు కొడుకులతో= ఐదుగురు కొడుకులతో; దగ్ధ+అగుట= కాలిపోయిం దవటం; ఎఱింగి= తెలిసికొని, గజ, పురంబునకున్= హస్తినాపురానికి; చని= వెళ్ళి; తత్+వృత్తాంతంబును= ఆ విషయాన్ని; పాండవుల, కుశల, గమనంబును= పాండవులయొక్క క్షేమగమనాన్ని; విదురునకున్; చెప్పెన్; ఇట= ఇక్కడ; వారణా వతమ్మునవారు+ఎల్లన్= వారణవతాన ఉన్నవాళ్ళంతా; ఇట్టి, దారుణంబు= ఈ విధమైన ఘోరం; దుర్యోధనకారితంబు+అ+కాన్= దుర్యోధనునియొక్క చేష్టయే; అని, ఎఱింగి= తెలిసికొని; శోకించి= దుఃఖించి; కుంతీ, పాండవుల, పంచత్వంబు= కుంతియొక్క, పాండవులయొక్క మరణం; ధృతరాష్ట్రునకున్; చెప్పి, పుచ్చినన్= చెప్పిపంపగా.

తాత్పర్యం: విదురుడు పంపిన ఆ ఖనకుడు వారణావతనగరప్రజలతో కలిసి బూడిదను ఆవలికి తోసేవాడిలా ప్రవర్తించి, ఇతరు లెవ్వరు చూడకుండ తాను త్రవ్విన సొరంగద్వారాన్ని కప్పివేశాడు. లక్కయింట కాలిపోయింది బోయెత, ఆమెఐదుగురుకొడుకులు అని తెలిసికొని హస్తినాపురానికి వెళ్ళి, ఆ విషయాన్నీ, పాండవులు క్షేమంగా అక్కడనుండి వెళ్ళటాన్నీ విదురునికి చెప్పాడు. వారణావతప్రజలంతా - ఈ ఘోరకృత్యం దుర్యోధనుడు చేసిందే- అని దుఃఖించి కుంతీపాండవుల మరణవార్తను ధృతరాష్ట్రునికి చెప్పి పంపారు.

పాండవులు లక్కయింటఁ జచ్చి రని ధృతరాష్ట్రుండు దుఃఖించుట (సం.1-137-10)

ఉ. బాధిత శత్రు వర్గు లగు పాండుకుమారుల దుఃఖవార్త మ
ర్త్యాధము లైన సౌబలదినాధిపసూనులయొద్ద నప్డు దు
ర్యోధనుఁ డాదిగాఁగ సుతు లున్న సభన్ విని దుఃఖితాత్ముఁ డై
యా ధృతరాష్ట్రుఁ డా వఱచిన ట్లఱచెన్ వివిధప్రలాపుఁ డై. 169

ప్రతిపదార్థం: ఆ ధృతరాష్ట్రుఁడు; మర్త్య+అధములు+ఐన= మానవుల్లో తక్కువవారైన - నీచులైన; సౌబల, దిన+అధిప, సూనుల+ఒద్దన్= శకుని కర్ణుల దగ్గర; దుర్యోధనుఁడు+ఆది, కాఁగన్= దుర్యోధనుడు మొదలుగా; సుతులు= కొడుకులు; ఉన్న సభన్= ఉన్నట్టి సభలో; బాధిత, శత్రు, వర్గులు+అగు= బాధింపబడిన శత్రువుల సమూహం కలవాళ్ళయిన; పాండు, కుమారుల, దుఃఖ, వార్త= పాండవులయొక్క దుఃఖసమాచారం - అంటే పాండవుల మరణవార్త; విని; దుఃఖిత+ ఆత్ముఁడు+ఐ= బాధింపబడిన మనస్సుకలవాడై; వివిధ, ప్రలాపుఁడు+ఐ= అనేకవిధాలైన ఏడ్పటాన్ని కలవాడై; (పాండవులను గూర్చి అనేక విధాలుగా భావిస్తూ ఏడ్చినా డని భావం) ఆవు+అఱచినట్లు; అఱచెన్.

తాత్పర్యం: దుర్యోధనుడు మొదలగు కొడుకులు ఉన్నసభలో నీచులైన శకుని కర్ణుల ఎదుట, పాండవుల మరణవార్త విని, మిక్కలి బాధపడుతూ, అనేకవిధాల వాళ్ళను గూర్చి భావించి, దుఃఖిస్తూ, ధృతరాష్ట్రుడు ఆవు అరచినట్లు అరచాడు.

విశేషం: అలం: ఉపమ. పరమదారుణమైన ఈ సంఘటన వెనుక తన పుత్త్రుని మాయోపాయం ఉందని తెలిసి ఏడ్చినా; తెలియక ఏడ్చినా -నిజంగా ఏడ్చినా, అబద్ధంగా ఏడ్చినా - మొత్తానికి ధృతరాష్ట్రుడు, అందరిముందు అంతపెద్దగా ఏడ్చాడట

- 'ఆ వఱచి న ట్లఱచి' ఏడ్చాడట. సుబలుని తనయుడు సౌబలుడు - శకుని. దినాధిపుడు - పగటికిరాజు - సూర్యుడు. సూర్యసూనుడు - సూర్యుని కుమారుడు- కర్ణుడు. వీళ్లతో దుర్యోధనుణ్ణీ కలిపి మర్త్యాధము లనటం సార్థకం. సహృదయ సంవాదం కలిగించే విశేషణం.

వ. మఱియు గాంధారిం దొట్టి దేవీజనులయాక్రందనధ్వను లంతఃపురంబున నెగసె; భీష్మాదికురువృద్ధులును విప్రులుం బౌరులును శోకాక్రాంతు లయిరి; విదురుండు పాండవులకుశలస్థితి యెఱింగియు నెఱుంగనియ ట్లందఱం గలసి దుఃఖితుండపోలె నుండె; నంత ధృతరాష్ట్రుండు గొడుకులుం దానును బాంధవులును గుంతీపాండవుల కుదకదానంబు సేసి సంస్కారాదిపరలోకక్రియలు గంగాతీరంబునం జేయ సమకట్టించి తగువారి బ్రాహ్మణుల నపారధనంబులతోడం బుచ్చిన. 170

ప్రతిపదార్థం: మఱియున్; గాంధారిన్+తొట్టి= గాంధారి మొదలుగా; దేవీ, జనుల+ఆక్రందన, ధ్వనులు= అంతఃపుర స్త్రీల ఏడుపుశబ్దాలు; అంతఃపురంబునన్; ఎగసెన్= పైకిలేచాయి; భీష్మ+ఆది, కురు, వృద్ధులును= భీష్ముడు మొదలైన కురువంశపు పెద్దలును; విప్రులున్= బ్రాహ్మణులును; పౌరులును= పుర ప్రజలును; శోక+ఆక్రాంతులు= దుఃఖంచేత ఆక్రమింపబడినవాళ్ళు; అయిరి; విదురుండు; పాండవుల, కుశలస్థితి= పాండవులయొక్క క్షేమంగా ఉండే స్థితిని, ఎఱింగియు; ఎఱుంగని+అట్లు; అందఱన్+కలసి= అందరితో కూడి; దుఃఖితుండ పోలెను= దుఃఖించినవానివలె; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అటుపై; ధృత రాష్ట్రుండు; కొడుకులున్; తానును; బాంధవులును = చుట్టాలుకూడా; కుంతీ, పాండవులకున్= కుంతికీ పాండవులకు; ఉదక, దానంబు+చేసి= నీటిని వదలి; సంస్కార+ఆది, పరలోక, క్రియలు= దహనం మొదలైన పరలోకానికి సంబంధించిన అంత్యక్రియలు; గంగా, తీరంబునన్; చేయన్= చేయటానికి; సమకట్టించి= ఏర్పాటు చేయించి; తగువారిన్= తగినట్టివాళ్ళను; బ్రాహ్మణులను; అపార, ధనంబులతోడన్= అంతులేని ధనాలతో, పుచ్చినన్= పంపగా;

తాత్పర్యం: అంతేగాక గాంధారీదేవి మొదలయిన అంతఃపురకాంతల ఏడుపు ధ్వనులు పెల్లుబికాయి. భీష్ముడు మొదలైన కురువంశపు పెద్దలు దుఃఖించారు. విదురుడు, పాండవులు క్షేమంగా ఉన్నారని తెలిసినా అందరితోపాటు తానుకూడ దుఃఖించేవానివలె ఉన్నాడు. ధృతరాష్ట్రుడు, కొడుకులు, తాను, బంధువులు, కుంతీదేవికి, పాండవులకు నీళ్ళు వదలి, పరలోకక్రియలు గంగాతీరాన జరిపించటానికి ఏర్పాట్లు చేయించి, యోగ్యులైన బ్రాహ్మణులకు అంతులేని ధనాలిచ్చి పంపగా.

క. మతిఁ బాండుకుమారుల పం । చత విని దుర్యోధనుండు సంతసపడియెన్;
హితుఁ డయిన పురోచను పం । చత కెంతయు జాతదుఃఖచంచలుఁ డయ్యెన్. 171

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; పాండుకుమారుల, పంచత= పాండవులయొక్కమరణం, విని; మతిన్= మనస్సులో; సంతసపడియెన్= సంతోషించాడు; హితుఁడు+అయిన= మేలు కోరేవాడయిన; పురోచను పంచతకున్= పురోచనునియొక్క మరణానికి; ఎంతయున్= మిక్కిలి; జాత, దుఃఖచంచలుఁడు+అయ్యెన్= పుట్టబడిన దుఃఖంచేత చలించినవాడు అయ్యాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు పాండవుల మరణానికి సంతోషించాడు. తనమేలుకోరేవాడైన పురోచనుని మరణానికి మాత్రం ఎంతో దుఃఖించాడు.

విశేషం: పురోచనుణ్ణి ముందుగా కాల్చటంవల్ల పాండవులు తప్పించుకొన్నారన్నవార్త రహస్యంగా ఉండగలిగింది.

పాండవులు వారణావతమువనుండి దక్షిణదిశగా నడచుట (సం. 1-137-17)

వ. అట పాండవులును భాగీరథి లంఘించి దక్షిణాభిముఖు లయి మారుతమార్తాండమరీచిగోచరంబు గాని గహనంబున నరుగుచు నధికక్షుత్పిపాసాపరవశు లయి నడవనోపకయున్న నెప్పటియట్ల యందఱ నెత్తికొని వాయుతనయుండు వాయువేగంబునఁ జని సాయాహ్నంబున నొక్కవటమహీజాతశీతల శిలాతలంబున నునిచి దాని యగ్రవిటపం బెక్కి నీ రారయుచున్నంత ననతిదూరంబున. 172

ప్రతిపదార్థం: అట, పాండవులును; భాగీరథి, లంఘించి= గంగను దాటి; దక్షిణ+అభిముఖులు+అయి= దక్షిణానికి ఎదురుగా ముఖాలు గలవాళ్ళయి; మారుత, మార్తాండ, మరీచి, గోచరంబు, కాని= గాలికిని; సూర్యునికాంతికిని చొరగాని; గహనంబునన్= అడవిలో; అరుగుచున్= వెళ్ళుతూ; అధిక, క్షుత్+పిపాసా, పరవశులు+అయి= మిక్కిలి ఆకలిదప్పులకు లోనైనవాళ్ళయి, నడవన్+ఓపక= నడవలేక; ఉన్నన్; ఎప్పటి, అట్ల= ఎప్పటిమాదిరిగానే; అందఱన్; ఎత్తికొని; వాయు, తనయుండు= వాయుదేవునియొక్క కుమారుడు-భీముడు; వాయు, వేగంబునన్, చని= వాయువేగంతోపోయి; సాయ+అహ్నంబునన్= సాయంకాలాన; ఒక్క, వట, మహీజాత, శీతల, శిలా తలంబునన్= ఒక మఱ్ఱిచెట్టుయొక్క చల్లని రాతిప్రదేశంలో; ఉనిచి= ఉంచి; దాని= ఆ మఱ్ఱిచెట్టుయొక్క; అగ్ర, విటపంబు= చివరి కొమ్మ; ఎక్కి; నీరు+అరయుచు+ఉన్న+అంతన్= నీటిని వెదకుతుండగా; అనతి, దూరంబునన్= ఎక్కువ కాని దూరాన - అంటే కొద్ది దూరాన.

తాత్పర్యం: పాండవులు గంగానదిని దాటి దక్షిణంవైపు సాగి, గాలి, సూర్యకిరణాలు చొరరాని దట్టమైన అడవిలో నడిచివెళ్ళుతూ, ఎక్కువ ఆకలి దప్పులకు లోనైన వాళ్ళయి నడవలేకపోగా, భీమసేనుడు ఎప్పటివలె తక్కినవాళ్ళను ఎత్తుకొని వాయువేగాన వెళ్ళి, సాయంకాలాన ఒక మఱ్ఱి చెట్టుక్రింద ఉండే చల్లని రాతిప్రదేశాన ఉంచి, ఆ మఱ్ఱిచెట్టు చివరికొమ్మ నెక్కి నీళ్ళకొరకు వెదకుతుండగా కొంతదూరంలో.

మ. ప్రమదాపాదిపయఃప్రపూర్ణ మిది యౌఁ బద్మాకరం బంచుఁ ద
త్కమలామోదసుగంధ మారుతము వీఁకన్ ము న్నెఱింగించినన్
రమణం బిల్చె సరోవరం బనిలజున్ రాజీవరాజీ వస
త్సముదాళివ్రజచక్రవాక బక హంస క్రౌంచ నాదంబులన్. 173

ప్రతిపదార్థం: ప్రమద+ఆపాది, పయః ప్రపూర్ణము= సంతోషాన్ని కలిగించే నీటితో నిండినది; పద్మ+ఆకరంబు= పద్మాలకు స్థానమైనది - కొలను; ఇది+ఔన్= ఇది అగునని; అంచున్= అనుకుంటూ; తత్+కమల+ఆమోద, సుగంధ, మారుతము= ఆ కొలనులోని తామరలయొక్క మంచివాసనతో కూడివీస్తున్న గాలి; వీఁకన్= ఉత్సాహంతో; మున్ను+ఎఱింగించినన్= ముందుగా తెలియజేయగా, రాజీవ, రాజీ, వసత్+సమద+ఆళి, వ్రజ, చక్రవాక, బక, హంస, క్రౌంచ, నాదంబులన్= కమలాలయొక్క సమూహంలో ఉన్నట్టి మదించిన తుమ్మెదల సమూహంయొక్క, చక్రవాకపక్షులయొక్క, కొంగలయొక్క, క్రౌంచపక్షులయొక్క ధ్వనులచేత; సరోవరంబు= కొలను; రమణన్= ప్రీతితో; అనిలజున్= వాయుపుత్రుడైన భీముడిని; పిల్చెన్= పిలిచింది.

తాత్పర్యం: ఆహ్లాదాన్ని కలిగించే నీటితో నిండినదీ, పద్మాలకు నెలవైనదీ అని, తామరపూల మంచివాసనతో కలిసి వీస్తున్నగాలి ముందుగా పరిచయం చేస్తుండగా -కమలాలలో దాగిన మదించిన తుమ్మెదల గుంపులు, చక్రవాకపక్షులు, కొంగలు, క్రౌంచపక్షులు చేసేధ్వనులతో సరోవరం వాయుపుత్త్రుడైన భీముడిని పిలిచింది.

విశేషం: ఈ పద్యరచనలో సమాధి అనే గుణం ఉన్నది. 'రాజీవరాజీవ' అనేచోట యమకం. కథాప్రసన్నతకు భంగం కలిగించే విస్తృతి లేక, అక్షరరమ్యం, మనోహరం అయిన సరోవరమిది. సరోవరం (వనితవలె) భీముడిని ఆహ్వానిస్తున్నదనే వర్ణనం భావికథలో హిడింబ పవనసుతుడిని, తనంతట తాను కొరుకొనే కథార్థాన్ని సూచిస్తున్నది. భావికథార్థ ధ్వనిని ఇందులో నన్నయ నిబంధించాడు. (సంపా.)

వ. ఆ దిక్కున కా క్షణంబ యరిగి య క్కొలను గని యందుఁ గృతావగాహుం డై కడుపునిండ నీళ్ళు ద్రావి యచ్ఛిద్ర కమల పత్త్ర పుటికల నీళ్ళు గొని భీముండు గ్రమ్మఱి వచ్చునంత. 174

ప్రతిపదార్థం: ఆ, దిక్కునకున్; ఆ, క్షణంబు+అ= ఆ నిమిషాన్నే; అరిగి= వెళ్ళి; ఆ+కొలనున్; కని= చూచి; అందున్; కృత+అవగాహుండు+ఐ= చేయబడిన స్నానం గలవాడై; కడుపునిండ; నీళ్ళు; త్రావి; అచ్ఛిద్ర, కమల, పత్త్ర పుటికల= చినగని తామరాకు దొప్పలలో; నీళ్ళు; కొని= తీసికొని; భీముండు; క్రమ్మఱి= మరలి; వచ్చు+అంత= వచ్చేటప్పుడు.

తాత్పర్యం: ఆ వైపు వెంటనే వెళ్ళి ఆ సరోవరాన్ని చూచి, అందులో స్నానం చేసి, కడుపునిండా నీళ్ళుత్రాగి చినగని తామరాకుదొప్పలలో నీళ్ళు నింపుకొని భీముడు తిరిగివచ్చేటప్పుడు.

క. ధరణీ దిశాప్రసారిత । గురుకరనికరంబు లుడిచికొని దీర్ఘనిరం
తరగతి ఖిన్నుఁడపోలెను । హరిదశ్వుఁడు విశ్రమించె నస్తాద్రిదరిన్. 175

ప్రతిపదార్థం: హరిదశ్వుఁడు= సూర్యుడు; దీర్ఘ, నిరంతర గతిన్= నిడుపైన ఎడతెగనినడకచేత; ఖిన్నుఁడపోలెను= అలసిపోయిన వాడా అనేటట్లు; ధరణీ, దిశా, ప్రసారిత, గురు, కర, నికరంబులు= భూమిలోను, దిక్కులలోను చాపబడిన గొప్పకిరణాలయొక్క లేదా చేతులయొక్క సమూహాలు; ఉడిచికొని= అణచుకొని(ముడుచుకొని); అస్త+అద్రి, దరిన్= అస్తమించే పర్వతగుహలో; విశ్రమించెన్= పరుండినాడు.

తాత్పర్యం: సూర్యుడు తనసుదీర్ఘమైన ఎడతెగని నడకచేత అలసిపోయినాడా అన్నట్లు - భూమిమీద దిక్కులలో చాచిన తనకిరణాలనే చేతులను ముడుచుకొని అస్తగిరిగుహలో విశ్రమించాడు.

విశేషం: అలం; ఉత్ప్రేక్ష. హరిదశ్వుడు - పచ్చనికాంతిగల గుఱ్ఱాలు కలవాడు - సూర్యుడు. కరము - అనే శబ్దానికి కిరణం, చేయి అనే రెండు అర్థాలున్నాయి.

ఉ. అంబురుహాప్తుఁ డస్తశిఖరాంతరితుం డగుడున్ సమస్త జీ
వంబులు నెల్లచో నిజ నివాసముఁ బొందునెడం దమిస్రపుం
జంబులపోలె వెల్వడియె శైలవిశాలగుహాలినుండి నా
గంబులయూథముల్ సరసఘాసపరిగ్రహణోత్సుకంబు లై. 176

ప్రతిపదార్థం: అంబురుహ+ఆప్తుఁడు = తామరలకు చుట్టమైన సూర్యుడు; అస్త, శిఖర+అంతరితుండు+అగుడున్= అస్త పర్వతంయొక్క శిఖరంచేత మరుగుపరుపబడినవాడు కాగా; సమస్త జీవంబులున్= అన్ని ప్రాణులు; ఎల్లచోన్= అన్నిచోట్ల; నిజ, నివాసమున్= తమయొక్క నివాసస్థలాలను; పొందు+ఎడన్= పొందునట్టి సమయాన; నాగంబుల, యూథముల్= ఏనుగుల గుంపులు; సరస, ఘాస, పరిగ్రహణ+ఉత్సుకంబులు+ఐ= రుచితో కూడిన గడ్డిని ప్రియమార పుచ్చుకోవాలన్న

ఉత్సాహంగలవై; తమిస్ర, పుంజంబుల, పోలెన్= చీకట్ల గుంపులవలె; శైల, విశాల, గుహా+ఆలినుండి= కొండలలోని గుహల సమూహంనుండి; వెల్వడియెన్= బయటికి వచ్చాయి.

తాత్పర్యం: సూర్యాస్తమయం కాగానే అన్నిప్రాణులు తమ తమనివాసస్థానాలకు పోతుండగా, ఏనుగుల గుంపులు పచ్చిగడ్డిని ప్రియమార భుజించాలన్న ఉత్సాహంతో చీకట్లగుంపులవలె కొండగుహలనుండి వెలుపలికి వచ్చాయి.

విశేషం: అలం: ఉపమ. గుహలు వెలువడుతున్న ఏనుగులగుంపును వర్ణించే ఈ రచనలో ఆరోహావరోహక్రమస్ఫూర్తి కల సమాధి అనే శబ్దగుణం సార్థకంగా పోషింపబడింది. (సంపా.)

భీముఁడు నిద్రితు లైన జననీసోదరులను జూచి చింతిల్లుట (సం. 1-138-14)

వ. భీమసేనుండును దద్వటవృక్షంబుక్రింద నధికపథిశ్రాంతులై పయి పుట్టంబులు పఱచుకొని తమ బాహుదండంబులు దలగడలుగా నిద్రితులయియున్న సహోదరులం దల్లినిం జూచి పరమదుఃఖితుం డై యాత్మగతంబున. 177

ప్రతిపదార్థం: భీమసేనుండును; తత్+వట, వృక్షంబు క్రిందన్= ఆ మఱ్ఱిచెట్టుక్రింద; అధిక, పథిశ్రాంతులు+ఐ= ఎక్కువ దారినడకవలన బడలినవాళ్ళయి; పయి, పుట్టంబులు= పైగుడ్డలు; పఱచుకొని= నేలపై పరచి; తమ, బాహు, దండంబులు= తమ చేతులు; తలగడలుగా= దిండ్లుగా; నిద్రితులు+అయి= నిద్రపోయినవాళ్ళయి; ఉన్న= ఉండే; సహ+ఉదరులన్= తోబుట్టువులను; తల్లినిన్= తల్లిని; చూచి= కాంచి; పరమ+దుఃఖితుండు+ఐ= మిక్కిలిదుఃఖించినవాడై, ఆత్మగతంబునన్= తనమనస్సులో.

తాత్పర్యం: ఎక్కువ దారినడకవలన బడలిక పొందినవాళ్ళయి పై గుడ్డలు పరచుకొని చేతులు దిండ్లుగా పెట్టుకొని ఆ మఱ్ఱిచెట్టు క్రింద నిద్రించేసోదరులను, తల్లిని చూచి భీమసేనుడు మిక్కిలి దుఃఖించి తన మనస్సులో.

క. త్రిభువనసామ్రాజ్యశ్రీ । ప్రభుఁ డగు ధర్మాత్మజుండు ప్రాకృతజనున
ట్లభిరూక్షతలంబున ని । ట్లభిభూతుం డగునె నిద్ర నతిఖిన్నుం డై. 178

ప్రతిపదార్థం: త్రిభువ, సామ్రాజ్యశ్రీ, ప్రభుఁడు+అగు= ముల్లోకాలసామ్రాజ్యలక్ష్మికి ప్రభువైన; ధర్మ+ఆత్మజుండు= ధర్మరాజు; ప్రాకృతజనున్+అట్లు= సామాన్యమానవునివలె; ఇట్లు; అభిరూక్షతలంబునన్= మిక్కిలికఠినమైన ప్రదేశాన; అతి, ఖిన్నుండు+ఐ= మిక్కిలి దుఃఖం పొందినవాడై; నిద్రన్= నిద్రలో; అభిభూతుండు+అగునె= త్రోసిపుచ్చబడినవాడయ్యాడుగదా.

తాత్పర్యం: ముల్లోకాలకు ప్రభువైన ధర్మరాజు సామాన్య మానవునివలె ఈ విధంగా మిగుల దుఃఖం పొంది, కఠినమైన ఈ నేలమీద నిద్రించటమా!

విశేషం: అలం: విషమం.

సీ. కుంతిభోజాధిపుకూఁతురు వసుదేవు । చెలియలు మఱియు విచిత్రవీర్యు
కోడలు కౌరవకులవిభూషణుఁ డైన । పాండుమహాదేవి పరమధర్మ
పరు లైన కొడుకులఁ బడసినయది పుష్ప । సుకుమారతరమూర్తి శుచిపరార్థ్య
శయనతలంబున శయనించియును నిద్ర । వోవనియది దప్పిఁ బొంది కటికి

ఆ. నేల గుండ్లు లొత్త నిద్ర వోయిన యది; । తల్లికంటె నిద్రఁ దగిలి సుతులు
వాలుమృగము లున్న వన మని వగవక । మఱచియుండి; రేమి మాడ్కి యొక్కొ! 179

ప్రతిపదార్థం: కుంతిభోజ+అధిపు, కూతురు= కుంతిభోజుడనే పేరుగల రాజుయొక్కకూతురు; వసుదేవు, చెలియలు; మఱియు; విచిత్రవీర్యు, కోడలు; కౌరవకుల, విభూషణుఁడు+ఐన= కౌరవవంశానికి ఆభరణంవంటివాడైన; పాండు మహాదేవి= పాండురాజుయొక్క పట్టపురాణి; పరమ, ధర్మపరులు+ఐన= మిక్కిలిధర్మాత్ములైన; కొడుకులను; పడసిన+అది= కన్నట్టిది; పుష్ప, పరమ, సుకుమారతర, మూర్తి= పూవుకంటె సుకుమారమైన శరీరం కలది; శుచి, పరార్థ్య, శయన, తలంబునన్= పరిశుద్ధత ముఖ్యమైన పడకమీద; శయనించియును= పడుకొనికూడ; నిద్ర+పోవని+అది= నిద్రపోనిది; దప్పిపొంది= దాహంవేసి; కటికినేలన్= ఆచ్ఛాదనంలేని కఠినమైన గట్టి నేలమీద; గుండ్లులు+ఒత్తన్= రాళ్ళు ఒత్తుకొంటూ ఉండగా; నిద్ర పోయిన+అది= నిద్రపోయింది; తల్లి కంటెన్; నిద్రన్+తగిలి= నిద్రలో చిక్కుకొని; సుతులు= కొడుకులు; వాలు, మృగములు+ఉన్న= క్రూరమృగాలుండే; వనము+అని= అడవి అని; వగవక= విచారింపక; మరచి+ఉండిరి; ఏమి, మాడ్కి+ఒక్కొ= ఏవిధమో కదా!.

తాత్పర్యం: కుంతిభోజునికూతురు, వసుదేవునిచెల్లెలు, విచిత్రవీర్యునికోడలు, పాండురాజుపట్టపురాణి, పరమ ధర్మాత్ములైన కొడుకుల కన్నతల్లి, పూవుకంటె సుకుమారమైన శరీరం కలది, పరిశుభ్రమైన పడకమీద పరుండి కూడ నిద్రపోవనిది - అయిన కుంతీదేవి, అలసిపోయి కటికినేలమీద రాళ్ళొత్తుకొంటున్నా నిద్రపోయింది. తల్లికంటె గాఢంగా నిద్రలో ఉన్న కొడుకులు ఇది క్రూరమృగాలుండే అడవి అనికూడ ఆలోచించకుండా నిద్రపోతున్నారు. ఇదేమి చిత్రమో కదా!

విశేషం: అలం: విషమం.

వ. 'వీరికి నిద్రాభంగంబు సేయనోపఁ; దమకుం దార మేల్కొని నీళ్ళు ద్రావుదురుగాక!' యని యక్కమలపత్త్ర పుటికల నీ ళ్ళిమ్ముగా సంగ్రహించి వెండియుం దనమనంబున. 180

ప్రతిపదార్థం: వీరికిన్; నిద్రా, భంగంబు= నిద్రను చెరచటం; చేయన్+ఓపన్= చేయలేను; తమకున్+తారు+అ= తమకు తామే; మేలుకొని; నీళ్ళు; త్రావుదురు+కాక= తాగుదురులే అనీ; ఆ+కమల, పత్త్ర, పుటికల= ఆ తామరాకుదొప్పల్లో; నీళ్ళు+ఇమ్ముగా= నీళ్ళు తగురీతిగా; సంగ్రహించి= కుదించిఉంచి; వెండియున్= మరల; తన, మనంబున= తనమనస్సులో.

తాత్పర్యం: 'వీళ్ళకు నిద్రాభంగం చేయలేను; వీళ్ళు తమంత తామే మేల్కొని నీళ్ళు తాగుతారులే' అని నీళ్ళను తగు విధంగా తామరాకుదొప్పల్లో భద్రపరచి మళ్ళీ తనమనస్సులో.

క. ఖలుఁ డై ధృతరాష్ట్రుఁడు పు । త్త్రులుఁ దానును గూడి మమ్ము దూరస్థులఁ గా
నిలు వెలువరించి లాక్షా । నిలయంబున నునిచెఁ బాపనిష్ఠితబుద్ధిన్. 181

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుఁడు; ఖలుఁడు+ఐ= దుర్మార్గుడై; పుత్త్రులున్, తానును; కూడి= కలిసి; మమ్మున్; దూరస్థులన్+కాన్= దూరంగా ఉండేవాళ్ళు అగునట్లుగా; ఇలు, వెలువరించి= ఇంటినుండి బయటికి పంపి; పాపనిష్ఠిత, బుద్ధిన్= పాపంలో ఉంచబడిన బుద్ధితో; లాక్షా, నిలయంబునన్= లక్కయింటిలో; ఉనిచెన్= ఉంచాడు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు దుర్మార్గుడై, కొడుకులూ, తానూ కలిసి, మమ్మలను దూరం చేయటానికై ఇంటి నుండి బయటికి పంపి దుర్బుద్ధితో లక్కయింట్లో ఉంచాడు.

క. కులపాంసను లై యహితం । బులు సేయుచునుండుచుట్టములఁ బొందక యి
మ్ముల నుండువాఁడ పుణ్యుఁడు, । వెలయఁగ గ్రామస్థితైకవృక్షమపోలెన్. 182

ప్రతిపదార్థం: కుల, పాంసనులు+ఐ= వంశనాశనం చేసే వాళ్ళయి; అహితంబులు= అపకారాలు; చేయుచున్+ఉండు, చుట్టములన్= చేస్తూ ఉండే చుట్టాలను; పొందక= చేరక; వెలయఁగన్= ఒప్పుగ; గ్రామస్థిత+ఏకవృక్షము+అ పోలెన్= గ్రామంలో ఉండే ఒకే ఒకచెట్టువలె; ఇమ్ములన్= అనుకూలస్థానాల్లో; ఉండు, వాఁడు+అ= ఉండేటివాడే; పుణ్యుఁడు= పుణ్యాత్ముడు.

తాత్పర్యం: వంశనాశనం చేసేవాళ్ళయి, అపకారం చేసే దుర్మార్గులైన చుట్టాల చెంత చేరకుండా - గ్రామంలోని ఒకేఒకవృక్షంలా (అది అందరి ఆదరాన్ని పొంది క్షేమంగా ఉంటుంది) తన కనుకూలమైన స్థానంలో ఉండే వాడే పుణ్యాత్ముడు.

విశేషం: అలం: ఉపమ. నన్నయకవితలో రుచిరార్థసూక్తి.

క. పరహితఫలవంతులు సు । స్థిరమూలాన్వితు లపాపధీరతులు పర
స్పరసంశ్రయమున జీవిం । తురు మనుజులు వనములోని ద్రుమములపోలెన్. 183

ప్రతిపదార్థం: పరహిత, ఫలవంతులు= ఇతరుల మేలునే ఫలంగా కలవాళ్ళు (ఇతరుల మేలుకొరకు ఫలాలను కలిగినవి - అని వృక్షపరమైన అర్థం); సుస్థిర, మూల+అన్వితులు= మిక్కిలి స్థిరమైన మూలధనంతోకూడినవాళ్ళు (మిక్కిలి స్థిరమైన వేళ్ళతో కూడినవి - అని వృక్షపరమైన అర్థం); అపాప, ధీ, రతులు= పాపబుద్ధిలో ఆసక్తిలేనివాళ్ళు (పాపబుద్ధిలేనివి - అని వృక్షపరమైన అర్థం); మనుజులు; వనములోని= అడవిలోని; ద్రుమములపోలెన్= వృక్షాలవలె; పరస్పర, సంశ్రయమునన్= ఒండొరుల ఆశ్రయంచేత, జీవింతురు= జీవిస్తారు.

తాత్పర్యం: ఇతరుల మేలు కోరుతూ, సుస్థిరమైన మూలధనం గలిగి, పాపబుద్ధి లేని మానవులు - అడవిలో ఒకదానితో ఒకటి కలిసి పెనగి ఉండే వృక్షాలవలె కలిసిమెలసి జీవిస్తారు.

విశేషం: అలం: శ్లేష, ఉపమ. ఫలశబ్దానికి 'బల' అనే పాఠాంతరం ఉన్నది. అలాగే 'అపాపధీరతులు' అనే దానికి 'అపారధీయుతులు', 'అపారధీమతులు', 'అపారధిక్కృతుల్' అనే పాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.368.

వ. అని ధృతరాష్ట్రబాంధవంబు నిందించుచు నిబిడాంధకారనీరంధ్రంబు లయిన దిశలు సూచి యున్నంత, జన రభసంబు దవ్వుల వీతెంచిన ముందటం బురంబు గలుగవలయు, వీరల మేల్కొనునంతకు నే నిచ్చోట నేమరకుండవలయు నని. 184

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; ధృతరాష్ట్ర, బాంధవంబు= ధృతరాష్ట్రునియొక్క బంధుత్వాన్ని; నిందించున్, నిబిడ+అంధకార, నీరంధ్రంబులు+అయిన= దట్టమైన చీకటిచేత నిండి సందులేనివైన; దిశలు; చూచి; ఉన్న+అంతన్= ఉన్నతర్వాత; జన, రభసంబు= జనులసందడి; దవ్వుల, వీతెంచినన్= దూరంనుండి వినరాగా; ముందటన్, పురంబు= నగరం;

కలుగవలయున్= ఉండాలి; వీరలు= వీళ్ళు; మేలుకొనునంతకున్= మేలుకొనేవరకు; ఏన్= నేను; ఈ+చోటన్; ఏమరక+ఉండవలయున్= పరాకు లేక ఉండాలి; అని.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రునితో ఉన్న బంధుత్వాన్ని నిందిస్తూ పూర్తిగా చీకటిపడిన తర్వాత దూరంనుండి జనుల సందడి వినిపించగా, ముందువైపు పట్టణ మొకటి ఉన్నదని తెలిసికొని, అయినా తల్లీ, సోదరులూ మేల్కొనేవరకూ జాగ్రత్తగా ఉండాలి అని.

క. ఆ కాననాంతరంబునఁ । బ్రాకటభుజవిక్రముండు పాండవవజ్ర
ప్రాకారుఁడు జాగరమున । శోకమనస్కుఁ డయి పవనసూనుం డుండెన్. 185

ప్రతిపదార్థం: ఆ, కానన+అంతరంబునన్= ఆ అడవినడుమ; ప్రాకట, భుజ, విక్రముండు= ప్రసిద్ధమైన భుజపరాక్రమం కలవాడు; పాండవ, వజ్ర, ప్రాకారుఁడు= పాండవులకు వజ్ర ప్రహరిగోడ అయినవాడు; పవన సూనుఁడు= వాయుదేవునియొక్క కుమారుడు; భీముడు; శోకమనస్కుఁడు+అయి= దుఃఖమొందిన మనస్సు కలవాడయి; జాగరమునన్= మెలకువతో; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: ఆ అడవిమధ్య, ప్రసిద్ధమైన బాహుపరాక్రమం కలవాడు, పాండవులకు వజ్రప్రహరిగోడవంటివాడు అయిన భీముడు దుఃఖంతోకూడిన మనస్సుతో మెలకువగా ఉన్నాడు.

వ. తత్సమీపంబున బాలసాలతరుషండమండపంబుననుండి హిడింబుఁ డను నొక్కరాక్షసుండు వారి దవ్వులం జూచి మైపెంచి రూక్షకేశంబులు విద్రిచి యావులించి నీల్గి 'నీరసవన్యమృగమాంసఖాదనజాతనిర్వేదనపరుండ నయి పెద్దకాలంబునకు మానవమాంసం బాస్వాదింప గంటి' నని తన చెలియలి హిడింబ యనుదానిం బిలిచి యి ట్లనియె. 186

ప్రతిపదార్థం: తత్+సమీపంబునన్= దానికి దగ్గరగా; బాల, సాల, తరు, షండ, మండపంబునన్= లేతవైన మద్దిచెట్టు సమూహమనే మండపంలో; ఉండి; హిడింబుఁడు+అను; ఒక్క, రాక్షసుండు; వారిన్= వాళ్ళను - అంటే పాండవులను, కుంతిని; దవ్వులన్= దూరాన; చూచి; మై+పెంచి= శరీరాన్ని పెద్దదిగా చేసి; రూక్ష, కేశంబులు= కఱుకువెండ్రుకలు; విద్రిచి= విదిల్చి; ఆవులించి; నీల్గి= ఒడలు విరిచికొని; నీరస, వన్య, మృగ, మాంస, ఖాదన, జాత, నిర్వేదన, పరుండును+అయి= రుచిలేని అడవి జంతువుల మాంసాన్ని తినటంచేత కలిగిన రోత ప్రధానంగా కలవాడినై; పెద్ద, కాలంబునకు= చాలాకాలానికి; మానవ, మాంసంబు= మనుష్యులయొక్క మాంసాన్ని; ఆస్వాదింపన్+కంటిని+అని= రుచి చూడగలిగానని; తన, చెలియలిన్= తనయొక్క చెల్లెలిని; హిడింబ= హిడింబ అను పేరుగల, దానిన్= దాన్ని; పిలిచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అడవి మధ్య పాండవులుండే ప్రదేశానికి దగ్గరగా మద్దిచెట్ల నడుమ హిడింబు డనే రాక్షసు డొకడు వాళ్లను చూచి మేను పెంచి, తన కరకు వెంట్రుకలు విదిలించి, ఆవులించి, నీల్గి, రుచిలేని అడవి జంతువుల మాంసం తిని తిని రోత పుట్టిన తనకు చాలా కాలం తర్వాత మానవమాంసం రుచి చూచే అవకాశం కలిగిందని చెల్లెలు హిడింబను పిలిచి ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: స్వభావోక్తి. 'బాల సాల తరు షండ మండపంబున' అనే దానికి బాల రసాల తరు షండ మండిత మంటపంబున - బాల రసాల తరు షండ మండపంబున - ఇత్యాది పాఠాంతరాలు ఉన్నాయి - శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పుట. 369.

ఉ. ఇందుల కిమ్మెయిన్ మనుజు లెన్నఁడు వత్తురె? వత్తురేని యా
నందముఁ బొంది నిర్భయమునన్ శయనింతురె? యిట్లు వంటయిల్
కుందెలు సొచ్చెఁ; వేగ చని కోమలి ! వారలఁ జంపి తెచ్చి నా
కొందగ వండి పెట్టుము రసోత్కట మానవ మాంస ఖండముల్. 187

ప్రతిపదార్థం: కోమలి= సుకుమారమైనదానా!; ఇందులకున్= ఇక్కడికి; ఈ+మెయిన్= ఈ విధంగా; మనుజులు; ఎన్నఁడు= ఎప్పుడైన; వచ్చుదురె= వస్తారా!; వచ్చుదురు+ఏని= ఒకవేళ వచ్చినప్పటికీ; ఆనందమున్; పొంది; నిర్భయమునన్= భయంలేకుండ; శయనించుదురె= పడుకొంటారా!; ఇట్లు= ఈ విధంగా; వంటయిల్= వంట ఇంటిలో; కుందెలు= కుందేలు; చొచ్చెన్= ప్రవేశించింది; వేగన్= వేగంగా; చని= వెళ్ళి; వారలన్= వాళ్ళను; చంపి, రస+ఉత్కట, మానవ, మాంస, ఖండముల్= రుచిలో అధికమైన మానవులయొక్క మాంసపుముక్కలను; నాకు+ఒందగన్= నాకు ఒప్పేటట్లు; వండి; పెట్టుము.

తాత్పర్యం: 'ఇక్కడికి ఈ విధంగా మానవులు ఎప్పుడైనా వస్తారా! ఒకవేళ వస్తే సంతోషంగా, నిర్భయంగా ఇట్లా నిద్రిస్తారా! కుందేలు వంటింట్లోకి వచ్చింది. వెంటనే వెళ్ళి వాళ్ళని చంపి మిక్కిలి రుచి గల మానవమాంసఖండాలు చక్కగా నాకు వండిపెట్టు' మని హిడింబుడు చెల్లెలితో చెప్పాడు.

విశేషం: వంటయిల్ కుందెలు సొచ్చె - జాతీయం - అవసరమైనది తానై స్వాధీనమయిం దనటం. నన్నయగారి పాత్రోచిత సంభాషణరచనకు ఈ పద్యం చక్కని ఉదాహరణ.

హిడింబ భీమసేనునిం జూచి మోహించుట (సం. 1-139-1)

వ. అని పంచిన నదియును నతి త్వరితగతిం జని, ముందఱ వారల డాయ శంకించి, యొక్క వృక్షంబు మఱువునం గొండొక ప్రొ ద్దుండె. 188

ప్రతిపదార్థం: అని; పంచినన్= ఆజ్ఞాపించగా; అదియును= ఆ హిడింబకూడ; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగంగా; చని= వెళ్ళి; ముందఱ= ముందు; వారలకున్= వాళ్ళను; డాయన్= సమీపించటానికి; శంకించి= వెనుకాడి; ఒక్క; వృక్షంబు, మఱువునన్= చెట్టుయొక్క చాటున; కొండు+ఒక, ప్రొద్దు+ఉండె= కొంతసేపు ఉండె;

తాత్పర్యం: అని హిడింబుడు ఆజ్ఞాపించగా హిడింబ మిక్కిలి త్వరగా వెళ్ళి ముందు వాళ్ళను సమీపించటానికి జంకి ఒక చెట్టుచాటున కొంతసేపు ఉండె.

మ. వనజాతాయతనేత్రు నున్నతబృహద్వక్షఃస్థలున్ సింహసం
హననుం బాండవసింహమున్ హృదయజన్మాకారు నుద్యన్మహో
శనికల్పస్థిరబాహుఁ జూచుచు మనోజాతాగ్నిసంజాతవే
దన యై రాక్షసి కామరూపధర మర్త్యస్త్రీస్వరూపంబుతోన్. 189

ప్రతిపదార్థం: వనజాత+ఆయత, నేత్రున్= పద్మాలవలె విశాలమైన నేత్రాలు కలవానిని; ఉన్నత, బృహత్, వక్షస్+స్థలున్= ఎత్తైన విశాలమైన రొమ్ము గలవానిని; సింహసంహననున్= సింహంవంటి చక్కనినడుము కలవాడిని; హృదయ, జన్మ+ఆకారున్=

మనస్సునుండి పుట్టినవాడైన మన్మథునిఆకారంవంటి ఆకారం కలవాడిని; ఉద్యత్+మహత్+అశని, కల్ప, స్థిరబాహున్= ప్రకాశించేగొప్పవజ్రాయుధంతో సమానమైన దృఢమైన చేతులుగలవాడిని; పాండవ, సింహమున్= పాండవులలో శ్రేష్ఠుడిని-భీముణ్ణి; చూచుచున్= చూస్తూ; రాక్షసి= హిడింబ; మనో, జాత+అగ్ని, సంజాత, వేదన, ఐ= మన్మథాగ్నివలన పుట్టిన బాధ కలదై; కామ, రూప, ధర= ఇచ్ఛ వచ్చిన రూపాన్ని ధరించేది - రాక్షసి హిడింబ; మర్త్య స్త్రీ, స్వరూపంబుతోన్= మానవకాంతరూపంతో;

తాత్పర్యం: పద్మాలవలె విశాలమైన నేత్రాలు; ఎత్తైన విశాలమైన వక్షస్థలం, సింహంవంటి సన్నని నడుంతోకూడిన చక్కని శరీరం, మన్మథునివంటి అందం, వజ్రాయుధంవంటి దృఢమైన బాహువులు కల భీమసేనుడిని హిడింబ చూచి, మోహించి, కామరూపం ధరించి, మానవకాంతరూపంతో.

విశేషం: అలం: ఉపమ. ఈఘట్టంలో ఆకర్షించిన భీమసేనుని రూపవర్ణనకు మత్తేభవృత్తం, ఉదాత్తరమణీయశైలి ఎంతో ఉచితంగా ఉన్నాయి. మాధుర్యంతో, ఓజస్సుతో కూడిన ఈ రచన హిడింబకు, మనోహరుడు, మహావీరుడయిన భీమునికి తగినట్లున్నది.

క. వితత బహురత్నరుచిశో । భితభూషణములు వెలుంగ, బెడఁగగు నవపు
ష్పితజంగమలతక్రియ ను । న్నతకుచ సనుదెంచెఁ బవననందను డాయన్. 190

ప్రతిపదార్థం: ఉన్నత కుచ= ఎత్తైన రొమ్ములు కలది - హిడింబ; వితత, బహు, రత్న, రుచి, శోభిత, భూషణములు= గొప్పవై అనేకాలైన రత్నకాంతులచేత ప్రకాశిస్తున్న సొమ్ములు; వెలుంగన్= ప్రకాశించగా; నవ, పుష్పిత, జంగమ, లత, క్రియన్= క్రొత్తగా పుష్పించిన నడతీగవలె; పవన, నందనున్= వాయుపుత్రుడైన భీమసేనుడిని; డాయన్= సమీపించటానికి; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: హిడింబ రత్నకాంతులతో శోభిల్లే సొమ్ములు ధరించి, క్రొత్తగా పుష్పించిన నడతీగవలె భీమసేనుని దగ్గరకు వచ్చింది.

విశేషం: అలం: ఉపమ. ఉన్నత బృహద్వక్షస్సులుడైన భీమసేనునికి దీటైన నాయిక ఉన్నతకుచ అయిన హిడింబ అని చమత్కారం. పూలు విరగబూసిన జంగమ లత పవనతనయుడిని సమీపించిందనటంలో భావుకమైన సౌందర్యం ఉన్నది. పూలతీవెయొక్క యౌవనసౌగంధ్యాన్ని గాలి వహిస్తాడని వస్తుధ్వని.

క. రమణి నిజభ్రాతృనియో । గముఁ దలఁపక యపుడు భీముఁ గదిసెఁ; బతిస్నే
హము కామినులకు బలవం । తము; పెఱనెయ్యములు వేయుఁ దత్సదృశములే? 191

ప్రతిపదార్థం: రమణి= ఆ కాంత; నిజ, భ్రాతృ, నియోగమున్= తన అన్నయొక్క ఆజ్ఞను; తలపక= ఆలోచించక- మరచి; అపుడు; భీమున్; కదిసెన్= చేరుకొన్నది; కామినులకున్= కాంతలకు; పతిస్నేహము+అ= భర్తమీదిప్రేమే; బలవంతము= బలమైనది; పెఱ, నెయ్యములు= తక్కిన ప్రేమలు; వేయున్= వెయ్యి అయినా, తత్+సదృశములే= దానితో సమానాలా?

తాత్పర్యం: హిడింబ తనఅన్న ఆజ్ఞను మరచి భీముడిని కూడుకొన్నది. కాంతలకు భర్తమీది స్నేహమే బలమైనది. తక్కిన స్నేహాలు వెయ్యి అయినా దానితో సమానాలు కావు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. ఇట్లు మన్మథవ్యథాశిథిలితమానమానస యయి తనయొద్దకు వచ్చుదానిం బవమానసూనుం డవమాన పూర్వకంబున 'నీ వెందులదాన? వింతప్రొ ద్దిందుల కేల వచ్చి? తెటవోయెదె? దెడ గలిగి పొ' మ్మనిన విని హిడింబ యి ట్లనియె. 192

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; మన్మథ, వ్యధా, శిథిలిత, మాన, మానస+అయి= మన్మథబాధచే పోగొట్టబడ్డ అభిమానంగల మనస్సుగలదై; తన, ఒద్దకున్= తనదగ్గరికి; వచ్చు, దానినన్= వస్తున్న హిడింబను; పవమాన, సూనుండు= వాయుదేవునియొక్క కుమారుడు; అవమాన, పూర్వకంబునన్= అవమానం ముందు కలిగేట్లుగా; నీవు; ఎందుల, దానవు= ఎక్కడి దానివి; ఇంత, ప్రొద్దు= ఇంత, పొద్దు పోయినతర్వాత - అంటే ఇంతరాత్రివేళ; ఇందులకున్= ఇక్కడికి; ఏల, వచ్చితి= ఎందుకు వచ్చావు; ఎట+పోయెదు= ఎక్కడికి పోతున్నావు; ఎడ, కలిగి= దూరంగా; పొమ్ము+అనినన్= పో అనగా; విని; హిడింబ = హిడింబ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మన్మథబాధచేత అభిమానాన్ని కోల్పోయి తన దగ్గరకు వచ్చే హిడింబను చూచి భీముడు అవమాన పూర్వకంగా 'నీవు ఎక్కడిదానవు; ఇంతరాత్రివేళ ఇక్కడికి ఎందుకు వచ్చావు; దూరంగా తొలగిపో' అని అనగా హిడింబ అతనితో ఇట్లా అన్నది.

క. జననుత ! యేను హిడింబుం। డను రక్కసుచెలియలం బ్రియంబున నినుఁ జూ
చినయప్పటఁగోలెను గడు । మనోభవనిపీడ్యమానమానస నయితిన్. 193

ప్రతిపదార్థం: జన, నుత= ప్రజలచేత కొనియాడబడేవాడా!; ఏను= నేను; హిడింబుండు+అను; రక్కసు, చెలియలన్= రాక్షసునియొక్క చెల్లెలిని; ప్రియంబునన్= ప్రేమతో; నినున్= నిన్ను; చూచిన+అప్పటన్, కోలెన్= చూచినప్పటినుండి; కడు= మిక్కిలి; మనోభవ, నిపీడ్యమాన, మానసను+అయితిన్= మన్మథునిచేత ఎక్కువగా బాధింపబడే మనస్సు గల దానిని అయ్యాను.

తాత్పర్యం: జనులచేత కొనియాడబడేవాడా! నేను హిడింబుడనే రాక్షసుడికి చెల్లెలిని. నిన్ను చూచింది మొదలు మన్మథబాధకు గురిఅయ్యాను.

క. నాకుఁ బతి వయిన నిన్నుం । జేకొని మాయన్న యెగ్గుసేయక కాచున్;
నాకు మఱి నీవ పతివి గు । ణాకర యి జ్జన్మమున మహాస్నేహమునన్. 194

ప్రతిపదార్థం: నాకున్; పతివి= భర్తవు; అయినన్= అయితే; మా+అన్న; నిన్నున్+చేకొని= తీసికొని - అంటే నిన్ను తనవానినిగా భావించి; ఎగ్గు+చేయక= కీడుచేయక; కాచున్= రక్షిస్తాడు; గుణ+ఆకర= మంచిగుణాలకు స్థానమైనవాడా! ఈ+జన్మమునన్; మన, స్నేహమునన్= మిక్కిలి ప్రేమచేత; నీవు+అ= నీవే; నాకున్; మఱి; పతివి= భర్తవు.

తాత్పర్యం: నీవు నాకు భర్త వైతే మా అన్న నిన్ను తన వాడినిగా స్వీకరిస్తాడు. కీడుచేయకుండా నిన్ను కాపాడుతాడు. అమితప్రేమచేత ఈ జన్మలో నువ్వే నాకు భర్తవు.

విశేషం: హిడింబ జన్మచే రాక్షసవనిత. కాని, ఉత్తమ మానవలక్షణాలతో కూడుకొన్న పతివ్రత. హాస్యానికై అబద్ధం పలకదు. ఆమె భీముడిని చూచింది. మన్మథభావానికి గురిఅయింది. అయినా, ఆమె భీముడిని కామంతో చంచలదృష్టితో చూడలేదు. అతడే ఆమెకు జన్మంతా భర్తగా ఉండాలని భావించింది. అతనికొరకు తన అన్నను వదలివేయటానికికూడా వెనుకాడలేదు. జనానంతర సౌహృదాల జాగృతివలన భీముడిని భర్తగా కోరిన ఉత్తమఇల్లాలు హిడింబ. పాండవులకు ప్రథమ సంతతిని ప్రసాదించబోయే ఆ పాత్రను నన్నయ ఉదాత్తంగా పోషించాడు.

చ. ఉఱడు సురేంద్రు నైన బలియుండు హిడింబుఁడు వానిబారికిన్
వెఱవనివారలుం గలరె? వీరలు ముంద రెఱుంగ రక్కటా!
యెఱిఁగిరయేని యిట్లు దమయిండులనుండిన యట్లు మెచ్చ కే
మఱి శయనింతురే; కడుఁ బ్రమాదము సేసిరి బుద్ధిహీను లై. **195**

ప్రతిపదార్థం: బలియుండు= బలవంతుడైనవాడు; హిడింబుఁడు; సుర+ఇంద్రున్+ఐన= దేవేంద్రుడి నైనా; ఉఱడు= లెక్కపెట్టడు; వాని, బారికిన్= వాని హింసకు; వెఱువని, వారలున్= భయపడనివారు; కలరె= ఉన్నారా!; వీరలు= వీరు; అక్కటా= అయ్యో!; ముందర+ఎఱుఁగరు= ముందుగా తెలియరు; ఎఱిఁగిర+ఏని= తెలిసికొని ఉంటే; ఇట్లు= ఈ విధంగా; తమ, ఇండులన్= తమయొక్క ఇండ్లల్లో; ఉండిన+అట్లు = ఉన్నవిధంగా; మెచ్చక+ఏ= లెక్కచేయకే; మఱి; శయనించుదురె= పడుకొంటారా; కడు, బుద్ధి, హీనులు+ఐ= చాలాబుద్ధిలేనివారై; కడు= మిక్కలి; ప్రమాదము= పొరపాటు; చేసిరి.

తాత్పర్యం: హిడింబుడు బలవంతుడు. దేవేంద్రుడినికూడా లెక్కపెట్టడు. అతనిదెబ్బకు భయపడనివాళ్ళు లేరు. అయ్యో! వీళ్ళకు ముందుగా తెలియదు. తెలిసి ఉంటే ఈ విధంగా తమ ఇండ్లలో ఉన్నట్టు ఇతడిని లెక్కచేయకుండా ఇట్లా పడుకొంటారా! బుద్ధిహీనులై పెద్దపొరపాటు చేశారు.

విశేషం: 'ఉఱడు సురేంద్రు నైన' అనే దానికి ఉఱుకు సురేంద్రుఁడైన' అనే పాఠాంతరం ఉంది.

వ. 'ఇది హిడింబువనంబు; దీనం జొచ్చి వెలువడుట జముకుత్తుకఁ జొచ్చి వెలువడునట్లు; యాతం డింతకు వచ్చు; వీరితోడి దేమి; నీవు నాకుఁ బతి వై ప్రాణంబు రక్షించుకొని నావలన నిష్టోపభోగంబు లందు; మేనును గామచారిణిని; నీ కిష్టం బైన చోటికి నిన్నుఁ దోడ్కొనిపోవనేర్తు ననిన దానికి భీముం డి ట్లనియె. **196**

ప్రతిపదార్థం: ఇది; హిడింబు, వనంబు= హిడింబునియొక్క అడవి; దీనిన్+చొచ్చి= దీనిలో ప్రవేశించి; వెలువడుట= బయటపడటం; జము, కుత్తుకన్= యముడియొక్క గొంతులో; చొచ్చి= ప్రవేశించి; వెలువడునట్లు+అ= బయటికి వచ్చినట్లే; అతండు= హిడింబుడు; ఇంతకున్= ఇంతలో; వచ్చున్= రానున్నాడు; వీరితోడిది+ఏమి= వీళ్ళతో ఏం పని; నీవు; నాకున్; పతివి+ఐ= భర్తవై; ప్రాణంబు; రక్షించుకొని; నావలనన్; ఇష్ట+ఉపభోగంబులు+అందుము= ఇష్టమైన సుఖాలు అనుభవించుము; ఏనును= నేనుకూడ; కామ, చారిణిన్= ఇచ్చ వచ్చిన చోటికి పోయేదాన్ని; నీకు+ఇష్టంబు+ఐన, చోటికిన్; నిన్నున్+తోడ్కొని= నిన్ను తీసుకొని; పోవనేర్తున్= పోగలను; అనినన్= అనగా; దానికిన్= హిడింబకు; భీముండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఇది హిడింబాసురుడి అడవి. దీంట్లో ప్రవేశించి బయటికి పోవటం యముడి కుత్తుకలో ప్రవేశించి బయటపడటమే. ఇప్పుడే హిడింబుడు రాబోతున్నాడు. తక్కినవాళ్లసంగతి మన కెందుకు? నీవు నాకు భర్తవై ప్రాణాలు రక్షించుకొని నావలన కోరినసుఖాలు అనుభవించుము. నేను కోరినచోటికి పోగలదాన్ని. నీ కిష్టమైన చోటికి నిన్ను తీసికొని పోతాను' అని అనగా హిడింబతో భీముడు ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. విను బేల! యెట్టికష్టుఁడుఁ । దన పురుష గుణంబు సెడఁగఁ దల్లిని దోఁబు
ట్టినవారి విడిచి రాగం । బునఁ జపల స్త్రీ సుఖంబుఁ బొందునె చెపుమా. 197

ప్రతిపదార్థం: విను= వినుము; బేల= అమాయకురాలా; ఎట్టి, కష్టుఁడున్= ఎటువంటి నీచుడైనా; తన, పురుష, గుణంబు+చెడఁగన్= తన పురుష లక్షణం చెడిపోయేటట్లు; తల్లిని; తోన్+పుట్టినవారిన్= సోదరుల్ని; విడిచి; రాగంబునన్= మోహంచేత; చపల, స్త్రీ, సుఖంబున్= నిలుకడలేని స్త్రీవలనిసుఖాన్ని; పొందునె, చెపుమా= పొందుతాడా! చెప్పుము.

తాత్పర్యం: అమాయకురాలా! ఎంతటి నీచపురుషుడైనా తనపురుష లక్షణం పోగొట్టుకొని - తల్లిని, తోబుట్టువులను వదలి మోహంలో పడి చంచలమైన స్త్రీసుఖాన్ని పొందుతాడా! చెప్పుము.

విశేషం: 'బేల!', 'చపల స్త్రీ సుఖంబు' అనే రెండు శబ్దప్రయోగాల శక్తివలన ప్రతీయమానమయ్యే ధ్వని ఈ పద్యంలో ప్రాణం. వనంలో ప్రవేశించి సుఖంగా నిద్రిస్తున్న ధర్మజాదులను బుద్ధిహీనులనుగా భావించే హిడింబ, భీమునికి అమాయకురాలుగా అనిపించింది. మనసులో మెరసిన మదనభావానికి బానిస అయి ఆప్తులను వదలుకొనే లక్షణం చపల స్త్రీలకు సహజం. ఆమె భర్త మీదకూడ చపల ప్రణయమే కలిగిఉంటుందని భీముని వ్యాఖ్య. అందువలన ఇకపై హిడింబ తాను బేల కాదనీ, చపల కాదనీ మాటలతో, చేతలతో నిరూపించుకొని తనగాఢమైన ప్రేమను చాటుకొంది. భీముడు తాను ప్రౌఢుడననీ, బంధుప్రీతి కలవాడననీ చెప్పుకొన్నాడు. హిడింబాభీముల ప్రవృత్తులు విరుద్ధాలని భీముని భావనం. (సంపా.)

వ. అనిన విని హిడింబ వీరి 'నందఱ రక్షించుట నీకుఁ బ్రియం బేని య ప్పురుషాదుండు రాకుండ ముంద వీరి నెత్తుకొని పోయెద; వీరలఁ బ్రబోధింపు' మనిన భీముం డి ట్లనియె. 198

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని; హిడింబ; వీరిన్+అందఱన్= వీళ్ళను అందరినీ; కాపాడుట= రక్షించుట; నీకు; ప్రియంబు+ఏని= ఇష్టమైతే; ఆ+పురుషాదుండు= ఆ మనుష్యులను తినేవాడు - ఆ రాక్షసుడు; రాకుండన్, ముంద= రాక; ముందుగానే; వీరిన్= వీళ్లను; ఎత్తుకొని, పోయెదన్; వీరలన్+ప్రబోధింపుము= వీరిని మేల్కొనుపుము; అనినన్= అనగా; భీముండు+ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వీరి నెత్తుకొని పోయెద' అనిన విని హిడింబ భీమునితో 'వీ ళ్ళందరిని రక్షించటం నీ కిష్ట మైతే నరమాంసభక్షకుడైన ఆ రాక్షసుడు రాకముందే వీళ్ళను మేల్కొలుపుము' అనగా భీముడు ఇట్లా అన్నాడు.

విశేషం: సతికి తోబుట్టువుకోరికకంటె కట్టుకొన్నవాడిఇష్టమే ఎక్కువ అని వ్యంగ్యంగా హిడింబ చెప్పింది.

తే. అధికవీరుండు రక్కసుఁ డరుగుదెంచు । నని మనంబున భయమంది వనజనేత్ర!
వీరిసుఖసుప్తులై యున్నవారి నిద్ర । సెడఁగ బోధింప నోప; నాకడిమి వినుము. 199

ప్రతిపదార్థం: వనజ, నేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా!; అధిక వీరుండు= మేటివీరుడు; రక్కసుఁడు; అరుగుదెంచున్+అని= వస్తాడని; మనంబునన్, భయము+అంది= భీతి చెంది; సుఖ, సుప్తులు+ఐ+ఉన్నవారి= సుఖంగా నిద్రిస్తున్న వాళ్ళయిన వాళ్ళని; వీరిన్= వీళ్ళని; నిద్ర+చెడఁగన్= నిద్ర చెడిపొయ్యేటట్లు; బోధింపన్+ఓపన్= మేల్కొలుపలేను; నా, కడిమి= నా యొక్కబలం; వినుము.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కలదానా! మేటి వీరుడైన ఒక రాక్షసుడు వస్తున్నాడని సుఖంగా నిద్రిస్తున్న వీళ్ళను నిద్ర చెడిపొయ్యేటట్లు మేల్కొలుపలేను. నా బలాన్నిగూర్చి వినుము.

విశేషం: 'కన్యా వరయతే రూపం' అనే న్యాయంతో భీముడిని మనోహరరూపాన్ని చూచి అతడిని వలచింది హిడింబ. పరుల ఆధిక్యాన్ని తన యెదుట కీర్తిస్తే సహించలేని ఆత్మాభిమానం గల మహావీరుడు భీముడు. అయితే అతడు స్వభావంచేత ఉద్ధతుడు. తన పరాక్రమాదులను తానే కీర్తించకొనబోతున్నాడు. అతని మాటలవలన భీమునికి రూపానికి అనువైన పౌరుషంకూడా ఉన్నదని హిడింబకు తెలుస్తుంది. (సంపా.)

ఉ. క్రచ్చఱ నొక్కరక్కసుఁడ కాఁడు సురాసురులెల్ల నొక్కటై
వచ్చిన నీవ చూడఁగ నవార్యబలోన్నతిఁజేసి వారలన్
వ్రచ్చి వధింతుఁగాక; యిటు వచ్చి శ్రమంపడియున్న నిచ్చట
న్మెచ్చగువీరి దైన సుఖనిద్రకు భంగము సేయనేర్తునే. 200

ప్రతిపదార్థం: క్రచ్చు+అఱన్= మాంద్యము - మెల్లదనం - తొలగేటట్లుగా - అంటే వేగంగా; ఒక్క, రక్కసుఁడు+అ, కాఁడు= ఒక్కరాక్షసుడు మాత్రమే కాదు; సుర+అసురులు+ఎల్లన్= దేవతలు, రాక్షసులు అందరు; ఒక్కటి+ఐ= ఏకమై; వచ్చినన్= వచ్చినప్పటికీ; ఈవు+అ= నీవే; చూడగఁన్= చూస్తుండగా; అవార్య, బల+ఉన్నతిన్+చేసి= అడ్డుకొన సాధ్యం కాని బలంయొక్క ఆధిక్యంతో; వారలన్=వాళ్లను; వ్రచ్చి= చీల్చి; వధింతున్+కాక= చంపుతాను కాని; ఇటు, వచ్చి= ఈ విధంగా వచ్చి; శ్రమంపడి= అలసట పొంది; ఉన్నన్=ఉండగా; ఇచ్చటన్= ఇక్కడ; మెచ్చు+అగు= మెచ్చుకోదగిందైన; వీరిది+అగు= వీళ్ల; సుఖ, నిద్రకున్= సుఖమైన నిద్రకు; భంగము= ఆటంకం; చేయనేర్తునే= కలిగిస్తానా!

తాత్పర్యం: వేగంతో ఒక్క రాక్షసుడే కాదు దేవదానవులంతా ఏకమై వచ్చినా, నీవు చూస్తుండగా అపారబలంతో వాళ్ళను చీల్చి చంపుతాను. కాని, ఈ విధంగా వచ్చి అలసటచెంది సుఖంగా నిద్రించే వీళ్ళనిద్రకు భంగం కలిగిస్తానా?

విశేషం: పరపరాక్రమ వర్ణనంవలన ఏర్పడిన సాహంకారక్రోధంతో ఆత్మప్రశంసారూపమైన ప్రతాపోక్తులు పలకటం భీమపాత్రకు సహజం. క్రోధభాద్రమైన ఉత్సాహభావాన్ని దీప్తరసత్వం కల ఉజ్జ్వలవాక్యాలలో వ్యక్తంచేసిన భీముడిమాటలను కాంతిగుణంలో ప్రకాశింపచేయటం నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వ లక్షణం. (సంపా.)

వ. 'పెక్కులు వలుకక యారక్కసురాఁ బనుపు' మని భీమసేనుండు విజృంభించి పలుకుచున్నంత నట హిడింబుండు హిడింబ మసలుటకు మహాక్రోధానలజ్వలితచిత్తుం డయి. 201

ప్రతిపదార్థం: పెక్కులు+పలుకక= ఎక్కువమాటలాడక; ఆ, రక్కసున్, రాన్+పనుపుము= ఆ రాక్షసుడిని వచ్చేట్లు పంపుము; అని= ఆ ప్రకారం; భీమసేనుండు; విజృంభించి; పలుకుచు+ఉన్న+అంతన్= పలుకుతూ ఉండే సమయంలో; అట హిడింబుండు= హిడింబాసురుడు; హిడింబ; మసలుటకు= ఆలస్యం చేయటానికి; మహా+క్రోధ+అనల, జ్వలిత, చిత్తుండు+అయి= మిక్కిలి కోపమనే నిప్పుచేత మండుతున్న మనస్సుకలవాడై.

తాత్పర్యం: 'ఎక్కువగా మాట్లాడక ఆ రాక్షసుడిని ఇక్కడికి పంపు' మని భీమసేనుడు పెచ్చుపెరిగి పలుకుతుండగా - అక్కడ హిడింబుడు, హిడింబ ఆలస్యం చేసినందుకు మిక్కిలి కోపించి.

సీ. కాలమేఘంబునుబోలె విశాల మై । నీల మై దేహంబు గ్రాలుచుండ
ఘనతటిల్లతలయ ట్లెనిమిది దంష్ట్రలు । మెఱవంగఁ బండులుఁ గొఱికి పెలుచ
నతిరోషలోహితాయతవృత్తనేత్రముల్ । దిరుగంగఁ బెట్టుచుఁ బరుషకేశ
జాలంబు గాడ్పునఁ దూలంగఁ గాలోప । మానుఁ డై చనుదెంచి మానుషాదుఁ.

ఆ. దనుజఁ జూచి 'కష్టమనుజులఁ గూడి నా । పనుపు సేయకుండఁ జనునె నీకు?'
ననుచు నుదరిపలుక విని హిడింబయుఁ గడు । వెఱచి భీమసేను మఱువు సొచ్చె. 202

ప్రతిపదార్థం: కాల, మేఘంబును+పోలెన్= నల్లనిమేఘంవలె; విశాలము+ఐ; నీలము+ఐ= నీలిరంగు గల దేహంబు; క్రాలుచున్+ఉండన్= ఒప్పుతూ ఉండగా; ఘన, తటిత్+లతల+అట్లు= మేఘంలోని మెరుపుతీవలవలె; ఎనిమిది, దంష్ట్రలు= ఎనిమిదికోరలు; మెఱవంగన్= ప్రకాశిస్తుండగా; పెలుచన్= గట్టిగా; పండులు= పండ్లు; కొఱికి, అతి, రోష, లోహిత+ఆయత, వృత్త, నేత్రముల్= మిక్కిలికోపంతో ఎఱ్ఱనై, నిడుపులై గుండ్రనివైన కన్నులు; తిరుగంగన్+పెట్టుచున్= తిప్పుతూ; పరుష, కేశ, జాలంబు= బిరుసైన వెండ్రుకల సమూహం; గాడ్పునన్= గాలిచేత; తూలంగన్= కదలగా; కాల+ఉపమానుఁడు+ఐ= యమునితో పోల్చదగినవాడై; చనుదెంచి= వచ్చి; మానుషాదుఁడు= మానవమాంసం తినేవాడు-రాక్షసుడు; అనుజన్= తోబుట్టువును - చెల్లెలిని; చూచి; కష్ట, మనుజులన్+కూడి= నీచులైన మానవులతో కూడి; నా, పనుపు+చేయకుండన్= నాయొక్క ఆజ్ఞను పాటించకుండటం; నీకున్; చనునె= తగునా; అనుచున్= అని అంటూ; ఉదరి= పైకెగసి; పలుకన్= మాటాడగా; విని=ఆలకించి; హిడింబయున్; కడున్= మిక్కిలి; వెఱచి= భయపడి; భీమసేను, మఱువు+చొచ్చెన్= భీమునిచాటుకు వెళ్ళింది.

తాత్పర్యం: నల్లనిమబ్బువంటి పెద్దదేహంతో, మేఘంలోని మెరపు తీగలవంటి ఎనిమిదికోరలతో, గట్టిగా పండ్లుకొరికి; కోపంతో ఎర్రబడి, నిడుపులై, గుండ్రనివైన కళ్ళు తిప్పుతూ, బిరుసువెండ్రుకలు గాలికి కదులుతూ ఉండగా - యముడివంటిరాక్షసుడు హిడింబుడు వచ్చి, చెల్లెలిని చూచి 'నీవు నీచులైన మానవులతో కలిసి నా ఆజ్ఞ త్రోసిపుచ్చటం తగునా?' అని గద్దించి పలుకగా హిడింబ మిక్కిలి భయపడి భీమునిచాటుకు వెళ్ళింది.

విశేషం: అలం: ఉపమ.

భీమసేనహిడింబాసురుల యుద్ధము (సం.1-141-15)

వ. అంత. 203

తాత్పర్యం: అప్పుడు.

ఉ. పన్నగవైరి విక్రముఁడు పాండవ సింహము దానిఁ జూచి 'మీ
యన్నను నన్నుఁ జూడుము భయంపడకుండుమ' యంచు, వాని న
త్యున్నతిఁ దాఁకి 'రాక్షస! వధోచిత! నీ బల గర్వ మేదఁగా
నిన్ను వధించి యివ్వనము నెట్టన చేసెద నిర్భయంబుగన్'. 204

ప్రతిపదార్థం: పన్నగవైరి, విక్రముఁడు= పాములకు శత్రువైన గరుడునివంటి పరాక్రమం కలవాడు; పాండవ, సింహము= పాండవులలో శ్రేష్ఠుడు - భీముడు; దానిన్= ఆ హిడింబను; చూచి, మీ, అన్నను; నన్నున్, చూడుము; భయంపడక+ఉండుము= భయపడకుండా ఉండు; అంచున్= అనుచు; వానిన్= ఆ హిడింబాసురుని; అతి+ఉన్నతిన్= పెద్దఎత్తున; తాఁకి= ఎదుర్కొని; రాక్షస= ఓ రాక్షసుడా!; వధ+ఉచిత= చంపదగినవాడా!; నీ, బల, గర్వము+ఏదఁగాన్= నీ యొక్క బలంయొక్క పొగరు నశించేటట్లుగా; నిన్నున్; వధించి= చంపి; ఈ+వనమునన్= ఈ అడవిని; నెట్టన= తప్పనిసరిగా; నిర్+భయంబుగన్= భయంలేని దానినిగా, చేసెదన్= చేస్తాను.

తాత్పర్యం: గరుత్మంతునివంటి పరాక్రమం కల భీముడు, ఆ హిడింబతో -'మీ అన్నను, నన్ను చూడుము. భయపడకుము' అని పలికి ఆ హిడింబాసురుని పెద్దఎత్తున ఎదుర్కొని 'రాక్షసా! నీవు చంపదగినవాడివి; నీ బలగర్వం నశించేటట్లు నిన్ను చంపి, ఈ అడవిని తప్పక భయం లేని దాన్నిగా చేస్తాను' అన్నాడు.

విశేషం: హిడింబునికి భయపడి భీముని అండజేరింది-హిడింబ. భీముడిబాధ్యత పెరిగింది. తన బలానికీ హిడింబుడి బలానికీ గల భేదాన్ని చూడటానికి ఆమెను అక్కడే నిలవబడుమన్నాడు-భీముడు. 'తొలగిపొమ్ము' నుండి 'భయపడకుండా నిలిచిచూడు' అన్నంతవరకు మాట మారింది. ఆ మార్పుకు అభిమానమే కారణం, కాని భీమునికి ఆమెపట్ల కలిగిన వలపు కాదు. ఏమైనా వైముఖ్యంనుండి సౌముఖ్యంవరకు దిగేటట్లు భీముడిని ఆకట్టుకొనగలిగింది హిడింబ. (సంపా.)

క. 'చక్క నగు' మనిన రక్కసుఁ । డక్కజముగఁ బెరిఁగి 'యియ్యయగు నిప్పడు, నీ
యుక్కును బీరముఁ జూచెదఁ । జిక్కక నిలు' మనుచుఁ గడు విజృంభించి వడిన్. 205

ప్రతిపదార్థం: చక్కనగుము= చక్కగా, నిలువు; అనినన్= అనగా; రక్కసుఁడు; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; పెరిగి= విజృంభించి; ఇయ్య+అగున్= అంగీకారమవుతుంది; ఇప్పుడు; నీ+ఉక్కును= నీయొక్క బలాన్ని; బీరమున్= పరాక్రమాన్ని; చూచెదన్= చూస్తాను; చిక్కక= వెనుదీయక; నిలుము; అనుచున్= అంటూ; కడున్= మిక్కిలి; విజృంభించి= పెచ్చుపెరిగి; వడిన్= వేగంగా.

తాత్పర్యం: 'చక్కగా నిలువు' మనగానే రాక్షసుడు ఆశ్చర్యకరంగా విజృంభించి, సరే, అని 'నీ బల పరాక్రమాలను చూస్తాను గాక! వెనుదీయక నిలబడు' అని పెచ్చుపెరిగి వేగంగా.

క. చే సమరికొంచుఁ బొడువఁగ । డాసినఁ దద్భుజముతోన డగ్గఱఁగ జయో
ద్భాసి యయి పట్టికొనియె మ । హాసత్త్వుఁడు భీమసేనుఁ డమ్మనుజాదున్. 206

ప్రతిపదార్థం: చే, సమరికొంచున్= చేయి చరుచుకొంటూ; పొడువఁగన్= కొట్టడానికి; డాసినన్= సమీపించగా; మహాసత్త్వుఁడు= మిక్కిలి బలం గలవాడు; భీమసేనుఁడు, జయ+ఉత్+భాసి+అయి= విజయంతో మిక్కిలి ప్రకాశించేవాడై; ఆ+మనుజాదున్= ఆ రాక్షసుడిని; తత్+భుజముతోన, డగ్గఱఁగన్= ఆ భుజంతోగూడ దగ్గరగా; పట్టుకొనియెన్.

తాత్పర్యం: చేయి చరచి కొట్టటానికి మీదికి రాగా, మహాబలవంతుడైన భీముడు గెలుపు పొంది వెలిగేవాడై ఆ రాక్షసుణ్ణి వాడిచేతితోసహా దగ్గరగా పట్టుకొన్నాడు.

క. 'నిరుపద్రవసుఖనిద్రా । నిరతాత్మకు లయిన వీరినిద్రకు నస్మ
చ్చరణభుజఘాతశబ్దం । బరుదుగ విఘ్నంబు సేయు' నని వగచి మదిన్. 207

ప్రతిపదార్థం: నిర్+ఉపద్రవ, సుఖ, నిద్రా, నిరత+ఆత్మకులు+అయిన= హానిలేని సుఖమైన నిద్రలో తగిలిన మనస్సు కలవాళ్ళయిన; వీరి+నిద్రకున్; అస్మత్+చరణ, భుజ, ఘాత, శబ్దంబు= మాయొక్కకాళ్ళయొక్క చేతులయొక్క దెబ్బలధ్వని; అరుదుగన్= ఆశ్చర్యంగా; విఘ్నంబు+చేయున్+అని= ఆటంకం కలిగిస్తుందని; మదిన్= మనస్సులో; వగచి= బాధపడి.

తాత్పర్యం: భంగం లేని సుఖనిద్రలో ఉండే వీళ్ళనిద్రకు, తమకాళ్ళచేతుల దెబ్బల ధ్వని ఆటంకం కలిగిస్తుందని మనసులో బాధపడి.

క. వడముడి యారక్కసు న। య్యెడ కష్టధనుఃప్రమాణ మెడ గలుగఁగ నె
వ్వడి నీడ్చె నల్పమృగమును। విడువక గజవైరి యీడ్చువిధమునఁ బెలుచన్. 208

ప్రతిపదార్థం: వడముడి= భీముడు; ఆ రక్కసున్; ఆ+ఎడకున్= ఆ ప్రదేశానికి; అష్ట, ధనుః, ప్రమాణము= ఎనిమిది విండ్లకొలత; ఎడ+కలుగఁగన్= దూరం ఉండేటట్లు; నెఱ+వడిన్= మిక్కిలి వేగంతో; గజవైరి= ఏనుగుల శత్రువైన సింహం; అల్ప, మృగమును= చిన్నజంతువును; విడువక; పెలుచన్= గట్టిగా; ఈడ్చు, విధమునన్; ఈడ్చెన్= ఈడ్చాడు.

తాత్పర్యం: భీము డా రాక్షసుణ్ణి - సింహం చిన్న జంతువును వదలక గట్టిగా ఈడ్చేటట్లు - ఆ ప్రదేశానికి ఎనిమిది ధనుస్సుల కొలత గల దూరానికి మిక్కిలి వేగంగా ఈడ్చాడు.

విశేషం: అలం: ఉపమ. ధనుస్సు= నాల్గుమూరలకొలత. అష్టధనుస్సులు కనుక ముప్పైరెండు మూరల దూరం.

వ. అట్టియెడ. 209

తాత్పర్యం: అటువంటి సమయంలో.

చ. చరణహతిన్ మహాతరులు సాల్పడి జర్జరితంబు లై మహిం
దొరఁగఁగ నిట్టు లొండొరులతోడ మదోద్ధతషష్టిహాయన
ద్విరదములట్లు ఘోరరణవీరులు సేసిరి మల్లయుద్ధ ము
ద్ధురబలు లై సమీరణసుతుండు హిడింబుఁడు తద్వనంబునన్. 210

ప్రతిపదార్థం: ఘోర, రణ, వీరులు= భయంకరమైన యుద్ధవీరులు; సమీరణ, సుతుండు= వాయుదేవునియొక్క కుమారుడు - భీముడు; హిడింబుఁడు; చరణ, హతిన్= కాళ్ళయొక్క త్రొక్కిడిచేత; మహా, తరులు= పెద్దచెట్లు; చాలు+పడి= వరుసగా పడి; జర్జరితంబులు+ఐ= విరిగినవై; మహిన్+తొరఁగఁగన్= భూమిమీద పడగా; ఒండు+ఒరులతోడన్= ఒకరితో నొకరు; ఇట్టుల= ఈ విధంగా; మద+ఉద్ధత, షష్టి, హాయన, ద్విరదముల+అట్లు= మదంచేత గర్వించిన అరవయ్యేండ్ల మదపుటేనుగులవలె; ఉద్ధుర, బలులు+ఐ= ఎక్కువైన బలంగలవాళ్ళయి; తత్+వనంబునన్= ఆ అడవిలో; మల్లయుద్ధము; చేసిరి.

తాత్పర్యం: భయంకర యుద్ధవీరులైన భీమహిడింబులు - తమకాళ్ళతొక్కిడికి వరుసగా పెద్దపెద్ద వృక్షాలు విరిగి నేల కొరిగేటట్లు, అరవయ్యేండ్ల మదపుటేనుగులవలె ఆ అడవిలో ఒకరితో ఒకరు మల్లయుద్ధం చేశారు.

విశేషం: అలం: ఉపమ.

క. భూరిపదఘాతజాత ధ । రారేణుప్రకరధూసరశరీరకు లై
వా రిద్దఱు నొప్పిరి నీ । హారచ్ఛన్నంబు లయిన యద్రులపోలెన్. 211

ప్రతిపదార్థం: భూరి, పద, ఘాత, జాత, ధరా, రేణు, ప్రకర, ధూసర, శరీరకులు+ఐ= గొప్పవైన కాళ్ళయొక్క తొక్కిళ్ళవలన పుట్టిన భూమియొక్క దుమ్ముకణాల సమూహంచేత బూడిదరంగు గల దేహం కలవాళ్ళయి; వారు+ఇద్దఱున్= భీమ హిడింబు లిద్దరు; నీహార, ఛ్చన్నంబులు+అయిన= మంచుచేత కప్పబడ్డవైన, అద్రుల, పోలెన్= పర్వతాలవలె; ఒప్పిరి=ఉండిరి.

తాత్పర్యం: గొప్పవైన కాళ్ళతొక్కిళ్ళచేత పుట్టిన దుమ్ము కప్పి, బూడిదరంగుదేహాలు కలవాళ్ళయి భీమ హిడింబు లిద్దరు మంచుచేత కప్పబడిన కొండలవలె ఉన్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. ఆరాక్షసుండు భీము న । పారభుజాబంధనమున బంధించి మహా
ధీరధ్వని రోదోంతర। పూరిత మగునట్లు గాఁగ బొబ్బిడి యార్చెన్. 212

ప్రతిపదార్థం: ఆ, రాక్షసుండు; భీమున్; అపార, భుజా, బంధమునన్= అంతులేని చేతుల బిగింపుచే; బంధించి= కట్టివేసి; మహాధీర, ధ్వని= గొప్ప ధీరునియొక్క ధ్వని - గొప్ప ధైర్యంతో కూడినశబ్దం; రోదోంతర, పూరితము+అగునట్లు+కాఁగన్= భూమ్యాకాశాల నడుమ నిండింది అయ్యేట్లుగా; బొబ్బ+ఇడి= సింహనాదం చేసి; ఆర్చెన్= అరచాడు.

తాత్పర్యం: ఆ రాక్షసుడు భీముణ్ణి గట్టిగా చేతులతో బంధించి గొప్పధీరునివలె భూమ్యాకాశాల మధ్య భాగమంతా నిండేట్లు పెద్దగా సింహనాదం చేసి అరచాడు.

వ. అమ్మహాధ్వని విని కుంతియుఁ గొడుకులును మేల్కని, తమసమీపంబున నతిమానుషం బయిన రూప సౌందర్యములతో నున్న హిడింబం జూచి, 'యిది వనదేవతయో సురకన్యయో' యనుచు విస్మయంబంది; రంతం గుంతి శాంతవచనంబుల 'నీ వెందులదాన? విట కేల వచ్చి?' తని యడిగిన నది యి ట్లనియె. 213

ప్రతిపదార్థం: ఆ+మహాధ్వని= ఆ పెద్దశబ్దం; విని, కుంతియున్, కొడుకులున్; మేలు+కని= మేల్కాంచి, నిద్ర తెలిసి; తమ, సమీపంబునన్; అతి, మానుషంబు+అయిన= మానవులకు అతిక్రమించిందైన - అంటే, మానవులకు లేనట్టిదైన; రూప, సౌందర్యములతోన్= ఆకారంతో, అందంతో; ఉన్న= ఉండిన; హిడింబన్; చూచి, ఇది; వన, దేవతయో= వనదేవతయో; సుర, కన్యయో= దేవతాకాంతయో; అనుచున్= అని తలస్తూ; విస్మయంబు+అందిరి= ఆశ్చర్యపడ్డారు; అంతన్= తరువాత; కుంతి; శాంత, వచనంబులన్= మెల్లనిమాటలతో; నీవు, ఎందుల, దానవు= నీవు ఎక్కడిదానివి; ఇటకు+ఏల= ఇక్కడికి ఎందు లకు; వచ్చితివి+అని-వచ్చా వని; అడిగినన్= అడుగగా; అది= ఆ హిడింబ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ పెద్దశబ్దం విని కుంతీదేవీ, కొడుకులూ మేల్కొని తమసమీపంలో మానవాతీతమైన రూప సౌందర్యాలతో ఉన్న హిడింబను చూచి, ఇది వనదేవతో లేక దేవకాంతో అని ఆశ్చర్యపడ్డారు. తర్వాత కుంతి మెల్లని మాటలతో 'నీవు ఎక్కడి దానివి? ఇక్కడి కేల వచ్చావు?' అని అడుగగా అమెతో ఆ హిడింబ ఇట్లా చెప్పింది.

సీ. **నీలజీమూతంబులీల నాక్షేపించి । నల్ల నై తోతెంచు నల్లగృహము**
గల హిడింబుం డను బలితంపురక్కసు । చెలియల; నాతండు వెలయ మీకు
రోయక యహితంబు సేయ నన్ బంచినఁ । జనుదెంచి, యేను మీ తనయునందుఁ
బతిబుద్ధిఁ దాల్చి యుద్ధతమన్మథార్త నై । మసలితి; మసలిన నసుర వచ్చి.

తే. **యలిగి, మీతోడ నన్నును గలయఁ బట్టి । మ్రింగ నున్న నయ్యసురతోడం గడంగి**
మల్లయుద్ధంబు సేయుచు నల్లచోట । నున్నవాఁడు మీసుతుఁడు దర్పోన్నతుండు. 214

ప్రతిపదార్థం: నీల, జీమూతంబు, లీలన్= నల్లనిమేఘంయొక్క విలాసాన్ని; ఆక్షేపించి= త్రోసిపుచ్చి, నల్లన+ఐ=నల్లగా; తోతెంచు= కనిపించేటి; అల్ల, గృహము= ఆ యిల్లు; కల= కలిగిన; హిడింబుండు+అను; బలితంపు, రక్కసు, చెలియలన్= బలవంతుడైన రాక్షసునియొక్క చెల్లెలిని; అతండు= ఆ హిడింబుడు; వెలయన్= ప్రకాశించగా; రోయక= విడువక; మీకున్= మీకు అందరికీ; అహితంబు+చేయన్= కీడుచేయటానికి; నన్= నన్ను (హిడింబను); పంచినన్= ఆజ్ఞాపించగా; ఏను= నేను, మీ, తనయునందు= మీ కుమారునిమీద; పతి, బుద్ధిన్= భర్త అనే మనస్సును; తాల్చి= ధరించి; ఉద్ధత, మన్మథ+ఆర్తను+ఐ= మిక్కిలి మన్మథబాధను పొందినదాన్నై; మసలితిన్= ఆలస్యంచేశాను; మసలినన్= ఆలస్యం చేయగా; అసుర= రాక్షసుడు; వచ్చి, అలిగి= కోపించి; మీతోడన్= మీతో; నన్నును= నన్నుకూడా; కలయన్+పట్టి= మిక్కిలి గట్టిగా నిర్బంధించి; మ్రింగన్+ ఉన్నన్= మ్రింగబోతుండగా; ఆ, అసురతోడన్= ఆ రాక్షసునితో; కడంగి= పూనుకొని; మల్లయుద్ధంబు+చేయుచున్; దర్ప+ ఉన్నతుండు= గర్వంలో అధికుడైనవాడు; మీ సుతుఁడు= మీ కుమారుడు; అల్ల, చోటన్= ఆ ప్రదేశాన; ఉన్నవాఁడు= ఉన్నాడు.

తాత్పర్యం: మేఘకాంతిని మించిన నల్లదనంతో కన్పట్టే ఆ యిల్లు గల హిడింబుడనే రాక్షసుడి చెల్లెలిని. అతడు మీకు కీడు చెయ్యుమని నన్ను పంపిస్తే, నేను మీ కుమారుణ్ణి భర్తగా భావించి, మన్మథబాధ పొంది ఆలస్యం చేయటంచేత, అతడు వచ్చి కోపించి మీతో పాటు నన్నుగూడ మ్రింగబోయాడు. అప్పుడు గర్వాధికుడైన మీ కుమారుడు పూనుకొని అతనితో మల్లయుద్ధం చేస్తూ అదిగో అక్కడ ఉన్నాడు.

విశేషం: అన్నిచోట్ల ప్రాసయతి గల సీసం. ప్రసాదగుణంగల రచనలో - ప్రసన్నంగా మాట్లాడిన హిడింబమాటలు రచించటం, ఒక్కగుక్కలో ఎంతోకథను చెప్పుతున్న స్ఫూర్తిని సీసపద్యరచనలో కలిగించటం నన్నయ కథాకథనశిల్పం. హిడింబమాటలు పొల్లులేనివి, సార్థకమైనవి, సాభిప్రాయమైనవి. 'మీ తనయునందు పతిబుద్ధి తాల్చి, ఉద్ధతమన్మథార్తనై మసలితిని' అన్న వాక్యం ఆమె సంభాషణలో ఆయువుపట్టు. అదే కుంతిమనసును ఆకట్టుకొన్న సమ్మోహనాస్త్రం. 'మీ సుతుడు దర్పోన్నతుండు' అనే మాట కోడలు అత్తతో అనదగిన ఆప్యాయపు అభివ్యక్తి. రాబోయే కథను వస్తుధ్వనితో ప్రసన్నంచేశాడు నన్నయ. (సంపా.)

వ. **'నన్నును మిమ్మును రక్షించి యా రక్కసు నుక్కడంగ నశ్రమంబున నిప్పుడు చంపుం జూడుం' డనిన నందఱు లేచి యుద్ధతులై మల్లయుద్ధంబు సేయుచున్న భీమహిడింబులం జూచి; రంత నచ్చోటికిం జని యర్జునుండు భీమసేనున కి ట్లనియె.** 215

ప్రతిపదార్థం: నన్నునున్; మిమ్మునున్; రక్షించి= కాపాడి; ఆ, రక్కసు+ఉక్కు+అడంగన్= ఆ రాక్షసుడిబలం నశించేటట్లు; అశ్రమంబునన్= సులువుగా; ఇప్పుడు= ఈ సమయంలోనే; చంపున్= చంపుతాడు; చూడుండు+అనినన్; అందఱున్, లేచి; ఉద్ధతులు+ఐ= గర్వించినవాళ్ళై, మల్ల, యుద్ధంబు; చేయుచున్+ఉన్న= మల్లయుద్ధం చేస్తూ ఉన్న; భీమ, హిడింబులన్=

భీముడిని, హిడింబుని; చూచిరి; అంతన్= అప్పుడు; అర్జునుండు; ఆ+చోటికిన్ చని= అక్కడకు వెళ్ళి; భీమసేనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నన్నూ మిమ్మల్నీ రక్షించి, ఆ రాక్షసుణ్ణి ఇప్పుడు సులభంగా చంపగలడు చూడండి' అని అనగా- అందరూ లేచి, గర్వించి మల్లయుద్ధం చేసే ఆ భీమహిడింబులను చూచారు. అప్పుడు అర్జునుడు వాళ్ళు యుద్ధం చేసే చోటికి పోయి భీమునితో ఇట్లా అన్నాడు.

విశేషం: 'నన్నూ మిమ్మూ రక్షించి' అనటంలో కలుపుగోలుతనాన్ని, ఆత్మీయతనూ; ' ఆ రాక్షసుడు' అని అన్నను పేర్కొనటంలో పుట్టింటి సంబంధాన్ని త్రెంచుకొని అత్తవారింటిలో కలిసిపోయిన ఆప్యాయతను అద్భుతంగా ప్రదర్శించింది హిడింబ.

ఉ. తూ ర్పరుణంబుగాఁ దొడఁగె దుష్టనిశాచరవేళ యయ్యెడున్
మార్పుము కాలయాపన మమర్పక యప్పిశితాశిఁ బట్టి పా
లార్పఁగ నేల నావుడు బలాఢ్యుఁడు భీముఁడు మల్లవిద్య నే
ర్పేర్పడఁగా హిడింబు బలహీనపరాక్రముఁ జేసెఁ జెచ్చెరన్. 216

ప్రతిపదార్థం: తూర్పు+అరుణంబు+కాన్+తొడఁగెన్= తూర్పుదిక్కు ఎఱ్ఱపడటం మొదలైంది; దుష్ట, నిశా, చర, వేళ+ అయ్యెడున్= దుర్మార్గులైన రాక్షసుల వేళ అవుతున్నది; కాల, యాపనము+అమర్పక= ఆలస్యం చేయక; ఆ+పిశితాశిన్+పట్టి= ఆ రాక్షసుడిని పట్టి; మార్పుము= చంపుము; పాలార్పఁగన్+ఏల= ఉపేక్షించుట ఎందుకు?; నావుడున్= అని అనగా; బల+ ఆఢ్యుఁడు= బలంతో కూడినవాడు; భీముఁడు; మల్ల, విద్య, నేర్పు+ఏర్పడఁగాన్= మల్లవిద్యలోని నైపుణ్యం ప్రకాశించేటట్లు; హిడింబున్= హిడింబాసురుణ్ణి; చెర+చెరన్= వెంటనే; బలహీన, పరాక్రమున్= బలం నశించిన పరాక్రమం కలవాణ్ణిగా; చేసెన్.

తాత్పర్యం: 'తూర్పు ఎఱ్ఱబడుతున్నది. దుష్టరాక్షసులకు అనుకూల సమయం ఆసన్నమౌతున్నది. ఆలస్యం చేయక ఆ రాక్షసుణ్ణి చంపుము' అని అర్జునుడనగా తనమల్లయుద్ధనైపుణ్యం మెరయగా భీముడు హిడింబాసురుణ్ణి బలహీనుణ్ణి చేశాడు.

విశేషం: సంధ్యాసమయం రాక్షసుల కనుకూలమట! పూర్వసంధ్యాసమయంలో రౌద్రముహూర్తం వస్తుందట! అప్పుడు రాక్షసులెక్కువ శక్తిమంతులవుతారట! 'పుర స్సంరజ్యతే ప్రాచీ । పూర్వా సంధ్యా ప్రవర్తతే । రౌద్రే ముహూర్తే రక్షాంసి । భవంతి బలవంతి చ' - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.376.

క. వడి నసురవాత ముక్కున । నుడుగక రక్తప్రవాహ మొలుకుచు నుండన్
గడకాలు వట్టి వానిని । మడవక పవనజుఁడు నూఱు మాఱులు వీచెన్. 217

ప్రతిపదార్థం: వడిన్= వేగంగా; అసుర, వాత= రాక్షసునియొక్కనోటనుండి; ముక్కునన్= ముక్కునుండి; ఉడుగక= ఆగక; రక్త, ప్రవాహము= నెత్తుటిధార; ఒలుకుచున్, ఉండన్= కారుతూ ఉండగా; పవనజుఁడు= వాయుపుత్త్రుడైన భీముడు; కడ, కాలు, పట్టి= కాలి చివరిభాగం పట్టుకొని; వానిన్= ఆ హిడింబాసురుడిని; మడవక= వెనుకాడక; నూఱు, మాఱులు; వీచెన్= విసిరాడు (గిరగిర త్రిప్పాడు)

తాత్పర్యం: హిడింబాసురుడి నోట, ముక్కున ఆగకుండా నెత్తురుధారలు కారుతూ ఉండగా, భీముడు అతడి కడకాలుపట్టి గాలిలోకి ఎత్తి గిరగిరా వందసార్లు త్రిప్పాడు.

విశేషం: విసరటం పవనగుణం. హిడింబుడి కడకాలు పట్టి అతడిని వంగనీయక అతివేగంగా నూరుమారులు విసరిన భీముడిని పవనజుడని సంబోధించటం ఎంతో ఉచితంగా ఉన్నది.

ఆ. లావు సెడఁగ నిట్లు వీవంగఁ బడి గత । చేష్టుఁ డయిన యసురుఁ జిక్కఁ బట్టి
నేలఁ బెట్టి వాని కోలెమ్ము బ్రల్లన । విఱిచి నడుము ద్రుంచి వీచి వైచె. 218

ప్రతిపదార్థం: లావు+చెడఁగన్= బలం నశించేటట్లు; ఇట్లు= ఈ విధంగా; వీవంగన్+పడి= విసరబడి; గత, చేష్టుఁడు+అయిన= పోయినచేష్టలు కలవాడైన; అసురన్= రాక్షసుడిని; చిక్కన్+పట్టి= బిగియపట్టి; నేలన్+పెట్టి= నేలమీద పెట్టి; వాని, కోలెమ్ము= వాడి వెన్నెముకను; బ్రల్లు+అనన్= భళ్ళుమనేటట్లు; విఱిచి; నడుము; త్రుంచి; వీచి, వైచెన్= గాలి విసురునట్లు విసరివేశాడు.

తాత్పర్యం: బలం క్రుంగేటట్లు ఈ విధంగా విసరటంచేత అవయవాల కదలికలు కోల్పోయిన హిడింబుణ్ణి బిగియబట్టి, నేలమీద పెట్టి, అతడి వెన్నెముక విరిచి, నడుము త్రుంచి విసరివేశాడు.

విశేషం: అలతి అలతి పదాలతో కూడిన ఈ ఆటవెలది ఆ హిడింబుడి ప్రాణాలతో భీముడాడుకొన్న అతిభయంకరమైన తీరును అద్దంలోవలె పాఠకునికి ప్రదర్శిస్తున్నది.

వ. అట్టి చిత్ర వధం జూచి చిత్రీయమాణచిత్తు లై భీమసేను పరాక్రమంబు వొగడుచు నందఱు హిడింబానుగమ్యమాను లై చని; ర ట్లరుగునెడ భీముండు హిడింబ రాక కొడంబడక 'రాక్షసులు వైరంబుఁ దలంచి మాయలు సేయుదురు కావున నీవు మాతోడ రావలవదు; నిన్ను విశ్వసింపము; నీవును మీయన్న వోయిన తెరువున పొ' మ్మనిన నది భయంపడి వడవడ వడంకుచున్న దానిం జూచి కరుణారసార్ద్రచిత్తుం డయి ధర్మరాజు భీమున కి ట్లనియె. 219

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; చిత్ర, వధన్= చిత్రమైన చంపటాన్ని; చూచి; చిత్రీయమాణ, చిత్తులు+ఐ= ఆశ్చర్యపడుతున్న మనస్సు కలవాళ్ళయి; భీమసేను, పరాక్రమంబు= భీమునిపరాక్రమాన్ని; పొగడుచున్= పొగడుతూ; అందఱు; హిడింబ+ అనుగమ్యమానులు+ఐ= హిడింబచేత వెంబడింపబడినవాళ్ళయి; చనిరి=వెళ్ళారు; అట్లు+అరుగు+ఎడన్= ఆ విధంగా వెళ్ళేటప్పుడు; భీముండు; హిడింబ, రాకకు+ఒడంబడక= హిడింబ రావటానికి ఇష్టపడక; రాక్షసులు= రక్కసులు; వైరంబున్= పగను; తలంచి= మనస్సులోఉంచి; మాయలు; చేయుదురు= చేస్తారు; కావునన్; నీవు; మాతోడ; రా, వలవదు= రావద్దు; నిన్నున్= నిన్ను; విశ్వసింపము= నమ్మము; నీవును; మీ+అన్న+పోయిన; తెరువునన్= మార్గాన; పొమ్ము+అనినన్= పొమ్మని అనగా (అన్నపోయినమార్గం మరణమే); అది= ఆ హిడింబ; భయంపడి= భీతిచెంది; వడవడ, వడంకుచున్+ఉన్న దానిన్+చూచి= వడవడ వణకుతూ ఉండేది చూచి; కరుణా, రస+ఆర్ద్ర, చిత్తుండు+అయి= దయారసంచేత తడిసిన మనస్సు కలవాడై; ధర్మరాజు; భీమునకున్+ఇట్లు+అనియెన్= భీమునితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఆ విధంగా హిడింబుణ్ణి చిత్రవధ చేయటంచూచి ఆశ్చర్యపడి, భీమునిపరాక్రమాన్ని పొగడుతూ, హిడింబ తమ వెంట రాగా, అందరూ అతనిదగ్గరకు వెళ్ళారు. భీముడు హిడింబ రాకకు ఇష్టపడక' రాక్షసులు పగబట్టి మాయలు చేస్తారు. అందుచేత నీవు మాతో రావద్దు. నీవుకూడా మీ అన్న చనిపోయినట్లే చావు' మని అనగా, ఆ రాక్షసి భయపడి వడవడ వణుకుతుండటం చూచి దయతో ధర్మరాజు భీమునితో ఇట్లా అన్నాడు.

తే. వధకు నర్హుఁడై వచ్చినవానిఁ జంపి । తదియు ధర్మువ; యిది చాల నబల; దీని
కలుగఁ జన; దాత్మరక్షకు నగ్గలంబు । ధర్మరక్షయ యుత్తమధార్మికులకు. 220

ప్రతిపదార్థం: వధకున్+అర్హుఁడు+ఐ= చంపబడటానికి తగినవాడై; వచ్చినవానిన్= వచ్చిన అతణ్ణి; చంపితివి= చంపావు; అదియు= అది; ధర్మువు+అ= ధర్మమే; ఇది= ఈ హిడింబ; చాలన్, అబల= ఏ మాత్రం బలం లేనిది - ఆడది; దీనికిన్+అలుగన్= దీనిమీద కోపపడటం; చనదు= కూడదు; ఉత్తమ, ధార్మికులకు= ఉత్తములైన ధర్మాత్ములకు; ధర్మ, రక్షయ= ధర్మాన్ని రక్షించటమే; ఆత్మరక్షకున్= తనరక్షణకంటె; అగ్గలంబు= అధికం.

తాత్పర్యం: చంపదగినవాణ్ణి చంపావు. అది ధర్మమే. ఈ హిడింబ చాలా అబల. దీనిమీద కోపపడ కూడదు. ఉత్తములైన ధర్మాత్ములకు ఆత్మరక్షణకంటె ధర్మరక్షణమే ఉత్తమం.

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తినిధిలో ఇదొక సూక్తిరత్నం. సమస్యను విశ్లేషించి నిర్ణయించటంలో ధర్మజునివివేకం అపూర్వం. హిడింబను రక్షించటం ధర్మరక్షణం; శిక్షించటం ఆత్మరక్షణానికి సంబంధించింది. ఆత్మరక్షణకొరకు చూడక ధర్మరక్షణచేయటం ఉత్తమధార్మికుల కర్తవ్యమని ధర్మజుని తీర్పు.

క. ఆపద యైనను ధర్మువ । ప్రాపుగ రక్షింపవలయుఁ బరమార్థము; ధ
ర్మాపాయమ ధార్మికులకు । నాపద జన్మాంతరమున ననుగత మగుటన్. 221

ప్రతిపదార్థం: ఆపద+ఐనను= ప్రమాదం కలిగినా; ధర్మువు+అ= ధర్మాన్నే; ప్రాపుగన్= ఆధారంగా; రక్షింప, వలయున్= కాపాడాలి; పరమ+అర్థము= సత్యం; జన్మ+అంతరమునన్= ఇంకొక పుట్టుకలోకూడ; అనుగతము+అగుటన్= వెంబడించేది కావటంవల్ల; ధార్మికులకున్= ధర్మం ఆచరించేవారికి; ధర్మ+అపాయము+అ= ధర్మం చెడటమే; ఆపద= కీడు.

తాత్పర్యం: తనకు ఆపద కలిగినా ధర్మాత్ములు ధర్మాన్నే రక్షించాలి. ఇది నిజం. ఎందుచేతనంటే ఇంకొక జన్మలో కూడా వెంటవచ్చేది కావటంచేత ధర్మం చెడిపోవటమే ధర్మాత్ములకు నిజమైన ఆపద.

విశేషం: ధర్మప్రబోధానికి, ధర్మసూక్ష్మవివరణకు కథాగమనంలో ఎక్కడ ఏ అవకాశం వచ్చినా నన్నయ దాన్ని జారవిడువడు. కథా ప్రసన్నతకు భంగం లేకుండా, సూటిగా, సులభశైలిలో, రమణీయంగా ధర్మాన్నిగూర్చి చెప్పి ఆవలికథను కొనసాగించటం ఆయన పద్ధతి.

వ. 'దీనియందు రాక్షసభావం బుపలక్షింపవలవదు; మాకు నాత్మీయబుద్ధియ యుండు' ననిన హిడింబ ధర్మరాజునకుం గుంతీదేవికి మ్రొక్కి యేకాంతంబునఁ గుంతి కి ట్లనియె; 'నవ్వా! సర్వప్రాణులకు సామాన్యం బయ్యును మనోజరాగంబు వనితల కసహ్యం బయి విశేషంబయి యుండు; నేను వృకోదరునిమిత్తంబు మదనబాణబాధిత నయి నాచుట్టంబులను జెలులను విడిచితి; నాయిష్టంబు మీరు గావింపనినాఁ డిప్పడ ప్రాణంబులు విడుతు; నన్ను రక్షించిన మీకు నిష్టంబులయినవాని నెల్లం దలంచి చేయుదు; నిమ్ముగానియెడ మి మ్మందఱ నెత్తికొని మీమెచ్చినచోటికిఁ బోవనేర్తు; నాపలుకులు నమ్ము నది; యే నతీతానాగతవర్తమానంబు లెల్లను దెల్లంబుగా నెఱుంగుదు; వలయునేని యనాగతంబు సెప్పెద వినుండు; ముందట నొక్క సరోవరంబును

నొక్కవనస్పతియునుం గల; వవి రెండును శాలిహోత్రుం డనుమహామునిచేతం దపఃప్రభావంబునం బడయంబడినయవి; యక్కొలనినీళ్ళు ద్రావినవారికి నెన్నండును నాఁకలియును నీరువట్టును లే; వవ్వనస్పతియు శీతవాతాతపవర్షంబులవలన రక్షించు; మీర లందున్న మీ కడకుఁ గృష్ణద్వైపాయనుండు వచ్చి మీకు హితోపదేశంబు సేయు నని చెప్పిన. **222**

ప్రతిపదార్థం: దీని+అందున్= ఈ హిడింబపట్ల; రాక్షస భావంబు; ఉపలక్షింపవలవదు= చూడవద్దు; మాకున్; ఆత్మీయ, బుద్ధియు+అ= బంధువనే తలంపే; ఉండున్= ఉన్నది; అనినన్; హిడింబ; ధర్మరాజునకున్, కుంతీదేవికిన్; మ్రొక్కి; ఏకాంతంబునన్= ఒంటరిగా; కుంతికిన్; ఇట్లు+అనియెన్; అవ్వా= అమ్మా; సర్వ, ప్రాణులకున్= అన్ని జీవులకు; సామాన్యంబు+అయ్యును= సాధారణమే అయినను; మనోజ, రాగంబు= మన్మథునివలన కోరిక; వనితలకున్= స్త్రీలకు; అసహ్యంబు+అయి= ఎక్కువైనదై; ఉండున్= ఉంటుంది; నేను; వృక+ఉదరు, నిమిత్తంబు= భీమునికారణంగా; మదన, బాణ, బాధితను+అయి= మన్మథునియొక్కబాణాలచేత బాధింపబడినదాననై; నా, చుట్టంబులనున్; చెలులనున్=స్నేహితులను; విడిచితిన్= వదలిపెట్టాను; నా+ఇష్టంబు= నాయొక్క కోరికను; మీరు, కావింపనినాఁడు= మీరు తీర్చని రోజు; ఇప్పుడు+అ= ఇప్పటికిప్పుడే; ప్రాణంబులు విడుతున్= ప్రాణాలు వదలివేస్తాను; నన్నున్; రక్షించినన్; మీకున్ ఇష్టంబులు+అయిన, వానిన్+ఎల్లన్= మీకిష్టమైన అన్నింటిని; తలంచి= ఆలోచించి; చేయుదున్= చేస్తాను; ఇమ్ము, కాని+ఎడన్= అనుకూలం కానిదైన చోట; మిమ్మున్+అందఱన్= మిమ్మల్ని అందరినీ; ఎత్తికొని; మీ మెచ్చిన, చోటికిన్ = మీరు కోరిన ప్రదేశానికి; పోవన్; నేర్తు= పోగలను; నా పలుకులు= నా మాటలు; నమ్ముమది= నమ్మండి; ఏన్= నేను; అతీత+అనాగత, వర్తమానంబులు+ఎల్లను= భూత భవిష్య, ద్వర్తమానాల నన్నింటిని; తెల్లంబుగాన్= స్పష్టంగా; ఎఱుంగుదున్; వలయున్+ఏని= అవసరమైతే; అనాగతంబు= రాబోయేదాన్ని; చెప్పెదన్; వినుండు; ముందటన్; ఒక్క సరోవరంబును= ఒక కొలను; ఒక్క, వనస్పతియున్= ఒక్క చెట్టు; కలవు; అవి, రెండును; శాలిహోత్రుండు+అను= శాలిహోత్రుడు అనే పేరుగల; మహామునిచేతన్= మహర్షి చేత; తపఃప్రభావంబునన్, పడయన్+పడిన+అవి= తపస్సు యొక్క ప్రభావంతో. పొందబడినవి; ఆ+కొలని= ఆ కొలనులోని; నీళ్ళు; త్రావిన, వారికిన్; ఎన్నండును= ఎప్పుడునూ; ఆఁకలియును; నీరుపట్టును= దప్పికయును; లేవు; ఆ+వనస్పతియున్= ఆ చెట్టుకూడ; శీత+వాత+ఆతప, వర్షంబువలనన్= చలి, గాలి, ఎండ, వానలనుండి; రక్షించున్= కాపాడుతుంది; మీరలు, అందు+ఉన్నన్= అచ్చట ఉండగా; మీ, కడకున్= మీ చెంతకు; కృష్ణద్వైపాయనుండు= వేదవ్యాసమహర్షి; వచ్చి; మీకున్, హిత+ఉపదేశంబు= మేలును కలిగించేమాటలు; చేయున్= చెప్తాడు; అని; చెప్పినన్.

తాత్పర్యం: 'ఈ హిడింబను రాక్షసిగా చూడవద్దు. మాకు ఈమెపట్ల బంధుభావమే ఉన్నది' అని ధర్మరాజు అనగా - హిడింబ, ధర్మజునికి, కుంతీదేవికి మ్రొక్కి ఏకాంతంలో కుంతితో 'అమ్మా! సర్వప్రాణులకు కామవాంఛ సమానమే. అయినా స్త్రీలవిషయంలో ఇది ఓర్చుకొనరానిదై ఉంటుంది. నేను భీమునిమీద మనసుపడి బంధువులను, స్నేహితులను వదలుకొన్నాను. నాకోరికను మీరు తీర్చకుంటే ప్రాణాలు విడుస్తాను. నన్ను రక్షిస్తే మీ కిష్టమైన వాటిని చేస్తాను. మీకు మార్గం అనుకూలంగా లేనప్పుడు మీరు కోరినచోట్లకు మిమ్మల్ని ఎత్తుకొని పోయి చేర్చగలను. భూతభవిష్యద్వర్తమానాలను ఎరిగి చెప్పగలను. ఇప్పుడు రాబోయేదాన్ని గురించి చెప్తాను-వినండి. ముందర కొంత దూరాన ఒక సరోవరం, ఒక వృక్షం ఉన్నాయి. అవి రెండూ శాలిహోత్రుడనే మహామునితపఃప్రభావంచేత ఏర్పడ్డాయి. ఆ సరోవరంలోని నీళ్ళు త్రాగితే ఆకలిదప్పులుండవు. ఆ చెట్టు - చలి, గాలి, ఎండ, వానలనుండి రక్షించగలదు. మీ రక్కడ ఉండగా కృష్ణద్వైపాయనుడు వచ్చి మీకు మేలుకలిగేమాటలు చెప్తాడు' - అని చెప్పగా.

క. **విని కుంతియుఁ బాండవులును । మనమున విస్మయముపడి సమంజసభావం**
బున దాని దివ్యవనితయ । యని తద్దయు నాదరించి రప్పుడు కరుణన్. **223**

ప్రతిపదార్థం: విని, కుంతియున్; పాండవులును; మనమునన్; విస్మయముపడి= ఆశ్చర్యపడి; సమంజస, భావంబునన్= మంచి అభిప్రాయంతో; దానిన్= ఆ హిడింబను; దివ్యవనితయ+అని= దేవతాస్త్రీ అని; అప్పుడు; కరుణన్= దయతో; తద్దయున్= మిక్కిలి; ఆదరించిరి.

తాత్పర్యం: హిడింబమాటలు విని కుంతీదేవి, పాండవులు ఆశ్చర్యపడి మంచి అభిప్రాయంతో ఆమెను దేవతా కాంతగా భావించి మిక్కిలిదయతో అదరించారు.

వ. అంత దాని వినయంబునకు ననాగతం బెఱుంగుటకు సంతసిల్లి కుంతి భీమున కి ట్లనియె. 224

ప్రతిపదార్థం: అంత= తరువాత; దాని, వినయంబునకున్= ఆ హిడింబయొక్క అణకువకు; అనాగతంబు+ఎఱుంగుటకున్= రాబోయేదాన్ని తెలిసికొనగలగటానికి; సంతసిల్లి= సంతోషించి; కుంతి; భీమునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ తరువాత హిడింబయొక్క అణకువకు, భవిష్యత్తును తెలిసికొనగలిగిన వివేకానికి సంతోషించి, కుంతీదేవి భీమునితో ఈ విధంగా అన్నది.

భీముఁడు తల్లియనుమతంబున హిడింబను బరిగ్రహించుట (సం. 1-143-1)

క. అన్న! యిది ధర్మ వని మీ । యన్నను నన్నును నతిప్రియంబున నెదలో
మన్నించి, యేమి వనిచినఁ గ్రన్నన మా పసుపు సేయఁ గడఁగుము బుద్ధిన్. 225

ప్రతిపదార్థం: అన్న= నాయనా భీమసేనా! ఇది; ధర్మువు+అని= ధర్మమని; మీ, అన్నను= మీ అన్న అయిన ధర్మరాజును; నన్నును= నన్ను; అతిప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; ఎదలో= మనస్సులో; మన్నించి= గౌరవించి; ఏమి+పనిచినన్- ఏమి ఆజ్ఞాపించినా; క్రన్నన= వెంటనే; మా, పసుపు+చేయన్= మాయొక్క ఆజ్ఞ చేయటానికి; బుద్ధిన్= ఇష్టపడి; కడఁగుము= పూనుకొమ్ము.

తాత్పర్యం: నాయనా! భీమసేనా! మీ అన్న ధర్మరాజునూ, నన్నూ గౌరవించి, మేము ఏమి ఆజ్ఞాపించినా అది ధర్మ మని తలచి, వెంటనే చేయుము.

విశేషం: 'అన్న' - వాత్సల్యపూరితమైన సంబోధన. 'బుద్ధిన్' అనే దానికి 'భక్తిన్' అనే పాఠాంతరం కూడ ఉన్నది.

క. ఇది పరమ సాధ్వి, దీనిని । మది నొండుగఁ దలఁప వలదు, మానుగఁ బుత్రా
భ్యుదయ మగుఁ; బాండుహితముగ । నిది కార్యం బని పరిగ్రహింపుము నెమ్మిన్. 226

ప్రతిపదార్థం: ఇది= ఈ హిడింబ; పరమసాధ్వి= ఉత్తమ పతివ్రత; మదిన్= మనస్సులో; దీనిన్= ఈమెను; ఒండుగన్= వేరొక విధంగా; తలఁపవలదు= భావించవద్దు; మానుగన్= ఒప్పుగా; పాండు, హితముగన్= పాండురాజుకు మేలు కలిగేటట్లు; పుత్ర+అభ్యుదయము+అగున్= పుత్రుడు పుట్టటం జరుగుతుంది; నెమ్మిన్= సంతోషంతో; ఇది; కార్యంబు+అని= ఇది చేయదగిన పని అని; పరిగ్రహింపుము= చేపట్టుము.

తాత్పర్యం: ఈ హిడింబ ఉత్తమపతివ్రత. మనస్సులో దీన్ని గురించి వేరొక విధంగా భావించవద్దు. పాండురాజుకు కూడా మేలుకలిగేటట్లు పుత్రుడు పుడతాడు. ఇది చేయదగినపని అనే తలంపుతో దీన్ని చేపట్టుము.

విశేషం: వంశంలో పుత్రపౌత్రాభివృద్ధి పితృదేవతలకు హితమైనది. అందుచేతనే కుంతి పాండుహితంగా పుత్రాభ్యుదయం అవుతుందనటం.

వ. అని భీమసేను నొడంబఱిచి హిడింబ కనురాగంబుగాఁ జెప్పి 'నీవు శుచి వయి యుత్తమ స్త్రీ గుణంబులు దాల్చి భీమునకు మనఃప్రియంబు సేయుము; పగ ళ్లెల్లను మీ యిష్టంబున విహరించి రాత్రులు మాయొద్దన యుండు నది' యని నియమించిన భీముండును 'బుత్త్రజన్మం బగునంతకు దీని మీవచనంబునఁ బరిగ్రహించెద' నని వారల సమక్షంబున సమయంబు సేసె; నంతఁ బాండవులు జననీసహితంబు శాలిహోత్రునాశ్రమంబునకుం జని ప్రభాతసమయంబున నక్కొలనఁ గృతస్నాను లయి సంధ్యావందనంబులు దీర్చి; శాలిహోత్రుచేతం బూజితు లయి తద్వనస్పతి చ్ఛాయా శీతల తలంబున విశ్రమించి విగత క్షుత్పిపాసు లై సుఖం బున్నంత. 227

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; భీమసేనున్, ఒడంబఱిచి= ఒప్పించి; హిడింబకున్; అనురాగంబుగాన్= ప్రేమగా; చెప్పి; నీవు; శుచివి+అయి= పరిశుద్ధురాలవై; ఉత్తమ, స్త్రీగుణంబులు+తాల్చి= ఉత్తమస్త్రీయొక్క లక్షణాలను కలిగి; భీమునకున్; మనఃప్రియంబున్= మనస్సుకు సంతోషాన్ని; చేయుము= కలిగించుము; పగళ్లు+ఎల్లను= పగలంతా, మీ ఇష్టంబున= మీయొక్క ఇష్టం వచ్చినట్లు; విహరించి= తిరిగి; రాత్రులు; మా+ఒద్దన= మాదగ్గరే; ఉండునది= ఉండండి; అని= ఆ విధంగా; నియమించినన్= కట్టడి చేయగా; భీముండును; పుత్త్ర, జన్మంబు+అగు+అంతకు= కొడుకు పుట్టేవరకు; దీనిన్= హిడింబను; మీ వచనంబునన్= మీయొక్క మాటచేత; పరిగ్రహించెదను+అని= చేపడతానని. వారల= వాళ్లయొక్క; సమక్షంబునన్= ఎదుట; సమయంబు+చేసెన్= ప్రతిజ్ఞ చేసినాడు; అంతన్= ఆ తరువాత; పాండవులు= పాండుకుమారులు; జననీసహితంబు= తల్లితోకూడి; శాలిహోత్రు+ఆశ్రమంబునకున్= శాలిహోత్రునియొక్క ఆశ్రమానికి; చని=పోయి (వెళ్లి); ప్రభాత సమయంబునన్= ప్రొద్దుననే; ఆ+ కొలనన్= ఆ సరోవరంలో; కృత+స్నానులు+అయి= చేయబడ్డ స్నానము కలవారై; సంధ్యావందనంబులు= సంధ్యాసమయంలోని నమస్కారాలు; తీర్చి= తీర్చుకొని; శాలిహోత్రు+చేతన్= శాలిహోత్రమునిచేత; పూజితులు+అయి= గౌరవింపబడ్డవాళ్లై; తత్+వనస్పతి+ఛాయా+శీతల+తలంబునన్= ఆ వనస్పతి అను చెట్టు నీడయొక్క చల్లని ప్రదేశంలో; విశ్రమించి= విశ్రాంతి తీసుకొని; విగత+క్షుత్+పిపాసులు+ఐ= బొత్తిగా పోయిన (పూర్తిగా పోగొట్టబడిన) ఆకలి, దప్పిక కలవాళ్లై; సుఖంబు= సుఖంగా; ఉన్నంతన్= ఉన్న అనంతరం.

తాత్పర్యం: అని భీమసేనుణ్ణి ఒప్పించి, హిడింబకు ప్రియంగా జెప్పి, 'నీవు పరిశుద్ధురాలవై ఉత్తమ స్త్రీగుణాలతో భీముణ్ణి సంతోషపెట్టుము. పగలు నీ ఇష్టం వచ్చిన చోట తిరిగి, రాత్రులు మా దగ్గరే ఉండండి' అని నియమించగా భీముడుకూడ 'కొడుకు పుట్టేవరకు హిడింబను మీ మాటప్రకారం చేపడతా' నన్నాడు. తరువాత పాండవులు తల్లితో కలిసి శాలిహోత్రుని ఆశ్రమానికి వెళ్ళారు. ప్రొద్దున్నే అక్కడికొలనులో స్నానంచేసి, సంధ్యావందనాలు తీర్చుకొని, శాలిహోత్రునిచే గౌరవింపబడ్డారు. అక్కడిచెట్టునీడయొక్క చల్లదనంలో విశ్రాంతి తీసికొని, ఆకలిదప్పికలు తీరి సుఖంగా ఉన్నారు.

పాండవులకు వ్యాసుఁడు హితోపదేశము సేయుట (సం.1-144-7)

ఉ. పుణ్యతపోమయుండు మునిపూజ్యుఁడు బ్రహ్మసమప్రభుండు బ్ర
హ్మణ్యుఁడు ప్రావృషేణ్యజలదాసితవర్ణుఁ డశేషకిల్బిషా

రణ్యద వానలుం డగు పరాశరనందనుఁ డేగుదెంచెఁ ద

త్పుణ్యచయస్వరూపమునుబోలెఁ గరంబు మనోముదంబుగన్. **228**

ప్రతిపదార్థం: పుణ్యతపః+మయుండు= పవిత్రమైన తపస్సు నిండుగా గలవాడు; ముని, పూజ్యుఁడు= మునులచేత పూజింప దగినవాడు; బ్రహ్మసమప్రభుండు= బ్రహ్మదేవునితేజస్సుతో సమానమైన తేజస్సు కలవాడు; బ్రహ్మణ్యుఁడు= బ్రాహ్మణులకు హితుడైనవాడు; ప్రావృషేణ్య, జలద+అసిత, వర్ణుఁడు= వర్షాకాలంలలోని మేఘంవలె నల్లనైన రంగు కలవాడు; అశేష కిల్బిష+అరణ్య; దవానలుండు+అగు= సర్వపాపాలు అనే అడవికి కార్చిచ్చువంటి వాడైన; పరాశర, నందనుఁడు= పరాశరుని యొక్క కుమారుడు, వ్యాసుడు; తత్+పుణ్య, చయ, స్వరూపమును+పోలెన్= ఆ కుంతీ పాండవులయొక్క పుణ్యసమూహంయొక్క ఆకారంవలె; కరంబు= మిక్కిలి; మనస్ ముదంబుగన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లు; ఏగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: పవిత్రమైన తపస్సు నిండుగా కలవాడు, మునులచేత పూజింపదగినవాడు; బ్రహ్మదేవునితో సమానమైన తేజస్సు కలవాడు; బ్రాహ్మణులకు హితుడైనవాడు; వర్షాకాలమేఘంవంటి రంగుకలవాడు; సర్వపాపాలను హరించేవాడు అయిన వ్యాసుడు; ఆ కుంతీపాండవులయొక్క పుణ్యస్వరూపంవలె, వాళ్ళ మనస్సులకు ఆనందం కలిగేటట్లుగా వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ, రూపకం.

వ. ఇట్లు వచ్చిన వేదవ్యాసమునీంద్రునకు నందఱు నతిభక్తి నమస్కరించి యాస నార్ఘ్యాది విధులం బూజించి యున్నవారలం గరుణార్ద్రదృష్టిం జూచి కృష్ణద్వైపాయనుం డి ట్లనియె. **229**

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చిన; వేదవ్యాస, ముని+ఇంద్రునకున్= వేదవ్యాసమునిశ్రేష్ఠునికి; అందఱున్; అతి, భక్తిన్= మిక్కిలి భక్తితో; నమస్కరించి; ఆసన+అర్ఘ్య+ఆది, విధులన్= ఆసనం, అర్ఘ్యం, మొదలైన ఏర్పాట్లతో; పూజించి; ఉన్నన్=ఉండగా; వారలన్= వాళ్లను; కరుణా+ఆర్ద్ర, దృష్టిన్= దయచేత తడియైన చూపుతో; చూచి; కృష్ణద్వైపాయనుండు= కృష్ణద్వైపాయనుడైన వ్యాసుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసునికి అందరూ భక్తితో నమస్కరించి, ఆసనం, అర్ఘ్యం మొదలైన ఉపచారాలతో పూజించి ఉండగా, వాళ్ళందరినీ దయార్ద్రదృష్టితో చూచి, వ్యాసుడు ఈ విధంగా అన్నాడు.

పద్మకము.

కొడుకు పల్కు విని కూడదు నాక దుర్మాతుఁడై

కడఁగి మీకు నపకారము సేసి ధరిత్రి వె

ల్వడఁగఁబంచెఁ గడుఁబాపమతిన్ ధృతరాష్ట్రుఁ, డె

య్యెడల దుర్జనుల నేమఱి నమ్మఁగఁ బోలునే. **230**

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుడు; కొడుకు, పల్కు= కొడుకుయొక్క మాట; విని; కూడదు= తగదు; నాక= అని అనక; దుర్మాతుఁడు+ఐ= చెడుమనస్సు కలవాడై; కడఁగి= పూని; మీకున్; అపకారము, చేసి; ధరిత్రి= భూమి అనగా (రాజ్యం యొక్క పొలిమేరలను); వెలువడఁగన్= దాటిపోయేటట్లు; కడున్+పాపమతిన్= మిక్కిలిచెడుబుద్ధితో; పంచెన్= పంపించాడు; ఏ+ఎడలన్= ఎచ్చటైనా; దుర్జనులన్= దుర్మార్గులను; ఏమఱి= ఉపేక్షించి; నమ్మగన్+పోలునే= నమ్మవచ్చునా!

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కొడుకుమాట విని, ఇది తగదని చెప్పక దుర్మార్గుడై మీకు అపకారం చేసి, మిమ్మల్ని రాజ్యంనుండి వెళ్ళగొట్టాడు. దుర్మార్గులను ఎక్కడైనా ఎప్పుడైనా ఉపేక్షించకూడదు, నమ్మకూడదు.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. పద్మకవృత్తంలోని ప్రతిపాదంలోనూ వరుసగా న, భ, జ, జ, జ, గ - అనే గణాలుంటాయి. లాక్షణికులు 11వ అక్షరం యతిస్థానంగా పేర్కొన్నారు. కాని, నన్నయ 8వ అక్షరాన్ని యతిగా నిలిపాడు. ఆంధ్రమహాభారతమంతటిలో నన్నయమాత్రమే - ఒక్కసారిమాత్రమే - వాడినవిశేషవృత్తాల్లో ఇదొకటి కావటం విశేషం. ఇదికాక, రథోద్ధతం, మణిభూషకం, దండకం అనేవి ఈ కోవకు చెందుతాయి. (సంపా.)

వ. 'దీని నెఱింగి మీకు హితోపదేశంబు సేయ వచ్చితి; నిఖిల ధర్మవిదుల రయి వినీతుల రయిన మీకు బాంధవవియోజనం బయిన యీ కర్మంబు పురాకృతంబు; దీనికి శోకింపవలవదు; కొండొకకాలంబునకు మీరును బాంధవులం గలసి యెప్పటియట్ల రాజ్యంబు సేయుదు; రిది శాలిహోత్రుతపఃప్రభావంబున నైన కొలను; దీని జలంబు లుపయోగించినవారికి బుభుక్షాపిపాసలు లే; వివ్వనస్పతియును శీతవాతాతపవర్షంబువలన రక్షించు; నిం దొరు లెఱుంగకుండఁ గార్యార్థుల రై కతిపయదినంబు లుండి యేకచక్రపురంబున కేఁగి బ్రాహ్మణభావంబున బ్రాహ్మణగోష్ఠి నుండి నారాక ప్రతీక్షించియుండు నది' యని కఱపి తనకు వినయావనతులయి కృతాంజలు లయిన మనుమల దీవించి కౌఁగలించుకొని, బాష్పపూరితనయన యయి మ్రొక్కియున్న కోడలి నూరార్చి; 'నీకొడుకు ధర్మనిత్యుం; డీ యుధిష్ఠిరుండు నారాయణుభుజంబులంబోని తననలువురుదమ్ములబలంబున సర్వపార్థివుల శాసించి సార్వభౌముం డై రాజసూయాశ్వమేధాదిక్రతువులు సేసి పితృపైతామహం బైన రాజ్యలక్ష్మి ననుభవించుచుం గురుకులంబునెల్లఁ బవిత్రంబు సేయు' నని శోకోపశమనంబుఁ జేసి; హిడింబం జూచి 'దీనిపేరు కమలపాలిక యిది భీమునకు వశవర్తి యయి పరిచరించి మహాసత్త్వుం డయిన కొడుకుం గాంచు; నాతండు మి మ్మందఱ నాపద్విషయంబున నుద్ధరించు' నని చెప్పి మునివరుండు తిరోహితుం డైన. 231

ప్రతిపదార్థం: దీనిన్; ఎఱింగి= తెలిసికొని; మీకు; హిత+ఉపదేశంబు+చేయన్= మేలును కూర్చే మాటలు చెప్పటానికి; వచ్చితిన్; నిఖిల, ధర్మ, విదులరు+అయి= అన్నిధర్మాలు తెలిసికొన్న వాళ్ళయి; వినీతులరు= వినయం కలవాళ్లు; అయిన= అయినట్టి; మీకున్, బాంధవవియోజనంబు+అయిన= బంధువులకు దూరమైన; ఈ, కర్మంబు; పురాకృతంబు= గతజన్మంలో చేయబడింది; దీనికిన్; శోకింపన్, వలవదు= దుఃఖింప నక్కరలేదు; కొండొకకాలంబునకున్= కొంతకాలానికి; మీరును= మీరుకూడా; బాంధవులన్+కలిసి; ఎప్పటి+అట్ల= ఎప్పటివలెనే; రాజ్యంబు+ చేయుదురు; ఇది; శాలిహోత్రు, తపః, ప్రభావంబునన్+ ఐన= శాలిహోత్రుడనే మహామునియొక్క తపస్సుయొక్క మహిమచేత ఏర్పడిన; కొలను; దీని, జలంబులు; ఉపయోగించినవారికి; బుభుక్షా, పిపాసలు= ఆకలిదప్పులు; లేవు; ఈ+వనస్పతియును= ఈ చెట్టుకూడ; శీత, వాత+ఆతప, వర్షంబువలనన్= చలి, గాలి, ఎండ, వానలనుండి; రక్షించున్= కాపాడుతుంది; ఇందున్= ఇక్కడ; ఒరులు= ఇతరులు; ఎఱుంగక+ఉండన్= తెలుసుకొనకుండ; కార్య+అర్థులరు+ఐ= ప్రయోజనాన్ని కోరే వాళ్ళయి; కతిపయ, దినంబులు= కొన్నిరోజులు; ఉండి; ఏకచక్ర, పురంబునకున్= ఏకచక్రమనే పేరుగల పట్టణానికి; ఏఁగి= వెళ్ళి; అందున్= ఆ పట్టణంలో; బ్రాహ్మణభావంబునన్= బ్రాహ్మణులయొక్క పద్ధతిలో; బ్రాహ్మణులగోష్ఠిన్+ఉండి= బ్రాహ్మణులయొక్క సభలో ఉండి; నా రాక, ప్రతీక్షించి= నా యొక్క రాకను ఎదురుచూచి; ఉండునది= ఉండండి; అని= ఆప్రకారం; కఱపి= బోధించి; తనకున్; వినయ+అవనతులు+అయి= వినయంతో వంగినవారై; కృత+అంజలులు+అయిన= చేయబడిన చేతులజోడింపు కలవాళ్ళయిన - అంటే చేతులు జోడించి

నమస్కరించిన; మనుమలన్= మనుమల్ని; దీవించి= ఆశీర్వదించి; కౌఁగలించుకొని= ఆలింగనంచేసి; బాష్ప, పూరిత, నయన+అయి= కన్నీటిచే నిండిన కళ్ళు కలదై; మ్రొక్కి+ఉన్న= నమస్కరించిన; కోడలిన్= కోడలిని, కుంతిని; ఊరార్చి= ఓదార్చి; నీ, కొడుకు= నీ కుమారుడు; ఈ యుధిష్ఠిరుండు= ఈ ధర్మరాజు; ధర్మ, నిత్యుండు= ఎడతెగని ధర్మం కలవాడు; నారాయణ, భుజంబులన్+పోని= శ్రీమహావిష్ణువుయొక్క చేతులవంటి; తన, నలువురు+తమ్ముల, బలంబునన్; సార్వభౌముండు+ఐ= సమస్త భూమండలాన్ని ఏలువాడై; రాజసూయ+అశ్వమేధ+ఆది, క్రతువులు+చేసి= రాజసూయం, అశ్వమేధం మొదలయిన యాగాలు చేసి; పితృపైతామహంబు+ఐన= తండ్రితాతలకు సంబంధించిందైన; రాజ్యలక్ష్మిన్= రాజ్యసంపదను; అనుభవించుచున్= అనుభవిస్తూ; కురు, కులంబును+ఎల్లన్= కురువంశాన్నంతటినీ; పవిత్రంబు+చేయున్= పవిత్రం చేస్తాడు; అని= అని; శోక+ఉపశమనంబున్+చేసి= దుఃఖం తగ్గేటట్లు చేసి; హిడింబన్+చూచి; దీని, పేరు= ఈమె పేరు; కమలపాలిక; ఇది= ఈమె, భీమునకున్= భీమునికి; వశవర్తిని+అయి= లొంగినదై; పరిచరించి= సేవచేసి; మహా, సత్త్వుండు+అయిన= మిక్కిలి బలం గలవాడయిన; కొడుకున్= కుమారుణ్ణి; కాంచున్= పొందుతుంది; ఆతండు= ఆ కుమారుడు; మిమ్ము+అందఱన్= మిమ్మల్ని అందరినీ; ఆపత్+విషయంబునన్= ప్రమాదానికి సంబంధించిన సందర్భంలో; ఉద్ధరించున్= మీది కెత్తుతాడు - అంటే రక్షిస్తాడు; అని, చెప్పి; ముని, వరుండు= మునిశ్రేష్ఠుడు; తిరోహితుండు+ఐనన్= అగుపించకుండాపోయినవాడు కాగా - అంటే అంతర్ధానమందినవాడు కాగా.

తాత్పర్యం: 'ఆ విషయాన్ని తెలిసికొని మీకు హితోపదేశం చేయాలని వచ్చాను. అన్నిధర్మాలు తెలిసినవాళ్ళు, వినయవంతులు అయిన మీకు బంధువులతో ఎడబాటు కలగటం పూర్వజన్మకృతం. దీనికి దుఃఖించవద్దు. కొంతకాలానికి మీరుకూడా బంధువులతో కలిసి ఎప్పటివలె రాజ్యం చేస్తారు. ఇది శాలిహోత్రమహాముని తపః ప్రభావంచేత ఏర్పడిన సరోవరం. దీనినీళ్ళు త్రాగినవాళ్ళకు ఆకలిదప్పులుండవు. ఈ చెట్టుకూడ చలి, గాలి, ఎండ, వానలనుండి మిమ్మల్ని కాపాడుతుంది. ఇక్కడ ఇతరులకు కన్పించకుండ మీ పని నెరవేరేవరకు కొన్ని రోజులుండి, తరువాత ఏకచక్రపురానికి పోయి, అక్కడ బ్రాహ్మణరూపంలో బ్రాహ్మణులతో కలిసి ఉండి, నా రాకకోసం ఎదురుచూడం' డని బోధించాడు. తనకు శిరస్సువంచి నమస్కరించి, చేతులు జోడించి నిలిచిన మనుమలను దీవించి కౌగలించుకొని, కన్నీరు కారుస్తున్న కోడలు కుంతిని ఓదార్చి, 'నీకొడుకు యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. అతడు నారాయణునిభుజాలవంటి నలువురుతమ్ముళ్ల బలంచేత రాజులందరిని శాసించి సార్వభౌముడు చేసే, రాజసూయాశ్వమేధాదియాగాలు చేసి, తాతతండ్రులరాజ్యం ఏలగలుగుతాడు. కురువంశాన్నంతటిని పవిత్రం చేస్తాడు' అని వారిశోకాన్ని ఉపశమింపచేశాడు. హిడింబను చూచి 'దీని పేరు కమలపాలిక. ఇది భీమునికి వశమై సేవ చేసి మహాబలవంతుడైన కొడుకును కంటుంది. అతడు మిమ్ముల్నందరినీ ఆపత్సమయంలో రక్షిస్తాడు' అని చెప్పి వ్యాసమహర్షి అదృశ్యమయ్యాడు.

క. అమ్మునివరు కఱపిన మా । ర్గమ్మునఁ బాండవులు విగతకల్మషు లవిషా
దమ్మున సుఖముండిరి విన । య మ్మొప్పఁగ శాలిహోత్రునాశ్రమభూమిన్. 232

ప్రతిపదార్థం: ఆ+ముని, వరు, కఱపిన, మార్గమ్మునన్= ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసమహర్షి బోధించిన పద్ధతిలో; పాండవులు= పాండుకుమారులు; విగత, కల్మషులు= పోయినపాపంకలవాళ్ళు - అంటే పుణ్యాత్ములు; వినయమ్ము+ఒప్పఁగన్= వినయం ప్రకాశించగా; శాలిహోత్రు+ఆశ్రమ, భూమిన్= శాలిహోత్రునియొక్క ఆశ్రమప్రదేశంలో; అవిషాదమ్మునన్= దుఃఖంలేకుండా; సుఖము+ఉండిరి= సుఖంగా ఉన్నారు.

తాత్పర్యం: ఆ మునిశ్రేష్ఠుడైన వ్యాసమహర్షి బోధించినవిధంగా పుణ్యాత్ములైన పాండవులు వినయంతో శాలిహోత్రునిఆశ్రమంలో దుఃఖం లేకుండా సుఖంగా ఉన్నారు.

వ. అంత. 233

తాత్పర్యం: ఆ సమయంలో.

చ. పవనతనూజుఁ డక్కమలపాలికచేత వినీతుఁ డై మహా
ర్ణవవృతభూమిలోఁ గల వనంబుల హంసబలాకసారసా
రవరుచిరాపగావరసరఃపులినంబులఁ బర్వతంబులన్
వివిధవిహారుఁ డై యనుభవించె నభీష్టమనోజభోగముల్. 234

ప్రతిపదార్థం: పవన, తనూజుఁడు= వాయుదేవునికుమారుడైన భీముడు; ఆ+కమలపాలికచేతన్= ఆ హిడింబచేత; వినీతుఁడు+ఐ= నడిపించబడినవాడై; మహా+అర్ణవ, వృత, భూమిలోన్= పెద్దసముద్రాలచే చుట్టబడిన భూమిలో; కల= ఉన్న; వనంబులన్= అడవులలో; హంస, బలాక, సారస+ఆరవ, రుచిర+ఆపగా, వర, సరః+పులినంబులన్= హంసలయొక్క, కొంగలయొక్క, బెగ్గురుపక్షులయొక్క ధ్వనులచేత మనోహరాలైన నదులయొక్క, శ్రేష్ఠాలైన కొలనులయొక్క ఇసుకతిన్నెలలో; పర్వతంబులన్= కొండలలో; వివిధ, విహారుఁడు+ఐ= పలువిధాలైన విహారాలు కలవాడై; అభీష్ట, మనోజ, భోగముల్= మనస్సు కింపైన మన్మథసుఖాలను; అనుభవించెన్.

తాత్పర్యం: హిడింబ తనను అనుసరించగా భీముడు భూమండలంలోని అనేకవనాలలో, హంసలు, కొంగలు, బెగ్గురుపక్షులు మొదలయినవాటిధ్వనులచేత మనోహరాలైన నదులయొక్క, కొలనులయొక్క ఇసుకతిన్నెలలో; పర్వతాలలో అనేకవిధాల విహరించి మనసు కింపయిన మన్మథసుఖాలను అనుభవించాడు.

విశేషం: ఇందులో కమలపాలికాభీముల ప్రణయవిహారాలనే మనోహరసన్నివేశాలను మసృణమైన పదరచనతో నన్నయ వర్ణించి శ్లేషమనే గుణాన్ని పోషించాడు. శృంగారసస్ఫోరకమైన అక్షరరమ్యతతో రచనను అలంకరించాడు. (సంపా.)

హిడింబయందు ఘటోత్కచుండు పుట్టుట (సం.1-143-27)

చ. నరవరుఁడైన భీమువలనం బ్రభవించె హిడింబకున్ సుతుం
డురుతర భీమ రూపుఁడు ఘటోత్కచ నాముఁడు విస్ఫుర ద్భయం
కర వదనంబు శంకునిభకర్ణములున్ వికృతాక్షులుం బయో
ధరవరవర్ణమున్ వికటదారుణదంష్ట్రలు నొప్పచుండఁగన్. 235

ప్రతిపదార్థం: నర, వరుఁడు+ఐన= మానవులలో శ్రేష్ఠుడైన, భీమువలనన్= భీమునివల్ల; హిడింబకున్; విస్ఫురత్+భయంకర, వదనంబు= ప్రకాశిస్తున్న భయంకరమైన ముఖం; శంకు, నిభ, కర్ణములున్= మోడువంటిచెవులు; వికృత+అక్షులున్= వికార మైన కన్నులును; పయోధర, వర, వర్ణమున్= మేఘంయొక్క శ్రేష్ఠమైన రంగు, వికట, దారుణ, దంష్ట్రలున్= హెచ్చు తగ్గులై భయంకరాలైన కోరలు; ఒప్పుచున్+ఉండఁగన్= ప్రకాశిస్తుండగా; ఉరుతర, భీమ, రూపుఁడు= మిక్కిలి గొప్పదైన

భయంకరమైన రూపంకలవాడు; ఘటోత్కచనాముఁడు= ఘటోత్కచుడనే పేరు కలవాడు; సుతుండు= కుమారుడు; ప్రభవించెన్= పుట్టాడు.

తాత్పర్యం: భీమహిడింబలకు భయంకరమైన ముఖం, మోడువంటిచెవులు, వికారాలైన కన్నులు, నల్లనిరంగు, హెచ్చుతగ్గులై భయంకరాలైన కోరలు, భీతి గొలిపే పెద్దదేహం కల ఘటోత్కచ నామధేయుడు కుమారుడొకడు పుట్టాడు.

విశేషం: శంకునిభకర్ణములున్- అనేదానికి శంఖనిభకర్ణములున్ అనే పాఠాంతరం ఉన్నది. మూలంలో 'శంకుకర్ణం విభీషణమ్' అని ఉంది - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.382.

వ. ఇట్లు సద్యోగర్భంబునం గామరూపధరుం డై ఘటోత్కచుండు పుట్టి తత్క్షణంబ నవయౌవనుండును ననేకాస్త్రశస్త్ర కుశలుండును నపరిమిత రాక్షస పిశాచ బలపరివృతుండును నై తల్లిదండ్రులకుఁ గుంతీదేవికి మ్రొక్కిన, నగ్రనందనుం డగుట నందఱును గరంబు గారవంబునఁ గొనియాడం గొన్నిదినంబు లుండి; యొక్కనాఁ డంజలి పుటఘటితమస్తకుం డయి 'రాక్షసపిశాచబలంబులతోడ నాయిమ్ముల నుండెదం; బని గలయప్పుడు నన్నుఁ దలఁ చునది; యాక్షణంబ వత్తు' నని యందఱిచేత ననుజ్ఞాతుండై తల్లిం దోడ్కొని, యుత్తరాభిముఖుం డయి యరిగె; నిట పాండవులును శాలిహోత్రునొద్ద ననేకధర్మశాస్త్రనీతిశాస్త్రంబు లభ్యసించి యమ్మునివరు వీడ్కొని చని విదర్భమత్స్య త్రిగర్తకీచక విషయంబులు గడచి యేకచక్రం బను నగ్రహారంబు గని. 236

ప్రతిపదార్థం: ఇట్లు; సద్యః+గర్భంబునన్= అప్పటికప్పుడు కలిగిన కడుపున; కామ, రూప, ధరుండు+ఐ= ఇచ్చవచ్చిన రూపాన్ని ధరించేవాడై; ఘటోత్కచుండు, పుట్టి; తత్+క్షణంబు+అ= ఆ నిమిషాన్నే; నవ, యౌవనుండును= క్రొత్తగా ఏర్పడిన యౌవనం కలవాడును; అనేక+అస్త్ర, శస్త్ర, కుశలుండునున్= పలువిధాలైన అస్త్రాలలో, శస్త్రాలలో నేర్పుకలవాడును; అపరిమిత, రాక్షస, పిశాచ, బల పరివృతుండునున్+ఐ= అంతులేని రాక్షసపిశాచబలంచేత చుట్టబడినవాడును అయి; తల్లి, తండ్రులకున్; కుంతీదేవికిన్; మ్రొక్కినన్= నమస్కరింపగా; అగ్ర, నందనుండు+అగుటన్= పెద్దకొడుకు కావటంచేత; అందఱును; కరంబు= మిక్కిలి; గారవంబునన్= ప్రేమతో; కొనియాడన్= పొగడగా; కొన్ని, దినంబులు+ఉండి; ఒక్కనాఁడు; అంజలి పుట, ఘటిత, మస్తకుండు+అయి= దొప్పవంటి చేమోడ్పులచే కూడిన తల కలవాడై; రాక్షస,పిశాచ, బలంబులతోడన్; ఆ+ఇమ్ములన్= ఆ ప్రదేశాలలో; ఉండెదన్; పని, కల+అప్పుడు= పని ఉండే సమయంలో; నన్నున్, తలంచునది= తలచండి; ఆ+క్షణంబు+అ= ఆ నిమిషాననే; వచ్చుదును+అని= వస్తానని; అందఱిచేతన్, అనుజ్ఞాతుండు+ఐ= అనుమతింపబడినవాడై; తల్లిన్+తోడ్కొని= తల్లిని తీసుకొని; ఉత్తర+అభిముఖుండు+అయి= ఉత్తరానికి ఎదురుగా ముఖం కలవాడై- అంటే ఉత్తరంవైపు తిరిగినవాడై; అరిగెన్= వెళ్ళాడు; ఇట; పాండవులును= పాండవులు కూడా; శాలిహోత్రు+ఒద్దన్= శాలిహోత్రునిదగ్గర; అనేక ధర్మశాస్త్ర, నీతి శాస్త్రంబులు= చాలా ధర్మశాస్త్ర నీతిశాస్త్ర విషయాలు; అభ్యసించి= నేర్చుకొని; ఆ+ముని, వరున్= ఆ మునిశ్రేష్ఠుడిని; వీడ్కొని= వదలి; చని= వెళ్ళి; విదర్భ, మత్స్య, త్రిగర్త, కీచక, విషయంబులు= విదర్భ, మత్స్య, త్రిగర్త, కీచక దేశాలు, కడచి= దాటి; ఏకచక్రంబు+అను+అగ్రహారంబు; కని= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా అప్పటికప్పుడు కలిగిన గర్భంలో తనకు ఇచ్చవచ్చినరూపాన్ని ధరించగలవాడైన ఘటోత్కచుడు పుట్టి, తత్క్షణమే నవయౌవనం, వివిధశాస్త్రాలలో నైపుణ్యం కలవాడై, అపరిమితరాక్షసపిశాచబలంతో కూడి తల్లిదండ్రులకు, కుంతీదేవికి నమస్కరించాడు. ఘటోత్కచుడు మొదట పుట్టినకుమారుడు కావటంవలన

అతణ్ణి అందరు ఆదరించగా - అతడు కొన్నిదినాలుండి, ఒకనాడు అందరికీ నమస్కరించి - 'నేను రాక్షస పిశాచబలాలతో ఆయాప్రదేశాల్లో ఉంటాను. అవసరమైనప్పుడు నన్ను తలిస్తే ఆ క్షణాన్నే వస్తా' నన్నాడు. తరువాత అందరి అనుమతి పొంది తల్లిని వెంటతీసికొని ఉత్తరదిశగా వెళ్ళాడు. ఇట పాండవులు కూడా శాలిహోత్రుని దగ్గర అనేకధర్మశాస్త్రాలు, నీతిశాస్త్రాలు అభ్యసించి, ఆయనదగ్గర సెలవు తీసికొని విదర్భ, మత్స్య, త్రిగర్త, కీచకదేశాలు దాటి, ఏకచక్రమనే అగ్రహారాన్ని చూచి.

విశేషం: 'నాయిమ్ముల' - నాకు ఇష్టమైనట్లు - అనుకూలమైనట్లు అనిగూడ అన్వయించడానికి అవకాశం ఉన్నది. 'ఏకచక్రం బనునగ్రహారంబు' - ఏకచక్రాపురము అని మూలం. 'ఏకచక్రామ్ గతా స్తే తు' - చిత్రశాలాప్రతి, ఘటోత్కచజన్మము చైత్రబహుళ అష్టమి - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.383.

పాండవు లేకచక్రపురంబున విప్రగృహంబున నుండుట (సం.1-145-1)

క. లలితజటాజినకుశవ - ల్కలధరు లై వేద మొప్పఁగాఁ జదువుచు ని
మ్ముల బ్రహ్మచారివృత్తిని । వెలయఁగ నం దుండి రొక్కవిప్రగృహమునన్. 237

ప్రతిపదార్థం: లలిత, జటా+అజిన, కుశ, వల్కల, ధరులు, ఐ= చక్కనిజడలను, జింకతోళ్ళను, దర్భలను, నారచీరలను కట్టినవారై; వేదము= వేదాన్ని; ఒప్పఁగాన్= తగువిధంగా; చదువుచున్; ఇమ్ముల=సుఖంగా; బ్రహ్మచారి, వృత్తిని= బ్రహ్మచారియొక్క నడవడితో; వెలయఁగన్= ప్రకాశించేటట్లు; ఒక్క, విప్ర, గృహమునన్= ఒక బ్రాహ్మణుని ఇంటిలో; అందున్= ఆ ఏకచక్రపురంలో; ఉండిరి.

తాత్పర్యం: (పాండవులు) చక్కనిజడలతో, జింకతోళ్ళతో, దర్భలతో, నారచీరలతో వేదపఠనం చేస్తూ బ్రహ్మచర్యవృత్తి నవలంబించి సుఖంగా ఆ ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణునిఇంట్లో ఉన్నారు.

క. ధృతిఁ జదువుచు భిక్షార్థము । ప్రతిగృహమున కరుగుచున్న భవ్యుల మౌన
వ్రతులం దృప్తులఁ జేసిరి । సతతము నందుల గృహస్థ సద్ద్విజులు దయన్. 238

ప్రతిపదార్థం: ధృతిన్, చదువుచున్= సంతోషంతో చదువుతూ; భిక్షా+అర్థము= భిక్షకోసం; ప్రతిగృహమునకున్= ఇంటింటికి; అరుగుచున్+ఉన్న= వెళ్ళుతున్న; భవ్యులన్= మంచివాళ్ళను; మౌన, వ్రతులన్= మాటాడక ఉండే వ్రతాన్ని అవలంబించిన వాళ్ళను; అందుల= అక్కడి; గృహస్థ, సత్+ద్విజులు= ఏకచక్రపురంలోని గృహస్థులైన మంచి బ్రాహ్మణులు; దయన్= దయతో; సతతము= ఎల్లప్పుడు; తృప్తులన్+చేసిరి= తృప్తి పొందినవారినిగా చేశారు.

తాత్పర్యం: సంతోషంతో చదువుతూ భిక్షకోసం ప్రతిగృహానికి వెళుతున్న మౌనవ్రతులు, మంచివాళ్ళు అయిన పాండవులను ఏకచక్రపురంలోని సద్బ్రాహ్మణగృహస్థులు దయతో ఎల్లప్పుడు తృప్తిపరచారు.

క. 'జలజప్రియతేజుల వీ । రల ధీరుల ధరణివలయరాజ్యశ్రీయో
గ్యుల ని ట్లేలొకొ భిక్షా । శులఁ జేసె విధాతృఁ' డంచు శోకింప జనుల్. 239

ప్రతిపదార్థం: జలజ, ప్రియ, తేజులన్= నీటినుండి పుట్టిన పద్మానికి ప్రియుడైన సూర్యునివంటి కాంతి కలవాళ్ళను; ధీరులన్; ధరణి, వలయ, రాజ్యశ్రీ, యోగ్యులన్= భూమండలంయొక్క రాజ్యలక్ష్మికి తగినవాళ్ళను; వీరలన్= వీళ్ళను;

విధాత్రుఁడు= బ్రహ్మదేవుడు; ఏల+ఒకొ= ఎందుచేతనో; ఇట్లు= ఈ విధంగా; భిక్షా+అశులన్= భిక్షాన్నం తినేవాళ్ళుగా; చేసెన్; అంచున్= అంటూ; జనుల్; శోకింపన్= విచారింపగా.

తాత్పర్యం: 'సూర్యతేజులు, ధీరులు, భూమండలరాజ్యలక్ష్మికి తగినవాళ్ళు అయిన వీళ్ళను (పాండవులను) బ్రహ్మదేవుడు ఎందుచేత భిక్షాన్నం తినేవాళ్ళుగా చేశాడో కదా!' అని జనులంతా దుఃఖించగా.

క. పరమాన్నభక్ష్యభిక్షా । పరిపూర్ణతరంబు లయిన పాత్రము లయ్యే
వురు నిత్యంబు నివేదిం । తురు దల్లికిఁ గరముభక్తితో వినయమునన్. 240

ప్రతిపదార్థం: ఆ+ఏవురు= ఆ ఐదుగురు; నిత్యము= ప్రతిదినం; కరము= మిక్కిలి; భక్తితో; వినయమునన్= వినయంతో; పరమ+అన్న+భక్ష్య, భిక్షా, పరిపూర్ణతరంబులు+అయిన= పాయసంచేతను, పిండివంటలచేతను, అన్నంచేతను పూర్తిగా నిండినవైన; పాత్రములు= పాత్రములను; కుంతీదేవికి; నివేదింతురు= సమర్పిస్తారు, ఇస్తారు.

తాత్పర్యం: పాండవులైదుగురు ప్రతిదినం మిక్కిలి భక్తివినయాలతో పాయసం, పిండివంటలు, అన్నం నిండిన పాత్రలను తెచ్చి తల్లికి అందజేస్తారు.

వ. కుంతియు దాని రెండుభాగంబులు సేసి యం దొక్క భాగంబు భీమునకుం బెట్టి, తక్కిన భాగంబు గడమ కొడుకులుం దానును గుడుచుచు నిట్లు ప్రచ్ఛన్ను లై యేకచక్రపురంబున నున్నంత, నొక్కనాఁడు ధర్మార్జునయములు భిక్షార్థం బరిగిన నిట కుంతియు భీముండును దమ విడిసిన విప్రగృహంబున నున్నంత, నం దొక్కపెట్ట యార్తధ్వని యెగసిన విని కుంతీదేవి యెంతయు సంతాపించి భీమున కి ట్లనియె. 241

ప్రతిపదార్థం: కుంతియున్; దానిన్= ఆ ఆహారాన్ని; రెండు, భాగంబులు+చేసి; అందు+ఒక్క, భాగంబు; భీమునకున్+పెట్టి; తక్కినభాగంబు; కడమకొడుకులున్= తక్కినకొడుకులును; తానును= తానూ; కుడుచుచున్= తింటూ; ఇట్లు; ప్రచ్ఛన్నులు+ఐ= కప్పబడినవాళ్ళయి అంటే మారువేషాలలో ఉన్న వాళ్ళయి; ఏక, చక్ర, పురంబునన్; ఉన్న+అంతన్; ఉండగా; ఒక్కనాఁడు; ధర్మ+అర్జున+యములు= ధర్మరాజు, అర్జునుడు, నకులసహదేవులు; భిక్షా+అర్థంబు= భిక్షకోసం; అరిగినన్= వెళ్ళగా; ఇట, కుంతియు, భీముండును; తమ విడిసిన, విప్ర, గృహంబునన్= తమయొక్క విడిదిచేసిన బ్రాహ్మణగృహంలో; అంటే తా ముండే బ్రాహ్మణులఇంటిలో; ఉన్న+అంతన్= ఉండగా; అందున్= ఆ ఇంటిలో; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; ఆర్త, ధ్వని= ఏడుపుశబ్దం; ఎగసినన్= వ్యాపింపగా; విని; కుంతీదేవి, ఎంతయున్; మిక్కిలి; సంతాపించి= దుఃఖించి; భీమునకున్+ ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఆ ఆహారాన్ని రెండుభాగాలు చేసి ఒకభాగం భీమునికి పెట్టి, తక్కిన భాగాన్ని తానూ, తక్కినకొడుకులూ తింటూ, మారువేషంలో కాలం గడుపుతూండగా, ఒకనాడు ధర్మార్జుననకులసహదేవులు భిక్షకు వెళ్ళినసమయంలో తానూ భీముడూ ఇంట్లో ఉండగా, తా ముండే ఆ బ్రాహ్మణగృహంలో ఒక్కసారిగా పెద్దఏడుపు వినిపించింది. అది విని కుంతీదేవి ఎంతో బాధపడి భీమునితో ఇట్లా అన్నది.

తే. ఇందు సుఖ ముండితిమి యొరు లెఱుఁగకుండ । నేలొకో యిప్ప డీ విప్రు నింట నార్త
రవము వీతెంచె? దీని నారసి యెఱుంగ । వలయుఁ; దత్ప్రతీకారంబు వలయుఁ జేయ. 242

ప్రతిపదార్థం: ఒరులు+ఎఱుఁగక+ఉండన్= ఇతరులకు తెలియకుండ; ఇందున్= ఈ బ్రాహ్మణుని ఇంటిలో; సుఖము+ ఉండితిమి= సుఖంగా ఉన్నాం; ఇప్పుడు+ఈ, విప్రుని+ఇంటన్= ఇప్పు డీ బ్రాహ్మణుని ఇంట్లో; ఆర్త, రవము= ఏడుపుధ్వని; ఏల+ఒకో= ఎందుచేతనోకదా!; వీతెంచెన్= వ్యాపించింది; దీనిన్+ఆరసి= దీన్ని విచారించి; ఎఱుంగవలయున్= తెలిసికోవాలి; తత్+ప్రతీకారంబు= దానికి మారుచేతను; చేయ, వలయున్= చేయాలి, అనగా వాళ్ల బాధ తొలగించాలి.

తాత్పర్యం: ఇతరులకెవ్వరికీ తెలియకుండ ఇక్కడ సుఖంగా ఉన్నాం. ఎందుచేతనో ఇప్పు డీ బ్రాహ్మణుని ఇంట్లో ఏడుపుధ్వని వినవస్తున్నది. దీన్ని విచారించి తెలిసికొని వాళ్లబాధను తొలగించాలి.

వ. పరమోపకారి యైన యీ బ్రాహ్మణునకు నేమి ప్రియము సేయ సమకూరునో యని చింతించుచున్నచో నిప్పు డెద్ది యేనియు నొక్క దుస్తరం బయిన దుఃఖం బీ గృహస్థున కయ్యెం గావలయు; నా మనంబు మలమల మఱఁగెడుఁ గావున దీనిం దలఁగి వీరికి మనఃప్రియంబు సేయవలయు. 243

ప్రతిపదార్థం: పరమ+ఉపకారి+ఐన= మిక్కిలిఉపకారం చేసినవాడైన; ఈ, బ్రాహ్మణునకున్; ఏమి, ప్రియము= ఏమిఇష్టం; చేయన్; సమకూరునో= కలుగుతుందో; అని= ఆ విధంగా; చింతించుచున్+ఉన్నచోన్= ఆలోచిస్తూ ఉండగా; ఇప్పుడు; ఎద్ది+ఏనియున్= ఏదోఒక; దుస్తరంబు+అయిన= దాటరానిదైన; దుఃఖంబు= కష్టం; ఈ గృహస్థునకున్; అయ్యెన్+కావలయున్= అయి ఉండాలి; నా, మనంబు= నా యొక్క మనస్సు; మలమల= మలమలమాడినట్లు; మఱఁగెడున్= కాగుతున్నది - తపిస్తున్నది; కావునన్; దీనిన్= ఈ కష్టాన్ని; తలఁగి= తొలగించి; వీరికిన్; మనఃప్రియంబు= మనస్సుకు సంతోషాన్ని; చేయవలయున్= కలిగించాలి.

తాత్పర్యం: మనకు మహోపకారం చేసిన ఈ బ్రాహ్మణునికి ఏదైనా ఇష్టమైనది చేయాలని ఆలోచిస్తుండగా ఇప్పు డేదో దాట శక్యంకాని కష్టం ఈ యింటి యజమానికి కలిగినట్లున్నది. నా మనస్సు చాలా బాధపడుతున్నది. అందుచేత ఆ కష్టాన్ని తీర్చి' వారికి మనస్సంతోషాన్ని కలిగించాలి.

క. కృత మెఱుఁగుట పుణ్యము; స । న్మతి దానికి సమముసేఁత మధ్యము; మఱి త
త్కృతమున కగ్గలముగ స । త్కృతిసేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్. 244

ప్రతిపదార్థం: కృతబుద్ధులకున్= చేయబడినబుద్ధిగలవాళ్ళకు - అంటే పండితులకు; కృతము= చేయబడినదాన్ని; ఎఱుఁగుట= తెలిసికొనటం; పుణ్యము; సత్+మతిన్= మంచిబుద్ధితో; దానికిన్= చేసినమేలుకు; సమము= సమమైనదాన్ని - ప్రత్యుపకారాన్ని; చేఁత= చేయటం; మధ్యము= మధ్యమార్గం; మఱి= అంతేకాక; తత్+కృతమునకున్= ఆ చేయబడినదానికంటె; అగ్గలముగన్= అధికంగా; సత్+కృతి= మంచిపని; ప్రత్యుపకారం; చేయుట; ఉత్తమంబు.

తాత్పర్యం: బుద్ధిమంతులైనవాళ్ళు-ఎదుటివాళ్ళు చేసిన ఉపకారాన్ని గుర్తించటమే గొప్ప పుణ్యకార్యం. మంచిబుద్ధితో దానికి సమానమైన ప్రత్యుపకారం చేయటం మధ్యమమార్గం. అట్లాకాక చేసిన ఉపకారంకంటె ఎక్కువగా ప్రత్యుపకారం చేయటం ఉత్తమపద్ధతి.

విశేషం: నన్నయనానారుచిరార్థసూక్తి కిది ఒక చక్కని ఉదాహరణం.

వ. అనిన విని భీమసేనుం డి ట్లనియె. 245

తాత్పర్యం: అని కుంతీదేవి పలుకగా భీముడు విని ఈ విధంగా అన్నాడు.

వ. ఎఱిఁగి నాకుఁ జెప్పు; మిది యేమి? యెవ్వరి । వలన నింతయయ్యె? వగవ నేల?
యెంత కడిఁది యైన నిది యేను దీర్చి యీ । విప్రునకుఁ బ్రియంబు విస్తరింతు. 246

ప్రతిపదార్థం: ఇది; ఏమి= ఈ దుఃఖం ఏమిటి!; ఎవ్వరివలనన్= ఎవరివల్ల; ఇంత+అయ్యెన్= ఇంత జరిగింది - అంటే ఇంతదుఃఖం కలిగింది; ఎఱిఁగి= తెలిసికొని; నాకున్+చెప్పుము; వగవన్+ఏల= దుఃఖించటమెందుకు? ఎంత, కడిఁది+ఐనన్= ఎంతకష్టమైనదైనా; ఇది= దీన్ని; ఏను= నేను; తీర్చి= నెరవేర్చి, చక్కజేసి; ఈ, విప్రునకున్= ఈ బ్రాహ్మణునికి; ప్రియంబు= సంతోషాన్ని; విస్తరింతున్= అధికం చేస్తాను.

తాత్పర్యం: ఇ దేమి దుఃఖం? ఎవరివల్ల ఇంత జరిగింది? తెలిసికొని నాతో చెప్పుము. దుఃఖించటం ఎందుకు? ఇది ఎంత కష్టమైనదైనా నేను దీన్ని తీర్చి ఈ బ్రాహ్మణునికి మిక్కిలి సంతోషాన్ని కలిగిస్తాను.

వ. అనినం గుంతి యట్ల చేయుదు నని చని దుఃఖపరవశు లయి పరిదేవనంబు సేయుచున్న వారలం జూచి యడుగ నేరక మిన్న కున్నంత బ్రాహ్మణుండు దనబాంధవులు విన ని ట్లనియె. 247

ప్రతిపదార్థం: అనినన్=అనిచెప్పగా; కుంతి; అట్లు+అ= ఆ విధంగానే; చేయుదున్+అని= చేస్తాను అని చెప్పి; చని= వెళ్ళి; దుఃఖపరవశులు+అయి= దుఃఖానికి పూర్తిగా లొంగిపోయినవాళ్ళయి - అంటే పూర్తిగా దుఃఖంలో మునిగిపోయినవాళ్ళయి; పరిదేవనంబు; చేయుచున్+ఉన్న, వారలన్= ఏడుస్తూ ఉండే వాళ్లను; చూచి; అడుగనేరక= అడుగలేక; మిన్నక+ఉన్న+అంతన్= ఊరుకున్న తర్వాత; బ్రాహ్మణుండు; తన, బాంధవులు; వినన్= వినేటట్లుగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని భీము డనగా కుంతి అట్లాగే చేస్తా నని వెళ్ళి, పూర్తిగా దుఃఖంలో మునిగి ఏడుస్తున్నవాళ్ళను చూచి ఏమీ అడుగలేక ఊరకుండగా బ్రాహ్మణుడు తనబంధువులు వినేటట్లుగా ఇట్లా అన్నాడు.

బకున కాహారముగాఁ బోవుటనుగూర్చి బ్రాహ్మణకుటుంబము విచారించుట (సం.1-145-20)

క. నలసారము సంసార మ । ఖిలదుఃఖావహము భయనికేతన మతిచం
చలము పరాధీనం బిం । దుల జీవన మేల నమ్ముదురు తత్త్వవిదుల్. 248

ప్రతిపదార్థం: సంసారము; నలసారము= గడ్డియొక్కసారంవంటి సారంగలది - అంటే నిస్సారమైనది; దుఃఖ+ఆవహము= దుఃఖాన్ని కలిగించేది; భయ, నికేతనము= భయానికి ఇల్లు అయినట్టిది; అతి, చంచలము= మిక్కిలిచలించేది- స్థిరత్వం లేనట్టిది; పర+అధీనంబు= ఇతరులకు లొంగినట్టిది; తత్త్వవిదుల్= నిజాన్ని తెలిసికొన్నవారు - అంటే పండితులు; ఇందుల, జీవనము= సంసారంలోని బ్రతుకును; ఏల! నమ్ముదురు= ఎందుకు నమ్ముతారు.

తాత్పర్యం: సంసారం గడ్డివలె నిస్సారమైనది; దుఃఖాన్ని కలిగించేది; భయానికి స్థానమైనది; మిక్కిలి చంచలమైనది; ఇతరులకు లొంగేది; పండితులైనవాళ్ళు ఈ సంసారజీవనం సత్యమైనదని ఎట్లా నమ్ముతారు?

విశేషం: కథాప్రసన్నతకు భంగంలేకుండ, సందర్భోచితంగా మానవునికి వెలుగునిచ్చే నన్నయనానారుచిరార్థసూక్తులలో ఇది ఒకటి. నలసారము - నలస్యతృణస్యసారఇసారోయస్య సః - భా.కూ. - శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట.386.

క. ఆదిని సంయోగవియో । గాదిద్వంద్వములు దేహి యగు వానికి సం
పాదిల్లక తక్కవు పూ । ర్వోదయ కర్మమున నెట్టి యోగికి నయినన్. 249

ప్రతిపదార్థం: ఎట్టి, యోగికిన్+అయినన్= ఎట్లాంటి యోగాభ్యాసంచేసే వానికైనా లేదా ఎట్లాంటి అదృష్టవంతునికైనా; పూర్వ+ఉదయ, కర్మమునన్= పూర్వజన్మంలోని కర్మవలన; ఆదిని= మొదట; సంయోగ, వియోగ+ఆది, ద్వంద్వములు= కలవటం, విడిపోవటం మొదలయిన జంటలు; దేహి+అగువానికిన్= దేహంగలవాడైన వానికి - అంటే ప్రతిమనుజునికి; సంపాదిల్లక= కలుగక; తక్కవు= తప్పవు.

తాత్పర్యం: ఎంతయోగికైనా - ఏ మానవుడికైనా - పూర్వజన్మకర్మవలన కలవటం, విడిపోవటం ద్వంద్వాలను అనుభవించటం తప్పదు.

విశేషం: మానవజీవితతత్త్వాన్ని తెలిపే నన్నయ రుచిరార్థసూక్తులలో ఇది ఒకటి.

తరువోజ :-

ఏనును బ్రజలును నీధర్మసతియు నే యుపాయంబున నిబ్బారిఁ గడవఁ
గానేర్తు? మెయ్యది గర్జ? మిందుండఁ గా దేగుదమ యొండు గడ కని ముంద
రే నెంత సెప్పిన నెన్నండు వినద యిది; యిట్టిదారుణ మిమ్మెయిఁ జేయఁ
గా నున్న విధి యేల కడవంగ నిచ్చు? గర్మవిపాకంబు గడవంగ లావె. 250

ప్రతిపదార్థం: ఏనును= నేనూ; ప్రజలును= బిడ్డలును; ఈ, ధర్మ, సతియున్= ఈధర్మపత్ని - అంటే ఈ నా భార్యా; ఏ+ఉపాయంబునన్= ఏ ఉపాయంచేత; ఈ+బారిన్= ఈ ఆపదను; కడవంగన్= దాటగా; నేర్తుము (నేర్చుదము); ఏ+అది= ఏది; కర్జము= చేయదగింది; ఇందు+ఉండన్+కాదు= ఇక్కడ ఉండకూడదు; ఒండు+కడకున్= వేరొకచోటికి; ఏగుదము+అ= వెళ్ళుదామే; అని; ముందర+ఏను+ఎంత+చెప్పినన్= ముందుగా నే నెంతచెప్పినా; ఇది= ఈమె (భార్య); ఎన్నండు= ఎప్పుడూ; వినదు+అ= వినలేదు; ఇట్టి, దారుణము= ఇంతటిఘోరాన్ని; ఈ+మెయిన్= ఈవిధంగా; చేయన్+కాన్+ఉన్న= చేయటానికై ఉంటే; విధి= బ్రహ్మ; ఏల= ఎట్లు; కడవంగనిచ్చున్= పోనిస్తాడు; కర్మ విపాకంబు= కర్మఫలం; కడవంగన్= తప్పించుకోవటానికి; లావె= సాధ్యమా?

తాత్పర్యం: నేను, బిడ్డలు, నా భార్య ఏ ఉపాయంచేత ఈ ఆపదను దాటగలం? ఏం చేయాలో తోచకుండా ఉన్నది. ఇక్కడ ఉండకూడదు, వే రొకచోటికి వెళ్ళుదామే అని ముందుగా నే నే నెంత చెప్పినా నా భార్య వినలేదు. ఇంతటి ఘోరాన్ని ఈ విధంగా చేయబోతున్న బ్రహ్మ మమ్మల్ని ఎందుకు పోనిస్తాడు? కర్మఫలం తప్పించుకోవటం సాధ్యమా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. తరువోజకు 3 ఇంద్రగణాలు, 1 సూర్యగణం, మళ్ళీ 3 ఇంద్రగణాలు, 1 సూర్యగణం ఉంటాయి. 1-3-7 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి ఉంటుంది. ప్రాసనియతి ఉన్నది. 102వ పద్యం చూడండి.

సీ. మంత్రయుక్తంబుగా మత్పరిణీత యై । ధర్మచారిణి యగు దాని వినయ
వతిఁ బ్రజావతి ననువ్రత నెట్టు లసురకు । భక్ష్యంబ వగు మని పనుపనేర్తు?

ధర్మాభివృద్ధిగాఁ దగు వరునకు నీఁగ । నిల్లడ బ్రహ్మచే నిడఁగఁబడిన

యిక్కన్య యతిబాల యిం దుద్భవం బగు । దౌహిత్రలాభంబు దలుఁగ నెట్లు

ఆ. దీనిఁ బుత్తు? మఱి మదీయ పిండోదక । నిధిఁ దనూజుఁ గులము నిస్తరించు

వానిఁ బితృగణంబువలని ఋణంబుఁ బా । చిన మహోపకారిఁ జిఱుతవాని. 251

ప్రతిపదార్థం: మంత్రయుక్తంబుగాన్= మంత్రంతో కూడుకొన్నదిగా; మత్+పరిణీత+ఐన= నాచే వివాహమాడబడిన; ధర్మ, చారిణి+అగు, దానిన్= ధర్మంలో నడిచేదానిని; వినయవతిన్= వినయవంతురాలైనదానిని; అనువ్రతన్= అనుసరించి నడచుకొనేదానిని; ఎట్టుల= ఏ విధంగా; అసురకున్= రాక్షసునికి; భక్ష్యంబవు+అగుము+అని= తినదగిన దానివి కమ్ము అని; పనుప, నేర్తున్= పంపించగలను; ధర్మ+అభివృద్ధిగాన్= ధర్మం ఎక్కువగా పెరిగేటట్లు; తగు, వరునకున్= తగిన మగనికి; ఈగన్= ఇవ్వటానికి; బ్రహ్మచే= బ్రహ్మదేవునిచేత; ఇల్లడ= అడిగినప్పుడు ఇమ్మని ఉంచిన వస్తువుగా; ఇడఁగన్+పడిన= ఉంచబడిన; ఈ+కన్య; అతిబాల= చాలా చిన్నది; ఇందు+ఉద్భవంబు+అగు= దీనిద్వారా కలిగేటి; దౌహిత్ర, లాభంబు= కూతురికొడుకు - మనుమడు పుట్టటం; తలఁగన్= తొలగిపోయేటట్లు; ఎట్లు= ఏ విధంగా; దీనిని= ఈ కూతురిని; పుత్తున్= పంపిస్తాను; మఱి= అంతేకాక; మదీయ, పిండ+ఉదక, నిధిన్= నాయొక్క పితృదేవతల కిచ్చే అన్నపుముద్దలకు, నీళ్లకు స్థానమైనవాడిని; తనూజున్= శరీరంనుండి జన్మించినవాడిని - కుమారుడిని; కులము, నిస్తరించువానిన్= వంశాన్ని తరింపజేసేవాడిని; పితృగణంబువలని, ఋణంబున్+పాచిన, మహా+ఉపకారిన్= పితృదేవతలయొక్క సమూహంనుండి ఋణాన్ని తొలగించి గొప్ప ఉపకారం చేసినవాణ్ణి; చిఱుతవానిన్= చిన్నవాడిని.

తాత్పర్యం: వేదమంత్రపూర్వకంగా వివాహమాడి నాతోగూడ ధర్మమార్గాన చరిస్తూ వినయవతి అయి నన్ననుసరించి నడచుకొనే భార్యను రాక్షసునికి ఆహారం క మ్మని ఎలా పంపగలను? ధర్మం అభివృద్ధి చెందేటట్లు తగిన వరుడి కిచ్చి వివాహం చేయటానికి నా దగ్గర బ్రహ్మదేవుడు ఇల్లడగా ఉంచిన ఈ కన్యను నా కూతురిని - దౌహిత్రుడు నాకు లేకుండాపోయేటట్లు రాక్షసునికి ఆహారంగా ఎట్లా పంపగలను? అంతే కాదు, నా పితృదేవతలకు పిండోదకా లిచ్చే కుమారుడిని, వంశాన్ని తరింపజేసేవాడిని, పితృదేవతల ఋణం తీర్చే మహోపకారిని, ఈ చిన్నవాడిని.

ఆ, ఎట్టు సూచి చూచి యిది పాప మనక య । య్యసుర వాతఁ ద్రోతు నదయవృత్తి;

నరిగి యేన యిప్ప డసురకు నాహార । మగుదు వీరిఁ బుచ్చ నగునె నాకు. 252

ప్రతిపదార్థం: ఎట్టు= ఏవిధంగా; చూచి, చూచి; ఇది= ఈ పని; పాపము+అనక; ఆ+అసురవాతన్= ఆ రాక్షసుని చోట; అదయ, వృత్తిన్= దయలేనినడవడికతో - అంటే క్రూరంగా; త్రోతున్= తోస్తాను; ఏన= నేనే; అరిగి= వెళ్ళి; ఇప్పుడు+అ= ఇప్పుడే; అసురకున్= రాక్షసునికి; ఆహారము+అగుదున్= ఆహారం అవుతాను; నాకున్; వీరికిన్; పుచ్చన్+అగునె= పంపతగునా!

తాత్పర్యం: ఏ విధంగా చూచి చూచి ఇది పాపమని అనక ఈ చిన్నవాడిని క్రూరంగా ఆ రాక్షసునినోట తోస్తాను? నేనే వెళ్ళి ఇప్పుడే ఆ రాక్షసునికి ఆహారమవుతాను. వీళ్ళను నేను పంపదగునా?

వ. అని యాత్మపరిత్యాగంబునందుఁ గృతనిశ్చయుం డై యున్న బ్రాహ్మణుం జూచి బ్రాహ్మణి యి ట్లనియె. 253

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ఆత్మ, పరిత్యాగంబునందున్= తనను తాను అర్పించుకోవటంలో; కృత, నిశ్చయుండు+ఐ= చేయబడిన నిర్ణయం కలవాడై; ఉన్న; బ్రాహ్మణున్+చూచి; బ్రాహ్మణి= బ్రాహ్మణునిభార్య; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని తనను తాను అర్పించుకోవటానికి నిర్ణయించుకొన్న బ్రాహ్మణుణ్ణి చూచి, ఆ బ్రాహ్మణుని భార్య ఈ విధంగా అన్నది.

క. మనుజులకు నెవ్విధంబున । ననతిక్రమణీయ మైన యాపద్విషయం
బున సంతాపింపఁగ జన । దని యెఱిఁగియు నగునె యెట్టు లని శోకింపన్. 254

ప్రతిపదార్థం: మనుజులకున్; ఏ+విధంబునన్= ఏ విధంగానైనా; న+అతిక్రమణీయము+ఐన= దాటరానిదైన; ఆపత్+ విషయంబునన్= ఆపద విషయంలో; సంతాపింపఁగన్+చనదు+అని= దుఃఖించకూడదని; ఎఱిఁగియున్= తెలిసియు, ఎట్టుల+అని= ఎట్లా అని; శోకింపన్= దుఃఖించగా; అగునె= తగునా!

తాత్పర్యం: మానవులకు ఏవిధంగాను దాటరానిదైన ఆపదవిషయంలో శోకించగూడదని తెలిసికూడా ఎట్లా అని శోకింపవచ్చా? (కూడ దని భావం.)

వ. ఆ రక్కసున కే నశనం బయ్యెద; మీరు వగవకుండుఁడు; భార్యయందుఁ బడయంబడు నపత్యంబు నాయందు మున్న పడసితి; రేనును ఋణవిముక్త నయితిం; బ్రాణవియోగంబు సేసి యయినను భార్య పతికి హితంబు సేయవలయు; మఱి యట్లుంగాక. 255

ప్రతిపదార్థం: ఆ, రక్కసునకున్= ఆ రాక్షసునికి; ఏను+అశనంబు+అయ్యెదన్= నేను ఆహారమవుతాను; మీరు; వగవక+ఉండుఁడు= దుఃఖించకండి; భార్య+అందున్, పడయన్+పడు+అపత్యంబు= భార్యవల్ల పొందబడే సంతానం; నా+అందున్= నా యందు; మున్న= ముందే; పడసితిరి= పొందారు; ఏనును= నేనుకూడా; ఋణ, విముక్తను+అయితిన్= ఋణాన్ని తీర్చుకొన్న దాన్ని అయ్యాను; ప్రాణ, వియోగంబు+చేసి+అయినను= ప్రాణాలు వదలి అయినా; భార్య; పతికిన్= భర్తకు; హితంబు+చేయవలయున్= మేలు చేయాలి; అట్లున్+కాక= ఆవిధంగా కాకుండా.

తాత్పర్యం: ఆ రాక్షసునికి నేను ఆహారమవుతాను. మీరు దుఃఖించకండి. భార్యద్వారా పొందవలసిన సంతానాన్ని నాయందు ఇదివరకే మీరు పొందారు. నేను నా ఋణం తీర్చుకొన్నాను. ప్రాణాలు వదలి అయినా భార్య భర్తకు మేలుచేయాలి. అట్లాకాక-

ఆ. పురుషుకంటె మున్ను పరలోక మేఁగిన । సతియ నోఁచినదియు సతులలోనఁ;
బురుషహీన యైనఁ బరమపతివ్రత । యయ్యు జగముచేతఁ బ్రయ్యఁబడదె. 256

ప్రతిపదార్థం: పురుషుకంటెన్, మున్ను= భర్తకంటె ముందుగా; పరలోకము+ఏఁగిన, సతియ= పరలోకానికి పోయిన భార్యయే; సతులలోనన్= పతివ్రతలలో; నోచినదియు= పుణ్యంకలది; పురుష, హీన+ఐనన్= భర్తను కోల్పోయిందైతే; పరమ, పతివ్రత+అయ్యున్= పరమపతివ్రత అయికూడా; జగముచేతన్= లోకంచేత; ప్రయ్యన్+పడదె= నిందను పొందదా!

తాత్పర్యం: భర్తకంటె ముందు మరణించినభార్యే పతివ్రతలలో మిక్కిలి పుణ్యాత్మురాలు. పరమపతివ్రత అయినా భర్తలేని స్త్రీ లోకంచేత నింద పొందుతుంది గదా!

ఆ. పడిన యామిషంబు పక్షు లపేక్షించు । నట్లు పురుషహీనయయిన యువతిఁ
జూచి యెల్లవారుఁ జులుక నపేక్షింతు । రిదియుఁ బాప మనక హీనమతులు. 257

ప్రతిపదార్థం: పడిన+ఆమిషంబు= క్రింద పడిన మాంసపుముక్కను; పక్షులు+అపేక్షించునట్లు= పక్షులు కోరేవిధంగా; పురుష, హీన+అయిన, యువతిన్+చూచి= భర్తలేని స్త్రీని చూచి; ఎల్లవారున్= అందరు; హీనమతులు= నీచమైన బుద్ధికలవాళ్ళు; ఇదియున్= ఇది; పాపము+అనక; చులుకన్= తేలికగా; అపేక్షింతురు= కోరుకుంటారు.

తాత్పర్యం: క్రిందపడిన మాంసపుముక్కను పక్షులు కోరేవిధంగా భర్తను కోల్పోయిన స్త్రీని చూచి నీచులు ఇది పాప మని కూడా అనుకోక తేలికగా ఆమెను కోరతారు.

విశేషం: అలం: ఉపమ.

ఆ. సతి విముక్త యయినఁ బతికిఁ బునర్దార । సంగ్రహంబు సేఁత శాస్త్రమతము;
పతి విముక్తుఁ డయిన సతి కన్యపురుషసం । గ్రహముసేఁత లోకగర్హితంబు. 258

ప్రతిపదార్థం: సతి, విముక్త+అయినన్= భార్య విడువబడినదైతే - అంటే భార్య మరణిస్తే; పతికిన్= భర్తకు; పునః+దార, సంగ్రహంబు+చేత= మరల భార్యను చేపట్టటం; శాస్త్ర, మతము= శాస్త్రంయొక్క పద్ధతి; పతి, విముక్తుఁడు+అయినన్= భర్త విడువబడ్డ వాడయితే - అంటే భర్త మరణిస్తే; సతికిన్= భార్యకు, అన్య, పురుష, సంగ్రహము+చేఁత= మరొక భర్తను చేపట్టటం; లోక, గర్హితంబు= లోకంచేత నిందింపబడింది.

తాత్పర్యం: భార్య మరణిస్తే భర్త మరొక భార్యను స్వీకరించటం శాస్త్రసమ్మతమే. భర్త మరణిస్తే భార్య మరొక భర్తను స్వీకరించటం లోకంచేత నిందింపబడింది.

వ. 'కావున నేను భవద్విహీన నయి యొక్క నిమేషం బేనియు జీవింపనేర; నేర్చితినేనియు ని క్కుమారుల రక్షింపనేర; నె ట్లనిన శూద్రులు వేదశ్రుతిం బ్రార్థించునట్లు కులాచారసదృశులు గానివా రిక్కన్యం బ్రార్థించినం దత్ప్రతీకారంబు సేయను నిక్కుమారునందు గుణాధానంబు సేయను నాకొలంది గాదు; మత్పరోక్షంబునం బునర్దార పరిగ్రహంబు సేసి గృహస్థధర్మంబును నగ్నిహోత్రంబునుం బుత్త్రులను రక్షించునది । యనుచు మరణవ్యవసాయంబునం దున్న తల్లిని దండ్రిం జూచి కూఁతు రి ట్లనియె. 259

ప్రతిపదార్థం: కావున, నేను; భవత్+విహీనన్+అయి= మీయొక్కలేకుండటాన్ని గలదాననై - అంటే మీరు లేనిదాననై; ఒక్కనిమేషంబు+ఏనియు= ఒక నిమిషమైనా; జీవింపనేరన్= బ్రతుకలేను; నేర్చితిన్+ఏనియు= ఒకవేళ బ్రతుకనేర్చినా; ఈ+కుమారులన్= ఈ బిడ్డలను; కుల+ఆచార, సదృశులు, కాని వారు= కులంయొక్క ఆచారానికి సరిపోలనివాళ్ళు; ఈ+కన్యన్; ప్రార్థించినన్= కోరితే; తత్+ప్రతీకారంబు+చేయను= దానికి పరిహారం చేయటానికి; ఈ+కుమారుని+అందున్= ఈ కుమారునియెడ; గుణ+ ఆధానంబు+చేయను= గుణాలు ఉంచటాన్ని చేయటానికి - అనగా నేను చనిపోయింతర్వాత; పునః+దార, పరిగ్రహంబు+చేసి= మళ్ళీ భార్యను చేపట్టి; గృహస్థ; ధర్మంబును= గృహస్థునియొక్క ధర్మాన్ని - భార్యను పరిగ్రహించి

ధర్మార్థకామాలను నడుపుతూ, వేదపాఠం, వైశ్వదేవాదిహోమం, అతిథిపూజ, పితృతర్పణం, భూతబలి అనే పంచయజ్ఞాలు చేయటం; అగ్నిహోత్రంబునున్; పుత్త్రులను; రక్షించునది= కాపాడండి; అనుచున్, మరణ, వ్యవసాయంబు+అందు+ఉన్న= చనిపోయే ప్రయత్నంలో ఉన్న; తల్లిని, తండ్రిని+చూచి; కూతురు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కావున నేను మీరు లేకుండ ఒక్క నిమిషమైనా జీవించలేను. ఒకవేళ జీవించినా ఈ బిడ్డలను రక్షించలేను. ఎట్లంటే వేదాధికారం లేని శూద్రులు వేదం వినటాన్ని కోరినట్లు, కులాచారానికి సరిపోనివాళ్ళు ఈ కన్యను కోరితే దానికి ప్రతీకారం చేయటానికికాని, ఈ కుమారునికి మంచిగుణాలు అలవడేటట్లు తగినశిక్షణ ఇవ్వటానికి కాని - నాకు శక్తి లేదు. నేను మరణించినా మీరు మరొక భార్యను చేపట్టి గృహస్థ ఆచరించవలసిన ధర్మాన్ని, అగ్నిహోత్రాన్ని, పుత్రులను రక్షించండి' - అని చనిపోయే ప్రయత్నంలో ఉన్న తల్లిని, తండ్రిని చూచి కూతురు ఈ విధంగా అన్నది.

ఆ. ఒలసి యెంతకాల ముండిన నేను మీ । దానఁ గాన, యొరుల ధనము; నన్ను
నెన్నఁడయిన నొరుల కిచ్చుచో నసురకు । భోజనముగ నిచ్చి పుచ్చుఁ డిపుడ. 260

ప్రతిపదార్థం: ఒలసి= కలిసి; ఎంతకాలము+ఉండినన్= ఎంతకాలం మీతో ఉన్నా; ఏను= నేను; మీ, దానన్, కాను+అ= మీ దాన్ని కాను (ఆడదాన్నే); ఒరుల, ధనము+అ= ఇతరులయొక్క సొమ్మునే; నన్నున్= నన్ను; ఎన్నఁడు+అయినన్= ఏ రోజైనా; ఒరులకున్= ఇతరులకు; ఇచ్చుచోన్= ఇవ్వవలసిఉండగా, ఇపుడు+అ= ఇప్పుడే; అసురకున్= రాక్షసునికి; భోజనముగన్= ఆహారంగా; ఇచ్చి, పుచ్చుడు= ఇచ్చిపంపండి.

తాత్పర్యం: ఎంతకాలం మీతో కలిసి ఉన్నా నేను మీదాన్ని కాను, ఇతరుల సొమ్మునే. ఎప్పుడైనా నన్ను ఇతరుల కివ్వటం తప్పనప్పుడు ఇప్పుడే ఈ రాక్షసునికి ఆహారంగా ఇచ్చి పంపండి.

తే. తండ్రిచేయు తిలోదక దాన విధులు । పొందుఁ బరలోకగత యైన పుత్త్రియందుఁ;
బుత్త్రి చేసిన విధులు దత్పురుషుఁ గాని । తల్లిదండ్రులఁ బొందవు ధర్మయుక్తి. 261

ప్రతిపదార్థం: తండ్రి, చేయు, తిల+ఉదక, దాన, విధులు= నువ్వులు, నీళ్ళువదలటంవంటి తర్పణక్రియలు; పర, లోకగత+ఐన= స్వర్గలోకానికి వెళ్ళిందైన; పుత్త్రి+అందున్= కుమార్తెకు; పొందున్= చేరుతాయి; పుత్త్రి= కూతురు; చేసిన; విధులు= చేసేకర్మలు; తత్+పురుషునకున్+కాని= దానియొక్క భర్తకే కాని; తల్లి, తండ్రులన్; ధర్మయుక్తిన్= ధర్మంప్రకారం; పొందవు= చేరవు.

తాత్పర్యం: తండ్రి వదలే నువ్వులు, నీళ్ళు మరణించిన కూతురుకి చెందుతాయి. కాని, కూతురు చేసే కర్మలు ధర్మప్రకారం ఆమె భర్తకే కాని, తల్లిదండ్రులకు చెందవు.

విశేషం: సందర్భం వచ్చినపుడంతా నన్నయ సంక్షిప్తంగా వైదికవిధులు వివరిస్తాడు.

వ. 'మీకు నాయం దయ్యెడు దౌహిత్ర లాభంబునకంటె మీ రిద్దఱు జీవించిన ననేక పుత్త్ర పౌత్త్ర లాభం బగు; దానంజేసి కులంబు నిలుచుం గావున నన్నుఁ బుచ్చుం' డనినఁ గూఁతుం గౌఁగిలించుకొని యేడ్చుచున్న వారల కన్నీళ్ళు దుడుచుచు. 262

ప్రతిపదార్థం: మీకున్; నా+అందు+అయ్యెడు= నాయందు కలిగే; దౌహిత్ర, లాభంబునకంటెన్= మనుమని పుట్టుకకంటె; మీరు+ఇద్దఱు; జీవించినన్= బ్రదికిఉంటే; అనేక, పుత్త్ర, పౌత్త్ర, లాభంబు+అగున్= పెక్కుమందికుమారులు, మనుమలు కలగటం జరుగుతుంది; దానన్+చేసి= దానివలన; కులంబు= వంశం; నిలుచున్= నిలుస్తుంది; కావునన్, = కాబట్టి; పుచ్చుండు+అనినన్= పంపండి అని అనగా; కూఁతున్= కుమార్తెను; కౌఁగిలించుకొని; ఏడ్చుచున్+ఉన్న; వారల= తల్లిదండ్రుల; కన్నీళ్ళు, తుడుచుచున్.

తాత్పర్యం: 'మీకు నాయందు మనుమడు పుట్టటం అనే లాభంకంటె, మీ రిద్దరు బ్రతికి ఉంటే పెక్కుమంది కుమారులు, మనుమలు పుడతారు. వారివల్ల వంశం నిలుస్తుంది. అందుచేత నన్ను రాక్షసునికి ఆహారంగా పంపం'డని పలికిన కూతురుని కౌగలించుకొని ఏడుస్తున్న తల్లిదండ్రుల కన్నీళ్ళు తుడుస్తూ.

తే. బాలకుం డొక కొండుక కోల చేతఁ । బట్టికొని యేన రక్కసుఁ గిట్టి చంపి
చులుక వత్తు మీ రేడ్వఁగా వలవ, దనుచుఁ । గలయ నూరార్చెఁ దన తొక్కుఁబలుకు లొప్ప. 263

ప్రతిపదార్థం: బాలకుండు= చిన్నపిల్లవాడు; ఒక, కొండుక, కోల= ఒక చిన్నకర్రను; చేతన్+పట్టికొని= చేతిలో పట్టుకొని; ఏన= నేను; రక్కసున్= రాక్షసుణ్ణి; కిట్టి= సమీపించి, చంపి; చులుక= సులువుగ; వత్తున్= వస్తాను; మీరు+ఏడ్వఁగా, వలవదు+అనుచున్= మీరు ఏడ్వవద్దంటూ; తన, తొక్కున్, పలుకులు= తనయొక్క అవ్యక్తపు మాటలు - అంటే వచ్చీరాని మాటలు; ఒప్పన్= అందగింపగా; కలయన్= అందరినీ చేరి; ఊరార్చెన్= ఓదార్చాడు.

తాత్పర్యం: చిన్నపిల్లవాడు ఒకచిన్నకఱ్ఱను చేత పట్టుకొని 'నేనే ఆ రాక్షసుడిదగ్గరకు వెళ్ళి సులువుగా తిరిగివస్తాను; మీరు ఏడ్వవద్దు' అని వచ్చీరానిమాటలతో అందరినీ చేరి ఓదార్చాడు.

విశేషం: తొక్కుపలుకులు - అనేదానికి ముద్దుపలుకులు, తొట్రుపలుకులు, తొత్తుపలుకులు - అనేపాఠాంతరాలున్నాయి. - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.389. కుమారాస్త్రవిద్యాప్రదర్శనఘట్టంలోవలె నన్నయనాటకీయత ఈ తేటగీతిలో తాండవించింది. చిన్నకర్ర చేతపట్టుకొని, తడబడే అడుగులతోవచ్చీరానిమాటలతో అందరినీ చేరి ఓదార్చే ఆ బాలకుడిని భావుకుడైన ప్రతిపాఠకుడు చూడగలడు. పై పద్యంలో అన్నీ ప్రాసయతులే.

వ. వాని యవ్యక్తవచనంబులు విని యందఱు నే డ్పుడిగిన, నయ్యవసరంబునం గుంతీదేవి వారల డాయంబోయి. 264

ప్రతిపదార్థం: వాని, అవ్యక్త, వచనంబులు= ఆ బాలకునియొక్క స్పష్టతలేని మాటలు - వచ్చీరాని మాటలు; విని; అందఱున్= ఇంటివాళ్ళు అందరు; ఏడ్పు+ఉడిగినన్= ఏడుపు మానగా; ఆ+అవసరంబునన్= ఆ సమయాన; కుంతీదేవి; వారల, డాయన్+పోయి= వారలదగ్గరకు వెళ్ళి.

తాత్పర్యం: ఆ బాలకుని వచ్చీరాని మాటలు విని అందరూ ఏడ్పు మానగా, కుంతీదేవి వాళ్ళదగ్గరకు వెళ్ళి.

క. 'ఇది యేమి తెఱఁగు? దీనికి । మొద లెయ్యది నాకుఁ దెల్లముగఁ జెప్పుఁడు తీ
ర్చెద' నని విగతాసులఁ దన । మృదు వచన ప్రశ్న మను నమృతమున నెత్తెన్. 265

ప్రతిపదార్థం: ఇది= ఈ దుఃఖకారణము; ఏమి, తెఱఁగు= ఏమి పద్ధతి; దీనికిన్; మొదలు= కారణం; ఏ+అది; నాకున్, తెల్లముగన్= స్పష్టంగా; చెప్పుఁడు; తీర్చెదన్+అని= తొలగిస్తానని; విగత+అసులన్= పోయినప్రాణాలు కలవాళ్ళను; తన, మృదు, వచన, ప్రశ్నము+అను= తనయొక్క మెత్తనైన మాటలతో కూడిన ప్రశ్న అనే; అమృతమునన్= అమృతంచేత; ఎత్తెన్=పైకెత్తింది - అంటే బ్రతికించింది.

తాత్పర్యం: 'ఇది ఏమిటి? దీనికి కారణమేమి? నాకు స్పష్టంగా చెప్పండి. నే నీ ఆపదను తొలగిస్తాను' అని తన మృదువైన మాటలతో కూడిన ప్రశ్న అనే అమృతంతో వాళ్ళను బ్రతికించింది.

విశేషం: అలం: రూపకం.

వ. ఇ ట్లడిగినఁ గుంతీదేవికి నవ్విప్రుం డి ట్లనియె. 266

తాత్పర్యం: ఈ విధంగా అడిగిన కుంతీదేవికి ఆ బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు.

కుంతీదేవికి బ్రాహ్మణుండు తనదుఃఖకారణంబును దెలుపుట (సం.1-148-1)

సీ. ఏ నేమి సెప్పుదు దీని నెవ్వరికిని । మానుషంబునఁ దీర్పరాని దాని;
నయినను జెప్పెదఁ బ్రియహితవచన । యీ । ప్రోలికి నామడనేల నల్ల
యమునానదీగహ్వరమున బకుం డను । రక్కసుం డుండి వాఁ డక్కజముగ
నిందుల కాఁపుల నందఱఁ దొల్లి యి । ల్వరుస మ్రింగుచు నున్నఁ బరమసాధు

ఆ. లగు ధరామరేంద్రు లగణితజపహోమ । దానవిధులఁ జేసి వానివలనఁ
గ్రమము వడసి యొక్క సమయంబుఁ జేసిరి; । యొనర దాని తెఱఁగు వినుము తల్లి! 267

ప్రతిపదార్థం: మానుషంబునన్= మానవప్రయత్నంచేత; ఏ+వారికిని= ఎవరికికూడా; తీర్పరాని, దానిన్= తీర్చటానికి సాధ్యం కానిదానిని; దీనిన్= ఈ విపత్తును; ఏను= నేను; ఏమి+చెప్పుదున్= ఏమని చెప్పగలను? అయినను; ప్రియ, హిత, వచన= వినటానికి ఇంపై మేలుచేసే మాటలు గలదానా! చెప్పెదను; ఈప్రోలికిన్= ఈ పట్టణానికి; ఆమడ, నేలన్= ఆమడదూరంలో; అల్ల, యమునా, నదీ, గహ్వరమున= ఆ యమునానది దగ్గర కొండగుహలో; బకుండు+అను; రక్కసుండు+ఉండి= రాక్షసుడు ఉండి; వాఁడు+అక్కజముగన్= వాడు ఆశ్చర్యకరంగా; ఇందుల కాపులన్+అందఱన్= ఈ పట్టణంలో కాపురముండేవాళ్ళనందరిని; తొల్లి= ఇదివరకు; ఇల్+వరుసన్= ఇంటివరుసన; మ్రింగుచున్+ఉన్నన్= మ్రింగుతూ ఉండగా; పరమ, సాధులు+అగు= మిక్కిలి మంచి వాళ్ళయిన; ధరా+అమర+ఇంద్రులు= భూమియందు దేవతలు - అంటే బ్రాహ్మణశ్రేష్ఠులు; అగణిత, జప, హోమ, విధులన్+చేసి= లెక్కింపసాధ్యంగాని జపాలు, హోమాలు, దానాలు అనేకకర్మలను చేసి; వాని, వలనన్; క్రమము+పడసి= మార్గాన్ని పొంది; ఒక్క, సమయంబున్= ఒక ఏర్పాటును; చేసిరి; తల్లి= ఓ తల్లీ! ఒనరన్= ఒప్పగా; దాని, తెఱఁగు= దానియొక్కవిధం; వినుము.

తాత్పర్యం: మానవ ప్రయత్నంచేత ఎవ్వరికీ తీర్ప సాధ్యంగాని ఆపదనుగురించి ఏమని చెప్పగలను? ప్రియంగా, హితంగా మాట్లాడే ఓ తల్లీ! ఈ పట్టణానికి ఆమడదూరాన యమునానదీతీరంలో ఉండే అడవిలో బకుడనే రాక్షసు

డున్నాడు. వాడీపట్టణవాసులను ఇంటివరుసగా మింగుతుండగా పరమసాధువులైన బ్రాహ్మణశ్రేష్ఠులు లెక్కకు మిక్కిలి జప హోమ దాన సత్కర్మలు చేసి, అతనితో ఒక ఏర్పాటు చేసికొన్నారు. అది నీకు చెప్పుతాను. వినుము.

వ. నిత్యంబు నిలువరుస నొక్కమానిసి రెం డెనుపోతులం బూన్చిన శకటంబున నపరిమితభక్ష్యపిశిత మిశ్రాన్నంబు నించికొని పోయిన దానిని, వానిని, నయ్యెనుపోతులను భక్షించుచు. 268

ప్రతిపదార్థం: నిత్యంబున్= ప్రతిదినం; ఇలువరుసన్= ఇంటి వరుసబట్టి; ఒక్క, మానిసి= ఒక్కమనిషి; రెండు+ఎనుపోతులన్= రెండు దున్నపోతులను; పూన్చిన= కట్టిన; శకటంబునన్= బండిలో; అపరిమిత, భక్ష్య, పిశిత, మిశ్ర+అన్నంబు= అంతులేని తినుబండారాలతో, మాంసంతో కలిపిన అన్నం; నించికొని= నింపుకొని; పోయినన్= పోతే; దానిన్= ఆ అన్నాన్ని; వానిని= ఆ మనిషినీ; ఆ+ఎనుపోతులను=ఆ దున్నపోతుల్నీ; భక్షించుచున్= తింటూ.

తాత్పర్యం: ప్రతిదినం ఇంటివరుసన ఒక మనిషి రెండు దున్నపోతులను కట్టిన బండిలో అపరిమితమైన తిను బండారాలూ, మాంసంతో కలిపిన అన్నాన్నీ నింపుకొని వెళ్ళితే, వాడు ఆ అన్నాన్నీ, మనిషినీ, ఆ దున్నపోతుల్నీ తింటూ.

ఆ. మనుజభక్షుఁ డిదియ తనకు నప్పనముగా । నొరులవలనిబాధ నొరయకుండ
దీనిఁ గాచుచుండు నీనాఁటిరాజును । దలఁపఁ డసుర నోర్వ బలిమిలేమి. 269

ప్రతిపదార్థం: మనుజ, భక్షుఁడు= మానవులను తినేవాడు - రాక్షసుడు; ఇదియ= ఇదే; తనకున్, అప్పనముకాన్= కానుకగా; ఒరుల, వలని, బాధన్= ఇతరులవలన కలిగేబాధను; ఒరయక+ఉండన్= కలుగకుండ; దీనిన్= ఈపట్టణాన్ని; కాచుచుండున్= రక్షిస్తూఉన్నాడు; ఈ, నాఁటి, రాజును= ఈ దేశపు రాజుకూడ; అసురన్= రాక్షసుడిని; ఓర్వన్= అణచటానికి; బలిమిలేమిన్= బలంలేకుండటంచేత; తలపఁడు= దీన్నిగురించి ఆలోచించడు.

తాత్పర్యం: రాక్షసుడు ఇదే తనకు కానుకగా భావించి, ఇతరులవలన ఈ పట్టణానికి బాధ కలుగకుండ రక్షిస్తూ ఉన్నాడు. ఈ దేశప్రభువుకూడ రాక్షసుడిని చంపగలశక్తి లేనివాడవటంచేత దీన్ని గురించి ఆలోచించడు.

విశేషం: అప్పనము - అనేదానికి జీవితము, వర్తనము, వేతనము, జీవనము అనే పాఠాంతరాలున్నాయి. శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట.290,

ఉ. పోలఁగ ధర్మశీలుఁ డయి భూరిబలాధికుఁ డైన ధారుణీ
పాలకు రక్ష ము న్వడసి భార్యను బుత్త్రుల నర్థయుక్తితో
నోలిన మేలుగాఁ బడసి యూళ్ళను నున్నది యట్లుగాని నాఁ
డేల గృహస్థవృత్తి సుఖ మేఁగి వనంబున నుక్కి కష్టమే. 270

ప్రతిపదార్థం: పోలఁగన్= ఒప్పుగ; ధర్మ, శీలుఁడు+అయి= ధర్మం స్వభావంగా కలవాడై; భూరి, బల+అధికుఁడు+ఐన= పెద్దబలంచేత గొప్పవాడైన; ధారుణీ, పాలకు, రక్ష=భూమిని ఏలే రాజుయొక్క అండ; మున్+పడసి= ముందుగా పొంది; భార్యను; పుత్త్రులన్; అర్థ, యుక్తితోన్= ధనంయొక్కకూడికతో - అంటే ధనం కలిగి; ఓలిన= వరుసగా; మేలుగాన్= మేలు కలదిగా; పడసి= పొంది; ఊళ్ళను+ఉన్నది= ఊళ్ళలో కాపురమున్నట్టిది (తగినపద్ధతి); అట్లు+కాని, నాఁడు= ఆ విధంగా కాని

నాడు; ఏల= ఎందుకు? గృహస్థ, వృత్తి= గృహస్థధర్మం; సుఖమె=సుఖమా! ఏఁగి= వెళ్ళి; వనంబునన్= అడవిలో; ఉనికి= ఉండటం; కష్టమే= కష్టమా!

తాత్పర్యం: ధర్మాత్ముడు, బలవంతుడు అయిన రాజుయొక్క రక్షణ పొందిన తర్వాత వివాహమాడి, పిల్లలను కని, ధనం సంపాదించి, ఊళ్ళలో కాపురముండాలి కాని, అది లేనినాడు గృహస్థవృత్తి ఎందుకు? అది సుఖాన్ని ఇయ్యగలదా! వెళ్ళి అడవిలో ఉండటం కష్టమా! అదే సుఖం గదా!

విశేషం: సందర్భోచితంగా ఈ పద్యం రాజధర్మాన్ని చెప్పుతున్నది.

క. అరి యని విప్రులచేతను । ధరణీశులు పోఁకయును మొదలుగాఁ గొన రె
వ్వరు నిప్పాపుఁడు మానిసి । నరిగొనియెడు భక్షణార్థి యై విప్రులచేన్. 271

ప్రతిపదార్థం: ధరణి+ఈశులు= భూమికిప్రభువులు - రాజులు; ఎవ్వరున్= ఎవరుకూడ; విప్రులచేతను= బ్రాహ్మణులచేత; అరి+అని= కప్పమని; పోఁకయును, మొదలుగాన్= వక్కనుకూడ; కొనరు= తీసికొనరు; ఈ+పాపుఁడు= ఈ పాపాత్ముడైన రాక్షసుడు; భక్షణ+అర్థి+ఐ= తిండికోరినవాడై; విప్రులచేన్= బ్రాహ్మణులచేత; మానిసిన్= మనిషిని; అరిగొనియెడున్= కప్పంగా తీసికొంటున్నాడు.

తాత్పర్యం: రాజులు బ్రాహ్మణులనుండి పోకచెక్కనుకూడా కప్పంగా తీసికొనరు. కాని ఈ పాపాత్ముడైన రాక్షసుడు తిండికొరకు విప్రులనుండి మనిషినే కప్పంగా తీసికొంటున్నాడు.

విశేషం: 'పోఁకయు' అనేదానికి 'రూకయు, రూఁకయు' అనే పాఠాంతరాలున్నాయి - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.391.

వ. 'పెద్దకాలంబునకు నీ యిలువరుస నేఁడు మాకు వచ్చె; ని చ్చిఱుత వాని నా రాక్షసునకు భక్ష్యంబుగాఁ బుచ్చనోప; నేన పోయెద' నని దుఃఖించి పలికిన బ్రాహ్మణునకుఁ గుంతి యి ట్లనియె; 'నయ్యా! దీనికి సంతాపింపవలవ; దీయాపద దలఁగునట్టి యుపాయంబు గంటి; నీకుం గొడు కొక్కరుండ; వాఁడును గడుబాలుండు; బలిగొనపోవ నర్హుండు గాఁడు; నా కేవురుగొడుకులు గలరు; వారలలో నొక్కరుం డారక్కసునకు భవదర్థంబుగా బలి గొని పోయెడు' ననిన దాని విననోడి బ్రాహ్మణుండు చెవులు మూసికొని యి ట్లనియె. 272

ప్రతిపదార్థం: పెద్దకాలంబునకున్= చాలాకాలానికి; ఈ+ఇలు, వరుస= ఈ ఇంటివరుస; నేఁడు= ఈ రోజు; మాకున్= మాకు (వంతుగా); వచ్చెన్= వచ్చింది; ఈ+చిఱుత, వానిన్= ఈ చిన్నవాడిని; ఆ రాక్షసునకున్= ఆ రక్కసునికి; భక్ష్యంబు+కాన్= ఆహారంగా; పుచ్చన్+ఓపన్= పంపలేను; నేను+అ= నేనే; పోయెదను+అని= పోతానని; దుఃఖించి=విలపించి; పలికిన= మాటాడిన; బ్రాహ్మణునకున్= విప్రునికి; కుంతి=కుంతీదేవి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది; అయ్యా!; దీనికిన్; సంతాపింపన్, వలవదు= దుఃఖించవద్దు; ఈ+ఆపద, తలఁగునట్టి= ఈవిపత్తు తొలగిపోయేటి; ఉపాయంబు+కంటిన్= ఉపాయాన్ని కనుగొన్నాను; నీకున్; కొడుకు; ఒక్కరుండు+అ= ఒక్కడే; వాఁడును= వాడుకూడా; కడున్= మిక్కిలి; బాలుండు= పసివాడు; బలికొనిపోవన్= ఆహారం తీసికొనిపోవటానికి; అర్హుండు= తగినవాడు; కాఁడు= కానేరడు; నాకున్+ఏవురు, కొడుకులు= నాకు ఐదుగురు కొడుకులు; కలరు=ఉన్నారు; వారలలోన్, ఒక్కరుండు= ఆ అయిదుమందిలో ఒకడు; ఆ రక్కసునకున్; భవత్+అర్థంబుగాన్= మీకోసం; బలి, కొని, పోయెడున్= కప్పం తీసికొనివెళ్ళగలడు; అనినన్= అని అనగా; దానిన్= ఆ మాటను; వినన్+ఓడి= వినలేక; బ్రాహ్మణుండు; చెవులు, మూసికొని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'చాలా కాలానికి ఈ యింటివరుస నేడు మా యింటికి వచ్చింది. ఈ పసిబాలుణ్ణి రాక్షసునికి ఆహారంగా పంపలేను. నేను పోతాను' అని బ్రాహ్మణుడు దుఃఖంతో పలుకగా, కుంతి 'అయ్యా! దీనికి దుఃఖించవద్దు. ఈ ఆపద తొలగే ఉపాయం నేను ఆలోచించాను. నీకు ఒక్కడే కొడుకు. వాడు పసివాడు. బకుడికి బలితీసుకొనిపోవటానికికూడా అర్హుడు కాడు. నాకు ఐదుగురు కొడుకులు. వాళ్ళలో ఒకడు మీకు బదులుగా ఈ బలి తీసికొని వెళ్ళగలడు' అని అంటూనే బ్రాహ్మణుడు ఆ మాటలు వినలేక చెవులు మూసికొని ఆమెతో ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

అతిథి యై వచ్చిన బ్రాహ్మణున్ జీవితార్థి నై నాకు
హితముగా రక్కసువాతఁ ద్రోవ నే నె ట్లొడంబడుదు?
మతి నవమానింపఁగా దనిన విప్రుమరణంబు దలఁచు
టతిపాతకము; పాతకములలో బ్రహ్మహత్యయ పెద్ద. **273**

ప్రతిపదార్థం: అతిథి+ఐ= అతిథిగా; వచ్చిన; బ్రాహ్మణున్= విప్రుడిని; జీవిత+అర్థిని+ఐ= బ్రతుకు కోరుకొన్నవాడినై; నాకున్, హితముగా= నాకు మేలుకలిగేటట్లుగా; రక్కసు; వాతన్= రాక్షసుడి నోటిలో; త్రోవన్= త్రోయటానికి; ఏన్= నేను; ఎట్లు= ఏవిధంగా; ఒడంబడుదున్= ఒప్పుకొంటాను; మతిన్= మనస్సులో; అవమానింపన్+కాదు+అనినన్= అవమానించతగదు అనగా; విప్ర, మరణంబు= బ్రాహ్మణునియొక్క చావును; తలఁచుట= సంకల్పించటం; అతి, పాతకము= మహాపాపం; పాతకములలోన్= పాపాలలో; బ్రహ్మహత్యయు+అ= బ్రాహ్మణుడినిచంపటమే; పెద్ద= పెద్దపాపం.

తాత్పర్యం: అతిథిగా వచ్చిన బ్రాహ్మణుడిని, నా జీవితాన్ని నిలుపుకొనే కోరికతో - నాకు మేలు కలిగేటట్లుగా - రాక్షసునిబారిన పడవేయటానికి నే నెట్లా అంగీకరిస్తాను? అసలు బ్రాహ్మణులను అవమానించే సంకల్పమే పాపమైతే విప్రుని మరణాన్ని సంకల్పించటం మరెంత పాపమో! పాతకాలన్నింటిలో బ్రాహ్మణహత్య మహాపాపం. (పెద్దది)

విశేషం: మధ్యాక్కర లక్షణం చూడు. ఆది. 6.166. ఇది ధార్మికసూక్తి.

క. ధృతి సెడి వేఁడెడువానిని । నతిథిని నభ్యాగతుని భయస్థుని శరణా
గతుఁ జంపఁగ నొడఁబడు దు । ర్మతి కిహముం బరముఁ గలదె మదిఁ బరికింపన్. **274**

ప్రతిపదార్థం: ధృతి+చెడి= ధైర్యంపోయి; వేఁడెడు, వానినిన్= ప్రార్థించేవాడిని; అతిథిని= తిథిలేకుండావచ్చే ఆగంతకుణ్ణి; అభి+అగతుని= భోజనమయానికి రమ్మని ఆహ్వానింపగా వచ్చిన అతిథిని; భయస్థునిన్= భయపడేవాడిని; శరణ+ఆగతున్= శరణుకోరి వచ్చినవాడిని; చంపఁగన్= చంపటానికి; ఒడన్, పడు= ఇష్టపడు; దుర్+మతికిన్= చెడ్డబుద్ధికలవాడికి; మదిన్= మనస్సులో; పరికింపన్= ఆలోచిస్తే; ఇహమున్+పరమున్= ఇహలోకపరలోకసుఖం; కలదె= కలదా! (లేదని భావం)

తాత్పర్యం: ధైర్యాన్ని కోల్పోయి ప్రార్థించేవాడిని, అతిథిని, అభ్యాగతుడిని, భయపడేవాడిని, శరణు కోరి వచ్చిన వాడిని చంపాలనుకొనే దుర్మార్గునికి ఇహలోకపరలోకసుఖముంటుందా! (ఉండదు).

వ. 'మఱి యాత్మఘాతంబు మహాపాతకంబు; దాని కెట్లొడంబడి తంటేని యది యనతిక్రమణీయం బయి యప్రతీకారం బయి యొరులచేతం జేయంబడుటంజేసి నాకుం బాతకంబు లేదు; దానిం జేసినవానికి మహాపాతకం బగుం గావున బ్రాహ్మణహింస కే నొడంబడ నోప' ననినఁ గుంతి యి ట్లనియె. 275

ప్రతిపదార్థం: మఱి ఆత్మ, ఘాతంబు= తనను తాను చంపుకోవటం; మహా, పాతకంబు= మిక్కిలిపాపం; దానికిన్= ఆ ఆత్మహత్యకు; ఎట్లు+ఒడంబడితివి+అంటి+ఏని= ఏ విధంగా అంగీకరించావు అని అంటావేమో; అది; న+అతిక్రమణీయంబు+ అయి= మారుసేత లేనిదై; ఒరులచేతన్+చేయన్+పడుటన్+చేసి= ఇతరులచేత చేయబడటంవలన; నాకున్; పాతకంబు= పాపం; లేదు, దానిన్+చేసిన, వానికిన్= ఆ పనిగావించిన అతనికి; మహా, పాతకంబు= మిక్కిలిపాపం; అగున్=అవుతుంది; కావునన్; బ్రాహ్మణ, హింసకున్= బ్రాహ్మణమరణానికి; ఏన్= నేను; ఒడంబడన్+ఓపన్= ఇష్టపడలేను; అనినన్= అనగా; కుంతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'తనను తాను చంపుకొనటం (ఆత్మహత్య) మహాపాపం కదా! దానికెట్లా అంగీకరించావని అంటావేమో - అది దాటరానిదై, మారుచేయటానికి వీలులేనిదై, ఇతరులచేత చేయబడుతున్నది కనుక నాకు పాపం లేదు. దానిని చేసినవాళ్ళకే మహాపాపం కనుక నేను బ్రాహ్మణహింసకు (అంటే మీ కుమారుడిని బకుడికి ఆహారంగా పంపటానికి) ఇష్టపడలే' నని పలుకగా కుంతి ఇట్లా అన్నది.

బకునిఁ జంప భీమునిఁ బంపుటకుఁ గుంతి నిశ్చయించుట (సం.1-149-13)

క. ఏనును దీనిన తలఁచి మ । హీనుత! విప్రవధ యెద సహింపక మఱి నా
సూను సమర్పించితి; మ । త్సూను వధింపంగ రక్కసునకు వశంబే? 276

ప్రతిపదార్థం: మహీ, నుత= లోకంచేత కొనియాడబడేవాడా; ఏనును= నేనుకూడ; దీనిన్+అ= దీన్నే; తలఁచి= ఆలోచించి; విప్ర, వధ= బ్రాహ్మణుడిని చంపటాన్ని; ఎదన్, సహించక= మనస్సులో ఓర్వలేక; మఱి; నా, సూనున్= నాయొక్కకుమారుడిని; సమర్పించితిన్= ఇచ్చాను; మత్+సూనున్+వధింపంగన్= నాయొక్కకుమారుడిని చంపటం; రక్కసునకున్= రాక్షసుడికి; వశంబె= సాధ్యమా; (కాదని భావం)

తాత్పర్యం: నేనుగూడ దీన్నే ఆలోచించి బ్రాహ్మణవధను సహింపక నా కుమారుణ్ణి బకాసురుడికి అర్పిస్తానన్నాను. నా కుమారుడిని చంపటం ఆ రాక్షసుడికి సాధ్యం కాదు.

క. ఖలు నసుర నోర్వ నోపెడు । బలయుతుఁగా నెఱిఁగి కొడుకుఁ బనిచెదఁ గా; కి
మ్ములఁ శతపుత్రులు గల ధ । న్యుల కైన ననిష్టుఁ డగు తనూజుఁడు గలఁడే ? 277

ప్రతిపదార్థం: ఖలున్+అసురన్+ఓర్వన్+ఓపెడు= దుర్మార్గుడైన రాక్షసుడిని చంపగలిగిన; బలయుతుగాన్= బలంతో కూడుకొన్నవానిగా; ఎఱిఁగి= తెలిసికొని; కొడుకున్; పనిచెదన్= పంపుతున్నాను; కాక= అట్లా కాక; ఇమ్ములన్= సుఖంగా; శత, పుత్రులు= నూరుమంది కొడుకులు; కల= ఉన్నట్టి; ధన్యులకున్+ఐనన్= పుణ్యాత్ములకైనా; అనిష్టుఁడు+అగు= ఇష్టంకానివాడైన; తనూజుఁడు= పుత్రుడు; కలఁడే= ఉన్నాడా? (ఉండడని భావం.)

తాత్పర్యం: దుర్మార్గుడైన రాక్షసుడిని చంపగల బలవంతుడని తెలిసే నా కుమారుడిని పంపుతున్నాను. కాకుంటే వందమంది కొడుకులున్నవాళ్ళకయినా ఇష్టంకాని కొడుకు ఉంటాడా?

వ. 'ఈతనిచేతఁ దొల్లియుఁ బెక్కం డ్రసురులు నిహతు లయిరి' వీఁడు మహాబలసంపన్నుండు మంత్రసిద్ధుం; డని భీముం బిలిచి 'యీ బ్రాహ్మణునాపదం దలఁగి నాకు మనఃప్రియంబు సేయు' మనిన వల్లె యని భీముం డారక్కసుఁ జంప బూనె; బ్రాహ్మణుండును దనబంధువర్గంబుతో సంతసిల్లె; నంత ధర్మార్జుననకుల సహదేవులు వచ్చి పరమహర్ష పరిపూర్ణుండై యున్న పవనతనయునాకారం బుపలక్షించి విస్మితు లగుచుండ ధర్మతనయుం డల్లనఁ దల్లికి ని ట్లనియె. 278

ప్రతిపదార్థం: ఈతనిచేతన్= ఈ నా కుమారునిచేత; తొల్లియున్= ఇదివరకుకూడ; పెక్కండ్రు+అసురులు= పెక్కుమంది రాక్షసులు; నిహతులు+అయిరి= చంపబడినవాళ్ళయ్యారు; వీఁడు= ఇతడు; మహాబల, సంపన్నుండు= మిక్కిలి బలసంపద కలవాడు; మంత్రసిద్ధుండు= మంత్రసిద్ధి కలవాడు; అని= అని చెప్పి; భీమున్, పిలిచి; ఈ, బ్రాహ్మణు+ఆపదన్= ఈ బ్రాహ్మణుని యొక్క విపత్తును; తలఁగి= తొలగించి; నాకున్; మనఃప్రియంబు= మనస్సుకు సంతోషం; చేయుము; అనినన్= అనగా; వల్లె+అని= సరే అని; భీముండు; ఆ, రక్కసున్= ఆ రాక్షసుని; చంపన్+పూనెన్= చంపటానికి పూనుకొన్నాడు; బ్రాహ్మణుండును= బ్రాహ్మణుడుకూడా; తన, బంధు, వర్గంబుతో= తనయొక్క బంధువుల సమూహంతో; సంతసిల్లెన్= సంతోషించాడు; అంతన్= తర్వాత; ధర్మ+అర్జున, నకుల, సహదేవులు= ధర్మరాజు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు; వచ్చి; పరమ, హర్ష, పరిపూర్ణుండు+ఐ= మిక్కిలిసంతోషంతో నిండినవాడై; ఉన్న= ఉండే; పవన, తనయు+ఆకారంబున్= వాయుపుత్రుడైన భీమునియొక్క రూపాన్ని; ఉపలక్షించి= చూచి; విస్మితులు+అగుచున్+ఉండన్= ఆశ్చర్యం పొందినవారవుతుంటే; ధర్మతనయుండు= ధర్మరాజు; అల్లనన్= మెల్లగా; తల్లికిన్= తల్లితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఇతడు ఇదివరకుకూడా పెక్కుమంది రాక్షసులను చంపాడు. ఇతడు మహాబలవంతుడు. మంత్రసిద్ధి కలవాడు' అని భీముడిని పిలిచి 'ఈ బ్రాహ్మణుని ఆపద తీర్చి నా మనసుకు సంతోషాన్ని కూర్చు'మనగా సరే అని భీముడు ఆ రాక్షసుడిని చంపటానికి పూనుకొన్నాడు. బ్రాహ్మణుడుకూడ తనబంధువులతో కలిసి సంతోషించాడు. తరువాత ధర్మరాజు, అర్జునుడు, నకులసహదేవులు వచ్చి మహానందంతో ఉన్న భీముని రూపాన్ని చూచి ఆశ్చర్యపడుతుండగా ధర్మరాజు మెల్లగా తల్లితో ఇట్లా అన్నాడు.

చ. నరనుతకీర్తి యీ యనిలనందనుఁ డెవ్వరితోడనేని భీ
కరసమరంబు సేయ సమకట్టినయట్లు మహానురాగ ని
ర్భరమున నున్నవాఁ; డితనిభావము సూడఁగ వేఱు; వీని సు
స్థిరబలు మీరు పంచితిరొ? చెచ్చెరఁ దాన యుపక్రమించెనో? 279

ప్రతిపదార్థం: నర, నుత, కీర్తి= మనుష్యులచేత పొగడబడిన కీర్తిగలవాడు; ఈ+అనిలనందనుడు= ఈ వాయుపుత్రుడు - భీముడు; ఎవ్వరితోడన్+ఏని= ఎవ్వరితోనైనా; భీకర, సమరంబు+చేయన్= భయంకరమైన యుద్ధం చేయటానికి; సమకట్టిన+అట్లు= పూనుకొన్నట్లు; మహా+అనురాగ, నిర్భరమునన్+ఉన్నవాఁడు= గొప్పసంతోషంచేత నిండినట్లున్నాడు; ఇతని, భావము+చూడఁగన్= ఇతనియొక్క స్థితిని చూస్తే; వేఱు= మార్పుగ ఉన్నది; సుస్థిరబలున్= మిక్కిలి నిలకడగల బలంగలవాడిని; వీనిన్= ఈ భీముడిని; మీరు; పంచితిరొ= ఆజ్ఞాపించారా; చెర+చెరన్= వెంటనే; తాను+అ= తనంతట తానే; ఉపక్రమించెనో= పూనుకొన్నాడో!

తాత్పర్యం: భీముడు ఎవరితోనో భయంకర యుద్ధం చేయటానికి పూనుకొన్నట్లు మహాసంతోషంగా ఉన్నాడు. ఇతనిస్థితి చూస్తే ఎప్పటిలాగ లేదు. ఈ భీముడిని మీరు ఆజ్ఞాపించారా? లేక తనంతట తానే యుద్ధానికి పూనుకొన్నాడా?

వ. అని యడిగిన ధర్మతనయునకుఁ గుంతీదేవి 'యీ యేకచక్రపురంబున బ్రాహ్మణుల బకాసురుండు బాధించుటయుఁ దమ విడిసిన యింటిబ్రాహ్మణుని కైన యాపదయు, దానిం దీర్పం బవనతనయు బ్రాహ్మణార్థంబుగాఁ దనసమర్పించుటయుం జెప్పిన విని ధర్మజుండు దుఃఖించి 'యిది యేమి సాహసంబు సేసితి? రొడ్లకొడుకులకుంగాఁ దమకొడుకుల విడుచు దుర్బుద్ధులునుం గలరె; యిది లోకాచారవిరుద్ధంబు; మఱి భీమసేనుఁడు మీకు విడువందగియెడు కొడుకే? **280**

ప్రతిపదార్థం: అని; అడిగిన; ధర్మతనయునకున్= ధర్మరాజుకు; కుంతీదేవి, ఈ+ఏకచక్ర, పురంబున, బ్రాహ్మణులన్= ఈ ఏకచక్రపురంలోని బ్రాహ్మణులను; బక+అసురుండు= బకుడు అను రాక్షసుడు; బాధించుటయున్; తమ, విడిసిన= తమయొక్క విడిది చేసిన; ఇంటి= ఇంటిలోని; బ్రాహ్మణునికిన్+ఐన= బ్రాహ్మణునికి కలిగిన; ఆపదయు, దానిన్+తీర్పన్= దానిని తీర్చటానికి; పవన, తనయున్= వాయుదేవునియొక్కకుమారుడైన భీముడిని; బ్రాహ్మణ+అర్థంబుగాన్= బ్రాహ్మణునికొఱకు; తన, సమర్పించుటయున్= తనయొక్కఇవ్వటం - అంటే తా నివ్వటం; చెప్పినన్= చెప్పగా; విని; ధర్మజుండు= ధర్మరాజు; దుఃఖించి; ఇది+ఏమి+సాహసంబు+చేసితిరి; ఒడ్ల, కొడుకులన్+కాన్= ఇతరులయొక్క కొడుకులకొరకు; తమ, కొడుకులన్; విడుచు= వదిలే; దుర్+బుద్ధులునున్= చెడుబుద్ధి కలవారుకూడ; కలరె= ఉన్నారా? ఇది; లోక+ఆచార, విరుద్ధంబు= ఇది లోకంయొక్కపద్ధతికి వ్యతిరేకమైనది; మఱి= అంతేకాక; భీమసేనుఁడు; మీకున్; విడువన్+తగియెడి; కొడుకే. (విడువదగిన కొడుకు కాడని భావం.)

తాత్పర్యం: అని అడిగిన ధర్మరాజుకు కుంతీదేవి ఏకచక్రపురంలోని బ్రాహ్మణులను బకాసురుడు బాధించటాన్నీ, తాము విడిది ఉన్న ఇంటిబ్రాహ్మణునికి కలిగిన ఆపదను, దాన్ని తీర్చటానికి బ్రాహ్మణునికొరకు తాను భీముడిని పంపటాన్నీ చెప్పగా విని ధర్మరాజు దుఃఖించి - 'ఇదేమి సాహసం? ఇతరుల కొడుకులను రక్షించటానికి తమ కొడుకులను కోల్పోయే దుర్బుద్ధులూ ఉన్నారా! ఇది లోకపద్ధతికి విరుద్ధం. అంతేకాదు, భీమసేనుడు మీకు విడువదగిన కుమారుడా?

సీ. ఇతని విక్రమ మాశ్రయించియ కాదె య । య్యెడ లక్కయిల్లు వెల్వడఁగఁ గంటి;
మడవిలో నిద్రావశాత్ముల మై యున్న । మననిద్రఁ జెఱుపఁగా దని హిడింబు
నెడగల్గఁ గొనిపోయి యెక్కటి సంపిన । దండితశత్రుఁ డీతండ కాఁడె!
యితనిబల్మిన కాదె యెంతయు భీతు లై । ధృతరాష్ట్రనందనుల్ ధృతియుఁ దఱఁగి

ఆ. నిద్రలేక తమకు నిలుచు నుపాయంబు । లొండుదక్కి వెదకుచున్నవారు;
బలియు నిట్టిభీము బ్రాహ్మణార్థమ్ముగా । నసురవాతఁ ద్రోతు రవ్వ! యిట్లు. **281**

ప్రతిపదార్థం: ఇతని, విక్రమము+ఆశ్రయించియ, కాదె= ఇతనిపరాక్రమాన్ని ఆధారం చేసికొనేకదా; ఆ+ఎడ= ఆ చోట; లక్క+ఇల్లు; వెలువడన్+కంటిమి= లక్కయింటినుండి బయటపడగలిగాము; అడవిలో; నిద్రా+అవశ+ఆత్ములము+ఐ= నిద్రలో

స్వాధీనం లేని దేహాలు గలవారమై; ఉన్న, మన, నిద్రన్; చెఱుపఁగన్+కాదు+అని= చెడగొట్టకూడదని; హిడింబున్= హిడింబాసురుణ్ణి, ఎడ+కలుగన్= దూరముండేటట్లు - అంటే దూరంగా; కొనిపోయి= తీసికొని పోయి; ఎక్కటి= ఒక్కడుగా; చంపిన, దండిత, శత్రుఁడు= దండింపబడిన శత్రువులు కలవాడు; ఈతండు+అ, కాడె= ఇతడే కదా! ఇతని బల్మిన, కాదె= ఇతనిబలంచేతనే కదా; ఎంతయు= ఎంతేని - అంటే మిక్కిలి; భీతులు+ఐ= భయపడినవారై; ధృతరాష్ట్రనందనుల్= ధృతరాష్ట్రునియొక్క కుమారులు - కౌరవులు; ధృతియున్+తఱిగి = ధైర్యం తగ్గి; నిద్రలేక; తమకున్, నిలుచు+ఉపాయంబులు+ ఒండు+తక్కి= తమకు నిలబడునట్టి ఉపాయాలు ఇతరాలు లేక; వెదకుచున్+ఉన్నవారు; బలియున్= బలవంతుడైనవాడిని; ఇట్టి, భీమున్= ఇటువంటి భీముడిని; బ్రాహ్మణ+ అర్థంబుగాన్= బ్రాహ్మణునికోసం; అసుర, వాతన్= రాక్షసునినోట; అవ్వ= అమ్మా; ఇట్లు, త్రోతురె= తోస్తారా!

తాత్పర్యం: ఇతని పరాక్రమాన్ని ఆశ్రయించే కదా అక్కడ లక్కయింటినుండి బయటపడగలిగాము. మనం మైమరచి నిద్రించేటప్పుడు మననిద్రకు భంగం కలగకూడదని, హిడింబాసురుడిని దూరంగా తీసికొనిపోయి ఒంటరిగా చంపినవాడితడే కదా! ఇతని బలం చూచేగదా భయపడి కౌరవులు నిద్రలేక తమకు నిలిచే ఉపాయాలు - అంటే బ్రతికిబట్టకట్టే ఉపాయాలు - వెదకుతున్నారు. అమ్మా! అట్లాంటి బలవంతుడైన భీముడిని బ్రాహ్మణునికోసం బకాసురుని నోట్లో ఇట్లా తోస్తారా!

వ. 'అక్కట! దుఃఖాతిశయంబున మతిభ్రమణం బయ్యెం గా కేమి?' యనినఁ గొడుకునకుఁ గుంతి యి ట్లనియె.282

ప్రతిపదార్థం: అక్కట= అయ్యో!; దుఃఖ+అతిశయంబునన్= దుఃఖంయొక్క ఆధిక్యం(ఎక్కువ) వల్ల; మతి, భ్రమణంబు+ అయ్యెన్+ కాక+ఏమి= బుద్ధి తిరుగుడుపడటం జరిగిందా ఏమి - అంటే చిత్తచాంచల్యం ఏర్పడిందా ఏమి? అనినన్= అనగా; కొడుకునకున్= ధర్మరాజుతో; కుంతి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అయ్యో! దుఃఖం అమితంగా ఏర్పడటంవలన మతిభ్రమణం జరిగిందా ఏమి?' అని అనగా ధర్మరాజుతో కుంతీదేవి ఈ విధంగా పలికింది.

ఆ. భ్రమవిమోహలోభభయపరిభూత నై । కొడుకు విడువ నంత వెడఁగ నయ్య!
యేను భీముశక్తి యెఱుఁగక పంచిన । దానఁ గాను; వినుము వీనిశక్తి. 283

ప్రతిపదార్థం: భ్రమ, విమోహ, లోభ, భయ, పరిభూతన్+ఐ= భ్రాంతిచేత, మిక్కిలిమోహంచేత, ఆశచేత, భయంచేత, పీడింప బడినదాననై; కొడుకున్= కొడుకును; విడువన్= వదలిపెట్టటానికి; అంత, వెడఁగన్+అయ్య= అంత వెర్రిదాన్నటయ్యా!; ఏను= నేను; భీము, శక్తి= భీమునియొక్కశక్తి; ఎఱుఁగక= తెలియక; పంచినదానను= ఆజ్ఞాపించినదానిని; కాను= కాదు; వీని, శక్తి; వినుము.

తాత్పర్యం: భ్రాంతికి, మోహానికి, ఆశకు, భయానికి వశమై కొడుకును పోగొట్టుకొనటానికి నేనంత వెర్రిదా న్నటయ్యా! భీమునిశక్తి తెలియక నే నీ పని అప్పగించలేదు. ఇతనిశక్తి వినుము.

తే. వీఁడు పుట్టిన పదియగునాఁడు పెలుచఁ । బడియె నాచేతనుండి య ప్పర్వతమునఁ;
బడినవడిఁ జేసి బాలకు నొడలు దాఁకి । యచటి రాలెల్లఁ బెల్లు ను గ్గయ్యెఁ జూవె. 284

ప్రతిపదార్థం: వీఁడు= ఈ భీముడు; పుట్టిన; పది+అగు, నాఁడు= పదవరోజు; నాచేతన్+ఉండి= నాచేతిలోనుండి; ఆ+పర్వతమునన్= ఆ కొండమీద; పెలుచన్= గట్టిగా; పడియెన్; పడిన వడిన్+చేసి= పడినవేగంచేత; బాలకు+ఒడలు+ తాఁకి= బాలకునియొక్క శరీరం తగిలి; అచటి; రాలు+ఎల్లన్= రాళ్ళన్నీ; పెల్లు= అధికంగా; నుగ్గు+అయ్యెన్+చూవె= పొడి అయ్యాయి సుమా!

తాత్పర్యం: ఈ భీముడు పుట్టిన పదవరోజు నా చేతినుండి జారి ఆ పర్వతంమీద గట్టిగా పడ్డాడు. వేగంతో పడ్డవాడిశరీరం తగిలి అక్కడి రాళ్ళన్నీ పొడి అయ్యాయి సుమా!

వ. అట్టి వజ్రకాయుండు వజ్రధరు నయిన నోర్వనోపు నట్టి సమర్థుండు; రక్కసు నశ్రమంబునం జంపి యిందుల బ్రాహ్మణులబాధ యుడుచుం; బవనతనయు నుద్దేశించి సంతాపింపవలవదు; మనకు సుఖనివాసంబు సేసి పరమోపకారి యైన యీబ్రాహ్మణునకుఁ బ్రత్యుపకారంబు సేయ సమకూరె. **285**

ప్రతిపదార్థం: అట్టి, వజ్రకాయుండు= వజ్రంవంటి దేహం కలవాడు; వజ్రధరున్+అయినన్= వజ్రాయుధాన్ని ధరించిన దేవేంద్రుడిని అయినా; ఓర్వన్+ఓపునట్టి, సమర్థుండు= జయించగలిగినట్టి శక్తికలవాడు; రక్కసున్= రాక్షసుడిని; అశ్రమంబునన్= శ్రమలేకుండ - సులువుగా; చంపి; ఇందుల= ఈ ఏకచక్రపురంలోని; బ్రాహ్మణుల, బాధ, ఉడుచున్= బ్రాహ్మణుల బాధను పోగొట్టుతాడు; పవన, తనయున్+ఉద్దేశించి= భీముడిని గురించి; సంతాపింప, వలవదు= దిగులుపడవద్దు; మనకున్; సుఖ, నివాసంబు+చేసి= సుఖమైన ఉనికిని కల్గించి; పరమ+ఉపకారి+ఐన= మిక్కిలి మేలుచేసేవాడైన; ఈ, బ్రాహ్మణునకున్; ప్రతి+ఉపకారంబు= బదులుమేలు; చేయన్= చేయటానికి; సమకూరెన్= (అవకాశం) లభించింది.

తాత్పర్యం: ఆ విధంగా వజ్రంవంటి దేహం గల భీముడు వజ్రాయుధుడైన దేవేంద్రుడినైనా జయించగల సమర్థుడు. రాక్షసుడిని సులభంగా చంపి ఈ ఊరి బ్రాహ్మణులబాధ తీర్చగలడు. అతడిని గురించి దిగులుపడ నక్కరలేదు. మనం సుఖంగా ఉండటానికి తగిన నివాసాన్ని కూర్చి మిక్కిలి ఉపకారం చేసిన ఈ బ్రాహ్మణునికి ప్రత్యుపకారం చేయటానికి తగిన అవకాశం లభించింది.

కుంతి ధర్మజునకుఁ బరదుఃఖనివారణము పరమపుణ్యం బని తెలుపుట (సం. 1-150-20)

సీ. ఉత్తమక్షత్రియుం డొరులదుఃఖంబులు । దలఁగంగఁ బుట్టిన ధర్మశీలుఁ;
డలయక మృత్యుభయం బైనచో విప్రుఁ । గాచి సత్పుణ్యలోకములు వడయు;
ధన్యుఁడై క్షత్రియు దయఁ గాచి బుధలోక । కీర్తనీయంబగు కీర్తి వడయు;
వైశ్యశూద్రులఁ గాచి వసుధాతలస్థిత । సర్వప్రజానురంజనము వడయు;

ఆ. ననఘ! సన్మునీంద్రుఁ డయిన వేదవ్యాసు । వలన దీని నిక్కువముగ వింటి;
బ్రాహ్మణులకుఁ బ్రియము పాయక చేయంగఁ । గాన్ప చూవె పుణ్యకర్మఫలము. **286**

ప్రతిపదార్థం: ఉత్తమ, క్షత్రియుండు; ఒరుల, దుఃఖంబులు= ఇతరులయొక్క దుఃఖాలను; తలఁగంగన్= తొలగించటానికి; పుట్టిన; ధర్మశీలుఁడు = ధర్మాన్నే స్వభావంగా కలవాడు; అలయక= ఆలస్యం చేయక; మృత్యు, భయంబు+ఐనచో= మృత్యువు వలన భయం కలిగితే; విప్రున్= బ్రాహ్మణుడిని; కాచి= రక్షించి, సత్+పుణ్య, లోకములు= మంచిపుణ్య లోకాలను; పడయున్= పొందుతాడు; ధన్యుఁడు+ఐ= పుణ్యవంతుడై; క్షత్రియున్= క్షత్రియుని; దయన్+కాచి= దయతో రక్షించి; బుధ,

లోక, కీర్తనీయంబు +అగు= పండితులయొక్క సమూహంచేత పొగడదగిందైన; కీర్తి+పడయున్= కీర్తిని పొందుతాడు; వైశ్య+శూద్రులన్+కాచి= వైశ్యులను, శూద్రులను రక్షించి; వసుధా, తల, స్థిత, సర్వ, ప్రజల+అనురంజనము+పడయు= భూమండలంలో ఉన్న ప్రజలందరియొక్క అనురాగాన్ని పొందుతాడు; దీనిన్= ఈ విషయాన్ని; అనఘ= పాపంలేనివాడా - పుణ్యాత్మా; సత్+ముని+ఇంద్రుఁ+డు+అయిన= గొప్పమునుల్లో శ్రేష్ఠుడైన; వేదవ్యాసువలనన్; నిక్కువముగన్= నిజంగా; వింటిన్; బ్రాహ్మణులకున్; ప్రియము= ఇష్టమైనది; పాయక, చేయంగన్+కాన్వ, చూవె= తప్పక చేయచూడటమే సుమా; పుణ్య, కర్మ, ఫలము= పవిత్రాలైన పనులు చేయటంవలన పొందేఫలం - మహాపుణ్యం.

తాత్పర్యం: ఉత్తమక్షత్రియుడు ఇతరుల దుఃఖాలు తొలగించటానికి పుట్టినధర్మశీలుడు, ఆలస్యం చేయక మృత్యుభయం కలిగిన బ్రాహ్మణుడిని కాపాడితే అతడు పుణ్యలోకాలు పొందుతాడు. ధన్యుడై క్షత్రియుడిని దయతో రక్షిస్తే పండితుల చేత ప్రశంసించదగిన కీర్తిని పొందుతాడు. వైశ్యులను, శూద్రులను రక్షిస్తే భూమండలంలో ప్రజలందరి అనురాగాన్ని పొందుతాడు. ఈ విషయం మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసుడు చెప్పితే విన్నాను. బ్రాహ్మణులకు ఇష్టమైనది తప్పక చేయచూడటమే సుమా మహాపుణ్యఫలం.

క. జననుత! బ్రాహ్మణకార్యము । సనఁ జేసిన బ్రాహ్మణప్రసాదంబున నీ
కును నీతమ్ములకును నగు । ననవరతశ్రీసుఖాయురైశ్వర్యంబుల్. 287

ప్రతిపదార్థం: జన, నుత= జనులచేత కొనియాడబడేవాడా!; బ్రాహ్మణ, కార్యము; చనన్+చేసినన్= జరిగేటట్లు చేస్తే; బ్రాహ్మణ, ప్రసాదంబునన్= బ్రాహ్మణులయొక్క అనుగ్రహంచేత; నీకును, నీ, తమ్ములకును, అనవరత, శ్రీ, సుఖ, ఆయుః +ఐశ్వర్యంబుల్= ఎడతెగని సంపద, సుఖం, ఆయువు, ప్రభుత; అగున్= కలుగుతాయి.

తాత్పర్యం: బ్రాహ్మణకార్యం పూర్తిచేస్తే వారిఅనుగ్రహంవలన నీకు, నీ తమ్ములకు అంతులేని సంపద, సుఖం, ఆయువు, ప్రభుత కలుగుతాయి.

వ. అనిన విని ధర్మతనయుండు గుంతీదేవి కారుణ్యబుద్ధికి బ్రాహ్మణభక్తికి ధర్మనిత్యతకు సంతసిల్లి తానును భీమసేను నియోగించె; నంత భీముం డవ్విప్రున కి ట్లనియె. 288

ప్రతిపదార్థం: అనినన్= అనగా; విని; ధర్మతనయుండు= ధర్మరాజు; కుంతీదేవి, కారుణ్య బుద్ధికిన్= కుంతీదేవియొక్క దయతోకూడిన మనసుకు; బ్రాహ్మణభక్తికిన్= బ్రాహ్మణులపట్లగల భక్తికి; ధర్మ, నిత్యతకు= ధర్మంయొక్క ఎడతెగనితనానికి - అంటే ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించటానికి; సంతసిల్లి= సంతోషించి; తానును= తానుకూడా; భీమసేనున్; నియోగించెన్= ఆజ్ఞాపించాడు; అంతన్= అంతట; భీముండు; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చెప్పగా విని ధర్మరాజు కుంతీదేవియొక్క దయార్ద్రబుద్ధికి, బ్రాహ్మణభక్తికి; ధర్మాచరణానికి సంతోషించి, తానుకూడా భీమసేనుడిని ఆజ్ఞాపించాడు. అప్పుడు భీమసేనుడు బ్రాహ్మణునితో ఇట్లా అన్నాడు.

విశేషం: తల్లిగా కుంతీదేవి కొడుకులను దిద్దితీరుస్తున్న ఉదాత్తవైఖరిని తెలిపే రెండవ సన్నివేశమిది. అన్నంపెట్టి కొడుకులను పోషించటంలోకూడా ఆమె తీర్పరితనం గోచరించింది. ధర్మాన్ని బోధించి, దానిని ఆచరించే పద్ధతిలోకూడ, తాను ఆచరిస్తూ కొడుకుల మొదటిగురువైన తల్లిగా తెలియచెప్పే నేర్పరితనం ప్రదర్శించింది. ధర్మరాజుకుసైతం వివేకం కలిగించే ధర్మబోధ

చేసింది. ఆ తెలివిడి వేదవ్యాసులవలన కలిగిందని ప్రామాణికభావం కలిగించింది. భీముడిని ధర్మాచరణశీలునిగా మలచింది. బుద్ధిశక్తినీ, బాహుబలాన్నీ ధర్మశక్తికి అనుకూలంగా ఎలా రూపొందించాలో తెలిసిన వివేకమూర్తి పాండవమాతృమూర్తి.

ఆ. కడుపునిండఁ గుడువఁ గానమి రేయెల్లఁ । గన్నుమొందకున్నఁ గరము డస్సి
యున్నవాఁడ; నాకు నోపుదురేని యా । హారతృప్తిసేయుఁ; డట్లు లయిన. 289

ప్రతిపదార్థం: కడుపు నిండన్= కడుపునిండుగా; కుడువన్+కానమి= తినటానికి లేకుండటంచేత - అంటే కడుపునిండా తిండి లేకుండటంచేత; రేయి+ఎల్లన్= రాత్రి అంతా; కన్ను+పొందక+ఉన్నన్= కన్ను మూయకుండుటవలన - అంటే నిద్రలేకపోవటంచేత; కరము= మిక్కిలి; డస్సి+ఉన్నవాఁడన్= అలసిఉన్నాను; ఓపుదురు+ఏని= చేయగలిగితే; నాకున్; ఆహార, తృప్తి+చేయుఁడు= ఆహారంచేత తృప్తి చేయండి; అట్టులు+అయినన్= ఆ విధంగా అయితే.

తాత్పర్యం: కడుపునిండ తిండి లేకుండటంచేత రాత్రి పూర్తిగా నిద్రలేదు. అందుచేత మిక్కిలి డస్సి ఉన్నాను. పెట్టగలిగితే నాకు ఆహారం తృప్తిగా పెట్టండి. అట్లయితే.

ఆ. 'బలము పెద్ద గలిగి పాపిష్ఠు రక్కసుఁ । జంపి యిప్పురమున జనుల కెల్ల
హర్ష మే నొనర్తు' ననవుడు విప్రుఁడు । దానుఁ జుట్టములును దత్క్షణంబ. 290

ప్రతిపదార్థం: బలము; పెద్ద+కలిగి= ఎక్కువగా పొంది; పాపిష్ఠు, రక్కసున్= పాపి అయిన రాక్షసుని; చంపి, ఈ+పురమునన్= ఈ పట్టణంలోని; జనులకున్+ఎల్లన్= ప్రజలందరికీ; హర్షము= సంతోషం; ఏను= నేను; ఒనర్తున్= చేస్తాను; అని అనగా విని, విప్రుఁడు= బ్రాహ్మణుడు; తానున్; చుట్టములును; తత్క్షణంబు+అ= అప్పటికప్పుడే.

తాత్పర్యం: 'బలం ఎక్కువగా పొంది, ఆ పాపాత్ముడైన రక్కసుడిని చంపి, ఈ పురజనులందరికి సంతోషాన్ని కలిగిస్తా' నని అనగా - బ్రాహ్మణుడు, తాను, చుట్టాలు అప్పటికప్పుడే.

తరలము

పలుదెఱంగుల పిండివంటలుఁ బప్పుఁ గూడును నేతికుం
డలు గుడంబు దధిప్రపూర్ణఘటంబులుం గొనివచ్చి యీ
నలఘుసత్త్వుఁడు మారుతాత్మజుఁ డన్నిటన్ గతఖేదుఁడై
బలము గల్గి కడంగె నప్పుడు బ్రాహ్మణార్థము సేయఁగన్. 291

ప్రతిపదార్థం: పలు+తెఱంగులు= అనేక విధాలైన; పిండి, వంటలును; పప్పున్= పప్పును; కూడును= అన్నము; నేతి, కుండలు= నెయ్యిగల కుండలు; గుడంబు= బెల్లం; దధి, ప్రపూర్ణ, ఘటంబులున్= పెరుగుతో పూర్తిగా నిండిన కుండలు; ఈన్= ఈయగా; అలఘు, సత్త్వుఁడు= తక్కువకాని బలం కలవాడు - మహాబలవంతుడు; మారుత+ఆత్మజుఁడు= వాయుతనయుడైన భీముడు; అన్నిటన్= అన్నింటిచేత; గత, ఖేదుఁడు+ఐ= పోయిన బడలిక కలవాడై; బలము+కల్గి; అప్పుడు; బ్రాహ్మణ+అర్థము+చేయఁగన్= బ్రాహ్మణునియొక్క పని చెయ్యటానికి; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: అనేక విధాలైన పిండివంటలు, పప్పు, కూడు, నేతికుండలు, బెల్లం, పెరుగు నిండినకుండలు తీసుకొని వచ్చి ఇస్తే - వాటి నన్నింటిని భక్షించి బలవంతుడైన భీముడు బడలిక తీరి బ్రాహ్మణుని ఆపద తీర్చటానికి, బకాసురునిమీదికి వెళ్ళటానికి పూనుకొన్నాడు.

విశేషం: నన్నయ ఈ ఆశ్వాసంలో రెండు తరలవృత్తాలను వాడాడు. ఒకటి దుర్యోధనుడు పురోచనుని లక్కయిల్లు కట్టటానికి పంపిన ఘట్టంలో ఉన్నది. (ఆది.6.139) రెండోది ఇది. బ్రాహ్మణార్థము అనేమాట బ్రాహ్మణులకొరకు చేసే ఏ పనికైనా వర్తించే అర్థంలో నన్నయచేత వాడబడింది. కాని, అది ఇప్పుడు అర్థపరిణామం పొంది బ్రాహ్మణులఇంట ఆబ్దికానికి భోక్తగా ఒప్పుకొని చేసే పనికే రూఢి కెక్కింది.

భీముఁడు బకాసురునిఁ జంపఁబోవుట (సం. 1-151-1)

వ. ఇట్లు భీమసేనుం డిష్టాన్నోపభోగంబునం దృప్తుం డయి భక్ష్యాన్నపూర్ణం బయిన శకటంబు నెక్కి దక్షిణాభిముఖుం డయి బకాసురుం డున్నచోటికిం జని యార్ద్రశుష్కకళేబరదుర్గంధనిందితం బయిన బకస్థానంబు డాయక యెడగలిగి యమునాతీరంబున శకటంబు నిలిపి యారక్కసుం బిలుచుచు వానివచ్చునంతకు మిన్నకుండ నేల యని కాళ్లుసేతులుఁ గడిగికొని యాచమించి యాశకటంబుపయి కూడు గుడుచుచుండె; నటబకాసురుండును.292

ప్రతిపదార్థం: ఇట్లు; భీమసేనుండు; ఇష్ట+అన్న+ఉపభోగంబునన్= ఇష్టమైన ఆహారాన్ని భుజించటంచేత; తృప్తుండు+అయి= తృప్తిపొందినవాడయి; భక్ష్య+అన్న, పూర్ణంబు+అయిన= పిండివంటలతో, అన్నంతో నిండినదైన; శకటంబున్=బండిని; ఎక్కి; దక్షిణ+అభిముఖుండు+అయి= దక్షిణదిశకు ఎదురుగా ముఖం కలవాడై; బకాసురుండు; ఉన్న; చోటికిన్; చని= వెళ్ళి; ఆర్ద్ర, శుష్క, కళేబర, దుర్గంధ, నిందితంబు+అయిన= పచ్చివి, ఎండినవి అయిన పీనుగుల దుర్వాసనచేత దూషింపబడిం దైన; బక, స్థానంబు= బకాసురుడియొక్కచోటు - ఉన్నచోటు; డాయక= సమీపించక; ఎడ+కలిగి= దూరంగా ఉండి; యమునా తీరంబునన్= యమునానదియొక్క ఒడ్డు దగ్గర; శకటంబు= బండి; నిలిపి; ఆ, రక్కసున్= ఆ రాక్షసుడిని; పిలుచుచున్= పిలుస్తూ; వాని, వచ్చు+అంతకున్= వాడియొక్క రాక వరకు; మిన్నక+ఉండన్+ఏల+అని= ఊరకుండుట ఎందులకని; కాళ్లు+చేతులు; కడిగికొని; ఆచమించి= ఆచమనం చేసి; ఆ, శకటంబుపయి= ఆ బండిమీద ఉండే; కూడు= అన్నం; కుడుచుచున్+ఉండెన్= తింటూ ఉన్నాడు; అట= అక్కడ; బకాసురుండును= బకాసురుడుకూడా.

తాత్పర్యం: ఈ విధంగా భీమసేనుడు ఇష్టమైన ఆహారాన్ని భుజించి, తృప్తినొంది, పిండివంటలతో, అన్నంతో నిండిన బండినెక్కి, దక్షిణదిశగా బకాసురుడుండేచోటికి వెళ్ళి, పచ్చివి, ఎండినవి అయిన పీనుగుల కంపు కొట్టే బకాసురుని నివాసస్థానాన్ని సమీపించక, యమునానదీ తీరాన్నే బండి నిలిపి, ఆ రాక్షసుణ్ణి పిలుస్తూ, వాడు వచ్చేవరకు ఊరకుండుట ఎందుకని కాళ్ళుచేతులు కడుక్కొని ఆచమనం చేసి బండిమీదికూడు తినసాగాడు. అట బకాసురుడు.

ఆ. 'ప్రొద్దు నేఁడు పెద్దపోయె నిత్యము నిట। తెచ్చియిచ్చుబలియుఁ దెచ్చి యీఁగ
నొల్ల కెలుఁగు లిచ్చుచున్నవాఁ డమ్మను। జాధముండు మెచ్చఁ డయ్యెఁ' ననుచు. 293

ప్రతిపదార్థం: నేఁడు= ఈరోజు; ప్రొద్దు= కాలం; పెద్ద+పోయెన్= ఎక్కువ గడిచింది; నిత్యమున్= ప్రతిదినం; ఇట= ఇక్కడకు; తెచ్చి+ఇచ్చు; బలియున్= (ఆహారరూపమైన) కానుక; తెచ్చి+ఈఁగన్+ఒల్లక= తెచ్చి ఇవ్వటానికి ఇష్టపడక; ఆ+మనుజు+అధముండు= ఆ నీచమానవుడు; ఎలుఁగులు+ఇచ్చుచున్+ఉన్నవాఁడు= పిలుపు ఇస్తున్నాడు; - అంటే పిలుస్తున్నాడు; మెచ్చఁడు+అయ్యెన్+అనుచున్= నన్ను లెక్కపెట్టలేదంటూ.

తాత్పర్యం: 'ఈ రోజు ప్రొద్దు పోయింది. ప్రతిదినం ఇక్కడికి తెచ్చి యిచ్చే బలి తెచ్చి ఇవ్వటం ఇష్టపడక, ఆ నీచమానవుడు నన్ను లెక్కపెట్టక పిలుస్తున్నాడు' అని.

ఆ. అలిగి యౌడుగఱచి యాఁకటి పెలుచన। నిలువనోప కసుర నింగి దాఁకఁ
పెరిఁగి యరుగుదెంచె భీమరూపంబుతో। నుగ్రభంగి భీముఁ డున్న దెసకు. 294

ప్రతిపదార్థం: అసుర= రాక్షసుడు; అలిగి= కోపించి; ఔడు+కఱచి= పెదవి బిగబట్టి; ఆఁకటి, పెలుచనన్= ఆకలియొక్క అతిశయంతో; నిలువన్+ఓపక= నిలువలేక; నింగి+తాఁకన్= ఆకాశమంటేటట్లు; పెరిఁగి= విజృంభించి; భీమ, రూపంబుతోన్= భయంకరమైన ఆకారంతో; ఉగ్ర, భంగిన్= అధికమైన కోపంగల వైఖరితో; భీముఁడు+ఉన్న, దెసకున్= భీముడుండే దిక్కుకు; అరుగుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: బకాసురుడు కోపించి, అధికమైన ఆకలికి తాళలేక, ఆకాశం ఎత్తున విజృంభించి, భయంకరమైన ఆకారంతో భయంకరమైన విధంగా భీముడుండే దిక్కుకు వచ్చాడు.

సీ. చనుదెంచి ముందట శకటంబుపైనుండి। యోడక కుడుచుచు నున్న భీము
దవ్వులఁ జూచి 'నిత్యము నాకు నియమించి। కొనివచ్చు కూ డేల కుడిచె దీవు?
గడుఁ గ్రొవ్వి, రేకచక్రంబునవారల। కే నింత యెల్లిద మేల యైతి?'
నని డాయ వచ్చి యయ్యనిలనందనువీఁపుఁ। బిడికిటఁ బొడిచిన, బెదర కసుర

ఆ. వలను సూడ కొండు వగవక యెప్పటి। యట్లు కుడుచుచున్న నలిగి బకుఁడు
'వీని బాగు సూడ వే' అంచు డాసిన। తరువుఁ బెఱికి కొనుచుఁ దాఁకుఁ దెంచె. 295

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ముందటన్; శకటంబు పైన్+ఉండి= బండిమీదనుండి; ఓడక= భయపడక; కుడుచుచున్+ఉన్న= ఆహారం తింటున్న; భీమున్; దవ్వులన్= దూరంగా; చూచి; నిత్యము= ప్రతిదినం; నాకున్; నియమించుకొనివచ్చు= ఏర్పాటు చేసుకొని వచ్చే; కూడు+ఏల= అన్నాన్ని ఎందుచేత; ఈవు= నీవు; కుడిచెదు= తింటున్నావు; కడు(క్రొవ్విరి= మిక్కిలి పొగరు పట్టినారు; ఏక, చక్రంబున, వారలకు= ఏకచక్రపురంలో ఉండేవాళ్ళకు; ఏను= నేను; ఇంత+ఎల్లిదము= ఇంతచులకన; ఏల+ఐతిని; అని; డాయ, వచ్చి= దగ్గరగా వచ్చి; ఆ+అనిల, నందను, వీఁపున్= ఆ భీమునియొక్క వీపును; పిడికిటన్ పొడిచినన్= పిడికిటితో పొడవగా; బెదరక= భయపడక; అసుర, వలను+చూడక= ఆ రాక్షసునివైపు చూడకుండ; ఒండు వగవక= వేరేమీ ఆలోచించకుండ; ఎప్పటి+అట్లు; కుడుచుచున్+ఉన్నన్= తింటూఉండగా; బకుఁడు; అలిగి= కోపించి; వీని, బాగుచూడన్+వేఱు+అంచున్= వీడివిధం చూస్తే వేరుగా ఉన్నదని; డాసిన, తరువున్= దగ్గరగా ఉండే చెట్టును; పెఱికికొనుచున్; తాఁకుదెంచెన్= దగ్గరకు వచ్చాడు.

తాత్పర్యం: వచ్చి, తనను చూచి భయపడక, బండిమీద ఉండి ఆహారం తింటున్న భీమసేనుడిని - దూరాన్నుండి చూచి 'ప్రతిదినం నాకై తెచ్చే అన్నాన్ని నీ వేల తింటున్నా'వనీ, 'ఏకచక్రపురవాసులు పొగరుపట్టారు. వాళ్ళకు నే నెందువలన ఇంత చులకన అయ్యాను?' అనీ, సమీపించి, భీముడివీపున పిడికిట పొడిచాడు. భీముడు బెదరక, ఆ రాక్షసుడివైపు కూడ చూడకుండ, వేరేమీ ఆలోచించక, ఎప్పటివలె అన్నం తింటుండగా, బకుడు కోపించి, వీడితీరు వేరుగా ఉన్నదని పక్కనుండే చెట్టును పెరికికొని భీమునిదగ్గరకు వచ్చాడు.

విశేషం: వీని బాగు - అనే దానికి వీనిబాస, వీనిలావు, వీనిభంగి - అనే పాఠాంతరాలున్నాయి. శ్రీమదాంధ్రమహాభారత సంశోధితప్రతి, పుట.397.

వ. అంతకు ముందఱ భీమసేనుం డంత కూడునుం గుడిచి యనంతబలసమేతుం డై యంతకాకారంబున మల్లసఱచుకొని యార్చుచు. 296

ప్రతిపదార్థం: అంతకు, ముందఱ= అంతకు మునుపు; భీమసేనుండు; అంత, కూడునున్= మొత్తం ఆహారాన్ని; కుడిచి= తిని; అనంత, బల, సమేతుండు+ఐ= అంతులేనిబలంతో కూడుకొన్నవాడై; అంతక+ఆకారంబునన్= యమధర్మరాజుయొక్క రూపంతో; మల్ల, చఱచుకొని= భుజంతట్టుకొని; ఆర్చుచున్= అరుస్తూ.

తాత్పర్యం: అంతకు ముందు భీమసేనుడు మొత్తం ఆహారాన్ని తిని మిక్కిలి బలవంతుడై యమధర్మరాజు రూపం దాల్చి భుజం తట్టి అరుస్తూ.

ఉ. ఇంచుకయేని పాపమున కెన్నఁడు రోయక యెల్లవారి బా
ధించి మనుష్యమాంసములు దించును గ్రొవ్వితి; వాని నెల్లఁ గ్ర
క్కించెద, నీమదాంధ్య ముడిగించెద, నిప్పడ కాలుప్రోలి కే
గించెదఁ జక్కనై నిలుము గిట్టి రణంబున రాక్షసాధమా! 297

ప్రతిపదార్థం: రాక్షస+అధమా!= రాక్షసులలో నీచుడైనవాడా! ఎన్నడు= ఎప్పుడుకూడ; పాపమునకున్; ఇంచుక+ఏని= కొద్దిగా కూడ; రోయక= రోతచెందక; ఎల్లవారిన్= అందరినీ; బాధించి; మనుష్య, మాంసములు= మానవుల మాంసాలు; తించును= తినుచును, తింటూ; క్రొవ్వితివి= పొగరెక్కావు; వానిన్+ఎల్లన్= వాటినన్నింటిని; క్రక్కించెదన్= క్రక్కిస్తాను; నీ మద+ఆంధ్యము= నీ పొగరు= యొక్క గ్రుడ్డితనం; ఉడిగించెదన్= పోగొట్టుతాను; ఇప్పుడు+అ= ఇప్పటికిప్పుడే; కాలు+ప్రోలికిన్+ఏగించెదన్= యమధర్మరాజుయొక్క పట్టణానికి పంపిస్తాను; కిట్టి= సమీపించి; రణంబునన్= యుద్ధంలో; చక్కన+ఐ= సరిగా; నిలుము= నిలబడుము.

భీమసేనుఁడు బకాసురుం జంపుట (సం. 1-151-15)

వ. అనుచు సమీరణసుతుండు దన సమీపంబున నున్న విశాలసాలవృక్షంబు పెఱికికొని రక్కసునిపై వైచిన వాఁడును దన చేతివృక్షంబున దాని భగ్నంబుఁ జేసె; ని ట్లిరువురు నొక్కవడి వృక్షయుద్ధంబు సేసి యాసన్న మహీరుహంబులు సమసిన మల్లయుద్ధసన్నద్ధులై. 298

ప్రతిపదార్థం: అనుచున్= అనిఅంటూ; సమీరణ, సుతుండు= వాయుపుత్రుడైన భీముడు; తన, సమీపంబునన్= తన దగ్గరలో ఉండే; విశాల, సాల, వృక్షంబున్= పెద్ద మద్దిచెట్టును; పెఱికికొని= ఊడదీసి; రక్కసు, పైన్= రాక్షసుని మీద; వైచినన్= వేయగా; వాఁడును= ఆ రాక్షసుడు కూడా; తన, చేతి వృక్షంబునన్= తనచేతిలోని చెట్టుచేత; దానిన్= ఆ పెద్దమద్దిచెట్టును; భగ్నంబున్+చేసెన్= విరుగగొట్టాడు; ఇట్లు+ ఇరువురున్= ఈ విధంగా ఇద్దరున్నూ; ఒక్క, వడిన్= ఒక్కవేగంలో; వృక్ష, యుద్ధంబు+చేసి= చెట్లతో యుద్ధం చేసి; ఆసన్న, మహీరుహంబులు= దగ్గరుండే చెట్లు; సమసినన్= నశింపగా; మల్ల, యుద్ధ, సన్నద్ధులు+ఐ= మల్లయుద్ధానికి పూనుకొన్నవాళ్ళయి.

తాత్పర్యం: అని అంటూ, వాయుపుత్రుడైన భీముడు తనకు సమీపాన ఉన్న ఒకపెద్దమద్దిచెట్టును పెరికి రాక్షసుడిమీద వేయగా - వాడు తనచేతిలో ఉండే చెట్టుతో దాన్ని విరుగగొట్టాడు. ఈ విధంగా ఇద్దరూ చెట్లతో యుద్ధం చేసి, చుట్టుప్రక్కల ఉండే చెట్లన్నీ నశించగా మల్లయుద్ధానికి పూనుకొన్నారు.

చ. పరువడి నొండొరుం బెనఁగి పట్టుచుఁ ద్రోచుచు నీడ్చుచుం బర
స్పరజయకాంక్షులైన బక పాండవవీరుల పాదఘట్టనన్
ధరణితలంబు గ్రక్కదలెఁ, దన్నికటద్రుమవల్లు లెల్ల జ
ర్జరితము లయ్యె, నిష్ఠురవిశాలశిలల్ నుఱుమయ్యె నయ్యెడన్. 299

ప్రతిపదార్థం: పరువడిన్= క్రమంగా; ఒండు+ఒరున్= ఒకరితో నొకరు; పెనఁగి= కలియబడి; పట్టుచున్= పట్టుకొంటూ; త్రోచుచున్= తోసుకొంటూ; ఈడ్చుచున్= ఈడ్చుకొంటూ; పరస్పర, జయ, కాంక్షులు+ఐన= ఒకరినొకరు జయించాలన్న కోరిక కలవాళ్ళయిన; బక, పాండవ, వీరుల, పాద, ఘట్టనన్= వీరులైన బక భీములయొక్క పాదాలయొక్క తొక్కిడిచేత; ఆ+ఎడన్= ఆ ప్రదేశాన; ధరణి, తలంబు= భూభాగం, గ్రక్కదలెన్= మిక్కిలి చలించింది; తత్+నికట, ద్రుమ, వల్లులు+ఎల్ల= దానికి సమీపంలో ఉండేచెట్లు, తీగలు, అన్నీ; జర్జరితములు+అయ్యెన్= శిథిలమయ్యాయి - చెల్లాచెదరయ్యాయి; నిష్ఠుర, విశాల, శిలల్= కఠినాలైన పెద్దబండలు; నుఱుము+అయ్యెన్= పిండి అయ్యాయి.

తాత్పర్యం: క్రమంగా భీమబకాసురులు ఒకరితో ఒకరు కలియబడి పట్టుకొంటూ; త్రోసుకొంటూ, ఈడ్చుకొంటూ విజయం సాధించాలని మల్లయుద్ధం చేస్తుంటే, అక్కడి భూభాగం ఎక్కువగా చలించింది. ప్రక్కల ఉండే అన్నిచెట్లూ, తీగెలు చెల్లాచెదరయ్యాయి. కఠినాలైన పెద్దబండలుకూడా పిండి అయ్యాయి.

ఉ. ఇద్దఱ హుంకృతిధ్వనులు నిద్దఱ భూరిభుజారవంబు న
య్యిద్దఱముష్టిఘాతజనితేరితదారుణనిస్వనంబు న
య్యిద్దఱపాదఘట్టితమహీరవమున్ విని చూప ఱెల్లనుం
దద్దయు భీతి నచ్చటికిఁ దా రెడగల్గఁగఁ బాఱి రొక్కఁడై. 300

ప్రతిపదార్థం: ఇద్దఱ, హుంకృతి, ధ్వనులున్= భీమబకాసురులిద్దరియొక్క హుంకారశబ్దాలు; ఇద్దఱ, భూరి, భుజా, రవంబున్= ఆ యిద్దరియొక్క పెద్దభుజాలు తట్టేచప్పుడు; ఆ+ఇద్దఱ, ముష్టి, ఘాత, జనిత+ఈరిత, దారుణ, నిస్వనంబున్= ఆ యిద్దరియొక్క పిడికిలిపోట్లనుండి పుట్టి త్రోయబడిన భయంకరమైన శబ్దం; ఆ+ఇద్దఱ, పాద, ఘట్టిత, మహీ, రవమున్= ఆ యిద్దరియొక్క పాదాలచే త్రొక్కబడిన భూమియొక్కశబ్దం; విని; చూపఱు+ఎల్లనున్= చూచేవాళ్ళంతా; తద్దయు, భీతిన్= మిక్కిలిభయంతో; తారు= తాము; ఒక్కడు+ఐ= ఒక్కటై; అచ్చటికిన్; ఎడ, కల్గఁగన్= దూరమవునట్లుగా - దూరంగా; పాఱిరి= పరుగెత్తారు.

తాత్పర్యం: భీమ బకాసురులిద్దరియొక్క హుంకారాలు, భుజాల చప్పుడు, పిడికిటిపోట్ల ధ్వని, కాళ్ళ తొక్కిళ్ళచేత భూమినుండి పుట్టిన శబ్దం విని, చూచేవాళ్ళంతా మిక్కిలి భయపడి ఒక్కటిగా అక్కడినుండి పరుగెత్తారు.

విశేషం: వీరరసోచితంగా ఓజోగుణప్రధానమైన ఈ పద్యంలో - ద్విత్వాక్షర ప్రాస, ద్విత్వాక్షరాలు, విశేషించి మహాప్రాణాక్షరాలు- భీమ బకాసురుల ద్వంద్వయుద్ధాన్ని - అందులోనూ మల్లయుద్ధశబ్దాల్ని అద్భుతంగా ధ్వనింప చేసేవిగా ఉన్నాయి. అక్షర రమ్యమైన నన్నయశైలికి ఇదొక చక్కని ఉదాహరణ.

వ. ఇట్లు భీమ బకాసురు లాసురంబునం బెనంగి మల్లయుద్ధంబు సేయునెడ. 301

ప్రతిపదార్థం: ఇట్లు; భీమ, బక+అసురులు+ఆసురంబునన్= భీముడు, బకాసురుడు, అసురకృత్యం చేత; పెనంగి= కలియబడి; మల్ల, యుద్ధంబు+చేయు+ఎడ= మల్లయుద్ధం చేసే సమయంలో.

తాత్పర్యం: ఈ విధంగా భీమబకాసురులు రాక్షసంగా కలియబడి మల్లయుద్ధం చేసే సమయంలో.

క. కడఁగి వృకోదరుఁ డసురం। బడఁగా ధర వైచి వామపాదంబునఁ జే
డ్పడ వానిఱొమ్ముఁ దాఁచెం। గడుకొని యసురయును లేచి కడునుద్ధతుఁ డై. 302

ప్రతిపదార్థం: కడఁగి= పూనుకొని; వృక+ఉదరుఁడు= తోడేలుకడుపువంటి కడుపుకలవాడు - భీముడు; అసురన్= రాక్షసుడిని; పడఁగా= పడేటట్లు; ధరన్ వైచి= భూమిమీద పడవేసి; వామ, పాదంబునన్= ఎడమకాలితో; వాని, ఱొమ్మున్= అతనియొక్క ఎదను; తాఁచెన్= తన్నాడు; కడుకొని= పూనుకొని; అసురయును= రాక్షసుడుకూడ; లేచి= పైకిలేచి; కడున్+ఉద్ధతుఁడు+ఐ= మిక్కిలి విజృంభించినవాడై.

తాత్పర్యం: ప్రయత్నించి భీముడు బకాసురుడిని నేలమీద పడవేసి, అతనిఎదను ఎడమకాలితో తన్నాడు. వాడుకూడా ప్రయత్నించి, లేచి, మిక్కిలి విజృంభించి.

క. అనిలసుతుఁ బట్టికొని పె। ల్చన త్రోచి కడంగి కనకశైలనికుంజం
బునుబోని వానివక్షముఁ। దనదృఢతరముష్టిఁ బొడిచెఁ దద్దయు నలుకన్. 303

ప్రతిపదార్థం: అనిలసుతున్= వాయుపుత్రుడైన భీముడిని; పట్టికొని= బిగియపట్టి; పెల్చన్= గట్టిగా; త్రోచి= నెట్టి; కడంగి= పూని; కనక, శైల, నికుంజంబును+పోని= బంగారుకొండలోని పొదరింటిని పోలిన; వాని, వక్షమున్= భీమునియొక్క రొమ్మును; తద్దయున్= మిక్కిలి; అలుకన్= కోపంతో; తన, దృఢ, తర, ముష్టిన్= తనయొక్క మిక్కిలి గట్టి పిడికిలితో; పొడిచెన్.

తాత్పర్యం: భీముడిని గట్టిగా పట్టుకొని మేరుపర్వతంమీది పొదరింటినిపోలిన అతని ఎదను అమితమైన కోపంతో గట్టిగా తన పిడికిలితో పొడిచాడు.

విశేషం: అలం: ఉపమ. కనకశైలనికుంజంబునుబోని - అనేదానికి శైలోచ్ఛ్రాయంబునుంబోని - అనే పాఠాంతరం ఉంది. మూలం; "వ్యాత్తాననేన ఘోరేణ లంబజిహ్వేన రక్షసా తే నాభిద్రుత్య భీమేన భీమో మూర్ధ్ని సమాహితః" - శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పుట. 398.

వ. భీముండును వాని హీనసత్త్వుంగా నెఱింగి సుర హస్తి హస్తానుకారంబు లైన సవ్య దక్షిణ హస్తంబుల న మ్మనుజ కంటకు కటి కంఠ ప్రదేశంబులు వట్టికొని. 304

ప్రతిపదార్థం: భీముండును= భీముడుకూడా; వానిన్= ఆ బకాసురుణ్ణి; హీన, సత్త్వున్+కాన్= నశించినబలం కలవాడినిగా; ఎఱింగి= తెలుసుకొని; సుర; హస్తి, హస్త+అనుకారంబులు+ఐన= ఐరావతంయొక్క తొండాలను పోలినవైన; సవ్య, దక్షిణ, హస్తంబులన్= ఎడమకుడి చేతులతో; ఆ+మనుజ, కంటకు, కటి, కంఠ, ప్రదేశంబులు+పట్టికొని= మానవులకు శత్రువైన ఆ బకాసురుడి నడుము, గొంతు పట్టుకొని.

తాత్పర్యం: భీముడుకూడా - ఆ బకాసురుడు బలహీనుడు కావటాన్ని గమనించి, ఐరావతంయొక్క తొండాలవంటి బలమైన తన ఎడమకుడిచేతులతో వాడినడుమూ, గొంతూ పట్టుకొని.

ఉ. దారుణ జానుదండమున దండధర ప్రతిముండు భీకరా
కారుఁడు వానివీఁపు విఱుగంబొడిచెం బిశితంబుతో నవ
ద్వారములన్ మహారుధిరధారలు బోరన నొల్కి మాంస పం
కారుణవారిఘోరనదు లై పఱవన్ విపినాంతరంబునన్. 305

ప్రతిపదార్థం: భీకర+ఆకారుఁడు= భయంకరమైన రూపం కలవాడు; దండ, ధర, ప్రతిముండు= యమధర్మరాజుతో సమానమైనవాడు - అయిన భీముడు; దారుణ, జాను, దండమునన్= కఠినమైన తనమోకాలనే దండంతో; పిశితంబుతోన్= మాంసంతో; నవ, ద్వారంబులన్= తొమ్మిదిమార్గాలనుండి; మహా, రుధిర, ధారలు= పెద్ద నెత్తుటి ధారలు; బోరనన్+ఒల్కి= బోరన చింది; విపిన+అంతరంబునన్= అడవి మధ్యభాగంలో; మాంస, పంక+అరుణ, వారి, ఘోర, నదులు+ఐ= మాంస మనే బురదతో ఎఱ్ఱనినీటితో భయంకరాలైన నదులై; పఱవన్= పారగా; వాని, వీఁపు= ఆ బకాసురునియొక్క వీపు; విఱుగన్= విరిగేటట్లు; పొడిచెన్.

తాత్పర్యం: భీముడు దండధరునివలె - అంటే యమునివలె - భయంకరాకారుడై, మహాకఠినమైన తన మోకాలనే దండంతో - బకాసురునినవద్వారాలనుండి మాంసంతో కూడిన నెత్తుటిధారలు ఉరవడిగా వెలికివచ్చి, అడవిమధ్యలో మాంసం అనే బురదతో, ఎర్రనినీటితో భయంకరాలైన నదులవలె ప్రవహించేటట్లు - ఆ రాక్షసుడివీపు విరిగేలా పొడిచాడు.

విశేషం: నవద్వారాలు - నేత్రాలు -2; శ్రోత్రాలు -2, నాసారంధ్రాలు-2, ముఖరంధ్రం-1, మలమూత్రవిసర్జన రంధ్రాలు-2, అలం: రూపకం. ఉపమ, అతిశయోక్తి. శ్రవ్యకావ్యంలో స్థిరరూపవర్ణనకంటె, చలద్రూపవర్ణన చాల కష్టం. అయినా పాఠకుని దృష్టిని విశేషంగా ఆకర్షించేది, అతడిని అధికంగా రసపరవశుడిని చేసేది - చలద్రూపవర్ణనమే. ఈ సన్నివేశంలో నన్నయ మల్లయుద్ధం చేస్తున్న భీమబకాసురుల చలద్రూపాలను మనకళ్ళకు కట్టినట్లు మనోహరంగా చిత్రించాడు. ఆ యిద్దరియుద్ధాన్ని చూస్తున్న అనుభూతిని కలిగించాడు. కాగా, అలంకారాన్ని ప్రయోగించి వస్తువును, రసాన్ని ధ్వనింప చెయ్యటం ఒక గొప్ప కవితా శిల్పం. ఈ పద్యంలో నన్నయ - భీముని మోకాటిని యమదండంతో రూపించి, భీముడిని యమధర్మరాజుతో పోల్చి - బకాసురుని పాలిటికి భీముడు సాక్షాత్తు యముడే అని, ఆ రాక్షసునికి మరణం తప్పదని ధ్వనింపచేశాడు. అట్లాగే భీమునిదెబ్బకు బకాసురుని నవరంధ్రాలనుండి మాంసంతో కూడిన నెత్తురు ఏరులై పారిందన్న అతిశయోక్తితో - భయానక బీభత్స రసస్ఫూర్తి కలిగించాడు. విశేషించి - 297వ పద్యంలో భీముడు ప్రతిజ్ఞ చేసినట్లు - బకాసురుడు ఇన్నాళ్ళూ తిన్న మానవమాంసాన్నీ, త్రాగినరక్తాన్నీ క్రక్కించినట్లుంది - ఈ పద్యవర్ణన. అంతేకాదు హిడింబ బకాసురులవధలలో శత్రువును వెన్నువిరిచి చంపే మల్లవిద్యను భీముడు సమంగా ప్రదర్శించటం గమనార్హం. ఇటువంటి సంవాదశిల్పపూర్వాపరసంవిధానంతో నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తిని సాధించటం ఇందులోని విశేషం.

వ. ఇట్లు బకాసురుండు భీముచేత నిహతుం డయి విగతజీవితుం డగుచుండి యఱచిన నమ్మహాధ్వని విని, వాని బాంధవు లైన రక్కసులు పెక్కండ్రు పఱతెంచిన వారలం జూచి భీముం డి ట్లనియె. 306

ప్రతిపదార్థం: ఇట్లు; బకాసురుండు; భీముచేత; నిహతుండు+అయి= చంపబడినవాడై; విగజీవితుండు+అగుచున్+ఉండి= కోల్పోయిన ప్రాణం కలవాడవుతూ; అఱచినన్ = అరవగా; ఆ+మహా, ధ్వని= ఆ పెద్దశబ్దాన్ని; విని; వాని బాంధవులు+ఐన= వాడియొక్క బంధువులయిన; రక్కసులు= రాక్షసులు; పెక్కండ్రు= చాలామంది; పఱతెంచినన్= రాగా; వారలన్+చూచి; భీముండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: బకాసురుడు భీమునిచేత హతుడై ప్రాణం పోయేటప్పుడు పెద్దగా అరవగా; ఆ ధ్వని విని అతని బంధువులైన పెక్కుమందిరాక్షసులు పరుగెత్తుకొని రాగా వారిని చూచి భీముడిట్లా అన్నాడు.

తే. 'ఇంక నెన్నండు రక్కసు లిద్దురాత్ము । నట్లు మనుజులఁ దినకుండుఁ; డడరి మనుజ
భక్షణము సేసితిరయేని బకుని యట్లు చత్తు' రని రక్కసుల కెల్లఁ జాటె వినఁగ. 307

ప్రతిపదార్థం: ఇంకన్+ఎన్నండున్= ఇంకెప్పుడుకూడ; రక్కసులు; ఈ దురాత్మ+అట్లు= ఈ దుర్మార్గుడివలె; మనుజులన్= మానవులను; తినక+ఉండుఁడు; అడరి= పూనుకొని; మనుజ, భక్షణము+చేసితిర+ఏని= మానవులను తినటం చేస్తే - అంటే మానవులను తింటే; బకుని+అట్లు; చత్తురు (చచ్చుదురు)+అని; రక్కసులు+ఎల్లన్= రాక్షసులందరు; వినఁగన్= వినేటట్లు; చాటెన్= ప్రకటించాడు.

తాత్పర్యం: 'ఇంకెప్పుడు మీరు ఈ దుర్మార్గునివలె మానవులను తినవద్దు. తింటే ఈ బకాసురుడివలె మీకు కూడ చావు తప్ప'దని ఆ రాక్షసులందరు వినేటట్లు భీముడు ప్రకటించాడు.

వ. అంత నారాక్షసులు భీతు లై భీము సేసిన సమయంబున కొడంబడి నాఁటంగోలె నేకచక్రనివాసులకు నుపద్రవంబుఁ చేయనోడి; రట్లు భీముండు బకాసురుం జంపి, వానిం జంపుట జగద్విదితంబుగాఁ దత్కళేబరం బీడ్చుకొని వచ్చి, నగర ద్వార సమీపంబున వైచి, యందుల విప్రులకు సంతోషంబు సేసి, నిజ నివాసంబునకుం జని త ద్వృత్తాంతం బంతయుఁ దల్లికి సహోదరులకుం జెప్పి యున్నంత. 308

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ఆ, రాక్షసులు; భీతులు+ఐ= భయపడినవారై; భీము, చేసిన, సమయంబునకున్= భీముడు చేసిన నియమానికి; ఒడంబడి= ఒప్పుకొని; నాఁటన్+కోలెన్= ఆ రోజునుండి; ఏకచక్ర, నివాసులకున్= ఏకచక్రపురంలో కాపురముండేవారికి; ఉపద్రవంబున్= హాని; చేయన్+ఓడిరి= చేయటానికి భయపడ్డారు; అట్లు; భీముండు; బకాసురున్; చంపి; వానిన్= బకాసురుని; చంపుట; జగత్+విదితంబు+కాన్= ప్రపంచానికంతటికీ తెలిసేటట్లు; తత్+కళేబరంబున్= అతనియొక్క శవాన్ని; ఈడ్చుకొని, వచ్చి; నగర, ద్వార, సమీపంబునన్= నగరంయొక్క ద్వారం దగ్గర; వైచి= పడవేసి; అందుల, విప్రులకున్= అందుండే బ్రాహ్మణులకు; సంతోషంబు+చేసి; నిజ, నివాసంబునకున్+చని= తానుండే ఇంటికి వెళ్ళి; తత్+వృత్తాంతంబు+ అంతయున్= ఆ విషయాన్నంతటినీ; తల్లికిన్, సహ+ఉదరులకున్= తల్లికి, తోబుట్టువులకు; చెప్పి+ఉన్న+అంతన్= తెలిపి ఉన్న సమయంలో;

తాత్పర్యం: అప్పుడు రాక్షసులు భయపడి భీముడు చేసిన నియమానికి అంగీకరించారు. ఆ రోజునుండి ఏకచక్ర పురవాసులకు కీడు చేయటానికి భయపడ్డారు. బకాసురవధ లోకానికంతటికి తెలిసేటట్లు భీముడు ఆ రాక్షసునిశవాన్ని ఈడ్చుకొనివచ్చి, ఏకచక్రనగరద్వారం దగ్గర పడవేసి, ఆ నగరంలోని బ్రాహ్మణుల కెల్ల సంతోషం కలిగించి, తన ఇంటికి వెళ్ళి, తల్లికి, సోదరులకు జరిగిన వృత్తాంతం చెప్పాడు. అప్పుడు.

ఉ. వీఁ డొక మంత్రసిద్ధుఁ డగు విప్రుఁ; డసాధ్యబలున్ బకాసురున్
నేఁ డనిఁ జంపెనట్టె! యితనిం జని చూతమ యంచుఁ జెచ్చెరం
బోఁడిగ వేత్రకీయమున భూసురు లాదిగ వచ్చి చూచి ర
వ్వాఁడిమగంటిమిన్ వెలయువాని వృకోదరు నెల్లవారలున్. **309**

ప్రతిపదార్థం: వీఁడు+ఒక, మంత్రసిద్ధుఁడు+అగు, విప్రుఁడు= వీ డొకమంత్రంచేత ఫలాన్ని పొందిన బ్రాహ్మణుడు; అసాధ్యబలున్= జయించటానికి శక్యంగాని బలం కలవాడిని; బకాసురున్= బకుడు అనే రాక్షసుణ్ణి; నేఁడు; అనిన్= యుద్ధంలో; అట్టె, చంపెన్= అంతసులువుగా చంపాడు; చని= వెళ్ళి; ఇతనిన్; చూచుదుము+అ+అంచున్= చూద్దామా అంటూ; చెర+చెరన్= త్వరత్వరగా; వేత్రకీయమునన్= ఏకచక్రపురంలో; భూసురులు+ఆదిగన్= బ్రాహ్మణులు మొదలుగా; ఎల్లవారలున్= అందరును; ఆ+వాఁడిమగంటిమిన్, వెలయువానిన్, వృక+ఉదరున్= ఈ తీక్ష్ణమైన పౌరుషంచేత ప్రకాశించేవాడైన భీముడిని; పోఁడిగ= ఒప్పుగా; వచ్చి, చూచిరి.

తాత్పర్యం: 'వీ డొక మంత్రసిద్ధి గల బ్రాహ్మణుడు. జయించ సాధ్యంగాని బలవంతుడైన బకాసురుడిని ఈరోజు యుద్ధంలో సులువుగా చంపాడు. వెళ్ళి చూద్దాం' అని ఏకచక్రపురంలో బ్రాహ్మణులు మొదలుగా అందరూ త్వరత్వరగా వచ్చి తీక్ష్ణమైన పౌరుషంచేత ప్రకాశించే భీముడిని చూచారు.

విశేషం: వేత్రకీయము - అనేది ఏకచక్రపురానికి సంజ్ఞ. ఇచట భారతకూలంకషంలో ఇట్లా ఉంది. 'వేత్రకీయమున - ఏక చక్రాపురమున - అద్యప్రభృతి స్వప్యంతే వేత్రకీయ నివాసినః' - శ్రీమదాంధ్రమహాభారతసంశోధితప్రతి, పుట.399. బకాసురవధకు నాయకుని వంటివాడు భీముడు. హిడింబుడిని కారడవిలో చంపి, ఆత్మీయులైన అన్నదమ్ముల కుంతీహిడింబల ప్రశంసల నందుకొన్నాడు. అది ఆత్మరక్షణకోసం చేసిన రాక్షససంహారం. బకాసురవధ పరహితార్థమై కృతజ్ఞతాభావంతో ఏకచక్రపురవాసులకు పాండవులు చేసిన ప్రత్యుపకారం. అందువలన కార్యసాధకుడైన భీమునికి ప్రజలప్రశంస.

క. అని యిట్లు పాండునృపనం । దనుల చరిత్రంబు సెప్పెఁ దా వైశంపా
యనుఁడు జనమేజయున కని । జనవినుతచరిత్రపాత్ర ! సౌజన్యనిధీ! **310**

ప్రతిపదార్థం: జన, వినుత, చరిత్ర, పాత్ర= జనులచేత పొగడబడిన నడవడికి స్థానమైన వాడా!; సౌజన్య, నిధీ= మంచితనానికి ఉనికిపట్టయినవాడా - రాజరాజనరేంద్రా!; అని; ఇట్లు; పాండు, నృప, నందనుల, చరిత్రంబు= పాండురాజుయొక్క కొడుకుల కథను; వైశంపాయనుడు; తాన్= తాను; జనమేజయునకున్; చెప్పెన్; అని-

తాత్పర్యం: జనులచే కీర్తింపబడిన చరిత్ర కలిగి, మంచితనానికి నిధివైన ఓ రాజరాజనరేంద్రా! ఈవిధంగా పాండవుల చరిత్రను వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు - అని సూతుడు శౌనకాదిమహామునులకు చెప్పాడు.

విశేషం: చరిత్ర అంటే కథ అనీ, శీలం అనీ అర్థాలున్నాయి. ఇక్కడ రెండర్థాలూ సార్థకాలే. కథాపరంగా, సంఘటనలపరంగా, మనస్తత్వాలపరంగా - మహాభారతంలో ఈ ఆరవ ఆశ్వాసానికి ఒక ప్రత్యేకత ఉన్నది; ప్రాధాన్యం ఉన్నది. నన్నయ నాటకీయ రచనకు నిలువెత్తు నిదర్శనంవలె నిలిచి, కురుకుమారుల అస్త్రవిద్యాప్రదర్శనతో ఆరంభమైన ఈ ఆశ్వాసంలో - భీమదుర్యోధనుల

గదాయుద్ధఘట్టంలో - కురు పాండవ విభేదాలు అందరిముందు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. కర్ణుని రంగప్రవేశంతో, అతని అంగరాజ్యాభిషేకంతో అవి ఘనీభవించాయి. అందరు చూచి ఆనందించవలసిన అస్త్రవిద్యాప్రదర్శన - మున్ముందు రానున్న మహాభారత సంగ్రామానికి నాందివలె మారింది. అర్ధాంతరంగా ముగిసింది. అంతబలవంతుడైన ద్రుపదుడిని అట్లాపట్టి కట్టితెచ్చి, గురుదక్షిణగా ద్రోణునికి ఇవ్వటంలో అర్జునుని అద్వితీయసామర్థ్యసౌశీల్యాలు అందరిదృష్టిని ఆకర్షించాయి. ధర్మజుని యౌవరాజ్యాభిషేకం, అతని నలుగురు తమ్ముల దిగ్విజయ యాత్ర, పాండవుల మీద - ప్రత్యేకించి ధర్మరాజు మీద పెల్లుబికిన ప్రజానురాగం, పాండవుల నాయకత్వ నైపుణ్యాన్ని నిరూపించాయి. ప్రతినాయకుడైన దుర్యోధనుడు పాండవులకు వ్యతిరేకంగా తన సహాయులతో సాగించిన దురాలోచన, పాండవుల ప్రాణాలు తీయాలని జరిపించిన లాక్షాగృహదహనం - అతని దుర్మార్గప్రవృత్తిని ప్రస్ఫుటం చేశాయి. దుర్యోధనుడు తండ్రితో తన మనోదుఃఖాన్ని వెళ్ళబోసుకొనే ఘట్టం - కురుపాండవ కథాగతిని ప్రభావితం చేసే - ధృతరాష్ట్ర మహారాజు మనస్తత్వాన్ని వ్యక్తం చేసింది. లాక్షాగృహదహనం నుండి పాండవులు ప్రాణాలతో బయటపడటం, ధర్మవిజయానికి, అధర్మపరాజయానికి, మొత్తం మహాభారత సందేశానికి చక్కని సంకేతమై నిలిచింది. లాక్షగృహదహనం తరువాతి కథ అంతా భీమనాయకంగానే సాగింది. హిడింబాసుర బకాసురులవధలు భీముని బలపరాక్రమాలకు విజయపతాకాలు. తల్లి శాసనాన్ని, అన్నగారి నిర్దేశాన్ని అనుసరించి, ఇద్దరి గురుత్వాన్ని శిరసావహించి పాండవపక్షాన ప్రవర్తిల్లే ప్రబల క్రియాశక్తి భీముడు. హిడింబను అతడు వివాహమాడటం ఇందుకొక నిదర్శనం. హిడింబా భీమసేనుల వివాహఫలమే - మాయాయుద్ధనిపుణుడు, మహాశక్తి సంపన్నుడు అయిన ఘటోత్కచుని జననం. అతని జననం పాండవపక్షానికి పెద్దబలం. పాండవపక్షాన జ్ఞానశక్తి వ్యాసుడు; ఇచ్ఛాశక్తి కుంతి; ధార్మికశక్తి ధర్మరాజు; క్రియాశక్తులు భీమార్జునులు; రక్షాశక్తులు నకుల సహదేవులు. ఆరవ ఆశ్వాసకథ ఆసక్తికరమైన కథ; మున్ముందు రానున్న మలుపులను సూచించే కథ.

ఆశ్వాసాంతము

క. మలహారినాథ ! విలస । చ్చళుక్యకులతిలక! రాజసర్వజ్ఞ! రిపు
ప్రలయప్రతాప ! పరనృప । లలనాననకమలహరిణలాంఛనమూర్తీ! 311

ప్రతిపదార్థం: మలహారి, నాథ= మలహారిదేశానికి ప్రభువైనవాడా!; విలసత్+చళక్య, కుల, తిలక= ప్రకాశిస్తున్న చాళుక్యవంశానికి అలంకారమైనవాడా!; రాజ, సర్వజ్ఞ= రాజపరమేశ్వరా! రిపు, ప్రలయ, ప్రతాప= శత్రువులకు నాశనం కలిగించేటి ప్రతాపం కలవాడా!; పర, నృప, లలనా+ఆనన, కమల, హరిణ, లాంఛన, మూర్తీ= శత్రువులయొక్క స్త్రీలముఖాలనే పద్మాలకు చంద్రునివంటి ఆకారం గలవాడా!

తాత్పర్యం: మలహారిదేశప్రభూ! చాళుక్యవంశాలంకారా! రాజపరమేశ్వరా! శత్రురాజులను నశింపజేసే పరాక్రమం కలవాడా! శత్రువులయొక్క స్త్రీల ముఖాలనే పద్మాలు ముడుచుకొని పోయేటట్లు చేసే చంద్రుని వంటివాడా!

విశేషం: ఇవి ఆశ్వాసాంతంలో కృతిపతి అయిన రాజరాజనరేంద్రుడిని ప్రశంసిస్తూ చేసే సంబోధనలు.

మాలిని.

ప్రణమదఖిలధాత్రీపాలకాలోలచూడా । మణిగణకిరణశ్రీమండితాంఘ్రీ! నరేంద్రా
గ్రణి ! నిఖిలమహీరక్షామణీ! రాజనారా । యణ ! విమలమతీ! శీతాంశువంశప్రకాశీ! 312

ప్రతిపదార్థం: ప్రణమత్+అఖిల, ధాత్రీ, పాలక+ఆలోల, చూడామణి, గణ, కిరణశ్రీ, మండిత+అంఘ్రీ= నమస్కరిస్తున్న అందరు రాజులయొక్క కదలుతున్న శిరోరత్నాల సమూహాల కాంతులయొక్క సంపదచేత అలంకరింపబడిన పాదాలు కలవాడా!; నరేంద్ర+అగ్రణీ= రాజులలో శ్రేష్ఠుడా!; నిఖిల, మహీ, రక్షా, మణీ= సమస్త భూమండలాన్ని రక్షించుటయందు శ్రేష్ఠుడా!; రాజనారాయణ!= రాజనారాయణుడు అనే బిరుదు కలవాడా!; విమల, మతీ= నిర్మలమైన బుద్ధికలవాడా!; శీత+అంశు, వంశ, ప్రకాశీ= చల్లని కిరణాలు కలవాడైనచంద్రునివంశాన్ని ప్రకాశింప చేసేవాడా!

తాత్పర్యం: నమస్కరిస్తున్న రాజులందరి చలించేశిరోరత్నసమూహాల కాంతిసంపదచేత అలంకరింపబడిన పాదాలుకలవాడా! రాజశ్రేష్ఠా! సమస్త భూమండలాన్ని రక్షించడంలో శ్రేష్ఠుడా! రాజనారాయణ బిరుదాంకితా! నిర్మలమైన బుద్ధికలవాడా! చంద్రవంశాన్ని ప్రకాశింపజేసేవాడా! - ఓ రాజరాజనరేంద్రా!

విశేషం: మాలిని వృత్తపాదంలో వరుసగా న, న, మ, య, య గణాలుంటాయి. 9వ అక్షరం యతిస్థానం. 'కుర్యాత్ సర్గస్య పర్యన్తే మాలినీం ద్రుతతాలవత్' అని క్షేమేంద్రుడు సువృత్తతిలకంలో తెలిపినట్లే ఇచ్చట షష్ఠాశ్వాసాంతంలో మాలినివృత్తం కూర్చబడింది. రాజరాజనరేంద్రుణ్ణి "నారాయణాఖ్య" అని ఆదిపర్వం ద్వితీయాశ్వాసాంతంలోని ఆశ్వాసాంతపద్యాల్లో (పద్యం-237) కూడా ఉంది. కనుక 'రాజనారాయణ' అనేది ఇతని బిరుదు.

గద్యము

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబునం గుమారాస్త్రవిద్యాసందర్శనంబును, ద్రుపదగ్రహణమోక్షణంబును, దుర్యోధనుదుర్మంత్రంబును, వారణావతయాత్రయు, జతుగృహదాహంబును, విదురోపదిష్టద్వారంబునం బాండవాపక్రమణంబును, హిడింబు వధయును, హిడింబావివాహంబును, వ్యాససందర్శనంబును, ఘటోత్కచసంభవంబును, విప్రగృహంబున నజ్ఞాతచర్యయును, బకాసురవధయును నన్నది షష్ఠాశ్వాసము. **313**

తాత్పర్యం: ఇది, సకల సత్కవుల ప్రశంసలందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీ మహాభారతంలో ఆదిపర్వంలో - కురుకుమారుల అస్త్రవిద్యాప్రదర్శన చూడటం, ద్రుపదరాజును యుద్ధంలో బంధించి విడిచిపెట్టటం, దుర్యోధనుని దురాలోచనం, పాండవులు - వారణావతానికి వెళ్ళటం, లక్కయింటిని తగులబెట్టటం, విదురుడు ఉపదేశించిన మార్గంలో పాండవులు బయటపడటం, హిడింబాసురుడుని సంహరించటం, భీమసేనుడు హిడింబను వివాహమాడటం, వ్యాసమహర్షి దర్శనమివ్వటం, ఘటోత్కచుడు జన్మించటం, పాండవులు బ్రాహ్మణుని ఇంట అజ్ఞాతంగా మెలగటం, బకాసురుడిని హతమార్చటం- అనే అంశాలు కలది ఆరవఆశ్వాసం.

ఆదిపర్వంలో షష్ఠాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - సప్తమాశ్వాసము

శ్రీ రాజరాజ! వీర । శ్రీరమణీరమ్య । గంధసింధుర హయ శి
క్షారూఢిదక్ష ! దక్ష మ । ఖారిదయాలబ్ధ సుస్థిరైశ్వర్యపదా ! 1

ప్రతిపదార్థం: శ్రీరాజరాజ! వీర, శ్రీ, రమణీ, రమ్య! = వీరలక్ష్మి అనే కాంతకు మనోహరుడ వైనవాడా!; గంధ, సింధుర, హయ, శిక్షా+ఆరూఢి, దక్ష!= మదపుటేనుగులను, గుఱ్ఱాలను శిక్షించటంలోను, ఎక్కటంలోను సమర్థుడ వైనవాడా! దక్ష, మఖ+అరి దయా, లబ్ధ, సుస్థిర+ఐశ్వర్య, పదా!= దక్షుడి యజ్ఞానికి శత్రు వైన శివుడిదయతో పొందబడిన శాశ్వతమైన ఐశ్వర్య స్థానం - అనగా రాజ్యపదవి కలవాడా!

తాత్పర్యం: ఓ రాజరాజనరేంద్రా! వీరలక్ష్మి అనే కాంతకు మనోహరుడ వైనవాడా! మదపుటేనుగులను, గుఱ్ఱాలను శిక్షించటంలోను, అధిరోహించటంలోను సమర్థుడైనవాడా! దక్షయజ్ఞానికి శత్రు వైన శివునిదయతో పొందిన శాశ్వతరాజ్యపదవి కలవాడా!

ధృష్టద్యుమ్న ద్రౌపదుల యుత్పత్తి వృత్తాంతము (సం. 1-153-1)

వ. అ క్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె; నట్లు పాండవులు విప్రవేషంబున నేకచక్రపురంబునందు వేదాధ్యయనంబు సేయుచు విప్రగృహంబున నున్న కొన్ని దినంబులకు నొక్కబ్రాహ్మణుండు ద్రుపదు పురంబున నుండి చనుదెంచి విశ్రమార్థి యైన, నాగృహస్థుండు వాని నభ్యాగతపూజల సంతుష్టుం జేసి యున్నంతఁ, గుంతీదేవి గొడుకులుం దాను నవ్విప్రు నతిప్రీతి నుపాసించి 'యయ్యా! మీర లెందుండి వచ్చితి? రే దేశంబులు రమ్యంబు? లెందుల రాజులు గుణవంతు? లని యడిగిన' న వ్విప్రుం డి ట్లనియె. 2

ప్రతిపదార్థం: ఆ+కథకుండు= మహాభారతకథను చెప్పే ఆ ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలైన మహర్షులకు; చెప్పెన్; అట్లు= ఆ విధంగా; పాండవులు; విప్ర వేషంబునన్= బ్రాహ్మణవేషంతో; ఏకచక్రపురంబునందు; వేద+అధ్యయనంబు+చేయుచున్= వేదాన్ని గురుముఖంగా చదువుకొంటూ; విప్ర, గృహంబునన్= బ్రాహ్మణుని ఇంట్లో; ఉన్నన్= ఉండగా; కొన్ని, దినంబులకున్; ఒక్క, బ్రాహ్మణుండు; ద్రుపదు, పురంబుననుండి= ద్రుపదుని పట్టణంనుండి; చనుదెంచి= వచ్చి; విశ్రమ+అర్థి, ఐనన్= విశ్రాంతిని కోరినవాడు కాగా; ఆ గృహస్థుండు= పాండవులున్న ఆ యింటి యజమాని; వానిన్= ఆ బ్రాహ్మణుడిని; అభ్యాగత పూజలన్= అభ్యాగతులకు చేసే పూజలతో; సంతుష్టున్= తృప్తి పొందిన

వాడినిగా; చేసి, ఉన్నంతన్= ఉన్న అంతట; కొడుకులున్; తానున్; కుంతీదేవి; ఆ+విప్రున్= వచ్చి ఉన్న ఆ బ్రాహ్మణుడిని; అతిప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; ఉపాసించి= సేవించి; అయ్యా!;= అయ్యా; మీరలు, ఎందుండి= మీ రెక్కడినుండి; వచ్చితిరి= వచ్చినారు; ఏ దేశంబులు; రమ్యంబులు= అందమైనవి; ఎందుల రాజులు= ఏ దేశాలలోని రాజులు; గుణవంతులు= మంచిగుణాలు కలవారు; అని; అడిగినన్= అడుగగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: మహాభారతకథను చెప్పుతున్న ఉగ్రశ్రవసుడు, శౌనకాది మహామునులకు - భీముడు బకాసురుడిని వధించేవరకు జరిగినకథను వివరించాడు. ఆ విధంగా పాండవులు బ్రాహ్మణవేషాలతో ఏకచక్రపురంలో వేదాధ్యయనం చేస్తూ ఒక బ్రాహ్మణుని ఇంట్లో ఉండగా, కొన్ని రోజుల తర్వాత ఒక బ్రాహ్మణుడు ద్రుపదరాజు పట్టణంనుండి వచ్చి విశ్రాంతి కోరగా, పాండవు లున్న ఇంటియజమాని అతడిని అభ్యాగత పూజలతో తృప్తిపరచాడు. ఆ సమయంలో కుంతీదేవి - కొడుకులు, తాను ప్రీతితో ఆ బ్రాహ్మణుడిని సేవించి, 'అయ్యా! మీరు ఎక్కడినుంచి వచ్చారు? ఏ దేశాలు అందమైనవి? ఏ దేశాల రాజులు గుణవంతులు?' అని అడుగగా ఆ బ్రాహ్మణుడు ఇట్లా అన్నాడు.

చ. సొలయక యెల్ల దేశములుఁ జూచితి; నందుఁ బ్రసిద్ధు లైన రా
జుల సుచరిత్ర సంపదలుఁ జూచితి; నా ద్రుపదేశుదేశముం
బొలుపున నొండు దేశములు పోల్పఁగ నెవ్వియు లేవు; సద్గుణం
బులఁ బరు లెవ్వరున్ ద్రుపదుఁ బోలఁగ లేరు ధరాతలంబునన్. 3

ప్రతిపదార్థం: సొలయక= అలసట చెందక; ఎల్ల, దేశములున్; చూచితిన్; అందున్, ప్రసిద్ధులు+ఐన= వాటిలో ముఖ్యులైన; రాజుల; సుచరిత్ర, సంపదలున్= మంచి నడవడి అనే సంపదలను; చూచితిన్; ధరాతలంబునన్= భూమిమీద; ఆ, ద్రుపద+ఈశు, దేశమున్= ఆ ద్రుపదరాజుయొక్క దేశమును; పొలుపునన్= అందంలో; పోల్పఁగన్= పోల్చటానికి; ఒండు, దేశములు= ఇతర దేశాలు; ఎవ్వియున్, లేవు= ఏవీ లేవు; సద్గుణంబులన్= మంచిగుణాలలో; పరులు= ఇతరులు; ఎవ్వరున్= ఎవరూగానీ; ద్రుపదున్; పోలఁగలేరు= సరిపోలేరు.

తాత్పర్యం: అలసట చెందకుండా నేను అన్నిదేశాలను చూచాను. వాటిలో ప్రసిద్ధు లైన రాజుల మంచి నడవడి అనే సంపదలూ చూచాను. ఈ భూమిమీద అందంలో ఆ ద్రుపదరాజుదేశంతో పోల్చటానికి ఇతరదేశా లేవీ లేవు. సద్గుణాలలో ఇతరు లెవ్వరూ ఆ ద్రుపదుడిని సరిపోలలేరు.

వ. 'ఆ ద్రుపదుండు దన కూఁతు నగ్నికుండసముద్భవ యైనదాని నయోనిజ నగణ్యపుణ్యలావణ్యగుణసమన్విత ననురూపుఁ డైన రాజపుత్రునకు వివాహంబు సేయంగానక, స్వయంవరంబు రచియించుచున్నవాఁ' డనినం, గుంతియు ధర్మ తనయుండును విస్మితులై 'యది యేమి కారణంబున నయోనిజ యయ్యెఁ? నక్కన్య నెవ్విధంబున ద్రుపదుండు వడసె? దీని సవిస్తరంబుగాఁ జెప్పు' మనిన నవ్విప్రుండు వారల కి ట్లనియె. 4

ప్రతిపదార్థం: ఆ, ద్రుపదుండు; తన, కూఁతున్= తన పుత్రికను; అగ్ని, కుండ, సముద్భవ, ఐన, దానిన్= అగ్నిగుండం నుండి గొప్పగా జన్మించిన దానిని; అయోనిజన్= స్త్రీ గర్భంనుండి పుట్టని దానిని; అగణ్య, పుణ్య, లావణ్య, గుణ, సమన్వితన్= లెక్కించటానికి సాధ్యం కాని పుణ్యంతో, కాంతితో, గుణంతో కూడుకొన్నదానిని; అనురూపుఁడు+ఐన=

తగినవాడైన; రాజపుత్రునకున్; వివాహంబు+చేయన్+కానక= పెళ్ళిచేయటం సాధ్యం కాక; స్వయంవరంబు; రచియించుచున్న వాఁడు= రూపొందిస్తున్నాడు; అనినన్= అని ఆ బ్రాహ్మణుడు చెప్పగా; కుంతియున్; ధర్మతనయుండును= ధర్మరాజును; విస్మితులు+ఐ= ఆశ్చర్యపడినవాళ్ళయి; అది= ద్రౌపది; ఏమి, కారణంబునన్= ఏకారణంచేత; అయోనిజ, అయ్యెన్= అయోనిజ అయినది; ఆ+కన్యన్; ఏ+విధంబునన్; ద్రుపదుండు; పడసెన్= పొందినాడు; దీనిన్= ఈ వృత్తాంతాన్ని; సవిస్తరంబుగాన్= విపులంగా; చెప్పుము; అనినన్= అనిఅనగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; వారలకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అగ్నిగుండంనుండి ఆవిర్భవించిందీ, మానవకాంతకు జన్మించనిదీ, అపార మైన పుణ్యంతో, కాంతితో, గుణంతో కూడుకొన్నదీ అయిన తన పుత్రిక ద్రౌపదికి వివాహం చేయా లనుకొన్న ద్రుపదునికి తగిన రాకుమారుడు దొరకలేదు; అందుకే ఆయన స్వయంవరాన్ని ఏర్పాటు చేస్తున్నాడు' అని ఆ బ్రాహ్మణుడు చెప్పగా, కుంతీ ధర్మరాజులు ఆశ్చర్యపడి ' ఆ ద్రౌపది ఏ కారణంచేత మానవకాంతకు జన్మించని దైనది? ద్రుపదుడు ఆమెను ఏ విధంగా కూతురుగా పొందాడు? ఈ వృత్తాంతం విపులంగా చెప్పండి' అని అడుగగా, ఆ బ్రాహ్మణుడు వాళ్ళతో ఇట్లా అన్నాడు.

సీ. ఆది భరద్వాజుఁ డను ముని కలశంబు । నం దుద్భవించిన యనఘమూర్తి
ద్రోణుండు మఱి పృషతున కుద్భవించిన । ద్రుపదుండు నొక్కటఁ దొడఁగి యిష్ట
సఖు లయి వేదముల్ సదివి, ధనుర్వేద । మగ్నివేశులతోడ నర్థిఁ గఱచి
చని, ద్రుపదుండు పాంచాలభూములకు రా । జైన, భారద్వాజుఁ డతని కడకు.

ఆ. నరిగి, వానిచేత నవమానితుం డయి । హస్తిపురికి వచ్చి, యఖిలకురుకు
మారవరుల నెల్ల మానుగా శస్త్రకో । విదులఁ జేసె లోకవిదితయశుఁడు. 5

ప్రతిపదార్థం: ఆదిన్= మొదట; భరద్వాజుఁడు, అను; ముని, కలశంబునందు= మునియొక్క కుండయందు; ఉద్భవించిన= పుట్టిన; అనఘమూర్తి= పాపరహితుడైనవాడు; ద్రోణుండు; మఱి= మఱియు; పృషతునకున్; ఉద్భవించిన= పుట్టిన; ద్రుపదుండున్; ఒక్కటన్= ఒకచోట; తొడఁగి= పూనుకొని; ఇష్ట, సఖులు+అయి= ప్రియస్నేహితులై; వేదముల్, చదివి; ధనుర్వేదము= ధనుర్వేదాన్ని; అగ్నివేశులతోడన్= అగ్నివేశు డనే మునిదగ్గర; అర్థిన్= కోరి; కఱచి= నేర్చుకొని; చని= వెళ్ళి; ఆ ద్రుపదుండు; పాంచాల భూములకున్= పాంచాలదేశానికి; రాజు+ఐనన్= రాజు కాగా; భారద్వాజుఁడు= భరద్వాజుని కుమారు డైన ద్రోణుడు; అతని, కడకున్= ఆ ద్రుపదుని దగ్గరకు; అరిగి= వెళ్ళి; వానిచేతన్; =అతనివల్ల; అవమానితుండు+ అయి= అవమానింపబడినవా డై; హస్తి, పురికిన్; వచ్చి; అఖిల, కురు, కుమార, వరులన్+ఎల్లన్= కురుకుమార శ్రేష్ఠుల నందరిని; లోక, విదిత, యశుఁ డు= ప్రపంచాని కంతటికి తెలియబడిన కీర్తికలవాడు - ద్రోణుడు; మానుగాన్= ఒప్పుగా; శస్త్ర, కోవిదులన్= శస్త్ర విద్యలలో మిక్కిలి నేర్పరులనుగా; చేసెన్.

తాత్పర్యం: భరద్వాజ మహర్షి కలశంనుండి పుట్టిన పుణ్యాత్ముడు ద్రోణుడు, పృషతుని పుత్రుడైన ద్రుపదుడు- ఒకచోట ఉండి ప్రియ స్నేహితు లై, వేదాలను చదివారు. తరువాత ధనుర్వేదాన్ని అగ్నివేశుని దగ్గర అభ్యసించారు. ద్రుపదుడు పాంచాలదేశానికి ప్రభువుకాగా, ద్రోణుడు అతనిదగ్గరకు వెళ్ళి అవమానం పొందాడు. ప్రపంచ ప్రసిద్ధ మైన కీర్తి గల ఆ ద్రోణుడు హస్తినాపురానికి వచ్చి, కురుకుమారుల నందరినీ శస్త్రవిద్యలో ఎంతో నేర్పరులుగా తీర్చిదిద్దాడు.

వ. ఇట్లు దనవలన విలువిద్య గఱచిన పాండవ కౌరవ కుమారులం జూచి ద్రోణుండు' నా కవమానంబు సేసిన య ప్పాంచాలు నోడించి పట్టికొని తెం; డిదియ నాకు గురుదక్షిణ యగు' నని పంచిన, వల్లె యని యందఱు నా ద్రుపదుపయిం బోయి, వానిచేత నిర్జితు లయిన, నర్జునుండు ద్రుపదుతోడ మహాయుద్ధంబుసేసి, వానిం బట్టికొని వచ్చి, ద్రోణున కొప్పించిన నతండును. 6

ప్రతిపదార్థం: ఇట్లు, తనవలన; విలువిద్య; కఱచిన= నేర్చుకొన్న; పాండవ, కౌరవ, కుమారులన్= పాండుకుమారుల్ని, కౌరవుల్ని; చూచి, ద్రోణుండు; నాకున్; అవమానంబు, చేసిన= అవమానం కలిగించిన; ఆ+పాంచాలున్= పాంచాల దేశ రాజైన ద్రుపదుడిని; ఓడించి, పట్టికొని, తెండు= ఓడించిపట్టి తీసుకొనిరండు; ఇదియ; నాకున్; గురుదక్షిణ; అగున్= అవుతుంది; అని; పంచినన్= పంపగా; వల్లె, అని= సరే అని; అందఱున్= అందరూ; ఆ, ద్రుపదు, పయిన్= ఆ ద్రుపదుని మీదికి పోయి; వానిచేతన్, నిర్జితులు+అయినన్= అతనిచేత ఓడింపబడినవాళ్ళు కాగా; అర్జునుండు; ద్రుపదుతోడన్= ద్రుపదునితో; మహాయుద్ధంబు; చేసి, వానిన్, పట్టికొని; వచ్చి; ద్రోణునకున్; ఒప్పించినన్= అప్పగించగా; అతండును= ఆ ద్రోణుడు.

తాత్పర్యం: ఈ విధంగా తనవలన విద్య నేర్చుకొన్న కురు పాండవకుమారులను చూచి ద్రోణుడు - 'నన్ను అవమానించిన ద్రుపదుడిని ఓడించి, పట్టికొని రండి. ఇదే నాకు గురుదక్షిణ' అని పంపగా; సరే అని, అందరు ఆ ద్రుపదునిమీదికి దండెత్తిపోయి ఓడిపోయారు. అర్జునుడు అతనితో మహాయుద్ధం చేసి, అతడిని పట్టుకొని వచ్చి ద్రోణునికి అప్పగించాడు. అప్పుడు ఆ ద్రోణుడు.

విశేషం: కౌరవులుమాత్రమే ముందు వెళ్లి, ఓడినట్లు పూర్వకథ. ఇక్కడ అర్జునుడు తప్ప తక్కినవా ళ్ళంతా ఓడిన ట్లున్నది.

ఆ. ఉల్లసంబు లాడి యోడకు పొ మ్మని। ద్రుపదు విడిచి పుచ్చె; ద్రోణుచేత
నట్లు విడువఁబడి తదవమాన తప్తుఁడై। పృషతనందనుండు పెద్ద యలిగి 7

ప్రతిపదార్థం: ఉల్లసంబులు+ఆడి= దెప్పిపొడుపుమాటలు మాట్లాడి; ఓడకు= భయపడవద్దు; పొమ్ము=పో; అని, ద్రుపదున్; విడిచి, పుచ్చెన్= విడిచిపెట్టాడు; పృషత, నందనుండు= పృషతునియొక్క కుమారుడు-ద్రుపదుడు; ద్రోణుచేతన్, అట్లు; విడుబడి= వదలిపెట్టబడి; తద్+అవమాన, తప్తుఁడు+ఐ= ఆ అవమానంచేత బాధింపబడినవా డై; పెద్ద, అలిగి= మిక్కిలి కోపించి.

తాత్పర్యం: దెప్పి పొడుపుమాటలు మాట్లాడి, అవమానించి, భయపడవద్దు పొ మ్మని ద్రుపదుడిని విడిచిపెట్టాడు. ద్రుపదుడు ఆ విధంగా విడువబడి, ఆ అవమానంతో బాధపడి, మిక్కిలి కోపించి.

వ. రణరంగంబున ద్రోణు వధియించునట్టి కొడుకును, నర్జునునకు దేవి యగునట్టి కూఁతునుం బడయుదు నని బ్రహ్మవిదు లయిన బ్రాహ్మణులనివాసంబులకుం జని, నిత్యంబును బ్రాహ్మణోపాస్తి సేయుచు, నొక్కనాఁడు గంగాకూలంబునందు వానప్రస్థవృత్తి నున్న యాజోపయాజు లనువారి నిద్దఱ ననవరతవ్రతవ్యాసక్తులం గాశ్యపగోత్రులం గని వారికి నమస్కరించి, యందుఁ గొండుక యయ్యును దపోమహిమ నెవ్వరికంటెఁ బెద్దయైన వాని నుపయాజు నుపాసించి యి ట్లనియె. 8

ప్రతిపదార్థం: రణ, రంగంబునన్= యుద్ధభూమిలో; ద్రోణున్, వధియించునట్టి= ద్రోణుడిని చంపునట్టి; కొడుకునున్; అర్జుననకున్; దేవి యగునట్టి; కూఁతునున్; పడయుదున్+అని= పొందుతాను అని, బ్రహ్మ, విదులు+అయిన= బ్రహ్మజ్ఞాన సంపన్నులైన, బ్రాహ్మణుల, నివాసంబులకున్= బ్రాహ్మణులుండే స్థలాలకు; చని= వెళ్ళి; నిత్యంబును= ప్రతిదినము; బ్రాహ్మణ+ఉపాస్తి= బ్రాహ్మణసేవ; చేయుచున్, ఒక్కనాఁడు; గంగా, కూలంబునందున్= గంగాతీరంలో; వానప్రస్థ, వృత్తిన్= వానప్రస్థాశ్రమ జీవనంలో; ఉన్న; యాజ+ఉపయాజులు= యాజుడు, ఉపయాజుడు; అను, వారిన్= అనే వాళ్ళను; ఇద్దఱన్= ఇరువురిని; అనవరత, వ్రత, వ్యాసక్తులన్= సర్వదా నియమనిష్ఠల్లో మిక్కిలి ఆసక్తి గలవాళ్ళను; కాశ్యప, గోత్రులన్= కాశ్యప గోత్రంవాళ్ళను; కని= చూచి; వారికిన్, నమస్కరించి; అందున్= వారిలో; కొండుక, అయ్యును= చిన్నవాడైనను; తపోమహిమన్= తపోమహిమచే; ఎవ్వరికంటెన్= ఇతరులందరికంటెపెద్ద, ఐన, వానిన్= గొప్ప వాడైన వానిని; ఉపయాజున్; ఉపాసించి= పూజించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: యుద్ధరంగంలో ద్రోణుడిని చంపగల పుత్రుడిని, అర్జునునికి భార్య కాగల పుత్రికను పొందా లని ద్రుపదుడు బ్రహ్మజ్ఞానసంపన్ను లైన బ్రాహ్మణు లున్న ప్రదేశాలకు వెళ్ళి, ప్రతిదినం బ్రాహ్మణసేవ చేయసాగాడు. అతడు ఒకనాడు గంగాతీరంలో వానప్రస్థ ఆశ్రమజీవితం గడుపుతున్న యాజ, ఉపయాజు లనే ఇద్దరిని చూచాడు. వాళ్ళు కాశ్యపగోత్రులు; సర్వదా నియమనిష్ఠాచరణంలో మిక్కిలి ఆసక్తి కలవాళ్ళు. వాళ్ళకు నమస్కరించి, వాళ్ళలో చిన్నవాడైనా తపోమహిమలో అందరికంటె పెద్దవా డైన ఉపయాజిని పూజించి, ఇట్లా అన్నాడు.

విశేషం: తనను ఓడించి పట్టి తెచ్చిన అర్జునునిపై శాశ్వతక్రోధం పెట్టుకోకుండా, అతని పరాక్రమాన్ని మనసారా మెచ్చుకొన్న ద్రుపదుని సహృదయత, అంతటి వీరకిశోరుడిని తన అల్లుడిగా చేసికొనా లన్న తలంపు ప్రశంసింప దగినవే! ఆశ్చర్యకరమైనవే! చతుర్విధ - ఆశ్రమాలు: 1. బ్రహ్మచర్యం, 2.గార్హస్థ్యం, 3. వానప్రస్థం, 4. సన్న్యాసం.

క. మునినాథ! నాకు సత్సుత । జననం బగునట్టి క్రతువు సద్విధిఁ గావిం
చినఁ గృతకృత్యుఁడ నగుదుం; । గొను మిచ్చెద నీకు లక్ష గోధేనువులన్. 9

ప్రతిపదార్థం: మునినాథ!= మునిశ్రేష్ఠా; నాకున్; సత్+సుత, జననంబు+అగు= మంచి కుమారుడిని కలిగించే; క్రతువున్= యజ్ఞాన్ని; సత్+ విధిన్= శాస్త్రంలో చెప్పిన పద్ధతి ప్రకారం; కావించినన్= జరిపిస్తే; కృత, కృత్యుఁడన్= నెరవేరిన కోరిక కలవాడను; అగుదున్= అవుతాను; నీకున్; లక్ష, గో, ధేనువులన్= లక్ష ఆవులను, లేగలతో కూడిన పాడిఆవులను; ఇచ్చెదన్, కొనుము= ఇస్తాను, తీసికొనుము.

తాత్పర్యం: ఓ మునిశ్రేష్ఠా! నాకు మంచి కుమారుడిని ప్రసాదించే యజ్ఞాన్ని జరిపిస్తే ధన్యుడ నౌతాను. నీకు లక్ష ఆవులను, లేగదూడలతో కూడిన పాడిఆవులను ఇస్తాను. తీసికొమ్ము.

విశేషం: 'గోధేనువులన్' అనే చోట ' గో ధనచయమున్' అనే పాఠాంతరం ఉంది. గో శబ్దానికున్న నానార్థాలలో ఆవు, ఎద్దు అనేవి ప్రకృతానికి సంబంధించినవి. వాటిలోను 'ఆవు' అనే అర్థమే ఎక్కువ ఉచితంగా ఉన్నది. ధేనువు అంటే లేగదూడకు పాలు కుడిపే ఆవు.

వ. అనిన నుపయాజుం 'దే నిట్టి ఫలంబు నపేక్షింప; నెవ్వరేని ఫలార్థు లగుదు రందుల కేఁగు' మనిన ద్రుపదుండు వెండియు వానిన యొక్క సంవత్సరం బారాధించిన నమ్ముని వాని కి ట్లనియె. 10

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఉపయాజుండు; ఏన్= నేను; ఇట్టి= ఈ విధమైన; ఫలంబున్= ఫలితాన్ని; అపేక్షింపన్= కోరుకొనను; ఎవ్వరు+ఏని= ఎవరైనా; ఫల+అర్థులు+అగుదురు= ఫలం కోరుకొనేవా రున్నట్లైతే; అందులకున్= అక్కడకు; ఏఁగుము= వెళ్ళుము; అనినన్= అనిచెప్పగా; ద్రుపదుండు; వెండియున్= మరల; వానిన్+అ= ఆ ఉపయాజినే; ఒక్క సంవత్సరంబు; ఆరాధించినన్= సేవించగా; ఆ+ముని= ఆ ఉపయాజి; వానికిన్= ద్రుపదునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ద్రుపదుడు పల్కగా; ఉపయాజుడు 'నేను అట్లాంటి ఫలాన్ని ఆశించను. ఎవరైనా ప్రతిఫలం ఆశించేవా ళ్ళుంటే వెళ్లుము' అన్నాడు. ద్రుపదుడు మళ్ళీ ఒక సంవత్సరం ఆ మునినే సేవించగా, అతడు ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

విశేషం: కార్యార్థి ఎదుటివారితత్త్వం తెలిసికొనకుండా 'ఉపకారం చేస్తే ప్రతిఫలం ఇస్తా' నని పలకటం అవివేకం. అల్పులు అందుకు సంతోషిస్తారేమో కాని, మహాత్ములు దాన్ని మెచ్చరు. అంతేకాక దాన్ని అవినయంగా, అవినీతిగా, అహంకారంగా కూడా పరిగణిస్తారు.

తే. **అనఘచరితుఁడు మాయన్న వనములోనఁ**
జనుచు నొక్కనాఁ డొక్కపం డొనరఁ గాంచి
కొనియె శుచి యగు శుచియుఁ గా దని యెఱుంగఁ
బడని భూమితలంబుపైఁ బడిన దాని. **11**

ప్రతిపదార్థం: అనఘ, చరితుఁడు= పాపరహితమైన నడవడి కల వాడు; మా, అన్న (యాజుడు); వనములోన్= అడవియందు; చనుచున్= వెళ్ళుతూ; ఒక్కనాఁడు; శుచి, అగు= శుభ్రమైనది; శుచియున్+కాదు= శుభ్రమైనది కాదు; అని= అని; ఎఱుంగన్+పడని= తెలియని; భూమి, తలంబు, పైన్+ భూప్రదేశంమీద; పడిన దానిన్= పడినదాన్ని; ఒక్క, పండు= ఒక పండును; ఒనరన్= ఒప్పుగ, కాంచి= చూచి; కొనియెన్= తీసికొన్నాడు.

తాత్పర్యం: పాప రహితమైన నడవడి గల మా అన్న యాజుడు అడవిలో వెళ్తూ ఒకనాడు 'ఇది శుభ్రమైనది, కాదు' అని తెలియని నేలమీద పడిన ఒక పండును చూచి, దాన్ని తీసికొన్నాడు.

విశేషం: పై పద్యంలో మొదటిమూడు పాదాల్లో ప్రాసయతులే ఉన్నాయి.

వ. **'ఫలార్థి యయినవాఁడు తత్ఫలానుబంధంబు లయిన దోషంబులు పరికింపండు గావున నమ్మునివరుండు నీ కభిమతంబు సేయుం బో' మ్మనిన ద్రుపదుం డరిగి, సంహితాధ్యయనాది పంచమహాయజ్ఞంబులు సేయుచు, శిలోంఛవృత్తి భైక్షసంపాదిత కుటుంబభారుం డై, ఘోరతపోవృత్తి నున్న యాజుం గని, నమస్కరించి యి ట్లనియె.** **12**

ప్రతిపదార్థం: ఫల+ఆర్థి, అయినవాఁడు= ఫలాన్ని కోరుకొనేవాడు; తద్+ఫల+అనుబంధంబులు+అయిన= ఆ ఫలానికి సంబంధించినవైన; దోషంబులు; పరికింపండు= లెక్కపెట్టడు; కావునన్; ఆ+ముని, వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; నీకున్; అభిమతంబు= ఇష్టమైనది; చేయున్; చేస్తాడు; పొమ్ము+అనినన్= పో అని చెప్పగా; ద్రుపదుండు; అరిగి= వెళ్ళి; సంహితా+ అధ్యయన+ఆది= వేదాన్ని అధ్యయనం చేయటం మొదలైన; పంచ, మహాయజ్ఞంబులు; చేయుచున్; శిల+ఉంఛ, వృత్తి, భైక్ష,

సంపాదిత, కుటుంబ, భారుండు+ఐ= పైరు కోసిన తరువాత మళ్ళయందు జారిపడిన వెన్ను గింజలు మొదలగు వాటిని ఏరికొనే జీవనోపాయంచేత, భిక్షా సంబంధంగా- అనగా బిచ్చమెత్తి సంపాదించబడిన దానిచేత, కుటుంబ భారాన్ని వహించిన వా డై; ఘోర, తపో, వృత్తిన్+ఉన్న= భయంకరమైన తపస్సు చేస్తున్న; యాజున్= యాజమునిని; కని= చూచి; నమస్కరించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఫలాన్ని కోరేవాడు దానికి సంబంధించిన దోషాలను లెక్కపెట్టడు. అందువలన ఆ మునిశ్రేష్ఠుడు నీవు కోరిన దానిని చేస్తాడు, వెళ్ళుము' అని చెప్పగా, ద్రుపదుడు యాజుని వద్దకు వెళ్ళాడు. అతడు వేదాధ్యయనం మొదలైన పంచమహాయజ్ఞాలు చేసేవాడు. పైరు కోసిన తర్వాత మళ్లలో జారిపడిన వెన్నులు, గింజలు మొదలైన వాటిని ఏరుకొనే జీవనోపాయంచేత, బిచ్చమెత్తి సంపాదించిన దానిచేత - కుటుంబభారాన్ని వహిస్తూ, భయంకరమైన తపస్సు చేస్తున్నాడు. అతడిని చూచి ద్రుపదుడు నమస్కరించి ఇట్లా అన్నాడు.

విశేషం: పంచమహాయజ్ఞాలు: (1) దేవయజ్ఞం (దేవతలతృప్తికొఱకు అగ్నిహోత్రంలో హవిస్సులు వేసి హోమం చేయటం), (2) పితృయజ్ఞం (పితృదేవతలతృప్తికొఱకు స్వధాకారంతో తర్పణం చేసి, బ్రాహ్మణులకు భోజనం పెట్టటం), (3) భూతయజ్ఞం (వైశ్వదేవం చేసిన తర్వాత బహిర్దేశంలో భూతాలతృప్తికొఱకు బలి యివ్వటం), (4) మనుష్యయజ్ఞం (యథాశక్తిగా అతిథులకు అన్నం పెట్టటం) (5) బ్రహ్మయజ్ఞం (వేదాధ్యయనం - ఒక ఋక్కును గాని, యజస్సును గాని, సామాన్ని గాని, శక్తి కొద్దీ నిత్యం అభ్యసించటం).

క. మునినాథ! నాకు సత్సుత । జననం బగునట్టి క్రతువు సద్విధి గావిం
చినఁ గృతకృత్యుఁడ నగుదుం । గొను మిచ్చెద నీకు లక్ష గో ధేనువులన్. 13

ప్రతిపదార్థం: (ప్రతిపదార్థ, తాత్పర్యాలకొరకు తొమ్మిదవ పద్యం చూడండి).

విశేషం: యాజుడు ఫలార్థి అని ముందే అతని తమ్ముడు చెప్పాడు. కనుక ద్రుపదుడు 'లక్ష గోధేనువులను ప్రతిఫలంగా ఇస్తాను' అనటంలో తప్పు లేదు. నన్నయ 9వ పద్యాన్నే యథాతథంగా మరల వాడుకొన్నాడు. అంటే తమ్ముని దగ్గర ఒకమాట, అన్నదగ్గర మరొకమాట చెప్పకుండా తన ధ్యేయాన్ని యథాతథంగా తెలిపాడు-ద్రుపదుడు అనటానికి నిదర్శనంగా తొమ్మిదవపద్యాన్ని ఇక్కడకూడా ఒక పలుకైనా తప్పకుండా అర్థిస్తూ తెలిపాడు.

వ. అని ప్రార్థించి వెండియు నా ద్రుపదుండు యాజున కి ట్లనియె. 14

ప్రతిపదార్థం: అని, ప్రార్థించి; వెండియున్= మరల; ఆ ద్రుపదుండు; యాజునకున్, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వేడికొని మరల ఆ ద్రుపదుడు యాజునితో ఈ విధంగా చెప్పాడు.

క. భారతవంశాచార్యుఁడు । భారద్వాజుండు నా కపాయము సేసెన్
ఘోరాజి నతని నోర్చున । పారపరాక్రమసుపుత్త్రుఁ బడయఁగ వలయున్. 15

ప్రతిపదార్థం: భారతవంశ+ఆచార్యుఁడు=భరతునికి సంబంధించిన వంశానికి గురువు; భారద్వాజుండు= భరద్వాజునికి పుత్రు డైన ద్రోణుడు; నాకున్; అపాయము= కీడు; చేసెన్; అతనిన్; ఘోర+ఆజిన్= భయంకరమైన యుద్ధంలో; ఓర్చు= ఓడించే; అపార, పరాక్రమున్= అంతులేని పరాక్రమం కలవాడిని; సుపుత్త్రున్= మంచి కుమారుడిని; పడయఁగవలయున్= పొందవలెను.

తాత్పర్యం: భరతవంశానికి గురువు, భరద్వాజునికి పుత్రుడు అయిన ద్రోణుడు, నాకు హాని చేశాడు. అతడిని మహాయుద్ధంలో ఓడించే మంచిపుత్రుడిని పొందాలి.

క. షడరత్ని ధనుర్ధరుఁ డె । య్యెడ నజితుఁడు గాన వాని హీనుంగాఁ జే

యుఁడు నాకుఁ జతుర్వర్గము । వడయుట యని పృషతసుతుఁడు ప్రార్థించె మునిన్. 16

ప్రతిపదార్థం: షట్+అరత్ని; ధనుస్+ధరుడు= చిటికెన వ్రేలు చాచిన ఆరు పిడిమూరల ధనుస్సును ధరించినవాడు, ద్రోణుడు; ఎయ్యెడన్= ఎక్కడ కూడ; అజితుఁడు, కాన= జయించబడనివాడు కావున; వానిన్= అతణ్ణి; హీనుంగాన్= తక్కువైన వాడినిగా; చేయుఁడు= చేసినచో; నాకున్= నాకు; చతుర్వర్గము= ధర్మార్థ కామమోక్షాలు; పడయుట= పొందుట; అని; పృషత, సుతుఁడు= పృషతుని కుమారుడైన ద్రుపదుడు; మునిన్= యాజుని; ప్రార్థించెన్.

తాత్పర్యం: 'ఆరుమూరల పొడవైన ధనుస్సును ధరించిన ద్రోణుడు ఎక్కడకూడ జయింపబడనివాడు కనుక, అట్లాంటివాడిని తక్కువ చేస్తే, ధర్మార్థకామమోక్షాలైన నాలుగుపురుషార్థాలు నేను పొందినట్లే' అని ద్రుపదుడు యాజుణ్ణి ప్రార్థించాడు.

విశేషం: 'అరత్ని' శబ్దానికి 'చిటికెన వ్రేలు చాచిన పిడి మూర మో చేయి' అని గుప్తార్థప్రకాశిక.

వ. అ య్యాజుండును యాజకత్వంబున కొడంబడి 'నీ కోర్కికిం దగినయట్టి కొడుకునుం గూఁతురుం బుట్టుదు; రోడకుండు మని యజ్ఞోపకరణద్రవ్యంబులు సమకట్టికొని; యథావిధి నుపయాజుండు సహాయుండుగా సౌత్రామణి యయిన కోకిలాదేవి పత్నిగా ద్రుపదుం బుత్రకామేష్టి సేయించిన, నందు మంత్రాహుతులం దృప్తుం డయిన యగ్నిదేవుని వలన. 17

ప్రతిపదార్థం: ఆ+యాజుండును; యాజకత్వంబునకు= యజ్ఞం చేయించే యాజ్ఞికుడిగా ఉండటానికి; ఒడంబడి= ఒప్పుకొని; నీ, కోర్కికిన్; తగిన, అట్టి; కొడుకున్; కూతురున్, పుట్టుదురు; ఓడకుండుము= భయపడవద్దు; అని= అనిపలికి; యజ్ఞ+ఉపకరణ, ద్రవ్యంబులు= యజ్ఞసాధనములను, పదార్థములను; సమకట్టికొని= సిద్ధం చేసికొని; యథావిధిన్= శాస్త్ర పద్ధతి ప్రకారం; ఉపయాజుండు (తమ్ముడు) సహాయుండుగా; సౌత్రామణి, అయిన కోకిలాదేవి (ద్రుపదుని భార్య), పత్నిగా= యజ్ఞాది ధర్మ కార్య నిర్వహణల్లో భర్తను అనుసరించే భార్యగా; ద్రుపదున్; పుత్రకామ+ఇష్టిన్= పుత్రులను కోరిచేసే యజ్ఞాన్ని; చేయించినన్; అందున్= ఆ యజ్ఞంలో; మంత్ర+ఆహుతులన్= మంత్రాలచేత, వ్రేల్చిన హోమద్రవ్యాలచేత; తృప్తుండు= తృప్తిపొందినవాడు; అయిన; అగ్నిదేవువలనన్= అగ్నిదేవునివల్ల.

తాత్పర్యం: ఆ యాజుడు యజ్ఞం చేయించే యాజ్ఞికుడిగా ఉండటానికి అంగీకరించి, 'నీ కోరికకు తగిన కొడుకు, కూతురు జన్మిస్తారు; భయపడవద్దు' అని - యజ్ఞసాధనాలను, పదార్థాలను సిద్ధం చేసికొని, తమ్ముడు ఉపయాజుడు సహాయుడుగా, ద్రుపదుని భార్య కోకిలాదేవి ధర్మపత్నిగా, ద్రుపదునిచేత శాస్త్రోక్తంగా యజ్ఞం చేయించాడు. మంత్రాలతో ఆహుతులుగా వ్రేల్చిన పదార్థాలతో, తృప్తి పొందిన అగ్నిదేవునివలన.

విశేషం: భార్య అనగా భరింపబడేది. జాయ సంతానాన్ని కూర్చేది. గృహిణి గృహాన్ని నిర్వహించేది. రాజులకు పెక్కుమంది భార్య లున్నా, యజ్ఞాలవంటి ధర్మకార్యాలలో భర్తను అనుసరించే వ్యక్తిని, పత్ని, ధర్మపత్ని అని వ్యవహరిస్తారు. పుత్రకామేష్టి

పుత్త్రులను కోరి చేసే యజ్ఞం. పూర్వం దశరథ మహారాజు ఈ యజ్ఞం చేశాడు. యజ్ఞసమయంలో ధర్మపత్ని తప్పక యజమానితో ఉండితీరాలి. ఈ సందర్భంలో ద్రుపదుని భార్య పేరు ప్రస్తావించటం గమనార్హం. ఇక్కడ కోకిలాదేవి అను పేరుకు ముందు 'సౌత్రామణి అయిన' అనే విశేషణం ఉన్నది. సౌత్రామణి అనగా తూర్పు అంటే తూర్పు దిక్కుకలదియై ఆమె యజ్ఞం చేసే సమయంలో కూర్చొని ఉన్న దని గ్రహించాలి.

క. జ్వాలాభీలాంగుఁడు కర । వాల బృహచ్చాపధరుఁడు వరవర్మ కిరీ

టాలంకారుఁడు వహ్నియ । పోలె రథారూఢుఁ డొక్క పుత్త్రుఁడు పుట్టెన్. 18

ప్రతిపదార్థం: జ్వాలా+ఆభీల+అంగుడు= అగ్నిజ్వాలవలె భయంకరమైన శరీరం కలవాడు; కరవాల, బృహత్+చాప, ధరుఁడు= ఖడ్గాన్ని, పెద్ద ధనుస్సును ధరించినవాడు; వర, వర్మ, కిరీట+అలంకారుఁడు= శ్రేష్ఠమైన కవచం, కిరీటం అలంకారంగా కలవాడు; రథ+ఆరూఢుఁడు= రథాన్ని ఎక్కిఉన్నవాడు; వహ్నియ పోలెన్= అగ్నిహోత్రునివలె; ఒక్క, పుత్త్రుఁడు; పుట్టెన్.

తాత్పర్యం: అగ్నిజ్వాలవలె భయంకరమైన శరీరం కలవాడు, ఖడ్గాన్నీ, పెద్ద ధనుస్సును ధరించినవాడు, శ్రేష్ఠమైన కవచంతో కిరీటంతో అలంకరింపబడినవాడు; రథాన్ని అధిరోహించినవాడు అయిన ఒక పుత్రుడు అగ్నిహోత్రుని వలె ఉదయించాడు.

విశేషం: అలం; ఉపమ.

వ. మఱియు 19

తాత్పర్యం: ఇంకా.

తరలము.

కుల పవిత్ర, సితేతరోత్పలకోమలామలవర్ణ, యు

త్పలసుగంధి, లసన్మహోత్పలపత్త్రనేత్ర, యరాళకుం

తల విభాసిని, దివ్యతేజముఁ దాల్చి యొక్క కుమారి త

జ్జ్వలనకుండమునందుఁ బుట్టెఁ బ్రసన్నమూర్తి ముదంబుతోన్. 20

ప్రతిపదార్థం: కుల, పవిత్ర= వంశాన్ని పవిత్రం చేసేది; సిత+ఇతర+ఉత్పల; కోమల+అమల, వర్ణ= తెల్లదికాని కలువవలె సుకుమారమూ స్వచ్ఛమూ అయిన రంగు కలది - అనగా నల్లకలువవంటి శరీరవర్ణం కలది; ఉత్పల, సుగంధి= కలువవంటి సువాసన కలది; లసత్+మహా+ఉత్పల, పత్త్ర, నేత్ర = ప్రకాశించే పెద్ద కలువ రేకులవంటి నేత్రాలు కలది; అరాళ, కుంతల, విభాసిని= వంకరలు తిరిగిన వెంద్రుకలతో వెలిగేది; దివ్య, తేజమున్= దివ్యకాంతిని; తాల్చి= ధరించి; ప్రసన్నమూర్తి= హాయిని గొలుపు ఆకారం కలది; ముదంబుతోన్= సంతోషంతో; ఒక్క, కుమారి= ఒక కన్య; తద్+జ్వలన, కుండము+అందున్= ఆ అగ్నికుండంలోనుండి; పుట్టెన్.

తాత్పర్యం: వంశాన్ని పావనం చేసేది, నల్లకలువవంటి శరీరవర్ణం కలది, కలువగంధంవంటి సుగంధం కలది, కళకళలాడే పెద్ద కలువరేకులవంటి కన్నులు కలది, వంకరలు తిరిగిన వెంద్రుకలతో వెలిగేది, దివ్య తేజస్సును ధరించింది; మనోహరమైన ఆకారం కలది అయిన ఒకకన్య సంతోషంతో ఆ అగ్నికుండంలో ఉదయించింది.

విశేషం: అలం: ఉపమ. నన్నయ తరల వృత్తాన్ని ఆది సభా పర్వాలలో ప్రతి ఆశ్వాసంలోనూ కనీసం ఒకటి రచించాడు. ఆదిపర్వంలోని చతుర్థ, పంచమ, అష్టమాశ్వాసాలలో ఒక్కొక్కటి చొప్పున, మిగిలిన వాటిల్లో రెండు చొప్పున వాడాడు. సభాపర్వంలో ప్రథమాశ్వాసంలో మూడు, ద్వితీయాశ్వాసంలో అయిదు వాడాడు. అరణ్యపర్వంలో ద్వితీయాశ్వాసంలో తప్ప ప్రథమ తృతీయాశ్వాసాలలో రెండేసి రచించాడు. నన్నయ అభిమాన విశేష వృత్తాలలో ఇది ఒకటి. లక్షణం ఇదివరలో చెప్పబడింది. (చూడు ఆది. 3-142) (సంపా.) తరలము లేదా తరళము అనగా ప్రకాశించేది. ఇచ్చట దివ్యతేజస్సు ధరించిన కన్య అగ్నికుండంలోనుండి ఆవిర్భవించింది కాబట్టి ఈ సందర్భంగా ప్రస్తుత ఛందోవిశేషం ఎంతో ఔచిత్యవంతం.

వ. ఇట్లు పుట్టిన యక్కొడుకునకుం గూఁతునకు ధృష్టద్యుమ్నుండును గృష్ణయు నను నామంబు లాకాశవాణి జన విదితంబుగా నుచ్చరించె; నట్లు ద్రుపదుండు లబ్ధసంతానుం డయి, సంతసిల్లి యాజునకు యథోక్త దక్షిణ లిచ్చి, బ్రాహ్మణులం బూజించి, ధృష్టద్యుమ్నుని ధనుర్వేదపారగుం జేయించి యున్నంత, నక్కన్య యిపుడు వివాహసమయప్రాప్త యయిన. 21

ప్రతిపదార్థం: ఇట్లు; పుట్టిన; ఆ+కొడుకునకున్; కూఁతునకున్; ధృష్టద్యుమ్నుండును, కృష్ణయున్, అను, నామంబులు= ధృష్టద్యుమ్నుడు, కృష్ణ అను పేర్లు; ఆకాశవాణి; జన, విదితంబుగాన్= జనులకు తెలిసేటట్లుగా; ఉచ్చరించెన్= పలికెను; అట్లు= ఆ విధంగా; ద్రుపదుండు; లబ్ధ, సంతానుండు+అయి= పొందిన సంతానం కలవాడై; సంతసిల్లి= సంతోషించి; యాజునకున్= యాజ మునికి; యథా+ఉక్త, దక్షిణలు= చెప్పిన ప్రకారం దక్షిణలు; ఇచ్చి; బ్రాహ్మణులన్; పూజించి; ధృష్టద్యుమ్నుని; ధనుర్వేద పారగున్= ధనుర్వేదము యొక్క ఆవలి ఒడ్డు చేరినవాడినిగా - అనగా ధనుర్వేదాన్ని పూర్తిగా నేర్చినవాడినిగా; చేయించి; ఉన్నంతన్= ఉన్నంతలో; ఆ+కన్య= ఆ కృష్ణ; ఇపుడు; వివాహ, సమయ, ప్రాప్త, అయినన్= వివాహసమయం సమీపించింది కాగా.

తాత్పర్యం: ఈ విధంగా పుట్టిన కుమారునికి, కూతురికి - ధృష్టద్యుమ్నుడు, కృష్ణ అనే పేర్లను ప్రజ లందరికీ తెలిసే విధంగా ఆకాశవాణి పలికింది. ఆ విధంగా ద్రుపదుడు సంతానం పొంది, సంతోషించి, యాజునికి చెప్పిన ప్రకారం దక్షిణ లిచ్చి, బ్రాహ్మణులను పూజించాడు. ధృష్టద్యుమ్నుడిని ధనుర్వేదపారంగతుడిని చేయించాడు. ఇప్పుడు ఆ కన్యకు వివాహసమయం సమీపించగా;

విశేషం: ధృష్టద్యుమ్నుడు= గొప్ప బలంకలవాడు; కృష్ణ= నల్లని శరీరం కలది.

ద్రౌపదీవివాహప్రయత్నము (అమూలకము)

ఉ. మానితు లైన పాండవకుమారులుఁ గుంతియు లక్కయింట ను
గ్రానలదగ్ధు లై రని ధరామరముఖ్యు లెఱింగి చెప్పఁగా
నా నరనాయకుండు విని యాతత శోకమహానలజ్వల
న్మానసుఁ డయ్యె బంధుజనమంత్రిపురోహిత విప్రసన్నిధిన్. 22

ప్రతిపదార్థం: మానితులు+ఐన= గౌరవింపబడినవా రైన; పాండవ కుమారులున్= పాండవులూ; కుంతియున్; లక్క, ఇంటన్= లక్కయింటిలో; ఉగ్ర+అనల, దగ్ధులు+ఐరి+అని= భయంకరమైన అగ్నిచేత కాలిపోయా రని; బంధు, జన, మంత్రి, పురోహిత, విప్ర, సన్నిధిన్= బంధుజనులయొక్క, మంత్రులయొక్క, పురోహితులయొక్క, బ్రాహ్మణులయొక్క ఎదుట;

ధరా+అమర ముఖ్యులు= బ్రాహ్మణశ్రేష్ఠులు; ఎఱింగి= తెలిసికొని; చెప్పఁగాన్; ఆ, నర నాయకుండు= ఆ రాజు - ద్రుపదుడు; విని, అతత, శోక, మహా+అనల, జ్వలత్+మానసుఁడు+అయ్యెన్= మిక్కుటమైన దుఃఖ మనెడి గొప్ప అగ్నిచేత దహింప బడుతున్న మనస్సు కల వా డయ్యాడు.

తాత్పర్యం: గొప్పవా ళ్ళయిన పాండవులు, కుంతి లక్కయింట్లో భయంకరమైన అగ్నికి ఆహుతి అయ్యా రని బంధువుల, మంత్రుల, పురోహితుల, బ్రాహ్మణుల సమక్షంలో బ్రాహ్మణశ్రేష్ఠులు చెప్పగా, విని ద్రుపదుడు అధికదుఃఖ మనే అగ్నిచే దహింపబడుతున్న మనస్సు కలవా డయ్యాడు.

విశేషం: అలం: రూపకం. జ్వలత్+మానసుడు= జ్వలన్మానసుడు - అనునాసికసంధి.

వ. మఱియును. **23**

తాత్పర్యం: అంతటితో ఆగక.

సీ. 'ఇంద్రసమానున కిందీవరశ్యామ । సుందరాంగున కింద్రనందనునకు
దేవిఁగాఁ బ్రీతితో దీని నీఁ గాంచితి । నని యున్నచో విధాతృనకు నిట్లు
పాడియే విఘ్న మాపాదింప; నమ్మహా । ధ్వరమునఁ బుట్టిన సరసిజాక్షి
నే నెట్టు లొరులకు నీ నేర్తు' నని దుఃఖ । పరవశుఁడయి యున్న ధరణిపతికిఁ

ఆ. దత్పురోహితుండు దా నిట్టు లనియె 'న । ప్పాండవులనుగుఱిచి బహువిధంబు
లగు నిమిత్తములు నయంబునఁ జూచితి; । నెగ్గు లేదు; వారి కెల్ల లగ్గు'. **24**

ప్రతిపదార్థం: ఇంద్ర, సమానునకున్= ఇంద్రునితో సమానమైనవానికి; ఇందీవర, శ్యామసుందర+అంగునకున్= నల్లకలువవలె నల్ల నై అందమైన శరీరం కలవానికి; ఇంద్ర, నందనునకున్= ఇంద్రుని కుమారు డైన అర్జునునికి; ప్రీతితోన్= ప్రేమతో; దీనిన్= ఈ కృష్ణను, దేవిగాన్= భార్యగా; ఈన్+కాంచితిన్= ఇవ్వగలిగాను; అని, ఉన్నచో= అని ఉండగా; విధాతృనకున్= బ్రహ్మదేవునికి; ఇట్లు; విఘ్నము= చెఱుపు; ఆపాదింపన్= కలిగించుట; పాడియే= న్యాయమా; ఆ+మహా+అధ్వరమునన్= ఆ మహాయజ్ఞంలో; పుట్టిన; సరసిజ+అక్షిన్= సరస్సునుండి పుట్టిన పద్మమువంటి కన్నులు కలదానిని; ఏన్= నేను; ఎట్టుల= ఏ విధంగా; ఒరులకున్= ఇతరులకు; ఈ, నేర్తును= ఇవ్వగలను; అని= అని తలచి; దుఃఖ, పరవశుఁడు+అయి= దుఃఖానికి పూర్తిగా లొంగిపోయినవా డై- అనగా మిక్కిలి దుఃఖం పొందినవా డై; ఉన్న, ధరణి, పతికిన్= ఉండు భూపతికి - ద్రుపదరాజుకు; తద్+పురోహితుండు= అతని పురోహితుడు; తాన్= తాను; ఇట్లు+అనియెన్; ఆ+పాండవులను; గుఱిచి= గురించి; బహువిధంబులు+అగు= పెక్కు విధాలైన; నిమిత్తములు= శకునాలు; నయంబునన్= నేర్పుగా; చూచితిన్; వారికిన్= ఆ పాండవులకు; ఎగ్గు= కీడు; లేదు; ఎల్ల= అంతయు; లగ్గు= మేలు.

తాత్పర్యం: 'ఇంద్రునితో సమానుడు, నల్లకలువవలె నల్లని అందమైన శరీరం కలవాడు. ఇంద్రుని కుమారుడు అయిన అర్జునునికి ప్రేమతో కృష్ణను భార్యగా ఇవ్వా లని ఉండగా, బ్రహ్మదేవుడు ఈ విధంగా చెరుపు చేయటం న్యాయమా? ఆ మహాయజ్ఞంలో పుట్టిన ద్రౌపదిని ఏ విధంగా ఇతరులకు ఇవ్వగలను? అని ద్రుపదుడు దుఃఖంలో మునిగిపోయాడు. అప్పు డతని పురోహితుడు ఇట్లా అన్నాడు. 'ఆ పాండవులను గురించి అనేకవిధా లైన శుభశకునాలను నిపుణంగా చూచాను. వారికి కీడు లేదు. అంతా మేలే'.

విశేషం: అర్జునుడు ఇందీవరశ్యాముడు. అగ్నినుండి పుట్టిన కృష్ణకూడ 'సితేతరోత్పల కోమలామలవర్ణ' - (ఉత్పల, పత్రనేత్ర, ఉత్పలసుగంధి కూడ). అర్జునునికొరకే ద్రౌపది పుట్టింది కనుక ఇద్దరిలో ఈ రూపసామ్యం ఒక విశేషం.

వ. 'తొల్లి దేవేంద్రుండు గొండొకకాలం బదృశ్యుం డై యుండిన, నతనిం గానక శచీదేవి శోకింపం బోయిన నుపశ్రుతిం జేసి బృహస్పతి దానికి దేవేంద్రాగమనంబు సెప్పె నని వేదంబుల వినంబడుం; గావున నేను నుపశ్రుతిం జూచితి; నిది దప్పదు; పాండవులు పరలోకగతులు గారు; పరమానందంబున నున్నవారు; వార లెందుండియు నిందులకు వత్తురు; నీవును సుచిత్తుండ వయి స్వయంవరం బిప్పురంబున ఘోషింపం బంపు; మిది కన్యాదానంబునందు రాజులకు శాస్త్రచోదితం' బనినం బురోహితువచనంబునంజేసి, యూఱడి ద్రుపదుండు నేఁటికి డెబ్బదియేనగు దివసంబునం బౌషమాసంబున శుక్లపక్షంబున నష్టమియు రోహిణినాఁడు స్వయంవరం బని ఘోషింపం బంచి. 25

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; దేవేంద్రుండు; కొండు+ఒక, కాలంబు= కొంత కాలం; అదృశ్యుండు+ఐ= అగుపడనివా డై; ఉండినన్= ఉండగా; అతనిని= ఆ ఇంద్రుని; కానక= చూడక; శచీదేవి; శోకింపన్+పోయినన్= దుఃఖించపోగా; ఉపశ్రుతిన్+చేసి= శుభాశుభ సూచకమైన ఇతరుల సంభాషణ ధ్వనిని వినటంచేత; బృహస్పతి; దానికిన్= ఆ శచీదేవికి; దేవేంద్ర+ఆగమనంబు= దేవేంద్రుని యొక్క రాకను; చెప్పెన్+అని= చెప్పాడు అని; వేదంబులన్= వేదాలలో; వినంబడున్= వినబడుతూ ఉంది; కావునన్= కాబట్టి; నేనున్= నేనుకూడా; ఉపశ్రుతిన్; = ఆ ఉపశ్రుతిని; చూచితిన్, ఇది; తప్పదు; పాండవులు; పరలోకగతులు, కారు= స్వర్గలోకానికి వెళ్ళినవారు కారు - అనగా మరణించలేదు; పరమ+ఆనందంబునన్= మిక్కిలి సంతోషంతో; ఉన్న, వారు; వారలు; ఎందు+ఉండియున్= ఎక్కడ ఉన్నా; ఇందులకున్= ఇక్కడికి; వత్తురు= వచ్చుదురు; నీవును; సు చిత్తుండవు+ అయి= కలతలేని మంచి మనస్సు కలవాడవై; స్వయంవరంబు= స్వయంవరాన్ని; ఈ+పురంబునన్= ఈ నగరంలో; ఘోషింపన్= చాటించటానికి; పంపుము= ఆజ్ఞాపించు; ఇది= ఈ స్వయంవరం; కన్యా, దానంబునందున్= కన్యాదానమున; రాజులకున్; శాస్త్ర, చోదితంబు= శాస్త్రంచేత చెప్పబడింది; అనినన్= అని అనగా; పురోహితు, వచనంబునన్+చేసి= పురోహితుని యొక్క మాటలతో; ఊఱడి= ఓదార్పునొంది; ద్రుపదుండు; నేఁటికిన్= ఈనాటికి; డెబ్బది, ఏను+అగు= డెబ్బది యైదవది అగు; దివసంబునన్= రోజున; పౌష, మాసంబునన్= పుష్యమాసంలో; శుక్ల, పక్షంబునన్, అష్టమియు= శుక్లపక్షం అష్టమితిథి; రోహిణినాడు= రోహిణీ నక్షత్ర మున్ననాడు; స్వయంవరంబు+అని; ఘోషింపన్= చాటించటానికి; పంచి= ఆజ్ఞాపించి.

తాత్పర్యం: 'పూర్వం దేవేంద్రుడు కొంతకాలం కనబడకపోగా, శచీదేవి శోకించిం దనీ, శుభసూచకమైన ఇతరుల సంభాషణనుబట్టి బృహస్పతి ఆమెకు దేవేంద్రుని రాకనుగురించి చెప్పా డనీ వేదాలవలన తెలుస్తున్నది. కనుక నేనుకూడ అట్లాంటి శుభశకునాలే చూచాను. ఇది తప్పదు. పాండవులు మరణించలేదు. పరమానందంతో ఉన్నారు. వా ళ్ళెక్కడున్నా ఇక్కడికి వస్తారు. నీవు నిర్మల మైన మనస్సుతో ఈ పట్టణంలో స్వయంవరాన్ని చాటించడానికి ఆజ్ఞాపించుము. స్వయంవరం కన్యాదానంలో రాజులకు శాస్త్రవిహితమే - ఈ విధంగా చెప్పిన పురోహితునిమాటలతో ఊరటచెంది, ద్రుపదుడు - ఈ నాటినుండి డెబ్బై ఐదవరోజు పుష్యమాస, శుక్ల పక్ష అష్టమి, రోహిణీనక్షత్రం ఉన్నరోజు స్వయంవరం జరుగుతుం దని చాటించటానికి ఆజ్ఞాపించాడు.

విశేషం: కొన్ని ప్రతులలో 'అష్టమి'కి బదులు పంచమి అని ఉన్నది. ఉపశ్రుతి అంటే ఒకరు మాట్లాడుతున్నప్పుడు అనుకోకుండా శుభాశుభసూచకమైన ఇతరుల సంభాషణ వినటం. ఇది శకునం. దీన్నిబట్టి భవిష్యత్తులో జరుగబోయే శుభాశుభాలను శకునశాస్త్రం చెప్పేవాళ్లు చెప్పుతారు.

క. ఎవ్వరికిని మోపెట్టను । దివ్వను శక్యంబు గాని దృఢకార్ముకమున్
దవ్వై దివమునఁ దిరిగెడు । నవ్విలసత్కనకమత్స్య యంత్రముఁ జేసెన్. 26

ప్రతిపదార్థం: ఎవ్వరికిని; మోపెట్టను= ఎక్కు పెట్టటానికి; తివ్వను= లాగటానికి; శక్యంబు+కాని= సాధ్యం కాని; దృఢ; కార్ముకమున్= బలమైన ధనుస్సును; దవ్వు+ఐ= దూరమై; దివమునన్= ఆకాశంలో; తిరిగెడు= తిరుగునట్టి; ఆ+విలసత్+కనక, మత్స్యయంత్రమున్= ప్రకాశించే బంగారుచేపతో కూడిన యంత్రాన్ని; చేసెన్= రూపొందించాడు.

తాత్పర్యం: ఎక్కుపెట్టటానికికాని, లాగటానికి కాని ఎవ్వరికీ సాధ్యంకాని ఒక బలమైన ధనుస్సునూ, దూరంగా ఆకాశంలో తిరిగే ప్రకాశవంత మైన బంగారు మత్స్యయంత్రాన్నీ రూపొందించాడు.

క. 'ధరణిఁ గల రాజులెల్లను । బురుడునఁ గాంపిల్య నగరమున కరిగెద రొం
డొరులం గడవఁగ, నని భూ । సురువరుఁ డెఱిఁగించెఁ బృషతసుతుకథయెల్లన్. 27

ప్రతిపదార్థం: ధరణిన్= భూమిమీద; కల= ఉన్న; రాజులు+ఎల్లన్= రాజులంతా; పురుడునన్= సమానంగా; కాంపిల్య నగరమునకు (ఇది ద్రుపదుపురం); ఒండొరులన్+కడవఁగన్= ఒకరికంటె ముందుగా మరొకరు; అరిగెదరు= వెళ్ళుతారు; అని= ఆప్రకారం, భూసుర, వరుఁడు= బ్రాహ్మణ శ్రేష్ఠుడు; పృషత, సుతు, కథ, ఎల్లన్= ద్రుపదుడి కథ అంతా; ఎఱిఁగించెన్= చెప్పాడు.

తాత్పర్యం: 'భూమిమీద ఉన్న రాజులంతా ఒకరికొకరు (ముందుగా వెళ్ళా లని) పోటీపడుతూ ద్రుపదుని కాంపిల్య నగరానికి వెళ్ళుతున్నా' రని ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు ద్రుపదునికథ అంతా చెప్పాడు.

వ. దాని విని పాండునందను లందులకుం బోవనున్నఁ గొడుకుల యభిప్రాయం బెఱింగి కుంతీదేవి యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: దానిన్= ఆ వృత్తాంతమును; విని, పాండునందనులు= పాండుకుమారులు; అందులకున్= కాంపిల్యనగరానికి; పోవన్+ఉన్నన్= పోవలె నని ఉండగా; కొడుకుల; అభిప్రాయంబు; ఎఱింగి; కుంతీదేవి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ వృత్తాంతాన్ని విని పాండవులు కాంపిల్యనగరానికి పోవా లనే అభిప్రాయంతో ఉండగా; దానిని గ్రహించి కుంతీదేవి వాళ్ళతో ఈ విధంగా అనింది.

పాండవులు పాంచాలపురంబునకు బయలుదేరుట. (సం. 1-156-2)

క. కడుఁబెద్దకాల ముండితి । మొడఁబడి; యిం దెంతకాల మున్నను మన క
య్యెడు లాభ మేమి? మఱి యె । ప్పడు నుచితమె యొరుల యిండ్ల పొత్తున నుండన్. 29

ప్రతిపదార్థం: కడున్= చాల; పెద్ద, కాలము= ఎక్కువ కాలం; ఒడఁబడి= ఇష్టపడి; ఉండితిమి= ఉంటిమి; ఇందు+ఎంతకాలము+ఉన్నను= ఇక్కడ ఎంతకాలం ఉన్నా; మనకున్; అయ్యెడు= కలిగే; లాభము+ఏమి; మఱి; ఎప్పుడున్; ఒరుల= ఇతరుల; ఇండ్ల, పొత్తునన్= ఇండ్లల్లో; ఉండన్= ఉండటం; ఉచితమె= తగునా?

తాత్పర్యం: ఏకచక్రపురంలోని ఈ బ్రాహ్మణుని ఇంట్లో చాలా యెక్కువకాలం ఎట్లాగో ఉన్నాం. ఇక్కడ ఎంత కాల మున్నా మనకు కలిగే లాభ మే ముంది? అంతేకాక ఎప్పుడూ ఇతరుల యిండ్లలో కలిసి ఉండటం ఉచితం కాదు కదా!

వ. దక్షిణపాంచాలంబు గరంబు రమ్యం బనియును, బాంచాలపతి పరమధార్మికుం డనియును వింటిమి; మఱి యట్లుం గాక. 30

ప్రతిపదార్థం: దక్షిణ, పాంచాలంబు= దక్షిణపాంచాలదేశం; కరంబు= మిక్కిలి; రమ్యంబు+అనియును= అందమైన దనీ, పాంచాల పతి= పాంచాలరాజు; పరమ, ధార్మికుండు+అనియును= మిక్కిలి ధర్మబుద్ధికలవా డనీ; వింటిమి= విన్నాము; మఱి= ఇక; అట్లున్+కాక= ఆ విధంగా కాకుండా;

తాత్పర్యం: దక్షిణపాంచాలదేశం ఎంతో అందమైన దనీ, పాంచాలాన్ని పాలించే రాజు మిక్కిలి ధర్మబుద్ధి కలవా డనిన్నీ విన్నాము; అంతేకాక.

క. అడుగకయు విప్రవరులకు । నడరఁగ నద్దేశమున గృహస్థులు భక్తిం
గుడువఁగఁ బెట్టుదు రెప్పుడుఁ । గడు హృద్యము లయిన మోదకంబులతోడన్. 31

ప్రతిపదార్థం: ఆ+దేశమునన్= ఆ పాంచాలదేశంలో; గృహస్థులు= ఇంటి యజమానులు; అడరఁగన్= ఒప్పుగ; విప్ర, వరులకున్= బ్రాహ్మణ శ్రేష్ఠులకు; అడుగకయు= అడుగకుండానే; భక్తిన్= భక్తితో; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కడున్= మిక్కిలి; హృద్యములు+ అయిన= ఇంపైన; మోదకంబులతోడన్= కుడుములతో; కుడువగన్= తినటానికి (భోజనం); పెట్టుదురు.

తాత్పర్యం: ఆ పాంచాలదేశంలో గృహస్థులు బ్రాహ్మణశ్రేష్ఠులకు అడుగకుండానే భక్తితో, మనోహరా లైన మోదకాలతో ఎప్పుడూ భోజనం పెడుతూ ఉంటారు.

వ. 'అందులకుం బోవుద' మనినం గొడుకులెల్ల వల్లె యని 'మీ పంచిన విధంబ చేయం గలవార' మని యొడంబడి తమయున్న యింటిబ్రాహ్మణునకుం జెప్పి వీడ్కొని. 32

ప్రతిపదార్థం: అందులకున్= ఆ పాంచాలదేశానికి; పోవుదము+అనినన్= పోదాం అని అనగా; కొడుకులు+ఎల్ల= కొడుకులంతా; వల్లె, అని= సరే అని; మీ, పంచిన, విధంబు+అ= మీరు ఆజ్ఞాపించినట్లే; చేయన్+కలవారము+అని= చేస్తాము అని; ఒడంబడి= సమ్మతించి; తమ, ఉన్న= తామున్న; ఇంటి= ఇంటి; బ్రాహ్మణునకున్, చెప్పి; వీడ్కొని= సెలవు తీసికొని.

తాత్పర్యం: పాంచాలపురానికి వెళ్లుదా మని కుంతి అనగానే కొడుకులంతా సరే అని 'మీరు చెప్పినట్లే చేస్తా' మని ఒప్పుకొని, తా మున్న యింటి బ్రాహ్మణునికి చెప్పి అతనిదగ్గర సెలవు తీసికొని.

పాండవులు ద్రుపదుపురంబున కరుగుచు వ్యాసమహర్షిం గనుట (సం. 1-157-1)

చ. ఉరుసరసీవనంబులు మహోగ్రనగంబులు నేఱులున్ సుదు
స్తరవిపినంబులుం గడచి ధన్యులు పాండుకుమారకుల్ నిరం

తరగతి నేఁగుచుం గనిరి ధర్మసమేతుఁ బితామహుం దమో

హరు హరిమూర్తి నార్తిహరు నాదిమునీంద్రుఁ బరాశరాత్మజున్. **33**

ప్రతిపదార్థం: ఉరు, సరసీవనంబులు= పెద్ద సరస్సుల సమూహాలు; మహా+ఉగ్ర, నగంబులున్= మిక్కిలి భయంకరా లైన పర్వతాలు; ఏఱులున్= నదులు; సు, దుస్తర, విపినంబులున్= దాటటానికి చాలా కష్టమైన అడవులు; కడచి= దాటి; ధన్యులు= పుణ్యవంతులైన; పాండుకుమారకుల్= పాండురాజుకుమారులు; నిరంతర, గతిన్= ఎడతెగని ప్రయాణంతో; ఏఁగుచున్= వెళ్ళుతూ; ధర్మ, సమేతున్= ధర్మంతో కూడుకొన్నవాడిని - అనగా ధర్మాత్ముడిని; పితామహున్= తాతను; తమోహరున్= అజ్ఞానాన్ని తొలగించేవాడిని; హరిమూర్తిన్= విష్ణుస్వరూపుని; ఆర్తి, హరున్= దుఃఖాన్ని తొలగించే వాడిని; ఆది, మునీంద్రున్= తొలి ముని శ్రేష్ఠుడిని; పరాశర+ఆత్మజున్= పరాశరునియొక్క కుమారుడిని - వేదవ్యాసుడిని; కనిరి= చూచారు.

తాత్పర్యం: పెద్ద సరస్సుల సమూహాలను, భయంకరా లైన పర్వతాలను, నదులను - దాటడానికి చాలా కష్టమైన అడవులను దాటి - పుణ్యాత్ములైన పాండవులు నిరంతరం ప్రయాణం చేస్తూ - ధర్మాత్ముడు, పితామహుడు, అజ్ఞానాన్ని తొలగించేవాడు, విష్ణుస్వరూపుడు, దుఃఖాన్ని హరించేవాడు, ఆదిమునీంద్రుడు, పరాశరపుత్రుడు అయిన వ్యాసమహర్షిని దర్శించారు.

వ. కని వినయమ్మున నమ్మునీంద్రునకు నందఱు నమస్కారంబు సేసిన వారలం జూచి కరుణారస పూరితాంతః కరణుం డయి వ్యాసభట్టారకుం డి ట్లనియె. **34**

ప్రతిపదార్థం: కని= చూచి; వినయమ్మునన్; ఆ+మునీంద్రునకున్= ఆ వ్యాసమహర్షికి; అందఱు; నమస్కారంబు; చేసిన; వారలన్; చూచి; కరుణా, రస, పూరిత+అంతఃకరణుండు+అయి= దయారసంతో నిండిన మనస్సు కలవాడై; వ్యాసభట్టారకుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పాండవులు వ్యాసమహర్షిని చూచి వినయంతో ఆయనకు నమస్కరించగా; ఆ మునీంద్రుడు కరుణారసంతో నిండినహృదయంతో వాళ్ళను చూచి ఈ విధంగా అన్నాడు.

క. ధర్మసుతుఁ డున్న చోటను । ధర్మువునకు హాని గలదె ధారుణి; నైనన్

ధర్మువ తాత్పర్యముగా । నిర్మలమతి నెగడునది వినీతాత్ముల రై. **35**

ప్రతిపదార్థం: ధర్మసుతుఁడు= ధర్మరాజు; ఉన్న, చోటను= ఉండే ప్రదేశంలో; ధర్మువునకున్= ధర్మానికి; హానికలదె= హాని ఉంటుందా?; ధారుణిన్= భూమిమీద; అయినన్= అయినప్పటికి; ధర్మువు+అ= ధర్మమే; తాత్పర్యముగా= ముఖ్యసారాంశంగా; నిర్మలమతిన్= మాలిన్యం లేని మనస్సుతో; వినీత+ఆత్ములరు+ఐ= వినయవంతు లై; నెగడునది= నడచుకోండి.

తాత్పర్యం: ధర్మరాజు ఉన్నచోట ధర్మానికి హాని ఉంటుందా? (ఉండ దని భావం). అయినప్పటికీ ధర్మమే ప్రధానంగా, నిర్మలమైన మనస్సుతో వినయవంతు లై మెలగండి.

సీ. తా నొక్క మునికన్య దన కర్మవశమునఁ । బతిఁ బడయంగ నోపక యుపేత

దౌర్భాగ్య యై ఘోరతప మొనరించిన । దానికి శివుఁడు ప్రత్యక్షమయ్యు,

'వేఁడుము వర' మన్న వేడ్కతోఁ బతిదాన । మని యేనుమాఱు లయ్యబల వేఁడె;
'నట్లేని నీకు దేహాంతరంబునఁ బతు । లగుదు రేవురు పరమార్థ' మనియు

ఆ. హరుఁడు కరుణ నిచ్చె; నది యిప్డు పాంచాల । పతికిఁ గృష్ణ యనఁగఁ బంకజాక్షి
యుద్భవిల్లి పెరుఁగుచున్నది; తత్స్వయం । వరము సేయుచున్నవాఁడు నేఁడు. 36

ప్రతిపదార్థం: తాను; ఒక్క మునికన్య; తన, కర్మవశమునన్= తన పూర్వజన్మ కర్మవలన; పతిన్= భర్తను; పడయంగన్+ఓపక= పొందలేక; ఉపేత, దౌర్భాగ్య+ఐ= కూడుకొన్న దురదృష్టం కలదై - అనగా దురదృష్టవంతురాలై; ఘోర, తపము= కఠినమైన తపస్సు; ఒనరించినన్= చేయగా; దానికిన్= ఆమెకు; శివుఁడు; ప్రత్యక్షము+అయ్యు= అగుపించి; వరము, వేడుము, అన్నన్= వరాన్ని కోరుకో, అని అనగా; వేడ్కతోన్= సంతోషంతో; పతి, దానము+అని= భర్తను దానం చేయం డని; ఏను+మారులు= ఐదుసారులు; ఆ+అబల= ఆ కాంత; వేఁడెన్= ప్రార్థించింది; అట్లు+ఏని= అట్లయితే; నీకున్, దేహాంతరంబునన్= మరొక దేహాన్ని పొందినపుడు - అనగా మరొక జన్మలో; ఏవురు= ఐదుగురు; పతులు అగుదురు= భర్తలు ఔతారు; పరమార్థము+ అనియు= సత్యము అని; హరుఁడు= శివుడు; కరుణన్= దయతో; ఇచ్చెన్= వరం ఇచ్చాడు; అది= ఆ మునికన్య; ఇప్డు= ఇప్పుడు; పంకజ+అక్షి - పద్మాలవంటి కన్నులు కలది; కృష్ణ, అనఁగన్= కృష్ణ అనే పేరుతో; పాంచాల, పతికిన్= పాంచాలరాజుకు; ఉద్భవిల్లి= పుట్టి; పెరుగుచున్+ఉన్నది= పెరుగుతూ ఉన్నది; తద్+స్వయంవరము= ఆమెయొక్క స్వయంవరం; నేఁడు= ఈ రోజు; చేయుచున్+ఉన్నవాఁడు= చేస్తున్నాడు లేదా ప్రకటిస్తున్నాడు.

తాత్పర్యం: ఒక మునికన్య తన పూర్వజన్మకర్మవశాత్తు భర్తను పొందలేక దురదృష్టవంతురా లై కఠోర మైన తపస్సు చేయగా, ఆమెకు శివుడు ప్రత్యక్షమై వరం కోరుకో మన్నాడు. అప్పు డామె సంతోషంతో పతిదాన మి మ్మని ఐదుసార్లు అడిగింది. శివుడు దయతో - 'అట్లయితే నీకు మరుసటిజన్మలో భర్తలు ఐదుగురు అవుతారు, ఇది సత్య' మని వర మిచ్చాడు. ఆ కన్య ఇప్పుడు కృష్ణ అనే పేరుతో పాంచాలరాజు కూతురుగా పుట్టి పెరుగుతూ ఉన్నది. ద్రుపదుడు ఆమె స్వయంవరాన్ని ఈ రోజు జరుపుతున్నాడు.

విశేషం: హరుడు - ప్రళయకాలంలో సర్వాన్నీ హరించేవాడు, భక్తుల పీడను హరించేవాడు - శివుడు. 'చేయుచున్నవాఁడు నేఁడు' అనేదానికి 'చేయుచున్నవాఁడు వాఁడు' అనే పాంఠాంతరం ఉన్నది. 'నేడు' అనేదానికంటే ఇదే సముచితంగా కనపడుతున్నది. ఎందువలననంటే, పాండవులు ఈ మాట విన్న తరువాత కొన్నిరోజులు రాత్రింబవళ్ళు ప్రయాణంచేసి ద్రుపదుని నగరానికి వెళ్ళినట్లు చెప్పబడింది.

వ. 'మీరు ద్రుపదపురంబునకుం జక్క నరుగునది; యందు మీకు ల గ్గగు' నని చెప్పి కృష్ణద్వైపాయనుం డరిగినఁ బాండునందనులు జననీసహితం బనవరతంబు రాత్రులుం బగళ్ళును బయనంబు వోవువా రొక్కనాఁ డర్ధరాత్రంబున గంగయందు సోమశ్రవం బను తీర్థంబున స్నానార్థు లై, యర్జునుండు ప్రకాశార్థంబును రక్షణార్థంబునుంగా నొక్కకొఱవి సేతఁ బట్టుకొని ముందఱం బోవ, నందఱు నరుగునెడ, నంగారపర్ణుఁ డను గంధర్వుం డంగనాసహితంబు గంగకు నంతప్రొద్దు జలక్రీడార్థంబు వచ్చిన; వాఁ డప్పాండవుల పాదధ్వని విని యలిగి, విల్లుగొని గుణధ్వనిం జేసి వారి కి ట్లనియె. 37

ప్రతిపదార్థం: మీరు; ద్రుపదు, పురంబునకున్= ద్రుపదుని నగరానికి; చక్కన్= నేరుగా; అరుగునది= వెళ్ళండి; అందున్= అక్కడ; మీకున్; లగ్గు= మేలు; అగున్, అని, చెప్పి; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; అరిగినన్= వెళ్ళగా; పాండు,

నందనులు= పాండుకుమారులు; జననీ, సహితంబు= తల్లితో కలిసి; అనవరతంబు= ఎడతెగకుండ; రాత్రులున్, పగళ్ళును; పయనంబు, పోవువారు= ప్రయాణం చేసేవాళ్ళు; ఒక్కనాఁడు; అర్ధరాత్రంబునన్= నడిరేయిలో; గంగ, అందున్= గంగానదిలోని, సోమశ్రవంబు= సోమశ్రవము అను పేరుగల తీర్థములో; స్నాన+అర్థులై= స్నానాన్ని చేయగోరిన వాళ్ళయి; అర్జునుండు; ప్రకాశ+అర్థంబును= వెలుగు కొరకూ; రక్షణ= అర్థంబునున్+కాన్= రక్షణ కొరకూ; ఒక్క; కొఱవి= మండుచున్న కొయ్య; చేతన్+పట్టుకొని; ముందఱన్+పోవన్= ముందుకు పోగా; అందఱున్= అందరూ; అరుగునెడన్= వెళ్ళుతూ ఉండగా; అంగార పర్ణుఁడు+అను; గంధర్వుఁడు; అంగనా, సహితంబు= భార్యలతో గూడి; గంగకున్; అంతప్రొద్దు= అంతరాత్రి సమయంలో; జలక్రీడా+అర్థంబు= జలక్రీడకొరకు; వచ్చినన్= రాగా; వాఁడు; ఆ+పాండవుల, పాదధ్వని= కాళ్ళచప్పుడు; విని=ఆలకించి; అలిగి= కోపించి; విల్లు, కొని= విల్లు తీసికొని; గుణధ్వని= అల్లెత్రాడు లాగినశబ్దం చేసి; వారికిన్= వాళ్ళకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మీరు ద్రుపదపురానికి చక్కగా వెళ్ళండి. అక్కడ మీకు మేలు కలుగుతుంది' అని చెప్పి వ్యాసుడు వెళ్లగా - పాండవులు తల్లితోకూడి రాత్రింబగళ్లు ఎడతెగకుండా ప్రయాణం చేశారు. ఒకనాటి అర్ధరాత్రి గంగానదిలో - సోమశ్రవ మనే తీర్థంలో - స్నానం చెయ్యా లని అనుకొన్నారు. అర్జునుడు వెలుగుకొరకూ, రక్షణకొరకూ ఒక కొరవిని చేత బట్టుకొని ముందుపోతూ ఉండగా; అందరూ అతనివెంట వెళ్తూ ఉన్నారు. అప్పుడు అంగారపర్ణుడు అనే గంధర్వుడు తన భార్యలతో కూడి ఆ రాత్రివేళ జలక్రీడ లాడటానికి గంగానదికి వచ్చాడు. ఆ పాండవుల పాదధ్వని విని, కోపించి ధనుస్సు చేతబట్టి, అల్లెత్రాటి శబ్దం చేసి, వాళ్ళతో ఇట్లా అన్నాడు.

క. ఇల నర్ధరాత్రమును, సం । ధ్యలు రెండును, భూత యక్ష దానవ గంధ
ర్వులు గ్రుమ్మరియెడు ప్రొద్దులు; । వెలయఁగ నిం దవనిచరులు వెఱతురు నడవన్. 38

ప్రతిపదార్థం: ఇలన్= భూమిమీద; అర్ధ, రాత్రమును= నడిరేయి; సంధ్యలు, రెండును= ఉదయం సాయంసంధ్యలు; భూత, యక్ష, దానవ, గంధర్వులు= భూతాలు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు; క్రుమ్మరియెడు= తిరిగెడు; ప్రొద్దులు= వేళలు; వెలయఁగన్= ఒప్పగా; ఇందున్= ఈ వేళలలో; అవని, చరులు= భూమిమీద నడిచేవారు - అనగా మానవులు; నడవన్, వెఱతురు= తిరగటానికి భయపడతారు.

తాత్పర్యం: ఈ భూమిమీద అర్ధరాత్రిసమయంలో; ఉదయసాయంసంధ్యలలో భూతాలు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు తిరుగుతూ ఉంటారు. కనుక ఆ వేళలలో మానవులు తిరగటానికి భయపడతారు.

విశేషం: సంధ్య: రాత్రింబవళ్ల సంధికాలం. ప్రాతస్సంధ్య: సూర్యోదయానికి ముందు మూడుఘడియలనుండి సూర్యోదయం వరకు గల కాలం. సాయంసంధ్య: సూర్యాస్తమయానికి ముందు మూడుఘడియల నుండి సూర్యాస్తమయంవరకు గల కాలం.

అర్జునుఁ డంగారపర్ణుని జయించుట (1-158-9)

వ. 'ఇ వ్వేళయందుఁ గ్రుమ్మరియెడువారి నెంత బలవంతుల నైనను రాజుల నయినను నిగ్రహింతుము; నన్ను డాయకుం; డెడగలిగి పొం; డే నంగారపర్ణుం డను గంధర్వుండఁ, గుబేరుసఖుండ; నెప్పుడు నిందు విహరించుచుండుదు; న న్నె ఱుంగరె! యి వ్వనంబును గంగాతీరంబును నంగారపర్ణంబులు నా జగద్విదితంబులు; దీని మానవులు సొర నోడుదు' రనిన వాని కర్జునుం డి ట్లనియె. 39

ప్రతిపదార్థం: ఈ+వేళ+అందున్= ఈ సమయాలలో; క్రుమ్మరియెడు, వారిన్= తిరిగేవాళ్ళని; ఎంత, బలవంతులన్+ఐనను; రాజులన్+అయినను; నిగ్రహింతుము= నిగ్రహించుదుము, పడత్రోయగలం; నన్నున్; డాయకుండుఁడు= సమీపించకండి; ఎడ, గలిగి, పొండు= దూరంగా తొలగిపొండి; ఏన్= నేను; అంగాపర్ణుండు; అను, గంధర్వుండన్; కుబేర, సఖుండన్= కుబేరునికి స్నేహితుడిని; ఎప్పుడున్; ఇందున్= ఇక్కడ; విహరించుచుందున్= విహరిస్తూ ఉంటాను; నన్నున్; ఎఱుంగరె= తెలియరా?; ఈ, వనంబును= అ అడవీ; గంగాతీర్థంబును; అంగారపర్ణంబులునా= అంగారపర్ణుడి వని; జగత్+విదితంబులు= ప్రపంచానికి తెలియబడినవి; దీనిన్; మానవులు; చొరన్= ప్రవేశించటానికి; ఓడుదురు= భయపడతారు; అనినన్= అని అనగా; వానికిన్= ఆ అంగారపర్ణునికి; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ సమయాలలో తిరిగేవాళ్ళు ఎంత బలవంతు లైనా, రాజు లైనా వాళ్ళను పడద్రోయగలం; నా దగ్గరికి రాకండి; దూరంగా తొలగిపొండి. నేను అంగారపర్ణు డనే గంధర్వుడిని. కుబేరుడి మిత్రుడిని. ఎప్పుడూ ఇక్కడ విహరిస్తుంటాను. నన్ను గురించి తెలియదా? ఈ అడవి, గంగాతీరం అంగారపర్ణుడి వని ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. ఈ ప్రాంతంలో ప్రవేశించటానికి మానవులు భయపడతారు-అని పల్కగా, అతనితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

క. నడురేయి సంధ్యలందును । నడవఁగ నోడుదు రశక్తనరు లొరులు; భయం
పడుదుమె యే మెయ్యెడ నె । ప్పుడు నడతుమ యధికశక్తి పురుషుల మగుటన్. 40

ప్రతిపదార్థం: అశక్త, నరులు= బలహీనులైన మానవులు; ఒరులు= ఇతరులు; నడురేయి= అర్ధరాత్రి; సంధ్యల+అందును= ఉభయసంధ్యలలో; నడవఁగన్= నడవటానికి; ఓడుదురు= జంకుతారు; ఏము= మేము; భయంపడుదుమె= భయపడుతామా?; అధిక, శక్తి, పురుషులము+అగుటన్= మిక్కిలి శక్తి కల మగవార మవటంచేత; ఏ+ఎడన్= ఎక్కడ నైనా; ఎప్పుడున్= ఎప్పుడైనా; నడతుము+అ= నడుస్తాము.

తాత్పర్యం: బలహీనులైన ఇతరమానవులు అర్ధరాత్రి, సంధ్యాసమయాలలో నడవటానికి భయపడతారు. మేము భయపడతామా? మహాశక్తి కల వీరులం కావటంచేత ఎక్కడైనా; ఎప్పుడైనా సంచరిస్తూ ఉంటాము.

క. అడవులు నేఱులు నివి నీ । పడసిన యవి యట్టె; పుణ్య భాగీరథి యి
ప్పుడమిఁ గల జనుల కెల్లను । నెడపక సేవ్యంబ కాక యిది నీయదియే? 41

ప్రతిపదార్థం: అడవులున్, ఏఱులున్, ఇవి, నీ, పడసిన, అవి, అట్టె= అరణ్యాలు, నదులు ఇవి నీవు సంపాదించినట్టివా ఏమి?; పుణ్య, భాగీరథి= పవిత్రమైన గంగ; ఈ+పుడమిన్= ఈ భూమియందు; కల= ఉన్న; జనులకు+ఎల్లను= జనులందరికీ; ఎడపక= ఎల్లప్పుడు; సేవ్యంబు+అ, కాక= సేవింప దగింది కాక; ఇది, నీ యదియే= ఇది నీకు మాత్రమే సంబంధించినదా?

తాత్పర్యం: అడవులు, నదులు నీవు సంపాదించినవా ఏమి? పవిత్ర గంగానది భూమిమీది జను లందరికి తప్పక సేవింపదగిందే. ఇది నీదా?

విశేషం: అడవులు, నదులు, పర్వతాలు, సముద్రాలు ఏ మానవుడూ భూమిమీదికి తెచ్చినవి కావు. అవి ప్రకృతి ప్రసాదించినవి. అందరూ సమానంగా అనుభవించవలసినవి. ఇది ఈ నాటి సామ్యవాదానికి పునాది భావన. భగీరథుడి ప్రయత్నంచేత గంగ ఈ లోకానికి తీసికొనిరాబడింది కనుక దానికి భాగీరథి అని పేరు.

సీ. హైమవతోత్తుంగ హేమశృంగంబున । నుండి భూమికి వచ్చి యుదధిఁ గూడె
గంగనా; మూఁడు దెఱంగుల నదియు; మం । దాకిని నా సత్పథంబునందు
సురసిద్ధముని వియచ్చర సేవ్య యయ్యె; న । య్యధమలోకంబునయందు భోగ
వతి యన నొప్పె నున్నతి; నిట్లు త్రిభువన । పావని యైన యిప్పరమమూర్తిఁ

ఆ. బార్వతీశమకుటబంధబంధురతరా । వాస గంగ నాడ వచ్చి నీవు
వలవ దనిన నుడుగువారము గాము; నీ । విఘ్నవచనములకు వెఱతు మెట్లు? 42

ప్రతిపదార్థం: హైమవత+ఉత్తుంగ, హేమ, శృంగంబున నుండి= హిమవత్పర్వతముయొక్క ఎత్తైన బంగారు శిఖరంనుండి; భూమికి వచ్చి; గంగనాన్= గంగ అను పేరుతో; ఉదధిన్= సముద్రమును; కూడెన్= కలిసెను; అదియు, మూఁడు; తెఱంగులన్= మూడు మార్గాలలో; సత్+పథంబు+అందున్= నక్షత్ర మార్గంలో - అనగా ఆకాశంలో; మందాకినినాన్= మందాకిని అనే పేరుతో; సుర, సిద్ధ, ముని, వియత్+చర, సేవ్య, అయ్యెన్= సురలు, సిద్ధులు, మునులు మొదలైన ఆకాశ సంచారులకు సేవింపదగిందయ్యెను; అధమ, లోకంబునన్, అందున్= పాతాళలోకంలో; భోగవతి, అనన్= భోగవతి అనే పేరుతో; ఒప్పెన్= ఉన్నది; ఇట్లు; ఉన్నతిన్= గొప్పగ; త్రిభువన; పావని, ఐన= మూడులోకాలను పవిత్రం చేసే దైన; ఈ+పరమమూర్తి= ఈ పవిత్రమూర్తి; పార్వతీ+ఈశ, మకుట, బంధ, బంధురతర+ఆవాస= పార్వతీపతి యైన శివుని జటాజూటంలో మిక్కిలి ఒప్పైన స్థానం గల దైన; గంగన్= గంగయందు; ఆడవచ్చి= స్నానం చేయవచ్చి; నీవు; వలవదు+అనినన్= వద్దనిన; ఉడుగువారము= మానుకొనేవారం; కాము= కాము; నీ, విఘ్న వచనములకున్= నీ ఆటంకపు మాటలకు; వెఱతుము= వెఱచుదుము; ఎట్లు= ఎట్లా భయపడతాము? (భయపడ మని భావం)

తాత్పర్యం: హిమాలయంలోని ఎత్తైన బంగారు శిఖరంనుండి భూమికి వచ్చి, గంగ అనే పేరుతో సముద్రంలో కలిసింది. అది మూడు మార్గాలలో సాగింది. ఆకాశమార్గంలో మందాకిని అనే పేరుతో దేవతలు, సిద్ధులు, మునులు మొదలైన ఆకాశసంచారులకు సేవించదగింది అయింది. పాతాళ లోకంలో 'భోగవతి' అనే పేరుతో ఉంది. ఈ విధంగా మూడులోకాలను గొప్పగా పవిత్రం చేసే ఈ పుణ్యమూర్తి, శివునిజటాజూటంలో ఉచితస్థానం గలది - అయిన ఈ గంగలో స్నానం చేయటానికి వచ్చి, నీవు వ ద్దన్నంత మాత్రాన మానుకొనే వాళ్ళం కాము. నీ అడ్డుమాటలకు ఎట్లా భయపడతాము?

వ. అనుచు నిజ జననీ భ్రాతృ సహితుం డయి గంగాభిషేకార్థంబు చనుదెంచు న య్యర్జునునిపయి నంగారపర్ణుం డతినిశిత సాయకంబు లేసిన, నర్జునుం డలిగి తనచేతికొఱవి విదిర్చి యయ్యమ్ములు దన్నుం దాఁకకుండం గాచి కొని వాని కి ట్లనియె. 43

ప్రతిపదార్థం: అనుచున్= అని అంటూ; నిజ, జననీ, భ్రాతృ, సహితుండు+అయి= తన తల్లితో, తోబుట్టువులతో కూడినవాడై; గంగా+అభిషేక+అర్థంబు= గంగలో స్నానం చేయటంకొరకు; చనుదెంచు= వచ్చు; ఆ+అర్జునుని, పయిన్= ఆ అర్జునుని మీద; అంగారపర్ణుండు; అతి, నిశిత, సాయకంబులు= మిక్కిలివాడియైన బాణాలను; ఏసినన్= ప్రయోగింపగా; అర్జునుండు= అర్జునుడు; అలిగి= కోపించి; తన, చేతి= తన చేతిలోని; కొఱవి= దివిటీని; విదిర్చి= విదిలించి; ఆ+అమ్ములు= ఆ బాణాలు; తన్నున్= తనను; తాఁకకుండన్= తగలకుండా; కాచికొని= కాపాడుకొని; వానికిన్= ఆ అంగారపర్ణునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని పల్కుతూ, తన తల్లితో, అన్నదమ్ములతో గంగాస్నానం చేయటానికి వస్తున్న ఆ అర్జునునిమీద అంగారపర్ణుడు మిక్కిలి వాడిబాణాలు వేయగా, అర్జునుడు కోపించి, తనచేతి కొరవి విదిల్చి, ఆ బాణాలు తనను తాకకుండా కాపాడుకొని, అతనితో ఇట్లా అన్నాడు.

ఆ. వెడఁగ! యిట్టి పాటి వెఱపించుటలును మా । యలును నేమి సేయు నస్త్రవిదులఁ ;
బెక్కులయ్యు నీ బిభీషికల్ నుఱువులు । విరియునట్టు లిందు విరియుఁ జూవె. 44

ప్రతిపదార్థం: వెడఁగ! = వెఱ్ఱివాడా!; ఇట్టి, పాటి= ఈ మాత్రపు; వెఱపించుటలును= బెదరింపులు; మాయలును; అస్త్ర, విదులన్= అస్త్రరహస్యాలు తెలిసినవాళ్ళను; ఏమి, చేయున్= ఏమి చేయగలవు; పెక్కులు+అయ్యున్; నీ బిభీషికల్= నీయొక్క బడాయి మాటలు; నుఱువులు= నీటిపై నురుగులు; విరియునట్టులన్= చెదరిపోయేటట్లు; ఇందున్= ఇచ్చట; విరియున్= చెదరిపోతాయి; చూవె= చూడుము సుమా!

తాత్పర్యం: వెఱ్ఱివాడా! ఈ మాత్రపు బెదిరింపులు, మాయలు అస్త్రవేత్తలను ఏమి చేయగలవు? నీ బెదిరింపులు ఎన్నైనా అవి నురుగులవలె చెదరినట్లు చెదరిపోతాయి, చూడుము.

విశేషం: అలం: ఉపమ.

సీ. అగ్నిదేవుండు బృహస్పతి కిచ్చె ము, । న్నతఁడు భరద్వాజుఁ డనఁగఁ బరఁగు
ముని కిచ్చె, నమ్మహాముని భార్గవున కిచ్చె । భార్గవుండును గుంభభవున కిచ్చె
నమ్మహాత్ముండు నా కతిదయ నిచ్చె ని । య్యనలాస్త్ర మని దాని నమ్మహోగ్ర
గంధర్వుపై వైచె ఘనుఁ డింద్రసుతుఁ డంతఁ । దద్రథం బప్పుడ దగ్ధ మయిన,

ఆ. నగ్నిదాహభీతి నంగారపర్ణుండు । బమ్మరిల్లి నేలఁబడిన, వానిఁ
గొప్పు వట్టి యీడ్చికొని వచ్చె ధర్మజు । కడకు నింద్రసుతుఁడు కడిమి మెఱసి. 45

ప్రతిపదార్థం: ఈ+అనల+అస్త్రము= ఈ ఆగ్నేయాస్త్రం; అగ్నిదేవుండు; మున్ను= పూర్వం; బృహస్పతికిన్+ఇచ్చెన్; అతఁడు= ఆ బృహస్పతి; భరద్వాజుఁడు, అనఁగన్= భరద్వాజు డనే; పరఁగు= ఒప్పునట్టి; మునికిన్+ఇచ్చెన్= మునికి ఇచ్చాడు; ఆ+మహాముని= ఆ మహర్షి; భార్గవునకున్= పరశురామునికి; ఇచ్చెన్= ఇచ్చాడు; భార్గవుండును= పరశురాముండును; కుంభ, భవునకున్= కుండనుండి పుట్టినవానికి-ద్రోణునికి; ఇచ్చెన్; ఆ+మహాత్ముండును; నాకున్; అతి, దయన్ ఇచ్చెన్= మిక్కిలి దయతో ఇచ్చాడు; అని= అనుచు; దానిన్= ఆ అస్త్రాన్ని; ఆ+మహా+ఉగ్ర, గంధర్వు, పై = మహాభయంకరు డైన ఆ గంధర్వునిమీద; ఘనుఁడు= గొప్పవాడు; ఇంద్ర, సుతుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; వైచెన్= వేశాడు; అంతన్= అంతలో; తత్+ రథంబు= అతనియొక్క (అంగారుపర్ణుడియొక్క) రథము; అప్పుడు+అ= అప్పటికప్పుడే; దగ్ధము+అయినన్= తగులబడినదికాగా; అగ్ని, దాహ; భీతిన్= నిప్పు కాల్పువలన భయంతో; అంగారపర్ణుండు; బమ్మరిల్లి= దిమ్మతిరిగి; నేల, పడినన్= నేలపై పడగా; వానిన్= ఆ గంధర్వుని; కొప్పుపట్టి= జుట్టు పట్టి; ఇంద్ర, సుతుఁడు= అర్జునుడు; కడిమి= పరాక్రమం, మెఱసి=ప్రకాశించగా; ధర్మజు, కడకున్= ధర్మరాజు దగ్గరకు; ఈడ్చికొని; వచ్చెన్.

తాత్పర్యం: 'ఈ ఆగ్నేయాస్త్రాన్ని పూర్వం అగ్నిదేవుడు బృహస్పతి కిచ్చాడు. అతడు భరద్వాజముని కిచ్చాడు. ఆ ముని పరశురామునికి, అతడు ద్రోణునికి, ఆ మహాత్ముడు అతిదయతో నాకు ఇవ్వటం జరిగింది' అని మహావీరుడైన అర్జునుడు దానిని ఆ భయంకరు డైన గంధర్వునిమీద ప్రయోగించాడు. తత్క్షణమే అతని రథం దగ్ధమైపోగా; నిప్పుకాల్పువల్ల కలిగిన భయంతో అతడు దిమ్మతిరిగి నేలమీద పడిపోయాడు. అర్జునుడు తన పరాక్రమం ప్రకాశించగా, అతడిని జుట్టుపట్టి ధర్మరాజు దగ్గరికి ఈడ్చుకొని వచ్చాడు.

క. వాని మనోవల్లభ కుం । భీనసి యనునది గరంబు భీతి 'నశేషో
ర్వీనాథులార! దయఁ బతి । దానము నా కిండు మీకు ధర్మువు పెరుఁగున్'. 46

ప్రతిపదార్థం: వాని, మనో, వల్లభ= ఆ అంగారపర్ణుని ప్రాణేశ్వరి - భార్య; కుంభీనసి; అనునది= అనే పేరుకలది; కరంబు, భీతిన్= మిక్కిలి భయంతో; అశేష+ఉర్వీనాథులార!= సమస్త భూమికి ప్రభువులారా!; దయన్= కరుణతో; పతిదానము= పతియొక్క దానం; నాకున్+ఇండు= నాకు ప్రసాదించండి; మీకున్; ధర్మువు= ధర్మంపెరుఁగున్.

తాత్పర్యం: ఆ అంగారపర్ణునిభార్య కుంభీనసి మిక్కిలిభయంతో - 'ఈ సమస్తభూమికి ప్రభువులారా! దయతో నాకు పతిదానం చేయండి. మీకు ధర్మం పెరుగుతుంది'.

విశేషం: అప్పటికి పాండవులు బ్రాహ్మణవేషాలలో ఉన్నారు. కుంభీనసి వాళ్ళను 'అశేషోర్వీనాథులారా!' అని సంబోధించటం ఆశ్చర్యకరంగా ఉన్నా - అంగారపర్ణుడు పాండవులను ముందే గుర్తించినట్లు చెప్పాడు కదా. (చూ.ప.57, ప.58) అందువలన బ్రాహ్మణవేషధారులై వచ్చిన వాళ్ళు పాండవు లని కుంభీనసికి భర్త ముందే చెప్పాడేమో. అందువలననే ఆమె అట్లా అన్నదేమో. కాగా, కుంభీనసి ప్రార్థనను మన్నించి 'గంధర్వా! కురువంశ ప్రభువు ధర్మరాజు కరుణతో నిన్ను విడువు మన్నాడు. ఇక భయపడకు' మని కూడా అర్జునుడు అన్నాడు.

క. అని యఱచుచున్నదానికి । ననఘుఁడు గరుణించి పాండవాగ్రజుఁ డయ్య
ర్జునుఁ జూచి 'వీని విడువుమ । యని నోడినవాని హీను నపగతశౌర్యున్'. 47

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; అఱచుచున్+ఉన్న= ఏడ్చుచున్న; దానికిన్= ఆ కుంభీనసికి; అనఘుఁడు= పాపంలేనివాడు; పాండవ+అగ్రజుఁడు= పాండవులందు ముందు పుట్టినవాడు - ధర్మరాజు; కరుణించి= దయతలచి; ఆ+అర్జునున్; చూచి; అనిన్= యుద్ధంలో; ఓడినవాడిని; హీనున్= క్రుంగిపోయినవాడిని; అపగతశౌర్యున్= పోయిన శౌర్యం కలవాడిని; వీనిన్= ఈ అంగారపర్ణుడిని; విడువుము+అ.

తాత్పర్యం: అని ఆక్రోశిస్తున్న కుంభీనసిపట్ల పుణ్యాత్ముడు, పాండవాగ్రజుడు అయిన ధర్మరాజు దయతలచి, అర్జునుడిని చూచి, యుద్ధంలో ఓడినవాడు, క్రుంగిపోయినవాడు, శౌర్యం కోల్పోయినవాడు అయిన ఈ అంగారపర్ణుడిని విడిచిపెట్టుము.

ఆ. అనిన నరుఁడు వల్లె యని వాని కనియె 'గం । ధర్వ! నిన్నుఁ గరుణ ధర్మరాజు
కురుకులేశ్వరుం డశరణశరణ్యుండు । విడువఁ బనిచె నింక వెఱవకుండు'. 48

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; నరుఁడు= అర్జునుడు; వల్లె, అని= సరే అని; వానికిన్ అనియెన్= అంగారపర్ణునితో ఇట్లా అన్నాడు; గంధర్వ!; నిన్నున్; కురుకుల+ఈశ్వరుండు= కురువంశ ప్రభువు; అ, శరణ, శరణ్యుండు= శరణులేనివారికి శరణు పొందతగినవాడు; ధర్మరాజు; కరుణన్= దయతో; విడువన్, పనిచెన్= వదిలిపెట్టుమని ఆజ్ఞాపించాడు; ఇంకన్; వెఱవక= భయపడక; ఉండు.

తాత్పర్యం: అని పల్కగా అర్జునుడు సరే అని అంగారపర్ణునితో ఇట్లా అన్నాడు - 'ఓ గంధర్వుడా! కురువంశ ప్రభువు, శరణులేని వారికి శరణు పొందదగినవాడు అయిన ధర్మరాజు దయతో నిన్ను విడువటానికి ఆజ్ఞాపించాడు.

వ. అని వాని నాశ్వాసించి విడిచిన నట్లు నిర్జితుండై యర్జునున కంగారుపర్ణుం డి ట్లనియె. 49

ప్రతిపదార్థం: అని, వానిన్; ఆశ్వాసించి= ఓదార్చి; విడిచినన్= విడిచిపెట్టగా; అట్లు= ఆ విధంగా; నిర్జితుండు+ఐ= ఓడింపబడినవా డై; అర్జుననకున్; అంగారపర్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అంగారపర్ణుడిని ఓదార్చి విడుదల చేయగా, ఓడిపోయిన అంగారపర్ణుడు అర్జునునితో ఈ విధంగా అన్నాడు.

అంగారపర్ణుం డర్జునునితో సఖ్యము సేయుట (1-158-35)

మ. అని నీచేతఁ బరాజితుండ నయి నా యంగారపర్ణత్వ మిం
కను దాల్పన్ మది నంత నిస్త్రపుఁడనే; గర్వం బడంగన్ రణం
బున మున్నోడియుఁ బూర్వనామమున బెంపున్ గర్వముం దాల్చువాఁ
డనఘా! సత్సభలందు మెచ్చఁబడునే హాసాస్పదీభూతుఁ డై. 50

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా!, ఓ అర్జునుడా!; అనిన్= యుద్ధంలో; నీచేతన్; పరాజితుండన్+అయి= ఓడింపబడిన వాడి నై; నా, అంగారపర్ణత్వము= అంగారపర్ణుడనే నా పేరును; ఇంకను; తాల్పన్= ధరించుటకు; మదిన్= మనస్సునందు; అంత నిస్త్రపుఁడనే= అంతగా సిగ్గులేనివాడనా; గర్వంబు+అడంగన్= పొగరు అణగగా; రణంబునన్= యుద్ధంలో; మున్ను; ఓడియున్= ఓడిపోయికూడా; పూర్వనామమునన్= మొదటిపేరుతో; పెంపున్= గొప్పతనాన్ని; గర్వమున్, తాల్చువాఁడు= దర్పముతో ధరించువాడు; హాస+ఆస్పదీ, భూతుఁడు+ఐ= ఎగతాళికి ఉనికి పట్టయినవా డై; సత్+సభల, అందున్= సజ్జనుల సభలలో; మెచ్చన్+పడునే= గౌరవింపబడతాడా, కీర్తింపబడతాడా! (పడ డని భావం.)

తాత్పర్యం: పుణ్యాత్మా! అర్జునా! యుద్ధంలో నీ చేతిలో ఓడిపోయి, ఇంకా అంగారపర్ణు డనే పేరు ధరించటానికి నే నంత సిగ్గు లేనివాడినా? మొదట యుద్ధంలో గర్వం అణగిపోయేవిధంగా ఓడిపోయికూడా - మొదటిపేరుతోనే గొప్పతనాన్నీ, గర్వాన్నీ పొందేవాడు సజ్జనుల సభలలో ఎగతాళికి గురౌతాడు కాని, మెప్పు పొందగలడా?

వ. నీ యాగ్నేయాస్త్రంబున దగ్ధరథుండ నయ్యును గంధర్వమాయ ననేక రత్నవిచిత్రం బైన రథంబు వడసి, యిది మొదలుగాఁ జిత్రరథుండ నయ్యెద; నీ పరాక్రమంబునకు మెచ్చితి; నీతోడి సఖ్యంబు నా కభిమతం బయిన యది; నా తపంబునం బడయంబడిన చాక్షుషి యనువిద్య నీ కిచ్చెద; దీనిం దొల్లి మనువువలన సోముండు పడసె; సోమునివలన గంధర్వపతి యయిన విశ్వావసుండు వడసె; నాతనివలన నేనుఁ బడసితి; నెవ్వండేని

మూఁడులోకంబులుం జూడ నిచ్చగించు నాతండు దనయిచ్చకుం దగ నివ్విద్యపెంపున సర్వస్వంబును గంజూచు; నేము దీనన చేసికాదె మానవులకు విశేషుల మై వేల్పులచేత శాసింపంబడక జీవించెద; మిది కాపురుషప్రాప్తం బైఫలియింపదు; నీవు తాపత్యవంశవర్ధ నుండవు; మహాపురుషుండవు; నీకు సఫలంబగు, నీదివ్యవిద్యఁ గొను మిచ్చెద; దీనిఁ గొనునప్పుడు షణ్మాసవ్రతంబు సేయవలయు; నీవు నాకు నాగ్నేయాస్త్రం బిచ్చునది; మఱి మహా జవసత్త్వంబులుఁ గామగమనంబులు నయిన గంధర్వహయంబుల మీ కేవురకుం జెఱు నూఱేసి యిచ్చెద. 51

ప్రతిపదార్థం: నీ, ఆగ్నేయ+అస్త్రంబునన్; దగ్ధ, రథుండను+అయ్యును= కాలిపోయిన రథం కలవాడనయినా; గంధర్వ, మాయన్= గంధర్వమాయచేత; అనేక, రత్న, విచిత్రంబు+ఐన= వివిధరత్నాలచేత ఆశ్చర్యకరమైన; రథంబు; పడసి= పొంది; ఇది, మొదలుగా= నేటినుండి; చిత్రరథుండన్= చిత్రరథుడు అనుపేరుగలవాడను; అయ్యెదన్= అవుతాను; నీ పరాక్రమంబునకు; మెచ్చితిన్; నీతోడి; సఖ్యంబు= స్నేహం; నాకున్; అభిమతంబు= ఇష్టము అయిన; అది= ఇష్టమైనది; నా తపంబునన్, పడయన్+పడిన= పొందబడిన; చాక్షుషి, అను, విద్య, నీకున్= చాక్షుషి అనుపేరుగల విద్యను నీకు ఇస్తున్నాను; దీనిన్; తొల్లి= పూర్వం; మనువువలన, సోముండు= చంద్రుడు; పడసెన్= పొందినాడు; సోముని వలన= చంద్రునివలన; గంధర్వ, పతి, అయిన= గంధర్వరాజైన; విశ్వావసుండు; పడసెన్= పొందినాడు; అతనివలన= ఆ విశ్వావసునివల్ల; నేను; పడసితిన్= పొందాను; ఎవ్వండేని; మూడు, లోకంబులున్, చూడన్= ఎవ్వరైనా ముల్లోకాలను చూచుటకు; ఇచ్చగించునో= కోరుకొనునో; అతండు; తన ఇచ్చకున్= తన కోరికకు; తగన్= తగినట్లు; ఈ+విద్య, పెంపునన్= ఈ విద్యయొక్క మహిమచేత; సర్వస్వంబునున్= మొత్తాన్నీ; చూచున్= చూస్తాడు; ఏము= మేము; దీనన, చేసి= దీనివలననే; కాదె= కదా!; మానవులకు; విశేషులము+ఐ= శ్రేష్ఠులమై, వేల్పుల చేత= దేవతలచేత; శాసింపన్+పడక= ఆజ్ఞాపించబడక; జీవించెదము= జీవిస్తాము; ఇది, కాపురుష, ప్రాప్తంబు+ఐ= చెడుమానవులచే పొందబడినచో; ఫలియింపదు= ఫలవంతం కాదు; నీవు, తాపత్య, వంశ, వర్ధనుండవు= తపతికి సంబంధించిన వంశాన్ని పెంపుచేసేవాడవు; మహాపురుషుండవు; నీకున్, సఫలంబు+అగున్= నీకు ఫలముతో కూడినది అగును; ఈ దివ్య, విద్యన్; కొనుము= తీసికొనుము; ఇచ్చెదన్; దీనిన్; కొనునప్పుడు; షట్+మాస, వ్రతంబు= ఆరు నెలల వ్రతం; చేయవలయు; నీవు; నాకున్; ఆగ్నేయ+అస్త్రంబు; ఇచ్చునది; మఱి= అంతేగాక; మహా, జవ, సత్త్వంబులున్= మిక్కిలి వేగం, బలం కలవీ; కామ, గమనంబులున్= కోరినచోటికి వెళ్ళగలవీ; అయిన= అయినటికీ; గంధర్వ, హయంబులన్= గంధర్వ జాతిగుర్రాలను; మీకున్+ఏవురకున్= మీ అయిదుగురికి; చెఱు, నూఱు+ఏసి= ఒక్కొక్కరికి వందవంతున; ఇచ్చెదన్= ఇస్తాను.

తాత్పర్యం: నీ ఆగ్నేయాస్త్రంవలన దగ్ధరథుడిని అయినప్పటికి, గంధర్వమహిమతో వివిధ రత్నాలచేత విచిత్రమైన రథాన్ని పొంది, ఇది మొదలు 'చిత్రరథుడు' అనే పేరు కలవాడ నౌతాను. నీ పరాక్రమానికి మెచ్చాను. నీతో స్నేహం చెయ్యా లని కోరుతున్నాను. నేను తపస్సుచేత సాధించిన చాక్షుషీవిద్యను నీ కిస్తాను. దీనిని పూర్వం మనువునుండి చంద్రుడు, అతడినుండి గంధర్వా జైన విశ్వావసుడు పొందారు. అతడినుండి నేను పొందాను. మూడులోకాలూ చూడగోరేవాడు తన కోరికకు తగినట్లు ఈ విద్యాప్రభావంచేత సర్వం చూడగలడు. మేము ఈ విద్యవలననే గదా మానవులకంటె శ్రేష్ఠుల మై, దేవతలచే ఆజ్ఞాపింపబడక జీవిస్తున్నాము. ఈ విద్య దుర్మార్గులకు లభిస్తే ఫలించదు. నీవు తపతికి సంబంధించిన వంశాన్ని వర్ధిల్లజేసేవాడివి. నీ కిది సఫలమవుతుంది. ఈ విద్యను నీ కిస్తాను. తీసికొమ్ము. దీనిని గ్రహించే సమయంలో ఆరు నెలలు వ్రతం చేయాలి. నీవు నాకు ఆగ్నేయాస్త్రాన్ని ఇవ్వు. నేను ఇంకా మీ అయిదుగురికి మహావేగం, బలం గల గంధర్వజాతి గుర్రాలను ఒక్కొక్కరికి వంద ఇస్తాను.

సీ. వృత్రుపై గీర్వాణవిభుఁ డల్గి వజ్రంబు । వైచిన నది వాని వజ్ర కఠిన
పటు మస్తకంబునఁ బడి పాతరయమునఁ । బదివ్రయ్యలైనఁ దద్భాగచయము
క్రమమున బ్రాహ్మణ క్షత్ర విట్ఛూద్రుల । యందు వేదంబులు నాయుధములు
హలము శుశ్రూషయు నయ్యె వజ్రంబులు । వాహంబులందు జవంబు నయ్యె

తే. నట్టి జవమున నభిమతం బగుచు నున్న । యట్టి హయసమూహం బయ్యె నవనిపతుల
కఖిల భువనముల్ రక్షించునపుడు సకల । సాధనములలో నుత్తమసాధనంబు. 52

ప్రతిపదార్థం: వృత్రు, పై= వృత్రు డనే రాక్షసుని మీద; గీర్వాణవిభుఁడు= దేవతలరాజు, దేవేంద్రుడు; అల్గి= కోపించి; వజ్రంబు= వజ్రాయుధం; వైచినన్= వేయగా; అది, వాని, వజ్ర, కఠిన, పటు, మస్తకంబునన్= అది అతనియొక్క వజ్రంవలె గట్టిదైన పెద్ద తలమీద; పడి, పాత, రయమునన్= పడిన వేగంచేత; అది= ఆ వజ్రాయుధం; పది, వ్రయ్యలు+ఐనన్= పదిముక్కలు కాగా; తద్+భాగ, చయము= ఆ ముక్కల సమూహం, క్రమమునన్= వరుసగా; బ్రాహ్మణ, క్షత్ర, విట్, శూద్రుల, అందున్= బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య శూద్రులలో; వేదంబులున్; ఆయుధములు; హలము= నాగలి; శుశ్రూషయున్= సేవయు; అయ్యెన్= అయినవి; వజ్రంబులు; వాహల్ంబు+అందు= గుర్రాలలో; జవంబు= వేగం; అయ్యెన్= అయినవి; అట్టి, జవమునన్= వేగంచేత; అభిమతంబు+అగుచున్+ఉన్న= ఇష్టమౌతున్న; అట్టి; హయ, సమూహము= గుర్రాల సమూహం; అవని, పతులకు= భూపతులకు- రాజులకు; అఖిల, భువనముల్= అన్ని లోకాలు; రక్షించునపుడు; సకల, సాధనములలోన్; ఉత్తమ, సాధనము, అయ్యెన్= అన్ని సాధనాలలో శ్రేష్ఠమైన సాధనం అయింది.

తాత్పర్యం: వృత్రు డనే రాక్షసునిమీద దేవేంద్రుడు కోపించి వజ్రాయుధం వేయగా, అది వజ్రంవలె కఠినమైన అతని పెద్ద తల మీద పడి, పతనవేగంతో పది ముక్కలైంది. ఆ ముక్కల సమూహం వరుసగా బ్రాహ్మణులలో వేదశక్తిగా, క్షత్రియులలో ఆయుధశక్తిగా; వైశ్యులలో నాగలిశక్తిగా; శూద్రులలో సేవాశక్తిగా; గుర్రాలలో వేగంగా రూపొందింది. ఆ విధమైన వేగం కారణంగా రాజులకు ఇష్టమౌతున్న గుర్రాల సమూహం వాళ్ళ లోకా లన్నింటిని రక్షించటానికి ఉపయోగించే సాధనాలలో ఉత్తమసాధనం అయింది.

వ. అనిన వాని కర్జునుం డి ట్లనియె. 53

తాత్పర్యం: అని అనగా, అంగారపర్ణునితో అర్జునుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. ఎంత మిత్రు లైన నెన్నండు నొరులచే । విద్యయును జయంబు విత్తచయము
గొనఁగ నొల్లఁ! నాకుఁ గూర్తేని యనలాస్త్ర । మనఘ ! నీవు గొనుము హయము లిమ్ము. 54

ప్రతిపదార్థం: ఎంత, మిత్రులు+ఐనన్= ఎంత స్నేహితు లైనను; ఎన్నండున్= ఎన్నడైనను; ఒరులచే= ఇతరులచేత; విద్యయును= విద్యను; జయంబు= విజయాన్ని; విత్త, చయము= ధనసమూహం; కొనఁగన్= తీసికొనుటకు; ఒల్లన్= ఇష్టపడను; నాకున్= నాకు; కూర్తు+ఏని= మిత్రుడ వైతే- ఈయ తలిస్తే; అనఘ!= పాపరహితుడా! అనల+అస్త్రము= ఆగ్నేయాస్త్రం; నీవు, కొనుము= తీసికొనుము; హయములు= గుర్రాలు; ఇమ్ము= ఇవ్వవలసింది.

తాత్పర్యం: ఎంత స్నేహితు లైనా ఇతరులనుండి విద్యను, విజయాన్ని, ధనసమూహాన్ని స్వీకరించటానికి ఎప్పుడూ నే నిష్టపడను. కాని, నీవు నాకు ఇవ్వదలచుకొంటే; ఓ పుణ్యాత్మా! ఈ ఆగ్నేయాస్త్రాన్ని తీసికొని, ఆ గుఱ్ఱాలను ఇవ్వుము.

వ. 'నీతోడ సఖ్యంబుఁ జేసెద; మఱి మమ్ముఁ బరమధార్మికులం బరమబ్రహ్మణ్యుల నేమి కారణంబున నుదరి పలికి?' తనిన గంధర్వుం డి ట్లనియె. 55

ప్రతిపదార్థం: నీతోడన్; సఖ్యంబు= స్నేహం; చేసెదన్= చేస్తాను; మఱి= అయితే; మమ్మున్= మమ్మల్ని; పరమ, ధార్మికులను= మహాధర్మబుద్ధికలవాళ్ళను; పరమ, బ్రహ్మణ్యులన్= మిక్కిలిగా బ్రాహ్మణహితం కోరేవాళ్ళను; ఏమి, కారణంబునన్= ఏ కారణంచేత; ఉదరి= అదిరించి; పలికితి(వి)= మాటాడితివి; అనినన్= అని అనగా; గంధర్వుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీతో స్నేహం చేస్తాను. అయితే మిక్కిలిగా మేము బ్రాహ్మణహితం కోరేవాళ్ళం. మహాధర్మబుద్ధి కలవాళ్ళం. ఎందుచేత మమ్మల్ని అధిక్షేపించి మాట్లాడావు? అని ప్రశ్నించగా గంధర్వుడు ఇట్లా అన్నాడు.

క. విమలము లయి లోకత్రిత । యమునఁ బ్రవర్తిల్లు మీ మహాగుణములు ని
త్యము విందు నారదప్రము । ఖ మునీశ్వర సిద్ధసాధ్య గణములవలనన్. 56

ప్రతిపదార్థం: విమలములు+అయి= పవిత్రాలై; లోక; త్రితయమునన్= ముల్లోకాలలో; ప్రవర్తిల్లు= నడుచు; మీ, మహా, గుణములు= మీ యొక్క గొప్పగుణాలు; నారద, ప్రముఖ, ముని+ఈశ్వర, సిద్ధ, సాధ్య, గణములవలనన్= నారదుడు మొదలైన ప్రసిద్ధ మునీశ్వరుల, సిద్ధుల, సాధ్యుల సమూహాలచేత; నిత్యము= ప్రతిదినం; విందున్= వింటాను.

తాత్పర్యం: పవిత్రా లై ముల్లోకాలలో వ్యాపించిన మీ గొప్ప గుణాలు నారదుడు మొదలైన మునీశ్వరులు, సిద్ధ, సాధ్యసమూహాలు చెప్పగా ప్రతిదినం వింటూ ఉంటాను.

క. మేరునగోత్తంసమహీ । భారధురంధరుల మిమ్ముఁ బాండవుల గుణో
దారుల ధీరుల నెఱుఁగని । వా రెవ్వరుఁ గలరె భరతవంశోత్తములన్. 57

విశేషం: మేరు, నగ+ఉత్తంస, మహీ, భార, ధురంధరుల= మేరుపర్వతాన్ని సిగబంతిగా గల భూమండలభారాన్ని వహించిన; మిమ్మున్; పాండవులన్= పాండవుల్ని; గుణ+ఉదారులన్= గుణంచేత గొప్పవారైనవాళ్ళను; ధీరులన్= ధీరుల్ని; భరతవంశ+ఉత్తములన్= భరతవంశ శ్రేష్ఠులను; ఎఱుఁగనివారు= తెలియనివాళ్ళు; ఎవ్వరున్+కలరె= ఎవరైనా ఉన్నారా?

తాత్పర్యం : మేరుపర్వతాన్ని సిగబంతిగా గల భూమండల భారాన్ని వహించినవాళ్ళు, సద్గుణాలచేత గొప్పవాళ్ళు, ధీరులు, భరతవంశశ్రేష్ఠులు అయిన మిమ్మల్ని - పాండవులను - తెలియని వా ళ్ళెవరైనా ఉన్నారా?

వ. ఏను మిమ్ము నెఱింగియు, మీకు నగ్నిపరిగ్రహంబును, బ్రాహ్మణసంగ్రహంబును లేమింజేసి పరుసంబులు పలికితి; మఱియును. 58

ప్రతిపదార్థం: ఏను= నేను; మిమ్మున్, ఎఱింగియు; మీకున్; అగ్ని, పరిగ్రహంబును= అగ్నిహోత్రస్వీకారం; బ్రాహ్మణ, సంగ్రహంబును= బ్రాహ్మణుడిని గ్రహించటం; లేమిన్+చేసి= లేకుండటంవలన; పరుసంబులు= కఠినాలైన మాటలు; పలికితిన్; మఱియును= ఇంకా.

తాత్పర్యం: నాకు మీరు తెలిసినా, మీకు అగ్నిహోత్రం, బ్రాహ్మణుడు లేనందువలన కఠినంగా మాట్లాడాను. అంతేకాక.

ఉ. ఇంతుల గోష్ఠి నున్నయతఁ డెంత వివేకము గల్గెనేని య
త్యంత మదాభిభూతుఁ డగు; ధర్మువు దప్పుఁ; బ్రియం బెఱుంగఁ; డే
నెంత వివేకి నయ్యును సహింపక యింతుల యొద్దఁ బల్కితిన్;
వింతయె? కాము శక్తి యుడివింపఁగ శక్యమె యెట్టివారికిన్! 59

ప్రతిపదార్థం: ఇంతుల, గోష్ఠిన్= స్త్రీలతో సల్లాపాలాడుతూ; ఉన్న; అతఁడు; ఎంత; వివేకము; కలిగెన్+ఏని; అత్యంత, మద+అభిభూతుఁడు+అగున్= ఎంతో ఎక్కువైన మదంచేత తిరస్కరింపబడినవా డౌతాడు - అనగా మిక్కిలి దురభిమానంతో కూడుకొన్న వా డౌతాడు; ధర్మువు, తప్పున్= ధర్మాన్ని తప్పుతాడు; ప్రియంబు+ఎఱుంగఁడు= ప్రీతిగా మెలగటం తెలియడు; ఏన్= నేను; ఎంత, వివేకిన్+అయ్యును= వివేకం కలవాడ నైనా; సహింపక= ఓర్పులేక; ఇంతుల, ఒద్దన్= భార్యల ఎదుట; పల్కితిన్= ఆ విధంగా మాట్లాడాను; వింతయె?= ఇది ఆశ్చర్యమా?; కాము, శక్తి= మన్మథునియొక్క శక్తిని; ఉడివింపఁగన్= మాన్పించటం- అనగా లేకుండ చేయటం; ఎట్టివారికిన్; శక్యమె= సాధ్యమా?

తాత్పర్యం: స్త్రీల గోష్ఠిలో ఉండేవాడు ఎంత వివేకి అయినా, అహంకారపూరితు డౌతాడు. ధర్మం తప్పి వ్యవహరిస్తాడు. ప్రియంగా వ్యవహరించలేడు. నేను వివేకంగలవాడినే అయినా నిగ్రహం కోల్పోయి, భార్యల యెదుట ఆ విధంగా మీతో మాట్లాడాను. ఇది అసహజం కాదు గదా! మన్మథుని శక్తిని అణచటం ఎంతవారికైనా సాధ్యమా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. స్త్రీలయెదుట స్వాతిశయభావం పెంచుకొని ఇతరులతో వ్యవహరించటం పురుషసహజం.

క. సుర గరుడ విషోరగ య । క్ష రాక్షస పిశాచ, భూత గంధర్వులు నో
పరు ధిక్కరింప బ్రాహ్మణ । పురస్కృతులఁ బుణ్యమతుల భూతలపతులన్. 60

ప్రతిపదార్థం: బ్రాహ్మణ, పురస్కృతులన్= బ్రాహ్మణుడిని ముందుంచుకొన్న వాళ్ళను; పుణ్య, మతులన్= పవిత్రమైన మనస్సుకల వాళ్ళను; భూతల, పతులన్= రాజులను; సుర, గరుడ, విష+ఉరగ, యక్ష, రాక్షస, పిశాచ, భూత, గంధర్వులు= దేవతలు, గరుడులు, నాగులు, యక్షులు, రాక్షసులు, పిశాచాలు, భూతాలు, గంధర్వులు; ధిక్కరింపన్= తిరస్కరించటానికి; ఓపరు= చాలరు.

తాత్పర్యం: బ్రాహ్మణుడిని ముందుంచుకొన్న పవిత్రహృదయులైన రాజులను - సురలు కాని, గరుడులు కాని, నాగులుకాని, యక్ష, రాక్షస పిశాచభూతగంధర్వులు కాని ధిక్కరించలేరు.

అంగారపర్ణుఁడు పాండవులకుఁ బురోహితునిఁ బురస్కరింపుఁ డని చెప్పుట (సం.1-159-17)

సీ. అనవద్యు వేదవేదాంగ విశారదు । జప హోమ యజ్ఞ ప్రశస్తు సత్య
వచను విప్రోత్తము వర్గచతుష్టయ । సాధనసఖు సదాచారు సూరి
సేవ్యుఁ బురోహితుఁ జేసిన భూపతి । యేలు నుర్వీతలం బెల్ల; నిందుఁ
బరలోకమునఁ బుణ్యపరుల లోకంబులు । వడయు; జయస్వర్గఫలము నూవె

ఆ. రాజ్య మదియు నుర్వరాసురవిరహితుఁ । డయిన పతికిఁ గేవలాభిజాత్య
శౌర్యమహిమఁ బడయ సమకూరునయ్య తా । పత్య! నిత్యసత్యభాషణుండ !. 61

ప్రతిపదార్థం: తాపత్య= తపతికి సంబంధించిన వంశంవాడా!; నిత్య, సత్య, భాషణుండ= ఎల్లప్పుడు సత్యాన్ని మాటాడే వాడా!; అనవద్యున్= ఏ లోపమూ లేనివాడిని; వేద, వేదాంగ, విశారదున్= వేదాలలో, వేదాంగాలలో- జ్యోతిషవ్యాకరణాదిశాస్త్రాలలో విద్వాంసుడిని; జప, హోమ, యజ్ఞప్రశస్తున్= జపంచేత, హోమంచేత, యజ్ఞంచేత ప్రసిద్ధుడైన వాడిని; విప్ర+ఉత్తమున్= బ్రాహ్మణ శ్రేష్ఠుని, వర్గ, చతుష్టయ, సాధన, సఖున్= ధర్మార్థ కామమోక్షాలను సాధించటంలో మిత్రుడైనవాడిని; సదాచారున్= మంచి నడవడి గలవాడిని; సూరి, సేవ్యున్= పండితులచేత సేవింపబడేవాడిని; పురోహితున్= పురోహితునిగా; చేసిన= చేసుకొన్న; భూపతి= రాజు; ఇందున్= ఈ లోకాన; ఉర్వీ, తలంబు+ఎల్లన్= భూమండలాన్నిఅంతా; ఏలున్= పాలిస్తాడు; పరలోకమునన్= పరలోకంలో; పుణ్యపరుల= పుణ్యాత్ముల; లోకంబులు; పడయున్= పొందుతాడు; రాజ్యము; జయ, స్వర్గ ఫలము= జయాన్నీ, స్వర్గాన్నీ, ఫలంగా గలిగినట్టిది; సూవె= సుమా; అదియున్= ఆ ఫలం; ఉర్వరా; సుర, విరహితుఁడయిన పతికిన్= భూసురుడు - అనగా బ్రాహ్మణుడు లేనిరాజుకు; కేవల+ఆభిజాత్య, శౌర్య, మహిమన్= కేవలం వంశంయొక్క పరాక్రమంయొక్క గొప్పతనంచేత; పడయన్, సమకూరున్+అయ్య= పొందటం సాధ్యమగునా? (సాధ్యం కాదని భావం)

తాత్పర్యం: తపతికి సంబంధించినవంశంలో జన్మించినవాడా! నిత్యసత్యభాషీ! అర్జునా! ఏ లోపం లేనివాడిని, వేద వేదాంగాలలో పండితుడిని, జప, హోమయజ్ఞాలు చేయటంచేత ప్రసిద్ధు డైనవాడిని, సత్యభాషిని, బ్రాహ్మణ శ్రేష్ఠుని, ధర్మార్థ కామమోక్ష సాధనలో మిత్రుడిని, మంచినడవడిగలవాడిని పురోహితుడిగా చేసికొన్న రాజు, ఈ లోకంలో భూమండలమంతా పరిపాలిస్తాడు; పరలోకంలో పుణ్యగతులు పొందుతాడు; జయ,ం, స్వర్గం రాజ్యం వలన లభిస్తాయి. బ్రాహ్మణుడు లేకుండా రాజుకు కేవలం వంశపరాక్రమాల గొప్పతనంచేతనే అటువంటి ఫలాన్ని పొందటం సాధ్యం కాదు.

విశేషం: ఈ పద్యం రాజ్యవ్యవస్థలో పురోహితుని ప్రాధాన్యాన్నీ, అతని యోగ్యతలను వివరిస్తుంది. అర్జునుణ్ణి తాపత్యుడనడానికి గల విశేషాలు ఇదే ఆశ్వాసంలో 67 పద్యంనుండీ ఉన్నాయి. చూడవచ్చు.

వ. మీరు ధర్మానిలశక్రాశ్వినులవరంబునం బాండురాజునకుం గుంతీమాద్రులకుం బుట్టినవారలు ధర్మవిదులరు; వేదవేదాంగ ధనుర్వేదపారగుం డయిన భారద్వాజు శిష్యుల; రఖిలలోకహితులరుం గావునం బురోహిత రహితులరై యుండఁ దగదు. 62

ప్రతిపదార్థం: మీరు; ధర్మ+అనిల, శక్ర+అశ్వినుల, వరంబునన్= యమధర్మరాజు, వాయుదేవుడు, దేవేంద్రుడు, అశ్వినీదేవతలు - వీరి వరంవలన; పాండురాజునకున్, కుంతీ, మాద్రులకున్, పుట్టినవారలు; ధర్మ, విదులరు= ధర్మం తెలిసినవాళ్ళు; వేద, వేద+అంగ, ధనుర్వేద, పారగుండు+అయిన= వేద వేదాంగ ధనుర్వేదాల యొక్క ఆవలి ఒడ్డు చేరినవాడైన - అనగా వేద వేదాంగ ధనుర్వేదాలను పూర్తిగా నేర్చినవాడైన; భారద్వాజు, శిష్యులరు= భరద్వాజుని కుమారుడైన ద్రోణునియొక్క శిష్యులు; అఖిల, లోకహితులరున్= అన్ని లోకాల మేలు కోరేవాళ్ళున్నూ; కావునన్= కాబట్టి; పురోహితరహితులరు+ఐ= పురోహితుడు లేనివాళ్లై; ఉండన్+తగదు= ఉండటం యోగ్యం కాదు.

తాత్పర్యం: మీరు, యమ, వాయు, దేవేంద్ర, అశ్వినీదేవతల వరాలతో పాండురాజుకు, కుంతీమాద్రులకు జన్మించినవాళ్ళు. ధర్మం తెలిసినవాళ్ళు. వేదవేదాంగధనుర్వేదాలను పూర్తిగా తెలిసిన ద్రోణాచార్యుని శిష్యులు. అన్ని లోకాలమేలు కోరేవాళ్ళు. అందుచేత పురోహితుడు లేకుండా ఉండటం తగదు.

విశేషం: వేదాలు నాలుగు: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. వేదాంగాలు ఆరు; శిక్ష (కర్త-పాణిని), వ్యాకరణం (కర్త-పాణిని), ఛందం (కర్త-పింగళముని), నిరుక్తం (కర్త-యాస్కుడు), జ్యోతిషం (కర్తలు-ఆదిత్యాదులు), కల్పం (కర్తలు-ఆశ్వలాయన, కాత్యాయన, ఆపస్తంబాదులు). ఉపవేదాలు నాలుగు : ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థవేదం.

ఆ. పాండుపుత్త్ర ! నీవు బ్రహ్మచర్యస్థుండ । వగుటఁ జేసి మన్మథార్తు నన్ను
నొడిచి తిందు రాత్రి యుద్ధంబు సేసి; కా । మోపభోగనిరతుఁ డోటు వడఁడె? 63

ప్రతిపదార్థం: పాండు, పుత్త్ర= పాండురాజుకుమారా!; నీవు, బ్రహ్మచర్యస్థుండవు+అగుటన్+చేసి= బ్రహ్మచర్య ఆశ్రమంలో ఉన్నవాడవు కనుక; ఇందున్= ఇక్కడ; రాత్రి, యుద్ధంబు, చేసి; మన్మథ+ఆర్తున్= మన్మథునిచేత పీడితు డనైన; నన్నున్= నన్ను; ఒడిచితివి= ఓడించావు; కామ+ఉపభోగ, నిరతుఁడు= కామసుఖానుభవాలలో మిక్కిలి ఆసక్తిగొన్నవాడు ఓటు, పడఁడె= ఓడిపోడా?

తాత్పర్యం: పాండుకుమారా! ఓ అర్జునా! నీవు బ్రహ్మచర్యంలో ఉన్నవాడివి కావటంచేత మన్మథపీడితుడ నైన నన్ను ఇక్కడ రాత్రియుద్ధం చేసి ఓడించావు. కామసుఖానుభవంలో నిమగ్నుడైనవాడు ఓడిపోడా?

విశేషం: అలం : అర్థాంతరన్యాసం.

వ. మఱియుఁ గామ ప్రవృత్తుం డయ్యును మహీపతి మహీసురవరపురస్సరుం డగు నేని యెల్ల యుద్ధంబుల శత్రుల జయించు. 64

ప్రతిపదార్థం: మఱియున్= అంతేకాక; కామప్రవృత్తుండు+అయ్యును= కామమునందు ప్రవర్తిల్లేవాడైనా; మహీపతి= రాజు; మహీసుర, వర, పురస్+సరుండు+అగున్+ఏని= బ్రాహ్మణశ్రేష్ఠుని ముందుంచుకొన్నవా డైతే; ఎల్ల, యుద్ధంబులన్= అన్ని యుద్ధాలలో; శత్రులన్, జయించున్= శత్రువుల్ని జయించగలుగుతాడు.

తాత్పర్యం: అంతేకాక రాజు కామభోగాలలో ప్రవర్తిల్లేవా డైనా, పురోహితుడిని ముందుంచుకొంటే, అన్ని యుద్ధాలలో శత్రువులను జయించగలడు.

ఉ. వేదము వేదియుం గలుగు విప్రవరేణ్యుఁ డగణ్యపుణ్య సం
పాది పురోహితుం డయినఁ బాపము పొందునె భూపతిం బ్రతా
పోదయ! కాన మీఁదగు గుణోన్నతికిం దగ ధర్మతత్త్వ సం
వేదిఁ బురస్కరింపుఁడు పవిత్రచరిత్రు మహీసురోత్తమున్. 65

ప్రతిపదార్థం: ప్రతాప+ఉదయ!= ఓ పరాక్రమశాలీ! అర్జునా!; వేదము; వేదియున్= యజ్ఞవేదికయు; కలుగు; విప్ర, వరేణ్యుఁడు= బ్రాహ్మణశ్రేష్ఠుడు; అగణ్య, పుణ్య, సంపాది= లెక్కకు మిక్కిలియైన పుణ్యాలను సంపాదించినవాడు; పురోహితుండు+అయినన్= పురోహితుడు అయితే; భూపతిన్= రాజును, పాపము; పొందునె= పాపం అంటునా; కాన= అందుచేత; మీది+అగు; గుణ+ఉన్నతికిన్= గుణాల గొప్పతనానికి; తగన్= తగినట్లు; ధర్మ, తత్త్వ, సంవేదిన్= ధర్మతత్త్వాన్ని బాగా

తెలిసినవాడిని; పవిత్ర, చరిత్రున్= పుణ్యప్రవర్తన కలవాడిని; మహీ, సుర+ఉత్తమున్= బ్రాహ్మణశ్రేష్ఠుడిని; పురస్కరింపుఁడు= ముం దిడుకొనండి - అనగా పురోహితునిగా చేసుకోండి.

తాత్పర్యం: పరాక్రమశాలీ! ఓ అర్జునా! వేదం, యజ్ఞవేదిక కల బ్రాహ్మణశ్రేష్ఠుడు, అత్యధిక పుణ్యాన్ని సంపాదించిన వాడు - పురోహితుడైతే, ఇక రాజుకు పాపం అంటుతుందా? అందుచేత మీ గుణాల గొప్పతనానికి తగినట్లు ధర్మతత్త్వాన్ని బాగా తెలిసినవాడు, పవిత్రమైన నడవడి కలవాడు అయిన బ్రాహ్మణ శ్రేష్ఠుడిని మీ పురోహితునిగా చేసుకోండి.

తే. అనిన వానికి నర్జునుం డనియె 'మమ్ము । ననఘ! తాపత్యు లని పల్కి తతిముదమున
నేము కౌంతేయులము మఱి యెట్లు సెప్పు । మయ్య తపతి కపత్యుల మైన తెఱఁగు'. 66

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; వానికిన్= ఆ అంగారపర్ణునికి; అర్జునుండు; అనియెన్; అనఘ!= పాప రహితుడా! అతి ముదమునన్= మిక్కిలి సంతోషంతో; మమ్మున్, తాపత్యులు+అని= తపతిసంతతివా రని; పల్కితి(వి)= పలికితివి; ఏము= మేము; కౌంతేయులము= కుంతీపుత్రులం; తపతికిన్; అపత్యులము+ఐన= తపతికి సంతతివార మైన ; తెఱఁగు= విధం; మఱి; ఎట్లు; చెప్పుము+అయ్య= మరి ఏ విధంగానో తెలపండయ్యా!

తాత్పర్యం: అని పల్కగా ఆ గంధర్వునితో అర్జునుడు ఇట్లా అన్నాడు. 'పుణ్యాత్మా! నీవు సంతోషంతో మమ్మల్ని 'తపతిసంతతివారు' అని పేర్కొన్నావు. మేము కుంతీపుత్రులం. మరి యే విధంగా మేము తపతి సంతతివార మయ్యామో తెలియచెప్పవలసింది'.

తపతీసంవరణోపాఖ్యానము (సం. 1-160-3)

వ. అనిన నర్జునునకు నంగారపర్ణుం డి ట్లనియె. 67

తాత్పర్యం: అని పలికిన అర్జునునితో అంగారపర్ణుడు ఈ విధంగా అన్నాడు.

సీ. ఆదిత్యునకుఁ బుత్త్రి యనఘ సావిత్రికిని । ననుజ యుత్తమలక్షణామలాంగి
తపతి; యక్కన్య ధవళాయతేక్షణ । యౌవనసంప్రాప్త యైన, దానిఁ
జూచి యక్కన్యక సురుచిరగుణముల । కనుగుణుం డగు నిర్మలాభిజాత్యుఁ
బతి నెవ్విధంబునఁ బడయుదునో యని । తలఁచుచు నున్న యత్తపనుగుఱిచి

ఆ. భక్తిఁ దపము సేసెఁ బ్రభుఁ డజామీఢనం । దనుఁడు భరతకులుఁడు ధర్మవిదుఁడు
సర్వగుణయుతుండు సంవరణుం డను । వాఁడు కృతజపోపవాసవిధుల. 68

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా- ఓ అర్జునా!; ఆదిత్యునకున్= సూర్యునికి; పుత్త్రి= కూతురు; సావిత్రికిన్; అనుజ= అనుసరించి జన్మించినది - అనగా చెల్లెలు; ఉత్తమ, లక్షణ+అమల+అంగి= శ్రేష్ఠమైన లక్షణాలతో కూడిన నిర్మల మైన శరీరం కలది; తపతి; ఆ+కన్య = ఆ కన్యక; ధవళ+ఆయత+ఈక్షణ= తెల్లని విశాలములైన కన్నులు కలది; యౌవన, సంప్రాప్త, ఐన, దానిన్= యౌవనవతి అయినదానిని; చూచి; ఆ+కన్యక= ఆ తపతియొక్క; సురుచిర గుణములకున్=

ఒప్పిదమైన గుణాలకు - అనగా మంచి గుణాలకు; అనుగుణుండు+అగు= తగినగుణాలు కలవా డైన; నిర్మల+ఆభిజాత్యున్= స్వచ్ఛమైన వంశం కలవాడిని; పతిన్= భర్తను; ఏ+విధంబునన్, పడయుదునో= ఏ విధంగా పొందుతానో; అని; తలఁచుచున్+ఉన్న= ఆలోచిస్తున్న; ఆ+తపను గుఱిచి= ఆ సూర్యుడినిగూర్చి; ప్రభుఁడు= రాజు; అజామీఢ, నందనుఁడు= అజామీఢుని యొక్క కుమారుడు; భరత, కులుఁడు= భరత వంశపువాడు; ధర్మ విదుఁడు= ధర్మం తెలిసినవాడు, సర్వ, గుణయుతుండు= అన్ని మంచి గుణాలతో కూడుకొన్నవాడు అయిన; సంవరణుండు+అను, వాఁడు; కృత, జప+ఉపవాస, విధులన్= చేయబడిన జపం, ఉపవాసం, మొదలైన నియమాలచేత; భక్తిన్= భక్తితో; తపము; చేసెన్.

తాత్పర్యం: సూర్యునికి కూతురు, సావిత్రికి చెల్లెలు, ఉత్తమ లక్షణాలు, నిర్మల శరీరం, తెల్లని నేత్రాలు కలది, యౌవనవతి అయిన తపతి అనే కన్యకను చూచి - ఆమెఉత్తమగుణాలకు తగినగుణాలుకలవాడు, మంచివంశం కలవాడు అయిన భర్తను ఏ విధంగా పొందుతానా అని సూర్యుడు ఆలోచిస్తుండగా - ఆ సూర్యుడినిగూర్చి - ప్రభువు అజామీఢుని పుత్రుడు, భరతవంశంవాడు, ధర్మం తెలిసినవాడు, సర్వసద్గుణాలతో కూడుకొన్నవాడు అయిన సంవరణుడు - జపం, ఉపవాసం, మొదలైన నియమాలతో భక్తితో తపస్సు చేశాడు.

విశేషం: ఋక్షకుని కుమారుని పేరుకూడా సంవరణుడే.

చ. 'గగనమునందు నెందు నధికప్రభ నేను వెలుంగు నట్టు లి
జ్జగతిఁ బ్రసిద్ధుఁడై వెలుఁగు సంవరణుండ మదీయపుత్త్రికిం
దగుపతి; వీని కిచ్చెద ముదంబున నీలలితాంగి' నంచు మా
నుగ నెడ నిశ్చయించెఁ దపనుండు దదీయతపః ప్రసన్నుఁడై. 69

ప్రతిపదార్థం: గగనమునందున్= ఆకాశంలో; ఎందున్= ఎక్కడైనా; ఏను= నేను; అధిక, ప్రభన్= మిక్కిలికాంతితో; వెలుంగు నట్టులు= ప్రకాశిస్తూ ఉన్నట్లే; ఈ+జగతిన్= ఈ ప్రపంచంలో; ప్రసిద్ధుఁడు+ఐ; వెలుఁగు= ప్రకాశించే; సంవరణుండు+అ= సంవరణుడే; మదీయ, పుత్త్రికిన్= నా యొక్క పుత్రికకు; తగు, పతి= తగిన భర్త; ముదంబునన్= సంతోషంతో; ఈ, లలిత+అంగిన్= ఈ సుకుమారమైన శరీరం కలదానిని; వీనికిన్, ఇచ్చెదన్= ఇతనికి ఇస్తాను; అనుచున్= అంటూ; సూర్యుడు, తదీయ, తపః+ప్రసన్నుఁడు+ఐ= ఆ సంవరణునియొక్క తపస్సునకు సంతోషించినవాడై; మానుగన్= ఒప్పుగా; ఎడన్= హృదయంలో; నిశ్చయించెన్= నిర్ణయించుకొన్నాడు.

తాత్పర్యం: 'ఆకాశంలో అధికకాంతితో నేను వెలుగుతున్నట్లే ఈ ప్రపంచంలో సంవరణుడు ప్రసిద్ధు డై వెలుగుతున్నాడు. కనుక ఇతడే నా పుత్రికకు తగిన భర్త. ఈ సుకుమారిని సంతోషంతో ఇతని కిస్తాను' అని సంవరణుని తపస్సుకు సంతోషించిన సూర్యుడు తనమనస్సులో చక్కగా నిశ్చయించుకొన్నాడు.

వ. అంత నొక్కనాఁడు సంవరణుండు మృగయావినోదార్థి యయి వనంబునఁ బరిభ్రమించి అధికక్షుత్పిపాసాపీడిత పతితతురంగుం డయి యేకతంబ పాదచారి యై చని యొక్క పర్వతవనోద్దేశంబునందు. 70

ప్రతిపదార్థం: అంతన్= అటుపై; ఒక్కనాఁడు; సంవరణుండు; మృగయా, వినోద+అర్థి, అయి= వేటయొక్క వినోదంకొరకు; వనంబునన్= అడవిలో; పరిభ్రమించి= తిరిగి; అధిక, క్షుత్+పిపాసా, పీడిత, పతిత, తురంగుండు+అయి= మిక్కిలి ఆకలిచేత, దప్పికచేత, పీడింపబడి పడిపోయిన గుఱ్ఱం కలవాడై; ఏకతంబు+అ= ఒంటరిగా; పాదచారి+ఐ= కాలినడకతో; చని= వెళ్ళి; ఒక్క, పర్వత, వన+ఉత్+దేశంబునందు= ఒక పర్వతంయొక్క అరణ్యంలోని ఎత్తైన ప్రదేశంలో.

తాత్పర్యం: తర్వాత ఒకనాడు సంవరణుడు వేటకై అడవికి వెళ్ళాడు. తిరిగి తిరిగి అధికమైన ఆకలిదప్పులతో తన గుర్రం పడిపోగా, తాను ఒంటరిగా కాలినడకతో వెళ్ళి ఒక కొండ అడవిలోని ఎత్తైన ప్రదేశంలో.

క. కనియె నొక కన్యఁ గోమలిఁ । గనకప్రభ నిజ శరీరకాంతి నుపాంతం
బున వృక్షలతావలిఁ గాం । చనమయముగఁ జేయుచున్న చంద్రనిభాస్యన్. 71

ప్రతిపదార్థం: ఒక, కన్యన్= ఒక వివాహంకాని అమ్మాయిని; కోమలిన్= సుకుమారిని; కనక, ప్రభ,నిజ, శరీర కాంతిన్= బంగారు కాంతితో సమానమైన తన శరీరకాంతిచేత; ఉపాంతంబునన్= సమీపంలోని; వృక్ష, లతా+ఆవలిన్= చెట్ల తీవల సమూహాన్ని; కాంచన మయముగన్= బంగారుమయంగా చేయుచున్న; చేస్తున్న; చంద్ర, నిభ+ఆస్యన్= చంద్రునితో సమానమైన ముఖం కలిగిన దానిని; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: సుకుమారి, బంగారుకాంతివంటి తన శరీరకాంతితో ప్రక్క నున్న చెట్లను, తీవలను బంగారుమయం చేస్తున్నట్టిది, చంద్రునివంటి అందమైన ముఖంకలది అయిన ఒకకన్యను చూశాడు.

విశేషం: అలం: ఉపమ, తద్గుణం.

సంవరణుండు తపతింజూచి మోహించుట (సం. 1-160-25)

వ. కని యనిమిషలోచనుం డయి మనంబున ని ట్లని వితర్కించె. 72

ప్రతిపదార్థం: కని= చూచి; అనిమిష, లోచనుండు+అయి= రెప్పవాల్చని కన్నులు కలవాడై; మనంబునన్= మనస్సునందు; ఇట్లు+అని= ఈ విధంగా; వితర్కించెన్= ఊహించాడు.

తాత్పర్యం: చూచి కనురెప్పపాటుకూడా లేని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ మనస్సులో ఈ విధంగా భావించాడు.

సీ. త్రిభువనలక్ష్మి యేతెంచి యేకాంత మి । ట్లేలొకో యున్నది యివ్వనమున,
గగనమణిప్రభ గగనంబునం దుండి । యవనీతల ప్రాప్త మయ్యె నొక్కొ
శంభుండు లావణ్యసద్గుణసముదాయ । మింద యిమ్ముగ సంగ్రహించె నొక్కొ
దీని యంగములఁ బొందిన యివ్విభూషణ । శ్రీ యేమి పుణ్యంబుఁ జేసె నొక్కొ

ఆ. యమరకన్యయొక్కొ యక్షకన్యక యొక్కొ । సిద్ధకన్య యొక్కొ శ్రీసమృద్ధి
సర్వలక్షణ ప్రశస్తాంగి యిది దివ్య । కన్య యగు ననంతకాంతిపేర్మి. 73

ప్రతిపదార్థం: త్రిభువన లక్ష్మి= మూడులోకాలలక్ష్మి; ఏతెంచి= వచ్చి; ఏకాంతము= ఒంటరిగా; ఈ వనమునన్= ఈ అడవిలో; ఇట్లు+ఏల+ఒకో= ఈ విధంగా ఎందుకు; ఉన్నది= ఉన్నదో; గగనమణిప్రభ= సూర్యునియొక్కకాంతి; గగనంబు+అందున్+ఉండి= ఆకాశంనుండి; అవనీతల, ప్రాప్తము+అయ్యెన్+ఒక్కొ= భూతలంమీదికి వచ్చినదా! శంభుండు= బ్రహ్మదేవుడు; లావణ్య, సద్గుణ, సముదాయము= సౌందర్యం యొక్క మంచిగుణాల సమూహం; ఇందు+అ= దీని యందే; ఇమ్ముగన్= ఒప్పుగ; సంగ్రహించెన్, ఒక్కొ= కూర్చినాడా; దీని= ఈ కన్యకయొక్క; అంగంబులన్= అవయవాలను; ఈ+విభూషణ, శ్రీ= ఈ అలంకారాల శోభ; ఏమి, పుణ్యంబున్= ఏ పుణ్యాన్ని; చేసెన్+ఒక్కొ= చేసిందో కదా!; అమర, కన్య,

ఒక్కో= దేవతాకన్యయా!; యక్ష, కన్యక+ఒక్కో= యక్ష కన్యయా; సిద్ధ కన్య+ఒక్కో = సిద్ధ కన్యయా; శ్రీ సమృద్ధి, సర్వ, లక్షణ ప్రశస్త+అంగి= శోభచే నిండి, అన్ని శుభలక్షణాలచేత ప్రశంసింప తగిన శరీరం కలది; అనంత కాంతి పేర్మిన్= అంతం లేని కాంతియొక్క అతిశయంచేత; ఇది, దివ్య, కన్య, అగున్= ఈమె దివ్యకన్యయే అవుతుంది.

తాత్పర్యం: త్రిలోకలక్ష్మి ఒంటరిగా ఈ వనంలో ఈ విధంగా ఎందు కున్నదో! సూర్యకాంతి ఆకాశంనుండి భూమిమీదికి అవతరించిందో! బ్రహ్మదేవుడు సౌందర్య సద్గుణాల సముదాయాన్ని ఈమెలోనే సమకూర్చాడేమో! ఈమె అవయవాలను పొందిన ఈ అలంకారాల శోభ యేపుణ్యం చేసిందో! ఈమె దేవకన్యో, యక్షకన్యో, సిద్ధకన్యో, శోభాసమృద్ధితో, అపారమైన కాంతితో, సకలశుభలక్షణాలతో ప్రశంసింప దగిన శరీరం గల ఈమె ఒక దివ్యకన్యే అయి ఉంటుంది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సంవరణుని హృదయంలో అభిలాష జనించటానికి కారణ మైన తపతినిగురించి ఉత్ప్రేక్షలో వర్ణించిన ఈ పద్యరచనలోని మాధుర్య మనే శబ్దగుణం రసపోషకం. (సంపా.) శంభు శబ్దం శివుడు, విష్ణువు, బ్రహ్మ అని ముగ్వురకు వర్తిస్తుంది. కాని ఈ పద్యంలో 'బ్రహ్మ' అనే అర్థంలోనే గ్రహించడమైనది.

చ. నెఱికురులున్ విలోలసితనేత్రయుగంబును నొప్పులొల్కు వా
తెఱయును దీని యాననముతెల్వి కరంబు మనోహరంబు; నా
యెఱిఁగిన యంతనుండి సతి నిట్టిలతాలలితాంగిఁ జూచి యే
నెఱుఁగ; సురేంద్రకన్యకలు నిట్టిరె రూపవిలాససంపదన్. 74

ప్రతిపదార్థం: నెఱి, కురులున్= అందమైన జుట్టు; విలోల, సిత, నేత్ర యుగంబునున్= చలిస్తున్న తెల్లని కన్నుల జంట; ఒప్పులు+ఒల్కు, వా తెఱయును= అందాలు చిందే పెదవీ; దీని, ఆననము, తెల్వి= దీని ముఖకాంతి; కరంబు= మిక్కిలి; మనోహరంబు= మనస్సును దోచుకొనునట్టిది; నా ఎఱిఁగిన, అంత నుండి= నేను పుట్టి బుద్ధి ఎఱిగినప్పటి నుండి; ఇట్టి; లతా, లలిత+అంగిన్= ఇటువంటి తీగవలె సుకుమారమైన శరీరం కల దానిని; సతిన్= కాంతను; ఏన్= నేను; చూచి, ఎఱుఁగన్= చూచి ఎరుగుట లేదు అనగా చూడలేదు; రూప, విలాస, సంపదన్= అందంయొక్క శృంగార కళా విశేషం యొక్క ఆధిక్యంలో; సుర+ఇంద్ర, కన్యకలున్= దేవేంద్రునియొక్క కన్యకలైనా; ఇట్టిరే= ఇట్టివారా?

తాత్పర్యం: ఈమె అందమైన కేశపాశం, చలించే తెల్లని కన్నుల జంట, ఒప్పు లొలికే పెదవి, ముఖకాంతి ఎంతో మనోహరంగా ఉన్నాయి. నేను పుట్టి బుద్ధి యెఱిగిననాటినుండి - తీవవలె ఇంత సుకుమారమైన స్త్రీని చూడలేదు. అందంలో శృంగారకళావిశేషంలో దేవతాకన్యకలలో నైనా ఇట్లాంటివా ళ్ళున్నారా?

విశేషం: అలం: ఉదాత్తం. ఈ పద్యంలోకూడ అభిలాషను ధ్వనింపచేసే మాధుర్యగుణం పోషింపబడింది. (సంపా.)

వ. అని వితర్కించుచు మదనకర్కశమార్గణలక్షీభూతచేతస్కుం డయి తదీయగుణమయపాశబద్ధుండునుం బోలెఁ గదలనేరక తన్నివేశితచేతనుండునుంబోలెఁ ద న్నెఱుంగక తద్రూపామృతపానంబున ననిమిషత్వంబునం బొందిన తన నయనంబుల దానియంద నిలిపి సంవరణుం డక్కన్యక కి ట్లనియె. 75

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; వితర్కించుచున్= ఊహిస్తూ; మదన, కర్కశ, మార్గ; లక్షీభూత, చేతస్కుండు+అయి= మన్మథునియొక్క కఠినమైన బాణాలకు గురిచేయబడిన మనస్సు కలవాడై; తదీయగుణమయ, పాశబద్ధుండునున్+పోలెన్= దానియొక్క గుణాలనెడి త్రాళ్ళచేత కట్టివేయబడినవానివలె; కదలనేరక= చలింపక; తద్+నివేశిత, చేతనుండునున్+పోలెన్= దానియందు ఉంచబడిన చైతన్యం కలవానివలె; తన్ను+ఎఱుంగక= తన్ను తాను మరచి; తద్+రూప+అమృత, పానంబునన్= దానియొక్క రూపమనెడి అమృతాన్ని త్రాగటంచేత; అనిమిషత్వంబునన్= రెప్పపాటు లేమిని అనగా దేవతాత్వమును; పొందిన; తన, నయనంబులన్= తన కన్నులను; దాని; అందు+అ= ఆ తపతియందే; నిలిపి, సంవరణుండు; ఆ+కన్యకకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని ఊహిస్తూ తనమనస్సు మన్మథబాణాలకు గురికాగా, సంవరణుడు ఆమె గుణా లనే త్రాళ్ళతో కట్టివేయబడ్డవానివలె కదలలేక, తన చైతన్యా న్నంతా ఆమెలో ఉంచినట్లు తనను తాను మరచి ఆమెరూప మనే అమృతాన్ని త్రాగడంచేత రెప్పపాటు లేనికళ్ళను ఆమెవైపే నిలిపి, ఆ కన్యతో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. చక్షుఃప్రీతి అనే మన్మథావస్థ.

ఆ. ఎఱుఁగఁ జెప్పు మబల ! యెవ్వరి దాన; వి । ట్లేల యున్నదాన వేకతంబ;
క్రూర వన మృగములు గ్రుమ్మరుచున్న యీ । విజన విషమ శైల విపిన భూమి. 76

ప్రతిపదార్థం: అబల!= ఓ కాంత!; ఎవ్వరిదానవు= ఎవరికి సంబంధించినదానివి; ఎఱుఁగన్+చెప్పుము; క్రూర, వన, మృగములు, క్రుమ్మరుచు+ఉన్న= క్రూరమైన అడవిమృగాలు తిరుగుతున్న; ఈ, విజన, విషమ, శైల, విపిన, భూమిన్= ఈ మనుష్యులులేని ఎగుడుదిగుడు పర్వతారణ్య ప్రదేశంలో; ఇట్లు= ఈవిధంగా; ఏల= ఎందుకు; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్నదానవు= ఉన్నావు.

తాత్పర్యం: ఓ కాంతా! నీ వెవరో వివరంగా చెప్పుము. క్రూరమైన అడవిమృగాలు తిరుగుతున్న ఈ ప్రాంతంలో మనుష్యులు లేని ఎగుడుదిగుడు పర్వతారణ్యప్రదేశంలో ఈ విధంగా ఒంటరిగా ఎందు కున్నావు?

క. అని పలుకుచున్న నృపనం । దనునకు మఱుమాట యీక తామరసనిభా
నన మేఘమధ్యసౌదా । మనివోలె నడంగె దృష్టిమార్గము గడవన్. 77

ప్రతిపదార్థం: అని, పలుకుచు, ఉన్న; నృప, నందనునకు= రాజకుమారునికి; మఱుమాట= సమాధానం; ఈక=ఇవ్వకుండా; తామరస, నిభ+ఆనన= పద్మవంటి ముఖం కల ఆ తపతి; మేఘ, మధ్య, సౌదామని, పోలెన్= మేఘాలమధ్య మెరపు తీగవలె; దృష్టిమార్గము= చూపు ప్రసరించే త్రోవ; కడవన్= దాటి; అడంగెన్= మాయమయింది.

తాత్పర్యం: అని మాట్లాడుతున్న రాజకుమారునికి బదులు చెప్పకుండా పద్మంవంటి ముఖం కల ఆ తపతి మేఘాలమధ్య మెరపుతీగవలె కంటికి కన్పించకుండా మాయమైపోయింది.

విశేషం: అలం: ఉపమ.

వ. ఇ ట్లదృశ్యం బయిన యక్కన్యకం గానక మానవపతి మానరహితుం డయి మహీతలంబు పయిం బడి ప్రలాపించు చున్న, నాతని నభినవయౌవనవిభ్రమోద్భాసితు నంగజాకారుం జూచి తపతి తానును

మదనబాణబాధిత యై, తన రూపంబుఁ జూపి మధురవచనంబుల 'ని ట్లేల మోహగతుండ వయి?' తని పలికిన, దానికి సంవరణుం డి ట్లనియె. **78**

ప్రతిపదార్థం: ఇట్లు+అదృశ్యంబు+అయిన= ఈ విధంగా అగుపడకుండ పోయిన; ఆ+కన్యకన్= ఆ కన్నెను; కానక= కనజాలక; మానవపతి= రాజు (సంవరణుడు); మానరహితుండు+అయి= అభిమానాన్ని కోల్పోయినవాడై; మహీతలంబు+ పయిన్+పడి= నేలమీదపడి; ప్రలాపించుచున్నన్= ఏడ్చుచుండగా; ఆతనిన్= ఆ సంవరణుడిని; అభినవ యౌవన విభ్రమ+ ఉద్భాసితున్= సరిక్రొత్త యౌవన విలాసంచేత లెస్సగా ప్రకాశించేవాడిని; అంగజ+ఆకారున్= మన్మథునివంటి ఆకారం కల వాడిని; చూచి; తపతి; తానును; మదన బాణ బాధిత, ఐ= మన్మథ బాణాలచేత బాధింపబడినదై; తన, రూపంబున్, చూపి= తన రూపాన్ని చూపి; మధుర, వచనంబులన్= తీయని మాటలతో; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు; మోహ, గతుండవు= మోహాన్ని పొందినవాడవు; అయితి(వి)= అయితివి; అని పలికినన్= అని పలుకగా; దానికిన్= ఆ తపతికి; సంవరణుండు= సంవరణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ఆమె అదృశ్యమై పోగా, సంవరణుడు ఆమెను కనుగొనలేక అభిమానాన్ని కోల్పోయి, నేలమీద పడి దుఃఖించాడు. నవయౌవనవిలాసంతో ప్రకాశించేవాడు, మన్మథాకారుడు అయిన అతడిని చూచి తపతి తానుకూడ మన్మథబాణాలచేత బాధింపబడిం దై, అతనియెదుట నిలిచి, తీయనిమాటలతో ' ఈ విధంగా ఎందుకు మోహం పొందావు?' అని అడుగగా ఆమెతో సంవరణుడు ఇట్లా అన్నాడు.

చ. ధరణి నతిప్రతాపబలదర్పములన్ విన నేన పెద్ద; నె
వ్వరికిని మున్ భయంపడనివాఁడ; భయార్తుఁడ నైతి నిప్డు; పం
కరుహదళాయతాక్షి! దయఁ గావుము నన్ను; భవన్నిమిత్త దు
ర్భరతర పంచబాణహతిఁ బంచతఁ బొందకయుండునట్లుగన్. **79**

ప్రతిపదార్థం: వినన్= వినగా; ధరణిన్= భూమిమీద; అతి, ప్రతాప, బల, దర్పములన్= గొప్ప పరాక్రమంచేత, బలంచేత, గర్వం చేత; నేను+అ, పెద్దన్= నేనే పెద్దను; మున్= ఇదివరకు; ఎవ్వరికిని; భయంపడనివాఁడన్= ఎవ్వరికీ భయపడనివాడిని; ఇప్పుడు= ఇప్పుడు; భయ+ఆర్తుఁడన్+ఐతిన్= భయంచేత దుఃఖాన్ని పొందినవాడ నైనాను; పంకరుహ, దళ+ఆయత+అక్షి= పద్మపత్రాలవంటి విశాలా లయిన కన్నులు కలదానా; భవత్+నిమిత్త; దుర్భరతర, పంచబాణ, హతిన్= నీ కారణంగా భరింప సాధ్యం కాని మన్మథుని యొక్క దెబ్బచే; పంచతన్= మరణాన్ని; పొందక; ఉండునట్లుగన్= ఉండే విధంగా; దయన్= దయతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: గొప్పబలగర్వపరాక్రమాలలో ఈ భూమిమీద నేనే గొప్పవాడిని. ఇంతవరకు ఎవ్వరికీ భయపడనివాడిని; కాని ఇప్పుడు భయంతో బాధితుడ నయ్యాను. ఓ పద్మాక్షీ! నీ కారణంగా భరింపరాని మన్మథునిదెబ్బతో మరణం పొందకుండ, దయతో నన్ను రక్షింపుము.

వ. 'నన్ను గాంధర్వవివాహంబున వరియింపు' మనిన సంవరణునకుఁ దపతి యి ట్లనియె. **80**

ప్రతిపదార్థం: నన్నున్= నన్ను; గాంధర్వవివాహంబునన్= గాంధర్వ వివాహ పద్ధతిలో; వరియింపుము= కోరి పెండ్లాడు; అనినన్= అని అడుగగా; సంవరణునకున్= సంవరణునికి; తపతి=తపతి; ఇట్లు= ఈ విధంగా; అనియె= అన్నది.

తాత్పర్యం: 'నన్ను గాంధర్వవివాహపద్ధతిలో పెండ్లి చేసికొను' మని అడుగగా; సంవరుణునితో తపతి ఈ విధంగా పలికింది.

విశేషం: గాంధర్వ వివాహాలు: వధూవరులు పరస్పరం ప్రేమించుకొని పెద్దలతో అవసరం లేకుండా రహస్యంగా, అమంత్రకంగా చేసికొనే వివాహం. వివాహాలు ఎనిమిది విధాలు. (1) బ్రాహ్మం (2) దైవం (3) ఆర్షం (4) ప్రాజాపత్యం (5) రాక్షసం (6) ఆసురం (7) గాంధర్వం (8) పైశాచం (వివరాలకు చూడు. ఆది.4.55)

క. భువనైకదీపకుం డగు । సవితృనకుఁ దనూజ; మఱియు సావిత్రికి నే
నవరజ, నవినయవర్జిత; నవనీశ్వర! వినుము తపతి యను సురకన్యన్. 81

ప్రతిపదార్థం: అవని+ఈశ్వర= భూపతీ! సంవరణ మహారాజా!; వినుము; ఏన్= నేను; భువన+ఏక, దీపకుండు, అగు= లోకాన్ని అంతటిని వెలిగించేవా డైన; సవితృనకున్= సూర్యునికి; తనూజన్= కూతురిని; మఱియు; సావిత్రికిన్= సావిత్రికి; అవరజన్= తోబుట్టువును- చెల్లెలిని; అవినయ, వర్జితన్= అవినయంచేత విడువబడినదానిని - అనగా గర్వంలేనిదానిని; తపతి అను; సురకన్యన్= దేవకన్యను.

తాత్పర్యం: ఓ రాజా! విను. లోకాన్ని వెలిగించే సూర్యునికూతురిని. సావిత్రికి చెల్లెలిని. గర్వం లేనిదానిని. తపతి అనే పేరుగల దేవకన్యను.

వ. 'నాయందు నీకుం బ్రియంబు గలదేని మదీయ జనకు నడుగుము; న న్నిచ్చు; నింతులకు స్వాతంత్ర్యంబు లేమి నీ వెఱుంగుదువు గాదె! కావున ననవరతజపనియమప్రణిపాతంబుల నాదిత్యు నారాధింపు' మని చెప్పి తపతి యాదిత్యమండలంబున కరిగె; నంత సంవరణుండు మూర్ఛాగతుం డయి పడియున్న, నాతని యమాత్యుండు వచ్చి శీతలపరిషేచనంబు సేసిన మూర్ఛదేఱి యమ్మహీపతి మహాభక్తి నప్పర్వతంబున నుండి సూర్యు నారాధించుచు. 82

ప్రతిపదార్థం: నాయందున్= నాపై; నీకున్; ప్రియంబు= ప్రేమ; కలదు+ఏనిన్= ఉన్నచో; మదీయ, జనకున్= నాయొక్క తండ్రిని; అడుగుము; నన్నున్+ఇచ్చున్= నన్ను నీ కిచ్చి వివాహం చేస్తాడు; ఇంతులకున్; స్వాతంత్ర్యంబు, లేమి= స్వేచ్ఛలేకుండుట; నీవు; ఎఱుంగుదువుకాదె= తెలియుదువు కదా; కావునన్= కాబట్టి; అనవరత, జప, నియమ, ప్రణిపాతంబులన్= ఎడతెగని జపాలచేత, నియమాలచేత, నమస్కారాలచేత; ఆదిత్యునిన్= సూర్యుడిని; ఆరాధింపుము= సేవింపుము; అని, చెప్పి; తపతి; ఆదిత్య, మండలమునకున్= సూర్యమండలానికి; అరిగెన్= వెళ్ళింది; అంతన్= తరువాత; సంవరణుండు; మూర్ఛా, గతుండు+ అయి= మూర్ఛపోయినవాడై; పడియున్నన్, ఆతని= ఆ సంవరణునియొక్క; అమాత్యుండు= మంత్రి; వచ్చి; శీతల, పరిషేచనంబు, చేసినన్= చల్లని నీళ్ళు చల్లగా; మూర్ఛ, తేఱి= మూర్ఛనుండి తేరుకొని; ఆ+మహీపతి= ఆ రాజు (సంవరణుడు); మహా భక్తిన్= మిక్కిలి భక్తితో; ఆ+పర్వతంబునన్= ఆ కొండమీద; ఉండి= నివసించి; సూర్యున్= సూర్యుణ్ణి; ఆరాధించుచున్=సేవిస్తూ.

తాత్పర్యం: 'నాపై నీకు ప్రేమ ఉంటే, మా తండ్రిని అడుగుము; న న్నిస్తాడు. స్త్రీలకు స్వాతంత్ర్యం లే దని నీకు తెలుసుకదా! కనుక నిరంతరజపాలతో, నియమాలతో, నమస్కారాలతో సూర్యుడిని ఆరాధించుము' అని పలికి తపతి సూర్యమండలానికి వెళ్ళిపోయింది. తరువాత సంవరణుడు మూర్ఛపడి ఉండగా, అతనిమంత్రి వచ్చి చల్లని నీటితో మూర్ఛతేర్చాడు. ఆ మహారాజు ఆ పర్వతంమీదనే ఉండి, మహాభక్తితో సూర్యుడిని ఆరాధించాడు.

వసిష్ఠుఁడు తపతినిఁ గొనితెచ్చి సంవరణునకు వివాహంబు సేయించుట (సం.1-162-12)

చ. ప్రతిహత రాగ కోపభయుఁ బంకరుహప్రభవప్రభావు దూ
రితదురితున్ మునీశ్వరవరిష్ఠు వసిష్ఠమహామునిం బురో
హితు నతిభక్తితోఁ దలఁచె; నిష్ట మెఱింగి వసిష్ఠుఁడున్ సమా
హితమతి నేఁగుదెంచి కనియెం బ్రభు సంవరణుం బ్రియంబునన్. 83

ప్రతిపదార్థం: ప్రతిహత, రాగ, కోప, భయున్= నిరోధింపబడిన రాగం, కోపం, భయం కలవాడూ; పంకరుహ, ప్రభవ, ప్రభావున్= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునివంటి మహిమ కలవాడూ; దూరిత దురితున్= దూరం చేయబడిన పాపం కలవాడూ - అనగా ఏ పాపమూ చేయనివాడూ; ముని+ఈశ్వర, వరిష్ఠున్= మునిశ్రేష్ఠులలో ఉత్తముడైనవాడూ; అయిన; వసిష్ఠ, మహామునిన్= వసిష్ఠ మహర్షిని; పురోహితున్= తన పురోహితునిగా; అతి, భక్తితోన్= మిక్కిలి భక్తితో; తలఁచెన్= స్మరించాడు; ఇష్టము+ఎఱింగి= అతని కోరికను తెలిసికొని; వసిష్ఠుఁడున్= వసిష్ఠుడుకూడా; సమాహిత, మతిన్= ప్రసన్నమైన మనస్సుతో; ఏఁగుదెంచి= వచ్చి; ప్రభున్; సంవరణున్= సంవరణుడిని; ప్రియంబునన్= ప్రేమతో; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: రాగం, కోపం,భయం లేనివాడు బ్రహ్మదేవునితో సమానమైన ప్రభావం గలవాడు, పాపరహితుడు, మునీశ్వరశ్రేష్ఠుడు, తమ పురోహితుడు అయిన వసిష్ఠమహామునిని సంవరణుడు మిక్కిలి భక్తితో స్మరించాడు. అతని కోరికను తెలిసికొని, ఆ మహాముని ప్రసన్నమైన మనసుతో వచ్చి, ఆ ప్రభువును ప్రేమతో దర్శించాడు.

వ. ఇట్లు దలంచిన పండ్రెం డగు దివసంబునకు వచ్చి వసిష్ఠుం డవిరతవ్రతోపవాసకృశీభూతశరీరుం డయి యున్న సంవరణుం జూచి యాతండు తపనసుత యయిన తపతియందు బద్ధానురాగుం డగుట తన యోగ దృష్టి నెఱింగి. 84

ప్రతిపదార్థం: ఇట్లు; తలంచిన= స్మరించిన; పండ్రెండు+అగు= పన్నెండవది అయిన; దివసంబునకున్= రోజునకు; వచ్చి; వసిష్ఠుండు; అవిరత, వ్రత+ఉపవాస, కృశీభూత, శరీరుండు+అయి= ఎడతెగని వ్రతోపవాసాలచేత బక్కచిక్కిన దేహం కలవాడై; ఉన్న, సంవరణున్= ఉండే సంవరుణ్ణి; చూచి; ఆతండు= ఆ సంవరణుడు; తపన, సుత, అయిన= సూర్యుని కూతు రైన; తపతి అందున్ = తపతిపై; బద్ధ+అనురాగుండు+అగుటన్= కట్టివేయబడిన ప్రేమ కలవా డగుటను; తన, యోగదృష్టిన్= తన యోగదృష్టితో; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: ఈ విధంగా సంవరణుడు తలచుకొన్న పన్నెండవ రోజున వసిష్ఠుడు వచ్చి, ఎడతెగని వ్రతోపవాసాలతో కృశించి ఉన్న అతడిని చూచి, అతడు సూర్యపుత్రిక అయిన తపతిపై గాఢమైన ప్రేమ కలిగి ఉన్నా డని తన యోగ దృష్టితో తెలిసికొని.

చ. జగదభివంద్యుఁ డాక్షణమ సమ్మతి సంవరణ ప్రయోజనం
బొగి నొనరింపఁగా నయుతయోజనముల్ చని లోకలోచనుం
డగు దిననాథు నాతతసహస్రకరుం గని సంస్తుతించె న
త్యగణితవేదమంత్రముల నమ్మునినాథుఁ డతిప్రియంబునన్. 85

ప్రతిపదార్థం: జగత్+అభివంద్యుఁడు= లోకంచేత నమస్కరింపదగినవాడు - వసిష్ఠుడు; ఆ, క్షణము+అ= అప్పటికప్పుడే; సమ్మతిన్= అంగీకారంతో; సంవరణ ప్రయోజనంబు= సంవరణునియొక్క పని; ఒగిన్= క్రమంగా; ఒనరింపఁగాన్= చేయటానికి; అయుత; యోజనముల్= పదివేల ఆమడలదూరం; చని= వెళ్ళి; లోక, లోచనుండు+అగు= లోకాలకు కన్నైనవాడగు; దిన, నాథున్= పగటికి ప్రభు వైనవాడిని; ఆతత, సహస్రకరున్= విస్తారమైన వేయికిరణాలు కలవాడిని; కని= చూచి; ఆ+మునినాథుఁడు= ఆ మునిశ్రేష్ఠుడైన, వసిష్ఠుడు; అతి+ప్రియంబునన్= మిక్కిలి ప్రీతితో; అతి+అగణిత, వేదమంత్రములన్= లెక్కలేనన్ని వేదమంత్రాలతో; సంస్తుతించెన్= స్తోత్రం చేశాడు.

తాత్పర్యం: జగత్పూజ్యుడైన వసిష్ఠమహాముని అప్పటి కప్పుడే సంవరణునికోర్కె తీర్చటానికి అంగీకరించి పదివేల ఆమడలు పయనించి, లోకాలకు కన్నైనవాడు, పగటికి ప్రభువు, విస్తారమైన వేయికిరణాలు కలవాడు అయిన సూర్యుడిని చూచి మిక్కిలి ప్రీతితో అనేకవేదమంత్రాలతో స్తోత్రం చేశాడు.

వ. సూర్యుండును వసిష్ఠమహాముని నతిగౌరవంబున సంభావించి 'భవదాగమన ప్రయోజనంబు సెప్పు' మనిన వసిష్ఠుండి ట్లనియె. 86

ప్రతిపదార్థం: సూర్యుండును= సూర్యుడుకూడ; వసిష్ఠమహామునిన్= వసిష్ఠమహర్షిని; అతి, గౌరవంబునన్= మిక్కిలిగౌరవంతో; సంభావించి= పూజించి; భవత్+ఆగమన, ప్రయోజనంబు= మీరు వచ్చిన పని; చెప్పుము+అనినన్= చెప్పండి అనగా; వసిష్ఠుండు= వసిష్ఠుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: సూర్యుడుకూడ వసిష్ఠమహర్షిని మిక్కిలి మర్యాదతో పూజించి 'మీ రాకకు కారణ మేమి? చెప్పం' డని వసిష్ఠుణ్ణి అడిగాడు. అపుడు వసిష్ఠుడు ఈ విధంగా అన్నాడు.

సీ. 'అలఘుండు పౌరవకులశేఖరుండు సం। వరణుఁ డన్వాఁ డనవరత కీర్తి
విదితుండు ధర్మార్థవిదుఁడు నీ పుత్త్రికి। నగణిత గుణములఁ దగు వరుండు
గావున నతనికి దేవిగాఁ దపతి నీ। వలయుఁ; గూఁతులఁ గన్నఫలము దగిన
వరులకు సద్ధర్మచరితుల కీఁ గాన్ప। కాదె!' నావుడు సూర్యుఁ డాదరించి

ఆ. 'వరుఁడు రాజవంశకరుఁడు సంవరణుండ। యనుగుణుండు దీని' కని కరంబు
గారవమున నిచ్చి యా ఋషితోడఁ బు। త్తెంచెఁ దపతిఁ గురుకులాంచితునకు. 87

ప్రతిపదార్థం: అలఘుండు= తక్కువవాడు కానివాడు - అనగా గొప్పవాడు; పౌరవ, కులశేఖరుండు= పూరువుయొక్క వంశానికి శిరోభూషణమైనవాడు; సంవరణుండు; అన్+వాఁడు= అనేవాడు; అనవరత; కీర్తి, విదితుండు= ఎల్లప్పుడు కీర్తిచేత తెలియబడిన వాడు - అనగా కీర్తిచేత ప్రసిద్ధుడు; ధర్మ+అర్థ, విదుఁడు= ధర్మార్థాలను తెలిసినవాడు; నీ పుత్త్రికిన్= నీకుమార్తెకు; అగణిత, గుణములన్= లెక్కలేనన్ని సుగుణాలచేత; తగు, వరుండు= తగిన భర్త; కావునన్; తపతిన్; అతనికిన్, దేవికాన్= అతనికి భార్యగా; ఈవలయున్= ఇయ్యవలసింది; కూతులన్= కుమార్తెల్ని; కన్న= కనినందులకు; ఫలము= ఫలితము; తగిన, వరులకున్= యోగ్యులైనవరులకు; సత్+ధర్మ, చరితులకున్= చక్కని ధర్మంతో కూడిన నడవడి కలవారికి; ఈన్+కాన్పు+అ కాదె= ఇవ్వగలగటమే కదా!; నావుడు= అని అనగా; సూర్యుఁడు; ఆదరించి; దీనికిన్= ఈ తపతికి; వరుఁడు= భర్త (కోరదగినవాడు); రాజవంశకరుఁడు= సంతానంవలన చంద్రవంశాన్ని నిలిపేవాడు; సంవరణుండు+అ= సంవరణుడే;

అనుగుణుండు= తగిన గుణాలు కలవాడు; అని= అని తలచి; కరంబు= మిక్కిలి; గౌరవమునన్= ప్రేమతో; తపతిన్; కురు, కుల+అంచితునకున్= కురుకులంచేత పూజింపబడేవానికి; ఇచ్చి; ఆ ఋషితోడన్= ఆ ఋషివెంట; పుత్తెంచెన్= పంపాడు.

తాత్పర్యం: 'గొప్పవాడు, పూరువుయొక్క వంశానికి శిరోభూషణమైనవాడు, ఎల్లప్పుడు కీర్తిచేత ప్రసిద్ధుడు, ధర్మార్థాలు తెలిసినవాడు అయిన సంవరణుడు అనేకసద్గుణాలచేత నీపుత్రికకు తగినవరుడు. కనుక అతనికి భార్యగా తపతిని ఇవ్వాలి. కుమార్తెలను కన్నందుకు ఫలం -ధర్మబద్ధమైన నడవడిగల తగినవరులకు ఇవ్వగలగటమే కదా!' అని పల్కగా, సూర్యుడు వసిష్ఠునిమాట ఆదరించి, 'చంద్రవంశాన్ని నిలిపేవాడైన సంవరణుడే ఈమెకు తగిన వరు డని - మిక్కిలిప్రీతితో, కురుకులంచేత పూజింపబడే అతనికి తపతి నిచ్చి ఆ ఋషివెంట సాగనంపాడు.

వ. ఇ ట్లొక్కనిమిషంబున మున్నూటయఱువదినాలుగు యోజనంబులు పఱచు నాదిత్యురథంబుతో నశ్రమంబున నరిగి, తపనదత్త యయిన తపతిం దోడ్కొని వచ్చి, వసిష్ఠుండు విధివంతంబుగా సంవరణునకుం దపతి వివాహంబు సేయించెఁ; గావున మహాత్ము లయిన పురోహితులం బడసిన రాజుల కభీష్టంబు లయిన శుభంబు లగుట నిశ్చయం; బిట్లు సంవరణుండు దపతి వివాహంబయి. 88

ప్రతిపదార్థం: ఇట్లు+ఒక్క, నిమిషంబునన్; మున్నూట అరువది నాలుగు యోజనంబులు; పఱచు= పరుగెత్తు; ఆదిత్యు రథంబుతోన్= సూర్యునియొక్క రథంతో; అ(శమంబునన్= (శమలేకుండా; అరిగి= వెళ్ళి; తపన, దత్త, అయిన= సూర్యునిచే ఇవ్వబడినదైన; తపతిన్; తోడ్కొనివచ్చి= తీసికొనివచ్చి; వసిష్ఠుండు; విధివంతంబుగాన్= శాస్త్రపద్ధతిగా; సంవరణునకున్, తపతిన్, వివాహంబు; చేయించెన్, కావునన్; మహత్+ఆత్ములు+ఐన= మహనీయులైన; పురోహితులన్; పడసిన= పొందిన; రాజులకున్; అభీష్టంబులు+అయిన= కోరబడినవైన; శుభంబులు+అగుట; నిశ్చయంబు; ఇట్లు; సంవరణుండు; తపతిన్; వివాహంబు+అయి= పెండ్లి చేసికొని.

తాత్పర్యం: ఈ విధంగా, నిముషానికి మూడువందల అరవైనాలుగు ఆమడలు పరుగెత్తే సూర్యుని రథంతోపాటు శ్రమలేకుండ వెళ్ళి, అత డిచ్చిన తపతిని తనవెంట తీసికొనివచ్చి, వసిష్ఠుడు శాస్త్రోక్తంగా తపతీసంవరణులకు వివాహం జరిపించాడు. అందుచేత మహాత్ములైన పురోహితులను పొందినరాజులకు కోరుకొన్న శుభాలు కలగటం నిశ్చయం. ఈ విధంగా సంవరణుడు తపతిని వివాహం చేసికొని.

క. ఆ తరుణియందుఁ జేతో । జాత సుఖప్రీతిఁ దగిలి శైలాటవులన్
వీతనృపకార్యధర్మ । వ్రాతుం డయి పదియురెండువర్షము లుండెన్. 89

ప్రతిపదార్థం: ఆ, తరుణియందున్= ఆ కాంతయందు; చేతోజాత; సుఖప్రీతిన్= మన్మథ సుఖప్రీతితో; తగిలి= తగులుకొని, ఆసక్తి కలిగి; వీత, నృపకార్య ధర్మవ్రాతుండు+అయి= వదలిన రాచకార్య ధర్మసమూహం కలవాడై; శైల+అటవులన్= కొండలందు, అడవులందు; పదియు, రెండు, వర్షములు= పండ్రెండేండ్లు; ఉండెన్.

తాత్పర్యం: మన్మథసుఖప్రీతితో ఆ తపతితోనే కాపురం చేస్తూ, రాచకార్యాలను, ధర్మాలను వదలి పన్నెండేళ్లు కొండలలో, అడవులలో ఉండిపోయాడు.

వ. 'దానం జేసి మహీతలంబున కనావృష్టి యయిన నెఱింగి వసిష్ఠుండు శాంతికపౌష్టికవిధు లొనరించి, సంవరణుం దోడ్కొని హస్తినాపురంబున కరిగిన నఖిలప్రజకు ననురాగం బయ్యె; ననావృష్టి దోషంబునుం బాసె; నంత సంవరణునకుఁ దపతికిం దాపత్యుండై వంశకరుండు కురుండు పుట్టె, నది మొదలుగా మీరును దాపత్యుల రయితి' రని గంధర్వుండు చెప్పిన నర్జునుండు వెండియు ని ట్లనియె. 90

ప్రతిపదార్థం: దానన్+చేసి= అందువలన; మహీ, తలంబునకున్= భూమండలానికి; అనావృష్టి, అయినన్= వానలేమి ఏర్పడగా; ఎఱింగి= తెలిసికొని; వసిష్ఠుండు; శాంతి, పౌష్టిక, విధులు= శాంతికములు, పౌష్టికములు అయిన వేదకర్మలను; ఒనరించి= చేసి; సంవరణున్= సంవరణుని; తోడ్కొని= తీసికొని; హస్తినాపురంబునకున్= హస్తినాపురానికి; అరిగినన్= వెళ్ళగా; అఖిల= సమస్త; ప్రజకున్= జనులకు; అనురాగంబు+అయ్యెన్= ప్రీతికలిగింది; అనావృష్టి, దోషంబునున్= వానలేమి లోపంకూడ; పాసెన్= తొలగింది; అంతన్= అటు; సంవరణునకున్, తపతికిన్; తాపత్యుండు+ఐ= తపతి కుమారు డై; వంశకరుండు= సంతానం వలన వంశాన్ని నిలిపేవాడేకాక వంశానికి పేరు తెచ్చేవాడు; కురుండు= కురువు; పుట్టెన్; అది, మొదలుగాన్= ఆనాటి నుండి; మీరును; తాపత్యులరు= తపతి సంతానమైనవారు; అయితిరి; అని, = ఆ విధంగా; గంధర్వుండు; చెప్పినన్= చెప్పగా; అర్జునుండు; వెండియున్, మరలా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'దానివలన భూమండలంలో అనావృష్టి ఏర్పడగా, అది తెలిసికొని వసిష్ఠుడు శాంతిక, పౌష్టిక, వైదిక క్రియలు చేసి, సంవరణుడిని తనవెంట పిలిచికొని హస్తినాపురానికి వెళ్ళాడు. ప్రజలంతా ఆనందించారు. అనావృష్టి తొలగింది. తరువాత సంవరణుడిని తనవెంట పిలిచికొని హస్తినాపురానికి వెళ్ళాడు. ప్రజ లంతా ఆనందించారు. అనావృష్టి తొలగింది. తరువాత సంవరణునికి, తపతికి వంశకర్త అయిన కురుడు పుట్టాడు. అప్పటినుండి మీరు కూడా తాపత్యు లయ్యారు, అని గంధర్వుడు చెప్పగా, అర్జునుడు మరల ఇట్లా అన్నాడు.

విశేషం: 'హిమకరుఁదొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్ । క్రమమున వంశకర్త లనఁగా మహినొప్పిన' (1.14) చంద్ర వంశంలోని వంశకర్తల చరిత్రలు పాండవుల చరిత్రకంటె ముందు చెప్పటం మహాభారతంలో కాలక్రమంలో చెప్పే కథాకథనశిల్పం. భరతుని తరువాత కురుమహారాజు జననం చెప్పి ఉండవలసింది. కాని, అంగారపర్ణునికథలో పాండవులు - కౌరవు లనేకాదు, తాపత్యులు అనికూడా వాళ్ళు పిలువబడతా రనే అంశం చెప్పవలసివచ్చినప్పుడు కురుజన్మవృత్తాంతం చెప్పటం జరిగింది. ఇది కార్యకారణసంబద్ధమైన కథాకథనపద్ధతి. చంద్రవంశంలోని రాజులను వంశకర్తలపేర్లతో (అంటే వారి సంతాన మని) పిలిచే పద్ధతి ఉన్నది. అంటే - పాండవులనుకూడా పౌరవు లనీ, భారతు లనీ, కౌరవు లనీ పిలుస్తారు. ఇంతేకాక - వంశకర్తల భార్యల పేర్లతో (వారిసంతాన మని) పిలిచే సంప్రదాయంకూడా ఉన్నది. అటువంటి విశిష్ట గౌరవం ఇద్దరు ముగ్గురికిమాత్రమే దక్కింది. అందులో ముఖ్యులు, తపతి, కుంతి, సత్యవతి. పాండవులను 'తాపత్యు'లని అంగారపర్ణుడు కావా లనే పేర్కొన్నాడు. తీగలాగితే డొంకంతా కదలినట్లు 'మేము తాపత్యుల మె ట్లయ్యాం?' అన్న ప్రశ్నతో తపతీసంవరణోపాఖ్యానం అంతా చెప్పాడు అయితే ఈ కథ వంశకథమాత్రమే కాదు; మరేవంశకర్తజీవితంలోనూ కనపడని పురోహిత మాహాత్మ్యాన్ని చెప్పేకథ. సంవరణమహారాజువలె పాండవులుకూడా పురోహితపురస్సరులై ఉండా లని అంగారపర్ణునిహితబోధ. పురోహితునివలన హితం కలిగిన వంశకర్తకథ విన్న తరువాత, ఆ పురోహితుడైన వసిష్ఠునిమహత్త్వాన్నిగురించి అర్జునుడు తెలిసికొనగోరటం సహజం. ఒక కథలోనుండి మరొక కథ సహజంగా ఉద్భవించే కథాకథన శిల్పం ఇది. నన్నయగారి ప్రసన్నకథాకవితార్థయుక్తికి అత్యంత సహజంగా ఆవిష్కరించిన కథార్థాలు ఈ ఘట్టంలోనే ఉన్నాయి.

క. నుతముగ నస్మత్కుల భూ । పతులకు నాద్యులకుఁ బుణ్యభాగులకుఁ బురో
హితుఁ డయిన వసిష్ఠ మహా। త్మతఁ జెప్పుము వినఁగ వలతు మది నేర్పడఁగన్. 91

ప్రతిపదార్థం: నుతముగన్= కొనియాడదగినట్లుగా; అస్మత్+కుల, భూపతులకున్= నా (మా) యొక్క వంశమందలి రాజులకు; ఆద్యులకున్= మొదటివారలకు; పుణ్యభాగులకున్= పుణ్యదంపతులకు; పురోహితుఁడు+అయిన= పురోహితుడు అయిన; వసిష్ఠ= వసిష్ఠునియొక్క; మహా+ఆత్మతన్= మహిమను; మదిన్= మనస్సునందు; ఏర్పడఁగన్= చెప్పుము; వినఁ గన్+వలతున్= వినటానికి, కోరుకొంటాను.

తాత్పర్యం: మా వంశంలో మొదటివారు, పుణ్యాత్ములు అయిన ప్రభువులకు పురోహితుడుగా ప్రశంస లందుకొన్న వసిష్ఠులవారిమహిమను మనసుకు వచ్చే విధంగా స్పష్టంగా వినా లని ఉన్నది; తెలియజేయండి.

వ. అనిన గంధర్వుం డి ట్లనియె. 92

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; గంధర్వుండు= అంగారపర్ణు డనే గంధర్వరాజు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని అనగా గంధర్వుడైన అంగారపర్ణుడు ఈ విధంగా అన్నాడు.

క. ధృతి నెవ్వని నేని పురో । హితుఁగాఁ బుణ్యమునఁ బడసి యిక్ష్వాకుకులో
దితు లైన పతులు రాజ్యో - న్నతి నొప్పం జేసి రుర్వి నానాక్రతువుల్. 93

ప్రతిపదార్థం: ఇక్ష్వాకు, కుల+ఉదితులు+అయిన= ఇక్ష్వాకువంశంలో జన్మించిన; పతులు= రాజులు; ధృతిన్= సంతోషంతో; ఎవ్వనిన్+ఏని= ఎవరినైతే; పురోహితుఁగాన్= పురోహితునిగా; పుణ్యమునన్= పుణ్యంచేత; పడసి= పొంది; ఉర్విన్= భూమిమీద; రాజ్య+ఉన్నతిన్= రాజ్యముయొక్క గొప్పతనం; ఒప్పన్= ప్రకాశింపగా; నానా, క్రతువుల్= అనేకవిధా లైన యజ్ఞాలు; చేసిరి.

తాత్పర్యం: ఇక్ష్వాకువంశరాజులు పుణ్యవశంచేత ఎవరిని పురోహితునిగా పొంది, రాజ్యగౌరవం ప్రకాశించగా, భూమిమీద పెక్కువిధా లైన యజ్ఞాలు చేశారో.

క. బలమతి కామక్రోధం । బులు రెండు జయింపఁబడి తపోవీర్య బలం
బులఁ జేసి చేయునవి ని । చ్చలు నెవ్వనియేని పాద సంవాహంబుల్. 94

ప్రతిపదార్థం: నిచ్చలున్= ఎల్లప్పుడు; ఎవ్వని+ఏని= ఎవరియొక్క; పాద, సంవాహంబుల్= పాదాలు ఒత్తుటలు; బలము+అఱి= బలం నశించి; కామ, క్రోధంబులు= కామము, క్రోధము; రెండు= రెండూ; జయింపన్+పడి= జయింపబడి; తపోవీర్య బలంబులన్+చేసి= తపముయొక్క ప్రభవాతిశయంవలన; చేయునవి.

తాత్పర్యం: ఎల్లప్పుడు ఎవరి పాద సంవాహనం చేస్తే కామక్రోధాలు రెండూ బలహీనాలై జయింపబడి, తపస్సు యొక్క ప్రభావాతిశయాలచేత చేసే పను లౌతాయో.

విశేషం: తపశ్శక్తియొక్క బలంచేత, కామక్రోధాలు బలహీనమై జయింపబడి నిత్యం ఎవ్వరి పాదసంవాహాలను చేస్తాయో - అంటే ఎవరికి అధీనాలు అవుతాయో అనికూడా చెప్పవచ్చును.

సీ. 'శమహీనుఁ డైన విశ్వామిత్రు చేసిన । యపకారమునఁ జేసి యాత్మసుతులు
యమసదనంబున కరిగిన, వారలఁ । దనతపోవీర్యసత్త్వముల పేర్మిఁ
గ్రమ్మఱింపఁగ శక్తి కలిగియు, వేల న । య్యంబుధి గడవనియట్ల శాంతుఁ
డయి యెవ్వఁడేని కృతాంతకుఁ గడవంగ । నొల్లండ, యట్టి యత్యుగ్రతేజుఁ

ఆ. డగు వసిష్ఠముని మహాత్మతఁ జెప్ప నా । యలవియయ్య'! యనిన నవ్వసిష్ఠ
గాధిసుతుల కేమికారణంబున నిట్టి । వైర మయ్యె నెఱుఁగ వలతు దీని. 95

ప్రతిపదార్థం: శమ, హీనుఁడు+ఐన= శాంతం లేనివాడైన; విశ్వామిత్రు, చేసిన= విశ్వామిత్రుడు చేసిన; అపకారమునన్+చేసి= అపకారంవలన; ఆత్మసుతులు = తన కుమారులు; యమ, సదనంబునకున్=యముని ఇంటికి; అరిగినన్= వెళ్ళగా; వారలన్= వాళ్ళను; తన, తపోవీర్య, సత్త్వముల, పేర్మిన్= తనతపస్సుయొక్క ప్రభావబలాల అతిశయంతో; క్రమ్మఱింపఁగన్= మరలించటానికి; శక్తి కలిగియున్= బలము ఉండియు; వేలన్= చెలియలికట్టను; ఆ+అంబుధి= ఆ సముద్రం; కడవని, అట్లు+అ= దాటనివిధంగానే; శాంతుఁడు+అయి= శాంతం కలవాడై; ఎవ్వఁడు+ఏని= ఎవరైనా; కృత+అంతకున్= యమధర్మరాజును; కడవంగన్= దాటివెళ్ళడానికి; ఒల్లండు+అ= ఇష్టపడడో; అట్టి; అతి+ఉగ్ర, తేజుఁడు= అటువంటి మిక్కిలి భయంకరమైన తేజస్సు కలవాడు; అగు, వసిష్ఠముని; మహత్+ఆత్మతన్=మహానుభావతను; చెప్పన్= చెప్పటానికి; నా, అలవి, అయ్య!= నాకు సాధ్య మౌతుందటయ్యా!; అనినన్= అని అనగా; ఆ+వసిష్ఠ, గాధిసుతులకున్= ఆ వసిష్ఠవిశ్వామిత్రులకు; ఏమి, కారణంబునన్= ఎందువల్ల; ఇట్టి, వైరము+అయ్యెన్= శత్రుత్వం కలిగిందో; దీనిన్= దీనిని; ఎఱుఁగన్ వలతున్= తెలిసికొనగోరుతున్నాను.

తాత్పర్యం: 'శాంతస్వభావం లేని విశ్వామిత్రుడు చేసిన అపకారంవలన, తనకుమారులు యమలోకానికి వెళ్లగా, వాళ్ళను తనతపఃప్రభావంతో మరలించటానికి సమర్థు డై ఉండికూడ, చెలియలికట్టను సముద్రం దాటనట్లే, శాంతుడై, యమధర్మరాజును అతిక్రమించటానికి ఎవరు ఇష్టపడలేదో - అట్లాంటి మహాభయంకరమైన తేజస్సు కల వసిష్ఠమహాముని మహిమను చెప్పటం నా తరమా? అని గంధర్వుడు పల్కగా 'ఆ వసిష్ఠ విశ్వామిత్రులకు ఏ కారణంచేత ఇటువంటివైరం ఏర్పడిందో వినగోరుతున్నాను'.

విశేషం: అలం: ఉపమ.

అంగారపర్ణుఁడు అర్జునునకు వసిష్ఠమహిమ చెప్పుట (సం.1-165-2)

వ. చెప్ప మని యర్జునుం డడిగిన గంధర్వుం డి ట్లని చెప్పెఁ; దొల్లి కన్యాకుబ్జంబున గాధిపుత్త్రుండు విశ్వామిత్రుం డనురాజు నిరమిత్రంబుగా ధాత్రి నేలుచు, నొక్కనాఁడు మృగయార్థం బరిగి, యపారబలసమేతుం డయి ఘోరారణ్యంబున గ్రుమ్మరి, వడంబడి కడు డస్సి వసిష్ఠునాశ్రమం బాశ్రయించిన, నమ్మునివరుండు విశ్వామిత్రు నతిప్రీతిం బూజించి, వానికిని వానిసేనకు నభిమతంబు లైన యాహారంబులు గురియ నందిని యను తన హోమధేనువుం బంచిన నదియు. 96

ప్రతిపదార్థం: చెప్పుము+అని; అర్జునుండు; అడిగినన్; గంధర్వుండు= అంగారపర్ణుడు; ఇట్లు+అని; చెప్పెన్; తొల్లి= పూర్వం; కన్యాకుబ్జంబునన్= కన్యాకుబ్జంలో; గాధిపుత్త్రుండు= గాధియొక్క కుమారుడు; విశ్వామిత్రుండు+అను; రాజు; నిర్+అమిత్రంబుగాన్= శత్రువులు లేకుండ; ధాత్రిన్= భూమిని; ఏలుచున్= పాలిస్తూ; ఒక్కనాఁడు; మృగయా+అర్థంబు= వేటకొరకు; అరిగి= వెళ్ళి; అపార, బల, సమేతుండు+అయి= అంతులేని సైన్యంతో కూడినవాడై; ఘోర+అరణ్యంబునన్= భయంకరమైన అడవియందు; క్రుమ్మరి= తిరిగి; వడన్+పడి= తాపం పొంది; కడున్, డస్సి= మిక్కిలి అలసి; వసిష్ఠ+ఆశ్రమంబు= వసిష్ఠునియొక్క ఆశ్రమాన్ని; ఆశ్రయించినన్= (విశ్రాంతికొరకు) చేరగా; ఆ+ముని, వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు; విశ్వామిత్రున్= విశ్వామిత్రుని; అతి, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; పూజించి; వానికిని = అతనికి; వాని, సేనకున్= అతని సైన్యానికి; అభిమతంబులు+ఐన= ఇష్టములైన; ఆహారంబులు= భోజనాలు; కురియన్= వర్షించుటకై; నందిని; అను, హోమ, ధేనువున్; పంచినన్= ఆజ్ఞాపించగా; అదియున్= ఆ ధేనువు.

తాత్పర్యం: చెప్పవలసిం దని అర్జునుడు అడుగగా, గంధర్వుడు ఈ విధంగా చెప్పాడు. పూర్వం కన్యాకుబ్జంలో గాధికుమారుడు, విశ్వామిత్రుడు అనే రాజు, శత్రువులు లేకుండా భూమిని పరిపాలించాడు. అతడు ఒకనాడు వేట కొరకు అపారమైన సైన్యంతో వెళ్ళి, భయంకరమైన అరణ్యంలో తిరిగి, తాపం పొంది, మిక్కిలి అలసి, విశ్రాంతికొరకు వసిష్ఠుని ఆశ్రమం చేరాడు. ఆ మునిశ్రేష్ఠుడు విశ్వామిత్రుడిని మిక్కిలిప్రేమతో పూజించి, అతనికీ, అతనిసేనకూఇష్ట మైన ఆహారపదార్థాలు సమృద్ధిగా అందజేయటానికి 'నందిని' అనే తన హోమధేనువును ఆజ్ఞాపించాడు. అప్పు డది.

క. ఘృతనదులును, నోదన ప । ర్వతములు, దధి కుల్యములు, నవారిత రసపూ
రిత బహువిధోపదంశో । న్నత పుంజంబులును దత్క్షణంబునఁ గురిసెన్. 97

ప్రతిపదార్థం: ఘృత, నదులునున్= నేతి నదులూ; ఓదన పర్వతములు= అన్నపు కొండలూ; దధి కుల్యములున్= పెరుగు కాలువలూ; అవారిత, రసపూరిత, బహువిధ, ఉపదంశ+ఉన్నత, పుంజములును= ఆపుటకు సాధ్యం కాని రసంతో నిండిన అనేకవిధాలైన ఊరుగాయలయొక్క గొప్పరాసులూ; తద్+క్షణంబునన్= ఆ క్షణంలోనే; కురిసెన్= కురిపించింది.

తాత్పర్యం: నేతినదులను, అన్నపు కొండలను, పెరుగుకాల్వలను, ఎడతెరపి లేని రసంతో నిండిన అనేక విధాలైన గొప్ప ఊరుగాయల రాసులను అప్పటి కప్పుడే వర్షించింది.

వ. ఇట్లు చతుర్విధాహారంబుల నందఱం దృప్తులం జేసి యున్న యా నందినిం జూచి విశ్వామిత్త్రుండు విస్మితుం డయి యాత్మగతంబున. 98

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; చతుర్విధ+ఆహారంబులన్= నాలుగురకాలైన ఆహారపదార్థాలతో; అందఱన్= అందరినీ; తృప్తులన్+చేసి= సంతృప్తి కలిగించి; ఉన్న+ఆ; నందినిన్= ఆ నందినీ ధేనువును; చూచి; విశ్వామిత్రుండు; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై; ఆత్మ, గతంబునన్= తన మనస్సులో.

తాత్పర్యం: ఈ విధంగా భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య లనే నాలుగువిధాలైన ఆహారపదార్థాలతో అందరినీ తృప్తిపరచి ఉన్న ఆ నందినీధేనువును చూచి, విశ్వామిత్రుడు ఆశ్చర్యపడి, తన మనస్సులో.

మధ్యాక్కర.

మృదురోమములును, శంకునిభకర్ణముల్, మెత్తని వలుఁద
పొదుగును, నిడుదచన్నులును గుఱుచలై పొలుచు కొమ్ములును,
సదమలశరదిందుశంఖనిభ మైన చాయయుఁ గలుగు
మొద వివి నిధి చేరినట్లు చేరె నిమ్మునికిఁ బుణ్యమున. 99

ప్రతిపదార్థం: మృదురోమములును= మృదువైన వెంట్రుకలూ; శంకు, నిభ, కర్ణముల్= బాణాగ్రాలతో సమానమైన చెవులూ; మెత్తని, వలుద, పొదుగును= మెత్తని పెద్దదియైన పొదుగును; నిడుద, చన్నులును= పొడవైన చన్నులూ; కుఱుచలు+ఐ= పొట్టివై; పొలుచు= ఒప్పు; కొమ్ములును= కొమ్ములూ; సత్+అమల, శరద్+ఇందు, శంఖ, నిభము+ఐన= నిర్మలమైన శరత్కాల చంద్రునితో, శంఖంతో సమానమైన; చాయయున్= రంగును; కలుగు=కలిగిన; మొదవు= పాడి ఆవు; ఇది; నిధి= ధనపు పాతర; చేరినట్లు= చేరిన విధంగా; పుణ్యమునన్= పుణ్యంచేత; ఈ+మునికిన్= ఈ వసిష్ఠమహామునికి; చేరెన్.

తాత్పర్యం: మెత్తని వెంట్రుకలు, బాణాగ్రాలవంటి చెవులు, మెత్తని పెద్దపొదుగు, పొడవైన చన్నులు, ఒప్పిదమయిన పొట్టి కొమ్ములు; నిర్మలమైన శరత్కాల చంద్రునితో; శంఖంతో సమానమైన రంగు కల ఈ పాడిఆవు పెన్నిధి చేరినట్లు పుణ్యంవలన ఈ వసిష్ఠమహామునిని చేరింది.

విశేషం: అలం: ఉపమ. చంద్రునిలో మచ్చ ఉంటుంది. హోమధేనువు నందిని రంగు ఏ మాత్రం మచ్చలేని తెలుపు - అని తెలపటానికి సదమలశరదిందుశంఖనిభమైన చాయ అనటం జరిగింది. నన్నయ ఈ ఆశ్వాసంలో అయిదు మధ్యాక్కరలను వాడాడు. అందులో ఇది మొదటిది. ఆదిపర్వంలో ఎక్కువ సంఖ్యలో మధ్యాక్కరలు వాడిన ఆశ్వాసం ఇదే. (సంపా.)

వ. అని పెద్దయుం బ్రొద్దు చింతించి తత్పరిగ్రహకుతూహలహృదయుం డయి విశ్వామిత్రుండు వసిష్ఠున కి ట్లనియె. 100

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి; తద్+పరిగ్రహ, కుతూహల, హృదయుండు+అయి= దానిని తీసికొనటంలో ఉబలాటపడే హృదయం కలవాడై; విశ్వామిత్రుండు; వసిష్ఠునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని చాలాసేపు ఆలోచించి ఆ ఆవును తీసికొనాలనే ఉబలాటపడే హృదయంతో విశ్వామిత్రుడు వసిష్ఠునితో ఈ విధంగా అన్నాడు.

తే. దీనికంటెను నొప్పెడి వాని నొక్క। లక్ష మొదవుల నిచ్చెద నక్షయముగ
రాజ్యమయిన నిచ్చెద జగత్పూజ్య! నాకు। నిమ్ము నీ హోమధేనువు నెమ్మితోడ. 101

ప్రతిపదార్థం: జగత్+పూజ్య!= లోకంచేత పూజింపదగినవాడా!; దీని కంటెను; ఒప్పెడి, వానిన్= బాగున్నవాటిని; ఒక్క లక్ష, మొదవులన్= పాడి ఆవులను; అక్షయముగన్= తరుగకుండ; ఇచ్చెదన్; రాజ్యము+అయినన్; ఇచ్చెదన్; నాకున్; నీ, హోమధేనువు; నెమ్మితోడన్= ప్రీతితో; ఇమ్ము= నీ యొక్క హోమధేనువును ఇష్టంతో ఈయవలసింది.

తాత్పర్యం: ప్రపంచంచేత పూజలు పొందదగిన ఓ వసిష్ఠమహర్షీ! దీనికంటె బాగున్న ఒక లక్షపాడిఆవులను తరుగులేకుండా నీ కిస్తాను. రాజ్యమైనా ఇస్తాను. ప్రీతితో నీ హోమధేనువును నా కిమ్ము.

చ. అనిన వసిష్ఠుఁ డి ట్లనియె; 'నంత ధనంబును నట్టి రాజ్యముం
గొననగు నయ్య యిచ్చిడిపికుఱ్ఱికి? నీ కిది యేల? యేను దీ
నన పితృదేవతాతిథిజనంబులఁ దృప్తులఁ జేయుచుండుదున్;
జననుత! దీనిఁ బ్రోచుటయ చాలుఁ దపస్వుల కేల సంపదల్?' 102

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; వసిష్ఠుఁడు; ఇట్లు+అనియెన్; ఈ+చిడిపి, కుఱ్ఱికిన్= ఈ చిన్న ఆవునకు; అంత, ధనంబునున్= అంత అధికధనాన్ని; అట్టి; రాజ్యమున్; కొనన్+అగునయ్య= తీసికొనవచ్చునా; నీకున్; ఇది; ఏల?= ఇది ఎందుకు; ఏను; దీనన్+అ= నేను ఈ ఆవుచేతనే; పితృదేవతా+అతిథి, జనంబులన్= పితృదేవతలను, అతిథులను; తృప్తులను= తృప్తి పొందినవారిగా; చేయుచున్+ఉండుదున్= చేస్తూ ఉంటాను; జన, నుత!= జనులచే పొగడబడువాడా!; దీనిన్= ఈ ధేనువును; ప్రోచుటయు+అ= కాపాడుటయే; చాలున్= రక్షించుకొంటేనే చాలు; తపస్వులకున్= ఋషులకు; సంపదల్; ఏల?

తాత్పర్యం: పై విధంగా విశ్వామిత్రుడు పలుకగా, వసిష్ఠుడు ఇట్లా అన్నాడు - 'ఈ చిన్ని ఆవుకై అంత ఎక్కువ ధనాన్ని, అంత గొప్పరాజ్యాన్ని తీసికొనవచ్చునా? ఇది నీకు ఎందుకు? నేను దీనిచేత పితృదేవతలను, అతిథి జనులను తృప్తిపరుస్తూ ఉంటాను. ప్రజలచేత పొగడబడే ఓ విశ్వామిత్రా! ఈ ఆవును ఒక్కదానిని కాపాడుకొంటే చాలు; ఋషులకు సంపద లెందుకు?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. 'దీని నొరున కీఁ గా' దనిన నలిగి విశ్వామిత్రుండు 'నేను క్షత్రియుండ నిగ్రహానుగ్రహసమర్థుండ, నీవు బ్రాహ్మణుండవు శాంతుండ; వేమి సేయ నోపుదు? దీనికి లక్షమొదవుల నీఁబోయిన నొల్లవ యిమ్మొదవు నవశ్యంబును బలిమి నైనం బరిగ్రహింతు' నని నందినిం బట్టికొనఁ బంచినం బలుకక వసిష్ఠుండు చూచుచుండె. 103

ప్రతిపదార్థం: దీనిని= ఈ ఆవును; ఒరునకున్= ఇతరునికి; ఈన్+కాదు= ఇచ్చుటకు వీలేకాదు; అనినన్=అని చెప్పగా; అలిగి= కోపించి; విశ్వామిత్రుండు; నేను; క్షత్రియుండన్; నిగ్రహ+అనుగ్రహ, సమర్థుండన్= శిక్షించుటకు, దయచూపుటకు శక్తి కలవాడను; నీవు; బ్రాహ్మణుండవు; శాంతుండవు= శాంత గుణం కలవాడవు; ఏమి; చేయన్+ఓపుదు= ఏమి, చేయగలవు; దీనికిన్= ఈ ఆవుకు; లక్ష మొదవులన్= ఒక లక్ష పాడి ఆవులను; ఈన్+పోయినన్= ఇవ్వబోగా; ఒల్లవు+అ= ఇష్టపడ వైతివి; ఈ+మొదవున్= ఈ పాడిఆవును, ఈ నందినీ ధేనువును; అవశ్యంబును= తప్పక; బలిమిన్+ఐనన్= బలవంతంగా నైనాసరే; పరిగ్రహింతున్= తీసికొని పోతాను; అని= అని అంటూ; నందినిన్= నందినిని; పట్టికొనన్= పట్టుకొనటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా; పలుకక= మారుమాటాడకుండా; వసిష్ఠుండు; చూచుచున్+ఉండెన్= చూస్తూ ఉండిపోయాడు.

తాత్పర్యం: 'దీనిని మరొకరికి ఇవ్వటానికి వీలు కాదు' అనగా విశ్వామిత్రుడు కోపించి, 'నేను క్షత్రియుడను. శిక్షించటానికి; దయచూపటానికి సమర్థుడను. నీవు బ్రాహ్మణుడవు. శాంతుడవు. ఏమి చేయగలవు? దీనికి బదులుగా

లక్షపాడిఆవులను ఇవ్వబోతే వద్దన్నావు. ఈ ఆవును బలాత్కారంగా నైనా తప్పక గ్రహిస్తాను' అని నందినిని పట్టుకొనేందుకు ఆజ్ఞాపించగా, వసిష్ఠుడు మారు మాటాడక చూస్తూ ఉండిపోయాడు.

ఆ. పరులవలన బాధ పొరయకుండఁగ సాధు । జనుల ధనము గాచు జనవిభుండు
కరుణ తప్పి తాన హరియించువాఁ డగు । నేని సాధులోక మేమి సేయు?. 104

ప్రతిపదార్థం: పరులవలనన్= ఇతరులవలన; బాధ; పొరయక+ఉండఁగన్= కలుగకుండ; సాధుజనుల, ధనము= మంచివారి ధనాన్ని; కాచు= కాపాడు; జనవిభుండు= రాజు; కరుణ, తప్పి= దయలేక; తాను+అ= తానే; హరియించువాఁడు అగున్+ఏని= అపహరించే వాడైతే; సాధు, లోకము= సాధువుల సమూహం; ఏమి, చేయున్= ఏమి చేయగలుగుతుంది.

తాత్పర్యం: ఇతరులవలన బాధ కలుగకుండ, సాధుజనుల ధనాన్ని కాపాడవలసిన ప్రభువే దయ తప్పి, తాను అపహరించేవా డైతే; సాధు జనులసమూహం ఏం చేయగలదు?

వ. ఇట్లు విశ్వామిత్రుండు వసిష్ఠ హోమధేనువుం బట్టికొనఁ బంచిన పట్టీక జనులవలని కశాదండతాడనంబులం బీడింపం బడి యఱచుచు వసిష్ఠునొద్దకు వచ్చి యి ట్లనియె. 105

ప్రతిపదార్థం: ఇట్లు, విశ్వామిత్రుండు; వసిష్ఠ, హోమధేనువున్= వసిష్ఠుని హోమధేనువును; పట్టికొనన్= పట్టుకొనుటకు; పంచినన్= పంపగా; అది= ఆ ధేనువు; పట్టు+ఈక= పట్టుపడక; జనులవలని= సైనికులవలన; కశా, దండ, తాడనంబులన్= కొరడాల యొక్క, కఱ్ఱలయొక్క దెబ్బలతో; పీడింపన్+పడి= బాధింపబడి; అఱచుచున్= అరుస్తూ; వసిష్ఠు+ఒద్దకు= వసిష్ఠుని దగ్గరకు; వచ్చి, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా విశ్వామిత్రుడు, వసిష్ఠుని హోమధేనువును పట్టుకొనేందుకు తన సైనికులను పంపగా, అది పట్టువడక, వాళ్ళ కొరడాల, కర్రల దెబ్బలచేత బాధింపబడి అరుస్తూ వసిష్ఠుని దగ్గరికి వచ్చి ఇట్లా పలికింది.

క. 'న న్నేల యుపేక్షించితి? రిన్నరుల కధర్మపరుల కిచ్చితిరే? వి
ద్వన్నాథ! యిదియు ధర్మువె?' । యన్నను విని పలుకకుండె నమ్ముని యంతన్. 106

ప్రతిపదార్థం: విద్వత్+నాథ!= పండితులకు ప్రభువైనవాడా - ఓ వసిష్ఠా!; నన్నున్+ఏల= న న్నెందుకు; ఉపేక్షించితిరి= నా సంగతి ఎందుకు పట్టించు కొనకుండ అశ్రద్ధతో ఉన్నారు; అధర్మపరులకున్= అధర్మమే ప్రధానంగా కలవాళ్ళకు; ఈ+నరులకున్= ఈ ప్రజలకు; ఇచ్చితిరి+ఏ; ఇచ్చినారా!; ఇదియు= ఇది; ధర్మువు+ఎ= ధర్మమా; అన్నను= అని నందిని అనగా; విని; ఆ+ముని= ఆ వసిష్ఠ మహాముని; పలుకక+ఉండెన్= మాటాడకుండా ఉన్నాడు; అంతన్= తరువాత.

తాత్పర్యం: పండితులకు ప్రభు వైన ఓ వసిష్ఠమహామునీ! మీరు న న్నెందుకు విడిచారు? అధర్మపరులైన ఈ నరులకు ఎందు కిచ్చారు? ఇది ధర్మమా? అని పల్కగా, ఆ ముని మౌనంగానే ఉండిపోయాడు. తరువాత.

వ. తదీయాభిప్రాయం బెఱింగి నందినియుఁ దనవత్సంబుఁ బట్టికొన వచ్చిన జనుల కలిగి చిందఱరేఁగి నిదాఘ సమయమధ్యందినదినకరమూర్తియుం బోలె దుర్నిరీక్ష్య యయి, యంగవిక్షేపంబున నంగారవృష్టిఁ గురియుచు, వాలంబున శబరులను, శకృన్మూత్రంబుల శక యవన పుండ్ర పుళింద ద్రవిళ సింహళులను, ఫేనంబున దరదబర్బరు లను బుట్టించిన. 107

ప్రతిపదార్థం: తదీయ+అభిప్రాయంబు= అతని యొక్క అభిప్రాయాన్ని; ఎఱింగి= తెలిసికొని; నందినియున్= నందినికూడా; తన వత్సంబున్= తన దూడను; పట్టికొనన్= పట్టుకొనుటకై; వచ్చిన= వచ్చిన; జనులకున్= జనానికి; అలిగి= కోపించి; చిందఱరేగి= ఆవేశంతో చెలరేగి; నిదాఘ, సమయ, మధ్యందిన, దినకరమూర్తియున్+పోలెన్= వేసవికాలంలోని మధ్యాహ్న సూర్యుని ఆకారం వలె; దుర్నిరీక్ష్య+అయి= చూడ సాధ్యం గాని దై; అంగ, విక్షేపంబునన్= దేహాన్ని విదిలించటంచేత; అంగారవృష్టిన్= నిప్పుల వానను; కురియుచున్= కురిపిస్తూ; వాలంబునన్= తోకనుండి; శబరులను; శకృత్+మూత్రంబులన్= పేడనుండి, పంచితంనుండి; శక, యవన, పుండ్ర, పుళింద, ద్రవిళ, సింహళులను; ఫేనంబునన్= నురుగునుండి; దరద, బర్బరులను; పుట్టించినన్= పుట్టించగా.

తాత్పర్యం: వసిష్ఠుని అభిప్రాయాన్ని తెలిసికొని నందినికూడ, తన దూడను పట్టుకొనటానికి వచ్చిన జనులను చూచి, కోపించి ఆవేశంతో చెలరేగి, వేసవికాలంలోని మధ్యాహ్నసూర్యునివలె తేరిపార చూడరానిదై, దేహాన్ని విదిల్చి, నిప్పులవాన కురిపిస్తూ, తోకనుండి శబరులను, మలమూత్రాలనుండి శక, యవన, పుండ్ర, పుళింద, సింహళులను, నురుగునుండి దరద బర్బరులను పుట్టించగా.

క. నలి రేఁగి కడఁగి తద్బల । ములు విశ్వామిత్రు సైన్యముల కేనుమడుం
గులు పెరిఁగి మూఁడుయోజన ।ములు వాఱఁగ నెగిచె నొక్కమొగిఁ బ్రతిబలమున్. 108

ప్రతిపదార్థం: నలిరేఁగి= విజృంభించి; కడఁగి= పూని; తత్+బలములు= ఆ సైన్యములు - శబర, శక, యవన, పుండ్ర, పుళింద, ద్రవిళ, సింహళ సైన్యములు; విశ్వామిత్రు, సైన్యములకు= విశ్వామిత్రునియొక్క సేనలకు; ఏను, మడుంగులు= అయిదురెట్లు; పెరిఁగి; ప్రతిబలమున్= శత్రుసైన్యాన్ని - అనగా విశ్వామిత్రుని సైన్యాన్ని; ఒక్క మొగిన్= ఒక్క పూనికతో; మూఁడు, యోజనముల్= మూడు ఆమడలు; పాఱఁగన్= పరుగెత్తేటట్లు; ఎగిచెన్= తరిమెను.

తాత్పర్యం: నందినినుండి పుట్టిన ఆ సైన్యాలు చెలరేగి, విశ్వామిత్రుని సైన్యాలకంటె అయిదురెట్లు అధికమై, శత్రుసైన్యాన్ని ఒక్కఊపున మూడామడలు పరుగెత్తే విధంగా తరిమివేశాయి.

వ. అట్టి బ్రహ్మతేజోజనితం బయిన ప్రభావంబుఁ జూచి విశ్వామిత్రుండు విలక్షముఖుం డై, క్షాత్రబలంబు నిందించి, యెల్ల బలంబులకు మిక్కిలి తపోబలంబ యని. 109

ప్రతిపదార్థం: అట్టి, బ్రహ్మతేజస్+జనితంబు+అయిన= బ్రాహ్మణుని తేజస్సునుండి పుట్టిన దైన; ప్రభావంబున్= మహిమను; చూచి; విశ్వామిత్రుండు; విలక్ష, ముఖుండు+ఐ= సిగ్గుపడిన ముఖం కలవా డై; క్షాత్ర, బలంబు= క్షత్రియబలాన్ని; నిందించి; ఎల్ల, బలంబులకున్= అన్ని బలాలకు; మిక్కిలి= ఎక్కువైనది; తపస్+బలంబు+అ= తపోబలమే; అని.

తాత్పర్యం: అట్టి బ్రాహ్మణ తేజస్సునుండి పుట్టిన మహిమను చూచి, విశ్వామిత్రుడు సిగ్గుపడి, క్షత్రియబలాన్ని నిందించి, అన్ని బలాలకంటె ఎక్కువైనది తపోబలమే అని.

చ. పొలుపగు రాజ్యసంపదుపభోగములెల్లఁ దృణంబుగా మదిం
దలఁచి విరక్తుఁ డై విడిచి, దారుణశైలవనాంతరంబులన్
వెలయఁ దపంబు సేసి, గుణవిశ్రుతుఁడై పడసెన్ మహాతపో
బలమున సర్వసంపదలు బ్రహ్మఋషిత్వము దివ్యశక్తియున్. 110

ప్రతిపదార్థం: పొలుపు+అగు= స్థిరమైన; రాజ్య, సంపద్+ఉపభోగములు= రాజ్యసందవలని భోగానుభవాలు; ఎల్లన్= అన్నింటిని; తృణంబుగాన్= ఒక్క గడ్డిపరకగా; మదిన్; తలఁచి; విరక్తుఁడు+ఐ= వైరాగ్యభావం పొందినవా డై; విడిచి= వదలిపెట్టి; దారుణ, శైల, వన+ అంతరంబులన్= భయంకరమైన కొండల, అడవుల మధ్య; వెలయన్= ఒప్పునట్లు; తపంబు; చేసి; గుణ, విశ్రుతుఁడు+ఐ= గుణాలచే ప్రసిద్ధుడై; మహా, తపస్+బలమునన్= గొప్ప తప శ్శక్తిచేత; సర్వ, సంపదలు; బ్రహ్మ ఋషిత్వము= బ్రహ్మర్షి అగుటను; దివ్య, శక్తియున్= దేవతాసంబంధమైన మహిమను; పడసెన్= పొందెను.

తాత్పర్యం: స్థిరమైన రాజ్యసంపదతో అనుభవించే భోగా లన్నింటిని గడ్డిపరకగా భావించి, విరక్తి చెంది, వాటిన న్నింటిని విడిచి, భయంకరమైన కొండలు, అడవుల మధ్యకు వెళ్ళి, గొప్పతపస్సు చేసి, సద్గుణాలతో ప్రసిద్ధ డై తపోమహిమవలన సర్వసంపదలను, బ్రహ్మర్షిత్వాన్ని, దివ్యశక్తిని పొందాడు.

వ. ఆ విశ్వామిత్రుం డిక్ష్వాకు కుల సంభవు డైన కల్మాషపాదుం డను రాజునకు యాజకత్వం బపేక్షించి తత్పురోహితుం డైన వసిష్ఠుతో బద్ధవైరుం డయి, తదపకారంబు రోయుచున్నంత, నొక్కనాఁడు కల్మాషపాదుండు వేఁట పోయి, రమ్యారణ్య భ్రమణ ఖిన్నుం డయి, విశ్రమార్థంబు వసిష్ఠాశ్రమంబునకుం జనువాఁడు దన కభిముఖుం డయి వచ్చువాని వసిష్ఠ పు త్రుం బుత్త్రశతాగ్రజు నధికతపశ్శక్తియుక్తు శక్తియనుమహామునిం గని, తెరువు దొలంగు మని రాజాభిమానంబున మెచ్చక పలికిన, నమ్మునివరుం డి ట్లనియె. 111

ప్రతిపదార్థం: ఆ, విశ్వామిత్రుండు, ఇక్ష్వాకు, కుల, సంభవుండు+అయిన= ఇక్ష్వాకువంశంలో, జన్మించినవా డైన; కల్మాష పాదుండు+అను, రాజునకు; యాజకత్వంబు= యజ్ఞం చేయించే వా డగుటను; అపేక్షించి= కోరి; తద్+పురోహితుండు= అతని యొక్క పురోహితుడు; అయిన, వసిష్ఠుతో; బద్ధవైరుండు+ఐ= కట్టుబడిన వైరం గలవా డై - అనగా మనస్సున తీవ్రంగా నిలిచిన పగ కలవా డై; తద్+అపకారంబు= ఆ వసిష్ఠునికి కీడును; రోయుచున్= వెదకుతూ; ఉన్నంతన్= ఉండగా; ఒక్కనాఁడు; కల్మాషపాదుండు; వేఁట పోయి; రమ్య+అరణ్య, భ్రమణ, ఖిన్నుండు+అయి= అందమైన అడవులలో తిరగటంచేత బడలిక నొందిన వాడై; విశ్రమ+అర్థంబు= విశ్రాంతికొరకు; వసిష్ఠ+ఆశ్రమంబునకున్= వసిష్ఠునియొక్కఆశ్రమానికి; చను వాఁడు= వెళ్లేవాడు; తనకు+అభిముఖుండు+అయి= తనకు ఎదురై; వచ్చు, వానిన్= వస్తున్న వాడిని; వసిష్ఠ, పుత్త్రున్= వసిష్ఠుని కుమారుణ్ణి; పుత్త్ర, శత+అగ్రజున్= పుత్త్రులు నూఱుగురియందు పెద్దవాడిని; అధిక, తపస్+శక్తి, యుక్తున్= మిక్కిలి తపోబలంతో కూడుకొన్నవాడిని; శక్తి, అను; మహా, మునిన్; కని= చూచి; తెరువు= మార్గం; తొలంగుము+అని; తప్పుకొమ్మని; రాజ+ అభిమానమునన్= రాజుననేగర్వంతో; మెచ్చక= లక్ష్యపెట్టక; పలికినన్= పలుకగా; ఆ+ముని వరుండు= ఆ మునిశ్రేష్ఠుడు (శక్తి); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విశ్వామిత్రుడు ఇక్ష్వాకువంశంలో జన్మించిన కల్మాషపాదు డనే రాజుకు యాజకుడు కావా లని కోరి, అతని పురోహితుడైన వసిష్ఠునితో తీవ్రవైరం కలవాడై, అతనికి అపకారం చెయ్యా లని ఆలోచిస్తుండగా, ఒకనాడు కల్మాషపాదుడు వేటకు పోయి, అందమైన అడవులలో తిరిగి, ఆ అలసట తీర్చుకోవటానికి వసిష్ఠుని ఆశ్రమానికి వెళ్తూ, తనకు ఎదురుగా వస్తున్న వసిష్ఠపుత్రుడిని చూచాడు. అతడు నూరుమందిపుత్రులలో పెద్దవాడు; అధికతపశ్శక్తి కలవాడు; శక్తి అను పేరు గలవాడు, మహాముని. అతడిని చూచి కల్మాషపాదుడు రాజుననేగర్వంతో త్రోవనుండి తప్పుకొ మ్మని అతడిని లక్ష్యపెట్టకుండా పలికాడు. అప్పుడు ఆ మునిశ్రేష్ఠుడు (శక్తి) ఇట్లా అన్నాడు.

ఆ. ఎట్టి రాజులును మహీసురోత్తము లెదు । రరుగుదెంచు నప్పు డధికభక్తిఁ
దెరలి ప్రియము వలికి తెరువిత్తు రిట్టిద । ధర్మ; వీవు దీనిఁ దలఁప వెట్టు? 112

ప్రతిపదార్థం: ఎట్టి రాజులును= ఎంతటి రాజులైనా; మహీసుర+ఉత్తములు= బ్రాహ్మణోత్తములు; ఎదురు+అరుగు దెంచునప్పుడు= ఎదురుగా వచ్చునపుడు; అధికభక్తిన్= మిక్కిలి భక్తితో; తెరలి= తొలగి; ప్రియము= ఇంపైన మాటను; పలికి; తెరువు= మార్గము; ఇత్తురు (ఇచ్చుదురు) = ఇస్తారు; ఇట్టిది+అ, ధర్మువు= ఇదే ధర్మం; నీవు; దీనిన్= ఈ ధర్మాన్ని; తలఁపవు+ఎట్టు= ఎందుచేత దీనిని ఆలోచించవు.

తాత్పర్యం: ఎంత గొప్పరాజులైనా బ్రాహ్మణు లెదురుగా వచ్చినప్పుడు, మిక్కిలిభక్తితో తాము ప్రక్కకు తొలగి, ప్రియంగా మాటాడి, దారి యిస్తారు. ఇది ధర్మం. దీన్నిగురించి నీ వెందుకు ఆలోచించటం లేదు?

శక్తిమహాముని కల్మాషపాదుని శపియించుట (సం.1-166-7)

వ. 'ఏను ధర్మపథంబున నున్నవాఁడ; నేల తొలంగుదు'? ననిన నలిగి కల్మాషపాదుండు దనచేతి కశకోలనమ్మునీంద్రుని వ్రేసిన నవమానితుం డయి కోపారుణితనయనంబుల నతనిం జూచి 'నీవు రాక్షసభావంబున నకారణంబ నాకు నికారంబు సేసితి కావున రాక్షసుండ వయి మనుష్యపిశితం బశనంబుగా నుండు' మని శాపం బిచ్చినఁ, గల్మాషపాదుం డమ్మహామునివరు వసిష్ఠతనయుంగా నెఱింగి 'నాకు శాపవ్యపాయంబు ప్రసాదింప వలయు' నని ప్రార్థించుచున్న నచ్చోటికి విశ్వామిత్రుండు వచ్చి వారలు దన్నెఱుంగకుండ నంతర్హితుం డయి కల్మాషపాదు నంతర్గతుం డయి యుండ, నొక్కరక్కసుం గింకరుం డను వానిం బంచిన వాఁడు విశ్వామిత్రునాదేశంబునను, శక్తిశాపంబుననుం జేసి కల్మాషపాదునంతరాత్మ నావేశించి యున్నంత. 113

ప్రతిపదార్థం: ఏను= నేను; ధర్మ, పథంబునన్= ధర్మమార్గంలో; ఉన్న, వాఁడన్= ఉన్నాను; ఏల= ఎందుకు; తొలంగుదున్= తొలగుతాను; అనినన్= అని అనగా; అలిగి= కోపించి, అవమానింపబడినవాడై; కోప+అరుణిత, నయనంబులన్= కోపంచేత ఎఱ్ఱవిగా చేయబడిన కన్నులతో; అతనిన్= ఆ రాజును; చూచి; నీవు, రాక్షస భావంబునన్= నీవు రాక్షస బుద్ధిచేత; అకారణంబు+అ= కారణం లేకుండానే; నాకున్; నికారంబు= అవమానం; చేసితి(వి)= చేసితివి; కావునన్= కాబట్టి; రాక్షసుండవు+ అయి; మనుష్య, పిశితంబు= మానవ మాంసం; అశనంబుగాన్= ఆహారంగా; ఉండుము+అని; శాపంబు; ఇచ్చినన్; కల్మాషపాదుండు; ఆ+మహా, మునివరున్= ఆ మహర్షి శ్రేష్ఠుని; వసిష్ఠ, తనయున్+కాన్= వసిష్ఠునియొక్క కుమారునిగా; ఎఱింగి= తెలిసికొని; నాకున్, శాప, వ్యపాయంబు= శాపముయొక్క తొలగింపును; ప్రసాదింపవలయున్+అని= దయతో ఇవ్వవలసిం దని; ప్రార్థించుచున్నన్= వేడుకొంటూ ఉండగా; ఆ+చోటికిన్= ఆచోటికి; విశ్వామిత్రుండు; వచ్చి; వారలు; తన్నున్+ఎఱుంగకుండన్= తనను తెలియకుండా; అంతర్హితుండు+అయి= చాటున నున్నవా డై; కల్మాషపాదున్; అంతర్గతుండు+అయి= కల్మాషపాదుని లోపల చేరి; ఉండన్= ఉండుటకు; ఒక్క, రక్కసున్= ఒక్క రాక్షసుడిని; కింకరుఁడు; అను, వానిన్; పంచినన్= ఆజ్ఞాపించగా; వాడు= ఆ కింకరుడు; విశ్వామిత్రు+ఆదేశంబునను= విశ్వామిత్రుని ఆజ్ఞచేత; శక్తి, శాపంబుననున్+చేసి= శక్తియొక్క శాపంవలన; కల్మాషపాదు+అంతరాత్మన్= కల్మాషపాదునియొక్క మనస్సును; ఆవేశించి= ప్రవేశించి; ఉన్న+అంతన్= ఉండిన అనంతరం.

తాత్పర్యం: 'నేను ధర్మమార్గంలో ఉన్నాను. ఎందుకు తొలగుతాను' అని పల్కగా కోపించి కల్మాషపాదుడు తన చేతికొరడాకర్రతో ఆ మునీశ్వరుడిని కొట్టాడు. ఆ విధంగా అవమానింపబడిన ఆ ముని, కోపంతో ఎరుపెక్కిన కళ్ళతో అతడిని చూచి నీవు రాక్షసబుద్ధితో అకారణంగా నన్ను అవమానించావు. కనుక రాక్షసుడ వై నరమాంసం ఆహారంగా జీవించు' మని శాపమిచ్చాడు. అప్పుడు కల్మాషపాదుడు అతణ్ణి వసిష్ఠుని కుమారునిగా గుర్తించి 'శాపవిమోచనం ప్రసాదించండి' అని ప్రార్థిస్తూ ఉండగా - విశ్వామిత్రుడు అక్కడికి వచ్చి, కనబడకుండ దాగి కల్మాషపాదుని మనస్సులో చేరవలసిం దని కింకరు డనే రాక్షసుడిని ఆజ్ఞాపించాడు. వాడు విశ్వామిత్రుని ఆజ్ఞతో శక్తిశాపంతో కల్మాషపాదుని అంతరాత్మలో ప్రవేశించాడు. ఆ పరిస్థితిలో.

తే. రాక్షసావిష్టుఁ డైనప్డు రాజ్యలీల । విడిచి త న్నెఱుంగక, తదావేశరహితుఁ
డైన యప్పుడు రాచకార్యంబులందు । బద్ధబుద్ధి యై కల్మాషపాదుఁ డుండె. 114

ప్రతిపదార్థం: కల్మాషపాదుఁడు; రాక్షస+ఆవిష్టుఁడు= రాక్షసునిచేత ఆవేశింపబడినవాడు; అయినప్డు= అయిన సందర్భంలో; రాజ్యలీలన్= రాజ్యవిలాసాలను; విడిచి; తన్నున్+ఎఱుంగక= తనను తాను తెలియక; తద్+ఆవేశ, రహితుఁడు+అయిన, అప్పుడు= ఆ రాక్షసుడు ఆవేశించనప్పుడు; రాచకార్యంబులందు; బద్ధ, బుద్ధి+ఐ= కట్టుబడిన బుద్ధికలవాడై; ఉండెన్.

తాత్పర్యం: కల్మాషపాదుడు - రాక్షసుడు త న్నావేశించినప్పుడు రాజ్యవ్యవహారాలు విచారించక తనను తాను మరచి, ఆవేశించనప్పుడు రాజ్యవ్యవహారాలు చూస్తూ ఉండేవాడు.

వ. ఆ కల్మాషపాదు నొక్కనాఁ డొక్కబ్రాహ్మణుం డధిక క్షుధార్తుం డయి వచ్చి సమాంసంబయిన భోజనం బడిగిన నిచ్చి, పోయిన వాఁ డంతఃపురంబున నుండి మఱచి యర్ధరాత్రంబునప్పుడు దలంచికొని తన బానసంబు వానిం బిలిచి 'యే నొక్కబ్రాహ్మణునకుం గుడువ నిచ్చి వచ్చి మఱచియుండితిం; జెచ్చెర నవ్విప్రునకు మాంసంబుతోఁ గుడువంబెట్టు' మని పంచిన, వాఁడు నింతప్రొద్దు మాంసంబు వడయనేర ననిన నప్పు డారాజు రాక్షసాధిష్ఠితుం డగుటం చేసి 'మనుష్యమాంసంబుతో నయినం గుడువం బెట్టు' మనిన సూపకారుండు వధ్యస్థానంబునకుఁ జని మనుష్య మాంసంబు దెచ్చి యిమ్ముగా వండి పెట్టిన, నవ్విప్రుండు దన దివ్యదృష్టిం జూచి దాని మానవమాంసంగా నెఱింగి కడు నలిగి. 115

ప్రతిపదార్థం: ఆ, కల్మాషపాదున్= ఆ కల్మాషపాదుణ్ణి; ఒక్కనాఁడు; ఒక్క, బ్రాహ్మణుండు; అధిక= మిక్కిలి; క్షుధా+ఆర్తుండు+అయి= ఆకలిచేత పీడింపబడిన వాడై; వచ్చి= అరుదెంచి; సమాంసంబు+అయిన= మాంసంతో కూడిన; భోజనంబు; అడిగినన్= అడుగగా; ఇచ్చి= పెట్టుతా నని మాట ఇచ్చి; పోయినన్= పోగా; వాఁడు= అతడు-ఆరాజు; అంతః పురంబునన్= అంతఃపురంలోనే ఉండి; మఱచి; అర్ధ, రాత్రంబు= సగం రాత్రిలో; తలంచికొని= గుర్తుచేసికొని; బానసంబు, వానికిన్= తన వంటవాణ్ణి; పిలిచి; ఏన్= నేను; ఒక్క బ్రాహ్మణునకున్= ఒక బ్రాహ్మణునికి; కుడువన్= తినుటకు; ఇచ్చి, వచ్చి= మాట ఇచ్చి వచ్చి; మఱచి+ఉండితిన్= మరచిపోయాను; చెరన్+చెరన్= వెంటనే; ఆ+విప్రునకున్= ఆ బ్రాహ్మణునికి; మాంసంబుతోన్; కుడువన్+పెట్టుము+అని= భుజించుటకై పెట్టు అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడున్= అతడును; ఇంత ప్రొద్దు= ఇంత రాత్రిపూట; మాంసంబు= మాంసాన్ని; పడయ, నేరన్= పొందలేను; అనినన్= అని అనగా; అప్పుడు, ఆ రాజు= ఆ సమయంలో ఆ రాజు; రాక్షస+అధిష్ఠితుండు=రాక్షసునిచేత ఆవేశింపబడినవాడు; అగుటన్+చేసి= అయినందువల్ల;

మనుష్య, మాంసంబుతోన్+అయినన్= నరమాంసంతోనైనా సరే; కుడువన్; పెట్టుము; అనినన్= అనగా; సూపకారుండు= వంటవాడు; వధ్యస్థానంబునకున్= చంపునట్టి స్థలానికి; చని= వెళ్ళి; మనుష్య, మాంసంబు = మానవ మాంసాన్ని; తెచ్చి= తీసికొనివచ్చి; ఇమ్ముగాన్= ఇంపుగా; వండిపెట్టినన్= వండిపెట్టగా; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; తన, దివ్య, దృష్టిన్= తన దివ్యదృష్టితో; దానిన్, మానవ, మాంసంబుగాన్= దానిని నరమాంసంగా; ఎఱింగి= తెలిసికొని; కడున్=మిక్కిలి; అలిగి= కోపించి.

తాత్పర్యం: ఒకనాడు ఆ కల్మాషపాదుని దగ్గరకు ఒక బ్రాహ్మణుడు మిక్కిలి ఆకలితో బాధపడుతూ వచ్చాడు. మాంసాహారం కావా లని అడిగాడు. అతడు సరే అని మాట ఇచ్చి అంతఃపురానికి వెళ్ళి మరచిపోయాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుకు వచ్చి, వంటవాడిని పిలిచి, 'నే నొక బ్రాహ్మణునికి భోజనం పెడతా నని చెప్పి వచ్చి మరచి పోయాను. వెంటనే అతనికి మాంసంతో భోజనం పెట్టు' మని ఆజ్ఞాపించాడు. వాడు ఆ అర్ధరాత్రి పూట మాంసాన్ని సంపాదించ లే నని అన్నాడు. అప్పు డారాజు రాక్షసునిచేత ఆవేశింపబడినవాడు కావటంచేత 'నరమాంసంతో నైనా అతనికి భోజనం పెట్టు' మని పల్కగా, ఆ వంటవాడు వధ్యస్థానానికి వెళ్ళి మనుష్యమాంసం తెచ్చి, రుచిగా వండిపెట్టాడు. ఆ బ్రాహ్మణుడు దివ్యదృష్టితో అది మానవమాంసం అని తెలిసికొని, మిక్కిలి కోపించి,

క. 'తివిరి యభోజ్యం బగు మా । నవ మాంసముతోడ భోజనము పెట్టినవాఁ
డవు నీవు మనుష్యాదుఁడ । వవు' మని వాఁ డిచ్చె శాప మన్నరపతికిన్. 116

ప్రతిపదార్థం: తివిరి= పూని; అభోజ్యంబు+అగు= తినగూడని దైన; మానవ, మాంసముతోడన్; భోజనము, పెట్టినవాఁడవు; నీవు; మనుష్యాదుఁడవు+అగుము+అని= మనుష్యమాంసం తినేవాడి వగు మని - అనగా రాక్షసుడవు కమ్మని; ఆ+నరపతికిన్= ఆ రాజుకు; వాఁడు= ఆ బ్రాహ్మణుడు; శాపము; ఇచ్చెన్.

తాత్పర్యం: 'తినగూడని నరమాంసంతో నాకు భోజనం పెట్టావు. నీవు మనుష్యమాంసం తినే రాక్షసుడవు అగుదువు గాక!' అని ఆ బ్రాహ్మణుడు రాజైన కల్మాషపాదుడిని శపించాడు.

వ. ఇట్లు బ్రాహ్మణ శాపంబునం గల్మాషపాదుండు మానుష భావంబు విడిచి, రాక్షసుం డై శక్తి యొద్దకు వచ్చి 'నీ కారణంబున నిట్టి శాపవ్యాపారంబు సంభవించె; దీని ఫలంబు ముందఱ నీవ యనుభవింపు' మని శక్తి నపగత ప్రాణుం జేసి, విశ్వామిత్రుచేతఁ బ్రచోదితుం డయి పదంపడి వసిష్ఠపుత్త్రుల నందఱ వధియించిన. 117

ప్రతిపదార్థం: ఇట్లు; బ్రాహ్మణ, శాపంబునన్= బ్రాహ్మణ శాపంచేత; కల్మాషపాదుండు; మానుష భావంబు= మనుష్యత్వమును; విడిచి; రాక్షసుండు+ఐ; శక్తి, ఒద్దకున్; వచ్చి; నీ కారణంబునన్= నీ కారణంచేత; ఇట్టి, శాప, వ్యాపారంబు= ఇటువంటి శాపం కలిగేపని; సంభవించెన్= ఏర్పడింది; దీని, ఫలంబు= దీని ఫలితం; ముందఱ= ముందుగానే; నీవు+అ= నీవే; అనుభవింపుము; అని= అని; శక్తిన్= శక్తిమహామునిని; అపగత, ప్రాణున్+చేసి= పోయిన ప్రాణం కలవాడినిగా చేసి 'అనగా చంపి; విశ్వామిత్రుచేతన్; ప్రచోదితుండు+అయి= విశ్వామిత్రునిచే పురికొల్పబడినవాడై; పదంపడి= పిమ్మట; వసిష్ఠ, పుత్త్రులన్= వసిష్ఠుని కుమారుల్ని; అందఱన్= అందరినీ; వధియించినన్= చంపగా.

తాత్పర్యం: ఈ విధంగా బ్రాహ్మణశాపంచేత కల్మాషపాదుడు మనుష్యత్వాన్ని విడిచి, రాక్షసుడైన శక్తి మహాముని దగ్గరికి వచ్చి 'నీ కారణంగా ఈ శాపవ్యవహారం ఏర్పడింది. దీనిఫలం నీవే మొదట అనుభవించు' మని అతడిని చంపేశాడు. తరువాత విశ్వామిత్రునిప్రేరణతో వసిష్ఠునిపుత్రు లందరినీ వధించాడు.

పుత్త్రశోకమున వసిష్ఠుఁడు ఆత్మహత్యకుఁ బ్రయత్నించుట (సం.1-166-40)

తే. సుతుల రాక్షసనిహతులఁ జూచి పరమ । యోగధరుఁ డయ్యుఁ బుత్త్ర వియోగశోక
భరము దాల్చె వసిష్ఠుం డపారభూరి । ధరణిభరము నగేంద్రుండు దాల్చునట్లు. 118

ప్రతిపదార్థం: రాక్షస, నిహతులన్= రాక్షసునిచేత చంపబడినవాళ్ళను; సుతులన్= పుత్త్రులను; చూచి; వసిష్ఠుండు; పరమ, యోగ, ధరుఁడు+అయ్యున్= ఉత్తమమైన యోగశక్తిని ధరించేవాడే అయినా; అపార, భూరి, ధరణి, భరమున్= అంతులేని గొప్ప భూభారాన్ని; నగ+ఇంద్రుఁడు= పర్వతాలకు రాజైన హిమవంతుడు; తాల్చునట్లు= ధరించునట్లు; పుత్త్ర వియోగ, శోక, భరమున్= కొడుకుల ఎడబాటువలన కలిగిన దుఃఖంయొక్కభారాన్ని; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: వసిష్ఠుడు గొప్ప యోగశక్తి కలవాడే అయినా - రాక్షసునిచేత చచ్చిన తనకొడుకులను చూచి, పర్వత రాజైన హిమవంతుడు అంతులేని గొప్పభూభారాన్ని ధరించినట్లు పుత్రుల ఎడబాటువలన కలిగిన దుఃఖభారాన్ని వహించాడు.

విశేషం: అలం: ఉపమ. 'నగేంద్రుండు' అనే చోట 'ధరణి' భర మురగేంద్రుండు' అని పెక్కు ప్రతులలో; 'ధరణి భరము నాగేంద్రుండు' అని కొన్ని ప్రతులలో పాఠాంతరా లున్నాయి. ఉరగేంద్రుడు, నాగేంద్రుడు అంటే ఆదిశేషుడు. అతడు భూభారం వహించేవాడే. పర్వతానికి 'ధరణీ ధరం' అనే పేరుంది. గనుక నగేంద్రు డైన హిమవంతుడుకూడ భూభారం వహించేవాడే!

చ. అమిత వివృద్ధ శోక వివశాత్మకుఁ డై మది నాత్మఘాతదో
షమును దలంప కెంతయు విషాదమునన్ బలవద్దవాగ్ని మ
ధ్యము వడిఁ జొచ్చినన్ బృహదుదగ్రశిఖానల మాక్షణంబ యు
ష్ణము చెడి శీత మయ్యె మునినాథున కుగ్రతపంబుపెంపునన్. 119

ప్రతిపదార్థం: అమిత, వివృద్ధ, శోక, వివశ+ఆత్మకుఁడు+ఐ= మిక్కిలి ఎక్కువైన దుఃఖంచేత పరవశమైన మనస్సు కలవా డై; మదిన్= మనస్సునందు; ఆత్మ, ఘాత, దోషమును= ఆత్మహత్య అనే పాపాన్ని; తలంపక= ఆలోచింపక; ఎంతయున్= మిక్కిలి; విషాదమునన్= దుఃఖంచేత; బలవత్+దవ+అగ్ని, మధ్యము= అధికమైన కార్చిచ్చునడుమ; వడిన్= వేగమే; చొచ్చినన్= ప్రవేశించగా; బృహత్+ఉదగ్ర, శిఖా+అనలము= పెద్ద భయంకరమైన మంటలు కల అగ్ని; మునినాథునకున్= మునిశ్రేష్ఠు డైన ఆ వసిష్ఠునకు; ఉగ్ర, తపంబు, పెంపునన్= గొప్ప తపస్సుయొక్క అతిశయంచేత; ఆ క్షణంబు+అ= అప్పటికప్పుడే; ఉష్ణము= వేడి; చెడి=పోయి; శీతము= చల్లనిది; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: మిక్కిలి ఎక్కువైన దుఃఖంతో మనస్సు స్వాధీనం తప్పి, ఆత్మహత్య పాప మని కూడ భావించక, అమిత మైన బాధతో పెద్ద కార్చిచ్చులోకి వడిగా ప్రవేశించాడు. అయితే, మునిశ్రేష్ఠు డైన ఆ వసిష్ఠుని తపోమహిమచేత ఆ కార్చిచ్చు వేడిని కోల్పోయి చల్లబడింది.

విశేషం: శోకభావ తీవ్రతచేత వసిష్ఠుడు ఆత్మహత్య చేసికొనటానికి చేసే ప్రయత్నాలను అయిదింటిని - పంచప్రాణాలు తీసికొనే యత్నాలకు వ్యంజకాలుగా - నన్నయ రచించాడు. ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్క ప్రయత్నం ఒక్కొక్క ఘటనగా

రాణిస్తుంది. ఘటనాచిత్రణంలో శ్లేష అనే గుణం శోభిస్తుంది. బహుపదాలు ఏకపదవద్భావం పొందే మసృణ మైన రచనను శ్లేష మని అంటారు. ప్రసాదంకంటె విలక్షణంగా ఉండే ఇటువంటి రచనను 119 నుండి 123 పద్యంవరకు శ్లేషగుణసుందరంగా రచించి, సంఘటనౌచిత్యాన్ని పాటించాడు - నన్నయ. (సంపా.)

ఉ. పంబిన శోక భారమునఁ బ్రాణ విమోక్షముఁ గోరి కంఠ దే
శంబున రాయి గట్టికొని సన్మునినాథుఁడు నిశ్చితాత్ముఁడై
యంబుధిఁ జొచ్చినం గడు భయంపడి వార్ధి లసత్తరంగ హ
స్తంబుల నెత్తిపట్టె నుచితస్థితిఁ దీరముఁ జేర నమ్మునిన్. 120

ప్రతిపదార్థం: పంబిన= మిక్కుటమైన; శోకభారమునన్= దుఃఖంయొక్క బరువుచేత; సత్+ముని, నాథుఁడు= గొప్ప మునిశ్రేష్ఠు డైన ఆ వసిష్ఠుడు; నిశ్చిత+ఆత్ముఁడు+ఐ= నిర్ణయించుకొన్న మనస్సు కలవాడై; ప్రాణ, విమోక్షమున్= ప్రాణమును వదలుటను; కోరి= కోరుకొని; కంఠదేశంబునన్= మెడలో; రాయి, కట్టికొని= రాతిని కట్టుకొని; అంబుధిన్= సముద్రంలో; చొచ్చినన్= ప్రవేశింపగా; వార్ధి= సముద్రం; కడున్= మిక్కిలి; భయంపడి; ఆ+మునిన్= ఆ వసిష్ఠుని; ఉచిత, స్థితిన్= తగినట్లుగ; తీరమున్= గట్టును; చేరన్= చేరునట్లుగ; లసత్, తరంగ, హస్తంబులన్= ప్రకాశిస్తున్న అలలుఅనెడి చేతులతో; ఎత్తి పట్టెన్=ఎత్తి పట్టింది.

తాత్పర్యం: మిక్కుటమైన దుఃఖభారంతో మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు ఎలాగైనా ప్రాణం విడువా లని నిశ్చయించుకొని, మెడకు రాయికట్టుకొని సముద్రంలో దూకగా - ఆ సముద్రుడే భయపడి, ప్రకాశించే తన అల లనే చేతులతో ఎత్తిపట్టి తగువిధంగా ఆయనను ఒడ్డుకు చేర్చాడు.

విశేషం: అలం: రూపకం.

చ. సుతశతవర్జితాశ్రమము చూడఁగ నోపక మేరుపర్వతో
న్నతపృథుశృంగ మెక్కిపడినన్, మునివల్లభుదేహబంధ మ
క్షత మయి తూలసంచయనికాశత నొప్పెఁ; ననంత సంతత
వ్రతనియమప్రభావు లగువారలఁ బొందునె దేహదుఃఖముల్. 121

ప్రతిపదార్థం: సుత, శత, వర్జిత+ఆశ్రమము= కొడుకులు నూఱుమందిచేత విడువబడిన ఆశ్రమాన్ని; చూడన్+కన్+ఓపక= చూడటానికి ఇష్టపడక; మేరుపర్వత+ఉన్నత, పృథు, శృంగము+ఎక్కి= మేరుపర్వతపు ఎత్తైన విశాలశిఖరాన్ని ఎక్కి; పడినన్= పడగా; మునివల్లభు, దేహబంధము= మునినాథు డైన వసిష్ఠుని శరీరముయొక్క కూర్పు; అక్షతము+అయి= గాయం కానిది అయి; తూల, సంచయ, నికాశతన్= దూదిమూటయొక్క సమానత్వంతో; ఒప్పెన్= ప్రకాశించింది; అనంత, సంతత, వ్రత, నియమ, ప్రభావులు+అగు= అంతులేని ఎడతెగని వ్రతనియమాలయొక్క ప్రభావం కలవాళ్ళయిన; వారలన్= వాళ్లను; దేహ, దుఃఖముల్= శరీర సంబంధ మైన దుఃఖాలు; పొందునె= కలుగుతాయా? (కలుగవు అనిభావం).

తాత్పర్యం: నూరుమంది కొడుకులు మరణించటంతో శూన్యమైన తనఆశ్రమాన్ని చూడలేక మునిశ్రేష్ఠు డైన వసిష్ఠుడు మేరుపర్వతపు ఎత్తైన శిఖరం ఎక్కి క్రిందికి దూకగా, అతనిదేహం దూదిమూటవలె గాయపడలేదు. ఎల్లప్పుడు అంతులేని వ్రతనియమాలప్రభావం కలవాళ్ళను దేహకష్టాలు దరిచేరవుకదా!

విశేషం: అలం : అర్థాంతరన్యాసం, ఉపమ.

మధ్యాక్కర.

వదలక మరణార్థి యగుచు మునినాథవరుఁడు దా నొక్క
నది నుదగ్రగ్రాహవతిఁ బ్రవేశించినను ముని నంట
నది యోడి శతవిధంబులఁ బరిద్రుతయయి స్థలం బయిన
నది యాదిగాఁగ శతద్రునామ యై యన్నది యొప్పె. 122

ప్రతిపదార్థం: వదలక= విడిచిపెట్టక; మరణ+అర్థి= చావును కోరినవాడు; అగుచున్= అవుతూ; మునినాథ, వరుఁడు= మునిశ్రేష్ఠులలో ఉత్తముడు; తాన్= తాను; ఉదగ్ర, గ్రాహవతిన్= మిక్కిలి భయంకరమైన మొసళ్ళు కలదానిని; ఒక్క, నదిన్= ఒక్క నదిలో; ప్రవేశించినను= ప్రవేశించినప్పటికీ; అది= ఆ నది; మునిన్= వసిష్ఠుని; అంటన్= తాకుటకు; ఓడి= భయపడి; శతవిధంబులన్= నూఱుమార్గాల; పరిద్రుత; అయి= పారినదై; స్థలంబు+అయినన్= మెరక కాగా; ఆదికాఁగన్= అది మొదలుగా; ఆ+నది; శతద్రు, నామ+ఐ= శతద్రువు అనే పేరు కలదై; ఒప్పెన్= ప్రసిద్ధికెక్కింది.

తాత్పర్యం: మునిశ్రేష్ఠులలో ఉత్తముడైన వసిష్ఠుడు మరణించా లన్న కోరికను ఇంకా వదలకుండా మహా భయంకరమైన మొస ళ్ళున్న ఒకనదిలో ప్రవేశించాడు. ఆ నది ఆయనను తాకటానికి భయపడి, నూరు మార్గాలలో ప్రవహించి మెరక అయిపోయింది. అప్పటినుండి ఆ నది శతద్రువు అనే పేరుతో ప్రసిద్ధి చెందింది.

మధ్యాక్కర.

ఘనపాశములఁ జేసి యెల్ల యంగముల్ గలయ బంధించి
కొని యొక్కనదిఁ జొచ్చి మునిఁగినను వంతఁ గూరి యన్నదియుఁ
దన దివ్యశక్తి నప్పాశముల విడిచి తన్మునినాథుఁ
బనుగొనఁ దీరంబు చేరఁ బెట్టి విపాశనాఁ బరఁగె. 123

ప్రతిపదార్థం: ఘన, పాశములన్+చేసి= గొప్ప త్రాళ్ళచేత; ఎల్ల అంగముల్= అన్ని అవయవాలను; కలయన్= ఒకటిగా చేర్చి; బంధించికొని= కట్టివేసికొని; ఒక్కనదిన్; చొచ్చి= ప్రవేశించి; మునిఁగినన్= మునుగగా; ఆ+నదియున్= ఆ నదిగూడ; వంతన్+కూరి= దుఃఖాన్ని పొంది; తన దివ్య, శక్తిన్= తనయొక్క ఆశ్చర్యకరమైన శక్తిచేత; ఆ+పాశములన్= ఆ త్రాళ్ళను; విడిచి= విడిపించి; తద్+మునినాథున్= ఆ మునిశ్రేష్ఠుడిని; పనుగొనన్= చక్కనగునట్లు; తీరంబు, చేరన్= ఒడ్డు చేరునట్లు; పెట్టి= చేసి; విపాశ నాన్= విపాశ (పాశములు లేనిది) అనే పేరుతో; పరఁగెన్= ఒప్పింది.

తాత్పర్యం: వసిష్ఠుడు పెద్దత్రాళ్ళతో తన అవయవా లన్నిటినీ ఒకటిగా చేర్చి కట్టుకొని ఒక నదిలో మునిగాడు. ఆ నదికూడ మిక్కిలి దుఃఖించి తన దివ్యశక్తితో అతనికట్లను విప్పి, ఒడ్డుచేర్చి తాను 'విపాశ' అనే పేరుతో ప్రసిద్ధి చెందింది.

వ. **ఇట్లు పెక్కువిధంబుల నాత్మపరిత్యాగంబునందుఁ గృతనిశ్చయుం డయ్యును నప్రాప్తమరణుం డయి వసిష్ఠుండు నిజాశ్రమంబునకు వచ్చువాఁడు దన పిఱుంద వచ్చు కోడలి నదృశ్యంతి యను దాని శక్తిభార్య నప్పు డెఱింగి, దాని యుదరంబుననుండి షడంగాలంకృత వేదధ్వని గరంబు మధురం బై వీతెంచిన విని విస్మితుం డయి.** 124

ప్రతిపదార్థం: ఇట్లు; పెక్కు విధంబులన్=ఎన్నో రకాలుగా; ఆత్మ; పరిత్యాగంబునందున్= దేహాన్ని విడుచుటయందు; కృత, నిశ్చయుండు= చేయబడిన నిశ్చయం కలవాడు; అయ్యును= అయినప్పటికీ; అప్రాప్త; మరణుండు+అయి= పొందబడని చావుకలవా డై; వసిష్ఠుండు= వసిష్ఠుడు; నిజ+ఆశ్రమంబునకున్= తనయొక్క ఆశ్రమానికి; వచ్చువాఁడు= వచ్చునటువంటివాడు; తన పిఱుందన్= తన వెనుక; వచ్చు= వస్తూ ఉన్న; కోడలిన్; అదృశ్యంతి అనుదానిన్ = అదృశ్యంతి అను పేరుగల ఆమెను; శక్తి, భార్యన్= శక్తి మహామునియొక్క భార్యను; అప్పుడు; ఎఱింగి= చూచి; దాని= ఆమెయొక్క; ఉదరంబుననుండి= కడుపులో నుండి; షడంగ+అలంకృత వేద, ధ్వని= ఆరు అంగములచేత అలంకరింపబడిన వేదంయొక్క ఉచ్చారణ ధ్వని; కరంబు= మిక్కిలి; మధురంబు+ఐ= వినసొంపై; వీతెంచినన్= రాగా; విని; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై.

తాత్పర్యం: ఈ విధంగా వసిష్ఠుడు ఆత్మహత్య చేసికొనా లని పెక్కుమార్గాలలో దృఢంగా ప్రయత్నించినా, మరణం పొందలేక తన ఆశ్రమానికి తిరిగివస్తూ, తన వెనుకనే వస్తున్న తన కోడలిని గమనించాడు. ఆమె శక్తి మహాముని భార్య. ఆమె పేరు అదృశ్యంతి. ఆమె గర్భంనుండి షడంగాలతో అలంకృతమైన వేద ధ్వని మిక్కిలి మనోహరంగా వినిపించసాగింది. దానిని విని వసిష్ఠుడు ఆశ్చర్యపడి.

విశేషం: షడంగాలు: అనుద్రుతం, ద్రుతం, లఘువు, గురువు, ప్లుతం, కాకపాదం.

తే. **శక్తి చదువును బోలె సువ్యక్త మగుచు । వీనులకు నిది యమృతోపమాన మయ్యె**
వేదనాదంబు; దీని పుణ్యోదరమున । నున్నవాఁడు సుతుండు విద్వన్నుతుండు. **125**

ప్రతిపదార్థం: శక్తి, చదువును+పోలె= శక్తిమహాముని చదువువలె; సువ్యక్తము= మిక్కిలి స్పష్టమైనది; అగుచున్= అవుతూ; ఇది, వేద, నాదంబు= ఇది వేద ధ్వని; వీనులకున్= చెవులకు; అమృత+ఉపమానము+అయ్యెన్= అమృతమువంటి దయింది; దీనిన్= ఈ అదృశ్యంతి యొక్క; పుణ్య+ఉదరమునన్= పవిత్రమైన గర్భంలో; విద్వత్+నుతుండు= విద్వాంసులచేత పొగడబడువాడు; సుతుండు= కుమారుడు; ఉన్నవాడు= ఉన్నాడు.

తాత్పర్యం: శక్తిమహాముని చదివినట్లు మిక్కిలి స్పష్టమై ఈ వేదనాదం చెవులకు అమృతంవలె వినిపిస్తున్నది. ఈమె పుణ్యగర్భంలో విద్వాంసులచేత పొగడబడే కుమారుడు ఉన్నాడు.

విశేషం: అలం: ఉపమ. ఈ తేటగీతిలో నాల్గుపాదాల్లోనూ ప్రాసయతి గలదు.

వ. **'అనవరత వేదాధ్యయనశీలుం డయిన శక్తిచదువు వినుచుం బండ్రెండేఁడులు గర్భంబునుండి సకల వేదంబులు ధరియించినవాఁ డీ పౌత్రుముఖంబు చూచి యేను గృతార్థుండ నగుదు' నని వసిష్ఠుండు మరణ వ్యవసాయ నివృత్తుం డై నిజాశ్రమంబున నుండునంత; నొక్కనాఁడు రాక్షసరూపధరుం డై రౌద్రాకారంబున వచ్చు కల్మాషపాదుం జూచి యదృశ్యంతి వెఱచిన దాని నోడుకుండు మని మునివరుండు హుంకారంబున రాక్షసు వారించి, వానిపయి మంత్రపూతంబు లైన కమండలుజలంబు లొలికిన.** **126**

ప్రతిపదార్థం: అనవరత, వేద+అధ్యయన, శీలుండు+అయిన= ఎల్లప్పుడు వేదాలను పఠించటమే స్వభావంగా గలవాడైన; శక్తి, చదువు= శక్తి మహామునియొక్క చదువు; వినుచున్= వింటూ; పండ్రెండు+ఏడులున్= పన్నెండు సంవత్సరాలు; గర్భంబునుండి= కడుపులో ఉండి; సకల, వేదంబులు= అన్ని వేదాలు; ధరియించినవాఁడు= నేర్చిన అతడు; ఈ; పౌత్రు,

ముఖంబున్= ఈ మనుమడి యొక్క ముఖాన్ని; చూచి; ఏను= నేను; కృతార్థుండను= తీరిన కోరికకలవాడను; అగుదున్+అని= అవుతా నని; వసిష్ఠుండు; మరణ, వ్యవసాయ, నివృత్తుండు+ఐ= చావుకొరకు చేసే ప్రయత్నంనుండి వెనుదిరిగినవా డై - అనగా ఆత్మహత్యా ప్రయత్నాన్ని మాని; నిజ+ఆశ్రమంబునన్= తన ఆశ్రమంలో; ఉండునంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు; రాక్షస, రూప, ధరుండు+ఐ= రాక్షస రూపాన్ని ధరించినవా డై; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన రూపంతో; వచ్చు= వస్తూన్న; కల్మాషపాదున్; చూచి; అదృశ్యంతి (వసిష్ఠుడి కోడలు); వెఱచిన= భయపడిన; దానిన్= ఆమెను; ఓడక+ ఉండుము+అని= భయపడకుండు మని; మునివరుండు= మునిశ్రేష్ఠు డైన వసిష్ఠుడు; హుంకారంబున్= హుం అనే పెద్ద ధ్వనితో; రాక్షసున్= రక్కసుని; వారించి= ఆపి; వానిపై; మంత్ర, పూతంబులు+ఐన= మంత్రాలచేత పవిత్రాలైన; కమండలు, జలంబులు= కమండలంలోని నీళ్ళు; ఒలికినన్= చల్లగా.

తాత్పర్యం: 'ఎల్లప్పుడు వేదాలు చదవటమే స్వభావంగా శక్తియొక్కచదువు వింటూ పన్నెండుసంవత్సరాలు గర్భంలో ఉండి అన్నివేదాలు నేర్చుకొన్న ఈ మనుమడిముఖం చూచి, నేను కృతార్థుడ నౌతాను' అని వసిష్ఠుడు ఆత్మహత్యాప్రయత్నం మాని, తన ఆశ్రమంలో ఉండిపోయాడు. ఒకనాడు కల్మాషపాదుడు రాక్షస రూపాన్ని ధరించి రాగా అతడిని చూచి అదృశ్యంతి భయపడింది. వసిష్ఠుడు ఆమెను భయపడ వద్దని చెప్పి, తన హుంకారంతో ఆ రాక్షసుడిని నిలిపి, మంత్రపూతమైన కమండలుజలాన్ని అతనిపై చల్లాడు.

వసిష్ఠువలనఁ గల్మాషపాదుండు శాపవిముక్తిఁ జెందుట (సం.1-168-5)

క. భూపాలకుండు బ్రాహ్మణ । శాపంబునఁ బదియురెండుసంవత్సరముల్
పాపమతి నుండి రాక్షస । రూపము చెడి యపుడు మనుజరూపముఁ దాల్చెన్. 127

ప్రతిపదార్థం: భూపాలకుండు= రాజైన కల్మాషపాదుడు; బ్రాహ్మణ, శాపంబునన్= బ్రాహ్మణశాపంచేత; పదియు, రెండు, సంవత్సరముల్= పండ్రెండేళ్ళు; పాప, మతిన్= పాపబుద్ధితో; ఉండి= ధరించి; అప్పుడు, రాక్షస, రూపము; చెడి= కోల్పోయి; మనుజ, రూపమున్; తాల్చెన్.

తాత్పర్యం: కల్మాషపాదమహారాజు బ్రాహ్మణశాపంవలన పన్నెండేళ్లు పాపబుద్ధితో ఉండి, అప్పుడు రాక్షస రూపాన్ని వదలి, మానవరూపాన్ని పొందాడు.

వ. ఇట్లు శాపవిముక్తుం డై కల్మాషపాదుండు వసిష్ఠునకు నమస్కరించి ముకుళితకరకమలుఁ డై 'మునీంద్రా! నీ ప్రసాదంబున శాపంబువలనం బాసి కృతార్థుండ నయితి' ననిన వానికి వసిష్ఠుం డి ట్లనియె. 128

ప్రతిపదార్థం: ఇట్లు; శాప, విముక్తుండు+అయి= శాపంచేత విముక్తి పొందినవాడై; కల్మాషపాదుండు; వసిష్ఠునకున్, నమస్కరించి; ముకుళిత, కర, కమలుండు+ఐ= మోడ్పుగా చేయబడిన కమలాలవంటి చేతులు కలవాడై; ముని+ఇంద్రా!= మునిశ్రేష్ఠా!; నీ, ప్రసాదంబునన్= నీ దయచేత; శాపంబువలనన్= శాపంనుండి; పాసి= విముక్తినొంది; కృత+అర్థుండను= నెరవేరిన కోరిక కలవాడను; అయితిన్= అయినాను; అనినన్= అని చెప్పగా; వానికిన్= ఆ కల్మాషపాదునికి; వసిష్ఠుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా శాపవిముక్తి పొంది కల్మాషపాదుడు వసిష్ఠునికి నమస్కరించి చేతులు జోడించి 'మునిశ్రేష్ఠా! నీ దయవలన శాపవిముక్తి పొంది కృతార్థుడ నయ్యాను' అని పల్కగా, అతనితో వసిష్ఠుడు ఇట్లా అన్నాడు.

చ. గుణముల నొప్పి బ్రాహ్మణులకుం గడుభక్తుఁడ వై సమస్త ధా
రుణి ప్రజ గూర్పఁగా విగతరోషుఁడ వై సుఖ ముండు మింక బ్రా
హ్మణుల కవజ్ఞసేయక శమంబును చేకొను; మింద్రుఁడైన బ్రా
హ్మణుల కవజ్ఞసేసి యవమానముఁ బొందుఁ బ్రతాపహీనుఁడై. 129

ప్రతిపదార్థం: గుణములన్= మంచిగుణాలచేత; ఒప్పి= ప్రకాశించి; బ్రాహ్మణులకున్; కడున్= మిక్కిలి; భక్తుఁడవు+ఐ; సమస్త; ధారుణి, ప్రజ= మొత్తం భూమియందలి ప్రజలు; కూర్పఁగా= ప్రేమింపగా; విగత, రోషుఁడవు+ఐ= పోయిన కోపం కలవాడ వై; సుఖము+ఉండుము= సుఖంగా ఉండుము; ఇంకన్= ఇకమీదట; బ్రాహ్మణులకున్; అవజ్ఞ= అవమానం; చేయక= కలిగించకుండా; శమంబును= శాంతిని; చేకొనుము= పొందుము; ఇంద్రుఁడు+ఐనన్= ఇంద్రుడు అయినప్పటికీ; బ్రాహ్మణులకున్; అవజ్ఞ= అవమానం; చేసి; ప్రతాప; హీనుఁడు+ఐ= పరాక్రమాన్ని కోల్పోయినవా డై; అవమానమున్, పొందున్= అవమానాన్ని పొందుతాడు.

తాత్పర్యం: మంచిగుణాలతో బ్రాహ్మణభక్తుడ వై; భూమిమీద ప్రజ లందరికీ ఇష్టుడ వై, కోపం లేకుండా, సుఖంగా జీవించుము. బ్రాహ్మణులను అవమానించక శాంతిని పొందుము. బ్రాహ్మణులకు అవమానం చేస్తే, ఇంద్రుడైనా పరాక్రమహీనుడై అవమానం పొందగలడు.

విశేషం: అలం : అర్థాంతరన్యాసం.

నన్నయకు "ధారుణి" (భూమి అని అర్థం) పదప్రయోగం చాలా ఇష్టం. ఈ పద్యం రెండవపాదంలో "ధా/రుణి....రోషు" అని యతి స్థానములో 'ధారుణి'లోని "రు" వచ్చి-ఈ రూపాన్ని స్థిరపరచింది.

వ. అని కఱపిన నట్లచేయుదు నని యమ్మహీపతి వసిష్ఠుం దోడ్కొని, యయోధ్యాపురంబున కరిగి, సకల ప్రజానురాగ కరుం డయి యమ్మునివరు నతిభక్తిం బూజించుచుఁ, దొల్లి రాక్షసుం డయి మదయంతీ సహితంబు వనంబునం గ్రుమ్మరియెడి కాలం బొక్క బ్రాహ్మణ మిథునంబు ఋతుకాలప్రవృత్తి నున్నం గని యాఁ కంటి పెలుచన నందు బ్రాహ్మణుం బట్టికొని భక్షించిన, నతిదుఃఖిత యై యాబ్రాహ్మణభార్య పరమ పతివ్రత యాంగిరసి యనునది పురుషవియోగంబునం బుత్త్రార్థంబయిన నిజప్రయత్నంబు విఫలం బగుటకు శోకించి, 'వనితాసంభోగంబున నీవును నా పురుషునట్లు పంచత్వంబునుం బొందు' మని శాపం బిచ్చి వసిష్ఠువలన నీకుఁ బుత్త్రలాభం బగు నని చెప్పి, యగ్నిప్రవేశంబు సేసినం, బదంపడి దీని నంతయు మదయంతివలన నెఱింగినవాఁ డై, తనకుఁ బుత్త్రోత్పాదన సామర్థ్యంబు లేమిం దలంచి కల్మాషపాదుండు పుత్త్రార్థి యయి వసిష్ఠున కి ట్లనియె. 130

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; కఱపినన్= బోధించగా; అట్లు+అ; చేయుదున్+అని; ఆ+మహీ, పతి= ఆ రాజు (కల్మాషపాదుడు); వసిష్ఠున్ తోడ్కొని= వెంటపెట్టుకొని; అయోధ్యాపురంబునకున్; అరిగి= వెళ్ళి; సకల, ప్రజా+అనురాగ, కరుండు+అయి= అందరు ప్రజలకు ప్రేమను, కలిగించువా డై; ఆ+ముని, వరున్= ఆ మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడిని; అతి భక్తిన్= మిక్కిలి భక్తితో సేవిస్తూ; పూజించుచున్; తొల్లి= పూర్వం; రాక్షసుండు+అయి; మదయంతీ, సహితంబు= మదయంతితో

కూడి; వనంబునన్= అడవియందు; క్రుమ్మరియెడి= తిరిగెడి; కాలంబు= కాలంలో; ఒక్క; బ్రాహ్మణ, మిథునంబు= బ్రాహ్మణ దంపతుల జంట; ఋతుకాల, ప్రవృత్తిన్= కామకేళియందు; ఉన్నన్= ఉండగా; కని=చూచి; ఆఁకంటి, పెలుచనన్= ఆకలియొక్క అతిశయంచేత; అందున్= ఆ జంటలో; బ్రాహ్మణున్= బ్రాహ్మణుని; పట్టికొని, భక్షించినన్= తినగా; ఆ బ్రాహ్మణ భార్య= ఆ బ్రాహ్మణుని ఇల్లాలు; పరమ, పతివ్రత= మహాపతివ్రత; ఆంగిరసి అనునది= ఆంగిరసి అను ఆమె; అతి, దుఃఖిత+ఐ= మిక్కిలి దుఃఖించిన దై; పురుష, వియోగంబునన్= భర్తను కోల్పోవటంచేత; పుత్త్ర+అర్థంబు+అయిన= పుత్రుని కొరకైన; నిజ, ప్రయత్నంబు= తన యొక్క ప్రయత్నం; విఫలంబు+అగుటన్= ఫలము లేని దగుటకు; శోకించి= దుఃఖించి; వనితా, సంభోగంబునన్= స్త్రీతో రమించేటప్పుడు; నీవును= నీవు కూడా; నా, పురుషున్+అట్ల= నా భర్తవలె; పంచత్వంబునున్= మరణమును; పొందుము+అని; శాపంబు+ఇచ్చి; వసిష్ఠునివలనన్; నీకున్; పుత్త్ర, లాభంబు; అగున్+అని= చెప్పి; అగ్ని, ప్రవేశంబు= నిప్పులో దూకుట; చేసినన్= చేయగా; పదంపడి= పిమ్మట; దీనిన్+అంతయున్= ఈ జరిగినదాని నంతయు; మదయంతివలనన్= తనభార్య యైన మదయంతివలన; ఎఱింగినవాఁడై= తెలిసిన వాడై; తనకున్; పుత్త్ర+ఉత్పాదన, సామర్థ్యంబు లేమిన్= కొడుకును పుట్టించే శక్తి లేకుండుటను; తలంచి; కల్మాష పాదుండు; పుత్త్ర+అర్థి, అయి= పుత్రుడిని కోరినవాడై; వసిష్ఠునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని వసిష్ఠుడు బోధింపగా, ఆ విధంగానే చేస్తా నని ఆ రాజు వసిష్ఠుడిని వెంటబెట్టుకొని అయోధ్యా నగరానికి వెళ్లి, ప్రజలందరికి ఇష్టు డై ఆ ముని శ్రేష్ఠుణ్ణి అతిభక్తితో పూజించసాగాడు. పూర్వం తాను రాక్షసుడై, తనభార్య మదయంతితో కూడి అడవిలో తిరిగేకాలంలో ఒక బ్రాహ్మణదంపతులజంట కామకేళిలో ఉండటం చూచి, అధికమైన ఆకలితో బ్రాహ్మణుడిని పట్టుకొని భక్షింపగా, అతనిభార్య పరమపతివ్రత 'ఆంగిరసి' మిక్కిలి దుఃఖించి, భర్తను కోల్పోవటంవలన కొడుకు పుట్టా లన్న తనకోరిక విఫలమైన దని శోకించి, 'స్త్రీతో రమించినప్పుడు నీవుకూడా నా భర్తవలె అకాలమరణం పొందుతావు' అని శపించి, 'వసిష్ఠునివలన నీకు పుత్రలాభం కలుగుతుంది' అని చెప్పి, అగ్నిప్రవేశం చేసింది. తరువాత ఈ విషయమంతా మదయంతి ద్వారా తెలిసికొని, తనకు పుత్రులను పొందే యోగ్యత లే దని ఆలోచించి, కల్మాషపాదుడు పుత్రుణ్ణి కోరినవాడై వసిష్ఠునితో ఇట్లా అన్నాడు.

వసిష్ఠప్రసాదంబునఁ గల్మాషపాదుఁడు పుత్త్రవంతుఁడగుట (సం.1-168-11)

క. మనుకుల పవిత్రుఁ బుత్త్రకు । నినసన్నిభు ! నాకుఁ బడయు; మే నట్లయినన్
మునినాథ! నీ ప్రసాదం । బునఁ బితరులవలన ఋణవిముక్తుఁడ నగుదున్. 131

ప్రతిపదార్థం: మను, కుల, పవిత్రున్= మనువువంశాన్ని పరిశుద్ధం చేసేవాడిని; పుత్త్రకున్= చక్కటి కుమారుడిని; ఇన, సన్నిభున్= సూర్యుడితో సమానమైనవాడిని; నాకున్; పడయుము= పొందుము; ఏను= నేను; అట్లు+అయినన్= ఆ విధంగా అయితే కానీ; మునినాథ!= ఓ మునిశ్రేష్ఠా!; నీ ప్రసాదంబునన్= నీదయచేత; పితరులవలనన్= పితృదేవతలవలన; ఋణ, విముక్తుఁడన్= అప్పునుండి విడువబడినవాడను; అగుదున్= ఔతాను.

తాత్పర్యం: ఓ వసిష్ఠమహర్షీ! మనువువంశాన్ని పవిత్రంచేసేవాడు, సూర్యునితో సమానమైనవాడు అయిన సుపుత్రుడిని నాకు కలిగించుము. నేను ఆ విధంగా నీదయతో పితృదేవతల ఋణంనుండి విముక్తుడ నౌతాను.

వ. అని తన భార్యయైన మదయంతి యనుదానిని ఋతుమతి సమర్పించిన, నదియు వసిష్ఠుప్రసాదంబున గర్భిణి యయి పండ్రెండేఁడులు గర్భంబు మోచి వేసరి, యొక్క యశ్మశకలంబున నుదరభేదనంబుఁ జేసిన నశ్మకుం

డను రాజర్షి పుట్టె; నట యదృశ్యంతికిం బరాశరుం డుదయించి వసిష్ఠ నిర్మిత జాతకర్మాదికుండయి పెరుఁగుచు నొక్క నాఁడు రాక్షసభక్షణంబునం దనజనకు పంచత్వంబు దల్లివలన విని కోపదహనదందహ్యమాన హృదయుం డయి 'తపోమహత్త్వంబున నఖిలలోకసంహారంబు సేయుదు' నని యున్న మనుమని వారించి వసిష్ఠుం డి ట్లనియె. **132**

ప్రతిపదార్థం: అని= ఆప్రకారం; తన భార్య, ఐన, మదయంతి అను దానిని= మదయంతి అనే పేరుగల ఆమెను; ఋతుమతిన్= రజస్వల యైన దానిని; సమర్పించినన్= ఈయగా; అదియు= ఆమెయు; వసిష్ఠు, ప్రసాదంబునన్= వసిష్ఠుని దయచేత; గర్భిణి; అయి; పంద్రెండు+ఏఁడులు= పండ్రెండు సంవత్సరాలు; గర్భంబు, మోచి= గర్భాన్ని మోసి; వేసరి= విసుగుచెంది; ఒక్క; అశ్మ, శకలంబునన్= రాతిముక్కచేత; ఉదర భేదనంబునున్= కడుపు చీల్చుటను; చేసినన్= చేయగా; అశ్మకుండు, అను, రాజర్షి; పుట్టెన్= పుట్టాడు; అట; అదృశ్యంతికిన్= అదృశ్యంతికి; పరాశరుండు; ఉదయించి= పుట్టి; వసిష్ఠ, నిర్మిత, జాతకర్మ+ఆదికుండు+అయి= వసిష్ఠునిచేత చేయబడిన జాతకర్మం మొదలైనవి కలవాడై; పెరుగుఁచు; ఒక్కనాఁడు; రాక్షస, భక్షణంబునన్= రాక్షసుడు తినటంచేత; తన, జనకు, పంచత్వంబు= తనతండ్రియొక్క మరణం; తల్లివలన; విని; కోప, దహన, దందహ్యమాన హృదయుండు+అయి= కోప మనే అగ్నిచేత మిక్కిలిగా కాల్చబడుతున్న మనస్సు కలవా డై; తపస్+మహత్త్వంబునన్= తపస్సు యొక్క మహిమచేత; అఖిల, లోక, సంహారంబునన్= అన్ని లోకాలను చంపటం; చేయుదును=చేస్తాను; అని (కోపంతో) ఉండే; మనుమని, వారించి= పౌత్రుణ్ణి ఆపి; వసిష్ఠుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని, రజస్వల అయిన తన భార్య మదయంతిని వసిష్ఠునికి సమర్పించగా ఆమె అతని అనుగ్రహంతో గర్భిణి అయి, పన్నెండేళ్ళు గర్భం మోసి విసిగి, ఒక రాతిముక్కతో కడుపు చీల్చుకొనగా, అశ్మకుడు అనే రాజర్షి జన్మించాడు. అక్కడ అదృశ్యంతికి (శక్తి భార్యకు) పరాశరుడు జన్మించాడు. అతనికి వసిష్ఠుడు జాతకర్మాదులు జరిపించాడు. అతడు పెరుగుతూ 'రాక్షసుడు భక్షించటంచేత తనతండ్రి మరణించా డని ఒకనాడు తల్లి ద్వారా తెలిసికొని, కోపాగ్నితో మండుతున్న హృదయం కలవాడై తన తపోమహిమతో అఖిలలోకాలను నాశనం చేస్తా నని పూనుకొనగా అతడిని ఆపి, వసిష్ఠమహాముని ఇట్లా అన్నాడు.

సీ. వినవయ్య! కృతవీర్యుఁ డను జనపతి దొల్లి । భృగు వంశ యాజ్యుఁ డై పెక్కుక్రతువు
లొనరించి, యగణిత ధనదానముల వారిఁ । దృప్తులఁ గావించి దివికిఁ జనిన,
నతనివంశమున వా రతిధనలుబ్ధులై । కృత్యవీర్య ధనమెల్లఁ గ్లప్తి సేసి
కొని డాఁచియున్న వా రని భార్గవుల నెల్లఁ । బలికిన భార్గవుల్ భయము నొంది.

తే. కొంద ఱర్థము వారిక కూర్చి యిచ్చి; । రవనిసురవంశ్యులకు నిచ్చి రందుఁ గొంద,
ఱెవ్వరికి నీక తమ తమ యిండ్లఁ బాఁతి । కొని సుఖం బుండి రధము లై కొంద ఱందు. **133**

ప్రతిపదార్థం: వినవయ్య!= అయ్యా! విను; కృతవీర్యుఁడు; అను, జన, పతి= అనెడి రాజు; తొల్లి= పూర్వం; భృగు, వంశ, యాజ్యుఁడు+ఐ= భృగువంశం వారిని యాజ్యులుగా - అనగా యజ్ఞం చేయించే యాజ్ఞికులుగా కలవా డై; క్రతువులు= అనేక యజ్ఞాలు; ఒనరించి= చేసి; అగణిత, ధన, దానములన్= లెక్కలేనన్ని ధనదానాలచేత; వారిన్= వాళ్ళను; తృప్తులన్+కావించి= తృప్తినొందిన వారినిగా చేసి; దివికిన్= స్వర్గానికి; చనినన్= వెళ్ళగా; అతని, వంశము, వారు; అతి ధనలుబ్ధులు+ఐ= మిక్కిలిగా

ధనమునందు ఆశకలవారై; కృతవీర్యు, ధనము+ఎల్లన్= కృతవీరునియొక్క ధనాన్ని అంతా; క్లప్తి, చేసికొని= ఏర్పాటు చేసికొని; డాఁచి, ఉన్నవారు= దాచుకొని ఉన్నారు; అని= అని; భార్గవులన్+ఎల్లన్= భృగువంశం వారి నందరిని ఉద్దేశించి; పలికినన్= పలుకగా; భార్గవుల్= ఆ భృగువంశ బ్రాహ్మణులు; భయము, పొంది; కొందరు; అర్థము= ధనాన్ని; వారికి+అ= వారికే; కూర్చి= ఒకటిగా చేర్చి; ఇచ్చిరి= ఇచ్చారు; అందున్= వారిలో; కొందఱు= కొంతమంది; అవని, సుర, వంశ్యులకున్= బ్రాహ్మణ వంశాన పుట్టిన వారికి; ఇచ్చిరి; అందు, కొందఱు= అందులో మరికొంతమంది; ఎవ్వరికిన్= ఎవ్వరికికూడా; ఈక= ఇవ్వక; అధములు+ఐ= నీచులై; తమతమ, ఇండ్లన్; పాతికొని, సుఖంబు+ఉండిరి= తమ తమ ఇళ్ళలో పాతిపెట్టుకొని సుఖంగా ఉన్నారు.

తాత్పర్యం: వినవయ్యా! పూర్వం కృతవీర్యు డనే రాజు భృగువంశబ్రాహ్మణులను యాజ్ఞికులుగా పొంది, పెక్కు యాగాలు చేసి, లెక్కలేనన్ని ధనదానాలచే వాళ్ళను తృప్తిపరచి స్వర్గానికి వెళ్ళాడు. అతనివంశంవాళ్ళు ధన లోభంతో 'కృతవీరుని ధనాన్నంతా భృగువంశబ్రాహ్మణులు సంగ్రహించి దాచుకొని ఉన్నారు' అని పలుకగా, ఆ బ్రాహ్మణులు కొందరు భయపడి తమ దగ్గర ఉన్న ధనాన్ని ఒకచోట చేర్చి వాళ్ళకే ఇచ్చారు. మరికొందరు తమధనాన్ని వేర్వేరు బ్రాహ్మణవంశాలవాళ్ళకు ఇచ్చారు. ఇంక కొందరు తమ ఇళ్లలో పాతిపెట్టుకొన్నారు.

వ. అంత నా క్షత్త్రియు లొక్క భార్గవుని యిల్లు గ్రొచ్చి యనంతం బయిన యర్థంబు గని యలిగి, రాజధన వంచకులై రని భార్గవుల నెల్ల నిగ్రహించి, గర్భంబుల నున్న యర్భకులు మొదలుగా వధించిన, వెఱచి భార్గవుల భార్యలెల్ల హిమవంతంబునకుం బాఱిన; నం దొక్క భృగుపత్ని భయంపడి, తన యూరుదేశంబున గర్భంబు ధరియించిన, నెఱింగి క్షత్త్రియులు దాని భేదింప సమకట్టి వచ్చిన నంతకు ముందఱ. 134

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; ఆ క్షత్రియులు= ఆ రాజులు; ఒక్క, భార్గవుని, ఇల్లు= ఒక భృగువంశ బ్రాహ్మణుని ఇల్లు; క్రొచ్చి= త్రవ్వి; అనంతంబు+అయిన= అంతం లేనిదైన అనగా అత్యధిక మైన, అర్థంబున్= ధనాన్ని; కని= చూచి; అలిగి= కోపించి; రాజ, ధనవంచకులు+ఐరి+అని= రాజుయొక్క ధనాన్ని అపహరించిన వాళ్ళు అయ్యా రని; భార్గవులన్+ఎల్లన్= భృగువంశ బ్రాహ్మణుల నంతా; నిగ్రహించి= పడద్రోసి; గర్భంబులన్+ఉన్న= కడుపు లో ఉన్న; అర్భకులు= బాలురు; మొదలుగా; వధియించినన్= చంపగా; వెఱచి= భయపడి; భార్గవుల; భార్యలు+ఎల్లన్= భార్గవుల, భార్యలందరు; హిమవంతంబు నకున్= హిమాలయ పర్వతానికి; పాఱినన్= పరుగెత్తగా; అందు+ఒక్క= వారిలో ఒక్క; భృగుపత్ని= భృగువంశపు బ్రాహ్మణుని భార్య, భయంపడి; తన; ఊరు, దేశంబునన్= తొడయందు; గర్భంబు= గర్భాన్ని; ధరియించినన్= ధరింపగా; ఎఱింగి= తెలిసికొని; క్షత్రియులు= రాజులు; దానిన్= దానిని; భేదింపన్= చీల్చుటకు; సమకట్టి= పూనుకొని; వచ్చినన్= రాగా; అంతకు ముందఱ= అంతకంటె మునుపే.

తాత్పర్యం: తర్వాత ఆ క్షత్రియులు ఒక భృగువంశబ్రాహ్మణుని ఇల్లు త్రవ్వి అత్యధికమైన ధనం చూచి, కోపించి, రాజధనం వంచనతో గ్రహించా రని ఆ భృగువంశబ్రాహ్మణుల నందరినీ పడద్రోసి, కడుపులలో ఉన్న బాలురు మొదలుగా అందరినీ చంపగా, వాళ్ళభార్యలంతా భయపడి హిమాలయానికి పరుగెత్తారు. వాళ్ళలో ఒక బ్రాహ్మణునిభార్య తనతొడలో గర్భాన్ని ధరించగా, క్షత్రియులు అది తెలిసికొని దానినికూడ విచ్ఛిన్నం చేయా లని రాగా, అంతకు ముందే.

భార్గవుండైన ఔర్వునిజననము (సం.1-169-20)

క. భువనోపప్లవసమయో। ద్భవ భానునిభప్రభావిభాసితుఁ డయి భా
ర్గవుఁ డూరుదేశమున ను। ద్భవించె మహి వెలుఁగుచుండఁ బ్రభ నౌర్వుఁ డనన్. 135

ప్రతిపదార్థం: భువన+ఉపప్లవ, సమయ+ఉద్భవ, భాను, నిభ, ప్రభా, విభాసితుఁడు+అయి= లోకాలయొక్క ప్రళయకాలమందు పుట్టిన సూర్యునితో సమానమైన కాంతిచేత ప్రకాశించేవా డై; భార్గవుఁడు= భృగువంశంవాడు; ఊరు, దేశమునన్= తొడయందు; ఔర్వుఁడు+అనన్= ఔర్వు డనే పేరుతో; ప్రభన్= కాంతితో; మహిన్= భూమిమీద; వెలుఁగుచుండన్= ప్రకాశించేటట్లుగా; ఉద్భవించెన్= పుట్టెను.

తాత్పర్యం: ప్రళయకాలసూర్యునివంటి కాంతితో భృగువంశంవాడు తొడనుండి పుట్టి ఔర్వు డనే పేరుతో లోక ప్రసిద్ధు డయ్యాడు.

మ. అమితౌజుం డగు వానిఁ జూచి కృతవీర్యామ్నాయజ క్షత్రియా
ధములెల్లన్ హతదృష్టు లై కృపణతం దత్పర్వతారణ్యదే
శములం గ్రుమ్మరుచుండి రంధు లయి; నిశ్శంకం బ్రతిక్రూరక
ర్మములం దుద్యతు లైన వారికి నశర్మప్రాప్తి గాకుండునే. 136

ప్రతిపదార్థం: అమిత+ఓజుండు+అగు= మిక్కిలి తేజస్సు కలవాడైన; వానిన్= ఆ ఔర్వుని; చూచి; కృతవీర్య+ఆమ్నాయజ, క్షత్రియ+అధములు+ఎల్లన్= కృతవీర్యుని వంశంలో పుట్టిన నీచులైన క్షత్రియులంతా; హత, దృష్టులు+ఐ= కొట్టబడిన చూపులు కలవాళ్ళయి అనగా నాశమైన దృష్టి కలవాళ్ళయి; అంధులు+అయి= గ్రుడ్డివాళ్ళయి; కృపణతన్= దీనత్వంతో; తద్+పర్వత, అరణ్య, దేశములన్= ఆ కొండలయొక్క, అడవులయొక్క ప్రదేశాలలో; క్రుమ్మరుచుండిరి= తిరుగుతూ ఉన్నారు; నిశ్శంకంబు= జంకులేకుండ; అతి, క్రూర, కర్మములందు= మిక్కిలి దుర్మార్గపు పనులలో; ఉద్యతులు+ఐన; వారికిన్= ప్రయత్నం కలవాళ్ళకి; అశర్మప్రాప్తి= సంతోషం కానిదానిని పొందటం - అనగా దుఃఖాన్ని పొందటం; కాకుండునే= జరుగకుండునా.

తాత్పర్యం: అమితమైన తేజస్సు కల ఆ ఔర్వుడిని చూచిన వెంటనే కృతవీర్యుని వంశంలో పుట్టిన క్షత్రియాధము లంతా దృష్టి కోల్పోయి, గ్రుడ్డివా ళ్ళయి దైన్యంతో ఆ పర్వతారణ్యప్రదేశాలలో తిరుగుతూ ఉండిపోయారు. జంకు లేకుండ పరమదుర్మార్గపుపనులు చేయటానికి ప్రయత్నించేవాళ్ళకు దుఃఖం ప్రాప్తించకుండా ఉంటుందా?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

వ. అ ట్లా క్షత్రియు లందఱు నంధు లై భృగుపత్ని యొద్దకు వచ్చి, మాకు దృష్టిదానంబుఁ బ్రసాదింపవలయు నని వేఁడిన నది వారల కి ట్లనియె. 137

ప్రతిపదార్థం: అట్లు; ఆ క్షత్రియులు; అందఱున్; అంధు లై= గ్రుడ్డివాళ్ళయి; భృగుపత్ని= భృగువు భార్య; వద్దకు= దగ్గరకు; వచ్చి= చనుదెంచి; మాకున్; దృష్టి= చూపు; దానంబున్= ఇచ్చుట; ప్రసాదింపవలయును; అని= అని; వేఁడినన్= ప్రార్థింపగా; అది, వారలకున్= ఆమె వాళ్లతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ విధంగా ఆ క్షత్రియులంతా గ్రుడ్డివాళ్ళయి భృగుభార్యవద్దకు వచ్చి 'మాకు చూపు మరల ప్రసాదించు' మని వేడుకోగా ఆమె వాళ్ళతో ఇట్లా అన్నది.

మధ్యాక్కర.

ఏను మీ దృష్టులు గొన్నదానఁ గా; నిక్కుమారుండు
భానుతేజుండు మీచేఁ దనగురులు పరిభూతు లయిన
దానికి నలిగి మీ పాపబుద్ధికిఁ దగ నిట్లు సేసె;
వీని మే రెఱుఁగరె భార్గవకులము వెలిఁగించువాని. 138

ప్రతిపదార్థం: ఏను= నేను; మీ, దృష్టులు= మీ చూపులను; కొన్న, దానన్= తీసికొన్న దానను - అనగా మీకు లేకుండ చేసిన దానను; కాన్= కాను; ఈ+కుమారుండు; భాను, తేజుండు= సూర్యునితో సమానమైన తేజస్సుకలవాడు; మీచేన్= మీ చేత; తన, గురులు= తన తండ్రి తాతలు; పరిభూతులు= అవమానింపబడినవాళ్ళు; అయిన, దానికిన్= అయినందుకు; అలిగి= కోపించి; మీ, పాప, బుద్ధికిన్= మీ యొక్క పాపచింతనకు; తగన్= తగినట్లు; ఇట్లు; చేసెన్; భార్గవ, కులము; వెలిఁగించువాని; వీని, మీరు+ఎఱుఁగరే= ఇతనిని మీరు ఎరుగరా?

తాత్పర్యం: మీ చూపులను నేను పోగొట్టలేదు. ఈ కుమారుడు సూర్యసమానమైన తేజస్సు కలవాడు. తన తండ్రితాతలను మీరు అవమానించా రని కోపించి, మీ పాపబుద్ధికి తగినట్లు ఇట్లా చేశాడు. భార్గవకులాన్ని ప్రకాశింపజేసే వీడిని మే రెరుగరా?

వ. 'ఇ క్కుమారుండు నూఱు సంవత్సరములు నా యూరు గర్భంబున నుండి సకల వేదవేదాంగంబులు నేర్చినవాఁడు, మహాతపోనిధి; మీకుం గరుణించు నితనిం బ్రార్థింపుం', డనిన, నాక్షత్రియులు నతిభక్తులై యౌర్వుం బ్రార్థించి తత్ప్రసాదంబున దృష్టులు వడసి చని; రంత నౌర్వుండు దన పితృబంధుజనులెల్ల నొక్కటం బరలోక గతు లగుటకు దుఃఖించి, సకలలోక ప్రలయార్థంబుగా ఘోరతపంబు సేయందొడంగిన. 139

ప్రతిపదార్థం: ఈ+కుమారుండు; నూఱు, సంవత్సరములు; నా, ఊరు గర్భంబునన్= నా తొడయందు; ఉండి= నివసించి; సకల, వేద, వేద+అంగంబులు= అన్ని వేదములు, వేద వేదాంగములు; నేర్చినవాఁడు= అభ్యసించినవాడు; మహా, తపోనిధి= గొప్ప తపస్సునకు స్థానమైనవాడు; మీకున్= మిమ్ము; కరుణించున్= కరుణిస్తాడు; ఇతనిన్= వీనిని; ప్రార్థింపుండు= ప్రార్థించండి; అనినన్= అనగా; ఆ క్షత్రియులున్= ఆ క్షత్రియులు; అతి, భక్తులు+ఐ= మిక్కిలి భక్తికలవారై; ఔర్వున్, ప్రార్థించి= ఔర్వుని ప్రార్థించి (వేడుకొని); తత్+ప్రసాదంబునన్= అతనియొక్క దయచేత; దృష్టులు= చూపులు; పడసి= పొంది; చనిరి= వెళ్ళారు; అంతన్= అటుపై; ఔర్వుండు= ఔర్వుడు; తన, పితృ బంధుజనులు+ఎల్లన్= తన తండ్రులు, బంధువులు అందరు; ఒక్కటన్= ఒక్కటిగా, ఒక్కసారిగా; పరలోక, గతులు+అగుటకున్= మరొకలోకానికి వెళ్లినవారగుటకు; - అనగా మరణించినందుకు; దుఃఖించి; సకలలోక; ప్రలయ+అర్థంబుగాన్= అన్ని లోకాల నాశనంకొరకు; ఘోర తపంబు= భయంకరమైన తపస్సు; చేయన్+ తొడంగినన్= చేయటానికి పూనుకొనగా.

తాత్పర్యం: 'ఈ కుమారుడు వందసంవత్సరాలు నా ఊరువులో ఉండి వేదవేదాంగా లన్నిటిని నేర్చాడు; మహాతపోనిధి. ఇతడిని ప్రార్థించండి. మిమ్ములను కరుణిస్తాడు' అని పల్కగా, ఆ క్షత్రియులు మిక్కిలి భక్తి కలవాళ్ళయి ఔర్వుని

ప్రార్థించి, అతని దయతో తిరిగి దృష్టిని పొంది వెళ్ళిపోయారు. తర్వాత ఔర్వుడు తన తండ్రులు, బంధువులు అందరు ఒక్కసారిగా మరణించినందుకు దుఃఖించి, లోకాలన్నింటిని నాశనం చేసేందుకు భయంకరమైన తపస్సు చేయ పూనుకొన్నాడు.

చ. అతని తపంబు పెంపునఁ జరాచరసంభృతమైన విష్టప
త్రితయము భీతిఁ బొందిన, ధృతిం బితృలోకనివాసు లైన త
త్పితృవరు లెల్ల వచ్చి కడుఁ బ్రీతి నపాకృత గర్వు నౌర్వు న
ప్రతిమతపోవిభాసిఁ గని పల్కిరి తద్దయు శాంతచిత్తులై. 140

ప్రతిపదార్థం: అతని, తపంబు, పెంపునన్= ఆ ఔర్వుని తపస్సుయొక్క అధిక్యంచేత; చర+అచర, సంభృతము+అయిన= కదలిక కలవాటితో, కదలికలేని వాటితో నిండిన; విష్టప, త్రితయము= లోకాలు మూడు; భీతిన్= భయాన్ని; పొందినన్= పొందగా; ధృతిన్= సంతోషంతో; పితృలోక, నివాసులు+ఐన= పితృలోకంలో ఉన్నవాళ్ళయిన; తద్+పితృ, వరులు+ఎల్లన్= అతనియొక్క ఉత్తములైన తండ్రులంతా; వచ్చి; కడున్= మిక్కిలి; ప్రీతిన్= ప్రేమతో; అపాకృత, గర్వున్= తొలగింపబడిన గర్వం కలవాడిని; అప్రతిమ, తపస్+విభాసిన్= సాటిలేని తపస్సుచే ప్రకాశించేవాడిని; ఔర్వున్= ఔర్వుని; కని= చూచి; తద్దయున్= మిక్కిలి; శాంతచిత్తులు+ఐ= శాంతంతో కూడిన మనస్సుకలవాళ్ళయి; పలికిరి.

తాత్పర్యం: ఆ ఔర్వుని తీవ్రతపస్సుకు చరాచరాలతో కూడిన ముల్లోకాలు భీతిచెందగా, పితృలోకవాసులైన అతని తాతతండ్రులంతా సంతోషంతో వచ్చి మిక్కిలిప్రేమతో - గర్వం లేనివాడు, సాటిలేని తపస్సుతో ప్రకాశించేవాడు అయిన ఔర్వుడిని చూచి మిక్కిలి శాంతచిత్తులై ఈ విధంగా పలికారు.

పితృదేవతలు ఔర్వుని శాంతచిత్తునిఁ జేయుట (సం.1-170-14)

వ. 'అయ్యా! నీ తపో మహత్త్వంబుఁ జూచి లోకంబు లెల్ల భయంపడియెడు; లోకానుగ్రహంబుగా నీరోషంబు విడువుము; మే మసమర్థుల మై క్షత్రియులచేత వధియింపం బడిన వారము గాము; ధనలుబ్ధుల మయి ధనంబు దాఁచినవారము గాము; ధనము వలసినం గుబేరుండు దాన మాకుఁ దెచ్చి యిచ్చుం; దపోమహత్త్వంబున మాకు నాయువు గడుంబెద్దయైన నిర్వేదించి మనుష్యలోకంబున నుండ నొల్లక యాత్మఘాతంబునం బుణ్యలోకంబులు లేమిం జేసి దానిం బరిహరించి యా క్షత్త్రియులతో వైరం బమర్చికొని తన్నిమిత్తంబున దేహంబులు విడిచితిమి; భార్గవులతేజంబు నొరులు పరిభవింప నోపుదురె? కావున నీవు దీనికింగా సర్వజనోపద్రవంబు సేయవల; దిది మా కభీష్టం' బనిన నౌర్వుండు వారల కి ట్లనియె. 141

ప్రతిపదార్థం: అయ్యా; నీ, తపస్+మహత్త్వంబున్= నీ తపస్సుయొక్క గొప్పతనాన్ని; చూచి; లోకంబులు+ఎల్లన్; భయంపడియెడు; లోక+అనుగ్రహంబుగా= లోకాలకు మేలు కలిగేటట్లుగా; నీ, రోషంబు= నీ కోపాన్ని; విడువుము; మేము= అందరము; అసమర్థులము+ఐ= శక్తిలేని వారమై; క్షత్రియులచేత; వధియింపన్+పడిన, వారము కాము= చంపబడినవాళ్ళం కాము; ధన, లుబ్ధులము+అయి= ధనమునందు మిక్కిలి ఆశ కలవాళ్ళ మై; ధనంబు= ధనాన్ని; దాచిన వారము కాము= దాచిపెట్టిన వాళ్లం కాము; ధనము; వలసినన్= అవసరమైతే; కుబేరుండు; తాన్+అ= తానే; మాకున్; తెచ్చి ఇచ్చున్; తపస్+మహత్త్వంబునన్=

తపస్సుయొక్క మహిమచేత; మాకున్= మాకు; ఆయువు= ఆయుష్యం; కడున్= మిక్కిలి; పెద్ద, ఐనన్= ఎక్కువ కాగా; నిర్వేదించి= విరక్తి చెంది; మనుష్య లోకంబునన్= మానవలోకంలో; ఉండన్= ఉండటానికి; ఒల్లక= ఇష్టపడక; ఆత్మ, ఘాతంబునన్= ఆత్మహత్యవలన; పుణ్యలోకంబులు; లేమిన్+చేసి= లేకుండటంవలన; దానిన్= ఆత్మహత్యను; పరిహరించి= వదలి; ఆ, క్షత్రియులతో; వైరంబు; అమర్చికొని= ఏర్పాటు చేసికొని; తద్+నిమిత్తంబునన్= ఆ కారణంగా; దేహంబులు, విడిచితిమి; భార్గవుల= భృగువంశం బ్రాహ్మణులయొక్క; తేజంబున్= కాంతిని, పరాక్రమాన్ని; ఒరులు= ఇతరులు; పరిభవింపన్+ ఓపుదురే= అవమానింపగలరా; కావునన్; నీవు; దీనికిన్+కా= దీనికొరకని; సర్వ, జన+ఉపద్రవంబు= అందరు ప్రజలకు హాని; చేయ, వలదు= చేయవద్దు; ఇది; మాకు; అభీష్టంబు= కోరిక; అనినన్= అని చెప్పగా; ఔర్వుండు; వారలకున్= వాళ్లకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నాయనా! నీ తపోమహిమ చూచి లోకా లన్నీ భయపడుతున్నాయి. లోకాలకు మేలు కలిగే విధంగా నీ కోపాన్ని వదలిపెట్టుము. మేము అసమర్థుల మై క్షత్రియులచేత వధింపబడ లేదు. ధనంమీది పేరాసతో ధనాన్ని దాచలేదు. మాకు ధనం అవసరమైతే, కుబేరుడు తానే తెచ్చి యిస్తాడు. తపోమహిమతో మాకు ఆయుష్యం మిక్కిలియెక్కువ కాగా విరక్తి చెంది, మానవలోకంలో ఉండటానికి ఇష్టం లేక, ఆత్మహత్య చేసికొంటే పుణ్యలోకాలు రావని, దాన్ని వదలి, ఆ క్షత్రియులతో వైరం తెచ్చుకొన్నాం. ఆ కారణంగా దేహాలు విడిచాం. భృగువంశ బ్రాహ్మణులు తేజస్సును ఇతరులు పరాభవించగలరా? కనుక దీనికై నీవు ప్రజలందరికీ హాని చేయవద్దు. ఇది మా కోరిక' అని పల్కగా ఔర్వుడు వాళ్ళతో ఇట్లా అన్నాడు.

మత్తకోకిలము.

మానితం బగు నా తపోమహిమం బ్రిలోక పరాభవం
బేను జేయఁగఁ బూని చేసితి నిట్టి దొక్క ప్రతిజ్ఞ మున్,
దీని నెట్టులు గ్రమ్మఱింతు మదీయ భాషిత మెన్నఁడు
న్నేని మోఘము గాదు దిగ్ధరణీరవీందు లెఱుంగఁగన్. 142

ప్రతిపదార్థం: మానితంబు+అగు= పూజింపబడినదయిన; నా, తపోమహిమన్ = నా తపస్సుయొక్క గొప్పతనంచేత; ఏను=నేను; త్రిలోక, పరాభవంబున్= ముల్లోకాల నాశనాన్ని; చేయఁగన్= చేయటానికి; పూని= ప్రయత్నించి; పూర్వము; ఇట్టిది= ఇటువంటిదైన, ఒక్క, ప్రతిజ్ఞ= ఒక్క ప్రతిన; చేసితిన్= చేశాను; దీనిన్= దీన్ని; ఎట్టులు= ఏ విధంగా; క్రమ్మరింతున్= మరలిస్తాను; దిక్+ధరణీ, రవి+ఇందులు= దిక్కులు, భూమి, సూర్యుడు, చంద్రుడు; ఎఱుంగఁగన్= తెలియగా; మదీయ, భాషితము= నాదైన మాట; ఎన్నఁడున్+ఏని= ఎన్నడైనా; మోఘము= వ్యర్థం; కాదు= కాజాలదు.

తాత్పర్యం: ప్రశస్తమైన నా తపోమహిమతో ముల్లోకాలను నాశనం చేస్తా నని పూర్వం నే నొక ప్రతిజ్ఞ చేశాను. దీనిని ఏ విధంగా మరలిస్తాను. దిక్కులు, భూమి, సూర్యచంద్రులు సాక్షులుగా నా మాట ఎన్నడూ వ్యర్థం కాదు.

విశేషం: ఔర్వుడు తన ప్రతిజ్ఞ వ్యర్థం కాదు అని చెప్పే సందర్భంలో ప్రతిజ్ఞాపాలన తప్ప దని నిర్ధారించాడు. అట్టి నిర్ధారణ వాక్యం ఏ స్వరంలో ఏ విధంగా ప్రకటించాలో ప్రస్తుత పద్యగతిలో ప్రతీయమానమైంది.

క. మతి మఱచి యనిస్తీర్ణ । ప్రతిజ్ఞుఁ డగు వాని కోపపటుదహన మని
ర్గత మయి వడి నరణి సము । త్థిత దహనమపోలె నాత్మదేహము నేర్చున్. 143

ప్రతిపదార్థం: మతిన్= మనస్సునందు; మఱచి; అనిస్తీర్ణ, ప్రతిజ్ఞుఁడు= దాటబడని ప్రతిజ్ఞ కలవాడు; అగు, వాని, కోప, పటు, దహనము= అయిన వ్యక్తియొక్క కోపం అనెడి గొప్ప అగ్ని; అనిర్గతము+అయి= బయటికి వెలువడని దై; అరణి, సమ్+ఉత్థిత, దహనము+అ పోలెన్= అరణియందు పుట్టిన నిప్పువలె, వడిన్= వేగమే; ఆత్మదేహమున్= తన శరీరాన్ని; ఏర్చున్= కాల్చును.

తాత్పర్యం: మరచిపోయి తన ప్రతిజ్ఞను నేరవేర్చుకొననివాడి కోపాగ్ని వెలుపలికి రానిదై, అరణిలో పుట్టిన అగ్నివలె వెంటనే అతనిశరీరాన్ని కాల్చివేస్తుంది.

విశేషం: అలం: ఉపమ.

క. అలయక నిమిత్తజంబగు । నలుకను క్షమియించి శాంతుఁ డగు పురుషుం డి
మ్ముల రక్షింపఁగ నోపునె । పొలుపుగ ధర్మార్థకామములు సమములుగన్. **144**

ప్రతిపదార్థం: అలయక= శ్రమపడక; నిమిత్తజంబు+అగు, అలుకను= కారణంవలన పుట్టిన దైవ కోపాన్ని; క్షమించి= ఓర్చి; శాంతుఁడు+అగు= శాంతం కలవాడైన; పురుషుండు= మానవుడు; పొలుపుగా= చక్కగా; ధర్మ+అర్థ, కామములు= ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలు; సమములుగన్= సమానాలుగా; ఇమ్ములన్= తగినట్లుగా; రక్షింపఁగన్+ఓపునె= రక్షింప కలుగునా.

తాత్పర్యం: ఒక కారణంవలన కలిగిన కోపాన్ని తీర్చుకొనటానికి శ్రమపడక, సహించి శాంతు డైన మానవుడు ధర్మార్థకామాలను చక్కగా, సమానంగా రక్షించగలడా?

తే. పాపు లై క్షత్త్రియాధముల్ భార్గవులకు । నట్లు హింస గావించు నాఁ డార్తనాద
మూరుగర్భగతుండనై యుండి వినిన । నాఁడ కోప మసహ్యమై నన్నుఁ బొందె. **145**

ప్రతిపదార్థం: పాపులు+ఐ= దుర్మార్గు లై; క్షత్త్రియ+అధముల్= నీచు లైన క్షత్రియులు; భార్గవులకున్= భృగువంశ బ్రాహ్మణులకు; అట్లు; హింస, కావించునాఁడు= ఆ విధంగా హింస చేసే రోజు, ఆర్తనాదము= దుఃఖధ్వని; ఊరు, గర్భ, గతుండను+ఐ= తొడలోపల ఉన్నవాడనై; ఉండి= వసించి; వినిన, నాఁడు+అ= వినిన రోజే; కోపము; అసహ్యము+ఐ= ఓర్వరాని దై; నన్నున్; పొందెన్.

తాత్పర్యం: దుర్మార్గులై, నీచు లైన క్షత్రియులు - భృగువంశ బ్రాహ్మణులను ఆ విధంగా హింసిస్తున్నవాడే, వాళ్ళ దుఃఖధ్వనిని నేను తొడలోపల ఉండి విన్నప్పుడే నాకు సహించరాని కోపం కలిగింది.

తే. ఎఱుక గలఁ డేని మఱి శక్తుఁ డేని యన్యు । లన్యులకు హింస గావించునపుడు దానిఁ
బూని వారింపకున్న నప్పురుషుఁ డేఁగు । హింస చేసినవారల యేఁగుగతికి. **146**

ప్రతిపదార్థం: ఎఱుక=జ్ఞానం; కలఁడు+ఏని= ఉన్నవాడైతే; అన్యులు= ఇతరులు; అన్యులకున్= ఇతరులకు; హింస, కావించు, నపుడు; దానిన్= ఆ హింసను; పూని= ప్రయత్నించి; వారింపక+ఉన్నన్= ఆపకున్నట్లయితే; ఆ+పురుషుఁడు; హింస, చేసిన వారల; ఏఁగు గతికిన్= వెళ్ళే మార్గానికి (చోటుకి) (నరకానికి అని భావం).

తాత్పర్యం: జ్ఞానవంతుడు, సమర్థుడు అయినవాడు - ఒకరు మరొకరిని హింసించే సమయంలో ప్రయత్నించి ఆ హింసను నివారించకుంటే, అతడుకూడ ఆ హింస చేసినవాళ్ళగతినే (నరకాన్నే) పొందుతాడు.

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తి.

వ. 'కావున లోకంబులయందు సామర్థ్యంబు గలిగి పాప ప్రతిషేధంబు సేయని వారల నుద్దేశించి యలిగితి; నేనును మీ వచనంబతిక్రమింప నోడుదు; నఖిలలోకదహనోద్యతం బయిన నా కోపదహనంబు నిగృహీతం బయిన నన్ను దహించు; నేమి సేయు వాఁడ? మీరు సర్వలోకహితులరు; నాకును లోకంబులకును హితం బగునట్లుగా నుపదేశింపుఁ' డనిన నౌర్వునకుం బితరు లి ట్లనిరి. 147

ప్రతిపదార్థం: కావునన్; లోకంబుల అందున్= లోకాలలో; సామర్థ్యంబు; కలిగి; పాప, ప్రతిషేధంబు= పాపాన్ని ఆపటాన్ని; చేయని వారలన్= చేయనివాళ్లను; ఉద్దేశించి; అలిగితిని= కోపించాను; ఏనును= నేనుకూడ; మీ, వచనంబు= మీ మాట; అతిక్రమింపన్= దాటుటకు; ఓడుదును= భయపడతాను; అఖిల, లోక, దహన+ఉద్యతంబు+అయిన= అన్ని లోకాలను కాల్చటానికి పూనుకొన్న; నా, కోప, దహనంబు= నా కోప మనే నిప్పు; నిగృహీతంబు+అయినన్= నివారింపబడిన దైతే; నన్ను+అ= నన్నే; దహించున్= కాల్చును; ఏమి, చేయువాఁడన్= నేనేమి చేయాలి; మీరు; సర్వలోక, హితులరు= అన్ని లోకాలకు మేలు కోరేవారు; నాకును, లోకంబులకును, హితంబు+అగునట్లుగాన్= నాకూ, లోకాలకూ మేలు కలిగేటట్లుగా; ఉపదేశింపుఁడు; అనినన్= అని అడుగగా; ఔర్వునకున్= ఔర్వునికి; పితరులు= పితృదేవతలు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: 'అందుచేత లోకాలలో - సామర్థ్యం ఉండి, పాపాన్ని ఆపటానికి ప్రయత్నంచేయనివాళ్ళను ఉద్దేశించి కోపం వహించాను. నేను మీ మాట దాటటానికి భయపడతాను. లోకాలన్నింటిని దహించటానికి పూనుకొన్న నా కోపాగ్నిని ఆపితే, అది నన్నే దహిస్తుంది. ఇప్పు డేం చేయాలి? నాకూ, ఈ లోకాలకూ మేలు కలిగే విధంగా ఉపదేశించండి' అని పల్కగా ఔర్వునితో పితృదేవతలు ఇట్లా అన్నారు.

ఆ. జలములంద యుండు సర్వలోకంబులు । గాన నీ మహోగ్ర కలుష వహ్ని
జలధిలోన విడిచి సత్యప్రతిజ్ఞుండ । వగుము; జలధి జలము నది దహించు. 148

ప్రతిపదార్థం: సర్వ, లోకంబులు= అన్ని లోకాలు; జలములు+అంద= నీటియందే; ఉండున్= ఉంటాయి; కాన= కనుక; నీ, మహా+ఉగ్ర, కలుషవహ్నిన్= నీయొక్క మిక్కిలి భయంకరమైన కోప మనే అగ్నిని; జలధిలోనన్= సముద్రంలో; విడిచి; సత్య, ప్రతిజ్ఞుఁడవు= సత్యమైన ప్రతిజ్ఞ కలవాడవు; అగుము= కావలసింది; ఆ కోపాగ్ని; జలధి, జలమున్= సముద్రపు నీటిని; దహించున్= కాల్చుతుంది.

తాత్పర్యం: అన్నిలోకాలూ నీటిలోనే ఉంటాయి. కనుక మహాభయంకరమైన నీ కోపాగ్నిని సముద్రంలో విడిచిపెట్టి; నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకో. అది సముద్రంలోని నీటిని దహిస్తుంది.

వ. 'అనిన నౌర్వుండు పితృదేవతాదేశంబునఁ దన కోపానలంబు సముద్రంబులో వైచిన, నది యౌర్వానలంబు నా నశ్వముఖంబున నబ్ధిజలంబులఁ ద్రావుచుండు; నిది వేదంబులయందు వినంబడియెడుకథ గావున నీవును నౌర్వునట్ల ధర్మవిదుండవు భువనపరిభావి యైన యీ క్రోధంబు విడువు' మనిన వసిష్ఠు వచనంబునం బరాశరుండు గోపం బుపసంహరించి, రాక్షసవినాశార్థంబుగా సత్త్రయాగంబు సేయం గడంగిన. 149

ప్రతిపదార్థం: అనినన్= అని తెలుపగా; ఔర్వుండు; పితృదేవతా+ఆదేశంబునన్= పితృదేవతలయొక్క ఆజ్ఞచేత; తన, కోప+అనలంబు= కోపమనే అగ్నిని; సముద్రంలో= సాగరంలో; వైచినన్= విసరివేయగా; అది= అదే; ఔర్వ+అనలంబు, నాన్= ఔర్వాగ్ని అనే పేరుతో; అశ్వముఖంబునన్= గుఱ్ఱపుముఖంతో; అబ్ధి, జలంబులన్= సముద్రపు నీటిని; త్రావుచున్+ఉండున్= త్రాగుతూ ఉన్నది; ఇది, వేదంబులన్ అందు= ఇది వేదాలలో; వినంబడియెడు= వినిపించెడి; కథ= కథ; కావునన్= కాబట్టి; నీవును= నీవు కూడా; ఔర్వు, అట్ల= ఔర్వునివలె; ధర్మ, విదుండవు= ధర్మాన్ని తెలిసినవాడవు; భువన, పరిభావి,ఐన= లోకములను నశింపచేసేది ఐన; ఈ, క్రోధంబున్= ఈ కోపాన్ని; విడువుము+అనిన= వదలిపెట్టు అని పలికినట్టి; వసిష్ఠ, వచనంబునన్= వసిష్ఠునిమాటప్రకారం; పరాశరుండు; కోపంబు= కోపాన్ని; ఉపసంహరించి= మరలించి; రాక్షస, వినాశ+ అర్థంబుగాన్= రాక్షసులచావుకొరకు; సత్త్రయాగంబు= సత్రయాగాన్ని; చేయన్= చేయటానికి; కడంగినన్= పూనుకొనగా.

తాత్పర్యం: అని పల్కగా ఔర్వుడు పితృదేవతల ఆజ్ఞ ప్రకారం తన కోపాగ్నిని సముద్రంలో వేయగా, అది ఔర్వాగ్ని అనే పేరుతో గుఱ్ఱపుముఖంతో సముద్రపునీటిని త్రాగుతూ ఉంటుంది. ఇది వేదాలలో వినిపించే కథ. 'నీవుకూడా ఔర్వునివలె ధర్మం తెలిసినవాడవు కనుక లోకాలను నశింపజేసే ఈ కోపాన్ని విడిచిపెట్టుము' అని పల్కగా, వసిష్ఠునిమాట ప్రకారం పరాశరుడు కోపాన్ని ఉపసంహరించి, రాక్షసవినాశంకొరకు సత్రయాగం చేయాలని పూనుకొన్నాడు.

పరాశరుఁడు రాక్షసవినాశార్థంబు సత్రయాగంబు సేయుట (సం.1-172-2)

తే. శక్తి రాక్షసనిహతుఁ డై చనిన శోక। దహనహతుఁ డై వసిష్ఠుండు దానిఁ దలఁచి
కడుఁ బ్రశాంతాత్ముఁ డయ్యు రాక్షసవినాశ। మొలసి మనుమని వారింపకుండె నంత. 150

ప్రతిపదార్థం: శక్తి= శక్తిమహాముని; రాక్షస, నిహతుఁడు+ఐ= రాక్షసునిచేత చంపబడినవాడై; చనినన్= చనిపోగా; వసిష్ఠుండు, ప్రశాంత+ఆత్ముఁడు+అయ్యున్= శాంతమైన మనస్సు కలవాడే అయినా; దానిన్= దానిని; తలఁచి= తలచుకొని; శోక, దహన, హతుఁడు+ఐ= శోక మనే అగ్నిచేత మనస్సు చెడినవాడై; రాక్షస, వినాశము= రాక్షసులయొక్క చావు; ఒలసి= కాంక్షించి; మనుమనిన్= మనుమడైన పరాశరుణ్ణి; వారింపక= ఆపక; ఉండెన్; అంతన్= అటుపై.

తాత్పర్యం: శక్తి మహాముని రాక్షసనిహతు డై గతింపగా, వసిష్ఠుడు శాంతమైన మనస్సు కలవాడే అయినప్పటికీ, దానిని తలచుకొని దుఃఖాగ్నితో మనస్సు చెడినవాడై; తన మనుమ డైన పరాశరుడు రాక్షసవినాశనార్థం చేసే యాగప్రయత్నాన్ని నివారించలేదు.

క. ఘోరాకారులు కృతహా। హారవులు సబాలవృద్ధు లయి పడిరి దురా
చారులు రాక్షసులు ముని। ప్రారబ్ధాధ్వరసమిద్ధపావకశిఖలన్. 151

ప్రతిపదార్థం: ఘోర+ఆకారులు= భయంకరమైన రూపం కలవాళ్ళు; కృత, హాహా, రవులు= చేయబడిన హాహా అనేధ్వని కలవాళ్ళు; దుర్+ఆచారులు= చెడుప్రవర్తన కలవాళ్ళు; రాక్షసులు, స, బాల, వృద్ధులు+అయి= బాలురతో, ముసలి వాండ్రతో కూడినవాళ్లయి; ముని, ప్ర+ఆరబ్ధ+అధ్వర, సమిద్ధ, పావక, శిఖలన్= పరాశరమునిచేత గొప్పగా ప్రారంభింపబడిన యజ్ఞమునందలి మండుతున్న అగ్నిజ్వాలలలో; పడిరి.

తాత్పర్యం: దుర్మార్గులైన రాక్షసులు, భయంకరమైన హాహాకారాలతో, బాలురతో, వృద్ధులతో సహా పరాశరుడు ప్రారంభించిన యాగంలో - మండుతున్న అగ్నిజ్వాలలలో పడిపోయారు.

వ. ఇట్లు పరాశరుండు గావించు సత్త్రయాగంబున నైన రాక్షసకులప్రళయంబుఁ జూచి పులస్త్యపులహక్రతువులు మహామునిసంఘంబులతో వసిష్ఠాశ్రమంబునకు వచ్చి. 152

ప్రతిపదార్థం: ఇట్లు, పరాశరుండు; కావించు= చేయు; సత్త్ర, యాగంబునన్+ఐన= సత్రయాగంలో జరిగిన; రాక్షస, కుల, ప్రళయంబున్= రాక్షసవంశ నాశనాన్ని; చూచి, పులస్త్య= పులస్త్యుడు; పులహ= పులహుడు; క్రతువులు= క్రతువు లనేవాళ్లు; మహాముని, సంఘంబులతోన్= మహామునుల సమూహాలతో; వసిష్ఠ+ఆశ్రమంబునకున్= వసిష్ఠుని ఆశ్రమానికి; వచ్చి.

తాత్పర్యం: ఈ విధంగా పరాశరుడు చేసే సత్త్రయాగంలో జరిగిన రాక్షసనాశనాన్ని చూచి - పులస్త్యుడు, పులహుడు, క్రతువు మహర్షులసమూహంతో వసిష్ఠాశ్రమానికి వచ్చి.

విశేషం: పులస్త్యుడు, పులహుడు, క్రతువు - బ్రహ్మమానసపుత్రులు.

క. అగ్నిహతిఁ జేసి మానవ । భుగ్నివహము మరణబాధఁ బొందించుచు మూఁ
డగ్నులయొద్దను నాలవ । యగ్నియనన్ వెలుఁగుచున్న యమ్మునినాథున్. 153

ప్రతిపదార్థం: అగ్ని, హతిన్+చేసి= అగ్నిలో పడటంచేత; మానవ, భుక్+నివహము= మానవులను తినే రాక్షసుల సమూహాన్ని; మరణబాధన్= చావుకు సంబంధించిన దుఃఖాన్ని; పొందించుచున్= కలిగిస్తూ; మూఁడు, అగ్నుల ఒద్దను= మూడు విధాలైన అగ్నుల దగ్గర; నాలవ, అగ్ని అనన్= నాల్గవ అగ్నియో అన్నట్లుగా; వెలుఁగుచు+ఉన్న= ప్రకాశిస్తున్న; ఆ+ముని నాథున్= ఆ మునిశ్రేష్ఠుడైన పరాశరుడిని.

తాత్పర్యం: మానవులు భక్షించే రాక్షససమూహాన్ని అగ్నిలో పడేటట్లు చేయటంద్వారా వాళ్ళకు మరణబాధ కలిగిస్తూ, మూడగ్నులదగ్గర నాల్గవఅగ్నివలె ఉన్న ఆ మునిశ్రేష్ఠుడిని.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. త్రేతాగ్నులు - ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం - ఇవి మూడు యజ్ఞవేదికి క్రమంగా తూర్పు, దక్షిణం, పడమర - ఈ దిక్కులలో ఉంటాయి.

క. పరమతపోనిలయు దినే । శ్వరదీప్తిసహస్రతేజు శాక్తేయుఁ బరా
శరుఁ గని యందఱుఁ బ్రార్థిం । చిరి రాక్షసమారణంబు సేయకు మనుచున్. 154

ప్రతిపదార్థం: పరమ, తపస్+నిలయున్= గొప్ప తపస్సుకు ఉనికిపట్టయినవాడిని; దిన+ఈశ్వర, దీప్తి, సహస్ర, తేజున్= పగటి ప్రభువైన సూర్యునికాంతికి వేయిరెట్లుకాంతి కలవాడిని - అనగా వేయిమందిసూర్యులవలె ప్రకాశించేవాణ్ణి; శాక్తేయున్= శక్తి మహామునియొక్క పుత్రుని; పరాశరున్; కని= చూచి; అందఱున్= మునులుఅంతా; రాక్షస, మారణంబున్= రాక్షసులను చంపటాన్ని; చేయకుము= చేయవద్దు; అనుచున్; ప్రార్థించిరి.

తాత్పర్యం: మహాతపస్సంపన్నుడు, వెయ్యిమంది సూర్యుల కాంతితో ప్రకాశించేవాడు, శక్తిమహాముని కుమారుడు అయిన పరాశరుడిని చూచి, రాక్షససంహారం మానండని అందరు ప్రార్థించారు.

వ. 'పరాశరుండును బులస్త్యాదిమహామునిప్రార్థితుం డై రాక్షససత్త్రయాగం బుపసంహరించి, తన్నియోగంబున నయ్యగ్ని హిమవదుత్తరపార్శ్వంబున వైచిన, నదియును బర్వంబుల నందు వృక్షలతా గుల్మ శిలాభక్షణంబు

సేయుచుండె' నని యిట్లు గంధర్వుండు తాపత్యవసిష్ఠౌర్వోపాఖ్యానంబు చెప్పిన విని యర్జునుండు వాని కి ట్లనియె. **155**

ప్రతిపదార్థం: పరాశరుండును, పులస్త్య+ఆది, మహాముని, ప్రార్థితుండు+ఐ= పులస్త్యుడు మొదలైన మహామునులచేత ప్రార్థింపబడినవా డై; రాక్షస, సత్త్రయాగంబు= రాక్షససత్త్రయాగాన్ని; ఉపసంహరించి= ఆపి; తద్+నియోగంబునన్= వారి ఆజ్ఞచేత; ఆ+అగ్ని; హిమవత్+ఉత్తర, పార్శ్వంబునన్= హిమాలయపర్వతంయొక్క ఉత్తరపు ప్రక్క; వైచినన్= వేయగా; అదియును= ఆ ఆగ్నియు; పర్వంబుల, అందున్= పర్వదినాలలో, ఆ ఉత్తరపు ప్రక్కన; వృక్ష, లతా, గుల్మ, శిలా, భక్షణంబు= చెట్లను, తీవలను, పొదలను, రాళ్ళను తినుటను; చేయుచు+ఉండెన్= చేస్తూ ఉండింది; అని= అని; ఇట్లు; గంధర్వుండు; తాపత్య వసిష్ఠ+ఔర్వ+ఉపాఖ్యానంబు= తాపత్యులయొక్క వసిష్ఠునియొక్క, ఔర్వునియొక్క కథను; చెప్పినన్= చెప్పగా; విని=ఆలకించి; అర్జునుండు= అర్జునుడు; వానికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పరాశరుడుకూడ - పులస్త్యుడు మొదలైన మహామునులు ప్రార్థించగా రాక్షసవినాశనంకొరకు చేసే ఆ సత్త్రయాగాన్ని ఆపి, ఆ మునుల ఆజ్ఞతో ఆ యాగాగ్నిని హిమాలయానికి ఉత్తరంవైపు వేయగా, అది పర్వదినాలలో చెట్లను, తీగలను, పొదలను, శిలలను భక్షిస్తూ ఉండింది' అని గంధర్వుడు తాపత్య - వసిష్ఠ - ఔర్వుల కథను చెప్పగా విని, అర్జునుడు అతనితో ఇట్లా అన్నాడు.

ఉ. మాకు నతిప్రియుండవు సమస్తవిదుండవు చెప్పమయ్య! యీ
లోకములోని వర్తనములుం దగువారి నెఱుంగు; దెవ్వనిం
బ్రాకటధర్మతత్త్వవిదు బ్రాహ్మణముఖ్యుఁ బురోహితుండుగాఁ
జేకొనువార? మట్టి బుధసేవితుఁ గానఁగ మాకు నెం దగున్? **156**

ప్రతిపదార్థం: మాకున్, అతి, ప్రియుండవు= మిక్కిలి ఇష్టమైనవాడవు; సమస్త, విదుండవు= అన్నీ తెలిసినవాడవు; చెప్పుము+అయ్య= అయ్యా! వివరించు; ఈ లోకములోని, వర్తనములున్= ఈ లోకమందలి నడవడులను; తగువారిన్= తగినవారిని; ఎఱుంగుదు= తెలియుదువు; ఎవ్వనిన్= ఎవ్వరిని; ప్రాకట, ధర్మ, తత్త్వవిదున్= ప్రసిద్ధంగా ధర్మతత్త్వాన్ని తెలిసిన వాడిని; బ్రాహ్మణ; ముఖ్యున్= బ్రాహ్మణులలో శ్రేష్ఠు డైనవాడిని; పురోహితుండు, కాన్= పురోహితు డయ్యేటట్లు; చేకొనువారము= గ్రహించగలవారం; అట్టి= అటువంటి; బుధ, సేవితున్= పండితులచే పూజింపబడేవాడిని; మాకున్; కానఁగన్= చూచుటకు; ఎందు+అగున్= ఎచ్చట జరుగుతుంది?

తాత్పర్యం: మాకు మిక్కిలి ఇష్టమైనవాడవు, అన్నింటిని తెలిసినవాడవు, అంతేకాదు ఈ లోకవ్యవహారాలను, తగిన వ్యక్తులను తెలిసినవాడవు. ధర్మతత్త్వం బాగా తెలిసినవాడు, బ్రాహ్మణశ్రేష్ఠుడు అయిన ఏవ్యక్తిని పురోహితునిగా మేము స్వీకరించాలో, పండితులచే పూజింపబడే అట్టివ్యక్తి మాకు ఎక్కడ లభిస్తాడో తెల్పకోరుతాను.

వ. అనిన గంధర్వుండు పెద్దయుంబ్రొద్దు విచారించి 'యిచ్చోటికిం గుఱంగట నుత్కచం బను పుణ్యతీర్థంబునం దపంబు సేయుచున్నవాని ధౌమ్యుం డను బ్రాహ్మణునిఁ బురోహితుఁగాఁ బ్రార్థింపుం; డమ్మహాత్ముండు మీకుఁ బురోహితుం డైన సర్వార్థసిద్ధి యగు' ననిన సంతసిల్లి వానికి నాగ్నేయాస్త్రంబు విధ్యుక్తంబుగా నిచ్చి 'మాకు నీ యిచ్చిన హయంబుల

నీయంద సంగ్రహించి యుండుము; ప్రయోజనంబు గలనాఁడు గొనిపోయెద' మని గంధర్వు వీడ్కొని పాండవులు భాగీరథి నుత్తరించి యుత్కచం బను పుణ్యతీర్థంబున కరిగి యందు. 157

ప్రతిపదార్థం: అనినన్= అని అడుగగా; గంధర్వుండు; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; విచారించి= ఆలోచించి; ఈ+చోటికిన్= ఇచ్చటికి; కుఱంగటన్= సమీపాన; ఉత్కచంబు; అను, పుణ్య, తీర్థంబునన్= అను పుణ్యతీర్థంలో; తపంబు; చేయుచు; ఉన్నవాని; ధౌమ్యుండు; అను; బ్రాహ్మణునిన్; పురోహితున్+కాన్= పురోహితు డయ్యేటట్లుగా; ప్రార్థింపుండు= ప్రార్థించండి; ఆ+మహాత్ముండు= ఆ మహనీయుడు; మీకున్, పురోహితుండు+ఐనన్= పురోహితుడైతే; సర్వ+అర్థ, సిద్ధి= అన్ని ప్రయోజనాలు సమకూరటం; అగున్= జరుగును; అనినన్= అని తెల్పగా; సంతసిల్లి; వానికిన్= అతనికి; ఆగ్నేయ+అస్త్రంబు; = ఆగ్నేయాస్త్రాన్ని; విధి+ఉక్తంబుగాన్= నియమం ప్రకారం; ఇచ్చి; మాకున్; నీ ఇచ్చిన, హయంబులన్= నీవు ఒసగిన గుర్రాలను; నీ; అందు+అ= నీ దగ్గరే; సంగ్రహించి= దాచి; ఉండుము= ఉంచు; ప్రయోజనంబు, కలనాఁడు= అవసరమేర్పడిన రోజు; కొని పోయెదము= తీసికొనిపోతాము; అని, గంధర్వున్= ఆవిధంగా గంధర్వుణ్ణి; వీడ్కొని; పాండవులు; భాగీరథిన్= గంగను; ఉత్తరించి= దాటి; ఉత్కచంబు, అను, పుణ్యతీర్థంబునకున్; అరిగి= వెళ్ళి, అందున్= అక్కడ.

తాత్పర్యం: అని పల్కగా, గంధర్వుడు చాలాసేపు ఆలోచించి 'ఇక్కడికి సమీపంలో ఉత్కచం అనే పుణ్యతీర్థం ఉన్నది. అక్కడ తపస్సు చేసికొంటున్న ధౌమ్యుడనే బ్రాహ్మణుడిని పురోహితునిగా ప్రార్థించండి. ఆ మహాత్ముడు మీకు పురోహితుడైతే అన్ని ప్రయోజనాలు సిద్ధిస్తా'యని తెల్పగా, సంతోషించి, అతనికి ఆగ్నేయాస్త్రాన్ని యథావిధిగా ఇచ్చి, 'మాకు నీ విచ్చిన గుఱ్ఱాలను నీ దగ్గరే ఉంచుము. అవసరమైనప్పుడు తీసికొంటాము' అని ఆ గంధర్వుడిని వీడ్కొని, పాండవులు గంగానదిని దాటి, ఉత్కచ మనే పుణ్యతీర్థానికి వెళ్ళి, అక్కడ.

పాండవులు ధౌమ్యునిఁ బురోహితుఁగా వరియించుట (సం.1-174-6)

ఉ. వీత సమస్త దోషుఁ డయి వేడ్క దపం బొనరించుచున్న వి
ఖ్యాతుఁ బురోహితప్రవరుఁగా వరియించిరి భక్తితో జగ
త్పూతచరిత్రు సాధుజనపూజితు ధార్మికు ధౌమ్యు దేవల
భ్రాతృవరున్ మహాత్ము హితభాషణు భూసురవంశభూషణున్. 158

ప్రతిపదార్థం: వీత, సమస్త, దోషుఁడు+అయి= పోయిన ఎల్లపాపాలు కలవాడై; వేడ్కన్= కుతూహలంతో, తపంబు; ఒనరించుచున్+ఉన్న= చేస్తూఉన్న; విఖ్యాతున్= ప్రసిద్ధుడిని; జగత్+పూత, చరిత్రున్= లోకాలలో పవిత్రమైన నడవడి కలవాడిని; సాధుజన, పూజితున్= సజ్జనులచేత పూజింపబడినవాడిని; ధార్మికున్= ధర్మం చేసేవాడిని; మహాత్మున్= మహాత్ముడైన వాడిని; హిత, భాషణు=ఉపకారం చేసేమాటలుకలవాడిని; భూసుర, వంశ, భూషణున్= బ్రాహ్మణవంశానికి అలంకారమైనవాడిని; దేవల, భ్రాతృ, వరున్= దేవలుని తోబుట్టువులలో శ్రేష్ఠుడైనవాడిని; ధౌమ్యున్= ధౌమ్యుని; పురోహిత, ప్రవరున్+కాన్= పురోహిత శ్రేష్ఠునిగా, భక్తితోన్; వరియించిరి= కోరారు.

తాత్పర్యం: పాపరహితుడు, కుతూహలంతో తపస్సు చేస్తున్నవాడు, ప్రసిద్ధుడు, లోకంలో పవిత్రమైనచరిత్ర కలవాడు, సజ్జనులచేత పూజింపబడేవాడు, ధార్మికుడు, మహాత్ముడు, మేలు కలిగించే మాటలు పలికేవాడు, బ్రాహ్మణవంశానికి అలంకారమైనవాడు, దేవలుని తోబుట్టువులలో శ్రేష్ఠుడు అయినధౌమ్యుడిని తమకు పురోహితశ్రేష్ఠునిగా పాండవులు స్వీకరించారు.

వ. ధౌమ్యుండును వారి నతిప్రీతిం బూజించి పురోహితత్వంబుం బరిగ్రహించె; నట్లు తేజోరూపబుద్ధివిభవంబుల బృహస్పతిసదృశుం డై వేదవేదాంగవిదుం డైన ధౌమ్యుం బురోహితుంగాఁ బడసి, పాండునందను లశేష మహీరాజ్యంబు వడసినంతియ సంతసిల్లి, తత్కృతస్వస్త్యయను లయి, జననీ సహితంబు దక్షిణ పాంచాలం బున కరుగువారు ముందఱ ద్రుపదుపురంబునకుఁ బోయెడు బ్రాహ్మణులం గని 'మీ రెందులకుం బోయెద'? రని యడిగిన వా రి ట్లనిరి. 159

ప్రతిపదార్థం: ధౌమ్యుండును; వారిన్= ఆ పాండవుల్ని; అతి, ప్రీతిన్= మిక్కిలి ప్రేమతో; పూజించి, పురోహితత్వంబున్; పరిగ్రహించెన్= చేకొని, గ్రహించాడు; అట్లు; తేజస్, రూప, బుద్ధి, విభవంబులన్= తేజస్సుచేతను, రూపంచేతను, బుద్ధిచేతను, గొప్పతనంచేతను; బృహస్పతి, సదృశుండు+ఐ= బృహస్పతితో సమాన మైనవాడై; వేద, వేద+అంగ, విదుండు+ఐన= వేదాలను, వేదాంగాలను తెలిసినవాడైన; ధౌమ్యున్= ధౌమ్యుణ్ణి; పురోహితున్+కాన్= పురోహితునిగా; పడసి= పొంది; పాండునందనులు= పాండవులు; అశేష, మహీ, రాజ్యంబున్= మొత్తం భూమిమీద అధికారాన్నిఅంతయు; పడసిన, అంతియ= పొందినంతగా; సంతసిల్లి; తత్+కృత, స్వస్తి+అయనులు+అయి= అతనిచేత చేయబడిన ఆశీర్వాదం కలవా ళ్ళయి; జననీ, సహితంబు= తల్లితో కలిసి; దక్షిణ, పాంచాలంబునకున్, అరుగువారు= దక్షిణ పాంచాలదేశాలకు వెళ్ళే వాళ్ళు; ముందఱ= ముందుగా; ద్రుపదు, పురంబునకున్ = ద్రుపదుని నగరానికి; పోయెడు= పోయే; బ్రాహ్మణులన్+కని= బ్రాహ్మణులను చూచి; మీరు; ఎందులకున్= ఎక్కడికి; పోయెదరు+అని= పోతూఉన్నారని; అడిగినన్= అడుగగా; వారు, ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ధౌమ్యుడుకూడా వాళ్ళను మిక్కిలి ప్రేమతో పూజించి, పురోహితత్వాన్ని స్వీకరించాడు. ఆ విధంగా తేజస్సుచేత, రూపంచేత, బుద్ధిచేత, గొప్పతనంచేత, బృహస్పతితో సమానుడై, వేదవేదాంగాలను పూర్తిగా తెలిసిన ధౌమ్యుడిని పురోహితునిగా పొంది, పాండవులు సమస్తభూమండలరాజ్యాన్ని పొందినంతగా సంతోషించి, ధౌమ్యుని ఆశీర్వచనం పొంది, తల్లితోకూడ దక్షిణపాంచాలదేశానికి వెళ్ళుతూ, తమకు ముందు ద్రుపదుని నగరానికి వెళ్లే బ్రాహ్మణులను చూచి, 'మీ రెక్కడికి వెళ్లుతున్నారు' అని అడుగగా, వా రిట్లా అన్నారు.

సీ. యజ్ఞసేన ప్రభు యజ్ఞమహావేదిఁ । గవచశరాసనఖడ్గబాణ
రథయుక్తుఁ డై మహారథుఁడు ధృష్టద్యుమ్నుఁ । డన నుదయించిన, నతనితోడ
నొక్కటఁ బుట్టిన యక్కన్యకను గృష్ణ । నసితోత్పల శ్యామలామలాంగి
మెఱుపునుం బోలెను వఱలు నుత్పలగంధి । బంధుర తను సౌరభంబు గలుగు

ఆ. దాని ద్రుపదరాజుతనయఁ దదీయ స్వ । యంవరోత్సవంబు నపుడు చూడఁ
గనినవారు దృష్టు గనిన ఫలం బెల్లఁ । గనినవారు పరమకౌతుకమున. 160

ప్రతిపదార్థం: యజ్ఞసేన, ప్రభు, యజ్ఞమహావేదిన్= ద్రుపదమహారాజుయొక్క యజ్ఞమునందలి గొప్పవేదియందు; కవచ, శర+ ఆసన, ఖడ్గ, బాణ, రథ, యుక్తుఁడు+ఐ= కవచంతో, ధనుస్సుతో; ఖడ్గంతో, బాణాలతో, రథంతో కూడినవాడై; మహా రథుఁడు; ధృష్టద్యుమ్నుఁడు; అనన్= అనగా; ఉదయించినన్= పుట్టగా; అతనితోడన్; ఒక్కటన్= ఏకకాలంలో; పుట్టిన = ఉదయించిన; ఆ+కన్యకను= ఆ కన్నెను; కృష్ణన్= కృష్ణ అను పేరు కలదానిని, అసిత+ఉత్పల, శ్యామల+అమల+అంగిన్= నల్లకలువవలె నల్లని నిర్మల మైన దేహం కలదానిని; మెఱుపునున్+పోలెను= మెఱుపువలె; వఱలు= ప్రకాశించే; ఉత్పల,

గంధిన్= కలువ పూవు వాసనవంటి వాసనకలదానిని; బంధుర, తను, సౌరభంబు, కలుగు, దానిన్= గాఢమైన మేని సువాసన కలదానిని; ద్రుపదరాజు తనయన్= ద్రుపదరాజుయొక్క పుత్రికను; తదీయ, స్వయంవర+ఉత్సవంబు, అపుడు= ఆమె స్వయంవరంయొక్క ఉత్సవమునందు; పరమ, కౌతుకమునన్= మిక్కిలి ఆసక్తితో; చూడన్+కనిన, వారు= చూడగలిగిన వారు; దృష్టు కనిన= కన్నులను (చూపులను) పొందిన; ఫలంబు+ఎల్లన్= ఫలితాన్ని అంతా; కనిన, వారు= పొందినవారు.

తాత్పర్యం: ద్రుపదమహారాజుయజ్ఞవేదికనుండి కవచంతో, ధనుస్సుతో, ఖడ్గంతో, బాణాలతో, రథంతో మహారథుడైన ధృష్టద్యుమ్నుడు ఉద్భవించాడు. అతనితోపాటు 'కృష్ణ' అనే పేరు కల కూతురుకూడ జన్మించింది. ఆమె నల్లకలువవలవలె నల్లని నిర్మలమైన దేహంకలది. మెఱుపుతీగవలె ప్రకాశిస్తూ, నల్లకలువగంధంవంటి మనోహరమైన శరీరసుగంధం కలది. కనుక అటువంటి ఆ ద్రౌపదిని మిక్కిలి కుతూహలంతో స్వయంవరోత్సవ సమయంలో చూడగలిగినవాళ్ళే కన్నులున్న ఫలం పొందినవారు.

విశేషం: అలం: ఉపమ. మహారథుడు: - పదకొండువేలమంది విలుకాండ్రతో యుద్ధంచేయగల యోధుడు. మరొకవిధంగా - 'తనను, సారథిని, గుర్రాలను కాపాడుకొంటూ పోరాడే యోధుడు మహారథుడు' అని కొందరు అంటారు.

వ. అట్టి మహోత్సవంబు చూడ ద్రుపదు పురంబునకుం బోయెద; మందులకు నుత్సవ దర్శనోత్సుకు లై దర్శనీయులుం దరుణులును నపారభూరిదక్షిణయజ్ఞకరులును ననేకశ స్త్రాస్త్రవిదులును నయిన నానాదేశాధిపతులు నింతకుఁ జనుదెంతు; రనంతధనంబును బ్రాహ్మణులకు వా రిత్తు; రట్టె మీరును వారిం జూడ వచ్చెదరేని యొక్కటఁ బోదము రండు. 161

ప్రతిపదార్థం: అట్టి, మహా+ఉత్సవంబున్= గొప్ప ఉత్సవాన్ని; చూడన్= చూచుటకై; ద్రుపదుపురంబునకున్= ద్రుపదుని నగరానికి; పోయెదము= పోతూఉన్నాము; అందులకున్; ఉత్సవ, దర్శన+ఉత్సుకులు+ఐ= స్వయంవరోత్సవాన్ని చూచుటయందు ఉత్సాహం కలిగినవాళ్ళూ; దర్శనీయులున్= చూడదగినవాళ్ళూ; తరుణులునున్= యౌవనంలో ఉన్నవాళ్ళూ; అపార, భూరి, దక్షిణ, యజ్ఞకరులునున్= అంతులేని అధికమైన దక్షిణలతో యజ్ఞాలు చేసేవాళ్ళూ; అనేక శస్త్ర+అస్త్ర, విదులునున్= పెక్కు, మంత్రరహిత, మంత్రసహిత బాణవిద్యలు తెలిసినవాళ్ళూ; అయిన; నానా, దేశ+అధిపతులున్= వివిధ దేశాలరాజులు; ఇంతకున్= ఇప్పటికే; చనుదెంతురు= వచ్చిఉంటారు; అనంత, ధనంబును= అంతులేని డబ్బును; బ్రాహ్మణులకు; వారు+ఇత్తురు= వారు ఇస్తారు; అట్టె; మీరునున్= అట్లే మీరుకూడా; వారిన్= వాళ్ళను; చూడన్ వచ్చెదరు+ఏని= చూచుటకు వచ్చేవారయితే; ఒక్కటన్= ఒకటిగా; కలిసి, పోదము, రండు= కలసిపోదాం రండి.

తాత్పర్యం: అటువంటి స్వయంవరమహోత్సవాన్ని చూడటానికి ద్రుపదునినగరానికి మేము వెళ్తున్నాము. ఆ ఉత్సవం చూడాలన్న కుతూహలంతో చూడముచ్చటైనవాళ్ళు, యౌవనంలో ఉన్నవాళ్ళు, అంతులేని గొప్ప దక్షిణలతో యజ్ఞాలుచేసినవాళ్ళు, అనేకశస్త్రాస్త్రాలు తెలిసినవాళ్ళు అయిన వివిధదేశాల రాజులు ఈ పాటికి అక్కడికి వచ్చిఉంటారు. వాళ్ళు బ్రాహ్మణులకు అపారమైన ధనాన్ని ఇస్తారట. మీరుకూడ వాళ్ళను చూడడానికి వచ్చేట్టయితే, కలిసిపోదాం రండి.

క. మీ యం దీ కృష్ణ నుదం। సాయతభుజుఁ జూచి తాన హర్షముతోడం
దోయజముఖి వరియించును। మా యెఱిఁగినకార్య మిది సమంజసబుద్ధిన్. 162

ప్రతిపదార్థం: మీ+అందున్= మీలో; ఈ కృష్ణున్= ఈ నల్లని వాడిని; ఉత్+అంస+ఆయత, భుజున్= గొప్ప భుజశిఖరాలు కల నిడుపైన బాహువులు కల వాడిని; చూచి; తోజయ, ముఖి= నీటినుండి పుట్టిన పద్మాలవంటి ముఖం కలది - ద్రౌపది; తాను+అ= తనంతట తానే; వరియించును= కోరుకుంటుంది; ఇది, సమంజస; బుద్ధిన్= ఇది మిక్కిలి ఒప్పుతున్న బుద్ధితో, మా, ఎఱిఁగిన, కార్యము= మాకు తెలిసిన కార్యం.

తాత్పర్యం: మీలో నల్లనివాడు, గొప్ప భుజశిఖరాలతో కూడిన నిడుపైన చేతులు కలవాడు అయిన ఇతడిని చూచి, ద్రౌపది తనంతట తానే వరిస్తుంది. ఇది మా మనస్సుకు తోచిన సమంజసమైన కార్యం.

విశేషం: విప్రుల మాటలలో ఉపశ్రుతివంటి శుభశకునం భావికథార్థాన్ని ధ్వనింపచేస్తున్నది. (ఉపశ్రుతినిగురించి చూడు. ఆది. 7.24.25)

వ. అని మాటలాడుచు వచ్చు బ్రాహ్మణులతోడఁ బాండవులు ద్రుపదుపురంబున కరుగు వా రెదుర. 163

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; మాటలాడుచు; వచ్చు=వచ్చే; బ్రాహ్మణులతో=బ్రాహ్మణులతో; పాండవులు= పాండుకుమారులు; ద్రుపదు, పురంబునకున్= ద్రుపదు నగరానికి; అరుగువారు= వెళ్ళేవాళ్ళు; ఎదురన్= ఎదుట.

తాత్పర్యం: అని మాట్లాడుకొంటూ వచ్చే బ్రాహ్మణులతో కలిసి పాండవులు ద్రుపదునిపట్టణానికి వెళ్లుతూ ఎదుట.

క. కృష్ణమృగాజినధరుఁ దరు । ణోష్ణద్యుతితేజుఁ బంకజోద్భవసదృశుం
గృష్ణద్వైపాయను గత । తృష్ణామయుఁ గాంచి రరుగుదెంచు మహాత్మున్. 164

ప్రతిపదార్థం: కృష్ణ, మృగ+అజిన, ధరున్= నల్లని జింకతోలు వస్త్రంగా కట్టుకొన్నవాడిని; తరుణ+ఉష్ణ, ద్యుతి, తేజున్= మధ్యాహ్న సూర్యునివంటి కాంతి కలవాడిని; పంకజ+ఉద్భవ, సదృశున్= పద్మమునుండి పుట్టిన బ్రహ్మతో సమానుడైనవాడిని; గత, తృష్ణా; మయున్= పోయిన ఆశ కల వాడిని; అరుగుదెంచు= వస్తున్న; మహాత్మున్= మహానుభావుడిని; కృష్ణద్వైపాయనున్= వేదవ్యాసుడిని; కాంచిరి= చూచిరి.

తాత్పర్యం: నల్లచి జింకచర్మం ధరించినవాడు, మధ్యాహ్న సూర్యునివంటి కాంతికలవాడు, పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునితో సమానమైనవాడు అయిన వేదవ్యాసుడు, తమకు ఎదురు వస్తుండగా పాండవులు ఏ ఆశాలేని ఆ మహానుభావుడిని చూచారు.

విశేషం: అలం: ఉపమ.

వ. కని వినయమ్మున న మ్మునీంద్రునకు నందఱు నమస్కరించి కృతాంజలు లై యున్న వారికి హృదయానందంబుగా సత్యవతీనందనుం డాగామి శుభంబు లావేదించి చనినఁ; బాండవులును గతిపయ దినంబులకు ద్రుపదుపురంబు సొచ్చి నాలుగు సముద్రంబులుం బోలె ఘూర్ణిల్లి మ్రోయుచుం బురంబు నాలుగుదిక్కుల విడిసియున్న నానాదేశాగత మహీనాథుల బహువిధస్కంధావారంబులఁ జూచుచుం జని, యొక్కకుంభకారగృహంబున విడిసి, త మ్మెవ్వరు నెఱుంగకుండ బ్రాహ్మణవృత్తి నుండు నంతఁ, బాంచాలపతి పార్థునకుఁ గూఁతు నీ సమకట్టి పాండవుల నన్వేషించి యెందునుం గానక. 165

ప్రతిపదార్థం: కని= చూచి; వినయమ్మునన్; ఆ+మునీంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠుడైన వేదవ్యాసునకు; అందరున్; నమస్కరించి; కృత+అంజలులు+ఐ= చేతులు జోడించిన వాళ్ళయి; ఉన్నన్= ఉండగా; వారికిన్= ఆ పాండవులకు; హృదయ+ ఆనందంబుగాన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లు; సత్యవతీ, నందనుండు= సత్యవతియొక్క కుమారుడు, వ్యాసుడు; ఆగామి, శుభంబులు= రానున్న శుభాలను; ఆవేదించి= తెలిపి; చనినన్= వెళ్ళగా; పాండవులును; కతిపయ, దినంబులకున్= కొన్ని రోజులకు; ద్రుపదుపురంబు= ద్రుపదు నగరాన్ని; చొచ్చి= ప్రవేశించి; నాలుగు, సముద్రంబులున్+పోలెన్= నాలుగు సముద్రాలవలె; ఘూర్ణిల్లి= కలతనొంది; మ్రోయుచున్= శబ్దిస్తూ, ఘోషిస్తూ; పురంబు, నాలుగు దిక్కులన్= ఊరికి నాలుగు దిక్కులలో; విడిసి, ఉన్న= విడిది చేసి ఉన్న; నానా, దేశ+ఆగత, మహీనాథుల= వివిధ దేశాలనుండి వచ్చిన రాజులయొక్క; బహువిధ, స్కంధావారంబులన్= అనేక విధాలైన సైన్యం విడిదిచేసిన చోట్లను; చూచుచున్= చూస్తూ; చని= వెళ్ళి; ఒక్క, కుంభకార గృహంబునన్= ఒక కుమ్మరిఇంటియందు; విడిసి= విడిది చేసి; తమ్ము+ఎవ్వరున్= తమను ఎవ్వరుకూడ; ఎఱుంగ కుండ= తెలియకుండ; బ్రాహ్మణ, వృత్తిన్= బ్రాహ్మణ వృత్తిలో; ఉండునంతన్= ఉన్న సమయంలో; పాంచాలపతి= పాంచాలదేశపురాజు - ద్రుపదుడు; పార్థునకున్= అర్జునునకు; కూఁతున్= పుత్రికను; ఈన్= ఇచ్చుటకు; సమకట్టి=పూనుకొని; పాండవులన్= పాండవుల్ని; అన్వేషించి= వెదకి; ఎందునన్= ఎక్కడ కూడ; కానక= చూడక.

తాత్పర్యం: చూచి, వినయంతో ఆ వేదవ్యాసునికి అందరు నమస్కరించి, చేతులు జోడించి, నిలువగా - వాళ్ళకు సంతోషం కలిగే విధంగా ఆ సత్యవతీనందనుడైన వ్యాసుడు రానున్న శుభాలను గురించి తెలిపి వెళ్ళాడు. తర్వాత పాండవులు కొద్దిరోజులలో ద్రుపదుని నగరానికి చేరి, నగరం నాలుగుదిక్కుల నాలుగు సముద్రాలవలె ఘూర్ణిస్తూ, వివిధ దేశాలనుండి వచ్చిన రాజులబహువిధసైన్యాలు విడిదిచేసిన స్థావరాలను చూస్తూ, నగరంలో ప్రవేశించి, ఒక కుమ్మరిఇంట్లో విడిది చేసి, ఎవరూ గుర్తించకుండా బ్రాహ్మణవృత్తిలో ఉన్నారు. పాంచాలరాజు అర్జునునికి తన కుమార్తె నివ్వా లని ప్రయత్నించి, పాండవులకొరకు వెదకి, వాళ్ళను ఎక్కడా కనుగొనలేక.

విశేషం: అలం: ఉపమ.

ద్రౌపదీస్వయంవరము (సం.1-176-11)

సీ. **వైహాయసం బైన వరమత్స్యయంత్రంబు । ని వ్విల్లు మోపెట్టి యెవ్వఁ డేను**
శరముల నేయు నశ్రమమున నతఁడ నా । తనయకు వరుఁ డగు ధర్మయుక్తి
నని చాటఁ బంచిన నా ఘోషణము విని । యుర్వీశులెల్ల నొండొరులఁ గడవఁ
గడువేడ్కఁ దొడి పూసి కట్టి విభూతితోఁ । దమతమచిహ్నముల్ దనరి యెఱుక

ఆ. **పడఁగ వేఱువేఱ పన్ని భూతలము గ్ర । క్కదల సైన్యపాదఘట్టనమునఁ**
బొలుచు ద్రుపదరాజపుత్త్రీస్వయంవర । రంగమునకుఁ జనిరి రమణతోడ. 166

ప్రతిపదార్థం: వైహాయసంబు+ఐన= ఆకాశంలో ఉన్నట్టిదైన; వర, మత్స్యయంత్రంబున్= శ్రేష్ఠమైన మత్స్యయంత్రాన్ని; ఈ+విల్లు= ఈ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; ఎవ్వఁడున్; ఏను, శరములన్= ఐదు బాణాలతో; అశ్రమమునన్= శ్రమ పడకుండా - అనగా సులభంగా; ఏయున్= కొట్టునో; అతఁడు+అ= అతడే; నా, తనయకున్= నా కూతురికి; ధర్మయుక్తిన్= ధర్మంతోడి కూడికతో అనగా ధర్మబద్ధంగా; వరుఁడు= మగడు; అగున్= అవుతాడు; అని, చాటన్, పంచినన్= చాటింపువేయండని ఆజ్ఞాపించగా; ఆఘోషణము= ఆ చాటింపు; విని; ఉర్వీ+ఈశులు= భూపతులు, రాజులు; ఎల్లన్= అందరు; ఒండొరులన్=

ఒకరి నొకరు; కడవన్= మీరునట్లు; కడున్= మిక్కిలి; వేడ్కన్= సంతోషంతో; తొడి= సొమ్ములు ధరించి (తొడుగుకొని); పూసి= మైపూతలు పూసి; కట్టి= (మంచి) వస్త్రాలు కట్టి; విభూతితోన్= సంపదతో; తమ తమ చిహ్నముల్= తమ తమ గుర్తులతో (ధ్వజములు మొదలుగునవి) తనరి= ఒప్పి; ఎఱుకపడఁగన్= తెలిసేటట్లు; వేఱువేఱు+అ= విడివిడిగా, పన్ని= సిద్ధపడి; సైన్య, పాద, ఘట్టనమునన్= సైన్యాలయొక్క కాలిత్రొక్కుడుచేత; భూతలము= భూమి; క్రక్కదల (కదల+కదల)= మిక్కిలి చలింపగా; పొలుచు= ఒప్పునట్టి; ద్రుపదరాజు పుత్త్రీ, స్వయంవర, రంగమునకున్= ద్రౌపదియొక్క స్వయంవర స్థానానికి; రమణతోడన్= ప్రీతిగా; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: 'ఆకాశంలో కట్టిన మత్స్యయంత్రాన్ని ఈ విల్లు ఎక్కుపెట్టి ఐదు బాణాలతో ఎవడు పడగొడతాడో అతడే ధర్మప్రకారం నా పుత్రికకు భర్త అవుతాడు' అని ద్రుపదుడు చాటింపు వేయగా, ఆ చాటింపు విని రాజులంతా ఒకరికంటె ముందు మరొకరు ఎంతో సంతోషంగా ఆభరణాలు ధరించి, మైపూతలు పూసికొని, మంచి వస్త్రాలు కట్టుకొని, ఐశ్వర్యంతో తమ తమ ధ్వజాలు మొదలైన చిహ్నాలు స్పష్టంగా కనబడే విధంగా సిద్ధమై, సైన్యాల కాళ్ళతాకిడికి భూతలం కంపించగా, ద్రౌపదీస్వయంవరమండపానికి ప్రీతితో వెళ్ళారు.

వ. అదియును బురంబు పూర్వోత్తరదిగ్భాగంబునం జందనోదకసంసిక్త సమీకృతస్థలం బయి, యగాధోన్నత పరిఖాప్రాకారంబులను విశాలద్వారతోరణంబులను గైలాసశైలవిలాసాపహాసిభాసురగగనతలోల్లేఖిశిఖర రమ్యహర్మ్యతలంబులను బహుప్రకారంబు లైన సారువులనుం జేసి యొప్పుచున్న, నందు యథాస్థానంబుల నానాదేశాధిపతుల నుండంబంచి ద్రుపదుండు వారల నెల్లం బూజించెఁ; బరమబ్రహ్మణ్యు లగు బ్రాహ్మణులతోడం గలసియున్న పాండవులును బ్రాహ్మణసమూహంబులో నుండి పాంచాలరాజు సమృద్ధినిం జూచి సంతసిల్లి రంత. 167

ప్రతిపదార్థం: అదియును= ఆ ద్రౌపదీ స్వయంవరరంగం; పురంబు, పూర్వ+ఉత్తర దిక్+భాగంబునన్= పట్టణంయొక్క ఈశాన్య దిక్కున ఉన్న ప్రదేశంలో; చందన+ఉదక, సంసిక్త, సమీకృత, స్థలంబు+అయి= మంచి గంధపు నీటిచే తడుపబడి చదరంగా చేయబడిన స్థలం కలదై; అగాధ+ఉన్నత, పరిఖా, ప్రాకారంబులను= లోతైన అగడ్తలతో, ఎత్తైన ప్రహరులతో; విశాల, ద్వార, తోరణంబులను= పెద్దవైన వెలుపలి వాకిళ్ళతో, తోరణాలతో; కైలాస, శైల, విలాస+అపహాసి, భాసుర, గగనతల+ఉల్లేఖి, శిఖర, రమ్య, హర్మ్య, తలంబులను= కైలాసపర్వతంయొక్క చక్కదనాన్ని ఎగతాళి చేసేటట్లు ప్రకాశిస్తూ ఆకాశప్రదేశాన్ని తాకుతున్న కొనలచేత అందమైన మేడల ప్రదేశాలతో; సారువులనున్ చేసి= మంచెలతో; ఒప్పుచున్నన్= వెలుగుతుండగా; అందున్= అక్కడ; యథా, స్థానంబుల= ఆయాప్రదేశాలలో; నానా, దేశ+అధిపతులన్= వివిధ దేశాల రాజులను; ఉండన్+పంచి= ఉండునట్లుగా నియమించి; ద్రుపదుండు; వారలన్+ఎల్లన్, పూజించెన్; పరమ, బ్రహ్మణ్యులు+అగు= మిక్కిలిగ బ్రాహ్మణత్వము కలిగియున్న వాళ్ళయిన; బ్రాహ్మణులతోడన్= బ్రాహ్మణులతో; కలిసి, ఉన్న, పాండవులును; బ్రాహ్మణ సమూహంబులోన్; ఉండి; పాంచాలరాజు, సమృద్ధినిన్= ద్రుపదునియొక్క గొప్పఐశ్వర్యాన్ని; చూచి; సంతసిల్లిరి; అంతన్.

తాత్పర్యం: ఆ ద్రౌపదీ స్వయంవరరంగం నగరానికి ఈశాన్యదిక్కున, మంచిగంధపునీటితో తడుపబడి చదరంగా చేయబడిన స్థలం కలదై, లోతైన అగడ్తలతో, ఎత్తైన ప్రాకారాలతో, విశాలా లైన ద్వారాలతో, వెలుపలి వాకిళ్లతో, కైలాస పర్వత సౌందర్యాన్ని ఎగతాళిచేసే విధంగా ప్రకాశిస్తూ, ఆకాశా న్నంటే శిఖరాలు కల అందమైన సౌధ

ప్రదేశాలతో, అనేకవిధా లైన మంచెలతో అమరి ఉండగా, అందులో వివిధదేశాల రాజులకు ఆయా ప్రదేశాలలో విడిది కల్పించి, ద్రుపదుడు వా ళ్ళందరిని పూజించాడు. ఉత్తమబ్రాహ్మణులతో కలిసి ఉన్న పాండవులు, ఆ బ్రాహ్మణసమూహంలో ఉంటూనే, పాంచాలరాజు ఐశ్వర్యాతిశయాన్ని చూచి, సంతోషించారు. తరువాత.

సీ. ధవళవిభూషణ దామానులేపనా । మలినాంగి సితపుష్పమాల చేతఁ
గొని పుష్పసాయకు కుసుమేతరం బైన । యాఱగు సాయకం బనఁగ జనులు
ధవళాక్షి రంగమధ్యంబునఁ దనుమధ్య । దా నొప్పి పాంచాలతనయ యున్న
భూసురప్రవరుల పుణ్యాహఘోషంబు । విలసిల్లె నాశీర్వివృద్ధితోడ

ఆ. ద్రుపదపతి పురోహితుండును గృతపరి । స్తరణుఁ డై ప్రయోగదక్షుఁ డగ్ని
ముఖము సేసి వేల్వ మొనసి వివాహోప । కరణ వస్తుచయము గాచియుండె. 168

ప్రతిపదార్థం: ధవళ, విభూషణ, దామ+అనులేపన+అమలిన+అంగి= తెల్లని ఆభరణాలను. మాలలను, మైపూతను కల నిర్మల మైన దేహం కలది; ధవళ+అక్షి= తెల్లని కన్నులు కలది; తను, మధ్య= సన్నని నడుం కలది; పాంచాల, తనయ= పాంచాల రాజు కూతురు అయిన ద్రౌపది; సిత, పుష్పమాల= తెల్లని పూలదండను; చేతన్+కొని= చేతిలో ధరించి; జనులు= ప్రజలు; పుష్ప, సాయకు, కుసుమ+ఇతరంబు+ఐన= పూవులను బాణాలుగా గల మన్మథునియొక్క పూవులకంటె ఇతరమైన; ఆఱు+అగు, సాయకంబు+అనఁగన్= ఆరవ బాణమా అని అనగా; రంగమధ్యంబునన్= స్వయంవరరంగమధ్యంలో; తాన్= తాను; ఒప్పి= ప్రకాశించి; ఉన్నన్= ఉండగా; భూసుర, ప్రవరుల, పుణ్యాహఘోషంబు= బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క పుణ్యాహము అనే ధ్వని; ఆశీస్+వివృద్ధితోడన్= ఆశీర్వాదాల అతిశయంతో; విలసిల్లెన్= ఒప్పెను; ప్రయోగ దక్షుఁడు= వైదికకర్మలు చేయించటంలో సమర్థుడు; ద్రుపద పురోహితుండును= ద్రుపదుని యొక్క పురోహితుడుకూడ; కృత, పరిస్తరణుఁడు+ఐ= చేయబడిన పరిస్తరణం కలవాడై- అనగా అగ్నిచుట్టును దర్భల సమూహాన్ని అలంకరించినవాడై; అగ్నిముఖము= అగ్నియొక్క హోమారంభం; చేసి= కావించి; వివాహ+ఉపకరణ, వస్తు చయము= పెండ్లికి సాధనాలైన వస్తువుల సమూహాన్ని; వేల్వన్= హోమం చేయటానికి; మొనసి= పూని; కాచి, ఉండెన్= వేచిఉన్నాడు.

తాత్పర్యం: పాంచాలరాజతనయ ద్రౌపది - అందమైన సన్ననినడుముతో, తెల్లని కళ్ళతో, అలంకరించుకొన్న తెల్లని ఆభరణాలతో, పూలదండతో, మైపూతతో, నిర్మలదేహకాంతితో, తెల్లటి పూదండ ఒకటి చేత ధరించి ప్రజలంతా తనను చూచి 'ఈమె మన్మథునిఅయిదుపూలబాణాలకంటే వేరైన ఆరవపూబాణమా అని అనుకొంటుండగా - స్వయంవర రంగమధ్యంలో నిలిచి ఉన్నది. బ్రాహ్మణ శ్రేష్ఠుల పుణ్యాహధ్వని, ఆశీర్వచనాలు అతిశయిల్లాయి. వైదిక కర్మలు చేయించటంలో చాలా సమర్థుడైన ద్రుపదపురోహితుడు అగ్నిచుట్టూ దర్భలు అలంకరించి, హోమారంభంచేసి, వివాహానికి తగిన వస్తుసమూహంతో హోమం చేయటానికి సిద్ధంగా వేచి ఉన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అట్టి యవసరంబున బోరన మ్రోయు జనులయులివును వాదిత్రనాదంబును వారించి ధృష్టద్యుమ్నుండు మూఁగినరాజలోకంబు నెల్లం జూచి యగ్నిసమీపంబున గంధపుష్పధూపదీపార్చితం బైన విల్లును నమ్ములను వైహాయసం బైన లక్ష్యంబును వారలకుం జూపి యి ట్లనియె. 169

ప్రతిపదార్థం: అట్టి, అవసరంబునన్= అట్టి సమయంలో; బోరన, మ్రోయు= హోరుమని మ్రోగే; జనుల, ఉలివును= జనులు మాట్లాడుకొనే మాటల సవ్వడిని; వాదిత్రనాదంబును= వాద్యాల ధ్వనిని; వారించి= ఆపి; ధృష్టద్యుమ్నుండు; మూఁగిన= కూడిఉన్న; రాజ, లోకంబున్+ఎల్లన్= రాజుల సమూహాన్నంతా; చూచి; అగ్ని, సమీపంబునన్, అగ్నిహోత్రం దగ్గర; గంధ, పుష్ప, ధూప, దీప+అర్చితంబు+అయిన= గంధంచేత, పూవులచేత, ధూపంచేత, దీపంచేత, పూజింపబడిన దైన; విల్లును= ధనుస్సును; అమ్ములను= బాణాలను; వైహాయసంబు+ఐన= ఆకాశాన ఉన్నట్టి దైన; లక్ష్యంబును= గురియైన మత్స్యయంత్రాన్ని; వారలకున్, చూపి= వాళ్లకు చూపించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ సమయంలో హోరు మనే ప్రజలధ్వనినీ, వాద్యాలధ్వనినీ ఆపి, ధృష్టద్యుమ్నుడు అక్కడ చేరిన రాజ సమూహా న్నంతా చూచి, అగ్నిహోత్రం దగ్గర గంధపుష్పధూపదీపాలతో పూజింపబడిన ధనుస్సును, బాణాలను, ఆకాశంలో ఉన్న మత్స్యయంత్రాన్ని వాళ్ళకు చూపి, ఈ విధంగా పలికాడు.

తరువోజ.

ఈ విల్లు మోపెట్టి యేను బాణముల । నీ యంత్రమత్స్యంబు నేసినవాఁడ
భావజప్రతిముఁ డిబ్బాలకుఁ దగిన । పతి; యిది మునిశక్తిఁ బడసిన విద్య;
గావున మీ రిప్డు గావింపుఁ డిదియ । ఘనతర కార్ముక కౌశలోన్నతియు
లావును గలవారలకు నవసరము । లలితయశంబుఁ గల్యాణంబుఁ బడయ. 170

ప్రతిపదార్థం: ఈ, విల్లు= ఈ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; ఏను, బాణములన్= ఐదుబాణాలచేత; ఈ యంత్ర, మత్స్యంబున్= ఈ యంత్రంలోని చేపను; ఏసిన, వాఁడు+అ= కొట్టినవాడే; భావజ, ప్రతిముఁడు= మన్మథుని పోలినవాడు; ఈ, బాలకున్= ఈ కన్యకు - ద్రౌపదికి; తగిన, పతి= తగిన మగడు; ఇది= ఈ మత్స్యయంత్రం; ముని, శక్తిన్= ఋషి యొక్క శక్తి చేత; పడసిన= పొందిన; విద్య; కావునన్; మీరు; ఇప్డు= ఇప్పుడు; కావింపుడు= ప్రయత్నింపుడు; ఘనతర, కార్ముక, కౌశల+ ఉన్నతియున్= మిక్కిలి గొప్పదైన ధనుస్సునందలి నైపుణ్యంయొక్క అతిశయాన్ని; లావును= బలమును; కలవారలకున్= కలిగినవారికి; ఇదియు+అ= ఇదే; లలిత, యశంబున్= చక్కని కీర్తిని; కల్యాణంబున్= శుభాన్ని, వివాహాన్ని; పడయన్= పొందటానికి; అవసరము= (తగిన) సమయం.

తాత్పర్యం: ఈ విల్లును ఎక్కుపెట్టి, ఐదు బాణాలతో ఈ యంత్రంలోని మత్స్యాన్ని కొట్టినవాడే ఈ కన్యకు తగిన మన్మథసమాను డైన భర్త. ఈ మత్స్యయంత్రం మునిశక్తితో పొందినవిద్య. కనుక ఇప్పుడు మీరు ప్రయత్నించండి. విలువిద్యలో గొప్పసామర్థ్యం, బలం కలవాళ్ళు చక్కనికీర్తిని, కల్యాణాన్ని పొందటానికి ఇదే సరైన సమయం.

వ. అని ధృష్టద్యుమ్నుండు మూఁగిన రాజపుత్త్రులకు నెల్ల నెఱుంగ జెప్పి, ద్రుపదరాజపుత్రిం జూచి 'యఖిలజలధి వేలావలయవలయిత మహీతలంబునం గల రాజనందను లెల్ల నీస్వయంవరంబునకు వచ్చినవారు; వీరలం జూడు' మని దుర్యోధనదుశ్శాసనదుర్ముఖప్రముఖు లయిన ధృతరాష్ట్రనందనుల నూర్వురం, దత్సమీపంబున నున్న కర్ణాశ్వత్థామ సోమదత్త భూరిశ్రవశ్శ్రుతసేనాదులను, బుత్త్రభ్రాతృసమేతు లయి యున్న శల్య విరాట జరాసంధ గాంధారపతులను, నక్రూర సారణ సాత్యకి సాంబ సంకర్షణ ప్రద్యుమ్న కృష్ణ కృతవ ర్మానిరుద్ధ యుయుధాన ప్రముఖులైన యదువృష్ణి భోజాంధకవరులను, సుమిత్ర సుకుమార సుశర్మ సుదక్షిణ సుషేణ

సేనాబిందు చంద్రసేన సముద్రసే నౌశీనర చేకితాన శిశుపాల శ్రేణిమ జ్జనమేజయ జయద్రథ బృహద్రథ సత్యవ్రత
చిత్రాంగద శుభాంగద భగీరథ భగదత్త పౌండ్రకవాసుదేవ వత్సరాజ ప్రభృతు లయిన నానాదేశాధీశులను వేదధ్వని
సనాథం బై యొప్పచున్న బ్రాహ్మణసమూహంబునుం జూపి. 171

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ధృష్టద్యుమ్నుండు; మూఁగిన= చేరిన; రాజ, పుత్త్రులకున్+ఎల్లన్= రాజకుమారు లందరికీ; ఎఱుంగన్+చెప్పి= తెలియునట్లుచెప్పి; ద్రుపదరాజ, పుత్త్రిన్+చూచి= ద్రౌపదిని చూచి; అఖిల, జలధి, వేలా, వలయ, వలయిత, మహీతలంబునన్+కల= అన్ని సముద్రాల చెలియలికట్టలు అనే వలయంచేత చుట్టబడిన భూప్రదేశంలో; కల= ఉన్న; రాజ, నందనులు+ఎల్లన్= రాజకుమారులందరు; నీ, స్వయం వరమునకు ; వచ్చినవారు= వచ్చారు; వీరలన్= వీళ్లను, చూడుము+అని; దుర్యోధన, దుశ్శాసన, దుర్ముఖ, ప్రముఖులు+అయిన= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, దుర్ముఖుడు మొదలైన; ధృతరాష్ట్ర, నందనులన్= ధృతరాష్ట్రుని కుమారుల; నూర్వురన్= నూరుమందినీ; తద్+సమీపంబునన్= అక్కడికి దగ్గరగా నున్న; కర్ణ+అశ్వత్థామ, సోమదత్త, భూరిశ్రవస్, శ్రుతసేన, ఆదులను= కర్ణుడు, అశ్వత్థామ, సోమదత్తుడు, భూరిశ్రవుడు, శ్రుతసేనుడు, మొదలగువారినీ; పుత్త్ర, భ్రాతృ, సమేతులు+అయి ఉన్న= కొడుకులతో, తోబుట్టువులతో కూడిఉన్న; శల్య, విరాట, జరాసంధ, గాంధార పతులనున్; అక్రూర, సారణ, సాత్యకి, సాంబ, సంకర్షణ, ప్రద్యుమ్న, కృష్ణ, కృతవర్మ+అనిరుద్ధ, యుయుధాన; ప్రముఖులు+అయిన= మొదలైన; యదు, వృష్ణి, భోజ+అంధక, వరులను= యదు, వృష్ణి, భోజ, అంధక వంశ శ్రేష్ఠులనూ; సుమిత్ర, సుకుమార, సుశర్మ, సుదక్షిణ, సుషేణ, సేనాబిందు, చంద్రసేన, సముద్రసేన, ఔశీనర, చేకితాన, శిశుపాల, శ్రేణిమత్+జనమేజయ, జయద్రథ, బృహద్రథ, సత్యవ్రత, చిత్రాంగద, శుభాంగద, భగీరథ, భగదత్త, పౌండ్రకవాసుదేవ, వత్సరాజ, ప్రభృతులు+అయిన= మొదలగు వారైన; నానా, దేశ+అధీశులను= వివిధదేశాల రాజులనూ; వేద, ధ్వని సనాథంబు+ఐ= వేద ధ్వనులతో కూడినదై; ఒప్పుచున్న= ప్రకాశిస్తున్న; బ్రాహ్మణ, సమూహంబునున్= బ్రాహ్మణులయొక్క సమూహాన్నీ; చూపి.

తాత్పర్యం: అని ధృష్టద్యుమ్నుడు అక్కడ చేరిన రాజపుత్రుల కందరికీ తెలియజెప్పాడు. ద్రౌపదిని చూచి 'సమస్త భూమండలంలో కల రాజకుమారులంతా నీ స్వయంవరానికి వచ్చారు. వీళ్ళను చూడు' మని దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన ధృతరాష్ట్రకుమారులు నూరుగురినీ - ఆ సమీపంలో ఉన్న కర్ణుడు, అశ్వత్థామ, సోమదత్తాదులనూ, కొడుకులతో సోదరులతో కూడి ఉన్న శల్య, విరాటాదులనూ - అక్రూరుడు, సారణుడు, సాత్యకి మొదలైన యదు వృష్ణి భోజ అంధక వంశ శ్రేష్ఠులనూ - సుమిత్రుడు, సుకుమారుడు మొదలైన వివిధ దేశాల రాజులనూ, వేదధ్వనితో ప్రకాశిస్తున్న బ్రాహ్మణసమూహాన్నీ చూపి.

గమనిక: ఇందలి పేర్ల వరుస మొత్తము వచనభాగాన్ని చదివి గ్రహింప ప్రార్థన.

విశేషం: స్వయంవరం - క్షత్రియకన్యలు-వివిధదేశాలనుండి వచ్చి చేరిన రాజకుమారుల సభలో, స్వయంగా తనకు ఇష్టమైన వరుణ్ణి వరించే ఉత్సవం. ఇక్కడ బాలుడైన అనిరుద్ధుడూ, వృద్ధుడైన సోమదత్తుడూ స్వయంవరానికి వచ్చిన వాళ్లలో ఉన్నారు. మూలంలోనూ ఇట్లే ఉంది. వచ్చినవాళ్లందరూ వరించడానికే కాదు-చూడడానికీ, ఆశీర్వదించడానికీ వచ్చినవాళ్లూ ఉంటారు. బలరామకృష్ణులూ ఇలా వచ్చినవాళ్లే!

రాజపుత్త్రులు మత్స్యయంత్రమును భేదింపఁబోయి భంగపడుట. (సం -177-22)

**ఆ.	'ఇందు లక్ష్య మెవ్వఁ డేసె నాతని వరి । యింపు నెమ్మితోడ నిందువదన!'**
యనిన రాజపుత్త్రు లవ్విల్లు మోపెట్టి । యేయఁ గడఁగి కదలి రెల్లవారు. 172

ప్రతిపదార్థం: ఇందు, వదన= చంద్రునివంటిముఖం కలదానా!; ఇందున్= వీరందరిలో; లక్ష్యము= గురి అయిన మత్స్యయంత్రాన్ని; ఎవ్వఁడు; ఏసెన్= కొట్టాడో; అతనిన్= వానిని; నెమ్మితోడన్= ప్రేమతో; వరియింపు= వరింపుము; అనినన్= అనిపలుకగా; రాజ, పుత్రులు; ఎల్లవారు=అందరు, ఆ+విల్లు= ఆ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; ఏయన్= కొట్టటానికి; కడఁగి= పూనుకొని; కదలిరి= ముందుకు సాగారు.

తాత్పర్యం: 'చంద్రునివంటి ముఖం కల ఓద్రౌపదీ! వీరిలో మత్స్యయంత్రాన్ని కొట్టినవాడిని ప్రేమతో వరించుము' అని పల్కగా రాజకుమారు లంతా ఆ విల్లు ఎక్కుపెట్టి కొట్టటానికి పూనుకొని కదిలారు.

సీ. అమ్మహోత్సవము నెయ్యమ్మునఁ జూడంగఁ । దివిరి యేతెంచిన దివిజ ఖచర
గరుడ గంధర్వ కిన్నరుల విమానముల్ । విలసిల్లె నంబరతలమునందుఁ;
బణవవీణావేణురణితానుసార మై । రసగీతరవ మెల్ల దెసల నెసఁగెఁ;
బోరన వివిధతూర్యారవంబులు మహా । వననిధిధ్వానంబు ననుకరించె;

ఆ. దివ్యమాల్యములయు దివ్యానులేపన । ములయు సౌరభంబు వెలయఁ దాల్చి
రంగమధ్యజనులకుం గడు తనుపుగాఁ జేరి వీచె దివ్య మారుతంబు. 173

ప్రతిపదార్థం: ఆ+మహోత్సవమున్= ఆ గొప్ప ఉత్సవాన్ని; నెయ్యమ్మునన్= ప్రీతితో; చూడంగన్; తివిరి= కోరి; ఏతెంచిన= (విచ్చేసిన) వచ్చిన; దివిజ, ఖచర, గరుడ, గంధర్వ, కిన్నరుల విమానముల్; అంబరతలంబునందున్= ఆకాశ ప్రదేశంలో; విలసిల్లెన్= ప్రకాశించాయి; పణవ, వీణా, వేణు, రణిత+అనుసారము+ఐ= మద్దెలల, వీణల, పిల్లనగ్రోవుల ధ్వనిని అనుసరించిన దై; రస, గీత, రవము= ఆనందాన్ని కలిగించే సంగీతధ్వని; ఎల్ల దెసలన్= అన్నిదిక్కుల; ఎసఁగెన్= వ్యాపించెను; బోరన; వివిధ తూర్య+ఆరవంబు= బోరు మని అనేక విధాలైన వాద్యాల ధ్వనులు; మహా, వన, నిధి ధ్వానంబున్= మహాసముద్రముయొక్క ధ్వనిని; అనుకరించెన్= పోలెను; దివ్య, మాల్యములయు= మంచిపూలదండలయొక్క; దివ్య+అనులేపనములయు = మంచిపూతలయొక్క - అనగా గంధం మొదలైన మైపూతద్రవ్యాలయొక్క; సౌరభంబు= సువాసన; వెలయన్= ఒప్పగా; తాల్చి= ధరించి; రంగ, మధ్య, జనులకున్= స్వయంవరరంగమధ్యంలో ఉన్న జనులకు; కడున్= మిక్కిలి; తనుపుగాన్= తృప్తిగా; దివ్య, మారుతంబు= మంచి గాలి; వీచెన్= వీచింది.

తాత్పర్యం: దేవతలు, ఆకాశసంచారులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు ఆ ద్రౌపదీ స్వయంవరమహోత్సవాన్ని చూడగోరి ప్రీతితో రాగా, వాళ్ళవిమానాలు ఆకాశంలో ప్రకాశించాయి. మద్దెలల, వీణల, పిల్లనగ్రోవుల ధ్వనిని అనుసరిస్తూ రసమయసంగీతధ్వని అన్నిదిక్కుల వ్యాపించింది. అనేకవిధాలైన వాద్యాల ధ్వనులహోరు మహాసముద్ర ధ్వనినిపోలి ఉండింది. మంచిపూదండలు, గంధంవంటి మంచిమైపూతలు మొదలైనవవాటి సువాసనతో కూడిన మంచిగాలి, స్వయంవరరంగమధ్యంలో ఉన్న జనులకు తృప్తి కలిగేవిధంగా వీచింది.

విశేషం: అలం: ఉపమ.

చ. అవిరళభస్మమధ్యమున నగ్నికణంబుల పోలె బ్రాహ్మణ
ప్రవరులలోన నేర్పడక పాండవు లేవురు నున్నఁ జూచి యా

దవ వృషభుండు కృష్ణుఁడు ముదంబున వారి నెఱింగి, పార్థుఁ డీ

యువతిఁ బరిగ్రహించు ననియుం దలఁచెన్ హృదయంబులోపలన్. 174

ప్రతిపదార్థం: అవిరళ, భస్మ, మధ్యమునన్= దట్టమైన బూడిద నడుమ; అగ్ని కణంబుల, పోలెన్= నిప్పు ముక్కలవలె; బ్రాహ్మణ, ప్రవరులలోనన్= బ్రాహ్మణశ్రేష్ఠులలో; పాండవులు+ఏవురున్= పాండవు లైదుగురూ; ఏర్పడక= తెలియరాక; ఉన్నన్= ఉండగా; చూచి; యాదవ, వృషభుండు= యాదవులలో శ్రేష్ఠుడు-కృష్ణుడు; ముదంబునన్= సంతోషంతో; వారిన్= వాళ్ళను; ఎఱింగి= తెలిసికొని; పార్థుఁడు= అర్జునుడు; ఈ, యువతిన్= ఈ కన్యను - ద్రౌపదిని; పరిగ్రహించున్= చేపట్టును; అనియున్, హృదయంబులోపలన్, తలఁచెన్= అని కూడ హృదయంలో అనుకొన్నాడు.

తాత్పర్యం: దట్టమైన బూడిద నడుమ నిప్పు కణాలవలె బ్రాహ్మణ శ్రేష్ఠుల మధ్య పాండవులైదుగురూ స్పష్టంగా తెలియరాకుండా ఉండటం చూచి, ఆ యాదవ శ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు సంతోషంతో వాళ్ళను గుర్తించి, అర్జునుడు ఈ ద్రౌపదిని చేపట్టగల డనికూడ మనస్సులో అనుకొన్నాడు.

విశేషం: అలం: ఉపమ. సత్త్వగుణ ప్రధానులు, పవిత్రులు అయిన బ్రాహ్మణశ్రేష్ఠుల సమూహాన్ని భస్మంతో, సత్త్వరజోగుణ ప్రధానులు-బ్రాహ్మణ వేషాలతో బ్రాహ్మణులమధ్యలో ఉన్న పాండవులను అగ్నికణాలతో పోల్చటం అర్థవంతంగా మనోహరంగా ఉన్నది. పాండవులను నివురుకప్పిన నిప్పుకణాలుగా వర్ణించటం రుచిరార్థసూక్తిమత్త్వం. బ్రాహ్మణవేషాలు తొలగి నిజరూపాలు వెలువడే సమయం వచ్చిం దని రంగమధ్యంలోని గాలి ధ్వనిస్తున్నది. నివురుకప్పిన నిప్పులను సైతం గుర్తింపగలిగిన శ్రీకృష్ణుని దివ్యప్రతిభ ఇందులో గమ్యమానం. 'ఏర్పడక పాండవు లేవురు నున్నన్ - చూచి' అన్నప్పుడు ఉండగా చూచి, అనిన్నీ, ఉన్నప్పటికీ గమనింప కలిగి (తెలిసికొని చూచి) అనిన్నీ చెప్పుకొనేటట్లు రచించటం నన్నయ సూక్తిప్రయోగనైపుణ్యం. శ్రీకృష్ణాదులు మత్స్యయంత్ర భేదనంలో పాల్గొనకపోవటానికి కారణం ధ్వనిమయం చేసి కథను ప్రసన్నం చేశాడు నన్నయ. (సంపా.)

వ. అంత నా రాజనందనులు ద్రుపదరాజనందనం జూచి కందర్పబాణబాధితు లయి తమ్మును దమ సామర్థ్యము నెఱుంగక యర్థిత్వంబున నవ్విల్లు మోపెట్టఁ బోయి. 175

ప్రతిపదార్థం: అంతన్= అనంతరం; ఆ రాజనందనులు= ఆ రాజకుమారులు, ద్రుపదరాజనందనన్= ద్రుపదరాజుయొక్క కూతురైన ద్రౌపదిని; చూచి; కందర్ప, బాణ, బాధితులు+అయి= మన్మథునిబాణాలచేత బాధింపబడినవాళ్ళయి; తమ్మునున్= తమను; తమ సామర్థ్యమ్మును; ఎఱుంగక= తెలియక; అర్థిత్వంబునన్= ఆశచేత; ఆ+విల్లు= ఆ ధనుస్సును; మోపెట్టన్+పోయి= ఎక్కుపెట్టపోయి.

తాత్పర్యం: తరువాత ఆ రాజకుమారులు ద్రౌపదిని చూచి మన్మథబాణపీడితులై తమను, తమ పరాక్రమాన్ని అంచనా వేసుకోలేక ఆశతో ఆ విల్లును ఎక్కుపెట్టటానికి పోయి.

క. వడి నౌడు గఱచి, వలకేల్ । నిడుచన గనయమునఁ బెనఁచి, నీల్గి, బలం బే

ర్పడ విల్లు వంపనోపక । యుడిగిరి నృపసుతులు గొంద ఱొయ్యన లజ్జన్. 176

ప్రతిపదార్థం: నృప, సుతులు= రాజపుత్రులు; కొందరు; వడిన్= వేగమే; ఔడు, కఱచి= పెదవిని పళ్ళతో బిగబట్టి; వలకేల్= కుడిచేతిని; నిడుచన= పొడవగునట్లు; గనయమునన్= వింటికొప్పునందు; పెనఁచి= చుట్టి; నీల్గి= ఒళ్ళువిరుచుకొని; బలంబు=

శక్తి; ఏర్పడన్= బైటపడగా; విల్లు= ధనుస్సు; వంపన్+ఓపక= వంచలేక; ఒయ్యనన్= తిన్నగా; లజ్జన్= సిగ్గుచేత; ఉడిగిరి= ప్రయత్నాన్ని మానుకొన్నారు.

తాత్పర్యం: రాజకుమారులు కొందరు వేగంగా తమ పెదవిని పళ్ళతో బిగబట్టి, కుడిచేతిని చాచి, వింటికొప్పును పట్టి, నీల్గి తమబలం బైటపడగా, ఆ వింటిని వంచలేక సిగ్గుపడి ఆ ప్రయత్నం మెల్లగా మానుకొన్నారు.

క. బలవంతుల బలమఱఁగా । మలువక ప్రూన్ర్మానిపాట మాయాధను వి
మ్ములఁ జేసిన మోపెట్టఁగఁ । గొలఁదియె యని డాయ రైరి కొందఱు దానిన్. 177

ప్రతిపదార్థం: కొందరు; బలవంతులు; బలము; అఱఁగాన్= నశించేటట్లు; మలువక= వంపక; ప్రూన్+ప్రూని పాట= ప్రూకులలో పెద్ద ప్రూకువలె; మాయా, ధనువు= మాయా ధనుస్సును; ఇమ్ములన్= చక్కగా; చేసినన్= చేసినచో; మోపెట్టఁగన్= ఎక్కుపెట్టుటకు; కొలదియె= సాధ్యమా; అని= తలంచి; దానిన్= ఆ ధనుస్సును; డాయరు+అయిరి= దగ్గరకే పోక పోయారు.

తాత్పర్యం: 'బలవంతుల బలం అణగేవిధంగా దానిని వంచక' ప్రూనులలో పెద్దప్రూనువలె ఉన్న ఈ మాయా ధనుస్సును ఈ విధంగా చేస్తే ఎవరు ఎక్కుపెట్టగలరు? అని కొందరు రాకుమారులు దాని దగ్గరకే పోలేదు.

మ. 'ఇది యెట్లున్ సమకూర దెవ్వరికి; ము న్నీ విల్లు మోపెట్టఁ బో
లదు; మోపెట్టియు నంతరిక్షమున నా లక్ష్యంబు భేదింపఁగా
నది బ్రహ్మాదుల కైన నిం దలవిగా' దంచున్ విచారించి ని
ర్మదు లై కొందఱు రాజు లేఁగిరి నిజక్ష్మామార్గముల్ చూచుచున్. 178

ప్రతిపదార్థం: ఇది= ఈ ద్రౌపది; ఎట్లున్= ఏ విధంగా కూడ; ఎవ్వరికీ= ఎవరికీ; సమకూరదు= లభించదు; మున్ను= ముందు; ఈ, విల్లు; మోపెట్టన్= ఎక్కుపెట్టటానికి; పోలదు= సాధ్యంకాదు; మోపెట్టియున్= ఎక్కుపెట్టినప్పటికి; అంతరిక్షమునన్= ఆకాశంలో; ఆ, లక్ష్యంబున్= ఆ గురిని - మత్స్యయంత్రాన్ని; భేదింపఁగాన్= కొట్టటం; అది= అనేది; బ్రహ్మ+ఆదులకు+ఐనన్= బ్రహ్మ మొదలైన వాళ్ళకు కూడ; ఇందున్= ఇక్కడ; అలవి, కాదు= సాధ్యం కాదు; అంచున్= అని అంటూ; విచారించి= ఆలోచించి; కొందఱు, రాజులు; నిర్మదులు+ఐ= మదంలేనివాళ్ళయి; నిజ, క్ష్మా, మార్గముల్= తమ భూముల త్రోవలు - అనగా తమ ఊరిత్రోవలు; చూచుచున్; ఏఁగిరి= వెళ్ళిరి.

తాత్పర్యం: 'ఈ ద్రౌపది యే విధంగాకూడా ఎవ్వరికీ లభించదు. మొదట ఈ విల్లు ఎక్కుపెట్టటమే సాధ్యం కాదు. ఎక్కుపెట్టినా, ఆకాశంలోని ఆ మత్స్యయంత్రాన్ని భేదించటం బ్రహ్మాదులకైనా అలవికాదు' అని ఆలోచించి, కొందరు రాజులు గర్వం వదలి, తమఊరిదారి పట్టారు.

విశేషం: భూవలయంలో ఉన్న రాజులంతా మూగిన సభ అది. చాలమంది విల్లును ఎత్తే శక్తిలేక ఓటుపడ్డారు. వాళ్ళంతా ఆ విల్లెత్తటం, ఆపైన మత్స్యయంత్రాన్ని భేదించటం సాధ్యమయ్యే పని కా దనీ, ద్రౌపదిస్వయంవరం సఫలం కా దనీ భావించి, తమ తమ దేశాలకు తిరిగిపోయారు. ఈ వర్ణనం మత్స్యయంత్రాన్ని భేదించే అర్జుననీ. అర్జునుని సామర్థ్యాతిశయాన్నీ మరింత ప్రకాశింపచేసేదిగా ఉన్నది.

అర్జునుఁడు మత్స్యయంత్రంబుఁ దెగ నేయుట (సం.1-179-4)

వ. ఇట్లు రాజపుత్త్రు లవ్విల్లు మోపెట్ట నోపక నివృత్తు లయిరి; మఱి యదు వృష్ణి భోజాంధకులు కృష్ణానుమతంబున సజ్య కర్మంబునం దనారంభు లయి మిన్నకుండిి; రంత శిశుపాల జరాసంధ శల్యకర్ణులు దర్పితు లై తమ తమ లావులు మెఱసి క్రమంబున నలువురు మాష యవముద్గరోమమాత్రంబులు దక్క గొనయం బెక్కించియు మోపెట్ట నశక్యంబయిన నుక్కుసెడి స్రుక్కిన; వారలం జూచి యగ్రజు ననుమతంబున విప్రసభ వెలువడి విజయుండు ధనుస్సమీపంబున కరిగిన, నాతని యుత్సాహంబున కచ్చెరువడి కొందఱు బ్రాహ్మణులు దమలో ని ట్లనిరి.179

ప్రతిపదార్థం: ఇట్లు; రాజపుత్త్రులు; ఆ+విల్లు= ఆ ధనుస్సును; మోపెట్టన్+ఓపక= ఎక్కుపెట్టలేక; నివృత్తులు+ఐరి= వెనుదిరిగి పోయారు; మఱి= ఇక; యదు, వృష్ణి; భోజ+అంధకులు= యాదవులు, వృష్ణులు, భోజులు, అంధకులు; కృష్ణ+అనుమతంబునన్= కృష్ణుని అభిప్రాయాన్ని అనుసరించి; సజ్య, కర్మంబునందు= విల్లు ఎక్కుపెట్టే పనియందు; అనారంభులు+ఐ= ఆరంభం చేయని వా ళ్ళయి - అనగా ప్రయత్నం చేయనివాళ్ళయి; మిన్నక+ఉండిరి= ఊరకున్నారు; అంతన్= అటుపై; శిశుపాల, జరాసంధ; శల్య, కర్ణులు; దర్పితులు+ఐ= గర్వంతో కూడుకొన్నవారై; తమ తమ లావులు= తమతమ బలాలు; మెఱసి= ప్రకటించి; క్రమంబునన్= వరుసగా; నలువురు; మాష, యవ, ముద్గ, రోమ, మాత్రంబులు= మినుపగింజ, యవగింజ, పెసరగింజ, వెంట్రుక అంత మాత్రములు; తక్క= తక్కువగా, (మిగులునట్టుగా); గొనయంబు= అల్లెత్రాటిని; ఎక్కించియు; మోపెట్టన్= ఎక్కుపెట్టుటకు; అశక్యంబు+అయినన్= సాధ్యం కాకపోగా; ఉక్కు, చెడి= బలం లేక; స్రుక్కినన్= సోలగా; వారలన్= వాళ్ళను; చూచి, అగ్రజు, అనుమతంబునన్= అన్న యైన ధర్మరాజుయొక్క సమ్మతిచేత; విప్రసభ= బ్రాహ్మణుల సభనుండి; వెలువడి= బయలుదేరి; విజయుండు= అర్జునుడు; ధనుస్+సమీపంబునకు= విల్లు దగ్గరకు; అరిగినన్= వెళ్లగా; అతని ఉత్సాహంబునకున్; అచ్చెరువు, పడి= ఆశ్చర్యపడి; కొందరు, బ్రాహ్మణులు; తమలోన్; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా రాజకుమారులు ఆ ధనుస్సులు ఎక్కుపెట్టలేక వెనుదిరిగి పోయారు. యదువృష్ణి, భోజాంధకులు శ్రీకృష్ణుని అభిప్రాయాన్ని అనుసరించి ధనుస్సును ఎక్కుపెట్టే ప్రయత్నమే చేయలేదు. శిశుపాల, జరాసంధ, శల్య, కర్ణులు గర్వితులై తమ తమ బలాలు వెల్లడి కాగా - క్రమంగా మినుపగింజ, యవగింజ, పెసరగింజ, వెంట్రుక - అంతమాత్రం తక్కువగా అల్లెత్రాటిని ఎక్కించి కూడ, ఆ ధనుస్సును ఎక్కుపెట్టలేక బలం చెడి సోలిపోయారు. వాళ్ళను చూచి అర్జునుడు తన అన్న ధర్మరాజు అనుమతిని పొంది, బ్రాహ్మణసభ నుండి వెలువడి ధనుస్సు దగ్గరికి వెళ్లగా, అతని ఉత్సాహానికి ఆశ్చర్యపడి కొందరు బ్రాహ్మణులు తమలో ఇట్లా మాట్లాడుకొన్నారు.

విశేషం: అలం: క్రమము. మత్స్యయంత్రం భేదించలేని రాజులను నన్నయ నాల్గు విధాలుగా వర్గీకరించి వర్ణించాడు. 1. విల్లు నెత్తటానికి ప్రయత్నించి విఫలు లైనవారు. 2. విల్లు నెత్తటం, మత్స్యయంత్రం కొట్టటం సాధ్యం కా దని భావించి పోటీ మానుకొని ఇండ్లకు పోయినవారు. 3. ఆ పోటీలో పాల్గొనా లని వచ్చి పోటీలో పాల్గొనక నిర్లిప్తులుగా ఉండిపోయినవారు. 4. పోటీలో పాల్గొన్నా అల్లెత్రాటిని ఎక్కించేవరకు వచ్చి కొద్దిలో తప్పినవారు. ఈ నాల్గువర్గాల రాజకుమారులందరి ప్రయత్నాలు ముగిసిన తరువాత బ్రాహ్మణవర్గంలో నుండి విజయుడు లేచి విల్లును సమీపించాడు. అర్జునుడిని ఈ సమయంలో 'విజయుడు' అని పేర్కొనటం (అతని విజయాన్ని సూచిస్తూ) ఎంతో ఉచితంగా ఉన్నది.

ఉ. ఇ మ్మనుజేంద్రనందను లహీనబలుల్ దృఢదీర్ఘ బాహువీ
ర్యమ్ములవార లోపర శరాసనకర్మమునం ; దయుక్త ద
ర్పమ్మున నిప్డు నవ్వు పఱుపన్ సమకట్టె నితండు విప్రవం
శమ్మునవారినెల్లఁ దనశక్తి యెఱుంగక దుర్విదగ్ధుఁ డై. 180

ప్రతిపదార్థం: ఈ+మనుజ+ఇంద్ర, నందనులు= ఈ రాజశ్రేష్ఠుల కుమారులు; దృఢ, దీర్ఘ, బాహు, వీర్యమ్ముల వారలు= దృఢాలై పొడవైన బాహువుల పరాక్రమాలు గలవారు; అహీన, బలుల్= తక్కువగాని బలం కలవారు; శర+ఆసన, కర్మమునందు= ధనుస్సు యొక్క పనియందు అనగా ధనుస్సును ఎక్కుపెట్టి మత్స్యయంత్రాన్ని కొట్టేపనిలో; ఓపరు+అ= చేతగాని వా రైరికదా; ఇప్పుడు, ఇతండు; అయుక్త, దర్పమ్మునన్= తగని గర్వంచేత; తన శక్తి; ఎఱుంగక= తెలియక; దుర్విదగ్ధుఁడు+ఐ= అవివేకి అయి; విప్ర, వంశంబునన్, వారిన్+ఎల్లన్= బ్రాహ్మణవంశంలోని వారినందరిని; నవ్వుపఱుపన్= నవ్వుల పాలయ్యేటట్లు చేయటానికి; సమకట్టెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: ఈ మహారాజకుమారులు దృఢాలైనవి, పొడవైనవి అగు బాహువుల పరాక్రమంలో ఏమాత్రం తక్కువ కాని బలంకలవాళ్ళు. వాళ్ళే ఈ విల్లును ఎక్కుపెట్టి కొట్టలేక పోయారు. ఇప్పు డితడు అనుచిత మైన గర్వంతో, తనశక్తి యెంతో తెలుసుకోలేక, అవివేకి అయి బ్రాహ్మణవంశంవాళ్ళనంతా నవ్వులపాలు చేయటానికి పూనుకొన్నాడు.

క. అనువారు, నందుఁ గొందఱు । 'ఘనుఁ డీతఁడు; వీరికంటెఁ గార్ముక విద్యం
దనరిన వాఁ డయి దీనికి । మొనసెంగా; కన్యుఁ డిట్లు మొనయం గలఁడే! 181

ప్రతిపదార్థం: అనువారున్= అని పలికేవాళ్లు; అందున్= వారిలో; కొందఱు; ఈతఁడు; ఘనుఁడు; కార్ముక విద్యన్= విలువిద్యలో; వీరికంటెన్; తనరినవాఁడు+ఐ= ఒప్పినవా డై; దీనికిన్= ఈ పనికి, మొనసెన్+కాక= పూనుకొన్నాడు కాని; అన్యుఁడు= ఇతరుడు; ఇట్లు; మొనయన్+కలఁడు+ఏ= పూనుకొనగలడా.

తాత్పర్యం: అని పలుకుతూ ఉండగా; అందులో కొందరు 'ఇతడు గొప్పవాడు. వీళ్ళకంటె విలువిద్యలో నేర్పు కలవా డై ఈ పనికి పూనుకొన్నాడుకాని సామాన్యుడు ఈ విధంగా పూనుకొనగలడా?'

మ. అమితోత్సాహుఁడు దీర్ఘ బాహుపరిఘుం డత్యంతతేజస్వి స
ద్విమలాచారుఁడు విప్రభక్తిపరుఁ డీ విప్రుండు విప్రప్రసా
దమునన్ విప్రుల కెల్ల సంతసముగాఁ దత్కర్మసంసిద్ధి ను
త్తముఁడై పొందెడు మంచు నుండిరి దయన్ ధాత్రీసురుల్ ప్రీతు లై. 182

ప్రతిపదార్థం: అమిత+ఉత్సాహుఁడు= అపరిమితమైన ఉత్సాహం కలవాడు; దీర్ఘ; బాహు, పరిఘుండు= పొడవైన ఇనుప గుదియలవంటి బాహువులు కలవాడు; అత్యంత, తేజస్వి= మిక్కిలి తేజస్సు కలవాడు; సత్+విమల, ఆచారుఁడు= శ్రేష్ఠమూ; నిర్మలమూ అయిన నడవడి కలవాడు; విప్ర, భక్తిపరుఁడు= బ్రాహ్మణభక్తి ప్రధానంగా కలవాడు; ఈ, విప్రుండు= ఈ బ్రాహ్మణుడు; విప్ర, ప్రసాదమునన్= బ్రాహ్మణుల అనుగ్రహంవలన; విప్రులకున్+ఎల్లన్= బ్రాహ్మణులందరికి; సంతసముగాన్= సంతోషమయ్యేటట్లు; తద్+కర్మ; సంసిద్ధిన్= ఆ కార్యంయొక్క నెఱవేరుటను; ఉత్తముఁడు+ఐ; పొందెడుము= పొందుగాక;

అంచున్= అని పలుకుతూ; ధాత్రీ, సురుల్= బ్రాహ్మణులు; ప్రీతులు+ఐ= సంతోషించినవా ళ్ళయి; దయన్= దయతో; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: అపరిమితమైన ఉత్సాహం కలవాడు, దీర్ఘమైన ఇనుపగుదియలవంటి బాహువులు కలవాడు, మిక్కిలి తేజస్సు కలవాడు, శ్రేష్ఠము, నిర్మలము అయిన నడవడి కలవాడు, బ్రాహ్మణభక్తి కలవాడు అయిన ఈ బ్రాహ్మణుడు - బ్రాహ్మణుల అనుగ్రహంచేత బ్రాహ్మణులందరికి సంతోషం కలిగేవిధంగా కార్యసిద్ధి పొందుగాక! అని బ్రాహ్మణులు సంతోషించినవాళ్ళయి అర్జునునిపట్ల దయతో ఉన్నారు.

విశేషం: అర్జునుడు ధనువుదగ్గరికి పోతున్న సమయంలో బ్రాహ్మణవర్గంవాళ్ళు అతడినిగురించి భావించిన పద్ధతులను మూడురకాలుగా ఒక క్రమంలో చిత్రించటం నన్నయ కథాకథనశిల్పం. ఒకరకంవాళ్ళు భయస్థులు. మహాపరాక్రమవంతు లైన రాకుమారులే ఎక్కుపెట్టలేని విల్లును చేపట్టి మత్స్యయంత్రాన్ని కొట్టటానికి యత్నించి విఫలుడై బ్రాహ్మణవర్గాన్ని నవ్వులపాలు చేయటానికి పూనుకొన్నా డని వాళ్ళు భావించారు. రెండవ రకంవాళ్ళు వివేచనపరులు. రాకుమారులకంటె బలవంతుడై ఉండబట్టే ప్రయత్నిస్తున్నా డని భావించారు. మూడవ రకంవాళ్ళు విజ్ఞులు. విజయుని రూపతేజోబలాదులను గణించి, విజయం తథ్యమని నిశ్చయించినవారు. ఈ బ్రాహ్మణవర్గాలవారి వ్యాఖ్యలు అర్జునుని సామర్థ్యాన్ని, విజయాన్ని ప్రకాశింపచేసే వస్తుధ్వని విశేషాలు. క్షత్రియులు మాట్లాడకుండా ఉండటంకూడా ఇందులో ఒక విశేషమే. బ్రాహ్మణహృదయం బయటపడినట్లుగా క్షత్రియహృదయం బయటపడదు. బహుశః కొందరు క్షత్రియులు ఆశ్చర్యచకితులై అర్జునునివైపు అలా చూస్తూ ఉన్నారేమో - ఇతడు ఏం చేస్తాడో చూద్దా మని. మరికొందరు అతని ప్రయత్నాన్ని ఉపేక్షించి ఊరకున్నారేమో! మొత్తానికి క్షత్రియులు మాట్లాడలేదు.

వ. అంత న య్యర్జునుండు న వ్వింటిసమీపంబునకు వచ్చి గురువులం దలంచి నమస్కారంబు సేసి, ధనువునకుఁ బ్రదక్షిణంబుఁ జేసి మ్రొక్కి దాని నెత్తికొని పూర్వపరిచితం బైనవిల్లు మోపెట్టిన ట్లశ్రమంబున మోపెట్టి, జను లాశ్చర్యంబునుం బొందుచుండ, నే నమ్ముల న మ్మత్స్యయంత్రంబు నాక్షణంబ యురుల నేసినం జూచి బ్రాహ్మణ క్షత్త్రియ ప్రముఖు లయిన జనులెల్ల విస్మితు లయి. 183

ప్రతిపదార్థం: అంతన్= అటుపై; ఆ+అర్జునుండున్= ఆ అర్జునుడుకూడా; ఆ+వింటి= ఆ ధనుస్సుయొక్క; సమీపంబునకున్= దగ్గరకు; వచ్చి; గురువులన్; తలంచి; నమస్కారంబు, చేసి; ధనువునకున్= ధనుస్సుకు; ప్రదక్షిణంబున్ చేసి= చుట్టుతిరిగి; మ్రొక్కి; దానిన్, ఎత్తికొని= ఆ వింటిని ఎత్తుకొని; పూర్వ, పరిచితంబు+ఐన= ఇంతకు ముందే అలవాటుపడిన; విల్లు= ధనుస్సు; మోపెట్టిన+అట్లు= ఎక్కుపెట్టినట్లు; అశ్రమంబునన్= శ్రమలేకుండా, సులభంగా; మోపెట్టి= ఎక్కుపెట్టి; జనులు, ఆశ్చర్యంబునున్, పొందుచుండన్= ఆశ్చర్యాన్ని పొందగా; ఏను+అమ్ములన్= ఐదుబాణాలచేత; ఆ+మత్స్య యంత్రంబున్= ఆ మత్స్యయంత్రాన్ని; ఆ, క్షణంబు+అ= ఆ క్షణమే; ఉరులన్= పడేటట్లు; ఏసినన్= కొట్టగా; చూచి; బ్రాహ్మణ, క్షత్త్రియ, ప్రముఖులు+ఐన= బ్రాహ్మణులు, క్షత్రియులతో ముఖ్యులైన; జనులు+ఎల్లన్= ప్రజలు అందరూ; విస్మితులు+అయి= ఆశ్చర్యపడిన వాళ్ళయి.

తాత్పర్యం: తరువాత అర్జునుడు ఆ ధనుస్సు దగ్గరికి వచ్చి, గురువులను స్మరించుకొని నమస్కారం చేసి, ధనుస్సుకు ప్రదక్షిణనమస్కారాలు చేసి, దాన్ని ఎత్తుకొని, అలవా టైన ధనుస్సును సంధించినట్లు సులభంగా సంధించి, ప్రజలంతా ఆశ్చర్యపడుతుండగా, ఐదు బాణాలతో ఆ మత్స్యయంత్రాన్ని ఒక్క క్షణంలోనే పడగొట్టాడు. అది చూచి బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలైన జనులంతా ఆశ్చర్యపరవశు లయ్యారు.

విశేషం: అర్జునుడు విల్లును ఎక్కుపెట్టటానికి ముందు గురువులను స్మరించి నమస్కరించటం, విల్లుకు ప్రదక్షిణం చేసి మ్రొక్కటం - అనేవి ధనుర్వేదవిద్యను పవిత్రభావంతో ఉపాసించే మేటివీరుని లక్షణం. గర్వితులైనవారికి విల్లు వశం కాలేదు. మత్స్యయంత్రం ఒక ఋషి కల్పించిన విద్య అని ధృష్టద్యుమ్నుడు చెప్పనే చెప్పాడు. విద్యను గౌరవించటం విద్వాంసునికే తెలుసు అని అర్జునునిపాత్రను చిత్రించటం - ఇక్కడ విశేషం. విద్య వినయవంతులకే ప్రసన్నమౌతుం దనే సత్యంకూడ ఇక్కడ స్పష్టమౌతున్నది. మత్స్యయంత్రభేదనంవంటి మహత్తరవిషయాన్ని నన్నయ చిన్నవచనంలో చెప్పి ముగించాడు. అర్జునుని ప్రశంసించిన వాక్యాలను వృత్తాలలో నిబంధించాడు. మత్స్యయంత్రం కొట్టిన అర్జునునికి అది ఒక గొప్ప ప్రదర్శనం కాదు. కాని, ఆ సభలో ఉన్నవాళ్ళ కంతా అది ఒక అద్భుతం. అవలీలగా ప్రదర్శితమైన జగదేకవీరుడైన అర్జునుని వీరరసాన్ని వచనంలోనూ, దానినుండి పుట్టిన అద్భుతాన్ని పద్యాలలోనూ రచించటం నన్నయగారి సార్థక ఛందఃప్రయోగశిల్పం.

చ. ఫలపవనాంబుభోజన శుభవ్రతవృత్తులఁ జేసి చూడ దు
ర్బలతను లయ్యు బ్రాహ్మణు లపారతపోబలసంపదన్ మహా
బలయుతు; లట్టి వారలకు భవ్యుల కెందు నసాధ్య మెద్దియుం
గలదె? చరాచరాఖిలజగంబులఁ బెద్దల కారె సద్ద్విజుల్. 184

ప్రతిపదార్థం: బ్రాహ్మణులు; ఫల, పవన+అంబు, భోజన, శుభ, వ్రత, వృత్తులన్+చేసి= పండ్లు, గాలి, నీరు భక్షించటంచేత, పుణ్యాలయిన వ్రతాలను చేయటంచేత; చూడన్= చూడటానికి; దుర్బల తనులు+అయ్యున్= బలహీనమైన శరీరం కలవారు అయినప్పటికీ; అపార, తపస్+బల, సంపదన్= అమితమైన తపోబలంయొక్క అతిశయంచేత; మహా, బల, యుతులు= గొప్ప బలంతో కూడినవారు; అట్టి, వారలకు; భవ్యులకున్= మహనీయులకు; ఎందున్, అసాధ్యము= ఎచ్చటను సాధ్యం కానిది; ఎద్దియున్, కలదె= ఏదైనా ఉన్నదా?; సత్+ద్విజుల్= ఉత్తములైన బ్రాహ్మణులు; చర+అచర+అఖిల, జగంబులన్= కదలునవి, కదలనివి అయిన అన్ని లోకాలలో; పెద్దలు+అ, కారె= పెద్దలే కదా.

తాత్పర్యం: బ్రాహ్మణులు ఫలాలను, గాలిని, నీటిని భక్షించటంచేత, పుణ్యవ్రతాలు చేయటంచేత; చూడటానికి బలహీనమైన దేహంకలవా ళ్ళయినా, అపారతపోబలసంపదచేత వాళ్ళు మహాబలవంతులు. అటువంటి మహనీయులకు ఎక్కడా అసాధ్యమైనది ఏదీ లేదు. సమస్తచరాచరలోకాలలో సద్బ్రాహ్మణులే గొప్పవాళ్ళుగదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

క. నిమిషాంతరమున ని ట్ల । శ్రమమున మర్త్యులకు నేయ సమకూరునె యు
త్తముఁ డీతఁడు బ్రాహ్మణ రూ । పమున సురేశ్వరుఁడొ హరుఁడొ భానుఁడొ గుహుఁడో! 185

ప్రతిపదార్థం: నిమిష+అంతరమునన్= క్షణం లోపల; ఇట్లు; అశ్రమమునన్= అనాయాసంగా; మర్త్యులకున్= మానవులకు; ఏయన్= మత్స్యయంత్రాన్ని పడవేయటం; సమకూరునె= సాధ్యమౌతుందా; ఈతఁడు, ఉత్తముఁడు; బ్రాహ్మణ రూపమునన్= బ్రాహ్మణ రూపంలో ఉన్న; సుర+ఈశ్వరుఁడొ= దేవేంద్రుడో; హరుఁడొ= శివుడో; భానుఁడొ= సూర్యుడో; గుహుఁడో= కుమారస్వామియో.

తాత్పర్యం: క్షణకాలంలోపలనే ఈ విధంగా అనాయాసంగా మత్స్యయంత్రాన్ని కొట్టటం మానవులకు సాధ్యమౌతుందా? ఉత్తము డైన ఇతడు బ్రాహ్మణరూపంలో ఉన్న దేవేంద్రుడో! శివుడో! సూర్యుడో! కుమారస్వామియో!

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, ఉల్లేఖం.

క. అని ధరణి నుండి పొగడెడు । జనుల నిరంతరరవంబు, జలధరమార్గం
బున నుండి పొగడు దివ్యుల । యనవరతరవంబు నొక్కఁ డయి కడు నొప్పెన్. 186

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; ధరణిన్+ఉండి= భూమిమీద ఉండి; పొగడెడు, జనుల, నిరంతర, రవంబు= పొగడునట్టి మనుష్యులయొక్క ఎడతెగని శబ్దం; జలధర, మార్గంబున నుండి = మేఘమార్గము - అనగా ఆకాశమార్గమునుండి; పొగడు, దివ్యుల అనవరత, రవంబున్ = పొగడునటువంటి దేవతలయొక్క ఎడతెగనిశబ్దం; ఒక్కఁడు+అయి= ఒకటి అయి; కడున్= మిక్కిలి; ఒప్పెన్= అనువుగా అమరాయి.

తాత్పర్యం: అని భూమిమీద ఉండి పొగడే జనుల ఎడతెగని ధ్వని, ఆకాశంనుండి పొగడే దేవతల ఎడతెగని ధ్వని కలిసి మిక్కిలి అనువుగా అమరాయి.

విశేషం: ఇటు నేలమీదనుండి పొగడే జనాల సవ్వడి, అటు ఆకాశంనుండి పొగడే దేవతల సవ్వడి సమంగా ఏర్పడి అర్జునుని ప్రశంస భూనభోంతరాళాలలో వ్యాపించిం దని భావనామయంగా వర్ణించాడు నన్నయ. ఈ పద్యరచనానిర్ధారణంలోని సమత అనే గుణం ఈ వస్తుగుణాన్ని రమణీయంగా పోషిస్తున్నది. అద్భుతం ఆశ్చర్యభావంయొక్క ఉత్కటదశ. అది వాచికంగా వ్యక్తమైన మూడుదశలను మూడుపద్యాలలో నన్నయ చిత్రంచటం గమనార్హం. రాబోయే పద్యంలో చేష్టాత్మకమైన ఆశ్చర్యాన్ని వర్ణించటం శిల్పం. (సంపా.)

క. చెలఁగె సురదుందుభిస్వన । ములు ముదమున భూసురోత్తములు పయిపుట్టం
బులు వీచివీచి యార్చిరి । వెలయఁగ నరుమీఁదఁ బుష్పవృష్టియుఁ గురిసెన్. 187

ప్రతిపదార్థం: సుర, దుందుభి, స్వనములు= దేవతలయొక్కభేరులధ్వనులు; చెలఁగెన్= మ్రోగాయి; భూసుర+ఉత్తముల్= బ్రాహ్మణ శ్రేష్ఠులు; ముదమునన్= సంతోషంతో; పయి, పుట్టంబులు= మీది వస్త్రాలు - అనగా ఉత్తరీయాలు; వీచి, వీచి, ఆర్చిరి= మిక్కిలి వీచుతూ అరచారు; వెలయఁగన్= ఒప్పగా; నరుమీఁదన్= అర్జునుని మీద; పుష్పవృష్టియున్= పూలవానకూడ; కురిసెన్.

తాత్పర్యం: అప్పుడు దేవతల భేరీధ్వనులు మ్రోగాయి. బ్రాహ్మణోత్తములు తమ ఉత్తరీయాలను పదే పదే వీచుతూ పెద్దగా కేకలు వేశారు. అర్జునునిమీద పూలవాన అందంగా కురిసింది.

విశేషం: అంతమందిలో తమవాడు గెలిచా డని ఆనందాతిశయంతో బ్రాహ్మణులు ఉత్తరీయాలను పదేపదే వీచుతూ పెద్దగా కేకలు వేయటం ఎంతో సహజంగా, నాటకదృశ్యంగా కళ్ళకు కట్టిన ట్లున్నది.

వ. అ య్యవసరంబున ధర్మనందనుండు నకుల సహదేవానుగమ్యమానుం డయి నిజనివాసంబునకుం జనియె; నిట ధృష్టద్యుమ్న సహితుం డయి యజ్ఞసేనుండు మహాసేనతో నర్జునునకు సహాయుండుగా నరిగె; నంత. 188

ప్రతిపదార్థం: ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; ధర్మనందనుండు; నకుల, సహదేవ+అనుగమ్యమానుండు+అయి= నకుల, సహదేవులచే వెంబడింప బడినవాడై; నిజ, నివాసంబునకున్= తన ఇంటికి; చనియెన్= వెళ్ళాడు; ఇట; ధృష్టద్యుమ్న,

సహితుండు+ అయి= ధృష్టద్యుమ్నునితో కూడి; యజ్ఞసేనుండు= ద్రుపదుడు; మహా, సేనతోన్= గొప్ప సైన్యంతో; అర్జుననకున్= అర్జునునికి; సహాయుండుగాన్= సహకరించువాడై; అరిగెన్= వెళ్ళాడు; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఆ సమయంలో ధర్మరాజు నకులసహదేవులు వెంటరాగా తమ యింటికి వెళ్ళిపోయాడు. ఇక్కడ ధృష్టద్యుమ్నునితో కూడి ద్రుపదుడు గొప్పసేనతో అర్జునునికి సహాయుడుగా వెళ్ళాడు. అప్పుడు.

ద్రౌపది యర్జునుని వరించుట (సం. 1-179-22)

సీ. **ధరణీశ నందనుల్ ద న్నతిప్రీతితోఁ జూచుచు నుండంగ సుందరాంగి**
తోయజదళనేత్ర ద్రుపదరాజాత్మజ। కమనీయ గజరాజగమనలీలఁ
జనుదెంచి సురరాజసన్నిభు నభినవ। యౌవనోద్భాసితు నసితరత్న
రుచిరాంగు నంగజరూపు ధనంజయుఁ। దనచేతి సితపుష్పదామకమునఁ

ఆ. **బొలఁతి ముదముతోడఁ బూజించె; నట్టియు। త్సవముఁ జూచి దాని సైఁప కపుడు**
కౌరవేంద్రుఁ డాదిగాఁ గల భూపతు। లెల్ల నలిగి కలయు నేపు రేఁగి. 189

ప్రతిపదార్థం: ధరణి+ఈశ, నందనుల్= రాజకుమారులు; తన్నున్; అతి, ప్రీతితోన్, చూచుచున్, ఉండంగన్ = మిక్కిలి ప్రీతితో చూస్తూ ఉండగా; సుందర+అంగి= అందమైన శరీరం కలది; తోయజ, దళ, నేత్ర= తామర రేకులవంటి కన్నులు కలది; ద్రుపదరాజ+ఆత్మజ= ద్రుపదరాజుయొక్క కూతురు-ద్రౌపది; కమనీయ, గజరాజ, గమన, లీలన్= మనోహరమైన ఏనుగు శ్రేష్ఠముయొక్క నడకవంటి విలాసంతో; చనుదెంచి= వచ్చి; సురరాజ, సన్నిభున్= దేవేంద్రునితో సమానుడైనవాడిని; అభినవ, యౌవన+ఉద్భాసితున్= క్రొత్త యౌవనంచే ప్రకాశించే కాంతికల దేహం కలవాడిని; అంగజ, రూపున్= మన్మథుని వంటి రూపం కలవాడిని; ధనంజయున్= అర్జునుడిని; తన, చేతి, సిత, పుష్ప, దామకమునన్= తనచేతిలో ఉన్న తెల్లని పూదండచేత; పొలఁతి= ఆ కాంత; ముదముతోడన్= సంతోషంతో; పూజించెన్; అట్టి, ఉత్సవమున్, చూచి; సైఁపక= ఓర్వక; అపుడు; కౌరవ+ఇంద్రుఁడు= దుర్యోధనుడు; ఆదికాన్+కల= మొదలుగా కల; భూపతులు= రాజులు; ఎల్లన్= అందరు; అలిగి= కోపించి; కలయన్= అంతటను; ఏపురేఁగి= విజృంభించి.

తాత్పర్యం: రాజకుమారులంతా తనను మిక్కిలి ప్రీతితో చూస్తూ ఉండగా - అందమైనశరీరం కలది, తామరరేకులవంటి కన్నులు కలది అయిన ద్రౌపది, మనోహర మైన మదపుటేనుగునడకవంటి నడకతో విలాసంగా వచ్చి - దేవేంద్రునితో సమానమైనవాడు, నూత్నయౌవనంతో ప్రకాశించేవాడు, ఇంద్రనీలంవంటి కాంతిగల దేహం కలవాడు; మన్మథునివంటి రూపం కలవాడు అయిన అర్జునుడిని తనచేతితెల్లని పూలదండతో పూజించింది. అటువంటి ఉత్సవాన్ని చూచి ఓర్వలేక, అప్పుడు దుర్యోధనుడు మొదలైనరాజులంతా కోపించి అంతటా విజృంభించారు.

విశేషం: రాజకుమారులంతా ద్రౌపది యొక్క అందమైన ఆకారాన్నీ, తామరరేకులవంటి కన్నులనూ, మదేభగమనంవంటి నడకహొయలనూ కన్నార్పకుండా చూచారు. అంతటి సౌందర్యరాశి అర్జునునికి అంకితమైపోతున్నదే అని వారి అసూయ. ఆమె సౌందర్యం, దాని ఫలితం తరువాతి పద్యంలో నన్నయ చెప్పబోతున్నాడు. దానికి హేతువును కల్పించుకొన్నా డిక్కడ. ఇది ప్రసన్న కథాకలితార్థయుక్తి. రాజకుమారులంతా ద్రౌపదిని చూస్తుండగా, ఆమెమాత్రం అర్జునుడినే ఏకాగ్రతతో చూస్తున్నది. అతడు మొదట దేవేంద్రునితో సమానుడైనవాడుగా కనిపించాడట! ఈ 'సురరాజసన్నిభుడు' అనే విశేషణం రమణీయార్థవ్యంజకం.

వస్తుధ్వని పోషకం. అర్జునుడు ఇంద్రునివరంవలన పుట్టినవా డన్నది ఒక అర్థం, రాబోయే కథలో పంచేంద్రోపాఖ్యానంలో చెప్పబోయే కథార్థాలలో ఇంద్రత్వభావనం పఠిత ఇక్కడ అనుసంధించుకొనవలసివస్తుంది. పూర్వాపర కావ్యార్థభావనవలన అర్జునుడుగా ఉన్న ఇంద్రుడు నిజానికి అయిదురూపాలకు ప్రతినిధి. అందువలననే అంతగా ఆసక్తితో చూస్తున్న ద్రౌపదియందు అర్జునుని మనసు మన్మథాయత్తమైనట్లు నన్నయ వర్ణించాడు. ఇది కథాకథనశిల్పరహస్యం. 213వ పద్యంలో ఈ రహస్యం గమనింపవచ్చును. ఇంద్రత్వమే కాక యౌవనం, కాంతి, రూపం అనే గుణాలను ద్రౌపది అర్జునునిలో చూచి అతనిమెడలో దండవేసింది. 'కన్యా వరయతే రూపం'. (సంపా.)

మత్తకోకిలము.

> **ఏల రాఁ బనిచెన్ మహీశుల నెల్లఁ జుట్టమపోలె ము**
> **న్నేల సత్కృతిఁ జేసె నిందఱ? కిమ్మహారథు లుండఁగా**
> **నేల కన్యక నిచ్చె విప్రున కిందు నేఁడు శఠుండు పాం**
> **చాలుఁ, డిప్పుడ వీని నిర్గతసత్త్వుఁ జేయుద మాజిలోన్.** **190**

ప్రతిపదార్థం: మహీ+ఈశులన్+ఎల్లన్= రాజులందరిని; ఏల, రాన్+పనిచెన్= ఎందుకు రప్పించాడు? చుట్టమ, పోలెన్= చుట్టంవలె; మున్ను= ముందు; ఇందఱకున్= ఇంతమందికి; ఏల, సత్కృతిన్= ఎందుకు సమ్మానం; చేసెన్= చేశాడు; ఈ+మహారథులు+ ఉండఁగాన్= ఇంతమంది మహావీరు లుండగా; నేఁడు; ఏల= ఎందుకు; ఇందున్= ఇచ్చట; విప్రునకున్= బ్రాహ్మణునికి; కన్యకన్; ఇచ్చెన్; పాంచాలుఁడు= ద్రుపదుడు; శఠుండు= మోసగాడు; ఇప్పుడు+అ= ఇప్పటి కిప్పుడే; వీనిన్= ఈ ద్రుపదుడిని; ఆజిలోన్= యుద్ధంలో; నిర్గత, సత్త్వున్= కోల్పోయిన బలం కలవాణ్ణిగా; చేయుదము= చేస్తాము.

తాత్పర్యం: రాజు లందరినీ ఎందుకు రప్పించాడు? చుట్టంవలె ఇందరికి ముందుగా ఎందుకు సమ్మానం చేశాడు? ఈ మహావీరులంతా ఉండగా ఈనాడు ఇక్కడ ఒక బ్రాహ్మణుడికి కన్యకను ఎందు కిచ్చాడు? ద్రుపదుడు మోసగాడు. ఇప్పుడే యుద్ధంలో ఇతని బలాన్ని అణచివేద్దాం.

విశేషం: ద్రౌపదీస్వయంవరానికి విచ్చేసి పరాభూతులైన భూపతుల కోపాగ్ని ఈ పద్యంలో ప్రకటితం. చిన్న చిన్న వాక్యాలలో ఎక్కడికక్కడ ఆగిపోయే ఈ వాక్యాలనుబట్టి వారి కోపతాపాలు పూర్తిగా నిర్వీర్యము లని సూచన.

> **క.** **తన విద్య పేర్మి నృపనం । దనఁ బడసెను విప్రుఁ; డితని తప్పే? కడుదు**
> **ర్జనుఁ డీ ద్రుపదుఁడు నృపతుల । ననయంబున మెచ్చఁ డయ్యె నతిగర్వితుఁడై.** **191**

ప్రతిపదార్థం: విప్రుఁడు= బ్రాహ్మణుడు; తన, విద్య, పేర్మిన్= తన విద్యయొక్క గొప్పతనంచేత; నృప, నందనన్= రాజు కూతురైన ద్రౌపదిని; పడసెను= పొందాడు; ఇతని తప్పు+ఏ= ఇతని త ప్పేమున్నది; ఈ ద్రుపదుఁడు; దుర్జనుఁడు= దుర్మార్గుడు; అతి గర్వితుఁడు+ఐ= మిక్కిలి గర్వించినవాడై; నృపతులన్= రాజులను; అనయంబునన్= అవినీతితో; మెచ్చఁడు+అయ్యెన్= మెచ్చని వాడు అయ్యాడు.

తాత్పర్యం: ఈ బ్రాహ్మణుడు తన విద్యాబలంతో ద్రౌపదిని పొందాడు. ఇతని తప్పు ఏ మున్నది? ద్రుపదుడు దుర్మార్గుడు. అతడు అతిగర్వంతో రాజులను ఏమాత్రం లెక్కపెట్టలేదు.

వ. **'ఏమిదోషంబు సేసియు బ్రాహ్మణుండు వధ్యుండు గాఁడు; మన రాజ్యంబును నర్థంబును బ్రాహ్మణార్థంబ; కావున న విప్రుతోడి దేమి? యని ద్రుపదుపయి నెత్తుదెంచిన, ద్రుపదుండును కడుభీతుం డై బ్రాహ్మణుల మఱువు సొచ్చె;**

నిట్లు శరణాగతుం డయిన ద్రుపదు నోడకుండు మని బ్రాహ్మణులు దమ తమ దండాజినంబు లెత్తికొని ప్రతిబలంబులపయి వీచుచున్నంత, వారలం జూచి నగుచు నర్జునుం డి ట్లనియె. 192

ప్రతిపదార్థం: ఏమి, దోషంబు, చేసియు; బ్రాహ్మణుండు; వధ్యుండు= చంపదగినవాడు; కాఁడు; మన, రాజ్యంబునున్; అర్థంబును= సంపదయు; బ్రాహ్మణ+అర్థంబు+అ= బ్రాహ్మణుల కొరకే; కావునన్, ఆ+విప్రుతోడిది+ఏమి= ఆ బ్రాహ్మణునితో మన కేమి; అని= అని తలచి; ద్రుపదు పయిన్= ద్రుపదునిమీద; ఎత్తుదెంచినన్= దండెత్తి రాగా; ద్రుపదుండును; కడున్= మిక్కిలి; భీతుండు+ఐ= భయపడినవాడై; బ్రాహ్మణుల, మఱువు= బ్రాహ్మణులచాటున; చొచ్చెన్= చేరెను; ఇట్లు; శరణ+ ఆగతుండు+అయిన= శరణుకోరి వచ్చిన; ద్రుపదున్= ద్రుపదుని; ఓడకుండుము+అని= భయపడ వద్దని; బ్రాహ్మణులు; తమతమ, దండ+అజినంబులు= చేతికఱ్ఱలను, (యోగదండములు మొదలైనవి) జింకచర్మములను; ఎత్తికొని; ప్రతిబలం బుపయిన్= శత్రుసేనలమీద; వీచుచున్; ఉన్నంతన్= వీచుచుండగా; వారలన్+చూచి= వాళ్ళను కనుగొని; నగుచున్= నవ్వుతూ; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఏ తప్పుచేసినా బ్రాహ్మణుడు చంపదగినవాడు కాదు. మనరాజ్యం, సంపద బ్రాహ్మణులకొరకే. కనుక ఈ బ్రాహ్మణునితో మన కేమి పని?' అని ద్రుపదుడిమీదికి దండెత్తి రాగా, అతడు మిక్కిలి భయపడి, బ్రాహ్మణుల చాటున చేరాడు. ఈ విధంగా శరణుకోరివచ్చిన ద్రుపదునికి అభయమిచ్చి బ్రాహ్మణులు తమ తమ దండాలను, జింక చర్మాలను ఎత్తుకొని శత్రుసేనలమీద వీచుతుండగా వారిని చూచి నవ్వుతూ అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: దుర్యోధనుడి దురహంకారం, కులాహంకారం, కుత్సితనీతి, అధర్మప్రవృత్తి ఈ సన్నివేశంలో బైటపడ్డాయి. మత్స్యయంత్రం కొట్టిన బ్రాహ్మణుడు అవధ్యుడు కాబట్టి అతడిని వదలిపెట్టటం న్యాయం అన్నాడు. క్షత్రియు లుండగా బ్రాహ్మణుడికి అవకాశం కలిగించి రాజకులానికి అవమానం కలిగించిన ద్రుపదుడిపై ఆగ్రహించాడు. పూర్వాపరాలను గాని, స్వపరసామర్థ్యాలను గాని ఆలోచించని దుర్విదగ్ధుడు దుర్యోధనుడు. కన్యను గెలుచుకొన్నవాడు రాజలోకం తిరగబడితే వారిని జయించి తన యోగ్యతను నిరూపించుకోవటం స్వయంవరరాజధర్మం. దుర్యోధనుడు సమర్థుడైతే బ్రాహ్మణుడి (అర్జునుడి)తో తలపడాలి. ఆ ధర్మం అతడు పాటించలేదు. ద్రుపదుడు బ్రాహ్మణుల నాశ్రయించటం సందర్భోచితం. అర్జునుడు తన యోగ్యతను నిరూపించుకొనా లని వీరసూచనంకూడా అది. అర్జునుడు దానిని పసికట్టాడు. బ్రాహ్మణులు దండాలతో విజృంభిస్తే వారిని వారించాడు. భీముడితో కలిసి రంగంలో నిలువబడి తనయోగ్యతను నిరూపించుకొనే ప్రయత్నంచేయటానికి పూర్వరంగం కలిగించాడు దుర్యోధనుడు. స్వయంవరసభలోకూడ దుర్యోధనుడు తన వర్గంతో కూడి, ప్రతినాయకప్రవృత్తిని ప్రదర్శించటం వస్తుధ్వనికి పరోక్షపోషకం. (సంపా.)

క. కడఁగి మదీయాస్త్రము లని । యెడు పటుమంత్రముల నిప్పు డీ నృపురిపుల
న్కడిఁది విషాహుల దర్పం । బుడిగించెదఁ దొలఁగి చూచుచుండుఁడు మీరల్. 193

ప్రతిపదార్థం: కడఁగి= పూని; మదీయ+అస్త్రములు= నా బాణాలు; అనియెడు= అనెడి; పటు, మంత్రములన్= గొప్ప మంత్రాలచేత; ఇప్పుడు; ఈ, నృప, రిపులు+అన్= ఈ రాజుయొక్క శత్రువులనెడి - అనగా ద్రుపదుడి శత్రువులు అనే; కడిఁది విష+అహుల, దర్పంబు= పెద్ద విషసర్పాల గర్వాన్ని; ఉడిగించెదన్= అణచెదను; మీరల్= మీరు; తొలఁగి= ప్రక్కకు తొలగి; చూచుచు+ ఉండుఁడు =చూస్తూ ఉండండి.

తాత్పర్యం: పూనుకొని, నా అస్త్రా లనే గొప్పమంత్రాలతో ఇప్పు డీ ద్రుపదునిశత్రువు లనే పెద్దవిషసర్పాల గర్వం అణచివేస్తాను. మీరు ప్రక్కకు తొలగి చూస్తూ ఉండండి.

విశేషం: అలం: రూపకం. అలంకారవస్తుధ్వనికి పోషణం కావటానికి ఈ పద్యం రమణీయోదాహరణం. దుర్యోధనాదులు దుష్టసర్పాలు. అవి కాటువేయటానికి పూనుకొన్నాయి. అవి కాటువేయకుండా మంత్రగానివలె వాటిని నిర్వీర్యం చేస్తా నని సూచించాడు అర్జునుడు. 'ప్రతివీరులను చంపకుండా భంగపాటుకు గురిచేస్తాను చూడండి' అని వస్తుధ్వని. విషసర్పోపమానం దుర్యోధనాదుల కుటిలస్వభావానికీ, క్రూరత్వానికీ వ్యంజకం.

అర్జునుండు కర్ణునితో యుద్ధంబు సేసి జయించుట (సం.1-181-3)

వ. అని తానును భీమసేనుండును గడఁగి రిపుబలంబుపయి నపరిమితశరంబు లేసె; భీమసేనుండు నొక్క వృక్షంబు వెఱికికొని దండ హస్తుం డయిన దండధరుండునుంబోలె నర్జునునకు సహాయుం డయి నిలిచె; నంత న య్యిద్దఱ మహా సంరంభంబుఁ జూచి విస్మితుఁ డై కృష్ణుండు బలదేవుని కి ట్లనియె. 194

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; తానును, భీమసేనుండును; కడఁగి= పూనుకొని; రిపు, బలంబుపయిన్= శత్రుసైన్యంమీద; అపరిమిత, శరంబులు= లెక్కలేనన్ని బాణాలు, ఏసెన్= వేశాడు; భీమసేనుండున్= భీమసేనుడుకూడా; ఒక్క, వృక్షంబు= ఒక చెట్టును; పెఱికి= పెరికి; దండ, హస్తుండు+అయిన= దండమును చేతియందు కలవా డైన; దండధరుండునున్+పోలెన్= యమధర్మరాజువలె; అర్జునునకున్= అర్జునునికి; సహాయుండు+అయి= సహకరించేవాడై; నిలిచెన్= నిలిచాడు; అంతన్= అటుపై; ఆ+ఇద్దఱ, మహా, సంరంభంబున్= ఆ ఇరువురి గొప్పవిజృంభణాన్ని; చూచి; కృష్ణుండు; విస్మితుఁడు+ఐ= ఆశ్చర్యపడినవాడై; బలదేవునకున్= బలరామునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా పల్కి, తానూ భీమసేనుడూ పూనుకొని శత్రుసైన్యంమీద లెక్కలేనన్ని బాణాలు వేశాడు. భీమసేనుడు ఒక పెద్దచెట్టును పెకలించుకొని, దండాయుధాన్ని ధరించిన యమధర్మరాజువలె అర్జునునికి సహాయుడుగా నిలిచాడు. అప్పుడు వా ళ్ళిద్దరి మహావిజృంభణం చూచి కృష్ణుడు ఆశ్చర్యపడి బలరామునితో ఇట్లా అన్నాడు.

సీ. 'తాలాభ మగు విల్లు దాల్చి విరోధుల । నెగచుచున్నవాఁ డింద్రతనయుఁ;
డాతని కెలన మహావృక్షహస్తుఁడై । యున్న వీరుండు వృకోదరుండు;
యంత్రంబు నరుఁ డేసి నప్పుడు పోయిన । యగ్గౌరవర్ణుండు యమతనూజుఁ;
డాతనితోడన యరిగిన యిరువురుఁ । గవల వా రర్కప్రకాశ తేజు'

ఆ. లనిన 'లక్కయింట నగ్నిదాహంబున । నెట్లు బ్రదికి రొక్కొ! యిమ్మహాత్ము;
లెట్టి పుణ్యదినమొ యేవురఁ జూచితి' । మనుచు సంతసిల్లె హలధరుండు. 195

ప్రతిపదార్థం: తాల+ఆభము= తాటిచెట్టు వంటిది; అగు= అయిన, విల్లు= ధనుస్సు; తాల్చి= ధరించి; విరోధులన్= శత్రువులను, ఎగచుచున్= తోలుచు; ఉన్నవాఁడు; ఇంద్ర, తనయుఁడు= ఇంద్రుని కుమారుడైన అర్జునుడు; అతని, కెలనన్= అతనికి ప్రక్క; మహా, వృక్ష, హస్తుఁడు+ఐ= గొప్ప చెట్టును చేత కలవాడై; ఉన్న= ఉండే; వీరుండు; వృకోదరుండు= భీముడు; యంత్రంబున్= మత్స్యయంత్రమును; నరుఁడు= అర్జునుడు; ఏసిన+అప్పుడు= కొట్టినప్పుడు; పోయిన, ఆ, గౌర, వర్ణుండు= తెల్లని వన్నె కల అతడు; యమ, తనూజుఁడు= యముని పుత్త్రుడైన ధర్మరాజు; అతని తోడన= అతని వెంట; అరిగిన= వెళ్ళిన; ఇరువురున్= ఇద్దరును; కవలవారు= నకుల సహదేవులు; అర్క, ప్రకాశతేజులు= సూర్యకాంతివంటి తేజస్సు

కలవాళ్ళు; అనినన్= అని పల్కగా; లక్క, ఇంటన్= లక్క ఇంటిలో; అగ్ని దాహంబునన్= నిప్పు మంటనుండి; ఈ మహాత్ములు; ఎట్లు; బ్రదికిరి+ఒక్కో; ఎట్టి, పుణ్యదినమొ= ఎటువంటి పవిత్రమైన రోజో; ఏవురన్= ఐదుగురిని; చూచితిమి; అనుచున్= అనుకొంటూ; హలధరుండు= నాగలిని ధరించినవాడు - బలరాముడు; సంతసిల్లెన్= సంతోషించాడు.

తాత్పర్యం: 'తాటిచెట్టువంటి పెద్దవిల్లు ధరించి, శత్రువులను తరుముతున్నవాడు అర్జునుడు. అతని ప్రక్కనే గొప్పవృక్షాన్ని చే పట్టి ఉన్నవీరుడు భీముడు. అర్జునుడు మత్స్యయంత్రాన్ని పడగొట్టగానే సభనుండి వెళ్లిపోయిన తెల్లనివన్నెగలఅతడు-ధర్మరాజు. అతనివెంట వెళ్ళిన సూర్యసమానతేజు లిద్దరు నకులసహదేవులు' అని శ్రీకృష్ణుడు చెప్పగా 'లక్కయింటిలో నిప్పుమంటనుండి వీ రెట్లా బ్రతికారో! ఈ ఐదుగురుని చూచాము. ఇది ఎంత సుదినం!' అని బలరాముడు సంతోషించాడు.

విశేషం: వృకోదరుడు - వృకము=తోడేలు; తోడేలు కడుపువంటి కడుపు గలవాడు - భీముడు.

వ. అంత. 196

ప్రతిపదార్థం: అంతన్= అంతలో.

తాత్పర్యం: అప్పుడు.

క. కురుపతి సూడఁగఁ గర్ణుఁడు । నరుఁ దాఁకెను; శల్యుఁ డనిల నందనుఁ దాఁకెన్
సరభసమున, విస్మయ మం । దిరి ధరణీదేవమనుజదేవప్రవరుల్. 197

ప్రతిపదార్థం: కురుపతి= దుర్యోధనుడు; చూడఁగన్= చూస్తూఉండగా; కర్ణుఁడు; నరున్= అర్జునుని; తాఁకెను= ఎదుర్కొనెను; సరభసమునన్= వేగిరపాటుతో కూడినట్లుగ; శల్యుఁడు; అనిల, నందనున్= వాయుదేవుని కుమారుడైన భీముని; తాఁకెన్= ఎదుర్కొన్నాడు; ధరణీ, దేవ, మనుజ, దేవ ప్రవరుల్= బ్రాహ్మణశ్రేష్ఠులు, మానవశ్రేష్ఠులు దేవతా శ్రేష్ఠులు; విస్మయము+అందిరి= ఆశ్చర్యాన్ని పొందారు.

తాత్పర్యం: కురుపతి అయిన దుర్యోధనుడు చూస్తూ ఉండగా కర్ణుడు అర్జునుడిని ఎదుర్కొన్నాడు. వెంటనే వేగంగా శల్యుడు భీముడిని ఎదుర్కొన్నాడు. అది చూచి బ్రాహ్మణ, మానవ, దేవతా శ్రేష్ఠులు ఆశ్చర్యపడ్డారు.

శా. కర్ణుండున్ విజయుండు నొండొరులఁ జుల్కం దాఁకి; చాపంబు లా
కర్ణాంతం బగుచుండఁగాఁ దిగిచి యుగ్రక్రోధులై యేసి; రా
పూర్ణంబయ్యెఁ దదీయ బాణతతి నంభోభృత్పథం బెల్ల; నా
స్తీర్ణం బయ్యె ధరిత్రి యెల్ల; నవిసెన్ దిక్చక్ర మెల్లన్ వడిన్. 198

ప్రతిపదార్థం: కర్ణుండున్, విజయుండున్= కర్ణుడును, అర్జునుడును; ఒండొరులన్= ఒకరినొకరు; చుల్కన్= సులభంగా; తాఁకి= ఎదుర్కొని; చాపంబులు= ధనుస్సులను; ఆకర్ణ+అంతంబు= చెవికొనవరకు పోవునవి; అగుచున్+ఉండఁగాన్= అవుతూ ఉండగా; తిగిచి= లాగి; ఉగ్ర, క్రోధులు+ఐ= భయంకరమైన కోపం కలవాళ్ళయి; ఏసిరి= బాణాలను వేశారు; తదీయ, బాణతతిన్= వారియొక్క బాణాల సమూహంచేత; వడిన్= వెంటనే; అంభో, భృత్+పథంబు+ఎల్లన్= నీటిని ధరించిన

మేఘాలయొక్క మార్గమంతా - అనగా ఆకాశమంతా; ఆపూర్ణంబు= నిండినది; అయ్యెన్= అయింది; ధరిత్రి, ఎల్లన్= భూమి అంతా; ఆస్తీర్ణంబు+అయ్యెన్= పరచబడింది అయింది; దిక్+చక్రము= దిక్కుల సమూహం; ఎల్లన్= అంతయు; వడిన్= వేగంగా; అవిసెన్= పగిలెను.

తాత్పర్యం: కర్ణార్జునులు ఒకరినొకరు సులభంగా ఎదుర్కొని, ధనుస్సులను ఆకర్ణాంతం లాగి, భయంకరమైన కోపంతో పరస్పరం బాణప్రయోగం చేసికొన్నారు. వాళ్లబాణాలసమూహంతో భూమీ, ఆకాశం నిండిపోయాయి. దిక్కులు పగిలిపోయాయి.

క. వీరుఁడగు నరుని యేయు న । పార శరావలుల నడుమ వారింపంగా
నేరక యే టుడిగి మహా । శూరుఁడు రాధేయుఁ డింద్రజున కి ట్లనియెన్. 199

ప్రతిపదార్థం: వీరుఁడు+అగు; నరుని; ఏయు, అపార, శర+ఆవళులన్= అర్జునునియొక్క వేయునటువంటి అనంతాలైన బాణాల సమూహాలను; నడుమన్= మధ్యలో; వారింపఁగన్= ఆపటానికి; నేరక= చేతకాక; మహాశూరుఁడు; రాధేయుఁడు= కర్ణుడు; ఏటు+ఉడిగి= బాణాలు వేయటం మాని; ఇంద్రజునకున్= అర్జునునకు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: వీరు డైన అర్జునుడు వేసే అంతులేని బాణపరంపరను నడుమ అడ్డుకొనలేక, మహాశూరుడైన కర్ణుడు బాణప్రయోగం మాని ఇంద్రకుమారు డైన అర్జునునితో ఇట్లా అన్నాడు.

విశేషం: నరుని యేయు - నరునియొక్క ఏయు - అనగా, నరుడు ఏయు. ఇక్కడ ప్రథమకు షష్ఠి వచ్చింది.

క. నా యెదురఁ జక్కనై యని । సేయఁగ భార్గవునకును శచీవరునకుఁ గౌం
తేయుఁ డగు విజయునకుఁ గా । కాయతభుజశక్తి నొరుల కలవియె ధరణిన్. 200

ప్రతిపదార్థం: నా, ఎదురన్= నా సమక్షంలో; చక్కన+ఐ= చక్కగా నిలబడి; అని= యుద్ధం; చేయఁగన్= చేయటానికి; భార్గవునకును= పరశురామునికి; శచీవరునకున్= శచీదేవి భర్తయైన దేవేంద్రునికి; కౌంతేయుఁడు+అగు= కుంతికొడుకు అయిన; విజయునకున్= అర్జునునికి; కాక= తప్ప; ఆయత, భుజ, శక్తిన్= అధికమైన భుజబలంచేత; ధరణిన్= భూమియందు; ఒరులకున్= ఇతరులకు; అలవియె= సాధ్యమా!; (కా దని భావం.)

తాత్పర్యం: నా యెదుట చక్కగా నిలిచి, యుద్ధంచేయటానికి పరశురామునికి, దేవేంద్రునికి, కుంతి కొడుకైన అర్జునునికి మాత్రమే సాధ్యమవుతుంది. కాని, గొప్పభుజశక్తితో న న్నెదుర్కొనటానికి ఈ భూమిమీద ఇతరులకు సాధ్యమవుతుందా?

క. నీ వప్రాకృతబలుఁడవు; । నీ విక్రమమునకు విల్లునేర్పునకు మహీ
దేవకులోత్తమ ! మెచ్చితి; । నావుడుఁ బార్థుండు గర్ణునకు ని ట్లనియెన్. 201

ప్రతిపదార్థం: నీవు+అప్రాకృత, బలుఁడవు= నీవు సామాన్యంకాని బలం కలవాడవు; మహీదేవ, కుల+ఉత్తమ= బ్రాహ్మణ కులంలో శ్రేష్ఠుడా; నీ విక్రమునకున్= నీ పరాక్రమానికి; విల్లు; నేర్పునకున్= విలువిద్యానైపుణ్యానికి; మెచ్చితిన్; నావుడున్= అని అనగా; పార్థుండు= అర్జునుడు; కర్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీవు అసాధారణమైన బలం కలిగి ఉన్నావు. నీ పరాక్రమానికి, విలువిద్యా నైపుణ్యానికి మెచ్చాను' అని పల్కగా అర్జునుడు కర్ణునితో ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

ఏను నీ చెప్పిన వారిలోపల నెవ్వఁడఁ గాను;
గాని నే సర్వశస్త్రాస్త్రవిద్యలఁ గడుఁ బ్రసిద్ధుండ;
భూనుత బ్రహ్మతేజోఽ ధికుఁడ; నిన్నుఁ బోరిలో నోర్వఁ
గా నున్న వీరుండ; నొండు దక్కి లోఁగక చక్క నిలుము. **202**

ప్రతిపదార్థం: ఏను= నేను; నీ, చెప్పిన, వారిలోపలన్= నీయొక్క చెప్పినవారియందు - అనగా నీవు చెప్పినవారిలో; ఎవ్వఁడన్ కాను;= ఎవరినీకాను; కాని= అయితే; నే= నేను; సర్వ, శస్త్ర+అస్త్ర, విద్యలన్= అన్ని శస్త్రాస్త్రవిద్యలందు; కడున్= మిక్కిలి; ప్రసిద్ధుండన్= ప్రముఖుడిని; భూనుత, బ్రహ్మతేజస్+అధికుఁడన్= భూమియందు పొగడబడిన బ్రహ్మతేజస్సుచేత గొప్పవాడను; నిన్నున్= నిన్ను; పోరిలోన్= యుద్ధంలో; ఓర్వన్+కాన్+ఉన్న= ఓడించటానికి సిద్ధంగా ఉన్న; వీరుండన్= వీరుణ్ణి; ఒండు= ఇతరములు; తక్కి= విడిచి; లోఁగక= వెనుదీయక; చక్క, నిలుము= గట్టిగ ఎదురుగా నిలబడుము.

తాత్పర్యం: నేను నీవు చెప్పినవాళ్ళలో ఎవ్వడినీ కాను. కాని అన్ని శస్త్రాస్త్రవిద్యలలో మిక్కిలి ప్రసిద్ధుడిని. లోకం కొనియాడే బ్రహ్మతేజస్సుతో గొప్పవాడిని. నిన్ను యుద్ధంలో ఓడించటానికి సిద్ధంగా ఉన్న వీరుడిని. తక్కిన మాటలు కట్టిపెట్టి గట్టిగా నిలబడు.

విశేషం: 'కాని నే' - అనే దానికి బదులు 'కానీన' అని అర్జునుడు కర్ణుడిని సంబోధించినట్లు కొన్ని ప్రతులలో ఉన్న పాఠం సరైందిగా తోచదు. కన్యాపుత్రుడు కానీనుడు, కర్ణుడు కన్యాపుత్రుడే అయినా అప్పటి కావిషయం అర్జునుడికి తెలియదు. అందుచేత కర్ణుడిని 'కానీన' అని సంబోధించటం అసంబద్ధం. 'కాని, నే' అనే ప్రస్తుతపాఠమే అన్నివిధాల ఉత్తమమైనది.

మరొక విశేషం: 'ఏను నీ చెప్పినవారిలోపల నెవ్వఁడఁగాను' అని నిశ్చయార్థంలో అంటే సందర్భోచితంగా అర్జునుడు మాట్లాడి నట్లవుతుందే కాని, అబద్ధం పలికినదోషం కలుగుతుంది. అందువలన నానారుచిరార్థ సూక్తి నిపుణుడైన నన్నయ ఆవాక్యాన్ని ప్రశ్నార్థకంగా, కాకువులో ఉచ్చరించటానికి వీలుగా కూడా నిబంధించాడు. అప్పుడు కర్ణుడు చెప్పినవారిలో అర్జునుడు ఎవ్వడు కాడు? అందరూ అవుతాడు - ముగ్గురు కలిసినా వారితో సమాను డౌతాడు అనే అర్థచమత్కారం ఏర్పడుతుంది. 'కాని, నే సర్వశస్త్రాస్త్రవిద్యలఁ గడు బ్రసిద్ధుండ' - అనే అర్జునునివాక్యంలో - 'కాని, నేను పైన నీవు చెప్పిన అందరియొక్క శస్త్రాస్త్రవిద్యలలో ఎంతో ప్రసిద్ధిపొందాను' అనే అర్థం కాకువులోనే సిద్ధిస్తుంది. అసత్యదోషం నివారితమవుతుంది. 'నిన్నుఁ బోరిలో నోర్వఁగ నున్న వీరుండన్' అని పలికినప్పుడు 'నిన్ను యుద్ధంలో ఓడించటానికే ఇంకా బ్రతికి ఉన్నాను, అదే నా జీవిత లక్ష్యం' అని అర్జునుడు వ్యంగ్యంగా చెప్పినట్లు భావించటానికి వీలుంది. మధ్యాక్కర మాటనేర్పరితనానికి వాడటం ఛందశ్శిల్పం. అర్జునుడు తన ఉనికిని గూఢంగా నిబంధించి వాఙ్మయ నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు చిత్రించాడు నన్నయ. (సంపా.)

వ. అనిన విని కర్ణుండు బ్రహ్మతేజం బజేయం బని విజయుతోడియుద్ధం బొల్లక క్రమ్మఱియె; మఱిశల్య భీమసేనులు పెనంగి మల్లయుద్ధంబు సేయునెడ భీముండు భీమబలంబునం బట్టుకొని శల్యుం ద్రెళ్ళ వైచిన. **203**

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడు పలుకగా; విని, కర్ణుండు; బ్రహ్మతేజంబు; అజేయంబు= జయింప సాధ్యంకానిది; అని; విజయుతోడి= అర్జునునితో; యుద్ధంబు+ఒల్లక= యుద్ధం చేయటానికి ఇష్టపడక; క్రమ్మఱియెన్= వెనుదిరిగాడు; మఱి= పిమ్మట; శల్య, భీమసేనులు= శల్యుడు, భీముడు; పెనంగి= కలియబడి; మల్లయుద్ధంబున్; చేయు, ఎడ= చేసేటప్పుడు; భీముండు; భీమ, బలంబునన్= భయంకరమైన బలంచేత; శల్యున్= శల్యుని; పట్టుకొని= బిగియపట్టి; త్రెళ్ళవైచినన్= పడవేయగా.

తాత్పర్యం: అని అర్జునుడు పల్కగా, కర్ణుడు విని బ్రాహ్మణతేజస్సును జయించటం సాధ్య కా దని, అర్జునునితో యుద్ధం చేయటానికి ఇష్టపడక వెనుదిరిగి వెళ్ళాడు. శల్యభీమసేనులు కలియబడి మల్లయుద్ధం చేశారు. అప్పుడు భీముడు భయంకరమైన బలంతో శల్యుడిని పట్టుకొని పడవేశాడు.

ఆ. సెల్లుఁ డట్లు నేల ద్రెళ్ళి చెచ్చెర లేచి। యొడలు దుడిచికొనుచు నొయ్యఁ జనియె;
వానిఁ జూచి నగుచు మానుగా విప్రులు। భూరిసత్త్వు భీముఁ బొగడి రంత. 204

ప్రతిపదార్థం: సెల్లుఁడు= శల్యుడు; అట్లు; నేలన్= భూమిమీద; త్రెళ్ళి= పడి; చెరన్+చెరన్= బిరబిరా; లేచి; ఒడలు= దేహాన్ని; తుడిచి కొనుచున్; ఒయ్యన్= తిన్నగా; చనియెన్= వెళ్ళాడు; వానిన్= ఆ శల్యుణ్ణి; చూచి; విప్రులు= బ్రాహ్మణులు; నగుచున్= నవ్వుతూ; మానుగాన్= ఒప్పుగా; భూరి, సత్త్వు, భీమున్= గొప్ప బలవంతుడైన భీముడిని; అంతన్= అప్పుడు; పొగడిరి.

తాత్పర్యం: శల్యు డా విధంగా నేలపై పడి వెంటనే లేచి, శరీరం తుడుచుకొంటూ, తిన్నగా వెళ్ళిపోయాడు. అతడిని చూచి బ్రాహ్మణులు నవ్వుతూ మహాబలవంతు డైన భీముడిని గొప్పగా ప్రశంసించారు.

ఆ. పరశురాముఁ డొండె హరుఁ డొండె నరుఁ డొండె। గాక యొరులు గలరె కర్ణు నోర్వ!
బలిమి భీముఁ డొండె బలదేవుఁ డొండెఁ గా। కొరులు నరులు శల్యు నోర్వఁ గలరె! 205

ప్రతిపదార్థం: పరశురాముఁడు; ఒండె= కాని; హరుఁడు= శివుడు; ఒండె= కాని; నరుఁడు= అర్జునుడు; ఒండె= కాని; కాక= తప్ప; కర్ణున్+ఓర్వన్= కర్ణుని ఓడించటానికి; ఒరులు= ఇతరులు; కలరె= ఉన్నారా; బలిమిన్= బలంచేత; భీముఁడు; ఒండె= కాని; బలదేవుఁడు= బలరాముడు; ఒండెన్= కాని; కాక= తప్ప; ఒరులు= ఇతరులు; నరులు= మానవులు; శల్యున్+ఓర్వన్, కలరె= శల్యుడిని ఓడించగలరా! (లే రని భావం)

తాత్పర్యం: పరశురాముడో, శివుడో, అర్జునుడో కాక ఇతరులు కర్ణుడిని ఓడించగలరా? బలంలో భీముడో, బలరాముడో కాక తక్కినమానవులు శల్యుడిని ఓడించగలరా?

వ. 'వీ రెవ్వరో యెం దుండుదురో యెఱుంగవలయు' నని దుర్యోధనాదు లయిన రాజపుత్త్రు లెల్ల విస్మితు లయి యున్న వారలం జూచి కృష్ణుం డి ట్లనియె. 206

ప్రతిపదార్థం: వీరు; ఎవ్వరో= వీరెవరో; ఎందు+ఉండుదురో= ఎక్కడ ఉంటారో; ఎఱుంగవలయున్= తెలిసికోవాలి; అని= అని తలంచి; దుర్యోధన+ఆదులు+అయిన= దుర్యోధనుడు మొదలైన; రాజ, పుత్త్రులు+ఎల్లన్= రాజకుమారులంతా; విస్మితులు+అయి= ఆశ్చర్యపడినవారై; ఉన్నన్= ఉండగా; వారలన్, చూచి; కృష్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వీ ళ్ళెవరో, ఎక్కడ ఉంటారో తెలిసికొనాలి' అని దుర్యోధనుడు మొదలైన రాకుమారు లంతా ఆశ్చర్యంతో ఉండగా, వాళ్ళను చూచి కృష్ణుడు ఈవిధంగా అన్నాడు.

చ. పరులకు దుష్కరంబయిన భాసుర కార్యము సేసి, తత్స్వయం
వరమునఁ బత్నిఁగాఁ బడసె వారిరుహాయత నేత్రఁ గృష్ణ నీ
ధరణిసురాన్వయోత్తముఁడు ధర్మవిధిం; జెపుఁడయ్య యింక నె
వ్వరికిని జన్నె వీని ననవద్యపరాక్రము నాక్రమింపఁగన్. 207

ప్రతిపదార్థం: పరులకున్= ఇతరులకు (శత్రువులకు అని దుర్యోధనపరమైన చమత్కారార్థం); దుష్కరంబు+అయిన= చేయటానికి అలవి గానిదైన; భాసుర, కార్యము= గొప్పపని; చేసి; ఈ, ధరణి, సుర+అన్వయ+ఉత్తముఁడు= ఈ బ్రాహ్మణ వంశమందలి శ్రేష్ఠుడు; తద్+స్వయంవరంబునన్= ఆ స్వయంవరంలో; వారిరుహ+ఆయత, నేత్రన్= పద్మాలవంటి విశాలాలైన కన్నులు కలదానిని; కృష్ణన్= ద్రౌపదిని; ధర్మవిధిన్= ధర్మంప్రకారం; పత్నిన్+కాన్= భార్యగా; పడసెన్= పొందాడు; ఇంకన్= మరి; వీనిన్= ఇతనిని; అనవద్య, పరాక్రమున్= సాటిలేని పరాక్రమం కలవాడిని; ఆక్రమింపన్+కన్= జయించటానికి; ఎవ్వరికిన్= ఎవ్వరికైనా; చన్నె= సాధ్యమా; చెపుడు++అయ్య!= చెప్పండయ్యా!

తాత్పర్యం: ఇతరులు చేయటానికి సాధ్యం కాని గొప్పపని చేసి ఈ బ్రాహ్మణశ్రేష్ఠుడు ఆ స్వయంవరంలో పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదిని ధర్మమార్గంలో భార్యగా పొందాడు. ఈ సాటిలేని పరాక్రమశాలిని జయించటం ఇక ఎవరికి సాధ్యమో చెప్పండి.

విశేషం: మహాభారతంలో శ్రీకృష్ణుడు పాఠకులకు మొట్టమొదట కనిపించేది ఈ ఘట్టంలోనే. ఆయన మహనీయవ్యక్తిత్వం, సర్వజ్ఞత, చతురత అద్దంలోవలె మొదట అగుపించేదికూడ ఈ ఘట్టంలోనే. శ్రీకృష్ణుడు- బ్రాహ్మణవేషాల్లో బ్రాహ్మణులమధ్య కూర్చున్న పాండవులను మొదట కనిపెట్టాడు. ద్రౌపదిని గెలుచుకొనగల అర్జునుని ధనుర్విద్యాకౌశలాన్ని కూడా దర్శించాడు. ఎంతో దూరదృష్టితో యదు, వృష్ణి, భోజ, అంధక వంశాల వీరులు పోటీలో పాల్గొనకుండా తప్పించాడు. పాండవులందరిని బలరామునికి పరిచయంచేశాడు. అసూయాద్వేషాలతో పాండవుల ఉనికిపట్టు కనిపెట్టా లని ఆరాటపడే దుర్యోధనాది రాకుమారులందరి ప్రయత్నాన్ని విరమింపజేశాడు. అర్జునుని సామర్థ్యాన్ని అతిచతురంగా శ్లాఘించి, అన్యుల అసమర్థతను అవహేళన చేశాడు. కథాకథనశిల్పం ఆ మహాసభలో శ్రీకృష్ణుని పురుషోత్తమత్వాన్ని అద్భుతంగా ధ్వనింపజేసింది.

వ. 'వలవ దుడుగుం, డని వారించిన; నట్లు కృష్ణుచేత నివారితులయి రాజపుత్త్రులు దమతమదేశంబులకుం జని; రంత భీమార్జునులు బ్రాహ్మణపరివృతు లయి ద్రుపదరాజపుత్త్రిం దోడ్కొని వచ్చునంత. 208

ప్రతిపదార్థం: వలవదు= వద్దు; ఉడుగుండు= మానుడు; అని; వారించినన్= ఆపగా; అట్లు, కృష్ణుచేత; నివారితులు+అయి= ఆపబడినవా ళ్ళయి; రాజపుత్త్రులు, తమతమ, దేశంబులకున్=వారివారిదేశాలకు పోయారు; అంతన్= అటుపై; భీమ+అర్జునులు= భీముడు, అర్జునుడు; బ్రాహ్మణ, పరివృతులు+అయి= బ్రాహ్మణులచేత చుట్టబడినవాళ్ళయి; ద్రుపదరాజ పుత్త్రిన్= ద్రౌపదిని; తోడ్కొని= తీసికొని; వచ్చునంతన్= వచ్చుచుండగా; (వస్తూ ఉన్న సమయంలో)

తాత్పర్యం: 'వద్దు. వా ళ్ళెవరో తెలుసుకొనే ప్రయత్నం మానండి' అని శ్రీకృష్ణుడు ఆ రాకుమారు లందరిని ఆపగా, వాళ్ళు తమ తమ దేశాలకు తిరిగి వెళ్ళారు. అప్పుడు భీమార్జునులు బ్రాహ్మణులు చుట్టూ గుమిగూడి రాగా ద్రౌపదిని తమతో తీసుకొని ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు.

సీ. 'ఉత్సవ సందర్శనోత్సుకు లై పోయి । కడుఁ బెద్ద ప్రొ ద్దయ్యెఁ; గొడుకు లేల
మసలిరొ? కౌరవుల్ విసువక వైరంబు । గావించు పాపస్వభావు; లెఱిఁగి
క్రందునఁ జంపిరో? యందుల కేవురు । లీలతో నొక్కట నేల యరిగి?
రవ్యయుం డయిన వేదవ్యాసువచనంబు । నిక్కంబుగాకుండు నొక్కొ? వేల్పు

ఆ. లార! భూసురేశులార! మీ శరణంబ । కాని యొండుగతియుఁ గాన; నాకు
శరణ మగుఁడు; సుతులఁ గరుణతో రక్షింపుఁ' । డనుచుఁ గుంతి వగచి వనరుచుండె. 209

ప్రతిపదార్థం: ఉత్సవ, సందర్శన+ఉత్సుకులు+ఐ= స్వయంవరోత్సవాన్ని చూడగోరినవాళ్ళయి; కొడుకులు; పోయి; కడున్= మిక్కిలి; పెద్ద, ప్రొద్దు= ఎక్కువసేపు; అయ్యెన్= అయింది; ఏల= ఎందుచేత; మసలిరొ= ఆలస్యం చేశారో; విసువక= విసుగు లేకుండ, వైరంబు= పగను; కావించు= పూను; పాపస్వభావులు= దుర్మార్గపుబుద్ధికలవాళ్ళు; కౌరవుల్; ఎఱిఁగి= తెలిసికొని; క్రందునన్= సందడిలో; చంపిరో= చంపినారా!; అందులకున్= అక్కడకు; ఏవురు= ఐదుగురు; లీలతోన్= విలాసంగా; ఒక్కటన్= ఒక్కటిగా; ఏల= ఎందుచేత; అరిగిరి= వెళ్లారు; అవ్యయుండు+అయిన= నాశము లేనివా డైన; వేదవ్యాసు, వచనంబు= వేదవ్యాసునిమాట; నిక్కంబు= నిజము; కాక+ఉండున్+ఒక్కొ= కాకుండునా?; వేల్పులార= దేవతలార; భూసుర+ఈశులార= బ్రాహ్మణోత్తములారా; మీ, శరణంబు= మీశరణము; కాని= తప్ప; ఒండు= వేరొక; గతియున్= మార్గమును; కానన్= చూడలేదు; నాకున్= నాకు; శరణము+అగుఁడు= దిక్కుకండి; సుతులన్= కొడుకులను; కరుణతోన్= దయతో; రక్షింపుఁడు= కాపాడండి; అనుచున్= అని అంటూ; కుంతి; వగచి= విచారించి; వనరుచున్+ఉండెన్= ఏడుస్తూ ఉండెను (ఉండింది.)

తాత్పర్యం: 'కొడుకులు స్వయంవరోత్సవాన్ని చూడబోయి చాలా సేపైనది. ఇంకాతిరిగి రాక యెందుకు ఆలస్యం చేశారో? విసుగులేని వైరం పూనిన పాపస్వభావు లైన కౌరవులు వీరిని గుర్తించి ఆ సందడిలో చంపేశారేమో? విలాసంగా అక్కడికి ఐదుగురు ఒకేసారి యెందుకు వెళ్ళారు? అవ్యయుడైన వేదవ్యాసుని మాట సత్యం కాకుండా ఉంటుందా? దేవతలారా! బ్రాహ్మణోత్తములారా! మీరే నాకు దిక్కు. వేరే మార్గమేదీ లేదు. నన్ను రక్షించండి. నా కుమారులను దయతో కాపాడండి' అని కుంతి విచారించి, దుఃఖిస్తూ ఉండింది.

విశేషం: చిన్నప్పటినుంచి దుర్యోధనాదులు భీమాదులపై పగబూని ఉన్నారు. ఒక్కొక్కరిని (ముందుగా భీముడిని) చంపేయత్నం చేసి విఫలు లయ్యారు. ఆ తరువాత పాండవులందరినీ ఒక్కుమ్మడిగా చంపా లని యత్నించి లాక్షాగృహాన్ని కల్పించారు. అందువలన కౌరవులు విసుగులేని వైరం సాగించేవా ళ్ళని కుంతి పేర్కొన్నది. పాండవులంతా ఒక్కసారి ఒక్కచోట దొరికితే కౌరవులు చంపేస్తారేమో అనే భయం ఈ ఘట్టంలో కుంతికి కలగటం సహజం. దేవతలనూ, బ్రాహ్మణులనూ శరణు కోరింది. శరణుకోరినవారిని రక్షించటం వారి ధర్మ మనే భక్తివిశ్వాసాలు కల తల్లి ఆమె.

అర్జునుండు ద్రౌపదిం దెచ్చి తల్లికి నివేదించుట (సం.1-182-1)

వ. అట్టి యవసరంబునఁ దల్లియొద్దకు ధర్మరాజును గవలవారు మున్న వచ్చియున్నఁ, దదనంతరంబ భీమార్జునులు ద్రౌపదీసహితు లయి చనుదెంచి మ్రొక్కి 'మే మొక్క భిక్ష దెచ్చితి' మని తల్లికి నివేదించిన, నెఱుంగక యెప్పటి యట్ల

కా వగచి కుంతీదేవి సంతసిల్లి దాని 'మీ రేవురు నుపయోగింపుఁ' డని కొడుకుల నియోగించి, భువన త్రయ రాజ్య
లక్ష్మియుం బోలె నున్న యక్కన్నియం జూచి లజ్జించి, యధర్మభీత యయి ధర్మతనయున కి ట్లనియె. 210

ప్రతిపదార్థం: అట్టి; అవసరంబునన్= సమయాన; తల్లి, ఒద్దకున్= తల్లి దగ్గరకు; ధర్మరాజును; కవలవారున్= నకుల సహదేవులును; మున్న, వచ్చి= ముందుగానే వచ్చి; ఉన్నన్= ఉండగా; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; భీమ+అర్జునులు= భీముడు, అర్జునుడు; ద్రౌపదీ, సహితులు+అయి= ద్రౌపదితో కూడుకొన్నవాళ్లై; చనుదెంచి= వచ్చి; మ్రొక్కి; మేము+ఒక్క; భిక్ష; తెచ్చితిమి+అని; తల్లికి; నివేదించినన్= తెలుపగా; ఎఱుంగక= తెలియక; ఎప్పటి, అట్ల, కా= ఎప్పటివలె అయినట్లు; వగచి= తలచి; కుంతీదేవి; సంతసిల్లి; దానిన్; మీరు; ఏవురు= ఐదుగురును; ఉపయోగింపుఁడు= వినియోగించుకొనండి, అనుభవించండి; అని= అని అంటూ; కొడుకులన్; నియోగించి= నియమించి; భువన, త్రయ, రాజ్య, లక్ష్మియున్, పోలెన్= లోకములు మూడింటియొక్క రాజ్య లక్ష్మివలె; ఉన్న= ఉన్నట్టి; ఆ+కన్నియన్= ఆకన్నెను; చూచి= కనుగొని; లజ్జించి= సిగ్గుపడి; అధర్మ, భీత+అయి= అధర్మానికి భయపడిన దై; ధర్మతనయునకున్= ధర్మనందనునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటువంటి సమయంలో ధర్మరాజు, నకులసహదేవులు తల్లి దగ్గరికి ముందుగానే వచ్చి ఉండగా, తర్వాత భీమార్జునులు ద్రౌపదితో కూడా వచ్చి నమస్కరించి 'మే మొక భిక్ష తెచ్చాము' అని తల్లికి నివేదించారు. ఆమె ఆ భిక్షనుగూర్చి తెలియక ఎప్పటివంటిదానిగానే భావించి, సంతసించి, 'దానిని మీ రైదుగురు ఉపయోగించుకొండి' అని కొడుకులను ఆజ్ఞాపించింది. అయితే, ముల్లోకాల రాజ్యలక్ష్మివలె ఉన్న ఆ కన్యను (ద్రౌపదిని) చూచి, సిగ్గుపడి, అధర్మానికి భయపడి ధర్మరాజుతో ఇట్లా పలికింది.

సీ. 'ఈ తన్విఁ దోడ్కొని నీ తమ్ము లిరువురు । ప్రీతి నేతెంచి 'యీ భిక్ష యెప్పఁ
గొను' మని నాకుఁ జెప్పినను 'నేవురు నుప । యోగింపుఁ' డంటి; నాయుక్తి దొల్లి
యనృత మెన్నండుఁ గా దనఘ! మీ రెప్పుడు । మద్వచనాతిక్రమంబు సేయ;
రిది లోకమున లేని యది; యేమి సేయంగ । నగు?' నని చింతాకులాత్మ యైనఁ

తే. దల్లి నూరార్చి, వాసవతనయుఁ జూచి । 'పార్థ! నీచేతఁ బడయంగఁ బడిన దీని
నగ్ని సన్నిధిఁ బాణిగ్రహణంబు నీవ । చేయు' మన ధర్మజునకును జిష్ణుఁ డనియె. 211

ప్రతిపదార్థం: ఈ, తన్విన్= ఈ కాంతను; తొడ్కొని= తీసికొని; నీ తమ్ములు= నీ తమ్ముళ్లు; ఇరువురు= ఇద్దరూ; ప్రీతిన్= సంతోషంతో; ఏతెంచి= వచ్చి; ఈ, భిక్ష= ఈ భిక్షను; ఒప్పన్= ఒప్పుగా; కొనుము+అని= గ్రహింపు మని; నాకున్; చెప్పినను= చెప్పగా; ఏవురున్= ఐదుగురును; ఉపయోగింపుఁడు= ఉపయోగించుకొండి; అంటిన్= అని అన్నాను; నా, ఉక్తి= నా మాట; తొల్లి= పూర్వం; ఎన్నండును= ఎప్పుడుకూడా; అనృతము= అబద్ధం; కాదు= కాలేదు; అనఘ= పాపరహితుడా! - ఓ ధర్మరాజా!; మీరు; ఎప్పుడు= ఏనాడుకూడా; మద్+వచన+అతిక్రమంబు= నామాట దాటుటను; చేయరు; ఇది= ఈ పద్ధతి; లోకాన, లేని, అది= లోకంలో లేనిది; ఏమి చేయంగన్+అగున్= ఏమి చేయగలం; అని= అంటూ; చింతా+ఆకుల+ఆత్మ+ఐనన్= చింతచేత కలత నొందిన మనస్సు కలది కాగా; తల్లిన్; ఊరార్చి= ఓదార్చి; వాసవ, తనయున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడిని; చూచి; పార్థా!= అర్జునా; నీచేతన్= నీచేత; పడయంగన్+పడిన= పొందబడిన; దీనిన్= ఈ స్త్రీని; అగ్ని, సన్నిధిన్= అగ్ని ఎదుట; నీవు+అ= నీవే; పాణిగ్రహణంబు, చేయుము= పెళ్ళాడుము; అనన్= అని అనగా; ధర్మజునకును; జిష్ణుఁడు= అర్జునుడు; అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: 'ఈ కాంతను తోడ్కొని నీ తమ్ము లిద్దరు సంతోషంతో వచ్చి ఈ భిక్ష గ్రహించు మని నాతో చెప్పగా, 'మీ రైదుగురు ఉపయోగించుకొండి' అని అన్నాను. నా మాట ఇంతవరకు ఎన్నడు అసత్యం కాలేదు. ధర్మజా! మీ రెప్పుడు నా మాట జవదాటరు. కాని, ఇది లోకవిరుద్ధం. ఏం చేద్దాం' అని చింతతో కలతచెందిన తల్లిని ఓదార్చి, అర్జునుని వైపు చూచి 'అర్జునా! నీవు సంపాదించిన ఈమెను అగ్నిసన్నిధిలో నీవే వివాహం చేసికొమ్ము' అని పల్కగా ధర్మజునితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

వ. 'పెద్దవాఁ డుండఁ గొండుక వానికి వివాహం బగుట ధర్మ విరుద్ధంబు గావున దీని నగ్రమహిషిగాఁ బరిగ్రహింపుము; మా నలువుర యనుమతంబును నిట్టిద' యనుచున్న యవసరంబున విధిప్రేరణవశంబున. 212

ప్రతిపదార్థం: పెద్దవాడు; ఉండన్= ఉండగా; కొండుకవానికిన్= చిన్నవానికి; వివాహంబు+అగుట= పెండ్లి అగుట; ధర్మ, విరుద్ధంబు= ధర్మానికి విరుద్ధం; కావున= కాబట్టి; దీనిన్= ఈమెను; అగ్ర, మహిషిన్, కాన్= పెద్దభార్యగా; పరిగ్రహింపుము; మా నలువుర, అనుమతంబునున్= మా నలుగురి సమ్మతికూడా; ఇట్టిది+అ= ఇదే; అనుచున్+ఉన్న= అనుకుంటూ ఉండే; అవసరంబునన్= సమయాన; విధి, ప్రేరణ, వశంబునన్= విధిప్రేరణచేత.

తాత్పర్యం: 'పెద్దవాడు ఉండగా చిన్నవాడికి పెళ్లికావటం ధర్మవిరుద్ధం. అందుచేత ఈమెను పెద్దభార్యగా పరిగ్రహింపుము. మా నలువురికి సమ్మత మైనదికూడ ఇదే'! అని అంటున్న సమయంలో విధిప్రేరణతో.

ఉ. ఆ లలితాంగియందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండుభూ
పాల తనూజపంచకము పంచశరాహతిఁ బొందె నొక్కతన్
బాలికఁ దొల్లి యేవురకు భామినిగా సృజియించి యున్న య
య్యాలరి బ్రహ్మ చెయ్ది పరమార్థముగా కది యేల యొం డగున్. 213

ప్రతిపదార్థం: ఆ, లలిత+అంగి, అందు= ఆ అందమైనశరీరం కల ద్రౌపదియందు; హృదయంబులు= మనస్సులు; దృష్టులు= చూపులు; నిల్పి= పాదుకొల్పి, నెలకొనజేసి; పాండుభూపాల, తనూజ, పంచకము= పాండురాజు కొడుకు లైదుగురి సమూహం; పంచ, శర+ఆహతిన్= ఐదుబాణాలు కలవాడైన మన్మథునియొక్క దెబ్బను; పొందెన్= పొందాడు; ఒక్కతన్, బాలికన్= ఒక కన్యకను; తొల్లి= పూర్వం; ఏవురకున్= ఐదుగురికి; భామినిన్+కాన్= భార్యగా; సృజియించి= సృష్టించి; ఉన్న= ఉండే; ఆ+అలరి, బ్రహ్మ, చెయ్ది= ఆ తుంటరిఅయిన బ్రహ్మయొక్కచేష్ట అయినది; పరమ+అర్థము= సత్యము కాక; ఒండు= ఇతరం; ఏల, అగున్= ఎందుకు ఔతుంది?

తాత్పర్యం: ఆ అందమైనశరీరం కల ద్రౌపదిమీద పాండురాజు కుమారు లైదుగురు తమ మనస్సులను, చూపులను నిల్పి, మన్మథబాధ పొందారు. ఒక కన్యకను ఐదుగురికి భార్యగా భావించి, ముందే సృష్టించి ఉన్న తుంటరి బ్రహ్మచేసినపని సత్యంకాక, వేరొక విధంగా ఎలా అవుతుంది?

విశేషం: పాండుభూపాల తనూజ 'పంచకం' - అన ప్రయోగంలో సమాహారమైన 'పంచకం' అనే శబ్దానికి వ్యంగ్యార్థస్ఫూర్తి ఉన్నది. ద్రౌపదిపట్ల పాండవులకు ఉండే ఏకతాభావాని కిది సూచన. పంచేంద్రోపాఖ్యానంలో చెప్పబడబోయే ఏకైకతత్త్వాని కిది ధ్వని. ద్రౌపదియందు పాండవులు అయిదుగురు ఒక్కసారి మన్మథభావం పొందా రని చెప్పటం సాభిప్రాయం. ఆపైన

ద్రౌపదికూడ పాండవులందరియందు అనురక్తురా లౌతుంది. ఇది చిత్రమైన సన్నివేశం. భార్యాభర్తలనడుమ ఉదయించే రతిభావం, అనురాగం, జనసాంతరసౌహృదరూపం కాని తాత్కాలికం కా దని ఇందులో ధ్వనింపబడింది. అంతేకాదు - మత్స్యయంత్రం భేదించిన తరువాత ద్రౌపది మన్మథునివంటి అర్జునుని మెడను కల్యాణమాలతో అలంకరించినట్లు కవి చెప్పినా వారిరువురి మనస్సులలో మారవికారం కలిగినట్లు చెప్పక, ఇక్కడ అందరికీ ఒకేసారి మన్మథభావం ఉదయ మైన దని వర్ణించడం నన్నయ కథాకథనశిల్పం. (సంపా.)

వ. ఇట్లు పాంచాలియందు బద్ధానురాగు లయియున్న తమ యేవుర యభిప్రాయం బెఱింగి వేద వ్యాస వచనంబులుం దలంచి ధర్మతనయుండు దమ్ముల కి ట్లనియె. 214

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాంచాలి, అందున్= ద్రౌపదియందు; బద్ధ+అనురాగులు+అయి= తగులుకొన్న ప్రేమకలవా ళ్ళయి; ఉన్న= ఉన్నటువంటి; తమ, ఏవుర= తమ ఐదుగురి; అభిప్రాయంబు; ఎఱింగి= తెలిసికొని; వేదవ్యాస, వచనంబులున్= వేదవ్యాసుని వాక్కులు కూడా; తలంచి= తలచుకొని; ధర్మతనయుండు= ధర్మరాజు; తమ్ములకున్= సోదరులతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా ద్రౌపదియందు అనురక్తు లై ఉన్న తమ అయిదుగురి అభిప్రాయం తెలిసికొని, వేదవ్యాసునిమాటలు తలచి, ధర్మరాజు తమ్ములతో ఈ విధంగా అన్నాడు.

క. గురువచనస్థితి మన కే । గురకును నిది పత్నిగాఁ దగుం గావున ని
త్తరుణిని బరిగ్రహింతము । తిరముగ; గురువచన మొండుదెఱఁ గేల యగున్. 215

ప్రతిపదార్థం: గురు, వచన, స్థితి= పెద్దవారియొక్కమాట ఉండటంచేత; మనకు+ఏగురకునున్= మన ఐదుగురికి; ఇది= ఈ ద్రౌపది; పత్ని= భార్య; కాన్, తగున్= కాదగును; కావునన్= కాబట్టి; ఈ+తరుణినిన్= ఈ కాంతను; తిరముగా= స్థిరంగా; పరిగ్రహింతము= పరిగ్రహించుదము-పెండ్లాడుదాం; గురు, వచనము= పెద్దవారిమాట; ఒండు, తెఱఁగు= వేరు విధంగా; ఏల, అగున్= ఎందుకు అవుతుంది.

తాత్పర్యం: పెద్దల మాట ప్రకారం మన ఐదుగురికి ఈమె భార్య కాదగును. కనుక ఈమెను నిశ్చితంగా మనం వివాహం చేసుకొందాము. పెద్దలమాట వ్యర్థం కాదుగదా!

వ. అని పలుకుచున్న యవసరంబున. 216

ప్రతిపదార్థం: అని= ఆప్రకారంగా; పలుకుచు+ఉన్న= మాటాడుతూఉండే; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: అని అంటున్న సమయంలో.

శ్రీకృష్ణ బలరాములు ధర్మరాజాదులఁజూడవచ్చుట (సం.1-183-2)

శా. రాజత్కీర్తులు వచ్చి కాంచి రనఘుల్ రాముండు గృష్ణుండు న
య్యాజామీఢు నజాతశత్రు నృపలోకారాధ్యు నుద్యద్గుణ

భ్రాజిష్ణుం దమ మేనయత్త కొడుకున్ బాలార్కతుల్యోజ్జ్వల
త్తేజున్ భ్రాతృచతుష్కమధ్యగతుఁ గౌంతేయాగ్రజున్ ధర్మజున్. **217**

ప్రతిపదార్థం: రాజత్+కీర్తులు= ప్రకాశిస్తున్న కీర్తికలవాళ్ళు; అనఘుల్= పాపం లేనివాళ్ళు; రాముండు= బలరాముడు; కృష్ణుండున్; వచ్చి; ఆ+అజామీఢున్= ప్రసిద్ధమయిన అజామీఢునివంశంలో పుట్టినవాడిని; అజాతశత్రున్= పుట్టబడని శత్రువులు కలవాడిని; నృప, లోక+ఆరాధ్యున్= రాజసమూహంచేత సేవింపదగినవాడిని; ఉద్యత్+గుణ, భ్రాజిష్ణున్= ఉన్నత మైన గుణాలచేత ప్రకాశించేవాడిని; తమ, మేనయత్త= తన మేనత్త; కొడుకున్= కుమారుణ్ణి; బాల+అర్క, తుల్య+ఉత్+జ్వలత్+తేజున్= బాలసూర్యునితో సమానంగా ప్రకాశిస్తున్న తేజస్సు కలవాడిని; భ్రాతృ, చతుష్క, మధ్య, గతున్= తమ్ములు నలుగురిమధ్య ఉన్నవాడిని; కౌంతేయ+అగ్రజున్= కుంతికొడుకులలో పెద్దవాడిని; ధర్మరాజున్; కాంచిరి= చూచారు.

తాత్పర్యం: ప్రకాశిస్తున్న కీర్తి కలవాళ్ళు, పాపంలేనివాళ్ళు అయిన బలరామకృష్ణులు వచ్చి - అజామీఢుని వంశంలో పుట్టినవాడు, శత్రువులు లేనివాడు, రాజసమూహం సేవింప తగినవాడు, ఉన్నతగుణాలతో వెలిగేవాడు, తమ మేనత్తకొడుకు, బాలసూర్యునితో సమానమైన ఉజ్జ్వలతేజస్సు కలవాడు, తమ్ములు నలుగురిమధ్యలో ఉన్నవాడు, కుంతికొడుకులలో పెద్దవాడు అయిన ధర్మజుడిని చూచారు.

విశేషం: మహాభారతంలో ఇది శ్రీకృష్ణపాండవుల ప్రథమసమావేశం. నన్నయగారి వస్తుధ్వని శిల్పానికి ఇది ఉత్తమ ఉదాహరణం. ఇది ఒక అపూర్వ ప్రథమ సమావేశం. శ్రీకృష్ణుడు పాండవులను చూచా డని వర్ణించలేదు నన్నయ. నలుగురు తమ్ముల నడుమనున్న ధర్మరాజును చూచినట్లు వర్ణించాడు. అంతేకాదు బ్రాహ్మణ వేషధారిగా కాక 'నృపలోకారాధ్యుడి'గా దర్శించినట్లు వర్ణించటం సాభిప్రాయం. శ్రీకృష్ణకృపాకటాక్షాలతో ధర్మజుడు రాజసూయాగాదులు నిర్వహించి సకల రాజలోక పూజితుడౌతా డని వస్తుధ్వని. 'బాలార్కతుల్యోజ్జ్వలతేజు' డనటం మరొక విశేషం. ఇక్కడినుండి ధర్మరాజు జీవితంలో ఉజ్జ్వల అధ్యాయం మొదలౌతున్న దని భావం. ముందుపద్యం (213)లో పాండవ పంచకం అనే సమాసం వ్యక్తులుగా వా రైదుగురైనా తత్త్వంలో ఒకరే అని ధ్వనింపజేస్తున్నది. అందువలననే నాయికగా ద్రౌపది ఒక్కతే. మహాభారతంలో నాయకులు పాండవులు, అందులోనూ ప్రధానుడు ధర్మరాజు. భీమాదులు అనునాయకులు. అనునాయకు లంటే స్వీయప్రయోజనం లేకుండా ప్రధాననాయకకార్యమే తమ కార్యాలుగా భావించే అద్వైతచిత్తవృత్తులు కలవారు. శ్రీకృష్ణుడు పాండవులకు దైవంవంటి మిత్రుడు, గురువు, బంధువు. అందువలన మహాభారతంలో కృష్ణుడు ఉపనాయకుడు. స్వీయప్రయోజనంతోపాటు నాయక ప్రయోజనాన్ని కూడా సాధించి పెట్టేవాడు ఉపనాయకుడు. ఒక్కొక్కసారి నాయకునికంటె ఉపనాయకుడు మహిమాన్వితుడు కావచ్చును. ఇటువంటి సందర్భమే ధర్మరాజుకు సిద్ధించింది. దానివలన ధర్మరాజు ఉభయార్థసిద్ధి అయ్యాడు. శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపది, కుంతి - అనే పాత్రలు పాండవపక్షంలో ఇక ముందుకథలో ప్రధానపాత్రలు నిర్వహించబోతున్నారన్న అర్థాన్ని ధ్వనిమయం చేశాడు నన్నయ. (సంపా.)

వ. కని త మ్మెఱింగించి యతిస్నేహంబున నయ్యుధిష్ఠిరునకుం గుంతీదేవికి మ్రొక్కి భీమార్జుననకుల సహదేవులం గౌఁగిలించుకొని, పరమసమ్మదరసపూరితహృదయు లై యున్న వారల కుశలం బడిగి ధర్మరా జి ట్లనియె. **218**

ప్రతిపదార్థం: కని= చూచి; తమ్ము+ఎఱింగించి= తమను పరిచయం చేసికొని; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రేమతో; ఆ యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; కుంతీదేవికిన్, మ్రొక్కి; భీమ+అర్జున, నకుల, సహదేవులన్= భీముని, అర్జునుని నకులుని సహదేవుని; కౌఁగిలించుకొని; పరమ, సమ్మద, రస, పూరిత, హృదయులు+ఐ= మిక్కిలి ఆనంద మనే రసంచేత

నిండిన హృదయాలు కలవాళ్ళయి; ఉన్నన్= ఉండగా; వారల= వారియొక్క; కుశలంబు= క్షేమం; అడిగి; ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: చూచి, తమను పరిచయం చేసికొని మిక్కిలిప్రేమతో ధర్మజునికి, కుంతీదేవికి నమస్కరించి, భీమార్జుననకులసహదేవులను కౌగలించుకొని పరమానందంతో నిండిన హృదయాలతో ఉండగా, వాళ్ళను కుశలమడిగి ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. ఒవ్వమిఁ గౌరవులకుఁ గడు । దవ్వయి మఱి విప్రవేషధారుల మయి మ
మ్మెవ్వరు నెఱుంగకుండఁగ । నివ్విధమున నున్న నెట్టు లెఱిఁగితి రీరల్. 219

ప్రతిపదార్థం: ఒవ్వమిన్= విరోధంచేత; కౌరవులకున్; కడున్= మిక్కిలి; దవ్వు+అయి= దూరమై; మఱి= ఇంకా; విప్ర, వేష, ధారులము+అయి= బ్రాహ్మణవేషాలను ధరించినవాళ్ళమై; మమ్ము+ఎవ్వరున్= మమ్మల్ని ఎవరుకూడా; ఎఱుంగక; ఉండఁగన్= తెలియకుండగ; ఈ, విధమునన్= ఈ విధంగా; ఉన్నన్= ఉండగా; ఈరల్+మీరు; ఎట్టులు= ఏవిధంగా; ఎఱిఁగితిరి= గుర్తించినారు?

తాత్పర్యం: విరోధంతో కౌరవులకు మేము దూరమై, బ్రాహ్మణ వేషాలు ధరించి, మమ్మల్ని ఎవ్వరూ గుర్తించకుండ ఈ విధంగా ఉంటే, మీ రెట్లా తెలిసికొన్నారు?

వ. అనిన నగుచు వాసుదేవుం డి ట్లనియె. 220

ప్రతిపదార్థం: అనినన్= అని ధర్మరాజు అనగా; నగుచున్= నవ్వుతూ; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని ధర్మరాజు అనగా శ్రీకృష్ణుడు నవ్వుతూ ఈ విధంగా అన్నాడు.

ఉ. అంబుజమిత్రుఁ డంబుదచయాంతరితుం డగుడుం దదీయ తే
జంబు జగజ్జనంబులకు శక్యమె కప్పఁగ; మీరు గూఢభా
వంబున నున్న మీదగు నవారితతేజము భూజనప్రసి
ద్ధం బగుఁ గాక; దానిఁ బిహితంబుగ నెవ్వరుఁ జేయనేర్తురే. 221

ప్రతిపదార్థం: అంబుజ, మిత్రుఁడు= నీటినుండి పుట్టిన పద్మాలకు స్నేహితు డైన సూర్యుడు; అంబుద, చయ, అంతరితుండు= మేఘ సమూహంచేత కప్పబడినవాడు; అగుడున్= కాగా; తదీయ, తేజంబు= అతనియొక్క తేజస్సు; జగత్+జనంబులకున్= లోకంలోని మానవులకు; కప్పఁగన్= అగుపడకుండ చేయుట; శక్యమే= సాధ్యమా; మీరు; గూఢ భావంబునన్= రహస్య మైన విధంగా; ఉన్నన్= ఉండగా; మీది+అగున్= మీకు సంబంధించినదగు; ; అవారిత, తేజము= అడ్డగింప సాధ్యం కాని తేజస్సు; భూ, జన, ప్రసిద్ధంబు= భూమి యందలి జనులకు తెలిసినదే; అగున్= ఔనుకదా!; కాక, దానిన్= ఆ తేజస్సును; పిహితంబుగన్= కప్పబడిన దానినిగా; ఎవ్వరున్= ఎవరైనను; చేయ, నేర్తురే= చేయగలరా!

తాత్పర్యం: సూర్యుడిని మేఘసమూహం కప్పినా అతనితేజస్సును లోకంలోని జనులకు కనిపించకుండ చేయటం సాధ్యమా? అట్లాగే మీరు రహస్యంగా మారువేషంలో ఉన్నా, అడ్డగించ సాధ్యం కాని మీ తేజస్సు లోకంలోని ప్రజలకు ప్రసిద్ధమే. దానిని అగుపడకుండ ఎవ్వరు చేయగలరు?

విశేషం: అలం: దృష్టాంతం. పాండవులు ఎన్నో కష్టా లనుభవించి, చివరకు గొప్పగా ద్రౌపదిని గెల్చుకొని మహానందంతో ఉన్న సమయంలో శ్రీకృష్ణుడు మొదటిసారిగా కలిసి చేసిన ఈ ప్రశంస, వారి ఆనందాన్ని అంతకు అంత పెంచటమే గాక వారి హృదయాలను గట్టిగా తనవశం చేసుకోగలదు.

పాండవుల వంశాదికము నెఱింగి ర మ్మని ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం బనుచుట (సం.1-184-3)

వ. 'సకలరాజసమక్షంబున నిట్టి యతిమానుషం బయిన యద్భుతకర్మం బర్జుసునక కా కన్యులకుఁ జేయ శక్యంబె? యని యెఱింగితిమి; మీపరాక్రమంబ మిమ్ము నెఱింగించె; నధర్మనిరతు లగు ధృతరాష్ట్రదుర్యోధనులు సేసిన లాక్షాగారదాహప్రయోగంబువలన విముక్తుల రయితి; రింక మీకు ల గ్గగు' నని చెప్పి బలదేవసహితుం డయి వాసుదేవుం డరిగిన; నిట ద్రుపదుండు దనకూఁతునకు వరుం డైన వాఁ డెవ్వఁడో యేవంశంబునవాఁడో వాని చరితం బెట్టిదో యెఱింగి రమ్మని ధృష్టద్యుమ్నుం బనిచిన, నతండు భీమార్జున ద్రౌపదుల పిఱుందన వచ్చి త న్నొఱు లెఱుంగకుండ నక్కుంభకారగృహంబున నుండి యంత వృత్తాంతంబు నెఱింగిపోయి ద్రుపదున కి ట్లనియె.222

ప్రతిపదార్థం: సకల, రాజ సమక్షంబునన్= అందరు రాజుల ఎదుట; ఇట్టి; అతిమానుషంబు+ఐన= మానవులకు సాధ్యంకాని దైన; అద్భుత, కర్మంబు= ఆశ్చర్యకరమైన పని; అర్జునునకు+అ+కాక= అర్జునునకు తప్ప; అన్యులకున్= ఇతరులకు; చేయ; శక్యంబె= సాధ్యమా; అని= అని; ఎఱింగితిమి= తెలిసికొంటిమి; మీ, పరాక్రమంబు+అ=మీ పరాక్రమమే; మిమ్మున్+ ఎఱింగించెన్= తెలియజేసింది; అధర్మ, నిరతులు+అగు= అధర్మంలో ఇష్టంకలవాళ్ళయిన; ధృతరాష్ట్ర, దుర్యోధనులు= ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు; చేసిన; లాక్షా+అగార, దాహ, ప్రయోగంబువలనన్= లక్కయింటిని తగులబెట్టే ప్రయత్నంనుండి; విముక్తులరు+అయితిరి= తప్పించుకొన్నవా ళ్ళయితిరి; ఇంకన్= ఇకపై; మీకు; లగ్గు= మేలు; అగున్= అవుతుంది; అని; చెప్పి; బలదేవ, సహితుండు+అయి= బలరామునితో కూడి; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; అరిగినన్= వెళ్లగా; ఇట; ద్రుపదుండు= ద్రుపదమహారాజు; తన, కూఁతునకు= తన కుమార్తెకు; వరుండు+ఐన, వాఁడు= భర్త అయిన, అతడు; ఎవ్వడో= ఎవరో; ఏ వంశంబున వాఁడో= ఏ వంశంలోని అతడో; వాని చరితంబు= అతని చరిత్ర; ఎట్టిదో= ఎటువంటిదో; ఎఱింగి= తెలుసుకొని; రమ్ము+అని; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుని; పనిచినన్= పంపగా; అతండు; ఆ ధృష్టద్యుమ్నుడు; భీమ+అర్జున, ద్రౌపదుల; పిఱుందన్+అ= భీముడు అర్జునుడు ద్రౌపది వెనుకనే; వచ్చి; తన్నున్= తనను; ఒరులు= ఇతరులు; ఎఱుంగక+ఉండన్= తెలియకుండ; ఆ+కుంభకార, గృహంబునన్= ఆ కుండలు చేసేవాని ఇంట్లో; ఉండి= విశ్రమించి; అంత, వృత్తాంతంబున్= విషయము అంతా; ఎఱింగి= తెలిసికొని; పోయి; ద్రుపదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అందరు రాజులముందు మానవులకు అసాధ్యమైన ఇటువంటి అద్భుతకార్యం చేయటం అర్జునునికి కాక ఇతరులకు సాధ్యమా? అని తెలిసికొన్నాము. మీ పరాక్రమమే మిమ్మల్ని తెలియపరచింది. అధర్మంలో ఆసక్తి కలవా ళ్ళయిన ధృతరాష్ట్ర దుర్యోధనులు చేసిన లాక్షాగృహ దహనంనుండి తప్పించుకొన్నారు. ఇక మీకు మేలు కలుగుతుంది' అని చెప్పి బలరామునితోగూడి శ్రీకృష్ణుడు వెళ్లిపోయాడు. ఇక్కడ ద్రుపదుడు తన పుత్రికకు భర్త

అయినవాడు ఎవ్వడో? ఏ వంశంవాడో; అతనిచరిత్ర ఎటువంటిదో? తెలిసికొని ర మ్మని ధృష్టద్యుమ్నుడిని పంపాడు. అతడు భీమార్జునద్రౌపదుల వెనుకనే వచ్చి, ఇతరులు తనను చూడకుండ, ఆ కుమ్మరివాని యింట్లో ఉండి, వృత్తాంతమంతా గ్రహించి వెళ్లి ద్రుపదునితో ఈ విధంగా చెప్పాడు.

సీ. అ య్యిద్దఱును గృష్ణ న ట్లొప్పఁ దోడ్కొని । చని యొక్క ముదుసలి సాని కపుడు
మ్రొక్కి యక్కన్యను మ్రొక్కించి మఱియొక్క । గౌరవర్ణుఁడు పంపఁ గడఁకతోడ
నలువురు భూసురనాథగృహంబుల । కరిగి భైక్షము దెచ్చి యంతగూడు
నొగిన యయ్యవ్వకు నొప్పించియున్న న । య్యవ్వయు ద్రౌపది నర్థిఁ బిలిచి

ఆ. బలివిధానములకు బ్రాహ్మణాతిథులకు । నన్నకాంక్షు లైన యధ్వగులకు
నగ్రమిందుఁ బుచ్చి యయ్యగ్రశేషంబుఁ । జెలువ రెండు పాళ్ళు సేయు మొనర. 223

ప్రతిపదార్థం: ఆ+ఇద్దఱును; కృష్ణన్= ద్రౌపదిని; అట్లు; ఒప్పన్= తగు విధంగా; తోడ్కొని; చని; ఒక్క, ముదుసలి, సానికి= ఒక ముసలి అవ్వకు; అపుడు= ఆ సందర్భంలో; మ్రొక్కి; ఆ+కన్యను= ఆ కన్నెను; మ్రొక్కించి= నమస్కరింపజేసి; మఱి= పిదప; ఒక్క= ఇంకొక; గౌరవర్ణుఁడు= తెల్లని వన్నెగలవాడు-ధర్మరాజు; పంపన్= ఆజ్ఞాపింపగా; కడఁకతోడన్= ప్రయత్నంతో; నలువురు= నలుగురు; భూసుర, నాథ, గృహంబులకున్= బ్రాహ్మణ శ్రేష్ఠుల ఇండ్లకు; అరిగి= వెళ్ళి; భైక్షము= భిక్షాసమూహం; తెచ్చి= తీసికొనివచ్చి; అంత, కూడున్= అంత అన్నమును; ఒగిన్= క్రమముగ; ఆ+అవ్వకున్; ఒప్పించి= అప్పగించి; ఉన్నన్= ఉండగా; ఆ+అవ్వయున్= ఆ అవ్వకూడా; ద్రౌపదిన్; అర్థిన్= ప్రీతితో; పిలిచి; చెలువ= సుందరీ; బలివిధానములకు= బలులు వేయుటకు; బ్రాహ్మణ+అతిథులకున్= బ్రాహ్మణులైన అతిథులకు; అన్న, కాంక్షులు+ఐన= అన్నమును కోరేవా ళ్ళయిన; అధ్వగులకున్= బాటసారులకు; ఇందున్= దీనిలో; అగ్రము= అధికభాగం; పుచ్చి= గ్రహించి; ఆ+అగ్రశేషంబున్= అగ్రభాగం పోగా మిగిలిన దానిని; రెండు, పాళ్ళు; ఒనరన్= ఒప్పగ; చేయుము.

తాత్పర్యం: 'ఆ యిద్దరు (భీమార్జునులు) ద్రౌపదిని ఆ విధంగా తమవెంట పిలిచికొని పోయి, ఒక ముసలి అవ్వకు నమస్కరించారు. ఆ కన్యచేతకూడా మ్రొక్కించారు. ధర్మరాజు ఆజ్ఞాపించగా పూనికతో తక్కిన నలుగురు, బ్రాహ్మణశ్రేష్ఠుల గృహాలకు వెళ్లి, భిక్షాసమూహాన్ని తెచ్చి, ఆ ఆహారాన్నంతా ఆ అవ్వకు అప్పగించారు. ఆ అవ్వ ద్రౌపదిని ఆప్యాయంగా పిలిచి, 'సుందరీ! ఇందులో అగ్రభాగం బలివిధానాలకు, బ్రాహ్మణాతిథులకు, అన్నం కోరి వచ్చే బాటసారులకు వేరుగా ఉంచి, మిగిలినదాన్ని రెండు భాగాలు చేయు' మని చెప్పింది.

విశేషం: భిక్షాన్నంలో కూడా అన్యులకు అగ్రభాగం సమర్పించే ఆర్షసంప్రదాయం అమోఘం. కోడలుగా ఇంట్లో అడుగుబెట్టిన ద్రౌపదికి అత్తగారైన కుంతి తనయింటి ఆచారవ్యవహారాలను, సంస్కృతి విశేషాలను తెలియజెప్పి, వాటి బాధ్యతలను ఆమెకు అనుభవ మయ్యేటట్లు బోధించటం ఉత్తమగృహస్థాశ్రమధర్మం. అత్తాకోడళ్ళు ఒక వంశంలో సాగే అవిచ్ఛిన్న సంప్రదాయాన్ని పోషించే ధర్మకర్త లనే భారతీయసంప్రదాయంకూడా ఇందులో రమణీయంగా చిత్రించబడింది.

క. వెడఁదయురంబును నన్నువ । కడుపును దృఢకఠినతనువుఁ గల యాతని కిం
దడర నొకపాలు వెట్టుము । వడి; నాగాయుతబలంబువాఁ డతఁ డబలా! 224

ప్రతిపదార్థం: అబలా= ఓకాంతా!; వెడద, ఉరంబునున్= విశాలమైన రొమ్మును; అన్నువ కడుపును= సన్నని కడుపును; దృఢ, కఠిన, తనువున్= దృఢమైన కఠినమైన దేహమును; కల= కలిగిన; అతనికిన్= అతనికి; ఇందున్+అడరన్= ఇందులో ఒప్పుగా; ఒక, పాలు= ఒక భాగం; వడి= వేగమే; పెట్టుము; అతడు= ఆ వ్యక్తి; నాగ+అయుత; బలంబువాడు= పదివేల ఏనుగుల బలం కలవాడు.

తాత్పర్యం: ఓ కాంతా! విశాలమైన రొమ్ము, సన్నని కడుపు, దృఢము కఠినము అయిన దేహం కల అతనికి వెంటనే ఒకభాగం ఆహారం పెట్టుము. అతడు పదివేల యేనుగుల బలం కలవాడు.

విశేషం: 'అమ్మ కడుపు చూస్తుంది. ఆలు వీపు చూస్తుంది' అని సామెత. అంటే ఊరినుండి వచ్చినబిడ్డలకయ్యే ఆకలిని ముందుగా గమనించి అన్నంపెట్టి ఆనందపెట్టేది తల్లి. ఊరినుండి ఏమి సంపాదించి తెచ్చాడో ముందుగా మగని వీపుమీది మూటను గమనించేది భార్య అని దీనిభావం. ఇల్లాలుగా బాధ్యతలు నిర్వహించటంలో ద్రౌపది తల్లిమనసుకూడా పెంచుకొన్న దని చెప్పటం ఇందులో ధ్వని. బిడ్డలు పెక్కుమంది ఉన్నప్పుడు తల్లి వివేకవతి అయి వారివారి అవసరాలను గుర్తించి ఆహారం పెట్టటం ధర్మం. భీమునికి భిక్షలో సగం పెట్టటానికి హేతువునుకూడా కుంతి చెప్పింది. అది పక్షపాతం కా దని తెలియచెప్పింది. పాండవులకు భీమునిబలమే పెద్దరక్ష అని వస్తుధ్వని. (సంపా.)

వ. 'మఱియు రెండగుపా లన్నలువురకుం బెట్టి తద్భుక్తశేషం బేనును నీవు నుపయోగింత' మని పంచినఁ గృష్ణయు నయ్యవ్వ పంచినరూపున నందఱకుం గుడువం బెట్టి, తానును గుడిచి, దర్భపూరులు విద్రిచి యందఱకు వేఱువేఱ శయనమ్ము లిమ్ముగా రచియించి, వానిపయి వారల కృష్ణాజినంబులు పఱచి సుఖశయను లై యున్న వారి పాదంబులకు నుపధానభూత యై శయనించి. 225

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; రెండు+అగు, పాలు= రెండవ భాగం; ఆ నలువురకున్= ఆ నలుగురికి; పెట్టి; తద్+భుక్త, శేషంబు= వారిచే తినబడగా మిగిలిన దానిని; ఏనును= నేనూ; నీవున్= నీవూ; ఉపయోగింతము= ఉపయోగిద్దాం; అని= అంటూ; పంచినన్= ఆజ్ఞాపించగా; కృష్ణయున్= ద్రౌపదియు; ఆ+అవ్వ; పంచిన= ఆజ్ఞాపించిన; రూపునన్= తీరున; అందరకున్= అందరికీ; కుడువన్+పెట్టి= తినటానికి పెట్టి; తానును, కుడిచి; దర్భపూరులు= దర్భపోచలు; విద్రిచి= విదిలించి; అందఱకున్= అందరికీ; వేఱువేఱు+అ= విడివిడిగా; శయనమ్ములు= పడకలు; ఇమ్ముగా= ప్రీతిగా; రచియించి= ఏర్పాటు చేసి; వాని, పయి= వాటిమీద; వారల, కృష్ణ+అజినంబులు= వాళ్ళవైన జింకచర్మాలు; పఱచి; సుఖశయనులు+ఐ= సుఖంగా పడుకొన్నవా ళ్ళయి; ఉన్నన్= ఉండగా; వారి, పాదంబులకున్= వారికాళ్లకు; ఉపధాన, భూత+ఐ= దిండువంటి దై; శయనించి= పడుకొని.

తాత్పర్యం: 'రెండవభాగం అన్నం ఆ నలుగురికి పెట్టి, వాళ్ళు తినగా మిగిలిన దానిని నేనూ, నీవూ ఉపయోగిద్దా' మని ఆజ్ఞాపించగా ద్రౌపది ఆమె చెప్పినట్లే అందరికీ అన్నం పెట్టి, తానూ తిన్నది. దర్భగడ్డిపోచలు విదిలించి, అందరికీ వేరువేరుగా పడకలు ప్రీతితో వేసి, వాటిమీద జింకచర్మాలు పరచింది. వాళ్ళు సుఖంగా పడుకొన్న తర్వాత వాళ్ళపాదాలకు దిండువలె తాను పడుకొన్నది.

ఆ. కఱకు దర్భపూరి పఱపులు; భిక్షాన్న । మశన; మట్టివారి నతిముదమున
నాదరించెఁ బ్రీతి; నాదిగర్భేశ్వరి । యయ్యు నేవగింపదయ్యెఁ గృష్ణ. 226

ప్రతిపదార్థం: కఱకు, దర్భపూరి, పఱుపులు= కఠినమైన దర్భగడ్డి పఱుపులు; భిక్షా+అన్నము= బిచ్చమెత్తుకొని తెచ్చిన అన్నం; అశనము= ఆహారం; అట్టివారిన్= అటువంటి వాళ్లను; కృష్ణ= ద్రౌపది; ఆది, గర్భ+ఈశ్వరి= మొదటినుండి - గర్భంలో ఉన్నప్పటినుండి సంపద కలది; అయ్యున్= అయినను; అతి, ముదమునన్= మిక్కిలి సంతోషంతో; ప్రీతిన్= ప్రేమతో; ఆదరించెన్; ఏవగింపదు+అయ్యెన్= అసహ్యపడదయ్యెను.

తాత్పర్యం: దర్భగడ్డి పరుపులు; భిక్షాన్నం ఆహారం - వీటిని ఆగర్భశ్రీమంతురా లైనా ద్రౌపది మిక్కిలి సంతోషంతో, ప్రేమతో ఆదరించింది కాని, ఏవగించుకొనలేదు.

క. కడవసములుఁ గోలలుఁ గ । ప్పడములు వీరలధనంబు పరికింపఁగ నె
క్కడి దేశికు లని వగవక । మడవక తనుమధ్య నిండుమనమున నుండెన్. 227

ప్రతిపదార్థం: కడవసములున్= జింకచర్మాలూ; కోలలున్= దండాలూ; కప్పడములు= చినిగిన గుడ్డలూ; వీరల, ధనంబు= వీళ్ల ధనం; పరికింపఁగన్= ఆలోచించగా; ఎక్కడి, దేశికులు= ఎక్కడి పెద్దలు - అనగా ఏమి భర్తలు; అని= అని తలచి; వగవక= దుఃఖించక; మడవక= ఏవగించక; తనుమధ్య= సన్నని నడుము కల ద్రౌపది; నిండుమనమునన్, ఉండెన్= నిండుమనస్సుతో ఉన్నది.

తాత్పర్యం: జింకచర్మాలు, దండాలు, చినిగిన గుడ్డలు - వీళ్ళ ధనాలు. ఆలోచిస్తే వీ ళ్ళేం భర్తలు? అని దుఃఖించక, అసహ్యపడక ద్రౌపది నిండుమనస్సుతో ఉన్నది.

సీ. 'అంత నయ్యేవురు నయ్యయికథ లొప్పఁ । జెప్పుచు మఱి రథసింధురాశ్వ
విషయంబులును, సమవిషమ మహావ్యూహ । నిర్భేదనోపాయనిపుణవిధులు,
నాయుధవిద్యారహస్య ప్రయుక్తులుఁ । బలికిరి; పలికినబాసఁ జూడ
నత్యుత్తమక్షత్రియాన్వయు లగుదురు; । చరితఁ జూడఁగ విప్రజాతు లగుదు;

ఆ. రెఱుఁగరాదు వారి; నీ రెండు జాతుల । వార కాని, కారు వైశ్య శూద్ర
హీనజాతు' లనిన నెంతయు సంతస । మందెఁ బృషతపుత్త్రుఁ డాత్మలోన. 228

ప్రతిపదార్థం: అంతన్= ఆ సమయంలో; ఆ+ఏవురున్= ఆ ఐదుగురు; అయ్యయి, కథలు= ఆయా కథలు; ఒప్పన్= తగు విధంగా; చెప్పుచున్= చెప్పుకొంటూ; మఱి; రథ, సింధుర+అశ్వ విషయంబులును= రథముల, ఏనుగుల, గుఱ్ఱాల సంగతులూ; సమ, విషమ, మహావ్యూహ, నిర్భేదన+ఉపాయ, నిపుణ, విధులున్= సమములు, విషమములు అయిన మహాయుద్ధ వ్యూహాలను భేదించునట్టి ఉపాయాలయొక్క నిపుణ మైన పద్ధతులూ; ఆయుధ, విద్యా, రహస్య, ప్రయుక్తులున్= ఆయుధవిద్యయందలి రహస్య ప్రయోగాలూ; పలికిరి; పలికిన, బాసన్= మాటాడిన మాటతీరును; చూడన్= పరిశీలింపగా; అత్యుత్తమ, క్షత్రియ+అన్వయులు= మిక్కిలి శ్రేష్ఠమయిన రాజవంశం కలవాళ్ళు; అగుదురు= అవుతారు; చరితన్= నడతను; చూడఁగన్= గమనింపగా; విప్ర, జాతులు= బ్రాహ్మణజాతికలవారు; అగుదురు= అవుతారు; వారిన్= వారలను; ఎఱుఁ గరాదు= తెలియటం సాధ్యపడదు; ఈరెండు జాతులవారు+అ= ఈ రెండుజాతులకు చెందినవారే; కాని; వైశ్య, శూద్ర, హీన, జాతులు, కారు; అనినన్= అని అనగా; పృషత; పుత్త్రుఁడు= పృషతుని కుమారు డైన ద్రుపదుడు; ఆత్మలోనన్= మనస్సులో; ఎంతయున్= ఎంతో; సంతసము, అందెన్= సంతోషాన్ని పొందాడు.

తాత్పర్యం: 'అప్పుడు ఆ ఐదుగురు ఆ యా కథలు చెప్పుకొంటూ రథాలు, ఏనుగులు, గుర్రాలు - వీటికి సంబంధించిన విషయాలు, సమవిషమాలైన మహాయుద్ధవ్యూహాలను భేదించే ఉపాయాలలో నిపుణమైన పద్ధతులు, ఆయుధాల రహస్యప్రయోగాలు మాట్లాడుకొన్నారు. మాటాడిన మాటలు చూస్తే, వాళ్ళు మిక్కిలి శ్రేష్ఠమైన రాజవంశంవాళ్ళుగా ఉన్నారు. ప్రవర్తన చూస్తే బ్రాహ్మణజాతివా ళ్ళనిపిస్తుంది. వా ళ్ళెవరో స్పష్టంగా తెలిసికొనటం సాధ్యపడదు. కాని, వాళ్ళు ఈ రెండుజాతులవాళ్ళే! వైశ్య, శూద్ర, హీనజాతులవాళ్ళుమాత్రం కాదు' అని తెల్పగా, ద్రుపదుడు మనస్సులో మిక్కిలి ఆనందం పొందాడు.

విశేషం: ద్రౌపదికి స్వయంవరం ప్రకటించిన ద్రుపదుడు ఆశించింది ఒకటి - అయింది ఇంకొకటి. అర్జునుడు లేదా ఏ రాకుమారుడో మత్స్యయంత్రాన్ని భేదించి ద్రౌపదిని చేపట్టగల డని ఆశిస్తే - ఒక బ్రాహ్మణుడు దాన్ని కొట్టాడు; ఆమెను చేపట్టాడు. ఒక మహారాజ పుత్రి పేద బ్రాహ్మణుని వెంట జీవితం పంచుకొనటానికి వెళ్ళింది. ఎంత చిత్రమైన మలుపు! సహజంగానే ఏ తల్లిదండ్రులైనా తమ పిల్ల వెళ్ళినచోట ఎలా ఉందో - అల్లుడు ఏలాంటివాడో - తెలిసికొనటానికి పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా ప్రయత్నిస్తారు. అటువంటప్పుడు ముక్కూ మొగం తెలియని ఒక బ్రాహ్మణుని వెంట ఎక్కడికో వెళ్ళిన తన కూతురి స్థితిగతులు తెలిసికొనా లని ద్రుపదుడు తహతహలాడటంలో ఆశ్చర్యమేముంది? అందుకే ఆ మహారాజు మొదట కొడుకును పంపాడు. పిల్లనిచ్చినవాళ్ళు తమను పరిశీలిస్తున్నా రని తెలిస్తే అత్తింటివాళ్ళు గ్రహించే అవకాశం ఉన్నది. అందుకే ధృష్టద్యుమ్నుడు రహస్యంగా విషయం సేకరించి వచ్చాడు. మాటలు చూస్తే వాళ్ళు రాకుమారు లని, ప్రవర్తన చూస్తే బ్రాహ్మణు లని, ఇతర జాతుల వాళ్ళు ఏ మాత్రం కా రని చెప్పాడు. అంతమాత్రాన తండ్రి ఉత్కంఠ ఆగుతుందా? వా ళ్ళెవరో వివరంగా తెలియాలికదా. అందుకే ద్రుపదుడు మళ్ళీ తన పురోహితుడిని పంపాడు. మహాభారతంలో చిత్రమైన మలుపులతో సహజమనోహరంగా సాగిన కథాకథన మిది.

వ. వెండియు వారల నిమ్ముగా నెఱుంగవేఁడి తనపురోహితుం బుత్తెంచినం, బురోహితుండును బ్రాహ్మణ సమూహంబుతోడ వచ్చి పాండవులం గని ధర్మరాజు నియోగంబున భీమసేనుచేత నర్ఘ్యాదివిధుల నర్చితుం డయి యి ట్లనియె. 229

ప్రతిపదార్థం: వెండియున్= మఱియు; వారలన్= వాళ్లను; ఇమ్ముగాన్= చక్కగా; ఎఱుంగన్= తెలియుటకై; వేఁడి= ప్రార్థించి, తన పురోహితున్; పుత్తెంచినన్= పంపగా; పురోహితుండును= పురోహితుడుకూడా; బ్రాహ్మణ, సమూహంబుతోడన్= బ్రాహ్మణ సమూహంతో; వచ్చి= వచ్చి; పాండవులన్; కని= చూచి; ధర్మరాజు= ధర్మరాజుయొక్క; నియోగంబునన్= ఆజ్ఞచే; భీమసేనుచేతన్; అర్ఘ్య+ఆది, విధులన్= అర్ఘ్యం మొదలైన పూజాపద్ధతులచేత; అర్చితుండు+అయి= పూజింపబడినవా డై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇంకా వాళ్ళవిషయం చక్కగా తెలిసికొని ర మ్మని తన పురోహితుడిని ప్రార్థించి, పంపగా, అతడు బ్రాహ్మణసమూహంతో వచ్చి పాండవులను చూచి - ధర్మరాజు ఆజ్ఞాపించగా భీమసేనుడు ఇచ్చిన అర్ఘ్యాది పూజలు అందుకొని, ఇట్లా అన్నాడు.

ఉ. మీ కులగోత్ర నామములు మిమ్మును నెమ్మి నెఱుంగవేఁడి చిం
తాకులు డైనవాఁడు ద్రుపదాధిపుఁ; డాతనికిం బ్రియంబుగా
నా కెఱిఁగింపుఁ డింతయు; ఘనంబుగ నద్భుతయంత్ర మత్స్యమున్
వీకున నట్టు లేసిన సువిక్రము నాతఁడు గోరుఁ జూడఁగన్. 230

ప్రతిపదార్థం: మీ, కుల గోత్ర, నామములన్= మీయొక్క కులం గోత్రం పేర్లు; మిమ్ములన్= మిమ్మల్ని; నెమ్మిన్= ప్రీతితో; ఎఱుంగన్= తెలియుటకై; వేఁడి= కుతూహలపడి; ద్రుపద+అధిపుఁడు= ద్రుపద మహారాజు; చింతా+ఆకులుఁడు+ఐనవాఁడు= చింతచేత కలతచెందినవాడైనాడు; అతనికిన్; ప్రియంబుగాన్= ప్రీతిగా; ఇంతయున్= అంతా; నాకున్+ఎఱిఁగింపుడు; ఘనంబుగన్= గొప్పగా; అద్భుత, యంత్ర మత్స్యమున్= ఆశ్చర్యకరమైన మత్స్యయంత్రాన్ని; పీకునన్= పరాక్రమంతో; అట్టుల= ఆ విధంగా; ఏసిన= కొట్టిన; సువిక్రమున్= మంచిపరాక్రమం కల వాడిని; ఆతడు, చూడఁగన్, కోరున్= ఆతడు చూచుటకై కోరుతూ ఉన్నాడు.

తాత్పర్యం: మీ కులం, గోత్రం, పేర్లు, మిమ్మల్నిగురించి ప్రీతితో తెలిసికొనా లని ద్రుపదమహారాజు చింతిస్తున్నాడు. ఆయనకు సంతోషం కలిగే విధంగా అంతా నాకు తెలియజేయండి. ఆశ్చర్యకరమైన ఆ మత్స్యయంత్రాన్ని తన పరాక్రమంతో ఆ విధంగా పడగొట్టిన మహావీరుడిని అతడు చూడగోరుతున్నాడు.

వ. అనిన విని నగుచు ధర్మతనయుండు ద్రుపద పురోహితున కి ట్లనియె. 231

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; నగుచున్= నవ్వుతూ; ధర్మతనయుఁడు= ధర్మరాజు; ద్రుపద, పురోహితునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా విని నవ్వుతూ ధర్మరాజు ద్రుపదపురోహితునితో ఈ విధంగా అన్నాడు.

క. ఇవ్వైహాయసలక్ష్యం । బివ్విలు మోపెట్టి నెట్టనేసిన వీరుం
డివ్వనితకు వరుఁ డగు నని । నెవ్వగ మీ రాజు చులక నియమము సేసెన్. 232

ప్రతిపదార్థం: ఈ+వైహాయస, లక్ష్యంబు= ఈ ఆకాశమందలి గుఱిని; ఈ+విలున్= ఈ ధనుస్సును; మోపెట్టి= ఎక్కుపెట్టి; నెట్టన్= క్రమముగ; ఏసిన= కొట్టిన; వీరుండు; ఈ+వనితకు= ఈ ద్రౌపదికి; వరుఁడు= మగడు; అగున్= అవుతాడు; అని; నెవ్వగన్= నిండైన ఆలోచనతో; మీ, రాజు; చులక, నియమము= సులువైన ఏర్పాటు; చేసెన్.

తాత్పర్యం: 'ఈ ఆకాశ మత్స్యయంత్రాన్ని, ఈ విల్లు ఎక్కుపెట్టి కొట్టినవీరుడు ఈ వనితకు భర్త అవుతాడు'- అని మీ ద్రుపదమహారాజు ఎంతో ఆలోచించి సులువైన నియమం చేశాడు.

తే. అతని నియమించి నట్లు యయ్యంత్ర మేసి । యీతఁ డిక్కన్యఁ బడసె నుర్వీశు లొద్ద;
నేల మమ్ముఁ దా నెఱిఁగెడు? నెఱిఁగి యేమి । సేయువాఁ డింక మీ పతి సెప్పుమయ్య! 233

ప్రతిపదార్థం: అతని, నియమించిన +అట్టుల+అ= అతనియొక్క నియమించినట్లుగ - అనగా అతడు చెప్పినట్లు; ఆ+యంత్రము; ఏసి= పడగొట్టి; ఈతఁడు; ఉర్వీ+ఈశుల+ఒద్దన్= రాజుల ఎదుట; ఈ+కన్యన్; పడసెన్= పొందాడు; మీ, పతి= మీ రాజు; ఏల= ఎందుకు; మమ్మున్= మమ్మల్ని; తాన్= తాను; ఎఱిఁగెడున్= తెలియగోరుతున్నాడు; ఇంకన్= ఇకపై; ఎఱిఁగి= తెలిసికొని; ఏమి, చేయువాఁడు= ఏమి చేయగలవాడు; చెప్పుము+అయ్య.

తాత్పర్యం: అతడు చెప్పినట్లే ఆ మత్స్యయంత్రాన్ని పడగొట్టి ఇత డీ కన్యను రాజు లందరి సమక్షంలో పొందాడు. ఇక మీ రాజు మమ్మల్ని తెలిసికొనటం యెందుకు? తెలిసికొని ఏం చేస్తాడు? చెప్పండి.

క. బలహీనుఁ డైన వానికి । నలవియె? మోపెట్టి తివియ న క్కార్ముకముం;
గులహీనున కకృతాస్త్రున । కలవియె? యా లక్ష్యమేయ? నశ్రమలీలన్. 234

ప్రతిపదార్థం: బలహీనుఁడు+ఐన, వానికిన్ = బలము లేనివానికి; ఆ+కార్ముకము= ఆ విల్లును; మోపెట్టి= ఎక్కుపెట్టి; తివియన్= లాగుట; అలవియె= శక్యమా; కులహీనునకున్= కులంతక్కువవానికి; అకృత+అస్త్రునకున్= నేర్వబడని అస్త్రములు కలవానికి - అంటే అస్త్రవిద్య తెలియనివానికి; ఆ, లక్ష్యము = ఆ గుఱిని; అశ్రమలీలన్= శ్రమలేని విలాసంతో; ఏయన్= కొట్టటం; అలవియే= సాధ్యమా!

తాత్పర్యం: ఆ విల్లును ఎక్కుపెట్టి లాగటం బలహీను డైనవానికి సాధ్యమౌతుందా? కులహీనుడికి, అస్త్రవిద్య నేర్వనివాడికి ఆ లక్ష్యాన్ని (మత్స్యయంత్రాన్ని) అనాయాసంగా కొట్టటం సాధ్య మౌతుందా?

పాండవులు ద్రుపదమహారాజు గృహంబునకుఁ బోవుట (సం.1-185-25)

వ. ' మీ రాజు మనోరథంబు సఫలం బయ్యె వగవ నేల?' యనిన ధర్మరాజుపలుకు విని పురోహితుండు వోయి ద్రుపదున కెఱింగించిన; ద్రుపదుండు ధృష్టద్యుమ్నుం జూచి 'చాతుర్వర్ణ్యోచితంబు లయిన రథంబులు గొనిపోయి వారల దోడ్కొని ర' మ్మని పంచిన వాఁడును నాక్షణంబ పాండవుల పాలికి వచ్చి 'యీరథంబు లెక్కి మారాజునొద్దకు రం' డనినఁ బాండవులు రాజయోగ్యంబు లయి రత్నాంచితంబు లయిన కాంచన రథంబు లెక్కి కుంతీదేవిని, ద్రౌపదిని నొక్కరథం బెక్కించి తోడ్కొని ధృష్టద్యుమ్నుతో ద్రుపదరాజనివేశంబున కరుగుదెంచునంత ద్రుపదుండును వారల కనేకవిధంబు లైన వస్తువు లతిప్రీతిం బుత్తెంచినఁ, బరార్థ్యంబు లైన యొండువస్తువులఁ బరిగ్రహింపక సాంగ్రామికంబు లైన యసిచర్మకార్ముకబాణతూణీరరథవరూథ వాజివారణ నివహంబులఁ బరిగ్రహించి తనయొద్దకు వచ్చువారి. 235

ప్రతిపదార్థం: మీ, రాజు; మనోరథంబు= కోరిక; సఫలంబు+అయ్యెన్= సఫలం అయింది; వగవన్+ఏల= చింతించటం ఎందుకు; అనినన్= అనిఅనగా; ధర్మరాజు పలుకు; విని; పురోహితుండు; పోయి; ద్రుపదునకున్; ఎఱింగించినన్= తెలుపగా; ద్రుపదుండు= ద్రుపదుడు; ధృష్టద్యుమ్నున్= ధృష్టద్యుమ్నుడిని; చూచి= కాంచి; చాతుర్వర్ణ్య+ఉచితంబులు= నాలుగుజాతులవారికి తగినవి; అయిన= అయినటువంటి; రథంబులు; కొనిపోయి= తీసుకునివెళ్లి; వారలన్= వాళ్లను; తోడ్కొని= తీసికొని; రమ్ము+అని= రమ్ము అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వాఁడునున్= ఆ ధృష్టద్యుమ్నుడుకూడా; ఆ, క్షణంబు+అ= ఆ క్షణమే; పాండవుల, పాలికిన్= పాండవుల దగ్గరకు; వచ్చి; ఈ, రథంబులు+ఎక్కి; మా, రాజు, ఒద్దకు; రండు; అనినన్; పాండవులు; రాజ యోగ్యంబులు+అయి= రాజులకు తగిన వై; రత్న+అంచితంబులు+అయిన= రత్నములచేత ఒప్పుచున్న వైన; కాంచన, రథంబులు= బంగారు తేరులు; ఎక్కి; కుంతీదేవిని; ద్రౌపదిని; ఒక్క, రథంబు= ఒక్క తేరుపై; ఎక్కించి= ఎక్కునట్లు చేసి; తోడ్కొని= తీసికొనివచ్చి; ధృష్టద్యుమ్నుతో; ద్రుపదరాజ= ద్రుపదరాజునియొక్క; నివేశంబునకున్= ద్రుపదమహారాజుయొక్క నివాసానికి; అరుగుదెంచున్+అంత= వస్తుండగా; ద్రుపదుండును= ద్రుపద మహారాజుకూడ; వారలకున్= వాళ్లకు; అనేక, విధంబులు+ఐన= అనేకరకాలైన; వస్తువులు= కానుకలైన పదార్థాలు; అతి, ప్రీతిన్= అమితమైన సంతోషంతో; పుత్తెంచినన్= పంపగా; పరార్థ్యంబులు+ఐన= శ్రేష్ఠము లైన; ఒండు, వస్తువులన్= ఇతర వస్తువులను; పరిగ్రహింపక=తీసుకొనక; సాంగ్రామికంబులు+ఐన= యుద్ధానికి సంబంధించిన వైన; అసి, చర్మ, కార్ముక, బాణ, తూణీర, రథ, వరూథ, వాజి, వారణ, నివహంబులన్= కత్తులయొక్క, డాలులయొక్క, విండ్లయొక్క, బాణాలయొక్క, అమ్ములపొదులయొక్క, రథాలయొక్క,

రథములమీది కప్పులయొక్క, గుర్రాలయొక్క, ఏనుగులయొక్క సమూహాలను; పరిగ్రహించి=తీసికొని; తన ఒద్దకు= తన దగ్గరకు; వచ్చువారిన్= వస్తూ ఉన్న పాండవులను.

తాత్పర్యం: 'మీ రాజుకోరిక సఫలమైనది. విచారించటం ఎందుకు? అని ధర్మరాజు పల్కగా విని, పురోహితుడు వెళ్ళి ద్రుపదునికి తెలియజేశాడు. అతడు ధృష్టద్యుమ్నుడిని చూచి, 'నాలుగుజాతులవాళ్ళకు ఉచితా లైన రథాలను తీసికొనివెళ్ళి, వాళ్ళను తోడ్కొని ర' మ్మని ఆజ్ఞాపించాడు. అతడు తత్క్షణమే పాండవులదగ్గరకి వెళ్ళి; 'ఈ రథా లెక్కి మా రాజు దగ్గరికి రండి' అని పల్కగా, వాళ్ళు రత్నాలు పొదిగినవి, రాజులకు తగినవి అయిన బంగారు రథాలెక్కి కుంతీదేవిని, ద్రౌపదిని ఒక రథంలో కూర్చోబెట్టి తోడ్కొని ధృష్టద్యుమ్నునితో గూడి ద్రుపదమహారాజు ఇంటికి వచ్చారు. అప్పుడు ద్రుపదుడు వాళ్ళకు అనేకవిధాలైన వస్తువులను మిక్కిలి ప్రేమతో పంపాడు. వాటిలో శ్రేష్ఠాలైన ఇతర వస్తువులను పరిగ్రహించక, యుద్ధసంబంధాలైన కత్తులు, డాలులు, ధనుస్సులు, బాణాలు, అమ్ముల పొదులు, రథాలు, రథంమీదికప్పులు, గుర్రాలు, ఏనుగులు - వీటి సమూహాలను మాత్రమే స్వీకరించారు. ఈ విధంగా స్వీకరించి తనదగ్గరకు వస్తున్న పాండవులను.

విశేషం: ధర్మరాజు గంభీరుడు; వాగ్మి; కార్యచతురుడు అని ఈ ఘట్టం నిరూపిస్తున్నది. తననుగురించి సాటివాడైన ద్రుపదరాజుకే చెప్పుతాడు కాని ఇతరులకు చెప్పని ఆత్మాభిమాని. 'మీరాజు పెద్దగా ఆలోచించి ఈ చిన్న నియమాన్ని పెట్టా' డని తన ఔన్నత్యాన్ని తెలిపాడు. నియమమే ముఖ్య మన్నాడు. కాని ద్రుపదుడు ఇతర వివరాలను ప్రకటించలేదుకదా. నియమం ప్రకారం ద్రౌపదిని గెలుచుకొన్న తరువాత వివరాలను గురించి విచారించి దుఃఖించటం ఎందుకని పలికి వివేకాన్ని ప్రదర్శించాడు. అంతటి బలపరాక్రమాలను ప్రదర్శించినవాళ్ళు సామాన్యులు కా రని తెలిసికొనటం సులభమేకదా? అని విజ్ఞత ప్రదర్శించాడు. చివరకు ముక్తాయింపుగా 'మీ రాజుమనోరథం సఫలం అయ్యింది. ఇంకా చింతించడం దేనికి'? అని అన్నాడు. ఈ వాక్యం ధర్మరాజు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నది. పైకి చూస్తే అనుకొన్నట్లుగా మత్స్యయంత్రం భేదించి కన్యను వివాహమాడ గలిగిన వరుడు దొరికాడు. ద్రుపదునికోరిక తీరిం దని భావం. లో నారసి చూస్తే 'అర్జునునికే ద్రౌపది నిద్దా మని ద్రుపదుని మనోరథంకదా! అది తీరింది. ఇంకా విచారమెందుకు? అని రమణీయార్థం. ఈ రెండర్థాలలో ధర్మజుని అంతరార్థాన్ని తెలుసుకుందా మని ద్రుపదుడు రథాలను పంపాడు. వివిధ వస్తువులను కానుకలుగా పంపాడు. ధర్మజుడు తాము బ్రాహ్మణులం కా మని, సుక్షత్రియుల మని తమ చర్యలద్వారా వ్యక్తం చేశాడు. వస్తుధ్వని సహజంగా పండిన కథాశిల్పక్షేత్రం ఈ ఘట్టం. (సంపా.)

సీ. అజినోత్తరీయుల నతిసంభృత బ్రహ్మ । తేజుల సముదితాదిత్యసముల
నాజానులంబి మహాబాహుపరిఘుల । నత్యున్నతాంసుల నతివిశాల
వక్షుల నవిరళవ్యాయామ దృఢ కరి । నాంగుల వృషభాక్షు లయిన వారిఁ
బాండుకుమారుల భరతవంశేశులఁ । జూచి సుతభ్రాతృ సుహృదమాత్య

ఆ. బంధుజనులతోడఁ బరమవిద్వన్మహీ । సురగణంబుతోడ సోమకుండు
గరము సంతసిల్లె ఘనుల నత్యుత్తమ । క్షత్త్రవంశవరులఁ గా నెఱింగి. 236

ప్రతిపదార్థం: అజిన+ఉత్తరీయులన్= జింకచర్మం పైగుడ్డగా కలవాళ్ళను; అతి, సంభృత, బ్రహ్మ, తేజులన్= మిక్కిలిగా భరించబడిన బ్రహ్మతేజస్సు కలవాళ్ళను; సముదిత+ఆదిత్య, సములన్= ఉదయించిన సూర్యుడితో సమానమైనవాళ్ళను;

ఆజాను, లంబి, మహాబాహు; పరిఘులన్= మోకాలివరకు వ్రేలాడుతున్న ఇనుపగుదియలవంటి పెద్దబాహువులు కలవాళ్ళను; అతి+ఉన్నత+అంసులన్= మిక్కిలి ఎత్తైన భుజశిఖరాలు కలవాళ్ళను; అతి, విశాల, వక్షులన్= మిక్కిలి వెడ ల్పయిన రొమ్ములు కల వాళ్ళను; అవిరళ, వ్యాయామ, దృఢ, కఠిన+అంగులన్= ఎడతెగని వ్యాయామంచేత గట్టిపడి కఠినా లైన అవయవాలు కలవాళ్ళను; వృషభ+అక్షులు+అయిన, వారిన్= ఆబోతు కన్నులవంటి కన్నులు కలవాళ్ళను; భరత వంశ+ఈశులన్= భరతవంశరాజులను; ఘనులన్= గొప్పవాళ్ళను; పాండు, కుమారులన్= పాండవులను; చూచి= కనుగొని; సోమకుండు= ద్రుపదుడు; అతి+ఉత్తమ, క్షత్ర, వంశ, వరులన్+కాన్= మిక్కిలి శ్రేష్ఠమైన క్షత్రియవంశమందు పుట్టిన శ్రేష్ఠులుగా; ఎఱింగి= తెలిసికొని; సుత, భ్రాతృ, సుహృత్+అమాత్య, బంధుజనుల తోడన్= కొడుకులతో; తమ్ములతో, స్నేహితులతో, మంత్రులతో, బంధువులతో; పరమ, విద్వత్+మహీసుర, గణంబుతోడ= గొప్పవిద్వాంసు లైన బ్రాహ్మణసమూహంతో; కరము= మిక్కిలి; సంతసిల్లెన్= సంతోషించాడు.

తాత్పర్యం: జింకచర్మం ఉత్తరీయంగా కలవాళ్ళు, అత్యధికమైన బ్రహ్మతేజస్సు కలవాళ్ళు, ఉదయించిన సూర్యుడితో సమానులైనవాళ్ళు, మోకాలివరకు వ్రేలాడే ఇనుపగడియలవంటిచేతులు కలవాళ్ళు; మిక్కిలి ఎత్తైన భుజశిఖరాలు కలవాళ్ళు, అతివిశాలమైన వక్షస్థలం కలవాళ్ళు, ఎడతెగని వ్యాయామంతో గట్టిపడి, కఠినమైన అవయవాలు కలవాళ్ళు, ఆబోతుకన్నులవంటికన్నులు కలవాళ్ళు, భరతవంశరాజులు, ఘనులు అయిన పాండుకుమారులను చూచి, వాళ్ళు అత్యుత్తమక్షత్రియవంశశ్రేష్ఠు లని తెలిసికొని - పుత్రులతో, తమ్ములతో, మిత్రులతో, మంత్రులతో, బంధువులతో, మహావిద్వాంసులైన బ్రాహ్మణసమూహాలతో కలిసి ద్రుపదుడు మిక్కిలి సంతోషించాడు.

విశేషం: ఆబోతుకన్నులు గుండ్రంగా-ఎర్రగా అందంగా ఉంటాయి. పాండవులకన్నులు అంత పౌరుషవంతంగా, అందంగా ఉన్నాయి.

వ. 'మఱియుం దనయొద్దకు వచ్చి యశంకితు లయి క్షత్త్రియోచితంబు లైన మహార్హాసనంబుల నున్నవారల రాజపుత్త్రులంగా నెఱింగియు, సంశయాపనోదనపరుండై ధర్మతనయునకు ద్రుపదుం డి ట్లనియె 'నయ్యా! మీరు క్షత్త్రియులరో బ్రాహ్మణులరో మాయావు లయి క్రుమ్మరుచున్న మంత్త్రసిద్ధులరో కాక కృష్ణాపరిగ్రహణార్థంబు దివంబున నుండి వచ్చిన దివ్యులరో యెఱుంగము; మాకు సందేహం బయి యున్నయది; మీ కలరూ పెఱింగి కాని యిక్కన్య వివాహంబు సేయనేర' మనిన ద్రుపదునకు ధర్మతనయుం డి ట్లనియె. 237

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకనూ; తన, ఒద్దకు వచ్చి= తన కడకు వచ్చి; అశంకితులు+అయి= జంకులేనివాళ్ళయి; క్షత్రియ+ఉచితంబులు+ఐన= రాజులకు తగినవైన; మహా+అర్హ+ఆసనంబులన్= ఉత్తమా లైన ఆసనములందు; ఉన్న= ఉండేవాళ్ళను; రాజపుత్త్రులన్, కాన్= రాజకుమారులుగా; ఎఱింగియు= తెలిసికొనియు; సంశయ+అపనోదన, పరుండు+ఐ= సందేహాన్ని తీర్చుకొనటమే ప్రధానంగా కలవా డై; ధర్మ, తనయునకున్= ధర్మరాజునకు; ద్రుపదుండు; ఇట్లు+అనియెన్; అయ్యా; మీరు= తమరు; క్షత్రియులరో= రాజులో; బ్రాహ్మణులరో= బ్రాహ్మణులో; మాయావులు+అయి= మాయచేయువా ళ్ళయి; క్రుమ్మరుచున్న= తిరుగుచున్న; మంత్ర, సిద్ధులరో = మంత్రసిద్ధి కలవారో; కాక; కృష్ణా, పరిగ్రహణ+అర్థంబు= కృష్ణను (ద్రౌపది) పెండ్లాడటం కొరకు; దివంబున నుండి= స్వర్గం నుండి; వచ్చిన= విచ్చేసిన; దివ్యులరో= దేవతలో; ఎఱుంగము; మాకున్= మాకు; సందేహంబు+అయి+ఉన్న+అది= సంశయం కలిగి ఉన్నది; అది; మీ, కలరూపు= మీ నిజరూపం; ఎఱింగి= గ్రహించి; కాని= తప్ప; వివాహంబు= పెండ్లి; చేయనేరము= చేయజాలము; అనిన= అని అనగా; ద్రుపదునకున్= ద్రుపదమహారాజుకు; ధర్మతనయుండు= ధర్మజుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతేకాక, తన దగ్గరికి వచ్చి జంకులేక క్షత్రియులకు తగిన ఉన్నతాసనాలపై కూర్చొన్న పాండవులను-రాజపుత్రులుగా తెలిసికొన్నప్పటికి, సందేహం తీర్చుకొనా లని ద్రుపదుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు - 'అయ్యా! మీరు క్షత్రియులో? బ్రాహ్మణులో? మాయావు లై తిరుగుతున్న మంత్రసిద్ధులో? లేక ద్రౌపదిని వివాహ మాడటానికి దేవలోకంనుండి దిగివచ్చిన దేవతలో? తెలియడంలేదు. మాకు సందేహంగా ఉన్నది. మీ నిజస్థితి తెలిసికొని కాని ఈ కన్యకు వివాహం చేయలేము' అని ద్రుపదుడు పల్కగా అతనితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. క్షత్త్రియులము, పాండుప్రియ । పుత్త్రుల; మే నగ్రజుండ, భూనుతులు మరు
త్పుత్త్రార్జునయము లమల చ । రిత్రులు నలువురును వీ రరిందము లెందున్. 238

ప్రతిపదార్థం: క్షత్రియులము, పాండు, ప్రియపుత్త్రులము= క్షత్రియులము, పాండురాజుయొక్క ప్రియమైన కుమారులం; ఏన్= నేను; అగ్రజుండు+అ= ముందుపుట్టినవాడను; భూ, నుతులు= భూమియందు కొనియాడబడినవాళ్ళు; మరుత్+పుత్త్ర+అర్జున, యములు= వాయుపుత్త్రుడైన భీముడు, అర్జునుడు, కవ లైన నకులసహదేవులు; వీరు; నలువురును; అమల, చరిత్రులు= నిర్మలమైన నడవడి కలవాళ్ళు; ఎందున్= ఎక్కడైన; అరిందములు= శత్రువులను జయించేవాళ్ళు.

తాత్పర్యం: మేము క్షత్రియులం. పాండురాజు ప్రియపుత్రులం. నేను పెద్దవాడను. లోకంకొనియాడే భీమార్జున నకులసహదేవు లైన వీళ్ళు నలుగురు నిర్మలమైన నడవడి కలవాళ్ళు. ఎక్కడైనా శత్రువులను జయించగలవాళ్ళు.

వ. 'వీరు కుంతీమహాదేవు' లని తన్నునుం దమ్ములనుం దల్లిని నెఱింగించిన, ద్రుపదుం డతిహర్షరసావేశపరవశుం డయి పెద్దయుం బ్రొద్దునకుఁ దెలిసి, యానందజలభరితనయనుం డగుచు 'నా పుణ్యంబున లాక్షాగృహదాహం బువలన విముక్తుల రయితి' రని సంతసిల్లి తద్వృత్తాంతం బంతయు ధర్మతనయునివలన విని, ధృతరాష్ట్ర దుర్యోధనుల నిందించి, సామప్రియభాషణంబుల నభీష్టసత్కారంబులను వారిం బూజించి, యొక్కనాఁడు పుత్త్రమిత్త్రామాత్య బాంధవబ్రాహ్మణపరివృతుం డయి ద్రుపదుండు సుఖాసీను లయి యున్న పాండవుల కి ట్లనియె. 239

ప్రతిపదార్థం: వీరు, కుంతీమహాదేవులు= కుంతీమహాదేవిగారు; అని= అని; తన్నునున్= తనను; తమ్ములనున్= తమ్ముళ్లను; తల్లినిన్= తల్లిని; ఎఱింగించినన్= తెలుపగా; ద్రుపదుండు; అతి, హర్ష, రస+ఆవేశ, పరవశుండు+అయి= మిక్కిలి ఆనంద రసముయొక్క కూడికచే మైమరచినవాడై; పెద్దయున్+ప్రొద్దునకున్, తెలిసి; ఆనంద, జల, భరిత, నయనుండు+అగుచున్= సంతోషంచేత కలిగిన కన్నీటితో నిండిన కన్నులు కలవాడౌతూ; నా, పుణ్యంబునన్= నా అదృష్టంవలన; లాక్షా, గృహ, దాహంబువలనన్= లక్కఇంటి నిప్పునుండి; విముక్తులరు= బయటపడినవారు; అయితిరి= అయినారు; అని=అని; సంతసిల్లి= సంతోషించి; తద్+వృత్తాంతంబు= ఆ కథను; అంతయున్= అంతా; ధర్మతనయునివలనన్= ధర్మరాజువల్ల; విని; ధృతరాష్ట్రుని, దుర్యోధనుల= ధృతరాష్ట్ర, దుర్యోధనుని; నిందించి= తూలనాడి; సామ, ప్రియ భాషణంబులన్= మంచిఇష్టమైన మాటలతో; అభీష్ట, సత్కారంబులను= మిక్కిలిప్రియాలైన సమ్మానాలచేత; వారిన్, పూజించి; ఒక్కనాఁడు= ఒకనాడు; పుత్త్ర, మిత్ర+అమాత్య, బాంధవ, బ్రాహ్మణ, పరివృతుండు+అయి= పుత్త్రులతో, మిత్రులతో, మంత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో చుట్టబడినవాడై; ద్రుపదుండు= ద్రుపదమహారాజు; సుఖ+ఆసీనులు+అయి= సుఖంగా కూర్చున్న వాళ్ళయి; ఉన్నన్= ఉండగా; పాండవులకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వీరు కుంతీమహాదేవులు' అని తనను, తమ్ముళను, తల్లిని తెలియజేయగా - ద్రుపదుడు - అత్యధిక సంతోష రసావేశంలో మైమరచి, చాలాసేపటికి తేరుకుని, ఆనందబాష్పాలతో నిండిన కళ్ళతో 'నా పుణ్యం వలన లాక్షాగృహదహనంనుండి మీరు తప్పించుకొన్నారు' అని సంతోషించి, ఆ కథనంతా ధర్మరాజువలన విని, ధృతరాష్ట్రదుర్యోధనులను నిందించి, ఇంపైన మాటలతో, ఇష్టమైనసమ్మానాలతో వాళ్ళను పూజించాడు. తరువాత ఒకరోజు పుత్రులతో, మిత్రులతో, మంత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో కూడి ద్రుపదుడు సుఖాసీను లై ఉన్న పాండవులతో ఇట్లా అన్నాడు.

క. సుత్రామపుత్త్రుఁ డభిజన । పాత్రుండు, విచిత్ర వీర్యుపౌత్త్రుఁడు, శుభ చా
రిత్రుం డీ విజయుఁడు మ । త్పుత్రికి వరుఁ డయ్యె నెట్టి పుణ్యోదయమో! 240

ప్రతిపదార్థం: సుత్రామ, పుత్త్రుఁడు= ఇంద్రునియొక్క కుమారుడు; అభిజన, పాత్రుండు= వంశానికి తగినవాడు; విచిత్రవీర్యు, పౌత్త్రుండు= విచిత్రవీర్యుని మనుమడు; శుభ, చారిత్రుండు= మంచి నడవడి కలవాడు; ఈ, విజయుఁడు= ఈ అర్జునుడు; మత్+పుత్రికి= నా యొక్క కూతురికి; వరుఁడు+అయ్యెన్= భర్త అయ్యాడు; ఎట్టి, పుణ్య+ఉదయమో= ఎంతటి పుణ్యముయొక్క అతిశయమో.

తాత్పర్యం: ఇంద్రునికుమారుడు, జన్మించిన వంశానికి తగినవాడు, విచిత్రవీర్యుని మనుమడు, మంచినడవడి కలవాడు అయిన ఈ అర్జునుడు నాకుమార్తెకు భర్త అయ్యాడు. నా భాగ్య మేమన గలను?

వ. 'స్వయంవర లబ్ధ యయిన యి క్కన్యక నర్జునుండు ధర్మవిధిం బాణిగ్రహణంబు సేయువాఁ' డనిన ద్రుపదునకు ధర్మతనయుం డి ట్లనియె; 'నది యె? ట్లేను వివాహం బైనఁ బదంపడి భీమసేనుండు వివాహం బయిన మఱి యర్జునుండు వివాహం బగుఁగాక! ముంద రర్జునునకుఁ బాణిగ్రహణంబు సేయ నె ట్లగు?' ననిన ద్రుపదుండు ధర్మతనయున కి ట్లనియె. 241

ప్రతిపదార్థం: స్వయంవర, లబ్ధ+అయిన= స్వయంవరమునందు పొందబడిన దైన; ఈ+కన్యకన్; అర్జునుండు; ధర్మవిధిన్= ధర్మప్రకారంగా; పాణిగ్రహణంబు, చేయువాఁడు= పెండ్లిచేసికొంటాడు; అనినన్= అని అనగా; ద్రుపదునకున్= ద్రుపదునితో; ధర్మతనయుండు; ఇట్లు+అనియెన్; అది, ఎట్లు= అది ఏ విధంగా!; ఏను= నేను; వివాహంబు+ఐనన్= పెళ్ళి చేసుకొంటే; పదంపడి= తరువాత; భీమసేనుండు; వివాహంబు+అయిన= వివాహం కాగా; మఱి= అటుపై; అర్జునుండు; వివాహంబు+ అగున్+కాక; పెండ్లాడతాడు కాని; ముందర= ముందుగా; అర్జునునకున్= అర్జునునికి; పాణిగ్రహణంబు= పెండ్లి; చేయన్= చేయుట; ఎట్లు+అగున్= ఏ విధంగా అవుతుంది; అనినన్= అని అనగా; ద్రుపదుండు; ధర్మతనయునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'స్వయంవరంలో లభించిన ఈ కన్యకను అర్జునుడు ధర్మపద్ధతిలో వివాహం చేసికొంటాడు' అని ద్రుపదుడు పల్కగా; ధర్మరాజు ఇట్లా అన్నాడు ' అదెలా వీలవుతుంది? నేను పెళ్లాడిన తర్వాత భీమసేనుడు పెళ్లాడతాడు. తరువాత అర్జునుడు. ముందుగానే అర్జునుడు పెళ్లాడటం ఎట్లా జరుగుతుంది? అనగా ద్రుపదుడు ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

తే. 'అట్ల యగునేని యిక్కన్య నభిమతముగ । వసుమతీనాథ । నీవ వివాహ మగుము;
ధర్మమార్గ మెవ్వరికిని దప్ప నగునె?' । యనిన నాతని కనియె ధర్మాత్మజుండు. 242

ప్రతిపదార్థం: అట్లు+అ= ఆ విధంగానే; అగున్=ఏని= అయ్యే పక్షంలో; ఈ+కన్యన్= ఈ కన్నెను; వసుమతీనాథ= ఓ రాజా; నీవు+అ= నీవే; అభిమతముగన్= ఇష్టముగా; వివాహము+అగుము= పెండ్లిచేసుకో; ధర్మ, మార్గము= ధర్మమార్గాన్ని; ఎవ్వరికిన్= ఎవ్వరికైనను; తప్పన్+అగునె= తప్పవచ్చునా; అనినన్= అని అనగా; ధర్మ+ఆత్మజుండు= ధర్మరాజు; అతనికిన్, అనియెన్= ఆ ద్రుపదునితో ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'అట్లయితే ఓ రాజా! నీ ఇష్టప్రకారం ఈ కన్యను నీవే వివాహం చేసికొమ్ము. ధర్మమార్గం ఎవరూ తప్పరాదు కదా!' అని ద్రుపదుడు చెప్పగా, ధర్మరాజు అతనితో ఇట్లా అన్నాడు.

వ. 'ఏన కా, దిక్కన్యక నే మేవురము వివాహం బయ్యెద; మస్మన్మాతృ నియోగం బిట్టిద; యది మాకు నలంఘనీయం' బనిన విని విస్మితుం డై ద్రుపదుం డి ట్లనియె. 243

ప్రతిపదార్థం: ఏను+అ= నేనొక్కడినే; కాదు= కాదు; ఈ+కన్యకన్= ఈ కన్నెను; ఏము= మేము; ఏవురము= ఐదుగురం; వివాహంబు+అయ్యెదము= పెండ్లి చేసుకొంటాము; అస్మద్+మాతృ, నియోగంబు+ఇట్టిది+అ= మాతల్లి ఆజ్ఞ ఇట్టిదై ఉన్నది; అది= ఆ ఆజ్ఞ; మాకున్= మాకు; అలంఘనీయంబు= దాటరానిది; అనినన్= అని తెల్పగా; విని= ఆలకించి; విస్మితుండు+ఐ= ఆశ్చర్యపడినవా డై; ద్రుపదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేనే కాదు. ఈ కన్యను మే మైదుగురం వివాహం చేసికొంటాము. ఇదే మా తల్లి ఆజ్ఞ. అది మాకు దాటరానిది' అనగా విని ద్రుపదుడు ఆశ్చర్యపడి ఇట్లా అన్నాడు.

క. ఒక్క పురుషునకు భార్యలు । పెక్కం డ్రగు టెందుఁ గలదు; పెక్కండ్రకు నా
లొక్కత యగు టే యుగముల । నెక్కథలను వినియు నెఱుఁగ మెవ్వరివలనన్. 244

ప్రతిపదార్థం: ఒక్క, పురుషునకున్; భార్యలు; పెక్కండ్రు= అనేకులు; అగుట= కావటం; ఎందున్= ఎక్కడ; కలదు= ఉన్నది; పెక్కండ్రకున్= పలువురికి; ఆలు= భార్య, ఒక్కతి+అ= ఒక్కతయే; అగుట= కావటం; ఏయుగములన్, ఏ+కథలను, ఎవ్వరి వలనన్, వినియున్, ఎఱుంగము= ఏ యుగాలలో, ఏ కథలలో, ఎవరివల్ల వినికూడా తెలియము,

తాత్పర్యం: ఒక్కమగవానికి పెక్కుమంది భార్య లుండటం ఎక్కడైనా ఉన్నది. కాని పెక్కుమంది మగవాళ్ళకి ఒక్కతే భార్యకావటం ఏ యుగాలలోను, ఏ కథలలోను, ఎవ్వరివలనా విని ఎరుగం.

వ. 'నీవు లౌకిక వైదిక ధర్మస్వరూప విదుండవు ధర్మాత్మజుండవు; నీ పలుకులు ధర్మవిరుద్ధంబులు నా నోడుదు; మయినను లోకంబున నిది యశ్రుతపూర్వంబు; దీని నింక నీవును నేనును గుంతీదేవియును ధృష్టద్యుమ్నుండును విచారించి యెల్లి నిశ్చయింత' మని. 245

ప్రతిపదార్థం: నీవు; లౌకిక, వైదిక, ధర్మ, స్వరూప, విదుండవు= లోకసంబంధమైన, వేదసంబంధమైన, ధర్మస్వరూపాన్ని తెలిసిన వాడవు; ధర్మ+ఆత్మజుండవు= ధర్మదేవతయొక్క కుమారుడవు; నీ పలుకులు; ధర్మ, విరుద్ధంబులు= ధర్మానికి

వ్యతిరేకమైనవి; నాన్= అని అనటానికి; ఓడుదుము= భయపడతాము; అయినను; లోకంబునన్= లోకంలో; ఇది, అ(శ్రుత, పూర్వంబు= మున్నెన్నడు వినబడనట్టిది; దీనిన్= దీన్ని; ఇంక= ఇంకనూ; నీవును= నీవు; నేనును= నేను; కుంతీదేవియును= కుంతీదేవి; ధృష్టద్యుమ్నుండును; విచారించి= ఆలోచించి; ఎల్లి= రేపు; నిశ్చయించుదము= నిర్ణయిద్దాం; అని.

తాత్పర్యం: 'నీవు లోక సంబంధమైన, వేదసంబంధమైన ధర్మస్వరూపం తెలిసినవాడవు, ధర్ముని కుమారుడవు. నీ మాటలు ధర్మవిరుద్ధా లని అనటానికి వెనుకాడుతాము. అయినా ఇది లోకంలో ముం దెన్నడు విననట్టిది. దీనిని గురించి నీవు, నేను, కుంతీదేవి, ధృష్టద్యుమ్నుడు మరింత ఆలోచించి రేపు నిర్ణయిద్దాం' అని.

వ్యాసమహాముని ద్రుపదునియొద్దకు వచ్చుట (సం.1-186-38)

ఉ. ఈహితకార్యసిద్ధి యిది యెట్లొకో తా సమకూరు నంచు సం
దేహముఁ బొంది సోమక యుధిష్ఠిరు లున్నఁ, దదీయధర్మసం
దేహనివృత్తిపొంటెఁ జనుదెంచెఁ బరాశరసూనుఁ డాత్మతే
జోహృతసూర్యతేజుఁ డగుచున్ దిశలెల్ల వెలుంగుచుండఁగన్. 246

ప్రతిపదార్థం: ఈహిత, కార్యసిద్ధి= కోరుకొన్న కార్యం నెఱవేరటం; ఇది; ఎట్లు+ఒకొ= ఇది ఏ విధంగా; తా= తాను; సమకూరున్= నెఱవేరుతుంది; అనుచున్; సందేహమున్; పొంది; సోమక, యుధిష్ఠిరులు= ద్రుపద, ధర్మజులు; ఉన్నన్= ఉండగా; తదీయ, ధర్మ,సందేహ, నివృత్తిపొంటెన్= వాళ్ళయొక్క ధర్మసందేహాన్ని నివారించటంకొరకు; పరాశర, సూనుఁడు= పరాశరుని కుమారు డైన వ్యాసుడు; ఆత్మ, తేజోహృత, సూర్యతేజుఁడు= తన తేజస్సుచేత అణచబడిన సూర్యతేజస్సు కలవాడు; అగుచున్= అవుతూ; దిశలు+ఎల్లన్, వెలుంగుచుండఁగన్= దిక్కులు అన్నీ వెలుగుతూ ఉండగా; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: కోరుకొన్న కార్యం నెరవేరటం ఎట్లా అని ద్రుపద ధర్మజులు సందేహపడుతూ ఉండగా, వాళ్ళ ధర్మ సందేహాన్ని నివారించటానికై వ్యాసమహాముని - సూర్యతేజస్సును అణచే తన తేజస్సుతో దిక్కులన్నీ వెలుగుతుండగా అక్కడికి వచ్చాడు.

విశేషం: అలం: ఉపమ. కొఱకు - అనే అర్థంలో నన్నయనా డున్న 'పొంటెన్' అనే చతుర్థీవిభక్తిప్రత్యయం ఈనాటి తెలుగుభాషలో లేదు.

వ. ఇట్లు వచ్చిన కృష్ణద్వైపాయనునకుఁ గుంతీదేవియుఁ బాండవులును బాంచాలుండు నతిభక్తి మ్రొక్కి యమ్మహామునిం గాంచనమణిమయోచ్చాసనంబున నునిచి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి యున్న వారల కుశలం బడిగి హిత మధురసత్యసంభాషణామృతరసప్రవాహసందోహంబున నందఱం బరమానందహృదయులం జేసియున్న యమ్మునీంద్రునకు ముకుళితకరకమలుండయి ద్రుపదుం డి ట్లనియె. 247

ప్రతిపదార్థం: ఇట్లు; వచ్చిన; కృష్ణద్వైపాయనునకున్= వ్యాసునికి; కుంతీదేవియున్; పాండవులును; పాంచాలుండున్= ద్రుపదుడును; అతి=మిక్కిలి; భక్తిన్= భక్తితో; మ్రొక్కి; ఆ+మహామునిన్= ఆమహర్షిని; కాంచన, మణిమయ+ ఉచ్చ+ ఆసనంబునన్= బంగారుతో, మణులతో చేయబడిన ఎత్తైన ఆసనంమీద; ఉనిచి= కూర్చుండబెట్టి; అర్ఘ్య, పాద్య+ఆది,

విధులన్= అర్ఘ్యం, పాద్యం మొదలైన పూజాపద్ధతులచేత; పూజించి= సేవించి; ఉన్నన్= ఉండగా; వారల= వాళ్ల; కుశలంబు= క్షేమాన్ని; అడిగి= అడిగి; హిత, మధుర, సత్య, సంభాషణ+అమృత, రస, ప్రవాహ, సందోహంబునన్= మేలు చేయునది, మనస్సుకు హాయి కొలుపునది, సత్యమైనది అయిన సంభాషణ మనెడి అమృతరస ప్రవాహాల సమూహాలచేత; అందఱన్= అందరినీ; పరమ+ఆనంద, హృదయులన్= మిక్కిలి ఆనందించిన మనస్సులు కలవాళ్ళనుగా; చేసి= కావించి; ఉన్న= ఉండు; ఆ+మునీంద్రునకున్= ఆ మునిశ్రేష్ఠునికి; ముకుళిత, కర, కమలుండు+అయి= ముడిచిన కమలములవంటి చేతులు కలవాడై; ద్రుపదుండు= ద్రుపదమహారాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా వచ్చిన వేదవ్యాసునికి కుంతీదేవి, పాండవులు, ద్రుపదుడు మిక్కిలి భక్తితో నమస్కరించారు. బంగారుతో, మణులతో చేసిన ఎత్తైన ఆసనంమీద ఆ మహామునిని కూర్చుండబెట్టారు. అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించారు. ఆ మహాముని వాళ్ళను కుశల మడిగి, మనస్సుకు హాయి కలిగించే, సత్య సంభాషణ అనే అమృతరససమూహంలో అందరు పరమానందహృదయు లయ్యేటట్లు చేశాడు. అప్పుడు ద్రుపదుడు తనకరకమలాలను జోడించి నమస్కరిస్తూ ఇట్లా అన్నాడు.

క. తన పలుకు లోక మెల్లను । గొనియాడఁగఁ దగిన లోకగురుఁ డీ యమనం
దనుఁ డే మేవురమును నీ । తనుమధ్య వివాహ మయ్యెదము నని పలికెన్. 248

ప్రతిపదార్థం: తన పలుకు= తనమాట; లోకము+ఎల్లను= లోకం అంతా; కొనియాడఁగన్= మెచ్చుటకు; తగిన= యోగ్యుడైన; లోకగురుఁడు= లోకానికి ఆచార్యుడు; ఈ, యమనందనుఁడు= ఈ ధర్మరాజు; ఏము= మేము; ఏవురమును= ఐదుగురమును; ఈ, తనుమధ్యన్= ఈ సన్నని నడుము కల దానిని - ద్రౌపదిని; వివాహము= పెండ్లి; అయ్యెదము= చేసుకుంటాము; అని, పలికెన్.

తాత్పర్యం: లోకమంతా మెచ్చుకొనదగిన మాట కలవాడు, లోకగురుడు అయిన ఈ ధర్మరాజు 'మే మైదుగురమూ ఈ ద్రౌపదిని వివాహం చేసికొంటాము' అని అన్నాడు.

క. మీ రెఱుఁగనట్టి లోకా । చారము గలదయ్య? తొల్లి చన్న మహాత్ముల్
ధీరమతు లిట్లు సేసిన । వా రెవ్వరుఁ గలరె యాప్తవచనానుమతిన్. 249

ప్రతిపదార్థం: మీరు; ఎఱుఁగని అట్టి= తెలియనటువంటి; లోక+ఆచారము కలదయ్య?;= లోకాచారం ఉన్నదా? తొల్లి= పూర్వం; చన్న= గతించిన; మహాత్ముల్= పెద్దలు; ధీర, మతులు= గొప్పబుద్ధి కలవారు; ఆప్త, వచన+అనుమతిన్= పెద్దల మాట సమ్మతిచేత; ఇట్లు= ఈ విధంగా; చేసినవారు; ఎవ్వరున్= ఎవరైనా; కలరె?= ఉన్నారా!

తాత్పర్యం: మీకు తెలియని లోకాచారం లేదు. పూర్వం గతించిన మహాత్ములు, ధీరమతులు ఎవరైనా పెద్దల సమ్మతితో ఇట్లా చేసినవారు ఉన్నారా?

క. విమలమతి యన్యులకు విష । యమె ధర్మాధర్మనిర్ణయము సేయఁగ ది
వ్యమునీంద్ర । దీని సువిచా । రము సేయుము ధర్మసంకరము గాకుండన్. 250

ప్రతిపదార్థం: దివ్య, ముని+ఇంద్ర=మునీంద్రా; విమలమతి= నిర్మలమైన బుద్ధి కలవాడా!; ధర్మ+అధర్మ, నిర్ణయము= ధర్మా ధర్మములను గూర్చిన నిర్ణయం; చేయఁగన్= చేయటానికి; అన్యులకున్= ఇతరులకు; విషయమె= సాధ్యమా?; ధర్మ, సంకరము= ఇది ధర్మం, ఇది కాదు అని తెలియని సంకటస్థితి; కాక, ఉండన్= ఏర్పడకుండ ఉండేటట్లు; దీనిన్= దీన్ని; సువిచారము= చక్కని విమర్శ; చేయుము.

తాత్పర్యం: దివ్యమునీంద్రా! నిర్మలమైన బుద్ధి కలవాడా! ధర్మాధర్మనిర్ణయం చేయటం ఇతరు లెవ్వరికీ సాధ్యం కాదు. ధర్మసంకరం ఏర్పడకుండా మీరే దీనిని ఆలోచించండి.

విశేషం: ద్రుపదుడు వ్యాసునితో ఇట్లా అనటం ధర్మరాజు ధార్మికతను శంకించి కాదు, చిన్నచూపు చూచీ కాదు, విచిత్రము, అసహజము, అశ్రుతపూర్వము అయిన ఆచారాన్ని జీర్ణించుకోలేక. ధర్మరాజు ధార్మికతను ముందే మనసారా అంగీకరించాడు ద్రుపదుడు. (చూ.ప.245) కాని ధర్మరాజు చెప్పేది - ఏ ఆడపిల్ల తండ్రి అయినా అన్నివిధాల ఆలోచించి, మనః స్ఫూర్తిగా చేయవలసిన పని. అంతేకాదు - ధార్మికదృష్టితో చూస్తే, ఇది సామాన్యమైన విషయం కాదు. లోకధర్మానికి, వ్యక్తి ధర్మానికి ఏర్పడిన సంఘర్షణ. అందువలన ఈ విషయంలో సువిచారం చాలా అవసరం. అందుకే ద్రుపదుడు ధర్మజుని ధార్మికతమీద ఎంతగౌరవం ఉన్నా త్వరపడి నిర్ణయం తీసికొనక, నీవూ, నేనూ, కుంతీదేవీ, ధృష్టద్యుమ్నుడూ విచారించి రేపు నిర్ణయిద్దాం' అన్నాడు. ఇంతలో అర్థించకుండానే విజ్ఞానసంపద్విఖ్యాతుడు, సంయమిప్రకరసంభావ్యానుభావుడు వేదవ్యాస మహామునీంద్రుడు వచ్చాడు. ద్రుపదుడు తన మనస్సును ఊగిసలాడించే అనుమానాన్ని ఆయన ముందుంచాడు. అంతే.

వ. అనిన నా ద్రుపదునకుఁ గృష్ణద్వైపాయను సమక్షంబున ధర్మజుం డి ట్లనియె. 251

ప్రతిపదార్థం: అనినన్= అనగా; ఆ, ద్రుపదునకున్= ఆ ద్రుపదునికి; కృష్ణద్వైపాయను, సమక్షంబునన్= వ్యాసుని ఎదుట; ధర్మజుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అనగా ఆ ద్రుపదునితో వ్యాసునిఎదుట ధర్మరాజు ఈ విధంగా పలికాడు.

చ. నగియును బొంకునందు వచనంబు, నధర్మువునందుఁ జిత్తముం
దగులదు నాకు నెన్నఁడును; ధర్మ వవశ్యము; నట్ల కావునన్
వగవక మాకు నేవురకు వారిజలోచనఁ గృష్ణ నీఁ దగుం
దగ దను నీ విచారములు దక్కి వివాహ మొనర్పు మొప్పఁగన్. 252

ప్రతిపదార్థం: నగియును= నవ్వులాట కైనా; బొంకునందు= అసత్యమునందు; వచనంబున్= మాటా; అధర్మువు నందున్= అధర్మమునందు; చిత్తమున్= మనస్సు; నాకున్= నాకు; ఎన్నడును= ఎప్పుడుకానీ; తగులదు= తగులుకోదు; అవశ్యమున్= తప్పక; ధర్మువు= ధర్మము; అట్లు+అ= అట్లే; కావునన్; వగవక= విచారించక; మాకున్; ఏవురకున్= ఐదుగురకు; వారిజ, లోచనన్= పద్మముల వంటి కన్నులు కలదానిని; కృష్ణన్= ద్రౌపదిని; ఈన్+తగున్= ఈయతగును; తగదు+అను= ఈయతగదు అనే; నీ, విచారములు= నీ ఆలోచనలు; తక్కి= మాని; ఒప్పుఁగన్= చక్కఁగా; వివాహము+ ఒనర్పుము= పెండ్లి చేయుము.

తాత్పర్యం: నవ్వులాటకైనా నా మాట అసత్యంలో, నా మనస్సు అధర్మంలో ఎన్నడూ తగులుకొనదు. ధర్మం ఆ విధంగానే ఉన్నది. అందువలన పద్మాలవంటి కన్నులు కల ద్రౌపదిని 'ఇవ్వదగును, ఇవ్వకూడదు' అని ఆలోచించడం మానుకొని, బాధపడకుండా, మా ఐదుగురికి ఇచ్చి వివాహం జరిపించుము.

వ. మఱియుం దొల్లి గౌతమి యయిన జటిల యను ఋషికూఁతురు తపఃప్రభావంబున నేడ్వురు ఋషులకు నొక్కతియ భార్య యయ్యె ననియును, దాక్షాయణి యను మునికన్యక యేకనామంబునఁ బ్రచేతను లనంబరఁగిన పదుండ్రకు నొక్కతియ భార్యయయ్యె ననియును గథల వినంబడు; మఱి యట్లుం గాక. 253

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; తొల్లి= పూర్వం, గౌతమి+అయిన= గౌతముని వంశంలో పుట్టిన దైన; జటిల; అను; ఋషి, కూఁతురు= ఋషి కుమార్తె; తపస్+ప్రభావంబునన్= తపస్సు యొక్క ప్రభావంచేత; ఏడ్వురు= ఏడుగురు; ఋషులకున్; ఒక్కతియ= ఒక్కతె; భార్య, అయ్యెన్= భార్య అయింది; అనియును; దాక్షాయణి, అను= దాక్షాయణి అనే; మునికన్యక= మునికన్య; ఏక, నామంబునన్= ఒకే పేరున; ప్రచేతసులు; అనన్= అనగా; పరఁగిన= ఒప్పిన; పదుండ్రకున్= పదిమందికి; ఒక్కతియ= ఒక్కతె; భార్య= భార్య; అయ్యెన్+అనియును= భార్య అయింది అనికూడా; కథలన్= కథలలో; వినంబడున్= వినబడుతూ ఉంది; మఱి; అట్లున్+కాక= ఇక ఆ విధంగానే కాక.

తాత్పర్యం: అంతేగాక పూర్వం గౌతమునివంశంలో పుట్టిన జటిల అనే ఋషికూతురు తన తపఃప్రభావం చేత ఏడుగురు ఋషులకు ఒక్కతే భార్య అయిం దనీ, దాక్షాయణి అనే మునికన్యక ఒకే పేరుతో ప్రచేతసు లనబడే పదిమందికీ భార్య అయిం దనీ కథలలో వినబడుతూ ఉన్నది. అంతేకాక ఇంకా.

విశేషం: 'గౌతమి యయిన జటిల యను ఋషి కూతురు' అనే దానికి బదులు 'గౌతముం డయిన జటిలుం డను ఋషి కూతురు' అని కొన్ని ప్రతులలో పాఠాంతరం ఉన్నది.

ఆ. 'గురులలోనఁ బరమగురువు దల్లియ; యట్టి । తల్లి వచనమును, విధాతృకృతము
నన్యథాకరింప నలవియే?' యనిన నం । దొఱకు నిట్లు లనియె ద్రుపదవిభుఁడు. 254

ప్రతిపదార్థం: గురులలోనన్= గురువులలో; తల్లి+అ= తల్లియే; పరమ, గురువు= శ్రేష్ఠమైన గురువు; అట్టి= అటువంటి; తల్లి, వచనమును= తల్లిమాటను; విధాతృ, కృతమున్= బ్రహ్మదేవునిచేత చేయబడినదానిని; అన్యథాకరింపన్= వేరుగా చేయటం; అలవియే= సాధ్యమా?; అనినన్; ద్రుపద విభుఁడు= ద్రుపదరాజు; అందొఱకున్= అందరికి; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: గురువులలో తల్లి ఉత్తమగురువు. అటువంటి తల్లిమాటను, బ్రహ్మ చేసిన పనిని మార్పుచేయటం సాధ్యమా? అని ధర్మజుడు పల్కగా, అందరితో ద్రుపదరాజు ఇట్లా అన్నాడు.

విశేషం: యువకుడైన ధర్మరాజు - వయోవృద్ధు, జ్ఞానవృద్ధు, మహాతపస్వి, అన్నింటిని మించి తమ శ్రేయోభిలాషి అయిన వ్యాసుని ముందు తన మాటను తాను సమర్థించుకొన్నాడు. తాను చెప్పిన దానికి కొన్ని ఉదాహరణలుకూడా చూపాడు.

వ. 'ధర్మసూక్ష్మత నిర్ణయింప మన కశక్యంబు; త్రిలోకవంద్యుండు త్రికాలప్రవర్తనవిజ్ఞాననిధి యీ కృష్ణద్వైపాయనుండు విచారించి యెద్ది యాన తిచ్చె నదియ యిప్పుడు కర్తవ్యం' బనిన విని యమ్మునివరుండు ద్రుపదునకి ట్లనియె. 255

ప్రతిపదార్థం: ధర్మ, సూక్ష్మత= ధర్మంలోని రహస్యాన్ని; నిర్ణయింపన్= నిర్ణయించడానికి; మనకున్; అశక్యంబు= అసాధ్యం; త్రిలోక, వంద్యుండు= మూడులోకాలచే నమస్కరింప తగినవాడు; త్రికాల, ప్రవర్తన, విజ్ఞాన నిధి= మూడులోకాలలో ప్రవర్తిల్లే

విజ్ఞానానికి నిధి అయినవాడు; ఈ, కృష్ణద్వైపాయనుండు= ఈ వేదవ్యాసుడే; విచారించి= ఆలోచించి; ఎద్దె= ఏది; ఆనతి+ఇచ్చెన్= ఆజ్ఞాపిస్తాడో; అదియ= అదే; ఇప్పుడు= ఇపుడు; కర్తవ్యంబు= చేయదగినది; అనినన్= అని అనగా; విని; ఆ+మునివరుండు= ఆ మునిశ్రేష్ఠుడు - వ్యాసుడు; ద్రుపదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ధర్మసూక్ష్మాన్ని నిర్ణయించటం మనకు సాధ్యం కాదు. ముల్లోకాలచే నమస్కరింప దగినవాడు, మూడులోకాల్లో ప్రవర్తిల్లే విజ్ఞానానికి నిధి అయిన ఈ వేదవ్యాసుడు ఆలోచించి ఏది ఆజ్ఞాపిస్తే, అదే ఇప్పుడు చేయదగింది' అని పల్కగా విని, ఆ మునిశ్రేష్ఠుడు ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

విశేషం: సంశయగ్రస్తుడైన ద్రుపదుడు ఒకవైపు, నిశ్చితధర్మబుద్ధి అయిన ధర్మరాజు మరొకవైపు తమతమ వాదాలను పేర్కొన్న తరువాత, ద్రుపదుడు నిర్ణయాధికారాన్ని వ్యాసమహామునికి అప్పగించాడు. ఇక వ్యాసుడు చెప్పిందే ధర్మం,తీర్పు.

సీ. 'ధర్మతత్త్వజ్ఞుఁ డీ ధర్మతనూజుండు। ధర్మమార్గం బేల తప్పఁబలుకు?
దేవతామూర్తి యిద్దేవి మాధవి యేల। తా నెఱుంగక యన్నృతంబు పలుకు?
వీరల పలుకులు వేల్పుల మతమును। నొక్కండ కావున నొండు దక్కి
యీ యేవురకుఁ గూఁతు నిచ్చి వివాహంబుఁ। గావింపు; మఱి దీని కల తెఱంగు.

ఆ. వినఁగ నిష్టమేని విను 'మని ద్రుపదు చే। యూఁది యింటిలోని కొనర నరిగి.
తాను నతఁడు నేకతమ యుండి, వాని కం। తయును జెప్పఁదొడఁగె ధర్మవిదుఁడు. 256

ప్రతిపదార్థం: ధర్మ, తత్త్వజ్ఞుఁడు= ధర్మతత్త్వమును తెలిసినవాడు; ఈ, ధర్మతనూజుండు= ఈ ధర్మరాజు; ఏల=ఎందుకు; ధర్మమార్గంబు; తప్పన్= తప్పునట్లుగా; పలుకున్= మాటాడుతాడు; దేవతా, మూర్తి= దేవతామూర్తి అయిన; మాధవి= కుంతి; ఏల= ఎందుకు; తాన్= తాను; ఎఱుంగక= తెలియక; అనృతంబు= అసత్యం; పలుకున్= మాట్లాడుతుంది; వీరల, పలుకులు; వేల్పుల, మతమునన్= దేవతల అభిప్రాయం కూడ; ఒక్కండు+అ= ఒకటే; కావునన్; ఒండు= ఇతర విచారము; తక్కి= మాని; ఈ, ఏవురకున్= ఈ ఐదుగురుకి; కూతున్+ఇచ్చి; వివాహంబున్, కావింపు= పెండ్లి చేయవలసింది; మఱి= ఇక; దీని= దీనియొక్క; కలతెఱంగు= యథార్థము; వినఁగన్= వినటానికి; ఇష్టము+ఏని= ఇష్టమైతే; వినుము+అని= విను అని; ద్రుపదు, చేయి= ద్రుపదునియొక్క చేతిని; ఊఁది= పట్టుకొని; ఇంటిలోనికి; ఒనరన్= ఒప్పుగా; అరిగి= వెళ్ళి; తానున్= తాను (వ్యాసుడు); అతఁడున్= అతడు అనగా ద్రుపదుడు; ఏకతము+అ= ఒంటరిగా; ఉండి; వానికిన్, అంతయును= ఆ ద్రుపదునికి అంతా; ధర్మవిదుఁడు= ధర్మము నెఱింగిన వ్యాసుడు; చెప్పన్+తొడఁగెన్= చెప్పటానికి ప్రారంభించాడు.

తాత్పర్యం: 'ఈ ధర్మరాజు ధర్మతత్త్వం తెలిసినవాడు. ధర్మమార్గం తప్పి ఎందుకు మాట్లాడుతాడు? దేవతామూర్తి అయిన ఈ కుంతీదేవి తెలియక ఎందుకు అసత్యం పలుకుతుంది? వీళ్ళమాటలు, దేవతల అభిప్రాయం ఒక్కటే. అందువలన వేరే ఆలోచన మాని, ఈ ఐదుగురికి నీ కుమార్తె నిచ్చి వివాహం చెయ్యి. దీని యథార్థస్థితి వినటం నీ కిష్టమైతే వినుము' అని ద్రుపదుని చేయి పట్టుకొని ఇంటిలోపలికి పిలిచికొని వెళ్ళి, ధర్మం' తెలిసిన వ్యాసుడు ఏకాంతంగా అతనికి విషయమంతా చెప్ప నారంభించాడు.

విశేషం: కుంతీధర్మజుల అభిప్రాయాలూ, దేవతల అభిప్రాయాలూ ఒకటే అని వేదవ్యాసుడు చెప్పాడు. లౌకికు లైన వీళ్ళ మాటలలో దేవతల సంకల్పాలు ఎట్లా ప్రతిఫలిస్తున్నాయో వివరించటమే వ్యాసుడు చేయవలసిన పని. అది దేవరహస్యం.

అందువలననే ఆ ఏకాంతసంభాషణ, ఆ దివ్యదృష్టిప్రసాదం. వీటి అవసరం లేకుండానే విషయాన్ని గ్రహించిన దార్శనికుడు ధర్మజుడు. ప్రత్యక్ష ప్రమాణంతో అనుమానం తీర్చుకొన్నవాడు ద్రుపదుడు. మాధవి= కుంతి; యదువంశంలో మధుడనేవాడు ఒక ప్రసిద్ధుడు. అతని వంశంలో జన్మించింది కనుక కుంతికి మాధవి అనే పేరు వచ్చింది.

ద్రుపదునకు వేదవ్యాసుండు ఇంద్రసేనయను పతివ్రతకథ సెప్పుట (సం.1-100-60)

వ. ఇది తొల్లి నాలాయని యైన యింద్రసేన యనంబరఁగిన పరమ పతివ్రత; మౌద్గల్యుం డను మహామునికి భార్య యయి, కర్మవశంబున నమ్మునిం గుష్ఠవ్యాధిబాధితత్వగస్థిభూతకష్టశరీరు వయోవృద్ధు వలిపలితధరు దుర్గంధవదను దుఃఖజీవు నతికోపను విశీర్యమాణనఖత్వచుం బరమభక్తి నారాధించి తదుచ్ఛిష్టంబు కుడుచుచున్న నొక్కనాఁడు. 257

ప్రతిపదార్థం: ఇది= ఈమె; తొల్లి= పూర్వం; నాలాయని+ఐన; నలునికుమార్తెఐన; ఇంద్రసేన; అనన్= అనుపేరుతో; పరఁగిన= ఒప్పిన; పరమ, పతివ్రత= మహా పతివ్రత; మౌద్గల్యుండు+అను; మహా, మునికి; భార్య; అయి; కర్మవశంబునన్= చేసినకర్మ కారణంగా; కుష్ఠ, వ్యాధి, బాధిత, త్వక్+అస్థి, భూత, కష్ట, శరీరున్= కుష్ఠరోగంచేత బాధింపబడిన దై చర్మం ఎముకలు మాత్రమే అయి బాధతో కూడిన శరీరం కలవాడిని; వయోవృద్ధున్= వయస్సుచేత వృద్ధుడైనవాడిని; వలి, పలితధరున్= కడుపుమీద ముడుతలు కల వాడిని, నెఱసిన వెంట్రుకలను ధరించినవాడిని; దుర్గంధ, వదనున్= చెడువాసనతో కూడుకొన్న ముఖం కలవాడిని; దుఃఖజీవున్= దుఃఖంతో జీవించేవాడిని; అతి, కోపనున్= మిక్కిలి కోపం కలవాడిని; విశీర్యమాణ, నఖ, త్వచున్= ఊడిపోతున్న గోళ్ళు, చర్మం కలవాడిని; ఆ+మునిన్= అగు ఆ మునిని; పరమ, భక్తిన్= మిక్కిలి భక్తితో; ఆరాధించి= సేవించి; తత్+ ఉచ్ఛిష్టంబు= అతని ఎంగిలి-అనగా అతడు తినగా మిగిలింది; కుడుచుచున్= తింటూ; ఉన్నన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: ఈమె పూర్వం నలుని కుమార్తెఐన ఇంద్రసేన అనే పరమపతివ్రత. ఈమె మౌద్గల్యుడు అనే మహామునికి భార్య అయింది. అతడు ముసలివాడు; కుష్ఠరోగ పీడితుడై చర్మం ఎముకలు మాత్రమే మిగిలినవాడు. బాధతో కూడిన శరీరం కలవాడు. కడుపుమీద చర్మపుముడుతలు కలవాడు, నెరసిన వెంట్రుకలు ఉన్నవాడు. దుర్వాసనతో కూడినముఖం కలవాడు. దుఃఖంతో జీవించేవాడు, మిక్కిలికోపం కలవాడు, ఊడిపోతున్న గోళ్లు, చర్మం కలవాడు, అటువంటి ఆ మునిని ఆమె కర్మవశంతో, పరమభక్తితో సేవించింది. ఒకనాడు అతడు తిని విడిచినయెంగిలిఅన్నం తింటూ ఉండగా-ఒకరోజు

విశేషం: ఈ నాలాయన్యుపాఖ్యానం భండార్కర్ ప్రతి, నీలకంఠప్రతి, వావిళ్ల ప్రతి మొదలైన సంస్కృతభారతప్రతులలో మూలగ్రంథ భాగంలో లేదు. నీలకంఠీయవ్యాఖ్యలో మాత్రం దీనిప్రశంస ఉన్నది. అందులో దీనికి 'నారాయణ్యుపాఖ్యానం' అనే పేరు కనిపిస్తున్నది.

తే. కుడుచునెడ వాని పెనువ్రేలు కూటిలోనఁ। దునిసి పడియున్న వ్రేల్ వుచ్చి తోయజాక్షి
యేవగింపక యుచ్ఛిష్ట మిష్టలీలఁ। దగిలి కుడుచుచున్నంత నత్తరుణిఁ జూచి. 258

ప్రతిపదార్థం: కుడుచు, ఎడన్= తినునప్పుడు; వాని= ఆ మునియొక్క; పెను, వ్రేలు= పెద్దవ్రేలు; కూటిలోన్= అన్నములో; తునిసి= తునిగి; పడి, ఉన్నన్= పడిఉండగా; తోయజాక్షి= నీటినుండి పుట్టిన కమలాలవంటి కన్నులు కల ఆ ఇంద్రసేన;

వ్రేల్= వ్రేలిని; పుచ్చి= తీసివేసి; ఏవగింపక= అసహ్యపడకుండ; ఉచ్ఛిష్టము= ఎంగిలి అన్నాన్ని; ఇష్ట, లీలన్= ఇష్టమైన పద్ధతిగా, సంతోషంగా; తగిలి= ఆసక్తితో; కుడుచుచున్= తినుచు; ఉన్నంతన్= ఉన్నప్పుడు; ఆ+తరుణిన్= ఆ కాంతను; చూచి.

తాత్పర్యం: తింటూ ఉండగా, అతని బొటనవ్రేలు తునిగి అన్నంలో పడి ఉండటం చూచి, పద్మాలవంటి కన్నులు కల ఆ ఇంద్రసేన ఆ వ్రేలిని తీసివేసి, అసహ్యపడక ఆ ఎంగిలి అన్నాన్ని మిక్కిలి ప్రీతితో తినసాగింది. అప్పుడామెను చూచి.

వ. దానిదయిన పతిభక్తి గుణంబునకు మెచ్చి మౌద్గల్యుండు ప్రసన్నుం డయి 'నీ కెద్ది యిష్టంబు వేఁడు మిచ్చెద' ననిన నది యి ట్లనియె; 'మునీంద్రా! నాకుం గామోపభోగేచ్ఛ పెద్ద గలదు; నీవునుం దపశ్శక్తిఁ గామరూప ధరుండ వయి యీ బీభత్సంబగు రూపం బుడిగి, మనోహరం బయిన రూపంబునం బంచధా విభక్తుండవయి నన్ను రమియించి కామభోగంబులం దనుపు' మనిన దాని కిష్టంబైనవిధంబున నేను దేహంబులు దాల్చి మర్త్య దేవలోకంబులయందు బ్రహ్మర్షిదేవర్షిపూజితుం డై సూర్యరథం బెక్కి చని యాకాశగంగాజలంబుల నాప్లుతదేహుం డయి శీతాంశునంశు జాలంబుల వసియించి మేరుకైలాసంబులయందుఁ గ్రీడించుచు ననేకస్థానంబుల ననేక సహస్రవర్షంబులు నాలాయని యైన యింద్రసేన నుపభోగించి తృప్తుం డై, మౌద్గల్యుండు దాని విడిచి ఘోరతపంబు సేసి బ్రహ్మమయుం డై బ్రహ్మలోకంబునకుఁ జనిన; నది కామభోగములందుఁ దనియక కాలవశంబున శరీరము విడిచి కాశిరా జను రాజర్షికిం బుట్టి పెరుగుచుం గన్యాత్వమునఁ బెద్దకాలం బుండి తన దౌర్భాగ్యమునకు నిర్వేదించి, పతిం గోరి పశుపతి నుద్దేశించి యుగ్రతపంబు సేయుచున్నంత. 259

ప్రతిపదార్థం: దానిది+అయిన= ఆమెకు సంబంధించినదైన; పతిభక్తి, గుణంబునకున్= పతిభక్తి గుణానికి; మెచ్చి= కొనియాడి; మౌద్గల్యుండు; ప్రసన్నుండు+అయి= దయతలచినవా డై; నీకున్; ఎద్ది, ఇష్టంబో= ఏది ఇష్టమో; వేడుము= కోరుకో; ఇచ్చెదన్= ఇస్తాను; అనినన్= అని అనగా; అది; ఇట్లు+అనియెన్; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠా; నాకున్= నాకు; కామ+ఉపభోగ+ఇచ్ఛ= కామాన్ని అనునభవించటంలో కోరిక; పెద్ద, కలదు= మిక్కిలి ఉన్నది; నీవునున్= నీవుకూడా; తపః+శక్తిన్, కామరూప, ధరుండవు+అయి= ఇష్టమైన రూపాన్ని ధరించినవాడవై; ఈ, బీభత్సంబు+అగు= ఈ అసహ్యమైన; రూపంబు= రూపాన్ని; ఉడిగి= మాని; మనోహరంబు+అయిన, రూపంబునన్= అందమైన రూపంలో; పంచధా, విభక్తుండవు+అయి= ఐదు విధాలుగా విభాగం పొందిన వాడవై; నన్నున్; రమియించి; కామ భోగంబులన్; తనుపుము= తృప్తిపొందింపుము; అనినన్= అనిఅనగా; ఆ+ముని; దానికిన్, ఇష్టంబు+ఐన= ఆమెకు ఇష్టమైన; విధంబునన్= విధంగా; ఏను= ఐదు; దేహంబులు= శరీరాలు; తాల్చి= ధరించి; మర్త్య, దేవ, లోకంబుల, అందున్= మనుష్యలోకంలో; దేవలోకంలో; బ్రహ్మర్షి, దేవర్షి, పూజితుండు+ఐ= బ్రహ్మర్షులచేత, దేవర్షులచేత పూజింపబడినవాడై; సూర్య, రథంబు+ఎక్కి= సూర్యుని రథంఎక్కి; చని= వెళ్ళి; ఆకాశ, గంగా, జలంబులన్= ఆకాశగంగలోని నీళ్లతో; ఆప్లుతదేహుండు+అయి= తడిసిన శరీరం కలిగినవాడయి అంటే స్నానం చేసినవాడయి; శీత+అంశున్+అంశు, జాలంబుల= చల్లని కిరణాల గల చంద్రుని కిరణ సమూహాలలో; వసియించి= నివసించి; మేరు, కైలాసంబుల, అందున్= మేరువులో, కైలాసంలో; క్రీడించుచున్= క్రీడిస్తూ; అనేక, స్థానంబులన్= అనేక ప్రదేశాలలో; అనేక, సహస్ర, వర్షంబులు= ఎన్నో, వేల సంవత్సరాలు; నాలాయని, ఐన ఇంద్రసేనన్= నాలాయని అగు ఇంద్రసేనను; ఉపభోగించి= అనుభవించి; తృప్తుండు+ఐ= తృప్తి పొందినవా డై; మౌద్గల్యుండు, దాని; విడిచి= ఆమెను వదలి; ఘోర, తపంబు; చేసి= కఠోర తపస్సు గావించి; బ్రహ్మమయుండు+ఐ= బ్రహ్మత్వాన్ని పొందినవాడై; బ్రహ్మ, లోకంబునకున్; చనినన్= వెళ్ళగా; అది= ఇంద్రసేన; కామభోగంబులన్= ఇష్టభోగాలతో; తనియక= తృప్తిపొందక; కాలవశంబునన్= కాలవశాన; శరీరంబు= దేహము;

విడిచి; కాశిరాజు+అను; రాజ+ఋషికిన్= రాజర్షికి; పుట్టి; పెరుగుచున్= పెరుగుతూ; కన్యాత్వమునన్= కన్యగానే; పెద్దకాలంబు= చాలాకాలం; ఉండి; తన, దౌర్భాగ్యంబునకున్= తన యొక్క దురదృష్టానికి; నిర్వేదించి= నిరాశచెంది; పతిన్= భర్తను; కోరి; పశుపతిని, ఉద్దేశించి= శివుని గూర్చి; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేయుచున్+ఉన్నంతన్= చేస్తూఉండగా.

తాత్పర్యం: ఆమెపతిభక్తి గుణానికి మెచ్చి మౌద్గల్యుడు దయతో 'నీ కేది ఇష్టమో కోరుకో. ఇస్తాను' అన్నాడు. ఆమె 'మునీంద్రా! నాకు కామాన్ని అనుభవించాలన్న కోరిక మిక్కిలిగా ఉన్నది. నీవు తపశ్శక్తితో కోరిన రూపాన్ని ధరించి, ఈ అసహ్యమైన రూపాన్ని వదలి, మనోహరమైన రూపంతో ఐదు విభాగాలుగా విభాగం పొంది నాతో రమించు. కామభోగాలతో నన్ను తృప్తి పరచుము' అని కోరగా ఆ మహాముని ఆమెకు ఇష్టమైన విధంగా ఐదు దేహాలు ధరించాడు. మానవలోకంలో, దేవలోకంలో బ్రహ్మర్షులు, దేవర్షులు తనను పూజించగా, సూర్యరథాన్ని ఎక్కి, ఆకాశగంగలో స్నానం చేసి, చంద్రునికిరణసమూహంలో నివసించి, మేరుకైలాసపర్వతాలలో క్రీడిస్తూ ఎన్నో చోట్ల వేల సంవత్సరాలు నాలాయని అయిన ఇంద్రసేనను అనుభవించి తృప్తిపడ్డాడు. తరువాత ఆమెను విడిచి, గొప్పతపస్సు చేసి బ్రహ్మత్వాన్ని పొంది, బ్రహ్మలోకానికి వెళ్లాడు. కాని ఆమె ఆ కామభోగాలతో తృప్తిపడక కాలవశాన శరీరం వదలి, కాశిరాజు అనే రాజర్షికి పుత్రికగా జన్మించింది. కన్యగానే చాలాకాలం ఉండి, తనదౌర్భాగ్యానికి బాధపడి, భర్తకొరకు శివుణ్ణిగూర్చి భయంకరమైన తపస్సుచేస్తుండగా.

తే. దానికడకుఁ బ్రత్యేకంబ ధర్మవాయు । వాసవాశ్వినుల్ ప్రీతు లై వచ్చి దాని
నాత్మ దేహాంశజులకు దేహాంతరమునఁ । బత్నిగాఁ గోరి రధికసౌభాగ్యయుక్తి. 260

ప్రతిపదార్థం: దాని, కడకున్= దానిదగ్గరకు; ప్రత్యేకంబు+అ= వేరువేరుగా; ధర్మ, వాయు, వాసవ+ఆశ్వినుల్= యముడును, వాయువును, ఇంద్రుడును, అశ్వినీదేవతలును; ప్రీతులు+ఐ= సంతోషంపొందినవాళ్ళయి; వచ్చి; దానిన్= ఆమెను; ఆత్మ, దేహ+అంశజులకున్= తమదేహాలయొక్క అంశాలవలన పుట్టినవాళ్ళకు; దేహాంతరమునన్= మరొకజన్మలో; అధిక, సౌభాగ్య, యుక్తిన్= ఎక్కువ అందముయొక్క పొందికచేత; పత్నిన్+కాన్= భార్య అయ్యేటట్లు; కోరిరి= కోరారు.

తాత్పర్యం: ఆమెదగ్గరకు యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు సంతోషంతో వేర్వేరుగా వచ్చి, జన్మాంతరంలో తమ తమఅంశలతో పుట్టినవాళ్ళకు అధికసౌందర్యంతో ఆమె భార్య కావా లని కోరారు.

వ. అదియును గొండొకకాలంబు జలానిలాహార యై, కొండొకకాలంబు నిరాహార యై, కొండొకకాలం బేకపాదంబున నిల్చి, కొండొకకాలంబు పంచాగ్నిమధ్యంబున నుండి యత్యుగ్రతపంబు సేసిన నీశ్వరుండు ప్రసన్నుం డయి వరంబు వేఁడు మనిన, నక్కన్యక 'నాకు బతిదానంబుఁ బ్రసాదింపు' మని యర్థిత్వంబున నేనుమాఱులు వేఁడినం గరుణించి యీశ్వరుండు 'నీకు దేహాంతరంబున నేవురుపతు లగుదు' రనిన నది యి ట్లనియె. 261

ప్రతిపదార్థం: అదియును= ఆ ఇంద్రసేనయు; కొండొకకాలంబు= కొంతకాలం; జల+అనిల+ఆహార+ఐ= నీటిని, గాలిని, ఆహారంగా కలదై; కొండొకకాలంబు= కొంతకాలం; నిరాహార+ఐ= ఆహారం లేనిదై; కొండొకకాలంబు= కొంతకాలం; ఏక, పాదంబునన్= ఒకే పాదంతో; నిల్చి; కొండొకకాలంబు; పంచ+అగ్ని, మధ్యంబునన్= అయిదు అగ్నులనడుమ; ఉండి; అతి+ఉగ్ర, తపంబు= మిక్కిలి భయంకరమైన తపస్సు; చేసినన్= చేయగా; ఈశ్వరుండు= పరమేశ్వరుడు; ప్రసన్నుండు+అయి= ప్రత్యక్ష మైనవాడై; వరంబు= వరం; వేడుము+అనినన్= కోరుకో అనగా; ఆ+కన్యక; నాకున్; పతిదానంబు= పతిదానాన్ని;

ప్రసాదింపుము+అని= ఇమ్ము అని; అర్థిత్వంబునన్= కోరికచేత; ఏను, మాఱులు= ఐదుసార్లు; వేఁడినన్= ప్రార్థింపగా; కరుణించి= దయ తలచి; ఈశ్వరుండు; నీకున్, దేహ+అంతరంబునన్= నీకు మరొకదేహమునందు - అనగా మరుసటిజన్మలో; ఏవురు= ఐదుగురు; పతులు= భర్తలు; అగుదురు= అవుతారు; అనినన్= అనగా; అది= ఆమె; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత ఆమె కొంతకాలం నీరు, గాలి ఆహారంగా, కొంతకాలం ఆహారమే లేకుండా, కొంతకాలం ఒకేపాదంమీద నిల్చి, కొంతకాలం ఐదుఅగ్నులమధ్యలో ఉండి, మహాభయంకరమైన తపస్సు చేసింది. ఈశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరు కొ మ్మనగా, ఆ కన్యక 'నాకు పతిదానం ఇ' మ్మని ప్రబలమైన కోరికతో ఐదుసార్లు అడిగింది. ఈశ్వరుడు కరుణించి 'నీకు మరొకజన్మలో ఐదుగురు భర్తలౌతా' రని అనగా - ఆమె ఇట్లా అన్నది.

ఆ. సతికి నొక్కరుండ పతిగాక యెందును । బతులు పలువు రవుట కతలఁ గలదె?
లోకనాథ! యిట్టి లోకవిరుద్ధంపు । వరము వడయ నమరవరద! యొల్ల. 262

ప్రతిపదార్థం: సతికిన్= స్త్రీకి; ఒక్కరుండు+అ= ఒక్కడే; పతి= భర్త; కాక; ఎందును= ఎచ్చటనైన; పతులు= భర్తలు; పలువురు= అనేకులు; అవుట= కావటం; కతలన్= కథలందు; కలదె= ఉన్నదా? లోకనాథ!= లోకాలకు ప్రభువైనవాడా; అమర, వరద= దేవతలకు వరము లిచ్చేవాడా! ఓ పరమేశ్వరా; ఇట్టి; లోకవిరుద్ధంపు= లోకానికి విరుద్ధమైన; వరము= కోరిక; పడయన్= పొందటానికి; ఒల్లన్= ఇష్టపడను.

వ. అనిన దానికి రుద్రుం డి ట్లనియె. 263

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; దానికిన్= ఆ ఇంద్రసేనకు; రుద్రుండు= శివుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అనగా ఆమెతో ఈశ్వరుడు ఈ విధంగా అన్నాడు.

క. నా వచనంబున నీ క । య్యేవురు పతులందు ధర్మ వెడపకయుండుం
గావున నిట్టి వరం బిం । దీవరదళనేత్ర! యిచ్చితిని దయతోన్. 264

ప్రతిపదార్థం: నా, వచనంబునన్= నా మాటచేత; నీకున్; ఆ+ఏవురు, పతులందున్= ఆ ఐదుగురు భర్తలందును; ధర్మువు= ధర్మం; ఎడపక= తొలగక; ఉండున్= ఉంటుంది; కావునన్; ఇందీవర, దళ, నేత్ర= నల్లకలువరేకులవంటి కన్నులు కలదానా!; ఇట్టి వరంబున్; దయతోడన్; ఇచ్చితిని.

తాత్పర్యం: నల్లకలువరేకులవంటి కన్నులు కల ఓ కన్యకా! నా మాటవలన నీకు ఆ ఐదుగురుభర్తలలో ధర్మం తప్పకుండ ఉంటుంది. అందువల్లనే దయతో నేను నీ కీ వర మిచ్చాను.

వ, 'అనిన నది యట్లేని నయ్యేవురుపతులయందును బ్రత్యేకసంగమంబునను నాకుఁ గౌమారంబును బతిశుశ్రూషా సిద్ధియుఁ గామభోగేచ్ఛయు సౌభాగ్యంబునుం బ్రసాదింప వలయు' ననిన రుద్రుండు దాని కోరిన వరంబు లెల్ల నిచ్చి, గంగాతీరంబున నున్న యింద్రు నాయొద్దకుం దోడ్కొని ర మ్మని పంచిన వల్లె యని. 265

ప్రతిపదార్థం: అనినన్, = అని అనగా; అది= ఆమె; అట్లు+ఏని= అట్లయినచో; ఆ ఏవురు= ఐదుగురు; పతుల, అందును= భర్తలందును; ప్రత్యేక, సంగమంబునను= ఒక్కొక్కరితోడి కలయికయందును; నాకున్= నాకు; కౌమారంబునున్= కన్యాత్వమును; పతి, శుశ్రూషా, సిద్ధియున్= పతిసేవాభాగ్యము; కామ, భోగ+ఇచ్ఛయు= కామాన్ని అనుభవించేకోరిక; సౌభాగ్యంబునున్= ముత్తైదువతనము; ప్రసాదింపవలయున్= అనుగ్రహింపవలయును; అనినన్= అని అనగా; రుద్రుండు= శివుడు; దాని, కోరిన, వరంబులు+ఎల్లన్= ఆమె (యొక్క) కోరిన వరాలన్నింటిని; ఇచ్చి, గంగా, తీరంబునన్; ఉన్న; ఇంద్రున్= ఇంద్రుణ్ణి; నా+ఒద్దకున్; తోడ్కొని; రమ్ము+అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వల్లె, అని= సరే అని.

తాత్పర్యం: అని పల్కగా ఆమె 'అట్లైతే, ఆ అయిదుగురు భర్తలలో ఒక్కొక్కరితో కలయిక ఉన్నప్పటికి నాకు కన్యాత్వం, పతిసేవాభాగ్యం, కామాన్ని అనుభవించా లనే కోరిక, ముత్తైదువతనం అనుగ్రహించ వలసిం'దని కోరగా, శివుడు ఆమె కోరినవరాలన్నీ ఇచ్చి, గంగాతీరంలో ఉన్న ఇంద్రుడిని నాదగ్గరికి తోడ్కొని రమ్మని పంపాడు. ఆమె సరే అని.

క. దక్షాధ్వరమథనునకుఁ బ్ర। దక్షిణపూర్వముగ మ్రొక్కి తడయక చని ప
ద్మేక్షణ సహస్రచక్షుఁ బ్ర।తీక్షించుచు నుండె సురనదీతీరమునన్. 266

ప్రతిపదార్థం: పద్మ+ఈక్షణ= పద్మాలవంటికన్నులు కలది - ఆ కాశీరాజుకూతురు; దక్ష+అధ్వర, మథనునకున్= దక్షయజ్ఞాన్ని చెడగొట్టిన శివునికి; ప్రదక్షిణ, పూర్వముగన్= ముందుగా ప్రదక్షిణం చేసి; మ్రొక్కి; తడయక= ఆలస్యం చేయక; చని= వెళ్ళి; సురనదీ, తీరమునన్= గంగానది ఒడ్డున; సహస్ర, చక్షున్= వేయికన్నులు కలవాడైన ఇంద్రునికొరకు; ప్రతీక్షించుచున్= ఎదురు చూస్తూ; ఉండెన్.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు కల ఆ కాశీరాజుకూతురు శివునికి ప్రదక్షిణం చేసి, నమస్కరించి వెంటనే గంగాతీరానికి వెళ్ళి, ఇంద్రునిరాకకై యెదురుచూస్తూ ఉండింది.

ద్రుపదునకు వ్యాసుండు పంచేంద్రోపాఖ్యానంబు సెప్పుట (సం.1-189-1)

వ. అట వైవస్వతుండును నైమిశార్యణంబున సత్త్రయాగదీక్షితుం డయి ప్రాణిహింస సేయకుండుటం జేసి మానవు లప్రాప్తమరణు లయి వర్తించుచున్న దాని సహింపనోపక యింద్రాదిదేవతలందఱు బ్రహ్మపాలికిం జని 'భట్టారకా! మర్త్యు లమర్త్యు లయి వర్తిల్లువా రయిన వారికిని మాకును విశేషం బెద్ది?' యని దుఃఖించిన నయ్యమరుల కమరజ్యేష్ఠుం డి ట్లనియె. 267

ప్రతిపదార్థం: అట= అచ్చట; వైవస్వతుండును= యముడును; నైమిశ+అరణ్యంబునన్= నైమిశారణ్యంలో; సత్త్రయాగ దీక్షితుండు+అయి= సత్రయాగంలో దీక్షపూనినవాడై; ప్రాణి హింస= ప్రాణులను చంపటం; చేయక+ఉండుటన్+చేసి= చేయకుండుటం చేత; మానవులు; అప్రాప్త, మరణులు+అయి= పొందబడని చావుకలవా ళ్ళయి - అనగా చావులేనివాళ్ళయి; వర్తించుచున్+ఉన్నన్= వర్తిస్తూ ఉండగా; దానిన్= దానిని; సహింపన్+ఓపక= ఓర్చుకొనలేక; ఇంద్ర+ఆది, దేవతలు+అందరు= ఇంద్రుడు మొదలైన దేవతలంతా; బ్రహ్మపాలికిన్= బ్రహ్మ దగ్గరకు; చని= వెళ్ళి; భట్టారకా= ఓమహామునీ!; మర్త్యులు= చావుకలవాళ్ళు - మనుష్యులు; అమర్త్యులు+అయి= చావులేని వాళ్ళయి; వర్తిల్లువారు+ఐనన్= జీవించే వా ళ్ళయితే; వారికిని; మాకును; విశేషంబు= భేదం; ఎద్ది= ఏది; అని; దుఃఖించినన్= దుఃఖించగా; ఆ+అమరులకున్= ఆ దేవతలకు; అమర, జ్యేష్ఠుండు= దేవతలందరిలో పెద్దవాడైన బ్రహ్మ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అక్కడ యముడు నైమిశారణ్యంలో సత్రయాగదీక్షవహించి, ప్రాణిహింస మానివేయటంవలన మానవులు మరణం లేనివాళ్ళయి జీవించసాగారు. దానిని ఓర్వలేక ఇంద్రుడు మొదలైన దేవతలంతా బ్రహ్మదేవునిదగ్గరికి వెళ్ళి, 'మహామునీ! మృతి చెందే మానవులు మృతిలేనివాళ్ళయి జీవిస్తే, వాళ్ళకూ మాకూ భేద మేమిటి?' అని దుఃఖించగా వాళ్ళతో బ్రహ్మ ఇట్లా అన్నాడు.

క. ఎంతకుఁ గృతకార్యుం డగు । నంతకుఁ డీ రంతకును భయం బందక ని
శ్చింతమున నుండుఁ డాతం । డంతము నొందించుఁ దొంటియట్టుల నరులన్. 268

ప్రతిపదార్థం: అంతకుఁడు= యముడు; ఎంతకున్= ఎప్పటికి; కృత, కార్యుండు= చేయబడిన సత్రయాగకార్యం కలవాడు; అగున్= అగునో; ఈరు= మీరు; అంతకును= అంతవరకు; భయంబు+అందక; నిశ్చింతమునన్= చింతలేనివిధంగా; ఉండుఁడు; ఆతండు= ఆ యముడు; తొంటి; అట్టులు+అ= మునుపటివలెనే; నరులన్= మానవుల్ని; అంతమున్+ఒందించున్= చంపును.

తాత్పర్యం: యమునిసత్రయాగం ఎప్పటికి పూర్తి అవుతుందో అప్పటివరకు మీరు భయపడకుండా నిశ్చింతగా ఉండండి. అతడు మునుపటివలెనే మానవులను అంత మొందిస్తాడు.

క. ఆ వైవస్వతు వీర్యము । మీ వీర్యముఁ దాల్చి సూర్యమితతేజులు దా
రేవు రుదయింతు రాతని । కావించు విధానమునకుఁ గారణ మగుచున్. 269

ప్రతిపదార్థం: ఆ, వైవస్వతు, వీర్యము= ఆ యమునియొక్క తేజస్సును; మీ, వీర్యమును= మీ తేజస్సును; తాల్చి= ధరించి; సూర్య, మిత, తేజులు= సూర్యుని అంతటి తేజస్సు కలవాళ్ళు; తారు= తాము; ఏవురు= ఐదుగురు; అతని, కావించు, విధానమునకున్= ఆ యముడు చేసే పనికి; కారణము+అగుచున్= కారణం అవుతూ; ఉదయింతురు= పుట్టుతారు.

తాత్పర్యం: ఆ యమునితేజస్సు, మీతేజస్సు ధరించి, సూర్యునంతటితేజస్సు కలవాళ్ళు అయిదుగురు, యముడు చేసేపనికి సాధనంగా జన్మిస్తారు.

వ. అనిన నమరపతి పురోగము లయిన యమరు లెల్ల నమరాపగాసమీపంబునకుం జనునప్పుడు, తత్సలిలమధ్యంబున నొక్కకన్యక యేడ్చుచున్న, దానికన్నీళ్ళు కనకకమలంబు లయినం జూచి వేల్పులుం దానును విస్మయం బంది, యింద్రుఁ డక్కన్యకయొద్దకుం జని 'యేడ్చెద వెందుల దాన?' వని యడిగిన నది యింద్రున కి ట్లనియె. 270

ప్రతిపదార్థం: అనినన్= అని బ్రహ్మదేవుడు పలుకగా; అమరపతి, పురోగములు+అయిన= దేవేంద్రుడు ముందు నడచువాడుగా కలవాళ్ళయిన; అమరులు+ఎల్లన్= దేవతలంతా; అమర+ఆపగా, సమీపంబునకున్= దేవనది యైన గంగానదిదగ్గరకు; చనునప్పుడు= వెళ్ళునప్పుడు; తత్+సలిల, మధ్యంబునన్= ఆ నీళ్ళనడుమ; ఒక్క; కన్య; ఏడ్చుచున్+ఉన్నన్; దాని, కన్నీళ్ళు= ఆమె కన్నీరు; కనక, కమలంబులు+అయినన్= బంగారుతామరలు కాగా; చూచి= కనుగొని; వేల్పులున్= దేవతలును; తానును= తాను; విస్మయంబు+అంది= ఆశ్చర్యపడి; ఇంద్రుఁడు; ఆ+కన్యక, ఒద్దకున్= ఆ కన్యదగ్గరకు; చని= వెళ్ళి; ఏడ్చెదవు= ఏడుస్తూ ఉన్నావు; ఎందులదానవు= ఎక్కడిదానవు; అని, అడిగినన్= అని అడుగగా; అది= ఆమె; ఇంద్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని బ్రహ్మదేవుడు పల్కగా, దేవతలంతా వెనుదిరిగి, దేవేంద్రుడు ముందు నడువగా గంగానది దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో ఆ నీటిమధ్యలో ఒకకన్య యేడుస్తుండగా, ఆమెకన్నీళ్లు బంగారుతామరలు కావటంచూచి, దేవతలూ, ఇంద్రుడూ ఆశ్చర్యపడ్డారు. ఆకన్యదగ్గరికి వెళ్ళి 'ఎందుకు ఏడుస్తున్నావు? ఏ ప్రదేశానికి చెందినదానవు?' అని అడుగగా ఆమె ఇంద్రునితో ఇట్లా పలికింది.

ఆ. 'నాదు రోదనంబు, నన్ను, నెఱుంగఁగ । వలతయేని యమరవల్లభుండ!
నా పిఱుంద రమ్ము' నావుడు నప్పు డ । వ్వనితపజ్జ నరిగె వాసవుండు. 271

ప్రతిపదార్థం: నాదు, రోదనంబున్= నా ఏడ్పును; నన్నున్; ఎఱుంగఁగన్= తెలిసికొనటానికి; వలతు+అ, ఏని= కోరుదువేని; అమర, వల్లభుండ!= దేవతల రాజైన ఓ దేవేంద్రా!; నా పిఱుందన్= నా వెంట రమ్ము; నావుడున్= అని అనగా; వాసవుండు= దేవేంద్రుడు; అప్పుడు; ఆ+వనిత, పజ్జన్= ఆ కన్యవెంబడి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'దేవేంద్రా! నా దుఃఖాన్నిగురించి, నన్నుగురించి తెలిసికొనా లనుకుంటే, నావెంట రమ్ము!' అని ఆ కన్య చెప్పగా దేవేంద్రుడు ఆమెను అనుసరించి వెళ్లాడు.

వ. ఇ ట్లక్కన్యక పిఱుంద నరుగువాఁడు ముందఱ హిమవదచలకందరారచితరత్నవేదికాతలంబున సింహాసనాసీనుం డయి తరుణరూపంబున నొక్కతరుణితో జూదం బాడుచున్న యాదిదేవుం గని తరుణుండ కా వగచి సురపతి కరం బలిగి యి ట్లనియె. 272

ప్రతిపదార్థం: ఇట్లు; ఆ+కన్యక పిఱుందన్= ఆ కన్య వెంట; అరుగువాఁడు= వెళ్తూన్న దేవేంద్రుడు; ముందఱ= ఎదుట; హిమవత్+అచల, కందరా, రచిత, రత్న, వేదికా, తలంబునన్= హిమాలయపర్వతముయొక్క గుహయందు రూపొందించబడిన రత్నపుటరుగుమీద; సింహాసన+ఆసీనుండు+అయి= సింహాసనంమీద కూర్చున్నవాడై; తరుణ, రూపంబునన్= యౌవనంలో ఉన్న వాని రూపమున; ఒక్క+తరుణితోన్= యౌవనంలో ఉన్న ఒక కాంతతో; జూదంబు+ఆడుచున్+ఉన్న= జూదం ఆడుతూ ఉండే; ఆదిదేవున్= శివుడిని; కని= చూచి; తరుణుండు+అకా= యౌవనంలో ఉన్నవాడు అని; వగచి= తలచి; సుర, పతి= దేవేంద్రుడు; కరంబు= మిక్కిలి; అలిగి= కోపించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా ఆ కన్యకవెంట వెళ్తూ దేవేంద్రుడు - ఎదుట హిమాలయపర్వతగుహలో నిర్మించబడిన రత్నపుటరుగుమీద సింహాసనంపై కూర్చొని యువకునిరూపంలో ఒక యువతితో జూదమాడుతున్న పరమేశ్వరుడిని చూచి, అతడిని సాధారణయువకుడు అని భావించి, దేవేంద్రుడు మిక్కిలి కోపించి ఇట్లా అన్నాడు.

మ. అమితస్థావరజంగమం బయిన బ్రహ్మాండంబు దా నింతయున్
మమతాగోచర మీ త్రిలోకములు నస్మద్బాహువజ్రానుపా
ల్యము ; లే నింద్రుఁడ; నిట్టి న న్నుఱక లీలన్ జూదమాడంగ ను
త్తమసింహాసన మెక్క నీకుఁ జనునే దర్పించి నాముందటన్. 273

ప్రతిపదార్థం: అమిత, స్థావర, జంగమంబు+అయిన= అంతులేని స్థావరాలు (కదలిక లేనివి); జంగమాలు (కదలిక కలవి) కలదైన; బ్రహ్మాండంబు= బ్రహ్మాండము; తాన్= తాను; ఇంతయున్= అంతా; మమతా గోచరము= నాదిగా అగుపించునట్టి;

ఈ, త్రిలోకములున్= ఈమూడులోకాలూ; అస్మత్+బాహు, వజ్ర+అనుపాల్యములు= నా చేతిలోని వజ్రాయుధంచేత పాలించదగినవి; ఏన్= నేను; ఇంద్రుఁడన్= ఇంద్రుణ్ణి; ఇట్టి= ఇటువంటి; నన్నున్= నన్ను; ఉఱక= లెక్కపెట్టక; దర్పించి= గర్వించి; నా, ముందటన్= నా ఎదుట; ఉత్తమ, సింహాసనము; ఎక్కన్= ఎక్కటానికి; లీలన్= విలాసంగా; జూదము+ఆడంగన్= జూదమాడటానికి; నీకున్+చనునే= నీకు తగునా!

తాత్పర్యం: అంతులేని స్థావరజంగమాలతో నిండిన ఈ బ్రహ్మాండమంతా నాది. ఈ మూడులోకాలు నా చేతి వజ్రాయుధంతో పాలించబడుతూ ఉన్నాయి. నేను దేవేంద్రుడిని. ఇటువంటి నన్ను లెక్కపెట్టక, గర్వించి నా యెదుట విలాసంగా జూదమాడటం, పెద్దసింహాసన మెక్కటం నీకు తగునా?

వ. అనిన రుద్రుం డలిగి రౌద్రాకారంబున వానిం జూచి 'మదీయ క్రీడారసభంగంబుఁ జేసిన యిద్దుర్మదుం బట్టి తె' మ్మని య క్కన్యకం బంచిన నప్పుడు దానికరస్పర్శనంబున విచేష్టితుం డయి మహీతలంబుపయిం బడిన యయ్యింద్రునకు రుద్రుం డి ట్లనియె. 274

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; రుద్రుండు= శివుడు; అలిగి= కోపించి; రౌద్ర+ఆకారంబునన్= భయంకరమైన రూపంతో; వానిన్= ఆ దేవేంద్రుడిని; చూచి; మదీయ, క్రీడా, రస, భంగంబున్= నా యొక్క ఆటయందలి ఆనందానికి ఆటంకం; చేసిన= కలిగించిన; ఈ+దుర్మదున్= ఈ పొగరుబోతును; పట్టితెమ్ము+అని= పట్టి తీసుకొని రా అని; ఆ+కన్యకన్= ఆ కన్యను; పంచినన్= పంపగా; అప్పుడు; దాని, కర, స్పర్శనంబునన్= ఆమెచేతితాకిడిచేత; విచేష్టింతుడు+అయి= చేష్టలు కోల్పోయినవా డై; మహీతలంబు, పయిన్= నేలమీద; పడిన= పడిపోయిన; ఆ+ఇంద్రునకున్; రుద్రుండు= పరమేశ్వరుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని దేవేంద్రుడు పల్కగా శివుడు కోపించి, భయంకరమైన ఆకారంతో అతణ్ణి చూచి 'నా ఆటలోని ఆనందాన్ని ఆటంకపరచిన ఈ పొగరుబోతును పట్టి తె'మ్మని ఆ కన్యను పంపగా, అప్పు డామె చేతిస్పర్శతో చేష్టలు లేనివాడై నేలమీద పడిన ఇంద్రునితో శివుడు ఇట్లా అన్నాడు.

క. 'గర్వించి పలికి, తగు, నీ । గర్వము భుజవీర్యమును బ్రకాశంబుగ నీ
పర్వతవివరము దెర్చి వి । గుర్వింపుము చూత' మనిన గోత్రభిదుండున్. 275

ప్రతిపదార్థం: గర్వించి= దర్పించి -పొగరుగలిగి; పలికితి= పలికితివి; అగున్= అట్లే అగుగాక; నీ, గర్వము; భుజ, వీర్యమును= బాహుబలమును; ప్రకాశంబుగన్= వెల్లడి అయ్యేటట్లు; ఈ పర్వత, వివరము= ఈ పర్వతంయొక్క రంధ్రం; తెర్చి= తెరచి; విగుర్వింపుము= విరువుము; చూతము= చూస్తాము; అనినన్= అని పలుకగా; గోత్రభిదుండున్= పర్వతాలయొక్కరెక్కలను విరిచిన దేవేంద్రుడు.

తాత్పర్యం: 'గర్వంతో మాట్లాడావు. నీ గర్వం, బాహుబలం వెల్లడి అయ్యేటట్లు ఈ పర్వతరంధ్రాన్ని తెరచి, విరువుము చూద్దాం' అని శివుడు పల్కగా, దేవేంద్రుడు.

విశేషం: 'వివరము' అనే పదానికి బదులు కొన్నిప్రతులలో ఉన్న 'శిఖరము' అనే పాఠాంతరం మేల్తర మనిపిస్తుంది. 'తెర్చి' అనే దానికి 'తీర్చి' అనే పాఠాంతరం ఉంది. వివరాన్ని విరవటం కంటె శిఖరాన్ని విరవటం సమంజసం. 'శిఖరం బెత్తి

విగుర్వింపుము' అనే పాఠం అన్నిటికంటె స్పష్టార్థాన్ని కలిగివున్నది. కాని శివు డున్నది గుహలో కనుక ఇక్కడ 'వివరము' అనే పాఠాన్నే గ్రహించటం జరిగింది.

సీ. హరువచనమున నా గిరిరాజవివరంబు । గరములఁ బట్టి చెచ్చెర దినేశ
చండమయూఖముల్ రెండు విధంబు లై । యుండంగఁ దెర్చి యాఖండలుండు
దనయట్టివారల ఘనశరీరుల నందు । నలువుర నన్యుల వెలయఁ జూచి,
'యే నిట్టు లేలొకో యేనుప్రకారంబు । లయితి నిం?' దనుచు విస్మయముఁ బొంది

ఆ. యున్నఁ జూచి హరుఁడు గ్రన్న నయ్యింద్రుల । నేవురను మహానుభావ మెసఁగ
మనుజయోనిఁ బుట్టుఁ డని పంచె గీర్వాణ । హితము సేయుపొంటె మతిఁ దలంచి. 276

ప్రతిపదార్థం: హరు, వచనమునన్= శివునియొక్క మాటచేత; ఆ, గిరి, రాజ, వివరంబు= ఆ పర్వత శ్రేష్ఠంయొక్క రంధ్రమును; కరములన్+పట్టి= చేతులతో పట్టుకొని; చెరన్+చెరన్ = వేగమే; దిన+ఈశ, చండ, మయూఖముల్= సూర్యునియొక్క వేడికిరణాలు; రెండు; విధంబులు+ఐ= రెండు పాయలై; ఉండంగన్= ఉండగా; తెర్చి= తెరచి; ఆఖండలుండు= దేవేంద్రుడు; తన అట్టి, వారలన్; ఘన, శరీరులన్= గొప్ప శరీరాలు కలవారిని; నలువురన్= నలుగురిని; అన్యులన్= ఇతరులను; అందున్= ఆ రంధ్రమునందు; వెలయన్= మెరయగా; చూచి; ఏను= నేను; ఇట్టులన్; ఏల+ఒకో= ఎందుచేతనో; ఏను, ప్రకారంబులు= అయిదువిధాలు; ఇందున్= ఇచ్చట; అయితిన్= అయినాను; అనుచున్; విస్మయమున్= ఆశ్చర్యాన్ని; పొంది= పొంది; ఉన్నన్= ఉండగా; చూచి= కనుగొని; హరుఁడు= శివుడు; క్రన్నన్= వెంటనే; ఆ+ఇంద్రులన్, ఏవురను= ఆ ఇంద్రులను ఐదుగురను; మహా+అనుభావము= గొప్ప వ్యక్తిత్వము; ఎసఁగన్= అతిశయించగా; మనుజ, యోనిన్= మానవస్త్రీయందు పుట్టుడు; అని; గీర్వాణ, హితము= దేవతలకు మేలు; చేయు, పొంటెన్= చేయుటకొరకు; మతిన్= బుద్ధియందు; తలంచి= భావించి; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: శివుని మాటప్రకారం దేవేంద్రుడు ఆ పర్వతరంధ్రాన్ని రెండుచేతులతో పట్టుకొని సూర్యుని కిరణాలు రెండుపాయలైనట్లుగా తెరచి, ఆ రంధ్రంలో తనవలె గొప్పశరీరంకలవాళ్ళు మరో నలుగురు వెలుగుతుండటం చూచి, 'నే నెందుకు అయిదువిధాలుగా అయ్యా' నని ఆశ్చర్యపడగా, శివుడు వెంటనే ఆ ఇంద్రులైదుగురిని దేవతల మేలు కోరి, 'మానవస్త్రీయందు మహానుభావులుగా జన్మించండి' అని ఆజ్ఞాపించాడు.

వ. 'వారలు ధర్మానిలశక్రాశ్వినులు దమకు నాధారకర్తలుగా ధర్మజభీమార్జుననకులసహదేవు లనంగాఁ బుట్టిరి; కమలభవప్రముఖనిఖిలసురగణప్రార్థితుం డయి నారాయణుసితాసితకేశద్వయంబు బలదేవవాసుదేవు లై దేవహితార్థం బుద్భవించిన, నందు వాసుదేవుండు వారలకుఁ గార్యసహాయం డయ్యె; నయ్యింద్రుల కేవురకును నేకపత్నిగాఁ దపంబుసేసి శ్రీమూర్తి యయిన యాజ్ఞసేని యజ్ఞవేదిం బుట్టె; నమ్మవేని వీరల పూర్వదేహంబులఁ జూడు' మని కృష్ణద్వైపాయనుండు ద్రుపదునకు దివ్యదృష్టి యిచ్చి చూపిన. 277

ప్రతిపదార్థం: వారలు= వాళ్లు; ధర్మ+అనిల, శక్ర+అశ్వినులు= యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు; తమకున్, ఆధారకర్తలుగా; ధర్మజ, భీమ+అర్జున, నకుల, సహదేవులు; అనన్+కాన్= అనే పేర్లతో; పుట్టిరి; కమలభవ, ప్రముఖ, నిఖిల, సురగణ, ప్రార్థితుండు+అయి= పద్మంనుండి జన్మించిన బ్రహ్మ మొదలైన అందరు దేవతల సమూహంచేత

ప్రార్థింపబడినవాడై; నారాయణు, సిత+అసిత, కేశ, ద్వయంబు= విష్ణుమూర్తి యొక్క తెల్లని, నల్లని వెంట్రుకల జంట; బలదేవ, వాసుదేవులు+ఐ= బలరామశ్రీకృష్ణు లై; దేవహిత+అర్థంబు= దేవతలమేలుకొరకు; ఉద్భవించెన్= పుట్టగా; అందున్= వారిలో; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వారలకున్= వారికి; కార్య సహాయుండు= కార్యాలందు సాయం చేసేవాడు; అయ్యెన్= అయినాడు; ఆ+ఇంద్రులకు; ఏవురకున్= ఆ ఇంద్రులైన ఐదుగురికి; ఏకపత్నిగాన్= ఒకే భార్యగా; తపంబు; చేసి, శ్రీమూర్తి, అయిన= లక్ష్మీదేవి ఆకారమైన; యాజ్ఞసేని= ద్రౌపది; యజ్ఞవేదిన్= యజ్ఞ వేదికలో ; పుట్టెన్= జన్మించింది; నమ్మవు+ఏని= నమ్మకున్నచో; వీరల, పూర్వ, దేహంబులన్= వీళ్ల ముందటి శరీరాలు; చూడుము+అని; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ద్రుపదునకున్= ద్రుపదునికి; దివ్య, దృష్టి, ఇచ్చి, చూపి= దివ్యదృష్టి ప్రసాదించి చూపి.

తాత్పర్యం: ఆ అయిదుగురు ఇంద్రులు యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు ఆధార కర్తలుగా ధర్మజ భీమార్జున నకులసహదేవులు అనే పేర్లతో జన్మించారు. బ్రహ్మాదిదేవత లంతా ప్రార్థింపగా విష్ణుమూర్తి యొక్క తెల్లని నల్లని వెంట్రుకల జంట, దేవతల మేలుకొరకు బలరామకృష్ణులుగా అవతరించారు. వారిలో శ్రీకృష్ణుడు ఆ అయిదుగురికి వాళ్ళపనులలో సాయంచేసేవా డయ్యాడు. ఆ అయిదుగురు ఇంద్రులకు ఒకే భార్యగా తపస్సుచేసి లక్ష్మీస్వరూపురాలైన యాజ్ఞసేని (ద్రౌపది) యజ్ఞవేదిలో జన్మించింది. నీకు నమ్మకం లేకుంటే వీళ్ళ పూర్వదేహాలు చూడు' అని వ్యాసుడు ద్రుపదునికి దివ్యదృష్టి నిచ్చి చూపాడు.

ఉ. చారు మణి ప్రభా పటల జాల విచిత్ర కిరీట మాలికా
భారములన్ సముద్యదినపావక వర్ణములన్ సువర్ణకే
యూర విభూషణావళుల నొప్పుచునున్న తదీయదేహముల్
ధీరుఁడు సూచెఁ దాళసమదీర్ఘతఁ బొల్చినవాని నేనిటిన్. 278

ప్రతిపదార్థం: చారు, మణి, ప్రభా, పటల, జాల విచిత్ర, కిరీట, మాలికా, భారములన్= అందమైన రత్నాలకాంతి సమూహాల వలలచే మిక్కిలి చిత్రమైన రంగులు కల కిరీటాలయొక్క, దండలయొక్క బరువులచేత; సముద్యత్+ఇన, పావక, వర్ణములన్= లెస్సగా ప్రకాశించే సూర్యునియొక్క, అగ్నియొక్క రూపాలచేత; సువర్ణ కేయూర, విభూషణ+ఆవళులన్= బంగారు సందె కడియంవంటి ఆభరణసమూహాలచేత; ఒప్పుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉండే; తదీయ, దేహముల్= వారియొక్క శరీరాలు; తాళ, సమ, దీర్ఘతన్= తాటిచెట్టుతో సమానమైన పొడవుతో; పొల్చిన, వానిన్= ఒప్పిన వాటిని; ఏనిటిన్= ఐదింటిని; ధీరుఁడు= ధైర్యశాలి, ద్రుపదుడు; చూచెన్.

తాత్పర్యం: అందమైనరత్నకాంతిసమూహాలవలలచే మిక్కిలిచిత్రమైనరంగులు కల కిరీటాల, దండల భారాలతో, లెస్సగా ప్రకాశించే సూర్యునివంటి, అగ్నివంటిరూపాలతో, బంగారు సందెకడియాలవంటి ఆభరణాలతో ఒప్పుతూ, తాటిచెట్టంత పొడవైన వాళ్ళ దేహా లైదింటిని ద్రుపదుడు చూచాడు.

వ. మఱియు సకలలావణ్యమూర్తి యై వారల కేవురకుఁ బత్నిగాఁ దపంబు సేసిన యక్కన్యకపూర్వదేహంబును జూచి విస్మితుం డయి హర్షించి యున్న ద్రుపదునకు వెండియుం గృష్ణద్వైపాయనుం డి ట్లనియెఁ; 'దొల్లి నితంతుం డను రాజర్షికొడుకు లనంతబలపరాక్రములు సాల్వేయ శూరసేన శ్రుతసేన బిందుసారాతిసారు లను వా రేవురుం బరస్పర స్నేహవినయంబుల నతిప్రసిద్ధు లయి పెరుఁగుచు నౌశీనరపతి కన్యక నజిత యను దాని స్వయం వరంబునఁ బడసి వివాహం బయి. 279

ప్రతిపదార్థం: మఱియున్; సకల, లావణ్య, మూర్తి+ఐ= సమస్తసౌందర్యంయొక్క స్వరూపమై; వారలకున్; ఏవురకున్= ఐదుగురకు; పత్ని, కాన్= భార్య అగుటకు; తపంబు, చేసి,= తపస్సు కావించి; ఆ+కన్యక, పూర్వ, దేహంబును= ఆ కన్యకయొక్క (తొలుతటి ఇంద్రసేన, ఇప్పటి కృష్ణ) మొదటిశరీరాన్ని; చూచి; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవా డై; హర్షించి= సంతోషించి; ఉన్న= ఉండు; ద్రుపదునకున్; వెండియున్= మరల; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; ఇట్లు+అనియెన్; తొల్లి= పూర్వం; నితంతుండు+అను= నితంతుడు అనే పేరుగల; రాజర్షి= రాజర్షియొక్క; కొడుకులు; అనంత, బల, పరాక్రములు= అంతులేని బలం, పరాక్రమం కలవారు; సాల్వేయ= శూరసేన, శ్రుతసేన, బిందుసార+అతిసారులు; అనువారు; ఏవురున్= ఐదుగురును; పరస్పర, స్నేహ, వినయంబులన్= ఒకరిమీద మరొకరికి కల ప్రేమ; వినయాలతో; అతి, ప్రసిద్ధులు; అయి, పెరుఁగుచు; ఔశీనరపతి= ఔశీనరపతి యొక్క; కన్యకన్= కన్యను; అజిత; అను, దానిన్= అనుదానిని; స్వయంవరంబునన్; పడసి= పొంది; వివాహంబు+అయి= పెండ్లాడి.

తాత్పర్యం: అంతేగాక, సమస్త సౌందర్యం రూపుదాల్చిం దై, ఆ అయిదుగురికి భార్య కావటానికి తపస్సు చేసిన ఆ కన్యయొక్కమొదటిదేహాన్ని చూచి ఆశ్చర్యపడి, సంతోషించి ఉన్నద్రుపదునితో మరల వ్యాసుడు ఇట్లా అన్నాడు. ' పూర్వం నితంతు డనే రాజర్షికుమారులు సాల్వేయ, శూరసేన, శ్రుతసేన, బిందుసార, అతిసారు లైదుగురు అంతులేని బలపరాక్రమాలు కలవాళ్ళు. వాళ్ళు పరస్పరం ప్రేమ, వినయం కలిగి మహాప్రసిద్ధు లై పెరుగుతూ ఔశీనరపతిపుత్రికను స్వయంవరంలో పొంది వివాహమాడారు.

విశేషం: 'నితంతుడు' అనే పేరుకు బదులు కొన్ని ప్రతులలో సితతంతుడు, శిలావంతుడు అనే పేర్లు ఉన్నాయి. అట్లే బిందుసారుడికి బదులుగా తిందుసారుడు, అతిసారునికి బదులుగా అద్రిసారుడు అనే పాఠాలు శ్రీ పి.పి.యస్.శాస్త్రి గారి సంస్కృత భారతప్రతిలో ఉన్నాయి.

క. కాంతి విశేష విలాసా । నంతశ్రీఁ దనరు నజితయం దనఘులు నై
తంతువు లేవురుఁ బడసిరి । సంతానము వేఱువేఱ సత్కుల మెసఁగన్. 280

ప్రతిపదార్థం: కాంతి, విశేష, విలాస+అనంత శ్రీన్= అధికకాంతియొక్క విలాసంయొక్క అంతులేని సంపదతో; తనరు= ఒప్పు; అజిత, అందున్= ఆ అజితలో; అనఘులు= పాపరహితులైన వాళ్ళు; నైతంతువులు= నితంతుని కుమారులు; ఏవురున్= ఐదుగురును; సత్+కులము= మంచివంశం; ఎసఁగన్= వృద్ధిపొందగా; వేఱు వేఱు+అ= విడివిడిగా; సంతానము; పడసిరి= పొందారు.

తాత్పర్యం: అధికకాంతి, విలాసాలు - అనే అంతులేని సంపదతో ప్రకాశంతో ఆ అజితయందు, పుణ్యాత్ములైన నితంతునికుమారు లైదుగురు మంచివంశం వృద్ధి పొందేటట్లు విడివిడిగా సంతానాన్ని పొందారు.

వ. 'తొల్లింటి మహాత్ములయందును నిట్టి చరితంబులు గలవుం గావున బాండవుల కేవురకు ద్రౌపదిం గ్రమంబునఁ బాణిగ్రహంబు సేయింపు; మిది మన చేసినయది గాదు; దైవాధిష్ఠితం' బని ద్రుపదు నొడంబఱచి కుంతియుఁ, బాండవులు నున్న చోటికి ద్రుపద సహితుం డయి కృష్ణద్వైపాయనుండు వచ్చి యుధిష్ఠిరున కి ట్లనియె. 281

ప్రతిపదార్థం: తొల్లింటి= పూర్వపు; మహా+ఆత్ముల అందునున్= మహాత్ముల యందుకూడా; ఇట్టి; చరితంబులు; కలవు; కావునన్; పాండవులకున్; ఏవురకున్= ఐదుగురికి; ద్రౌపదిన్= ద్రౌపదిని; క్రమంబునన్= వరుసగా; పాణి, గ్రహణంబు=

వివాహం; చేయింపుము= జరిపించు; ఇది, మన, చేసిన, అది= ఇది మనం చేసింది; కాదు; దైవ+అధిష్ఠితంబు= దైవము నా(శ్రయించింది - అనగా దేవునిచేత చేయబడింది; అని= అని; ద్రుపదున్= ద్రుపదుణ్ణి; ఒడంబఱిచి= ఒప్పించి; కుంతియున్; పాండవులున్, ఉన్న; చోటికిన్; ద్రుపద, సహితుండు+అయి= ద్రుపదునితో కూడినవాడై; కృష్ణద్వైపాయనుండు= వ్యాసుడు; వచ్చి; యుధిష్ఠిరునకున్= ధర్మరాజుతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పూర్వపుమహాత్ములలోకూడ ఇటువంటిచరిత్ర లున్నాయి. అందువలన పాండవు లైదుగురికి ద్రౌపది నిచ్చి వరుసగా వివాహం జరిపించుము. ఇది మనం చేసింది కాదు. దైవనిర్ణయం' అని ద్రుపదుడిని ఒప్పించి వ్యాసుడు అతనితోకూడ కుంతీపాండవు లున్నచోటికి వెళ్ళి, ధర్మరాజుతో ఇట్లా అన్నాడు.

ద్రౌపదీవివాహమహోత్సవము (1-190-5)

ఆ. నేఁడు పుణ్యదినము నెమ్మితో రోహిణీ। యుక్తుఁ డయి శశాంకుఁ డున్నవాఁడు;
మంత్రవంతముగఁ గ్రమంబున నేవురుఁ। బెండ్లియగుఁడు కృష్ణఁ బ్రీతితోడ. 282

ప్రతిపదార్థం: నేఁడు= ఈ దినం; పుణ్య, దినము; నెమ్మితో= ప్రేమతో; శశాంకుఁడు= కుందేలును గుర్తుగా కల చంద్రుడు; రోహిణీ; యుక్తుడుఁ+అయి= రోహిణీ నక్షత్రంతో కూడి; ఉన్నవాఁడు= ఉన్నాడు; మంత్రవంతముగన్= మంత్రాలతో; ఏవురున్= ఐదుగురూ; ప్రీతితోడన్= సంతోషంతో; కృష్ణన్= ద్రౌపదిని; క్రమంబుగన్= వరుసగా; పెండ్లి, అగుడు= పెండ్లి చేసికొనండి.

తాత్పర్యం: ఈ రోజు పుణ్యదినం. చంద్రుడు ప్రేమతో రోహిణీనక్షత్రాన్ని కూడి ఉన్నాడు. మంత్రయుక్తంగా మీ రైదుగురు సంతోషంగా ద్రౌపదిని వివాహం చేసికొనండి.

విశేషం: వ్యాసమహర్షి ద్రుపదరాజుకు ద్రౌపదీపాండవుల పుట్టుక వెనుక ఉన్న దివ్యరహస్యాలు తెలియచెప్పాడు. వాటిని దర్శించటానికి అవసరమైన దివ్యదృష్టిని అనుగ్రహించాడు. ఇదివరలో కూడ ఇటువంటిది ఉన్న దని ఒక ఉదాహరణ ఇచ్చాడు. ఆ కన్యాదాత మనస్సును ఆవరించిన అనుమానతిమిరాన్ని పూర్తిగా తొలగించాడు. 'గతం న శోచామి కృతం స్మరామి' అన్నట్లు కర్తవ్యాన్ని నిర్ణయించాడు. ద్రౌపదీ వివాహానికి ఆటంకమే లేని రాచబాట వేశాడు. ధర్మజుని తీర్పే వ్యాసుని తీర్పుకావటం, ధర్మజుని స్థాయి మరో మెట్టు ఈ ఘట్టంలో పెరగటం విశేషం.

వ. అని నిశ్చయించి పంచినం బాంచాలపతియును గరం బనురాగంబునఁ బురం బష్టశోభనంబు సేయించి, సమారబ్ధవివాహమహోత్సవుం డయ్యె; నంత నిరంతర క్రముకకదళీస్తంభ శుంభత్సంభృత నవామ్రాశ్వత్థ పల్లవ మాలాలంకృత ద్వారతోరణంబులను, జందనోదక సంసిక్త ప్రాంగణ రంగవల్లీ కృత కర్పూరమౌక్తిక ప్రకరంబులను, గౌతుకోత్సవమంగళశృంగార వారాంగనా ప్రవర్తమాన స్వనియోగకృత్యంబులను, నుత్సవ సందర్శనాగతానేకరాజన్య సుహృద్బాంధవబ్రాహ్మణ సంకులంబుననుం జేసి యొప్పుచున్న ద్రుపదరాజ మందిరంబునం బూర్వోత్తర దిగ్భాగంబున విచిత్రనేత్ర వితత వితాన ముక్త మౌక్తిక కుసుమ మాలాలంబనాభిరామంబును, సమీచీన చీనాంశుక విరచితస్తంభ వేష్టనంబును, బ్రత్యగ్ర పల్లవ శాల్యక్షతాంచిత కాంచన పూర్ణ కలశోపశోభితంబును, లాజాజ్య సంపూర్ణ సౌవర్ణ పాత్ర నవసౌరభ బహువిధపుష్ప సమిత్కుశాశ్మశమ్యాభిరమ్యంబును, నవగోమయ శ్యామ మరకత మణి ప్రభాపటల

విలిప్త హిరణ్మయవేదీమధ్యసమిద్ధాగ్నికుండమండితంబును, సర్వాలంకారసుందరంబును నయిన వివాహ
మంటపంబునకుం జని నిజ పురోహితుం డయిన ధౌమ్యుం డాదిగా ననేకవిద్వన్మహీసుర నివహంబుతోఁ
గరం బొప్పి. 283

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; నిశ్చయించి; పంచినన్= ఆజ్ఞాపించగా; పాంచాల, పతియును= ద్రుపదుడును; కరంబు= మిక్కిలి; అనురాగంబునన్= ప్రీతితో; పురంబున్= నగరాన్ని; అష్టశోభనంబు= ఎనిమిదివిధాల మంగళాలంకారం; చేయించి; సమారబ్ధ, వివాహ, మహా+ఉత్సవుండు= చక్కగా ఆరంభింపబడిన వివాహమహోత్సవం కలవాడు; అయ్యెన్= అయ్యాడు; అంత= అప్పుడు; నిరంతర, క్రముక, కదళీస్తంభ, శుంభత్+సంభృత, నవ+ఆమ్ర+అశ్వత్థ, పల్లవ, మాలా+అలంకృత, ద్వారతోరణంబులను= ఎడతెగని పోకల అరటుల స్తంభాలందు ప్రకాశిస్తూ నిండుగా భరింపబడిన క్రొత్త మామిడి, రావి చివుళ్ళ దండనల చేత అలంకరింపబడిన లోపలి వెలుపలి ద్వారాలచేత; చందన+ఉదక, సంసిక్త, ప్రాంగణ, రంగవల్లీకృత, కర్పూర మౌక్తిక ప్రకరంబులను= మంచి గంధపు నీటిచేత చక్కగా తడుపబడిన ముంగిళ్ళయందు ముగ్గులుగా చేయబడిన పచ్చకర్పూరాలయొక్క, ముత్యాలయొక్క సమూహాలచేత; కౌతుక+ఉత్సవ, మంగళ, శృంగార, వార+అంగనా, ప్రవర్త్యమాన, స్వనియోగ, కృత్యంబులను= వివాహ మహోత్సవంకొరకైన మంగళాలంకారాలు కల వేశ్యలచే చేయబడుతున్న, తమకు నియమింపబడిన పనులచేత; ఉత్సవ, సందర్శన+ఆగత+అనేక, రాజన్య, సుహృత్+బాంధవ, బ్రాహ్మణ, సంకులంబునున్+చేసి= వివాహమహోత్సవాన్ని చూడటానికి వచ్చిన పెక్కుమంది రాజులతో, మిత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో క్రిక్కిరియటంచేత; ఒప్పుచు+ఉన్న; ద్రుపదరాజు, మందిరంబునన్= ద్రుపదరాజుయొక్క ఇంటిముందు; పూర్వ+ఉత్తర, దిక్+భాగంబునన్= ఈశాన్యదిక్కునందు; విచిత్ర, నేత్ర, వితత, వితాన, ముక్త, మౌక్తిక, కుసుమ, మాలా+ఆలంబన+అభిరామంబును= రంగురంగుల వస్త్రాలయొక్క విశాలాలైన మేల్కట్లనుండి క్రిందికి విడువబడిన ముత్యాలయొక్క పూలయొక్క దండలు వ్రేలాడటంచేత మనోహరమైనదీ; సమీచీన, చీన+అంశుక, విరచిత, స్తంభ, వేష్టనంబును= చక్కని పట్టువస్త్రాలచేత కల్పించబడిన స్తంభపు చుట్టు కలదీ; ప్రత్యగ్ర, పల్లవ, శాలి+అక్షత+అంచిత, కాంచన, పూర్ణ, కలశ+ఉపశోభితంబును= క్రొత్త చిగుళ్ళచేత, వరి అక్షతలచేత ఒప్పుచున్న బంగారు పూర్ణకలశాలచేత ప్రకాశిస్తున్నదీ; లాజ+ఆజ్య, సంపూర్ణ, సౌవర్ణ, పాత్ర, నవ, సౌరభ, బహువిధ, పుష్ప, సమిత్, కుశ+అశ్మ, శమ్యా, అభిరమ్యంబును= పేలాలతో, నేతితో నిండిన బంగారు పాత్రలచేత, క్రొత్త వాసనలతో, దర్భలచేత, సన్నెకల్లుచేత, యజ్ఞపాత్రలచేత మనోహర మైనదీ; నవ, గోమయ, శ్యామ, మరకత, మణి, ప్రభా, పటల, విలిప్త, హిరణ్మయ, వేదీ, మధ్య, సమిద్ధ+అగ్ని కుండ, మండితంబును= క్రొత్త ఆవుపేడవలె నల్లనిమరకతమణుల కాంతిసమూహంచేత అలుకబడిన బంగారుపెండ్లిఅరుగునడుమ మండుతున్న హోమగుండంచేత అలంకరింపబడినదీ; సర్వ+అలంకార, సుందరంబును= అన్ని అలంకారాలచేత అందమైనదీ అయిన, వివాహ మంటపంబునకున్; చని= వెళ్ళి; పురోహితుండు+అయిన= తనయొక్కపురోహితు డైన; ధౌమ్యుండు+ఆది, కాన్+అనేక, విద్వత్+మహీసుర, నివహంబుతోన్= ధౌమ్యుడు మొదలైన పెక్కుమంది పండితులగు బ్రాహ్మణసమూహంతో; కరంబు= మిక్కిలి; ఒప్పి= ప్రకాశించి.

తాత్పర్యం: అని నిర్ణయించి వ్యాసమహర్షి ఆజ్ఞాపించగా, ద్రుపదరాజుకూడ మిక్కిలిప్రీతితో పురానికి ఎనిమిది, విధా లైన మంగళాలంకారాలు చేయించి, వివాహమహోత్సవాన్ని చక్కగా ప్రారంభించాడు. అప్పుడు ఎడతెగని పోక, అరటిస్తంభాలతో, నిండుగా ధరించిన క్రొత్తమామిడి, రావిచివుళ్లదండలతో అలంకరించబడిన లోపలి వెలుపలి ద్వారాలతోను, మంచిగంధపునీటితో చక్కగా తడుపబడిన ముంగిళ్లలో ముగ్గులుగా చేయబడిన పచ్చకర్పూరాల, ముత్యాల సమూహాలతో, వివాహమహోత్సవంకొరకు కావించుకొన్న మంగళాలంకారాలు కల వేశ్యలు చేస్తున్న నియమితకార్యాలతో, వివాహమహోత్సవం చూడవచ్చిన పెక్కుమందిరాజులతో, మిత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో క్రిక్కిరిసి శోభిల్లుతున్న ద్రుపదునిఇంటిలో - ఈశాన్యదిక్కున రంగు రంగులవస్త్రాలతో నిర్మించబడిన

విశాలమైన మేల్కట్లనుండి క్రిందికి విడువబడిన ముత్యాల పూలదండలు వ్రేలాడటంచేత మనోహర మైనదీ, చక్కని పట్టువస్త్రాలతో కల్పింపబడిన స్తంభపుచుట్లు కలదీ, క్రొత్తచివుళ్లతో, బియ్యపు అక్షతలతో ఒప్పుతున్న బంగారుపూర్ణకలశాలతో ప్రకాశిస్తున్నదీ, పేలాలతో నేతితో నిండిన బంగారుపాత్రలతో, క్రొత్త వాసనలతో కూడిన పెక్కువిధా లైన పువ్వులతో సమిధలతో, దర్భలతో, సన్నెకల్లుతో, యజ్ఞపాత్రలతో మనోహర మైనదీ, అప్పుడే పెట్టిన ఆవుపేడవలె నల్లనిమరకతమణుల కాంతిసమూహంతో అలుకబడిన బంగారు వివాహవేదికనడుమ మండుతున్న హోమకుండంచేత అలంకరింపబడినదీ, అన్ని అలంకారాలతో అందమైనదీ అయిన కల్యాణమంటపానికి వెళ్లి, తమ పురోహితుడైన ధౌమ్యుడు మొదలైన పెక్కుమంది పండిత బ్రాహ్మణసమూహంతో మిక్కిలి ఒప్పి.

సీ. అనఘులు కృతమంగళాభిషేకులు, ధృత । సముచిత వేష ప్రశస్త రత్న
భూషణుల్, కౌరవపుంగవు లేవురు । నేతెంచి ; రంతఁ బూర్ణేందువదన
యధికవిదగ్ధ పుణ్యాంగనా విరచిత । లలిత ప్రసాధనాలంకృతాంగి
కమలాక్షి కమనీయకాంతాసహస్రంబు । తోఁ జనుదెంచె నాద్రుపదతనయ;

ఆ. భూరి భూసురేంద్ర పుణ్యాహరవమును । మంగళ ప్రగీత మధురరవము
వివిధతూర్యవేణు వీణారవంబును । విస్తరిల్లె దిశల విభవయుక్తి. 284

ప్రతిపదార్థం: అనఘులు= పాపంలేనివారు; కృత, మంగళ+అభిషేకులు= చేయబడిన మంగళస్నానం కలవారు; ధృత, సముచిత, వేష, ప్రశస్త, రత్న, భూషణుల్= ధరించబడిన తగినవేషాలు, ప్రసిద్ధా లైన రత్నాభరణాలు కలవారు; కౌరవ, పుంగవులు= కురు వంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠులైన పాండవులు; ఏవురున్= ఐదుగురు; ఏతెంచిరి= వచ్చారు; అంతన్= అప్పుడు; పూర్ణ+ఇందు, వదన= నిండు చంద్రునివంటి ముఖం కలది, అధిక, విదగ్ధ, పుణ్యాంగనా, విరచిత, లలిత, ప్రసాధన+అలంకృత+అంగి= మిక్కిలి నేర్పరు లైన ముత్తైదువులచేత కూర్చబడిన అంద మైన అలంకారాలచేత అలంకరించబడిన అవయవాలు కలది; కమల+అక్షి= కమలాలవంటి కన్నులు కలది; ఆ, ద్రుపద, తనయ= ఆ ద్రౌపది; కమనీయ, కాంతా, సహస్రంబుతోన్= అందమైన స్త్రీలు వేయిమందితో; చనుదెంచెన్= వచ్చెను; భూరి, భూసుర+ఇంద్ర, పుణ్యాహధ్వని= బ్రాహ్మణశ్రేష్ఠుల పుణ్యాహవచనాల అధికమైన ధ్వని; మంగళ, ప్రగీత, మధుర, రవము= మంగళగానాలయొక్క మధురమైన ధ్వని; వివిధ, తూర్య, వేణు, వీణా, రవంబును= వివిధాలైన వాద్యాలయొక్క, పిల్లనగ్రోవులయొక్క, వీణలయొక్క ధ్వని; విభవ, యుక్తిన్= వైభవంతో; దిశలన్=దిక్కులలో; విస్తరిల్లెన్= వ్యాపించాయి.

తాత్పర్యం: పుణ్యాత్ములు, మంగళస్నానం చేసినవాళ్ళు, తగినవేషం, ప్రసిద్ధమైన రత్నాభరణాలు ధరించినవాళ్ళు, కురువంశశ్రేష్ఠులు అయిన పాండవులు అయిదుగురు వచ్చారు. అప్పుడు నిండుచంద్రుని ముఖంవంటి ముఖం కలది, మిక్కిలినేర్పరులైన ముత్తైదువులచేత అలంకరించబడిన అవయవాలు కలది, కమలాలవంటి కన్నులు కలది అయిన ద్రౌపది అందమైన స్త్రీలు వేయిమందితో కలిసి వచ్చింది. పెక్కుమంది బ్రాహ్మణశ్రేష్ఠుల పుణ్యాహధ్వని, మంగళగీతాల మధురధ్వని, పిల్లనగ్రోవుల, వీణల వివిధవాద్యాలధ్వని - మహావైభవంతో దిక్కులకు వ్యాపించాయి.

క. వితత ప్రదక్షిణావ । ర్తితదీప్త శిఖానలమున ధృతి వేల్చెఁ బురో
హితుఁ డగు ధౌమ్యుఁడు బుధ స । మ్మతుఁడు వివాహప్రయుక్త మంత్రాహుతులన్. 285

ప్రతిపదార్థం: బుధ, సమ్మతుఁడు= పండితులకు ఇష్టమైనవాడు; పురోహితుఁడు; అగు; ధౌమ్యుఁడు; వివాహ; ప్రయుక్త, మంత్ర+ ఆహుతులన్= పెండ్లికొరకు చేయవలసిన మంత్రపూర్వకా లైన ఆహుతులను; ధృతిన్= సంతోషంతో; వితత, ప్రదక్షిణ+ఆవర్తిత, దీప్త, శిఖా+అనలమునన్= విస్తరిల్లి ప్రదక్షిణంగా చుట్టు తిరిగిన వై మండు మంటలు కల అగ్నియందు; వేల్చెన్= దహనమయ్యేటట్లు చేశాడు.

తాత్పర్యం: పండితులకు ఇష్టమైనవాడు, పురోహితుడు అయిన ధౌమ్యుడు వివాహసమయంలో చేయవలసిన మంత్రపూర్వకాలైన ఆహుతులను - విస్తరిల్లి ప్రదక్షిణంగా చుట్టు తిరిగి మండే మంటలున్న అగ్నిహోత్రంలో దహన మయ్యేటట్లు వేశాడు.

విశేషం: వేదధర్మోద్ధరణ మహాభారతరచనాలక్ష్యాలలో ప్రధానమైనది కనుక వైదికాంశాలు, వేదోక్త క్రియాకలాపాలు కథలో ఎక్కడ వచ్చినా నన్నయ విశేషించి ప్రవర్తిస్తాడు. వేదోక్తంగా సాగిన ద్రౌపదీపాండవుల వివాహవైభవవిపులవర్ణన అట్లాంటిదే.

వ. ఇట్లు వేల్చి ముందఱ ధర్మపుత్రునకు ద్రుపదరాజపుత్త్రిం బాణిగ్రహణంబు సేయించి, తొల్లి యేవురకు వివాహంబు సేయునప్పుడు కన్యాత్వంబు దూషితంబు గాకుండ నీశ్వరువరంబునం గౌమారంబు వడసిన యక్కన్యకం గ్రమంబున భీమార్జున నకుల సహదేవులకుం బాణిగ్రహణంబు సేయించిన. 286

ప్రతిపదార్థం: ఇట్లు; వేల్చి= ఆహుతులువేసి; ధర్మపుత్రునకున్; ద్రుపదరాజు; పుత్త్రిన్= ద్రౌపదిని; పాణిగ్రహణంబు= వివాహం; చేయించి; తొల్లి= పూర్వం; ఏవురకున్= ఐదుగురకు; వివాహంబు, చేయునప్పుడు; కన్యాత్వంబు= కన్నెరికం; దూషితంబు, కాకుండన్= చెడకుండ; ఈశ్వరు, వరంబునన్= ఈశ్వరుని వరముచే; కౌమారంబు= కన్యాత్వం; పడసిన= పొందిన; ఆ+కన్యకన్= ఆ కన్యను; క్రమంబునన్ =క్రమంగా; భీమ+అర్జున, నకుల, సహదేవులకున్; పాణిగ్రహణంబు= వివాహం; చేయించినన్= కావింపగా.

తాత్పర్యం: ఈ విధంగా ఆహుతులువేసి, మొదట ధర్మజునికి ద్రౌపది నిచ్చి వివాహం చేయించాడు. అయిదుగురిని వివాహం చేసికొన్నా కన్యాత్వం చెడకుండ ఈశ్వరునివలన పూర్వం వరంపొందినద్రౌపది మళ్ళీ కన్యాత్వం పొందగా, ఆమెను వరుసగా భీమార్జుననకులసహదేవుల కిచ్చి వివాహం చేయించాడు. అప్పుడు.

తే. జనుల ఆశీరవంబును జదలఁ దివురు । దేవ దుందుభినాదంబు దివ్యగంధ
మందగంధవహామోదమానకుసుమ । వృష్టియును మహాముదముతో విస్తరిల్లె. 287

ప్రతిపదార్థం: జనుల, ఆశీరవంబును= జనులయొక్క ఆశీర్వాదధ్వని; చదలన్= ఆకాశమున; తివురు= మ్రోగునట్టి; దేవ, దుందుభి, నాదంబు= దేవతల యొక్క భేరులయొక్క ధ్వని; దివ్య, గంధ, మంద, గంధవహ+ఆమోదమాన, కుసుమ, వృష్టియును= మంచివాసన కల మెల్లని గాలిచే పరిమళిస్తున్న పూలవాన; మహా, ముదముతోన్= మిక్కిలి సంతోషంతో; విస్తరిల్లెన్= అతిశయించాయి.

తాత్పర్యం: జనుల ఆశీర్వాద ధ్వని, ఆకాశంలో మ్రోగే దేవతల భేరుల ధ్వని, మంచివాసన కల మందమారుతంతో పరిమళించే పూలవాసన మిక్కిలిసంతోషంతో అతిశయించాయి.

వ. అని వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పె నని. 288

ప్రతిపదార్థం: అని= ఆ విధంగా; వైశంపాయనుండు; జనమేజయునకున్= జనమేజయునికి; చెప్పెన్, అని= చెప్పాడని.

తాత్పర్యం: అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పా డని.

ఆశ్వాసాంతము

క. విద్యావిలాస ! పార్థివ । విద్యాధర ! నిఖిలరాజవిద్యానిధి ! శీ
తద్యుతి విశదయశః ప్రస । రద్యోతిత సర్వలోక! రాజమహేంద్రా! 289

ప్రతిపదార్థం: విద్యా, విలాస= విద్యలచేత ప్రకాశించేవాడా!; పార్థివ, విద్యాధర=రాజులలో విద్యాధరుడైన జీమూతవాహనుని వంటివాడా! - అనగా మహాదాతా అని భావం; నిఖిల, రాజవిద్యా, నిధి= అన్ని రాజవిద్యలకు నిధియైనవాడా!; శీత, ద్యుతి, విశద, యశస్, ప్రసర, ద్యోతిత, సర్వలోక= చల్లనికాంతి కల చంద్రునివలె తెల్లనికీర్తియొక్క వ్యాప్తిచేత ప్రకాశింప చేయబడిన అన్ని లోకాలు కలవాడా!; రాజమహేంద్రా= ఓ రాజరాజ నరేంద్రా!

తాత్పర్యం: విద్యలలో ప్రకాశించేవాడా! రాజులలో విద్యాధరుడైన జీమూతవాహనునివంటివాడా! అన్ని రాజవిద్యలకు నిధియైనవాడా! చంద్రునివలె తెల్లని కీర్తియొక్క వ్యాప్తితో అన్నిలోకాలను ప్రకాశింప చేసినవాడా! ఓ రాజరాజ నరేంద్రా!

స్వాగతము.

రాజరాజ ! గుణరాజిత ! రాజ । త్తేజ! రాజకులదీప ! విశిష్టాం
భోజమిత్ర! నృపపూజిత పాదాం । భోజ! భూవినుత! పుణ్యవరేణ్యా! 290

ప్రతిపదార్థం: రాజరాజ!= రాజరాజుఅనే పేరుగలవాడా!; గుణ; రాజిత= మంచి గుణాలచేత ప్రకాశించేవాడా!; రాజత్+తేజ= ప్రకాశించే పరాక్రమం కలవాడా!; రాజ, కుల, దీప= రాజవంశంలో దీపమువంటివాడా!; విశిష్ట+అంభోజ, మిత్ర= సదాచార సంపన్నులు అనే కమలాలకు సూర్యుడి వంటివాడా!; నృప, పూజిత, పాద+అంభోజ= రాజులచేత పూజింపబడిన పద్మాలవంటి పాదాలు కలవాడా!; భూ, వినుత= లోకంచేత కొనియాడబడేవాడా!; పుణ్య, వరేణ్యా= పుణ్యాత్ములలో శ్రేష్ఠుడా!

తాత్పర్యం: రాజరాజ! మంచిగుణాలతో ప్రకాశించేవాడా! ప్రకాశించేపరాక్రమం కలవాడా! రాజవంశంలో దీపం వంటివాడా! సదాచారసంపన్నులు అనే కమలాలకు సూర్యునివంటివాడా! రాజుల పూజలందుకొన్న పాదపద్మాలు కలవాడా! లోకప్రశంసలు పొందినవాడా! పుణ్యాత్ములలో శ్రేష్ఠుడా!

విశేషం: ఈ వృత్తంలోని ప్రతిపాదంలో వరుసగా ర, న, భ, గగ అనే గణా లుంటాయి. 7వ అక్షరం యతిమైత్రి స్థానం.

గద్యము.

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్ట ప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబున ధృష్టద్యుమ్న ద్రౌపదీసంభవకథనంబును, గృష్ణద్వైపాయనసందర్శనంబును, గంగాతీరంబున నంగారపర్ణు నర్జునుండు

జయించుటయుఁ, దాపత్యవసిష్ఠౌర్వోపాఖ్యానంబును, ద్రౌపదీస్వయంవరంబును, బంచేంద్రోపాఖ్యానంబును, ద్రౌపదీవివాహంబును నన్నది సప్తమాశ్వాసము. **291**

తాత్పర్యం: ఇది, సకలసత్కవుల ప్రశంస లందుకొన్న నన్నయభట్టు రచించిన శ్రీమహాభారతంలో మొదటిదైన ఆదిపర్వంలో - ధృష్టద్యుమ్నద్రౌపదుల జన్మనుగూర్చి చెప్పటం, వేదవ్యాసమహామునీంద్రులను దర్శించటం, గంగాతీరంలో అంగారపర్ణుడిని అర్జునుడు జయించటం, తపతీసంవరణ, వసిష్ఠ, ఔర్వుల కథాకథనం, ద్రౌపదీ స్వయంవరం, పంచేంద్రోపాఖ్యానం, ద్రౌపదీవివాహం - అనే అంశాలు కల ఏడవఆశ్వాసం.

ఆదిపర్వంలో సప్తమాశ్వాసం సమాప్తం.

శ్రీరస్తు

శ్రీమదాంధ్ర మహాభారతము

ఆదిపర్వము - అష్టమాశ్వాసము

శ్రీవిభవనిత్యనిలయ! ద । యావర్ధితధారుణీసురాన్వయ ! వేంగీ
భూవల్లభ! నిఖిలజగ । త్పావనశుభచరిత! భావభవనిభసుభగా! 1

ప్రతిపదార్థం: శ్రీ, విభవ, నిత్య, నిలయ= ఐశ్వర్యాతిశయానికి శాశ్వతస్థానమైనవాడా!; దయా, వర్ధిత, ధారుణీసుర+అన్వయ= దయతో వృద్ధిపొందించబడిన బ్రాహ్మణవంశాలు కలవాడా!; వేంగీ, భూ, వల్లభ= వేంగీదేశపురాజా!; నిఖిల, జగత్+పావన, శుభ, చరిత= లోకాలన్నింటినీ పవిత్రం చేసే శుభమైన నడవడి కలవాడా!; భావభవ, నిభ, సుభగా= మన్మథునితో సమానమైన సౌందర్యం కలవాడా!

తాత్పర్యం: ఐశ్వర్యాతిశయానికి శాశ్వతస్థానమైనవాడా! దయతో వృద్ధిపొందించిన బ్రాహ్మణవంశాలు కలవాడా! వేంగీదేశప్రభూ! లోకాలన్నింటినీ పవిత్రంచేసే శుభచరిత్ర కలవాడా! మన్మథునితో సమానమైన సౌందర్యం కలవాడా!

విశేషం: భావభవుడు - భావంలో పుట్టేవాడు మన్మథుడు. ఇది రాజరాజుయొక్క ప్రశంసాపూర్వకమైన ఆశ్వాసారంభపద్యం.

పాండవులు ద్రుపదరాజుపురంబున నిష్టోపభోగంబు లనుభవించుచు సుఖంబుండుట (సం.1-190-25)

వ. అ క్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పె: నట్లు పాండవు లేవురకుం బాంచాలిం బరమోత్సవంబున వివాహంబు సేయించి ద్రుపదుం డయ్యేవురకు వేఱువేఱ యనర్ఘ్యమణిఖచితంబులైన యాభరణంబులను నపరిమితంబు లైన యర్థరాసులను, సౌవర్ణంబు లయిన శయ్యాసనపరికరంబులను, నూఱేసిభద్రగజంబులను, నూఱేసి కాంచనరథంబులను, వేయేసికాంభోజహయంబులను, పదివేవురేసి వరవస్త్రాభరణభూషితు లగు దాసదాసీజనంబులను, నూఱేసివేలు పాఁడిమొదవులను నగ్నిసాక్షికంబుగా నరణం బిచ్చిన. 2

ప్రతిపదార్థం: ఆ, కథకుండు= ఆ కథను చెప్పేవాడు - ఉగ్రశ్రవసుడు; శౌనక+ఆది, మహామునులకున్= శౌనకుడు మొదలైన మహామునులకు; చెప్పెన్; అట్లు; పాండవులు+ఏవురకున్= పాండవులు ఐదుగురకు; పాంచాలిన్= ద్రౌపదిని; పరమ+ఉత్సవంబునన్= మహావైభవంగా; వివాహంబు, చేయించి= పెండ్లి గావించి; ద్రుపదుండు= ద్రుపదుడు; ఆ+ఏవురకున్= ఆ ఐదుగురికి; వేఱువేఱు+అ= విడివిడిగా; అనర్ఘ్య, మణి, ఖచితంబులు, ఐన= వెలలేనిరత్నాలు పొదగబడినవైన; ఆభరణంబు లనున్= భూషణాలను; అపరిమితంబులు+ఐన= పరిమితంకానివైన; అర్థ, రాసులను= ధనరాసులను; సౌవర్ణంబులు+అయిన= బంగారంతో చేయబడిన; శయ్యా+ఆసన, పరికరంబులను= పాన్పులు, పీటలు, ఇతరవస్తువులను; నూఱు+ఏసి= వందవంతున; భద్రగజంబులను= మదపుటేనుగులను; నూఱు+ఏసి= వందవంతున; కాంచన, రథంబులను= బంగారు రథాలను; వేయి+ఏసి=

వేయి వంతున; కాంభోజ, హయంబులను= కాంభోజదేశపుగుర్రాలను; పదివేవురు+ఏసి= పదివేలమందివంతున; వర, వస్త్ర+ఆభరణ, భూషితులు+ అగు= శ్రేష్ఠాలైన వస్త్రాలతో సొమ్ములతో అలంకరిచబడినవాళ్ళయిన; దాన, దాసీ, జనంబులను= సేవకులను, పనిగత్తెలను; నూఱు+ఏసి, వేలు= లక్షవంతున; పాఁడి, మొదవులనున్= పాడి ఆవులను; అగ్ని, సాక్షికంబుగాన్= అగ్నిసాక్షిగా; అరణంబు= అల్లుడికి, కూతురికి ఇచ్చే సొమ్ముగా; ఇచ్చినన్= ఈయగా.

తాత్పర్యం: ఆ కథను చెప్పే ఉగ్రశ్రవసుడు, శౌనకుడు మొదలైన మహామునులకు చెప్పాడు; ఆ విధంగా పాండవులు అయిదుగురికి ద్రౌపదిని ఇచ్చి మహావైభవంగా వివాహం చేయించి, ద్రుపదుడు ఆ అయిదుగురికి వేరువేరుగా ఎంతో విలువైన మణులు పొదిగినఆభరణాలను, బంగారంతో చేసినపానుపులను, పీటలను, ఇతరవస్తువులను, నూరేసి మదపుటేనుగులను, నూరేసి బంగారు రథాలను, వేయేసి కాంభోజ దేశపు గుర్రాలను, శ్రేష్ఠమైన వస్త్రాలతో అలంకరించిన పదివేలదాసదాసీజనాలను, లక్షపాడిఆవులను అరణంగా ఇచ్చాడు.

క. చతురుదధివలయ నిఖిల । క్షితితలసామ్రాజ్యలక్ష్మి కిని మూలం బై
సతి యాజ్ఞసేని పతులకు । నతిముద మొనరించెఁ దుల్యమగు శుశ్రూషన్. 3

ప్రతిపదార్థం: చతుః+ఉదధి, వలయ, నిఖిల, క్షితి, తల, సామ్రాజ్యలక్ష్మికిని= నాలుగుసముద్రాలు చుట్టుకొని ఉన్న సమస్త భూమండలంయొక్క సామ్రాజ్యాధికారసంపదకు; మూలంబు+ఐ= కారణమై; సతి, యాజ్ఞసేని= పతివ్రత అయిన ద్రౌపది; తుల్యము+అగు= సమానమైన; శుశ్రూషన్= సేవతో; పతులకున్= భర్తలకు; అతి, ముదము= మిక్కిలి సంతోషాన్ని; ఒనరించెన్= కలిగించింది.

తాత్పర్యం: నాలుగుసముద్రాలు చుట్టుకొనిఉన్న సమస్తభూమండల సామ్రాజ్యాధికారసంపదకు కారణమై పతివ్రతద్రౌపది, సమానంగా సేవచేసి భర్తలందరికీ మిక్కిలిసంతోషాన్ని కలిగించింది.

సీ. కోడలి యుత్తమ గుణముల కెంతయు । సంతుష్టచిత్త యై కుంతిదేవి
'లలితాంగి! హరియందు లక్ష్మిని, మఱి చంద్రు । నందు రోహిణి, నింద్రునందు శచిని
నవ్వసిష్ఠమునీంద్రునం దరుంధతిఁ బోలి । సుందరి! నీపతులందుఁ బ్రీతిఁ
బతిభక్తి యొప్ప నపత్యంబుఁ బడయుము; । గురు వృద్ధబాంధవాతుర విశిష్ట

ఆ. జనుల నతిథిజనుల సతతంబుఁ బూజింపు, । మన్నదానమున ధరామరేంద్ర
వరులఁ దనుపు, మఖిలవసుమతీప్రజ కెల్లఁ । గరుణ గలుగు మమ్మ కమలనేత్ర! 4

ప్రతిపదార్థం: కోడలి, ఉత్తమ, గుణములకున్, ఎంతయు, సంతుష్టచిత్త ఐ, కుంతిదేవి; లలిత+అంగి!= సుకుమారమైన శరీరం కలదానా!; హరియందున్= విష్ణుమూర్తియందు; లక్ష్మిని; మఱి, చంద్రుని, అందున్; రోహిణిన్; ఇంద్రుని, అందున్; శచినిన్= శచీదేవిని; ఆ+వసిష్ఠముని+ఇంద్రు, అందున్; అరుంధతిన్; పోలి; సుందరి!; నీ పతుల, అందున్; ప్రీతిన్= ప్రేమతో; పతి, భక్తి; ఒప్పన్; అపత్యంబున్= సంతానాన్ని; పడయుము= పొందుము; గురు, వృద్ధ, బాంధవ+ఆతుర+విశిష్టజనులన్= గురువులను, వృద్ధులను, బంధువులను, రోగులను, పూజ్యులను; అతిథిజనులన్= అతిథులుగా విచ్చేసినవారిని; సతతంబున్= ఎల్లప్పుడు; పూజింపుము; అన్న, దానమునన్= అన్నదానంతో; ధర+అమర+ఇంద్ర, వరులన్= బ్రాహ్మణ శ్రేష్ఠులను; తనుపుము= తృప్తిపరచుము; కమల, నేత్ర= పద్మాలవంటి కన్నులు కలదానా!; అఖిల, వసుమతీ, ప్రజకు+ఎల్లన్= సమస్త భూమండలంమీది ప్రజలందరికీ; కరుణ= దయ; కలుగుము+అమ్మ= కలిగి ఉండుము తల్లీ!

తాత్పర్యం: కుంతీదేవి, కోడలి ఉత్తమగుణాలకు ఎంతో సంతోషించి, 'ద్రౌపదీ! విష్ణుమూర్తిపై లక్ష్మీదేవివలె, చంద్రునిమీద రోహిణీదేవివలె, ఇంద్రునిమీద శచీదేవివలె, వసిష్ఠునిపై అరుంధతివలె నీ భర్తల మీది ప్రేమతో పతిభక్తి ప్రకాశించగా సంతానాన్ని పొందుము. గురువులను, వృద్ధులను, బంధువులను, రోగులను, పూజ్యులను, అతిథులను అన్నివేళలా పూజించుము. అన్నదానంతో శ్రేష్ఠులైన బ్రాహ్మణులను తృప్తిపెట్టుము. భూమిమీదిప్రజలందరిపట్ల దయ కలిగి ఉండుము.

ఉ. పూని పరాక్రమం బెసఁగ భూతలనాథుల నోర్చి, వీరు లై
యీ నవఖండమండితమహీతల మేలుచు, నీపతుల్ పయో
జానన! రాజసూయమఖ మాదిగ నధ్వరపంక్తి సేయుచో
మానుగఁ బత్ని వీ వగుము మానితధర్మవిధానయుక్తితోన్. 5

ప్రతిపదార్థం: పయోజ+ఆనన= పద్మంవంటి ముఖం కలదానా!; నీ, పతుల్= నీ భర్తలు; పూని= ప్రయత్నించి; పరాక్రమంబు; ఎసఁగన్= అతిశయించగా; భూతలనాథులన్= రాజులను; ఓర్చి= జయించి; వీరులు+ఐ= పరాక్రమముకలవారై ఈ, నవ ఖండ, మండిత, మహీతలము= ఈ తొమ్మిది దీవులతో అలంకరించబడిన భూమండలాన్ని; ఏలుచున్= పాలించుచు; రాజసూయ, మఖము+ఆదిగన్= రాజసూయయాగం మొదలైన; అధ్వర, పంక్తి= యాగాల సమూహం; చేయుచో; ఈవు= నీవు; మానిత, ధర్మ, విధానయుక్తితోన్= గౌరవించబడిన ధర్మపద్ధతియొక్క కూడికతో; మానుగన్= ఒప్పుగా; పత్నివి= యజ్ఞంవంటి ధర్మకార్య సంబంధం కల భార్యవు; అగుము= కావలసింది.

తాత్పర్యం: పద్మంవంటిముఖం కల ఓ ద్రౌపదీ! నీ భర్తలు పూనికతో, పరాక్రమాతిశయంతో రాజులను జయించి, వీరులై, ఈ తొమ్మిదిదీవులతో అలంకరించబడిన భూమండలాన్ని పరిపాలిస్తూ రాజసూయయాగం మొదలైన అనేకయాగాలు చేసేటప్పుడు, నీవు వాళ్ళ ధర్మపత్నిగా ఉండుము.

విశేషం: నవఖండాలు- భరత, ఇంద్ర, పురు, గభస్తి, నాగ, తామ్ర, వారుణ, సౌమ్య, గంధర్వ ఖండాలు. జాయ, దార, కళత్రం, పత్ని- మొదలైనవి 'భార్యకు' పర్యాయపదాలే అయినా యజ్ఞంవంటి ధర్మకార్యాలలో భర్తప్రక్కన కూర్చుండి పాలుపంచుకొనే భార్యనే ప్రత్యేకించి 'పత్ని' అనటం ఉన్నది. తన పుత్రులు రాజసూయం చేయాలనేభావం ఆ రాజమాత అయిన కుంతీదేవి హృదయంలో ఇంతముందుగా మోసులెత్తింది. పాండవుల భవిష్యదుజ్జ్వల జీవితాన్నిగురించి ఆకాశవాణి, దేవతలు, వ్యాసాది మహర్షులు చెప్పినవాక్యాలు ఆమె ఆశలకు, ఆశయాలకు ఆలంబనాలై ఉంటాయి. ఆ రాజసూయం మహాభారతకథనే మలుపు తిప్పింది.

క. 'ఇందీవరలోచన! నీ । యం దే నభినందితాత్మ నైనట్టులు నీ
నందనులయందుఁ బౌత్రుల । యందును నభినంద్య వగుమ' యని దీవించెన్. 6

ప్రతిపదార్థం: ఇందీవర, లోచన= నల్లకలువలవంటి కన్నులు కలదానా!; ఏను= నేను; నీయందు; అభినందిత+ఆత్మను= సంతోషించిన మనస్సు కలదానిని; ఐన, అట్టులు= అయినవిధంగా; నీ, నందనుల, అందున్= నీ కుమారులలో; పౌత్రుల, అందున్= మనుమలలో; అభినంద్యవు= సంతోషించదగినదానివి; అగుము+అ; అని, దీవించెన్= కమ్ము అని దీవించింది.

తాత్పర్యం: 'నల్లకలువలవంటి కన్నులు కల ఓ ద్రౌపదీ! నేను నిన్ను పొంది సంతోషించినట్లే, నీవు కూడా నీ కొడుకులను, మనుమలను పొంది సంతోషించు' అని దీవించింది.

విశేషం: "నీవు సంతోషించదగిన యోగ్యులైన కొడుకులు, మనుమలు నీకు కలుగుదురు గాక"! అని కుంతీదేవి దీవెన. ఏ స్త్రీమూర్తికైనా జీవితంలో ఇది గొప్ప దీవెనే.

వ. అట వాసుదేవుండు ద్రౌపదిని బాండవు లేవురు వివాహం బగుట విని సంతసిల్లి, వా రేవురకు వజ్ర వైదూర్య మరకత మౌక్తిక విభూషణంబులును, నానాదేశవిచిత్రవస్త్రంబులును, ననేకకరితురంగరథరత్న శిబికావిలాసినీనివహంబులుం బుత్తెంచిన. 7

ప్రతిపదార్థం: అట= అక్కడ; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ద్రౌపదిని; పాండవులు; ఏవురు= ఐదుగురు; వివాహంబు+అగుట= పెండ్లిచేసుకొనుట; విని= ఆలకించి; సంతసిల్లి; వారు+ఏవురకున్= ఆ పాండవులైదుగురికి; వజ్ర, వైదూర్య,మరకత, మౌక్తిక, విభూషణంబులును= వజ్రాలు, వైదూర్యాలు, మరకతం, ముత్యాల ఆభరణాలు; నానాదేశ; విచిత్ర, వస్త్రంబులునున్= అనేక దేశాలకు సంబంధించిన విచిత్రవస్త్రాలు; అనేక, కరి, తురంగ, రథ, రత్న, శిబికా, విలాసినీ, నివహంబులున్= పెక్కు ఏనుగుల, గుర్రాల, రథాల, రత్నాల, పల్లకీల, వేశ్యల సమూహాలను; పుత్తెంచిన= పంపిన.

తాత్పర్యం: పాండవులైదుగురు ద్రౌపదిని వివాహమాడటం విని ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుడు సంతోషించాడు. ఆ అయిదుగురికి వజ్రాలు, వైదూర్యాలు, మరకతాలు, ముత్యాలు పొదిగిన ఆభరణాలను, వివిధ దేశాలకు సంబంధించిన చిత్రవిచిత్రాలైన వస్త్రాలను, ఎన్నో ఏనుగుల, గుర్రాల, రథాల, రత్నాల, పల్లకీల, వేశ్యల సమూహాలను పంపించాడు.

చ. విలసిత రాజ్యలీలఁ బరవీరభయంకరు లై గుణంబులన్
వెలయుచుఁ బాండవుల్ విదితవిక్రము లుండుటఁజేసి దేవతా
దులవలనన్ భయంబు ద్రుపదుం డెఱుఁగండ; తదీయదేశముల్
దలరక యొప్పె రోగ భయ తస్కర డామర వర్జితంబు లై. 8

ప్రతిపదార్థం: విలసిత, రాజ్య, లీలన్= ప్రకాశిస్తున్న రాజ్యాధికారవిలాసంతో; పర, వీర, భయంకరులు+ఐ= శత్రువీరులకు భయాన్ని కలిగించేవాళ్ళయి; గుణంబులన్= మంచిగుణాలతో; వెలయుచున్= ఒప్పుతూ (ప్రకాశిస్తూ); విదిత, విక్రములు= ప్రసిద్ధమైన పరాక్రమం కలవాళ్ళు; పాండవుల్; ఉండుటన్+చేసి= ఉండటంచేత; ద్రుపదుండు; దేవతా+ఆదుల, వలనన్= దేవతలు మొదలైన వారివలనకూడా; భయంబు= భీతిని; ఎఱుఁగండు+అ= పొందలేదు; దేశముల్= అతనియొక్క దేశాలు; రోగ భయ, తస్కర, డామర, వర్జితంబులు+ఐ= రోగభయంచేత, దొంగలచేత, కొల్లగొట్టుటచేత విడువబడినవై - అంటే రోగం, దొంగలు, కొల్లగొట్టటాలు లేనివై; తలరక= కలతపొందక; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: వెలుగుతున్న రాజ్యాధికారవిలాసంతో, శత్రువీరులకు భయం కలిగించేవాళ్ళయి, సుగుణాలతో ప్రకాశిస్తూ, మహాపరాక్రమశాలులైన పాండవులు ఉండటంవలన ద్రుపదునికి దేవతలవలనకూడా భయం లేకుండా ఉన్నది. అతని దేశాలు - రోగాలు, దొంగలు, కొల్లగొట్టటాలు లేనివై కలతలేక సుఖంగా ఉన్నాయి.

చారులవలన పాండవుల యభ్యుదయమును విని దుర్యోధనుఁడు నిర్వేదించుట (సం.1-191-1)

వ. ఇట్లు పాండవులు ద్రుపదుపురంబున నఖిలరాజ్యవిభవసమన్వితు లయి యొక్క సంవత్సరం బుండునంత నంతయు నెఱింగి దుర్యోధనగూఢచారు లరిగి కర్ణదుశ్శాసనసౌబలసోమదత్తపరివృతుం డయి యున్న దుర్యోధనునకు మ్రొక్కి యి ట్లనిరి. 9

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పాండవులు= పాండుకుమారులు; ద్రుపదు, పురమునన్= ద్రుపదునినగరంలో; అఖిల, రాజ్య, విభవ, సమన్వితులు+అయి= సమస్తరాజ్యవైభవంతో కూడుకొన్నవాళ్ళయి; ఒక్క, సంవత్సరంబు; ఉండునంతన్= ఉండగా; అంతయున్= అంతా; ఎఱింగి= తెలిసికొని; దుర్యోధన, గూఢ+చారులు= దుర్యోధనునివేగులవాళ్ళు; అరిగి= వెళ్ళి; కర్ణ, దుశ్శాసన, సౌబల, సోమదత్త, పరివృతుండు+అయి= కర్ణ దుశ్శాసన శకుని సోమదత్తులచే కొలువబడినవాడై, ఉన్న= ఉండు దుర్యోధనునకున్; మ్రొక్కి; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా పాండవులు ద్రుపదునినగరంలో సమస్తరాజ్యవైభవంతో ఒక్కసంవత్సరం ఉండగా; విషయాన్నంతా తెలిసికొని దుర్యోధనునివేగులవాళ్ళు, హస్తినాపురానికి వెళ్ళి, కర్ణ దుశ్శాశన శకుని సోమదత్తులు చుట్టూ చేరి ఉండగా, కొలువున్న దుర్యోధనునికి మ్రొక్కి ఇట్లా అన్నారు.

సీ. కర్ణశల్యులు మొదల్గాఁ గల భూపతు । లత్యంత బలవంతు లస్త్రవేదు
లుద్ధతుల్ మోపెట్టనోపని చాప మ । శ్రమమున మోపెట్టి, చదలఁ దిరుగు
నయ్యంత్ర మేసి, మీయందఱముందరఁ । గృష్ణఁ దోడ్కొని యొక్క కృష్ణవర్ణుఁ
డెక్కటి రణములో నేపునఁ గానీను । నోడించి జయలీల నున్న యాతఁ

ఆ. డర్జునుండు; మఱిమహాబాహుబలమున । శల్యుఁ ద్రెళ్ల వైచి శత్రువరుల
నెల్లఁ దల్లడిల్ల నెగచిన యాతండు । భీమసేనుఁ డమితభీమబలుఁడు. 10

ప్రతిపదార్థం: కర్ణ, శల్యులు= కర్ణుడు, శల్యుడు; మొదల్, కాన్+కల= ఆదిగా ఉన్న; భూపతులు= రాజులు; అత్యంత, బలవంతులు= మిక్కిలి బలముకలవాళ్లు; అస్త్ర, వేదులు= అస్త్రవిద్యను ఎరిగినవాళ్ళు; ఉద్ధతుల్= గర్వించినవాళ్ళు; మోపెట్టన్= ఎక్కుపెట్టటానికి; ఓపని= సాధ్యంకాని; చాపము= ధనుస్సును; అశ్రమమునన్= సులువుగా; మోపెట్టి= ఎక్కుపెట్టి; చదలన్= ఆకాశంలో; తిరుగు, ఆ+యంత్రము= కదిలే ఆ మత్స్యయంత్రాన్ని; ఏసి= కొట్టి; మీ, అందఱ ముందరన్= మీ అందరి సమక్షంలో; కృష్ణన్= ద్రౌపదిని; తోడ్కొని= తీసికొని; ఎక్కటి, రణములోన్= ద్వంద్వయుద్ధంలో; ఏపునన్= పరాక్రమంతో; కానీనున్= కన్యాపుత్రుడు అయిన కర్ణుడిని; ఓడించి; జయ, లీలన్= జయముయొక్కవిలాసంతో; ఉన్న= ఉండే, ఆతఁడు= అతడు; ఒక్క= ఆ ఒకే ఒక్క; కృష్ణవర్ణుఁడు= నల్లటికాంతికలవాడు; అర్జునుండు; మఱి= ఇక; మహా, బాహు, బలమునన్= గొప్ప భుజబలంతో; శల్యున్= శల్యుణ్ణి; త్రెళ్ళ, వైచి= పడవేసి; శత్రు, వరులన్= మేటి శత్రువులందరిని; తల్లడిల్లన్= భయపడగా, బాధపడగా; ఎగచిన= తరిమిన; ఆతండు; అమిత, భీమ, బలుఁడు= అంతులేనిభయంకరమైన బలం కలవాడు; భీమసేనుఁడు;

తాత్పర్యం: మహాబలవంతులు, అస్త్రవిద్యావేత్తలు, గర్వితులు అయిన కర్ణుడు, శల్యుడు మొదలైన రాజులంతా ఎక్కుపెట్టలేని ధనుస్సును సులభంగా ఎక్కుపెట్టి, ఆకాశంలో తిరిగే మత్స్యయంత్రాన్ని కొట్టి, అందరిఎదుట ద్రౌపదిని చేపట్టి, ద్వంద్వయుద్ధంలో తన పరాక్రమం ప్రకాశించేటట్లు కర్ణుడిని ఓడించి విజయవిలాసంతో ఉన్న ఆ

నల్లటివాడు - అర్జునుడు. గొప్ప భుజబలంతో శల్యుడిని పడవేసి, మేటిశత్రువులందరినీ తల్లడిల్లజేసి తరిమిన, ఆ మహాభయంకరమైన బలం గలవాడు భీముడు.

చ. 'అనిమొన నట్లు దాఁకిన మహారథులన్ ధృతరాష్ట్రరాజనం
దనుల బలాఢ్యులన్ దళితదర్పులఁ జేసినవారు ధర్మనం
దనయము లుగ్రవీరు' లని తద్విధమంతయు నేర్పడంగఁ జె
ప్పిన విని కౌరవప్రభుఁడుఁ బెల్కుఱి తద్దయు దుఃఖితాత్ముఁ డై. 11

ప్రతిపదార్థం: అని, మొనన్= యుద్ధంమొదట; అట్లు; తాఁకిన= ఎదుర్కొన్న; మహారథులన్= గొప్పయోధుల్ని; బల+ఆఢ్యులన్= బలవంతులను; ధృతరాష్ట్రరాజ, నందనులన్= ధృతరాష్ట్రమహారాజు కుమారులను; దళిత, దర్పులన్= ఖండింపబడిన గర్వం కలవాళ్ళనుగా - అంటే అణచివేయబడిన గర్వం కలవాళ్ళనుగా; చేసినవారు= చేసినవాళ్ళు; ఉగ్రవీరులు= భయంకరమైన పరాక్రమం కలవాళ్ళు; ధర్మనందన, యములు= ధర్మరాజు, కవల లైన నకులసహదేవులు; అని= ఆ ప్రకారం; తత్+విధము= ఆ విధం; అంతయున్, ఏర్పడంగన్= స్పష్టం అయ్యేటట్లు; చెప్పినన్= చెప్పగా; విని; కౌరవ, ప్రభుఁడున్= దుర్యోధనుడు కూడ; పెల్కుఱి= వెలవెలపోయి; తద్దయున్= మిక్కిలి; దుఃఖిత+ఆత్ముఁడు+ఐ= దుఃఖించిన మనస్సు కలవాడై.

తాత్పర్యం: యుద్ధప్రారంభంలో ఆ విధంగా ఎదుర్కొని మహారథులూ, బలవంతులూ అయిన ధృతరాష్ట్ర మహారాజుకుమారులగర్వాన్ని అణచినవాళ్ళు - ధర్మజ నకుల సహదేవులనీ, ఆ విషయాన్నంతా స్పష్టంగా చెప్పగా విని, దుర్యోధనుడు వెలవెలబోయి మిక్కిలి దుఃఖించాడు.

విశేషం: ఈ వివరాలు ద్రౌపదీస్వయంవరఘట్టంలో చెప్పకుండ ఇక్కడ చారులచేత చెప్పించటంవలన పునరుక్తిదోషం కలుగకుండ విశేష వృత్తాంతాన్ని ప్రతిపాదించి కథాంశాలకు ఉత్కంఠ నాపాదించటం జరిగింది. ఈ వివరణ లేకపోతే ధర్మరాజు, నకులసహదేవులు సభను వీడి ఎందుకు ముందుగానే వెళ్ళారో, భీము డొక్కడే సభలో ఎందుకు ఆగాడో తెలియదు. ఇప్పుడు స్వయంవర ఘట్టంలో పాండవులు కూడబలుకుకొని కార్యాన్ని సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించినట్లు స్పష్టమవుతున్నది.

వ. 'అక్కట! పురోచనుం డొక్కరుండ లక్కయింట దగ్ధుం డయ్యెం గా కేమి; దైవానుకూల్యంబు లేక మానుషం బెంతయయ్యు నేమి సేయుఁ; బాండవు లేమిదైవసంపన్నులైరో యని వగచి, యీ యవసరంబున ద్రుపదు భేదించి పాండవుల నుత్సాదింపవలయు నె ట్లనిన. 12

ప్రతిపదార్థం: అక్కట= అయ్యో!; పురోచనుండు; ఒక్కరుండు+అ= ఒక్కడే; లక్కయింటన్= లక్కఇంటిలో; దగ్ధుండు+ అయ్యెన్= కాలిపోయాడు; కాక+ఏమి= కాబోలు; దైవ+అనుకూల్యంబు= దైవముయొక్కతోడ్పాటు; లేక= లేకుండా; మానుషంబు= మానవప్రయత్నం; ఎంత, అయ్యున్= ఎంతయినా; ఏమి, చేయున్= ఏమి చేయగలదు!; పాండవులు; ఏమి= ఎంత; దైవసంపన్నులు+ ఐరో= దైవబలసంపదతో కూడినవాళ్ళు అయ్యారో; అని= ఆ విధంగా; వగచి= విచారించి; ఈ, అవసరంబునన్= ఈ సమయంలో; ద్రుపదున్, భేదించి= ద్రుపదుడిని వేరుచేసి; పాండవులన్; ఉత్సాదింపవలయున్= పెకలించాలి; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే.

తాత్పర్యం: 'అయ్యో! పురోచనుడు ఒక్కటే లక్కఇంటిలో మాడిపోయాడు కాబోలు! దైవం అనుకూలించకుంటే మానవప్రయత్నం ఎంత ఉన్నా ప్రయోజనం ఏమిటి? పాండవులు ఎంతదైవబలసంపన్నులో గదా!' అని చింతించి, ఈ సమయంలో ద్రుపదుడిని వేరు చేసి పాండవులను పెకలించివేయాలి. ఎట్లాగంటే.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

ఉ. యాదవవృష్ణిభోజవరు లందఱుఁ బాండవపక్షపాతు; ల
చ్చేదివిభుండు వారలన చేకొనువాఁడగు; వీరలెల్ల నా
త్మోదయవృద్ధి పొంటెను దదున్నతిఁ గోరుదు; రట్లు గావునన్
భేదము సేయఁగావలయుఁ బెల్చన యందఱుఁ గూడకుండఁగన్. 13

ప్రతిపదార్థం: యాదవ, వృష్ణి, భోజ, వరులు= యాదవ, వృష్ణి, భోజ(కుల)శ్రేష్ఠులు; పాండవపక్షపాతులు= పాండవులపై పక్షపాతం కలవాళ్లు; ఆ+చేది, విభుండు= ఆ చేది రాజైన శిశుపాలుడూ; వారలన్+అ= వారినే; చేకొనువాఁడు= చేపట్టేవాడు- అంటే వారి పక్షాన్నే గ్రహించేవాడు; అగున్= అగును; వీరలు+ఎల్లన్= వీళ్ళంతా; ఆత్మ+ఉదయ, వృద్ధిపొంటెను= తమ అభ్యుదయం యొక్క అభివృద్ధికంటె; తత్+ఉన్నతిన్= ఆ పాండవులయొక్క అభివృద్ధిని; కోరుదురు= కోరుతారు; అట్లు+కావునన్= అందువల్ల; అందఱు= వీళ్లు అంతా; కూడక+ఉండఁగన్= కలియకుండా ఉండేటట్లు; పెల్చనన్= వెంటనే; భేదము= వేర్పాటు; చేయఁగావలయున్= కలిగించాలి.

తాత్పర్యం: యాదవ వృష్ణి భోజ కుల శ్రేష్ఠులంతా పాండవ పక్షపాతులు. ఆ చేది రాజైన శిశుపాలుడుకూడా వాళ్ళ పక్షం వహించేవాడే. వీళ్ళంతా తమ అభ్యుదయంకంటె పాండవుల అభివృద్ధినే కోరుతారు. అందువలన వీళ్ళంతా ఒకటి కాకుండా భేదం కల్పించాలి.

విశేషం: పాండవులకు పెదతండ్రి కొడుకులైన దుర్యోధనాదులు శత్రువులయ్యారు. ద్రుపదరాజు పుత్రికను వివాహంచేసికొనటంవలన, పాండవులకు బంధువర్గం ఏర్పడింది. ఈ సంగతి వ్యాసు డిదివరకే సూచించాడు. పాండవ మిత్రులూ, బంధువులూ వారివారి స్వార్థాలకంటె పాండవుల అభ్యుదయాన్నే కోరుతారు. కౌరవపక్షం దానికి విరుద్ధం. వారికి స్వార్థమే లక్ష్యం. ఈ సంగతి తెలిసికొన్న దుర్యోధనుడు పాండవబలాన్ని అంచనావేసి, భయపడి, వాళ్ళపట్ల భేదోపాయాన్ని ప్రయోగించాలని యోచించాడు. కణికుడు బోధించిన శుక్రనీతి ప్రకారం శత్రువుల పట్ల భేదోపాయాన్ని ప్రయోగించటానికి దుర్యోధనుడు ప్రయత్నం చేస్తున్నాడు. (కణికనీతి. చూడు: ఆది. 6.119,120).

వ. అని దుర్యోధనుండు పాండవ పాంచాల విభేదనోపాయంబుఁ జింతించుచుండె; నంత విదురుండు పాండవాభ్యుదయంబును బాంచాలీస్వయంవరంబును దుర్యోధనాదులు భగ్నదర్పు లగుటయు విని సంతసిల్లి, పాండవులు ద్రుపదరాజపుత్త్రిం బెండ్లి యై ద్రుపదుపురంబున సుఖంబున్న వా రని ధృతరాష్ట్రునకుం జెప్పిన నతం డి ట్లనియె. 14

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; దుర్యోధనుండు; పాండవ, పాంచాల, విభేదన+ఉపాయంబున్= పాండవులను ద్రుపదుడిని వేరుపరచే ఉపాయాన్ని; చింతించుచుండెన్= ఆలోచిస్తూఉన్నాడు; అంతన్= అంతలో; విదురుండు= విదురుడు; పాండవ+

అభ్యుదయంబును= పాండవుల అభివృద్ధిని; పాంచాలీ, స్వయంవరంబును= ద్రౌపదీ స్వయంవరాన్ని; దుర్యోధన+ఆదులు= దుర్యోధనుడు మొదలైనవాళ్ళు; భగ్న; దర్పులు= పోయినగర్వం కలవాళ్ళు; అగుటయును= కావటం; విని= ఆలకించి; సంతసిల్లి; పాండవులు= పాండుకుమారులు; ద్రుపదరాజు, పుత్త్రిని= ద్రౌపదిని; పెండ్లి+ఐ= పెండ్లాడి; ద్రుపదు, పురంబునన్= ద్రుపదుని నగరంలో; సుఖంగా+ఉన్నవారు= సుఖంగా ఉన్నారు; అని= ఆ విధంగా; ధృతరాష్ట్రునకున్, చెప్పినన్= ధృతరాష్ట్రునికి చెప్పగా; అతండు= ఆ ధృతరాష్ట్రుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అని దుర్యోధనుడు పాండవులను ద్రుపదునుండి వేరుచేసే ఉపాయాన్ని ఆలోచిస్తూ ఉన్నాడు. అంతలో విదురుడు పాండవుల అభ్యుదయాన్నీ, ద్రౌపదీస్వయంవరాన్నీ, దుర్యోధనుడు భంగపడటాన్ని విని సంతోషించి, పాండవులు ద్రౌపదిని పెండ్లిచేసికొని ద్రుపదుడినినగరంలో సుఖంగా ఉన్నారని ధృతరాష్ట్రునికి చెప్పగా, అతడు ఇట్లా అన్నాడు.

ఆ. యజ్ఞసేనుకూఁతు నభిజాత నాతని। యజ్ఞవేది నుదిత యయినదాని
ననఘువిధి వివాహ మయి పాండునందనుల్। మిగుల మిత్త్రబలసమృద్ధు లయిరి. 15

ప్రతిపదార్థం: యజ్ఞసేనుకూఁతున్= ద్రుపదునికూతురిని; అభిజాతన్= ఉత్తమవంశం కలదానిని; అతని= ఆ ద్రుపదుని; యజ్ఞవేదిన్= యజ్ఞవేదికలో; ఉదిత, అయిన, దానిన్= పుట్టిన దానిని; అనఘ, విధిన్= దోషం లేని పద్ధతిలో; వివాహము+అయి= పెండ్లాడి; పాండు, నందనుల్= పాండుకుమారులు; మిగులన్= మిక్కిలి; మిత్త్ర, సమృద్ధులు= మిత్రబలంతో నిండినవాళ్ళు; అయిరి= అయ్యారు.

తాత్పర్యం: యజ్ఞవేదికలో పుట్టి, ఉత్తమవంశం కల ద్రౌపదిని చక్కగా వివాహమాడటంవలన పాండవులు మిక్కిలిమిత్రబలాన్ని పొందారు.

విశేషం: గృహస్థధర్మంలో ఉత్తమవంశంలో పుట్టి గుణవతి అయిన వధువుకుండే ప్రాధాన్యం ధృతరాష్ట్రునిమాటలో ధ్వనిస్తున్నది.

క. కొడుకుల యభ్యుదయము విని। కడు సంతస మయ్యె నిపుడు; కౌరవకుల మే
ర్పడ వెలిఁగె నెల్లరాజుల। నొడిచిన భుజవీర్యమున మహోత్సాహమునన్. 16

ప్రతిపదార్థం: కొడుకుల, అభ్యుదయము= కొడుకుల అభివృద్ధిగురించి; విని, కడు=మిక్కిలి; సంతసము+అయ్యెన్; ఇపుడు; కౌరవకులము= కౌరవవంశం; ఎల్ల, రాజులన్= అందరి రాజుల్ని; ఒడిచిన= ఓడించిన; భుజ, వీర్యమునన్; మహా+ఉత్సాహమునన్= గొప్ప ఉత్సాహంతో; ఏర్పడన్= స్పష్టంగా; వెలిఁగెన్= ప్రకాశించింది.

తాత్పర్యం: పాండవుల అభివృద్ధినిగూర్చి వినటంవలన ఎంతోసంతోషం కలిగింది. ఇప్పుడు కౌరవవంశం రాజులందరినీ ఓడించిన భుజబలంతో, మహోత్సాహంతో బాగా ప్రకాశించింది.

వ. అని విదురునకు మనఃప్రియంబుగాఁ బలికి, యంతఃపురంబునకుం జని యంతస్తాపం బేర్పడకుండ నుండునంత; గర్ణ దుర్యోధనులు ధృతరాష్ట్రు పాలికిం జని యి ట్లనిరి. 17

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; విదురునకున్= విదురునితో; మనఃప్రియంబుగాన్= మనసుకు సంతోషం కలిగేటట్లు; పలికి, అంతఃపురంబునకున్= అంతఃపురానికి; చని= వెళ్ళి; అంతస్+తాపము= లోపలి దుఃఖం - అంటే మనస్సులోని

దుఃఖం; ఏర్పడకుండన్= బయటపడకుండా; ఉండున్, అంతన్= ఉన్న సమయంలో; కర్ణదుర్యోధనులు= కర్ణుడు, దుర్యోధనుడు; ధృతరాష్ట్ర, పాలికిన్= ధృతరాష్ట్రుని దగ్గరకు; చని= వెళ్ళి; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అని విదురునిమనస్సుకు సంతోషం కలిగేటట్లు పలికి, అంతఃపురానికి వెళ్ళి, తనమనస్సులోని దుఃఖం బయటపడకుండా ఉండగా - కర్ణదుర్యోధనులు, ధృతరాష్ట్రునిదగ్గరకు వెళ్ళి ఇట్లా అన్నారు.

దుర్యోధనుఁడు తండ్రితోఁ బాండవపాంచాలవిభేదనోపాయంబు నాలోచించుట (సం.1-192-25)

క. రేయును బగలును విదురుఁడు । నీయొద్దన యునికిఁజేసి నేరము పలుకన్
మాయిష్టం బెఱిఁగింపఁగ । ధీయుత ! యెడఁ గంటి మిన్ని దివసంబులకున్. 18

ప్రతిపదార్థం: రేయును= రాత్రి; పగలును= పగలూ; విదురుఁడు; నీ, ఒద్దన= నీ ప్రక్కనే; ఉనికిన్+చేసి= ఉండటంచేత; పలుకన్, నేరము= చెప్పలేకపోయాము; ధీయుత= బుద్ధిబలంతో కూడినవాడా!; ఇన్ని, దివసంబులకున్= ఇన్నిరోజులకు; మా, ఇష్టంబు= మా కోరిక; ఎఱిఁగింపఁగన్= తెలపటానికి; ఎడన్= అవకాశాన్ని; కంటిమి= పొందాము.

తాత్పర్యం: రాత్రీ పగలూ విదురుడు నీ వద్దనే ఉండటంచేత మా మనస్సులోని మాట చెప్పలేకపోయాము. మేధావీ! మా కోరిక తెలపటానికి ఇన్నిరోజులకు అవకాశం ఏర్పడింది.

క. విదురుఁడు పాండవహితుఁ డని । మొదలన యెఱిఁగియును నతి విమోహంబున న
వ్విదురువచనంబ నిలుపుదు । హృదయంబున; నతఁడు పెద్దయిష్టుఁడు మీకున్. 19

ప్రతిపదార్థం: విదురుఁడు; పాండవ, హితుఁడు= పాండవుల మేలు కోరేవాడు; అని, మొదలన= అని స్పష్టంగా మొదటనే; ఎఱిఁగియును= తెలిసికూడా; అతి, విమోహంబునన్= మిక్కిలి అజ్ఞానంచేత; ఆ+విదురు, వచనంబు+అ= ఆ విదురునియొక్క మాటే; హృదయంబునన్= మనసులో; నిలుపుదు= నిలుపుకొంటావు; అతడు= ఆ విదురుడు; మీకున్; పెద్ద= మిక్కిలి; ఇష్టుఁడు= ఇష్టమైనవాడు.

తాత్పర్యం: విదురుడు పాండవుల మేలు కోరేవాడని మొదటనే తెలిసికూడా మిక్కిలి అజ్ఞానంతో ఆ విదురుడి మాటే మనస్సులో నిలుపుకొంటావు. అతడు మీకు బాగా ఇష్టమైనవాడు.

విశేషం: ఈ మాటలు ధృతరాష్ట్రుడిని వ్యంగ్యంగా నిష్ఠూరమాడుతున్నట్లున్నాయి. మనసును విరిచే మాటలు ఇట్లాగే ఉంటాయి.

వ. అనిన వారలకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. 20

ప్రతిపదార్థం: అనినన్= అని మాటాడగా; వారలకున్= ఆ కర్ణ దుర్యోధనులకు; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్రుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అనగా వారితో ధృతరాష్ట్రుడు ఈ విధంగా అన్నాడు.

సీ. 'పలుకులఁ జెయ్వులఁ బాండవులకుఁ బ్రీతి । గలయట్ల యుండుదుఁగాని నాదు
హృదయంబు విదురున కెన్నఁడు నెఱిఁగింప; నేను మీతలఁచిన యివ్విధంబ

తలఁచుచు నుండుదు; దైవసంపద గల । వారలఁ బాండవవరుల నేమి
సేయంగ నగు? నెద్ది చెప్పఁ డిష్టం బింక?' । ననిన విచిత్రవీర్యాత్మజునకు

ఆ. దుష్టచేష్టితుండు దుర్యోధనుం డిట్టు । లనియెఁ 'జిత్తగింపు మవనినాథ!
పాండురాజసుతులఁ బాంచాలపతియొద్ద । నుండకుండఁ జేయు టుచిత మిపుడు' 21

ప్రతిపదార్థం: పలుకులన్= మాటలలో; చెయ్వులన్= చేతలలో; పాండవులకున్; ప్రీతి= ప్రీతి; కల, అట్లు+అ= ఉన్నట్లే; ఉండుదున్+కాని= ఉంటానుకానీ; నాదు, హృదయంబు= నా మనస్సు; విదురునకున్; ఎన్నండున్= ఎప్పుడుగానీ; ఎఱిఁగింపన్= చెప్పను; ఏను= నేను; మీ, తలఁచిన, ఈ+విధంబు+అ= మీరు ఆలోచించినట్లే; తలఁచుచున్= ఆలోచిస్తూ; ఉండుదున్= ఉంటాను; దైవ, సంపద= దైవబల సంపత్తి; కల= కలిగిన; వారలన్= వాళ్ళను; పాండవ, వరులన్= ఉత్తములైన పాండవులను; ఏమి; చేయంగన్+అగున్= ఏమి చేయగలం!; ఇంకన్= ఇంకా; ఎద్ది= ఏది; ఇష్టంబు= ఇష్టమో; చెప్పుఁడు= చెప్పండి; అనినన్= అని అనగా; విచిత్రవీర్య+ఆత్మజునకున్= విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రునికి; దుష్ట, చేష్టితుండు= చెడ్డపనులు చేసేవాడు; దుర్యోధనుండు; ఇట్టులు, అనియెన్; అవనినాథా= మహారాజా!; చిత్తగింపుము= దయతో వినుము; పాండురాజు సుతులన్= పాండురాజుకుమారులైన పాండవులను; పాంచాలపతి, ఒద్దన్= ద్రుపదునిదగ్గర; ఉండకుండన్, చేయుట= ఉండకుండా చేయడం; ఉచితము= తగినపని.

తాత్పర్యం: 'మాటలలో, చేతలలో పాండవులపట్ల ప్రీతి ఉన్నట్లే ఉంటాను. కాని, నా మనస్సును విదురునికి ఎన్నడూ తెలియనీయలేదు. మీ అభిప్రాయమే నా అభిప్రాయం. పాండవులు దైవబలం కలవాళ్ళు. ఏం చేయగలం? ఇక మీకు ఏది ఇష్టమో చెప్పండి' అని ధృతరాష్ట్రుడు అనగా దుర్మార్గపు పనులు చేసే దుర్యోధనుడు ఈ విధంగా అన్నాడు. 'మహారాజా! చిత్తగించండి. పాండవులను పాంచాలరాజు దగ్గర ఉండకుండా చేయటం ఇప్పుడు ఉచితమైన పని.

విశేషం: ఇది ధృతరాష్ట్రునిస్వభావాన్ని వ్యక్తంచేసే సీసం. బహిరంగంగా పాండవప్రీతి, అంతరంగంలో పాండవద్వేషం అతని స్వభావం. అందులో తండ్రికొడుకులు బింబ ప్రతిబింబాలు. ఆలోచన కొడుకుది, ఆచరణ తండ్రిది. సీసంవంటి కఠిన పాషాణ హృదయం ఈ సీసపద్యంలో సూచితం.

వ. అది యె ట్లనినం బుత్త్ర మిత్త్ర బాంధవ బలసంపన్నుం డైన ద్రుపదునొద్దఁ బాండవు లుండువా 'రైన వారలం గృష్ణబలదేవులు యదువృష్ణిభోజాంధకవర్గములతో వచ్చి కూడిన నెవ్వరు సాధింపనోపరు; గావున, నెడసేయక ద్రుపదుండు పాండవుల విడుచునట్లుగా భేదింత; మొండె, వలనుగలవారలం బంచి కౌంతేయమాద్రేయులను దమలో విరక్తు లగునట్లుగాఁ జేయుంత; మొండె నతిలలితప్రమదాజనంబులఁ బ్రత్యేకంబ యేవురకుం బ్రయోగించి ద్రౌపదివలన విరక్తిఁ బుట్టింత; మొండె, నేవురకు నొక్కతియ యా లగుట కష్టం బని ద్రోవదిఁ బాండవులవలన విగత స్నేహఁ గావింత; మొండె, నుపాంశుప్రయోగంబుల భీము వధియించి తక్కినవారల బలహీనులం జేయుదము.22

ప్రతిపదార్థం: అది= ఆ కార్యం; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే; పుత్త్ర, మిత్త్ర, బాంధవ, బల, సంపన్నుండు+ఐన= పుత్రులతో, స్నేహితులతో, బంధువులతో, బలంతో నిండినవాడైన; ద్రుపదు, ఒద్దన్= ద్రుపదుని దగ్గర; పాండవులు= పాండు కుమారులు; ఉండువారు+ఐన= ఉండేవాళ్లైతే; వారలన్= వాళ్ళను; కృష్ణ, బలదేవులు; యదు, వృష్ణి, భోజ+అంధక, వర్గములతో; వచ్చి= చనుదెంచి; కూడినన్= కలసినట్లైతే; ఎవ్వరు= ఎవ్వరు కూడా; సాధింపన్+ఓపరు= జయించలేరు; కావునన్= కాబట్టి;

ఎడచేయక= ఆలస్యం చేయక; ద్రుపదుండు; పాండవులన్= పాండవుల్ని; విడుచునట్లుగా; భేదింతము= చీలిక కలిగింతము; ఒండెన్= కానియెడల; వలను, కలవారలన్= నేర్పుకలవాళ్ళను; పంచి= పంపి; కౌంతేయ, మాద్రేయులను= కుంతికొడుకులను, మాద్రికొడుకులను; తమలో= వారిలో; విరక్తులు+అగునట్లుకాన్= ప్రేమలేనివాళ్ళు అయ్యేటట్లుగా; చేయింతము= చేయిద్దాము; ఒండెన్= కాదేని; అతి, లలిత, ప్రమదా, జనంబులన్= మిక్కిలి అందమైన స్త్రీలను; ఏవురకున్= ఐదుగురకు; ప్రయోగించి= ఉపయోగించి; ద్రౌపదివలనన్= ద్రౌపదియెడ; విరక్తిన్= ఏవగింపు; పుట్టింతము= కలిగిస్తాము; ఒండెన్= కాదేని; ఏవురకున్= ఐదుగురికి; ఒక్కతియు+అ= ఒకతె; ఆలు+అగుట= భార్య కావటం; కష్టంబు+అని= కష్టం అని; ద్రోవదిన్= ద్రౌపదిని; పాండవులవలన= పాండవులపై; విగత, స్నేహన్= తొలగిన ప్రేమకలదానినిగా; కావింతము= చేద్దాం; ఒండెన్= కాదేని; ఉపాంశు, ప్రయోగంబులన్= రహస్యాలైన మంత్రతంత్రాలచేత; భీమున్= భీముణ్ణి, వధియించి= చంపి; తక్కిన, వారలన్= మిగతావాళ్లను, బలహీనులన్, చేయుదము.

తాత్పర్యం: అది ఎట్లాగంటే, పుత్రమిత్రబంధుబలం సమృద్ధిగా కల ద్రుపదుని దగ్గర పాండవులుండి, వాళ్ళకుతోడుగా శ్రీకృష్ణబలరాములు యదువృష్ణి భోజాంధకవర్గాలతో వచ్చి చేరితే, ఇక వాళ్ళను జయించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. అందువలన ఆలస్యం చేయక ద్రుపదుడు పాండవులను వదిలేటట్లుగా చీలిక కలిగిద్దాం. లేకుంటే, నేర్పరులైన వాళ్ళను పంపి కుంతికొడుకులకు, మాద్రికొడుకులకు తమలో తాము ప్రేమ లేని వాళ్ళయ్యేటట్లు చేద్దాం. అట్లా కాకుంటే, మిక్కిలి అందగత్తెలైన ఆడవాళ్ళను పాండవులైదుగురిపై ప్రయోగించి, ద్రౌపదిపట్ల ఏవగింపు పుట్టిద్దాం. కాకుంటే, ఐదుగురికి ఒక్కతె భార్య కావటం కష్టం అని ద్రౌపదిని పాండవుల మీద ప్రేమలేనిది అయ్యేటట్లుగా చేద్దాం. లేకుంటే చాటుమాటు మంత్రతంత్రాలు నడిపి భీముడిని చంపి మిగిలినవాళ్ళను బలహీనులుగా చేద్దాం.

విశేషం: సామదానాలు ఫలించినప్పుడు భేదోపాయాన్ని ప్రయోగించటం రాజనీతి. అవసరాన్నిబట్టి దుర్యోధనుడు ముందుగానే ప్రయోగిస్తున్నాడు. ఇందులో ఆరురకాల భేదోపాయాలను తంత్రిముందు ప్రతిపాదిస్తున్నాడు. అవి 1.బంధువులబలగం కూడి ఒక కూటమిగా ఏర్పడకుండ చూడటం. 2. పాండవులకూ వారిబంధువులలో ముఖ్యుడైన ద్రుపదునికీ నడుమ భేదం కలిగించటం, 3. బంధువుల మధ్య భేదోపాయం పనిచేయకపోతే అన్నదమ్ముల మధ్య సవతితల్లుల బిడ్డలనే భావంతో కౌంతేయులు, మాద్రేయులు అనే భేదం కలిగించటం, 4. ద్రౌపదికంటె అందగత్తెలను పాండవులమీద ప్రయోగించి భర్తలకు భార్యపట్ల మక్కువలేకుండా చేయటం. 5. పంచభర్తృక అయిన ద్రౌపదికి భర్తలపై భేదభావం కలిగించటం. 6. పాండవబల మూలస్తంభంగా భావించబడే భీముడిని వధించి, వాళ్ళను నిర్వీర్యం చేయటం. ఇది దుర్యోధనుని దుర్విదగ్ధత, దుర్మార్గ ప్రవృత్తి, ప్రతిఫలించే ప్రతిపాదనలు. (సంపా.)

ఆ. గాడ్పుచూలి పిఱుఁదుఁ గావంగ నర్జును । నోర్వ నమరులైన నోప రాజి;
నతఁడు నిహతుఁ డగుడు నశ్రమంబునఁ । బార్థు నొక్కరుండ కర్ణుఁ డోర్వ నోపు. 23

ప్రతిపదార్థం: గాడ్పు, చూలి= వాయుతనయుడు - భీముడు; పిఱుఁదున్= వెనుకభాగాన్ని; కావంగన్= కాపాడగా; ఆజిన్= యుద్ధంలో; అర్జునున్= అర్జునుణ్ణి; ఓర్వన్= జయించటానికి; అమరులు+ఐనన్= దేవతలైన; ఓపరు=చాలరు; అతఁడు= ఆ భీముడు; నిహతుఁడు= చంపబడినవాడు; అగుడున్= కాగా; పార్థున్= అర్జునుణ్ణి; కర్ణుఁడు; ఒక్కరుండు+అ= ఒక్కడే; అశ్రమంబునన్= సులభంగా; ఓర్వన్+ఓపున్= జయించగలడు.

తాత్పర్యం: వాయుపుత్రుడైన భీముడు సహాయంగా వెనుక నిలిస్తే - అర్జునుడిని యుద్ధంలో జయించటం ఆ దేవ తలకైనా సాధ్యం కాదు. భీముడిని చంపితే అర్జునుణ్ణి కర్ణు డొక్కడే అనాయాసంగా జయించగలడు.

విశేషం: దుర్యోధనుని అంచనాలో పాండవబలానికి పెట్టనికోట భీమసేనుడు. అతడు అండగా నిలిస్తేనే అర్జునుని పరాక్రమం దేవతలకుకూడా అసాధ్యమౌతుందట. భీముడు లేకపోతే అర్జునుడు కర్ణునికి అసాధ్యుడు కా డని అతనివాదం. వాస్తవానికి అది నిజం కాదు. మత్స్యయంత్రసభలో అర్జుననిచేతిలో ఓడిపోయిన కర్ణుడిని సమర్థించుకొనే కుంటిసాకు ఇది. దుర్విదగ్ధులవాదం ఇట్లాగే ఉంటుంది.

వ. 'ఈ యుపాయంబులలో నెయ్యది యుచితంబును నపగతదోషంబును నదీర్ఘసూత్రంబును నగు నట్టి దానిం జెచ్చెర ననుష్ఠించు నది' యనినఁ గర్ణుం డి ట్లనియె. 24

ప్రతిపదార్థం: ఈ, ఉపాయంబులలోన్= ఈ నాలుగువిధాల ఉపాయాలలో; ఏ+అది, ఉచితంబును= ఏది తగినదీ; అపగత, దోషంబునున్= పోయినదోషం కలదీ - అంటే లోపం లేనిది; అదీర్ఘ, సూత్రంబునున్= ఆలస్యంచేయకుండా చేయదగిందీ; అగున్= అవుతుందో; అట్టి= అటువంటి; దానిన్= దాన్ని; చచ్చెరన్= వేగమే; అనుష్ఠించునది= ఆచరించవలసింది; అనినన్= అని అనగా; కర్ణుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ ఉపాయాలలో ఏది యోగ్యమవుతుందో, ఏది దోషం (లోపం) లేకుండా ఉంటుందో, చాలాకాలం పట్టకుండా స్వల్పకాలంలోనే సత్ఫలితాల నిస్తుందో అటువంటిదానిని వెంటనే ఆచరించవలసింది' అని దుర్యోధను డనగా, కర్ణుడు ఈ విధంగా పలికాడు.

విశేషం: చతుర్విధోపాయాలను ప్రయోగించేటప్పుడు తీసికొనవలసిన జాగ్రత్తలు మూడింటిని ఇందులో సూచించటం జరిగింది.

సీ. ఆర్యవృత్తుండు రాజాన్వయసమ్మతుఁ । డభిమతసంబంధుఁ డయినవాఁడు
గుణవంతు లగుచున్న కొడుకులు గలవాఁడు । పాంచాలుఁ డేల యప్పాండుసుతుల
వినయసంపన్నుల విడుచువాఁడగు?; మఱి । పాండునందను లేకపత్నియంద
కర మనురక్తులు గావునఁ దమలోన । నేల భేదిల్లుదు?; రెన్నఁడయ్యు

ఆ. నొక్కసతికిఁ బతులు పెక్కండ్రు రగు టిది । సతులకోర్కిగాన యతివ కృష్ణ
సుందరాంగి వారియం దేల యపరక్త । యగు మనోముదంబుఁ దగులుఁ గాక. 25

ప్రతిపదార్థం: ఆర్య, వృత్తుండు= మంచినడవడి కలవాడు; రాజ+అన్వయ, సమ్మతుఁడు= రాజవంశాలకు ఇష్టమైనవాడు; అభిమత, సంబంధుఁడు= ఇష్టమైన చుట్టరికం కలవాడు; అయినవాఁడు= అయినటువంటి అతడు; గుణవంతులు+అగుచు+ ఉన్న; కొడుకులు; కలవాడు; పాంచాలుఁడు= ద్రుపదుడు; ఏల= ఎందువల్ల; ఆ+పాండు, సుతులన్= ఆ పాండురాజు కుమారులైన పాండవులను; వినయ, సంపన్నులన్= అణకువ మిక్కిలిగా కలవాళ్ళను; విడుచువాఁడు, అగున్ = వదలేవాడు అవుతాడు; మఱి= ఆపై; పాండు, నందనులు= పాండవులు; ఏక, పత్ని, అందు+అ= ఒక భార్యమీదనే; కరము= మిక్కిలి; అనురక్తులు= ప్రేమకలవాళ్ళు; కావునన్; తమలోనన్; ఏల= ఎందుకు; భేదిల్లుదురు= విరోధం వహిస్తారు; ఎన్నఁడు+అయ్యున్= ఎప్పుడైనా; ఒక్క, సతికిన్= ఒక్క స్త్రీకి; పతులు= భర్తలు; పెక్కండ్రురు= పెక్కుమంది; అగుట= కావటం; ఇది; సతుల, కోర్కి= స్త్రీల కోరిక; కాన; సుందర+అంగి= అందమైనదేహం కలది; అతివ= స్త్రీ, కృష్ణ= ద్రౌపది; వారి, అందు, ఏల= ఆ పాండవులపై ఎందుకు; అపరక్త= ప్రేమలేనిది; అగున్= అవుతుంది; మనస్ ముదంబున్= మనస్సులోని సంతోషంతో; తగులున్, కాక= ప్రేమించునుకదా!, అనగా ఆసక్తితో ఉంటుంది కదా!

తాత్పర్యం: మంచి నడవడికలవాడు, రాజవంశాలకు ఇష్టమైనవాడు; ప్రియమైన బంధుబలంకలవాడు; గుణవంతులైన కొడుకులుకలవాడు అయిన ద్రుపదుడు, వినయసంపన్నులైన ఆ పాండవులను ఎందువలన వదలివేస్తాడు? అంతేకాదు, పాండవులంతా ఒకే భార్యమీద మిక్కిలిప్రేమకలవాళ్ళు. అందువలన వాళ్ళమధ్య ఎందుకు వైరం ఏర్పడుతుంది? కాగా, ఎప్పుడైనా స్త్రీలు, పెక్కుమందిభర్తలను కోరుకొంటారు. అందువలన అందగత్తె ద్రౌపది పాండవులను మనసారా ప్రేమిస్తుందే కాని తిరస్కరిస్తుందా?

విశేషం: అలంకారం - కావ్యలింగం. దుర్యోధనుడు ప్రతిపాదించిన భేదోపాయాలన్నీ సఫలాలు కావని కర్ణుడు సహేతుకంగా పేర్కొన్నాడు.

వ. మఱి భీమసేనుండు దొల్లి మీచేసిన యుపాంశువధల నేమి యయ్యె? నింకను నట్ల కావున నీ యుపాయప్రయోగంబు లన్నియు నుడిగి యిప్పడ పాండవులయందు విక్రమంబు ప్రయోగించుట కార్యంబు. 26

ప్రతిపదార్థం: మఱి= ఇక; భీమసేనుండు; తొల్లి= ఇంతకుముందు; మీ, చేసిన= మీయొక్క చేసిన - మీరు చేసిన; ఉపాంశు, వధలన్= రహస్య హత్యా ప్రయత్నాలచేత; ఏమి అయ్యెన్= ఏమైనాడు; ఇంకను; అట్లు+అ= ఇకముందుకూడా అంతే; కావునన్; ఈ, ఉపాయ, ప్రయోగంబులు= ఈ ఉపాయాలకు సంబంధించిన; అన్నియున్= అన్నీ; ఉడిగి= మాని; ఇప్పుడు+అ= ఇపుడే; పాండవుల, అందున్= పాండవుల మీద; విక్రమంబు= పరాక్రమం; ప్రయోగించుట; కార్యంబు= చేయదగిన పని.

తాత్పర్యం: అంతే కాదు, ఇదివరకు మీరు చేసిన రహస్యహత్యాప్రయత్నాలతో భీముడు ఏమయ్యాడు? ఇక ముందుకూడా అంతే. అందువలన ఈ ఉపాయాలు మాని ఇప్పుడు పాండవులమీద పరాక్రమం ప్రయోగించటమే మనకర్తవ్యం.

చ. ఘన మగు విక్రమంబునన కాదె జగత్త్రితయంబుఁ బాకశా
సనుఁడు జయించె; భూతలము సర్వము మున్ భరతుండు విక్రమం
బునన జయించె; విక్రమము భూరి యశఃప్రియు లైన రాజనం
దనులకు సర్వసాధనము, ధర్మువు శత్రునిబర్హణంబులన్. 27

ప్రతిపదార్థం: పాకశాసనుఁడు= దేవేంద్రుడు; జగత్+త్రితయంబున్= లోకాలు మూడింటిని; ఘనము+అగు= గొప్పదైన; విక్రమంబునన, కాదె= పరాక్రమంచేతనేకదా; జయించెన్= జయించాడు; భరతుండు; భూతలము, సర్వము= భూమండలాన్నంతా; మున్= మునుపు; విక్రమంబునన= పరాక్రమంచేతనే; జయించెన్= జయించాడు; భూరి, యశః ప్రియులు+ఐన= గొప్ప కీర్తి మీద ఇష్టంకలవాళ్ళు అయిన; రాజనందనులకున్= రాజకుమారులకు; విక్రమము= పరాక్రమమే; సర్వసాధనము= అన్నింటిని సాధించేది; శత్రు, నిబర్హణంబులన్= శత్రువధలు చేయటంలో; ధర్మువు= ధర్మం.

తాత్పర్యం: దేవేంద్రుడు ముల్లోకాలను గొప్ప పరాక్రమం చేతనే కదా జయించాడు. భరతుడు భూమండలాన్నంతా పూర్వం జయించింది పరాక్రమంచేతనే కదా! గొప్పకీర్తిని కోరుకొనే రాజకుమారులకు పరాక్రమమే సర్వసాధనం; శత్రువధలలో ధర్మం.

విశేషం: అలంకారం - అర్థాంతరన్యాసం. పాకశాసనుడు = వృత్రాసురుని సోదరుడైన పాకాసురుడిని చంపినవాడు - దేవేంద్రుడు. కర్ణుడు వీరుడు. దుర్యోధనధృతరాష్ట్రులవలె కపటికాడు, సామదానభేదోపాయాలు విఫలమైన తరువాత దండోపాయం ప్రయోగించాలి - రాజనీతిప్రకారం. దుర్యోధనుడు ప్రయోగించదలచుకొన్న భేదోపాయం ఫలవంతం కాదని కర్ణుడు నిరూపించి ప్రతాపప్రదర్శకమైన యుద్ధమే (దండోపాయం) శరణ్యమని పేర్కొన్నాడు. యుద్ధమే వీరధర్మమని ప్రతిపాదించాడు.

వ. 'కావునఁ జతురంగ బల సాధనసన్నద్ధుల మయి యుద్ధంబునం బాంచాలు భంజించి పాండవుల నొండుగడ నుండనీక తోడ్కొనితెత్త' మనినఁ గర్ణుపలుకు లాకర్ణించి ధృతరాష్ట్రుం 'డిది యకార్యం బగు; నయినను మతిమంతులతో విచారించి చేయుద మని భీష్మద్రోణవిదురశల్యకృపాశ్వత్థామసోమదత్తాదులం బిలువంబంచి యంతయు నెఱింగించిన భీష్ముండు దుర్యోధనుం జూచి యి ట్లనియె. 28

ప్రతిపదార్థం: కావునన్; చతురంగ, సాధన, సన్నద్ధులము+అయి= రథ గజ తురగ పదాతి బలాలతో, యుద్ధపరికరాలతో సిద్ధమై; యుద్ధంబునన్= యుద్ధంలో; పాంచాలున్= ద్రుపదుని; భంజించి= ఓడించి; పాండవులన్; ఒండు, కడన్= మరొకచోట; ఉండనీక= ఉండనీయకుండా; తోడ్కొని తెత్తము = తీసికొనివద్దాం; అనినన్= అని అనగా; కర్ణు, పలుకులు= కర్ణుని మాటలు; ఆకర్ణించి= విని; ధృతరాష్ట్రుండు; ఇది, అకార్యంబు+అగున్= చేయతగని పని అవుతుంది; అయినను; మతిమంతులతోన్= బుద్ధిబలం కలవారితో; విచారించి= ఆలోచించి; చేయుదము=చేద్దాం; అని= అని చెప్పి; భీష్మ, ద్రోణ, విదుర, శల్య, కృప+అశ్వత్థామ, సోమదత్త+ఆదులన్= భీష్ముడు; ద్రోణుడు మొదలైన వారిని; పిలువన్+పంచి= పిలిపించి; అంతయున్= అంతా; ఎఱింగించినన్= తెలియపరచగా; భీష్ముండు; దుర్యోధనున్; చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అందువలన చతురంగబలాలతో, యుద్ధపరికరాలతో సిద్ధమై వెళ్ళి, యుద్ధంలో ద్రుపదుడిని ఓడించి, పాండవులను వేరొకచోట ఉండనీయక వెంటతీసికొని వద్దాం' అని కర్ణుడు అనగా - అతనిమాటలు విని ధృతరాష్ట్రుడు, 'ఇది చేయ తగని పని, అయినా బుద్ధిబలం గలవాళ్ళతో ఆలోచించి చేద్దాం' అని భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైనవాళ్ళను పిలిపించి జరిగినదంతా చెప్పాడు. అప్పుడు భీష్ముడు దుర్యోధనుడిని చూచి ఇట్లా అన్నాడు.

విశేషం: మహాభారతంలో మహావీరుడు కర్ణుడు చేసిన యుద్ధప్రతిపాదనలలో ఇదొకటి. కర్ణుడు చేసే యుద్ధప్రతిపాదనలను దుర్యోధనుడు అంగీకరిస్తాడు. అందుకు ప్రధానకారణం - పాండవులను పరిమార్చాలన్న ద్వేషం. కాని కర్ణుని యుద్ధ ప్రతిపాదనలకు ప్రధానకారణం పార్థుడిని యుద్ధంలో ఓడించి, అతడిని మించిన వీరుడని కీర్తి గడించాలనే ఆశయం.

ధృతరాష్ట్రుడు కర్ణదుర్యోధనుల ప్రతిపాదనలు విన్నాడు. దుర్యోధనునిది కుటిలభేదోపాయప్రతిపాదన. కర్ణునిది వీరోచితయుద్ధ ప్రతిపాదన. అయితే దుర్యోధనుని ప్రతిపాదన కర్ణుడే ఖండించాడు. ఇబ్బంది లేదు. ఇక మిగిలింది కర్ణుని యుద్ధ ప్రతిపాదన. పుత్రమమకారపీడితుడు, లోభగుణపూరితుడు అయిన ధృతరాష్ట్రునికి నొసటి కళ్ళు లేవుగాని - కడుపు నిండా కళ్ళే. ఆ వృద్ధరాజు లోతైన ఆలోచన కల వ్యక్తి. అందుకే యుద్ధ ప్రతిపాదన వినగానే ఇదేమి దుర్బుద్ధి అని కొడుకును, కర్ణుడిని గట్టిగా మందలించలేదు; ప్రతిపాదనను తత్క్షణమే పూర్తిగా తిరస్కరించనూలేదు. 'మతిమంతులతో విచారించి చేయుదము' అన్నాడు. భీష్మద్రోణవిదురాదులను పిలిపించాడు. యుద్ధ ప్రతిపాదన కార్యరూపం దాల్చి, సఫలం కావాలంటే భీష్మద్రోణ విదురాదుల సహకారం కావాలి. భీష్మ ద్రోణులకు ద్రుపదుడు ఇష్టుడు కాదు. అందుకు ఎవరి కారణం వారికి ఉన్నది. కాబట్టి భీష్మ ద్రోణులు అంగీకరిస్తే యుద్ధ ప్రతిపాదన బాగా సఫలమౌతుంది. కొడుకులకు గొప్పగా లాభిస్తుంది. లేకుంటే ఆ పెద్దలే కర్ణదుర్యోధనులకు బుద్ధి చెపుతారు. తాను అప్రియంగా మాట్లాడవలసిన అవసరం తప్పుతుంది. ఆ దుడుకుయువకుల అసంతృప్తిని, ఆగ్రహాన్ని ఆ పెద్దలే పంచుకొంటారు.

మత్తకోకిల.

ధీరు లౌ ధృతరాష్ట్రపాండు లతిప్రశస్తగుణుల్ ప్రసి
ద్ధోరుకీర్తులు; నాకు నిద్దఱు నొక్కరూప; తలంపఁగా
వీరు వా రను నట్టిబుద్ధివిభేద మెన్నఁడు లేదు గాం
ధారిపుత్త్రశతంబునందుఁ బృథాతనూజులయందునున్. 29

ప్రతిపదార్థం: ధీరులు+ఔ= ధైర్యవంతులైన; ధృతరాష్ట్ర, పాండులు= ధృతరాష్ట్రుడు,పాండురాజు; అతి, ప్రశస్త, గుణుల్= మిక్కిలి శ్రేష్ఠములైన గుణాలు కలవారు; ప్రసిద్ధ+ఉరు, కీర్తులు= ప్రసిద్ధమైన గొప్ప కీర్తి కలవారు; ఇద్దఱున్; నాకున్; ఒక్కరూపు+అ= ఒక్కవిధమే; గాంధారి, పుత్త్ర, శతంబు, అందున్= గాంధారియొక్క కొడుకులు నూరుగురిలో; పృథా, తనూజుల, అందునున్= కుంతీదేవికొడుకులలో; వీరు, వారు, అనునట్టి; బుద్ధి, విభేదము= బుద్ధిలో భేదభావం; ఎన్నఁడు, లేదు= ఏనాడూ లేదు.

తాత్పర్యం: ధైర్యవంతులు, మిక్కిలి శ్రేష్ఠమైనగుణాలు కలవాళ్ళు, ప్రసిద్ధమైన గొప్పకీర్తి కలవాళ్ళు అయిన ధృతరాష్ట్ర పాండురాజు లిద్దరూ నా కొక్కటే. గాంధారికొడుకులలో, కుంతికొడుకులలో వీళ్ళు, వాళ్ళు అనే భేదభావం నా కెన్నడూ లేదు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు: ఆది.1.153 విశేషం. ఇది భీష్ముని సమత్వదృష్టిని ప్రకటించటంలో ఒక ప్రత్యేకతను, విశిష్టతను విస్పష్టం చేస్తూ ఉన్నది.

భీష్మద్రోణులు దుర్యోధనునకు బుద్ధి సెప్పుట (సం.1-195-1)

వ. అ ప్పాండవులతోడి విగ్రహంబుసేఁత కెన్నండును నొడంబడనేరఁ; బితృపైతామహం బయిన రాజ్యంబునకు నీయట్లు వారు నర్హులు; గావున వారికి నర్ధరాజ్యం బిచ్చిన నీకును నీ బాంధవులకును లోకంబులకును బ్రియం బగు; నట్లు గానినాఁ డపకీర్తి యగుఁ; గీర్తి నిలుపుటయ కాదె రాజులకు జన్మఫలంబు. 30

ప్రతిపదార్థం: ఆ+పాండవులతోడి; విగ్రహంబు, చేఁతకు= యుద్ధంచేయటానికి; ఎన్నండును= ఎప్పుడుకానీ; ఒడంబడనేరన్= సమ్మతించలేను; పితృ, పైతామహంబు+అయిన= తండ్రితాతలకు సంబంధించిన; రాజ్యంబునకున్; మీ, అట్లు= మీవలె; వారున్= వాళ్లుకూడా; అర్హులు= యోగ్యులు; కావునన్= కాబట్టి; వారలకున్= వాళ్లకు; అర్ధ, రాజ్యంబు= సగం రాజ్యం; ఇచ్చినన్= ఇస్తే; నీకును; నీ, బాంధవులకును; లోకంబులకును; ప్రియంబు= సంతోషం; అగున్= అవుతుంది; అట్లు, కాని నాఁడు= ఆవిధంగా జరుగనినాడు; అపకీర్తి, అగున్; కీర్తి, నిలుపుటయకాదె= కీర్తిని నిల్పుకోవటమేకదా; రాజులకున్, జన్మ, ఫలము= క్షత్రియులకు పుట్టుకతో వచ్చినఫలం.

తాత్పర్యం: ఆ పాండవులతో యుద్ధం చేయటానికి నేను ఎన్నడూ సమ్మతించను. తండ్రితాతలరాజ్యానికి మీవలెనే వాళ్ళుకూడా అర్హులు. కాబట్టి వాళ్ళకు సగంరాజ్యం ఇస్తే నీకూ, నీ చుట్టాలకూ, లోకాలకూ సంతోషం కలుగుతుంది. అట్లా కాకపోతే అపకీర్తి కలుగుతుంది. కీర్తి నిలపటమే రాజులకు జన్మఫలం.

ఆ. కీర్తి లేనివానికిని జీవనంబు ని । రర్థకంబ చూవె! యవనిమీఁద
నిత్య మయిన ధనము నిర్మల కీర్తియ; । యట్టి కీర్తి వడయు టశ్రమంబె? 31

ప్రతిపదార్థం: కీర్తిలేనివానికిని; జీవనంబు= బ్రదుకు; నిరర్థకంబు+అ= వ్యర్థమే; చూవె= సుమా; అవనిమీఁదన్= భూమిమీద; నిత్యము+అయిన= శాశ్వతమైన; ధనము; నిర్మల, కీర్తి+అ=స్వచ్ఛమైన కీర్తి మాత్రమే; అట్టి; కీర్తి, పడయుట= కీర్తిని పొందుట; అశ్రమంబె= సులభమా?

తాత్పర్యం: కీర్తి లేనివానిబ్రతుకు వ్యర్థమే. భూమిమీద శాశ్వతమైన ధనం స్వచ్ఛమైన కీర్తే. అట్లాంటి కీర్తిని పొందటం సులభమా?

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తులలో కీర్తినిగూర్చిన సూక్తి ఇది.

క. ఇలఁ గీర్తి యెంత కాలము । గలిగి ప్రవర్తిల్లె నంతకాలంబును ని
త్యుల కారె కీర్తి గల పు । ణ్యులు; కీర్తివిహీనుఁ డెందునుం బూజ్యుండే. **32**

ప్రతిపదార్థం: ఇలను= భూమిమీద; కీర్తి; ఎంతకాలము, కలిగి= నిలిచి; ప్రవర్తిల్లెన్= ఉంటుందో; అంత, కాలంబును; కీర్తి, కల, పుణ్యులు= కీర్తి గల పుణ్యాత్ములు; నిత్యులు= శాశ్వతంగా ఉండేవాళ్ళు; కారె?; కీర్తి, విహీనుఁడు= కీర్తిలేనివాడు; ఎందునున్= ఎక్కడైనా; పూజ్యుండే= పూజింపతగినవాడా? (కాడని భావం)

తాత్పర్యం: లోకంలో కీర్తి ఎంత కాలం నిలిచి ఉంటుందో, కీర్తిమంతులైన పుణ్యాత్ములు అంత కాలం జీవించి ఉంటారు. కీర్తి లేనివాడు ఎక్కడైనా పూజార్హుడవుతాడా?

వ. 'కీర్తియు నపకీర్తియు జనులకు స్వర్గ నరక నిమిత్తంబులు గావున, నపకీర్తి పరిహరించి, కీర్తిం బ్రతిష్ఠించి, పైతృకం బగు రాజ్యంబు పాండవుల కిచ్చి, వారితోడ బద్ధప్రణయుండవయి కీర్తి నిలుపు' మనిన భీష్మపలుకులకు సంతసిల్లి ద్రోణుండు దుర్యోధనున కి ట్లనియె. **33**

ప్రతిపదార్థం: కీర్తియున్, అపకీర్తియున్; జనులకు= ప్రజలకు; స్వర్గ, నరక, నిమిత్తంబులు= స్వర్గానికి, నరకానికి కారణాలు; కావునన్; అపకీర్తిన్= చెడ్డపేరును; పరిహరించి= వదలి; కీర్తిన్= మంచిపేరును; ప్రతిష్ఠించి= నిలుపుకొని; పైతృకంబు+అగు= తండ్రివలన వచ్చినదైన; రాజ్యంబు= రాజ్యాన్ని; పాండవులకున్+ఇచ్చి; వారితోడన్; బద్ధ, ప్రణయుండవు+అయి= చేయబడిన స్నేహం కలవాడవయి; కీర్తి; నిలుపుము= కీర్తిని నిలుపుకో; అనినన్= అని చెప్పగా; భీష్మ పలుకులకున్= భీష్ముని మాటలకు; సంతసిల్లి; ద్రోణుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కీర్తి మానవులకు స్వర్గకారణం. అపకీర్తి నరకకారణం. అందువలన అపకీర్తి వదలి కీర్తిని నిలుపుకొమ్ము. వంశపారంపర్యంగా వచ్చినరాజ్యం పాండవుల కిచ్చి వాళ్ళతో స్నేహంగా ఉండి కీర్తిని నిలుపుము' అని భీష్ముడు అనగా, ఆయనమాటలకు సంతసిల్లి ద్రోణుడు దుర్యోధనునితో ఇట్లా అన్నాడు.

చ. బహుగుణ ముత్తమోత్తమము పథ్యము ధర్మ్యము సాధుసమ్మతం
బహిత బలప్రమాథివిపులార్థయుతం బగుటన్ భవత్పితా
మహువచనంబుఁ జేకొనుము; మానుగ వారలతోడ నీవు వి
గ్రహ మొనరింప నేమిటికిఁ గౌరవసౌబలకర్ణశిక్షలన్. **34**

ప్రతిపదార్థం: బహుగుణము= అనేకవిధాల మంచిదైనది; ఉత్తమ+ఉత్తమము= మహాశ్రేష్ఠమైనది; పథ్యము= మేలు చేసేది; ధర్మ్యము= ధర్మమైనది; సాధు, సమ్మతంబు= సజ్జనులకు ఇష్టమైనది; అహిత, బల, ప్రమాథి= శత్రుబలాన్ని చంపటానికి తగినది; పీడింప (హింసింప) కలది; విపుల+అర్థ, యుతంబు= అధికమైన ప్రయోజనంతో కూడినది; అగుటన్= కావటంచేత; భవత్+పితామహు, వచనంబు= నీ తాత అయిన భీష్మునిమాటను; మానుగన్= చక్కగా; చేకొనుము= గ్రహించుము; నీవు; కౌరవ, సౌబల, కర్ణ, శిక్షలన్= కౌరవులయొక్క, శకునియొక్క, కర్ణునియొక్క ఉపదేశాలతో; వారలతోడన్= పాండవులతో; విగ్రహము= యుద్ధం; ఒనరింపన్=చేయుటం; ఏమిటికిన్= ఎందుకు?

తాత్పర్యం: నీ తాత భీష్మునిమాట అనేకవిధాల మంచిది. మిక్కిలి శ్రేష్ఠమైనది. మేలు చేసేది. ధర్మమైనది. సజ్జనులకు ఇష్టమైనది. శత్రుబలాన్ని అణచేది. అధికమైన లాభం కలది. అందువల్ల ఆయనమాట స్వీకరించుము. కౌరవులు, శకుని, కర్ణుడు చెప్పేమాటలు విని, నీవు పాండవులతో యుద్ధం చేయటం ఎందుకు?

విశేషం: కౌరవ శబ్దాన్ని దుర్యోధనుని గురించిన సంబోధనగా కూడా గ్రహింపవచ్చు. భీష్ముని వాక్యాలు నిర్దేశాత్మకంగా, సూటిగా ఉన్నాయి. ద్రోణునిమాటలు నిషేధాత్మకమార్గంలో నడిచాయి. ఉభయుల స్వభావాలు వాళ్ళమాటలలో ప్రతిఫలించాయి.

మ. విలసద్ధర్మవిశుద్ధవృత్తులు వయోవృద్ధుల్ కుశాగ్రీయబు
ద్ధులు మధ్యస్థులు కార్యనిర్ణయసమర్థుల్ మానమాత్సర్యదూ
రులు నాఁ జాలినవారిపల్కులకు వైరుధ్యంబు గావించున
జ్ఞులు భూనాథున కాప్తులున్ సఖులు నై శోషింతు రత్యంతమున్. 35

ప్రతిపదార్థం: విలసత్+ధర్మ, విశుద్ధ, వృత్తులు= ప్రకాశించేటటువంటి ధర్మంతో పరిశుద్ధమైన నడవడి గలవాళ్ళు; వయోవృద్ధుల్= వయస్సులో పెద్దవాళ్ళు; కుశాగ్రీయ బుద్ధులు= దర్భకొనలవంటి పదునైన బుద్ధికలవాళ్ళు; మధ్యస్థులు= పక్షపాతం లేనివాళ్ళు; కార్య, నిర్ణయ, సమర్థుల్= చేయదగిన పనిని నిర్ణయించటంలో నిపుణులు; మాన మాత్సర్య, దూరులు= కోపానికి, మాత్సర్యానికి దూరమైనవాళ్ళు; నాన్+చాలిన= అని అనదగిన; వారి, పల్కులకు; వైరుధ్యంబు= విరోధాన్ని; కావించు, అజ్ఞులు= చేయు (కల్పించు) అవివేకులు; భూనాథునకున్= రాజునకు; ఆప్తులున్= చుట్టాలూ; సఖులున్+ఐ= స్నేహితులై; అత్యంతమున్= మిక్కిలి; శోషింతురు= పాడయిపోతారు.

తాత్పర్యం: ధార్మికులు, వృద్ధులు, బుద్ధిబలం కలవాళ్ళు, పక్షపాతం లేనివాళ్ళు, చేయదగిన దానిని నిర్ణయించటంలో సమర్థులైనవాళ్ళు, కోపం, మాత్సర్యం లేనివారు అని చెప్పదగినవాళ్ళమాటలను కాదనే అవివేకులు - రాజుకు ఆప్తులు, స్నేహితులై అతడిని పాడుచేయడమేగాక, తామూ పాడయిపోతారు.

విశేషం: మతిమంతుల మాటలను కాదనే అవివేకులను ప్రభువు స్నేహితులుగా గౌరవించరాదని ధ్వని.

చ. తనరుచు దైవయుక్తి మెయి ధర్మువు సత్యముఁ దప్పకున్న య
య్యనఘుల పైతృకం బయిన యంశము మిన్నక వజ్రపాణి కై
నను గొనఁబోలు నయ్య కురునందన! పాండుతనూజు లున్న వా
రని విని వారికిం దగు ప్రియం బొనరింపక యున్కి ధర్మువే? 36

ప్రతిపదార్థం : దైవయుక్తి మెయిన్= దైవయోగంచేత; తనరుచున్= ఒప్పుతూ; ధర్మువు= ధర్మము; సత్యమున్= సత్యము; తప్పక+ఉన్న= విడువకుండా ఉండు; ఆ+అనఘుల= ఆ పాపరహితులైన పాండవులయొక్క; పైతృకంబు+అయిన= తండ్రి దైన; అంశము= భాగం; మిన్నక= ఊరక; కొనన్= తీసికొనటానికి; వజ్రపాణికిన్+ఐనను= దేవేంద్రునికైనా; పోలును+అయ్యె= సాధ్యమగునా? కురునందన= కురువంశకుమారా! ఓ దుర్యోధనా!; పాండు, తనూజులు= పాండవులు; ఉన్న, వారు+అని= సుఖంగా ఉన్నారని; విని= ఆలకించి; వాళ్లకున్; తగు; ప్రియంబు= తగినట్లు సంతోషకరమైన పని; ఒనరింపక= చేయక; ఉనికి= ఉండటం; ధర్మువే= ధర్మమా? (కాదని భావం.)

తాత్పర్యం: దైవయోగంవలన వెలుగుతూ - ధర్మాన్ని, సత్యాన్ని తప్పని పుణ్యాత్ములైన పాండవులతండ్రి భాగాన్ని ఊరకే తీసికొనటం ఆ వజ్రాయుధుడైన దేవేంద్రునికికూడా సాధ్యం కాదు. దుర్యోధనా! పాండవులు సుఖంగా జీవించి ఉన్నారని విని, వాళ్ళకు సంతోషకరమైన పని చేయకుండుట ధర్మమా?

విశేషం: పాండవులకు వచ్చే రాజ్యభాగాన్ని నిష్కారణంగా అపహరించటానికి దేవేంద్రునికైనా సాధ్యం కాదని చెప్పటంలో ద్రోణుని సత్యప్రతిపాదనం ఎంత కనపడుతున్నదో నిర్మొగమాటంకూడా అంతే స్పష్టమౌతున్నది. పాండవులను చంపటానికి యత్నించికూడా, వాళ్ళు బ్రతికారని తెలిసినప్పుడు గౌరవించకుండా ఉండటం అధర్మమని ముఖంమీద గ్రుద్దినట్లు విప్రస్వాభావికంగా చెప్పాడు.

వ. 'వారితో విగ్రహించుట కార్యంబు గాదు; 'కావునఁ బాండవద్రుపదధృష్టద్యుమ్నకుంతీద్రౌపదులకుఁ బ్రియపూర్వకంబున నుచితభూషణాంబరావళులు వేఱు వేఱ యిచ్చిపుచ్చి, పాండవుల నిందులకుఁ దోడ్కొనివచ్చువారుగా దుశ్శాసనవికర్ణ ప్రభృతుల సమకట్టి పంపు' మనిన ద్రోణుపలుకు లవకర్ణించి కర్ణుం డి ట్లనియె. 37

ప్రతిపదార్థం: వారితోన్= ఆ పాండవులతో; విగ్రహించుట= యుద్ధంచేయటం; కార్యంబు= చేయదగిన పని; కాదు; కావునన్, పాండవ= పాండవులకు; ద్రుపద= ద్రుపదునికి; ధృష్టద్యుమ్న= ధృష్టద్యుమ్నునికి; కుంతీ, ద్రౌపదులకున్= కుంతికీ, ద్రౌపదికీ; ప్రియ, పూర్వకంబునన్= స్నేహపూర్వకంగా; ఉచిత, భూషణ+అంబర+ఆవళులు= తగినసొమ్ములయొక్క, వస్త్రాలయొక్క, సమూహాలను; వేఱు, వేఱ= విడివిడిగా; ఇచ్చి, పుచ్చి= ఇచ్చిపంపి; పాండవులన్= పాండవుల్ని; ఇందులకున్= ఇక్కడికి; తోడ్కొనివచ్చువారుగా= పిలుచుకొనివచ్చేవాళ్ళుగా; దుశ్శాసన, వికర్ణ, ప్రభృతులన్= దుశ్శాసనుడు, వికర్ణుడు మొదలైనవాళ్ళని; సమకట్టి= సిద్ధంచేసి; పంపుము= పంపవలసింది; అనినన్= అనగా; ద్రోణు, పలుకులు= ద్రోణుని మాటలు; అవకర్ణించి= పెడ చెవిని పెట్టి; కర్ణుండు= కర్ణుడు, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పాండవులతో యుద్ధం చేయటం తగని పని. అందువలన పాండవులకు, ద్రుపదునికి, ధృష్టద్యుమ్నుడికి, కుంతీదేవికి, ద్రౌపదికి స్నేహపూర్వకంగా తగినసొమ్ములను, వస్త్రాలను వేర్వేర ఇచ్చి పంపి, పాండవులను ఇక్కడికి పిలిచికొని రావటానికి దుశ్శాసనుడు, వికర్ణుడు మొదలైనవాళ్ళని సిద్ధంచేసి పంపుము' అని అనగా ద్రోణునిమాటలు పెడచెవిని పెట్టి కర్ణుడు ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్మద్రోణులు చేసిన తొలిసంధి ప్రయత్నం. భీష్ముడు అర్ధరాజ్యప్రతిపాదననుకూడా మొదటిసారి ఈ ఘట్టంలోనే చేశాడు. భీష్ముడు కీర్తి, అపకీర్తులను నిరూపించి, వ్యంగ్యంగా పాండవ కౌరవ తారతమ్యానుశీలనం చేశాడు. ద్రోణుడు భీష్ముడిని సమర్థించి శకుని కర్ణుల బోధనలను అధిక్షేపించి, పాండవపరాక్రమాన్ని కీర్తించి, వాస్తవాలను వాచ్యం చేశాడు. దుర్యోధనుడు కర్ణాదుల చెప్పుడుమాటలవలన చెడిపోతున్నట్లు ద్రోణుడు చెప్పటంతో కర్ణుడు కోపగించి అధిక్షేపిస్తూ వాదానికి దిగాడు.

తే. ముదుసళులు దమ కిమ్ముగాఁ జదివికొండ్రు । గాక పతులకు హిత మగు కర్జ మేల
యొలసి చెప్పదు? రహితుఁ గలపికొనుట । ధర్మ మని; రిది నయవిరుద్ధంబు గాదె? 38

ప్రతిపదార్థం: ముదుసళులు= ముసలివారు; తమకున్+ఇమ్ముగాన్= తమకు అనుకూలంగా; చదివికొండ్రు, కాక= చెప్పుదురుగాని; పతులకున్= రాజులకు; హితము+అగు= మేలగు; కర్జంబు= కార్యం; ఏల=ఎందుకు; ఒలసి= పూనుకొని; చెప్పుదురు= చెప్పుతారు; అహితులన్= మేలుకోరనివారిని - శత్రువులను; కలపికొనుట= చేర్చుకోవటం; ధర్మమ్ము= ధర్మం; అనిరి= అన్నారు; ఇది, నయ, విరుద్ధంబు= ఇది న్యాయానికి విరుద్ధమైనది; కాదె= అగునుకదా!

తాత్పర్యం: ముసలివాళ్ళు తమకు అనుకూలంగా ఉండేటట్లు చెప్పుతారు కాని రాజులకు మేలుకలిగేటట్లు చెప్పరు. శత్రువులైన పాండవులను చేర్చుకోవటం ధర్మం అన్నారు. ఇది న్యాయవిరుద్ధం కాదా?

విశేషం: భీష్మాదులకు కర్ణాదులకు వాదుపెట్టే ఈ సన్నివేశం ధృతరాష్ట్రుడే (సం) కల్పించాడు. ఇరువర్గాల విభిన్నమతాలకు సంఘర్షణ గమ్యమానమౌతుంది-ఇక్కడ. ధార్తరాష్ట్రులకు పాండవు లహితు లని కర్ణుడు బహిర్గతంగా ప్రకటించాడు. భీష్మాదులు మనసులో ఒకటి పెట్టుకొని పైకి మరొకటి మాట్లాడే అహితులైన అమాత్యులవంటివారని వ్యాఖ్యానించాడు. దుర్యోధనుడిని మెప్పించే ప్రియమే ధర్మమని వాదించి తన మిత్రత్వాన్ని ప్రకటించుకొన్నాడు-కర్ణుడు. నిందకు ప్రతినింద ఈ వాక్య సముదాయం.

వ. 'మంత్రులు దమ తమ బుద్ధిదోషంబులు నెట్లునుం బలుకుదురు. వారల సాధుత్వంబును నసాధుత్వంబును నెఱుంగవలయు; నె ట్లనినఁ దొల్లి నితంతు వను మగధరాజు వికలేంద్రియవర్గుం డయి శ్వాసమాత్రంబ తక్కి రాజ్యతంత్రంబునం దసమర్థుం డై యున్న నాతనిమంత్రి యేకప్రధానుం డయి రాజ్యతంత్రం బెల్లఁ దనవశంబ యగుటంజేసి వాని నవమానించి తదీయరాజ్యవిభవం బెల్లఁ జేకొనియె; వాఁడును విక్రమహీనుం డయి రాజ్యంబు గోల్పడియెం; గావున మంత్రులు హితులపోలె నుండి యహితం బాచరింతురు; మీ యిద్దఱపలుకులు మాకుం జూడ నహితంబు' లనిన నలిగి వానికి ద్రోణుం డి ట్లనియె. 39

ప్రతిపదార్థం: మంత్రులు; తమతమ, బుద్ధి దోషంబులన్= తమ మనస్సులలో ఉండే కల్మషాలను; ఎట్లునున్= ఎట్లయినా; పలుకుదురు=పలుకుతారు; వారల; సాధుత్వంబును= మంచితనాన్ని; అసాధుత్వంబును= చెడుతనాన్ని; ఎఱుంగవలయున్= తెలిసికొనాలి; ఎట్లు= ఏవిధంగా; అనినన్= అంటే; తొల్లి= పూర్వం; నితంతువు+అను= నితంతువు అనే ; మగధరాజు= మగధరాజు; వికల+ఇంద్రియ, వర్గుండు+అయి= చెడిన ఇంద్రియాల సమూహం కలవాడై; శ్వాస, మాత్రంబు= ఊపిరిమాత్రమే; తక్కి= మిగిలి; రాజ్య, తంత్రంబు, అందున్= రాజ్యపరిపాలనలో; అసమర్థుండు+ఐ= నేర్పులేనివాడై; ఉన్నన్= ఉండగా; అతని, మంత్రి= ఆ రాజుయొక్క మంత్రి; ఏక, ప్రధానుండు+అయి= ఒక్కడే ముఖ్యుడై; రాజ్యతంత్రంబు+ఎల్లన్= రాజ్యపాలన అంతా, తన, వశంబు= తన స్వాధీనం; అగుటన్+చేసి=కావటంచేత; వానిన్= ఆ నితంతుమహారాజును; అవమానించి; తదీయ, రాజ్య, విభవంబు+ఎల్లన్= ఆతని రాజ్యసంపదనంతా; చేకొనియెన్= గ్రహించాడు; వాఁడును= ఆ మంత్రికూడా; విక్రమ, హీనుండు+అయి= పరాక్రమం లేని వాడై; రాజ్యంబున్, కోల్పడియెన్; కావునన్= కాబట్టి; మంత్రులు= అమాత్యులు; హితులపోలెన్+ఉండి= మేలుకోరేవారివలె కనిపించి; అహితంబు= కీడు; ఆచరింతురు= చేస్తారు; మీ, ఇద్దఱు+అ= మీ ఇరువురి; పలుకులు= మాటలు; మాకున్; చూడన్= పరికింపగా; అహితంబులు= కీడు చేసేవి; అనినన్= అని పలుకగా; ద్రోణుండు; అలిగి= కోపించి; వానికిన్= కర్ణునికి (కర్ణుడితో); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మంత్రులు తమమనస్సులలో కల్మషం ఉంచుకొని ఏదో విధంగా మాట్లాడతారు. వాళ్ళ మంచితనాన్ని, చెడ్డతనాన్ని తరచి తెలుసుకోవాలి. పూర్వం నితంతువు అనే మగధరాజు శక్తి సన్నగిల్లి, ఇంద్రియాలు చెడి, ఊపిరి మాత్రమే మిగిలి రాజ్యపాలనలో అసమర్థుడై ఉండగా; అతనిమంత్రి తా నొక్కడే ప్రాధాన్యం వహించి రాజ్యపాలన నంతా తన వశం చేసికొని, నితంతుమహారాజును త్రోసిపుచ్చి, అతని రాజ్యసంపదనంతా గ్రహించాడు. ఆ మంత్రికూడా పరాక్రమహీనుడై రాజ్యాన్నే కోల్పోయాడు. ఈ విధంగా మంత్రులు మేలు కోరేవాళ్ళవలెనే ఉండి, కీడు చేస్తారు. మీ ఇద్దరిమాటలూ మాకు కీడు చేసేటటువంటివి' అని అనగా, ద్రోణుడు కోపించి, కర్ణునితో ఇట్లా అన్నాడు.

విశేషం: భీష్మద్రోణులు కర్ణుని యుద్ధ ప్రతిపాదనలు పూర్తిగా తిరస్కరించారు. పైగా భీష్ముడు అర్ధరాజ్యప్రతిపాదన చేశాడు. దాన్ని ద్రోణుడు బలపరిచాడు. విశేషించి - పాండవులను, ద్రుపదధృష్టద్యుమ్నకుంతీద్రౌపదులను విలువైన కానుకలిచ్చి గౌరవించండని అంటున్నాడు. కయ్యానికి కాలుదువ్వే కర్ణునిభావావేశప్రవాహానికి పెద్దబండ అడ్డుపడ్డది. అతనిభావావేశం ప్రక్కకు తిరుగక తప్పదు. అందుకే అతడు తన కనుకూలమైన నీతులవైపు మళ్ళాడు. భీష్మ ద్రోణుల మీద విరుచుకు పడ్డాడు. వాళ్ళ చిత్తశుద్ధిని, విశ్వసనీయతను ధృతరాష్ట్రదుర్యోధనులు శంకించేటట్లు నేర్పుగా నీతులను సమన్వయించాడు.

క. ఉడుగక యే మహితముఁ బలి । కెడు వారము; నీవు హితవు క్రియ గొనఁగాఁ బ
ల్కెడు వాఁడవు; మాకంటెను । గడు హితుఁడవు నీవ కావె కౌరవ్యులకున్. 40

ప్రతిపదార్థం: ఉడుగక= మానక; ఏము= మేము; అహితమున్= మేలుకాని దానిని; పలికెడు వారము= పలికేవాళ్లము; నీవు; హితవు= మేలు; క్రియ, కొనఁగాన్= ఫలించేటట్లు; పల్కెడువాఁడవు= పలికేవాడివి; కౌరవ్యులకున్= కౌరవులకు; మాకంటెను= మాకంటే; నీవ, కావె= నీవే కదా; కడు, హితుఁడవు= మిక్కిలి మేలుకోరేవాడివి.

తాత్పర్యం: మేము చెడు చెప్పేవాళ్ళమా? నీవు హితం చెప్పేవాడివా? కౌరవులకు మా కంటె నీవే హితుడవా?

విశేషం: కాకువుతో చేసే అధిక్షేపోక్తికి ఈ పద్యం చక్కని ఉదాహరణం. కర్ణుని అధిక్షేపానికి ద్రోణునిప్రత్యాఖ్యానం.

క. నీకఱపుల నిక్కురుకుల । మాకులతం బొందు టేమి యాశ్చర్యము? సౌ
మ్యాకృతులు గానివారల । వాకులు శిక్షలు నుపద్రవంబుల కావే! 41

ప్రతిపదార్థం: నీ, కఱపులన్= నీ బోధనంవలన; ఈ+కురుకులము= ఈ కురువంశం; అకులతన్= కలతను; పొందుట; ఏమి; ఆశ్చర్యము; సౌమ్య+ఆకృతులు= శాంతమైన ఆకారం కలవాళ్ళు; కాని, వారల, వాకులు, శిక్షలున్= కానట్టివారల యొక్క మాటలు, ఉపదేశాలు; ఉపద్రవంబులు+అ, కావే, = హానికరాలే కదా!

తాత్పర్యం: నీ ఉపదేశాలవల్ల ఈ కురుకులం కలత పొందటం ఆశ్చర్యం కాదు. శాంతమైన ఆకారం లేనివాళ్ళ మాటలు, ఉపదేశాలు కీడునే కలిగిస్తాయి కదా!

విశేషం: అలంకారం: అర్థాంతరన్యాసం.

వ. అనుచున్న సమయంబున నయ్యిద్దఱ వారించి విదురుండు ధృతరాష్ట్రున కి ట్లనియె. 42

ప్రతిపదార్థం: అనుచున్+ఉన్న= అని అంటూ ఉండే; సమయంబునన్= సమయంలో; ఆ+ఇద్దఱన్= ఆ ద్రోణకర్ణులను; వారించి= ఆపి; విదురుండు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని అంటూ ఉన్నసమయంలో ఆ ద్రోణకర్ణుల నిద్దరినీ ఆపి, విదురుడు ధృతరాష్ట్రునితో ఈ విధంగా అన్నాడు.

సీ. ధర్మార్థవిత్తముల్ తథ్యవాదులు వయో । వృద్ధులు మధ్యస్థవిమలమతులు
ద్రోణగాంగేయులు దురితవిదూరులు । ని న్నెద్దిగఱపిరి నెమ్మితోడ
దానిన చేయుట ధర్మువు; వారల । కంటె హితుల్ నీకుఁ గలరె యొరులు;
దుర్యోధనుండును దుశ్శాసనుండును । గర్ణుండు శకునియుఁ గరము బాలు;

ఆ. రెఱుఁగ రిదియు ధర్మ విది యధర్మం బని; । యట్టివారిపలుకు లాదరించి
వినక పాండుసుతుల వేగ రావించి వా । రలకుఁ బ్రీతి నర్ధరాజ్య మిమ్ము. 43

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ, విత్తముల్= ధర్మమును, అర్థమును తెలిసినవాళ్ళలో శ్రేష్ఠులు, తథ్య, వాదులు= నిజం చెప్పేవాళ్ళు; వయోవృద్ధులు= వయస్సులో పెద్దవారు; మధ్యస్థ, విమల, మతులు= పక్షపాతం లేని నిర్మలమైన బుద్ధికలవాళ్ళు; దురిత, విదూరులు= పాపానికి దూరమైనవాళ్ళు; ద్రోణ, గాంగేయులు= ద్రోణభీష్ములు; నిన్నున్; నెమ్మితోడన్= ప్రేమతో; ఎద్ది; కఱపిరి= బోధించారో; దానిన్+అ= దానినే; చేయుట; ధర్మువు= ధర్మం; వారలకంటెన్= వాళ్లకన్న; హితుల్= మేలుకోరేవాళ్ళు; నీకున్= నీకు; ఒరులు= ఇతరులు; కలరె= కలరా?; దుర్యోధనుండును; దుశ్శాసనుండును; కర్ణుండు, శకునియున్; కరము= మిక్కిలి; బాలురు= అజ్ఞానులు; ఇదియు, ధర్మువు= ఇది ధర్మం; ఇది, అధర్మంబు= ఇది ధర్మము కాదు; అని, ఎఱుఁగరు= అని తెలియరు; అట్టివారి, పలుకులు= అటువంటివాళ్లమాటలు; ఆదరించి, వినక= పాటించి వినకుండా; పాండుసుతులన్= పాండవుల్ని; రావించి= రప్పించి; ప్రీతిన్= ప్రేమతో;, అర్ధ, రాజ్యము; ఇమ్ము= సగం రాజ్యాన్ని ఇవ్వడంమంచిది.

తాత్పర్యం: ధర్మార్థాలను తెలిసినవాళ్ళలో శ్రేష్ఠులు, సత్యం చెప్పేవాళ్ళు, వయస్సులో పెద్దవాళ్ళు, పక్షపాతం లేని నిర్మలబుద్ధి కలవాళ్ళు, పుణ్యాత్ములు అయిన ద్రోణభీష్ములు నీ కేది ఉపదేశించారో దానిని చేయటమే ధర్మం. ఆ యిద్దరికంటె నీ మేలు కోరేవాళ్ళు ఇంకెవరున్నారు? దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని చాలా అవివేకులు. ఇది ధర్మమనీ, ఇది అధర్మమనీ వాళ్ళకు తెలియదు. అట్లాంటివాళ్ళమాటలు వినక పాండవులను వెంటనే రప్పించి ప్రేమతో వారికి అర్ధరాజ్యాన్ని ఇమ్ము.

విశేషం: ధర్మార్థవిత్తముల్ - అనేసమాసంలో 'అర్థ' శబ్దానికి ప్రయోజనం అనే అర్థాన్ని గ్రహించాలి. ద్రోణ, భీష్ములు ధర్మాన్నే కాక నీకు ఏది ప్రయోజనకరమో అదికూడా తెలిసినవాళ్ళని భావం. విదురుడి వాక్యాలను తర్కబద్ధంగా నిబంధించటం ఇక్కడ గమనింపదగినవిశేషం. పాత్ర ఒక అంశంమీద దీర్ఘసంభాషణం చేసేటప్పుడు నన్నయ తర్కశాస్త్రసంబంధాలైన అంశాలను పొందుపరచటం సహజంగా కనబడుతుంది. ప్రమాణాదిషోడశపదార్థాలు న్యాయశాస్త్రం పరిశీలించేవి. 'ప్రమాణ ప్రమేయ సంశయ ప్రయోజనదృష్టాంతసిద్ధాంతావయవతర్కనిర్ణయవాదజల్పవితండాహేత్వాభాసచ్ఛలజాతినిగ్రహస్థానానాం తత్త్వజ్ఞానాన్నిశ్శ్రేయసాధిగమః' అని న్యాయసూత్రం. ఈ పద్యంలో యథార్థ జ్ఞానాన్ని కలిగించే ద్రోణ గాంగేయుల వాక్యాలు ప్రమాణాలు. కర్ణాదుల వాక్యాలు అప్రమాణాలు. పాండవులను రావించి అర్ధరాజ్యం ఇమ్మనటం యథార్థజ్ఞాన విషయమైన ప్రమేయం.(సంపా.)

మ. తమకుం దార యజేయు లెవ్వరికి దోర్దర్పంబునన్, దానిపై
శమితారాతి బలుండు వారలకుఁ బాంచాల ప్రభుం డిప్డు సు
ట్టము దా నయ్యెఁ; దదాత్మజుండయిన ధృష్టద్యుమ్నుడున్ వారితో
సమవీర్యుం డొడఁగూడె నిష్ట సఖుఁ డై సంబంధబంధంబునన్. **44**

ప్రతిపదార్థం: తమకున్, తార= తమంతట తామే; దోః+దర్పంబునన్= బాహుబలగర్వంతో; ఎవ్వరికిన్= ఎవరికికూడా; అజేయులు= జయింపసాధ్యంకానివాళ్ళు; దానిపైన్= దానికిపైగా, మీదుమిక్కిలి; శమిత+అరాతి, బలుండు= అణగించబడిన శత్రుబలం కలవాడు; పాంచాల, ప్రభుండు= పాంచాలరాజైన ద్రుపదుడు; ఇపుడు= ఇప్పుడు; వారలకున్; తాను= ఆ ద్రుపదుడు; చుట్టము; అయ్యెన్; తత్+ఆత్మజుండు+అయిన= అతని కుమారుడైన; ధృష్టద్యుమ్నుడున్= ధృష్టద్యుమ్నుడు కూడ; వారితోన్= ఆ పాండవులతో; సమ, వీర్యుండు= సమానమైన బలం కలవాడు; సంబంధ, బంధంబునన్= బంధుత్వ మనే కట్టుచేత; ఇష్ట, సఖుఁడు+ఐ= ఆప్తుడైన స్నేహితుడై; ఒడన్++కూడెన్= చేరాడు.

తాత్పర్యం: పాండవులు తమంతట తామే ఎవరికీ జయింప శక్యంకానివాళ్ళు. మీదుమిక్కిలి శత్రువులందరినీ అణచిన మహాబలవంతుడైన పాంచాలరాజు వాళ్ళకు ఇప్పుడు చుట్టం. అతని కుమారుడు ధృష్టద్యుమ్నుడు పాండవులతో సమానమైన పరాక్రమంకలవాడు, బాంధవ్యబంధంవలన ఇష్టమిత్రుడై వాళ్ళతో చేరాడు.

మ. బలదేవాచ్యుతసాత్యకుల్ దమకు నొప్పన్ మిత్రులుం గూర్చు మం
త్రులుఁగా దైవము మానుషంబుఁ గల నిత్యుల్, నీకు దుర్యోధనా
దులకంటెం గడుభక్తు లెంతయు వినీతుల్, వీరు లప్పాండుపు
త్రులు నీపుత్రుల కారె ! వారిఁ దగునే దూరస్థులం జేయఁగన్. **45**

ప్రతిపదార్థం: బలదేవ+అచ్యుత, సాత్యకుల్= బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి; తమకున్= పాండవులకు; కూర్చు= ప్రియమైన; మంత్రులున్+కాన్= మంత్రులుగా; దైవము= దైవబలం; మానుషంబున్= మానవబలం; కల= కలిగిన; నిత్యుల్= నిలుకడవాళ్ళు; నీకున్; దుర్యోధన+ఆదులకంటెన్= దుర్యోధనుడు మొదలైనవాళ్ళకంటె; కడున్= మిక్కిలి; భక్తులు= భక్తికలవాళ్ళు; ఎంతయున్= మిక్కిలి; వినీతులు= వినయం కలవాళ్ళు; వీరులు; ఆ+పాండు, పుత్రులు= ఆ పాండవులు; నీ, పుత్రుల; కారె?; వారిన్= వాళ్లను; దూరస్థులన్= దూరంగా ఉన్నవాళ్ళుగా; చేయన్+కన్; తగునె= చేయటం న్యాయమౌతుందా?

తాత్పర్యం: బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి పాండవులకు మిత్రులు, ప్రియమంత్రులు. ఆ విధంగా దైవబలం మానవబలం కూడి, నిలుకడ కలిగి, నీ పట్ల దుర్యోధనాదులకంటె భక్తి వినయాలు కల పాండవవీరులు నీకు పుత్రులు కారా? వాళ్ళని దూరం చేయటం తగునా?

విశేషం: "పాండుపుత్రులు నీ పుత్రుల కారె? వారిఁ దగునే దూరస్థులన్ జేయగన్" అని ధృతరాష్ట్రుని హృదయంలో పాండవులపట్ల ఉన్న అనుమానాలను తొలగించి 'సంశయము'ను తొలగించ యత్నించాడు-విదురుడు. సంశయనివారణమనే ఈ అంశం 44, 45 పద్యాలలో వ్యాపించి ఉన్నది. అందువలన ఈ రెండింటిని మత్తేభవిక్రీడితాలుగా రచించి ఛందశ్శిల్పాన్నికూడా నన్నయ పాటించాడు. ధార్తరాష్ట్రుల కెంత బలగం ఉందో అంతకంటె మిన్న అయిన బలగం కలిగి, దైవమానుషశక్తులతో

ఒప్పారే పాండవులు ఆదరణీయులని చెప్పి, బలవన్నిరాకరణం భంగపాటుకు దారితీస్తుందని విదురుడు వ్యంగ్యంగా హెచ్చరించాడు. వస్తుస్వభావాన్ని స్ఫుటంగా వ్యక్తంచేసే ఝటిత్యర్థప్రతిపత్తిహేతుత్వం ఉండటంచేత 44, 45 పద్యాలలో అర్థవ్యక్తి అనే గుణం సార్థకంగా పోషింపబడింది. (సంపా.)

ఉ. ఆహవభూమిలోనఁ బరమార్థము పార్థుఁడు వైరివాహినీ
వ్యూహము ప్రచ్చుచోట మఘవుండును వానికి మార్కొనంగ ను
త్సాహముసేయఁ డన్న; లఘుసారు లధీర లసాహసుల్ నిరు
త్సాహులు ద్రోహులై యెదిరి చత్తురొ మందురొ మానవేశ్వరా! 46

ప్రతిపదార్థం: మానవ+ఈశ్వరా!= ధృతరాష్ట్రమహారాజా!; ఆ, భూమిలోనన్= ఆ యుద్ధరంగంలో; పరమ+అర్థము= పరమ ప్రయోజనం కొరకు - అంటే శత్రువుల అంతు తేల్చటంకొరకు; పార్థుఁడు= అర్జునుడు; వైరి, వాహినీ, వ్యూహము= శత్రుసైన్యంయొక్క మొగ్గరాన్ని; ప్రచ్చుచోటన్= చీల్చేచోట; మఘవుండును= దేవేంద్రుడుకూడా; వానికిన్= ఆ అర్జునునికి; మార్కొనంగన్= ఎదుర్కొనటానికి; ఉత్సాహము, చేయఁడు= ఉత్సాహంతో పూనుకోడు; అన్న= అని అనగా; లఘు, సారులు= తక్కువ బలం కలవాళ్ళు; అధీరులు= ధైర్యం లేనివాళ్ళు; అసాహసుల్= తెగింపులేనివాళ్ళు; నిరుత్సాహులు= ఉత్సాహంలేనివాళ్ళు; ద్రోహులు+ఐ= కీడు చేసే తలంపు కలవాళ్ళయి; ఎదిరి= ఎదిరించి; చత్తురొ= చస్తారో; మందురొ - (మనుదురా)= బతుకుతారో?

తాత్పర్యం: ఓ ధృతరాష్ట్రమహారాజా! యుద్ధభూమిలో శత్రువీరుల అంతు తేల్చటానికి పార్థుడు శత్రుసేనా వ్యూహాన్ని చీల్చేచోట దేవేంద్రుడుకూడా అతడిని ఎదుర్కోటానికి పూనుకోలేడు. ఇక పెద్దబలం, ధైర్యం, సాహసం, ఉత్సాహం లేనివాళ్ళు ద్రోహబుద్ధితో ఎదుర్కొని చస్తారో, బ్రతుకుతారో నీవే ఆలోచించుకొమ్ము.

విశేషం: విదురుడు పాండవులను పిలిచి వాళ్ళకు అర్ధరాజ్యమిచ్చి కుమారుల నడుమ శాంతిసౌఖ్యాలు కలిగించటం మంచి దని చెప్పటంతోనే ఆగలేదు. దుర్యోధనుని దుష్టచరిత్రంవలన లోకానికి హాని కలుగుతుంది. అతడు పుట్టిననాటినుండి చెప్తున్న విషయాన్ని జ్ఞాపకం చేసి, ఇప్పటి అతని వర్తనమే జననాశనానికి కారణం కావచ్చునని హెచ్చరించాడు. దానికి దృష్టాంతంగా ఈ పద్యం చెప్పాడు. ప్రతిపాదించదలచుకొన్న విషయాన్ని సమర్థించటానికై ప్రసిద్ధమైన దృష్టాంతం చూపించటం న్యాయ ప్రయోగ విషయం. అర్జునుని పరాక్రమాన్ని ఎదుర్కొనటానికి ఇంద్రుడే వెనకాడతాడనీ, ఇక దుర్యోధనాదులు బలహీనులనీ, అధీరులనీ, అసాహసులనీ, నిరుత్సాహులనీ, ద్రోహులనీ, వాళ్ళు అర్జునునెదిరించి చావటం తథ్యమనీ హెచ్చరిస్తాడు. ద్రౌపదీస్వయంవరంలో కర్ణదుర్యోధనాదుల వర్తనాలను గమనిస్తే పై విశేషణాలు వాళ్ళ నుద్దేశించినవే అని తెలుస్తుంది.(సంపా.)

ఉ. ఆయతబాహుఁ డాతనికి నగ్రజుఁ డగ్రణి పోరులందు నా
గాయుతసత్త్వుఁ డుద్ధతయుగాంతకృతాంతనిభుండు భీముఁ డ
వ్వాయుజసవ్యసాచుల నవార్యబలోన్నతిఁ బోలుచున్న మా
ద్రేయు లజేయు లెవ్వరికి దేవసముల్ సమరాంతరంబునన్. 47

ప్రతిపదార్థం: అతనికిన్= ఆ అర్జునునికి; అగ్రజుఁడు= అన్న, భీముఁడు; ఆయత, బాహుఁడు= పొడవైన చేతులు కలవాడు; పోరులందు= యుద్ధాలలో; అగ్రణి= ముందుండేవాడు; నాగ+అయుత, సత్త్వుఁడు= పదివేలఏనుగుల బలమంతటి బలం కలవాడు; ఉద్ధత, యుగ+అంత, కృత+అంత, నిభుండు= విజృంభించిన ప్రళయకాలయమునితో సమానమైనవాడు; ఆ+వాయుజ, సవ్యసాచులన్= ఆ భీమార్జునులను; అవార్య, బల+ఉన్నతిన్= అడ్డగింపరాని బలాతిశయంతో; పోలుచున్+ఉన్న; మాద్రేయులు=

నకులసహదేవులు; దేవ, సముల్= దేవతలతో సమానమైనవాళ్ళు; సమర+అంతరంబునన్= యుద్ధ మధ్యంలో; ఎవ్వరికిన్= ఎవరికీ; అజేయులు= జయించటానికి సాధ్యం కానివాళ్ళు?

తాత్పర్యం: ఆ అర్జునుని అన్న భీముడు మహావీరుడు. యుద్ధరంగంలో ముందుండేవాడు. వెయ్యి ఏనుగుల బలం కలవాడు. విజృంభిస్తే ప్రళయకాలయమునితో సమానమైనవాడు. ఆ భీమార్జునులను బలాధిక్యంలో పోలుతూ, దేవతలతో సమానులైన నకులసహదేవులనుకూడా యుద్ధమధ్యంలో జయించటం ఎవ్వరికీ సాధ్యం కాదు.

విశేషం: అర్జునుడే అంతటివాడు. ఇక అతని అన్న భీముడు 'ఉద్ధతయుగాంతకృతాంతనిభుండు' అని చెప్పటం సార్థకం. కౌరవులనందరినీ మట్టుబెట్టే భీమపరాక్రమాన్ని ఉదాహరిస్తున్నప్పుడు భావికథార్థాలు స్ఫురించి వస్తుధ్వని రాణిస్తుంది. ఇందులోకూడ 'దృష్టాంతం' అనే అంగం పోషింపబడింది. యుద్ధవీరులైన అర్జున భీముల చైతన్యమూర్తులను వీరరసోజ్జ్వలమైన కాంతి అనే గుణంతో 46, 47 పద్యాలను ఉత్పలమాలావృత్తాలలో రచించటం రచనాశిల్పం. దృష్టాంతమనే అంగాన్ని ప్రదర్శిస్తున్న పద్యాలు రెండింటి ఛందస్సామ్యం. గుణసామ్యం సార్థకం. రసపోషకం. (సంపా.)

క. తమ్ములయట్టుల తనకు వ । శమ్మయి ధర్మువును ధృతియు సత్యముఁ గారు
ణ్యమ్మును నొప్పఁగఁ బేర్మి ని । జమ్ముగ మను ధర్మజున కసాధ్యము గలదే! 48

ప్రతిపదార్థం: తమ్ముల, అట్టుల= తమ్ములవలె; తనకున్; ధర్మువునున్= ధర్మమూ; ధృతియున్= ధైర్యమూ; సత్యమున్= సత్యమూ; కారుణ్యమ్మునున్= దయా; వశమ్ము+అయి= స్వాధీనమై; ఒప్పఁగన్= ప్రకాశింపగా; నిజమ్ముగన్= నిజముగా; పేర్మి= గొప్పతనంతో; మను= ఉండేటటువంటి; ధర్మజునకున్; అసాధ్యము= పొందలేనిది; కలదె?= ఉన్నదా?(లేదని భావం.)

తాత్పర్యం: తమ్ములవలె తనకు ధర్మం, ధైర్యం, సత్యం, దయ వశమై గొప్పగా జీవించే ఆ ధర్మరాజుకు అసాధ్యమైనది ఏముంది?

విశేషం: సద్గుణప్రధానుడైన ధర్మరాజువ్యక్తిత్వాన్ని ప్రసాదగుణబంధురంగా చిత్రించటం సార్థకం. (సంపా.)

వ. 'వారల బలపరాక్రమంబు లెల్లవారికి దృష్టపూర్వంబుల; యట్టివారితోడ విగ్రహంబు సేయు దుర్బుద్ధులుం గలరె? నీపుణ్యమ్మున నమ్మహాత్ములు జననీసహితంబు లక్కయింట బ్రతికిరి; నీయందుఁ బురోచనదిగ్ధం బయిన దుర్యశః పంకంబుఁ బాండవానుగ్రహజలంబులం జేసి కడిగికొనుము; దుర్యోధనాపరాధంబున నఖిల మహీప్రజకు నపాయం బగు నని తొల్లియు నీకుం జెప్పితి; నట్లు గాకుండ రక్షింపు' మనిన ధృతరాష్ట్రుండు విదురున కి ట్లనియె. 49

ప్రతిపదార్థం: వారల, బల, పరాక్రమంబులు= వాళ్ల శక్తిశౌర్యాలు; ఎల్లవారికిన్= అందరికీ; దృష్ట, పూర్వంబులు+అ= ముందు చూడబడినవే; అట్టివారితోడన్= అటువంటివాళ్లతో; విగ్రహంబు, చేయు= యుద్ధం చేసే; దుర్బుద్ధులున్= దుష్టబుద్ధులు; కలరె= ఉన్నారా!; నీ, పుణ్యమ్మునన్= నీ పుణ్యంవల్ల; ఆ+మహాత్ములు; జననీసహితంబు= తల్లితోకూడా; లక్కయింటన్= లక్కయింటిలో; బ్రతికిరి; నీ, అందున్= నీలోని; పురోచన, దిగ్ధంబు+అయిన= పురోచనునిచే పూయబడిన; దుర్+యశ, పంకంబున్= అపకీర్తి అనే బురదను; పాండవ+÷అనుగ్రహ, జలంబులన్‌చేసి= పాండవులమీద దయచూపటం అనే నీళ్ళతో; కడిగికొనుము= కడుక్కో; దుర్యోధన+అపరాధంబునన్= దుర్యోధనుడితప్పువలన; అఖిల, మహీ, ప్రజకున్= సమస్తభూమండలం మీదిప్రజలకు; అపాయంబు= హాని; అగును= కలుగుతుంది; అని= అని; తొల్లియు= ఇదివరకు కూడా; నీకున్, చెప్పితిన్; అట్లుకాకుండ; రక్షింపుము; అనినన్; విని; ధృతరాష్ట్రుండు; విదురునకున్= విదురునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'వాళ్ళబలపరాక్రమాలు అందరూ ఇదివరకు చూచినవే. అట్లాంటివాళ్ళతో యుద్ధం చేసే దుర్బుద్ధులున్నారా? నీ పుణ్యంవలన ఆ మహాత్ములు లక్కయింట్లో తల్లితోకూడ బ్రతికారు. పురోచనునివలన నీ కంటిన అపకీర్తి అనే బురదను, పాండవులపట్ల దయ చూపటం అనే నీళ్ళతో కడుక్కో. దుర్యోధనుడు చేసే తప్పువలన లోకంలోని ప్రజలందరికీ అపాయం కలుగుతుందని ఇంతకుముందే నీకు చెప్పాను. అట్లా కాకుండా రక్షించు' అనగా విని ధృతరాష్ట్రుడు విదురునితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: రూపకం. పాండవుల పరాక్రమాలు 'దృష్టపూర్వములే' అని చెప్పి, ప్రసిద్ధమైన దృష్టాంతాలుగా పరిగణించాడు. ఆ తరువాత పాండవులను గౌరవిస్తే లాక్షాగృహదహనంవలన ఏర్పడిన అపకీర్తిని మాపుకొనవచ్చు నని 'ప్రయోజనం' చూపించాడు. ఆపైన దుర్యోధనుడు చేసే పాపంవలన భూప్రజలకు అపాయంరాకుండా చూడుమని సిద్ధాంతీకరించాడు. ఈ విధంగా ఆరువిధాల తర్కశాస్త్ర, న్యాయశాస్త్రాంశాలను ప్రయోగించి, వాదకుశలునిగా విదురుడిని నన్నయ తీర్చిదిద్దాడు.(సంపా.)

క. నీవును భీష్ముఁడు ద్రోణుఁడు । భూ వినుత విశుద్ధ ధర్మబుద్ధుల రగుటన్
మీ వచనమున కవజ్ఞత । గావింపఁగ నంత కార్యగతి మూఢుఁడనే? 50

ప్రతిపదార్థం: నీవును= నీవూ; భీష్ముఁడు; ద్రోణుఁడు; భూ వినుత, విశుద్ధ, ధర్మ, బుద్ధులరు+అగుటన్= భూమిమీద పొగడబడిన పరిశుద్ధమైన ధర్మబుద్ధి కలవాళ్ళు అవటంచేత; మీ, వచనమునకున్= మీమాటకు; అవజ్ఞత= త్రోసిపుచ్చటం; కావింపఁగన్= చేయటానికి; అంత, కార్యగతి, మూఢుఁడనే= అంత, పని వైనం తెలియని అవివేకినా?

తాత్పర్యం: నీవు, భీష్మద్రోణులు లోక ప్రశంసలందుకొన్న ధర్మబుద్ధి కలవాళ్ళు. మీ మాటను త్రోసిపుచ్చుతానా? అంత పనివైనం తెలియని అవివేకినా?

విశేషం: విదురుని తర్కబద్ధమైన వాదం ఫలించింది. వక్రబుద్ధి అయిన ధృతరాష్ట్రుడు సవ్యమైన నిర్ణయం తీసికొనలేక తప్పలేదు.

పాండవులను దోడ్తేర ధృతరాష్ట్రుండు విదురునిఁ బంచుట (సం.1-198-3)

వ. 'మీపంచినవిధంబున నప్పాండవుల కర్ధరాజ్యం బిచ్చెద' నని భీష్మవిదురద్రోణాదు లయిన బాంధవప్రధానులయు దుర్యోధనాదు లయిన పుత్త్రులయు సమక్షంబున నిశ్చయించి, యప్పుడ పాండవులం దోడ్తేర విదురుం బంచిన, నాతండును ధృతరాష్ట్రుశాసనంబున ద్రుపదుపురంబునకుం జని, పుత్త్రభ్రాతృపరివృతుం డై యున్న ద్రుపదుని వాసుదేవసహితులై యున్న పాండవులనుం గాంచి ధృతరాష్ట్రుండు పుత్తెంచిన వివిధరత్నభూషణాదుల వేఱువేఱ యిచ్చి తానును వారిచేతఁ బ్రతిపూజితుం డై కేశవపాండవసమక్షంబున విదురుండు ద్రుపదున కి ట్లనియె. 51

ప్రతిపదార్థం: మీ, పంచిన, విధంబునన్= మీరు ఆజ్ఞాపించినపద్ధతిలో; ఆ+పాండవులకున్; అర్ధ, రాజ్యంబు= సగంరాజ్యం; ఇచ్చెదన్+అని; భీష్మ, విదుర, ద్రోణ+ఆదులు+అయిన= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు మొదలైన; బాంధవ, ప్రధానులయు= బంధువులయొక్క, మంత్రులయొక్క; దుర్యోధన+ఆదులు+అయిన= దుర్యోధనుడు మొదలగువాళ్ళయిన; పుత్త్రులయు= కుమారులయొక్క; సమక్షంబునన్= ఎదుట; నిశ్చయించి; అప్పుడు+అ= వెంటనే; ఆ, పాండవులన్; తోడ్తేరన్= తీసికొనిరావటానికి; విదురున్= విదురుణ్ణి; పంచినన్= పంపగా; ఆతండును= ఆ విదురుడుకూడా; ధృతరాష్ట్ర, శాసనంబునన్= ధృతరాష్ట్రునియొక్క ఆజ్ఞచేత; ద్రుపదు= ద్రుపదుని; పురంబునకున్= నగరానికి; చని= వెళ్ళి; పుత్త్ర, భ్రాతృ, పరివృతుండు+ఐ= కొడుకులచే,

తోబుట్టువులచే చుట్టబడినవాడై; ఉన్న; ద్రుపదునిన్; వాసుదేవ, సహితులు+ఐ= శ్రీకృష్ణునితో కూడినవాళ్ళయి; ఉన్న; పాండవులనున్; కాంచి= చూచి; ధృతరాష్ట్రుండు; పుత్తెంచిన= పంపిన; వివిధ, రత్న, భూషణ+ఆదుల= నానావిధాలైన రత్నాలు, సొమ్ములు మొదలైనవాటిని; వేఱువేఱ, ఇచ్చి; తానును; వారిచేతన్; ప్రతి, పూజితుండు+ఐ= మారుగా పూజించబడినవాడై; కేశవ, పాండవ, సమక్షంబునన్= శ్రీకృష్ణునియొక్క, పాండవులయొక్క ఎదుట; విదురుండు; ద్రుపదునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మీరు ఆజ్ఞాపించిన విధంగా ఆ పాండవులకు సగభాగం రాజ్యం ఇస్తాను' అని భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైన బంధువులు, మంత్రులూ, దుర్యోధనుడు మొదలైన పుత్రులూ ఉన్నప్పుడు అందరి ఎదుట నిర్ణయించి, పాండవులను పిలుచుకొని రావటానికి విదురుడిని పంపాడు. విదురుడు ధృతరాష్ట్రుని ఆజ్ఞప్రకారం ద్రుపదుని పురానికి వెళ్ళి - కొడుకులతో తోబుట్టువులతో కూడిఉన్న ద్రుపదుడిని, శ్రీకృష్ణునితో కూడిఉన్న పాండవులను చూచి, ధృతరాష్ట్రుడు పంపిన వివిధరత్నాలను, ఆభరణాలను ఎవరి కీయవలసినవి వాళ్ళకిచ్చి, తానుకూడా వాళ్ళచేత పూజితుడై శ్రీకృష్ణపాండవులయెదుట ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

మ. అభిజాతుండవు ధర్మశీలుఁడవు నీయం దైన సంబంధ మిం
దభిరమ్యం బనురూప మిష్ట మని సౌహార్దంబునన్ జాహ్నవీ
ప్రభవుండున్ ధృతరాష్ట్రుఁడుం గృపుఁడుఁ గుంభప్రోద్భవుండున్ యశో
విభవాలంకృత! సంతసంబువడి రుర్వీవంద్యు లిష్టంబునన్. 52

ప్రతిపదార్థం: యశస్+విభవ+అలంకృత= కీర్తితో, ఐశ్వర్యంతో అలంకరించబడినవాడా!; అభిజాతుండవు= మంచివంశం కలవాడవు; ధర్మశీలుఁడవు= ధర్మస్వభావం కలవాడవు; నీ, అందు+ఐన, సంబంధము= నీతో ఏర్పడిన బంధుత్వం; ఇందున్= ఇచ్చట; అభిరమ్యంబు= మనోహరం; అనురూపము= తగినది; ఇష్టము= ఇష్టమైనది; అని= అని; సౌహార్దంబునన్= స్నేహభావంతో; జాహ్నవీ, ప్రభవుండున్= గంగాదేవికి జన్మించినవాడు - భీష్ముడు; ధృతరాష్ట్రుండున్; కృపుఁడున్= కృపాచార్యుడు; కుంభ, ప్ర+ఉద్భవుండున్= కుండనుంచి పుట్టినవాడు - ద్రోణుడు కూడా; ఉర్వీ, వంద్యులు= భూమిలో పొగడదగినవాళ్ళు; ఇష్టంబునన్= ప్రీతితో; సంతసంబు, పడిరి=సంతోషాన్ని పొందారు.

తాత్పర్యం: కీర్తి, ఐశ్వర్యం అలంకారాలుగా కల ఓ ద్రుపదమహారాజా! నీవు మంచివంశం కలవాడవని, ధర్మస్వభావం కలవాడవని, నీతో ఏర్పడిన బంధుత్వం మనోహరమైనది, తగినదని, ఇష్టమైనదని - లోకం కొనియాడదగిన భీష్మ, ధృతరాష్ట్ర, కృప, ద్రోణులు స్నేహభావంతో సంతోషించారు.

ఉ. తల్లియుఁ బుత్రులేవురు నుదాత్తమతుల్ దమయొద్ద వాసినం
దల్లడమంది యందఱును దద్దయు దుఃఖితచిత్తు లైరి, నీ
యల్లురఁ బాండుపుత్రులఁ బ్రియంబునఁ జూడఁగఁ గోరుచున్న వా
రెల్ల జనంబులుం గురుకులేశ్వరుఁ డాదిగ బంధువర్గమున్. 53

ప్రతిపదార్థం: ఉదాత్త, మతుల్= గొప్పబుద్ధికలవాళ్ళు; తల్లియున్= తల్లి కుంతీదేవి; పుత్రులు+ఏవురున్= కొడుకులు ఐదుగురుకూడా; తమ, ఒద్ద, పాసినన్= తమదగ్గరనుంచి వెళ్ళగా; తల్లడము+అంది= చలించి; అందఱును= అందరూ; తద్దయున్= మిక్కిలి; దుఃఖిత చిత్తులు= దుఃఖపడిన మనస్సు కలవాళ్ళు; అయిరి= అయ్యారు; కురు, కుల+

ఈశ్వరుఁడు= కురువంశప్రభువైన ధృతరాష్ట్రుడు; ఆదిగ= మొదలుగా; బంధు, వర్గమున్= బంధువుల సమూహం; ఎల్ల, జనంబులున్= ప్రజలంతా, నీ అల్లురన్, పాండు, పుత్త్రులన్= నీ అల్లుళ్లైన పాండుకుమారుల్ని; ప్రియంబునన్= ప్రీతితో; చూడఁగన్= చూడటానికై; కోరుచున్+ఉన్నవారు= ఇష్టపడుతూ ఉన్నారు.

తాత్పర్యం: గొప్ప బుద్ధి కలవాళ్ళయిన కుంతీదేవి, పాండవులు తమ దగ్గరనుండి వెళ్ళటంవలన చలించి అంతా ఎంతో దుఃఖించారు. కురువంశప్రభువైన ధృతరాష్ట్రుడు మొదలుకొని సమస్తబంధువర్గం, సకలప్రజలు నీ అల్లుళ్ళైన పాండవులను ప్రియమార చూడగోరుతున్నారు.

విశేషం: విదురుడు వెళ్ళిన పని అంతసులభమైనది కాదు - లక్కయింటిలో పాండవులను తగులబెట్టిన కౌరవులవద్దకు మళ్ళీ పాండవులను పంపండని అడగటం, వాళ్ళను వెంట పిలుచుకొనిరావటం. దానికి ద్రుపదుని అనుమతి కావాలి. అందువలననే విదురుడు చాలా నేర్పుగా మొదట ద్రుపదుడిని పొగడాడు. పాండవుల అభ్యుదయానికి, మీతో ఏర్పడిన బాంధవ్యానికి హస్తినలో అంతా ఆనందిస్తున్నారనీ, పాండవులను ప్రియమార చూడగోరుతున్నారనీ, వాళ్ళను పంపవలసిన దనీ, ఎంతో చాకచక్యంగా ద్రుపదుడిని అడుగుతున్నాడు.

క. గురుగుణయుతు లగు కొడుకులఁ। గురుకులము వెలుంగ నయిన కోడలిఁ గృష్ణం
బరమపతివ్రత గొంతిని। గరుణను రాఁ బనిచె రాజు గజపురమునకున్. 54

ప్రతిపదార్థం: గురు, గుణ యుతులు+అగు= గొప్పగుణాలతో కూడుకొన్నవాళ్ళయిన; కొడుకులన్; కురు, కులము= కురువంశం; వెలుంగన్+అయిన= ప్రకాశించటానికై ప్రాప్తించిన; కోడలిన్, కృష్ణన్= కోడలగు ద్రౌపదిని; పరమ పతివ్రత= పరమ పతివ్రతయైన; గొంతిని= కుంతీదేవిని; రాజు= ధృతరాష్ట్ర మహారాజు; గజ,. పురమునకున్= హస్తినాపురానికి; కరుణన్= దయతో; రాన్+పనిచెన్= పిలుచుకొని రమ్మని పంపాడు.

తాత్పర్యం: గొప్పగుణాలతో కూడుకొన్న కొడుకులను, కురువంశం వెలిగేటట్లుగా కోడలైన ద్రౌపదిని, పరమపతివ్రత అయిన కుంతిని దయతో ధృతరాష్ట్రమహారాజు హస్తినాపురానికి పిలుచుకొని రమ్మన్నాడు.

వ. 'నీచేత ననుజ్ఞాతు లై కాని వీరలు రా నేరరు గావున వీరలం బుత్తెంచు నది' యనిన విదురునకు ద్రుపదుం డి ట్లనియె. 55

ప్రతిపదార్థం: నీచేతన్; అనుజ్ఞాతులు+ఐ, కాని= అనుమతింపబడినవాళ్ళయితే తప్ప; వీరలు= వీళ్లు; రానేరరు= రాజాలరు; కావునన్; వీరలన్= వీళ్లను; పుత్తెంచునది= పంపునది; అనినన్; విదురునకున్; ద్రుపదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీ అనుమతి లభిస్తేనే పాండవులు రాగలరు. అందుచేత వీళ్ళను మీరు పంపండి' అని అనగా విదురునితో ద్రుపదుడు ఇట్లా అన్నాడు.

చ. రవినిభతేజుఁ డైన ధృతరాష్ట్రుఁడు పంపఁగ నీవు కార్యగౌ
రవమున వచ్చినప్పడ తిరంబుగ వీరికి నిష్టసిద్ధి దా
నవు టది యేమి సందియమె; యంబుజనాభుఁడు నీవుఁ బాండవ
ప్రవరుల కెల్లప్రొద్దును శుభంబ తలంతురుకాదె నెమ్మితోన్. 56

ప్రతిపదార్థం: రవి, నిభ, తేజుఁడు+ఐన= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడైన; ధృతరాష్ట్రుఁడు, పంపఁగన్= పంపగా; నీవు= నీవు; కార్య, గౌరవమునన్= పనియొక్క గొప్పతనంవలన; వచ్చినప్పుడు+అ= ఏతెంచిన ఆ క్షణమే; తిరంబుగన్= స్థిరంగా; వీరికిన్= వీళ్లకు; ఇష్ట, సిద్ధి= ఇష్టమైనది లభించటం; తాన్, అవుట, అది; ఏమి; సందియమె; అంబుజనాభుఁడు= శ్రీకృష్ణుడు; నీవున్; పాండవ, ప్రవరులకున్= శ్రేష్ఠులైన పాండవులకు; ఎల్ల, ప్రొద్దును= ఎల్లప్పుడుకూడా; నెమ్మితోన్= స్నేహంతో; శుభంబు+అ= శుభాన్నే; తలంతురు కాదె= కోరుతారు కదా.

తాత్పర్యం: సూర్యునితో సమానమైన తేజస్సు కల ధృతరాష్ట్రుడు పంపగా, గొప్ప పని బూని నీవు రాగా, పాండవులకు ఇష్టమైనది లభిస్తుందనటంలో సందేహం లేదు. శ్రీకృష్ణుడు, నీవు, ఉత్తములైన పాండవులకు ఎల్లప్పుడూ స్నేహంతో శుభమే కోరుతారుకదా!.

విశేషం: ఇక్కడ ద్రుపదుడుకూడా ఎంతో నేర్పుగా మాట్లాడాడు. పాండవుల యోగక్షేమాలు చూచేబాధ్యతను పరోక్షంగా విదురునికి అప్పగించాడు. శ్రీకృష్ణుడిని కూడా విదురునితో చేర్చాడు.

క. నీవును ద్రోణుండును వసు। దేవతనూజుండు భీష్మధృతరాష్ట్రులు స
ద్భావమున నెద్ది సేయం। గా వగచితి రది హితంబ కా కొం డగునే? 57

ప్రతిపదార్థం: నీవును= నీవూ; ద్రోణుండును= ద్రోణుడూ; వసుదేవ, తనూజుండు= శ్రీకృష్ణుడుకూడా; భీష్మ, ధృతరాష్ట్రులు= భీష్ముడు, ధృతరాష్ట్రుడు; సత్+భావమునన్= మంచిఉద్దేశంతో; ఎద్ది, చేయన్+కాన్= ఏది చేయటానికి; వగచితిరి= తలంచారో; అది= అది; హితంబు+అ, కాక= మేలుచేసేదికాకుండా; ఒండు= మరొకటి; అగునే= ఔతుందా? (కాదని భావం)

తాత్పర్యం: నీవు, ద్రోణుడు, శ్రీకృష్ణుడు, భీష్ముడు, ధృతరాష్ట్రుడు మంచిఉద్దేశంతో ఏది చేయ తలచారో అది పాండవులకు మేలే అవుతుంది కాని మరొకటి కాదు.

వ. అనిన వాసుదేవుం డి ట్లనియె. 58

ప్రతిపదార్థం: అనినన్= అని ద్రుపదుడు అనగా; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

క. ఎవ్వరును నేమి సేయుదు। రివ్విదురుఁడు పాండవులకు హిత మొనరింపన్
నెవ్వగ నొండు దలంపకుఁ డివ్వీరుల కగు నభీష్ట మిది మొదలుంగాన్. 59

ప్రతిపదార్థం: ఈ+విదురుఁడు; పాండవులకున్; హితము= మేలు; ఒనరింపన్= చేస్తుండగా; ఎవ్వరున్, ఏమి; చేయుదురు; నెఱ+వగన్= మిక్కిలి విచారంతో; ఒండు= వేరొకటి; తలంపకుఁడు= ఆలోచింపకండి; ఈ+వీరులకున్= ఈ వీరులైన పాండవులకు; ఇది, మొదలున్+కాన్= ఇది మొదలుకొని; అభీష్టము= కోరుకొన్నది; అగున్= సిద్ధిస్తుంది.

తాత్పర్యం: ఈ విదురుడు పాండవులకు మేలు చేసేవాడై ఉండగా - వాళ్ళను ఎవరు ఏమి చేయగలరు? అతిగా విచారించి వేరొకవిధంగా మీరు ఆలోచించ వద్దు. ఇది మొదలుగా పాండవులకు కోరుకొన్నది సిద్ధిస్తుంది.

విశేషం: ఇక కృష్ణుడు మాత్రం తక్కువవాడా? ఆయన పాండవుల శ్రేయోబాధ్యతను, అభీష్టసిద్ధిని మొత్తం విదురునికి

అప్పుజెప్పాడు. విదురుడు సామాన్యవ్యక్తి కాదు. పరమధార్మికుడు. గొప్పతాత్త్వికుడు. విశేషించి, హస్తినాపురరాజ్యవ్యవహారాలలో ప్రముఖపాత్ర నిర్వహించే మంత్రిసత్తముడు.

వ. అనిన నందఱకు ధర్మనందనుం డి ట్లనియె. 60

ప్రతిపదార్థం: అనినన్= అని శ్రీకృష్ణుడు అనగా; అందఱకున్= అందరితో; ధర్మనందనుండు= ధర్మరాజు; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అనగా అందరితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

క. కురు ముఖ్యులు ధృతరాష్ట్రవి । దుర భీష్ములు గురులు మాకు; ద్రుపదప్రభుఁడున్
గురుఁడు; మురాంతకుఁడు జగ । ద్గురుఁ; డిందఱ మతమునను నగున్ శుభయుక్తుల్. 61

ప్రతిపదార్థం: కురు, ముఖ్యులు= కురువంశశ్రేష్ఠులు; ధృతరాష్ట్ర, విదుర, భీష్ములు= ధృతరాష్ట్రుడు, విదురుడు, భీష్ముడు; మాకున్=మాకు; గురులు= పెద్దలు; ద్రుపదప్రభుఁడున్= ద్రుపదరాజుకూడా; గురుఁడు= పెద్ద; మురాంతకుఁడు= మురుడు అనే రాక్షసుడిని సంహరించిన శ్రీకృష్ణుడు; జగత్+గురుఁడు= లోకానికే పెద్ద; ఇందఱ= వీళ్లందరియొక్క; మతమునను= సమ్మతితో; శుభ, యుక్తుల్= శుభంతోడి కూడికలు; అగున్= అవుతాయి.

తాత్పర్యం: కురువంశశ్రేష్ఠులైన ధృతరాష్ట్ర విదుర భీష్ములు మాకు పెద్దలు. అట్లాగే ద్రుపద మహారాజుకూడా పెద్దలే. ఇక శ్రీకృష్ణుడు లోకానికంతా పెద్ద. వీళ్ళందరిసమ్మతివలన మాకు శుభాలే కలుగుతాయి.

పాండవులు హస్తిపురంబునకు వచ్చుట (సం. 1-199-10)

వ. అని యుధిష్ఠిరుండు వారి యనుమతంబు వడసి, తమ్ములు దానును హస్తిపురంబునకుఁ బోవ నిశ్చయించి, ద్రుపదు వీడ్కొని ప్రయాణోన్ముఖుం డయ్యెః నిట్లు విదురుండు పాండవులఁ బాంచాలిని గుంతీదేవినిం దోడ్కొని వాసుదేవ ధృష్టద్యుమ్ను లపరిమిత సేనాసమన్వితు లై తోడ రాఁగా వచ్చునంత, వారలరాక విని ధృతరాష్ట్రుండు వికర్ణ చిత్రసేన ద్రోణ కృపాచార్యుల నెదురు పుత్తెంచినం దత్సైన్యసమేతులయి మహోత్సవంబుతోఁ బాండవులు గజపురప్రవేశంబు సేయునప్పుడు వారలం జూచి. 62

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; వారి= వాళ్లయొక్క; అనుమతంబు= అనుమతి; పడసి= పొంది; తమ్ములు; తానును= తానూ; హస్తిపురంబునకున్= హస్తినాపురానికి; పోవన్= పోవటానికై; నిశ్చయించి= నిర్ణయించి; ద్రుపదున్, వీడ్కొని= ద్రుపదునిదగ్గర సెలవు తీసికొని; ప్రయాణ+ఉన్ముఖుండు= ప్రయాణంవైపు ఎత్తినముఖం కలవాడు - అంటే ప్రయాణానికి పూనుకొన్నవాడు; అయ్యెన్= అయ్యాడు; ఇట్లు= ఈ విధంగా; విదురుండు= విదురుడు; పాండవులన్= పాండవుల్ని; పాంచాలిని= ద్రౌపదిని; కుంతీదేవినిన్; తోడ్కొని= వెంటతీసుకొని; వాసుదేవ= శ్రీకృష్ణుడు; ధృష్టద్యుమ్నులు= ధృష్టద్యుమ్నుడు; అపరిమిత, సేనా, సమన్వితులు+ఐ= అంతులేని సైన్యంతో కూడినవాళ్ళయి; తోడ రాఁగా= వెంటరాగా; వచ్చునంతన్= వస్తూ ఉండగా; వారల, రాక, విని; ధృతరాష్ట్రుండు; వికర్ణ, చిత్రసేన, ద్రోణ, కృపాచార్యులన్; ఎదురు= ఎదురుగా; పుత్తెంచినన్= పంపగా; తత్+సైన్య, సమేతులు+అయి= ఆ సైన్యంతో కూడినవాళ్ళయి; మహా+ఉత్సవంబుతోన్= గొప్ప ఉత్సాహంతో; పాండవులు; గజపుర, ప్రవేశంబు; చేయునప్పుడు= హస్తినాపురంలో ప్రవేశించేటప్పుడు; వారలన్+చూచి;

తాత్పర్యం: అని ధర్మరాజు తనవాళ్ళ అనుమతి పొంది, తమ్ములు, తాను హస్తినాపురం వెళ్ళాలని నిశ్చయించాడు. ద్రుపదునిదగ్గర సెలవు తీసుకొని ప్రయాణానికి పూనుకొన్నాడు. ఈ విధంగా విదురుడు పాండవులను, ద్రౌపదిని, కుంతిని తోడ్కొని, శ్రీకృష్ణధృష్టద్యుమ్నులు, అంతులేనిసైన్యంతో వెంటరాగా, హస్తినాపురానికి వస్తూండగా, వాళ్ళరాక విని ధృతరాష్ట్రుడు, వికర్ణ, చిత్రసేన, ద్రోణ, కృపాచార్యులను ఎదురు పంపగా, సైన్యసమేతులై పాండవులు మహోత్సవంతో హస్తినాపురం ప్రవేశించేటప్పుడు వాళ్ళను చూచి.

విశేషం: అపారసైన్యం పాండవుల అపాయనివారకం, ఐశ్వర్యప్రదర్శకం. వాసుదేవ ధృష్టద్యుమ్నులు పాండవులకేర్పడిన నిజమైన అండదండలు.

సీ. **పుర జను లెల్లను గర మనురక్తు లై । 'ధర్మస్వరూపుఁ డీ ధర్మతనయుఁ**
దనుజులుఁ దానును జనుదెంచెఁ; బాండుభూ । జనపతి జీవించి మనలఁ గావఁ
బ్రీతితోఁ దా నిప్పు డేతెంచె, మే లయ్యెఁ । నిమ్మహాత్ములకు దైవమ్ముఁ బురుష
కారంబుఁ గలుగంగ ధారుణీరాజ్యంబు । వాయునే యాపదల్ వాయుఁగాక;

ఆ. **దాన హోమ జప విధానముల్ మన కివి । గలవయేని ధరణివలయరాజ్య**
మింద యుండి ధర్మనందనుఁ డొనరించు । చుండుఁ గావుతమ యఖండితముగ. **63**

ప్రతిపదార్థం: పుర, జనులు ఎల్లను; కరము= మిక్కిలి; అనురక్తులు+ఐ= ప్రేమ కలవాళ్ళయి; ధర్మ, స్వరూపుఁడు; ఈ, ధర్మతనయుఁడు; అనుజులున్= తమ్ములుకూడా; తానును= తానూ; చనుదెంచెన్= వచ్చాడు; పాండుభూజనపతి= పాండురాజు; జీవించి= మళ్లీ బ్రతికి; మనలన్= మనల్ని; కావన్= కాపాడటానికి; ప్రీతితోన్= ప్రేమతో; తాన్= తానే; ఇప్పుడు; ఏతెంచెన్= వచ్చాడు; మేలు+అయ్యెన్= శుభం అయింది; ఈ+మహా+ఆత్ములకున్= ఈ మహనీయులకు; దైవమ్మున్= దైవబలం; పురుషకారంబున్= మానవబలం; కలుగన్+కన్= ఉండగా; ధారుణీరాజ్యంబు= భూసామ్రాజ్యం; పాయునే= తొలగునా; ఆపదల్= ఆపదలు; పాయున్+కాక= తొలగిపోవునుకాని; మనకున్= మనకు; దాన, హోమ, జప, విధానముల్= దానాలు, హోమాలు, జపాలు; చేయటాలు; ఇవి కలవు+అ; ఏని= ఇవి ఉన్నట్లయితే; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ఇందు+అ, ఉండి= ఈ హస్తినాపురంలోనే ఉండి; అఖండితముగన్= అవిచ్ఛిన్నంగా; ధరణివలయరాజ్యము= భూమండలపాలనం; ఒనరించుచున్= చేస్తూ; ఉండున్= ఉండటం; కావుతమ= అగుగాక.

తాత్పర్యం: నగరంలోని జనులంతా పాండవులను చూచి మిక్కిలి ప్రేమతో ఇట్లా అనుకొన్నారు. 'ధర్మస్వరూపుడైన ధర్మరాజు తమ్ములతోకూడి ఇక్కడకి వచ్చాడు. పాండురాజే మళ్ళీ బ్రతికి మనలను కాపాడటానికి ప్రీతితో తాను ఇపుడు వచ్చినట్లున్నది. మనకు మేలైనది. మహాత్ములైన ఈ పాండవులకు దైవబలం మానవబలం ఉండటంవలన ఆపదలు తొలగుతాయి కాని రాజ్యం తొలగిపోతుందా? మనం చేసిన దానహోమజపాల పుణ్యమే ఉన్నట్లైతే ఈ ధర్మరాజు ఈ హస్తినాపురిలోనే ఉండి అవిచ్ఛిన్నంగా భూమండలాన్ని పరిపాలిస్తూ ఉండుగాక'.

విశేషం: పాండవులు హస్తినాపురంలో ప్రవేశించేటప్పుడూ, ఏ కారణంవలననైనా హస్తినాపురి వదలిపోవలసివచ్చినపుడూ ప్రజలు వారిపట్ల ప్రదర్శించే ఆదరాభిమానాలను వాచికంగా, ఆంగికంగా, సాత్త్వికంగా ప్రదర్శించినట్లు వర్ణించటం నన్నయరచనలోనే కానవచ్చే సంవాదరచనాశిల్పం. పాండవులే హస్తినాపురానికి పాండురాజు తరువాత పరిపాలించ తగినవాళ్ళని ప్రజాభిప్రాయం. రాజ్యంలో పాండవులకు ఉన్న ప్రజానురాగానికి ఇది పెద్దతార్కాణం. దుర్యోధనాదులకు ఇటువంటి ప్రజాదరణ లేదు.(సంపా.)

వ. అని పౌరులెల్ల దీవించుచుండఁ బౌరవకులనందను లయిన పాండునందనులు వచ్చి, భీష్మధృతరాష్ట్రాది కురువృద్ధులకు మ్రొక్కి, సకలజనానురాగం బొనరించుచు దుర్యోధనాదులతోఁ గలసి యెప్పటియట్ల రాజ్యవిద్యా వినోదంబుల నేను సంవత్సరంబు లుండు నంత, నొక్కనాఁడు ధృతరాష్ట్రుండు భీష్మవిదురద్రోణ దుర్యోధనాదుల సమక్షంబునఁ బాండవుల కి ట్లనియె. 64

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారంగా; పౌరులు+ఎల్లన్= పురప్రజలంతా; దీవించుచున్+ఉండన్= దీవిస్తూ ఉండగా; పౌరవ, కుల, నందనులు+అయిన= పూరువంశకుమారులైన; పాండు, నందనులు= పాండురాజుపుత్రులు; వచ్చి; భీష్మ, ధృతరాష్ట్ర+ఆది= భీష్ముడు, ధృతరాష్ట్రుడు మొదలైన; కురు, వృద్ధులకున్= కురువంశంలోని పెద్దలకు; మ్రొక్కి; సకల, జన+అనురాగంబు= ఎల్ల జనులకు సంతోషం; ఒనరించుచున్= కలిగిస్తూ; దుర్యోధన+ఆదులతోన్= దుర్యోధనుడు మొదలైన వాళ్ళతో; కలిసి= కలిసిమెలసి; ఎప్పటి+అట్లు+అ= ఎప్పటివలెనే; రాజ్య, విద్యా, వినోదంబులన్= రాజ్యానికి, విద్యకు సంబంధించిన వేడుకలతో; ఏను, సంవత్సరంబులు= ఐదు సంవత్సరాలు; ఉండునంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒక్కరోజు; ధృతరాష్ట్రుండు; భీష్మ, విదుర, ద్రోణ, దుర్యోధన+ఆదుల, సమక్షంబునన్= భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, దుర్యోధనుడు మొదలైనవారి ఎదుట; పాండవులకున్, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని హస్తినాపురపౌరులంతా ఆశీర్వదిస్తుండగా పూరువంశరాజకుమారులు పాండవులు వచ్చి కురువంశపు పెద్దలైన భీష్ముడు, ధృతరాష్ట్రుడు మొదలైనవాళ్ళకి నమస్కరించి, సకలజనులకు సంతోషం కలిగిస్తూ దుర్యోధనాదులతో కలిసి, ఎప్పటివలె రాజ్యవిషయాలకు, విద్యావిషయాలకు సంబంధించిన వినోదాలతో ఐదుసంవత్సరాలు గడపగా, ఒకరోజు ధృతరాష్ట్రుడు- భీష్మ, ద్రోణ, దుర్యోధనాదుల సమక్షంలో పాండవులతో ఇట్లా అన్నాడు.

విశేషం: రాజ్యవిద్యావినోదాలు - అనేచోట రాజ్యానికి, విద్యకు సంబంధించిన వినోదాలనే గాక-రాజ్యవిద్యకు సంబంధించిన వినోదాలనికూడా చెప్పుకోవచ్చు. రాజ్యవిద్య అంటే రాజనీతి.

ఆ. సర్వలోక కర్మసాక్షి యీకృష్ణుండు । సాక్షి గాఁగ మీకు సకలవృద్ధ
రాజు లొద్ద నర్ధరాజ్య మిచ్చితిఁ బాండు । రాజవిభవ మెల్ల రమణఁ గొనుఁడు. 65

ప్రతిపదార్థం: సర్వలోక, కర్మసాక్షి= సర్వజనులయొక్క కర్మములకు సాక్షి అయినవాడు; ఈ, కృష్ణుండు; సాక్షి, కాఁగన్= సాక్షిగా; మీకున్, సకల, వృద్ధ, రాజుల+ఒద్దన్= అందరు పెద్దలయొక్క, రాజులయొక్క ఎదుట, అర్ధరాజ్యము= సగరాజ్యం; ఇచ్చితిని; పాండురాజ, విభవము+ఎల్లన్= పాండురాజుయొక్క ఐశ్వర్యాన్నంతా; రమణన్= సంతోషంతో; కొనుఁడు= తీసికొనండి.

తాత్పర్యం: సర్వజనులకర్మసాక్షి అయిన ఈ కృష్ణుడు సాక్షిగా, అందరు పెద్దలఎదుట, రాజులఎదుట మీకు అర్ధరాజ్యం ఇచ్చాను. పాండురాజు ఐశ్వర్యమంతా సంతోషంతో స్వీకరించండి.

విశేషం: ఇదివరకు (అంటే లాక్షాగృహదహనానికి ముందు) ధర్మరాజును యువరాజుగా అభిషేకించింది-అర్ధరాజ్యానికి కాదు. ఇప్పుడు ధర్మరాజును అభిషేకించేదిమాత్రం అర్ధరాజ్యానికి. దానిలో మీ తండ్రి పాండురాజుకు సంబంధించిన సగభాగానికి అనే సూచనకూడా ఉన్నది.

వ. అని ధర్మరాజు నభిషిక్తుం జేసి. 66

ప్రతిపదార్థం: అని= అనిపలికి; ధర్మరాజున్=ధర్మరాజును; అభిషిక్తున్+చేసి= అభిషేకించి.

తాత్పర్యం: అని పలికి ధర్మరాజును రాజుగా అభిషేకించి.

క. 'నెమ్మిఁ జని ఖాండవప్ర । స్థమ్ము నివాసమ్ముఁ జేసి తద్దయు ననురా
గ మ్మెసఁగ నుండుఁ డందుఁ ది । రమ్ముగ' నని పనిచెఁ బాండురాజాత్మజులన్. 67

ప్రతిపదార్థం: నెమ్మిన్= సంతోషంతో; చని= వెళ్ళి; ఖాండవప్రస్థమ్ము= ఖాండవప్రస్థము అను ప్రదేశాన్ని; నివాసమ్మున్+చేసి= నివసించేచోటు చేసికొని; తద్దయున్= మిక్కిలి; అనురాగమ్ము= స్నేహం; ఎసఁగన్= పెంపొంద; అందున్= అక్కడ; తిరమ్ముగన్= స్థిరంగా; ఉండుఁడు= ఉండండి; అని= అని చెప్పి; పాండురాజ+ఆత్మజులన్= పాండురాజుయొక్క కుమారులను; పనిచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'సంతోషంగా వెళ్ళి ఖాండవప్రస్థాన్ని రాజధానిగా చేసికొని స్నేహం పెంపొందేటట్లు అక్కడ స్థిరంగా ఉండండి' అని పాండవులను ఆజ్ఞాపించాడు.

వ. పాండవులును ధృతరాష్ట్రశాసనంబునను, భీష్మాదులయనుమతంబునను వాసుదేవసహితు లయి ఖాండవప్రస్థమ్మునకుం జని రంత. 68

ప్రతిపదార్థం: పాండవులును= పాండవులు కూడా; ధృతరాష్ట్ర, శాసనంబునను= ధృతరాష్ట్రునియొక్క ఆజ్ఞవలన; భీష్మ+ఆదుల, అనుమతంబునను= భీష్ముడు మొదలైన వాళ్ళయొక్క అంగీకారంతో; వాసుదేవ, సహితులు+అయి= శ్రీకృష్ణునితో కూడినవాళ్ళయి; ఖాండవప్రస్థమ్మునకున్= ఖాండవప్రస్థానికి; చనిరి= వెళ్ళారు; అంత= తర్వాత.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని ఆజ్ఞతో, భీష్మాదుల అంగీకారంతో పాండవులు వాసుదేవునితో కలిసి ఖాండవప్రస్థానికి వెళ్ళారు. ఆ తరువాత.

విశ్వకర్మ యింద్రప్రస్థపట్టణమును నిర్మించుట (1-199-28)

క. హరి యింద్రుఁ దలఁచె; నింద్రుఁడు । కర మనురాగమున విశ్వకర్మను బనిచెన్
'సురపురమున కెన యగు పుర । మరుదుగ నిర్మింపు మ్ముర్వి' నని కడుఁ బ్రీతిన్. 69

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; ఇంద్రున్= ఇంద్రుణ్ణి; తలఁచెన్; ఇంద్రుఁడు; కరము= మిక్కిలి; అనురాగమునన్= ప్రేమతో; సుర, పురమునకున్= దేవతలనగరమైన అమరావతికి; ఎన, అగు= సాటి అయిన; పురము= నగరం; ఉర్విన్= భూమిమీద; అరుదుగన్= ఆశ్చర్యకరంగా; నిర్మింపుము; అని; కడున్, ప్రీతిన్= మిక్కిలి ప్రీతితో; విశ్వకర్మను; పనిచెన్= ఆజ్ఞాపించెను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ఇంద్రుడిని తలవగా ఇంద్రుడు 'అమరావతికి దీటైన పట్టణాన్ని భూమిమీద ఆశ్చర్యకరంగా నిర్మించు' మని ప్రియమార దేవశిల్పి విశ్వకర్మను ఆజ్ఞాపించాడు.

విశేషం: ఒకరు తలచారు. మరొకరు ఆజ్ఞాపించారు. పని చకచక జరిగిపోవాలనే వారిఆకాంక్ష. లఘుబహుళమైన కందపద్యపు ఉత్తరార్ధంలోని ద్రుతగతి త్వరత్వరగా పని జరిగేతీరుకు అనుగుణంగా కూర్చబడింది. ఇది అక్షరరమ్యంగా ధ్వనింపచేస్తున్నది. (సంపా.)

సీ. ద్వైపాయనుండును ధౌమ్యుండు నాదిగా । భూసురుల్ సూత్రవిన్యాస మమరఁ
జేసి, శాంతికవిధుల్ సేయంగ, సుప్రశ । స్తం బైన రమ్యదేశంబునందు,
వాసవాదిష్టుఁ డై వసుధకు నేతెంచి । పేర్మితో నవ్విశ్వకర్మ పురము
నిర్మించె, నదియును నిరుపమలీలలఁ । దనరి యింద్రప్రస్థ మనఁగ నింద్రు

ఆ. పురముతోఁ గుబేరుపురముతో వరుణేంద్రు । పురవరంబుతోడ నురగరాజ
పురవిభూతితోడ నురువిలాసంబుల । సరి యనంగ నొప్పె ధరణిమీఁద. 70

ప్రతిపదార్థం: ద్వైపాయనుండును= వ్యాసుడూ; ధౌమ్యుండున్= పాండవపురోహితుడైన ధౌమ్యుడూ; ఆదిగాన్= మొదలుగా; భూసురుల్= బ్రాహ్మణులు, సూత్రవిన్యాసము= దారంతో కొలవటాన్ని; అమరన్= ఒప్పుగా; చేసి= కావించి; శాంతిక, విధుల్+ గ్రహశాంతిని కలిగించేటటువంటికర్మలు; చేయన్+కన్= ఒనరింపగా; సుప్రశస్తంబు+ఐన= మిక్కిలిశ్రేష్ఠమైన; రమ్య, దేశంబు, అందున్= అందమైన ప్రదేశంలో; ఆ+విశ్వకర్మ= దేవశిల్పి అయిన ఆ విశ్వకర్మ; వాసవ+ఆదిష్టుఁడు+ఐ= దేవేంద్రునివలన ఆజ్ఞాపించబడినవాడై; వసుధకున్= భూమికి; ఏతెంచి= వచ్చి; పేర్మితోన్= గొప్పగా; పురము= నగరాన్ని; నిర్మించెన్= నిర్మించాడు; అదియును= ఆ నగరం; నిరుపమ, లీలలన్= సాటిలేని విలాసాలచేత; తనరి= ఒప్పి; ఇంద్రప్రస్థము, అనఁగన్= ఇంద్రప్రస్థం అను పేరుతో; ఇంద్రు, పురముతోన్= ఇంద్రునిరాజధానితో; కుబేరు, పురముతో= కుబేరునిరాజధానితో; వరుణ+ఇంద్రు, పుర, వరంబుతోడన్= వరుణరాజుయొక్క శ్రేష్ఠమైనరాజధానితో; ఉరగ, రాజ, పుర, విభూతితోడన్= నాగరాజుయొక్క రాజధానిసంపదతో; ఉరు, విలాసంబులన్= గొప్పవిలాసాలచేత; సరి, అనంగన్= సాటి అన్నట్లుగా; ధరణి మీఁదన్= భూమిమీద; ఒప్పెన్= వెలిగింది.

తాత్పర్యం: వ్యాసుడు, ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణులు కొలతలు ఏర్పరచి, శాంతికర్మలు చేసిన తరువాత, శ్రేష్ఠమైన, అందమైన ప్రదేశంలో, ఇంద్రుని ఆదేశానుసారం విశ్వకర్మ భూలోకానికి వచ్చి, సాటిలేని విలాసాలతో వెలిగే, ఇంద్రప్రస్థం అనే పేరుగల మహానగరాన్ని నిర్మించాడు. అది ఇంద్ర కుబేర వరుణ నాగరాజుల రాజధానులతో సరిపోలి ప్రకాశించింది.

విశేషం: ఇంద్రునిరాజధాని అమరావతి. కుబేరునిరాజధాని అలకాపట్టణం. వరుణునిరాజధాని శ్రద్ధావతి. నాగరాజురాజధాని భోగవతి.

ఉ. ఇమ్ముగ విశ్వకర్మ రచియించిన కాంచన హర్మ్య తుంగ శృం
గమ్ముల రశ్మిరేఖలు ప్రకాశములై కడుఁ బర్వి, తత్సమీ
పమ్మునఁ బాఱుచున్న ఘన పంక్తులయం దచిరద్యుతి ప్రతా
నమ్ములఁ గ్రేణి సేయుచు ననారతమున్ విలసిల్లుఁ దత్పురిన్. 71

ప్రతిపదార్థం: తత్+పురిన్= ఆ ఇంద్రప్రస్థపురంలో; ఇమ్ముగన్= ఇంపుగా; విశ్వకర్మ= దేవశిల్పి ఆ విశ్వకర్మ; రచియించిన= నిర్మించిన; కాంచన, హర్మ్య, తుంగ, శృంగమ్ముల, రశ్మి, రేఖలు= బంగారుమేడల ఎత్తైన శిఖరాల కాంతివరుసలు; ప్రకాశములు+ఐ= వెలువడినవై; కడున్= మిక్కిలి; పర్వి= వ్యాపించి; తత్+సమీపమ్మునన్= ఆ శిఖరాలదగ్గర; పాఱుచున్+ఉన్న= పోతూఉన్న; ఘన, పంక్తుల, అందున్= మేఘసమూహాల్లో; అచిర, ద్యుతి, ప్రతానమ్ములన్= మెరుపుల సమూహాలను; క్రేణి, చేయుచున్= గేలి చేస్తూ; అనారతమున్= ఎల్లప్పుడు; విలసిల్లున్= ఒప్పి ఉంటాయి.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థనగరంలో విశ్వకర్మ ప్రియమార నిర్మించిన బంగారుమేడల ఎత్తైనశిఖరాల కాంతిరేఖలు విశేషంగా వ్యాపించి, వాటి సమీపాన పోతున్న మేఘాలలోని మెరుపుతీగలను ఎగతాళిచేస్తూ ప్రకాశిస్తున్నాయి.

విశేషం: అలం: అతిశయోక్తి, ఉపమ.

చ. అలఘుతరంబు లై తుహినహారిసుధారుచి నిందురోచిరా
కులశశికాంతవేది పృథుకుంజగళ జ్జలనిర్ఝరంబులన్
విలసిత జాహ్నవీ విమలవీచి విలోల లసత్పతాకలం
బొలుపగుఁ దత్పురీభవనముల్ హిమశైలముఁ బోలి యున్నతిన్. 72

ప్రతిపదార్థం: తుహిన, హారి, సుధారుచిన్= మంచువోలె మనోహరమైన సున్నపుకాంతిచేత; ఇందు, రోచిః+ఆకుల, శశికాంత, వేది, పృథు, కుంజ, గళత్+జల, నిర్ఝరంబులన్= చంద్రుని కిరణాలచేత కలత నొందిన (కరగిన) చంద్రకాంత మణుల తిన్నెలు కల పెద్ద పొదరిండ్లనుండి జాలువారుతున్న నీటిప్రవాహాలచేత; విలసిత, జాహ్నవీ, విమల, వీచి, విలోల, లసత్+పతాకలన్= మెరుస్తున్న గంగానదియొక్క నిర్మలాలైన తరంగాలవలె చలిస్తూ ప్రకాశించే జెండాలచేత; తత్+పురీ, భవనముల్= ఆ పట్టణంలోని మేడలు; అలఘుతరంబులు+ఐ= మిక్కిలి గొప్పవై; ఉన్నతిన్=ఎత్తులో; హిమ, శైలమున్= హిమాలయపర్వతాన్ని; పోలి; పొలుపు+అగున్= ఒప్పి అందంగా ఉన్నాయి.

తాత్పర్యం: మంచువలె మనోహరమై, సున్నపుకాంతిచేత, చంద్రునికిరణాలచేత కరిగిన చంద్రకాంతమణుల అరుగులు గల పెద్దపొందరిండ్ల నుండి జాలువారే నీటిప్రవాహాలచేత, గంగానదీనిర్మలతరంగాల వలె చలిస్తూ ప్రకాశించేజెండాలచేతనూ, ఆ ఇంద్రప్రస్థపురంలోని ఎత్తైన పెద్దమేడలు హిమాలయపర్వతాన్ని పోలి వెలుగుతున్నాయి.

విశేషం: అలం: ఉపమ. ఆ పట్టణంలోని మేడలు ఎంతపెద్దవో, ఎంతఎత్తైనవో ఈ పద్యం ధ్వనింపచేస్తున్నది. కావ్యాలలో కథావసరాన్నిబట్టి అష్టాదశవర్ణనలుంటాయి. వాటిలో పురవర్ణనకు ఒజ్జబంతిగా నన్నయ అలంకారసుందరంగా ఇంద్రప్రస్థపుర వర్ణనం చేశాడు. కావ్యేతిహాసనిర్మాణంలో కావ్యస్ఫృహను వెలార్చే రచనాశిల్పంలో ఇదొక విశేషం. (సంపా.)

చ. వననిధిలోని రత్నములు వాసుకిమూర్ధజరత్నసంఘముల్
గొనఁగ నవశ్యమున్ జనులకున్ సమకూరదు గాన నెప్పుడుం
గొనుఁడు పరార్ధ్యరత్నములు గోరినవానిన యిత్తు మన్తెఱం
గునఁ బచరింతు రంగడులఁ గోమటు లప్పురి నిద్ధరత్నముల్. 73

ప్రతిపదార్థం: ఆ+పురిన్= ఆ పట్టణంలో; కోమటులు; వన, నిధి, లోని, రత్నములు= సముద్రంలో ఉన్నరత్నాలూ; వాసుకి, మూర్ధజ, రత్న, సంఘముల్= వాసుకియొక్క శిరస్సులో పుట్టినరత్నాల సమూహాలూ; కొనఁగన్= కొనటానికి; జనులకున్; అవశ్యమున్= తప్పక; సమకూరదు, కానన్= లభించదు కనుక; పరార్ధ్య, రత్నములు= శ్రేష్ఠములైన రత్నాలను; కోరిన, వానిన్+అ= కోరినవాటినన్నిటిని; ఇత్తుము= ఇస్తాము; ఎప్పుడున్= ఎల్లప్పుడు; కొనుఁడు= కొనండి; అన్+తెఱంగునన్= అనేవిధంగా; అంగడులన్= అంగళ్లలో; ఇద్ధ, రత్నముల్= కాంతి గల రత్నాలను; పచరింతురు= (అంగళ్ళలో అమ్మటానికి) అమర్చిపెడతారు.

తాత్పర్యం: సముద్రంలోని రత్నాలను, వాసుకి శిరస్సుమీది రత్నాలను కొనటం జనులకు సాధ్యం కాదు కాబట్టి, 'మీరు కోరిన శ్రేష్ఠరత్నాలన్నింటినీ మీకు ఇస్తాము, ఎప్పుడైనా కొనండి' అన్నట్లు ఆ పట్టణంలోని కోమట్లు కాంతిమంతాలైనరత్నాలను అంగళ్ళలో అమ్మటానికి అమరుస్తారు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. చాతుర్వర్ణ్యాన్ని ఉదాత్తంగా వర్ణించటం పురవర్ణనంలో ఒక అంశం. అందులో వైశ్యులవర్ణన మిది.

సీ. **వలరాజు సచివుల వడువున బెడఁగగు । కర్కశస్తనములఁ గరమువాఁడి**
చూడ్కుల నతిరాగసురుచిరాధరముల । మదవిలాసాలసమందగతుల
వక్రాలకంబుల వలుఁదపిఱుందుల । దర్పగద్గదభాషితములఁ జేసి
జనులచిత్తములకు సంక్షోభ మొనరించు । కామినీజనములు గలిగి, సకల

తే. **కామభోగములకు సదేకాంతగృహముఁ । బోలి పొలిచియు, ధర్మార్థములకు నిదియ**
యాస్పదంబు నా వర్గత్రయావిరుద్ధు । లైన జనుల కెంతయు నొప్పు నప్పరంబు. 74

ప్రతిపదార్థం: వలరాజు, సచివుల, వడువునన్= మన్మథునిసహాయులవలె; బెడఁగు+అగు= అందమైన; కర్కశ, స్తనములన్= కఠినములైన చన్నులచేతను; కరము, వాఁడి, చూడ్కులన్= మిక్కిలి పదునైన చూపులచేతను; అతి, రాగ, సురుచిర+అధరములన్= మిక్కిలి ఎర్రనైన, మనోహరాలైన పెదవులచేతను; మద, విలాస+అలస, మంద, గతులన్= మదంయొక్క ఒయ్యారంతో, సోమరితనంతో కూడిన మెల్లని నడకలచేతను; వక్ర+అలకంబులన్= వంకరలు తిరిగిన ముంగురుల చేతను; వలుద, పిఱుందులన్= లావైన పిరుదులచేతను; దర్ప, గద్గద; భాషితములన్+చేసి= గర్వంతో తడబడుతున్న మాటలచేతను; జనుల, చిత్తములకున్, ప్రజల మనస్సులకు; సంక్షోభము+ఒనరించు= కలత కలిగించే; కామినీ, జనములు= స్త్రీ జనాలు; కలిగి= ఉండి, వసించి; సకల, కామ, భోగములకున్= అన్ని విధాలైన కామభోగాలు అనుభవించటానికి; సత్+ఏకాంత, గృహమున్= మంచి రహస్యగృహాన్ని; పోలి, పొలిచియున్= ఒప్పారి ఉన్నప్పటికి; ధర్మ+అర్థములకున్= ధర్మానికీ, అర్థానికీ, ఇదియు+అ= ఈ పట్టణమే; ఆస్పదంబు= ఉనికిపట్టు; నాన్= అని అనేటట్లు; వర్గత్రయ+అవిరుద్ధులు+ఐన= ధర్మార్థకామాలు మూడింటికీ విరోధులు కాని - అంటే మూడు పురుషార్థాలలో ఆసక్తి కలవాళ్ళయిన; జనులకున్; ఆ+పురంబు= ఆ ఇంద్రప్రస్థపురం; ఎంతయున్= మిక్కిలి; ఒప్పున్= ప్రకాశిస్తూ ఉన్నది.

తాత్పర్యం: మన్మథుని సహాయంచేసేవాళ్ళవలె - అందమై, కఠినాలైన స్తనాలచేతా, పదునైన చూపులచేతా, ఎర్రనై మనోహరాలైనపెదవులచేతా, మదంయొక్కఒయ్యారంతో మెల్లనైననడకలచేతా, పెద్దపిరుదులచేతా, గర్వంతో తడబడే మాటలచేతా, జనులమనస్సులను కలవరపరిచే స్త్రీలను కలిగి, కామభోగాలన్నిటికీ ఏకాంత మందిరమువలె ఉండి, 'ధర్మార్థాలకు ఇదే స్థానం' అన్నట్లు, ధర్మార్థకామాలు మూడింటిలోనూ ఆసక్తులైనవాళ్ళకు ఆ ఇంద్రప్రస్థపురం ఎంతో తగి ఉన్నది.

విశేషం: అలం: ఉపమ, ఉత్ప్రేక్ష. పురవర్ణనంలో వేశ్యావర్ణనం ఒక అంశం. ధర్మమూర్తి అయిన ధర్మరాజుయొక్క ముఖ్య పట్టణమైన ఇంద్రప్రస్థపురంలో నన్నయ 'కామినీజన' వర్ణనం చేశాడు. కామినీశబ్దానికి వేశ్య అనే అర్థం రూఢిలో ఏర్పడిందేకాని, వస్తుతః అది స్త్రీవాచకమే. ప్రియసంగమంలో మిక్కిలి ఆసక్తిగల ఆడుది అనే అర్థవిశేషం కలది. ఆ పురకామినులు విలాస సంపదచేత మారవికారాలు కలిగించేవాళ్ళయినా, ధర్మార్థకామసాధకులై ఆ పౌరజనుల ధార్మికప్రవృత్తికి విరుద్ధలు కారని వర్ణించి నన్నయ ఔచిత్యాన్ని పాటించాడు. 'కామినీజనములు' అనే సమాసం రుచిరార్థసూక్తి. (సంపా)

క. శరనిధినినాదనిభ మగు । పురఘోషముఁ గీడుపఱిచి పొలుపగుఁ గర మ
ప్పురి బ్రహ్మపురి మహీసుర । వరవేదాధ్యయనరవ మవార్యం బగుచున్. 75

ప్రతిపదార్థం: ఆ+పురి, బ్రహ్మ, పురి= ఆ ఇంద్రప్రస్థపురంలోని బ్రాహ్మణపురంలో; మహీసుర, వర, వేద+అధ్యయన,రవము= బ్రాహ్మణశ్రేష్ఠులయొక్క వేదం చదివే ధ్వని; అవార్యంబు+అగుచున్= అడ్డగింపరానిదై; శరనిధి, నినాద, నిభము+అగు= సముద్రధ్వనితో సమానమైన; పుర, ఘోషమున్= పట్టణ ధ్వనిని; కీడు, పఱిచి= అణచివేసి; కరము= మిక్కిలి; పొలుపు+అగున్= ఒప్పును.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థంలోని బ్రాహ్మణపురంలో బ్రాహ్మణశ్రేష్ఠుల వేదాధ్యాయనధ్వని, ఆపటానికి సాధ్యం కానిదై, సముద్రధ్వనితో సమానమైన ఆ పట్టణధ్వనిని మించి మిక్కుటంగా వినిపిస్తూ ఉంది.

విశేషం: అలం: పర్యాయోక్తం, ఉపమ. పురధ్వనికంటె వేదధ్వని మించిందని చెప్పటంవలన పురజనులలో అందరికంటె బ్రాహ్మణులకు అధిక గౌరవం లభిస్తున్నదని పర్యాయంగా చెప్పినట్లయింది. నిరంతరం యజ్ఞయాగాదులు జరుగుతున్నా యనికూడా చెప్పవచ్చును. వేదాధ్యయనపరులైన బ్రాహ్మణులను వర్ణించటం పురవర్ణనలోని చాతుర్వర్ణ్యవర్ణనలో ఒకటి.

చ. పరిఘుజలంబులం దమలపంకరుహోత్పలకైరవాదిసుం
దరకుసుమంబులున్ ఘనపథంబున నుజ్జ్వలతారకానిరం
తరకుసుమంబులున్ వెలయుఁ దత్పురవప్రము పాదపీఠికా
శిరముల కొప్ప నర్చనలు సేసిన పువ్వుల యవ్విధంబునన్. 76

ప్రతిపదార్థం: పరిఘ, జలంబులందున్= అగడ్తనీళ్ళలో; అమల, పంకరుహ+ఉత్పల, కైరవ+ఆది, సుందర, కుసుమంబులున్= నిర్మలమైన పద్మాలు, నల్లకలువలు, తెల్లకలువలు, మొదలైన అందమైన పూలూ; ఘన, పథంబునన్= ఆకాశంలో; ఉజ్జ్వల, తారకా, నిరంతర, కుసుమంబులున్= బాగాప్రకాశించే నక్షత్రాలనే దట్టమైన పూలూ; తత్+పుర, వప్రము, పాదపీఠికా, శిరములకున్= ఆ పట్టణముయొక్క ప్రాకారపాదపీఠానికి, శిరస్సుకు; ఒప్పన్= ఒప్పునట్లుగా; అర్చనలు= పూజలు; చేసిన= కావించిన; పువ్వుల, ఆ+విధంబునన్= పువ్వులా అన్నట్లు; వెలయున్= ప్రకాశిస్తున్నాయి.

తాత్పర్యం: అగడ్త నీళ్ళల్లో ఉన్న పద్మాలు, నల్లకలువలు, తెల్లకలువలు మొదలైన అందమైన పూలు, ఆకాశంలో బాగా ప్రకాశించే నక్షత్రాలనే దట్టమైన పూలు, ఆ పట్టణంయొక్క ప్రాకారపాదపీఠానికి, శిరస్సుకు పూజచేసిన పువ్వులా అన్నట్లు ప్రకాశిస్తున్నాయి.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష, క్రమం. ఆ పట్టణప్రాకారాలు ఆకాశాన్ని అంటేటంత ఎత్తైనవని ధ్వని. ఎత్తైనకోటను, లోతైన అగడ్తల వైభవాన్ని వర్ణించటం పురవర్ణనాంశంలో ఒకటి.

చ. తమము నడంచుచున్ వెలుఁగుతత్పురగోపురశాతకుంభకుం
భముల విచిత్రసన్మణిగభస్తివితానములన్ విచిత్రవ
ర్ణములగు నాత్మవాహముల నమ్మక పల్మఱుఁ జూచి యన్యవా
హము లని సంశయప్రణిహితాత్ముఁ డగున్ హరిదశ్వుఁ డెప్పుడున్. 77

విశేషం: తమమున్= చీకటిని; అడంచుచున్= అణచివేస్తూ; వెలుఁగు= ప్రకాశిస్తున్న; తత్+పుర, గోపుర, శాతకుంభ, కుంభముల, విచిత్ర, సత్+మణి, గభస్తి వితానములన్= ఆ పుర ద్వార గోపురాలయొక్క బంగారుకలశాల చిత్రవిచిత్రాలైన మంచిమణుల కాంతుల సమూహాలచేత; విచిత్ర, వర్ణములు+అగు= నానావిధాలైన రంగులు కలవైన; ఆత్మవాహములన్= తన గుఱ్ఱాలను; నమ్మక= విశ్వసింపక; పల్మఱున్= అనేక పర్యాయాలు; చూచి; అన్య, వాహములు+అని= ఇతరాలైన గుఱ్ఱాలని; హరిదశ్వుఁడు= పచ్చనిగుఱ్ఱాలు గల సూర్యుడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; సంశయ, ప్రణిహిత+ఆత్ముఁడు= సందేహంలో ఉంచబడిన మనస్సు కలవాడు; అగున్= అవుతూ ఉంటాడు.

తాత్పర్యం: చీకటిని అణచివేస్తూ వెలుగుతున్న ఆ ఇంద్రప్రస్థపురద్వారగోపురాలమీది బంగారుకలశాలకు పొదిగిన చిత్రవిచిత్రాలైన రత్నకాంతులసమూహంవలన తనగుఱ్ఱాలరంగు నానావిధాలుగా మారిపోయి, పసుపుపచ్చగుఱ్ఱాలు కల సూర్యుడు, అనేకపర్యాయాలు తనగుఱ్ఱాలను చూచుకొని, అవి తనగుఱ్ఱాలని నమ్మక, వేరే గుఱ్ఱాలని ఎప్పుడూ సందేహపడుతూంటాడు.

విశేషం: అలం: అతిశయోక్తి, సందేహం. ఆ పట్టణద్వారగోపురాలు అంత ఎత్తు ఉన్నవని ధ్వని.

చ. సరళ తమాల తాల హరిచందన చంపక నారికేళ కే
సర కదలీ లవంగ పనస క్రముకార్జున కేతకీలతా
గరుఘనసార సాల సహకార మహీరుహరాజ రాజి సుం
దర నవనందనావళులఁ దత్పురబాహ్యము లొప్పెఁ జూడఁగన్. **78**

ప్రతిపదార్థం: తత్+పుర, బాహ్యములు= ఆ పట్టణంయొక్క వెలుపలి ప్రదేశాలు; చూడఁగన్= చూడగా; సరళ, తమాల, తాల, హరిచందన, చంపక, నారికేళ, కదలీ, లవంగ, పనస, క్రముక+అర్జున, కేతకీలతా+అగరు, ఘనసార, సాల, సహకార, మహీరుహ, రాజ, రాజి, సుందర, నవ, నందన+ఆవళులన్= తెల్లతెగడ, చీకటి, తాటి, మంచిగంధం, సంపెంగ, కొబ్బరి, కేసర, అరటి, లవంగ, పనస, పోక, ఏరుమద్ది, మొగలి, అగరు, పచ్చకర్పూరం, మద్ది, మామిడి - శ్రేష్ఠమైన వృక్షాల వరుసలతో అందమైన క్రొత్త ఉద్యానవనాల సమూహాలచే; ఒప్పున్= ప్రకాశించాయి.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థంయొక్క వెలుపలిప్రదేశాలు తెల్లతెగడ, తాటి, మామిడి మొదలైన చెట్లవరుసలతో, అందమైన క్రొత్తఉద్యానవనాలతో చూడ ముచ్చటగా ఉంటాయి.

మ. అనిలం బప్పురిఁ బౌరచిత్తముల కత్యానంద మొందంగ నం
దిని యన్నేటితరంగలం బెనఁగుచున్ దివ్యద్రుమాకీర్ణ నం
దనసందోహముఁ దూఱుచున్ వికచకేతక్యాదినానాలతాం
తనవామోదముఁ బొందుచున్ సుడియు నిత్యంబుం గరం బిష్ట మై. **79**

ప్రతిపదార్థం: ఆ+పురిన్= ఆ ఇంద్రప్రస్థపురంలో; అనిలంబు= గాలి; పౌర, చిత్తములకున్= ఆ పురంలో నివసించే జనులమనస్సులకు; అత్యానందము= మహానందం; ఒందంగన్= కలిగేటట్లు; నందిని అన్= నందిని అనేటటువంటి; ఏటి, తరంగలన్= ఏటిఅలలతో; పెనఁగుచున్= కూడుచు; దివ్య, ద్రుమ+ఆకీర్ణ, నందన, సందోహమున్= శ్రేష్ఠములైన వృక్షాలచే

దట్టమైన ఉద్యానవనాల సమూహాన్ని; తూఱుచున్= చొచ్చుతూ; వికచ, కేతకీ+ఆది, నానా, లతాంత, నవ+ఆమోదమున్= వికసించిన మొగలిపువ్వుమొదలుగా గల వివిధాలైన పుష్పాలయొక్క క్రొత్తసువాసనను; పొందుచున్= పొందుతూ; కరంబు= మిక్కిలి; ఇష్టము+ఐ= ఇష్టమైనదియై, నిత్యంబున్= నిరంతరం; సుడియున్= వీస్తుంది.

తాత్పర్యం: ఆ ఇంద్రప్రస్థపురంలోని గాలి పౌరజనులమనస్సులకు మహానందం కలిగేటట్లు నందిని అనే నది అలలమీదుగా వచ్చి, శ్రేష్ఠాలైన వృక్షాలచే దట్టమైన ఉద్యానవనాలలో దూరి, వికసించిన మొగలిపూలు మొదలైన వివిధ, పుష్పాలక్రొత్తవాసనలను సమకూర్చుకొని మిక్కిలిప్రియంగా వీస్తుంది.

విశేషం: నది అలలమీదుగా, ఉద్యానవనాలమధ్యగా రావటంవలన ఆ గాలికి చల్లదనం, పూలసువాసనలను గ్రహించటంవలన పరిమళం, సమకూరి అది ఆ పురజనులకు హాయిని గొలుపుతూ ఉన్నది. పురవర్ణనాన్ని మందమలయానిలప్రశస్తితో ముగించటం ఒక ఔచిత్యం. సుగంధమయమైన గాలి ఆ పట్టణజీవితంలోని ఉత్తమవాసనలను ధ్వనింపచేస్తుంది. వాసనలంటే భావాలనీ అర్థం.

ఈ ఇంద్రప్రస్థపురవర్ణన తరువాతి కవులకావ్యాలలోని పురవర్ణనలకు మార్గదర్శకం అయ్యేటట్లు నడిచింది. కావ్యంలో అష్టాదశవర్ణనలుండటం లక్షణం. ఆ వర్ణనలో పురవర్ణనం ఒకటి. కావ్యలక్షణవిశిష్టమైన ఇతిహాసాన్ని (కావ్యేతిహాసాన్ని) నన్నయ రచిస్తున్నాడు కాబట్టి ఈ పురవర్ణనం కావ్యేతిహాసంలో కావ్యస్వభావాన్ని పెంచే ఒక రమణీయమైన అంశం. (సంపా.)

వ. ఇట్టి యింద్రప్రస్థపురంబున నింద్రవిలాసంబుతో వ్యాసవాసుదేవానుమతుం డై ధర్మతనయుండు ధౌమ్యపురస్సర మహీసురప్రవరవేదఘోషంబులు, సకలజనాశీర్వాదనాదంబులు, మృదుమధుర మంగళ సంగీత రవంబులు, వివిధ తూర్యధ్వనులు నతిసమృద్ధంబులై యెసంగ వర్గచతుష్టయంబునుం బోని యనుజవర్గంబుతో శుభముహూర్తం బునం బురప్రవేశంబు సేసి సర్వప్రకృతిజనానురాగకరుం డయి. 80

ప్రతిపదార్థం: ఇట్టి= ఇటువంటి; ఇంద్రప్రస్థ, పురంబునన్= ఇంద్రప్రస్థనగరంలో; ఇంద్ర, విలాసంబుతోన్= ఇంద్రునియొక్క విలాసంవంటి విలాసంతో; వ్యాస, వాసుదేవ+అనుమతుండు+ఐ= వ్యాసునితో, శ్రీకృష్ణునితో అనుమతి పొందినవాడై; ధర్మతనయుండు= ధర్మరాజు; ధౌమ్య, పురస్సర, మహీసుర, ప్రవర, వేదఘోషంబులు= ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణశ్రేష్ఠుల యొక్క వేదధ్వనులూ; సకల, జన+ఆశీర్వాద, నాదంబులును= ప్రజలందరియొక్క ఆశీర్వాదశబ్దాలూ; మృదు, మధుర, మంగళ, సంగీత, రవంబులు= సున్నితాలూ, మనోహరాలూ, శుభంకరాలూ అయిన సంగీతనాదాలూ; వివిధ, తూర్య, ధ్వనులున్= అనేకవిధాలైన వాద్యధ్వనులూ; అతి, సమృద్ధంబులు+ఐ= మిక్కిలి నిండినవై; ఎసంగన్= అతిశయించగా; వర్గ, చతుష్టయంబునున్+పోని= ధర్మార్థకామమోక్షాలు అనే నాలుగుపురుషార్థాలనుపోలిన; అనుజ, వర్గంబుతోన్= తమ్ముల సమూహంతో; పుర, ప్రవేశంబు, చేసి= నగర ప్రవేశం గావించి; సర్వ, ప్రకృతి, జన+అనురాగ, కరుండు+అయి= సామాన్య జనులందరికీ సంతోషం కలిగించేవాడై.

తాత్పర్యం: ఈవిధమైన ఇంద్రప్రస్థపురంలో దేవేంద్రునివలె విలాసంతో, వ్యాస, శ్రీకృష్ణుల అనుమతితో ధౌమ్యుడుమొదలైన బ్రాహ్మణశ్రేష్ఠుల వేదధ్వనులు, సకలజనులఆశీర్వాదశబ్దాలు, మృదు, మధుర, శుభ, సంగీతనాదాలు, వివిధవాద్యధ్వనులు మిక్కిలి అతిశయించగా, నాలుగువిధాలైన పురుషార్థాలనుపోలిన నలుగురితమ్ములతో పురప్రవేశం చేసి, ప్రజలందరికీ ఆనందం కలిగించేవాడై.

చ. అనుజులు నల్వురుం దనకు నత్యనురాగమునన్ విధేయు లై
తనరుచు నుండ వేదవిహితం బగు యజ్ఞమపోలె సర్వపా

వనశుభమూర్తి యై భువనవంద్యుఁడు ధర్మపరుండు ధర్మనం
దనుఁడు ధరాధిరాజ్యము ముదంబునఁ జేయుచునుండెఁ బేర్మితోన్. 81

ప్రతిపదార్థం: అనుజులు= తమ్ములు; నల్వురున్= నలుగురూ; తనకున్; అతి+అనురాగమునన్= మిక్కిలి ప్రేమతో; విధేయులు+ఐ= లొంగినవాళ్ళయి; తనరుచున్= ఒప్పుతూ; ఉండన్= ఉండగా; వేద, విహితంబు+అగు= వేదముచే విధింపబడిన దైన; యజ్ఞముపోలె; సర్వ, పావన, శుభమూర్తి+ఐ= సమస్తాన్ని పవిత్రం చేసే శుభకరమైన ఆకారం కలవాడై; భువన వంద్యుఁడు =లోకాలచే నమస్కరించతగినవాడు; ధర్మపరుండు= ధర్మమే ప్రధానంగా కలవాడు; ధర్మనందనుఁడు= ధర్మరాజు; ధరా+అధిరాజ్యము= భూమండల పరిపాలనం; ముదంబునన్= సంతోషంతో; పేర్మితోన్= గొప్పతనంతో; చేయుచున్, ఉండెన్= చేస్తూ ఉన్నాడు.

తాత్పర్యం: తమ్ములు నలుగురు ఎంతో ప్రేమతో తనకు విధేయులై వెలుగుతుండగా, వేదం విధించిన యజ్ఞం వలె సమస్తాన్నీ పవిత్రం చేసే శుభకరమైన ఆకారం కలవాడై లోకాలచే నమస్కరించదగినవాడు, ధర్మమే ప్రధానంగా కలవాడు అయిన ధర్మరాజు సంతోషంతో గొప్పగా రాజ్యపాలన చేస్తూ ఉన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. రాజ్యపాలనాన్ని ధర్మరాజు పవిత్రమైన యజ్ఞంగా భావించాడు. నలువురు తమ్ములూ నలువురు ఋత్విక్కులు.

సీ. అనఘు వేదాధ్యయనాసక్తు నారభ్య । మాణమహాధ్వరు మనుచరిత్రు
సర్వవర్ణాశ్రమసంరక్షణక్షము । సత్యసంధాను నజాతశత్రు
భరతవంశోత్తముఁ బ్రభు ధర్మనందను । రాజుఁగాఁ బడసి సురాజ యయ్యె
వసుధ, యధిష్ఠానవతి యయ్యె మఱి లక్ష్మి । బంధుమంతం బయ్యెఁ బరమధర్మ

ఆ. మన్నరేంద్రునందు నాపూర్ణతరశర । దైందవాతపంబునందుఁ బ్రీతి
సమమ కా సమస్తజనులచిత్తంబు లా । నందరసభరంబు నొందఁ దాల్చె. 82

ప్రతిపదార్థం: అనఘున్= పాపంలేనివాడిని; వేద+అధ్యయన+ఆసక్తున్= వేదాన్ని చదువుకోవటంలో ఆసక్తికలవాడిని; ఆరభ్యమాణ, మహా+అధ్వరున్= ఆరంభం కానున్న గొప్పయజ్ఞాలు కలవాడిని; మనుచరిత్రున్= వైవస్వతమనువుయొక్క చరిత్రవంటి చరిత్రకలవాడిని; సర్వ, వర్ణాశ్రమ, సంరక్షణ, క్షమున్= అన్నివర్ణాలను, ఆశ్రమాలను సంరక్షించటంలో సమర్థుడైనవాడిని; సత్యసంధానున్= ఆడితప్పనివాడిని, అజాతశత్రున్= పుట్టబడనిశత్రువులు కలవాడిని - అంటే శత్రువులు లేనివాడిని; భరతవంశ+ఉత్తమున్= భరతవంశంలో శ్రేష్ఠుడిని; ప్రభున్= ప్రభువైన; ధర్మనందనున్= ధర్మరాజును; రాజున్+కాన్= రాజుగా; పడసి= పొంది; వసుధ= భూమి, సురాజ అయ్యెన్= మంచిరాజు కలిగినది అయింది; మఱి= అటుపై; లక్ష్మి; అధిష్ఠానవతి= ఆక్రమించుకొన్నభర్త కలది; అయ్యెన్= అయింది; ఆ+నర+ఇంద్రు, అందున్= ఆ రాజులోన; ఆపూర్ణతర, శరత్+ఐందవ+ ఆతపంబునందున్= మిక్కిలి నిండైన శరత్కాలంలోని చంద్రసంబంధమైన కాంతిలోను; ప్రీతి= ప్రీతి; సమమకా= సమానం కాగా; సమస్త, జనుల, చిత్తంబులు= అందరు ప్రజల మనస్సులు; ఆనందరస, భరంబున్= సంతోషాతిశయాన్ని; ఒందన్= కలిగేటట్లు; తాల్చెన్= ధరించాయి.

తాత్పర్యం: పుణ్యాత్ముడు, వేదాన్ని చదువుకోవటంలో ఆసక్తి కలవాడు, గొప్పయజ్ఞాలు ప్రారంభించేవాడు, మనువువంటి ధార్మికమైన నడవడి కలవాడు, అన్నివర్ణాలను ఆశ్రమాలను రక్షించే సమర్థత కలవాడు, ఆడి తప్పనివాడు, శత్రువులు లేనివాడు, భరతవంశశ్రేష్ఠుడు అయిన ధర్మరాజును రాజుగా పొంది- భూమండలం మంచిరాజును కలది అయింది. లక్ష్మి స్థిరమైన భర్త కలది అయింది. ధర్మం మంచి బంధువు కలది అయింది. జనులు శరత్కాలపూర్ణచంద్రుని వెన్నెల్లోను, ఆ ధర్మరాజులో సమానమైన ప్రీతికలవాళ్ళయి సంతోషిస్తూ ఉన్నారు.

విశేషం: వర్ణాలు నాలుగు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. ఆశ్రమాలు నాలుగు - బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాలు. అలం: ప్రహర్షణం, తుల్యయోగిత. పై పద్యంలో వర్ణించిన వన్నీ ధీరోదాత్తనాయకలక్షణాలే.

క. ధరణిప్రజ ధర్మసుతు సు । స్థిరనిర్మలధర్మచరితఁ జేసి రుజా త
స్కరపరరాష్ట్రవిబాధలఁ । బొరయక సంతతసమృద్ధిఁ బొందె విభూతిన్. 83

ప్రతిపదార్థం: ధరణిప్రజ= భూమిమీదిజనులు; ధర్మసుతు, సుస్థిర, నిర్మల, ధర్మ, చరితన్+చేసి= ధర్మరాజుయొక్క మిక్కిలి స్థిరమై, స్వచ్ఛమైన ధర్మం గల నడవడితో; రుజా, తస్కర, పరరాష్ట్ర, విబాధలన్= రోగాలవలన, దొంగలవలన, శత్రుదేశాలవలన విశేషమైన బాధలు; పొరయక= పొందక, విభూతిన్= ఐశ్వర్యంతో; సంతత, సమృద్ధిన్= ఎడతెగని సంపూర్ణతను; పొందెన్= పొందారు.

తాత్పర్యం: ధర్మరాజు మిక్కిలి స్థిరమైన స్వచ్ఛమైన ధర్మప్రవర్తన కలవాడుకావటంచేత ప్రజలు రోగాలవలన, దొంగలవలన, శత్రుదేశాలవలన బాధలు లేక ఎడతెగని సంపదలు సమృద్ధిగా పొందారు.

క. తనరిరి తద్దేశంబున । ననవరతము యజనయాజనాధ్యయనాధ్యా
పనదానములుఁ బ్రతిగ్రహ । మును నను షట్కర్మములను భూసురవంశ్యుల్. 84

ప్రతిపదార్థం: భూసుర, ముఖ్యుల్= ఉత్తములైన బ్రాహ్మణులు, తత్+దేశంబునన్= ఆ దేశంలో; అనవరతము= ఎల్లప్పుడు; యజన, యాజన+అధ్యయన+అధ్యాపన, దానములున్= యజ్ఞం చేయటం, చేయించటం, వేదం చదివించటం, దానం చేయటం; ప్రతిగ్రహమును= దానం పుచ్చుకోవటం; అను; షట్+కర్మములను= ఆరుకర్మ(ము)లచేత; తనరిరి= ఒప్పారు.

తాత్పర్యం: ఆ దేశంలోని బ్రాహ్మణోత్తములు యజ్ఞంచేయటం, చేయించటం, వేదం చదవటం, చదివించటం, దానం చేయటం, పుచ్చుకోవటం అనే ఆరుకర్మలను ఎల్లప్పుడూ ఆచరిస్తూ ఉన్నారు.

క. పంబి యజనాధ్యయన దా । నంబుల వర్తిల్లె బ్రాహ్మణప్రియ మయి ధ
ర్మ్యం బయి క్షత్రియవైశ్యకు । లం బవిరతపుణ్యకర్మలాలస మగుచున్. 85

ప్రతిపదార్థం: క్షత్రియ, వైశ్య, కులంబు; పంబి= వృద్ధి పొంది; బ్రాహ్మణ, ప్రియము+అయి= బ్రాహ్మణులు ఇష్టమైన వాళ్ళుగా కలదై; ధర్మ్యంబు+అయి= ధర్మంనుండి తొలగనిదై; అవిరత, పుణ్యకర్య, లాలసము+అగుచున్= ఎడతెగని పుణ్యకార్యాల్లో ప్రీతి కలది అవుతూ; యజన+అధ్యయన, దానంబులన్= యజ్ఞం చేయటంలోను; వేదం చదవటంలోను, దానం చేయటంలోను; వర్తిల్లెన్= ఉన్నది.

తాత్పర్యం: క్షత్రియులు, వైశ్యులు వృద్ధిపొంది, బ్రాహ్మణభక్తి గలవారై, ధర్మమార్గం తప్పక, ఎల్లప్పుడు పుణ్యకార్యాల్లో ప్రీతి కలిగి, యజ్ఞాలు చేస్తూ, వేదాలు చదువుతూ, దానాలు చేస్తూ జీవిస్తూ ఉన్నారు.

క. పరమద్విజశుశ్రూషా । పరు లయి శూద్రాదు లవనిఁ బరగిరి ధర్మ
స్థిరమతు లయి ధర్మజు ధర్మరాజ్య మభివృద్ధిఁ బొందె మహిమాన్విత మై. 86

ప్రతిపదార్థం: శూద్ర+ఆదులు= శూద్రులు మొదలైనవాళ్ళు; పరమ, ద్విజ, శుశ్రూషా, పరులు+అయి= కేవలం బ్రాహ్మణులకు సేవచేయటంలో మిక్కిలి కోరిక కలవాళ్ళయి; ధర్మ, స్థిర, మతులు+అయి= ధర్మంమీద నిలకడ గల బుద్ధిగలవాళ్ళయి; పరగిరి= ప్రవర్తిల్లారు; ధర్మజు, ధర్మరాజ్యము; మహిమ+అన్వితము+ఐ= గొప్పతనంతో కూడినదై; అభివృద్ధిన్, పొందెన్= అభివృద్ధి పొందింది.

తాత్పర్యం: శూద్రులు మొదలైనవాళ్ళు కేవలం బ్రాహ్మణులకు సేవచేయటంలో ఎంతో ఆసక్తి కలవాళ్ళయి; ధర్మం మీద స్థిరమైన బుద్ధికలవాళ్ళయి నడుచుకొన్నారు. ధర్మజుని ధర్మరాజ్యం గొప్పగా అభివృద్ధి పొందింది.

విశేషం: రాజధానిలోనే కాక రాజ్యమంతటాకూడా చాతుర్వర్ణ్యప్రజలు వర్ణాశ్రమధర్మాలతో ధర్మం తప్పక బ్రాహ్మణభక్తితో వర్ధిల్లుతున్నారని చెప్పి, 'యథా రాజా తథా ప్రజా' అనే సూక్తి సార్థకమైనట్లు ధ్వనింపచేశాడు నన్నయ.

వ. అంత. 87

తాత్పర్యం: అట్లా ఉండగా.

క. 'నారదుఁడు వచ్చుఁ; దద్వచ । నారంభుల రగుఁడు మీర' లని కఱపి మహో
దారుఁడు వారల వీడ్కొని । నారాయణుఁ డరిగెఁ దత్క్షణమ తనపురికిన్. 88

ప్రతిపదార్థం: నారదుఁడు; వచ్చున్= వస్తాడు; మీరలు; తత్+వచన+ఆరంభులరు= అతనిమాటప్రకారం చేసేవాళ్ళు; అగుఁడు, అని= కండి అని; కఱపి= బోధించి; మహా+ఉదారుఁడు= మిక్కిలి గొప్పవాడు; నారాయణుఁడు= శ్రీకృష్ణుడు; వారలన్; వీడ్కొని= వీడి; తత్+క్షణము+అ= వెంటనే; తన, పురికిన్= తననగరానికి - ద్వారకానగరానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'మీ దగ్గరకు నారదుడు వస్తాడు. అతడు చెప్పిన విధంగా మీరు నడచుకోండి' అని పాండవులకు చెప్పి మహాత్ముడైన శ్రీకృష్ణుడు వెంటనే ద్వారకానగరానికి వెళ్ళాడు.

వ. పాండవులును పరాక్రమ, ప్రణయ, వశీకృతాఖిలరాజన్యు లయి సుఖం బుండు నంత నొక్కనాఁడు. 89

ప్రతిపదార్థం: పాండవులును; పరాక్రమ, ప్రణయ, వశీకృత+అఖిల, రాజన్యులు+అయి= పరాక్రమంచేత, స్నేహంచేత స్వాధీనులుగా చేసికొనబడిన ఎల్లరాజులు కలవాళ్ళయి - అనగా పరాక్రమంచేత, స్నేహంచేత రాజులందరినీ తమవశం చేసికొని; సుఖంబు+ఉండు; అంతన్= సుఖంగా ఉండగా; ఒక్కనాఁడు.

తాత్పర్యం: పాండవులు తమపరాక్రమంతో, స్నేహంతో రాజులందరినీ తమ వశం చేసికొని సుఖంగా ఉండగా, ఒకనాడు.

నారదుఁడు పాండవులపాలికి వచ్చుట (సం. 1-200-8)

తరలము.

ప్రవిమలాగమతత్త్వవేది తపఃప్రభాసి జగత్త్రయీ
శివకరుండు హితోపదేశము సేయఁగాఁ గడువేడ్కతో
దివిజవంద్యుఁడు ప్రీతితోఁ జనుదెంచె నారదుఁ డంబుజో
ద్భవతనూజుఁడు భానుతేజుఁడు పాండవేయులపాలికిన్. **90**

ప్రతిపదార్థం: ప్రవిమల+ఆగమ, తత్త్వ, వేది= పరిశుద్ధములైన వేదాలయొక్క తత్త్వాన్ని తెలిసినవాడు; తపః, ప్రభాసి= తపస్సుచే ప్రకాశించేవాడు; జగత్+త్రయీ, శివకరుండు= లోకాలు మూడిటికీ మేలుచేసేవాడు; దివిజ, వంద్యుఁడు= దేవతలచే పూజింపదగినవాడు; భాను, తేజుఁడు= సూర్యునితో సమానమైన తేజస్సు కలవాడు; అంబుజ+ఉద్భవ, తనూజుఁడు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవుని కుమారుడు; నారదుఁడు; హిత+ఉపదేశము= మంచి ఉపదేశం; చేయఁగాన్= చేయటానికి; కడు, వేడ్కతోన్= మిక్కిలి సంతోషంతో; పాండవేయుల, పాలికిన్= పాండవులదగ్గరకు; ప్రీతితోన్= ప్రేమతో; చనుదెంచెన్.

తాత్పర్యం: పవిత్రాలైన వేదాలతత్త్వం తెలిసినవాడు, తపస్సుచేత ప్రకాశించేవాడు, ముల్లోకాలకు శుభం చేకూర్చేవాడు, దేవతలచేత పూజించదగినవాడు, సూర్యునితో సమానమైన తేజస్సు గలవాడు, బ్రహ్మదేవుని పుత్రుడు అయిన నారదుడు హితాన్ని ఉపదేశించటానికి మిక్కిలి సంతోషంతో పాండవుల దగ్గరకు వచ్చాడు.

మానిని

తమ్ములుఁ దానును ధర్మతనూజుఁడు తత్క్షణసంభృతసంభ్రముఁ డై
యమ్మునినాథవరేణ్యునకున్ వినయమ్మున మ్రొక్కి సమున్నతపీ
ఠమ్మున నుంచి యథావిధి పూజ లొడంబడఁ జేసి మునీశ్వర నె
య్యమ్మున నీ విట వచ్చుటఁజేసి కృతార్థుల మైతిమి యిందఱమున్. **91**

ప్రతిపదార్థం: ధర్మతనూజుఁడు= ధర్మరాజు; తమ్ములున్= తమ్ముళ్లూ; తానును= తానూ; తత్+క్షణ, సంభృత, సంభ్రముఁడు+ఐ= ఆ క్షణంలో చక్కగా భరింపబడిన ఆదరం కలవాడై; ఆ+ముని, నాథ, వరేణ్యునకున్= ఈ ఋషిశ్రేష్ఠుడైన నారదునకు; వినయమ్మునన్= వినయంతో; మ్రొక్కి= నమస్కరించి; సమున్నత, పీఠమ్మునన్= మిక్కిలి ఎత్తైన పీఠంపై; ఉంచి= కూర్చుండబెట్టి; యథావిధి= శాస్త్రవిధిగా; పూజలు= పూజలు; ఒడంబడన్= అంగీకరించేటట్లు; చేసి; ముని+ఈశ్వర= మునిశ్రేష్ఠా!; నెయ్యమ్మునన్= స్నేహంతో; నీవు; ఇటన్= ఇచ్చటకు; వచ్చుటన్+చేసి= రావటంవలన; ఇందఱమున్= ఇంతమందిమి; కృతార్థులము+ ఐతిమి= ఈడేరిన కోరిక కలవారమయ్యాము.

తాత్పర్యం: ధర్మరాజు తమ్ములతో కూడ అమితమైన ఆదరభావంతో ఈ ఋషిశ్రేష్ఠుడైన నారదునికి వినయంగా మ్రొక్కి, మిక్కిలి ఎత్తైన పీఠంమీద కూర్చుండబెట్టి, యథావిధిగా పూజలు చేసి, 'మునీశ్వరా! మీరు స్నేహంతో ఇక్కడికి రావటంవలన మేమంతా కృతార్థులం అయ్యాం' అన్నాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది. 4.20 విశేషం. మానినీవృత్తాన్ని నన్నయ ఆదిపర్వంలో రెండుసార్లు, తిక్కన స్త్రీపర్వంలో రెండుసార్లు వాడారు.

వ. 'మాపుణ్యంబునంజేసి భవద్దర్శనంబు సంభవించె' నని పరమప్రీతిహృదయులై పలికి, పరమభక్తిం బాంచాలిమ్రొక్కించి యున్నంత, నందఱ నాశీర్వచనంబుల నభినందించి వారల కుశలం బడిగి నారదుండు ద్రౌపదిం బోవం బనిచి, వా రేవురకు నేకాంతంబున ని ట్లనియె. 92

ప్రతిపదార్థం: మా, పుణ్యంబునన్+చేసి= మా పుణ్యంవలన; భవత్+దర్శనంబు= మీ దర్శనం; సంభవించెన్= కలిగింది; అని= అని; పరమ, ప్రీత, హృదయులు+ఐ= మిక్కిలి సంతోషించిన హృదయం కలవాళ్ళయి; పలికి; పరమ, భక్తిన్= మహాభక్తితో; పాంచాలిన్= ద్రౌపదిని; మ్రొక్కించి; ఉన్నంతన్= ఉండునంతలో; అందఱన్= అందరిని; ఆశీర్వచనంబులన్= దీవెనలతో; అభినందించి= కొనియాడి; వారల, కుశలంబు+అడిగి; నారదుండు; ద్రౌపది, పోవన్+పనిచి= వెళ్ళవలసిందని ఆజ్ఞాపించి; వారు+ఏవురకున్= పాండవులైదుగురికి; ఏకాంతంబునన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మా పుణ్యంవలన మీ దర్శనం మాకు లభించింది' అని పాండవులు మిక్కిలి సంతోషంతో పలికి, మహాభక్తితో ద్రౌపదిచేత ఆ మహర్షికి మ్రొక్కించాడు. నారదమహర్షి అందరినీ ఆశీర్వదించి, కొనియాడి, కుశల మడిగి, ద్రౌపదిని పొమ్మని పాండవులైదుగురితో రహస్యంగా ఇట్లా అన్నాడు.

సీ. సర్వధర్మజ్ఞుల రుర్వీశపూజ్యుల । రన్యోన్యనిత్యసౌహార్దయుతుల
రగణితగుణయుక్తిం బొగడంగఁ దగువార । లిట్టి మీ కేవుర కిపుడు ద్రుపద
సుత యొక్కతియ ధర్మమతి ధర్మపత్ని యై । నది; యీక్రమంబు లోకాగమంబు
లందు విరుద్ధ; మీసుందరికారణం । బున మీకు విప్రీతి పుట్టకుండ

ఆ. నుండవలయుఁ; బ్రియసహోదరుల్ దొల్లి సుం । దోపసుందు లొక్కయువతి కడరి
విగ్రహించి యసురవీరులు దమలోనఁ । బొడిచి మృత్యునిలయమునకుఁ జనిరి. 93

ప్రతిపదార్థం: సర్వ, ధర్మజ్ఞులరు= అన్నిధర్మాలు తెలిసినవాళ్ళు; ఉర్వీ+ఈశ, పూజ్యులరు= రాజులచే పూజింపతగినవాళ్ళు; అన్యోన్య నిత్య, సౌహార్దయుతులరు= పరస్పరం శాశ్వతమైన స్నేహంతో కూడినవాళ్ళు; అగణిత, గుణ, యుక్తిన్= లెక్కలేనన్ని గుణాల కూడికచే; పొగడంగన్= కొనియాడ; తగు= తగిన, వారలు= వాళ్లు; ఇట్టి, మీకున్= ఇటువంటి మీకు; ఏవురకున్= ఐదుగురికి; ఇపుడు, ద్రుపద, సుత= ద్రుపదరాజుకూతురు; ఒక్కతియ= ఒక్కతియే; ధర్మమతిన్= ధర్మబుద్ధితో; ధర్మ, పత్ని= ఇల్లాలు, ఐనది, ఈ క్రమంబు= ఈ పద్ధతి; లోక+ఆగమంబుల+అందున్= లోకంలో, శాస్త్రంలో; విరుద్ధము= పొసగనట్టిది; ఈ, సుందరి= ఈ అందగత్తె; కారణంబునన్= కారణంగా; విప్రీతి= విరోధం; పుట్టకుండన్= కలుగకుండా; ఉండవలయునన్; తొల్లి= పూర్వం; అసుర, వీరులు= రాక్షసవీరులు; ప్రియ, సహోదరుల్= ప్రేమగల అన్నదమ్ములు; సుంద+ ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; ఒక్క, యువతికిన్= ఒక్కస్త్రీకోసం; అడరి= అతిశయించి; తమలోనన్= తమలో తాము; విగ్రహించి= కలహించి; పొడిచి= కొట్టుకొని; మృత్యు, నిలయమునకున్= యమునిఇంటికి; చనిరి= వెళ్ళారు. (మరణించారు.)

తాత్పర్యం: మీరు అన్నిధర్మాలు తెలిసినవాళ్ళు. రాజులచే పూజింపదగినవాళ్ళు. ఒకరిపై ఒకరు శాశ్వతస్నేహం కలవాళ్ళు. లెక్కలేనన్ని మంచిగుణాలు కలవాళ్ళు. కొనియాడదగిన వాళ్ళు. ఇట్లాంటి మీ అయిదుగురికి ఇప్పుడు ద్రౌపది ఒక్కతే భార్య అయింది. ఈ పద్ధతి లోకవిరుద్ధం, శాస్త్రవిరుద్ధం. ఈ అందగత్తె కారణంగా మీలో మీకు

విరోధం పుట్టకూడదు. పూర్వం ప్రేమగల అన్నదమ్ములు, సుందోపసుందులు అనే రాక్షసవీరులు, ఒక స్త్రీకోసం కలహించి కొట్టుకొని మృతిచెందారు.

క. అనిన నది యెట్టు లని యమ । తనయుఁడు గడువేడ్కతోడఁ ద న్నడిగిన నా
తనికిఁ దదీయానుజులకు । ఇనసన్నిభుఁ డమ్మునీంద్రుఁ డి ట్లని చెప్పెన్. 94

ప్రతిపదార్థం: అనినన్= అని నారదుడు చెప్పగా; అది, ఎట్టుల+అని= అది ఏ విధంగా అని; యమ, తనయుఁడు= యముని కుమారుడైన ధర్మరాజు; కడున్= మిక్కిలి; వేడ్కతోడన్= కుతూహలంతో; తన్నున్+అడిగినన్= తనను అడిగినంతనే; అతనికిన్= ఆ ధర్మరాజుకు; తదీయ, అనుజులకున్= అతని తమ్ములకు; ఇన, సన్నిభుఁడు= సూర్యునితో సమానమైనవాడు; ఆ+ మునీంద్రుఁడు= ఆ మునిశ్రేష్ఠుడైన నారదుడు; ఇట్లు+అని, చెప్పెన్= ఈ విధంగా అని చెప్పాడు.

తాత్పర్యం: అని నారదుడు చెప్పగా ధర్మరాజు మిక్కిలి కుతూహలంతో అది ఎట్లని అడుగగా, అతనికి, అతని తమ్ములకు సూర్యసమానుడైన నారదమునీంద్రుడు ఇట్లా చెప్పాడు.

సుందోపసుందోపాఖ్యానము (సం.1-201-1)

వ. తొల్లి దితిపుత్త్రుండైన హిరణ్యకశిపువంశంబున నికుంభుం డనువానికి సుందోపసుందు లన నిద్దఱుగొడుకులు పుట్టి, నియతాత్ములయి తపంబునన కాని సర్వంబునుం బడయంగా దని యేకనిశ్చయులై, వింధ్యాచలంబున కరిగి నిగృహీతేంద్రియు లై నిదాఘకాలం బెల్లఁ బంచాగ్నిమధ్యంబున నిలిచి, వానకాలంబును శీతకాలంబును జలాశయంబుల వసియించి, మఱియు వాయుభక్షులు నేకపాదస్థితులు నూర్ధ్వబాహులు నధోముఖులును నై పెద్దకాలంబు తపంబు సేసిన. 95

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; దితి, పుత్త్రుండు+ఐన= దితియొక్క కుమారుడైన; హిరణ్యకశిపు= హిరణ్యకశిపుని; వంశంబున= వంశంలో; నికుంభుండు= నికుంభుడు; అను వానికిన్= అనేపేరుగల వానికి; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; అనన్= అనగా; ఇద్దఱు, కొడుకులు, పుట్టి= ఇరువురు కొడుకులు కలిగి; నియత+ఆత్ములు+అయి= నిగ్రహించబడిన మనస్సు కలవారై; తపంబునన, కాని= తపముచేత తప్ప; సర్వంబునున్= అంతా; పడయన్+కాదు+అని= పొందటం సాధ్యపడదని; ఏక, నిశ్చయులు+ఐ= ఒకే నిర్ణయంకలవాళ్ళయి; వింధ్య+అచలంబునకున్= వింధ్యపర్వతానికి; అరిగి= వెళ్ళి; నిగృహీత+ఇంద్రియులు+ఐ= అదుపులో పెట్టబడిన ఇంద్రియాలు కలవాళ్ళయి; నిదాఘకాలంబు+ఎల్లన్= ఎండకాలమంతా; పంచ+అగ్ని, మధ్యంబునన్= అయిదుఅగ్నులమధ్య; నిలిచి=నిల్చుకొని; వాన, కాలంబును= వర్షాకాలం; శీత, కాలంబును= చలికాలముకూడా; జల+ఆశయంబులన్= నీటి మడుగులలో; వసియించి= ఉండి; మఱియున్= ఇంకా; వాయు, భక్షులున్= గాలిని తిన్నవాళ్ళు; ఏక, పాద, స్థితులున్= ఒంటికాలిమీద నిలబడేవాళ్ళు; ఊర్ధ్వ, బాహులును= మీదికి ఎత్తిన చేతులు కలవాళ్ళూ; అధో, ముఖులును= వంచినముఖాలు కలవాళ్ళూ; ఐ; పెద్ద, కాలంబు= చాలాకాలం; తపంబు, చేసినన్= తపస్సు గావింపగా.

తాత్పర్యం: పూర్వం దితి కుమారుడైన హిరణ్యకశిపునివంశంలో నికుంభుడు అనే వానికి సుందోపసుందులనే ఇద్దరు కుమారులు జన్మించారు. వాళ్ళు నిగ్రహంతో కూడిన మనస్సు కలవాళ్ళయి తపస్సుచే తప్ప సర్వాన్ని

పొందటం సాధ్యం కాదని ఒకే నిర్ణయం కలవాళ్ళయి, వింధ్యపర్వతానికి వెళ్ళారు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, వేసవికాలం అయిదుఅగ్నులమధ్య; వర్షాకాలంలో, చలికాలంలో నీటిమడుగులలో ఉండి, గాలిని భక్షిస్తూ, ఒంటికాలిమీద నిలబడి, చేతులు పైకెత్తి తలలు వంచి చాలాకాలం తపస్సు చేయగా.

విశేషం: పంచాగ్నులు - పూర్వాగ్ని, దక్షిణాగ్ని, పశ్చిమాగ్ని, ఉత్తరాగ్ని, సూర్యుడు. (నాల్గుదిక్కుల్లో అగ్ని-పైనసూర్యుడు)

సీ. వారిదారుణతపోవహ్నిదాహంబున । వింధ్యాద్రిదరుల నావిర్భవించి,
యత్యుచ్చ మయి ధూమ మాకాశమెల్లను । గప్పిన, నమరులు గరము వెఱచి,
రత్నంబులను వధూరత్నంబులను జేసి । తత్తపోవిఘ్నవిధాననిరతు
లయి ప్రబోధింపంగ నలవిగాకున్నఁ, దో । యజగర్భుపాలికి నరిగి యసుర

ఆ. వరులతపముఁ జెఱుపవలయు నావుడుఁ, గమ । లాసనుండు త్రిభువనార్చితుండు
సురహితంబుపొంటె సుందోపసుందుల । కడకు వచ్చె వరము కరుణ నీఁగ. **96**

ప్రతిపదార్థం: వారి, దారుణ, తపస్+వహ్ని, దాహంబునన్= ఆ సుందోపసుందులయొక్క భయంకరమైన తపస్సు అనే అగ్నియొక్క కాల్చటంచేత; వింధ్య+అద్రి, దరులన్= వింధ్యపర్వతంయొక్క గుహలలో; ధూమము= పొగ; ఆవిర్భవించి= పుట్టి, అతి+ఉచ్చము+ అయి= మిక్కిలిగా పైకి వ్యాపించినదై; ఆకాశము+ఎల్లను= ఆకాశంఅంతా; కప్పినన్= కప్పివేయగా; అమరులు= దేవతలు; కరము= మిక్కిలి; వెఱచి= భయపడి; రత్నములను= రత్నాలచేతా; వధూ, రత్నంబులను+చేసి= ఉత్తమస్త్రీలచేతా; తత్+తపస్+విఘ్న, విధాన, నిరతులు+అయి= వారితపస్సుకు ఆటంకం కలిగించటంలో మిక్కుటమైన కోరికగలవాళ్ళయి; ప్రబోధింపంగన్= మేలుకొలుపటానికి; అలవి, కాకున్నన్= సాధ్యం కాకపోగా; తోయజ, గర్భు, పాలికిన్= బ్రహ్మదేవునిదగ్గరకు; అరిగి= వెళ్ళి; అసుర, వరుల, తపమున్= రాక్షసశ్రేష్ఠులైన ఆ సుందోపసుందులతపస్సును; చెఱుపవలయున్, నావుడున్= చెడగొట్టాలని అనగా; త్రిభువన+అర్చితుండు= ముల్లోకాలచే పూజింపబడినవాడు; కమల+ఆసనుండు= పద్మాన్ని పీఠంగా కల బ్రహ్మదేవుడు; సుర, హితంబు, పొంటెన్= దేవతలకు మేలు చేయటంకోసం; కరుణన్= దయతో; వరము= వరాన్ని; ఈఁగన్= ఇవ్వటానికి; సుంద+ఉపసుందుల, కడకున్; వచ్చెన్= సుందోపసుందుల దగ్గరకు వచ్చాడు.

తాత్పర్యం: వాళ్ళ భయంకరమైన తపస్సు అనే అగ్ని కాల్చటంచేత వింధ్యపర్వతగుహలలో పొగ పుట్టి, ఎంతో పైకెగసి, ఆకాశం అంతా కప్పగా, దేవతలు భయపడ్డారు. రత్నాలచేత, అందమైన స్త్రీలచేతా వాళ్ళతపస్సుకు విఘ్నం కలిగించా లని ప్రయత్నించారు. విఫలులయి బ్రహ్మదేవునిదగ్గరకు వెళ్ళి, ఆ రాక్షసులతపస్సు చెడగొట్టాలని అనగా - ముల్లోకాలచే పూజింపబడినవాడు, పద్మం పీఠంగా కలవాడు అయిన ఆ బ్రహ్మదేవుడు దేవతలకు మేలు చేయా లని, దయతో వరం ఇవ్వటానికి సుందోపసుందుల దగ్గరకు వచ్చాడు.

వ. ఇట్లు పితామహుండు సుందోపసుందులతపంబునకు మెచ్చి సన్నిహితుం డయి 'మీ కిష్టం బైన వరం బిచ్చెద వేఁడుం' డనిన వారలు వారిజాసనునకు ముకుళితకరకమలు లయి 'దేవా! మాయిష్టంబు దయసేయ మీ కిష్టం బేని, మాకుఁ గామరూపత్వంబును గామగమనత్వంబును సకలమాయావిత్వంబును నన్యులచేత నవధ్యత్వంబును నమరత్వంబునుం బ్రసాదింపుం' డనిన. **97**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; పితామహుండు= బ్రహ్మదేవుడు; సుంద+ఉపసుందులు= సుందుని, ఉపసుందుని; తపంబునకున్= తపస్సుకు; మెచ్చి= పొగడి; సన్నిహితుండు+అయి= ఎదుట నిలిచినవాడై; మీకున్+ఇష్టంబు+ఐన= మీకు ఇష్టమైన; వరంబు= వరాన్ని; ఇచ్చెదన్= ఇస్తాను; వేఁడుండు= వేడుకొనండి; అనినన్= అని అనగా; వారలు= వాళ్లు; వారిజ+ఆసనునకున్= నీటినుండి పుట్టినపద్మాన్ని పీఠంగా గల ఆ బ్రహ్మదేవునికి; ముకుళిత, కర, కమలులు+అయి= ముడిచిన కమలాలవంటిచేతులు కలవాళ్ళయి; దేవా!= ప్రభూ! మా; ఇష్టంబు= మాకోరిక; దయ, చేయన్= అనుగ్రహించటానికి; మీకు+ఇష్టంబు, ఏనిన్ = మీకు ఇష్టమైతే; మాకున్= మా ఇరువురికి; కామరూపత్వంబును= కోరినరూపాన్ని కలిగి ఉండటాన్ని; కామగమనత్వంబును= కోరిన విధంగా వెళ్ళగలగటాన్ని; సకల, మాయావిత్వంబును= అన్నిమాయలు కలిగిఉండటాన్ని; అన్యులచేతన్= ఇతరులచేత; అవధ్యత్వంబునున్= చంపబడకుండటాన్ని; అమరత్వంబునున్= చావులేకుండటాన్ని; ప్రసాదింపుండు= అనుగ్రహించండి; అనినన్= అని కోరగా.

తాత్పర్యం: ఈ విధంగా బ్రహ్మదేవుడు సుందోపసుందులతపస్సుకు మెచ్చి; వాళ్ళకు ప్రత్యక్షమై, 'మీకు ఇష్టమైన వరం ఇస్తాను. వేడండి' అనగా వాళ్ళు చేతులు జోడించి, 'మా కోర్కె తీర్చటానికి మీకు ఇష్టం ఉన్నట్లయితే, కోరినరూపం కలిగి ఉండటాన్ని, కోరిన విధంగా వెళ్ళగలగటాన్ని, అన్ని మాయలు కలిగి ఉండటాన్ని, ఇతరులచేత చావు లేకుండటాన్ని, అసలు చావే లేకుండటాన్ని అనుగ్రహించం' డని కోరారు.

ఆ. కమలభవుఁడు వారి కమరత్వ మొక్కటి । దక్కఁ గోర్కులెల్ల నక్కజముగఁ
గరుణ నిచ్చె, నిట్లు సరసిజగర్భుచే । వరము వడసి యసురవరులు పెఱిగి. 98

ప్రతిపదార్థం: కమలభవుఁడు= పద్మంనుండి పుట్టినవాడు - బ్రహ్మ; వారికిన్= ఆ ఇద్దరికీ; అమరత్వము= చావులేకుండటం; ఒక్కటి, తక్కన్= ఒకటి తప్ప; కోర్కులు+ఎల్లన్= కోరికలు అన్నింటినీ; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; కరుణన్= దయతో; ఇచ్చెన్= ఇచ్చాడు; ఇట్లు=ఈ విధంగా; సరసిజ, గర్భుచేన్= సరస్సునుంచి పుట్టినపద్మం పుట్టుకస్థానంగా కలవాడైన బ్రహ్మదేవునిచే; వరము; పడసి= వరాన్ని పొంది; అసుర, వరులు= రాక్షసశ్రేష్ఠులైన సుందోపసుందులు; పెఱిగి= విజృంభించి.

తాత్పర్యం: బ్రహ్మదేవుడు వాళ్ళకు 'చావు లేకుండటం' అనే వరం ఒక్కటి తప్ప తక్కినవాటినన్నింటిని దయతో అనుగ్రహించాడు. ఈ విధంగా వాళ్ళు బ్రహ్మవలన వరాలు పొంది చెలరేగి.

క. అనుపమరాజ్యవిభూతిం । దనరి జగద్విజయకాంక్ష దైత్యులకు ముదం
బొనరఁగ నకాలకౌముది । యను నుత్సవ మొప్పఁ జేసి రగణితబలు లై. 99

ప్రతిపదార్థం: అనుపమ, రాజ్య విభూతిన్= సాటిలేని రాజ్యవైభవంతో; తనరి= ఒప్పి; జగత్+విజయకాంక్షన్= లోకాన్ని జయించాలనే కోరికచేత, దైత్యులకున్= రాక్షసులకు; ముదంబు= సంతోషం; ఒనరఁగన్= కలిగేటట్లు; అకాలకౌముది; అను ఉత్సవము; అగణిత, బలులు+ఐ= లెక్కలేనంతబలం కలవాళ్ళయి; ఒప్పన్; చేసిరి.

తాత్పర్యం: సాటిలేని రాజ్యవైభవంతో వెలిగి, లోకాన్ని జయించాలనే కోరికతో, రాక్షసులకు ఆనందం కలిగించేటట్లు అకాలకౌముది అనే ఉత్సవాన్ని, లెక్కింప సాధ్యం కానంత బలం కలవాళ్ళయి చేసిరు.

విశేషం: కౌముది అనే ఉత్సవాన్ని ఆశ్వయుజపౌర్ణమినాడు లేదా కార్తికపౌర్ణమినాడు జరుపుతారు. ప్రజలంతా ఈ ఉత్సవంతో సంతోషిస్తారు. సుందోపసుందులు దీనిని ఇతరకాలంలో చేయటంవలన ఇది 'అకాలకౌముదిఉత్సవం'.

క. సురగరుడోరగకిన్నర । పురములు వడిఁ జూఱకొనుచు భూలోకమునం
బరఁగిన రాజర్షి మహీ । సురవరులకు బాధసేయుచును గర్వమునన్. 100

ప్రతిపదార్థం: గర్వమునన్= గర్వంతో; సుర, గరుడ+ఉరగ, కిన్నర, పురములు= దేవతల, గరుడుల, ఉరగుల, కిన్నరుల నగరాలు; వడిన్= వేగమే; చూఱకొనుచున్= కొల్లగొట్టుతూ; భూలోకమునన్= భూలోకంలో; పరఁగిన= ఒప్పిన; రాజ+ఋషి, మహీసుర, వరులకున్= రాజులకు; ఋషులకు, బ్రాహ్మణశ్రేష్ఠులకు; బాధ, చేయుచును= బాధ కలిగిస్తూ;.

తాత్పర్యం: ఆ సుందోపసుందులు గర్వించి దేవతలయొక్క, గరుడులయొక్క, నాగులయొక్క, కిన్నరులయొక్క పురాలను వేగంగా కొల్లగొట్టుతూ; భూలోకంలోని రాజులను, ఋషులను, బ్రాహ్మణశ్రేష్ఠులను బాధిస్తూ.

క. ద్విజవరవినిర్మితము లగు । యజనస్వాధ్యాయకవ్యహవ్యతపోదా
నజపంబులఁ బితృదేవత । లజస్రమును దృప్తు లగుదు రని కడునలుకన్. 101

ప్రతిపదార్థం: ద్విజ, వర, వినిర్మితములు+అగు= బ్రాహ్మణశ్రేష్ఠులచే చేయబడిన వైన; యజన, స్వాధ్యాయ, కవ్య, హవ్య, తపస్; దాన, జపంబులన్= యజ్ఞాలచేతా, వేదాధ్యయనాలచేతా, శ్రాద్ధాలచేతా, హోమాలచేతా, తపస్సులచేతా, దానాలచేతా, జపాలచేతా; పితృదేవతలు; అజస్రమును= ఎల్లప్పుడూ; తృప్తులు+అగుదురు+అని= తృప్తిపొందినవాళ్ళవుతారని; కడున్= మిక్కిలి; అలుకన్= కోపంతో.

తాత్పర్యం: బ్రాహ్మణోత్తములు చేసిన యజ్ఞాలచేతా, వేదాధ్యయనాలచేతా, శ్రాద్ధాలచేతా, హోమాలచేతా, తపస్సులచేతా, దానాలచేతా, జపాలచేతా, పితృదేవతలు ఎల్లప్పుడూ తృప్తిపొందుతున్నారని కోపించి.

వ. పుణ్యవంతుల నిత్యనైమిత్తికకర్మంబులకు విఘ్నంబులు సేయుచు, సింహవ్యాఘ్రగజరూపధరు లై వనంబులం దిరుగుచు, మునిపల్లియలు సొచ్చి మునులకుఁ బ్రాణభయంబు సేయుచున్న వారలక్రూరకర్మంబులకు వెఱచి వేల్పులును మునులును బురాణముని యైన బ్రహ్మపాలికిం జని కృతాంజలు లయి జగంబులకు సుందోపసుందులు సేయు నుపద్రవంబులు సెప్పిన విని విశ్వగురుండు విస్మితుం డయి వార లన్యులచేత వధ్యులు గారు గావున పరస్పర యుద్ధంబునఁ బంచత్వంబుఁ బొందవలయు నని విచారించి, విశ్వకర్మ రావించి 'రూపలావణ్యవతియైన యొక్క యువతి సృజియింపు' మని పంచినఁ బ్రసాదం బని మ్రొక్కి యప్పుడు. 102

ప్రతిపదార్థం: పుణ్యవంతుల= పుణ్యాత్ముల; నిత్య, నైమిత్తిక, కర్మంబులకున్= ప్రతిరోజు చేసే బ్రహ్మయజ్ఞం మొదలైన కర్మలకు, కారణం ఏర్పడటంవలన గ్రహణంమొదలైన వాటిలో చేసే కర్మలకు; విఘ్నంబులు= ఆటంకాలు; చేయుచున్= కలిగిస్తూ; సింహ, వ్యాఘ్ర, గజ, రూప, ధరులు+ఐ= సింహం, పెద్దపులి, ఏనుగు రూపాలను ధరించినవాళ్ళయి; వనంబులన్= అడవులలో; తిరుగుచున్; ముని, పల్లియలు= మునుల పల్లెల్ని; చొచ్చి= ప్రవేశించి; మునులకున్= మునులకు; ప్రాణభయంబు= ప్రాణభీతి; చేయుచున్+ఉన్నన్= కలిగిస్తూ ఉండగా; వారల, క్రూర, కర్మంబులకున్= వాళ్ల భయంకరమైన పనులకు; వెఱచి= భయపడి; వేల్పులును= దేవతలూ; మునులును= ఋషులూ; పురాణ, ముని+ఐన= పురాతనముని అయిన; బ్రహ్మ, పాలికిన్= బ్రహ్మదగ్గరికి; చని= వెళ్ళి; కృత+అంజలులు+అయి= చేయబడిన కైమోడ్పుకలవాళ్ళయి - అంటే నమస్కరించి; జగంబులకున్= లోకాలకు; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; చేయు ఉపద్రవంబులు= కలిగించే కష్టాలు; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; విశ్వ, గురుండు= విశ్వానికి పెద్ద అయిన బ్రహ్మదేవుడు; విస్మితుండు+అయి= ఆశ్చర్య

పడినవాడై; వారలు= వాళ్లు; అన్యులచేతన్= ఇతరులచేత; వధ్యులుకారు= చంపబడరు; కావున= కాబట్టి; పరస్పర, యుద్ధంబునన్= ఒకరితో ఒకరు చేసే యుద్ధంలో; పంచత్వంబున్= మృతిని; పొందవలయున్= పొందాలి; అని= అని; విచారించి= ఆలోచించి; విశ్వకర్మన్= విశ్వకర్మను; రావించి= రప్పించి; రూప, లావణ్యవతి+ఐన= అందమైన రూపం, కాంతికల; ఒక్క, యువతిన్= ఒక స్త్రీని; సృజియింపుము+అని= సృష్టించుము అని; పంచినన్= ఆజ్ఞాపించగా; ప్రసాదంబు+అని= మీరు దయతో అప్పగించినపని చేస్తానని; మ్రొక్కి= నమస్కరించి; అప్పుడు= ఆ సందర్భంలో.

తాత్పర్యం: పుణ్యవంతుల నిత్యనైమిత్తికకర్మలకు ఆటంకాలు కలిగిస్తూ, సింహం, పెద్దపులి, ఏనుగు రూపాలు ధరించి అడవులలో తిరుగుతూ, మునిపల్లెల్లో ప్రవేశించి మునులకు ప్రాణభయం కలిగిస్తూ ఉండగా, మునులంతా బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళి, లోకాలకు సుందోపసుందులు కలిగించే ఉపద్రవాలనుగూర్చి చెప్పారు. బ్రహ్మ మునులు చెప్పింది విని, ఆశ్చర్యపడి, వాళ్ళు ఇతరులచేత చావరనీ, ఒకరితో మరొకరు యుద్ధం చేసి మాత్రమే మరణించా లనీ ఆలోచించి, విశ్వకర్మను పిలిపించి 'అందం, కాంతి గల ఒకస్త్రీని సృజింపు' మని ఆజ్ఞాపించాడు. అతడు మహాప్రసాదం అని బ్రహ్మకు మ్రొక్కి, అప్పుడు.

పృథ్వి.

తిలాణుమణికోటి సంఘటిత దివ్యదేహంబుతోఁ
దిలోత్తమ యనంగ నొక్కయువతీలలామంబు ను
త్పలాక్షి నొనరించె సర్వగుణభాసిరూపక్రియా
కలావిదుఁడు విశ్వకర్మ తనకౌశలం బేర్పడన్. **103**

ప్రతిపదార్థం: సర్వగుణ, భాసి, రూప, క్రియా, కలా, విదుఁడు= అన్నిగుణాలచే ప్రకాశించే రూపాన్ని చేసే కళను ఎరిగినవాడు; విశ్వకర్మ; తన, కౌశలంబు= తననేర్పు; ఏర్పడన్= తెలిసేటట్లు; తిల+అణు, మణి, కోటి, సంఘటిత, దివ్య, దేహంబుతోన్= నువ్వులవలె సూక్ష్మములైన మణుల సమూహంతో కూర్చబడిన ఉత్తమదేహంతో; తిలోత్తమ= తిలోత్తమ; అనంగన్= అనగా; ఒక్క= ఒక; యువతీ, లలామంబున్= ఉత్తమ స్త్రీని; ఉత్పల+అక్షిన్= నల్లకలువలవంటి కన్నులు కలదానిని; ఒనరించెన్= సృజించాడు.

తాత్పర్యం: సర్వగుణాలతో ప్రకాశించే రూపాన్ని చేసే కళను ఎరిగిన విశ్వకర్మ, తన నేర్పు ప్రకాశించగా, నువ్వులవలె సూక్ష్మాలైన రత్నాలుకూర్చి చక్కటిదేహం గల తిలోత్తమ అనే ఉత్తమస్త్రీని, నల్లకలువలవంటి కన్నులు గలదానిని సృజించాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు; ఆది. 2.165 విశేషం.

వ. అదియును సురేంద్రప్రముఖ బృందారక మునిబృంద పరివృతుండై యున్న పరమేష్ఠికిం బరమభక్తిం బ్రణమిల్లి పనియేమి యని ముందట నిలిచిన, నరవిందసంభవుం డాసుందరిం జూచి 'సుందోపసుందు లను దైత్యులు దర్పితు లయి జగంబుల కహితంబులు సేయుచు వింధ్యాచలకందరంబున నున్నవారు; వార లిద్దరు నీకారణంబునం దమలో నొండొరులతోఁ బొడిచి దండధరుపురంబున కరుగునట్లుగాఁ జేయు' మని పంచిన వల్లె యని. **104**

ప్రతిపదార్థం: అదియును= ఆ తిలోత్తమ; సుర+ఇంద్ర, ప్రముఖ, బృందారక, ముని, బృంద, పరివృతుండు+ఐ= దేవేంద్రుడు మొదలుగా గల దేవతలయొక్క, మునులయొక్క సమూహంచే చుట్టబడినవాడై; ఉన్న= ఉండు; పరమేష్ఠికిన్= బ్రహ్మదేవునికి; పరమ, భక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; పని; ఏమి; అని= అని పలికి; ముందటన్= సమక్షంలో; నిలిచినన్= నిలువగా; అరవింద, సంభవుండు= పద్మంనుండి పుట్టినవాడైన బ్రహ్మ; ఆ, సుందరిన్= ఆ అందగత్తెను; చూచి; సుంద+ఉపసుందులు= సుందుడు, ఉపసుందుడు; అను= అనే; దైత్యులు= రాక్షసులు; దర్పితులు+అయి= గర్వించినవాళ్ళయి; జగంబులకున్= లోకాలకు; అహితంబు= కీడు; చేయుచున్= చేస్తూ; వింధ్య+అచల, కందరంబునన్= వింధ్యపర్వతగుహలో; ఉన్నవారు= ఉన్నారు; వారలు+ఇద్దఱు= వాళ్లిరువురు; నీ, కారణంబునన్= నీ కారణంచేత; తమలోన్= తమలో; ఒండు+ఒరులతో= ఒకరితో ఒకరు; పొడిచి= కొట్లాడుకొని; దండధరు, పురంబునకున్= యమలోకానికి; అరుగునట్లుగా= వెళ్ళునట్లుగా; చేయుము+అని= చేయవలసింది అని; పంచినన్= ఆజ్ఞాపించగా; వల్లె, అని= సరే అని.

తాత్పర్యం: దేవేంద్రుడు మొదలైన దేవతల సమూహాలూ, మునుల సమూహాలూ కొలుస్తూఉన్న బ్రహ్మదేవునికి ఆ తిలోత్తమ మహాభక్తితో నమస్కరించి 'పని ఏమి?' అని ఎదుట నిలిచింది. బ్రహ్మదేవుడు ఆ అందగత్తెను చూచి, 'సుందుడు, ఉపసుందుడు అనే రాక్షసులిద్దరూ పొగరెక్కి లోకాలకు కీడుచేస్తూ వింధ్యపర్వతగుహలో ఉన్నారు. వాళ్ళిద్దరు నీ కారణంగా తమలో తాము పోరాడుకొని మరణించేటట్లుగా చేయు' మని ఆజ్ఞాపించాడు. తిలోత్తమ 'అట్లాగే' అని.

సీ. అబ్జజు వీడ్కొని యది దేవసభకుఁ బ్ర । దక్షిణం బొనరించెఁ; దత్క్షణంబ
తద్రూపసౌందర్యదర్శనలోలుఁ డై । యజుఁడు నాలుగుదిక్కులందుఁ దనకు
గావించుకొనియె ముఖంబులు; మఱిరెండు । కన్నులఁ జూచినం గాదు తృప్తి
యని సురేంద్రుండు సహస్రాక్షుఁ డయ్యె; న । య్యమరులు కామమోహాంధు లైరి;

ఆ. ముదిత యిట్లు సర్వమోహిని యై మర్త్య । భువనమునకు మెఱుఁగుఁ బోలె నొప్పి
యరుగుదెంచె సుందరాంగి వింధ్యాచల । విపినదేశ మెల్ల వెలుఁగుచుండ. 105

ప్రతిపదార్థం: అది= ఆ తిలోత్తమ; అబ్జజు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవుడిని; వీడ్కొని= పోయివస్తానని చెప్పి వదలి; దేవసభకున్= దేవసభకు; ప్రదక్షిణంబు= ప్రదక్షిణం; ఒనరించెన్= చేసింది; తత్+క్షణంబు+అ= ఆ క్షణమే; తత్+రూప, సౌందర్య, దర్శన, లోలుఁడు+ఐ= దానిరూపంయొక్క చక్కదనాన్ని చూడటంలో ఆసక్తుడై; అజుఁడు= బ్రహ్మదేవుడు; తనకున్= తనకు; నాలుగు, దిక్కుల+అందున్= నాలుగు దిక్కులలో; ముఖములు= ముఖాలు; కావించుకొనియెన్= చేసికొన్నాడు; మఱి= ఇక; రెండు; కన్నులన్= రెండుకళ్ళతో; చూచినన్= చూస్తే; తృప్తి, కాదు అని= సంతృప్తి కలగదని; సుర+ఇంద్రుండు= దేవేంద్రుడు; సహస్ర+అక్షుడు+అయ్యెన్= వేయికన్నులు కలవాడు అయ్యాడు; ఆ+అమరులు= ఆ దేవతలు; కామ, మోహ+అంధులు+ఐరి= మన్మథమోహంచేత గ్రుడ్డివాళ్ళు అయ్యారు; ముదిత= ఆ స్త్రీ; ఇట్లు= ఈ విధంగా; సర్వ, మోహిని+ఐ= అందరినీ మోహింపచేసేదై; మర్త్య, భువనమునకున్= మనుష్యలోకానికి; మెఱుఁగున్+పోలెన్= మెరుపుతీగవలె; ఒప్పి= ప్రకాశించి; సుందర+అంగి= అందమైన శరీరం గల ఆ తిలోత్తమ; వింధ్య+అచల,విపిన, దేశము+ఎల్లన్= వింధ్యపర్వతంయొక్క అరణ్యప్రాంతమంతా; వెలుగుచుండన్= వెలుగుకలుగుతున్నట్లు; అరుగుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: తిలోత్తమ బ్రహ్మదగ్గర సెలవు తీసికొని, దేవసభకు ప్రదక్షిణం చేసింది. అప్పుడు బ్రహ్మ దాని సౌందర్యాన్ని చూడటానికి తనకు నాలుగుదిక్కులలో ముఖాలు కల్పించుకొని చతుర్ముఖుడు అయ్యాడు. దేవేంద్రుడు తన రెండుకళ్ళతో చూస్తే తృప్తి కలగదని వేయికళ్ళవాడయ్యాడు. దేవతలు కామమోహితులయ్యారు. ఈ విధంగా తిలోత్తమ అందరినీ మోహింపజేసి, మానవలోకానికి మెరుపుతీగవలె ప్రకాశిస్తూ, వింధ్యపర్వత అరణ్యప్రాంతం అంతా వెలుగుతుండగా వచ్చింది.

విశేషం: అలం: కావ్యలింగం, ఉపమ.

క. అమ్ముదితఁ జూచి యన్నయుఁ దమ్ముఁడు నొక్కట మనోజతాడితు లై రా
గమ్మున నన్యోన్యస్నే । హమ్ములు చెడి దృష్టు నిలిపి రయ్యువతిపయిన్. 106

ప్రతిపదార్థం: ఆ+ముదితన్= ఆ కాంతను; చూచి; అన్నయున్, తమ్ముడున్= అన్నా తమ్ముడూ; ఒక్కటన్= ఒకే సమయంలో; మనోజ, తాడితులు+ఐ= మన్మథునిచే కొట్టబడినవాళ్ళయి; రాగమ్మునన్= అనురాగంతో; అన్యోన్య, స్నేహమ్ములు= ఒకరిమీద మరొకరికి గల స్నేహాలు; చెడి= నశించి; ఆ+అతివ= ఆ స్త్రీమీద; దృష్టు= చూపులు; నిలిపిరి= నిలిపారు.

తాత్పర్యం: సుందోపసుందులు ఆ తిలోత్తమను చూచి, ఒక్కసారిగా మన్మథపీడితులై, పరస్పరస్నేహాన్ని వదలి, అనురాగంతో ఆమెమీద చూపులు నిలిపారు.

క. ఘను లయ్యిరువురు నేకా । సనభోజనయాననిలయశయనక్రియలం
దనరెడువా రేకస్త్రీ । వినిహితకాము లయి రపుడు విధినియమమునన్. 107

ప్రతిపదార్థం: ఘనులు= బలవంతులైన; ఆ+ఇరువురున్= ఆ సుందోపసుందులిద్దరూ; ఏక+ఆసన, భోజన, యాన, నిలయ, శయన, క్రియలన్= ఒకే ఆసనంచేత, భోజనంచేత, వాహనంచేత, గృహంచేత, పడకచేత, పనిచేత; తనరెడు, వారు= ఒప్పేవాళ్ళు; అపుడు= ఆ సమయంలో; విధి, నియమమునన్= దైవనిర్ణయంచేత; ఏకస్త్రీ, వినిహిత, కాములు+అయిరి= ఒకే స్త్రీమీద (ఉంచబడిన) కామం కలవాళ్ళు అయ్యారు.

తాత్పర్యం: ఒకే ఆసనంమీద కూర్చొంటూ, ఒకే ఆహారం భుజిస్తూ, ఒకే వాహనం ఎక్కుతూ, ఒకే ఇంట్లో ఉంటూ, ఒకే పడకమీద పడుకొంటూ, ఒకే పనిచేస్తూ, ఒకటిగా ఉన్న బలవంతులు ఆ సుందోపసుందులిద్దరూ దైవనిర్ణయంవలన ఒకే స్త్రీని కామించారు.

క. ఇది నావల్లభ యిది నా । హృదయేశ్వరి యనుచుఁ గోరి యిరువురు మదనో
న్మదు లయి పరిగ్రహించిరి । తదీయ కమనీయ సవ్యదక్షిణకరముల్. 108

ప్రతిపదార్థం: ఇది; నా, వల్లభ= ఇది నా భార్య; ఇది; నా, హృదయ+ఈశ్వరి= ఇది నా హృదయానికి రాణి - నా భార్య; అనుచున్= అంటూ; కోరి= ఇష్టపడి; ఇరువురు= ఇద్దరూ; మదన+ఉన్మదులు+అయి= మన్మథునిచేత మిక్కిలిమదించినవాళ్ళయి; తదీయ, కమనీయ, సవ్య, దక్షిణ, కరముల్= ఆమెయొక్క చక్కని యెడమ కుడి చేతులు; పరిగ్రహించిరి=పట్టుకొన్నారు.

తాత్పర్యం: వాళ్ళిద్దరు మన్మథునివలన మిక్కిలి మదించినవాళ్ళయి 'ఇది నా భార్య', ఇది నా భార్య' అని ఆమె ఎడమకుడిచేతులను పట్టుకొన్నారు.

విశేషం: 'సవ్య' శబ్దానికి ఎడమ, కుడి - అని రెండర్థాలూ ఉన్నాయి. పద్యంలో 'సవ్య దక్షిణ', శబ్దాలు ఉన్నందున- 'సవ్య=ఎడమ. దక్షిణ= కుడి-' అని గ్రహించాలి. 'దక్షిణ'మంటే 'కుడి' అనియే అర్థం.

వ. ఇట్లు పట్టుకొని **109**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; పట్టుకొని= బిగియపట్టి, గట్టిగా బంధించి.

తాత్పర్యం: ఈ విధంగా ఆమె రెండుచేతులు పట్టుకొని.

క. 'సుందరి। మాయిద్దఱలో। నిం దెవ్వరి వలతు చెప్పు మీ' వనవుడుఁ బూ
ర్ణేందుముఖి వారి కను 'మీ। యం దెవ్వఁడు వొడిచి యొడుచు నతనిన వలతున్'. **110**

ప్రతిపదార్థం: సుందరి! = ఓ సుందరీ!; మా, ఇద్దఱలోన్= మా ఇరువురిలో; ఇందున్= ఇచ్చట; ఎవ్వరిన్, వలతు(వు)= ఎవరిని కోరుతావో; ఈవు= నీవు; చెప్పుము; అనవుడున్= అని, సుందోపసుందు లడుగగా; పూర్ణ+ఇందు, ముఖి= పూర్ణచంద్రునివంటి ముఖం కలది; వారికిన్= వాళ్లతో; అనున్= అనింది; మీ, అందున్= మీలో; ఎవ్వఁడు= ఎవ్వడు; పొడిచి= పోరాడి; ఒడుచున్= గెలుస్తాడో; అతనిన్+అ= అతనినే; వలతున్= కోరుతాను.

తాత్పర్యం: 'సుందరీ! మా ఇద్దరిలో నీవు ఎవ్వరిని కోరుతావో చెప్పు' మని సుందోపసుందులడుగగా 'మీలో మీరు యుద్ధం చేసి, ఎవడు గెలుస్తాడో అతడినే కోరుతాను' అని తిలోత్తమ చెప్పింది.

విశేషం: కొన్నిప్రతుల్లో ఈ పద్యం లేదు. దీని స్థానంలో ఈక్రింది వచనం ఉన్నది 'నీ వెవ్వరివల' తనిన అది రూప సౌందర్యంబుల మీ రొక్కరూప, కావున మి మ్మొకళ్ళ గోరనేర, మీలో పొడిచినవాని వలతు' ననిన. (శ్రీమదాంధ్ర మహాభారతసంశోధితప్రతి, పు.500)

సుందోపసుందు లొండొరులతోఁ బోరి చచ్చుట

క. అనవుడు నిద్దఱుఁ దమలోఁ। బొనుపడ కొండొరులతోడ భుజబలు లలుకన్
ఘనవజ్రతనులు దాఁకిరి। తనరఁగ నటఁ గొండ గొండఁ దాఁకినభంగిన్. **111**

ప్రతిపదార్థం: అనవుడున్= అని తిలోత్తమ చెప్పగా; ఇద్దఱున్= ఇరువురున్నూ; పొనుపడక= ఉడుగక; తమలోన్= తమలో; ఒండొరులతోడన్= ఒకరితో ఒకరు; అలుకన్= కోపంతో; భుజ, బలులు= భుజబలం కలవాళ్ళు; ఘన, వజ్ర, తనులు= గొప్ప వజ్రంవంటి (అంటే వజ్రంవలె కఠినమైన) శరీరం కలవాళ్ళు; తనరఁగన్= విజృంభించి; అటన్= అక్కడ; కొండ= పర్వతం; కొండన్= పర్వతాన్ని; తాఁకిన, భంగిన్= ఎదుర్కొన్న విధంగా; తాకిరి= (ఒకరిని ఒకరు) ఎదుర్కొన్నారు.

తాత్పర్యం: అని తిలోత్తమ చెప్పగా ఇద్దరూ తగ్గక భుజబలం కలవారు, వజ్రంవంటి శరీరం కలవాళ్ళు అయిన సుందోపసుందులు తమలో తాము విజృంభించి, కొండను కొండ ఎదుర్కొన్నట్లుగా ఒకరినొకరు ఎదుర్కొన్నారు.

విశేషం: అలం: ఉపమ.

క. విపరీతమతిని సుందుఁడు । నుపసుందుఁడుఁ దాఁకి పొడిచి రొండొరుతోడం
గుపితాత్ము లయి తిలోత్తమ । నెపమున దృఢముష్టిఘాతనిర్ఘాతములన్. 112

ప్రతిపదార్థం: విపరీత, మతిని= విరుద్ధమైన బుద్ధిచేత; సుందుఁడున్= సుందుడూ; ఉపసుందుఁడున్=ఉపసుందుడూ; తిలోత్తమ, నెపమునన్= తిలోత్తమ కారణంగా; కుపిత+ఆత్ములు+అయి= కోపంతో కూడిన మనస్సు కలవాళ్ళయి; దృఢ, ముష్టి, ఘాత, నిర్ఘాతములన్= పిడుగులవంటి గట్టి పిడికిటి పోట్లచేత; ఒండు+ఒరుతోడన్= ఒకరిని ఒకరు; తాఁకి= ఎదుర్కొని; పొడిచిరి= పోరాడినారు.

తాత్పర్యం: తిలోత్తమ కారణంగా సుందోపసుందులు వ్యతిరేకబుద్ధితో కోపాత్ములై పిడుగులవంటి గట్టి పిడికిలి పోట్లతో ఒకరినొకరు పోరాడినారు.

క. అన్యోన్యప్రియభాషణు । లన్యోన్యహితైషు లసుర లన్యులపోలెన్
మన్యుపరిప్రేరితు లై । యన్యోన్యాభిహతిఁ జనిరి యమపురమునకున్. 113

ప్రతిపదార్థం: అన్యోన్య, ప్రియ, భాషణులు= పరస్పరం సంతోషకరాలైన మాటలు కలవాళ్ళు; అన్యోన్య, హితైషులు= పరస్పరం మేలుకోరేవాళ్ళు; అసురులు= రాక్షసులు; అన్యుల, పోలెన్= పరాయివాళ్ళవలె; మన్యు, పరిప్రేరితులు+ఐ= కోపంచేత మిక్కిలి ప్రేరేపింపబడినవాళ్ళయి; అన్యోన్య+అభిహతిన్= ఒకరిని ఒకరు కొట్టుకొనటంచేత; యమ, పురమునకున్= యమ నగరానికి; చనిరి= వెళ్ళారు.

తాత్పర్యం: ఒకరితో ఒకరు సంతోషకరంగా మాట్లాడేవాళ్ళు, ఒకరి మేలు ఒకరు కోరేవాళ్ళు అయిన ఆ రాక్షసులు పరాయివాళ్ళవలె కోపంతో రెచ్చిపోయి, ఒకరినొకరు కొట్టుకొని చనిపోయారు.

విశేషం: పద్యంలోని అన్యోన్య శబ్ద పునరావృత్తి, నకార, యకార సంయోగం సుందోపసుందుల అన్యోన్యత ఎంతటిదో తెలియజేసేదిగా ఉన్నది. అభిహతిలో కూడా - అంటే కొట్టుకోవటంలో కూడా కనిపించే అన్యోన్యత చాలా చమత్కారమైనది.

క. ఇంతుల నిమిత్తమున ధృతి । మంతులుఁ బొందుదురు భేదమతి గావున మీ
రింతయు నెఱింగి యొండులు । చింతింపక సమయ మిందు సేయుఁడు బుద్ధిన్. 114

ప్రతిపదార్థం: ఇంతుల, నిమిత్తమునన్= స్త్రీల కారణంగా; ధృతి, మంతులున్= ధైర్యంకలవాళ్ళుకూడా; భేద, మతిన్= విరోధబుద్ధిని; పొందుదురు= పొందుతారు; కావునన్= కాబట్టి; మీరు, ఇంతయున్= ఇది అంతా; ఎఱింగి= తెలిసి; ఒండులు= ఇతరములు; చింతింపక= ఆలోచించక; సమయము= ఏర్పాటు; బుద్ధిన్= మనఃపూర్వకంగా; ఇందున్, చేయుఁడు= ఇచ్చట చేయండి.

తాత్పర్యం: ధైర్యవంతులు కూడా స్త్రీల కారణంగా విరోధం పొందుతారు. కాబట్టి దీనిని అంతా తెలిసి, ఇతర ఆలోచనలు చేయకుండా బుద్ధిపూర్వకంగా ఒక ఏర్పాటు చేసికొనండి.

నారదప్రేరితులయి పాండవులు సమయము సేయుట (సం.1-204-27)

సీ. అనిన నారదమహామునిపల్కు చేకొని । దమలో నొడంబడి విమలబుద్ధి
నేవురయందును ద్రోవది ప్రీతితో । నొక్కొక్కయింట దా నొక్కయేఁడు

క్రమమున నుండను; గమలాక్షి యెవ్వరి । యింటఁ దా నుండె నయ్యింటివలనఁ

బెఱవారు చనకుండ; నెఱుఁగక చనిరేని । వెలయఁగఁ బండ్రెండునెలలు తీర్థ

ఆ. సేవ సేయుచును విశేషవ్రతంబులు । ధీరవృత్తిఁ జలుపువారుగాను

సన్మునీంద్రునొద్ద సమయంబు సేసిరి । రాజనుతులు పాండురాజసుతులు. 115

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పిన; నారదమహాముని; పల్కు= మాట; చేకొని= గ్రహించి - అనగా అంగీకరించి; రాజ, నుతులు= రాజులచే కొనియాడబడేవాళ్ళు; పాండురాజసుతులు= పాండురాజుయొక్క కుమారులు - పాండవులు; విమల, బుద్ధిన్= నిర్మలమైన మనస్సుతో; ఒడంబడి= ఒప్పుకొని; ఏవుర, అందును= పాండవులు అయిదుగురిపట్ల; ద్రోవది= ద్రౌపది; ప్రీతితోన్= ప్రేమతో; తాన్= తాను; ఒక్కొక్క, ఇంటన్= ఒక్కొక్క ఇంటిలో; ఒక్క, ఏఁడు= ఒక సంవత్సరం; క్రమమునన్= వరుసగా; ఉండన్= ఉండటానికి; కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది - ద్రౌపది; ఎవ్వరి, ఇంటన్= ఎవ్వరి ఇంటిలో; తాన్= తాను; ఉండెన్= ఉంటుందో; ఆ+ఇంటివలనన్= ఆ ఇంటివైపు; పెఱవారు= ఇతరులు; చనకుండన్= వెళ్ళకుండా; ఎఱుఁగక= తెలియక; చనిరి+ఏని= వెళ్ళినట్లయితే; వెలయఁగన్= ఒప్పుగా; పండ్రెండు నెలలు= ఒక సంవత్సరం అంటే పన్నెండు మాసాలు; తీర్థసేవ; చేయుచును= చేస్తూ; విశేష, వ్రతంబులు= విశేషాలైన వ్రతాలు; ధీర, వృత్తిన్= ధైర్యంతో; చలుపువారుగాను= చేసేవాళ్ళుగా; సత్+ముని+ఇంద్రు, ఒద్దన్= నారదమహామునిఎదుట; సమయంబు= ప్రతిజ్ఞ; చేసిరి= చేశారు.

తాత్పర్యం: రాజులందరి ప్రశంసలందుకొనే పాండవులు నారదమహాముని చెప్పిన మాటను గ్రహించి, అరమరికలు లేని మనస్సుతో ఒప్పుకొనినారు. పాండవులైదుగురిపట్ల ద్రౌపది ప్రేమతో ఒక్కొక్కరి ఇంట ఒక్కొక్క సంవత్సరం క్రమంగా ఉండటానికీ, ద్రౌపది ఉన్న ఇంటివైపు ఇతరులు వెళ్ళకుండా ఉండటానికీ, ఒకవేళ ఎవరైనా తెలియక వెళ్ళితే, అతడు పన్నెండునెలలు తీర్థయాత్రలు, విశేషవ్రతాలు చేయటానికీ అంగీకరించారు. ఆ మేరకు ఆ మహర్షి ఎదుట ప్రతిజ్ఞ చేశారు.

విశేషం: కలసిఉన్నవారి నడుమ కలహాలు కల్పించటం కలహభోజనుడైన నారదుని స్వభావం. కాని ఇక్కడ పాండవుల మధ్య ద్రౌపది కారణంగా ఎప్పుడూ కలహాలు ఏర్పడకుండ నారదమహర్షి ప్రయత్నించటం ఒక పెద్ద ప్రత్యేకత. నారదమహర్షి ప్రయత్నం పాండవుల దైవానుగ్రహానికి పరోక్షచిహ్నం.

వ. ఇట్లు హితోపదేశంబు సేసి నారదుం డరిగినం బాండవులు దమచేసినసమయస్థితిం దప్పక సలుపుచు సుఖంబుండఁ; గొండొకకాలంబున కొక్కనాఁ డొక్కబ్రాహ్మణుండు మ్రుచ్చులచేతఁ దనహోమధేనువు గోల్పడి వచ్చి యాక్రోశించిన, నశ్రుతపూర్వం బయిన యయ్యాక్రోశంబు విని విస్మితుం డయి విజయుండు విప్రులకయిన బాధ దీర్పక యుపేక్షించుట పాతకం బని యప్పడ యవ్విప్రు రావించి 'యిది యేమి కారణం?' బని యడిగిన నర్జుననకు విప్రుం డి ట్లనియె. 116

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; హిత+ఉపదేశంబు, చేసి= మేలు కలిగించే మాటలు చెప్పి; నారదుండు; అరిగినన్= వెళ్ళగా; పాండవులు, తమ, చేసిన; సమయ, స్థితిన్= తాము కావించిన ప్రతిజ్ఞావిధాన్ని; తప్పక= విడువక; సలుపుచున్= శ్రద్ధతో పాటిస్తూ; సుఖంబు+ఉండన్= సుఖంగా ఉండగా; కొండు+ఒక, కాలంబునకున్= కొంత కాలానికి; ఒక్కనాఁడు; ఒక్క,

బ్రాహ్మణుండు; ముచ్చులచేతన్= దొంగలచేత; తన= తన; హోమధేనువు= యాగసంబంధమైన ఆవును; కోలు+పడి= పోగొట్టుకొని; వచ్చి, ఆక్రోశించినన్= ఏడ్వగా; అశ్రుతపూర్వంబు+అయిన= ఇదివరకు వినబడనిదైన; ఆ+ఆక్రోశంబు= ఆ ఏడుపు; విని, విజయుండు= అర్జునుడు; విస్మితుండు+అయి= ఆశ్చర్యపడినవాడై; విప్రులకున్+అయిన= బ్రాహ్మణులకు కలిగిన; బాధ; తీర్పక; ఉపేక్షించుట= ఊరకుండుట; పాతకంబు= పాపము అని; అప్పుడు+అ= అప్పటికప్పుడే; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుని; రావించి= రప్పించి; ఇది, ఏమి, కారణంబు అని = ఈ దుఃఖం ఏ కారణంగా అని; అడిగినన్= అడుగగా; అర్జుననకున్= అర్జునునికి; విప్రుండు= బ్రాహ్మణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా హితోపదేశం చేసి నారదుడు వెళ్ళగా, పాండవులు తమప్రతిజ్ఞను తప్పక పాలిస్తూ సుఖంగా ఉన్నారు. కొంతకాలంతర్వాత ఒకనాడు ఒక బ్రాహ్మణుడు తన హోమధేనువును దొంగలచే పోగొట్టుకొని వచ్చి ఏడ్వగా, అర్జునుడు పూర్వం ఎప్పుడూ వినని ఆ ఏడ్పు విని, బ్రాహ్మణులకు ఏర్పడిన బాధ తీర్చకపోతే పాపం వస్తుం దని ఆ బ్రాహ్మణుని దుఃఖకారణాన్ని అడుగగా, అతడు ఇట్లా అన్నాడు.

విశేషం: అశ్రుతపూర్వంబయిన అనే దానికి కొన్ని ప్రతులలో 'శ్రుత పూర్వం బయిన' అనే పాఠాంతరంకూడా ఉన్నది. అపుడు 'ముందు విన్నట్టిదైన' అని అర్థం.

క. యమతనయు ధర్మరాజ్యము । తమరాజ్యమ యని మహాముదంబున విప్రో
త్తము లున్నచోటనే బ । న్నమువడి కోల్పడితి గోధనము ముచ్చులచేన్. 117

ప్రతిపదార్థం: యమతనయు= ధర్మరాజుయొక్క; ధర్మరాజ్యము= ధర్మసామ్రాజ్యం; తమ, రాజ్యము= తమ రాజ్యమే అని; మహా, ముదంబునన్= మిక్కిలి సంతోషంతో; విప్ర+ఉత్తములు= బ్రాహ్మణశ్రేష్ఠులు; ఉన్నచోటనే; బన్నము+పడి= ఆపదపొంది; ముచ్చులచేన్= దొంగలచేత; గోధనము; కోల్పడితిన్= కోల్పోయాను.

తాత్పర్యం: ధర్మజుని ధర్మసామ్రాజ్యం తమరాజ్యమే అని బ్రాహ్మణోత్తములు మహానందంతో ఉన్నచోటనే ఆపదనొంది, దొంగలచేత గోధనాన్ని నేను కోల్పోయాను.

విశేషం: పూర్వం ధనమంటే గోధనమే. గోవులు ఎక్కువగా ఉండటం ఆనాటి గృహస్థులకు ఉత్తమధనం.

సీ. 'వదలక ముచ్చుల వధియించి నాహోమ । ధేనువుఁ గ్రమ్మఱఁ దెచ్చియిమ్ము
జననుత! దానివత్సంబు నిన్నటఁగోలె । నుడుగక యఱచుచునున్నయదియ;
పలుకుల కెడ లేదు; బాణాసనము గొని । చనుదెమ్ము నాతోడఁ జట్ట' ననిన
ద్రౌపదీసహితుఁ డై ధర్మరాజాయుధా । గారంబునం దున్న గార్ముకంబుఁ

ఆ. బుచ్చికొనఁగఁ దనకుఁబోలమి యెఱిఁగియు । విప్రునార్తరవము వినఁగ నోప
కర్జునుండు నిజశరాసనగ్రహణార్థ । మాయుధాలయమున కరిగె నపుడు. 118

ప్రతిపదార్థం: జననుత!= ప్రజలచే కీర్తింపబడేవాడా! ఓ అర్జునా!; వదలక= విడిచిపెట్టక; ముచ్చులన్= దొంగలను; వధియించి= చంపి; నా, హోమధేనువున్= నా హోమధేనువును; క్రమ్మఱన్= మరల; తెచ్చిఇమ్ము; దాని, వత్సంబు= దానిదూడ;

నిన్నటన్+కోలెన్= నిన్నటినుండి; ఉడుగక= ఆపక; అఱచుచున్+ఉన్న, అది+అ= అరుస్తూనే ఉన్నది; పలుకులకున్= మాటలకు; ఎడలేదు= అవకాశం లేదు; చట్టన్= శీఘ్రమే; బాణ+ఆసనము= ధనుస్సు; కొని= తీసికొని; నాతోడన్= నాతోకూడ; చనుదెమ్ము= రమ్ము; అనినన్= అని చెప్పగా; ధర్మరాజు, ద్రౌపదీసహితుఁడు+ఐ= ద్రౌపదీదేవితో కూడినవాడై; ఆయుధ+ అగారము+ అందున్= ఆయుధాలున్న ఇంటిలో; ఉన్నన్= ఉండగా; కార్ముకంబు= ధనుస్సు; పుచ్చుకొనఁగన్= తీసికొనటం; తనకున్= తనకు; పోలమి= సరికాకుండటం; ఎఱిఁగియు= తెలిసికూడా; అర్జునుండు= అర్జునుడు; విప్రు+ఆర్తరవము= బ్రాహ్మణుడియొక్క ఏడ్పు; వినఁగన్+ఓపక= వినలేక; నిజ= తనయొక్క; శర+ఆసన, గ్రహణ+అర్థము= ధనుస్సు తీసికొనటంకొరకు; ఆయుధ+ఆలయమునకున్= ఆయుధాలున్న ఇంటికి; అపుడు; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'జనులచే కీర్తింపబడే ఓ అర్జునా! దొంగలను వదలక బంధించి, నా హోమధేనువును మళ్ళీ తెచ్చి నాకు ఇమ్ము. దానిదూడ నిన్నటినుండి అట్లాగే అరుస్తూ ఉన్నది. మాటలకు వ్యవధి లేదు. వెంటనే ధనుస్సు తీసికొని నావెంట రమ్ము' అని ఆ బ్రాహ్మణుడు అనగా ధర్మరాజు ద్రౌపదితో కూడి ఆయుధాల ఇంట్లో ఉన్నాడనీ, అక్కడికి వెళ్ళి ధనుస్సు తీసికొనటం తప్పనీ తెలిసికూడా, అర్జునుడు విప్రునిఏడ్పు వినలేక తనధనుస్సు తీసికొనటానికి ఆయుధాలున్న ఆ ఇంటికి అప్పుడు వెళ్ళాడు.

క. 'ధరణీసురవరులకుఁ గడుఁ సెరగై నెడ నెఱిఁగి యెడయుఁ జేయుదురె మహా
పురుషు' లని నరుఁడు విలుగొని । యరిగెను మ్రుచ్చులపిఱుంద నవ్విప్రుపనిన్. **119**

ప్రతిపదార్థం: మహాపురుషులు= దైవాంశగల గొప్పవాళ్లు; ధరణీ, సుర, వరులకున్= బ్రాహ్మణోత్తములకు; కడున్= మిక్కిలి; సెరగు+ఐన= ఆపద కలిగిన; ఎడన్= చోటును; సమయాన్ని; ఎఱిఁగి= తెలిసి; ఎడయున్+చేయుదురె= తొలగుతారా - అంటే ముఖం తప్పించి వెళ్తారా; అని; నరుఁడు= అర్జునుడు; విలు= విల్లు; కొని= తీసికొని; ఆ+విప్రు, పనిన్= ఆ బ్రాహ్మణునియొక్క పనిమీద; మ్రుచ్చుల; పిఱుందన్= దొంగలవెంబడించి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'బ్రాహ్మణోత్తములకు ఆపద ఏర్పడిన సంగతి తెలిసి మహాపురుషులు మొహం తప్పించి వెళ్తారా? అని అర్జునుడు ధనుస్సు తీసికొని, ఆ విప్రునిపనిమీద దొంగలవెంట పడ్డాడు.

విశేషం: ఉత్తమక్షత్రియులకు తమకు సంబంధించిన ధర్మంకంటె సంఘానికి సంబంధించిన ధర్మం అవశ్య కర్తవ్యం. ఒక్కొకసారి వ్యక్తి (స్వీయ) ధర్మానికి ఆపదవాటిల్లినా సామాజికధర్మాన్ని మాత్రం తప్పకుండ నిర్వర్తించాలి. పాండవులు చేసికొన్న నియమాన్ని అనుసరించి ద్రౌపది ఎవరి ఇంటిలో ఉంటుందో ఆ యింటికి మిగిలినవాళ్ళు వెళ్ళకూడదు. ఇది జరిగినప్పుడు ద్రౌపది ధర్మరాజు వద్ద ఉన్నది. అతడు ఆమెతో కలిసి ఆయుధాగారంలో ఉన్నాడు. అది ధర్మజు ఇల్లు కాదు. ఆయుధాగారం పాండవులందరు ఉపయోగించతగినదే. అందువలన, అర్జునుడు ద్రౌపది ఉన్న ఆ చోటికి పోవటం అధర్మం అనటానికీ వీలు లేదు. కాని, ద్రౌపది ధర్మజునితో కలిసి ఉన్న ఏ ఇంటిలోనైనా ప్రవేశించకూడదనే నియమాన్ని వ్యాఖ్యానించుకొంటే అది తప్పు అవుతుంది. అయితే, ఈ ధర్మాధర్మవిచారం చేయడానికీ, ధర్మరాజుకుముందుగా తెలియపరచి, ద్రౌపదితోకూడా అతడు అవతలికి పోయినతర్వాత ఆయుధాగారంలోని విల్లును తీసికొనిపోవటానికీ వ్యవధానం లేదు. ధర్మనిర్వహణలో తనకు కలిగే కష్టంకంటె సమాజానికి కలిగే నష్టాన్ని పరిగణించి ప్రవర్తించే ధర్మవీరుడు-అర్జునుడు. అట్లా ప్రవర్తించటం ఉత్తమవీరలక్షణం.

వ. ఇట్లరిగి యర్జునుం డతివీరు లయిన చోరుల వధియించి, బ్రాహ్మణునకు గోధనంబు నిచ్చి క్రమ్మఱి వచ్చి ధర్మజునకు మ్రొక్కి, 'లోకంబులమర్యాదలు విచారించి రక్షించుచున్న మనయందు మర్యాదాభంగం బయ్యె నను నింతకంటె

దుర్యశం బొందెద్దియు లేదు గావున నాకు ద్వాదశమాసికవ్రతంబు సలుపవలయు' నని పోవ సమకట్టి యున్న నర్జుననకు యుధిష్ఠిరుం డి ట్లనియె. 120

ప్రతిపదార్థం: ఇట్లు+అరిగి= ఈవిధంగా వెళ్ళి; అర్జునుండు; అతి, వీరులు+అయిన= గొప్ప వీరులైన; చోరులన్= దొంగలను; వధియించి= చంపి; బ్రాహ్మణునకున్= ఆ విప్రునికి; గోధనంబున్= గోరూపధనాన్ని; ఇచ్చి= తెచ్చిఇచ్చి; క్రమ్మఱి= తిరిగి; వచ్చి= ఇంటికివచ్చి; ధర్మజునకున్= ధర్మరాజునకు; మ్రొక్కి= నమస్కరించి; లోకంబుల, మర్యాదలు= లోక నియమాలు; విచారించి= ఆలోచించి; రక్షించుచున్+ఉన్న= కాపాడుతూ ఉండే; మనయందున్= మనలో; మర్యాదా, భంగంబు= నియమభంగం; అయ్యెన్= అయింది; ఇంతకంటెన్= ఇంతకన్న; దుర్+యశంబు= అపకీర్తి; ఒండు= మరొకటి; ఎద్దియున్, లేదు = ఏదీ లేదు; కావునన్= కాబట్టి; నాకున్= నేను; ద్వాదశమాసికవ్రతంబు= పండ్రెండు నెలల వ్రతం; సలుపవలయున్= చేయాలి; అని= అని చెప్పి; పోవన్= పోవటానికి; సమకట్టి= పూని; ఉన్నన్= ఉండగా; అర్జుననకున్= అర్జునునికి; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా వెళ్ళి అర్జునుడు అతివీరులైన ఆ దొంగలను చంపి, బ్రాహ్మణునికి గోధనాన్ని ఇచ్చి, తిరిగి వచ్చి, ధర్మజునికి మొక్కి - 'లోకనియమాలను విచారించి రక్షిస్తున్న మనలోనే నియమభంగం జరిగిందన్న అపకీర్తికి మించింది మరొకటి లేదు. అందువలన నేను ద్వాదశమాసికవ్రతాన్ని చేయాలి' అని వెళ్ళడానికి సిద్ధంకాగా, అతనితో ధర్మరాజు ఇట్లా అన్నాడు.

ఆ. క్రూర కర్ము లయ్యు గో బ్రాహ్మణుల కగు । బాధ లుడుచుజనులఁ బాపచయము
లెట్టియెడలఁ బొంద వింద్రనందన! నీకు । సమయభంగభీతిఁ జనఁగ నేల? 121

ప్రతిపదార్థం: ఇంద్రనందన= ఇంద్రుని కుమారుడవైన ఓ అర్జునా!; క్రూర, కర్ములు+అయ్యున్= పాపపు పనులు చేసిన వారైనా; గో, బ్రాహ్మణులకున్+అగు= ఆవులకు, బ్రాహ్మణులకు కలిగే, బాధలు; ఉడుచు= పోగొట్టే; జనులన్= ప్రజల్ని; పాప, చయములు= పాపాల సమూహాలు; ఎట్టి, ఎడలన్= ఎటువంటి చోట్లలో గూడా; పొందవు= చేరవు; నీకున్; సమయ, భంగ, భీతిన్= నియమం చెడింది అనే భయంతో; చనఁగన్= వెళ్ళటం; ఏల= ఎందుకు?

తాత్పర్యం: అర్జునా! ఎంత దుర్మార్గులైనా ఆవులకు, బ్రాహ్మణులకు కలిగిన బాధలను తొలగించే జనులను పాపాలు ఎటువంటి చోట్ల కూడా పొందవు. అట్లాంటప్పుడు నీవు నియమభంగం అయిందన్న భయంతో పోవటం ఎందుకు?

విశేషం: రెండుధర్మాలకు సంఘర్షణ ఏర్పడినప్పుడు ధర్మసూక్ష్మాన్ని అనుసరించటం లోకధర్మం. ద్రౌపది ధర్మజునితో కూడి ఏ ఇంట్లో ఉన్నా, ఆ ఇంట్లోకి మిగిలిన పాండవులు వెళ్ళకూడదని నియమం. ఆ నియమం తప్పినట్లు అర్జునుడు భావించి, ప్రాయశ్చిత్తాన్ని చేసికొనటానికి అన్నను అనుమతి కోరాడు. ధర్మజుడు బ్రాహ్మణబాధను తొలగించే సందర్భంలో ఎటువంటిచోట్ల కూడా పాపాలు పొందవనే ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించాడు. అది అపద్ధర్మమౌతుందనీ, ప్రజలు దానిని నిందించే అవకాశం ఉంటుందనీ అర్జునుడు భావించాడు.

వ. 'మఱి యట్లుంగాక తస్కరవధోపేక్షల నశ్వమేధ భ్రూణహత్యల ఫలం బగు నని వేదంబులయందు వినంబడుఁ; దస్కరుల వధియించి బ్రాహ్మణహితంబు చేసినవాఁడవు; నీకు సమయోల్లంఘనప్రాయశ్చిత్తంబు సేయ నేల?' యనిన నర్జునుం డి ట్లనియె. 122

ప్రతిపదార్థం: మఱి= ఇంకా; అట్లున్+కాక= ఆ విధంగానూకాక; తస్కర, వధ+ఉపేక్షలన్= దొంగలను చంపటంవలన, వదలివేయటం వలన; అశ్వమేధ, భ్రూణ, హత్యల, ఫలంబు= అశ్వమేధయాగం చేయటంవలన, పసిబిడ్డను చంపటంవలన కలిగేఫలం; అగును+అని= అవుతుంది అని; వేదంబుల, అందున్= వేదాలలో; వినన్+పడున్= వినపడుతూంది; తస్కరులన్= దొంగలను; వధియించి= చంపి; బ్రాహ్మణ, హితంబు= బ్రాహ్మణునికి మేలు; చేసినవాడవు= చేసినావు; నీవు= నీవు; సమయ+ఉల్లంఘన, ప్రాయశ్చిత్తంబు= నియమాన్ని తప్పి నడచుకొన్న పాపాన్ని పోగొట్టుకోవటానికి చేసే పని; చేయన్+ఏల= చేయటం ఎందుకు; అనినన్= అని అనగా; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అంతేకాక దొంగలను చంపటంవలన అశ్వమేధం చేసినంత పుణ్యఫలం, వాళ్ళను వదలివేస్తే (కడుపులో) పసిబిడ్డను చంపినంత పాపఫలం కలుగుతుందని వేదాలవలన వింటున్నాం. దొంగలను చంపి బ్రాహ్మణుడికి మేలు చేసిన నీవు నియమం తప్పి నడచుకొన్నందుకు చేసికొనే ప్రాయశ్చిత్తాన్ని చేసికొనటం ఎందుకు?' అని ధర్మజుడు అనగా అర్జునుడు ధర్మజునితో ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: క్రమాలంకారం. ఒకవేళ అర్జునుడు చేసింది పాపమని గ్రహించి దానికి ప్రాయశ్చిత్తం చేసికొనటానికే ద్వాదశమాసవ్రతం పాటించినట్లయితే తస్కరవధవలన అశ్వమేధయాగం చేసిన పుణ్యం వస్తుందనీ, ఆ పుణ్యప్రభావంవలన పాపప్రాయశ్చిత్తం అవసరంలేదనీ ధర్మజుడి ప్రతిపాదన. పుణ్యప్రాప్తి పాపప్రాయశ్చిత్తానికి ప్రత్యామ్నాయం కాదని అర్జునుడి అభిప్రాయం.

క. భూజనపరివాదం బ । వ్యాజంబునఁ బరిహరింపవలయును మనకున్
వ్యాజమున ధర్మలోపం । బాజిజయా! పరిహరింతురయ్య మహాత్ముల్. 123

ప్రతిపదార్థం: ఆజి, జయా = యుద్ధంలో జయించేవాడా! ఓ ధర్మరాజా!; అవ్యాజంబునన్= కారణం లేకపోయినా; భూజన; పరివాదంబు= భూమిలోని ప్రజలవలన కలిగేనిందను; మనకున్= మనకు; పరిహరింపవలయును= తొలగించాల్సిఉంది; మహాత్ములు= మహనీయులు; వ్యాజమునన్= సాకుతో; ధర్మ, లోపంబున్= ధర్మం తప్పటాన్ని; పరిహరింతురు+అయ్య= త్రోసి పుచ్చుతారా!

తాత్పర్యం: యుద్ధంలో జయించే ఓ ధర్మరాజా! అకారణంగా భూజనులవలన కలిగిన నిందనైనా మనం తొలగించాలి. అటువంటప్పుడు ఏదో సాకు పెట్టి మహాత్ములైనవాళ్ళు ధర్మం తప్పటాన్ని త్రోసిపుచ్చుతారా?

విశేషం: నన్నయ రుచిరార్థసూక్తి అనదగిన సుభాషితం. ఏ కారణం లేకుండానే రాజులకు ఒక్కొక్కసారి నిందలు వస్తూ ఉంటాయి. కారణం లేదుకదా అని దానిని నిర్లక్ష్యం చేయకుండా ఆ నిందను తొలగించుకొనటానికి ప్రయత్నించటం రాజధర్మం. మరి ఇక్కడ 'ఏదో ఒక సాకు చెప్పి నియమాన్ని పాటించామని పాండవులు సమర్థించుకొన్నారు' అని సహేతుకంగా ప్రజలు విమర్శించటానికి పాలకులు అవకాశం కలిగించటం సమర్థనీయం కాదని అర్జునుడు పేర్కొని, నిర్మల ధర్మ కర్మ దీక్షాపరతంత్రుడనిపించుకొన్నాడు. ధర్మజుడు అతనిమాటను కాదనలేకపోయాడు.

సమయభంగకారణమున నర్జునుండు తీర్థయాత్రకుం జనుట (సం.1-206-12)

వ. కావున వ్రతదానంబు నా కనుగ్రహింప వలయు' నని మ్రొక్కి యర్జునుం డగ్రజు వీడ్కొని గురుజనానుమతుం డై యఖిలవేదవేదాంగపారగు లైన బ్రాహ్మణులు ననేకశాస్త్రవిదు లయి వివిధకథాకథనదక్షు లయిన పౌరాణికులును దనకు సహాయులుగా నరిగి సకలతీర్థసేవచేయుచు నయ్యైతీర్థంబులందు. 124

ప్రతిపదార్థం: కావున వ్రతదానంబు= కాబట్టి ద్వాదశమాసికవ్రతం అనే దానాన్ని; నాకున్; అనుగ్రహింపవలయును= ఇవ్వాలి; అని= అని చెప్పి; మ్రొక్కి; అర్జునుండు= అర్జునుడు; అగ్రజున్, వీడ్కొని= అన్నదగ్గర సెలవు తీసికొని; గురుజన+ అనుమతుండు+ఐ= పెద్దలచే అనుమతించబడినవాడై; అఖిల వేద, వేద+అంగ, పారగులు+ఐన= అన్ని వేదాలను, వేదాంగాలను, తుదముట్ట చదివిన; బ్రాహ్మణులున్= విప్రులూ; అనేక, శాస్త్ర, విదులు+అయి= పెక్కుశాస్త్రాలు తెలిసినవాళ్ళయి; వివిధ, కథా, కథన, దక్షులు+అయిన= అనేక విధాలైన కథలను చెప్పటంలో సమర్థులైన పౌరాణికులును; తనకున్= తనకు; సహాయులుకాన్= తోడైనవాళ్ళుగా; అరిగి= పోయి; సకలతీర్థసేవ చేయుచున్= అన్నితీర్థాలు సేవిస్తూ; అయ్యైతీర్థముల, అందున్= ఆయా తీర్థాలలో.

తాత్పర్యం: 'అందుచేత నాకు ద్వాదశమాసికవ్రతదానాన్ని అనుగ్రహించండి' అని నమస్కరించి అర్జునుడు అన్నదగ్గర సెలవుతీసికొని, పెద్దలందరి అనుమతి పొంది, అన్నివేదాలు, వేదాంగాలు తుదముట్ట చదివిన బ్రాహ్మణులూ, పెక్కుశాస్త్రాలూ తెలిసి అనేక విధాలైనకథలు చెప్పటంలో సమర్థులైన పౌరాణికులూ తనకు తోడై రాగా ఆ యాతీర్థాలు సేవిస్తూ.

ఆ. ధరణిసురుల గురులఁ బరమయోగుల మహా । భాగు లయిన యట్టి భాగవతుల
రాజవంశవరుఁడు పూజించుచును వారి । వలనఁ బుణ్యకథలు వెలయ వినుచు. 125

ప్రతిపదార్థం: రాజవంశవరుఁడు= చంద్రవంశశ్రేష్ఠుడైన అర్జునుడు; ధరణిసురులన్= బ్రాహ్మణులను; గురులన్= పెద్దలను; పరమయోగులన్= గొప్పయోగులను; మహాభాగులు+అయిన+అట్టి= నిర్మలమనస్సు గల ప్రసిద్ధులైనట్టి; భాగవతులన్= పుణ్యాత్ములను; పూజించుచును= పూజిస్తూ; వారివలనన్= వాళ్లవల్ల; పుణ్యకథలు= పుణ్యకథలను; వెలయన్= ఒప్పుగ; వినుచున్= వింటూ.

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠుడైన అర్జునుడు బ్రాహ్మణులను, పెద్దలను, పరమయోగులను, గొప్ప పుణ్యాత్ములను పూజిస్తూ, వారివలన పుణ్యకథలు వింటూ.

క. గంగాధర పింగజటా । సంగమ మంగళ విశాల చటుల తరంగన్
గంగానది సేవించెను । గంగాద్వారమున విగతకల్మషుఁ డగుచున్. 126

ప్రతిపదార్థం: గంగాధర, పింగ, జటా, సంగమ, మంగళ, విశాల, చటుల, తరంగన్= శివునియొక్క గోరోచనపువర్ణంగల జటలతో కలియటంచేత మంగళకరాలై, విశాలాలై చలించే అలలు కలదానిని; గంగానదిన్; గంగా, ద్వారమునన్= గంగానదియొక్క ద్వార ప్రదేశంలో; విగత, కల్మషుఁడు+అగుచున్= తొలగిన పాపాలు కలవాడవుతూ; సేవించెన్= సేవించాడు.

తాత్పర్యం: శివునిగోరోచనపురంగు జటలతో కలవటంవలన మంగళకరాలై, విశాలాలై, చలించేఅలలుగల గంగానదిని, గంగాద్వారంలో అర్జునుడు తనపాపాలు తొలగిపోయేటట్లు సేవించాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. గంగాతరంగనాదసౌందర్యాన్ని బిందుపూర్వక గకారంతో ధ్వనింపచేయటం అక్షరరమ్యత.

వ. అందు నిత్యంబును గంగాస్నానంబు సేసి తత్తీరంబున హోమంబు సేయుచు వాసవసుతుండు మహీసురవర సహితుం డయి కొన్ని దివసంబులు వసియించి, యొక్కనాఁడు ప్రభాతంబ విధిపూర్వకంబునం గృతాభిషేకుం డయి దేవర్షి పితృతర్పణంబులు సేసి. 127

విశేషం: అందున్= గంగానదీద్వారంలో; వాసవ, సుతుండు= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు; నిత్యంబును= ప్రతిదినమూ; గంగా, స్నానంబు చేసి; = గంగలో స్నానం చేసి; తత్+తీరంబునన్= ఆ గంగానది ఒడ్డున; హోమంబు, చేయుచున్= హోమం చేస్తూ; మహీసుర, వర, సహితుండు+అయి= బ్రాహ్మణోత్తములతో కూడినవాడై; కొన్ని, దివసంబులు= కొన్నిరోజులు; వసియించి= ఉండి; ఒక్కనాఁడు; ప్రభాతంబు+అ= వేకువనే; విధిపూర్వకంబునన్= నియమప్రకారం; కృత+ అభిషేకుండు+అయి= చేయబడిన స్నానం కలవాడై - అంటే స్నానంచేసి; దేవ+ఋషి, పితృ, తర్పణంబులు, చేసి= దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు తర్పణాలు చేసి.

తాత్పర్యం: ఆ గంగానదీద్వారంలో అర్జునుడు ప్రతిదినం (గంగా) స్నానం చేసి, గంగ ఒడ్డున హోమంచేస్తూ, బ్రాహ్మణశ్రేష్ఠులతో కూడి, కొన్నిరోజులు గడిపి, ఒకనాడు వేకువనే లేచి, నియమంప్రకారం స్నానం చేసి, దేవ, ఋషి, పితృతర్పణాలు చేసి.

ఉలూచి యర్జునునిఁ గామించుట (సం. 1-206-12)

సీ. **వేల్వంగ సమకట్టి వెలువడ నున్న న । య్యింద్రనందను రుచిరేంద్రనీల**
సుందరశ్యామాంగు సురరాజకరికరా । కారమహాబాహుఁ గట్టిఁ జూచి
నలినాక్షి యం దొక్కనాగకన్యక కామ । పరవశ యై వానిఁ బట్టి తిగిచి
కొని నాగపురమునకును జని నిజరమ్య । హర్మ్యంబునందు నెయ్యమున నునిచె;

ఆ. **నందు నగ్ని తొంటియట్టు లభ్యర్చితం । బయి వెలుంగుచున్న నర్జునుండు**
హోమకార్య మొప్ప నొనరించి యప్పు డ । య్యింతిఁ జూచి నగుచు నిట్టు లనియె. 128

ప్రతిపదార్థం: వేల్వంగన్= హోమం చేయటానికి; సమకట్టి= పూనుకొని; వెలువడన్+ఉన్న= వెలుపలికి రానున్న; ఆ+ఇంద్ర, నందనున్= ఇంద్రుని కుమారుడైన అర్జునుడిని; రుచిర+ఇంద్రనీల, సుందర, శ్యామ+అంగున్= కాంతిమంతమైన ఇంద్రనీలమణివలె అందమైన నల్లని శరీరం కలవాడిని; సుర, రాజ, కరి, కర+ఆకార, మహాబాహున్= దేవతలరాజైన దేవేంద్రుని ఏనుగుతొండంవంటి గొప్ప బాహువులు కలవాడిని; కట్టిన్= నల్లనివాడైన అర్జునుడిని; చూచి; అందున్= అచ్చట; ఒక్క; నలిన+అక్షి= పద్మంవంటి కన్నులు కలది; నాగకన్యక= నాగజాతికన్య; కామ, పరవశ+ఐ= కామానికి మిక్కిలి లొంగిపోయినదై; వానిన్= ఆ అర్జునుడిని; పట్టి= బంధించి; తిగిచికొని= లాగికొని; నాగపురమునకును; చని= వెళ్ళి; నిజ, రమ్య, హర్మ్యంబు, అందున్= అందమైన తన మేడలో; నెయ్యమునన్= స్నేహంతో; ఉనిచెన్= ఉంచింది; అందున్= ఆ నాగపురంలో; అగ్ని= అగ్ని; తొంటి, అట్టుల= పూర్వంవలెనే; అభి+అర్చితంబు+అయి= పూజింపబడినదై; వెలుంగుచున్నన్= వెలుగుతూఉండగా; అర్జునుండు; హోమకార్యము; ఒప్పన్; ఒనరించి= చేసి; అప్పుడు+అ= ఆ క్షణమే; ఆ+ఇంతిన్= ఆ నాగకన్యకను; చూచి; నగుచున్= నవ్వుతూ; ఇట్టుల+అనియెన్.

తాత్పర్యం: హోమం చేయపూని వెలుపలికి వచ్చిన ఆ పార్థుడిని, ఇంద్రనీలంవలె అందమైన నల్లటిశరీరం గలవాడిని, ఐరావతంతొండంవంటి పెద్దబాహువులు కలవాడిని-చూచి, కమలాలవంటి కన్నులు కల నాగకన్యక, కామపరవశ అయి అతడిని పట్టి లాక్కొని నాగపురానికి వెళ్ళి, అందమైన తనమేడలో ప్రేమతో ఉంచింది. అక్కడ వెలుగుతున్న అగ్నిలో అర్జునుడు హోమకార్యం జరిపి, ఆ నాగకన్యను చూచి నవ్వుతూ ఇట్లా అన్నాడు.

క. 'తామరసనేత్ర! నీ పే । రేమీ? యెవ్వరితనూజ; వి ట్లేల మహా
వ్యామోహిత వై?' తనవుడుఁ గోమలి సురరాజపుత్త్రకున కి ట్లనియెన్. 129

ప్రతిపదార్థం: తామరసనేత్ర= తామరలవంటి కన్నులు కలదానా!; నీపేరు; ఏమీ; ఎవ్వరి, తనూజవు= ఎవ్వరికూతురివి; ఇట్లు; ఏల= ఎందుకు; మహా, వ్యామోహితవు+ఐతి(వి)= మిక్కిలి వలపు కొన్నదానివి అయ్యావు; అనవుడున్= అని అనగా; కోమలి= సుకుమారి - ఆ నాగకన్యక, సురరాజ, పుత్త్రకునకున్= దేవేంద్రుని కుమారునికి (అర్జునునికి); ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! నీపేరేమి? నీ వెవ్వరి కూతురివి? ఈ విధంగా ఎందుకు ఇంత వలపు గొన్నదానివి అయ్యావు? అని అనగా ఆ నాగకన్యక అర్జునునితో ఇట్లా అన్నది.

వ. ఏ నులూచి యను నాగకన్యక; నైరావతకులసంభవుం డయిన కౌరవ్యకూఁతుర; నిన్నుం జూచి మనోజబాణబాధిత నయితి; నామనోరథంబు సలుపుము. 130

ప్రతిపదార్థం: ఏను= నేను; ఉలూచి; అను, నాగకన్యకను; ఐరావత, కుల, సంభవుండు+అయిన= ఐరావతవంశంలో పుట్టినవాడైన; కౌరవ్యకూతురన్= కౌరవ్యుని కుమార్తెను; నిన్నున్; చూచి, మనోజ, బాణ, బాధితను+అయితిన్= మన్మథబాణాలచేత బాధింపబడిన దాననయ్యాను; నా, మనోరథంబు= నా కోరిక; సలుపుము= ఈడేర్చుము.

తాత్పర్యం: నేను ఉలూచి అనే నాగకన్యకను. ఐరావతవంశంలో పుట్టిన కౌరవ్యుని కూతురిని. నిన్ను చూచి వలచాను. నా కోరిక తీర్చుము.

విశేషం: ఐరావతము - కద్రువకుమారులలో ఒకడు. అతనివంశంలో పుట్టిన కౌరవ్యునికూతురు ఉలూచి. ఉలూచికి ఉలూపి అనే పాఠాంతరం అనేకప్రతులలో ఉన్నది.

క. నీ గుణములు దొల్లియు నా । గీగీతములందు విని తగిలి యిపుడు మనో
రాగమునఁ జూడఁ గంటిని । భాగీరథియందు నిన్నుఁ బరహితచరితా! 131

ప్రతిపదార్థం: పరహిత, చరితా= ఇతరులకు మేలు చేసే నడవడి కలవాడా!; నీ, గుణములు; తొల్లియు= ఇదివరకే; నాగీ, గీతముల+అందున్= నాగకన్యకలపాటలలో; విని; తగిలి= ఆసక్తి కలిగి; ఇపుడు; మనోరాగమునన్= ప్రేమతో; నిన్నున్= నిన్ను; భాగీరథి, అందున్= గంగానదిలో; చూడన్+కంటిని= చూడగలిగాను.

తాత్పర్యం: ఇతరులకు మేలు చేసేనడవడి కల ఓ అర్జునా! ఇదివరకే నీ గుణాలు నాగకన్యకలపాటలలో విని, ఆసక్తి గొన్నాను. ఇపుడు ప్రేమతో నిన్ను గంగానదిలో చూడగలిగాను.

విశేషం: పరహితచరితా! అనే సంబోధనలో - ఇతరులమేలుకోరి నడుచుకొనే నీవు ఇపుడు నా మేలు కోరి నా కోరిక మన్నింపుము అనే ఉలూచి హృదయం చక్కగా వ్యక్తమవుతున్నది. పార్థుని ఈ తీర్థయాత్రలకు కారణంకూడా పరహితచరితమే కదా! భగీరథుడు భూమిమీదకు తీసికొనిరావటంవలన గంగకు భాగీరథి అనే పేరు వచ్చింది.

వ. అనిన దాని కర్జునుం డి ట్లనియె. 132

ప్రతిపదార్థం: అనినన్= అని ఉలూచి అనగా; దానికిన్= ఆమెకు; అర్జునుఁడు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని పలికిన ఉలూచితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

మధ్యాక్కర.

ద్వాదశమాసికవ్రతము సలుపుదుఁ దరుణి! మాయన్న
యాదేశమునఁ జేసి సర్వతీర్థము లాడుచు బ్రహ్మ
వాదులసంగతి బ్రహ్మచర్యసువ్రతుఁడ నై యుండి
నీదుమనోరథ మెట్లు సలుపంగనేర్తు నే నిపుడు? 133

ప్రతిపదార్థం: తరుణి! = ఓకాంతా!; మా, అన్న= మా అన్నగారి; ఆదేశమునన్+చేసి= ఆజ్ఞతో; ద్వాదశమాసికవ్రతమున్= ద్వాదశమాసవ్రతాన్ని; సలుపుదున్= చేస్తున్నాను; సర్వతీర్థములు+ఆడుచున్= అన్ని పుణ్యతీర్థాలలో స్నానం చేస్తూ; బ్రహ్మవాదుల, సంగతి= వేదవిదులయినవారితో కలిసి; బ్రహ్మచర్య, సువ్రతుఁడను+ఐ= బ్రహ్మచర్యవ్రతం ఆచరిస్తూ; ఉండి= ఉంటూ; నేను; ఇపుడు= ఇప్పుడు; నీదు, మనోరథము= నీకోరిక; ఎట్లు; సలుపంగనేర్తున్= ఏవిధంగా తీర్చగలను?

తాత్పర్యం: ఓ కాంతా! మా అన్నగారి ఆజ్ఞతో ద్వాదశమాసికవ్రతం చేస్తూ, అన్ని పుణ్యతీర్థాలలో స్నానమాడుతూ వేదవిదులైన బ్రాహ్మణోత్తములతో కలిసి బ్రహ్మచర్యవ్రతాన్ని సలుపుతూ ఉండగా, నేను ఇపుడు నీ కోర్కెను ఎట్లా తీర్చగలను?

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది.2.183 విశేషం.

వ. అనిన నవనతానన యయి నాగకన్యక యర్జునుం జూచి ' ద్రుపదరాజపుత్త్రియందు మీచేసిన సమయంబును, భవత్తీర్థాగమననిమిత్తంబును వ్రతంబును నెఱుంగనిదానఁ గాను; సర్వతీర్థసేవనంబును సర్వవ్రతంబులు సలుపుటయును సర్వదానధర్మక్రియలును బ్రాణదానంబుతో సమానంబులు గావు; నామనోరథంబు విఫలం బయిన మనోజానలంబునం బ్రాణపరిత్యాగం బగుం గావున నన్ను రక్షింపుము; దీన నీకు వ్రతభంగంబు గా' దనిన నర్జునుండు దానిమనోరథంబు సలిపి యారాత్రి నాగభువనంబున వసియించి నాగకన్యకయందు సద్యోగర్భంబున నిరావంతుం డను కొడుకుం బడసి, నాగలోకంబు వెలువడి యాదిత్యోదయంబుతోడన గంగాద్వారంబునకు వచ్చి, తద్వృత్తాంతం బంతయుఁ దనసహాయు లయిన విప్రులకుం జెప్పి, వారలకు హృదయానందంబు సేయుచు. 134

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడు; చెప్పగా; అవనత+ఆనన, అయి= వంచిన ముఖం కలదై; నాగకన్యక; అర్జునున్, చూచి; ద్రుపదరాజ, పుత్త్రి, అందున్= ద్రౌపదియందు; మీ, చేసిన= మీయొక్క చేసిన- అంటే మీరు చేసిన; సమయంబును= ప్రతిజ్ఞను; భవత్+తీర్థ+ఆగమన, నిమిత్తంబును= మీ తీర్థయాత్రాకారణాన్ని; వ్రతంబునున్; ఎఱుంగదానన్, కాను= తెలియనిదానను కాను; సర్వ, తీర్థ, సేవనంబును= అన్ని తీర్థాలను సేవించుట; సర్వ, వ్రతంబులు, సలుపుటయున్= అన్ని వ్రతాలు చేయటం; సర్వ, దాన, ధర్మ, క్రియలును= అన్ని దానాల ధర్మాల పనులు; ప్రాణదానంబుతోన్+సమానంబులు= ప్రాణదానంతో సరికావు; నా, మనోరథంబు= నా కోరిక; విఫలంబు+అయినన్= నెరవేరకుంటే; మనోజ+అనలంబునన్= మన్మథాగ్నిలో; ప్రాణ, పరి త్యాగంబు+అగున్= ప్రాణం వదలటం జరుగుతుంది; కావునన్; నన్నున్; రక్షింపుము; దీనన్=

దీనివలన; నీకున్; వ్రత, భంగంబు= వ్రతానికి భంగపాటు; కాదు= కలుగదు; అనినన్= అని అనగా; అర్జునుండు; దాని= ఆ ఉలూచియొక్క; మనోరథంబు= కోరిక; సలిపి= తీర్చి; ఆ రాత్రి; నాగభువనంబునన్= నాగలోకంలో; వసియించి= నివసించి; నాగకన్యక+అందున్= నాగకన్యకయందు; సద్యస్+గర్భంబునన్= అప్పటికప్పుడు కలిగిన గర్భంలో; ఇరావంతుండు+ అను= ఇరావంతుడు అను పేరుగల; కొడుకున్; పడసి= పొంది; నాగలోకంబు= నాగలోకంనుండి; వెలువడి= వెలుపలికివచ్చి; ఆదిత్య+ఉదయంబుతోడన= సూర్యోదయంతోనే; గంగా ద్వారంబునకున్= గంగాద్వారానికి; వచ్చి= చని; తత్+వృత్తాంతంబు= ఆ సంగతి; అంతయున్= అంతా; తన; సహాయులు+ అయిన= తోడుగా ఉన్న; విప్రులకున్= బ్రాహ్మణులకు; చెప్పి; వారలకున్, హృదయ+ఆనందంబు, చేయుచున్= ఆ బ్రాహ్మణులకు మనస్సంతోషము కలిగిస్తూ.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా ఉలూచి తలవంచి అర్జునుడిని చూచి - 'ద్రౌపదివిషయంలో మీరు చేసిన ప్రతిజ్ఞ, మీతీర్థయాత్రకారణం, మీవ్రతం తెలియని దాన్ని కాను. అన్నితీర్థాలు సేవించటం, అన్నివ్రతాలు సలపటం; అన్నిదానాలు, ధర్మకర్మలు చేయటం, ప్రాణదానంతో సమానం కావు. నా కోర్కె నెరవేరకుంటే మన్మథాగ్నిలో ప్రాణం వదలటం జరుగుతుంది. కాబట్టి నన్ను రక్షించు. దీనివలన నీకు వ్రతభంగం కాదు' అనగా అర్జునుడు ఉలూచి కోరిక తీర్చి, ఆ రాత్రి నాగలోకంలో గడిపి, ఆమెయందు సద్యోగర్భంలో ఇరావంతుండు అనే కొడుకును పొంది, సూర్యోదయంకాగానే గంగాద్వారానికి వచ్చి, జరిగిన వృత్తాంతమంతా తనకు తోడుగా ఉన్న బ్రాహ్మణులకు చెప్పి, వాళ్ళకు హృదయానందం కలిగిస్తూ.

క. వితతయశుఁ డరిగి హిమప । ర్వతపార్శ్వంబున నగస్త్యవటమును నత్యు
న్నతభృగుతుంగముఁ జూచుచు । ధృతి నేఁగి హిరణ్యబిందుతీర్థంబునకున్. 135

ప్రతిపదార్థం: వితత, యశుఁడు= విశాలమైన కీర్తికలవాడు - అర్జునుడు, అరిగి= వెళ్ళి, హిమపర్వత, పార్శ్వంబునన్= హిమాలయ పర్వతంప్రక్కన; అగస్త్యవటమున్ (పుణ్యక్షేత్రం); అతి+ఉన్నత, భృగుతుంగమున్= మిక్కిలి ఎత్తైన భృగుతుంగక్షేత్రాన్ని; చూచుచున్; ధృతిన్= సంతోషంతో; హిరణ్య, బిందు తీర్థంబునకున్= హిరణ్యబిందు తీర్థానికి; ఏఁగి= వెళ్ళి.

తాత్పర్యం: విశాలమైన కీర్తి గల అర్జునుడు హిమాలయం ప్రక్కన ఉన్న అగస్త్యవటక్షేత్రాన్ని, మిక్కిలి ఎత్తైన భృగు తుంగక్షేత్రాన్ని చూస్తూ సంతోషంతో హిరణ్యబిందుతీర్థానికి వెళ్ళి.

వ. అందును గోదాన భూదాన హిరణ్యదానంబు లాదిగాఁ బెక్కుదానంబులు సేసి, యజ్ఞార్థంబుగా భూసురోత్తములకు గోసహస్రంబు లిచ్చి, ప్రాగ్దేశంబున కరిగి నైమిశారణ్యంబునందు జగన్నాథునారాయణు నారాధించి యుత్పలినియుఁ గౌశికియు నందయు నపరనందయు గయయు గంగయు గంగాసాగరసంగమంబును జూచుచు. 136

ప్రతిపదార్థం: అందును= ఆ హిరణ్యబిందుతీర్థంలో; గోదాన, భూదాన, హిరణ్యదానంబులు= ఆవులను దానంచేయుటం, భూములనుదానంచేయుట; బంగారాన్ని దానంచేయటం; ఆదిగాన్= మొదలుగా; పెక్కు; దానంబులు; చేసి; యజ్ఞ+అర్థంబుగాన్= యజ్ఞంకొరకు; భూసుర+ఉత్తములకున్= బ్రాహ్మణోత్తములకు; గోసహస్రంబులు= వేలకొద్దిఆవులు; ఇచ్చి= దానమొసగి; ప్రాక్+దేశంబులకున్= తూర్పుదేశానికి; అరిగి= వెళ్ళి, నైమిశ+అరణ్యంబునందున్= నైమిశారణ్యంలో; జగన్నాథు నారాయణున్= లోకప్రభువైన నారాయణుని; ఆరాధించి= పూజించి; ఉత్పలినియున్= ఉత్పలిని; కౌశికియున్= కౌశికిని; నందయున్= నందను; అపరనందయున్= అపరనందను; గయయున్= గయను; గంగయున్= గంగను; గంగాసాగరసంగమంబును= గంగానది సముద్రంలో కలిసేచోటును; చూచుచున్= చూస్తూ.

తాత్పర్యం: ఆ హిరణ్యబిందుతీర్థంలో గోదాన, భూదాన, సువర్ణదానాది అనేకదానాలు చేసి, యజ్ఞంకొరకు బ్రాహ్మణోత్తములకు వేలాది ఆవులను ఇచ్చి, తూర్పుదేశానికి పోయి నైమిశారణ్యంలోని జగన్నాథుడిని ఆరాధించి ఉత్పలిని, కౌశిక, నంద, అపరనంద, గయ, గంగ, గంగాసాగరసంగమస్థలం మొదలైన ప్రదేశాలను చూస్తూ.

క. ఏలావనరమ్యము లగు । వేలావనములను బవనవిచలద్వీచీ
లాలితసముద్రవిద్రుమ । మాలాపులినస్థలముల మసలుచు లీలన్. 137

ప్రతిపదార్థం: ఏలా, వన, రమ్యములు+అగు= ఏలకితీగలతోటలచే అందములైన; వేలా, వనములను= సముద్రతీరపు అడవులలో; పవన, విచలత్+వీచీ, లాలిత, సముద్ర, విద్రుమ, మాలా, పులిన, స్థలముల= గాలిచే కదలుతున్న అలలచే ఊగించ బడిన సముద్రంయొక్క పగడపుచెట్ల వరుసలతో కూడిన ఇసుక తిన్నెలున్న ప్రదేశాలలో; లీలన్= విలాసంగా; మసలుచున్= తిరుగుతూ.

తాత్పర్యం: ఏలకితీగలతోటలలో అందంగా ఉన్న సముద్రతీరవనాలతో, గాలికి కదలే అలలు ఊగించే పగడపు చెట్లవరుసలతో కూడిన ఇసుకతిన్నెలున్నప్రదేశాలలో విలాసంగా తిరుగుతూ.

వ. కళింగవిషయంబు సొచ్చు నంతఁ దోడిబ్రాహ్మణులు కొందఱు కళింగద్వారంబునఁ గ్రమ్మఱి యుత్తర కురుదేశంబులకుం జనిన; నందుం గతిపయబ్రాహ్మణసహాయుం డయి పార్థుం డరిగి పూర్వసముద్రతీరంబునఁ బురుషోత్తమదేవరకు నమస్కరించి మహేంద్రపర్వతంబు చూచుచు. 138

ప్రతిపదార్థం: కళింగ, విషయంబు= కళింగదేశం; చొచ్చునంతన్= ప్రవేశించగానే; తోడి బ్రాహ్మణులు; కొందఱు= వెంటగల బ్రాహ్మణులు కొంతమంది; కళింగద్వారంబునన్= కళింగద్వారంలో; క్రమ్మఱి= మరలి;ఉత్తర, కురుదేశంబులకున్; చనినన్= వెళ్ళగా; అందున్= అక్కడి; కతిపయ, బ్రాహ్మణ, సహాయుండు+అయి= కొద్దిమంది బ్రాహ్మణుల సహాయం కలవాడై; పార్థుండు= అర్జునుడు; అరిగి= వెళ్ళి; పూర్వ, సముద్ర, తీరంబునన్= తూర్పుసముద్రతీరంలో; పురుషోత్తమదేవరకున్= జగన్నాథస్వామికి; నమస్కరించి; మహేంద్రపర్వతంబు, చూచుచున్= మహేంద్రపర్వతాన్ని చూస్తూ.

తాత్పర్యం: కళింగదేశంలో ప్రవేశించగానే అర్జునునివెంట వచ్చిన బ్రాహ్మణులలో కొందరు కళింగదేశ ద్వారం నుండి తిరిగి ఉత్తరకురుదేశాలకు వెళ్ళారు. మిగిలినవాళ్ళసాయంతో పార్థుడు తూర్పుసముద్రతీరంలో ఉన్న జగన్నాథస్వామిని సేవించి, మహేంద్రపర్వతం చూస్తూ.

సీ. దక్షిణగంగ నాఁ దద్దయు నొప్పిన । గోదావరియు, జగదాది యైన
భీమేశ్వరంబును, బెడఁగగుచున్న శ్రీ । పర్వతంబును జూచి, యుర్విలోన
ననఘ మై శిష్టాగ్రహారభూయిష్ఠ మై । ధరణీసురోత్తమాధ్వరవిధాన
పుణ్యసమృద్ధమై పొలుచు వేంగీదేశ । విభవంబుఁ జూచుచు విభుఁడు దక్షి

తే. ణాంబురాశితీరంబున కరిగి, దురిత । హారి యైన కావేరీమహాసముద్ర
సంగమంబున భూసురేశ్వరుల కభిమ । తార్థదానంబుఁ జేసి కృతార్థుఁ డగుచు. 139

ప్రతిపదార్థం: విభుఁడు= ప్రభువు - అర్జునుడు; దక్షిణగంగ; నాన్= అన్నట్లు; తద్దయున్= మిక్కిలి; ఒప్పిన= ప్రకాశించిన; గోదావరియు= గోదావరిని; జగత్+ఆది, ఐన= లోకానికి మొదలైన; భీమేశ్వరంబును= భీమేశ్వరాన్ని; బెడఁగు+అగుచున్+ఉన్న= మనోహరమైన; శ్రీపర్వతంబును= శ్రీశైలాన్ని; చూచి= కాంచి; ఉర్విలోనన్= భూమిలో; అనఘము+ఐ= పవిత్రమైన; శిష్ట+అగ్రహార, భూయిష్ఠము+ఐ= సదాచారసంపన్నులయొక్క అగ్రహారాలతో నిండినదై; ధరణీసుర+ఉత్తమ, అధ్వర, విధాన, పుణ్య, సమృద్ధము+ఐ= బ్రాహ్మణోత్తములయొక్క యజ్ఞకార్యాలచే కలిగే పుణ్యంతో నిండినదై; పొలుచు= ఒప్పు; వేంగీదేశ, విభవంబున్= వేంగీదేశంయొక్క వైభవాన్ని; చూచుచున్= చూస్తూ; దక్షిణ+అంబురాశి, తీరంబునకున్= దక్షిణ సముద్రతీరానికి; అరిగి= వెళ్ళి; దురిత, హారి+ ఐన= పాపాన్ని పోగొట్టేదైన; కావేరీ, మహాసముద్ర, సంగమంబునన్= కావేరీనది సముద్రంలో కలిసే చోట; భూసుర+ ఈశ్వరులకున్= బ్రాహ్మణశ్రేష్ఠులకు; అభిమత+అర్థ, దానంబున్+చేసి= కోరుకొన్నవాటిని దానం ఇచ్చి; కృత+అర్థుఁడు+అగుచున్= ధన్యుడై.

తాత్పర్యం: అర్జునుడు దక్షిణగంగ అని ప్రసిద్ధి పొందిన గోదావరీనదిని, లోకానికే మొదలు అనిపించుకొన్న భీమేశ్వరాన్ని, మనోహరమైన శ్రీశైలాన్ని చూచి, పవిత్రమై, శ్రోత్రియుల అగ్రహారాలకు నిలయమై, బ్రాహ్మణోత్తముల యజ్ఞకార్యాల పుణ్యఫలంతో నిండినదై వెలసి ఉన్న వేంగీదేశవైభవాన్ని చూస్తూ దక్షిణసముద్రతీరానికి వెళ్ళిపాపాలను పోగొట్టే కావేరీసముద్రసంగమంలో బ్రాహ్మణశ్రేష్ఠులకు ఇష్టమైన దానాలన్నీ ఇచ్చి, ధన్యుడయ్యాడు.

విశేషం: మనోహరమైన ఈ వేంగీదేశవర్ణనం స్వీయదేశాభిమానంతో నన్నయ తెలుగుభారతంలో చొప్పించిందే. ఇది అమూలకం. గోదావరిప్రశంసమాత్రం పి.పి.యస్.శాస్త్రిగారిప్రతిలో ఉన్నది.

అర్జునుండు చిత్రాంగదను వివాహంబగుట (సం.1-207-14)

వ. పదుమూఁడగు మాసంబున మణిపూరపురంబునకుంజని, యందున్న రాజుఁ జిత్రవాహనుం గని, వానిచేతం బూజితుం డయి, తత్పుత్త్రిఁ జిత్రాంగద యనుదాని వివాహంబుగా నపేక్షించిన, నయ్యర్జునునభిప్రాయం బాప్తులవలన నెఱింగి చిత్రవాహనుం డర్జునున కి ట్లనియె. 140

ప్రతిపదార్థం: పదుమూఁడు+అగు= పదమూడవనెలలో; మణిపూర, పురంబునకున్= మణిపూర నగరానికి; చని= వెళ్ళి; అందున్+ఉన్న, రాజున్= అక్కడ ఉన్న రాజును; చిత్రవాహనున్= చిత్రవాహనుణ్ణి; కని= చూచి; వానిచేతన్= ఆ రాజుచే; పూజితుండు+అయి= పూజింపబడినవాడై; తత్+పుత్రిన్= అతని కుమార్తెను; చిత్రాంగద, అను, దానిన్= చిత్రాంగద అను పేరుగల ఆమెను; వివాహంబు, కాన్= పెండ్లిచేసుకొనటానికి; అపేక్షించినన్= కోరగా; ఆ+అర్జును= ఆ అర్జునుని; అభిప్రాయంబు= అభిప్రాయాన్ని; ఆప్తులవలనన్= ఆప్తులమూలంగా; ఎఱింగి= తెలిసికొని; చిత్రవాహనుండు= చిత్రవాహనుడు; అర్జుననకున్= అర్జునునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అర్జునుడు పదమూడవమాసంలో మణిపూరమనే నగరానికి వెళ్లాడు. ఆ దేశపురాజైన చిత్రవాహనుణ్ణి చూచాడు. అతనిగౌరవం పొందాడు. అతనికూతురైన చిత్రాంగదను ప్రేమించాడు. వివాహంచేసికొనాలని అనుకొన్నాడు. అతనిఅభిప్రాయాన్ని ఆప్తులవలన తెలిసికొన్న చిత్రవాహనుడు అర్జునునితో ఈ విధంగా అన్నాడు.

విశేషం: అర్జునుని వ్రతం ద్వాదశ మాసాత్మకం-అంటే సంవత్సరం. ఇట "పదుమూడవమాసంబున" అనుటచే పండ్రెండుమాసాలు దాటాయికదా! వ్రతం ముగిసినా-అర్జునుడు ఇంకా పుణ్యతీర్థాటనం చేస్తూనే ఉన్నాడనుకోవాలి.

క. ధన్యుండ నైతి నీ కీ । కన్యక నీఁ గాంచి; యైనఁగలతెఱఁగు జగ
న్మాన్య! యెఱిఁగింపవలయు; న । నన్యమనస్కుండ వయి దయన్ విను మనఘా! 141

ప్రతిపదార్థం: జగత్+మాన్య= లోకంచే పూజింపబడేవాడా! నీకున్; ఈ, కన్యకన్= ఈ కన్నెను; ఈన్+కాంచి= ఈయగలిగి; ధన్యుండన్+ఐతిని= కృతార్థుణ్ణి అయ్యాను; ఐనన్= అయినప్పటికి; కల, తెఱఁగు= ఉన్నసంగతి; ఎఱిఁగింపవలయున్= తెలపాలి; అనఘా!= పాపరహితుడా! అనన్యమనస్కుండవు+అయి= మరొకదానిలో మనస్సు లేనివాడవై; దయన్= దయతో; వినుము.

తాత్పర్యం: అర్జునా! నీకు ఈ కన్యకను ఇవ్వగలిగి ధన్యుడనయ్యాను. అయినా ఉన్న సంగతి చెప్పాలి. పుణ్యాత్మా! సావధానంగా దయతో వినుము.

క. మా కులమునందుఁ దొల్లి ప్ర । భాకరుఁ డను రాజవరుఁ డపత్యము దనకున్
లేకున్న నుమేశ్వరునకుఁ । బ్రాకటముగ భక్తితోఁ దపం బొనరించెన్. 142

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వం; మా కులమునందు; ప్రభాకరుఁడు+అను; రాజ, వరుఁడు= రాజశ్రేష్ఠుడు; తనకున్; అపత్యము= సంతానం; లేకున్నన్= లేకపోగా; ప్రాకటముగన్= ప్రసిద్ధంగా; ఉమా+ఈశ్వరునకున్= ఉమాదేవి భర్తఅయిన పరమేశ్వరుడినిగూర్చి; భక్తితోన్= భక్తితో; తపంబు= తపస్సు; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: పూర్వం మా వంశంలో ప్రభాకరుడు అనే రాజశ్రేష్ఠుడు తనకు సంతానం లేకపోవటంవలన పరమేశ్వరుడినిగూర్చి భక్తితో తపస్సు చేశాడు.

వ. పరమేశ్వరుండును వానికిం గరుణించి నీకు నొక్కపుత్త్రుం డుద్భవించు; నీకులంబున వారికెల్ల సంతానం బిట్లు యగు నని వరం బిచ్చిన; నది మొదలుగా మావంశంబునవారికెల్ల నొక్కొక్కపుత్త్రుండ కా జన్మించుచు వచ్చిన నిప్పుడు నాకు నిక్కన్యక పుట్టె; నేను దీనిం బుత్త్రీకరణంబునం బెనిచితి. 143

ప్రతిపదార్థం: పరమ+ఈశ్వరుండును= పరమశివుడును; వానికిన్= ఆ ప్రభాకరునికి; (అతనిని); కరుణించి; నీకున్; ఒక పుత్త్రుండు; ఉద్భవించున్= పుట్టుతాడు; నీ, కులంబునవారికిన్+ఎల్లన్= నీ వంశంలోనివాళ్ళందరికీ; ఇట్లు+ఆ= ఈ విధంగానే; సంతానంబు= సంతతి; అగున్= కలుగుతుంది; అని, వరంబు= అని వరం; ఇచ్చినన్= ఈయగా; అదిమొదలు= నాడు మొదలుగా; మా, వంశంబునవారికిన్+ఎల్లన్= మా వంశలోనివాళ్లకు అందరికీ; ఒక్కొక్కపుత్త్రుండు+అ, కా= ఒక్కొక్కకొడుకే; జన్మించుచున్= పుట్టుతూ; వచ్చినన్= రాగా; ఇప్పుడు; నాకున్= నాకు; ఈ+కన్యక; పుట్టెన్= జన్మించింది; నేను; దీనిన్= ఈ కన్నెను; పుత్త్రీకరణంబునన్= పుత్త్రికగా; పెనిచితిన్= పెంచాను.

తాత్పర్యం: పరమేశ్వరుడు ఆ ప్రభాకరుడిని అనుగ్రహించి, 'నీ కొకకొడుకు పుడతాడు. నీ వంశంలోని వాళ్ళందరికీ ఇట్లాగే సంతానం కలుగుతుంది. (అంటే ఒక్కొక్కకొడుకుమాత్రమే పుట్టటం) అని వరమిచ్చాడు. అది మొదలుగా మా వంశంలోని వాళ్ళందరికీ ఒక్కొక్కకొడుకే జన్మిస్తూ వచ్చాడు. ఇప్పుడు నా కీ కన్యక పుట్టింది. నేను ఈ కన్యకను వంశం నిలిపే దానినిగా పెంచాను.

విశేషం: ఏ కుమారికి పుట్టిన పుత్త్రుడు తనకు పుత్రుడు కావాలని తండ్రి తలుస్తాడో ఆ కుమారికి పుత్త్రిక అనే సంజ్ఞ ఉన్నది. 'పుత్త్రీకరణంబునం' అనేదానికి. 'పుత్రాకారంబున' అనే పాఠాంతరం కూడా ఉన్నది. మొత్తం మీద చిత్రాంగద కుమారుడు (దౌహిత్రుడు) తన వంశకరుడు కావాలని చిత్రవాహనుని అభిమతం.

తే. ఇందుఁ బుట్టినసుతుఁడు మా కిందువంశ్య! । వంశవిస్తారకుండు గావలయు; నిదియ
యీలతాంగికి నుంకు; వి ట్లీఁగనోపు । దేని పెండిలియగుమ యీయింతిఁ బ్రీతి. 144

ప్రతిపదార్థం: ఇందున్= ఈ చిత్రాంగదకు; పుట్టిన, సుతుఁడు= పుట్టిన కుమారుడు; మాకున్; ఇందువంశ్య= చంద్రవంశానికి చెందినవాడా! ఓ అర్జునా!; వంశ, విస్తారకుండు= వంశాన్ని వృద్ధి చేసేవాడు; కావలయున్= కావాలి; ఇదియ= ఇదే; ఈ, లతా+అంగికిన్= ఈ సుకుమారికి; ఉంకువ= శుల్కం; ఇట్లు; ఈఁగన్= ఇవ్వటానికి; ఓపుదు(వు)+ఏని= చాలుదువేని; ఈ, ఇంతిన్= ఈ కాంతను; ప్రీతిన్= ప్రేమతో; పెండిలి, అగుము+అ= పెండ్లాడుమా!

తాత్పర్యం: అర్జునా! ఈ చిత్రాంగదకు పుట్టినకుమారుడు మా వంశం నిలిపేవాడు కావాలి. ఇదే నీవు ఈ కన్యకు ఇవ్వవలసిన శుల్కం. ఇట్లా ఇవ్వగలిగితే ప్రేమతో ఆమెను పెళ్ళి చేసికొమ్ము.

వ. అనిన నర్జునుండు చిత్రవాహనువచనంబున కొడంబడి చిత్రాంగద వివాహం బై. 145

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; అర్జునుండు= అర్జునుడు; చిత్రవాహనువచనంబునకున్= చిత్రవాహను మాటకు; ఒడంబడి= సమ్మతించి; చిత్రాంగదన్; వివాహంబు+ఐ= పెండ్లాడినవాడై, పెండ్లి చేసికొని.

తాత్పర్యం: అని అనగా అర్జునుడు చిత్రవాహనునిమాటకు ఒప్పుకొని చిత్రాంగదను పెండ్లాడి.

ఉ. అంగజరాజ్యలక్ష్మి పొడవైనదియొక్కొ యనంగ నొప్పు చి
త్రాంగదయందుఁ బార్థుఁడు మహాప్రణయప్రవణాంతరంగుఁ డై
యంగజభోగసంగమున నమ్మణిపూరపురిన్ సమస్తలో
కాంగణరంగసంగతవిహారయశోంగదుఁ డుండె లీలతోన్. 146

ప్రతిపదార్థం: అంగజ, రాజ్యలక్ష్మి= మన్మథునియొక్క రాజ్యలక్ష్మి; పొడవు+ఐనది, ఒక్కొ= రూపుతాల్చిందా; అనంగన్= అనునట్లు; ఒప్పు= ప్రకాశించు; చిత్రాంగద; అందున్= చిత్రాంగదపై; సమస్త, లోక+అంగణ, రంగ, సంగత, విహార, యశోంగదుఁడు= అన్నిలోకాల ముంగిళ్ళు అనే రంగస్థలాలలో కూడుకొన్న విహారం కల కీర్తి అనెడి బాహుపురి (సందికడియం) గలవాడు - అంటే అన్నిలోకాలలో వ్యాపించిన కీర్తి కలవాడు; పార్థుఁడు= అర్జునుడు; మహా, ప్రణయ, ప్రవణ+అంతరంగుఁడు+ఐ= మిక్కిలి ప్రేమలో ఆసక్తి కల మనస్సు కలవాడై; అంగజ, భోగ, సంగమునన్= మన్మథభోగాలతో కూడి; లీలతోన్= విలాసంగా; ఆ+మణిపూర, పురిన్, ఉండెన్= ఆ మణిపూరనగరంలో ఉండినాడు.

తాత్పర్యం: మన్మథుని రాజ్యలక్ష్మి రూపు తాల్చిందా అన్నట్లు మహాసౌందర్యవతి అయిన చిత్రాంగద మీద తగులు కొన్న మనస్సుతో, మన్మథభోగాలనుభవిస్తూ, మహాకీర్తిమంతుడైన అర్జునుడు మణిపూరపురంలో విలాసంతో ఉన్నాడు.

విశేషం: అలం : ఉత్ప్రేక్ష. మన్మథరాజ్యలక్ష్మివంటి ఆ చిత్రాంగదమీద తనివి తీరక అలలు అలలుగా పెల్లుబికిన పార్థుని శృంగారభావం - ప్రాసస్థానంలోనే గాక పద్యమంతటా ప్రయోగించబడిన బిందుపూర్వక 'గ' కారంతో చక్కగా వ్యక్తం చేయబడింది. అక్షరరమ్యమైన నన్నయపద్యాలలో ఇది ఒకటి.

అర్జునుండు పంచతీర్థంబులం దప్సరసలను శాపవిముక్తుల నొనరించుట (సం.1-208-1)

వ. ఇట్లుండి యొక్కనాఁడు తపోధనబ్రాహ్మణసమేతుం డై తత్సమీపంబున సముద్రతీరతీర్థంబులు చూచుచుం జని సౌభద్రం బను తీర్థంబుఁ గని యందు స్నానంబు సేయ సమకట్టిన నర్జునుం జూచి యందుల మును లి ట్లనిరి. 147

ప్రతిపదార్థం: ఇట్లు+ఉండి; ఒకనాఁడు; తపస్+ధన, బ్రాహ్మణ, సమేతుండు+ఐ= తపస్సే ధనంగా కల బ్రాహ్మణులతో కూడుకొన్నవాడై; తత్+సమీపంబునన్= ఆ మణిపూరపురానికి దగ్గర; సముద్రతీర, తీర్థంబులు= సముద్రం ఒడ్డున గల తీర్థాలు; చూచుచున్= చూస్తూ; చని=వెళ్ళి; సౌభద్రంబు+అను= సౌభద్రం అను పేరుగల ; తీర్థంబున్= తీర్థాన్ని; కని= చూచి; అందున్= ఆ తీర్థంలో; స్నానంబుచేయన్= స్నానం చేయటానికి; సమకట్టినన్= పూనుకోగా; అర్జునున్= అర్జునుణ్ణి; చూచి= కనుగొని; అందులన్= అందున్న; మునులు= ఋషులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: ఈ విధంగా ఉన్న అర్జునుడు ఒకనాడు తపోధనులైన బ్రాహ్మణులతో కలిసి ఆ మణిపూరపురానికి దగ్గరగా ఉన్న సముద్రతీరతీర్థాలను చూస్తూ సౌభద్రతీర్థాన్ని దర్శించాడు. అందులో స్నానం చేయటానికి పూనుకోగా, అక్కడ ఉన్న మునులు అతనితో ఇట్లా అన్నారు.

తరలము.

ఇది సౌరంగ నసాధ్య మెవ్వరి కిందువంశవరేణ్య! వి
న్మిదియ కా దివి యేనుతీర్థము లీసముద్రతటంబునన్
విదితముల్ దురితాపహంబులు వీని నెన్నఁడు నాడనో
డుదురు సన్మును లిందుఁ గోల్మొసళుల్ గొనున్ వడిఁ జొచ్చినన్. 148

ప్రతిపదార్థం: ఇందు, వంశ, వరేణ్యా= చంద్రవంశశ్రేష్ఠుడా!; ఓఅర్జునా!; ఇది= ఈ తీర్థం; చౌరంగన్= ప్రవేశించటానికి; ఎవ్వరికిన్= ఎంతటివారికైనా; అసాధ్యము= వీలుకాదు; వినుము; ఇదియ, కాదు= ఇది ఒక్కటే కాదు; ఇవి, ఏను, తీర్థముల్= ఇవి అయిదు తీర్థాలు; సముద్ర, తటంబునన్= ఈ సముద్రతీరాన; విదితముల్= ప్రసిద్ధాలు; దురిత+అపహంబులు= పాపాన్ని పోగొట్టేవి; సత్+మునులు = మహామునులు; వీనిన్= వీటిలో; ఎన్నఁడున్= ఎప్పుడును; ఆడన్= స్నానమాడటానికి; ఓడుదురు= భయపడతారు; ఇందున్= ఈ నీటిలో; చొచ్చినన్= ప్రవేశిస్తే; వడిన్= వెంటనే; కోల్+మొసళుల్= పెద్ద మొసళ్ళు; కొనున్= పట్టుకొంటాయి.

తాత్పర్యం: చంద్రవంశశ్రేష్ఠా! ఓ అర్జునా! ఈ తీర్థాన్ని ప్రవేశించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. వినుము. ఇదే కాదు. ఈ సముద్రతీరాన ప్రసిద్ధాలు, పాపహరాలు అయిన అయిదుతీర్థాలు ఉన్నాయి. మహామునులుకూడా వీటిలో స్నానం చేయటానికి భయపడతారు. దీనిలో ప్రవేశిస్తే వెంటనే పెద్దమొసళ్ళు పట్టుకొంటాయి.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది. 1.21.విశేషం.

వ. 'సౌభద్ర పౌలోమ కారంధమ ప్రసన్న భారద్వాజంబు లను నామంబుల దక్షిణసముద్ర తీరంబునం బ్రసిద్ధంబు లయిన యిప్పంచతీర్థంబు లిప్పుడు నూతేండ్లంగోలె నుగ్రగ్రాహగృహీతంబు లయి దుర్జనగృహీతంబు లయిన

రాజులవిభవంబులుంబోలె సాధుజనవర్జితంబు లయి యుండు' ననిన విని విజయుం 'డశేషతీర్థసేవార్థి నయి
వచ్చిన నాకు నీతీర్థంబు లాడకునికి పౌరుషంబు గా' దని యందు. 149

ప్రతిపదార్థం: సౌభద్ర, పౌలోమ, కారంధమ, ప్రసన్న, భరద్వాజంబులు, అను, నామంబులన్= సౌభద్రము, పౌలోమము, కారంధమము, ప్రసన్నము, భారద్వాజము లను పేర్లతో; దక్షిణ, సముద్రతీరంబునన్ = దక్షిణసముద్రపు ఒడ్డులో; ప్రసిద్ధంబులు+అయిన; ఈ+పంచ, తీర్థంబులు= ఈ అయిదు తీర్థాలు; ఇప్పుడు; నూతేండ్లన్+కోలెన్= నూరుసంవత్సరాల నుండి; ఉగ్ర, గ్రాహ, గృహీతంబులు+అయి= భయంకరాలైన మొసళ్ళచే గ్రహింపబడినవై; దుర్జన, గృహీతంబులు+అయిన= దుర్మార్గులచే గ్రహింపబడిన; రాజుల, విభవంబులున్+పోలెన్= రాజుల ఐశ్వర్యాలవలె; సాధుజన, వర్జితంబులు+అయి= మునీశ్వరులచేత విడువబడినవై; ఉండున్= ఉన్నాయి; అనినన్= అని అనగా; విని; విజయుండు= అర్జునుడు; అశేష, తీర్థసేవా+అర్థిన్+అయి= అన్ని తీర్థాలు సేవించాలన్న కోరిక కలవాడినై; వచ్చిన; నాకున్; ఈ, తీర్థంబులు; ఆడక+ఉనికి= స్నానమాడకుండటం; పౌరుషంబు; కాదు; అని; అందున్ = ఆ తీర్థాలలో;

తాత్పర్యం: 'సౌభద్ర, పౌలోమ, కారంధమ, ప్రసన్న, భారద్వాజంబు లనే పేర్లతో దక్షిణసముద్రతీరంలో ప్రసిద్ధా లైన ఈ అయిదు తీర్థాలను నూరేండ్లనుండి భయంకరాలైన మొసళ్ళు ఆక్రమించాయి. దుర్మార్గులవశం అయిన రాజుల ఐశ్వర్యాలవలె ఇవి మునీశ్వరులచేత విడువబడి ఉన్నాయి' - అనగా విని అర్జునుడు, 'అన్ని తీర్థాలు సేవించగోరిన నాకు ఈ తీర్థాలలో స్నానం చేయకుండా ఉండటం పౌరుషం కాదు' అని.

విశేషం: అలం: ఉపమ.

క. సాహసికుం డై నరుఁ డవ । గాహము సేయుటయు జలము గ్రక్కదల మహా
గ్రాహము బీభత్సు బృహ । ద్బాహుబలుం బట్టికొనియెఁ బఱతెంచి వడిన్. 150

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; సాహసికుండు+ఐ= సాహసంకలవాడై; అవగాహము= స్నానం; చేయుటయు; మహాగ్రాహము= పెద్దమొసలి; జలము= నీరు; కదల+కదల= మిక్కిలి కలత చెందగా; వడిన్= వేగంగా; పఱతెంచి= పరుగెత్తి వచ్చి; బృహత్+బాహుబలున్= గొప్పభుజంబలంకలవాడిని; బీభత్సున్= అర్జునుడిని; పట్టుకొనియెన్= పట్టుకొన్నది.

తాత్పర్యం: అర్జునుడు సాహసించి స్నానం చేయటానికి నీటిలో మునుగగా; పెద్దమొసలి ఒకటి నీరంతా కలత చెందేటట్లు వేగంగా పరుగెత్తి వచ్చి అతడిని పట్టుకొన్నది.

ఆ. దాని నశ్రమమునఁ దజ్జలాశయము వె । ల్వడఁగ వైచె నరుఁడు బాహుశక్తి;
నదియుఁ దత్క్షణంబ యభినవ యౌవనో । ద్భాసమాన దివ్యభామ యయ్యె. 151

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; బాహుశక్తిన్= భుజబలంతో; దానిన్= ఆ మొసలిని; అశ్రమమునన్= సులువుగా; తత్+జల+ఆశయము= ఆ మడుగునుండి; వెల్వడఁగన్= బయటపడేటట్లు; వైచెన్= విసరివేశాడు; అదియున్= ఆ మొసలికూడా; తత్+క్షణంబు+అ= ఆ క్షణమే; అభినవ, యౌవన+ఉద్భాసమాన, దివ్యభామ= కొత్తయౌవనంతో ప్రకాశిస్తున్న దివ్యస్త్రీ; అయ్యెన్= అయింది.

తాత్పర్యం: అర్జునుడు తన భుజబలంతో ఆ మొసలిని సులభంగా మడుగునుండి బయటపడేటట్లు విసిరాడు. అది వెంటనే నూత్నయౌవనంతో ప్రకాశించే దివ్యకాంత అయింది.

ఉ. ఆ లలితాంగిఁ జూచి నరుఁ డద్భుత మంది 'మృగాయతాక్షి! యి
ట్లేల జలేచరత్వమున నిజ్జలధిన్ వసియించి? తిప్పు డి
ట్లేల సురూప భామ వయి? తెందులదానవు నీవు?' నావుడున్
బాలిక పాండుపుత్త్రునకుఁ బార్థున కి ట్లనియెం బ్రియంబునన్. 152

ప్రతిపదార్థం: నరుఁడు= అర్జునుడు; ఆ, లలిత+అంగిన్= ఆ అందమైన శరీరం కలదానిని; చూచి, అద్భుతము+అంది= ఆశ్చర్యపడి; మృగ+ఆయత+అక్షి= లేడి కన్నులవంటి విశాలమైన కన్నులు కలదానా!; ఇట్లు, ఏల = ఈ విధంగా ఏల; జలేచరత్వమునన్= నీటిలో తిరిగే ప్రాణివి - మొసలివి కావటంవలన; ఈ+జలధిన్= ఈ మడుగులో; వసియించితి(వి)= ఉన్నావు; ఇప్పుడు= ఇపుడు; ఇట్లు; ఏల= ఎందుకు; సు, రూప, భామవు+అయితి(వి)= అందమైన కాంతవు అయ్యావు; నీవు, ఎందుల, దానవు= నీవు, ఎక్కడిదానవు; నావుడున్= అని అనగా; బాలిక= ఆ కాంత; పాండుపుత్త్రునకున్= పాండుకుమారునికి; పార్థునకున్= అర్జుననకు; ప్రియంబునన్= ప్రీతితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అందమైన ఆ కాంతను చూచి అర్జునుడు ఆశ్చర్యపడి 'నీ వేల మొసలివై ఈ విధంగా మడుగులో ఉన్నావు? ఇప్పుడు ఈ విధంగా ఎందుకు అందాలభామవయ్యావు? ఎక్కడి దానవు? అని అడుగగా ఆమె అర్జునునితో ఇట్లా అన్నది.

వ. 'ఏను వంద యను నప్సరసఁ, గుబేరుననుంగ; నాసఖులు సౌరభేయియు సమీచియు బుద్బుదయు లతయు ననువారలు నలువురు నాయట్ల యత్తీర్థంబులం దున్నవారలు; వారిని శాపవిముక్తలం జేసి రక్షింపు' మనిన దానికి నర్జునుం డి ట్లనియె. 153

ప్రతిపదార్థం: ఏను= నేను; వంద, అను= వంద అనే పేరుగల; అప్సరసన్= అప్సరసను; కుబేరు, అనుంగన్= కుబేరునియొక్క చెలిని; నా సఖులు= నా స్నేహితురాండ్రు; సౌరభేయియు; సమీచియు; బుద్బుదయు; లతయున్; అనువారలు= అనేవాళ్లు; నలువురు= నలుగురు; నాయట్ల= నావలెనే; ఆ తీర్థంబులందున్= ఆ తీర్థాలలో; ఉన్నవారలు= ఉన్నారు; వారిని= వాళ్లను; శాపవిముక్తలన్= శాపంనుండి తొలగచేసి; రక్షింపుము= కాపాడు; అనినన్= అనిఅనగా; దానికిన్= ఆ అప్సరసకు; అర్జునుండు= అర్జునుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నా పేరు వంద, కుబేరుని స్నేహితురాలిని. నా స్నేహితురాండ్రు సౌరభేయి, సమీచి, బుద్బుద, లత అనేవాళ్ళు నలుగురూ నావలె తీర్థాలలో ఉన్నారు. వాళ్ళనికూడా శాపవిముక్తులను చేసి రక్షింపుము' అని అనగా ఆమెతో అర్జునుడు ఇట్లా అన్నాడు.

విశేషం: వంద అనేదానికి అనేకప్రతులలో నంద అనే పాఠాంతరం ఉన్నది. భాండార్కరు ప్రతి అథస్సూచికలో వర్గా; వర్చా, వృందా, వర్దా, వందా, విందా, నందా అనేవిధంగా అనేక పాఠాలున్నాయి. మూలభారతం వావిళ్ళవారి తెలుగులిపి ప్రతిలో 'అహం చ సౌరభేయీచ, సమీచీ బుద్బుదా లతా' అని ఉన్నది.

క. 'వనజాక్షి! యేమికారణ । మున నుగ్రగ్రాహరూపములు దాల్చితి రీ?'
రని యడిగిన వేడుక నా । తని కది యి ట్లనుచుఁ జెప్పెఁ దద్విధమెల్లన్. 154

ప్రతిపదార్థం: వనజ+అక్షి!= పద్మాలవంటి కన్నులుకలదానా! ఈరు= మీరు; ఏమి, కారణమునన్= ఏకారణంచేత; ఉగ్ర, గ్రాహ, రూపములు= భయంకరాలైన మొసళ్ళ రూపాలు; తాల్చితిరి= ధరించారు; అని, అడిగినన్= అని అడుగగా; అది= ఆ అప్సరస; వేడుకన్= సంతోషంతో; అతనికిన్= అర్జునునికి; ఇట్లు+అనుచున్= ఈ విధంగా అంటూ; తత్+విధము+ఎల్లన్= ఆ విధమంతా చెప్పెన్.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! ఏ కారణంవలన మీరు భయంకరాలైన ఈ మొసళ్ళరూపాలు తాల్చారు?' అని అడుగగా, ఆమె సంతోషంతో ఆ విధమంతా చెప్పింది.

వ. వినవయ్య! యే మేవురము నఖిలలోకపాలపురంబులు చూచుచు భూలోకంబునకు వచ్చి యొక్క వనంబునం దుగ్రతపంబు సేయుచున్నవాని నత్యంతశాంతు నేకాంతచారి నగ్నికల్పు నొక్కబ్రాహ్మణుం గని వానితపంబునకు విఘ్నంబు సేయ సమకట్టి. 155

ప్రతిపదార్థం: వినవయ్య!; ఏము= మేము; ఏవురము= అయిదుగురం; అఖిల, లోకపాల, పురంబులు= అందరు దిక్పాలకుల పట్టణాలు; చూచుచున్; భూలోకంబునకున్; వచ్చి; ఒక్క, వనంబునందున్= ఒక అడవిలో; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేయుచున్+ఉన్న= చేస్తూ ఉన్న; వానిన్= అతనిని; అత్యంత, శాంతున్= మిక్కిలిశాంతం కలవాడిని; ఏకాంతచారిన్= ఒంటరిగా ఉన్నవాడిని; అగ్నికల్పున్= అగ్నిదేవునితో సమానమైనవాడిని; ఒక్క, బ్రాహ్మణునిన్; కని= చూచి; వాని, తపంబునకున్; విఘ్నంబు, చేయన్= భంగం కలిగించటానికి; సమకట్టి= పూనుకొని.

తాత్పర్యం: మే మైదుగురం దిక్పాలకులందరిపట్టణాలు చూస్తూ, భూలోకానికి వచ్చాము. ఒక అడవిలో ఒంటరిగా కూర్చుండి భయంకరమైన తపస్సు చేస్తూ మిక్కిలిశాంతంగా, అగ్నిదేవునితో సమానంగా ఉన్న ఒక బ్రాహ్మణుడిని చూచి అతనితపస్సు చెడగొట్ట పూనుకొని.

విశేషం: ఆ బ్రాహ్మణుడు అత్యంతశాంతుడు, అగ్నికల్పుడు అని చెప్పటం పరస్పరవిరుద్ధంగా భాసించినా - కాని, అతడు సహజంగా అత్యంతశాంతుడనీ, ఆగ్రహిస్తే అగ్నితో సమానుడనీ ఇక్కడ గ్రహించాలి. అగ్నిహోత్రుడు పవిత్రతకు పెట్టింది పేరు కాబట్టి అగ్నికల్పుడనటంలో ఆ బ్రాహ్మణుని పవిత్రతకూడా వ్యక్తమవుతున్నది.

క. వేడుక నమ్ముని ముందటఁ । బాడితి మాడితిమి; పెక్కుపరిహాసంబుల్
రూఢిగఁ బలికితి; మెట్లుం । జూడఁడు మావలను; నీరసుం డన నుండెన్. 156

ప్రతిపదార్థం: వేడుకన్= వినోదంగా; ఆ+ముని, ముందటన్; పాడితిమి; ఆడితిమి; పెక్కు, పరిహాసంబుల్; రూఢిగన్=ప్రసిద్ధంగా; పలికితిమి; ఎట్లున్= ఏవిధంగానూ; మావలను= మావైపు; చూడడు; నీరసుండు+అనన్= అనురాగం లేనివాడు అన్నట్లు; ఉండెన్.

తాత్పర్యం: మేము వినోదంగా ఆ మునిముందట పాడాము. ఆడాము, అనేకపరిహాసాలు పలికాము. ఆయన ఏ విధంగా కూడా మా వైపు చూడక అనురాగం లేని వానివలె ఉన్నాడు.

క. ధృతిహీనులచిత్తము ల । ట్లతివలయం దేల తగులు నత్యంతదృఢ
వ్రతులమనంబులు వారల । మతులఁ దృణస్త్రైణములు సమంబుల కావే. 157

ప్రతిపదార్థం: ధృతి; హీనుల, చిత్తముల్+అట్ల= ధైర్యంలేని వాళ్ళ మనస్సులవలె; అత్యంత, దృఢవ్రతుల, మనంబులు= మిక్కిలి దృఢమైన నిష్ఠ కలవారి మనస్సులు; అతివల, అందున్= స్త్రీలలో; ఏల; తగులున్= తగుల్కొంటాయి; వారల, మతులన్= మిక్కిలి దృఢవ్రతులైనవారి మనస్సులలో; తృణ, స్త్రైణములు= గడ్డి, స్త్రీలసమూహం; సమంబులు+అ= సమానములే; కావె= కదా!

తాత్పర్యం: మనోనిగ్రహం కలవారిమనస్సులు, నిగ్రహం లేనివారి మనస్సులవలె స్త్రీల విషయంలో ఎందుకు తగులుకొంటాయి? నిగ్రహపరుల దృష్టిలో స్త్రీలు, గడ్డిపరకలు సమానములే కదా!

వ. ఏము రాగకారణవికారంబులు గావించిన నవి దనకుం గోపకారణంబు లయిన నతికుపితుం డయి బ్రాహ్మణుండు మమ్మేవురను మహాగ్రాహంబులుగా శపియించిన నమ్మునివరునకు ముకుళితహస్తల మై యి ట్లంటిమి. 158

ప్రతిపదార్థం: ఏము= మేము; రాగ, కారణ, వికారంబు= అనురాగాన్ని కలిగించే పనులు; కావించినన్, అవి; తనకున్; కోప, కారణంబులు+అయినన్= కోపాన్ని కలిగించినవి కాగా; అతి, కుపితుండు+అయి= మిక్కిలికోపం కలవాడై; బ్రాహ్మణుండు; మమ్ము+ఏవురను= మా అయిదుగురిని; మహా, గ్రాహంబులు, కాన్= పెద్ద మొసళ్ళు అయ్యేటట్లు; శపియించినన్; ఆ+మునివరునకున్= ఆ మునిశ్రేష్ఠునికి; ముకుళిత, హస్తలము+ఐ = చేతులు జోడించినవాళ్ళమై - అంటే నమస్కరించి; ఇట్లు+అంటిమి.

తాత్పర్యం: మేము అనురాగాన్ని రేకెత్తించే చిలిపిచేష్టలు చేయగా - అవి, అతనికి కోపం తెప్పించాయి. ఆ బ్రాహ్మణుడు బాగా కోపించి మా అయిదుగురిని పెద్దమొసళ్ళు కండని శపించాడు. అప్పుడు మేము చేతులు జోడించి ఈ విధంగా అన్నాం.

చ. అలుగుదురయ్య విప్రులు ? మహాపురుషుల్ పరుషాపరాధముల్
దలిఁగెడువారు ధర్మువులు దప్పక సల్పెడువారు సత్యముల్
పలికెడువారు; వారల కపాయము డెందములం దలంచు మూ
ర్ఖులకు విధాతృచెయ్వున నగున్ దురితంబులు దుర్యశంబులున్. 159

ప్రతిపదార్థం: మహాపురుషులు= ఎంతోగొప్పవాళ్ళు; పరుష+అపరాధముల్= కఠినమైన మాటలను, తప్పులను; తలిఁ గెడువారు= తొలగించేవాళ్ళు అంటే కఠినంగా మాట్లాడనివాళ్ళు, తప్పులను చేయనివాళ్ళు; ధర్మువులు= ధర్మాలను; తప్పక; సలిపెడువారు= ఆచరించేవాళ్ళు; సత్యముల్; పలికెడువారు; అయిన; విప్రులు= బ్రాహ్మణులు; అలుగుదురు+అయ్య= కోపపడతారా?; వారలకున్= అట్లాంటి బ్రాహ్మణులకు; అపాయము= హాని; డెందములన్= మనస్సులలో; తలంచు= ఆలోచనచేసే; మూర్ఖులకున్= బుద్ధి లేనివాళ్ళకు; విధాతృ, చెయ్వునన్= బ్రహ్మదేవునిచేష్టలవలన దురితంబులు= పాపాలు; దుర్+యశంబులున్= అపకీర్తులు-అంటే చెడ్డపేరు; అగున్= కలుగుతుంది.

తాత్పర్యం: ఎంతో గొప్పవాళ్ళు, కఠినంగా మాట్లాడనివాళ్ళు, తప్పులు చేయనివాళ్ళు, ధర్మంగా నడచుకొనేవాళ్ళు; సత్యాలు పలికేవాళ్ళు అయిన బ్రాహ్మణులు కోపించటం తగునా? అట్లాంటి బ్రాహ్మణులకు హాని తలపెట్టే మూర్ఖులు బ్రహ్మదేవునివలన పాపాలు, అపకీర్తులు పొందుతారు.

విశేషం: అలుగుదురయ్య విప్రులు అని ప్రారంభించి సంస్కృతభాషాసంప్రదాయానుసారంగా విశేష్యం తరువాత పెక్కు విశేషణాలను ప్రయోగించటం భావతీవ్రతను పెంచటానికి బాగా దోహదం చేసింది.

వ. 'కావున మాచేసిన యజ్ఞానంబు సహించి మాకు శాపమోక్షంబుఁ బ్రసాదింపు' మనిన నవ్విప్రుండును గరుణించి 'యెవ్వండేని మీచే గృహీతుం డయి మీయున్న జలాశయంబు మిమ్ము వెలువరించు నాతండ మీకు శాపమోక్షకారణుం డగు' ననిన. 160

ప్రతిపదార్థం: కావున; మా, చేసిన= మేముచేసిన; అజ్ఞానంబు = తెలివితక్కువతనాన్ని; సహించి= ఓర్చుకొని; మాకున్; శాప, మోక్షంబున్= శాపం తొలగటాన్ని; ప్రసాదింపుము= అనుగ్రహింపుము - ఇమ్ము; అనినన్= అని అనగా; ఆ+విప్రుండును= ఆ బ్రాహ్మణుడుకూడా; కరుణించి= దయతలచి; ఎవ్వండు+ఏని= ఎవడైతే; మీచేతన్; గృహీతుండు+అయి= పట్టుకొన బడినవాడై; మీ, ఉన్న= మీరున్న; జల+ఆశయంబు= మడుగునుండి; మిమ్మున్, వెలువరించున్= బయటకు వేయునో; ఆతండు+అ= అతడే; మీకున్; శాప, మోక్ష, కారణుండు= శాపాన్ని తొలగించటానికి కారణమైనవాడు; అగున్; అనినన్.

తాత్పర్యం: 'అందువలన మా తెలివితక్కువతనాన్ని సహించి మాకు శాప విమోచనాన్ని ప్రసాదించండి' అని అడుగగా, ఆ బ్రాహ్మణుడుకూడా దయతలచి, 'మీరు పట్టుకున్నపుడు ఎవడైతే మిమ్మల్ని మీ మడుగునుండి బయటకు పడవేస్తాడో వాడే మీ శాపవిమోచనానికి కారకుడు అవుతాడు' అనగా.

సీ. అట్టిమహాబాహుఁ డత్యంతబలుఁ డెవ్వఁ । డగునొక్కొ! యనుచు నే మరుగుదెంచు
వారము త్రైలోక్యవర్తి నంబుజభవ । ప్రభవు నారదుఁ గని భక్తితోడ
మ్రొక్కిన మమ్ము నమ్ముని చూచి 'యి ట్లేల । వగఁ బొంది కందినవార?' లనియు
నడిగి మావృత్తాంత మంతయు మాచేత । విని, 'విప్రునలుకయు విధికృతంబుఁ

ఆ. గ్రమ్మఱింప లావె! కావున దక్షిణ । జలధితీరమునఁ బ్రశస్త పంచ
తీర్థములకు నేఁగి ధృతి నందు నూఱేఁడు । లుండుఁ డట్లు మీర లుండు నంత'. 161

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; మహా, బాహుఁడు= పెద్దచేతులు గలవాడు; అత్యంత, బలుఁడు= మిక్కిలిబలంకలవాడు; ఎవ్వఁడు+అగున్+ఒక్కొ= ఎవడై ఉన్నాడో; అనుచున్= అని అనుకొంటూ; ఏము= మేము; అరుగుదెంచువారము= వస్తున్నవాళ్ళము; త్రైలోక్యవర్తిన్= మూడులోకాలు తిరిగేవాడిని; అంబుజభవ, ప్రభవు= పద్మంనుండి జన్మించిన బ్రహ్మదేవుడికి పుట్టినవానిని; నారదున్= నారదమహర్షిని; కని= చూచి; భక్తితోడన్= భక్తితో; మ్రొక్కి= నమస్కరించి; మమ్మున్= మమ్ములను; ఆ+ముని= ఆ నారదుడు; చూచి; ఇట్లు; ఏల= ఎందుకు; వగన్= దుఃఖాన్ని; పొంది; కందినవారలు= నలుపెక్కినవారు; అనియున్= అనికూడా; అడిగి; మా వృత్తాంతము+అంతయు; మాచేతన్= మావల్ల; విని; విప్రు, అలుకయున్= బ్రాహ్మణునియొక్క కోపాన్ని; విధి, కృతంబున్= బ్రహ్మచేసిన పనిని; క్రమ్మఱింపన్= మరల్చటానికి; లావె= సాధ్యమా (కాదనిభావం); కావున; దక్షిణ, జలధి, తీరమునన్= దక్షిణసముద్రతీరంలో; ప్రశస్త, పంచ, తీర్థములకున్= ప్రసిద్ధిపొందిన అయిదు నీటిమడుగులకు; ఏఁగి= వెళ్ళి; ధృతిన్= ధైర్యంతో; అందున్= ఆ మడుగులలో; నూఱు+ఏఁడులు= వందసంవత్సరాలు; ఉండుఁడు= ఉండండి; అట్లు, మీరలు= ఆ విధంగా మీరు; ఉండు, అంతన్= ఉండగా.

తాత్పర్యం: అట్లాంటి (మాచేత పట్టుబడి మమ్మల్ని మడుగులనుండి బయట పడవేయగలిగిన) గొప్ప చేతులు కలవాడు; మిక్కిలి బలం కలవాడు; ఎవడా? అని అనుకొంటూ వస్తున్న మేము, ముల్లోకాలలో సంచరించే, బ్రహ్మపుత్రుడైన నారదుడిని చూచి, భక్తితో నమస్కరించాము. ఆ మహాముని మమ్మల్ని చూచి 'ఇట్లా ఎందుకు దుఃఖంతో నల్లబడ్డా'? రని అడిగాడు. మా వృత్తాంతమంతా చెప్పగా విని, 'బ్రాహ్మణులకోపం, బ్రహ్మదేవునిచేష్ట మరలింప సాధ్యం కాని' వని 'దక్షిణసముద్రతీరంలో ప్రసిద్ధికెక్కిన అయిదు మడుగులకు వెళ్ళి, వాటిలో ధైర్యంగా నూరుసంవత్సరాలు ఉండండి; అట్లా మీరు ఉండగా'.

క. 'జననుతుఁడు పాండుతనయుఁడు । ధనంజయుఁ డశేషతీర్థదర్శనకాంక్షం
జనుదెంచి మీకు దయ నమ్ముని చెప్పినయట్ల శాపమోక్షము సేయున్'. 162

ప్రతిపదార్థం: జన, నుతుఁడు= ప్రజలచే కొనియాడబడేవాడు; పాండు, తనయుఁడు= పాండురాజుకుమారుడు; ధనం జయుఁడు= అర్జునుడు; అశేష, తీర్థ, దర్శన కాంక్షన్= అన్ని పుణ్యతీర్థాలను చూడాలనే కోరికతో; చనుదెంచి= వచ్చి; ఆ+ముని; చెప్పిన, అట్ల= చెప్పినట్లే; దయన్= దయతో; మీకున్, శాప, మోక్షము= మీకు శాపాన్ని తొలగించటం; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: ప్రజల ప్రశంసలందుకొన్నవాడు, పాండురాజుకుమారుడు అయిన అర్జునుడు అన్ని పుణ్యతీర్థాలను చూడాలన్న కోరికతో వస్తాడు. ఆ ముని చెప్పినట్లే దయతో మీకు శాపవిమోచనాన్ని కలిగిస్తాడు.

వ. 'అనిన నన్నారదువచనంబులు విని వచ్చి మహోగ్రగ్రాహముల మై భవదాగమనంబు ప్రతీక్షించుచు నిప్పంచతీర్థంబుల నుండి నేఁడు నీకారణంబునం గృతార్థుల మయితి' మనిన నర్జునుండును గరుణాయత్తచిత్తుం డయి వంద చెప్పినయన్నలువురకు శాపమోక్షణంబు సేసిన, నమరకన్యక లతిహర్షంబున నమరేంద్రనందను దీవించి దేవలోకంబున కరిగె; రదిమొదలుగా నిప్పంచతీర్థంబులు నారీతీర్థంబులు నాఁ బరగె; నర్జునుండును గ్రమ్మఱి మణిపూరపురంబునకు వచ్చి రాజ్యలీల సుఖంబుండి చిత్రాంగదయందు బభ్రువాహనుం డను పుత్త్రుం బడసి చిత్రవాహనునకు వంశకరుంగా నిచ్చి, వాని వీడ్కొని గోకర్ణంబుఁ జూచుచుఁ బశ్చిమసముద్రపార్శ్వంబునఁ బ్రభాసం బను తీర్థంబునకుఁ జని, యందులకు ద్వారవతి పురంబు కుఱంగలి యని విని. 163

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఆ+నారదు, వచనంబులు= ఆ నారదుని మాటలు; విని; వచ్చి; మహా+ఉగ్ర, గ్రాహములము+ఐ= మిక్కిలి భయంకరమైన మొసళ్ళమై; భవత్+ఆగమనంబు= మీయొక్క రాకను; ప్రతీక్షించుచున్= ఎదురుచూస్తూ; ఈ+ పంచ తీర్థంబులన్= ఈ అయిదు తీర్థాలలో; ఉండి; నేఁడు= ఈ దినం; నీ, కారణంబునన్= నీ వల్ల; కృత+అర్థులము= తీరిన కోరిక కలవాళ్ళం; అయితిమి; అనినన్= అని అనగా; అర్జునుండును; కరుణా+ఆయత్త, చిత్తుండు+అయి= దయతో కూడిన మనస్సు కలవాడై; వంద, చెప్పిన= వంద తెలిపిన; ఆ+నలువురకున్= ఆ నలుగురికి; శాప, మోక్షణంబు= శాపంనుండి విడిపించటాన్ని; చేసినన్= చేయగా; అమర, కన్యకలు= దేవకన్యకలు; అతి, హర్షంబునన్= మిక్కిలి సంతోషంతో; అమర+ఇంద్ర, నందనున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడిని; దీవించి= ఆశీర్వదించి; దేవ లోకంబునకు= దేవలోకానికి; అరిగిరి= వెళ్ళారు; అదిమొదలుగాన్; ఈ+పంచతీర్థంబులు= ఈ ఐదు తీర్థాలు; నారీ, తీర్థంబులునాన్= నారీ తీర్థాలని; పరఁగెన్= ఒప్పిఉన్నాయి; అర్జునుండును; క్రమ్మఱి= తిరిగి; మణిపూర, పురంబునకున్ =

మణిపూర నగరానికి; వచ్చి, రాజ్యలీల, సుఖంబు+ఉండి= రాజ్యభోగాలతో సుఖంగా ఉండి; చిత్రాంగద, అందున్= చిత్రాంగదయందు; బభ్రువాహనుండు+అను; పుత్త్రున్= కుమారుని; పడసి= పొంది; చిత్రవాహనునకున్= చిత్రవాహనునికి; వంశకరున్+కాన్= వంశంనిలిపేవాడినిగా - అంటే వంశంవృద్ధి చేసేవాడినిగా; ఇచ్చి; వానిన్= ఆ చిత్రవాహనుడిని; వీడ్కొని; గోకర్ణంబున్= గోకర్ణతీర్థాన్ని; చూచుచున్, పశ్చిమ, సముద్ర, పార్శ్వంబునన్= పడమటి సముద్రం ప్రక్క; ప్రభాసంబు+అను, తీర్థంబునకున్= ప్రభాసం అనే పేరుగల తీర్థానికి; చని= వెళ్ళి; అందులకున్= అక్కడికి; ద్వారవతి, పురంబు= ద్వారకా నగరం; కుఱంగలి= దగ్గర; అని; విని.

తాత్పర్యం: 'అని చెప్పిన ఆ నారదునిమాలు విని వచ్చి, మిక్కిలి భయంకరమైన మొసళ్ళమై, మీ రాకకోసం ఎదురుచూస్తూ, నేడు నీవలన కోరిక తీరినవాళ్ళం అయ్యాము' - అని అనగా అర్జునుడుకూడా వంద అడిగినట్లు ఆ నలుగురికి దయతో శాపవిమోచనం కావించాడు. ఆ దేవకన్యలు ఎంతో సంతోషించి, దేవేంద్రతనయుడైన అర్జునుడిని ఆశీర్వదించి దేవలోకానికి వెళ్ళారు. ఆనాటినుండి ఆ పంచతీర్థాలకు నారీతీర్థాలనే పేరు కలిగింది. అర్జునుడుకూడా మణిపూరపురానికి తిరిగి వచ్చి రాజ్యభోగాలనుభవిస్తూ చిత్రాంగదయందు బభ్రువాహనుడనే కుమారుడిని పొంది, ఆ బాలుడిని చిత్రవాహనునికి వంశకరునిగా - అంటే వంశం నిలిపేవాడిగా ఇచ్చి, అక్కడి నుండి బయలుదేరి గోకర్ణతీర్థాన్ని చూస్తూ, పడమటిసముద్రంప్రక్కన ప్రభాసతీర్థానికి వెళ్ళి, అక్కడికి ద్వారవతి దగ్గర, అని విని.

విశేషం: చిత్రవాహనుడు కోరినట్లు (చూడు.144. పద్యం) చిత్రాంగదకు పుట్టిన బభ్రువాహనుడిని (దౌహిత్రుడిని) వంశకరునిగా అర్జునుడు అతనికి ఇవ్వటం జరిగింది.

సీ. 'అందుల కేఁగి యే నిందీవరశ్యాము । నరవిందనాభు నంబురుహనేత్రు
సన్మిత్రుఁ జూచి నాజన్మంబు సఫలంబు । సేయుదు నఘములు వాయుపొంటెఁ;
నదియునుంగాక, మున్ గదుఁ దనువానిచే । వింటిఁ దిలోత్తమకంటె రూప
వతియట్టె సద్గుణాన్వితయట్టె నా కట్టి । భద్రేభగమన సుభద్రఁ జూచు

ఆ. వేడుకయును గలదు; విష్ణుభట్టారకు । దయ నభీష్టసిద్ధి దనరు' ననుచుఁ
దద్ద సంతసిల్లి తద్ద్వారకాపురి । కరుగ నిశ్చయించె నర్జునుండు. 164

ప్రతిపదార్థం: అందులకున్= ఆ ద్వారవతికి; ఏఁగి= వెళ్ళి; ఏన్=నేను; ఇందీవర, శ్యామున్= నల్లకలువవంటి నల్లనిరంగు కలవాడిని; అరవింద, నాభున్= పద్మాన్ని బొడ్డుగా కలవాడిని; అంబురుహ, నేత్రున్= పద్మాలవంటి కన్నులు కలవాడిని; సత్+మిత్రున్= మంచిస్నేహితుడిని; చూచి, నా, జన్మంబు; సఫలంబు; చేయుచున్; అఘములు= పాపాలు; పాయుపొంటెన్= పోగొట్టుకోవటం కొరకు; అదియునున్+కాక= అదీకాక; మున్= పూర్వం; గదుఁడు+అనువానిచే; వింటిన్; (సుభద్ర) తిలోత్తమకంటెన్; రూపవతి; అటె= అందమైనదట; సద్గుణ+అన్విత, అట్టె= మంచిగుణాలతో కూడుకొన్నదట; నాకున్; అట్టి; భద్ర+ఇభ, గమన= మదపుటేనుగువంటి నడకకలదైన - అంటే అందమైన నడకగల; సుభద్రన్; చూచు; వేడుకయును= కుతూహలంకూడా; కలదు; విష్ణుభట్టారకు, దయన్= శ్రీకృష్ణునియొక్క దయచేత; అభీష్ట, సిద్ధి= కోరిక నెరవేరటం; తనరున్= ఒప్పును (కలుగుతుంది); అనుచున్= అంటూ; తద్ద= మిక్కిలి; సంతసిల్లి; అర్జునుండు; తత్; ద్వారకాపురికిన్= ఆ ద్వారకానగరానికి; అరుగన్= వెళ్ళటానికి; నిశ్చయించెన్.

తాత్పర్యం: అక్కడికి వెళ్ళి నల్లకలువవంటి నల్లనిశరీరం కలవాడు, పద్మాన్ని బొడ్డుగా కలవాడు; పద్మంవంటి కన్నులు కలవాడు; నాకు మంచి స్నేహితుడు అయిన శ్రీకృష్ణుడిని చూచి, జన్మ సఫలత పొందేటట్లు, పాపాలు పోగొట్టుకొంటాననీ - ఇదివరకు గదుడు అనేవాడు చెప్పగా తిలోత్తమకంటె రూపవతి, సుగుణాలరాశి అని విన్న ఆ అందమైన నడక గల సుభద్రను చూచేవేడుక కూడ కలదనీ- శ్రీకృష్ణునిదయతో తనకోరికకూడా (సుభద్రను చేపట్టాలన్న కోరిక) నెరవేరుతుందనీ - ఎంతో సంతోషించి అర్జునుడు ఆ ద్వారకానగరానికి వెళ్ళాలని నిశ్చయించాడు.

విశేషం: అలం: ఉపమ.

వ. మఱియు నప్పురంబునం ద న్నొరు లెఱుంగకుండ వలయు ననియు, యాదవులు యతుల కతిభక్తు లనియును మనంబునం దలంచి కృతకయతివేషధరుం డయి. 165

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; ఆ+పురంబునన్= ఆ ద్వారవతీనగరంలో; తన్ను= తనను; ఒరులు= ఇతరులు; ఎఱుంగకుండవలయున్= తెలియకుండా ఉండాలి; అనియున్= అని; యాదవులు; యతులకున్= సన్న్యాసకులకు; అతిభక్తులు= మిక్కిలి భక్తులని; అనియును; మనంబునన్= మనస్సులో; తలంచి= అనుకొని; కృతక, యతి, వేష, ధరుండు+అయి= కపట సన్న్యాసివేషాన్ని ధరించినవాడై.

తాత్పర్యం: అంతేకాక ఆ ద్వారవతీనగరంలో తన్ను ఇతరులు తెలిసికొనకుండా ఉండాలని, యాదవులు సన్న్యాసులపట్ల మిక్కిలి భక్తి గలవాళ్ళని - ఆలోచించి, కపటసన్న్యాసి వేషాన్ని ధరించి.

విశేషం: ఇంతవరకు అర్జునుడు వ్రతయాత్రా సముచిత వేషంతోనే ఉన్నాడు. ఇప్పుడు మాత్రమే కృతక యతివేషధరుడయ్యాడు.

క. పరమబ్రహ్మణ్యు జగద్గురు । గరుడధ్వజు ననంతగుణు నేకాగ్ర
స్థిరమతి యై నిజహృదయాం । తరసుస్థితుఁ జేసి భక్తిఁ దలఁచుచు నుండెన్. 166

ప్రతిపదార్థం: పరమబ్రహ్మణ్యున్= మిక్కిలిగా బ్రాహ్మణులమేలు కోరేవాడిని; జగత్+గురున్= లోకానికంతకూ గురుడైన వాడిని; గరుడ, ధ్వజున్= గరుత్మంతుడిని రథకేతనంగా కలవాడిని; అనంత, గుణున్= అంతులేని సుగుణాలు కలవాడిని; ఏక+అగ్ర, స్థిరమతి+ఐ= ఒకదానిపైనే స్థిరమైన బుద్ధికలవాడై; నిజ, హృదయ+అంతర, సుస్థితున్+చేసి= తన మనస్సులో చక్కగా ఉన్నవాడిని చేసి; భక్తిన్= భక్తితో; తలఁచుచున్, ఉండెన్ = భావిస్తూ (ధ్యానిస్తూ) ఉండినాడు.

తాత్పర్యం: మిక్కిలిగా బ్రాహ్మణులమేలుకోరేవాడు, లోకానికంతకూ గురుడైనవాడు, గరుత్మంతుని ధ్వజంగా కలవాడు, అంతులేని సుగుణాలు కలవాడు అయిన శ్రీకృష్ణుడిని ఏకాగ్రచిత్తుడై మనస్సులో నిలిపి భక్తితో ధ్యానించాడు.

క. నరు నునికి యెఱిఁగి కృష్ణుడు । తిరముగ దయతోఁ బ్రభాసతీర్థమునకు నొ
క్కరుఁడ చనుదెంచె; సర్వే । శ్వరుఁ డెప్పుడు భక్తులకుఁ బ్రసన్నుఁడ కాఁడే. 167

ప్రతిపదార్థం: నరు, ఉనికి= అర్జునుడు ఉండటాన్ని; ఎఱిఁగి= తెలిసికొని; కృష్ణుఁడు; తిరముగన్= స్థిరంగా; దయతోన్= అనుగ్రహంతో; ఒక్కరుఁడు+అ= ఒక్కడే; ప్రభాసతీర్థమునకున్; చనుదెంచెన్= వచ్చాడు; సర్వ+ఈశ్వరుఁడు= సర్వమునకు ప్రభువైన భగవంతుడు; ఎప్పుడున్= ఎల్లప్పుడు; భక్తులకున్; ప్రసన్నుఁడు+అ, కాఁడే= అనుగ్రహించేవాడే కదా!

తాత్పర్యం: అర్జునుడున్నాడని తెలిసికొని దయతో శ్రీకృష్ణుడు తానొక్కడే ప్రభాసతీర్థానికి వచ్చాడు. భగవంతుడు ఎల్లప్పుడు భక్తులకు ప్రసన్నుడే గదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం.

అర్జునుండు ద్వారకానగరంబునకుఁ జనుట (సం. 1-210-4)

వ. ఇట్లు దనకడకు వచ్చిన యాదిదేవునకు దేవకీనందనునకు నతిసంభ్రమంబున నమస్కరించి పురందరనందనుం డానందజలభరితనయనుం డయి యి ట్లనియె. 168

ప్రతిపదార్థం: ఇట్లు; తన, కడకున్= తన దగ్గరకు; వచ్చిన= విచ్చేసిన; ఆదిదేవునకున్= శ్రీమహావిష్ణువుకు; దేవకీ, నందనునకున్= దేవకీదేవియొక్క కుమారునికి, శ్రీకృష్ణునికి; అతి, సంభ్రమంబునన్= మిక్కిలి వేగిరపాటుతో; నమస్కరించి; పురందర, నందనుండు= దేవేంద్రునికుమారుడు - అర్జునుడు; ఆనంద, జల, భరిత, నయనుండు+అయి= ఆనందబాష్పాలతో నిండిన కన్నులు కలవాడై; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా తన దగ్గరకు వచ్చిన మహావిష్ణువు, దేవకీదేవి తనయుడు అయిన శ్రీకృష్ణునికి ఎంతో వేగిరపాటుతో నమస్కరించి అర్జునుడు ఆనందబాష్పాలు నిండిన కన్నులతో ఇట్లా అన్నాడు.

ఉ. ద్వాదశమాసికవ్రతము ధర్మవిధిం జలుపంగ నేఁగి గం
గాదిమహానదీహిమవదాదిమహాగిరిదర్శనంబు మీ
పాదపయోజదర్శనముఁ బన్నుగఁ జేయుటఁ జేసి పూర్వసం
పాదిత సర్వపాపములుఁ బాసె భృశంబుగ నాకు నచ్యుతా! 169

ప్రతిపదార్థం: అచ్యుతా= శ్రీకృష్ణా!; ద్వాదశ, మాసిక, వ్రతము= పండ్రెండునెలల వ్రతము; ధర్మ, విధిన్= ధర్మపద్ధతిగా; చలుపంగన్= చేయటానికి; ఏఁగి= వెళ్ళి; గంగా+ఆది; మహా, నదీ, హిమవత్+ఆది, మహా, గిరి, దర్శనంబు= గంగ మొదలైన మహానదులయొక్క, హిమాలయం మొదలైన మహాపర్వతాలయొక్క దర్శనం; మీ, పాద, పయోజ, దర్శనమున్= మీ పాదపద్మాలయొక్క దర్శనాన్ని; పన్నుగన్= క్రమంగా; చేయుటన్+చేసి= చేయటంవలన; నాకు= నాకు; పూర్వ; సంపాదిత,సర్వ, పాపములు= ఇదివరకు సంపాదించుకొన్న అన్నిపాపాలు; భృశంబుగన్= అధికంగా - అంటే పూర్తిగా; పాసెన్= తొలగిపోయాయి.

తాత్పర్యం: శ్రీకృష్ణా! ద్వాదశమాసికవ్రతాన్ని ధర్మపద్ధతిగా ఆచరించటంకోసం వెళ్ళి, గంగ మొదలైన మహానదుల దర్శనం, హిమాలయం మొదలైన మహాపర్వతాల దర్శనం, మీ పదపద్మాల దర్శనం చేయటం వలన నాకు పూర్వ పాపాలన్నీ పూర్తిగా తొలగిపోయాయి.

విశేషం: 'ద్వాదశమాసికవ్రతము'ను గురించి పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు ఈ విధంగా వివరించారు. "సంస్కృతభారతము, శ్లో॥ ద్రౌపద్యా వ స్సమాసీన మన్యోన్యం యోఽభిదర్శయేత్, సనోద్వాదశవర్షాణి బ్రహ్మచారీ వనే వసేత్॥" - ఈ విధముగా పండ్రెండేళ్ళు వ్రతము సలుపవలెనని యుండఁగా నన్నయభట్టారకుఁడు 'ద్వాదశమాసికవ్రతము' అని సంవత్సరపదమునకు మాసమని అర్థము చెప్పుట మీమాంసాద్యనుసారముగా నని యెఱుంగునది. మీమాంసశాస్త్రమందు సహస్రసంవత్సరవ్రతము మనుష్యులకెట్లు సాధ్యమగునని విచారించి యొకపక్షంబున సంవత్సరశబ్దము మాసపర్యాయమని చెప్పఁబడినది. దానికి

శ్రుతిప్రమాణముకలదు - 'యో మాస స్సంవత్సరః' (శ్రీమదాంధ్రమహాభారతము ఆదిపర్వము లఘుటీక) ద్వాదశమాసికవ్రతం ప్రాయశ్చిత్తరూపమైన వ్రతం. సకల తీర్థ స్నానాలవలన పూర్వం చేసిన పాపాలు తొలగిపోతాయని సామాన్యులైన తైర్థికుల అభిప్రాయం. కాని, అర్జునుడు నారాయణభక్తుడు. గంగాస్నానం చేయటంవలననే కాక ఆ గంగ పుట్టినచోటైన నారాయణ పాదపద్మాలను దర్శించినప్పుడే పూర్వ (జన్మ) పాపాలన్నీ పోయి నిర్వాణం సిద్ధిస్తుందని అర్జునుని ప్రౌఢోక్తి. అందుకే చివరి క్షేత్రం ద్వారవతి కావటం విశేషం. ప్రౌఢోక్తిమూలమైన వస్తుధ్వని గమ్యమానం. అర్థవ్యక్తి అనే శబ్దగుణాన్ని ఈ రచనలో సార్థకంగా ప్రయోగించాడు నన్నయ.

వ. అనిన విని నగుచు నబ్జనాభుం డర్జును నతిస్నేహంబునం గౌఁగిలించుకొని యెల్లవారల కుశలంబును నడిగి, యాతని తీర్థాభిగమననిమిత్తంబును సుభద్రయందు బద్ధానురాగుం డగుటయు నుపలక్షించి, ద్వారకాపురంబునకుఁ దోడ్కొని యరిగి. 170

ప్రతిపదార్థం: అనినన్= అనిఅనగా; విని; నగుచున్= నవ్వుతూ; అబ్జనాభుండు= పద్మనాభుడైన శ్రీకృష్ణుడు; అర్జునున్; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రీతితో; కౌఁగిలించుకొని; ఎల్లవారల, కుశలంబును= అందరి క్షేమాన్ని; అడిగి; అతని; తీర్థ+అభిగమన; నిమిత్తంబును= తీర్థయాత్రలకు వెళ్ళటానికి కల కారణాన్ని; సుభద్ర, అందున్; బద్ధ+అనురాగుండు+ అగుటయున్= తగులుకొన్న ప్రేమ కలవాడు కావటమూ; ఉపలక్షించి= గమనించి; ద్వారకా, నగరంబునకున్; తోడ్కొని= తీసికొని; అరిగి= వెళ్ళి.

తాత్పర్యం: అర్జునునిమాటలు విని శ్రీకృష్ణుడు నవ్వుతూ అతడిని గాఢంగా కౌగిలించుకొని, ఇంద్రప్రస్థంలో అందరి కుశలం అడిగి, అతడు తీర్థయాత్రలు చేయటానికి గల కారణాన్నీ, సుభద్రపై అతనికున్న అనురాగాన్నీ తెలిసికొని ద్వారకానగరానికి పిలిచికొని వెళ్ళి.

విశేషం: ఆ జగన్నాటకసూత్రధారి శ్రీకృష్ణుని నవ్వులో, కౌగిలింతలో అర్జునుని రాకవలన, అతనిభక్తిస్నేహాలవలన కలిగిన ఆనందం ఉన్నది. సుభద్రను చేపట్టాలన్న అతని ఆంతర్యాన్నిగూర్చిన అవగాహనం ఉన్నది. అది సఫలం చేస్తానన్న సూచనకూడ ఉన్నది.

ఉ. భ్రాజితశాతకుంభగృహపంక్తులఁ బుష్పితవల్లివేల్లితో
ర్వీజవనావృతిన్ విమలవిద్రుమవజ్రవిచిత్రవేదికా
రాజిఁ గరంబు రమ్య మగు రైవతకాచలకందరంబునన్
రాజకులైకసుందరుఁ బురందరనందను నుంచి లీలతోన్. 171

ప్రతిపదార్థం: భ్రాజిత, శాతకుంభ, గృహ, పంక్తులన్= ప్రకాశిస్తున్న బంగారుమేడలసమూహాలచేతా; పుష్పిత, వల్లి, వేల్లిత+ఉర్వీజ, వన+ఆవృతిన్= పూసినతీగలచే చుట్టబడిన చెట్లు కల పెంపుడువనాలు చుట్టబడటంచేతను; విమల, విద్రుమ, వజ్ర, విచిత్ర, వేదికా, రాజిన్= నిర్మలాలైన పగడాలచేతా, వజ్రాలచేత, వింతయైన అరుగుల సమూహంచేతా; కరంబు= మిక్కిలి; రమ్యము+అగు= అందమైన; రైవతక+అచల, కందరంబునన్= రైవతకమనే పేరుకల పర్వతంయొక్క గుహలో; రాజ, కుల+ఏక, సుందరున్= రాజవంశానికంతటికీ అందగాడైన వాడిని; పురందర, నందనున్= దేవేంద్ర తనయుడిని - అర్జునుడిని; ఉంచి= ఉండునట్లు చేసి; లీలతోన్= విలాసంతో.

తాత్పర్యం: మెరుస్తున్న బంగారు మేడల సమూహాలు, పూసినతీగల పెనవేసికొన్న చెట్లతో కూడిన ఉద్యానవనాలు చుట్టూ ఉండగా నిర్మలాలైన పగడాలతో, వజ్రాలతో, చిత్రవిచిత్రాలైన అరుగులతో ఎంతో అందమైన రైవతకాద్రి గుహలో రాజవంశానికంతా అందగాడైన అర్జునుడిని ఉంచి - విలాసంతో.

విశేషం: ఇందులో శ్లేష అనే గుణం సందర్భోచితంగా పోషింపబడింది. రమణీయమైన అర్థఘటనతో కూడిన మసృణత్వం ఇందులో సార్థకం. రాజకులైకసుందరుడు - అన్నప్పుడు రాజంటే క్షత్రియుడు, రాజు, చంద్రుడనే అర్థాలు చెప్పుకొనవచ్చు. అంటే అర్జునుడు చంద్రునివంశంలో అందమైనవాడు, పైపెచ్చు పురందరనందనుడు. అతనియోగ్యతకు తగినస్థలం రైవతకాద్రి. బంగారుమేడలు, తోటలు, అరుగులు మొదలైనవి రాజభోగాల చిహ్నాలు. రమణీయసన్నివేశాన్ని అక్షరరమ్యంగా, బహుపదాలు ఏకపదవద్భావం పొందినట్లుగా చేసిన రచన శ్లేష. అది ఇందులో అనువుగా అందగించింది. (సంపా.)

క. శ్రీపతి గడునెయ్యంబున । నాపోవక పార్థునొద్ద నారాత్రి ప్రియా
లాపములఁ దగిలి యుండెను । దీపమణుల్ వెలుఁగ భువనదీపుఁడు దానున్. 172

ప్రతిపదార్థం: భువనదీపుఁడు= లోకాలను వెలిగించేవాడు; తానున్= తానూ; శ్రీపతి= శ్రీకృష్ణుడు; కడున్= మిక్కిలి; నెయ్యంబునన్= స్నేహంచేత; ఆపు+ఓవక= తనివితీరక; పార్థు, ఒద్దన్= అర్జునునిదగ్గర; ఆ, రాత్రి; దీప, మణుల్= మణిదీపాలు; వెలుఁగన్; ప్రియ+ఆలాపములన్= ఇష్టమైన సంభాషణలతో; తగిలి; ఉండెను.

తాత్పర్యం: ఆ రాత్రి మణిదీపాలు వెలుగుతుండగా శ్రీకృష్ణుడు స్నేహాతిశయంతో తనివితీరక అర్జునునితో ఇష్టమైనసంభాషణలతో గడిపాడు.

వ. ఇట్లు పరమపురుషు లయిన నరనారాయణులు దమ పూర్వజన్మ సహవాసంబున య ట్లప్పడు పరమానందంబునఁ బరస్పరప్రియమధురసంభాషణంబుల నొక్కటనుండి యారాత్రి సలిపి; రంతఁ బ్రభాతంబ వాసుదేవుండు వాసవనందను నంద యుండం బంచి కాంచనరథారూఢుం డయి పురంబునకుం జని పౌరజనప్రధానసమక్షంబున రైవతకమహోత్సవంబు ఘోషింపం బంచిన. 173

ప్రతిపదార్థం: ఇట్లు; పరమపురుషులు+అయిన= మహాపురుషులైన; నర, నారాయణులు= అర్జునుడు, శ్రీకృష్ణుడు; పూర్వజన్మ, సహవాసంబునన్= తాము పూర్వజన్మలో కూడి ఉండటంవలన (బదరికాశ్రమంలో ఇద్దరూ తపస్సు చేశారు); అట్లు= అప్పుడు; పరమ+ఆనందంబునన్= మిక్కిలి సంతోషంతో; పరస్పర, ప్రియ, మధుర, సంభాషణంబులన్= ఒకరితో ఒకరు ఇంపైన తీయని మాటలతో; ఒక్కటన్+ఉండి= ఒకటిగా ఉండి; ఆ రాత్రి= ఆ దినం రాత్రి; సలిపిరి= గడిపారు; అంతన్= తరువాత; ప్రభాతంబు+అ= వేకువనే; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు; వాసవ, నందనున్= దేవేంద్రతనయుడిని - అర్జునుడిని; అందు+అ= అక్కడే; ఉండన్; పంచి= ఉండుటకై నియోగించి; కాంచన; రథ+ఆరూఢుండు+అయి= బంగారురథాన్ని ఎక్కినవాడై; పురంబునకున్= ద్వారకానగరానికి; చని= వెళ్ళి; పౌరజన, ప్రధాన, సమక్షంబునన్= పురజనులయొక్క, మంత్రులయొక్క ఎదుట; రైవతక= రైవతకపర్వత సంబంధమైన; మహా+ఉత్సవంబు= గొప్పపండుగను; ఘోషింపన్= చాటటానికి; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: ఈ విధంగా పరమపురుషులైన అర్జునుడు; శ్రీకృష్ణుడు తాము పూర్వజన్మలో నరనారాయణులుగా బదరికాశ్రమంలో తపస్సు చేస్తూ సహవాసం చేశారు కనుక - మహానందంతో, పరస్పరం ఇంపైన తీయని మాటలతో

ఆ రాత్రి గడిపారు. వేకువనే శ్రీకృష్ణుడు అర్జునుడిని అక్కడే ఉండవలసిందని చెప్పి, తాను బంగారురథం ఎక్కి, ద్వారకాపురానికి వెళ్ళి, పురజనుల, మంత్రుల సమక్షంలో రైవతకమహోత్సవాన్ని చాటించటానికి ఆజ్ఞాపించాడు.

చ. పొలుపుగఁ బూసి కట్టి తొడి భూరివిభూతిప్రకాశితంబుగాఁ
గలయఁగఁ దత్పురీజనులు కాంస్యమృదంగముకుందవేణుకా
హలపటహధ్వనుల్ చెలఁగ నాటలుఁ బాటలు నొప్పె నెల్లవా
రలుఁ జని చేసి రర్చనలు రైవతకాద్రికి నుత్సవంబుతోన్. 174

ప్రతిపదార్థం: తత్+పురీ, జనులు= ఆ ద్వారకానగర ప్రజలు; ఎల్లవారలున్= అందరూ; పొలుపుగన్= అందంగా; పూసి= మైపూతలు పూసుకొని; కట్టి= వస్త్రాలు కట్టి; తొడి= సొమ్ములు ధరించి; భూరి, విభూతి= గొప్పసంపద; ప్రకాశితంబు, కాన్= ప్రకటమయ్యేటట్లుగా; కలయఁగన్= కూడగా; కాంస్య, మృదంగ, ముకుంద, వేణు, కాహళ; పటహ, ధ్వనుల్= కంచుతాళాల యొక్క, మృదంగాలయొక్క, ముకుంద వాద్య విశేషాలయొక్క, పిల్లన గ్రోవులయొక్క, కాహళవాద్యాలయొక్క, తప్పెటలుయొక్క; శబ్దాలు; చెలఁగన్= వ్యాపించగా; ఆటలున్, పాటలున్= ఆటలూ, పాటలూ; ఒప్పన్= తనరగా; రైవతక+అద్రికిన్= రైవతక పర్వతానికి; ఉత్సవంబుతోన్= పండుగగా (ఊరేగింపుగా) చని= వెళ్ళి; అర్చనలు=పూజలు; చేసిరి= చేశారు.

తాత్పర్యం: ఆ ద్వారకానగరప్రజలంతా - అందంగా, మైపూతలు పూసికొని, మంచివస్త్రాలు కట్టుకొని, సొమ్ములు అలంకరించుకొని ఐశ్వర్యమంతా ప్రకటమయ్యేటట్లు కలిసి బయలుదేరారు. వివిధ వాద్యాల ధ్వనులు చెలరేగగా -ఆటలతో, పాటలతో రైవతకాద్రికి ఊరేగింపుగా వెళ్ళి, అక్కడ పూజలు చేశారు.

విశేషం: అలం: స్వభావోక్తి. పృథక్పదత్వంతోకూడిన మాధుర్యగుణం జనుల హృదయోల్లాసాన్ని ధ్వనింపచేస్తున్నది.

చ. గురు కుచ యుగ్మముల్ గదలఁ గ్రొమ్ముడులందుల పుష్పముల్ పయిం
దొరఁగ నిదాఘబిందువితతుల్ చెదరన్ మదిరామదంబునన్
బరవశ లయ్యు నింపెసఁగఁ బాడుచుఁ దాళము గూడ మెట్టుచుం
దరుణియ లొప్ప నాడిరి ముదంబునఁ దమ్ము జనాలి మెచ్చఁగన్. 175

ప్రతిపదార్థం: తరుణియలు= యౌవనవతులు; జన+ఆలి= జనసమూహం; ముదంబునన్= సంతోషంతో; మెచ్చఁగన్= మెచ్చుకోగా; గురు, కుచ, యుగ్మముల్= పెద్దపాలిండ్లజంటలు; కదలన్= చలింపగా; క్రొత్త+ముడులందుల, పుష్పముల్= క్రొత్త ముడులలోని పూలు; పయిన్+తొరగన్= మీదికి జారగా; నిదాఘబిందు, వితతుల్= చెమట బిందువుల సమూహాలు; చెదరన్= చెదరగా; మదిరా మదంబునన్= మద్యం త్రాగటంవలన కలిగిన మదంచేత; పరవశలు+అయ్యున్= మైమరచినవాళ్ళయి కూడా; ఇంపు+ఎసఁగన్= ఆనందం అధికం అయ్యేటట్లు; పాడుచున్= పాడుతూ; తాళము కూడ, మెట్టుచున్= తాళానికి తగినట్లు అడుగులు వేస్తూ; ఒప్పన్, ఆడిరి= అందంగా నాట్యం చేశారు.

తాత్పర్యం: యౌవనంలో ఉన్న ఆడవాళ్ళు, జనసమూహం సంతోషంతో తమను చూచి మెచ్చగా - పెద్ద చన్నుల జంటలు కదలగా, క్రొత్తగా ముడిచిన కొప్పులలోని పూలు మీదికి జారగా, చెమటబిందువులు చెదరగా, మద్యపానమదంచేత మైమరిచినా, ఇంపార పాడుతూ, తాళానికి తగినట్లు అడుగులు వేస్తూ నాట్యం చేశారు.

విశేషం: అలం: స్వభావోక్తి. రచనలో ఉదారత అనే గుణం పోషింపబడటంవలన ఈ పద్యం రసవత్తరంగా ఉన్నది. మదిరాపానంచేత పరవశలై ఉన్నా, కొప్పులూడేటట్లు, కుచాలు కదిలేటట్లు, చెమటబిందువులు చిందేటట్లు నాట్యంచేస్తున్నా తాళం తప్పకుండా ఆడుతూ, శ్రుతులు తప్పకుండా పాడుతున్న తరుణుల నాట్యం అగ్రామ్యత్వానికీ, నృత్యత్వదవద్భావానికీ (వికటత్వం) రూపుకట్టటంతో 'ఉదారత' రక్తికట్టింది. గ్రామ్యత్వం ప్రదర్శింపబడవలసినచోట మదిరాపానమత్తలైన యువతులు అగ్రామ్యత్వాన్ని సందర్భోచితంగా నాట్యంలో ప్రదర్శించే ఈ సన్నివేశవర్ణనం ఉదారతకు ఉత్తమోదాహరణం. (సంపా.)

సీ. సారణ సత్య కాక్రూర విదూరథ । సాంబ సంకర్షణ శంబరారి
భాను సుషే ణోగ్రసేన శైనే యాని । రుద్ధ హార్దిక్య గ దోద్ధవాది
యాదవు లధికప్రమోదు లై యొక్కటఁ । దరుణులుఁ దారును గరికరేణు
హయశిబికారూఢు లయి తదుత్సవమున । కరిగిరి; మఱి జగద్గురుఁడు గృష్ణుఁ

ఆ. డింద్రలీలతో నుపేంద్రుండు రుక్మిణీ । దేవి మొదలుగాఁగ దేవు లెల్ల
నొప్పతోడ రాఁగ నప్పర్వతమునకుఁ । జనియె సకలజనులుఁ దనకు నెరఁగ. 176

ప్రతిపదార్థం: సారణ, సత్యక+అక్రూర, విదూరథ, సాంబ, సంకర్షణ, శంబర+అరి, భాను, సుషేణ, ఉగ్రసేన, శైనేయ, అనిరుద్ధ, హార్దిక్య, గద, ఉద్ధవ; ఆది= మొదలైన; యాదవులు= యదువంశీయులు; అధిక, ప్రమోదులు+ఐ= మిక్కిలి ఆనందించినవాళ్ళయి; ఒక్కటన్= ఒకటిగా; తరుణులు= భార్యలు; తారును= తామూ; కరి, కరేణు, హయ, శిబికా+ఆరూఢులు+అయి= ఏనుగులను, ఆడయేనుగులను, గుర్రాలను, పల్లకీలను ఎక్కినవాళ్ళయి; తత్+ఉత్సవమునకున్= ఆ రైవతకాద్రి మహోత్సవానికి; అరిగిరి= వెళ్ళారు; మఱి= అటుపై; జగత్+గురుఁడు= లోకానికంతటికి గురుడైనవాడు - కృష్ణుడు; ఇంద్ర, లీలతోన్= దేవేంద్రుని (వంటి) వైభవంతో; ఉపేంద్రుఁడు= శ్రీకృష్ణుడు; రుక్మిణీదేవి; మొదలుగాఁగ= మొదలైన; దేవులు+ఎల్లన్= భార్యలంతా; ఒప్పుతోడన్= అందంగా; రాఁగన్= వెంటరాగా; సకల, జనులు; తనకున్= శ్రీకృష్ణునికి; ఎరఁగన్= నమస్కరించగా; ఆ+పర్వతమునకున్= ఆ రైవతకపర్వతానికి; చనియెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: సారణుడు, సత్యకుడు, అక్రూరుడు, ఉగ్రసేనుడు, గదుడు, ఉద్ధవుడు మొదలైన యాదవులంతా మహానందంగా భార్యలతో కూడి - ఏనుగులను, ఆడఏనుగులను, గుర్రాలను, పల్లకీలను అధిరోహించి ఆ ఉత్సవానికి వెళ్ళారు. జగద్గురుడైన శ్రీకృష్ణుడుకూడా రుక్మిణి మొదలైన భార్యలంతా వెంటరాగా, జనులంతా తనకు నమస్కరించగా దేవేంద్రవైభవంతో ఆ రైవతకాద్రికి వెళ్ళాడు.

వ. ఇ ట్లరిగి జనార్దనుండు ధనంజయుం దలంచి, తత్సమీపగతుం డై తోడ్కొని, యాతనికి న ప్పర్వత రమణీయ ప్రదేశంబులం జూపుచు విహరించి, యిద్దఱు నొక్కవిమలమణివేదికయం దభిమతసంభాషణంబుల నుండు నంత. 177

ప్రతిపదార్థం: ఇట్లు+అరిగి= ఈ విధంగా వెళ్ళి; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; ధనంజయున్= అర్జునుడిని; తలంచి= అనుకొని; తత్+సమీప, గతుండు+ఐ= అతనిదగ్గరకు వెళ్ళినవాడై; తోడ్కొని= అతనినివెంట తీసికొని; ఆతనికిన్= అర్జునునికి; ఆ+పర్వత, రమణీయ, ప్రదేశంబులన్= ఆ పర్వతమందలి అందమైన చోట్లను; చూపుచున్; విహరించి; ఇద్దఱున్; ఒక్క, విమల, మణి, వేదిక, అందున్= ఒక నిర్మలములైన మణులతో నిర్మించిన అరుగుమీద; అభిమత, సంభాషణములన్= ఇష్టములైన సంభాషణలలో; ఉండు, అంతన్= ఉండగా.

తాత్పర్యం: ఈ విధంగా వెళ్ళి శ్రీకృష్ణుడు అర్జునునిగూర్చి ఆలోచించి, అతనిదగ్గరకు వెళ్ళి, అతడిని వెంటబెట్టుకొని, ఆ పర్వతమందలి అందమైన ప్రదేశాలను చూపుతూ విహరించాడు. తరువాత ఇద్దరూ నిర్మల మణులతో నిర్మితమైన ఒక అరుగుమీద కూర్చుండి ఇష్టాగోష్ఠి సలుపుతుండగా.

చ. క్వణదణుకింకిణీకలితకాంచనకాంచికలాపమున్ రణ
న్మణికలనూపురంబులు సమధ్వని నొప్పఁగ భక్తిఁ బాదచా
రిణి యయి కన్యకాజనపరీత సుభద్ర తదద్రిపూజన
ప్రణతులు సేసె నింద్రసుతుఁ బార్థు నిజేశ్వరుఁగాఁ దలంచుచున్. 178

ప్రతిపదార్థం: క్వణత్+అణు, కింకిణీ, కలిత, కాంచన, కాంచి, కలాపమున్= మ్రోయుచున్న చిరుగజ్జెలతో కూడిన బంగారు మొలనూళ్ళ సమూహాన్ని; రణత్+మణి, కల, నూపురంబులు= ధ్వనిస్తూ మణులచే మనోహరాలైన అందెలూ; సమ, ధ్వనిన్= సమాన ధ్వనిలో; ఒప్పఁగన్= ఒప్పుచుండగా; భక్తిన్= భక్తితో; పాదచారిణి, అయి= కాలినడకన వెళ్ళినదై; కన్యకా, జన, పరీత= పెళ్ళికాని ఆడపిల్లలతో చుట్టబడినదైన; సుభద్ర; ఇంద్రసుతున్= దేవేంద్రునియొక్క కుమారుడిని; పార్థున్= పృథ (కుంతీదేవి) పుత్రుడైన అర్జునుడిని; నిజ+ఈశ్వరున్+కాన్= తనభర్త అయ్యేటట్లు; తలంచుచున్= భావించుచూ; తద్+అద్రి, పూజన, ప్రణతులు= ఆ రైవతకపర్వతాన్ని పూజించటాన్ని, మ్రొక్కటాన్ని; చేసెన్= చేసింది.

తాత్పర్యం: మ్రోగుతున్న చిరుగజ్జెలతో కూడిన బంగారు మొలనూళ్ళ సమూహం, మణులచేత మనోహరాలై మ్రోగుతున్న అందెలు సమానధ్వనితో ఒప్పుతుండగా, కన్యకాజనం తనచుట్టు రాగా, సుభద్ర అర్జునుడిని భర్తగా తనమనస్సులో తలచి భక్తితో కాలినడకన తిరిగి, ఆ రైవతకాద్రికి పూజలూ, నమస్కారాలు చేసింది.

విశేషం: నన్నయ అక్షరరమ్యతకు ఈ పద్యం ఒక చక్కని ఉదాహరణం. అర్జునునిమనస్సును ఆకర్షించి, అతనిలోని అనురాగాన్ని పెంచిన సుభద్ర కాంచీ కలాప కింకిణీ ధ్వనులు, మణి నూపుర ధ్వనులు - పదాల కూర్పులో 'ణ'కార పునరావృత్తిలో చక్కగా ధ్వనిస్తున్నాయి. ఈ పద్యంలో సమాధి అనే గుణం సమగ్రంగా పోషింపబడింది. సుభద్ర తన మొలను గల గజ్జెలూ కాలిఅందెలూ సమంగా మ్రోగుతూ ఉండగా నడచివచ్చి అర్జునుడు తనకు భర్త కావాలని గాఢంగా భావిస్తూ (సమాధి) రైవతకాద్రిని పూజించి నమస్కరించింది. పద్యంకూడా సుభద్రవలెనే నడిచింది. మొదటి రెండుచరణాల్లో నాయిక నడకసొబగు, ఆ తరువాత ఆగి పూజించి నమస్కరించిన విశ్రాంతి సౌందర్యం పద్యగతిలో అవరోహక్రమంలో చిత్రించటం గమనార్హం. దానివలన నాయిక మనోభీష్టంలో (త్వరగా అర్జునుడు భర్తకావాలన్న తీవ్రమైన ఆకాంక్ష) అర్థదర్శనం కావటం గమనిస్తే నన్నయగారి సమాధిగుణపద్యరచనకు ఈ పద్యం సార్థకోదాహరణం. (సంపా.)

ఉ. దాని సుభద్రగా నెఱిఁగి తత్క్షణజాతమనోజసంచల
న్మానసుఁ డైన యవ్విజయు మానుగఁ జూచి 'మునీంద్ర! నీకుఁ జ
న్నే నలినాక్షులందు మది నిల్పఁగ' నంచును మందహాసగ
ర్భాననుఁ డై రథాంగధరుఁ డాతని కి ట్లనియెం బ్రియంబునన్. 179

ప్రతిపదార్థం: దానిన్= ఆమెను; సుభద్రన్+కాన్, ఎఱిఁగి; తత్+క్షణ, జాత, మనోజ, సంచలత్+మానసుఁడు+ఐన= ఆ క్షణంలో పుట్టిన మన్మథునిచే చలింపబడిన మనస్సు కలవాడైన; ఆ+విజయున్= ఆ అర్జునుణ్ణి; మానుగన్= మనోహరంగా;

చూచి; ముని+ఇంద్ర= మునిశ్రేష్ఠా!; నలిన+అక్షుల+అందున్= పద్మాలవంటి కన్నులు కలవారైన స్త్రీలపై; మదిన్= మనస్సును; నిల్పఁగన్= నిలుపగా; నీకున్; చన్నే= తగునా; అంచును= అని అంటూ; రథ+అంగ, ధరుఁడు= చక్రాన్ని ధరించేవాడు - శ్రీకృష్ణుడు; మందహాస, గర్భ+ఆననుఁడు+ఐ= చిరునవ్వు నిండిన ముఖం కలవాడై; ఆతనికిన్= అర్జునునికి; ప్రియంబునన్= ప్రీతిగా; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆమె సుభద్ర అని తెలిసికొని, ఆ క్షణమే పుట్టిన మన్మథునిచే చలింపచేయబడిన మనస్సు కలవాడైన ఆ విజయుడిని, శ్రీకృష్ణుడు మనోహరంగా చూచి, 'మునీంద్రా! స్త్రీలమీద మనసు నిలపటం నీకు తగునా?' అని చిరునవ్వు నిండినముఖంతో అతనితో ప్రియమార ఇలా అన్నాడు.

విశేషం: ఈసందర్భంలో శ్రీకృష్ణుని సరసపుచూపులో, మాటలో, చిరునవ్వులో ఎంతో ఆనందం ఉన్నది; కొంత కొంటెతనం కూడ ఉన్నది. మునివేషంలో ఉన్న అర్జునుడు సుభద్రను చూచినంతనే మన్మథావేశాన్ని ప్రదర్శించబోవటం సందర్భౌచిత్యం కాదు. పాత్రౌచిత్యంకూడా కాదు. పైపెచ్చు జగద్గురువైన శ్రీకృష్ణుడి సన్నిధానంలో ఆ విధంగా బైటపడటం అనుదాత్తం. దానిని తెలిసిన శ్రీకృష్ణుడు అర్జునుడిని పరుషంగా మందలించవలసిన తరుణమది.కాని, అతనిపై గల అపారమైన అనురాగంవలన నవ్వుతూ వ్యంగ్యంగా హెచ్చరించాడు. అంటే పరుషార్థప్రకటనం చేయవలసినచోట అపారుష్యాన్ని ప్రదర్శించాడన్నమాట. ఇదే సౌకుమార్యమనే గుణం. సౌకుమార్యం శ్రీకృష్ణుడివాక్కులో అజరరత్వంగా, ఆసక్తికరంగా అనుసంధింపబడింది. (సంపా.)

వ. 'నీవు సుభద్రయందు బద్ధానురాగుండ వగుట తొల్లియు నే నెఱుంగుదు; నోడకుండుము; నీ కోర్కి వసుదేవ దేవకీ దేవులకుం జెప్పి సఫలంబు సేయుదు' నని యర్జునునకు హృదయానందంబుగాఁబలికి, యప్పుడ వడిగల చారుల రావించి ద్వారవతియం దర్జునుం డున్న వాఁ డనుకుశలవార్త ధర్మజున కెఱింగింప నింద్రప్రస్థపురంబునకుం బుచ్చియున్నంత; నచ్చటికి వచ్చి బలదేవాదియాదవు లతిభక్తులై యతియకా వగచి యర్జునునకు నమస్కరించి యాతనివలన సర్వతీర్థంబులుఁ దత్సేవాఫలంబులును విని సంతసిల్లి, యి వ్వర్షాకాలంబు మాయంద యుండి చాతుర్మాస్యంబు సేసి మమ్ముం గృతార్థులం జేయుం డని ప్రార్థించి, పార్థుం దోడ్కొని చని, వానికి నన్నపానాది విధులం బరిచరింప సుభద్రం బంచి, కన్యాపురంబునందు నివాసంబు సేసిన. 180

ప్రతిపదార్థం: నీవు; సుభద్ర+అందున్= సుభద్రపై; బద్ధ+అనురాగుండవు= కట్టివేయబడిన ప్రేమకలవాడవు, సుభద్రను ప్రేమించినవాడవు; అగుట, తొల్లియున్= ఇదివరకుకూడా; నేను= నేను; ఎఱుంగుదున్= తెలుసుకున్నాను; ఓడక+ఉండుము= భయపడకుము; నీ, కోర్కి= నీ ఇష్టం; వసుదేవ, దేవకీదేవులకున్= వసుదేవునికి, దేవకీదేవికి; చెప్పి; సఫలంబు= ఫలించునట్లు; చేయుదున్+అని= చేస్తాను అని; అర్జుననకున్; హృదయ+ఆనందంబుకాన్= మనస్సుకు సంతోషం కలిగేటట్లుగా; పలికి= చెప్పి; అప్పుడు+అ= అప్పటికప్పుడే; వడిగల= వేగంగల; చారులన్= వేగులవారిని; రావించి= రప్పించి; ద్వారవతి, అందున్= ద్వారకావతి నగరంలో; అర్జునుండు; ఉన్నవాఁడు= ఉన్నాడు; అను, కుశలవార్త= అనే క్షేమవృత్తాంతం; ధర్మజునకున్; ఎఱిగింపన్= తెలపటానికి; ఇంద్రప్రస్థ పురంబునకున్; పుచ్చి= పంపి; ఉన్న+అంతన్= ఉండగా; బలదేవ+ఆది, యాదవులు= బలరాముడు మొదలైన యాదవులు; అచ్చటికిన్; వచ్చి; అతి భక్తులు+ఐ= మిక్కిలిభక్తికలవాళ్ళయి; యతి+అ+కా ముని అని; వగచి= తలచి; అర్జుననకున్; నమస్కరించి; అతనివలన; సర్వ, తీర్థంబులున్= అన్నిపుణ్యతీర్థాలు; తత్+సేవా, ఫలంబులును= వాటిని సేవించటంవలన కలిగే ఫలాలు; విని, సంతసిల్లి; ఈ+వర్షాకాలంబు; మా, అందు+అ, ఉండి= మాదగ్గరే ఉండి; చాతుర్మాస్యంబున్= యతులు నాలుగునెలలు చేసే వ్రతాన్ని; చేసి; మమ్మున్; కృత+అర్థులన్= నెరవేరిన కోరిక కలవాళ్ళనుగా; చేయుండు+అని= చేయండి అని; ప్రార్థించి; పార్థున్= అర్జునుని; తోడ్కొని= వెంటతీసికొని; చని=వెళ్ళి; వానికిన్= అతనికి;

అన్న, పాన+ఆది, విధులన్= అన్నం; పానం మొదలైనవాటి ఏర్పాట్లలో; పరిచరింపన్= సేవ చేయటానికి; సుభద్రన్; పంచి= నియమించి; కన్యా, పురంబు, అందున్= కన్యలయొక్క అంతఃపురంలో; నివాసంబు= ఉనికి; చేసినన్= ఏర్పాటుచేయగా.

తాత్పర్యం: 'నీకు సుభద్రమీద అనురాగం ఉన్నసంగతి నాకు ఇదివరకే తెలుసు. భయపడకుము. నీ కోర్కె వసుదేవునికి, దేవకీదేవికి చెప్పి సఫలం చేస్తాను' అని అర్జునునిమనస్సుకు ఆనందం కలిగేటట్లుగా పలికాడు. అప్పటి కప్పుడే వడి గల వేగులవాళ్ళను పిలిచి ద్వారవతిలో అర్జునుడు ఉన్నాడన్న కుశలవార్తను ధర్మరాజుకు తెలియజేయటానికి ఇంద్రప్రస్థపురానికి పంపాడు. కృష్ణుడు అక్కడ ఉండగానే బలరాముడు మొదలైన యాదవులంతా అక్కడి వచ్చారు. అతిభక్తులై అర్జునుడిని యతిగా భావించి, ఆయనకు నమస్కరించారు. ఆయనవలన పుణ్యతీర్థవిశేషాలు, వాటిని సేవించటంవలన కలిగే ఫలాలు విని సంతోషించి 'ఈ వర్షాకాలంలో ఇక్కడే ఉండి చాతుర్మాస్యవ్రతం జరిపి మమ్ములను కృతార్థులను చేయండి' అని ప్రార్థించి అర్జునుడిని తోడ్కొని వెళ్ళి, ఆయనకు అన్నపానాదులతో సేవ చేయటానికి సుభద్రను నియోగించి, కన్యాంతఃపురంలోనే ఆయన ఉండటానికి ఏర్పాటు చేయగా.

విశేషం: చాతుర్మాస్యం - ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధఏకాదశి మొదలు కార్తిక శుద్ధఏకాదశి వరకు నాలుగు నెలలు చేసే వ్రతం. ఈ వర్షాకాలంలో యతులు తీర్థయాత్రలు సాగించకుండా ఒక్కచోటనే ఉండి ఈ వ్రతం ఆచరిస్తాను.

అర్జునుండు యతిరూపంబున కన్యాపురంబున నుండుట (సం- అను. 1-114-64 పంక్తి)

క. అందు ధృతిమందరుండు పు । రందర నందనుఁడు దనకు రమణి గుణశ్రీ
సుందరి సుభద్ర నెయ్యం । బొందఁగఁ బరిచర్య సేయుచుండఁగ నుండెన్. 181

ప్రతిపదార్థం: అందున్= ఆ కన్యాంతఃపురంలో; ధృతి, మందరుండు= ధైర్యంలో మందరపర్వతంవంటివాడు; పురందర, నందనుఁడు= దేవేంద్రుని కుమారుడైన అర్జునుడు; తనకున్; రమణి= అందమైనది; గుణశ్రీ, సుందరి= సుగుణాల సంపదచేత మనోహరమైనది; సుభద్ర; నెయ్యంబు+ఒందఁగన్= ప్రేమతో; పరిచర్య= సేవ; చేయుచున్+ఉండఁగన్, ఉండెన్= చేస్తూ ఉండగా, ఉన్నాడు.

తాత్పర్యం: ధైర్యంలో మందరపర్వతంవంటివాడైన అర్జునుడు - రూపవతి, గుణవతి అయిన సుభద్ర తనకు సేవచేస్తూ ఉండగా ఆ కన్యాంతఃపురంలో ఉన్నాడు.

క. ధీరుఁడు యతిరూపంబున । నారఁగ నిందున్నయాతఁ డర్జునుఁ డని స
త్యారుక్మిణులకుఁ జెప్పె ము । రారాతి రహస్యమున ననంత ప్రీతిన్. 182

ప్రతిపదార్థం: ముర+అరాతి= మురుడు అనే రాక్షసునికి శత్రువైనవాడు - శ్రీకృష్ణుడు; అనంత, ప్రీతిన్= మిక్కిలిసంతోషంతో; సత్యా, రుక్మిణులకున్= సత్యభామకు, రుక్మిణీదేవికి; ధీరుఁడు= ధైర్యవంతుడు; యతి, రూపంబునన్= యతివేషంలో; ఆరఁగన్= ఒప్పుగా; ఇందున్+ఉన్న= ఇక్కడ ఉండేవాడు; ఆతఁడు, అర్జునుఁడు; అని= అని; రహస్యమునన్, చెప్పెన్= రహస్యంగా చెప్పాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మహాసంతోషంతో - 'ఇక్కడ యతివేషంలో ఉన్న ధీరుడు అర్జునుడు' అని సత్యభామకు, రుక్మిణీదేవికి రహస్యంగా చెప్పాడు.

చ. అలయక నాఁడు నాఁటికి లతాంగి యపూర్వము లైన భోజనం
బులు గడుభక్తిఁ బెట్టుచు, నపూర్వము లైన వపుర్విలాస యు
క్తులు వెలయించుచున్, ముదముతోఁ బెనిచెన్ మరి నాఁడునాఁటి క
గ్గల మగుచుండ నెయ్యమును గామవికారము సవ్యసాచికిన్. 183

ప్రతిపదార్థం: లతా+అంగి= లతవంటి సుకుమారమైన శరీరంకలది - సుభద్ర; అలయక= విసుగులేకుండా; నాఁడు, నాఁటికిన్= ఏరోజు కా రోజు; అపూర్వములు+ఐన= ముందులేనివైన, క్రొత్తవైన; భోజనంబులు; కడు, భక్తిన్= మిక్కిలి భక్తితో; పెట్టుచున్= పెట్టుతూ; అపూర్వములు+ఐన= సరిక్రొత్తవైన; వపుస్+విలాస, యుక్తులు= శరీర విలాసాల కూడికలు - అంటే అందాల హొయలు; వెలయించుచున్= ప్రకటిస్తూ; మఱిన్= పైగా; సవ్యసాచికిన్= అర్జునునికి; నెయ్యమును= స్నేహాన్ని; కామ, వికారమున్= శృంగారభావాన్ని; నాఁడు, నాఁటికిన్= నానాటికి; అగ్గలము+అగుచుండన్= ఎక్కువగుచుండగా; ముదముతోన్= సంతోషంతో; పెనిచెన్= పెంచింది.

తాత్పర్యం: సుందరాంగి సుభద్ర విసుగులేకుండా ఏరోజు కారోజు సరిక్రొత్త భోజనాలు భక్తితో పెట్టుతూ, తన శరీరంలో సరిక్రొత్త అందాలు ప్రదర్శిస్తూ, ఏరోజు కా రోజు అర్జునునిలో స్నేహాన్నీ, శృంగారభావాన్నీ పెంచింది.

విశేషం: సుభద్ర సహజతనూవిలాసాలను ప్రదర్శిస్తూ మునిసేవ చేస్తున్నది. ప్రతిదిన ప్రవర్ధమానమౌతున్న ఆమె యౌవనం రోజురోజుకూ అర్జునునికి ఆసక్తిని పెంచుతున్నది. ఇది మధురమైన సన్నివేశం. మధురభావముద్రితం. అందువలననే నన్నయ మాధుర్యమనే గుణాన్ని పద్యరచనలో ప్రపంచించి ప్రౌఢిని ప్రదర్శించాడు. ఈ మాధుర్యాన్నే రాబోయే రెండుపద్యాలలో వరుసగా పోషించటం శిల్పం. (సంపా.)

వ. మఱియును. 184

ప్రతిపదార్థం: అంతేకాకుండా.

సీ. అలినీలకుంతలుం డనియును హరినీల । సమవర్ణుఁ డనియు నాజానులంబి
తాయతస్థిరబాహుఁ డనియును రక్తాంత । నలినదళాకారనయనుఁ డనియు
నుత్తుంగఘనవిశాలోరస్కుఁ డనియును । గవ్వడి యనియును గరము వేడ్క
వివ్వచ్చు నెప్పుడు వినియెడునది; దన । వినినట్ల యతిఁ జూచి, 'వీఁడు విజయుఁ

ఆ. డొక్కొ!' యనుచు సంశయోపేతచిత్త యై । యుండి, యుండ నోప కొక్కనాఁడు
భోజనావసానమున నున్న యమ్మునిఁ । కిందువదన ప్రీతి నిట్టు లనియె. 185

ప్రతిపదార్థం: అలి, నీల, కుంతలుండు+అనియును= తుమ్మెదవలె నల్లనివెంట్రుకలు కలవాడని; హరినీల, సమ, వర్ణుఁడు+అనియున్= ఇంద్రనీలమణితో సమానమైన రంగుకలవాడని; ఆజాను, లంబిత+ఆయత, స్థిర, బాహుఁడు+అనియును= మోకాళ్ళదాకా వ్రేలాడుతున్న పొడవైన, బలమైన బాహువులు కలవాడని; రక్త+అంత, నలిన, దళ+ఆకార, నయనుఁడు+అనియున్= ఎర్రనికొలకులు కలిగి తామరరేకులవంటి ఆకారం గల కన్నులు కలవాడని; ఉత్తుంగ, ఘన, విశాల+ఉరస్కుడు+అనియును= మిక్కిలి ఎత్తైన కఠినం, విశాలమైన వక్షఃస్థలం కలవాడని; కవ+వడి= రెండుచేతుల వడిగలవాడు; అనియును;

కరము, వేడ్కన్= మిక్కిలి కుతూహలంతో; విన్నచ్చున్= అర్జుననిగూర్చి; ఎప్పుడున్= ఎల్లప్పుడు; వినియెడు, అది= వినునట్టి సుభద్ర; తన, వినిన+అట్లు+అ= తాను విన్నవిధంగానే; యతిన్= యతిని; చూచి; వీఁడు= ఇతడు; విజయుఁడు+ఒక్కొ, అనుచున్= అర్జునుడో ఏమో అని; సంశయ+ఉపేత, చిత్త+ఐ= అనుమానంతో కూడుకొన్న మనసు కలదై; ఉండి= ఉంటూ; ఉండన్+ఓపక= ఉండలేక; ఒక్కనాఁడు; భోజన+అవసానమునన్= భోజనం చివర; ఉన్న= ఉండే; ఆ+మునికిన్= ఆ యతిని; ఇందు, వదన= చంద్రబింబంవంటి ముఖం కలది - సుభద్ర; ప్రీతిన్= ప్రేమతో; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: తుమ్మెదవలె నల్లని జుట్టు కలవాడని, ఇంద్రనీలపు రంగువాడని, మోకాలివరకు వ్రేలాడే పొడవైన, బలమైన బాహువులు కలవాడని, ఎర్రని కొలకులతో తామరరేకులవంటి కళ్ళు కలవాడని, ఎంతో ఎత్తైన కఠినం, విశాలం అయిన వక్షఃస్థలం కలవాడని, రెండుచేతులు వడి కలవాడని - మిక్కిలి కుతూహలంతో అర్జునుని గూర్చి ఎప్పుడూ వినే సుభద్ర, తాను విన్నవిధంగానే ఆ యతిని చూచి, ఇతడు విజయుడో ఏమో అని అనుమానించి, ఉండలేక ఒకనాడు భోజనంచివర ఆ మునితో ప్రియమార ఇట్లా అన్నది.

విశేషం: అలం: ఉపమ, సందేహం. రసానుకూలంగా అలంకారాన్ని ధ్వనిమయంగా నిర్వహించాడు నన్నయ. విశేషం ఏమంటే ఉపమాలంకారంతో మొదలై అది మధ్యలో వదలిపెట్టబడి సందేహాలంకారంతో పద్యాన్ని ముగించటం ఇందులోని శిల్పం. అర్జునుని పోలికలు యతిలో కనపడుతున్నాయి. అతడే అర్జునుడేమో అని మనస్సు సంశయిస్తున్నది. కాని, నిశ్చయంగా తెలియకపోయినప్పుడు ఆ భావంలో రమించటం ఉచితం కాదు. రతిభావపోషణకనువైన విభావస్ఫూర్తి యతిరూపంలో కనపడుతున్నా బింబమని భ్రమించి ప్రతిబింబాన్నే రమిస్తే రసభంగమౌతుందన్నసందేహంతో ఆమె సముచితంగా ఆగినట్లు వర్ణించటం రసధ్వనిశిల్పం. సుభద్రాహృదయగత మధురభావాన్ని మాధుర్యగుణముద్రితమైన పద్యరచనలో ప్రదర్శించటం నన్నయరసవద్గుణపోషణకు నిదర్శనం. (సంపా.)

వ. మునీంద్రా! నీ యాడనితీర్థంబులుం జూడనిపురంబులు నెఱుంగనిరాజకులంబును లే వని విచారింతు. 186

ప్రతిపదార్థం: ముని+ఇంద్రా= మునిశ్రేష్ఠా!; నీ, ఆడని= నీయొక్క స్నానం చేయని - అనగా నీవు స్నానమాడని; తీర్థంబులున్= తీర్థాలూ; చూడని= సందర్శించని; పురంబులున్= నగరాలూ; ఎఱుంగని= తెలియని; రాజకులంబును= రాజసమూహాలూ; లేవు+అని= లేవని; విచారింతున్= అనుకొంటాను.

తాత్పర్యం: మునివరా! నీవు స్నానం చేయని పుణ్యతీర్థాలూ, చూడని పట్టణాలూ, తెలియని రాజవంశాలూ లేవని అనుకొంటాను.

సీ. 'అమరావతికి నెన యనఁగ నివ్వసుమతిఁ । బరఁగు నింద్రప్రస్థపురవరంబు
చూచితిరే? పాండుసుతు లందు సుఖ మున్న । వారె? మాయత్త యంభోరుహాక్షి
కుంతీమహాదేవి కుశలయే? యమ్మహా । వీరుఁ డర్జునుఁడు జితారి తీర్థ
గమనోత్సుకుం డయ్యెఁ; గ్రమ్మఱి వచ్చెనే? । యెఱుఁగుదురేని నా కెఱుఁగఁ జెప్పుఁ '

ఆ. డనిన నేస చూవె యయ్యర్జునుండ; నీ । యొద్ద నివ్విధమున నున్నవాఁడఁ;
దరుణి! నీకు నాకు ధరణీధరుం డను । జలజభవుఁడు సేసె సంగమంబు. 187

ప్రతిపదార్థం: అమరావతికిన్= (దేవేంద్రుడిరాజధాని) అమరావతీనగరానికి; ఎన= సాటి; అనఁగన్= అనునట్లుగా; ఈ+వసుమతిన్= ఈ భూమిమీద; పరఁగు= ఒప్పు; ఇంద్రప్రస్థ, పుర, వరంబున్= ఇంద్రప్రస్థం అనేపేరుగల గల పురశ్రేష్ఠాన్ని - అంటే గొప్పదైన ఇంద్రప్రస్థపురాన్ని; చూచితిరే= చూచినారు కదా; పాండు, సుతులు= పాండవులు; అందున్= అక్కడ; సుఖము+ఉన్నవారె= సుఖంగా ఉన్నారా; మా, అత్త, అంభోరుహ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది; కుంతీమహాదేవి; కుశలయే= క్షేమంగా ఉన్నదా?; ఆ+మహావీరుఁడు; జిత+అరి= జయింపబడిన శత్రువులు కలవాడు; అర్జునుఁడు; తీర్థ, గమన+ఉత్సుకుండు= తీర్థయాత్రలకు వెళ్ళటంలో ఉత్సాహం కలవాడు; అయ్యెన్= అయ్యాడు; క్రమ్మఱి= తిరిగి; వచ్చెనే= వచ్చినాడా? ఎఱుగుదురు+ఏని= తెలిస్తే; నాకున్; ఎఱుఁగన్; చెప్పుఁడు= తెలియచేయండి; అనినన్= అని అనగా; తరుణి= ఓ కాంతా!; నేను+అ= నేనే; చూవె= సుమా; ఆ+అర్జునుండ; నీ, ఒద్దన్= నీ దగ్గర; ఈ+విధమునన్= ఈ విధంగా; ఉన్నవాఁడన్= ఉన్నాను; నీకున్; నాకున్; ధరణీ, ధరుండు+అను= భూమిని ధరించినవాడు - శ్రీకృష్ణుడు అనే; జలజభవుఁడు= బ్రహ్మదేవుడు-పద్మంనుండి పుట్టినవాడు; సంగమంబు= కలయిక; చేసెన్= ఏర్పాటు చేశాడు.

తాత్పర్యం: 'దేవేంద్రుని రాజధాని అమరావతితో సమానమని ఈ భూమిమీద పేరుపొందిన ఇంద్రప్రస్థపురశ్రేష్ఠాన్ని మీరు చూచారా? అందు పాండవులు సుఖంగా ఉన్నారా? మా అత్త కుంతీదేవి కుశలమా? ఆ మహావీరుడు, శత్రువులను జయించినవాడు అయిన అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళాలన్న ఉత్సాహంతో ఉండేవాడే - ఆయన తీర్థయాత్రలనుండి తిరిగి వచ్చాడా? తెలిసినట్లైతే నాకు చెప్పండి' అని సుభద్ర అడుగగా, 'ఓ కాంతా! నేనే అర్జునుడను; ఈ విధంగా నీవద్ద ఉన్నాను. శ్రీకృష్ణుడు అనే బ్రహ్మ నిన్నూ నన్నూ కలిపాడు'.

విశేషం: పృథక్పదత్వం, ఉక్తివైచిత్ర్యం అనే లక్షణాలు గల మాధుర్యగుణవద్రచనకు ఈ పద్యం హృద్యమైన ఉదాహరణం. రూపసామ్యం గల యతి అర్జునుడేమో అని ఆమె అనుమానం. కాని, ఆ విషయం సూటిగా అడగటానికి వీలులేదు. అందువలన చేపకొరకు గాలంవేస్తున్నట్లు సంభాషణ సాగించింది. తీర్థయాత్రలమీద ఆసక్తిగల ఆ అర్జునుడు తిరిగి ఇంద్రప్రస్థపురం చేరాడా? అని చివరి ప్రశ్న. చేరితే ఈ యతి అర్జునుడు కాడు. చేరకపోతే యతి ఎవరో తెలుస్తుంది - మాటనేర్పరితనం గల సుభద్ర ఉక్తిచమత్కారంతో సత్యం బైట పెట్టించింది. అందుకే అర్జునుడు మరేమీ చెప్పక తన ఉనికిని బయటపెట్టుకొన్నాడు. సుభద్రార్జునుల మధురాభిలాషల మధురాభివ్యక్తికి మాధుర్యగుణం మధుర సాధనమైనది. (సంపా.)

వ. 'బ్రాహ్మంబు మొదలుగాఁ గల యెనిమిది వివాహంబులయందును గాంధర్వరాక్షసంబులు క్షత్త్రియులకు నుత్తమ వివాహంబులు గావున నిది గాంధర్వ వివాహంబున కవసరం' బనిన సుభద్ర లజ్జావనతవదన యయి. 188

ప్రతిపదార్థం: బ్రాహ్మంబు= బ్రాహ్మం; మొదలుగాన్+కల= ఆదిగా ఉండే; ఎనిమిది, వివాహంబుల, అందున్= ఎనిమిదిరకాల వివాహాలలోనూ; గాంధర్వ, రాక్షసంబులు= గాంధర్వం, రాక్షసం; క్షత్రియులకున్= క్షత్రియులకు; ఉత్తమ= శ్రేష్ఠమైన; వివాహంబులు= వివాహాలు; కావునన్= కాబట్టి; ఇది = ఈ సందర్భం; వివాహంబునకున్= గాంధర్వ వివాహానికి; అవసరంబు= సమయంబు; అనినన్= అని అనగా; సుభద్ర= సుభద్ర; లజ్జా+అవనత, వదన, అయి= సిగ్గుచేత వంచుకొన్న ముఖం కలదై.

తాత్పర్యం: 'బ్రాహ్మము మొదలైన ఎనిమిదిరకాలవివాహాలలో గాంధర్వరాక్షసాలు క్షత్త్రియులకు ఉత్తమ వివాహాలు కాబట్టి ఇది గాంధర్వవివాహానికి సమయం' అనగానే సుభద్ర సిగ్గుతో తలవంచుకొని.

విశేషం: ఎనిమిది రకాల వివాహాలు - బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచము. వివరాలకు చూడు (ఆది.4-55)

తే. 'నన్ను నీ నర్హు లెల్ల నిం దున్నవారు; । వార యెఱిఁగి చేయుదురు వివాహ' మనుచు
వనజనేత్ర యంతఃపురంబునకుఁ జనియెఁ; నరిగెఁ దన లతాగృహమున కర్జునుండు. 189

ప్రతిపదార్థం: నన్నున్; ఈన్= ఇవ్వటానికి; అర్హులు+ఎల్లన్= తగినవారంతా; ఇందున్= ఇక్కడ; ఉన్నవారు= ఉండేవారే; వారు+అ= వారే; ఎఱిఁగి చేయుదురు= తెలిసి చేస్తారు; వివాహము= పెండ్లి; అనుచున్= అంటూ; వనజ, నేత్ర= పద్మాలవంటికన్నులు కలది-సుభద్ర; అంతఃపురంబునకున్= అంతఃపురానికి; చనియెన్= వెళ్ళింది; అర్జునుండు; తన= తనయొక్క; లతా, గృహమునకున్= తీగెలతో నిర్మించిన ఇంటికిన్, పొదరింటికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: 'నన్ను ఇవ్వటానికి అర్హులైనవాళ్ళంతా ఇక్కడే ఉన్నారు. వాళ్ళే తెలిసికొని వివాహం చేస్తా' రంటూ సుభద్ర అంతఃపురానికి వెళ్ళింది. తరువాత అర్జునుడు తన పొదరింటికి వెళ్ళాడు.

విశేషం: శ్రీకృష్ణుడే సుభద్రార్జునుల వివాహవ్యూహాన్ని రచించాడని తెలిసిన తరువాత సుభద్ర తనంత తాను గాంధర్వ వివాహానికి ఒడబడటం ఉచితం కాదు. సూత్రధారుడు అయిన కృష్ణుడే సమయాన్ని గమనించి సముచిత విధంగా సమర్పించ నున్నాడని సన్నివేశం ధ్వనింపచేస్తున్నది. అంతరంగంలో ఇష్టమే కాని ఈ అంతర్నాటకమెందుకో తెలిసిన తరువాతనే వివాహంకావటం ఇరువురికీ మంచిది అన్న భావాన్ని వ్యంగ్యంగా సూచించిన వివేకవతి, లజ్జావతి సుభద్ర. అర్జునునికి రహస్యం చెప్పి తనకు చెప్పకుండా ఉంచిన పెద్దలే తనను ఇస్తారులే; అంతవరకు నాకు తెలిసిందని నేను ఎందుకు బైటపడాలి? అన్న గూఢాభిమానంకూడా ఆమె మాటలలో ప్రతీయమానమౌతున్నది. పైపెచ్చు ఆ మాటలు తేటగీతి పూర్వార్ధంలో సమతను ప్రదర్శించటం, ఉత్తరార్ధంలో వాళ్ళచర్యలు సమంగా రెండుచరణాలలో వర్ణింపబడటంవలన పద్య రచనలో సమత అనే గుణం శోభిస్తున్నది. (సంపా.)

వ. అయ్యిరువుర యన్యోన్యప్రణయంబులు దనదివ్యజ్ఞానంబునం జేసి దివ్యపురుషుండు పురుషోత్తముం డెఱింగి, యర్జునునకు భోజనవిధు లమర్ప రుక్మిణీదేవిం బంచి, యొక్కనాఁ డేకాంతంబున దేవకీవసుదేవప్రద్యుమ్న సాంబసంకర్షణసారణసాత్యకు లకు నర్జును స్థితియును' నాతనియందు సుభద్రనెయ్యంబును నెఱింగించి, తమతొల్లింటి విచారంబున కనుగుణం బగుటకు సంతసిల్లి, బలదేవాదు లెఱుంగకుండ సుభద్రార్జునుల వివాహంబు సేయ సమకట్టి, తమనిశ్చయం బయ్యిరువురకుం జెప్పి, పశుపతిపూజా మహోత్సవవ్యాజంబున నఖిలయాదవ భోజాంధకవృష్ణివరులతో నంతర్ద్వీపంబునకుం జని. 190

ప్రతిపదార్థం: ఆ+ఇరువుర= ఆ సుభద్రార్జునులయొక్క; అన్యోన్య, ప్రణయంబులు= పరస్పరప్రేమలు; తన దివ్యజ్ఞానంబునన్+చేసి= తన దివ్యజ్ఞానంచేత; దివ్య, పురుషుండు; పురుష+ఉత్తముండు= పురుషులలో శ్రేష్ఠుడు - శ్రీకృష్ణుడు; ఎఱింగి= తెలిసికొని; అర్జునునకున్= అర్జునునికి; భోజన, విధులు= భోజన సంబంధకార్యములు; అమర్పన్= అమర్చుటకు; రుక్మిణీదేవిన్; పంచి= పంపి; ఒక్కనాఁడు; ఏకాంతంబునన్= ఏకాంతంలో; దేవకీ, వసుదేవ, ప్రద్యుమ్న, సాంబ, సంకర్షణ, సారణ, సాత్యకులకున్; అర్జును స్థితియును= అర్జునుని ఉనికిని; అతని అందున్= అతనిపై; సుభద్ర, నెయ్యంబును= సుభద్రయొక్క స్నేహాన్ని; ఎఱింగించి= తెలిపి; తమ, తొల్లింటి= తమ పూర్వపు; విచారంబునకున్= ఆలోచనకు; అనుగుణంబు= తగినది; అగుటకున్= కావటానికి; సంతసిల్లి; బలదేవ+ఆదులు= బలరాముడు మొదలైనవాళ్ళు; ఎఱుంగకుండన్= తెలియకుండా; సుభద్రా+అర్జునుల= సుభద్రార్జునుల; వివాహంబు= పెండ్లి; చేయన్= చేయటానికి; సమకట్టి= పూనుకొని; తమ, నిశ్చయంబు=

తమ నిర్ణయం; ఆ+ఇరువురకున్= ఆ ఇద్దరికి; పశుపతి, పూజా, మహా +ఉత్సవ, వ్యాజంబునన్= శివపూజా మహోత్సవం నెపంతో; అఖిల, యాదవ, భోజ+అంధక, వృష్ణి, వరులతోన్= యాదవ, భోజ, అంధక, వృష్ణివంశ శ్రేష్ఠులందరితో; అంతర్+ద్వీపంబునకున్= లోపలి ద్వీపానికి; చని= వెళ్ళి.

తాత్పర్యం: ఆ సుభద్రార్జునుల పరస్పరానురాగాలు తనదివ్యజ్ఞానంతో శ్రీకృష్ణుడు తెలిసికొని, అర్జునునికి భోజనవిధులు అమర్చటానికి రుక్మిణీదేవిని పంపి, ఏకాంతంలో దేవకీ వసుదేవ ప్రద్యుమ్న సాంబ సంకర్షణ సారణ సాత్యకులకు అర్జునునిఉనికిని, అతనిపై సుభద్రకున్న ప్రేమను తెలియజేశాడు. మొదటినుండి తమకున్న ఆలోచనకు అది అనుకూలమే కనుక సంతోషించాడు. బలరాముడు మొదలైనవాళ్ళకు తెలియకుండా సుభద్రార్జునుల వివాహం చేయటానికి నిశ్చయించాడు. తమనిశ్చయాన్ని ఆ ఇద్దరికి చెప్పాడు. శివపూజా మహోత్సవం నెపంతో అఖిలయాదవ భోజాంధకవృష్ణివంశశ్రేష్ఠులతో ఆంతరద్వీపానికి వెళ్ళి.

వ. **అం దమరబృందవంద్యున । కిందుకళాభరణునకు నుమేశ్వరునకు నా**
నందం బొందఁగ నందఱ । నందకధరుఁ డుత్సవం బొనర్పఁగఁ బంచెన్. **191**

విశేషం: నందక, ధరుడు= నందకం అనే పేరుకల ఖడ్గాన్ని ధరించినవాడు - విష్ణుమూర్తి - కృష్ణుడు; అందున్= ఆంతర ద్వీపంలో; అమర, బృంద, వంద్యునకున్= దేవతాసమూహానికి పూజ్యుడైనవానికి; ఇందు, కళా+ఆభరణునకున్= చంద్రకళ ఆభరణంగా కలవానికి; ఉమా+మహేశ్వరునకున్= ఉమాదేవి భర్తకు; ఆనందంబు= సంతోషం; ఒందఁగన్= కలిగేటట్లు; ఉత్సవంబు= పండుగ; ఒనర్పఁగన్= చేయటానికి; అందఱన్= అందరినీ; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'ఆంతరద్వీపంలో దేవతలందరికీ పూజ్యుడు, చంద్రశేఖరుడు ఉమాపతి అయిన పరమేశ్వరునికి ప్రీతిగా ఉత్సవం చేయండి' అని శ్రీకృష్ణుడు అందరినీ ఆజ్ఞాపించాడు.

క. **తగఁగ వివాహం బెన్నం । డగునొకొ, యెన్నండు సంగమావాప్తియు మా**
కగునొకొ యని యెడఁ గోరుచు । నొగి నిట యుండిరి సుభద్రయును విజయుండున్. **192**

ప్రతిపదార్థం: తగన్+కన్= తగురీతిగా; వివాహంబు= పెండ్లి; ఎన్నండు= ఎప్పుడు; అగున్+ఒకొ= అవుతుందోకదా!; ఎన్నండు= ఎప్పుడు; సమాగమ+అవాప్తియున్= కలయిక లభించటం; మాకున్= మాకు; అగున్+ఒకొ= కలుగుతుందోకదా!; అని; ఎడన్= హృదయంలో; కోరుచున్= కోరుకొంటూ; సుభద్రయును= సుభద్రయును; విజయుండును= అర్జునుడూ; ఒగిన్= క్రమంగా; ఇటన్= ద్వారవతిలో; ఉండిరి= ఉన్నారు.

తాత్పర్యం: 'తగురీతిలో వివాహం ఎన్నడు జరుగుతుందో! మాకు సమాగమ - అవకాశం ఎన్నడు లభిస్తుందో!' అని హృదయంలో కోరుకొంటూ సుభద్రార్జునులు ద్వారకలో ఉన్నారు.

విశేషం: నాయికానాయకులలో రతిభావం దేదీప్యమానంగా (ఉజ్జ్వలంగా) ధ్వనింపచేయటంలో నన్నయ 'కాంతి' అనే గుణాన్ని కమనీయంగా పోషించాడు. (సంపా.)

క. హరిఁ దలఁచె సుభద్ర ; పురం । దరుఁ దలఁచె ధనంజయుండు; దడయక వా ర
య్యిరువురఁ బెండిలి సేయఁగ । వరదులు తద్ద్వారవతికి వచ్చిరి ప్రీతిన్. 193

ప్రతిపదార్థం: సుభద్ర, హరిన్= శ్రీకృష్ణుడిని; తలఁచెన్= తలచింది; ధనంజయుండు= అర్జునుడు; పురందరున్= దేవేంద్రుడిని; తలఁచెన్= అనుకున్నాడు; వరదులు= వరాలిచ్చేవారు; వారు= ఆ శ్రీకృష్ణదేవేంద్రులు; తడయక= ఆలస్యంచేయక; ఆ+ఇరువురన్= ఆ ఇద్దరిని; పెండిలి= పెండ్లి; చేయఁగన్= చేయటానికి; ప్రీతిన్= ప్రేమతో; తత్+ద్వారవతికిన్= ఆ ద్వారకానగరానికి; వచ్చిరి= వచ్చారు.

తాత్పర్యం: సుభద్ర మనస్సులో శ్రీకృష్ణుడిని తలచుకొన్నది. అర్జునుడు దేవేంద్రుడిని తలచుకొన్నాడు. వరాలిచ్చే వాళ్ళిద్దరు వెంటనే వాళ్ళపెండ్లి చేయటానికి ప్రీతితో ద్వారవతీనగరానికి (ద్వారకానగరానికి) వచ్చారు.

విశేషం: ఈ పద్యంలో నాయికానాయకుల సంకల్పాలలోనూ, ఇంద్రోపేంద్రుల ఆగమనంలోనూ, పద్యనిర్మాణంలోనూ సమతాగుణం సార్థకం. (సంపా.)

అర్జునుండు సుభద్రను వివాహంబగుట (సం. అను 1-144-270 పంక్తి)

వ. ఇట్లు వాసుదేవుండు వసుదేవాక్రూరసారణసాంబసాత్యకిసహితంబుగా నంతర్ద్వీపంబుననుండి వచ్చిన యనంతరంబ యమరావతినుండి యమరసిద్ధసాధ్యమునిగణపరివృతుం డై యమరేంద్రుండు వచ్చె; నంత బృహస్పతి యిచ్చిన యుత్తమలగ్నంబున నగ్నియమనిరృతివరుణవాయుధనదేశానాదిసురవరులు, నత్రిభృగు నారద వసిష్ఠవామ దేవప్రభృతి మహామునులును సదస్యులుగాఁ, గశ్యపప్రజాపతి హోమకర్తగా, నరుంధతియు శచియు సత్యభామయు రుక్మిణియు నప్సరోగణంబులతోడం బురంధ్రీకార్యంబులు నిర్వహింప సుభద్రార్జునుల వివాహమహోత్సవం బతిరమ్యం బయ్యె నంత. 194

ప్రతిపదార్థం: ఇట్లు; వాసుదేవుండు= శ్రీకృష్ణుడు, వసుదేవ+అక్రూర, సారణ, సాంబ, సాత్యకి, సహితంబుగాన్= వసుదేవుడు, అక్రూరుడు మొదలైన వాళ్ళతోకూడి; అంతర్+ద్వీపంబునుండి; వచ్చిన= వచ్చిన; అనంతరంబు+అ= తరువాత; అమరావతినుండి; అమర, సిద్ధ, సాధ్య, ముని, గణ పరివృతుండు+ఐ= దేవతలతో, సిద్ధులతో, సాధ్యులతో, మునిసమూహాలతో చుట్టబడినవాడై; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; వచ్చెన్; అంతన్; బృహస్పతి; ఇచ్చిన= పెట్టిన; ఉత్తమ, లగ్నంబునన్= మంచి ముహూర్తంలో; అగ్ని, యమ, నిరృతి, వరుణ, వాయు, ధనద+ఈశాన+ఆది, సుర, వరులున్= అగ్నిదేవుడు, కుబేరుడు, ఈశానుడు (అష్టదిక్పాలకులు) మొదలైన దేవతాశ్రేష్ఠులూ; అత్రి, భృగు, నారద, వసిష్ఠ, వామదేవ, ప్రభృతి, మహామునులు= అత్రి, భృగువు, నారదుడు, వసిష్ఠుడు, వామదేవుడు మొదలైన మహామునులూ; సదస్యులుగాన్= సభలోని సభ్యులుగా; కశ్యప, ప్రజాపతి= కశ్యప ప్రజాపతి; హోమకర్తగాన్= హోమం చేసేవాడుగా; అరుంధతియు= అరుంధతి; శచియు, సత్యభామ, రుక్మిణియును= శచీదేవి, సత్యభామ, రుక్మిణి; అప్సరస్+గణంబులతోడన్= అప్సరసలసమూహాలతో; పురంధ్రీ, కార్యంబులు= ముత్తైదువులు చేయదగినపనులు; నిర్వహింపన్= నిర్వహించగా; సుభద్రా+అర్జునుల= సుభద్రార్జునుల; వివాహ= పెండ్లి; మహా+ఉత్సవంబు= గొప్ప పండుగ; అతి, రమ్యంబు= ఎంతో చూడముచ్చటైనది; అయ్యెన్= జరిగింది; అంతన్= అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు వసుదేవ అక్రూర సారణ సాంబ సాత్యకులతో ఆంతరద్వీపంనుండి వచ్చిన తర్వాత దేవేంద్రుడు అమర సిద్ధ సాధ్య ముని సమూహాలతో అమరావతినుండి వచ్చాడు. బృహస్పతి పెట్టిన ఉత్తమ లగ్నంలో అష్టదిక్పాలకులు మొదలైన దేవతాశ్రేష్ఠులు, అత్రి, భృగు, నారదాదిమహామునులు సదస్యులుగా, కశ్యప ప్రజాపతి హోమకర్తగా, అరుంధతీ శచీ సత్యభామా రుక్మిణులు అప్సరసల సాయంతో ముత్తైదువులు చేసే పనులన్నీ నిర్వహించగా, సుభద్రార్జునుల వివాహం చూడముచ్చటగా జరిగింది. అప్పుడు.

తరువోజ.

అనిమిషప్రభుఁడు నిజాత్మజు ననఘు । నర్జునుఁ బ్రీతితో నభిషిక్తుఁ జేసి
మనుజేంద్రుఁ గాంచనమణిమయోత్తుంగ । మకుటవిభూషణమస్తకుఁ జేసి
యనుపమకేయూరహారాదిభూష । ణాభిశోభితుఁ జేసి యప్పు డానంద
జనితాంబుకణికార్ద్రచక్షుస్సహస్ర । జలరుహంబులు దాల్చె సమ్మదం బెసఁగ. 195

ప్రతిపదార్థం: అనిమిష, ప్రభుఁడు = దేవేంద్రుడు; నిజ+ఆత్మజున్= తన కుమారుడిని; అనఘున్= పాపరహితుడిని; అర్జునున్= అర్జునుని; ప్రీతితోన్, అభిషిక్తున్+చేసి= అభిషేకింపబడినవాడినిగా చేసి, మనుజ+ఇంద్రున్= రాజును; కాంచన, మణిమయ+ఉత్తుంగ, మకుట, విభూషణ, మస్తకున్= బంగారంతో, మణులతో నిర్మించిన కిరీటంచేత అలంకరింపబడిన శిరస్సుకలవాడిని; చేసి; అనుపమ, కేయూర, హార+ఆది, భూషణ+అభిశోభితున్= సాటిలేని బాహుపురులు, హారాలు మొదలైన ఆభరణాలచే ప్రకాశించేవాడినిగా; చేసి, అప్పుడు; ఆనంద, జనిత+అంబు, కణిక+ఆర్ద్ర, చక్షుస్+సహస్ర, జల రుహంబులు= ఆనందంనుండి పుట్టిన నీటిబిందువులచే తడిసిన పద్మాలవంటి కళ్ళు వేయింటిని; సమ్మదంబు= సంతోషం; ఎసఁగన్= అతిశయించగా; తాల్చెన్= ధరించాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు - తన కుమారుడు, పుణ్యాత్ముడు అయిన అర్జునుడిని అభిషేకించి (మంగళస్నానం చేయించి), బంగారంతో మణులతో రూపొందించిన కిరీటాన్ని శిరస్సుపై అలంకరించి, సాటిలేని బాహుపురులు, హారాలు మొదలైన ఆభరణాలు - అలంకరించి' ఆనంద బాష్పాలచేత తడిసిన పద్మాలవంటి కళ్ళు వేయింటిని సంతోషం అతిశయిల్లగా ధరించాడు.

విశేషం: అలం: రూపకం. అనిమిషులు అంటే రెప్పపాటులేనివారు - దేవతలు. వృత్తలక్షణానికి చూడు. ఆది.2-150 విశేషం. ఈ పద్యంలో ఓజోగుణంతోకూడికొన్న ప్రసాదగుణం సన్నివేశగతమైన ఉదాత్తతను ప్రసన్నంగా పోషిస్తున్నది. (సంపా.)

మాలిని.

నరునకు దయ ని ట్లానంద మొందించి యింద్రుం
డరిగె దివికి దివ్యానంతరత్నాంశుజాల
స్ఫురితసురవిమానంబుల్ నభోభాగ మెల్ల
న్మెరసి వెలుఁగుచుండన్ నిర్జరశ్రేణితోడన్. 196

ప్రతిపదార్థం: ఇంద్రుండు= దేవేంద్రుడు; నరునకున్= అర్జునునికి; ఇట్లు= ఈ విధంగా; ఆనందము= సంతోషం; ఒందించి= కూర్చి; దివ్య+అనంత, రత్న+అంశు, జాల, స్ఫురిత, సుర, విమానంబుల్= శ్రేష్ఠములైన అంతులేని రత్నకిరణాల సమూహంతో ప్రకాశిస్తున్న దేవతా విమానాలు; నభస్+భాగము+ఎల్లన్= ఆకాశమంతటా; మెరసి= బయల్పడి; వెలుఁగుచున్+ఉండన్= ప్రకాశిస్తూ ఉండగా; నిర్జర, శ్రేణితోడన్= దేవతల సమూహంతో; దివికిన్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడు అర్జునునికి ఇట్లా ఆనందం కలిగించి - శ్రేష్ఠాలైన అనంత రత్నకిరణ సమూహంతో ప్రకాశించే దేవతావిమానాలు ఆకాశమంతా వెలుగుతుండగా దేవతలతో కలిసి స్వర్గలోకానికి వెళ్ళాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది. 2-81 విశేషం.

వ. ఇట్లు నారాయణుండు నిజారంభంబు సఫలం బగుటకు సంతసిల్లి, సంప్రాప్తమనోరథుం డయిన యప్పార్థుం గౌఁగిలించుకొని, 'యక్షయబాణతూణీరబాణాసనసనాథం బయి పవనజవనహయంబులం బూన్చిన యక్కాంచనరథం బెక్కి సుభద్రం దోడ్కొని యింద్రప్రస్థపురంబున కరుగు' మని పంచి, యనంతరం బంతర్ద్వీపంబున కరిగిన. 197

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; నారాయణుండు= శ్రీకృష్ణుడు; నిజ+ఆరంభంబు= తనప్రయత్నం; సఫలంబు+అగుటకున్= సఫలం కావటానికి; సంతసిల్లి= సంతోషించి; సంప్రాప్త; మనోరథుండు+అయిన= పొందబడిన కోరిక గలవాడైన; ఆ+పార్థున్= ఆ అర్జునుడిని; కౌఁగిలించుకొని= ఆలింగనంచేసి; అక్షయ, బాణ, తూణీర, బాణ+ఆసన, సనాథంబు+అయి= తరుగని బాణాల అమ్ములపొదితో, ధనుస్సుతో కూడినదై; పవన, జవన, హయంబులన్= వాయువేగం గల గుర్రాలను; పూన్చిన= కట్టిన; ఆ+కాంచన, రథంబు= ఆ బంగారురథాన్ని; ఎక్కి, సుభద్రన్= సుభద్రను; తోడ్కొని= వెంటతీసుకొని; ఇంద్రప్రస్థ, పురంబునకున్= ఇంద్రప్రస్థ నగరానికి; అరుగుము= వెళ్ళుము; అని= అని పలికి; పంచి= పంపి; అనంతరంబు+అ= తరువాత; అంతర్+ద్వీపంబునకున్= అంతర్ద్వీపానికి; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: ఈ విధంగా శ్రీకృష్ణుడు తన ప్రయత్నం సఫలం అయినందుకు సంతోషించి, కోరిక నెరవేరిన అర్జునుడిని కౌగిలించుకొని, 'తరుగని బాణాల అమ్ములపొదితో, ధనుస్సుతో కూడి, వాయువేగం గల గుర్రాలను పూన్చిన ఆ బంగారురథం ఎక్కి సుభద్రతో ఇంద్రప్రస్థపురానికి వెళ్ళు' మని పంపి, తరువాత తాను కూడ ఆంతర ద్వీపానికి వెళ్ళగా.

క. హరి పంచిన మార్గంబునఁ । గురువిభుఁడు సుభద్రఁ దోడుకొని చనునెడఁ ద
త్పురపరిరక్షకు లతిభీ । కరులు పృథుశ్రవసుఁ డాదిగాఁ గల వీరుల్. 198

ప్రతిపదార్థం: హరి= శ్రీకృష్ణుడు; పంచిన= పంపిన; మార్గంబునన్= దారిలో; కురు, విభుఁడు= కురువంశరాజు అర్జునుడు; సుభద్రన్= సుభద్రను; తోడుకొని= వెంట తీసికొని; చను+ఎడన్= వెళ్ళేటప్పుడు; తత్+పుర, పరిరక్షకులు= ఆ పట్టణానికి కాపలా ఉండేవాళ్ళు; అతి, భీకరులు= మిక్కిలి భయాన్ని కలిగించేవాళ్ళు; పృథుశ్రవసుడు+ఆదిగాన్+కల= పృథుశ్రవసుడు మొదలుగా ఉన్న; వీరుల్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పంపినమార్గంలో అర్జునుడు సుభద్రను తోడ్కొని వెళ్ళుతుండగా, ఆ పట్టణానికి కాపలా ఉన్న పృథుశ్రవసుడు మొదలైన భయంకరవీరులు.

ఉ. 'వీరుఁడు వీఁడు పాండవుఁడు వృష్ణికులోత్తము లైన సీరిదై
త్యారు లెఱుంగకుండఁగ మహారథుఁ డై తరుణిన్ సుభద్ర నం
భోరుహనేత్రఁ దోడ్కొనుచుఁ బోయెడి; నీతనిఁ బోవనిచ్చినన్
ధీరుఁడు మాధవుండు బలదేవుఁడు నల్గుదు' రంచు నడ్డ మై. 199

ప్రతిపదార్థం: వీఁడు= ఇతడు; పాండవుఁడు= పాండురాజుకుమారుడు; వీరుఁడు; వృష్ణి, కుల+ఉత్తములు+ఐన= వృష్ణివంశశ్రేష్ఠులైన; సీరి, దైత్య+అరులు= బలరామ శ్రీకృష్ణులు; ఎఱుంగక+ఉండఁగన్= తెలియకుండా; మహారథుఁడు+ఐ= గొప్ప రథంమీద కూర్చున్నవాడై; తరుణిన్= కాంతను; సుభద్రన్= సుభద్రను; అంభోరుహ, నేత్రన్= పద్మాలవంటి కళ్ళు కలదానిని; తోడ్కొనుచున్= వెంటతీసికొంటూ; పోయెడిన్= పోతున్నాడు; ఈతనిన్= ఇతనిని; పోవనిచ్చినన్= పోనిస్తే; ధీరుఁడు; మాధవుండు= శ్రీకృష్ణుడు; బలదేవుఁడున్= బలరాముడు; అల్గుదురు+అంచున్= కోపపడతారని; అడ్డమై= అడ్డగించి.

తాత్పర్యం: ఇతడు పాండవవీరుడు - వృష్ణికులశ్రేష్ఠులైన బలరామశ్రీకృష్ణులకు తెలియకుండా పెద్ద రథాన్ని ఎక్కి, పద్మాలవంటి కన్నులు గల సుభద్రాకాంతను తోడ్కొని పోతున్నాడు. ఇతడిని వదలితే ధీరులు శ్రీకృష్ణుడు, బలరాముడు కోపపడతారని అడ్డగించి.

విశేషం: "వీరుడు వీఁడు" అనే ప్రశంసాత్మకవాక్యంతో ప్రారంభమయ్యే ఈ పద్యంలో అర్జునుడి వీరకృత్యం భటులచేత వితర్కింపబడింది. ఇది అర్థవైమల్యాన్ని వ్యక్తం చేసే ప్రసాదగుణ విశిష్టరచన. (సంపా.)

క. వీఁకఁ బఱతెంచి నలుగడఁ । దాఁకినఁ గడు నలిగి ఘోరతరశరహతి న
మ్మూఁకలు విరియఁగ నర్జునుఁ । డాఁకరమున నేసె నుగ్రుఁ డయి రణభూమిన్. 200

ప్రతిపదార్థం: వీఁకన్= పరాక్రమంతో; పఱతెంచి= పరుగెత్తివచ్చి; నలుగడన్= నాలుగువైపుల; తాఁకినన్= ఎదుర్కోగా; అర్జునుఁడు; కడున్+అలిగి= మిక్కిలికోపించి; ఉగ్రుఁడు+అయి= భయంకరుడై; రణ, భూమిన్= యుద్ధరంగంలో; ఘోరతర, శర+ఆహతిన్= మిక్కిలి భయంకరాలైన బాణాల దెబ్బలచే; ఆ+మూఁకలు= ఆ సేనలు; విరియఁగన్= చెల్లాచెదురయ్యేటట్లు; ఆఁకరమునన్= ఆగ్రహంతో; కోపంతో; ఏసెన్= కొట్టాడు.

తాత్పర్యం: పరాక్రమంతో పరుగెత్తి వచ్చి నలువైపుల ముట్టడించగా అర్జునుడు భయంకరుడై యుద్ధరంగంలో మిక్కిలి తీవ్రాలైన బాణాలతో ఆ సేనలు చెల్లాచెదరయ్యేటట్లు కోపంతో కొట్టాడు.

చ. హరితనయుండు పార్థుఁడు రయంబున నందఱ నాహవక్రియా
విరతులఁ జేసి యప్పురమువీథుల వేదుల రమ్యహర్మ్య గో
పురములఁ దద్గిరీంద్రమణిభూముల భూరితటాకపంకజా
కరనవనందనావళులఁ గాండమయంబులఁ జేసె నీసునన్. 201

ప్రతిపదార్థం: హరి, తనయుండు= దేవేంద్రునికుమారుడు; పార్థుఁడు= అర్జునుడు; రయంబునన్= వేగంగా; అందఱన్= ఆ సైనికులందరినీ; ఆహవ, క్రియా విరతులన్+చేసి= యుద్ధపు పనినుండి విరమించుకొన్నవాళ్ళనుగా చేసి; ఈసునన్= కోపంతో; ఆ+పురము= ఆ పట్టణంయొక్క; వీథులన్; వేదులన్= అరుగులను, రమ్య, హర్మ్య, గోపురములన్= అందములైన మేడల గోపురాలను; తత్+గిరి+ఇంద్రమణి, భూములన్= ఆ పర్వతశ్రేష్ఠంయొక్క రత్నాల నేలలను; భూరి, తటాక, పంకజ+ఆకర,

నవ, నందన+ఆవళులన్= పెద్దచెరువులయొక్క, పద్మాలకు నిలయాలైన సరస్సులయొక్క, కొత్తఉద్యానవనాలయొక్క సమూహాలను; కాండమయంబులన్= బాణాలతో నిండినవాటినిగా; చేసెన్.

తాత్పర్యం: దేవేంద్రునితనయుడైన అర్జునుడు వెంటనే ఆ సైనికులు యుద్ధం విరమించుకొనేటట్లు చేసి, ఆ కోపంతో ఆ పట్టణంలోని వీథులను, అరుగులను, అందాలైన మేడల గోపురాలను, ఆ మహాపర్వతంయొక్క రత్నాల నేలలను, పెద్దచెరువులను, సరస్సులను, ఉద్యానవనాలను బాణాలతో నింపాడు.

విశేషం: అర్జునుని యుద్ధక్రీడ రమణీయం. ద్వారవతీనగర రక్షకులను, యాదవసైన్యాలను అంతమొందించటం ఆయన లక్ష్యం కాదు - తనకు అడ్డురాకుండా చెల్లాచెదురు చేయటం, మళ్ళీ విజృంభించకుండా తన శక్తిసామర్థ్యాలు చూపి, చతికిల పడేటట్లు చేయటం ఆయన ఉద్దేశం. అందుకే ఆయన ద్వారవతి వీథులను, అరుగులను, మేడల గోపురాలను, పర్వతప్రదేశాలను, చెరువులను, సరస్సులను, ఉద్యానవనాలను తన బాణాలతో నింపాడు. అడుగు ముందుకు వేస్తారేమో - జాగ్రత్త! అన్నట్లు - భాషతో కాక బాణాలతో హెచ్చరించి వెళ్ళాడు. అందువలన నన్నయ ఈ పద్యంలో శుద్ధఓజస్సును పోషించకుండ ప్రసాదగుణయుక్తమైన ఓజస్సునే ప్రదర్శించాడు. రసోదంచితగుణవద్రచన కిది ఉదాహరణం. ఈవిధంగా సుభద్రావివాహఘట్టంలో నన్నయ దశగుణాలను ఆవిష్కరించే రచనను చేసి తన శైలియొక్క ప్రత్యేకతను ప్రదర్శించాడు. (సంపా.)

క. అమరేంద్రసుతుఁడు దనకుం । గమలాక్షి సుభద్ర రథముఁ గడపఁగ ననిలో
నమిత యదుసైన్యముల న । శ్రమమున నోడించి లబ్ధ జయుఁ డయి యరిగెన్. 202

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర, సుతుఁడు= దేవేంద్రునియొక్కకుమారుడు - అర్జునుడు; తనకున్; కమల+అక్షి= పద్మాలవంటి కన్నులు కలది; సుభద్ర; రథమున్= రథాన్ని; కడపన్+కన్= నడపగా; అనిలోన్= యుద్ధంలో; అమిత, యదు, సైన్యములన్= పరిమితి లేని యాదవసైన్యాలను; అశ్రమమునన్= సులభంగా; ఓడించి, లబ్ధ, జయుఁడు+అయి= జయాన్ని పొందినవాడై - అంటే జయాన్ని పొంది; అరిగెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: ఇంద్రతనయుడైన అర్జునుడు తనకు సుభద్ర రథం నడుపగా - యుద్ధంలో అపరిమితాలైన యాదవసైన్యాలను సులభంగా ఓడించి, విజయాన్ని పొంది వెళ్ళాడు.

వ. అంత సభాపాలుండు ప్రబల జలధార ధ్వాన గంభీరభేరీధ్వనిచే నర్జునుపరాక్రమం బెఱింగించిన దాని విని యంతర్ద్వీపంబున నున్న బలదేవాదియాదవులందఱు నాక్షణంబ పురంబునకు వచ్చి సభాసీను లయి. 203

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; సభాపాలుండు; ప్రబల, జలధర, ధ్వాన, గంభీర, భేరీ, ధ్వనిచేన్= గొప్ప మేఘధ్వనివంటి గంభీరమైన నగారా మ్రోతచేత; అర్జును= అర్జునుని; పరాక్రమంబున్= పరాక్రమాన్ని; ఎఱింగించినన్= తెలుపగా; దానిన్= దానిని; విని; అంతర్+ద్వీపంబునన్, ఉన్న, బలదేవ+ఆది, యాదవులు+అందఱున్= అంతర్ద్వీపంలో ఉండే బలరాముడు మొదలైన యాదవులంతా; ఆ, క్షణంబు+అ= ఆ వెంటనే; పురంబునకున్= ద్వారవతీపురానికి; వచ్చి; సభా+ఆసీనులు+అయి= సభలో కూర్చున్నవాళ్ళయి.

తాత్పర్యం: అర్జునుడు ఆ విధంగా విజయాన్ని సాధించి వెళ్ళిన తరువాత - సభాపాలుడు పెద్ద మేఘధ్వనివంటి గంభీరమైన నగారామ్రోతతో అర్జునునిపరాక్రమం తెలుపగా, అది విని, అంతర్ద్వీపంలో ఉన్న బలరాముడు మొదలైన యాదవులంతా అప్పటికప్పుడే ద్వారవతీపురానికి వచ్చి సభ చేసి.

క. యాదవుల నాదరింపక । యాదవిఁ దోడ్కొని కిరీటి యరిగెను గంభీ
రోదధిఁ గరముల నీఁదం । గా దనక కడంగె నధికగర్వోద్ధతుఁ డై. 204

ప్రతిపదార్థం: కిరీటి= అర్జునుడు; యాదవులన్= యాదవుల్ని; ఆదరింపక= లెక్కపెట్టక; యాదవిన్= యాదవకాంతను; తోడ్కొని= వెంటతీసికొని; అరిగెను= వెళ్ళాడు; గంభీర+ఉదధిన్= లోతైన మహాసముద్రాన్ని; కరములన్= చేతులతో; ఈఁదన్+కాదు+అనక= ఈదటం సాధ్యం కాదనకుండా; అధిక, గర్వ+ఉద్ధతుఁడు+ఐ= మిక్కిలిగర్వంతో విజ్రుంభించినవా డై; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: యాదవులను లెక్కపెట్టక అర్జునుడు యాదవకాంతను తోడ్కొని వెళ్ళాడు. లోతైన మహాసముద్రాన్ని చేతులతో ఈదటం సాధ్యం కాదని తెలిసికొనకుండా గర్వాతిశయంతో విజ్రుంభించి ఈ పనికి పూనుకొన్నాడు.

మత్తకోకిల.

ఏల పార్థుపరాక్రమంబు సహింప? నాతని నాహవ
వ్యాలు నిప్పుడ పట్టి తెత్తము; వాతధూతదవానల
జ్వాలకున్ వనరాశివేల కసంఖ్యయాదవసేనకున్
దేలిపోవక చక్కనయ్యెడు ధీరు లెవ్వరు పోరిలోన్. 205

ప్రతిపదార్థం: పార్థు, పరాక్రమంబున్= అర్జునునియొక్క పరాక్రమాన్ని; సహింపన్= ఓర్చుకొనటం; ఏల= ఎందుకు? ఆహవ, వ్యాలున్= యుద్ధంలో పొగరుపట్టిన ఏనుగువంటివాడిని; అతనిన్= అతనిని; ఇప్పుడు+అ; పట్టితెత్తము= పట్టి తెస్తాము; వాత, ధూత, దవానల, జ్వాలకున్= గాలిచే కదలింపబడిన దావాగ్నిజ్వాలకు; వనరాశి, వేలకున్= సముద్రం ఉప్పెనకు; అసంఖ్య, యాదవ, సేనకున్= అంతులేని యాదవసైన్యానికి; పోరిలోన్= యుద్ధంలో; తేలిపోవక= తొలగిపోక; చక్కన+అయ్యెడు= ఎదుట నిలువగల; ధీరులు= ధైర్యవంతులు; ఎవ్వరు?= ఎవరు?

తాత్పర్యం: అర్జునునిపరాక్రమాన్ని సహించటం ఎందుకు? యుద్ధంలో మదించిన ఏనుగువంటి అతడిని పట్టుకొని తీసికొనివద్దాము. గాలిచే రగుల్కొన్న దావాగ్ని జ్వాలకు, సముద్రపుటుప్పెనకు, అంతులేని యాదవసైన్యానికి యుద్ధంలో తొలగిపోకుండా ఎదరు నిలువగలిగిన ధైర్యవంతులెవరు?

విశేషం: అలం: దీపకం, ఉపమ. వృత్తలక్షణాలకు చూడు; ఆది.1.153.విశేషం.

వ. అని విజృంభించి విలయసమయ సముద్ధూత వారాశియుంబోలె ఘూర్ణిల్లుచున్న యాదవవీరుల వారించి వాసుదేవుం జూచి, బలదేవుం డి ట్లనియె. 206

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; విజ్రుంభించి= అతిశయించి; విలయ, సమయ, సముద్ధూత, వారాశియున్+పోలెన్= ప్రళయకాలంలో మిక్కిలి వృద్ధి పొందింపబడిన సముద్రంవలె; ఘూర్ణిల్లుచున్+ఉన్న= తిరుగుపడుతున్న; యాదవ, వీరులన్= యాదవవీరుల్ని; వారించి= అడ్డగించి; వాసుదేవున్= శ్రీకృష్ణుణ్ణి; చూచి; బలదేవుండు= బలరాముడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అని విజ్రుంభించి ప్రళయకాలంలో పొంగిన మహాసముద్రంవలె తిరుగుడుపడుతున్న యాదవ వీరులను ఆపి, శ్రీకృష్ణునితో బలరాముడు ఇట్లా అన్నాడు.

విశేషం: అలం: ఉపమ.

క. 'నీ వెఱుఁగకుండ గర్వము । తో విజయుఁడు దా సుభద్ర దోడ్కొని బలిమిం
బోవఁగ నంతసమర్థుఁడె' । నావుడుఁ గృష్ణుండు రామునకు ని ట్లనియెన్. 207

ప్రతిపదార్థం: నీవు+ఎఱుంగకుండన్= నీకు తెలియకుండానే; విజయుఁడు= అర్జునుడు; గర్వముతోన్, తాన్= తాను; బలిమిన్= బలవంతంగా; సుభద్రన్; తోడ్కొని= వెంటతీసికొని; పోవఁగన్= పోవటానికి; అంత, సమర్థుఁడు+ఎ= అంత మొనగాడా? నావుడున్= అనిఅనగా; రామునకున్= బలరామునికి; కృష్ణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నీకు తెలియకుండానే అర్జునుడు గర్వంతో బలవంతంగా సుభద్రను తోడ్కొని పోవటానికి అంత సమర్థుడా!' అని అనగా బలరామునితో శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు.

విశేషం: గూఢమైన అధిక్షేప చతురోక్తికి ఇది చక్కని ఉదాహరణ.

సీ. భరతకులాగ్రణి పాండవసింహంబు । సర్వధర్మజ్ఞుఁ డాసవ్యసాచి
దనమేనమఱఁదలి ధవళాక్షిఁ దోడ్కొని । చనియె; నాతని కది చనదె చెపుఁడ!
యప్పార్థుపిఱుఁద మీ రరుగంగ వాఁ డంత । యశ్రమసాధ్యుఁడె యాహవమున?
నఖిలాస్త్రవిదుఁడు ద్రోణాచార్యశిష్యుండు । జితకాశి యని వానిఁ జెప్ప వినరె?

ఆ. వలవ దుడుగుఁ' డనిన వామను పలు కను । వేలఁ గడవదయ్యె వృష్ణిభోజ
యాదవాంబురాశి యట ధనంజయుఁ డవి । జేయుఁ డభిమతార్థసిద్ధిఁ బొంది. 208

ప్రతిపదార్థం: భరత, కుల+అగ్రణి= భరతవంశశ్రేష్ఠుడు; పాండవ, సింహంబు= పాండవశ్రేష్ఠుడు; సర్వ, ధర్మజ్ఞుఁడు= అన్నిధర్మాలు తెలిసినవాడు; సవ్యసాచి= అర్జునుడు; తన= తనయొక్క; మేనమఱఁదలిన్= మేనమరదలిని; ధవళ+అక్షిన్= తెల్లని కన్నులు కలదానిని, అందమైన కన్నులు కలదానిని; తోడ్కొని= వెంటతీసికొని; చనియెన్= వెళ్లాడు; అతనికిన్= ఆ అర్జునునికి; అది, చనదె= అది తగదా; చెపుఁడు+అ= చెప్పండి; ఆ+పార్థు, పిఱుఁదన్= ఆ అర్జునుని వెనుక; మీరు+అరుగంగన్= మీరు వెళ్ళగా - అంటే దండెత్తి వెళ్ళగా; వాఁడు= అతడు; ఆవహమునన్= యుద్ధంలో; అంత, అశ్రమ, సాధ్యుఁడు+ఎ= అంత సులభంగా లొంగేవాడా; వానిన్= అతనిని; అఖిల+అస్త్ర, విదుఁడు= అన్ని అస్త్రాలు తెలిసినవాడు; ద్రోణ+ఆచార్య, శిష్యుండు; జితకాశి= యుద్ధంలో జయించి ప్రకాశించేవాడు; అని= అని; చెప్పన్; వినరె= అనగా వినలేదే మీరు; వలవదు= వద్దు; ఉడుగుఁడు= (మీ ప్రయత్నం) మానుకోండి; అనినన్= అని చెప్పగా; వామను, పలుకు= శ్రీకృష్ణునియొక్క మాట; అను; వేలన్= చెలియలికట్టను; వృష్ణి, భోజ, యాదవ; అంబు, రాశి=వృష్ణి, భోజ, యాదవ వంశాలవాళ్ళనే సముద్రం; కడవదు+అయ్యెన్= దాటదాయెను; అవిజేయుఁడు= జయింపసాధ్యం కానివాడు; ధనంజయుఁడు= అర్జునుడు; అభిమత+అర్థ, సిద్ధిన్= ఇష్టమైన కోరిక సఫలం కావటాన్ని; పొంది.

తాత్పర్యం: 'భరతవంశశ్రేష్ఠుడు, పాండవశ్రేష్ఠుడు, సర్వధర్మాలు తెలిసినవాడూ అయిన అర్జునుడు తన మేనమరదలిని తోడ్కొని వెళ్ళటం తగదా? చెప్పండి. మీరు అతడిని వెంబడించి దండెత్తితే యుద్ధంలో అతడంత సులభ సాధ్యుడా? అతడు అన్నిఅస్త్రాలు తెలిసినవాడనీ, అంతటి ద్రోణాచార్య శిష్యుడనీ, యుద్ధంలో జయించి

ప్రకాశించేవాడనీ, మీరు వినలేదా?' - అని శ్రీకృష్ణుడన్నాడు. శ్రీకృష్ణునిమాట అనే చెలియలికట్టను వృష్ణి భోజ యాదవ వంశాలవారనే సముద్రం దాటలేకపోయింది. జయింపసాధ్యం కాని అర్జునుడు తాను కోరినదానిని పొందాడు.

విశేషం: అలం: రూపకం. యాదవులమీద శ్రీకృష్ణుని పట్టు, వ్యూహరచనలో ఆయన నేర్పు, మాటల చాకచక్యం ఈ ఘట్టంలో స్పష్టం.

అర్జునుండు సుభద్రాసహితుండై యింద్రప్రస్థపురంబునకుఁ జనుట (సం.1-213-13)

వ. ఇ ట్లింద్రప్రస్థపురంబున కభిముఖుం డై యానర్తకదేశంబులకుం జని, యందు ముందఱ ముకుందప్రేషితు లయిన దాశార్హవీరులతో నగణ్యారణ్యంబులు గడచుచుఁ, బుణ్యతీర్థంబుల నాడుచు నానాజనపదంబుల విహరించుచు వచ్చి యింద్రప్రస్థపురసమీపంబున. 209

ప్రతిపదార్థం: ఇట్లు; ఇంద్రప్రస్థ, పురంబునకున్; అభిముఖుండు+ఐ= ఎదురు ముఖం కలవాడై - అంటే ఇంద్రప్రస్థపురంవైపు పయనించినవాడై; ఆనర్తక, దేశంబులకున్= ఆనర్తక దేశాలకు; చని= వెళ్ళి; అందున్= అచ్చట; ముందఱన్= ముందుగా; ముకుంద, ప్రేషితులు+అయిన= శ్రీకృష్ణునిచే పంపబడినవాళ్ళయిన; దాశార్హ, వీరులతోన్= దాశార్హునివంశానికి సంబంధించిన వీరులతో; అగణ్య+అరణ్యంబులు= లెక్కించటానికి సాధ్యం కానన్ని అడవులు; కడచుచున్= దాటుతూ; పుణ్య తీర్థంబులన్= పుణ్య తీర్థాలలో; ఆడుచున్= స్నానమాడుతూ; నానా జనపదంబులన్= అనేక గ్రామాలలో; విహరించుచున్; వచ్చి; ఇంద్రప్రస్థ, పుర, సమీపంబునన్= ఇంద్రప్రస్థనగరానికి దగ్గరలో.

తాత్పర్యం: ఈ విధంగా ఇంద్రప్రస్థపురం వైపు పయనించి, ఆనర్తకదేశాలకు వెళ్ళి, అక్కడ శ్రీకృష్ణుడు పంపిన దాశార్హవంశవీరులతో కలిసి లెక్కించసాధ్యంకానన్ని అడవులను దాటుతూ, పుణ్యతీర్థాలలో స్నానమాడుతూ అనేక గ్రామాలలో విహరిస్తూ వచ్చి, ఇంద్రప్రస్థపురానికి సమీపంలో.

ఆ. ఘనభుజుండు నరుఁడు దనతొఱ్ఱుపట్టుల । విశ్రమించి భువనవిశ్రుతుండు
మతిఁ దలంచి యాత్మహిత మగు నట్లుగా । నిష్టమున సుభద్ర కిట్టు లనియె. 210

ప్రతిపదార్థం: ఘన, భుజుండు= దృఢమైన భుజాలు కలవాడు; భువన, విశ్రుతుండు= ప్రపంచమంతటా ప్రసిద్ధి కెక్కినవాడు; నరుఁడు; తన, తొఱ్ఱుపట్టులన్= తన ఆవులమందలున్నచోట; విశ్రమించి= అలసట తీర్చికొని; మతిన్= మనస్సులో; తలంచి= ఆలోచించి; ఆత్మ, హితము+అగునట్లుగాన్= తనకు మేలు కలిగేటట్లుగా; సుభద్రకున్; ఇష్టమునన్= ప్రీతితో; ఇట్టులు+అనియెన్.

తాత్పర్యం: బలమైన భుజాలు కలవాడు, ప్రపంచంలో ప్రసిద్ధికెక్కినవాడు అయిన అర్జునుడు తన ఆవులమంద లున్నచోట విశ్రమించి, తనకు మేలు కలిగేటట్లుగా ఆలోచించి ప్రియమార సుభద్రతో ఇట్లా అన్నాడు.

విశేషం: తొఱ్ఱుపట్టు అంటే ఆలమంద. ఆలమందలు సామాన్యంగా ఊరి పొలిమేరలలో ఉంటాయి. అర్జునుడు తన 'తొఱ్ఱుపట్టుల' విశ్రమించాడనగా ఇంద్రప్రస్థపట్టణపు పొలిమేరలకు చేరి విశ్రమించాడని భావం. ఇక మిగిలింది ఇంద్రప్రస్థపురప్రవేశమే. మూలంలో పి.పి.యస్.శాస్త్రిగారి ప్రతిలో "క్రోశమాత్రేపురస్యాసీత్ గోష్ఠం పార్థస్యశోభనం" అని ఉన్నది.

వ. 'మన మివ్విధంబునఁ జనునప్పుడు నిన్నుఁ జూచి ద్రుపదరాజపుత్త్రి యప్రియంబులు వలుకునో; యప్పరమ పతివ్రతపలుకు నిక్కువం బగుం గావున, నీ వేకతంబ గోపాలబాలికలతో ముందఱ నరిగి యక్కోమలిం గను మని

పనిచిన సుభద్రయు నిజేశ్వరుపంచిన మార్గంబున నింద్రప్రస్థపురంబునకుం బోయి కుంతీదేవికి ద్రౌపదికి మ్రొక్కిన.

211

ప్రతిపదార్థం: మనము; ఈ+విధంబునన్; చను, అప్పుడు= వెళ్ళేటప్పుడు; నిన్నున్= నిన్ను; చూచి, ద్రుపద, రాజ, పుత్రి= ద్రుపదరాజుయొక్క కూతురు-ద్రౌపది; అప్రియంబులు= కఠినమైన మాటలు; పలుకునో= అంటుందో ఏమో; ఆ+పరమ, పతివ్రత పలుకు= ఆ మహాపతివ్రత మాట; నిక్కువంబు= నిజం; అగున్= అవుతుంది; కావునన్; నీవు; ఏకతంబు+అ= ఒక్కదానివే; గోపాల, బాలికలతో= గొల్లపిల్లలతో; ముందఱన్= ముందుగా; అరిగి= వెళ్ళి; ఆ+కోమలిన్= ఆ అందగత్తెను - ద్రౌపదిని; కనుము= చూడుము; అని; పనిచిన= ఆజ్ఞాపించగా; సుభద్రయున్= సుభద్రకూడా; నిజ+ఈశ్వరు, పంచిన, మార్గంబునన్= తన భర్త ఆజ్ఞాపించిన విధంగా; ఇంద్రప్రస్థ, పురంబునకున్; పోయి= వెళ్ళి; కుంతీదేవికిన్, ద్రౌపదికిని; మ్రొక్కినన్= నమస్కరింపగా.

తాత్పర్యం: 'మనం ఈ విధంగా కలిసి వెళ్ళితే నిన్ను చూచి ద్రౌపది పరుషవాక్యాలు పలుకుతుందేమో! ఆ పరమపతివ్రత పలుకు నిజమవుతుంది. అందువలన నీవే ప్రత్యేకంగా గోపబాలికలతో కలిసి ముందుగా వెళ్ళి ఆమెను చూడుము' అని ఆజ్ఞాపించగా - సుభద్ర తనభర్త ఆజ్ఞాపించిన విధంగానే ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి కుంతీదేవికి, ద్రౌపదికి మ్రొక్కగా.

విశేషం: సామాన్యంగా ఏ ఇల్లాలుకూడా తన మగడు మరొక కాంతను వెంటబెట్టుకొని రావటాన్ని సహించదు కదా! అందువలననే అర్జునుడు సుభద్రకు ఆ ఉపాయం చెప్పాడు. దక్షిణనాయకులకు ఈ దూరదృష్టి, ఉపాయజ్ఞత ఉండక తప్పదు. కొన్ని భారతప్రతులలో 'కని యడుగులం బడు మని' అర్జునుడు సుభద్రకు చెప్పినట్లు కూడా ఉన్నది.

తే. 'పంకజాక్షి! నీపతి ప్రతిపక్షవీర । విజయుఁ డయ్యెడు; నీవును వీరపుత్త్ర
జనని వగు' మని దీవించె సంతసంబు । తోడ వసుదేవపుత్త్రి నాద్రుపదపుత్త్రి. **212**

ప్రతిపదార్థం: పంకజ+అక్షి= పద్మాలవంటి కన్నులు కలదానా!; నీ, పతి= నీయొక్క భర్త; ప్రతిపక్ష, వీర, విజయుఁడు= శత్రుపక్షవీరులను జయించేవాడు; అయ్యెడున్= అగుగాక; నీవును= నీవుకూడా; వీర, పుత్త్ర, జననివి= వీరుడైన పుత్రునికి తల్లివి - అనగా వీరమాతవు కమ్ము; అని; ఆ, ద్రుపద, పుత్త్రి= ఆ ద్రుపదరాజు కూతురు - ద్రౌపది; వసుదేవుని, పుత్త్రిన్= వసుదేవుని కూతురైన సుభద్రను; సంతసంబుతోడన్, దీవించెన్= సంతోషంతో దీవించింది.

తాత్పర్యం: పద్మాలవంటి అందమైన కన్నులు కలదానా! నీ భర్త శత్రుపక్ష వీర విజయుడు అగుగాక! నీవు కూడా వీరమాతవు అగుదువు గాక! అని ఆ ద్రౌపది సంతోషంతో సుభద్రను దీవించింది.

విశేషం: విజయుడు అనే పదం ఈ సందర్భంలో విశేషార్థాన్ని సాధించింది. నీ భర్త శత్రుపక్షవీరులను జయించే వాడగు గాక - అనే అర్థంలో ద్రౌపది ఆ పదాన్ని ప్రయోగించినా, అర్జునునికి విజయుడు అనే పేరు ఉండటంవలన - నీ భర్త శత్రుపక్ష వీరులను జయించే అర్జునుడగుగాక అనే అర్థంకూడా ఇక్కడ విశేషించి వ్యక్తమవుతున్నది. 'అప్పరమపతివ్రత పలుకు నిక్కువం బగు' అని అర్జునుడు అంతకుముందే సుభద్రతో అన్నట్లు - ద్రౌపది తెలిసి పలికినా, తెలియక పలికినా సుభద్రకు విజయుడే భర్త అయ్యాడు. అంతేకాక 'వీరపుత్ర జనని వగుము' అని దీవించింది. మున్ముందు ఆమె అభిమన్యునివంటి వీరాగ్రేసరుణ్ణి కని వీరమాత ఔతుంది. ఇది భావికథార్థ వ్యంజకమైన పతాకస్థానం.

వ. ఇట్లు ద్రోవదిచేత దీవనలు సేకొని కుంతీదేవియొద్ద సుభద్ర యున్నంత; నట యర్జునుండును నసంఖ్యాకదాశార్హసైన్య సమేతుం డై యనేకబ్రాహ్మణాశీర్వాదంబు లెసంగ నింద్రప్రస్థపురంబుం బ్రవేశంబుసేసి ధౌమ్యునకు ధర్మరాజునకు భీమునకుఁ గుంతీదేవికి మ్రొక్కి; తనకు మ్రొక్కిన కవలం గౌఁగిలించుకొని పరమానందంబున నుండు నంత. 213

ప్రతిపదార్థం: ఇట్లు; ద్రోవదిచేత= ద్రౌపదిచేత; దీవెనలు= ఆశీర్వాదాలు; చేకొని= గైకొని; కుంతీదేవి, ఒద్దన్= కుంతీదేవి దగ్గర; సుభద్ర; ఉన్నంతన్= ఉండగా; అచట= అచ్చట; అర్జునుండును= అర్జునుడుకూడ; అసంఖ్యాక, దాశార్హ, సైన్య, సమేతుండు+ఐ= లెక్కింప సాధ్యంకాని దాశార్హమైన సైన్యంతో కూడుకొన్నవాడై; అనేక, బ్రాహ్మణ+ఆశీర్వాదంబులు= పలువురు విప్రుల దీవెనలు; ఎసంగన్= అతిశయిల్లగా; ఇంద్రప్రస్థ, పురంబున్= ఇంద్రప్రస్థపురాన్ని; ప్రవేశంబు, చేసి,= ప్రవేశించి; ధౌమ్యునకున్= ధౌమ్యునికి; ధర్మరాజునకున్= ధర్మరాజునకు; భీమునకున్= భీమునికి; కుంతీదేవికిన్; మ్రొక్కి; తనకున్; మ్రొక్కిన= నమస్కరించినట్టి; కవలన్= నకులసహదేవులను; కౌఁగిలించుకొని; పరమ+ఆనందంబుననన్= మిక్కిలి సంతోషంతో; ఉండు+అంతన్= ఉండగా;

తాత్పర్యం: ఈ విధంగా సుభద్ర ద్రౌపదిచేత దీవెనలు పొంది కుంతీదేవిదగ్గర ఉండగా, అర్జునుడు అపరిమితమైన దాశార్హసైన్యంతో; పెక్కుమందిబ్రాహ్మణులఆశీర్వచనాలతో ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించి తమ పురోహితుడైన ధౌమ్యునికి, అన్నలైన ధర్మజభీములకు, తల్లి కుంతీదేవికి మ్రొక్కి, తనకు మ్రొక్కిన తమ్ములు నకులసహదేవులను కౌగిలించుకొని పరమానందంతో ఉండగా.

క. చెలియలు మఱఁదియుఁ జని యి। మ్ముల నింద్రప్రస్థనగరమున నభిమతబం
ధులయొద్ద నున్నవా రని। జలశయనుఁడు విని కరంబు సంతుష్టుం డై. 214

ప్రతిపదార్థం: చెలియలు= చెల్లెలు; మఱఁదియున్= మరిది; చని= వెళ్ళి; ఇమ్ములన్= సుఖంగా; ఇంద్రప్రస్థ, నగరమునన్; అభిమత, బంధుల, ఒద్దన్= ఇష్టమైన బంధువులదగ్గర; ఉన్నవారు= ఉన్నారు; అని= అని; జల, శయనుఁడు= నీటిమీద పవళించేవాడు- శ్రీమహావిష్ణువు- శ్రీకృష్ణుడు; విని= విని; కరంబు= మిక్కిలి; సంతుష్టుండు+ఐ= సంతోషం పొందినవాడై.

తాత్పర్యం: చెల్లెలు సుభద్ర, మరది అర్జునుడు ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి, సుఖంగా ఇష్టమైన బంధువులతో కలిసి ఉన్నారని విని - శ్రీకృష్ణుడు సంతోషించినవాడై.

శ్రీకృష్ణబలదేవాదులు పాండవులకుఁ గానుకలు తెచ్చియిచ్చుట (సం.1-213-23)

సీ. బలదేవ సాత్యకి ప్రద్యుమ్న వసుదేవు। లాదిగా బెరసిన యాదవాగ్ర
గణ్యులుఁ దాను నగణ్యమహావస్తు। వాహనంబులు గొని వాసుదేవుఁ
డనుజకు నరణ మీ నర్థితోఁ జనుదెంచె;। హరిరాక యెఱిఁగి ధర్మాత్మజుండు
గరము గారవమునఁ గవలను గృష్ణున। కెదురు పుత్తెంచిన నింద్రలీల

ఆ. నిందువంశవిభుఁ డుపేంద్రుఁ డింద్రప్రస్థ। పురము సొచ్చె నతివిభూతి మెఱసి
యనుజవరులతోడ నంతఁ బ్రత్యుద్గతుం। డై యుధిష్ఠిరుండు హర్ష మెసఁగ. 215

ప్రతిపదార్థం: వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; అనుజకున్= చెల్లెలికి-సుభద్రకు; అరణము= ఆడపడుచులను అత్తవారింటికి పంపినపుడు ఇచ్చే ధనం, ఇచ్చే కానుకలను; ఈన్= ఇవ్వటానికి; అగణ్య, మహా, వస్తు, వాహనంబులు= లెక్కింపసాధ్యం కానన్ని గొప్పవస్తువులు, వాహనాలు; కొని= తీసికొని; బలదేవ, సాత్యకి, ప్రద్యుమ్న, వసుదేవులు+ఆదిగాన్= బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, వసుదేవుడు మొదలుగా; బెరసిన= కూడిన; యాదవ+అగ్రగణ్యులు= యాదవశ్రేష్ఠులు; తానున్; అర్థితోన్= వేడ్కతో; చనుదెంచెన్= వచ్చాడు; ఇందువంశ, విభుఁడు= చంద్రవంశపురాజు; ధర్మ+ఆత్మజుండు= ధర్మునియొక్క కుమారుడు- ధర్మరాజు; హరి, రాక= శ్రీకృష్ణునిరాక; ఎఱిఁగి= తెలుసుకొని; కరము= మిక్కిలి; గారవమునన్= ప్రీతితో; ఇంద్రలీలన్= దేవేంద్రునివలె; కవలను= నకుల సహదేవులను; కృష్ణునకున్; ఎదురు, పుత్తెంచినన్= ఎదురు పంపగా; ఉపేంద్రుఁడు= శ్రీకృష్ణుడు; ఇంద్రప్రస్థ, పురము= ఇంద్రప్రస్థపురాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు; అంతన్= అపుడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; అతి, విభూతిన్= మిక్కిలి ఐశ్వర్యంతో; మెఱసి= ప్రకాశించి; అనుజ, వరులతోడన్= శ్రేష్ఠులైన తమ్ములతో కూడా; ప్రతి+ఉద్గతుండు+ఐ= ఎదురేగినవాడై; హర్షము= సంతోషం; ఎసఁగన్= అతిశయిల్లగా.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు చెల్లెలికి అరణంగా ఇవ్వటానికి లెక్కింప సాధ్యంకానన్ని గొప్ప వస్తువులను, వాహనాలను తీసికొని - బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, వసుదేవుడు మొదలైన యాదవకులశ్రేష్ఠులతో కలిసి ఎంతో సంతోషంతో వచ్చాడు. చంద్రవంశప్రభువైన ధర్మరాజు శ్రీకృష్ణునిరాక తెలిసికొని మిక్కిలిగౌరవంతో, దేవేంద్ర విలాసంతో, నకులసహదేవులను ఎదురు పంపగా, ఆయన ఇంద్రప్రస్థపురంలో ప్రవేశించాడు. అప్పుడు యుధిష్ఠిరుడు శ్రేష్ఠులైన తమ్ములతో తానుకూడా ఎదురేగి ఆనందాతిశయంతో.

వ. వసుదేవాది యాదవవృద్ధుల కెల్ల మ్రొక్కి బలదేవ వాసుదేవ సాత్యకి సారణ ప్రద్యుమ్నాదుల నుచితప్రియ పూర్వకంబున సత్కృతులం జేసిన. 216

ప్రతిపదార్థం: వసుదేవ+ఆది= వసుదేవుడు మొదలైన, యాదవ, వృద్ధులకున్+ఎల్లన్= యాదవవృద్ధుల కందరికీ; మ్రొక్కి; బలదేవ, వాసుదేవ, సాత్యకి, సారణ, ప్రద్యుమ్న+ఆదులన్= బలరాముడు, శ్రీకృష్ణుడు, సాత్యకి, సారణుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవారిని; ఉచిత, ప్రియ, పూర్వకంబునన్= ప్రేమతో తగినరీతిగా; సత్కృతులన్+చేసినన్= సమ్మానింపగా.

తాత్పర్యం: వసుదేవుడు మొదలైన యాదవవృద్ధులకు నమస్కరింపగా - వాసుదేవుడు, సాత్యకి, సారణుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవాళ్ళను ప్రియమార గౌరవింపగా.

ఉ. ఆనకదుందుభిప్రభృతియాదవులుం గురుముఖ్యులున్ మృదం
గానకదుందుభుల్ సెలఁగ నత్యనురాగముతో నిరంతర
శ్రీనుతు లొప్ప నుత్సవము సేసిరి సప్తదినంబు లిష్టస
మ్మానములన్ మహీసురసమాజసమీహితపూజనంబులన్. 217

ప్రతిపదార్థం: ఆనకదుందుభి= వసుదేవుడు; ప్రభృతి= మొదలైన; యాదవులున్=యాదవులు; కురు, ముఖ్యులున్= కురువంశశ్రేష్ఠులు; మృదంగ+ఆనక, దుందుభుల్, చెలఁగన్= మద్దెలలు, తప్పెటలు; భేరులు, మ్రోగుతుండగా; నిరంతరశ్రీ, నుతులు= ఎడతెగని సంపద, పొగడ్తలు; ఒప్పన్= ఒప్పగా; ఇష్ట, సమ్మానములన్= ఇష్టములైన గౌరవాలచేత (బంధువులకు); మహీసుర, సమాజ, సమీహిత, పూజనంబులన్= బ్రాహ్మణ సమూహంచే కోరబడిన పూజలచేత; అతి+అనురాగముతో= మిక్కిలి ప్రీతితో; సప్త, దినంబులు= ఏడురోజులు; ఉత్సవము, చేసిరి= పండుగచేశారు.

తాత్పర్యం: వసుదేవుడు మొదలైన యాదవులు, కురువంశప్రముఖులు - మద్దెలలు, తప్పెటలు, నగారాలు మ్రోగుతుండగా - అంతులేని సంపద, స్తోత్రాలు శోభిల్లగా - బంధువులను గౌరవించి, బ్రాహ్మణసమూహాన్ని కోరుకొన్న విధంగా పూజించి ఎంతో ప్రీతితో ఏడురోజులు పండుగ చేశారు.

విశేషం: వసుదేవుడు దేవమీఢునికి, మారిషకు పుట్టిన కుమారుడు. ఇతడు పుట్టేటప్పుడు ఆకాశంలో దుందుభులు మ్రోగాయి. అందువలన ఇతనికి ఆనకదుందుభి అనే పేరుకూడా కలిగింది. వసుదేవునికి రోహిణియందు బలరాముడు, గదుడు, సారణుడు మొదలైనవాళ్ళు జన్మించారు. దేవకియందు కీర్తిమంతుడు, సుషేణుడు, భద్రుడు, సంకర్షణుడు, శ్రీకృష్ణుడు మొదలైనవాళ్ళు జన్మించారు. దేవమీఢునికే 'శూరు' డని పేరు.

వ. అంత. 218

తాత్పర్యం: అప్పుడు.

క. నిరుపమపరార్థ్యరుచి సుం । దరరత్నావళుల శోభితము లగువానిన్
వరదుఁడు సహస్రసంఖ్యా । భరణంబులఁ బార్థునకు సుభద్రకు నిచ్చెన్. 219

ప్రతిపదార్థం: వరదుఁడు= వరాలను ఇచ్చేవాడు - శ్రీకృష్ణుడు; నిరుపమ, రుచి, సుందర, రత్న+ఆవళులన్= సాటిలేని ఉత్తమకాంతిచే అందమైన రత్న సమూహాలతో; శోభితములు+అగు, వానిన్= ప్రకాశిస్తున్న వాటిని; సహస్రసంఖ్య+ ఆభరణంబులన్= వేయి సొమ్ములను; పార్థునకున్= అర్జునునికి; సుభద్రకున్, ఇచ్చెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు - సాటిలేని శ్రేష్ఠమైనకాంతితో, అందమైన రత్నసమూహాలతో ప్రకాశించే వెయ్యి ఆభరణాలను అర్జునునికి, సుభద్రకు ఇచ్చాడు.

వ. మఱియును. 220

తాత్పర్యం: అంతేకాక.

సీ. అవిరళక్షరితదానార్ద్రగండస్థల । గజసహస్రంబును, గనకరత్న
రచిత మై తురగసారథిసహితం బైన । రథసహస్రంబును, రమ్యభూష
ణాలంకృతస్త్రీసహస్రంబుఁ, గాంచన । శిబికాసహస్రంబుఁ, జిత్రలలిత
గతి నొప్పు నేనూఱుగాడిదలను, సింధు । బాహ్లికకాంభోజపారసీక

ఆ. జాత మైన తురగశతసహస్రము, లక్ష । గోధనంబు, నధికఘోరవీర
దర్పయుక్తు లైన దశలక్షదాశార్హ । వరుల నరణ మిచ్చె వామనుండు. 221

ప్రతిపదార్థం: అవిరళ, క్షరిత, దాన+ఆర్ద్ర, గండస్థల, గజ, సహస్రంబును= ఎడతెగకుండా కారుతున్న మదజలంతో తడిసిన చెక్కిళ్ళు గల ఏనుగులు వేయింటిని; కనక, రత్న, రచితము+ఐ= బంగారంతో; రత్నాలతో నిర్మింపబడి, తురగ, సారథి,

సహితంబు+ఐన= గుర్రాలతో, సారథితో కూడుకొన్న; రథ, సహస్రంబును= రథాలు వెయ్యింటిని; రమ్య, భూషణ+అలంకృత, స్త్రీ, సహస్రంబున్= అందమైన ఆభరణాలచే అలంకరింపబడిన స్త్రీలను వెయ్యిమందిని; కాంచన, శిబికా, సహస్రంబును= బంగారు పల్లకీలు వెయ్యింటిని; చిత్ర, లలిత, గతిన్= చిత్రమూ, మనోహరమూ అయిన నడకతో; ఒప్పు= శోభిల్లు; ఏనూఱు, గాడిదలను= ఐదువందల గాడిదలను; సింధు, బాహ్లిక, పారసీక, జాతము+ఐన= సింధు బాహ్లిక కాంభోజ పారసీక దేశాలలో పుట్టిన; తురగ, శత, సహస్రము= గుర్రాలు నూరువేలను; లక్ష, గోధనంబున్= లక్ష గోరూప ధనాన్ని; అధిక, ఘోర, వీర, దర్ప, యుక్తులు+ఐన= మిక్కిలి భయంకరమైన వీరగర్వంచే కూడుకొన్న; దశ, లక్ష, దాశార్హ, వరులన్= పదిలక్షలమంది దాశార్హ వీరశ్రేష్ఠులను; వామనుండు= శ్రీకృష్ణుడు, అరణము+ఇచ్చెను= అత్తవారింటికి పంపిన ఆడపడుచులకు ఇచ్చే కానుకగా ఇచ్చాడు.

తాత్పర్యం: ఎడతెగకుండా కారుతున్న మదజలంచేత తడిసిన చెక్కిళ్ళు గల ఏనుగులు వెయ్యింటిని, బంగారుతో రత్నాలతో రూపొంది, గుర్రాలతో సారథితో కూడుకొన్న రథాలు వెయ్యింటిని, అందమైన ఆభరణాలతో అలంకరించిన స్త్రీలను వెయ్యిమందిని, బంగారు పల్లకీలను వెయ్యింటిని, చిత్రమై అందమైన నడకతో ఒప్పే గాడిదలు అయిదు వందలను, సింధు బాహ్లిక కాంభోజ పారశీకదేశాలలో పుట్టిన గుర్రాలను నూరువేలను; ఆవులు ఒక లక్షను, మహాభయంకరమైన వీరగర్వం కల దాశార్హవీరులను పదిలక్షలమందిని - శ్రీకృష్ణుడు అరణంగా ఇచ్చాడు.

క. క్రమమునను గొంతిదేవిని । యమనందను భీముఁ గవల నాద్రౌపది ను
త్తమరత్నాభరణాదుల । నమరఁగ వేర్వేఱ నెయ్యుఁ డయి పూజించెన్. 222

ప్రతిపదార్థం: క్రమమునను= వరుసగా; గొంతిదేవిని= కుంతీదేవిని; యమ, నందనున్=ధర్మరాజును; భీమున్= భీముని; కవలన్= నకుల సహదేవులను; ఆ, ద్రౌపదిన్= ఆ ద్రౌపదిని; ఉత్తమ, రత్న+ఆభరణాదులన్= శ్రేష్ఠములైన రత్నాభరణాలతో; వేరు+వేఱు+అ= వేరువేరుగా; నెయ్యుఁడు+అయి= స్నేహితుడై; అమరఁగన్= ఒప్పుగా; పూజించెన్.

తాత్పర్యం: క్రమంగా కుంతీదేవిని, ధర్మరాజును, భీముడిని, కవలలను, ద్రౌపదిని శ్రేష్ఠాలైన రత్నాభరణాలతో వేరువేరుగా పూజించాడు.

వ. మఱియు బలదేవాదియాదవముఖ్యు లెల్ల సుభద్రార్జునులం బూజించి, పాండవులచేతం బ్రతిపూజితు లై ద్వారవతికిం జని; రుపేంద్రుం డింద్రనందనుతోడి యిష్టవినోదంబుల నింద్రప్రస్థపురంబున నుండె నంత. 223

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; బలదేవ+ఆది; యాదవ, ముఖ్యులు+ఎల్లన్= బలరాముడు మొదలైన యాదవ ప్రముఖులంతా; సుభద్రా+అర్జునులన్= సుభద్రను అర్జునుని; పూజించి= పూజించి; పాండవులచేతన్= పాండుకుమారులచేత; ప్రతిపూజితులు+ఐ= ఎదురు పూజింపబడినవాళ్ళయి; ద్వారవతికిన్= ద్వారవతికి; చనిరి= వెళ్ళారు; ఉపేంద్రుండు= శ్రీకృష్ణుడు; ఇంద్ర, నందనుతోడి= అర్జునునితో; ఇష్ట, వినోదంబులన్= ఇష్టములైన వినోదాలతో; ఇంద్రప్రస్థ, పురంబునన్= ఇంద్రప్రస్థపురంలో; ఉండెన్= ఉన్నాడు; అంతన్= అటుపై.

తాత్పర్యం: బలరాముడు మొదలైన యాదవప్రముఖులంతా సుభద్రార్జునులను పూజించి, పాండవులచేత బదులు పూజలు అందుకొని ద్వారవతికి వెళ్ళారు. శ్రీకృష్ణుడు అర్జునునితో కలిసి ఇంద్రప్రస్థంలో ఇష్ట వినోదాలలో ఉన్నాడు. తరువాత.

అభిమన్యు ప్రభృతుల జననము (సం.1-213-58)

ఉ. ధన్యుల కా సుభద్రకు శతక్రతుపుత్త్రున కుద్భవించె స
మ్మాన్య యశుండు పుత్త్రుఁ డభిమన్యుఁడు వైన్యనిభుం డనన్యసా
మాన్యపరాక్రమప్రబలమాన్యుఁడు పుణ్యచరిత్రుఁ డన్యరా
జన్యభయంకరుండు రణశౌర్యుఁడు పాండవవంశకర్త యై. 224

ప్రతిపదార్థం: ధన్యులకున్= పుణ్యవంతులకు; ఆ, సుభద్రకున్; శతక్రతు, పుత్త్రునకున్= దేవేంద్రుని కుమారునకు - అర్జునునకు; సమ్మాన్య, యశుండు= మిక్కిలి పూజింపదగిన కీర్తి గలవాడు; వైన్య, నిభుండు= పృథుచక్రవర్తితో సమానమైనవాడు; అనన్య, సామాన్య, పరాక్రమ, ప్రబల, మాన్యుఁడు= ఇతరులెవ్వరికీ లేని పరాక్రమాధిక్యంచేత గౌరవించదగినవాడు; పుణ్య, చరిత్రుఁడు= పవిత్రమైన నడవడిక కలవాడు; అన్య, రాజన్య, భయంకరుడు= ఇతరరాజులకు భయాన్ని కలిగించేవాడు; రణ, శౌర్యుఁడు= యుద్ధంలో శూరత్వం కలవాడు; అభిమన్యుడు; పాండవ, వంశ, కర్త+ఐ= పాండవవంశాన్ని నిలిపేవాడై; ఉద్భవించెన్= జన్మించాడు.

తాత్పర్యం: పుణ్యవంతులైన సుభద్రార్జునులకు - మిక్కిలి పూజింపదగిన కీర్తికలవాడు, పృథుచక్రవర్తితో సమానమైనవాడు, ఇతరులెవ్వరికీ లేని పరాక్రమాధిక్యంచేత గౌరవింపదగినవాడు, పవిత్రమైన నడవడిక కలవాడు, ఇతరరాజులకు భయాన్ని కలిగించేవాడు, యుద్ధంలో శౌర్యం కలవాడు అయిన కుమారుడు - పాండవవంశం నిలిపేవాడై జన్మించాడు.

విశేషం: అభిమన్యుడు సుభద్రార్జునులకు పుట్టినకొడుకు. అతడు పుట్టినప్పుడు ఆకాశవాణులు పలుకలేదు. దేవతలు పూలవానలు కురిపించలేదు. అయితే, అతనిజీవితంలో క్రమంగా ఆవిష్కృతమయ్యేవీ, భావికథాసూచకాలూ అయిన సార్థక విశేషణాలు నన్నయ వాడి ప్రసన్నకథాకలితార్థయోజనం సాధించాడు. అతడు పుట్టుకతోనే పృథుచక్రవర్తివంటివాడు - పరాక్రమవంతుడు, పుణ్యచరిత్రుడు, శత్రుభయంకరుడు, వంశకర్త - అనే విశేషణాలు అభిమన్యుని జీవితచరిత్రకు సూచకాలు. సుభద్రార్జునులు నిజంగా ధన్యులు!

చ. సుతజననోత్సవంబున విశుద్ధయశుండు యుధిష్ఠిరుండు సం
భృతహృదయప్రమోదుఁ డయి పెంపున నిచ్చె సువర్ణభూషణ
ప్రతతులు గోధనాయుతము బ్రాహ్మణముఖ్యులకున్ నిరంతర
వ్రతులకు వేదవేదులకు వారిజసంభవునట్టివారికిన్. 225

ప్రతిపదార్థం: సుత, జనన+ఉత్సవంబునన్= కుమారుడు పుట్టినపుడు చేసే పండుగలో; విశుద్ధ, యశుండు= స్వచ్ఛమైన కీర్తి కలవాడు; యుధిష్ఠిరుండు= ధర్మరాజు; సంభృత, హృదయ, ప్రమోదుఁడు+అయి= నిండిన హృదయానందం కలవాడై; వారిజ, సంభవు, అట్టివారికిన్= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునివంటివారికి; వేద, వేదులకున్= వేదాలు తెలిసినవారికి - వేదపండితులకు; నిరంతర వ్రతులకున్= ఎల్లప్పుడు వ్రతాలు చేసేవారికి; బ్రాహ్మణ, ముఖ్యులకున్= బ్రాహ్మణ శ్రేష్ఠులకు; సువర్ణ, భూషణ, ప్రతతులు= బంగారు ఆభరణాల సమూహాలు; గోధన+అయుతము= గో ధనం పదివేలు - అంటే పదివేల గోవులు; పెంపునన్= సమృద్ధిగా; ఇచ్చెన్.

తాత్పర్యం: అభిమన్యుడు పుట్టినపుడు జరిపినపండుగలో స్వచ్ఛమైన కీర్తిగల ధర్మరాజు - మహానందంతో బ్రహ్మదేవునివంటివాళ్ళు, వేదవేత్తలైనవాళ్ళు, ఎల్లప్పుడు వ్రతాలు చేసేవాళ్ళు అయిన బ్రాహ్మణశ్రేష్ఠులకు బంగారు ఆభరణాలు, పదివేలగోవులు సమృద్ధిగా ఇచ్చాడు.

వ. ఇట్లుదయించిన యభిమన్యుండు దల్లిదండ్రులకు సకల జనులకు నానందం బొనరించుచు ధౌమ్య నిర్మిత జాతకర్మ చౌలోపనయనుం డయి పెరుఁగుచు. 226

ప్రతిపదార్థం: ఇట్లు; ఉదయించిన= జన్మించిన; అభిమన్యుండు; తల్లిదండ్రులకున్; సకల, జనులకున్; ఆనందంబు; ఒనరించుచున్= కూర్చుచు; ధౌమ్య, నిర్మిత, జాతకర్మ, చౌల+ఉపనయనుండు= పురోహితుడైన ధౌమ్యునిచే చేయబడిన, జాతకర్మ, ఉపనయనం కలవాడు; అయి; పెరుఁగుచున్= పెరుగుతూ.

తాత్పర్యం: ఇట్లా జన్మించిన అభిమన్యుడు తల్లిదండ్రులకూ, జనులకూ ఆనందం కలిగిస్తూ, ధౌమ్యుడు జాతకర్మను, ఉపనయనాన్నీ చేయగా, పెరుగుతూ.

విశేషం: జాతకర్మ, చౌలం, ఉపనయనం - షోడశకర్మలలోనివి. జాతకర్మ - పుట్టినప్పుడు చేసే క్రియ. చౌలం - జుట్టుపెట్టి తలవెంట్రుకలు తీయటం; ఉపన యనం - వేదవిద్యాభ్యాస యోగ్యతను కలిగించే సంస్కారం.

మత్తకోకిల.

ఆదిఁగోలెను గృష్ణుచే దయ నావృతుం డయి ధౌమ్యుతో
వేద మంగయుతంబుగాఁ జదివెన్, ధనంజయుతో ధను
ర్వేద మిమ్ముగ నభ్యసించెఁ; బ్రవీరవైరిపతాకినీ
భేదమార్గము లెల్ల నేర్చె నభేద్యవిక్రమసంపదన్. 227

ప్రతిపదార్థం: ఆదిన్+కోలెన్= మొదటినుండి; కృష్ణుచే=కృష్ణునిచే; దయన్= దయతో;ఆవృతుండు+అయి= చుట్టబడినవాడై; ధౌమ్యుతోన్= ధౌమ్యునిద్వారా; వేదము; అంగ, యుతంబుగాన్= అంగాలతోకూడి; చదివెన్; ధనంజయుతోన్= అర్జునునిద్వారా; ఇమ్ముగన్= విరివిగా; ధనుర్వేదము= ధనుర్వేదాన్ని; అభ్యసించెన్= నేర్చుకొన్నాడు; అభేద్య, విక్రమ, సంపదన్= ఓడింప సాధ్యంకాని పరాక్రమం అనే సంపదచే; ప్రవీర, వైరి, పతాకినీ, భేద, మార్గములు+ఎల్లన్= మిక్కిలి శూరులైన శత్రువుల సైన్యాలను భేదించే విధాలన్నింటినీ; నేర్చెన్= నేర్చుకొన్నాడు.

తాత్పర్యం: మొదటినుండి అభిమన్యుడు - శ్రీకృష్ణుని దయ నిండుగా కలిగి పాండవపురోహితుడైన ధౌమ్యుని దగ్గర ఆరు అంగాలతో కూడి వేదవిద్యను చదివాడు. తండ్రి అర్జునునిదగ్గర విరివిగా ధనుర్వేదాన్ని అభ్యసించాడు. అభేద్యమైన పరాక్రమసంపదతో ప్రబలశత్రుసైన్యాలను భేదించే విధాలన్నింటినీ నేర్చుకొన్నాడు.

విశేషం: వేదాంగాలు - శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం. మత్తకోకిల వృత్తలక్షణం. చూడు. ఆది.1.153 విశేషం. అభిమన్యుడు 'కృష్ణునిదయనావృతుడై' పెరిగెనని చెప్పటం సార్థకం. సారమతులైనవాళ్ళు అభిమన్యు మరణానంతరం అతని సంతానాన్ని రక్షించటంలో చూపించే దయ ఇక్కడ వస్తుధ్వని.

వ. అంత ద్రుపదరాజనందనయుం గ్రమంబునఁ బాండురాజనందనులవలనఁ బ్రతివింధ్య శ్రుతసోమ శ్రుతకీర్తి శతానీక శ్రుతసేను లనువారిఁ బంచోపపాండవులను సుపుత్త్రులం బడసిన. 228

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; ద్రుపదరాజ, నందనయున్= ద్రుపదరాజుకూతురుకూడా - అంటే ద్రౌపదికూడా; క్రమంబునన్= వరుసగా; పాండురాజ, నందనులవలనన్= పాండురాజుకుమారులవలన - పాండవులవలన; ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులు+అను= అనే పేర్లుగలవాళ్లను; వారిన్, పంచ+ఉపపాండవులు+అను= ఐదుగురు ఉపపాండవులు అనే; సుపుత్త్రులన్= మంచికుమారులను; పడసినన్= పొందగా.

తాత్పర్యం: తరువాత ద్రౌపదికూడా వరుసగా పాండవులవలన అయిదుగురు ఉపపాండవులు అనే సుపుత్రులను పొందింది. ఆ అయిదుగురు - ప్రతివింధ్య, శ్రుతసోమ, శ్రుతకీర్తి, శతానీక, శ్రుతసేనులు.

విశేషం: ఉపపాండవులు - ప్రతివింధ్యుడు ద్రౌపదికి ధర్మరాజువలన జన్మించినవాడు; శ్రుతసోముడు భీమునివలన జన్మించినవాడు; శ్రుతకీర్తి అర్జునునివలన జన్మించినవాడు; శతానీకుడు నకులునివలన జన్మించినవాడు; శ్రుతసేనుడు సహదేవునివలన జన్మించినవాడు.

క. సుతవంతు లయి విశుద్ధ । శ్రుతనయవంతు లయి పాండుసుతు లతులగుణా
న్వితులు జగజ్జన నుత వి । శ్రుతులు మహారాజ్యలీల సుఖ మున్నంతన్. 229

ప్రతిపదార్థం: పాండు, సుతులు= పాండురాజు కుమారులు - పాండవులు; సుతవంతులు+అయి= కొడుకులను కలిగినవాళ్ళయి; విశుద్ధ, శ్రుత, నయవంతులు+అయి= నిర్మలమైన విద్య, నీతి కలవాళ్ళయి; అతుల, గుణ+అన్వితులు= సాటిలేని సద్గుణాలతో కూడినవాళ్ళు; జగత్+జన, నుత, విశ్రుతులు= లోకంలోని జనులచే పొగడబడిన ప్రసిద్ధులు; మహా, రాజ్యలీలన్= మహారాజ్యవిలాసంతో; సుఖము+ఉన్నంతన్= సుఖంగా ఉండగా.

తాత్పర్యం: పాండవులు కొడుకులను పొంది, నిర్మలమైన నీతి కలవాళ్ళయి, సాటిలేనిసద్గుణాలతో, ప్రపంచ ప్రజల ప్రశంసలు అందుకొన్న ప్రసిద్ధులై మహారాజ్యవిలాసంతో సుఖంగా ఉండగా.

చ. ఉరుతర దావపావక శిఖోత్కలిత శ్వసనంబులున్, సితే
తరగతి తీవ్రతిగ్మకరధామ సహస్రములున్, బహుప్రవా
హరహితనిమ్నగాతతులు నై, కడుదీర్ఘము లై, నిదాఘవా
సరములు సర్వజీవుల కసహ్యము లయ్యెను దారుణంబు లై. 230

ప్రతిపదార్థం: నిదాఘ, వాసరములు= వేసవి కాలపు పగళ్ళు; ఉరుతర, దావ, పావక, శిఖా+ఉత్కలిత, శ్వసనంబులున్= మిక్కిలి గొప్పవైన కార్చిచ్చు మంటలతో కూడిన గాడ్పులు కలవీ; సిత+ఇతర, గతి, తీవ్ర, తిగ్మ, కర, ధామ, సహస్రములున్= నిప్పులవలె తీక్ష్ణములైన సూర్యకిరణకాంతులు వేయి కలవీ; బహు, ప్రవాహ, రహిత, నిమ్నగా, తతులును+ఐ= గొప్ప ప్రవాహాలు లేని నదుల సమూహాలు కలవై; కడు, దీర్ఘములు+ఐ= మిక్కిలి పొడవైనవై; దారుణంబులు+ఐ= భయంకరాలై; సర్వ జీవులకున్= అన్నిప్రాణులకు; అసహ్యములు+అయ్యెను= ఓర్చుకొనటానికి సాధ్యం కానివి అయ్యాయి.

తాత్పర్యం: వేసవిలో పగటిపూట మహాతీవ్రాలైన కార్చిచ్చుమంటలతో కూడినగాడ్పులతో నిప్పులవలె తీక్ష్ణములైన సూర్య సహస్రకిరణకాంతులతో, ప్రవాహాలు పెద్దగా లేని నదులసమూహాలతో - మిక్కిలి పొడవైనవి, భయంకరాలైనవి, ప్రాణులన్నింటికీ ఓర్చుకొనటానికి సాధ్యం కానివి అయ్యాయి.

విశేషం: వేసవిలో పగటిపూట ప్రొద్దెక్కువ. అందువలన వేసవిలో పగళ్ళు దీర్ఘాలనటం, వర్ణనం. స్వభావోక్తిసుందరం. ఓజోగుణభరితం.

వ. అట్టి ఘర్మ దివసంబులు సహింప నోప కర్జునుం డొక్కనాఁడు కృష్ణున కి ట్లనియె. 231

ప్రతిపదార్థం: అట్టి; ఘర్మ, దివసంబులు= వేసవికాలపు పగళ్ళు; సహింపన్+ఓపక= ఓర్చుకొనలేక; అర్జునుండు; ఒక్కనాఁడు; శ్రీకృష్ణునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటువంటి వేసవికాలపుఎండలు తట్టుకొనలేక అర్జునుడు శ్రీకృష్ణునితో ఇట్లా అన్నాడు.

చ. జలరుహనాభ! రమ్యగిరిసానువనంబుల వేఁటలాడుచున్
జలుపుద మీనిదాఘదివసంబుల నీవును నేను నున్మిష
న్నలిన రజస్సుగంధి యమునాహ్రద తుంగ తరంగ సంగతా
నిలశిశిరస్థలాంతరవినిర్మితనిర్మలహర్మ్యరేఖలన్. 232

ప్రతిపదార్థం: జలరుహ, నాభ= పద్మనాభా! - ఓ కృష్ణా!; నీవును= నీవూ; నేనున్= నేనూ; రమ్య, గిరి, సాను, వనంబులన్= మనోహరాలైన కొండచరియలలోని అడవులలో; వేటలాడుచున్= వేటాడుతూ; ఉన్మిషత్+నలిన, రజస్+సుగంధి, యమునా, హ్రద, తుంగ, తరంగ, సంగత+అనిల, శిశిర, స్థల+అంతర, వినిర్మిత, నిర్మల, హర్మ్యరేఖలన్= వికసిస్తున్న పద్మాలయొక్క పరాగంచే మంచివాసన కల యమునానది మడుగుయొక్క ఎత్తైన అలలతో కూడిన గాలులచేత చల్లనైన ప్రదేశాల మధ్య గొప్పగా కట్టబడిన పరిశుద్ధమైన మేడలయొక్క వరుసలలో; ఈ, నిదాఘ, దివసంబులన్= ఈ వేసవి రోజులను; చలుపుదము= గడుపుదాము.

తాత్పర్యం: శ్రీకృష్ణా! నీవూ, నేనూ మనోహరాలైన కొండచరియలలోని అడవులలో వేటాడుతూ, వికసిస్తున్న పద్మపరాగంతో మంచివాసన గల యమునానదిమడుగుయొక్క ఎత్తైనఅలలమీది గాలులచే చల్లనైన ప్రదేశాల మధ్య, గొప్పగా నిర్మించబడిన నిర్మలంగా ఉన్న మేడల వరుసలో ఈ వేసవిరోజులు గడుపుదాము.

విశేషం: వేసవినుండి తప్పించి శీతలసుఖపవనాల నిచ్చే పర్వతసానువులలో కట్టబడిన మేడలపై యమునానదినుండి వచ్చే గాలులను అనుభవిద్దామని అర్జునుడు కృష్ణుడితో చెబుతున్నాడు. ఆయా వస్తువులవలన కలిగే సుఖాలను ధ్వనింపచేసే అక్షరరమ్యతను సంతరించటం మొదట గమనింపదగింది. ఆ గాలులనూ, ఆ మేడలనూ మనసులో రూపుకట్టేటట్లు వర్ణించటంలో నన్నయ సమాధి అనే గుణాన్ని సాధించి ఆరోహక్రమంలో పద్యరచనచేసి, భావనాసుందరంగా శ్రోత అనుభవించేటట్లు చేయటం తరువాత తెలియదగింది. అక్షరరమ్యమైన నన్నయశైలికి అద్దంపట్టే పద్యాల్లో ఇదొకటి. (సంపా.)

వ. అని పురందరనందనుండు గోవిందు ననుమతంబు వడసి మిత్రామాత్యభృత్యసమేతులయి యిద్దఱు నరిగి యథారుచి ప్రదేశంబుల విహరించుచు నొక్కనాఁడు ఖాండవవనసమీపంబున నొక్కచందనలతాభవన

చంద్రకాంతవేదికయందు మందశీతలసురభిమారుతం బనుభవించుచు నిష్టకథావినోదంబుల నుండునంత.233

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; పురందర, నందనుండు= దేవేంద్రునికుమారుడు - అర్జునుడు; గోవిందు, అనుమతంబు= శ్రీకృష్ణునియొక్క సమ్మతిని; పడసి= పొంది; మిత్ర+అమాత్య, భృత్య, సమేతులు+అయి= స్నేహితులతో, మంత్రులతో, సేవకులతో కూడుకొన్నవాళ్ళయి; ఇద్దఱున్; అరిగి= వెళ్ళి; యథారుచి, ప్రదేశంబులన్= ఇష్టమైనచోట్ల; విహరించుచున్= విహరిస్తూ; ఒక్కనాఁడు; ఖాండవ, వన, సమీపంబునన్= ఖాండవవనానికి దగ్గరగా; ఒక్క; చందన, లతా, భవన, చంద్రకాంత, వేదిక, అందున్= మంచిగంధపు తీవల ఇంటిలోని చలువరాతి తిన్నెపై; మంద, శీతల, సురభి, మారుతంబు= మెల్లగా వీచేది, చల్లనిది, సువాసన కలది అయిన గాలిని; అనుభవించుచున్= అనుభవిస్తూ; ఇష్టకథా, వినోదంబులన్= ఇష్టములైన కథలతో, వినోదాలతో; ఉండు, అంతన్= ఉండగా.

తాత్పర్యం: అని అర్జునుడు శ్రీకృష్ణుని అనుమతి పొంది స్నేహితులతో, మంత్రులతో, సేవకులతో కూడి వెళ్ళి, ఇద్దరు (కృష్ణార్జునులు) ఇష్టమైన చోట్ల విహరిస్తూ, ఒక రోజు ఖాండవవనానికి దగ్గరగా ఒక మంచిగంధపు తీగెల ఇంటిలోని చలువరాతిఅరుగుమీద కూర్చుండి - మెల్లగా వీచేది, చల్లనిది, సువాసన కలది అయిన గాలిని అనుభవిస్తూ, ఇష్టకథలతో వినోదిస్తూ ఉండగా.

అగ్నిదేవుఁడు ఖాండవసమీపమున విహరించుచున్న కృష్ణార్జునులకడకు వచ్చుట (సం.1-214-29)

మాలిని.

అసితపథుఁడు విప్రుం డై మహాశ్రాంతలీలన్
మసృణకపిలకేశశ్మశ్రు లొప్పంగఁ దేజం
బెసఁగ ముదముతో నయ్యిద్దఱన్ డాయవచ్చెన్
వసునిభు లగు వారిన్ వాసవిన్ వాసుదేవున్. 234

ప్రతిపదార్థం: అసిత, పథుఁడు= తెల్లదికాని (నల్లని) మార్గం కలవాడు - అగ్నిదేవుడు; విప్రుండు+ఐ= బ్రాహ్మణుడై; మహా, శ్రాంత, లీలన్= మిక్కిలి బడలిక పొందిన వాని విధంగా; మసృణ, కపిల, కేశ, శ్మశ్రులు= నునుపైన గోరోజనం వంటి రంగు గల వెంట్రుకలు, మీసాలు; ఒప్పంగన్= అందగింపగా; తేజంబు= కాంతి; ఎసఁగన్= అతిశయిల్లగా; వసు, నిభులు+అగు, వారిన్= వసువులు అనే దేవతల సమానమైనవాళ్ళను, వాసవిన్= వాసవుని (దేవేంద్రుడి) కుమారుడిని - అర్జునుడిని; వాసుదేవున్= శ్రీకృష్ణుడిని; ఆ+ఇద్దఱన్= ఆ ఇరువురినీ; ముదముతో= సంతోషంతో; డాయవచ్చెన్= సమీపించాడు.

తాత్పర్యం: ఎంతో ప్రకాశిస్తూ సమానులైన ఆ కృష్ణార్జునులదగ్గరకు అగ్నిదేవుడు బ్రాహ్మణరూపంలో మిక్కిలి బడలిక పొందినవాడివలె, నునుపైన గోరోజనంరంగు గల వెంట్రుకలతో, మీసాలతో సంతోషంగా వచ్చాడు.

విశేషం: వృత్తలక్షణానికి చూడు. ఆది.2.81 విశేషం.

వ. వారు న వ్విప్రు నతిభక్తిఁ బూజించిన, వారలకు నవ్విప్రుం డి ట్లనియె. 235

ప్రతిపదార్థం: వారున్= ఆ శ్రీకృష్ణార్జునులుకూడా; ఆ+విప్రున్= ఆ బ్రాహ్మణుడిని; అతి, భక్తిన్= మిక్కిలి భక్తితో; పూజించినన్= పూజింపగా; వారలకున్= వాళ్లతో; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ కృష్ణార్జునులు ఆ బ్రాహ్మణుడిని ఎంతో భక్తితో పూజించారు. ఆ బ్రాహ్మణుడు వాళ్ళతో ఈ విధంగా అన్నాడు.

క. ఏ నమితభోజనుండ న। హీనాగ్నిబలుండ నాకు నిష్టాన్నము స
మ్మానముగఁ బెట్టుఁ డోపుదు। రేని సుతృప్తుండ నగుదు నే న ట్లయినన్. 236

ప్రతిపదార్థం: ఏను= నేను; అమిత, భోజనుండన్= పరిమితి లేకుండా భోజనం చేసేవాడిని; అహీన+అగ్ని, బలుండన్= మిక్కిలి జఠరాగ్ని - అంటే ఆకలి కలవాడిని; ఓపుదురు+ఏనిన్= చేతనైనవాళ్ళయితే - అంటే మీ చేతనైతే; నాకున్= నాకు; ఇష్ట+అన్నము= ఇష్టమైన ఆహారం; సమ్మానముగన్= గౌరవంగా; పెట్టుఁడు= పెట్టండి; అట్లు+అయినన్= ఆ విధంగా అయితే; నేను= నేను; సుతృప్తుండన్= బాగుగా తృప్తిపొందినవాడిని; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: నేను అమితంగా భోజనం చేసేవాడిని. మిక్కిలి ఆకలి గలవాడిని. మీకు చేతనైతే నాకు ఇష్టమైన అన్నం గౌరవంగా పెట్టండి. నేను బాగా తృప్తి పొందుతాను.

విశేషం: బ్రాహ్మణుడికి, అగ్నికీ అన్వయించే విశేషణాలను చతురంగా వాడటం ఈ పద్యంలోని రుచిరార్థసూక్తినైపుణ్యం. బ్రాహ్మణుడు అమితభోజనుడు, అగ్నిసర్వభక్షకుడు. బ్రాహ్మణుడు అహీనమైన జఠరాగ్ని కలవాడు. అగ్ని అనంతమైన దహనశక్తి కలవాడు. ఈ రెండుగుణాలూ అగ్నిలోని ఖాండవదహనశక్తికి వ్యంజకాలు. బ్రాహ్మణుడగ్నివంటివాడనీ, అతని కోర్కె తీర్చటం యజ్ఞక్రియవంటిదనీ ధ్వని.

వ. అనిన 'నీ కెద్దిభోజనం బిష్టంబు, దానిన పెట్టెద' మడుగు; మనిన వారికి నవ్విప్రుం డి ట్లనియె. 237

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; నీకున్; ఎద్ది, భోజనంబు= ఏ భోజనం; ఇష్టంబు; దానిన్+అ= దానినే; పెట్టెదము; అడుగుము= అడుగు; అనినన్=అనగా; వారికిన్; ఆ+విప్రుండు= ఆ బ్రాహ్మణుడు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అనగా, 'నీకు ఏ భోజనం ఇష్టమో దానినే పెడతాము అడుగుము' అని అనగా వారితో ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా అన్నాడు.

ఆ. అగ్ని నేను; నాకు నాహార మయ్యింద్రు। ఖాండవంబు; దీనిఁ గాల్పఁ గడఁగి
యెగువఁ బడితి ముంద రింద్రుపంచిన మహా॥ దారుణాంబుధరశతంబుచేత. 238

ప్రతిపదార్థం: ఏను= నేను; అగ్నిన్= అగ్నిదేవుడిని; నాకున్; ఆహారము; ఆ+ఇంద్రు, ఖాండవంబు= ఆ దేవేంద్రునియొక్క ఖాండవవనం; దీనిన్= దీనిని; కాల్పన్= కాల్చుటకై; కడఁగి= పూనుకొని; ముందర= ఇదివరకు; ఇంద్రు, పంచిన= ఇంద్రుడు పంపిన; మహా, దారుణ+అంబుధర, శతంబుచేతన్= మిక్కిలి భయంకరాలైన మేఘాలు నూరింటిచేత; ఎగువన్+పడితిన్= తరుమబడ్డాను.

తాత్పర్యం: నేను అగ్నిదేవుడిని; నాకు ఆహారం ఆ దేవేంద్రుని ఖాండవవనం. ఇదివరకు దీనిని కాల్చటానికి పూనుకొన్నాను. ఇంద్రుడు మహాభయంకరాలైన వందమేఘాలను పంపాడు. అవి నన్ను తరిమివేశాయి.

వ. తక్షకుం డను పన్నగేంద్రుఁ డింద్రున కిష్టసఖుం డయి ఖాండవంబునం దుండుటంజేసి దీని నమృతంబు రక్షించున ట్లతిప్రయత్నంబున నింద్రుండు రక్షించుకొనియుండు; నది నిమిత్తంబుగా సర్వసత్త్వంబులు నిందు సుఖం బుండు; మీరు మహాసత్త్వుల రఖిలాస్త్రవిదుల; రమరేంద్రుండు గావించువిఘాతంబులు మీయస్త్రబలంబున వారింపనోపుదు; రేనును దీని ననాకులంబున నుపయోగించి కృతార్థుండ నగుదు. 239

ప్రతిపదార్థం: తక్షకుండు, అను; పన్నగ+ఇంద్రుండు= నాగరాజు; ఇంద్రునకున్= దేవేంద్రునికి; ఇష్ట, సఖుండు+అయి= ప్రియమిత్రుడై; ఖాండవంబు+అందున్= ఖాండవవనంలో; ఉండుటన్+చేసి= ఉండటంచేత; దీనిన్= దీనిని; అమృతంబున్= అమృతాన్ని; రక్షించు+అట్లు= కాపాడునట్లు; అతి, ప్రయత్నంబునన్= మిక్కిలి ప్రయత్నంతో; ఇంద్రుండు; రక్షించుకొని= కాపాడుతూ; ఉండున్= ఉంటాడు; అది, నిమిత్తంబుగా= అది, కారణంగా; సర్వ, సత్త్వంబులున్= అన్నిప్రాణులు; ఇందున్= ఇక్కడ; సుఖంబు+ఉండున్= సుఖంగా ఉంటాయి; మీరు; మహాసత్త్వులరు= మిక్కిలి బలం కలవారు; అఖిల+అస్త్ర, విదులరు= అన్ని అస్త్రాలు తెలిసినవారు; అమర+ఇంద్రుండు= దేవేంద్రుడు; కావించు= చేయు; విఘాతంబులు= ఆటంకాలు; మీ, అస్త్ర, బలంబునన్= మీయొక్క అస్త్రాలబలంచేత; వారింపన్+ఓపుదురు= తొలగించగలరు; ఏనును= నేనుకూడా; దీనిన్= ఈ ఖాండవవనాన్ని; అనాకులంబునన్= అడ్డులేకుండా; ఉపయోగించి= వినియోగించి అనగా ఆరగించి; కృత+అర్థుండన్= నెరవేరిన కోరిక కలవాడను; అగుదున్= అవుతాను.

తాత్పర్యం: తక్షకుడు అనే నాగరాజు దేవేంద్రునికి ప్రియమిత్రుడై, ఈ ఖాండవవనంలో ఉండటంవలన దీన్ని అమృతాన్ని రక్షిస్తున్నట్లు అతిప్రయత్నంతో ఇంద్రుడు రక్షిస్తూ ఉంటాడు. ఆ కారణంవలన అన్నిప్రాణులు ఈ వనంలో సుఖంగా ఉంటాయి. మీరు మహాబలవంతులు, అన్నిశాస్త్రాలు తెలిసినవాళ్ళు. దేవేంద్రుడు కలిగించే ఆటంకాలను మీ అస్త్రబలంచేత తొలగించగలరు. నేను ఈ ఖాండవాన్ని అడ్డులేకుండా భుజించి (దహించి) కృతార్థుడినవుతాను.

క. అని యగ్నిదేవుఁ డయ్య । ర్జునదామోదరుల శౌర్యశోభితులఁ బ్రియం
బునఁ బ్రార్థించెను బలసూ । దనరక్షితఖాండవప్రదాహోత్సుకుఁ డై. 240

ప్రతిపదార్థం: అని= అని చెప్పి; బలసూదన, రక్షిత, ఖాండవ, ప్రదాహ+ఉత్సుకుఁడు+ఐ= దేవేంద్రునిచేత రక్షింపబడినదైన ఖాండవవనాన్ని లెస్సగా దహించటంలో ఉత్సాహం కలవాడై; శౌర్య, శోభితులన్= పరాక్రమంచేత ప్రకాశించేవాళ్ళను; ఆ+అర్జున, దామోదరులన్= ఆ అర్జునుడిని, శ్రీకృష్ణుడిని; ప్రియంబునన్, ప్రార్థించెన్= ప్రీతితో ప్రార్థించాడు.

తాత్పర్యం: అని దేవేంద్రుడు రక్షించేఖాండవవనాన్ని బాగా దహించాలన్న ఉత్సాహం కల అగ్నిదేవుడు పరాక్రమంతో ప్రకాశించే కృష్ణార్జునులను ప్రీతితో ప్రార్థించాడు.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 241

తాత్పర్యం: అనగా విని జనమేజయుండు వైశంపాయనునితో ఇట్లా అన్నాడు.

ఆ. 'ఏమి కారణమున నింద్రుఖాండవ మగ్ని । దేవుఁ డట్లు గాల్పఁ దివిరె? దీని
విప్రముఖ్య నాకు వినఁగ వేడుకయయ్యెఁ । దెలుఁగఁ జెప్పుమయ్య యిదియు' ననిన. 242

ప్రతిపదార్థం: ఏమి; కారణమునన్; ఇంద్రు, ఖాండవము= ఇంద్రునియొక్క ఖాండవవనాన్ని; అగ్నిదేవుఁడు; అట్లు; కాల్పన్; తివిరెన్= ప్రయత్నించాడు; విప్రముఖ్య= ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! - వైశంపాయనమహర్షీ! నాకున్; దీనిన్; వినఁగన్; వేడుక, అయ్యెన్= కుతూహలం కలిగింది; ఇదియున్= ఈ విషయం కూడా; ఎఱుఁగన్; చెప్పుము+అయ్య= తెలియచెప్పవయ్యా; అనినన్.

తాత్పర్యం: 'ఓ వైశంపాయనమహర్షీ! ఏ కారణంచేత ఇంద్రునిఖాండవవనాన్ని అగ్నిదేవుడు ఆ విధంగా కాల్చ ప్రయత్నించాడో వినాలని నాకు కుతూహలంగా ఉన్నది. తెలిసేటట్లు చెప్పండి' అన్నాడు.

శ్వేతకి యను రాజర్షి వృత్తాంతము (సం.1-215-11 (అను 1-18))

వ. జనమేజయునకు వైశంపాయనుం డి ట్లని చెప్పెఁ; దొల్లి శ్వేతకి యనురాజర్షి ఘృతసంపూర్ణదక్షిణానేకాధ్వరుం డయి శతవార్షికసత్త్రయాగంబు సేయ సమకట్టి ఋత్విజులం బ్రార్థించిన, ఋత్విజులు 'నేము నిరంతర క్లేశంబున కోపము; నీ వనవరతయజనశీలుండవు; నీకు నీశ్వరుండ యాజకత్వంబు సేయనోపుంగాని, యొరు లోప' రని విసివి పలికిన, నాతండును గైలాసంబున కరిగి, కైలాసవాసు నిఖిలలోకవంద్యు నిందుశేఖరు నీశ్వరు నుద్దేశించి యుగ్రతపంబు సేసినఁ బరమేశ్వరుండు ప్రత్యక్షం బయి వాని కి ట్లనియె. 243

ప్రతిపదార్థం: జనమేజయునకున్= జనమేజయునికి; వైశంపాయనుఁడు; ఇట్లు+అని= ఈ విధంగా నిర్దేశించి; చెప్పెన్; తొల్లి= పూర్వం; శ్వేతకి, అను; రాజ+ఋషి; ఘృత, సంపూర్ణ, దక్షిణా+అనేక+అధ్వరుండు+అయి= నేతితో నిండిన, దక్షిణలతో కూడిన అనేక యజ్ఞాలు కలవాడై; శత, వార్షిక సత్త్రయాగంబు= నూరుసంవత్సరాలు సత్త్రయాగం; చేయన్= చేయటానికి; సమకట్టి= పూనుకొని; ఋత్విజులన్= యజ్ఞంచేయించే బ్రాహ్మణులను; ప్రార్థించినన్= వేడగా; ఋత్విజులున్= యజ్ఞంచేయించే విప్రులు ; ఏము= మేము; నిరంతర, క్లేశంబునకున్= ఎడతెగని కష్టానికి; ఓపము= ఓర్చుకోలేము; నీవు; అనవరత, యజన, శీలుండవు= నీవు ఎల్లప్పుడు యజ్ఞం చేసే స్వభావం కలవాడవు; నీకున్, ఈశ్వరుండు+అ= శివుడే; యాజకత్వంబున్= యజ్ఞం చేయంచే పని; చేయన్+ఓపున్+కాని= చేయకలడు కాని; ఒరులు= ఇతరులు; ఓపరు+అని= చేయ లేరని; విసివి= విసుగుచెంది; పలికినన్= మాట్లాడగా; ఆతండును= ఆ శ్వేతకియు; కైలాసంబునకున్; అరిగి= వెళ్ళి; కైలాస, వాసున్= కైలాసంలో నివసించేవాడిని; నిఖిల, లోక, వంద్యున్= అన్నిలోకాలకు పూజ్యుడైనవాడిని; ఇందు, శేఖరున్= చంద్రుని సిగదండగా కలవాడిని; ఈశ్వరున్= శివుడిని; ఉద్దేశించి= గురించి; ఉగ్ర, తపంబు= భయంకరమైన తపస్సు; చేసినన్= చేయగా; పరమ+ఈశ్వరుండు; ప్రత్యక్షంబు+అయి= సాక్షాత్కరించి; వానికిన్= శ్వేతకికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జనమేజయునకు వైశంపాయనుడు ఈ విధంగా చెప్పాడు - పూర్వం శ్వేతకి అనే రాజర్షి సమృద్ధిగా నేతితో, దక్షిణలతో అనేకయజ్ఞాలు చేసి, నూరుసంవత్సరాలు చేసే సత్రయాగాన్ని చేయటానికి పూనుకొన్నాడు. ఆ యాగం చేయించే బ్రాహ్మణులను ప్రార్థించగా, వాళ్ళు - 'మేము ఎడతెగని శ్రమకు ఓర్వలేము. నీవు ఎల్లప్పుడు యజ్ఞం చేసే స్వభావం కలవాడివి. ఈశ్వరుడే నీ యజ్ఞానికి ఋత్విక్కుగా ఉండి దాన్ని చేయించగలడు కాని ఇతరులకు అది సాధ్యం కాదు' - అని విసుగుతో అన్నందువలన శ్వేతకి కైలాసానికి వెళ్ళాడు. అక్కడ కైలాసవాసుడు, సకలలోకపూజ్యుడు, చంద్రశేఖరుడు అయిన శివుడినిగూర్చి తీవ్రమైన తపస్సు చేశాడు. పరమేశ్వరుడు ప్రత్యక్షమై అతనితో ఇట్లా అన్నాడు.

క. 'శ్వేతకి! నీతపమున కేఁ । బ్రీతాత్ముఁడ నయితి; నీకుఁ బ్రియ మెయ్యది వి
ఖ్యాతముగ నిత్తు దానిని; । యాతతమతి వేఁడు' మనిన నన్నరపతియున్. 244

ప్రతిపదార్థం: శ్వేతకి= ఓ శ్వేతకీ!; నీ, తపమునకున్= నీ తపస్సుకు; ఏన్= నేను; ప్రీత+ఆత్ముఁడన్= తృప్తి పొందిన మనస్సు కలవాడను; అయితిన్= అయ్యాను; నీకున్; ప్రియము= ఇష్టమైనది; ఎయ్యది= ఏది; దానిన్+అ= దానినే; ఆతత మతిన్= నిండుమనస్సుతో; విఖ్యాతముగన్= ప్రసిద్ధంగా; ఇత్తున్= ఇస్తాను; వేడుము= కోరుకొమ్ము; అనినన్= అని అనగా; ఆ+నరపతియున్= ఆ రాజు (శ్వేతకి) కూడా.

తాత్పర్యం: 'ఓ శ్వేతకీ! నీ తపస్సుకు నేను తృప్తిపొందాను. నీ కేది ఇష్టమో దానినే నిండు మనస్సుతో గొప్పగా ఇస్తాను. కోరుకొమ్ము' అని అనగా ఆ శ్వేతకి.

వ. 'దేవా! నీప్రసాదంబున శతవార్షికసత్త్రయాగంబు చేసెద; నాకు నీవు ఋత్విజుండవు గావలయు' నని ప్రార్థించినం గరుణించి' యాజకత్వంబు బ్రాహ్మణులకు విధిదృష్టం బగుటంజేసి దాని నొరులకుఁ జేయంగాదు గావున, నింక నీవు బ్రహ్మచర్యంబునఁ బండ్రెండేండ్లు నిరంతరఘృతధారంజేసి హుతాశనుఁ దృప్తుం జేయు' మనిన వాఁడును బరమేశ్వరుపంచిన విధంబున నగ్నితర్పణంబు సేసిన సంతుష్టుండై యీశ్వరుండు వానిపాలికి వచ్చి యప్పుడ దుర్వాసు రావించి. 245

ప్రతిపదార్థం: దేవా!; నీ ప్రసాదంబునన్= నీ అనుగ్రహంచేత; శత, వార్షిక, సత్త్రయాగంబు= నూరు సంవత్సరాల సత్త్రయాగాన్ని; చేసెద= చేస్తాను; నాకున్, నీవు; ఋత్విజుండవు= యజ్ఞంచేసేవాడవు; కావలయును; అని; ప్రార్థించినన్= వేడుకోగా; కరుణించి= దయతలచి; యాజకత్వంబు= యజ్ఞం చేయించే పని; బ్రాహ్మణులకున్; విధి, దృష్టంబు= శాస్త్రం చేత చెప్పబడింది; అగుటన్+చేసి= అట్లు కావటంచేత; దానిన్= దాన్ని; ఒరులకున్= ఇతరులకు; చేయన్+కాదు= చేయకూడదు; కావునన్; ఇంకన్= ఇక; నీవు; బ్రహ్మ, చర్యంబునన్= బ్రహ్మచర్యవ్రతంచేత; పండ్రెండు+ఏండ్లు; నిరంతర, ఘృత, ధారన్+చేసి= ఎడతెగని నేతిధారతో; హుత+అశనున్= అగ్నిదేవుడిని; తృప్తున్= తృప్తిపొందినవాడినిగా; చేయుము; అనినన్= అని అనగా; వాడును= ఆ శ్వేతకికూడా; పరమేశ్వరు, పంచిన, విధంబునన్= శివుడు ఆజ్ఞాపించిన విధంగా అగ్ని, తర్పణంబు= అగ్నితృప్తి; చేసినన్= చేయగా; ఈశ్వరుండు; సంతుష్టుండు+ఐ= బాగా తృప్తి పొందినవాడై; వాని, పాలికిన్= ఆ శ్వేతకి దగ్గరకు; వచ్చి; అప్పుడు+అ= ఆ క్షణమే; దుర్వాసున్= దుర్వాసుని; రావించి= రప్పించి.

తాత్పర్యం: 'దేవా! నీ దయవలన నూరుసంవత్సరాల సత్రయాగం చేస్తాను. నీవు నాకు ఋత్విజుడివి కావాలి' -అని ప్రార్థించగా - పరమేశ్వరుడు, 'యజ్ఞం చేయించేపని శాస్త్రంలో బ్రాహ్మణులకు చెప్పబడింది. ఇతరులు యాజకత్వం వహించకూడదు. అందుచేత నీవు బ్రహ్మచర్యవ్రతం పూని పండ్రెండేళ్ళు ఎడతెగని నేతిధారతో అగ్నిదేవుడిని తృప్తిపొందించుము' అన్నాడు. ఆ శ్వేతకికూడా పరమేశ్వరుడు ఆజ్ఞాపించిన విధంగా అగ్నిదేవునికి తృప్తి కావించగా, ఈశ్వరుడుకూడా తృప్తిపొంది, శ్వేతకి దగ్గరకు వచ్చి, దుర్వాసుణ్ణి రప్పించి.

వ. 'ఈతఁ డనవరతయజన । ప్రీతుం; డీతనికి దురితభీతునకు మనః
ప్రీతిగ నార్త్విజ్యమ్ము మ । హాతేజోఽ_ధికుఁడ! చేయు' మని దయఁ బంచెన్. 246

ప్రతిపదార్థం: ఈతడు; అనవరత, యజన, ప్రీతుండు= ఎడతెగక యజ్ఞాలు చేయటంలో ప్రీతి కలవాడు; దురిత, భీతునకున్= పాపాలకు భయపడేవానికి; ఈతనికిన్= ఈ శ్వేతకికి; మనఃప్రీతిఁగన్= మనస్సుకు సంతోషం కలిగించేటట్లు; మహా, తేజస్+అధికుఁడ!= గొప్పతేజస్సుచేత అధికుడవైనవాడా; ఆర్త్విజ్యమ్ము= యాజకత్వం; చేయుము+అని= కావింపుమని; దయన్= దయతో; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: 'ఈ శ్వేతకి ఎడతెగకుండా యజ్ఞాలు చేయటంలో ప్రీతి కలవాడు. పాపభీతి కలవాడు. ఇతని మనస్సుకు సంతోషం కలిగేటట్లు గొప్పతేజస్సుచే అధికుడవైన ఓ దుర్వాసమహర్షీ! యజ్ఞం చేయించుము' అని దయతో శివుడు ఆజ్ఞాపించాడు.

వ. శ్వేతకియుఁ దనకు దుర్వాసుండు ఋషిగణంబులతో ఋత్విజుండుగా నభిమతం బయిన సత్త్రయాగంబు సేసె; న ట్లాశ్వేతకి చేసిన నిరంతరఘృతధారాకారణంబున నగ్నిదేవుండు దన కగ్నిమాంద్యంబును దేజోహీనతయు దప్పియు నైన; బితామహుపాలికిం జని తనశరీరస్థితి చెప్పినఁ బితామహుండును దాని నపరిమితఘృతోపయోగంబున నయిన మహావ్యాధిఁగా నెఱింగి యగ్నిదేవున కి ట్లనియె. 247

ప్రతిపదార్థం: శ్వేతకియున్= శ్వేతకికూడా; తనకున్; దుర్వాసుండు; ఋషి, గణంబులతోన్= ఋషులసమూహాలతో; ఋత్విజుండుగాన్= యజ్ఞం చేయించేవాడుగా; అభిమతంబు+అయిన= ఇష్టమైన; సత్త్రయాగంబు= సత్రయాగం; చేసెన్; అట్లు; ఆ, శ్వేతకి; చేసిన= కావించిన; నిరంతర, ఘృత, ధారా, కారణంబునన్= ఎడతెరపి లేని నేతిధార కారణంగా; తనకున్, అగ్ని, మాంద్యంబును= జీర్ణశక్తి తగ్గటమూ; తేజస్+హీనతయున్= కాంతి పోవటమూ; దప్పియున్= దప్పికా; ఐనన్= కలుగగా; పితామహు, పాలికిన్= బ్రహ్మదేవుని దగ్గరకు; చని= వెళ్ళి; తన, శరీర, స్థితి= తన దేహ పరిస్థితి; చెప్పినన్= చెప్పగా; పితా మహుండును= బ్రహ్మదేవుడుకూడా; దానిన్= దానిని; అపరిమిత; ఘృత+ఉపయోగంబునన్= మిక్కిలి ఎక్కువగా నేతిని ఉపయోగించటంవలన; అయిన, మహా, వ్యాధిన్+కాన్= పెద్దజబ్బుగా; ఎఱింగి= తెలిసికొని; అగ్నిదేవునకున్= అగ్నిదేవునికి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్వేతకికూడా ఋషుల సమూహాలతో దుర్వాసుడు తనకు ఋత్విజుడు (యజ్ఞం చేయించేవాడు) కాగా, తన కిష్టమైన సత్త్రయాగాన్ని చేశాడు. ఆ విధంగా శ్వేతకి చేసినయాగంలోని ఎడతెరపి నేతిధార కారణంగా అగ్నిదేవునికి జీర్ణశక్తి తగ్గింది, కాంతి సన్నగిల్లింది, దప్పిక ఎక్కువైంది. ఆయన బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళాడు. తన శరీరస్థితి చెప్పుకొన్నాడు. బ్రహ్మదేవుడు అది నేతిని అపరిమితంగా ఉపయోగించటంవలన కలిగిన మహావ్యాధిగా గ్రహించి అగ్నిదేవునితో ఇట్లా అన్నాడు.

క. 'ఈవ్యాధి యొంటఁ దీఱదు; । దివ్యౌషధయుక్త మైన దివిజవనంబున్
హవ్యాశన! భక్షింపు; మ । హావ్యాధి శమంబు దాన నగు నీ' కనినన్. 248

ప్రతిపదార్థం: ఈ, వ్యాధి; ఒంటన్= మరొకదానిచేత; తీఱదు; హవ్య+అశన= దేవతలకు ఈయదగిన అన్నాన్ని ఆహారంగా కలవాడా- అగ్నిహోత్రా!; దివ్య+ఔషధ, యుక్తము+ఐన= దేవలోకసంబంధమైన మందుచెట్లతో కూడిన; దివిజ, వనంబున్= దేవతావనాన్ని; భక్షింపు(ము); దానన్= దానివలన; నీకున్= నీకు; మహా, వ్యాధి, శమంబు= గొప్పజబ్బు తగ్గటం; అగున్= జరుగుతుంది; అనినన్= అని అనగా.

తాత్పర్యం: 'ఈ వ్యాధి మరొక దానిచేత తీరదు. అగ్నిహోత్రా! దివ్యౌషధాలతో కూడిన దేవతావనాన్ని భక్షించు. దానివలన నీ మహావ్యాధి పోతుం' దని అనగా.

క. చని ఖాండవంబుఁ గాల్పఁగ । మొనసి మహాహస్తియూథములఁ బోని ఘనా
ఘనములచే బాధితుఁ డయి । వనజజుకడ కరిగి హవ్యవాహనుఁ డనియెన్. 249

ప్రతిపదార్థం: చని= వెళ్ళి; ఖాండవంబున్= ఖాండవవనాన్ని; కాల్పన్+కన్= దహింపగా; మొనసి= పూని; మహా, హస్తి, యూథములన్+పోని= గొప్ప ఏనుగుల గుంపులనుపోలిన; ఘనా ఘనములచేన్= వర్షించే మేఘాలతో; బాధితుఁడు+అయి= బాధింపబడినవాడై; హవ్యవాహనుఁడు= దేవతలకు ఇవ్వదగిన అన్నాన్ని మోసేవాడు - అగ్నిహోత్రుడు; వనజజు, కడకున్= నీటినుండి పుట్టిన పద్మంనుండి జన్మించిన బ్రహ్మదేవునిదగ్గరకు; అరిగి= వెళ్ళి; అనియెన్.

తాత్పర్యం: అగ్నిహోత్రుడు ఖాండవవనాన్ని దహించటానికి పూనుకొన్నాడు. పెద్దఏనుగుగుంపులవంటి వర్షించే మేఘాలు బాధించగా ఆయన బ్రహ్మదేవునిదగ్గరకు వెళ్ళి ఇట్లా అన్నాడు.

వ. 'ఏను మీయానతిచ్చినవిధంబున ఖాండవం బుపయోగింపం బోయి, తద్రక్షకులు గావించువిఘాతంబులు వారింపనేరక యేడుమాఱులు విఫలప్రయత్నుండ నైతి; నింక నెద్ది యుపాయంబు? నాకు నెవ్విధంబున ఖాండవభక్షణంబు దొరకొను? నని దుఃఖించిన యతనిం జూచి కమలభవుండు కరుణించి, భావికార్యం బప్పుడు దలంచియుఁ; 'గొంతకాలంబునకు నరనారాయణు లను నాదిమునులు నరలోకంబున దేవహితార్థం బర్జునవాసుదేవు లయి జన్మించి యాఖాండవసమీపంబున విహరింతురు; వారు భవత్ప్రార్థితు లై తమ యస్త్రబలంబున నఖిలవిఘ్నంబుల నపనయించి నిరాకులంబున నీకు ఖాండవోపయోగంబు ప్రసాదింతు' రనిన, నగ్నిదేవుండు గరంబు సంతసిల్లి, కమలజువచనం బవలంబంబుగాఁ బెద్దకాలం బుండి, తద్వనమార్గంబున నప్పుడు కృష్ణార్జునులం గని ఖాండవదహనార్థంబు ప్రార్థించిన నగ్నిదేవున కర్జునుం డి ట్లనియె. 250

ప్రతిపదార్థం: ఏను= నేను; మీ, ఆనతి+ఇచ్చిన, విధంబున= మీ యొక్క ఆజ్ఞ ఇచ్చిన విధంగా - అంటే మీరు ఆజ్ఞాపించినట్లుగా; ఖాండవంబు; ఉపయోగింపన్, పోయి; తత్+రక్షకులు= దాన్ని రక్షించేవాళ్ళు; కావించు; విఘాతంబులు= ఆటంకాలు; వారింపన్= నివారించటానికి; నేరక= చేతగాక; ఏడు, మాఱులు, విఫల, ప్రయత్నుండన్= నెరవేరనిప్రయత్నం కలవాడిని; ఐతిన్= అయ్యాను; ఇంకన్, ఎద్ది= ఇక ఏది; ఉపాయంబు; నాకున్; ఏ+విధంబునన్= ఏ విధంగా; ఖాండవ, భక్షణంబు= ఖాండవవనాన్ని తినటం; దొరకున్= లభిస్తుంది; అని, దుఃఖించినన్= అంటూ విలపింపగా; అతనిన్, కని= అతనిని చూచి; కమల భవుండు= పద్మంనుండి పుట్టినవాడు-బ్రహ్మదేవుడు; కరుణించి= దయదలచి; భావి, కార్యంబు= మున్ముందు జరిగేపని; అప్పుడు= ఆ క్షణంబు; తలంచియున్= తలచికూడా; కొంత, కాలంబునకున్= కొంత కాలానికి; నరనారాయణులు; అను; ఆది, మునులు= నరుడు నారాయణుడు అనే మొట్టమొదటి మునులు; నర, లోకంబునన్= మానవలోకంలో; దేవ, హిత+అర్థంబు= దేవతల మేలుకోసం; అర్జున, వాసుదేవులు+ఐ; జన్మించి= పుట్టి; ఆ, ఖాండవ, సమీపంబునన్= ఆ ఖాండవవనం దగ్గర; విహరింతురు= విహరిస్తారు; వారు= ఆ ఇరువురు; భవత్+ప్రార్థితులు+ఐ= నీచే ప్రార్థింపబడినవాళ్ళయి; తమ, అస్త్ర, బలంబునన్= తమ అస్త్రబలంచేత; అఖిల, విఘ్నంబులన్ = అన్ని ఆటంకాలను; అపనయించి= తొలగించి; నిర్+అకులంబునన్= నిరాటంకంగా; నీకున్; ఖాండవ+ఉపయోగంబు= ఖాండవవనాన్ని ఉపయోగించటాన్ని - అంటే ఖాండవవనాన్ని దహించటాన్ని; ప్రసాదింతురు= దయతో కలుగజేస్తారు; అనినన్= అని అనగా; అగ్నిదేవుండు; కరంబు= మిక్కిలి; సంతసిల్లి; కమలజు, వచనంబు= పద్మంనుండి పుట్టిన బ్రహ్మదేవునిమాట; అవలంబంబుగాన్= ఊతగా; పెద్ద, కాలంబు= చాలాకాలం; ఉండి, తత్+వచన, మార్గంబునన్= అతనియొక్క మాటప్రకారం; అప్పుడు; కృష్ణ+అర్జునులన్= కృష్ణుని అర్జునుని; కని= చూచి; ఖాండవ, దహన+అర్థంబు= ఖాండవవనాన్ని కాల్చటంకోసం; ప్రార్థించినన్= ప్రార్థింపగా; అగ్నిదేవునకున్= అగ్నిదేవునితో; అర్జునుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'నేను మీరు ఆజ్ఞాపించిన విధంగా ఖాండవవనాన్ని దహించబోయాను. దాన్ని రక్షించేవాళ్ళు కల్పించిన ఆటంకాలు నివారించలేకపోయాను. ఏడుసార్లు నా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇక నాకు ఉపాయమేది? ఏ

విధంగా ఖాండవవనాన్ని దహిస్తాను? అని దుఃఖించగా అతడిని చూచి బ్రహ్మదేవుడు దయతలచి, మున్ముందు జరుగ వలసిన పనిని తలచి - 'కొంతకాలానికి ఆదిమునులైన నరనారాయణులు మానవలోకంలో దేవతల మేలుకోరి అర్జునుడు-కృష్ణుడుగా జన్మిస్తారు. ఆ ఖాండవవనందగ్గర విహరిస్తారు. వాళ్ళను నీవు ప్రార్థిస్తే తమ అస్త్రాలబలంతో అన్నిఆటంకాలు తొలగించి, నీవు ఖాండవవనాన్ని దహించేటట్లు చేస్తారు' అని అనగా -అగ్నిదేవుడు ఎంతో సంతోషించగా, బ్రహ్మదేవునిమాట ఆధారంగా చాలాకాలం ఉండి, ఆయన మాటప్రకారం అప్పుడు కృష్ణార్జునులను చూచి ఖాండవవనాన్ని కాల్చటంకోసం ప్రార్థించగా, అగ్నిదేవునితో అర్జునుడు ఇట్లా అన్నాడు.

అగ్నిదేవుండు కృష్ణార్జునులకుఁ జక్రకార్ముకాదు లొసంగుట (సం.1-215-12)

సీ. వారణహస్తానుకారంబు లగు వారి । ధారలు గురియు దుర్వారఘోర
తరవారివాహప్రకరములు వారింప । సురనివహంబుతో సురగణేశు
నైన నోర్వ సుశక్త మైన మహాదివ్య । శరసంచయము నా కపరిమితంబు
గల; దట్టిసాయకావలికి నాదగు భుజ । బలశీఘ్రసంధానములకుఁ దగిన.

ఆ. ధనువు సర్వవహనఘనరథాశ్వములుఁ గృ ష్ణునకు నాయుధములు ననఘ! యిపుడు
లేమిఁ జేసి చూవె యీమహాకార్యంబు । గడఁగకున్నవార మెడయుఁ జేసి. 251

ప్రతిపదార్థం: అనఘ= పాపరహితుడా!; వారణ; హస్త+అనుకారంబులు+అగు= ఏనుగుతొండాన్ని పోలినవైన; వారి, ధారలు= నీటిధారలు; కురియు= కురిసే; దుర్+వార; ఘోరతర, వారి, వాహ, ప్రకరములు= నివారింప సాధ్యం కాని మిక్కిలి భయంకరాలైన మేఘాల సమూహాలను; వారింపన్= అడ్డగించటానికి; సుర, నివహంబులతోన్= దేవతల సమూహంతో; సుర, గణ+ఈశున్+ఐనన్= దేవతా సమూహాల రాజునైనా - అంటే దేవేంద్రుడినైనా; ఓర్వన్= ఓడించుటకు; సుశక్తము+ఐన= మంచి సమర్థవంతమైన; మహా, దివ్య, శర, సంచయము= గొప్ప దేవతా సంబంధాలైన అస్త్రాల సమూహం; నాకున్, అపరిమితంబు= లెక్కలేనంత; కలదు= ఉన్నది; అట్టి= అటువంటి; సాయక+ఆవలికిన్= బాణాల సమూహానికి; నాది+అగు= నాదయిన; భుజ, బల, శీఘ్ర, సంధానములకున్= బాహుబలానికి, వేగంగా బాణాలను వింటినారిలో కూర్చటానికి; తగిన= తగినట్టి; ధనువు= విల్లు; సర్వ, వహన, ఘన, రథ+అశ్వములున్= అన్నింటిని మోయగల గొప్పరథం, గుర్రాలూ; కృష్ణునకున్= కృష్ణునికి; ఆయుధములు; ఇపుడు; లేమిన్+చేసి= లేకుండటంచేత; చూవె= సుమా!; ఈ, మహా, కార్యంబు= ఈ మహాకార్యం; ఎడయున్+చేసి= ఆలస్యంచేసి; కడగక+ఉన్న, వారము= పూనుకొనకున్నాము.

తాత్పర్యం: పుణ్యాత్మా! అగ్నిహోత్రా! ఏనుగు తొండమంతటి నీటిధారలను కురిసే దుర్వారాలైన మహా భయంకర మేఘసమూహాల్ని తొలగించటానికి, దేవతాసమూహంతో కూడిన దేవేంద్రుడినైనా ఓడించటానికి - సమర్థాలైన దివ్యాస్త్రసమూహం నా దగ్గర లెక్కలేనంత ఉన్నది. అట్లాంటి అస్త్రసమూహానికి, నా భుజబలానికి, వేగంగా బాణాలను వింటిలో సంధించే నేర్పుకు తగిన ధనుస్సు - అన్నింటిని మోయగల గొప్పరథం- శ్రీకృష్ణునికి ఆయుధాలు, ఇప్పుడు లేవు. అందువలననే సుమా ఆలస్యంచేసి ఈ మహాకార్యానికి పూనుకొనకుండా ఉన్నాం.

వ. అనిన నగ్నిదేవుండును నప్పడ వరుణుం దలంచి వానిం దనకు సన్నిహితుం జేసికొని, 'తొల్లి నీకు సోముం డిచ్చిన బ్రహ్మనిర్మితకార్ముకంబు నక్షయతూణీరయుగళంబును, గంధర్వజహయంబులం బూన్చిన రథంబు నియ్యతిరథుం

డయిన యర్జునున కిమ్ము; మఱి చక్రంబును గదయును వాసుదేవున కి' మ్మని పంచిన. 252

ప్రతిపదార్థం: అనినన్= అని అర్జునుడనగా; అగ్నిదేవుండును; అప్పుడు+అ= అప్పటికప్పుడే; వరుణున్= వరుణుని; తలంచి= స్మరించి; వానిన్= అతనిని; తనకున్= తనకు; సన్నిహితున్= దగ్గరకు వచ్చినవాడిగా; చేసికొని=ఒనరించుకొని; తొల్లి= పూర్వం; నీకున్; సోముండు+ఇచ్చిన= చంద్రుడిచ్చినట్టి; బ్రహ్మ, నిర్మిత, కార్ముకంబున్= బ్రహ్మచే రూపొందించబడిన ధనుస్సును; అక్షయ, తూణీర, యుగళంబును= తరుగులేని బాణాలు గల అమ్ములపొదల జంటను; గంధర్వజ, హయంబులన్= గంధర్వలోకంలో పుట్టిన గుఱ్ఱాలను; పూన్చిన= కట్టిన; రథంబున్= రథాన్ని; ఈ+అతి, రథుండు= పెక్కుమంది విలుకాండ్రతో పోరాడే ఈ మహావీరుడు; అయిన, అర్జునునికిన్; ఇమ్ము; మఱి= ఇక; చక్రంబును= చక్రాన్ని; గదయును= గదను; వాసుదేవునకున్= శ్రీకృష్ణునకు; ఇమ్ము= ఈయవలసింది; అని= అంటూ; పంచినన్= ఆజ్ఞాపించగా.

తాత్పర్యం: అని అర్జునుడు చెప్పగా అగ్నిదేవుడు అప్పటికప్పుడే వరుణుని స్మరించాడు. తన దగ్గరకు రప్పించాడు. 'పూర్వం నీకు చంద్రుడిచ్చిన బ్రహ్మనిర్మితమైన ధనుస్సును, తరుగులేని బాణాలు కల అమ్ముల పొదుల జంటను; గంధర్వలోకంలో పుట్టిన గుఱ్ఱాలను కట్టిన రథాన్ని అతిరథుడైన ఈ అర్జునునికి - చక్రాన్ని, గదను శ్రీకృష్ణుడి కిమ్ము' అని ఆజ్ఞాపించగా.

మ. అమరాహీంద్రవియచ్చరాదుల కజేయం బప్రధృష్యం బభే
ద్యము వజ్రస్థిర మన్యసాధనభిదాదక్షంబు నై సర్వలో
కమనోజ్ఞం బయి దివ్య మై వెలుఁగు నగ్గాండీవ మన్ చాప ర
త్నము నిచ్చెన్ వరుణుండు పార్థునకు నుద్యద్విక్రమోద్భాసికిన్. 253

ప్రతిపదార్థం: వరుణుండు; ఉద్యత్+విక్రమ+ఉత్+భాసికిన్= వృద్ధి పొందుతున్న పరాక్రమంచేత గొప్పగా ప్రకాశించేవానికి; పార్థునకున్= అర్జునునికి; అమర+అహి+ఇంద్ర, వియత్+చర+ఆదులకున్= దేవతలు, నాగరాజులు, గంధర్వులు మొదలైనవాళ్ళకు; అజేయంబు= జయింపసాధ్యంకానిది; అప్రధృష్యంబు= త్రోసిపుచ్చటానికి సాధ్యంకానిది; అభేద్యము= చీల్చటానికి సాధ్యం కానిది; వజ్రస్థిరము= వజ్రంవలె గట్టిది; అన్య, సాధన, భిదా, దక్షంబును+ఐ= ఇతరములైన ఆయుధాలను భేదించటంలో సమర్థమైనదై; సర్వ, లోక, మనోజ్ఞంబు+ఐ= అన్నిలోకాలకు మనోహరమైనదై; దివ్యమై= దేవతాసంబంధమైనదై; వెలుఁగు= ప్రకాశించునట్టి; ఆ+గాండీవము; అన్= అనే; చాప, రత్నమును= శ్రేష్ఠమైన ధనుస్సును; ఇచ్చెన్.

తాత్పర్యం: వరుణుడు, వృద్ధిపొందే పరాక్రమంలో ప్రకాశిస్తున్న అర్జునునికి- దేవతలు, నాగరాజులు, గంధర్వులు మొదలైనవాళ్ళకు జయించ శక్యంకానిదీ, త్రోసిపుచ్చ వీలుకానిదీ, భేదించ సాధ్యంకానిదీ, వజ్రంవలె కఠినమైనదీ, ఇతర ఆయుధాలను నాశనంచెయ్యటంలో సమర్థమైనదీ, అన్ని లోకాలకు మనోహరమైనదీ, దివ్యమైనదీ - అయి వెలుగుతున్న ఆ గాండీవం అనే ఉత్తమధనుస్సును ఇచ్చాడు.

విశేషం: సమాసఘటితం, సంధిబంధురం అయిన నన్నయరచన. ఓజోగుణవిశిష్టమై ఇక్కడ గాండీవంయొక్క ఔన్నత్యాన్నీ దృఢత్వాన్నీ భీకరత్వాన్నీ స్ఫురింపచేసేదిగా ఉన్నది.

వ. మఱియుఁ బ్రతిపక్ష సంక్షయకరంబులయిన యక్షయబాణంబులు గల తూణీరంబులును, వివిధాయుధభరితం బై, సింహలాంగూలకపిధ్వజవిరాజమానంబై, మహాంబుధరధ్వానబంధురంబై, మనోవాయువేగసితవాహవాహ్యమానం

బై, రణితరమణీయమణికింకిణీకలాపాలంకృతం బై, సకలదిగ్విజయాధిష్ఠానంబై యొప్పుచున్న దివ్యరథంబు నర్జునున కిచ్చి, సహస్రకరసహస్రదుస్సహమహఃపటలభాసురం బగుచు దేవదైత్యదానవయక్షరాక్షసపిశాచోరగప్రశమనంబయి వెలుంగుచున్న సుదర్శనం బను చక్రంబును, గౌమోదకి యను గదయును నారాయణున కిచ్చె; నట్లు సంప్రాప్తదివ్య చాపరథాయుధు లయి యున్న నరనారాయణులం జూచి యగ్నిదేవుం డి ట్లనియె. 254

ప్రతిపదార్థం: మఱియున్; ప్రతిపక్ష, సంక్షయ, కరంబులు+అయిన= శత్రువులను నాశనం చేసేటటువంటివైన; అక్షయ, బాణంబులు కల; తూణీరంబులును= అమ్ములపొదులూ; వివిధ+ఆయుధ, భరితంబు+ఐ= నానావిధాలైన ఆయుధాలతో నిండి; సింహ, లాంగూల, కపి, ధ్వజ, విరాజమానంబు+ఐ= సింహపు తోకవంటి (తోకగల) కోతిగుర్తు కల జెండాచే ప్రకాశించేటటువంటిదై; మహా+అంబుధర, ధ్వాన, బంధురంబు+ఐ= గొప్పమేఘంయొక్క ధ్వనిలాంటి ధ్వనితో నిండినదై; మనో, వాయు, వేగ, సిత, వాహ, వాహ్యమానంబు+ఐ= మనస్సుయొక్క, గాలియొక్క వేగంవంటి వేగంకల తెల్లనిగుర్రాలచే లాగబడుతున్నదై; రణిత, రమణీయ, మణి, కింకిణీ, కలాప+అలంకృతంబు+ఐ= ధ్వనిస్తున్న అందాలైన రత్నాల చిరుగంటల సమూహాలచే అలంకరింపబడినదై; సకల, దిక్+విజయ+అధిష్ఠానంబు+ఐ= అన్ని దిక్కులను జయించటానికి స్థానమై; ఒప్పుచున్+ఉన్న= ప్రకాశిస్తున్న; దివ్య, రథంబున్= దేవతా సంబంధమైన రథాన్ని; అర్జుననకున్+ఇచ్చి; సహస్రకర, సహస్ర, దుస్+సహ, మహఃపటల, భాసురంబు= వేయికిరణాలు గల సూర్యులు వేయిమందివంటి ఓర్వరాని గొప్పకాంతులచే ప్రకాశించేది; అగుచున్= అవుతూ; దేవ, దైత్య, దానవ, యక్ష, రాక్షస, పిశాచ+ఉరగ, ప్రశమనంబు+అయి= దేవతలను, దైత్యులను, దానవులను, యక్షులను, రాక్షసులను, పిశాచాలను, నాగులను; అణగింపజేయునట్టిదై; వెలుంగుచున్+ఉన్న= ప్రకాశిస్తూ ఉండే; సుదర్శనంబు; అను= సుదర్శనం అనే; చక్రంబును= చక్రాన్ని; కౌమోదకి; అను, గదయును= కౌమోదకి అను పేరుగల గదనుకూడా; నారాయణునకున్= శ్రీకృష్ణునికి; ఇచ్చెన్= ఇచ్చాడు; అట్లు+ఆవిధంగా; సంప్రాప్త, దివ్య, చాప; రథ+ఆయుధులు+అయి= పొందిన దివ్యధనుస్సును, రథాన్ని, ఆయుధాలను కలవారై; ఉన్న; నర, నారాయణులన్= అర్జునశ్రీకృష్ణులను; చూచి; అగ్నిదేవుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అంతేకాక శత్రువులను నాశనంచేసేటటువంటివి, తరుగని బాణాలు కల అమ్ములపొదులను, వివిధాయుధాలతో నిండి, సింహపుతోకవంటి తోక గల కోతిగుర్తున్న జెండాతో ప్రకాశిస్తూ, గొప్ప మేఘధ్వనివంటి ధ్వని కలిగి, మనోవేగ, వాయువేగాలవంటి వేగం గల తెల్లటిగుర్రాలు లాగుతూండగా, మ్రోగుతున్న అందాల రత్నపు చిరుగంటల సమూహాలతో అలంకరించబడి, అన్నిదిక్కులను జయించటానికి స్థానమై ప్రకాశిస్తున్న దివ్యరథాన్ని అర్జునుని కిచ్చాడు. వేయిసూర్యులవలె ఓర్వరాని గొప్ప కాంతులతో ప్రకాశిస్తూ, దేవ, దైత్య, దానవ, యక్ష, రాక్షస, పిశాచ, నాగులను అణచివేసే సుదర్శనచక్రాన్ని, కౌమోదకి అనే గదను శ్రీకృష్ణునికి ఇచ్చాడు. ఆ విధంగా దివ్య ధనుస్సును, రథాన్ని, ఆయుధాలను పొంది ఉన్న అర్జున శ్రీకృష్ణులను చూచి అగ్నిదేవుడు ఇట్లా అన్నాడు.

విశేషం: దైత్యులు - కశ్యపునికి దితియందు పుట్టినవాళ్ళు. దానవులు - కశ్యపునికి దనువునందు జన్మించినవాళ్ళు.

క. ఘనభుజ! యిది గాండీవం। బనఁబరఁగిన ధనువు దీని నస్త్రావలి పె
ల్చన తాఁకి భగ్న మగు న। త్యనుపమవజ్రాభిహతశిలావలి వోలెన్. 255

ప్రతిపదార్థం: ఘన, భుజ= గొప్పభుజాలు కలవాడా! - ఓ అర్జునా!; ఇది= ఇది; గాండీవంబు+అనన్= గాండీవం అనగా; పరఁగిన= ఒప్పిన; ధనువు= ధనుస్సు; దీనిని= దీన్ని; అస్త్ర+ఆవలి= మంత్రసహిత బాణాల సమూహం; పెల్చనన్= గట్టిగా;

తాఁకి= తాకి, తగిలి; అతి+అనుపమ, వజ్ర+అభిహత, శిలా+ఆవలి పోలెన్=మిక్కిలి సాటిలేని వజ్రాయుధంచేత కొట్టబడిన రాళ్ళ సమూహంవలె; భగ్నము+అగున్= ముక్కలైపోతాయి.

తాత్పర్యం: ఉన్నత భుజాలు కల ఓ అర్జునా! ఇది గాండీవం అనే ధనుస్సు. మంత్రసహిత బాణసమూహాలు సైతం దీన్ని తాకి వజ్రాయుధంచేత కొట్టబడిన రాళ్ళవలె ముక్కలవుతాయి.

విశేషం: అలం: ఉపమ.

క. ఈ రథ మప్రతిహతము, స । మీరజవోపేతహయసమేతము; దీనిన్
భూరిబలుఁ డెక్కి సోముఁడు । ధీరుం డయి తొల్లి యెల్లదిక్కుల నోడిచెన్. 256

ప్రతిపదార్థం: రథము= ఈ రథం; అప్రతిహితము=ఎదురులేనిది; సమీర, జవ+ఉపేత, హయ, సమేతము= వాయువేగంతో కూడుకొన్న గుర్రాలతో కూడినది; తొల్లి= పూర్వం; దీనిన్= దీన్ని; భూరి, బలుఁడు=గొప్ప బలం కలవాడు; సోముఁడు= చంద్రుడు; ఎక్కి; ధీరుండు+అయి= ధైర్యవంతుడై; ఎల్ల, దిక్కులన్= అన్ని దిక్కుల్ని; ఒడిచెన్= ఓడించాడు.

తాత్పర్యం: ఈ రథం ఎదురులేనిది. వాయువేగం కల గుర్రాలతో కూడుకొన్నది, పూర్వం దీన్ని మహాబలుడైన చంద్రుడుఎక్కి అన్నిదిక్కులు జయించాడు.

క. ఈ చక్రము మధుసూదన! । నీచేత విముక్త మగుచు నీరిపులఁ ద్రియా
మాచరులఁ జంపి క్రమ్మఱ । నీచేతికి వచ్చు దేవనిర్మితశక్తిన్. 257

ప్రతిపదార్థం: మధు, సూదన= మధువు అనే రాక్షసుడిని సంహరించినవాడా! - శ్రీకృష్ణా!; ఈ చక్రము; నీచేతన్= నీచే; విముక్తము= విడువబడినది; అగుచున్= అవుతూ; నీ, రిపులన్= నీ శత్రువులను, త్రియామా, చరులన్= రాత్రులలో తిరిగేవాళ్ళను- రాక్షసులను; చంపి= సంహరించి; దేవ, నిర్మిత, శక్తిన్= దేవతలచే కూర్చబడిన శక్తిచేత; క్రమ్మఱన్= మరల; నీచేతికిన్ వచ్చున్= నీచేతికి వచ్చి చేరుతుంది.

తాత్పర్యం: శ్రీకృష్ణా! ఈ చక్రాన్ని నీవు ప్రయోగిస్తే నీ శత్రువులైన రాక్షసులను సంహరించి, దేవతలు కూర్చిన శక్తితో మళ్ళీ నీ చేతికి వచ్చి చేరుతుంది.

కృష్ణార్జును లగ్నిహోత్రునిచే ఖాండవంబు దహింపఁజేయుట (సం-1-216-28)

వ. అని తత్ప్రభావప్రకారంబు చెప్పినఁ గృష్ణార్జునులు సంతసిల్లి, సన్నద్ధు లయి రథం బెక్కి, యగ్నిదేవుం జూచి 'సురాసుర పరివృతుండయి సురపతి వచ్చినను జయింతు' మింక శంకింపక ఖాండవదహనార్థం బుపక్రమింపు మనిన నగ్నిదేవుండు హర్షించి తైజసంబయిన రూపంబు ధరియించి. 258

ప్రతిపదార్థం: అని= ఆ ప్రకారం; తత్+ప్రభావ, ప్రకారంబు= వాటియొక్క ప్రభావవిధం; చెప్పినన్= చెప్పగా; కృష్ణ+అర్జునులు= కృష్ణుడు, అర్జునుడు; సంతసిల్లి= సంతోషించి; సన్నద్ధులు+అయి= పూనుకొని; రథంబు+ఎక్కి= రథమెక్కి; అగ్నిదేవున్+చూచి= అగ్నిదేవుణ్ణి చూచి; సుర+అసుర, పరివృతుండు+అయి= దేవ దానవులచేత చుట్టబడినవాడై; సుర, పతి= దేవేంద్రుడు;

వచ్చినను= వచ్చినప్పటికి; జయింతుము= జయిస్తాము; ఇంకన్= ఇక; శంకింపక= అనుమానించక; ఖాండవదహన+అర్థంబు= ఖాండవవనాన్ని దహించటంకొరకు; ఉపక్రమింపుము= ప్రారంభించుము; అనినన్= అని అనగా; అగ్నిదేవుండు; హర్షించి= సంతోషించి; తైజసంబు+అయిన= కాంతిమంతమైన, రూపంబు= రూపాన్ని; ధరియించి= తాల్చి.

తాత్పర్యం: అని వాటియొక్క ప్రభావాన్ని గూర్చిచెప్పగా - కృష్ణార్జునులు సంతోషించి, పూని రథం ఎక్కి, అగ్నిదేవుడిని చూచి - 'దేవేంద్రుడు దేవదానవులతో కలిసి దండెత్తి వచ్చినా జయిస్తాము. ఇంక సంకోచించవద్దు. ఖాండవవనాన్ని దహించటానికి ప్రారంభించుము' అని అనగా, అగ్నిదేవుడు సంతోషించి కాంతిమంతమైన రూపం ధరించి.

చ. పెడిలి సువర్ణపర్వతము పెక్కుదెఱంగుల వ్రయ్యునట్టు ల
ప్పుడు వివిధప్రకారముల భూరిశిఖావలి ఖాండవంబు న
ల్గడఁ గడుఁబర్వఁగాఁ బెటిఁగి కాల్పఁదొడంగె హుతాశనుండు సే
డ్పడఁగ వనంబులోని మృగపక్షిభుజంగమభూతసంఘముల్. **259**

ప్రతిపదార్థం: సువర్ణ, పర్వతము= బంగారుకొండ (మేరువు); పెడిలి= పెట్లి; పెక్కు, తెఱంగులన్= అనేకవిధాలుగా; వ్రయ్యునట్టులు= ముక్కలయ్యేటట్లు; అప్పుడు; హుతాశనుండు= అగ్నిహోత్రుడు; భూరి, శిఖా+ఆవలి= పెద్దమంటల సమూహం; వివిధ ప్రకారములన్= అనేకవిధాల; ఖాండవంబు, నల్గడన్= ఖాండవవనంలో నాలుగువైపుల; కడున్= మిక్కిలి, పర్వఁగాన్= వ్యాపించగా; పెటిఁగి= విజృంభించి, వనంబులోని= అడవిలోని; మృగ, పక్షి, భుజంగమ, భూత, సంఘముల్= మృగాలయొక్క, పక్షులయొక్క, పాములయొక్క, ప్రాణులయొక్క సమూహాలు; చేడ్పడఁగన్= బాధపడేటట్లు; కాల్పన్= కాల్చటానికి; తొడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: మేరుపర్వతం పెట్లి పెక్కువిధాల ముక్కలయ్యేటట్లు అగ్నిహోత్రుడు తనయొక్క పెద్ద మంటల సమూహం అనేకవిధాల ఖాండవవనంలో వ్యాపించగా విజృంభించాడు. మృగాల పక్షుల పాముల ప్రాణుల సమూహాలు బాధపడేటట్లు కాల్చటానికి పూనుకొన్నాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

వ. అంత. **260**

తాత్పర్యం: అప్పుడు.

సీ. చక్రధరుం డయ్యె జలరుహనాభుండు । గాండీవధరుఁ డయ్యెఁ బాండవుండు
నుండి రవ్వనమున కుభయపార్శ్వంబులఁ । దొల్లింటి యట్టులు పెల్లు రేఁగి
యనలంబు నార్పంగ నార్చుచుఁ బఱతెంచి । వనరక్షకులు పార్థు సునిశితాస్త్ర
ధారల నపగతదర్పు లై యరిగిరి । యమసదనంబున కమితబలులు;

ఆ. శిఖియు నుగ్రదీర్ఘజిహ్వలు సాఁచి యు । ద్ధురసమీరణంబు తోడు సేసి
కొని యుగాంతకాల కుపితానలాకారుఁ డయ్యె ఖాండవమున కద్భుతముగ. **261**

ప్రతిపదార్థం: ఆ+వనమునకున్= ఆ ఖాండవవనానికి; ఉభయ, పార్శ్వంబులన్= రెండువైపుల; చక్ర, ధరుండు+అయ్యు= చక్రాయుధాన్ని ధరించినవాడై; జలరుహనాభుండు= పద్మం నాభిలో కలవాడు - శ్రీకృష్ణుడు; గాండీవ, ధరుఁడు+అయ్యున్= గాండీవాన్ని ధరించినవాడై; పాండవుండు= అర్జునుడు; ఉండిరి; తొల్లింటి; అట్టులు= పూర్వంవలె; పెల్లురేఁగి= విజృంభించి; అమితబలులు= మిక్కిలి బలం కలవాళ్ళు; వన, రక్షకులు= ఆ ఖాండవవనాన్ని రక్షించేవాళ్ళు; అనలంబున్= నిప్పును; ఆర్పంగన్= ఆర్పటానికి; ఆర్చుచున్= అరచుచు; పఱతెంచి= పరుగెత్తుకొని వచ్చి; పార్థ, సునిశిత+అస్త్రధారలన్= అర్జునుని యొక్క మిక్కిలి వాడి అయిన బాణాల వర్షంచే; అపగత, దర్పులు+ఐ= కోల్పోయిన గర్వం కలవాళ్ళయి; యమ, సదనంబునకున్= యముని ఇంటికి; అరిగిరి= వెళ్ళారు - అనగా, మరణించారు; శిఖియున్= అగ్నిదేవుడుకూడా; ఉగ్ర, దీర్ఘ, జిహ్వలు= భయం కరాలు, దీర్ఘాలు అయిన నాలుకలు; చాచి= చాచి; ఉద్ధుర, సమీరణంబు= విజృంభించిన గాలిని; తోడు= సహాయంగా; చేసికొని= గావించుకొని; ఖాండవమునకున్= ఖాండవానికి; అద్భుతముగన్= ఆశ్చర్యకరంగా; యుగాంత, కాల, కుపిత+అనల+ఆకారుఁడు= ప్రళయకాలకోపంలో ఉన్న అగ్నివంటి ఆకారం కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: ఆ ఖాండవవనానికి రెండువైపులా - చక్రాయుధాన్ని ధరించి శ్రీకృష్ణుడూ, గాండీవాన్ని ధరించి అర్జునుడూ నిలబడ్డారు. అంతకుముందువలె అమితబలులైన ఖాండవవనరక్షకులు నిప్పు నార్పటానికి అరుస్తూ పరుగెత్తుకొని వచ్చారు. అర్జునుని వాడిబాణాలవర్షంవల్ల గర్వాన్ని కోల్పోయి మరణించారు. అగ్నిదేవుడు భయంకరాలైన పొడవైన నాలుకలు చాచి, విజృంభించిన గాలిని తోడుచేసికొని, ఆ ఖాండవానికి ప్రళయకాలాగ్నివంటివాడయ్యాడు.

మ. ఘనధూమధ్వజ దహ్యమాన లవలీ కర్పూర తక్కోల చం
దన కాలాగరు సల్లకీతరుల యుద్యద్ధూమధూపానువా
సన నొప్పెన్ సురభీకృతంబు లగుచున్ సంక్రీడమానామృతా
శనవిద్యాధరసద్విమానవితతుల్ సావిత్రవర్త్మంబునన్. **262**

ప్రతిపదార్థం: ఘన, ధూమ, ధ్వజ, దహ్యమాన, లవలీ, కర్పూర, తక్కోల, చందన, కాలాగరు, సల్లకీ, తరుల= గొప్పవాడు పొగను జెండాగా కలవాడు అయిన అగ్నిహోత్రునిచే కాల్చబడుతున్న లవలి తీవలు, తక్కోలాలు, మంచిగంధాలు, నల్లఅగరులు, అందుగులు అనే వృక్షాలయొక్క; ఉద్యత్+ధూమ, ధూప+అను, వాసనన్= మీది కెగుస్తూ ఉన్న పొగ అనే ధూపాన్ని అనుసరించిన వాసనచేత; సావిత్ర, వర్త్మంబునన్= సూర్యునిదైన మార్గంలో - అంటే ఆకాశమంతటా; సంక్రీడమాన+ అమృత+అశన, విద్యాధర, సత్+విమాన, వితతుల్= విహరిస్తున్న దేవతలయొక్క, విద్యాధరులయొక్క ఉత్తమాలైన విమానాల సమూహాలు; సురభీ, కృతంబులు+అగుచున్= మంచివాసన కలవిగా చేయబడినవై; ఒప్పెన్= ప్రకాశించాయి.

తాత్పర్యం: బాగా విజృంభించిన అగ్నిహోత్రుడు కాల్చే లవలితీగలు, కర్పూరాలు, తక్కోలాలు, మంచిగంధాలు, నల్లఅగరులు, అందుగులు అనే వృక్షాలనుండి మీది కెగుస్తున్న పొగ అనే ధూపాన్ని అనుసరించిన వాసనచేత- ఆకాశమందంతటా విహరించే దేవతలయొక్క, విద్యాధరులయొక్క ఉత్తమవిమానాలు మంచివాసనతో ప్రకాశించాయి.

విశేషం: అలంకారం - రూపకం, అతిశయోక్తి. అగ్నిహోత్రుని మహాభయంకరవిజృంభణం పద్యంలో ఓజోగుణవిశిష్టంగా ప్రకాశిస్తున్నది.

చ. జ్వలన శిఖాలియున్ విజయుసద్విశిఖాలియుఁ జుట్టుముట్టినం
దలరి భయాకులంబు లగు తద్వనజీవులయార్తనాద మం

దులియుచు నొక్కపెట్ట దివి నుద్గత మయ్యె నమందమందరా
చలపరివర్తనప్రసభసంక్షుభితార్ణవఘోషఘోర మై. 263

ప్రతిపదార్థం: జ్వలన, శిఖా+ఆలియున్= అగ్నిహోత్రునియొక్క మంటల సమూహం; విజయు, సత్+విశిఖ+ఆలియున్= అర్జునునియొక్క మేలిమి బాణాల సమూహం; చుట్టు, ముట్టిన్; తలరి= కలత నొంది; భయ+ఆకులంబులు+అగు= భయంతో చెదరినవైన; తత్+వన, జీవుల, ఆర్తనాదము= ఆ ఖాండవవనంలోని ప్రాణులయొక్క ఏడుపు; అందు, ఉలియుచున్= మ్రోగుతూ; ఒక్కపెట్ట= ఒక్కసారిగా; అమంద, మందర+ఆచల, పరివర్తన, ప్రసభ, సంక్షుభిత+అర్ణవ; ఘోరము+ఐ= తక్కువ కాని మందరపర్వతంయొక్క తిరుగుడువలన బలవంతంగా కలతనొందింపబడిన సముద్రంయొక్క శబ్దంవలె భయంకరమై; దివిన్= ఆకాశంలో; ఉద్గతము+అయ్యెన్= మీదికి లేచింది.

తాత్పర్యం: అగ్నిహోత్రుని మంటల సమూహం, అర్జునునిమేలిమిబాణాలసమూహం చుట్టుముట్టగా, ఆ ఖాండవవనంలో కలతనొంది భయంతో చెల్లాచెదురైన ప్రాణుల ఏడ్పుధ్వని - ఎంతోపెద్ద మందరపర్వతం తిరగటంవలన కలతనొందిన మహాసముద్రధ్వనివలె భయంకరమై ఒక్కసారిగా ఆకాశంలో మీదికి ఎగిసింది.

విశేషం: అలం: ఉపమ. నన్నయరచనలో అక్షరరమ్యత కిది చక్కని ఉదాహరణ. శిఖాలి. విశిఖాలి చుట్టుముట్టినవైనం లకార ప్రాసలో సూచింపబడింది. చివరి పంక్తిలో పరుష స్థిరాక్షర సంయోజనంతో సంక్షోభం ధ్వనింపచేయబడింది.

క. నెగయుడు నెగసి పిఱుందం । దగిలెడు మిడుఁగుఱులచేత దగ్ధచ్ఛద మై
గగనమునఁ బఱవ నోపక । ఖగనివహము వహ్నియంద కడువడిఁ బడియెన్. 264

ప్రతిపదార్థం: నెగయుడున్= ఎగురగానే; ఎగసి= మీదికి లేచి; పిఱుందన్= వెనుకనే; తగిలెడు; మిడుగుఱులచేతన్= తాకుతున్న నిప్పు రవ్వలచేత; దగ్ధ, ఛదము+ఐ= కాల్పబడిన రెక్కలుకలదై; గగనమునన్= ఆకాశంలో; పఱవన్+ఓపక= పరుగెత్తలేక; ఖగ, నివహము= పక్షులసమూహం; వహ్ని, అందు+అ= నిప్పులలోనే; కడున్, వడిన్= మిక్కిలివేగంగా; పడియెన్= పడ్డాయి.

తాత్పర్యం: అక్కడి పక్షులు తప్పించుకొని వెళ్ళాలని మీదికి ఎగురగానే, వాటిని వెంబడించి తాకే నిప్పురవ్వలచే రెక్కలు కాలి ఆకాశానికి ఎగురలేక అగ్నిలోనే పడ్డాయి.

విశేషం: అలం: స్వభావోక్తి. లఘుబహుళమైన ఈ కందం సత్వరగతినీ, పతనాన్నీ అక్షరరమ్యంగా సూచిస్తున్నది.

క. తనతేజోజాలము ప । ర్విన దగ్ధము లగు ననేకవిధదేహుల దే
హనికాయంబుల బహువిధ । తనువులు గలవాఁడవోలె దహనుం డొప్పెన్. 265

ప్రతిపదార్థం: తన, తేజస్+జాలము= తనయొక్క కాంతుల సమూహం; పర్వినన్= వ్యాపించగా; దగ్ధములు+అగు= కాలిపోతున్న; అనేక, విధ, దేహుల, దేహ, నికాయంబులన్= పెక్కు విధాలైన ప్రాణులయొక్క దేహాల సమూహాలచేత; దహనుండు= అగ్నిహోత్రుడు; బహువిధ, తనువులు, కలవాడు+అ, పోలెన్= అనేక విధాలైన దేహాలు కలవానివలె; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: తన కాంతిసమూహం వ్యాపించగా కాలిపోతున్న అనేకవిధాలైన ప్రాణుల సమూహాలతో అగ్నిదేవుడు అనేకవిధాలైన దేహాలు కలవానివలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ.

చ. అమితకృశానుదగ్ధ మగు నయ్యమరేంద్రువనంబులోని యు
త్తమసలిలాశయావళుల తప్తజలంబులయం దపేతజీ
వము లయి తేలుచుండె వరవారిచరంబులు వారిపక్షులుం;
గమరె నశేషకోకనదకైరవపంక్తులు శైవలంబులున్. 266

ప్రతిపదార్థం: అమిత, కృశాను, దగ్ధము+అగు= అంతులేని అగ్నిచేత కాల్చబడినదగు; ఆ+అమర+ఇంద్రు, వనంబులోని= అ దేవేంద్రునియొక్క ఉద్యానవనంలోని; ఉత్తమ, సలిల+ఆశయ+ఆవళుల= శ్రేష్ఠములైన నీటిమడుగుల సమూహాలయొక్క; తప్త, జలంబుల, అందున్= కాగిననీటిలో; వర, వారి, చరంబులు= శ్రేష్ఠములైన నీటిలో చరించే ప్రాణులు; వారి, పక్షులున్= నీటిపక్షులూ; అపేత, జీవములు+అయి= పోయిన ప్రాణాలు కలవై; తేలుచున్= తేలుతూ; ఉండెన్= ఉన్నవి; అశేష, కోకనద, కైరవపంక్తులు= అన్ని ఎర్రకలువల, తెల్లకలువల సమూహాలు; శైవలంబులున్= నాచుతీగలు; కమరెన్= మాడిపోయాయి.

తాత్పర్యం: అపరిమితంగా విజృంభించిన అగ్నిచేత కాల్చబడిన ఆ ఖాండవవనంలోని శ్రేష్ఠాలైన నీటిమడుగుల కాగిన నీటిలో - జలచరాలు, నీటిపక్షులు చచ్చి తేలాడుతూ ఉన్నాయి. ఎర్రకలువలు, తెల్లకలువలు, నాచుతీగలు మాడిపోయాయి.

విశేషం: మహాప్రమాదకరమైన అగ్నిహోత్రుని విజృంభణాన్ని ఈ పద్యం చక్కగా ప్రకటం కావిస్తూ ఉన్నది. సరోవరాలను వర్ణించే ఈ పద్యంలో అంతస్థాల, నాదాక్షరాల పునరావృత్తి అక్షరరమ్యతను వ్యక్తీకరిస్తున్నది.

క. అలుగుల పడి ఖాండవమునఁ। గల యాశీవిషమహోరగము లెల్ల విషా
గ్నులు గ్రక్కుచు నత్యుగ్రా। నలబహులజ్వాలలందు నాశము వొందెన్. 267

ప్రతిపదార్థం: అలుగులపడి= బాధపడి; ఖాండవమునన్+కల= ఖాండవవనంలో ఉండే; ఆశీ, విష, మహా+ఉరగములు+ఎల్లన్= ముఖంలో విషం కల పెద్దపాములన్నీ; విష+అగ్నులు= విషమనే నిప్పులను; క్రక్కుచున్= క్రక్కుతూ; అతి+ఉగ్ర+అనల, బహుల, జ్వాలల, అందున్= మిక్కిలి భయంకరమైన అగ్నియొక్క పెక్కుమంటలలో; నాశము; పొందెన్= నశించిపోయాయి, నాశాన్ని పొందాయి.

తాత్పర్యం: ఖాండవవనంలో నివసించే పెద్ద పాములన్నీ బాధపడి విషమనే నిప్పులు క్రక్కుతూ మహాభయంకరమైన అగ్నియొక్క అనేకజ్వాలలలో పడి నశించిపోయాయి.

వ. అంత దేవత లెల్ల మహావహ్నిశిఖాహతికి వెఱచి దేవేంద్రుపాలికిం బోయి ఖాండవవనంబున కైనయకాండ ప్రళయంబు సెప్పిన విని యదరిపడి యింద్రుండు తక్షకరక్షణాపేక్ష ననేకధారాధరనివహంబుతో నతిత్వరితగతి ఖాండవంబునకు వచ్చి హుతాశనుమీఁద మహావారిధారలు గురియించిన. 268

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; దేవతలు+ఎల్లన్= దేవతలు అందరూ; మహా, వహ్ని, శిఖా, హతికి= గొప్పనిప్పుమంటలదెబ్బకు; వెఱచి= భయపడి; దేవేంద్రు; పాలికిన్= దేవేంద్రునిదగ్గరకు; పోయి= వెళ్ళి; ఖాండవంబునకున్+ఐన= ఖాండవానికి జరిగిన; అకాండ, ప్రళయంబు= అకాల వినాశం; చెప్పినన్= చెప్పగా; విని= ఆలకించి; అదరిపడి= త్రుళ్లిపడి; ఇంద్రుండు= మహేంద్రుడు; తక్షక, రక్షణ+అపేక్షన్= తక్షకుడిని కాపాడాలన్న కోరికతో;, అనేక, ధారాధర, నివహంబుతోన్= పెక్కు మేఘాల సమూహంతో; అతి, త్వరిత, గతిన్= మిక్కిలివేగంగా; ఖాండవంబునకున్= ఖాండవవనానికి వచ్చి; హుతాశనుమీదన్= అగ్నిహోత్రునిమీద; మహా, వారి, ధారలు= పెద్దనీటిధారలు; కురియించినన్= కురిపించగా.

తాత్పర్యం: అప్పుడు దేవతలంతా ఆ గొప్ప నిప్పుమంటల దెబ్బకు భయపడి, దేవేంద్రునిదగ్గరకు వెళ్ళారు. ఖాండవవనానికి జరిగిన అకాలవినాశాన్నిగూర్చి చెప్పారు. అది విని దేవేంద్రుడు అదిరిపడ్డాడు. తక్షకుణ్ణి కాపాడా లనే కోరికతో అనేకమేఘాలను వెంట పెట్టుకొని, వేగంగా వచ్చి, అగ్నిహోత్రునిమీద పెద్దనీటిధారలు కురిపించాడు.

విశేషం: తక్షకుడు కద్రువపుత్రుడు. పాము. ఉదంకుని కుండలాలు అపహరించిందీ, పరీక్షిత్తును కాటువేసి చంపిందీ ఇతడే. జనమేజయుని సర్పయాగంలో అగ్నిలో పడకుండా ఇతడు దేవేంద్రుడిని శరణువేడి, అతని సింహాసనాన్ని కౌగలించుకొన్నాడు.కడకు ఆస్తీకుని అనుగ్రహంవలన అగ్నిలో పడకుండా బ్రతికాడు.

క. ఆ వారిధార లెల్ల మ । హావహ్ని శిఖాహతంబు లయి శుష్కము లై
లావఱి నడుమన యడఁగుటఁ । బావకు పయి నొక్కచినుకుఁ బడదయ్యె వడిన్. 269

ప్రతిపదార్థం: ఆ, వారి, ధారలు+ఎల్లన్= నీటిధారలన్నీ; మహా, వహ్ని, శిఖా, హతంబులు+అయి= గొప్పఅగ్నియొక్క మంటలచే కొట్టబడినవై; శుష్కములు+ఐ= ఎండిపోయినవై; లావు+అఱి= బలం చెడి; నడుమన్+అ= నడుమనే; అడఁగుటన్= నాశనం కావటంచేత; పావకు, పయిన్= అగ్నిహోత్రునిమీద; ఒక్క, చినుకున్= ఒక్క చినుకుకూడా; వడిన్= వేగంగా; పడదు+అయ్యెన్= పడలేదు.

తాత్పర్యం: ఆ నీటిధారలన్నీ గొప్ప నిప్పుమంటలచేత కొట్టబడి, ఎండి, బలం చెడి, నడుమనే నాశనం కావటంవలన అగ్నిహోత్రునిమీద ఒక్కచినుకైనా వేగంగా పడలేదు.

క. ఉఱుముచు మెఱుముచుఁ బిడుగులు । వఱలఁగ నలుగడలఁ బడ నవారితవృష్టుల్
గుఱుకొని కురియఁగఁ బంచెను । మఱియును నయ్యనలుమీఁద మఘవుం డలుకన్. 270

ప్రతిపదార్థం: మఘవుండు= దేవేంద్రుడు; అలుకన్= కోపంతో; ఉఱుముచున్; మెఱుముచున్; పిడుగులు; వఱలఁగన్= ప్రకాశిస్తూ; నలుగడలన్= నాలుగువైపుల; పడన్= పడేటట్లుగా; మఱియును= ఇంకా; ఆ+అనలుమీదన్= ఆ అగ్నిహోత్రుని మీద; గుఱుకొని= ప్రయత్నించి; అవారిత, వృష్టుల్= అడ్డగింప సాధ్యంకాని వానలు; కురియఁగన్= కురియుటకై; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: ఉరుముతూ, మెరుస్తూ, నాలుగువైపుల పిడుగులు పడేటట్లు - అడ్డగించ సాధ్యంకాని వానలు - మళ్ళీ ఆ అగ్నిహోత్రుని మీద ప్రయత్నించి గొప్పగా కురవండని దేవేంద్రుడు కోపంతో మేఘాలను ఆజ్ఞాపించాడు.

క. పాండుసుతుఁ డంత నానా । కాండసహస్రముల నేసి ఘనముగఁ జేసెన్
ఖాండవగృహము నఖండా । ఖండలధారలకు దూఱఁ గాకుండంగన్. 271

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు, పాండు, సుతుఁడు= పాండురాజు కుమారుడైన అర్జునుడు; అఖండ+ఆఖండల, ధారలకున్= ఎడతెగని దేవేంద్రుని వర్షధారలకు; దూఱన్+కాకుండన్+కన్= దూరుటకు వీలులేకుండా; నానా, కాండసహస్రములన్= అనేక విధాలైన బాణాలు వేలకొద్దిగా; వేసి= వేసి, ప్రయోగించి; ఖాండవ, గృహమున్= ఖాండవవనానికి ఇంటిని; ఘనముగన్= గొప్పగా; చేసెన్= నిర్మించాడు.

తాత్పర్యం: అప్పుడు అర్జునుడు దేవేంద్రుడు కురిపించే వర్షధారలు దూరటానికి వీలులేకుండా అనేక విధాలైన బాణాలు వేలకువేలు ప్రయోగించి ఖాండవవనానికి గొప్పగా ఇల్లు కట్టాడు.

వ. ఇట్లు కావించిన. 272

తాత్పర్యం: ఈ విధంగా చేయగా.

తే. దాని వెల్వడనేరక తద్వనంబు। జీవులెల్లను బావకశిఖలఁ జేసి
దగ్ధ లగుచున్నఁ దక్షకతనయుఁ డశ్వ। సేనుఁ డను భుజంగమ మగ్నిశిఖల కపుడు. 273

ప్రతిపదార్థం: దానిన్= ఆ గృహాన్ని; వెల్వడనేరక= దాటి బయటకు రాలేక; తత్+వనంబు, జీవులు+ఎల్లను= ఆ వనంలోని ప్రాణులన్నీ; పావక, శిఖలన్+చేసి= నిప్పుమంటలవలన; దగ్ధులు+అగుచున్+ఉన్నన్= కాలిపోతుండగా; తక్షక, తనయుఁడు= తక్షకుని యొక్క కుమారుడు; అశ్వసేనుఁడు; అను; భుజంగమము= పాము; అగ్ని, శిఖలకున్= నిప్పుమంటలకు; అపుడు= అప్పుడు.

తాత్పర్యం: అర్జునుడు నిర్మించిన ఆ ఇంటిని దాటి బయటకు రాలేక, ఆ వనంలోని ప్రాణులన్నీ నిప్పు మంటల వలన కాలిపోతుండగా, తక్షకునికుమారుడైన అశ్వసేనుడు అనే పాము ఆ నిప్పుమంటలకు అప్పుడు.

ఆ. వెఱచి తల్లిఁదోఁకఁ గఱపించుకొని దివిఁ। బఱచువానిఁ జూచి పార్థుఁ డలిగి
వానితల్లిశిరముతోన తత్పుచ్ఛంబు। దునిసి యగ్నిశిఖలఁ దొరఁగ నేసె. 274

ప్రతిపదార్థం: వెఱచి= భయపడి; తల్లిన్= తల్లిని; తోకన్= తోకయందు; కఱపించుకొని= కరిపించుకొని; దివిన్= ఆకాశంలో; పఱచు, వానిన్= పరుగెత్తేవాడిని; చూచి= కనుగొని; పార్థుఁడు= అర్జునుడు; అలిగి= కోపించి; వాని, తల్లి= అతని తల్లి; శిరముతోన= తలతోకూడా; తత్+పుచ్ఛంబు= అతనియొక్కతోక; తునిసి= తెగి; అగ్ని, శిఖలన్= నిప్పుమంటలలో; తొరఁగన్= పడేటట్లు; ఏసెన్= కొట్టాడు. (బాణం ప్రయోగించాడు.)

తాత్పర్యం: భయపడి తల్లిని తనతోకయందు కరపించుకొని ఆకాశంలో పరిగెత్తే ఆ అశ్వసేనుడిని అర్జునుడు చూచాడు. కోపపడ్డాడు. తల్లి తలతోకూడా అతనితోక తెగి నిప్పుమంటలలో పడేటట్లు కొట్టాడు.

వ. వెండియు నశ్వసేను నేయసమకట్టిన యప్పార్థునకుఁ దత్‌క్షణంబ మోహిని యను మాయ గావించి యమరేంద్రుఁ డశ్వసేను విడిపించి యందుఁ దక్షకుండు దగ్ధుం డయ్యెను కా వగచి కడు నలిగి. 275

ప్రతిపదార్థం: వెండియున్= మరల; అశ్వసేనున్; ఏయన్= కొట్టటానికి; సమకట్టిన= పూనుకొన్నట్టి; ఆ+పార్థునకున్= ఆ అర్జుననికి; తత్+క్షణంబు+అ= ఆ క్షణమే; మోహిని= మోహిని; అను= అనే; మాయ= మాయను; కావించి= చేసి; అమర+

ఇంద్రుఁడు= దేవేంద్రుడు; అశ్వసేనున్; విడిపించి; అందున్= ఆ ఖాండవవనంలో; తక్షకుండు; దగ్ధుండు+అయ్యెను, కా, వగచి= కాలిపోయాడని తలచి; కడున్= మిక్కిలి; అలిగి= కోపించి.

తాత్పర్యం: మళ్ళీ అశ్వసేనుడిని కొట్టటానికి పూనుకోగా, దేవేంద్రుడు వెంటనే అర్జునునికి మోహిని అనే మాయ కావించి, అశ్వసేనుడిని విడిపించి, ఖాండవవనంలో తక్షకుడు కాలిపోయాడేమో అని భావించి మహాకోపంతో.

ఇంద్రుండు కృష్ణార్జునులతోఁ బోరుట (సం 1-218-13)

ఉ. ఆ నరుమీఁద ఘోరనిశితాశని వైచె నఖండ చండ ఝం
ఝానిలజర్జరీకృతమహాజలధారలతో నిరంతరా
నూన పయోధరప్రకర ముద్ధత మై హరిదంతరంబులన్
భానుపథంబు నొక్కమొగిఁ బర్వి భయంకరలీలఁ గప్పఁగన్. 276

ప్రతిపదార్థం: అఖండ, చండ, ఝం ఝా+అనిల, జర్జరీకృత, మహా, జల, ధారలతో= తక్కువకాని భయంకరమైన గాలివానచే చెదరగొట్టబడిన పెద్ద నీటిధారలతో; నిరంతర+అనూన, పయోధర, ప్రకరము= ఎడతెగనట్టి వెలితిలేని నీటిని ధరించే మేఘాల సమూహం - అంటే ఎడతెగని నిండైన మేఘాల సమూహం; ఉద్ధతము+ఐ= విజృంభించి; హరిత్+ అంతరంబులన్= దిక్కుల మధ్య భాగాలను; భాను, పథంబున్= సూర్యునిమార్గాన్ని - అంటే ఆకాశాన్ని; ఒక్క, మొగిన్= ఒక్కసారిగా; పర్వి= పరుగెత్తి (వ్యాపించి); భయంకరలీలన్= భయం కలిగించే విధంగా; కప్పఁగన్= కప్పివేయగా; ఆ, నరు, మీఁదన్= ఆ అర్జునునిమీద; ఘోర, నిశిత+అశనిన్= భయంకరమైన వజ్రాయుధాన్ని; వైచెన్= వేశాడు.

తాత్పర్యం: తక్కువ కానిది, భయంకరమైనది అయిన గాలివానచేత చెదరగొట్టబడిన పెద్ద నీటిధారలతో - ఎడతెగని పెద్ద మేఘాల సమూహం విజృంభించి - ఒక్కసారి పరుగెత్తి దిక్కుల మధ్య ప్రదేశాలను ఆకాశాన్ని కప్పివేయగా - దేవేంద్రుడు ఆ అర్జునునిమీద భయంకరమైన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు.

ఉ. అ న్నవవారివాహ నివహమ్ములఁ జూచి భయప్రపన్నుఁ డై
యున్నహుతాశనున్ విజయుఁ డోడకు మంచును మారుతాస్త్రమ
త్యున్నతచిత్తుఁ డేసె; నదియున్ విరియించె రయంబుతో సము
త్పన్నసమీరణాహతి నపార పయోద కదంబకంబులన్. 277

ప్రతిపదార్థం: ఆ+నవ, వారివాహ, నివహమ్ములన్= ఆ కొత్తమేఘాల సమూహాలను; చూచి, భయ, ప్రపన్నుఁడు+ఐ= భయంచే శరణువేడినవాడై; ఉన్న= ఉన్నట్టి; హుతాశనున్= అగ్నిహోత్రుడిని; అతి+ఉన్నత, చిత్తుఁడు= మిక్కిలి గొప్పదైన మనస్సు కలవాడు; విజయుఁడు= అర్జునుడు; ఓడకుము= భయపడకుము; అంచును= అంటూ; మారుత+అస్త్రము= వాయువ్యాస్త్రాన్ని; ఏసెన్= ప్రయోగించాడు; అదియున్= ఆ వాయవ్యాస్త్రమూ; సముత్పన్న, సమీరణ+ఆహతిన్= అప్పటికప్పుడు గొప్పగా పుట్టిన గాలిదెబ్బచే; అపార, పయోద, కదంబకంబులన్= అంతులేని మేఘాలగుంపులను; రయంబుతో= వేగంతో; విరియించెన్= చెదరగొట్టింది.

తాత్పర్యం: ఆ క్రొత్త మేఘాల సమూహాలను చూచి, భయపడి శరణువేడిన అగ్నిహోత్రుడిని చూచి, అర్జునుడు పెద్దమనస్సుతో - భయపడవద్దని చెప్పి, వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ వాయవ్యాస్త్రం అప్పటికప్పుడు పుట్టిన గాలిదెబ్బచే అంతులేని ఆ మేఘాలగుంపులను వెంటనే చెదరగొట్టింది.

విశేషం: ఇక్కడ అర్జునుడు విజయుడనటంలో మున్ముందు అతడు సాధించబోయే విజయంకూడా ధ్వనింపచేయబడింది.

వ. అంత. 278

తాత్పర్యం: అప్పుడు.

సీ. బలవైరి కృష్ణుపైఁ బార్థుపై గడునల్గి । పంచినఁ గలయంగఁ బన్ని కడఁగి
సురగరుడోరగాసురసిద్ధగంధర్వు । లార్చుచుఁ దాఁకి యుగ్రాహవంబు
సేసిన నమరులఁ జెచ్చెరఁ బార్థుండు । భంజించెఁ దనదివ్యబాణశక్తిఁ;
జక్రధరుండును జక్రబలంబున । గరుడోరగాసురఖచరవరులఁ

ఆ. దత్క్షణంబ విగతదర్పులఁ జేసె; న । య్యిద్దఱకు సురాసురేశు లెల్ల
భీతు లగుట చూచి పెద్దయు విస్మిత । హృదయుఁ డయ్యె సురగణేశ్వరుండు. 279

ప్రతిపదార్థం: బలవైరి= దేవేంద్రుడు; కృష్ణు, పైన్= కృష్ణుని మీద; పార్థు, పైన్= అర్జునుని మీద; మిక్కిలి, అలిగి= చాలా కోపించి; పంచినన్= ఆజ్ఞాపించగా; సుర, గరుడ+ఉరగ+అసుర, సిద్ధ, గంధర్వులు= సురాసురులు గరుడోరగులు సిద్ధగంధర్వులు; కలయంగన్= కలిసి; పన్ని= యుద్ధం చేయటానికి వ్యూహం తీర్చి; కడఁగి= పూని; ఆర్చుచున్= అరుస్తూ; తాఁకి= ఎదుర్కొని; ఉగ్ర+ఆహవంబు= భయంకరమైన యుద్ధం; చేసినన్= చేయగా; పార్థుండు= అర్జునుడు; తన, దివ్య, బాణ, శక్తిన్= తనయొక్క దివ్యమైన బాణాల శక్తిచేత; అమరులన్= దేవతలను; చెచ్చెరన్+చెరన్= తత్క్షణమే; భంజించెన్= ఓడించాడు; చక్ర, ధరుండును= శ్రీకృష్ణుడుకూడా; చక్ర, బలంబునన్= చక్రాయుధంయొక్క బలంచేత; గరుడ+ఉరగ+అసుర, ఖచర, వరులన్= శ్రేష్ఠులైన గరుడులను, నాగులను, అసురులను, ఆకాశసంచారులను; విగత, దర్పులన్= కోల్పోయిన గర్వం కలవాళ్ళనుగా; చేసెన్; ఆ+ఇద్దఱకున్= ఆ కృష్ణార్జునులకు; సుర+అసుర+ఈశులు+ఎల్లన్= దేవదైత్యానాయకులంతా; భీతులు+అగుట= భయం పొందినవాళ్ళు కావటం; చూచి; సుర, గణ+ఈశ్వరుండు= దేవతా సమూహాల ప్రభువు- దేవేంద్రుడు; పెద్దయున్= మిక్కిలి; విస్మిత హృదయుఁడు= ఆశ్చర్యం పొందిన మనస్సు కలవాడు; అయ్యెన్.

తాత్పర్యం: దేవేంద్రుడు కృష్ణార్జునులపై మిక్కిలి కోపించి ఆజ్ఞాపించగా - సురలు, గరుడులు, నాగులు, అసురులు, సిద్ధులు, గంధర్వులు ఏకమై వ్యూహం తీర్చి, పూనికతో అరుస్తూ ఎదుర్కొని భయంకర యుద్ధం చేశారు. అర్జునుడు తనదివ్యబాణాల శక్తిచేత దేవతలను తత్క్షణమే ఓడించాడు. శ్రీకృష్ణుడుకూడా తన చక్రబలంతో గరుడులకు, నాగులకు, అసురులకు, ఆకాశ సంచారులకు గర్వభంగం కావించాడు. ఆ కృష్ణార్జునులకు దేవదైత్యానాయకులంతా భయపడటం చూచి, దేవేంద్రుడు ఆశ్చర్యపడ్డాడు.

వ. మఱియును వారల బల పరాక్రమంబు లెఱుంగ వేఁడి శక్రుండు శిలావర్షంబుఁ గురియించిన. 280

ప్రతిపదార్థం: మఱియును= అంతేగాక; వారల= కృష్ణార్జునులయొక్క; బల, పరాక్రమంబులు; ఎఱుంగన్+వేఁడి= తెలిసికొనా లనుకొని; శక్రుండు= దేవేంద్రుడు; శిలా, వర్షంబున్= రాళ్ళవానను; కురియించినన్= కురిపించగా.

తాత్పర్యం: అంతేకాక కృష్ణార్జునుల బలపరాక్రమాలను తెలిసికొనగోరి ఇంద్రుడు రాళ్ళవాన కురిపించగా,

క. నిశితశరవర్షమున ను । గ్రశిలావర్షమ్ముఁ జిత్రగతి నస్త్రకలా

కుశలుఁడు నరుఁ డశ్రమమునఁ । బ్రశాంతిఁ బొందించె నమరపతి వెరఁగందన్. 281

ప్రతిపదార్థం: అస్త్ర, కలా, కుశలుఁడు= బాణప్రయోగకళలో నేర్పరి అయినవాడు; నరుఁడు= అర్జునుడు; నిశిత, శర, వర్షమునన్= వాడి అయిన బాణ వర్షంచేత; చిత్ర, గతిన్= ఆశ్చర్యకరమైన విధంగా; ఉగ్ర, శిలా, వర్షమునన్= భయంకరమైన రాళ్ళవాన; అమర, పతి= దేవేంద్రుడు; వెరఁగు+అందన్= ఆశ్చర్యంపొందగా; అశ్రమమునన్= శ్రమలేకుండా - సులువుగా; ప్రశాంతిన్+పొందించెన్= అణగిపోయేటట్లు చేశాడు.

తాత్పర్యం: బాణ ప్రయోగకళలో నిపుణుడైన అర్జునుడు, వాడి అయిన తన బాణాల వర్షంతో ఆశ్చర్యకరంగా, భయంకరమైన ఆ రాళ్ళవానను దేవేంద్రుడుకూడా ఆశ్చర్యపడేటట్లు అవలీలగా అణగించాడు.

క. కొడుకుభుజవిక్రమమునకుఁ । గడుసంతసపడియుఁ దృప్తిగానక చల మే

ర్పడఁగ హుతాశను నార్పం । గడఁగి మహారౌద్రభంగిఁ గౌశికుఁడు వడిన్. 282

ప్రతిపదార్థం: కౌశికుఁడు = దేవేంద్రుడు; కొడుకు= కుమారుడైన అర్జునుని; భుజపరాక్రమానికి= బాహుబలానికి; కడున్= మిక్కిలి; సంతసపడియున్= సంతోషంపొందికూడా; తృప్తి, కానక= తృప్తిలేక; చలము= కోపం; ఏర్పడన్+కన్= బయలుపడేటట్లు; హుతాశనున్-హుత+అశనున్= అగ్నిహోత్రుడిని; ఆర్పన్= అణచటానికి; కడఁగి= పూనుకొని; మహా, రౌద్ర, భంగిన్= మిక్కిలి భయంకరమైన విధంగా; వడిన్= వేగమే.

తాత్పర్యం: దేవేంద్రుడు తన కుమారుడైన అర్జునుని బలపరాక్రమం చూచి, మిక్కిలి సంతోషించి, తృప్తిపొందక కోపంతో అగ్నిహోత్రుడిని ఆర్పివేయటానికి పూనుకొని మహాభయంకరంగా వేగమే.

చ. అరుదుగ దివ్యరత్ననివహంబులఁ జేసి వెలుంగుచున్న మం

దర శిఖరంబు నెత్తికొని తద్దహనార్చు లడంగునట్లుగాఁ

దెరలఁగ వైచినం దపనతేజుఁడు పాండుసుతుండు దానిజ

ర్జరితము సేసె వజ్రమయశాతశిలీముఖచండధారలన్. 283

ప్రతిపదార్థం: అరుదుగన్= ఆశ్చర్యం కలిగించేటట్లు; దివ్య, రత్న, నివహంబులన్+చేసి= శ్రేష్ఠాలైన రత్న సమూహాలతో; వెలుంగుచున్+ఉన్న= వెలుగుతూఉండే; మందర, శిఖరంబున్= మందరపర్వతంయొక్క శిఖరాన్ని; ఎత్తికొని; తత్+దహన+అర్చులు= ఆ అగ్నిహోత్రునిమంటలు; అడంగు, అట్లుగాన్= అణగిపోయేటట్లుగా; తెరలన్+కన్= కలతనొందేటట్లుగా; వైచినన్= వేయగా; తపన, తేజుఁడు= సూర్యునివంటి కాంతి కలవాడు; పాండు, సుతుండు= పాండురాజు కుమారుడు - అర్జునుడు; దానిన్= ఆ మందరపర్వతశిఖరాన్ని; వజ్రమయశాత, శిలీముఖ, చండ, ధారలన్= వజ్రాయుధంవలె వాడి అయిన బాణాల భయంకర వర్షాలచేత; జర్జరితము= శిథిలం; చేసెన్.

తాత్పర్యం: ఆశ్చర్యకరంగా దివ్యరత్న సమూహాలతో వెలుగుతున్న మందరపర్వతశిఖరాన్ని ఎత్తి దేవేంద్రుడు అగ్నిహోత్రునిమంటలు అణగేటట్లు వేయగా, సూర్యునివంటి కాంతిమంతుడైన అర్జునుడు వజ్రాయుధంవలె వాడి అయిన బాణవర్షాలతో దాన్ని ముక్కలు చేశాడు.

క. ధరణీధరుచక్రమునకుఁ । బురుహూతతనూజుబాణముల కనిలో నె
వ్వరు మార్కొ ననోపరు సుర । గరుడోరగ సిద్ధసాధ్యగణములలోనన్. 284

ప్రతిపదార్థం: ధరణీధరు, చక్రమునకున్= భూమిని ధరించినవాడైన శ్రీకృష్ణుని చక్రాయుధానికి; పురుహూత, తనూజ, బాణములకున్= దేవేంద్రుని కుమారుడైన అర్జునునియొక్క బాణాలకు; అనిలోన్= యుద్ధంలో; సుర, గరుడ+ఉరగ, సిద్ధ, సాధ్య, గణములలోనన్= దేవతలయొక్క, గరుడులయొక్క, నాగులయొక్క, సిద్ధులయొక్క, సాధ్యులయొక్క సమూహాలలో; ఎవ్వరున్= ఎవరుకూడా; మార్కొనన్+ఓపరు= ఎదుర్కోలేరు.

తాత్పర్యం: శ్రీకృష్ణునిచక్రాయుధాన్ని, అర్జునునిబాణాలను, యుద్ధంలో దేవ గరుడ నాగ సిద్ధ సాధ్యుల సమూహాలలో ఎవ్వరుకూడా ఎదుర్కొనలేరు.

విశేషం: ధరణీధరుడు - భూమిని ధరించిన - శ్రీమహావిష్ణువు - ఇక్కడ అతని అవతారమైన శ్రీకృష్ణుడు. పురుహూతుడనగా- యజ్ఞాలలో ప్రచురమైన పిలుపుకలవాడు; పురువను రక్కసుడిని చంపినవాడు - దేవేంద్రుడు.

వ. అంత నొక్కయశరీరవాణి పాకశాసనున కి ట్లనియె. 285

ప్రతిపదార్థం: అంతన్= అప్పుడు; ఒక్క; అశరీరవాణి= ఆకాశవాణి; పాకశాసనునకున్= దేవేంద్రునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అప్పుడు ఒక ఆకాశవాణి ఇంద్రునితో ఇట్లా అన్నది.

విశేషం: పాకశాసనుడు - వృత్రాసురుని సోదరుడైన పాకాసురుడిని చంపినవాడు - దేవేంద్రుడు.

క. పరమమును లయిన తొల్లిటి । నరనారాయణులు కృష్ణనామంబుల ను
ర్వర నుదయించిరి; నీ క । య్యిరువుర పేర్మియును వింతయే దివిజేంద్రా! 286

ప్రతిపదార్థం: దివిజ+ఇంద్రా!= దేవేంద్రా; పరమ, మునులు; అయిన= శ్రేష్ఠ మునీశ్వరులైన; నర, నారాయణులు; కృష్ణ, నామంబులన్= కృష్ణులు అనే పేర్లతో; ఉర్వరన్= భూమియందు (పై); ఉదయించిరి= పుట్టారు; నీకున్= నీకు; ఆ+ఇరువుర= ఆ ఇద్దరియొక్క; పేర్మియును= గొప్పతనం; వింతయే= ఆశ్చర్యకరమా?

తాత్పర్యం: దేవేంద్రా! పరమమునులైన నరనారాయణులు కృష్ణులనే పేర భూమిమీద పుట్టారు. ఆ ఇద్దరి గొప్పతనం నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదా?

విశేషం: శ్రీకృష్ణునికే గాక అర్జునునికి కూడా కృష్ణుడు అనే పేరు ఉన్నది. శ్లో॥ అర్జునః ఫల్గుణః పార్థః, కిరీటీ శ్వేతవాహనః । బీభత్సో విజయః, కృష్ణ, స్సవ్యసాచీ, ధనంజయః ॥ అని అర్జునుని పేర్లు.

చ. అలఘులు కృష్ణపార్థులు మహాత్ములు యాదవకౌరవాన్వయం
బులు వెలుఁగించుచున్న నృపపూజ్యులు; వీరల నీకు నోర్వఁగా
నలవియె? వీరు దొల్లియు సురాసుర యుద్ధమునాఁడు దైత్యులన్
వెలయఁగ నోర్చియున్న రణవీరులు గావుట ము న్నెఱుంగవే? 287

ప్రతిపదార్థం: కృష్ణ, పార్థులు= కృష్ణార్జునులు; అలఘులు= తక్కువ కాని వాళ్ళు - అంటే గొప్పవాళ్ళు; మహా+ఆత్ములు = మహనీయులు; యాదవ, కౌరవ+అన్వయంబులు= యాదవ కౌరవవంశాలు; వెలుఁగించుచున్+ఉన్న= వెలిగించే; నృప, పూజ్యులు= పూజించదగిన రాజులు; వీరలన్= వీళ్లను; నీకున్; ఓర్వగాన్= ఓడించడానికి; అలవియె= సాధ్యమా?; వీరు= వీళ్లు, తొల్లియున్= పూర్వంకూడా; సుర+అసుర, యుద్ధము, నాఁడు= దేవ దానవ యుద్ధ సమయంలో; దైత్యులన్= రాక్షసులను; వెలయన్+కన్= గొప్పగా; ఓర్చి, ఉన్న= ఓడించిఉన్న; రణ, వీరులు= యుద్ధవీరులు, కావుట= కావటం; మున్ను= ఇదివరకు; ఎఱుంగవే= తెలిసికొనలేదా!

తాత్పర్యం: కృష్ణార్జునులు గొప్పవాళ్ళు, మహాత్ములు. యాదవ కౌరవ వంశాలను వెలిగించే పూజ్య ప్రభువులు. వీళ్ళను ఓడించడం నీకు సాధ్యమా. పూర్వం దేవదానవయుద్ధంలో రాక్షసులను వీళ్ళు ఓడించడం ఇదివరకు నీకు తెలియదా?

వ. నీయిష్టసఖుం డయిన తక్షకుం డిం దుండక ముందరన కురుక్షేత్రంబున కరిగి ఖాండవప్రళయంబునకుఁ దప్పెఁ; ఖాండవం బగ్నిచేత దగ్ధం బగు నని తొల్లి బ్రహ్మవచనంబు గలుగుటం జేసి యిది హుతాశనున కశనం బయ్యెఁ; నింక దీనికి వగవం బనిలేఁ దనిన దాని విని సురపతి సురగణంబులతో మరలిన. 288

ప్రతిపదార్థం: నీ, ఇష్ట, సఖుండు+అయిన= నీకు మిక్కిలి ఇష్టమైన స్నేహితుడైన; తక్షకుండు; ఇందున్= ఇక్కడ; ఉండక= వసింపక; ముందరన= ముందుగానే; కురుక్షేత్రంబునకున్= కురుక్షేత్రానికి; అరిగి= వెళ్ళి; ఖాండవ, ప్రళయంబునకున్= ఖాండవవనంలోని ప్రమాదానికి; తప్పెన్= దూరమయినాడు; ఖాండవంబు; అగ్నిచేతన్= అగ్నిచే; దగ్ధంబు+అగున్= కాలిపోతుంది; అని= అని; తొల్లి= పూర్వం; బ్రహ్మ, వచనంబు= బ్రహ్మదేవునిమాట; కలుగుటన్+చేసి= ఉండటంచేత; ఇది, హుతాశనునకున్= అగ్నిహోత్రుడికి; అశనంబు= ఆహారం; అయ్యెన్= అయింది; ఇంకన్= ఇంక; దీనికి= దీనికై; వగవన్= చింతింప; పనిలేదు; అనినన్= అని అనగా; దానిన్= ఆ మాటను విని; సుర, పతి= దేవతలరాజు - దేవేంద్రుడు; సుర, గణంబులతోన్= దేవతా సమూహాలతో; మరలినన్= తిరిగి వెళ్ళగా.

తాత్పర్యం: 'నీ ప్రియమిత్రుడైన తక్షకుడు ఇక్కడ లేడు. ముందుగానే కురుక్షేత్రానికి వెళ్ళి, ఈ ఖాండవ దహనంవలన కలిగే ప్రమాదాన్ని తప్పించుకొన్నాడు. అగ్నిచే ఖాండవం కాలిపోతుందని పూర్వమే బ్రహ్మ చెప్పాడు. అందుచేత ఇది అగ్నిహోత్రునికి ఆహారమైనది. ఇక దీనికి దుఃఖింపనక్కరలేదు' అని చెప్పగా విని దేవేంద్రుడు దేవతాసమూహాలతో తిరిగి వెళ్ళగా.

క. బలయుతులు మనుజసింహులు । నలిఁ గృష్ణార్జునులు సింహనాదముల వియ
త్తలమును దిక్కులు బధిరం । బులుగాఁ జేసిరి త్రిలోకములు భయ మందన్. 289

ప్రతిపదార్థం: బల, యుతులు= బలంతో కూడినవాళ్ళు; మనుజ, సింహులు= మానవశ్రేష్ఠులు; కృష్ణ+ అర్జునులు= కృష్ణుడు, అర్జునుడు; నలిన్= అతిశయంగా; సింహనాదములన్= సింహనాదాలచేత; వియత్+తలమును= ఆకాశంయొక్క క్రిందిభాగం; దిక్కులు= అన్ని దిక్కులు; బధిరంబులు+కాన్= చెవిటివి అయ్యేటట్లుగా; త్రిలోకములు= మూడులోకాలు; భయము+అందన్= భయపడగా; చేసిరి= చేశారు;

తాత్పర్యం: బలవంతులు, మానవశ్రేష్ఠులు అయిన కృష్ణార్జునులు ముల్లోకాలు భయపడేటట్లుగా-ఆకాశం, దిక్కులు చెవిటివయ్యేటట్లుగా పెద్ద సింహనాదాలు చేశారు.

వ. అట్టియవసరంబున నముచి యను దనుజునసుజుండు మయుం డనువాఁడు ఖాండవంబు వెలువడనేరక తక్షకుగృహంబునఁ బరిభ్రమించుచున్నంతఁ ద న్నగ్ని చుట్టుముట్టిన నచ్యుతుండును జంప వచ్చిన నతిభీతుం డై యర్జునుమఱువు సొచ్చిన. 290

ప్రతిపదార్థం: అట్టి, అవసరంబునన్= అటువంటి సమయంలో; నముచి, అను= నముచి అనే పేరుగల; దనుజ; అనుజుండు= రాక్షసుడిని అనుసరించి పుట్టినవాడు; మయుండు= మయుడు; అనువాఁడు; ఖాండవంబు, వెలువడన్, నేరక= ఖాండవవనంనుండి బయటకి రాలేక; తక్షకు, గృహంబునన్; పరిభ్రమించుచున్= అంతటా తిరుగుతూ; ఉన్న+అంతన్= ఉండగా; తన్నున్= తనను; అగ్ని= అగ్ని; చుట్టుముట్టినన్= చుట్టుముట్టగా; అచ్యుతుండును= శ్రీకృష్ణుడుకూడా; చంపవచ్చినన్= చంపుటకైరాగా; అతి, భీతుండు+ఐ= మిక్కిలిభయపడినవాడై; అర్జును, మఱువు= అర్జునునిచాటు; చొచ్చినన్= ప్రవేశింపగా.

తాత్పర్యం: అట్లాంటి సమయంలో నముచి అనే రాక్షసునితమ్ముడు, మయుడు అనేవాడు ఖాండవవనంనుండి బయటపడలేక తక్షకుని ఇంట్లో దిక్కుతోచక తిరుగుతూ, తనను అగ్ని చుట్టుముట్టగా, శ్రీకృష్ణుడు చంపటానికి రాగా, మిక్కిలి భయపడి అర్జునునిచాటు చొచ్చాడు.

వ. శరణాగతరక్షణత । త్పరుఁడు ధనంజయుఁడు మయునిప్రాణము గాచెం;
గరుణను శరణాగతులగు । పురుషుల రక్షించునంత పుణ్యము గలదే. 291

ప్రతిపదార్థం: శరణ+ఆగత, రక్షణ, తత్+పరుఁడు= శరణుకోరివచ్చినవాళ్ళను రక్షించటంలో మనస్సు కలవాడు; ధనంజయుఁడు= అర్జునుడు; మయుని= మయుని; ప్రాణము= ప్రాణాన్ని; కాచెన్= కాపాడాడు; కరుణను= దయతో; శరణ+ఆగతులు+అగు= శరణుకోరి వచ్చిన వాళ్ళయిన; పురుషులన్= పురుషులను; రక్షించు, అంత= రక్షించేంతటి; పుణ్యము, కలదే= వేరే ఉన్నదా? (లేదని భావం).

తాత్పర్యం: శరణుకోరివచ్చినవాళ్ళను రక్షించటంలో మనస్సు కల అర్జునుడు మయునిప్రాణాలు కాపాడాడు. శరణుకోరినవాళ్ళను దయతో రక్షించటంవంటిపుణ్యం ఇంకొకటి కలదా! (లేదని భావం)

విశేషం: అలంకారం - అర్థాంతరన్యాసం. నానారుచిరార్థసూక్తినిధి అయిన నన్నయ కవితలో 'శరణాగతరక్షణ మహాపుణ్యకార్య' మని ప్రవచించిన ఈ సూక్తి ఒక మేలిమిరత్నం.

తే. మయుఁడు నశ్వసేనుండును మందపాల । సుతులు నలువురు శార్ఙ్గకు లతులదావ
దాహభీతి కయ్యార్వురుఁ దప్పి రన్య । జీవులెల్ల నం దపగతజీవు లైరి. 292

ప్రతిపదార్థం: మయుడున్, అశ్వసేనుండును; మందపాల, సుతులు= మందపాలునియొక్క కుమారులు; శార్ఙ్గకులు= శార్ఙ్గకులు, నలువురు= నలుగురు; ఆ+ఆర్వురు= ఆ ఆరుగురు; అతుల, దావ, భీతికిన్= సాటిలేని కార్చిచ్చువలన కలిగే భయానికి; తప్పిరి= తప్పించుకొన్నారు; అన్య, జీవులు+ఎల్లన్= తక్కినప్రాణులన్నీ; అందున్= ఆ అగ్నిలో; అపగత, జీవులు+ఐరి= ప్రాణాలు కోల్పోయారు.

తాత్పర్యం: మయుడు, అశ్వసేనుడు, మందపాలుని కుమారులు శార్ఙ్గకు లనేవాళ్ళు నలుగురు - మొత్తం ఆరుమంది ఆ దావాగ్నినుండి తప్పించుకొన్నారు. తక్కిన ప్రాణులన్నీ ఆ దావాగ్నిలో మరణించాయి.

మందపాలోఖ్యానము (సం. 1-220-1)

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కి ట్లనియె. 293

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; జనమేజయుండు; వైశంపాయనునకున్; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని జనమేజయుండు వైశంపాయనునితో ఇట్లా అన్నాడు.

క. మయభుజగమోక్షణము ని । ర్ణయముగ నెఱిఁగితి, నెఱుంగ నా కర్థిత్వం
బయినది నలుగురు శార్ఙ్గకు । లయు మోక్షణ మెట్లు నిర్మలజ్ఞాననిధీ! 294

ప్రతిపదార్థం: నిర్మల, జ్ఞాన, నిధీ= అచ్చపు జ్ఞానానికి స్థానమైనవాడా! ఓ వైశంపాయనమహర్షీ!, మయ, భుజగ, మోక్షణము= మయునియొక్క, పామైన అశ్వసేనునియొక్క విముక్తి - అంటే మయుడు, అశ్వసేనుడు ఆ దావాగ్నినుండి తప్పించుకొని బయటపడిన విధం; నిర్ణయముగన్= నిశ్చయంగా అంటే పూర్తిగా; ఎఱిఁగితిన్= తెలిసికొన్నాను; నలుగురు; శార్ఙ్గకులయు, మోక్షణము= నలుగురు శార్ఙ్గకులు తప్పించుకోవటం; ఎట్లు= ఏ విధంగా జరిగిందో; నాకున్= నాకు ; ఎఱుంగన్= తెలిసికోవటానికి; అర్థిత్వంబు+అయినది= కోరిక కలిగింది.

తాత్పర్యం: నిర్మల జ్ఞానానికి నిధివంటి ఓ వైశంపాయనమహర్షీ! మయుడు, అశ్వసేనుడు ఆ దావాగ్నినుండి తప్పించుకొన్నవిధం పూర్తిగా తెలుసుకొన్నాను. మందపాలుడి కుమారులైన నలుగురు శార్ఙ్గకు లెట్లా తప్పించుకొన్నారో తెలిసికొనాలనే కోరిక కలిగింది.

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డి ట్లనియె. 295

ప్రతిపదార్థం: అని, అడిగినన్= అని అడుగగా; జనమేజయునకున్= జనమేజయమహారాజుకు; వైశంపాయనుండు= వైశంపాయనమహర్షి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని అడుగగా వైశంపాయనుడు జనమేజయునితో ఈ విధంగా అన్నాడు.

క. జనపాల! మందపాలుం । డనుమునిముఖ్యుండు దొల్లి యత్యుగ్రతపం
బొనరించె బ్రహ్మచర్యం । బున దివ్యసహస్రవర్షములు నైష్ఠికుఁ డై. 296

ప్రతిపదార్థం: జనపాల= జనులను పాలించేవాడా! ఓ జనమేజయమహారాజా!; తొల్లి= పూర్వం; మందపాలుండు; అను; ముని, ముఖ్యుండు= ప్రసిద్ధుడైన ముని; బ్రహ్మచర్యంబునన్= బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబిస్తూ; దివ్య, సహస్ర, వర్షములు= వెయ్యి దేవతాసంవత్సరాలు; నైష్ఠికుఁడు+ఐ= నిష్ఠకలవాడై - అంటే స్థిరమైన బుద్ధి కలవాడై; అతి+ఉగ్ర, తపంబున్= మిక్కిలి భయంకరమైన తపస్సును; ఒనరించెన్= చేశాడు.

తాత్పర్యం: ఓ జనమేజయ మహారాజా! పూర్వం మందపాలుడనే మహాముని బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబించి వెయ్యిదేవతాసంవత్సరాలు నిష్ఠతో భయంకరమైనతపస్సు చేశాడు.

క. అమ్ముని యోగాభ్యాసవ । శమ్మున దేహంబు విడిచి చని పుణ్యు లలో
కమ్ములు సొరఁ గానక వడిఁ । ద్రిమ్మరి దేవతలఁ గాంచి ధృతి ని ట్లనియెన్. 297

ప్రతిపదార్థం: ఆ+ముని= ఆ మందపాలమహాముని; యోగ+అభ్యాస, వశమ్మునన్= యోగాభ్యాసంచేత; దేహంబు= శరీరం; విడిచి= వదలి; చని= వెళ్లి; పుణ్యుల, లోకమ్ములు= పుణ్యం చేసికొన్నవాళ్ళు ఉండే లోకాలు - దివ్యలోకాలు; చొరన్+కానక= ప్రవేశించలేక; వడిన్= వేగమే; త్రిమ్మరి= వెనుదిరిగి; దేవతలన్= దేవతలను; కాంచి= చూచి; ధృతిన్= ధైర్యంతో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ మందపాలమహాముని యోగాభ్యాసంచేత శరీరం విడిచి, పుణ్యలోకాలను ప్రవేశించలేక, వెంటనే వెనుదిరిగి దేవతలతో ధైర్యంగా ఇట్లా అన్నాడు.

వ. 'నాకుఁ బుణ్యలోకంబులు లేకుండ నే నేమి దుష్కృతంబు సేసితి?' ననిన నమ్మునీంద్రునకు దేవత లి ట్లనిరి. 298

ప్రతిపదార్థం: నాకున్; పుణ్య, లోకంబులు; లేకుండన్= లేకుండుటకు; ఏను= నేను; ఏమి; దుష్కృతంబు చేసితిన్= పాపం చేసితిని; అనినన్= అని అనగా; ఆ+ముని+ఇంద్రునకున్= ఆ మునీశ్వరునికి; దేవతలు, ఇట్లు+అనిరి.

తాత్పర్యం: 'నాకు పుణ్యలోకాలు లేకుండా పోవటానికి నే నేమి పాపం చేశాను?' అని అనగా ఆ మునిశ్రేష్ఠునితో దేవతలు ఇట్లా అన్నారు.

క. ఎంతతపం బొనరించియు । సంతానము లేనివారు సద్గతిఁ బొందం
గాంతురె? నీతప మేటికి । సంతానమువడయు మరిగి సన్మునినాథా! 299

ప్రతిపదార్థం: సత్+ముని, నాథా!= పూజింపదగిన మునిశ్రేష్ఠా!; ఎంత= ఎంతగా; తపంబు= తపస్సు; ఒనరించియు= చేసినా; సంతానము; లేని; వారు; సత్+గతిన్= మోక్షాన్ని; పొందన్+కాంతురె= పొందగలరా?; నీ, తపము= నీ తపస్సు; ఏటికి= ఎందుకు; అరిగి= వెళ్ళి; సంతానము= సంతానాన్ని; పడయుము= పొందుము.

తాత్పర్యం: పూజింప తగిన ఓ మునీశ్వరా! ఎంత తపస్సు చేసినా సంతానం లేనివాళ్ళు మోక్షాన్ని పొందకలరా? నీ తపస్సెందుకు? వెళ్ళి సంతానం పొందుము.

వ. అనిన విని మందపాలుండు మర్త్యలోకంబునకుఁ దిరిగివచ్చి 'నాకుం జెచ్చెరం బెక్కండ్రుపుత్త్రుల నెవ్విధంబునం బడయనగునో' యని చింతించి, పక్షులయందు వేగంబ యపత్యంబు పెద్ద యగుటం జూచి, తానును శార్ఙ్గకుండై, జరిత యను లావుక పెంటియందు రమియించి, దానివలన జరితారి సారిసృక్కస్తంబమిత్ర ద్రోణు లనువారల నలువురఁ గొడుకులఁ బరమబ్రహ్మవిదులం బడసి, వారల ఖాండవవనంబునం బెట్టి, తనపూర్వభార్యయైన లపితయుం దానును విహరించుచు నొక్కనాఁడు ఖాండవదహనోద్యతుండై వచ్చుచున్న యగ్నిభట్టారకుం గని, యగ్నిసూక్తంబుల స్తుతియించి యి ట్లనియె. 300

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; విని, మందపాలుండు, మర్త్య, లోకంబునకున్= మానవలోకానికి; తిరిగివచ్చి, నాకున్, చెరన్+చెరన్= వేగమే; పెక్కండ్రు= పలువురు; పుత్త్రులన్= కుమారులను; ఏ, విధంబునన్; పడయన్= పొందటానికి; అగునో= సాధ్యపడునో; అని= అంటూ; చింతించి = ఆలోచించి; పక్షుల, అందు= పక్షులలో, వేగంబు+అ= త్వరగా, అపత్యంబు=

సంతానం; పెద్ద, అగుటన్= ఎక్కువకావటాన్ని; చూచి= గ్రహించి; తానును; శార్ఙ్గకుండు+ఐ= శార్ఙ్గకపక్షి (లావుకపక్షి) రూపం దాల్చినవాడై; జరిత, అను; లావుక, పెంటియందున్= ఆడు లావుక పక్షియందు; రమియించి= సంభోగించి; దానివలనన్= జరితారి, సారిసృక్క, స్తంబమిత్ర, ద్రోణులు; అనువారలన్= అనే వాళ్ళను, నలువురన్= నలుగురిని; కొడుకులన్= కొడుకులను; పరమ, బ్రహ్మ, విదులన్= గొప్ప బ్రహ్మజ్ఞానం కలవాళ్ళను; పడసి= పొంది; వారలన్= వాళ్ళను; ఖాండవంబునన్= ఖాండవవనంలో; పెట్టి= ఉంచి; తన, పూర్వ, భార్య+ఐన= తన మొదటి భార్య అయిన; లపితయున్= లపితయూ, తానును= తానూ; విహరించుచున్= విహరించుచు; ఒక్కనాఁడు; ఖాండవ, దహన+ఉద్యతుండు+ఐ= ఖాండవవనాన్ని కాల్చటానికి పూనుకొన్నవాడై; వచ్చుచున్+ఉన్న= వస్తూ ఉండే; అగ్నిభట్టారకున్= అగ్నిహోత్రుడిని; కని=చూచి; అగ్ని, సూక్తంబులన్= అగ్నిని స్తుతించే వేదమంత్రాలతో; స్తుతియించి= స్తోత్రంచేసి-కొనియాడి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: దేవతలు ఆ విధంగా చెప్పగా విని, మందపాలుడు మానవలోకానికి తిరిగివచ్చాడు. త్వరగా తాను పుత్రులను పొందటం ఏ విధంగా సాధ్యమౌతుందో నంటూ ఆలోచించాడు. పక్షులలో సంతానం చాలా ఎక్కువ కావటం చూచి, మగలావుకపక్షిరూపం తాల్చాడు. ఆడులావుకపక్షి అయిన జరితతో సంభోగించాడు. జరితారి, సారిసృక్క, స్తంబమిత్ర, ద్రోణు లనే నలుగురు కొడుకులను - గొప్ప బ్రహ్మజ్ఞానంకలవాళ్ళను కన్నాడు. వాళ్ళను ఖాండవవనంలో ఉంచి తాను మొదటి భార్య అయిన లపితతో కలిసి విహరిస్తూ ఒక రోజు ఖాండవవనాన్ని కాల్చే ప్రయత్నంతో వస్తున్న అగ్నిహోత్రుడిని చూచి, అగ్నిసూక్తాలతో ఆయనను స్తోత్రం చేసి ఇట్లా అన్నాడు.

విశేషం: కథాప్రసన్నతను దృష్టిలో ఉంచుకొని నన్నయ ఇక్కడ మూలంలోని అగ్నిస్తోత్రాత్మకాలైన శ్లోకాలను అనువదించక వదిలాడు.

క. నీ వఖిల ధర్మమూర్తివి; । నావీర్యప్రభవు లయిన నలువురుసుతులన్
లావుకలఁ గరుణఁ గావుము । పావక! భువనోపకారపర్యాప్తమతీ! 301

ప్రతిపదార్థం: భువన+ఉపకార= లోకానికి ఉపకారం చేయటంలో; పర్యాప్తమతీ!= శక్తిమంతమైన మనస్సుకలవాడా!; పావక!= ఓ అగ్నిహోత్రా!; నీవు, అఖిల, ధర్మ మూర్తివి= సర్వధర్మస్వరూపుడవు; నా, వీర్య, ప్రభవులు+అయిన= నా వీర్యం నుండి పుట్టిన వాళ్ళయిన; నలువురు, సుతులన్= నలుగురు కుమారులను; లావుకలన్= లావుక పిట్టలను; కరుణన్= దయతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: లోకానికి ఉపకారం చేయటంలో శక్తిమంతమైన మనస్సు గలవాడా! ఓ అగ్నిహోత్రా! నీవు పరిపూర్ణ ధర్మమూర్తివి. నా వీర్యంనుండి పుట్టిన నలుగురు కుమారులు లావుకపిట్టలను దయతో రక్షింపుము.

వ. అనిన నమ్మందపాలుప్రార్థనంజేసి యానలువురు శార్ఙ్గకులను నగ్నిదేవుండు రక్షించువాఁ డయ్యెఁ; నంత నిట 302

ప్రతిపదార్థం: అనినన్= అని అనగా; ఆ+మందపాలు= ఆ మందపాలునియొక్క; ప్రార్థనన్, చేసి= ప్రార్థనవల్ల; ఆ నలువురు శార్ఙ్గకులను= నలుగురు కుమారులైన శార్ఙ్గకుల్ని; అగ్నిదేవుండు= అగ్నిదేవుడు; రక్షించువాఁడు= కాపాడగల్గినవాడు; అయ్యెన్= అయ్యాడు; అంతన్= అంతలో.

తాత్పర్యం: అనగా, ఆ మందపాలుని ప్రార్థనవలన ఆ నలుగురు శార్‌ఙ్గకులను అగ్నిదేవుడు రక్షించాడు. ఇక ఇక్కడ.

క. తనయుల నజాతపక్షుల । ననలశిఖాభీతిచంచలాత్ముల నెటయుం
జననేరనిబాలకులను । జననియు వీక్షించి శోకసంతాపిత యై. 303

ప్రతిపదార్థం: అజాత, పక్షులన్= మొలవని రెక్కలు కలవాళ్ళను; అనల, శిఖా, భీతి, చంచల+ఆత్ములన్= అగ్నిజ్వాలలవలన కలిగే భయంవలన కంపించే హృదయాలు కలవాళ్ళను; ఎటయున్= ఎక్కడికీ; చననేరని= వెళ్ళలేని; బాలకులను= చిన్నపిల్లలను; తనయులన్= కుమారులను; జననియు= తల్లికూడా; వీక్షించి= చూచి; శోక, సంతాపిత+ఐ= దుఃఖంచేత మిక్కిలితాపం పొందినదై.

తాత్పర్యం: రెక్కలు మొలవనివాళ్ళు, నిప్పుమంటలు చూచి భయంచేత చలించే మనస్సు కలవాళ్ళు, ఎక్కడికీ వెళ్ళ లేనివాళ్ళు, పసివాళ్ళు అయిన కుమారులను చూచి తల్లికూడా మిక్కిలి దుఃఖించింది.

క. వీరలఁ దోడ్కొనిపోవఁగ । నేరను బాలకులఁ బెట్టి నిర్దయబుద్ధిన్
వీరలతండ్రిక్రియం జన । నేరను; విధికృతము గడవనేరఁగ లావే. 304

ప్రతిపదార్థం: వీరలన్= వీళ్లను; తోడ్కొని= వెంటపెట్టుకొని; పోవఁగన్, నేరను= పోలేను; వీరల, తండ్రి, క్రియన్= వీళ్ళతండ్రివలె; బాలకులన్= పసివాళ్లను; పెట్టి= ఇక్కడే వదలిపెట్టి; నిర్దయ, బుద్ధిన్= దయలేని మనస్సుతో; చన నేరను= వెళ్ళలేను; విధికృతము= బ్రహ్మచే చేయబడింది; కడవనేరఁగన్= దాట కలగటం; లావే= అశక్యమేకదా!

తాత్పర్యం: వీళ్ళను వెంటబెట్టుకొని పోలేను. వీళ్ళతండ్రివలె దయమాలి ఇక్కడే విడిచిపోలేను. విధికృతం తప్పించుకోవటం ఎవరికి సాధ్యం?

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 'విధికృతము గడవనేరఁగ లావే' - నన్నయ నానారుచిరార్థసూక్తులలో ఇది ఒకటి.

చ. ఇది ప్రళయాగ్నివోలె దెసలెల్లను గప్పఁగ విస్ఫులింగముల్
వదలక వాయుసారథిజవంబునఁ దా నిట వచ్చె నేమి సే
యుదు సుతులార! యీబిలము నొయ్యన పోయి చొరుండు దీనిఁ గ
ప్పెద ఘనపాంసుజాలముల భీమశిఖావళి దాఁకకుండఁగన్. 305

ప్రతిపదార్థం: సుతులార!= కుమారులారా!; ఇది, ప్రళయ+అగ్ని, పోలెన్= ప్రళయకాలంలోని అగ్నివలె; విస్ఫులింగముల్= నిప్పుకణాలు; వదలక= విడువక; దెసలు+ఎల్లను= దిక్కులన్నింటా; కప్పఁగన్= కప్పివేయగా; వాయు, సారథి= గాలిని సారథిగా కలవాడు - అగ్నిదేవుడు; జవంబునన్= వేగంగా; తాన్= తాను; ఇట= ఇటువైపు; వచ్చెన్; ఏమి; చేయుదున్; ఈ, బిలమున్= ఈ రంధ్రాన్ని; ఒయ్యనన్= చక్కగా; పోయి, చొరుండు+అ= ప్రవేశించండి; భీమ, శిఖా+ఆవళి= భయంకరాలైన మంటల సమూహాలు; తాఁకకుండఁగన్= తగలకుండా; ఘన, పాంసు, జాలములు= గొప్ప దుమ్ముకణాల సమూహాలచే - అంటే పెద్ద దుమ్ముచేత; దీనిన్= ఈ రంధ్రాన్ని; కప్పెదన్= కప్పివేస్తాను.

తాత్పర్యం: పుత్రులారా! ప్రళయాగ్నివలె నిప్పుకణాలు దిక్కులన్నింటినీ కప్పగా అగ్నిదేవుడు వేగంగా ఇటువైపు వచ్చాడు. ఏం చేయాలి? తిన్నగా మీరు ఈ బొరియలో ప్రవేశించండి. భయంకరాలైన మంటలు తాకకుండా పెద్ద దుమ్ముతో నేను ఈ బొరియను కప్పేస్తాను.

చ. కొడుకుల బ్రహ్మవిత్తములఁ గోరినయట్టుల వీరి నల్వురం
బడసితి; నిమ్మహాత్ముల నపాయము నొందకయుండఁ బెంచుచున్
నడపుమటంచు నన్ను మునినాథుఁడు మీజనకుండు పంచి యి
ప్పుడ యెటయేనిఁ బోయె హుతభుక్ప్రళయంబు దలంప కక్కటా! 306

ప్రతిపదార్థం: ముని, నాథుఁడు= మునీంద్రుడైన మందపాలుడు; మీ, జనకుండు= మీ తండ్రి; కోరిన, అట్టులు+అ= కోరుకొన్నట్లే; బ్రహ్మవిత్తములన్= బ్రహ్మజ్ఞానం కలవాళ్ళలో శ్రేష్ఠులను; కొడుకులన్; వీరి= వీళ్ల; నల్వురన్= నలుగురిని; పడసితిన్= పొందాను; ఈ+మహాత్ములన్= ఈ మహనీయుల్ని; అపాయము; ఒందక, ఉండన్= పొందకుండా; పెంచుచున్= పెంచుతూ; నడపుము= ప్రవర్తిల్లుము; అటంచున్= అంటూ; నన్నున్= నన్ను; పంచి= ఆజ్ఞాపించి; హుత్‌భుక్+ప్రళయంబు= అగ్నిప్రమాదాన్ని; తలంపక= ఆలోచించక; అక్కటా;= అయ్యో!; ఇప్పుడు+అ= ఇప్పుడే - అంటే ఈ ప్రమాదపరిస్థితులేర్పడిన సమయంలోనే; ఎట, ఏనిన్= ఎక్కడికో; పోయెన్= వెళ్ళాడు.

తాత్పర్యం: మునీశ్వరుడైన మీ తండ్రి కోరుకొన్నట్లు బ్రహ్మజ్ఞానం కలవాళ్ళను నలుగురుకొడుకులను కన్నాను. 'ఈ మహాత్ములకు అపాయం కలగకుండా పెంచు' అని నన్నాజ్ఞాపించి, అగ్నిప్రమాదాన్ని తలపక, ఈ ప్రమాదపరిస్థితు లేర్పడినప్పుడే ఎక్కడికో వెళ్ళాడు.

వ. అని దుఃఖిత యై యున్న తల్లిం జూచి యగ్రతనయుం డైన జరితారి యి ట్లనియె. 307

ప్రతిపదార్థం: అని= అంటూ; దుఃఖిత+ఐ= దుఃఖించినదియై; ఉన్న= ఉన్నట్టి; తల్లిం+చూచి= తల్లిని చూచి; అగ్రతనయుండు+ఐన= పెద్ద కొడుకైన జరితారి; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అని దుఃఖించే తల్లిని చూచి పెద్దకొడుకైన జరితారి ఇట్లా అన్నాడు.

తే. బిలము సొచ్చితిమేని నం దెలుక చంపు; । నింద యుండితిమేనిఁ దా నేర్చు నగ్ని;
యెలుకచేఁ జచ్చుకంటె నీజ్వలన శిఖలఁ । గ్రాఁగి పుణ్యలోకంబులఁ గాంతు మేము. 308

ప్రతిపదార్థం: బిలము= రంధ్రం; చొచ్చితిమి+ఏనిన్= ప్రవేశిస్తే; అందున్= అందులో; ఎలుక; చంపున్= చంపుతుంది; ఇందు+అ= ఇక్కడే; ఉండితిమి+ఏనిన్= ఉంటిమా; అగ్ని; తాన్= తాను; ఏర్చున్= కాలుస్తాడు; ఎలుకచేన్= ఎలుకచేత; చచ్చుకంటెన్= చావటంకంటె; ఏము= మేము; ఈ, జ్వలన, శిఖలన్= ఈ అగ్నిహోత్రునిమంటలలో; క్రాఁగి= మాడి; పుణ్యలోకంబులన్= పుణ్యలోకాలను; కాంతుము= పొందుతాము.

తాత్పర్యం: కలుగులోకి దూరితిమా అందులో ఎలుక మమ్మల్ని చంపేస్తుంది. ఇక్కడే ఉన్నామా అగ్నిదేవుడు కాలుస్తాడు. ఎలుకచేత చావటంకంటె అగ్నిజ్వాలలోపడి మాడి పుణ్యలోకాలకు పోవటం మాకు మేలు.

వ. మఱియు మాంసపిండంబుల మయియున్న మాకు బిలప్రవేశంబున మూషకభయంబు నియతం బింద యుండిన నగ్నిభయంబు సంశయితం బె ట్లనిన. 309

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకా; మాంస, పిండంబులము= మాంసపు ముద్దలం; అయి= అయి; ఉన్న=ఉండే; మాకున్, బిల, ప్రవేశంబునన్= రంధ్రప్రవేశంలో; మూషక, భయంబు= ఎలుకవలనిభయం; నియతంబు= తప్పనిది; ఇందు+అ= ఇక్కడే; ఉండినన్= ఉంటే; అగ్ని, భయంబు= నిప్పులవలనిభయం; సంశయితంబు= అనుమానింపదగింది; ఎట్లు+అనినన్= ఏ విధంగా అంటే.

తాత్పర్యం: అంతేకాక మేము మాంసపుముద్దలమై ఉన్నందున నేల బొరియలో ప్రవేశిస్తే ఎలుకవలన ప్రమాదం తప్పదు. ఇక్కడే ఉంటే అగ్నిభయం అనుమానాస్పదం. ఎట్లా అంటే.

క. జ్వలనంబు వాయువశమునఁ । దొలఁగుడు జీవనము మాకు దొరకొనుఁ; గృచ్ఛం
బుల సంశయయుతకార్యం । బులు గర్తవ్యములు; నియతములు వర్జ్యమ్ముల్. 310

ప్రతిపదార్థం: జ్వలనంబు= మంట; వాయు, వశమునన్= గాలికి లొంగటంవలన; తొలఁగుడు= తొలగిపోతే; మాకున్; జీవనము= బ్రతుకు; దొరకొనున్= కలుగుతుంది; కృచ్ఛ్రంబుల= బాధలలో; సంశయ, యుత, కార్యంబులు= అనుమానంతో కూడుకొన్న పనులు - అంటే బాధ కలిగితే కలుగవచ్చు లేకుంటే తప్పిపోవచ్చు అనే పనులు; కర్తవ్యములు= చేయదగినవి; నియతములు= తప్పనివి - అంటే బాధ తప్పక కలుగుతుంది అని తోచేపనులు ; వర్జ్యమ్ముల్= విడువదగినవి.

తాత్పర్యం: మంట గాలివశాన తొలగిపోతే మేము బ్రతుకుతాము. కష్టసమయాలలో బాధ కలిగితే కలుగవచ్చు లేకుంటే తప్పిపోవచ్చు అని అనిపించే పనులు చేయతగినవి. బాధ తప్పదు అని అనిపించే పనులు విడువదగినవి.

విశేషం: కష్టసమయాలలో కరదీపికవలె మానవునికి ఉపయోగించే ఈ సూక్తి నానారుచిరార్థసూక్తినిధి అయిన నన్నయ కవితలో ఒక మేలిమి రత్నం.

వ. 'కావున నీవు మెచ్చినచోటికిఁ బోవనోపము; మావలని మోహంబు విడిచి యరుగు; మేము దహనక్లేశంబునం బొందినను నీవు జీవించి పుత్త్రులం బడయనోపుదువు; నీపుణ్యవశంబున మాకు నగ్నిభయంబు దొలంగెనేని నీవు మాయొద్దకు వచ్చి యెప్పటియట్ల రక్షింతు' వని కొడుకు లెల్ల మ్రొక్కినం జూచి, జరితయు బాష్పపూరితనయన యై యాసన్నతరుగుల్మగహనదహనమహోత్సాహుం డయి వచ్చు హవ్యవాహనుం జూచి, ప్రాణభయంబున గగనంబున కెగసి చనె నంత. 311

ప్రతిపదార్థం: కావునన్; నీవు, మెచ్చిన= నీ కిష్టమైన; చోటికిన్= ప్రదేశానికి, బిలంలోకి; పోవన్+ఓపము= పోలేము; మావలని; మోహంబు, విడిచి= మా మీద మమకారం వదలి; అరుగుము= వెళ్ళుము; ఏము= మేము; దహనక్లేశంబునన్= కాలుట అనే కష్టంలో; పొందినను= మేము కాలిపోయినా; నీవు, జీవించి, పుత్త్రులన్; పడయన్+ఓపుదువు= పొందగలుగుతావు; నీ, పుణ్య, వశంబునన్= నీ పుణ్యంకారణంగా; మాకున్= మాకు; అగ్నిభయంబు= అగ్నివలన భయం; తొలంగెన్+ఏని= తొలగిపోతే; నీవు, మా, ఒద్దకున్, వచ్చి; ఎప్పటి, అట్లు+అ= ఎప్పటివలె; రక్షింతువు= కాపాడుతావు; అని= అని; కొడుకులు+ఎల్లన్= కుమారులందరు; మ్రొక్కినన్= నమస్కరింపగా; చూచి, జరితయు=.జరిత; బాష్ప, పూరిత, నయన+ఐ= కన్నీటిచే నిండిన కన్నులు గలదై; ఆసన్న, తరు, గుల్మ, గహన, దహన, మహా+ఉత్సాహుండు+అయి= దగ్గరగా ఉన్న చెట్లను, పొదలను,

అడవులను దహించటంలో మిక్కిలి ఉత్సాహం కలవాడై; వచ్చు; హవ్య, వాహనున్= అగ్నిహోత్రుడిని; చూచి, ప్రాణభయంబునన్=ప్రాణభీతితో; గగనంబునకున్= ఆకాశానికి; ఎగసి= ఎగిరి; చనెన్= వెళ్ళింది; అంతన్= అంతట.

తాత్పర్యం: 'అందువలన మేము నీవు చెప్పినట్లు బిలంలోకి వెళ్ళం. నీవు మా మీద మమకారాన్ని వదలి వెళ్ళు. మేము కాలిపోయినా నీవు జీవించి ఉంటే మళ్ళీ పుత్రులను పొందగలవు. నీ పుణ్యంవలన మాకు అగ్నిభయం తొలగిపోతే నీవు మా వద్దకు వచ్చి ఎప్పటిలాగా రక్షిస్తావు' అని కొడుకులంతా మ్రొక్కగా, వాళ్ళను చూచి జరిత కన్నీరు నిండిన కన్నులు కలదై, ప్రక్కనున్న చెట్లను, పొదలను, అడవులను దహించటానికి ఉత్సాహంతో వస్తున్న అగ్నిహోత్రుడిని చూచి ప్రాణభయంతో ఆకాశానికి ఎగిరింది.

క. నలుగురు నాలుగు వేద । మ్ములమంత్రము లొప్ప బ్రహ్మముఖములు వోలెన్
వెలయంగ సంస్తుతించుచు । నలఘులు మా కభయ మభయ మని రయ్యనలున్. 312

ప్రతిపదార్థం: అలఘులు= తక్కువవారు కానివాళ్ళు - అంటే గొప్పవాళ్ళు; నలుగురు; నాలుగువేదమ్ముల= నాలుగువేదాల; మంత్రములు= మంత్రాలు; ఒప్పన్= బాగుగా; బ్రహ్మ, ముఖములు, పోలెన్= బ్రహ్మదేవునియొక్క నాలుగు ముఖాలవలె; వెలయంగన్= ప్రకాశించగా; సంస్తుతించుచున్= గొప్పగా స్తోత్రం చేస్తూ; ఆ+అనలున్= ఆ అగ్నిదేవుడిని; మాకున్, అభయము, అభయము; అనిరి= అన్నారు.

తాత్పర్యం: మహాత్ములైన శార్ఙ్గకులు నలుగురూ బ్రహ్మదేవుని నాలుగు ముఖాలవలె నాలుగు వేదమంత్రాలతో గొప్పగా స్తోత్రం చేస్తూ మాకు అభయం ఇమ్మని అగ్నిహోత్రుడిని ప్రార్థించారు.

విశేషం: అలం: ఉపమ. 'ఆదరాత్ ద్విరుక్తిః, అనాదరాత్ ద్విరుక్తిః' అన్నట్లు ఒక పదాన్ని ఒకటికి రెండుమార్లుగా పలికినప్పుడు అది అప్పటి పరిస్థితి యొక్క తీవ్రతను ధ్వనింపజేస్తుంది. అందులోనూ అది స్తోత్రించే సందర్భం. అప్పటి ఆద్రుతగతిని హ్రస్వాక్షరాలు సన్నివేశం సముచితంగా అక్షరరమ్యతను కథాగమనాన్ని సమన్వయింపజేశాయి.

వ. అగ్నిదేవుం డప్పడు మందపాలుప్రార్థనం దలంచి యన్నలువురు శార్ఙ్గకులు నున్న వృక్షంబు భక్షింపక పరిహరించిన జరితయు దానిం జూచి సంతసిల్లి కొడుకులయొద్దకు వచ్చి సుఖం బుండె; నంత నక్కడ మందపాలుండు పురందరువనంబు దహనుచేత దగ్ధం బగుట యెఱింగి, యం దున్న జరితను బుత్త్రులం దలంచి యతిదుఃఖితుం డయి లపిత కిట్లనియె. 313

ప్రతిపదార్థం: అగ్నిదేవుండు; అప్పుడు = ఆ సందర్భంలో; మందపాలు= మందపాలుని; ప్రార్థనన్; తలంచి= జ్ఞప్తికి తెచ్చుకొని; ఆ+నలువురు= ఆ నలుగురు పుత్రులు; శార్ఙ్గకులు= శార్ఙ్గకులు; ఉన్న= ఉండే; వృక్షంబున్= చెట్టును; భక్షింపక= తినక; పరిహరించినన్= వదలివేయగా; జరితయు= జరిత; దానిన్= తనకొడుకులను అగ్ని భక్షింపక వదలివేయటం; చూచి= కనుగొని; సంతసిల్లి= సంతోషించి; కొడుకుల= కుమారుల; ఒద్దకున్= దగ్గరకు; వచ్చి; సుఖంబు+ఉండెన్= సుఖంగా ఉండింది; అంతన్= అప్పుడు; అక్కడ; మందపాలుండు; పురందరు, వనంబు= దేవేంద్రునియొక్కతోట ఖాండవం; దహనుచేత= అగ్నిదేవునిచేత; దగ్ధంబు= కాలిపోయింది; అగుట; ఎఱింగి= తెలిసికొని; అందున్+ఉన్న= ఆ ఖాండవవనంలో ఉన్న; జరితను= జరితను; పుత్త్రులన్= కుమారుల్ని; తలంచి= తలచుకొని; అతి, దుఃఖితుండు, అయి= మిక్కిలి దుఃఖం పొందినవాడై; లపితకున్= లపితకు (తో); ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అన్నాడు.

తాత్పర్యం: అగ్నిదేవుడు మందపాలునిప్రార్థనను గుర్తు తెచ్చుకొని ఆ నలుగురు శార్ఙ్గకులున్న చెట్టును భక్షించకుండా వదలివేయగా, జరిత దానిని చూచి సంతోషపడి, కొడుకుల దగ్గరకు వచ్చి సుఖంగా ఉన్నది. అప్పుడు మందపాలుడు దేవేంద్రునివనం ఖాండవం అగ్నిదేవునిచేత కాల్చబడినట్లు తెలిసికొని, దానిలో ఉన్న తనభార్యాపుత్రులను తలచి మిక్కిలి దుఃఖించి, తన మొదటిభార్య అయిన లపితతో ఇట్లా అన్నాడు.

క. తరుణుల నజాతపక్షులఁ । జరణంబులు లేనివారి శార్ఙ్గేయుల న
ల్వుర నొక్కతె యెట దోడ్కొని । యరుగంగా నేర్చు జరిత యాపద గడవన్. 314

ప్రతిపదార్థం: తరుణులన్= చిన్నవారిని; అజాత, పక్షులన్= పుట్టని రెక్కలు కలవారిని-రెక్కలు రానివాళ్లను; చరణంబులు= కాళ్ళు; లేని, వారిన్; శార్ఙ్గేయుల= శార్ఙ్గేయులైన; నల్వురన్= నలుగురు కుమారుల్ని; జరిత, ఒక్కతె; ఆపద, కడవన్ (ఆపద) విపత్తు దాటునట్లు; ఎట= ఎక్కడికి; తోడ్కొని= వెంటతీసికొని; అరుగన్+కాన్= వెళ్ళటానికి; నేర్చున్= ఓపును.

తాత్పర్యం: చిన్నవాళ్ళు, రెక్కలు రానివాళ్ళు, కాళ్ళు రానివాళ్ళు అయిన శారఙ్గేయులు నలుగురిని జరిత ఒక్కతే ఆపద గడచేటట్లు ఎక్కడి తీసికొని వెళ్ళగలదు?

క. మఱచునొకొ! మఱవకుండియు । నెఱుఁగక యుండునొకొ! యనలుఁ డెఱిఁగియు నెడ నే
మఱునొకొ! పుత్త్రులఁ గావక । గుఱుకొని; నమ్మంగ నగునె క్రూరాత్మకులన్. 315

ప్రతిపదార్థం: అనలుఁడు= అగ్నిహోత్రుడు; మఱచున్+ఒకొ= నా ప్రార్థనను మఱచిపోవునో ఏమో; మఱవకుండియున్= మరవకపోతే; ఎఱుఁగక(తెలియక); ఉండున్+ఒకొ= వీరు నా పుత్త్రులు, శార్ఙ్గకులని తెలిసికొనలేకపోవునేమో!; ఎఱిఁగియున్= తెలిసికొనికూడా; ఎడన్= సమయం వచ్చినపుడు; గుఱుకొని= యత్నించి; పుత్త్రులన్= కుమారుల్ని; కావక= రక్షించక; ఏమఱున్+ఒకొ= మోసంచేయునేమో; క్రూర+ఆత్మలకున్= క్రూరమైన మనస్సు గలవాళ్ళను - అంటే దుర్మార్గులను; నమ్మన్+కన్+అగునె= నమ్మతగునా!

తాత్పర్యం: అగ్నిహోత్రుడు నా ప్రార్థనను మరచిపోతాడేమో? ఒకవేళ మరవకపోయినా నా పుత్త్రులైన శార్ఙ్గకులను గుర్తించలేకపోతాడేమో! లేదా గుర్తించినసమయం వచ్చినప్పుడు ప్రయత్నించి రక్షించక మోసగిస్తాడేమో. దుర్మార్గులను నమ్మతగదుకదా!

విశేషం: సర్వాన్ని దహించి బాధించే స్వభావం కలవాడు కావటంవలన అనలుడు క్రూరాత్ముడని అనటం. తనయుల క్షేమాన్ని గూర్చిన తండ్రి హృదయాందోళన ప్రతిఫలించే పద్యం ఇది. ఎఱుకలో కృతజ్ఞతను, మఱపులో కృతఘ్నతను నన్నయ ఎంతో ప్రసన్నగంభీరంగా ఈ కందపద్యంలో ప్రతిపాదించాడు. అనేక లఘువుల మధ్య ఎక్కడనో ఒక గురువు ప్రయోగించి అది హృదయాందోళనకు సూచికగా ఛందశ్శిల్పౌచితి పాటించిన విధానం అనుపమానం.

వ. అనిన విని లపిత యిట్లనియె. 316

ప్రతిపదార్థం: అనినన్= అని మందపాలుడు అనగా; విని; లపిత= లపిత; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

తాత్పర్యం: అతనిమాటలు విని లపిత ఇట్లా అన్నది.

క. నాయొద్దన ప్రార్థించిన । వాయుసఖుం డపుడు నీకు వరదుం డయి శార్
ఙ్గేయుల నలువురఁ గాతును । ధీయుత! యని పలికె మఱచితే మునినాథా! 317

ప్రతిపదార్థం: ముని, నాథా! = మునీశ్వరా!; నా, ఒద్దన= నా దగ్గర; ప్రార్థించినన్= ప్రార్థింపగా; వాయు, సఖుండు= గాలి దేవుని యొక్క స్నేహితుడు - అగ్నిదేవుడు; అపుడు, నీకున్, వరదుండు+అయి= వరాన్ని ఇచ్చేవాడై; శార్ఙ్గేయుల నలువురన్, శార్ఙ్గేయుల్ని నలుగురిని; కాతును= రక్షిస్తాను; ధీయుత!= ఓ బుద్ధిమంతుడా; అని; పలికెన్, మఱచితే= మరచిపోయావా?

తాత్పర్యం: మునీశ్వరా! నా ఎదుట నీవు ప్రార్థించినప్పుడు ఆ అగ్నిదేవుడు శార్ఙ్గేయులు నలుగురిని రక్షిస్తానని పలికిన సంగతి మరచిపోయావా!

వ. 'ఆలికి నెయ్యుండ వయి దానియోగక్షేమం బరయం దలంచి; తది పులుఁ గెటయేనియుం బఱచుం గా కేమి యయ్యెడు; వగవకుండు' మనిన మందపాలుండు మందస్మితవదనుం డగుచు 'వసిష్ఠు నట్టి పురుషు నైన నరుంధతియట్టి భార్య యైనను నిర్నిమిత్తంబున స్త్రీవిషయంబునందు సంశయింపకుండ' దిది స్త్రీలకు నైజంబ యని పలికి లపిత వీడ్కొని, ఖాండవంబునకు వచ్చి పుత్త్రసహిత యయి కుశలిని యయి యున్న జరితం జూచి సంతుష్టుండై నిజేచ్ఛ నరిగె; నగ్నిదేవుండు నిట్లు నిర్విఘ్నంబున ఖాండవవనౌషధంబు లుపయోగించి విగతరోగుండయి కృష్ణార్జునుల దీవించి చనియె; నంత. 318

ప్రతిపదార్థం: ఆలికిన్= భార్యకు; నెయ్యుండవు+అయి= స్నేహితుడవై; దాని= ఆ జరితయొక్క; యోగ, క్షేమంబు; అరయన్= విచారింప; తలంచితి(వి)= తలచావు; అది; పులుఁగు= పక్షి; ఎట, ఏనియున్= ఎక్కడికైనా; పఱచున్+కాక= పరుగెత్తగలదు; ఏమి, అయ్యెడు= (దానికి) ఏమవుతుంది; వగవక+ఉండుము= విచారింపకుము; అనినన్= అని పలుకగా; మందపాలుండు; మంద, స్మిత, వదనుండు= చిరునవ్వుతో కూడినముఖం కలవాడు; అగుచున్= అవుతూ; వసిష్ఠు, అట్టి= వసిష్ఠుని అంతటి; పురుషుని+ఐనన్= పురుషుణ్ణి అయినా; అరుంధతి, అట్టి భార్య= అరుంధతి వంటి భార్య; ఐనను= అయినను; నిర్+నిమిత్తంబునన్= కారణంలేకయే; స్త్రీ, విషయంబు, అందున్= స్త్రీ విషయంలో; సంశయింపక= అనుమానింపక; ఉండదు= ఉండదు కదా!, ఇది; స్త్రీలకున్; నైజంబు+అ= సహజమే; అని; పలికి, లపిత= లపితను; వీడ్కొని= వీడి; ఖాండవంబునకున్= ఖాండవవనానికి; వచ్చి= చనుదెంచి; పుత్త్ర, సహిత, అయి= కొడుకులతో కూడినదై; కుశలిని, అయి= క్షేమం కలదై; ఉన్న= ఉన్నట్టి; జరితన్= జరితను; చూచి= కనుగొని; సంతుష్టుండు+ఐ= తృప్తి పొందినవాడై; నిజ+ఇచ్ఛన్= తన ఇచ్ఛవచ్చినట్లు; అరిగెన్= వెళ్ళాడు; అగ్నిదేవుండును= అగ్నిదేవుడుకూడా; ఇట్లు= ఈ విధంగా; నిర్విఘ్నంబునన్= అడ్డులేకుండా; ఖాండవ, వన+ఔషధంబులు= ఖాండవవనంలోని (వృక్షసంబంధాలైన) మందులు; ఉపయోగించి= భక్షించి, అనుభవించి; విగత, రోగుండు+అయి= పోయిన రోగం కలవాడై; కృష్ణ+అర్జునులన్= కృష్ణుని అర్జునుని; దీవించి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= అనంతరం.

తాత్పర్యం: 'భార్యమీది ప్రేమతో నీవు దాని యోగక్షేమాలు విచారిస్తున్నావు. అది (జరిత)పక్షి. ఎక్కడికైనా పరుగెత్తగలదు. దానికేమీ కాదు. చింతించకు' అని లపిత అనగా మందపాలుడు చిరునవ్వుతో 'వసిష్ఠునివంటి పురుషుడిని అయినా అరుంధతివంటి భార్యకూడా స్త్రీ విషయంలో అనుమానించకుండా ఉండదు. ఇది స్త్రీలకు సహజమే'- అని లపితను వదలి, ఖాండవవనానికి వచ్చి కొడుకులతో కూడి క్షేమంగా ఉన్న జరితను చూచి తృప్తిపొంది, తన ఇష్టం వచ్చిన

చోటికి వెళ్ళాడు. అగ్నిదేవుడుకూడా ఏ ఆటంకం లేకుండా ఖాండవవనంలోని మందులను ఉపయోగించి, రోగం తొలగిపోగా కృష్ణార్జునులను దీవించి వెళ్ళాడు. ఆ తరువాత

విశేషం: యోగక్షేమాలు - యోగం అంటే ఇంతకుముందు లేని భాగ్యం కలగటం; క్షేమం అంటే కలిగినది చెడకుండా ఉండటం. అరుంధతీవసిష్ఠులు ఆదర్శదంపతులు. అట్టిదంపతులలో కూడా స్త్రీ విషయంలో భార్య భర్తను శంకిస్తుందని అభిప్రాయం. లోకంలో అన్యస్త్రీయోగక్షేమాలలో భర్త ఆసక్తి చూపటాన్ని ఏ భార్యకూడా సహించదు. అది స్త్రీసహజం.

ఇంద్రుం డర్జునునకు నాగ్నేయ వారుణ వాయవ్యాది దివ్యబాణంబు లిచ్చుట (సం- 1-225-7)

వ. అతిమానుష మత్యద్భుత । మతిదుష్కర మయిన కేశవార్జునకృతి గో
పతి చూచి మెచ్చి సురపరి । వృతుఁ డయి చనుదెంచెఁ గృష్ణవిజయులకడకున్. 319

ప్రతిపదార్థం: అతి, మానుషము= మానవులకు మించింది - మానవాతీతం; అతి+అద్భుతము= మిక్కిలి ఆశ్చర్యకరమైనది; అతి, దుష్కరము= మిక్కిలి కష్టమైనది; అయిన, కేశవ+అర్జున, కృతి= కృష్ణార్జునులు చేసినపని; గోపతి= స్వర్గాధిపతి - దేవేంద్రుడు; చూచి, మెచ్చి; సుర, పరివృతుఁడు+అయి= దేవతలచే చుట్టబడినవాడై - అంటే దేవతలు చుట్టు చేరి రాగా; కృష్ణ, విజయుల, కడకున్= కృష్ణార్జునుల దగ్గరకు; చనుదెంచెన్= వచ్చాడు.

తాత్పర్యం: మానవులు చేయలేనిది, మిక్కిలి ఆశ్చర్యకరమైనది, మహోత్కృష్టమైనది అయిన కృష్ణార్జునుల ఘన కార్యాన్ని చూచి మెచ్చుకొని దేవేంద్రుడు, దేవతలంతా తనచుట్టు చేరి రాగా, వాళ్ళవద్దకు వచ్చాడు.

క. అనఘులు నరనారాయణు । లన నాదియుగంబునన్ సురాసురనుతు ల
య్యును నపుడు మనుజు లగుటను । వినయంబున మ్రొక్కి రమరవిభునకు నంతన్. 320

ప్రతిపదార్థం: అనఘులు= పాపంచేయనివాళ్ళు - పుణ్యాత్ములు; ఆది, యుగంబునన్= తొలియుగంలో; నర, నారాయణులు; అనన్= అనగా; సుర+అసుర, నుతులు+అయ్యును=దేవతలచేత, దేవతలు కానివాళ్ళచేత (రాక్షసులచేత) స్తుతింపబడినవాళ్ళయి కూడా; అపుడు= ఆ సందర్భంలో; మనుజులు+అగుటను= మానవులు కావటంవలన; అమర, విభునకున్= దేవేంద్రునికి; వినయంబునన్= వినయంతో; మ్రొక్కిరి= నమస్కరించారు; అంతన్= తరువాత.

తాత్పర్యం: పుణ్యాత్ములు తొలియుగంలో నర నారాయణులుగా ప్రసిద్ధిపొంది, దేవదానవులచేత స్తుతింపబడిన వాళ్ళయినా, అపుడు మానవులు కావటంవలన కృష్ణార్జునులు దేవేంద్రునికి వినయంతో మ్రొక్కారు.

వ. ఇంద్రుండు నుపేంద్రార్జునుల నతిస్నేహంబునఁ గౌఁగిలించుకొని యర్జునునకు నాగ్నేయవారుణ వాయవ్యాది దివ్యబాణంబు లిచ్చి, 'వీని కెప్పుడు నిష్టసఖుండ వయి యుండు' మని కృష్ణుం బ్రార్థించి, దివ్యవిమానారూఢుం డయి దివిజాప్సరోగణసేవితుం డయి దివంబున కరిగె; నిట వాసుదేవార్జునులు మయుం దోడ్కొని మగిడి యింద్రప్రస్థపురంబునకు వచ్చి, ధర్మరాజునకు మ్రొక్కి ఖాండవదహనప్రకారంబు సెప్పి మయుం జూపి సుఖం బుండి రని. 321

ప్రతిపదార్థం: ఇంద్రుండున్= ఇంద్రుడుకూడా; ఉపేంద్ర+అర్జునులన్= కృష్ణార్జునులను; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రీతి(మైత్రి)తో; కౌఁగిలించుకొని; అర్జుననకున్; ఆగ్నేయ, వారుణ, వాయవ్య+ఆది= ఆగ్నేయం (అగ్నిసంబంధం కలది),

వారుణం (వరుణ సంబంధం కలది); వాయవ్యం (వాయుసంబంధం కలది); మొదలైన, దివ్య, బాణంబులు= దేవతాసంబంధాలైన బాణాలు; ఇచ్చి= ప్రసాదించి; వీనికిన్= ఈ అర్జునునికి; ఎప్పుడున్= ఎల్లప్పుడు; ఇష్ట, సఖుండవు+అయి= ప్రియమిత్రుడవై; ఉండుము= ఉండు; అని= ఆ విధంగా; కృష్ణున్, ప్రార్థించి, దివ్య, విమాన+ఆరూఢుండు+అయి= దేవతాసంబంధమైన విమానాన్ని ఎక్కినవాడై; దివిజ+అప్సరస్+గణ, సేవింతుడు+అయి= దేవతలయొక్క, అప్సరసలయొక్క సమూహంచేత కొలువబడినవాడై; దివంబునకున్= స్వర్గానికి; అరిగెన్= వెళ్ళాడు; ఇట= ఇక్కడ; వాసుదేవ+అర్జునులు= కృష్ణార్జునులు; మయున్= మయుడను విశ్వశిల్పిని; తోడ్కొని= వెంటబెట్టుకొని; మగిడి= తిరిగి; ఇంద్రప్రస్థ, పురానికి = ఇంద్రప్రస్థనగరానికి; వచ్చి= ఏతెంచి; ధర్మరాజునకున్, మ్రొక్కి, ఖాండవ, దహన, ప్రకారంబున్= ఖాండవవనం కాలిపోయిన విధం; చెప్పి; మయున్, చూపి; సుఖంబు, ఉండిరి= సుఖంగా ఉన్నారు, అని; ఆ ప్రకారంగా.

తాత్పర్యం: ఇంద్రుడుకూడా కృష్ణార్జునులను మిక్కిలిప్రేమతో కౌగిలించుకొని - అర్జునునికి ఆగ్నేయం, వారుణం, వాయవ్యం మొదలైన దివ్యాస్త్రాలిచ్చి, 'నీవు ఈ అర్జునునికి ఎల్లప్పుడూ ప్రియమిత్రుడవై ఉండు' మని శ్రీకృష్ణుడిని ప్రార్థించి, దివ్యవిమానం ఎక్కి, దేవతలు, అప్సరసలు తనను సేవిస్తుండగా స్వర్గానికి వెళ్ళాడు. ఇక్కడ కృష్ణార్జునులుకూడా మయుడిని వెంటబెట్టుకొని మళ్ళీ ఇంద్రప్రస్థానికి వచ్చి, ధర్మరాజుకు మ్రొక్కి, ఖాండవం కాలిపోయిన విధం చెప్పి, మయుడిని పరిచయం చేసి సుఖంగా ఉన్నారు - ఆ ప్రకారంగా.

క. **జనమేజయజనపాలున । కనఘుచరిత్రునకుఁ బ్రీతుఁ డయి వైశంపా**
యనుఁ డాదిపర్వకథ యె । ల్లను నిమ్ముగఁ జెప్పె నని విలాసమహేంద్రా! **322**

ప్రతిపదార్థం: విలాస, మహేంద్రా= విలాసంలో దేవేంద్రునివంటివాడా - రాజరాజనరేంద్రా! అని= అంటూ; జనమేజయ, జనపాలునకున్= జనమేజయమహారాజుకు; అనఘ, చరిత్రునకున్= పాపం లేని నడవడి కలవానికి; వైశంపాయనుఁడు; ప్రీతుఁడు+అయి= సంతోషించినవాడై; ఆది, పర్వ, కథ, ఎల్లనున్= ఆదిపర్వ కథ నంతా; ఇమ్ముగన్= ఇంపుగా; చెప్పెన్= చెప్పాడు; అని= అని;

తాత్పర్యం: విలాసంలో దేవేంద్రునివంటివాడవైన రాజరాజనరేంద్రా! - పుణ్యచరిత్రుడైన జనమేజయ మహారాజుకు వైశంపాయనుడు ప్రీతితో ఆదిపర్వకథ అంతా ఇంపుగా చెప్పాడు - అని సూతుడు శౌనకాదిమహామునులకు చెప్పాడు.

ఆశ్వాసాంతము

క. **అభిమానమహార్ణవ! హరి । నిభ విభవ విభాసమాన! నిరవద్య! రవి**
ప్రభ! రాజమనోహర! వై । రిభయంకరశౌర్య! నృపవరేణ్యశరణ్యా! **323**

ప్రతిపదార్థం: అభిమాన, మహా+అర్ణవ= అభిమానానికి సముద్రునివంటివాడా! (అంటే గొప్ప అభిమానం కలవాడా!); హరి, నిభ, విభవ, విభాసమాన= ఇంద్రునివంటి ఐశ్వర్యంచేత ప్రకాశించేవాడా!; నిరవద్య= నిందింపదగనివాడా! (స్తుతింపదగినవాడా); తక్కువతనం లేనివాడా!; రవి, ప్రభ= సూర్యునితేజస్సువంటి తేజస్సు కలవాడా!; రాజ, మనోహర= చంద్రునివలె అందమైనవాడా!; వైరి, భయంకర, శౌర్య= శత్రువులకు భయాన్ని కలిగించే పరాక్రమం కలవాడా!; నృప, వరేణ్య, శరణ్యా= రాజశ్రేష్ఠులకు శరణు పొందదగినవాడా!

తాత్పర్యం: అభిమానానికి సముద్రునివంటివాడా! ఇంద్రునితో సమానమైన ఐశ్వర్యంతో ప్రకాశించేవాడా! స్తుతిపాత్రమైనవాడా! సూర్యునివంటి తేజస్సు కలవాడా! చంద్రునివలె అందమైనవాడా! శత్రువులకు భయం కలిగించే పరాక్రమంకలవాడా! రాజశ్రేష్ఠులకు శరణుపొంద తగినవాడా! అని ప్రశంసాపూర్వకంగా నన్నయమహాకవి ఆశ్వాసాంతంలో రాజరాజనరేంద్రుడిని సంబోధిస్తున్నాడు.

మత్తకోకిల

రాజభూషణ! నిత్యసత్య! సరస్వతీవిలసన్ముఖాం
భోజ! రాజమనోజ! భూజనపూజ్యమాన! మహాయశో
రాజహంసపయోజినీవనరమ్యదిఙ్ముఖ! విక్రమో
ద్వేజితాహిత! విష్ణుసన్నిభ! విష్ణువర్ధనభూపతీ! 324

ప్రతిపదార్థం: రాజ, భూషణ= రాజులకు అలంకారమైనవాడా!; నిత్య, సత్య= శాశ్వతసత్యాన్ని కలవాడా! సరస్వతీ, విలసత్+ ముఖ+అంభోజ= సరస్వతీదేవీచేత ప్రకాశించే పద్మంవంటి ముఖంకలవాడా! (అంటే విద్యా తేజస్సుతో ప్రకాశించే ముఖం కలవాడా!); రాజ, మనోజ= రాజులలో మన్మథునివంటివాడా! భూ, జన, పూజ్యమాన= భూమిలోని జనులచేత పూజింపబడువాడా!; మహా, యశో, రాజహంస, పయోజినీ, వన, రమ్య, దిక్+ముఖ=గొప్పకీర్తి అనే రాజహంసకు పద్మవనమైన చక్కనిదిగ్భాగాలు కలవాడా! (అంటే దిక్కులలో వ్యాపించిన గొప్పకీర్తి కలవాడా!); విక్రమ+ఉద్వేజిత+అహిత= పరాక్రమంచేత భయపెట్టబడిన శత్రువులు కలవాడా!; విష్ణు, సన్నిభ= విష్ణుమూర్తితో సమానమైనవాడా; విష్ణువర్ధన, భూపతీ!= విష్ణువర్ధనమహారాజా!

తాత్పర్యం: రాజులకు అలంకారమైనవాడా! ఎల్లప్పుడు సత్యం చెప్పేవాడా! విద్యా తేజస్సుతో ప్రకాశించే పద్మం వంటి ముఖం కలవాడా! రాజులలో మన్మథునివంటివాడా! భూమిమీద ప్రజలచేత పూజింపబడేవాడా! దిక్కులన్నిటా వ్యాపించిన గొప్పకీర్తి కలవాడా!; పరాక్రమంచేత భయపెట్టబడిన శత్రువులు కలవాడా! విష్ణుమూర్తితో సమానమైనవాడా! విష్ణువర్ధనమహారాజా!

గద్యము

ఇది సకలసుకవిజనవినుత నన్నయభట్టప్రణీతం బైన శ్రీమహాభారతంబునం దాదిపర్వంబున విదురాగమనంబును, గృష్ణసందర్శనంబును, రాజ్యార్ధలాభంబును, ఖాండవప్రస్థనివాసంబును, సుందోపసుందోపాఖ్యానంబును, నారదువచనంబున ద్రౌపదియందు సమయక్రియయు, నర్జునుతీర్థాభిగమనంబును, నులూచిసమాగమంబును, జిత్రాంగదయందు బభ్రువాహనుజన్మంబును, ద్వారకాగమనంబును, వాసుదేవానుమతుం డయి యర్జునుండు సుభద్ర వివాహం బగుటయు, సుభద్రాహరణంబును, హరణహారికయు, నభిమన్యుసంభవంబును, గాండీవ దివ్యరథాశ్వలాభంబును, ఖాండవదహనంబును, నగ్నిభయంబువలన మయభుజంగమోక్షణంబును, మందపాలోఖ్యానంబును నన్నది సర్వంబును నష్టమాశ్వాసము. 325

శ్రీ మహాభారతమునందలి యాదిపర్వము సమాప్తము

తాత్పర్యం: ఇది ఉత్తమకవులందరిచేత స్తుతింపబడిన నన్నయభట్టు అనే పేరుగల కవిచేత రచింపబడిన శ్రీమహాభారత మనే గ్రంథంలో మొదటిదైన ఆదిపర్వంలో - విదురునిరాక, శ్రీకృష్ణుడు పాండవులను దర్శించటం, అర్ధరాజ్యం

పాండవులకు లభించటం, ఖాండవప్రస్థంలో పాండవులు ద్రౌపదియందు నియమాన్ని పాటించటం, అర్జునుడు తీర్థయాత్రలకు పోవటం, అర్జునుడు ఉలూచిని కూడటం, చిత్రాంగద బభ్రువాహనునికి జన్మనివ్వటం, అర్జునుడు ద్వారకానగరానికి రావటం; వాసుదేవుని అంగీకారంతో అర్జునుడు సుభద్రను పెండ్లాడటం, సుభద్రను తనతో తీసికొనిపోవటం, సుభద్రకు యాదవముఖ్యులు అరణాలను అందించటం, అభిమన్యుడు జన్మించటం, గాండీవం, దివ్యరథం; దివ్యాశ్వాలూ అర్జునుడికి లభించటం, ఖాండవవనాన్ని దహించటం, అగ్నిభయంనుండి మయుడిని, అశ్వసేనుడిని రక్షించటం, మందపాలునికథ - మొత్తం ఎనిమిదవ ఆశ్వాసం.

ఆదిపర్వంలో అష్టమాశ్వాసం సమాప్తం.

శ్రీమహాభారతంలో ఆదిపర్వం ముగిసింది.

శ్రీమదాంధ్ర మహాభారతము

సంపుటం -2

ఆదిపర్వము

రెండవ భాగము (5, 6, 7, 8 ఆశ్వాసములు)

గద్యపద్య ప్రథమపాదసూచి

పద్యము	పుట
అ	
అంగరాజ్యలక్ష్మి	920
అంగములలోన	472
అంత	474
అంత	597
అంత	619
అంత	674
అంత	688
అంత	810
అంత	895
అంత	954
అంత	971
అంత	978
అంతఁ గౌంతేయుఁడు	618
అంతఁ గృష్ణద్వైపాయనుండు	542
అంతఁ బ్రభాతం బగుటయు	612
అంతకు ముందఱ	713
అంత దానివినయంబునకు	683
అంత దేవతలెల్ల	974
అంత ద్రుపదరాజనందనయుం	958
అంత ద్రోణుచేత	599
అంతనట	528
అంత ననంతబల	589
అంత నయ్యర్జునుండు నవ్వింటి	803
అంత నయ్యేవురు నయ్యయి	824
అంత నర్జునుం డనిల	603
అంత నాక్షత్రియు లొక్క	779
అంత నాదిత్యుం	479
అంత నారాక్షసులు	717
అంత నారాజనందనులు	799
అంత నొక్కయశరీరవాణి	980
అంత నొక్కనాఁడు	750
అంత భీమదుర్యోధనుల	591
అంత విదురప్రేషితుండైన	659
అంత సభాపాలుండు	947
అందమరబృందవంద్యున	942
అందుఁ గరమొప్పి సుందరీ	585
అందు ధృతిమందరుండు	937
అందు నిత్యంబును	912
అందును గోదాన భూదాన	916
అందులకుం బోవుద మనినం	734
అందుల కేఁగి యే నిందీవర	928
అంబుజమిత్రుఁ డంబుద	820
అంబురుహాప్తుఁ డస్త	663
అక్కట దుఃఖాతిశయంబున	707
అక్కట పురోచనుం డొక్కరుండ	860
అక్కథకుండు శౌనకాది	467
అక్కథకుండు శౌనకాది	583
అక్కథకుండు శౌనకాది	721
అక్కథకుండు శౌనకాది	855
అక్కన్యయు నట్టి	477
అక్కశ్యపుండును జనుదెంచి	529
అక్కుమారుల ధనుర్విద్యా	576
అక్కుమారులు వాని	572
అగ్నిదేవుం డప్పుడు	989
అగ్నిదేవుండు బృహస్పతి	740
అగ్ని నేను నాకు నాహార	961
అగ్ని హుతిఁ జేసి మానవ	787
అజినోత్తరీయుల నతి	828
అట పాండవులును	662
అట వాసుదేవుండు	858
అట వైవస్వతుండును	842
అట హస్తిపురంబున	654
అట్టి కృపాచార్యు రావించి	554
అట్టి ఘర్మదివసంబులు	959
అట్టి చిత్రవధం జూచి	680
అట్టి బ్రహ్మతేజోజనితం బయిన	766
అట్టి మహాద్వంద్వయుద్ధంబున	620
అట్టి మహాబాహుఁ	926
అట్టి మహోత్సవంబు చూడ	791
అట్టి యవసరంబున	561
అట్టి యవసరంబున	587
అట్టి యవసరంబున	795
అట్టి యవసరంబున	815
అట్టి యవసరంబున	982
అట్టియెడ	676

పద్యము	పుట
అట్టి వజ్రకాయుండు	708
అట్టి వ్యుషితాశ్వుండు	505
అట్లయగునేని యిక్కన్య	832
అ ట్లా క్షత్రియు లందఱు	780
అట్లు నిలిచి రక్తచందన	588
అడవులు నేఱులు నివి	738
అడుగకయు విప్ర	734
అతగులచే ద్రుపదుఁ డనవ	614
అతని నియమించినట్లు	826
అతని తపంబు	782
అతిథియై వచ్చిన	703
అతిదురితక్రియాభి	658
అతిమానుష మత్యద్భుత	992
అతిరౌద్రాకారలీలా	485
అతులప్రతాపలీలా	484
అతులబలప్రతాప	504
అది కారణంబుగా	498
అదియును గొండొక	840
అదియును బురంబు	794
అదియును సురేంద్ర	902
అది యెట్లనినం బుత్త్ర	864
అధికవీరుండు రక్కసుఁ	672
అనఘచరితుఁడు	726
అనఘులు కృతమంగళాభి	851
అనఘులు నరనారాయణు	992
అనఘు వేదాధ్యయనాసక్తు	893
అనపత్యుఁడనై	502
అనవద్యు వేదవేదాంగ	746
అనవరతము	557
అనవరతవేదాధ్యయన	774
అనవుడు ధృతరాష్ట్రుఁడు	594
అనవుడు నిద్దఱుఁ	905
అని కఱపినట్ల	776
అని కుమారుల నెల్లం జూపి	567
అని కేలు మొగిచి	477
అని గర్వించి	601
అని గాంధారిం బదరి	515
అని తత్ప్రభావప్రకారంబు	970
అని తనభార్యయైన	777
అని తన్ను నిందించి	492
అని తమలో విచారించి	536
అని తానును భీమ	809
అని దుఃఖించి	501
అని దుఃఖితయై	987
అని దుర్యోధనుండు	861
అని ధరణినుండి	805
అని ధర్మరాజు నభిషిక్తుం	885
అని ధృతరాష్ట్రబాంధవంబు	666
అని ధృష్టద్యుమ్నుండు	796
అనినం గర్ణుండు	608
అనినం గుంతి యట్ల	693
అనిన గంధర్వుం డి ట్లనియె	760
అనిన గంధర్వుండు	788
అనిన దాని కర్జునుం	914
అనిన దానికి రుద్రుం	841
అనిన నందఱకు	883
అనిన నగుచు ధర్మతనయుండు	649
అనిన నగుచు వాసుదేవుం	820
అనిన నగ్నిదేవుండును	967
అనిన నట్ల చేయుదు నని	584
అనిన నది యట్లేని	841
అనిన నది యెట్టు లని	898
అనిన నన్నారదు	927
అనిన నమరపతి	843
అనిన నమ్మందపాలు	985
అనిన నరుఁడు వల్లె యని	741
అనిన నర్జుననకు	749
అనిన నర్జునుండు	920
అనిన నవనతానన	915
అనిన నాద్రుపదునకుఁ	835
అనిన నారద మహాముని	906
అనిన నినతనయు	599
అనిన నీకెద్ది భోజనం	961
అనిన నుపయాజుండే నిట్టి	725
అనిన నౌర్వుండు	785
అనిన రుద్రుం డలిగి	845
అనిన వసిష్ఠుఁ	764
అనిన వాని కర్జునుం	744
అనిన వానికి నర్జునుం	749
అనిన వారలకు	863
అనిన వారిపలుకులు	473
అనిన వాసుదేవుం	883
అనిన విని కర్ణుండు	604
అనిన విని కర్ణుండు	812
అనిన విని కురుకుమారు	573
అనిన విని జనమేజయుండు	550
అనిన విని జనమేజయుండు	962
అనిన విని జనమేజయుండు	983
అనిన విని దుర్యోధనున	606
అనిన విని ద్రోణుం డదరి	574
అనిన విని ద్రోణుండు	578
అనిన విని ధర్మతనయుండు	709
అనిన విని నగుచు	826
అనిన విని నగుచు	931
అనిన విని నరుల	499
అనిన విని పార్థునకు	600
అనిన విని భీమసేనుం	693
అనిన విని మందపాలుండు	984
అనిన విని లపిత	990
అనిన సూర్యుండు	479
అనిన విని హిడింబ	672
అని నియోగించినఁ గుంతియుం	511
అని నియోగించినఁ గుంతియుం	523
అని నిశ్చయించి గొంతిని	495
అని నిశ్చయించి ద్రుపదు	566
అని నిశ్చయించి పంచినం	849

పద్యము	పుట
అని నీచేతఁ బరాజితుండ	742
అని పంచినం బురోచనుం	646
అని పంచిన నదియును	668
అని పంచిన వారును	641
అని పనిచిన నెప్పటియట్ల	516
అని పలికి యప్పుడ	527
అని పలుకుచున్న	818
అని పలుకుచున్న నృప	753
అని పలుకుజనుల	593
అని పాపబుద్ధియందు	546
అని పుత్త్రముఖావలోకన	510
అని పురందరనందనుండు	959
అని పెద్దయుంబ్రొద్దు	763
అని పొగడుచుండ	595
అని పౌరులెల్ల దీవించు	885
అని ప్రార్థించి వెండియు	727
అని భీమసేను	684
అని మాటలాడుచు	792
అనిమిషప్రభుఁడు	944
అని మొననట్లు దాఁకిన	860
అని యగ్నిదేవుఁ డయ్యర్జున	962
అని యడిగిన	983
అని యడిగిన ధర్మ	706
అని యడిగిన వైశంపాయనుం	551
అని యప్పుడ భీష్మ	605
అని యఱచుచున్న	741
అని యాత్మపరిత్యాగంబునందుఁ	696
అని యిట్లు పాండునృప	719
అని యుధిష్ఠిరుండు	883
అనిలం బప్పురిఁ	891
అనిలజ నీ కిట్లని	609
అనిలజుఁ డుగ్రుఁడై	617
అనిలజు పుట్టిన దివసము	517
అనిలసుతుం డంతన	547
అనిలసుతుఁ బట్టికొని	715
అనిలాత్మజు బలమును	576
అని వగచుచు	527
అని వాని నాశ్వాసించి	742
అని విజృంభించి	948
అని విదురునకు	862
అని వితర్కించుచు	752
అని వైశంపాయనుండు	853
అనుచుం బాంచాలుపురం	614
అనుచు నిజజననీ	739
అనుచున్న సమయంబున	874
అనుచు సమీరణసుతుండు	714
అనుజులు నల్వురుం	892
అనుపమకార్ముకాది	624
అనుపమనిత్యసత్య	657
అనుపమరాజ్యవిభూతిం	900
అనువారు నందుఁ గొందఱు	802
అన్న యిది ధర్మువని	683
అన్నవవారివాహనివహ	977
అన్యోన్య ప్రియభాషణు	906
అపుత్రస్యగతి ర్నాస్తి	499
అప్పాండవులతోడి	869
అబ్జజు వీడ్కొని	903
అభిజాతుండవు	880
అభిమానమహార్ణవ	993
అమరగణంబులోనఁ	522
అమరాపగాసుతు	468
అమరావతికి నెన	939
అమరాహీంద్రవియచ్చరాదుల	968
అమరేంద్రసుతుఁడు	947
అమలాచారపవిత్ర	468
అమలినమతి నాత్మ	629
అమవస గావున	498
అమితకృశాను దగ్ధమగు	974
అమితవివృద్ధశోక	771
అమితస్థావరజంగమం	844
అమితోత్సాహుఁడు	802
అమితౌజుండగు వానిఁ	780
అమూల్యమణి	496
అమ్మంత్రముఁ దనదగు	476
అమ్మహాధ్వని విని	677
అమ్మహోగ్రగ్రాహంబు	580
అమ్మహోత్సవము	798
అమ్ముదితఁ జూచి	552
అమ్ముదితఁ జూచి	904
అమ్ముని యొక్కనాఁ డభి	555
అమ్ముని యోగాభ్యాస	984
అమ్మునివరు కఱపిన	687
అయ్యర్జునుతోడి విద్యా	568
అయ్యర్జునుస్తుతి	593
అయ్యవసరంబున	123
అయ్యవసరంబున	602
అయ్యవసరంబున	805
అయ్యాజుండును	728
అయ్యా నీతపోమహత్త్వంబుఁ	782
అయ్యిద్దఱును గృష్ణ	822
అయ్యిరువుర యన్యోన్య	941
అరిగి మహేంద్రాచలమున	557
అరియని విప్రులచేతను	702
అరుదుగ దివ్యరత్న	979
అలఘుండు పౌరవ	757
అలఘుతరంబులై	888
అలఘుతేజుల	645
అలఘుబలుండు	549
అలఘులు కృష్ణపార్థులు	980
అలయక ధర్మశాస్త్రముల	509
అలయక నాఁడునాఁటికి	938
అలయక నిమిత్తజంబగు	784
అలయక పరాత్మ	630
అలిగి యౌడుగఱచి	712
అలినీలకుంతలుం	938
అలుగుదురయ్య	925
అలుగుల పడి ఖాండవమునఁ	974
అవనీచక్రముపాద	590

పద్యము	పుట
అవిరళక్షరితదానార్ద్ర	954
అవిరళభస్మమధ్యమున	798
అవిరళవిషఫణి	548
అసిచర్మకౌశలం	588
అసితపథుఁడు విప్రుం డై	960
అస్త్రవిద్యలు గఱచి	567
ఆ	
ఆ కల్మాషపాదు	769
ఆ కాననాంతరంబునఁ	667
ఆ కృష్ణచతుర్దశినాఁడు	655
ఆగ్నేయశరమున	595
ఆతనిఁ జూచి సహింపక	619
ఆతని యజ్ఞంబున	505
ఆతని యస్త్రవిద్యా	569
ఆ తనూజుల	518
ఆ తరుణి కటాక్షేక్షణ	552
ఆ తరుణియందుఁ	758
ఆదిఁ గోలెను గృష్ణచే	957
ఆ దిక్కున కాక్షణంబ	663
ఆదిత్యునకుఁ బుత్రి	749
ఆదిని సంయోగవియోగా	694
ఆది భరద్వాజుఁ డను ముని	723
ఆ దుర్యోధనుఁడుద్భవిల్లుడును	517
ఆ ద్రుపదుండు దనకూఁతు	722
ఆనకదుందుభిప్రభృతి	953
ఆ నరుమీఁద ఘోరనిశితాశని	977
ఆపదయైనను ధర్మువ	681
ఆ పవనజు నతిఘన	547
ఆయతబాహుఁ డాతనికి	877
ఆ యముగర్వమున్	470
ఆయుధవిద్యలయందు	627
ఆ రక్కసునకే నశనం	696
ఆ రాక్షసుండు భీము	677
ఆ రాజసుతుల విద్యా	590
ఆర్యవృత్తుండు	866

పద్యము	పుట
ఆ లలితాంగిఁ జూచి	923
ఆ లలితాంగియందు	817
ఆలికి నెయ్యుండవయి	991
ఆ వారిధారలెల్ల	975
ఆ విశ్వామిత్రుం డిక్ష్వాకు	767
ఆ వైవస్వతువీర్యము	843
ఆసన్నపలితు ననఘు	563
ఆహవభూమిలోనఁ	877
ఇ	
ఇంక నెవ్వండు రక్కసు	717
ఇంకనైన మమ్ము నెఱుఁగంగ	622
ఇంచుకయేని పాపమున	713
ఇంతులగోష్ఠి నున్న	746
ఇంతుల నిమిత్తమున	906
ఇందీవరలోచన	857
ఇందుఁ బుట్టిన సుతుఁడు	920
ఇందుల కిమ్మోయిన్	668
ఇందు లక్ష్య మెవ్వఁ డేసె	797
ఇందు సుఖ ముండితిమి	692
ఇంద్రసమానున	731
ఇంద్రియార్థంబులం	494
ఇంద్రుండు నుపేంద్రార్జునుల	992
ఇక్కుమారుండు	781
ఇక్కుమారున కెందు	475
ఇట పాండవకౌరవ	571
ఇట వారణావతంబున	657
ఇట్టిదేని మనకు	652
ఇట్టి యింద్రప్రస్థ	892
ఇ ట్లక్కన్యక పెఱుంద	844
ఇ ట్లడిగినఁ గుంతీదేవికి	700
ఇ ట్లతినిష్ఠ నేకపాద	521
ఇ ట్లదృశ్యంబయిన	753
ఇ ట్లరిగి జనార్దనుండు	934
ఇ ట్లరిగి యర్జునుండతి	909
ఇ ట్లరిగి వనంబులో	571

పద్యము	పుట
ఇ ట్లశ్రమంబున	579
ఇ ట్లింద్రప్రస్థపురంబున	950
ఇ ట్లుండి యొక్కనాఁడు	921
ఇట్లు కావించిన	976
ఇట్లు చతుర్విధా హారంబుల	762
ఇట్లు దనకడకు వచ్చిన	930
ఇట్లు దనయిష్టంబు	567
ఇట్లు దనవలన విలువిద్య	724
ఇ ట్లుదయించిన	957
ఇట్లు దలంచిన	757
ఇట్లు దుర్యోధనుండు	550
ఇట్లు ద్రుపదుండు ద్రోణుచేత	623
ఇట్లు ద్రోవదిచేత	952
ఇట్లు నారాయణుండు	945
ఇట్లు పట్టుకొని	905
ఇట్లు పరమపురుషు	932
ఇట్లు పరాశరుండు	787
ఇట్లు పాంచాలియందు	818
ఇట్లు పాంచాలు బాణవృష్టికి	616
ఇట్లు పాండవులు ద్రుపదు	859
ఇట్లు పాండుకుమారు లపార	625
ఇట్లు పాండురాజు	486
ఇట్లు పితామహుండు	899
ఇట్లు పుట్టిన	730
ఇట్లు పుత్త్రోదయంబునఁ	514
ఇట్లు పెక్కువిధంబుల	773
ఇట్లు బకాసురుండు భీము	717
ఇట్లు బ్రహ్మోత్తరంబుగా	469
ఇట్లు బ్రాహ్మణశాపంబునం	770
ఇట్లు భీమబకాసురు	715
ఇట్లు భీమసేనుం డిష్టాన్నోప	711
ఇట్లు మన్మథవ్యథా	670
ఇట్లు రాజపుత్త్రు లవ్విల్లు	801
ఇట్లు రాజ్యంబు సేయుచు	470
ఇట్లు వచ్చిన కృష్ణద్వైపాయనునకుఁ	833

పద్యము	పుట
ఇట్లు వచ్చిన వేదవ్యాస	685
ఇట్లు వసునివహంబుతో	482
ఇట్లు వాసుదేవుండు	943
ఇట్లు విశ్వామిత్రుండు	766
ఇట్లు వేల్చి ముందఱ	852
ఇట్లు శతశృంగంబున	498
ఇట్లు శాపవిముక్తుండై	775
ఇట్లు సద్యోగర్భంబునం	689
ఇట్లు సర్వభూత	532
ఇట్లు హితోపదేశంబు	907
ఇ ట్లేకోత్తరశతపుత్త్రులం	518
ఇ ట్లేసి యబ్బాణంబులు	490
ఇ ట్లొక్క నిమిషంబున	758
ఇతని విక్రమ	707
ఇది తొల్లి నాలాయనియైన	838
ఇది దేహం బిది యర్థం బిది	574
ఇది నావల్లభ	904
ఇది పరమసాధ్వి	683
ఇది ప్రళయాగ్ని	986
ఇది యాదిగా సతు లెన్నండు	507
ఇది యెట్లున్ సమకూర	800
ఇది యేమి తెఱఁగు	700
ఇది సకలసుకవిజన	262
ఇది సకలసుకవిజన	720
ఇది సకలసుకవిజన	853
ఇది సకలసుకవిజన	994
ఇది సారంగ నసాధ్య	921
ఇది హిడింబువనంబు	671
ఇద్దఱ హుంకృతిధ్వనులు	714
ఇనసమతేజులై	491
ఇప్పాండుపుత్త్రుల నేలకో	647
ఇప్పావగృహప్రకారంబు	653
ఇమ్మనుజేంద్రనందను	802
ఇమ్మాంస పేశి	515
ఇమ్ముగ నాత్మరక్ష	631
ఇమ్ముగ విశ్వకర్మ	887
ఇలఁ గీర్తి యెంతకాలము	870
ఇల నర్ధరాత్రమును	737
ఇవ్వేళయందుఁ	737
ఇవ్విహాయసలక్ష్యం	826
ఈ	
ఈకార్యసిద్ధి యగుడును	646
ఈకులము వివర్ధింపగ	471
ఈగృహకుడ్యంబులు	651
ఈచక్రము మధుసూదన	970
ఈతఁ డనవరతయజన	964
ఈతనిచేతఁ దొల్లియుఁ	705
ఈతన్విఁ దోడ్కొని	816
ఈదేవియును బతితోడన	540
ఈబాలు నెత్తుకొని	481
ఈయుపాయంబులలో	866
ఈరంగభూమి యస్త్ర	600
ఈరథ మప్రతిహతము	970
ఈరాజ్యంబు మొదలింటంగోలె	639
ఈ వంశము విచ్ఛేదము	471
ఈ విల్లుమోపెట్టియేను	796
ఈవ్యాధియొంటఁ దీఱదు	965
ఈహితకార్యసిద్ధి	833
ఉ	
ఉడుగక యే మహితముఁ	874
ఉత్తమక్షత్రియప్రవరోప	608
ఉత్తమక్షత్రియుం	708
ఉత్సవసందర్శనోత్సుకులై	815
ఉపాంశువధఁ జేసి	545
ఉరుతరదావపావక	958
ఉరుశార్దూలభయంబునఁ	520
ఉరుసరసీవనంబులు	734
ఉఱఁడు సురేంద్రునైన	671
ఉఱుముచు మెఱుముచుఁ	975
ఉల్లాసంబులాడి	724
ఊ	
ఊర్జితులు యుధిష్ఠిర	528
ఋ	
ఋతిమతి వయిన	506
ఎ	
ఎంతకుఁ గృతకార్యుం	843
ఎంత తపం బొనరించియు	984
ఎంత మిత్రులైన	744
ఎందుండి వచ్చి తిందుల	563
ఎట్టి రాజులును	768
ఎట్టి విశిష్టకులంబున	493
ఎట్టు సూచి సూచి	695
ఎఱుఁగఁ జెప్పు మబల	753
ఎఱుకలేమిఁజేసి	478
ఎఱిఁగితిమి దీని	652
ఎఱిఁగి నాకుఁ జెప్పు	693
ఎఱుకగలఁడేని	784
ఎల్ల కార్యగతులు	649
ఎవ్వరికిని మోపెట్టను	733
ఎవ్వరును నేమి సేయుదు	883
ఏ	
ఏనకా దిక్కన్యక	832
ఏ నమితభోజనుండ	961
ఏను ధర్మపథంబున	768
ఏను ద్రోణుం డనువాఁడ	563
ఏను నీచెప్పిన	812
ఏనును దీనిన తలఁచి	704
ఏనును బ్రజలును	694
ఏను భారద్వాజుండ	557
ఏను మంత్రశక్తి యెఱుఁగక	478
ఏను మిమ్ము నెఱింగియు	745
ఏను మీ దృష్టులు	781
ఏను మీయానతిచ్చిన	966

పద్యము	పుట
ఏ నులూచియును	914
ఏను వందయును	923
ఏ నెల్లప్రొద్దు నాయెడలోనఁ	640
ఏ నేమి సెప్పుదు	700
ఏమి కారణమున	962
ఏమి దోషంబు	807
ఏము రాగకారణ	925
ఏల దీని నెడయుఁ	612
ఏల పార్థు పరాక్రమంబు	948
ఏల యమ్మున్ని నాకు నిచ్చె	480
ఏల రాఁ బనిచెన్	807
ఏలావనరమ్యము	917
ఒ	
ఒక్కపురుషునకు	832
ఒలసి యెంతకాల	698
ఒవ్వమిఁ గౌరవులకుఁ	820
ఔ	
ఔరసక్షేత్రజ	502
క	
కడఁగి ద్రుపదానుజుఁడు	619
కడఁగి మదీయాస్త్రముల	808
కడఁగి వృకోదరుఁ	715
కడఁగి సూతుండు	607
కడవసములుఁ గోలలుఁ	824
కడుఁ బెద్దకాల ముండితి	733
కడునలుకయుఁ గూర్మియు	632
కడునిద్రఁ గానక	656
కడుపునిండఁ గుడువఁ	710
కని త మ్మెఱింగించి	819
కని యనిమిషలోచనుండయి	751
కనియె నొక కన్యఁ	751
కని వినయమ్మున	735
కని వినయమ్మున	792
కమనీయలీల నొక్కట	540
కమలభవుఁడు వారి	900
కమ్మనిలతాంతములకు	530
కరిఘటలఁదాకి భీముఁడు	617
కర్ణశల్యులు మొదల్గాఁ	859
కర్ణుండున్ విజయుండు	810
కర్ణుండును జనుల నందఱ	598
కర్మబంధనములు	548
కఱకుదర్పపూరి	823
కలధనమెల్ల ముందఱ	557
కలయ నసి ముసల దండం	615
కళింగవిషయంబు	917
కవలవారు సూర్యేందు	528
కాంతివిశేషవిలాస	848
కాదేని నాకు నీ పుణ్యమూర్తి	506
కామవ్యామోహితుండయి	493
కాలమేఘంబునుబోలె	674
కావునఁ జతురంగబల	868
కావున ధృతరాష్ట్రునకు	471
కావున నిప్పుడ	519
కావున నీవు మెచ్చిన	988
కావున నేను భవద్విహీన	697
కావున మన మిందు	652
కావున మా చేసిన	926
కావున మీర లేమఱక	649
కావున లోకంబులయందు	785
కావున వ్రతదానంబు	911
కావున సర్వప్రకారంబుల	634
కిందముశాపము డెందము	533
కీర్తియు నపకీర్తియు	870
కీర్తి లేనివానికిని	869
కుంతిభోజాధిపు కూఁతురు	664
కుంతి యంత సహజ	611
కుంతియు నమ్మునివరు	476
కుంతియు దాని	691
కుడుచునెడవాని	838
కురుకులజుండు పాండునకుఁ	603
కురుకులవిభుఁడగు	513
కురుపతి సూడఁగఁ	810
కురుముఖ్యులు ధృతరాష్ట్ర	883
కురువంశనిస్తారకులఁ	534
కులపవిత్రసితేత	729
కులపాంసనులై	666
కులము గలవాఁడు	604
కులమునకు నఖిల	519
కులమును రూపము శీలము	474
కూడి జలక్రీడ లాడుచో	544
కృత మెఱుఁగుట పుణ్యము	692
కృపుఁడు ద్రోణుండు	550
కృష్ణమృగాజినధరుఁ	792
కొడుకుం ద్రిలోకవిజయుం	521
కొడుకు పల్కు విని	685
కొడుకు భుజవిక్రమమునకుఁ	979
కొడుకుల నిందఱ కిల్లడ	536
కొడుకుల బ్రహ్మవిత్తములఁ	987
కొడుకుల యభ్యుదయము	862
కొలఁ యెఱుంగ కిట్టి	559
కోడలి యుత్తమగుణముల	856
కోరిన కోర్కికి	526
క్రచ్చఱ నొక్కరక్కసుఁడ	673
క్రమమునను	955
కృతమెఱుఁగుట	692
క్రూరకర్ము లయ్యు	910
క్రూరులు విలుప్తధర్మా	542
క్వణదణు కింకిణీ	935
క్ష	
క్షత్రియులము పాండుప్రియ	830
ఖ	
ఖలు నసుర నోర్వనోపెడు	705
ఖలుఁడై ధృతరాష్ట్రుఁడు	665

పద్యము	పుట
గ	
గంగాధర పింగజటా	912
గగనమునందు నెందు	750
గర్వించి పలికి	845
గాడ్పుచూలి పిఱుఁదుఁ	865
గెలుపునెడ నేయునెడ	544
గుణముల నొప్పి	776
గురుకుచయుగ్మముల్	933
గురుగుణయుతులగు	881
గురులలోనఁ బరమ	836
గురువచనస్థితి	818
గురువచనానంతరమున	578
గుఱుకొని కార్యాకార్యము	628
ఘ	
ఘనధూమధ్వజదహ్యమాన	972
ఘనపాశములఁజేసి	773
ఘనభుజ యిదిగాండీవం	969
ఘనభుజుండు నరుఁడు	950
ఘనభుజుండు రాధయను	482
ఘనమగు విక్రమంబునన	867
ఘను లయ్యిరువురు	904
ఘృతనదులును	762
ఘోరాకారులు కృతహాహా	786
ఘోరాస్త్రశస్త్రవిద్యల	584
చ	
చందనతమాలతరులందు	531
చక్కనగు మనిన రక్కసుఁ	675
చక్రధరుం డయ్యు	971
చతురుదధివలయ	856
చని ఖాండవంబుఁ గాల్పఁగ	965
చనుదెంచి ముందట	712
చనుదెంచి శరద్వంతుండ	553
చరణహతిన్ మహాతరులు	676
చారుమణి ప్రభాపటల	847
చారుమనస్సమ్మద	593
చారుసువర్ణహాసి	532
చెప్పు మని యర్జునుం	761
చెలఁగె సురదుందుభి	805
చెలియలు మఱఁదియుఁ	952
చేసమరికొంచుఁ బొడువఁగ	675
జ	
జగదభి వంద్యుఁ డాక్షణమ	756
జననుత బ్రాహ్మణకార్యము	709
జననుత యాగ్రమానిని	577
జననుత యేను	670
జననుతుఁడు పాండు	927
జనపతి పనుపఁగ	548
జనపతియైనవానికిఁ	636
జనపాల మందపాలుం	983
జనపాలుఁడు మృదు	629
జనమేజయ జనపాలున	993
జనమేజయునకు వైశంపాయ	963
జనితామర్షణుఁ డంత	601
జనుల ఆశీరవంబును	852
జనులెల్లం గడు	597
జలజప్రియతేజుల	690
జలములంద యుండు	785
జలరుహనాభ	959
జ్వలనంబువాయు	988
జ్వలనశిఖాలియున్	972
జ్వాలాభీలాంగుఁడు	729
త	
తంత్రిచేయు తిలోదకదాన	698
తక్షకుం డను పన్నగేంద్రుఁ	962
తగఁగ వివాహం	942
తడయక సామభేదముల	634
తత్సమీపంబున	667
తదనంతరంబ	658
తదీయాభిప్రాయం బెఱింగి	765
తన కపకారము మునుఁ	633
తన కిమ్మగునంతకు	632
తనతేజోజాలము	973
తనపలుకు లోక మెల్లను	834
తనపిఱుందన వచ్చు	648
తనభార్యకు రాధకు	482
తనయుల నజాతపక్షుల	986
తనరిరి తద్దేశంబున	894
తనరుచు దైవయుక్తిమెయి	871
తనవగచిన కార్యము	644
తనవిద్యపేర్మి నృపనందన	807
తనసుతులు పాండుసుతు లని	543
తమకుం దార యజేయు	876
తమము నడంచుచున్	890
తమ్ముల యట్టుల తనకు	878
తమ్ములుఁ దానును	896
తరుణుల నజాతపక్షులఁ	990
తఱియగునంతకు రిపుఁ	632
తల్లియుఁ బుత్త్రు లేవురు	880
తా నొక్క మునికన్య	735
తామరసనేత్ర నీపే రేమీ	914
తాలాభమగు విల్లు దాల్చి	809
తిలాణుమణికోటి	902
తివిరి యభోజ్యంబగు	770
తూ ర్వరుణంబుగాఁ దొడఁగె	679
తేజితబాణహస్తు	572
తొల్లింటి మహాత్ములయందును	848
తొల్లి దితిపుత్త్రుండైన	898
తొల్లి దేవేంద్రుండు	732
తొల్లి యగస్త్య మహామునీంద్రుండు	492
త్రిదశాధినాథ సదృశుఁడు	540
త్రిభువనలక్ష్మి యేతెంచి	751
త్రిభువన సామ్రాజ్యశ్రీ	664
ద	
దక్షాధ్వరమథనునకుఁ	842
దక్షిణగంగనాఁదద్దయు	917
దక్షిణపాంచాలంబు	734

పద్యము	పుట
దక్షిణాంగుష్ఠ మిచ్చిన	575
దానంజేసి మహీతలంబునం	759
దానంజేసి విగతజీవుండై	533
దానచేసి పౌరజానపద	635
దానములం దపంబుల	501
దానిం జూచి దారిద్ర్యంబున	565
దానిం జూచి పాండురాజు	520
దానిం జూచి భీముండు	607
దానికడకుఁ బ్రత్యేకంబ	840
దాని దయినపతిభక్తి	839
దాని ధృతరాష్ట్రుండు	543
దానిన్ నేరక యందఱన్	580
దాని నశ్రమమునఁ	922
దాని నెఱింగి పరాశర	514
దాని నెఱింగి శరద్వంతుండు	552
దాని విడిపింప ద్రోణుఁడు	579
దాని విని పాండునందను	733
దాని వెల్వడ నేరక	976
దాని సహింప నోపక	545
దాని సుభద్రఁగా నెఱిఁగి	935
దారుణజానుదండమున	716
దారుణమౌ వృకోదరు	617
దీనికంటెను నొప్పెడివాని	763
దీనికి సదృశముగా	606
దీని తెఱఁ గెఱిఁగినట్ల	652
దీని నగస్తి నాఁబరగు	626
దీని నెఱింగి మీకు హితోప	686
దీని నొరున కీఁ గా దనిన	764
దీని బాణపరంపరం జేసి	562
దీని మానవులయందుఁ	626
దీనియందు రాక్షసభావంబు	681
దేవా నీ ప్రసాదంబున	964
దేహనాశంబుతోడన	501
ద్రోణాచార్యు పిఱుంద నొప్పి	588
ద్రోణుండును నర్జునుచేసిన	621

పద్యము	పుట
ద్వాదశమాసికవ్రతము	915
ద్వాదశమాసికవ్రతము	930
ద్విజవరవినిర్మితములగు	901
ద్వైపాయనుండును ధౌమ్యుండు	887
ధ	
ధనదానములను బ్రియ	655
ధనపతితో దరిద్రునకు	559
ధనపతుల బాలురు	564
ధనమున విద్యను సంతతిఁ	522
ధనములతో నత్యుత్తమ	558
ధన్యుండ నైతి నీ కీకన్యక	919
ధన్యుల కా సుభద్రకు	956
ధరణిఁ గల రాజులెల్లను	733
ధరణి నతిప్రతాపబల	754
ధరణిప్రజ ధర్మసుతు	894
ధరణీసురుల గురులఁ	912
ధరణీదిశా ప్రసారిత	663
ధరణీధరుచక్రమునకుఁ	980
ధరణీరాజ్య విభూతియు	536
ధరణీశ నందనుల్	806
ధరణీశుఁ డుద్యతదండుఁడై	628
ధరణీసురవరులకుఁ	909
ధరణీసురు లాదిగ	513
ధర్మతత్త్వజ్ఞుఁ డీ ధర్మతనూజుండు	837
ధర్మసుతుఁ డున్నచోటను	735
ధర్మసూక్ష్మత నిర్ణయింప	836
ధర్మార్థవిత్తముల్	875
ధవళ విభూషణ	795
ధీరమతియుతులతోడ	629
ధీరుఁడు యతిరూపంబున	937
ధీరులౌ ధృతరాష్ట్రపాండు	869
ధృతరాష్ట్రకుమారకు	615
ధృతరాష్ట్రు నెయ్యమున	544
ధృతిఁ జదువుచు భిక్షార్థము	690
ధృతి దఱిఁగి మోహమూర్ఛా	602

పద్యము	పుట
ధృతి నెవ్వనినేని	760
ధృతిసెడి వేఁడెడువానిని	704
ధృతిహీనుల చిత్తముల	924
ధౌమ్యుండును వారి నతిప్రీతిం	790
ధ్వజినీపాతభరంబునం	484
న	
నగియును బొంకునందు	835
నడురేయి సంధ్యలందును	738
నన్ను గాంధర్వ వివాహంబున	754
నన్ను నీ నర్వులెల్ల	941
నన్నును మిమ్మును రక్షించి	678
నన్నేల యుపేక్షించితి	765
నరనుతకీర్తి యీయనిల	706
నరవరుఁడైన భీము	688
నరుఁ డస్త్ర శస్త్ర విద్యా	508
నరునకు దయ నిట్లానంద	944
నరు నింద్రాత్మజు నింద్రా	592
నరు నునికి యెఱిఁగి	929
నలసారము సంసార	693
నలిరేఁగి కడఁగి తద్బల	766
నలువురుదమ్ములున్	623
నలుగురు నాలుగువేదమ్ముల	989
నాకంటెను మీకంటెను	573
నాకుం బరమవిశ్వాసివి	645
నాకుఁ బతివయిన నిన్నుం	670
నాకుఁ బుణ్యలోకంబులు	984
నాకెడ యిమ్ము లెమ్ము	533
నాదు రోదనంబు నన్ను	844
నానాద్రవ్యనిరంతర	488
నానావిధమార్గణముల	616
నానావిధశరశరధుల	561
నానావిహారశైలోద్యాన	630
నాయందు నీకుం బ్రియంబు	755
నాయెదురఁ జక్కనై	811
నాయొద్దన ప్రార్థించిన	991

పద్యము	పుట
నారదుఁడు వచ్చుఁ దద్వచ	895
నా వచనంబున	841
నా వచనమున నపత్యముఁ	527
నిత్యంబు నిలువరుస	701
నిమిషాంతరమున	804
నిరుపద్రవసుఖనిద్రా	675
నిరుపమకీర్తి	515
నిరుపమపరార్ధ్యరుచి	954
నిశితశరవర్షమున	979
నీకఱపుల నిక్కురుకుల	874
నీగుణములు దొల్లియు	914
నీచేత ననుజ్ఞాతులై	881
నీతోడ సఖ్యంబుఁ జేసెద	745
నీదు కులమునకుఁ దగఁగఁ	607
నీయాగ్నేయాస్త్రంబున	742
నీయిష్టసఖుం డయిన	981
నీరిలోనఁ దోఁచు తారక	561
నీలజీమూతంబులీల	678
నీవ కడునేర్పుకాఁడవు	598
నీ వఖిలధర్మమూర్తివి	985
నీ వప్రాకృతబలుఁడవు	811
నీవును ద్రోణుండును	883
నీవును భీష్ముఁడు ద్రోణుఁడు	879
నీవు లౌకిక వైదిక ధర్మ	832
నీవు సుభద్రయందు	936
నీ వెఱుఁగకుండ గర్వము	949
నుతముగ నస్మత్కుల	760
నెగయుడు నెగసి పిఱుందం	973
నెమ్మిఁ జని ఖాండవప్రస్థమ్ము	886
నెమ్మి నీ దక్షిణహస్తమ్మున	575
నెఱికురులున్ విలోలసిత	752
నేఁడు పుణ్యదినము	849
ప	
పంకజాక్షి నీపతి ప్రతిపక్ష	951
పంబినశోకభారమునఁ	772
పంబి యజనాధ్యయనదానం	894
పక్షిశిరంబు దిరంబుగ	578
పడినయామిషంబు	697
పఱుగఁ గని సైతురేనియు	492
పతి నియోగించిన దానిం	509
పతియు లేక జీవించు	505
పదుమూఁడగు మాసంబున	918
పన్నగవైరి విక్రముఁడు	674
పరచక్రపతులచే	638
పరమతపోనిలయు	787
పరమద్విజశుశ్రూషా	895
పరమబ్రహ్మణ్యు	929
పరమమునులయిన	980
పరమాన్న భక్ష్య భిక్షా	691
పరమాస్త్రైకవిశారదుల్	620
పరమేశ్వరుండును వానికిం	919
పరమోపకారియైన	692
పరశురాముఁ డొండె హరుఁ	813
పరహితఫలవంతులు	666
పరాశరుండును బులస్త్యాది	787
పరిఘుజలంబులం	890
పరులకు దుష్కరంబయిన	814
పరులవలన బాధ	765
పరువడి నొండొరుం బెనఁగి	714
పఱవనోపకయున్న	491
పలుకులఁ జెయ్వులఁ	863
పలుదెఱంగుల పిండివంటలు	710
పలుమఱు శపథంబులు	631
పవనతనూజుఁ డక్కమల	688
పశుపతినివాసంబయిన	644
పాండవులును ధృతరాష్ట్ర	886
పాండవులును పరాక్రమ	895
పాండవులును రథంబు లెక్కి	613
పాండుకుమారులం బిలువఁ	642
పాండుకుమారులు ననేక	651
పాండుపుత్త్ర నీవు	748
పాండురాజును బరమోత్సవంబునం	526
పాండుసుతుఁ డంత	975
పాపులై క్షత్రియాధముల్	784
పాయక చీఁకటియందును	569
పిలువంగఁ బడక	600
పుణ్యతపోమయుండు	685
పుణ్యవంతుల నిత్యనైమిత్తిక	901
పుత్త్రుఁడు నీ కుదయించు	521
పురజను లెల్లను	884
పురుషవిశేషవివేకా	564
పురుషుకంటె మున్ను	696
పురుషులచే ధర్మస్థితి	508
పూని పరాక్రమం బెసఁగ	857
పెక్కులు వలుకక	673
పెడిలి సువర్ణపర్వతము	971
పెద్దకాలంబునకు నీయిలు	702
పెద్దవాఁడుండఁ గొండుకవానికి	817
పైతృకంబగులక్ష్మి	638
పొలుపగు రాజ్యసంపదుప	766
పొలుపుగఁ బూసికట్టి	933
పోలఁగ ధర్మశీలుఁడయి	702
ప్రక్షీణదర్పు ద్రుపదు	621
ప్రణమదఖిలధాత్రీ	720
ప్రతిహతరాగకోపభయుఁ	756
ప్రమదాపాదిపయఃప్రపూర్ణ	662
ప్రవిమలాగమతత్త్వవేది	896
ప్రొద్దు నేఁడు పెద్దపోయె	712
ప్రోవైన భస్మంబు వాయఁ	658
ఫ	
ఫలపవనాంబుభోజన	804
ఫలార్థియయినవాఁడు	726
బ	
బద్ధపరంపర నొప్పె	624
బలదేవసాత్యకిప్రద్యుమ్న	952

పద్యము	పుట
బలదేవాచ్యుత సాత్యకుల్	876
బలమఱి కామక్రోధంబులు	760
బలము పెద్ద గలిగి	710
బలయుతులు మనుజసింహులు	981
బలవంతుల్ భరతాన్వయస్థితి	659
బలవంతుల బలమఱఁగా	800
బలవైరి కృష్ణుపైఁ బార్థుపైఁ	978
బలహీనుఁ డైనవానికి	827
బలహీను లైనచో శత్రులఁ	630
బహుగుణ ముత్తమోత్తమము	870
బాధితశత్రువర్గులగు	660
బాలకుం డొక కొండుక	699
బాలుఁ డని తలఁచి రిపుతో	633
బిలము సొచ్చితిమేని	987
బృహదబ్ధిమేఖలాఖిల	606
బ్రాహ్మంబు మొదలుగాఁగల	940
భ	
భరతకులప్రసూతులరు	562
భరతకులశ్రేష్ఠుఁడ వయి	504
భరతకులాగ్రణి	949
భర్తచేత నియోగింపఁ బడక	509
భవత్ప్రసాదంబున	504
భవదనుజ్ఞాగౌరవంబున	640
భానునిభుండు పాండుజనపాలుఁడు	539
భారతవంశాచార్యుఁడు	727
భీమసేనుండును దద్వట	664
భీముండును వాని హీనసత్త్వుంగా	716
భువనైకదీపకుండగు	755
భువనోపప్లవసమయోద్భవ	780
భూజనపరివాదం	911
భూపనందను లివ్విధంబున	576
భూపాలకుండు బ్రాహ్మణ	775
భూరినిజద్యుతితోడఁ	594
భూరిపదఘాతజాతధరా	677
భూరిభుజుం డర్జునుఁ డతి	594

పద్యము	పుట
భ్రమవిమోహ లోభభయ	707
భ్రాజితశాతకుంభగృహ	931
మ	
మండితగుణసంపద	488
మంత్రయుక్తంబుగా	695
మంత్రులు దమతమబుద్ధి	873
మతిఁ దలపఁగ సంసారం	542
మతిఁ బాండుకుమారుల	661
మతిమఱచి యనిస్తీర్ణ	783
మనదుర్యోధను జన్మంబునఁ	519
మన మివ్విధంబునఁ	950
మనసిజరాగంబున	489
మనుకులపవిత్రుఁ బుత్త్రకు	777
మనుజభక్షుఁ డిదియ	701
మనుజులకు నెవ్విధంబున	696
మనుమల నెల్లఁ జూపి	566
మయభుజగమోక్షణము	983
మయుఁడు నశ్వసేనుండును	982
మఱచునొకొ మఱవకుండియు	990
మఱి భీమసేనుండు దొల్లి	867
మఱి యట్లుంగాక	910
మఱి యట్లుంగాక రాజులకుఁ	560
మఱి యదియునుంగాక	608
మఱి యాత్మఘాతంబు	704
మఱియు	729
మఱియు నప్పురంబునం	930
మఱియుం గల వస్తువులెల్లను	497
మఱియుం దనయొద్దకు వచ్చి	829
మఱియుం దొల్లి గౌతమి	836
మఱియుం బాఱెడు	596
మఱియుఁ గామప్రవృత్తుం డయ్యు	748
మఱియుఁ దనకు ధృతరాష్ట్రుం	489
మఱియుఁ దిర్యగ్యోనులయందు	508
మఱియుఁ బ్రతిపక్షసంక్షయ	968
మఱియు గదాకార్ముక	570

పద్యము	పుట
మఱియు గాంధారిందొట్టి	661
మఱియు దుర్యోధన	518
మఱియు ననంతరంబ	556
మఱియు ననేకవినోదంబుల	488
మఱియు నప్పాండురాజు	487
మఱియు నప్పురంబునం	929
మఱియును	566
మఱియును	586
మఱియును	624
మఱియును	731
మఱియును	938
మఱియును	954
మఱియును నొకనాఁ డెవ్వరు	549
మఱియును వారల బల	978
మఱియు నొక్కనాఁడు	548
మఱియు బలదేవాది	955
మఱియు భీష్మానుమతంబున	483
మఱియు మరీచ్యాది	524
మఱియు మాంసపిండంబుల	988
మఱియు మృగశాపభయం	535
మఱియు రెండగు	823
మఱియు వానికంటె	638
మఱియు వారలకాచార్యుండైన	554
మఱియు సకలలావణ్య	847
మలహారినాథ	719
మాకు నతిప్రియుండవు	788
మాకులమునందుఁ దొల్లి	919
మానితంబగు నాతపోమహిమం	783
మానితులైన పాండవ	730
మానుగ రాజకుమారులతో	579
మాపుణ్యంబునం జేసి	897
మీకు నాయం దయ్యెడు	699
మీకులగోత్రనామములు	825
మీపంచిన విధంబున	879
మీయం దీకృష్ణును	791
మీరాజుమనోరథంబు	827

పద్యము	పుట
మీరు ద్రుపదుపురంబునకుం	736
మీరు ధర్మానిలశక్రాశ్వినుల	747
మీరును గుంతియు	643
మీ రెఱుఁగనట్టి లోకాచారము	834
ముదుసలులు దమకిమ్ముగాఁ	873
మునినాథ నాకు సత్సుత	725
మునినాథ నాకు సత్సుత	727
మునిసహస్రపరివృతులయి	538
మునీంద్రా నీయాడనితీర్థంబులుం	939
మృగములమైయున్న మమ్ము	490
మృగశాపభయమున	529
మృదురోమములును	763
మేరునగోత్తంస మహీ	745
మొనసి యపకారిఁ గడనిడి	633
య	
యజ్ఞసేనప్రభు యజ్ఞమహా	790
యజ్ఞసేనుకూఁతు నభిజాత	862
యతిసంఘంబుల సంగతిన్	497
యదుకుల విమలపయః	483
యమతనయు ధర్మరాజ్యము	908
యము లమితశౌర్యు లరినృప	625
యాదవకులవిభుఁడగు	475
యాదవవృష్ణిభోజవరు	861
యాదవుల నాదరింపక	948
ర	
రణరంగంబున ద్రోణు	724
రమణి నిజభ్రాతృనియోగముఁ	669
రవినిభజతేజుఁడైన	881
రవిసుతపార్థుల	602
రాక్షసావిష్టుఁ డైనప్డు	769
రాజకులశేఖర	581
రాజత్కీర్తులు వచ్చి	818
రాజభూషణ నిత్యసత్య	994
రాజయ్యెడువాఁడు	637
రాజరాజగుణరాజిత	853
రాజవరుఁడైన పార్థుతో	605
రాజ్యపదస్థుండ	653
రేయును బగలును	863
ల	
లలితజటాజినకుశ	690
లలితహయద్విపంబుల	485
లలితాంగి యెల్లలో కంబులు	510
లావు సెడఁగ	680
లోకనుతుండు పాండుఁడ	637
వ	
వందురి వగచుచున్న	481
వడముడి యారక్కసు	676
వడిగొని కౌరవు లొండొరుఁ	613
వడి నసురవాత ముక్కున	679
వడి నౌడుగఱచి వలకేల్	799
వదలక పెనంగి	544
వదలక మరణార్థి యగుచు	773
వదలక మ్రుచ్చుల	908
వధకు నర్హుఁడై వచ్చిన	681
వనజాక్షి యేమికారణమున	923
వనజాతాయతనేత్రు	668
వననిధిలోని రత్నములు	888
వలనుగలమంత్రివరులం	641
వలరాజు సచివుల	889
వలవ దుడుగు	814
వల్లె యని రాజనందను	612
వసుదేవాదియాదవ	953
వానితోడిదేమి దివ్య	610
వానిమనోవల్లభకుం	741
వానియవ్యక్తవచనంబులు	699
వారణహస్తానుకారంబు	967
వారణావతమున	650
వారల బలపరాక్రమంబు	878
వారల శరములు నడుమన	615
వారలు ధర్మానిలశక్రాశ్వినులు	846
వారితో విగ్రహించుట	872
వారిదారుణతపోవహ్ని	899
వారు నవ్విప్రునతిభక్తిఁ	960
వాసవనందనుండు గుడువం	569
వాసవసన్నిభుండు	488
వితతప్రదక్షిణావర్తిత	851
వితతబహురత్నరుచి	669
వితతయశుఁ డరిగి	916
విదితంబుగఁ బుణ్యామర	643
విదితముగ నీకు వర మిచ్చెద	506
విదురుఁడు పాండవహితుఁడని	863
విదురుఁ డేతెంచి యొరులకు	649
విద్యావిలాసపార్థివ	853
వినయమున ద్రోణురూపు	570
వినవయ్య కృత్యవీర్యుఁ డను	778
వినవయ్య గౌతముం డన	551
వినవయ్య యే మేవురము	924
విని కుంతియుఁ బాండవులును	683
విని రోయుతీఁగ గాళ్లం	566
వినుఁ డే హిరణ్యధన్వుం	573
విను కార్తవీర్యుకంటెను	523
వినుతధనుర్విద్యావిదు	611
వినుతయశుండు పాండు	486
విను బేల యెట్టికష్టుఁడుఁ	672
విపరీతమతిని	906
విమలమతి యన్యులకు	834
విమలములయి లోకత్రిత	745
విలసద్ధర్మవిశుద్ధవృత్తులు	871
విలసితరాజ్యలీలఁ	858
విలువిద్యఁ గఱచుచుండిరి	550
విలువిద్య నొరులు	573
విలువిద్య నొరులు	575
వివిధాస్త్రకోవిదుఁడు	619
వీఁకఁ బఱతెంచి నలుగడ	946
వీఁడు పుట్టిన పదియగునాఁడు	708

పద్యము	పుట
వీఁడె కృతహస్తుఁ డఖిలాస్త్ర	592
వీఁ డొక మంత్రసిద్ధుండగువిప్రుఁ	718
వీతసమస్తదోషుఁడయి	789
వీరలఁ దోడ్కొనిపోవఁగ	986
వీర లతిలలితమృదులా	499
వీరులు దైవశక్తిఁ బ్రభవించిన	537
వీరికి నిద్రాభంగంబు సేయనోపఁ	665
వీరుఁడగునరుని	811
వీరుఁడు పాండుమహీపతి	520
వీరుఁడు వీఁడు పాండవుఁడు	946
వీరు కుంతీమహాదేవు లని	830
వీరు నమ్మంగఁ దగుదురు	631
వీరు లని పాండుసుతులకు	635
వీ రెవ్వరయ్య ద్రుపద	622
వీ రెవ్వరో యెం దుండుదురో	813
వృక్షశాఖాగ్రమున నున్న	577
వృత్రుపై గీర్వాణవిభుఁ డల్గి	744
వెండియు నశ్వసేను నేయ	976
వెండియు వారల నిమ్ముగా	825
వెడఁగ యిట్టిపాటి	740
వెడఁద యురంబును	823
వెఱచఱవ నీరిలో	579
వెఱచి తల్లిఁ దోఁక	976
వెలయంగఁ బితృమేధ	541
వేఁడు టెంతయుఁ	565
వేడుక నమ్మని	924
వేడుక నొక్కరుండు	547
వేదంబుల్ చదివించె	553
వేదంబులందుఁ బ్రవీణుఁడై	474
వేదము వేదియుం గలుగు	748
వేల్వంగ సమకట్టి	913
వైహాయసంబైన పరమత్స్య	793
వ్యసనవివర్జితమాన	581
వ్యాసపురస్కృతావని	586

పద్యము	పుట
శ	
శక్తి చదువునుబోలె	774
శక్తి రాక్షసనిహతుఁడై	786
శతశృంగనగేంద్రము	525
శతశృంగ నిలయులగు	513
శమహీనుఁడైన విశ్వామిత్రు	761
శరణాగతరక్షణ	982
శరనికరసహస్రంబులఁ	614
శరనిధినినాద	890
శరనిధిపరివృతవిశ్వం	486
శరమోక్షణవేగనిరంతర	619
శాత్రవ జైత్రతేజమున	511
శూరుల జన్మంబు	609
శ్రీజయవిభాసి వినమ	583
శ్రీనాథమూర్తి విభుద	467
శ్రీపతి గడు నెయ్యంబున	932
శ్రీరాజరాజవీర శ్రీరమణీ	721
శ్రీవిభవ నిత్యనిలయ	855
శ్వేతకి నీతపమునకేఁ	963
శ్వేతకియుఁ దనకు	965
ష	
షడరత్నిధనుర్ధరుఁ డెయ్యెడ	728
స	
సకలరాజసమక్షంబున	821
సతికి నొక్కరుండ పతిగాక	841
సతివిముక్త యయినఁ బతికిఁ	697
సద్వినుత చరిత్రుండు	554
సమశీల శ్రుతుయుతులకు	560
సముఁడై యుయుత్సు డయ్యున్నము	549
సరసపురవధూ	525
సరళతమాలతాల	891
సర్వధర్మజ్ఞులరుర్వీశ	897
సర్వలోక కర్మసాక్షి	885
సలలితమైన పుట్టు	479
సవిశేషముగ ధనుర్వేద	554

పద్యము	పుట
సారణసత్యకాక్రూర	934
సాలప్రాంశు నిజోజ్జ్వల	597
సాహసకుండైనరుఁడ	922
సుందరి మాయిద్దఱలో	905
సుతజననోత్సవంబున	956
సుతవంతులయి విశుద్ధ	958
సుతశత వర్జితాశ్రమము	772
సుతుఁడు నభస్వదంశమున	516
సుతుల రాక్షసనిహతులఁ	771
సుతుల విద్యాప్రవీణత	586
సుత్రామపుత్త్రుఁ డభిజన	831
సురగరుడ విషోరగ	746
సురగరుడోరగకిన్నర	901
సురల వరప్రసాదమున	537
సూర్యుండును నీకు దుర్వాసుం	478
సూర్యుండును వసిష్ఠమహాముని	757
సెల్లుఁ డట్లు నేలద్రెళ్ళి	813
సొలయక యెల్లదేశములఁ	722
సౌభద్ర పౌలోమ కారంధమ	921
స్థిరపౌరుషుండు లోకోత్తరుఁ	523
స్వయంవరలబ్ధ యయిన	831
హ	
హరిఁ దలఁచె సుభద్ర	943
హరితనయుండు పార్థుఁడు	946
హరి పంచిన మార్గంబునఁ	945
హరిపరాక్రమ యేను	490
హరి యింద్రుఁ దలఁచె	886
హరువచనమున	846
హారివిచిత్రహేమకవచా	591
హైమవతోత్తుంగహేమ	739